Katha PART 1_Layout 1 6/29/2023 2:38 PM Page 1

# కథ 2021

ముల్కనూరు సాహితీ పీఠం - నమస్తే తెలంగాణ

కథల పోటీ 2021

# కథ 2021

ముల్కనూరు సాహితీ పీఠం – నమస్తే తెలంగాణ

కథల పోటీ 2021

# Katha 2021

Mulkanooru Sahithi Peetam- Namaste Telangana

Kathala poti

Print Year 2022

Copies 1000

Cover Page Art :

**Mallibhat Vasu**

Cell :8555905965

Book Design : vinoo

**Price : Rs. 350**

For Copies :

Pramodh Reddy:

94416270804

&

**Amazon.in**

# అక్షయం.. అక్షరం!



**తిగుళ్ల కృష్ణమూర్తి**
**ఎడిటర్, నమస్తే తెలంగాణ**

***వార్త.. నిజాలను చెబుతుంది.***
***పాఠకుడిని ఆలోచింపజేస్తుంది.***
***కథ.. అవే నిజాలకు***
***నాటకీయతను అద్దుతుంది.***
***పాఠకుడిని కదిలిస్తుంది.***
***పెనునిద్దుర వదిలిస్తుంది.***
***.. వార్త అనే చేదుమాత్ర మీద పూసిన చక్కెరపాకమే కథ.***

రెండు ప్రక్రియల లక్ష్యం ఒక్కటే.. మంచి సమాజం.

రెండు ప్రక్రియల మాధ్యమం ఒక్కటే.. అక్షరం.

కాకపోతే, వార్త మెదడులో ప్రాసెస్ అవుతుంది. కథ హృదయంలో ప్రాసెస్ అవుతుంది.

అవినీతి, స్వార్థం, విలువల పతనం, బీటలువారుతున్న బంధాలు..

పత్రికలో వచ్చే ప్రతి కథనం ఓ మంచికథకు ముడిసరుకే.

సాధారణ పాఠకుడితో పోలిస్తే, పత్రికా పాఠకుడిలో సామాజిక స్పృహ ఎక్కువ.

రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిణామాలను బేరీజు వేయడంలో నేర్పరి కూడా.

ఆ పాఠక దేవుళ్ల దృష్టికోణం నుంచే 'బతుకమ్మ' కథల వేట, ఎంపిక ఉంటుంది.

ముల్కనూరు సాహితి పీఠం భాగస్వామ్యంలో.. ఆ అన్వేషణ సులభతరమైంది. ఏడాది తిరిగేసరికి.. గుట్టలకొద్దీ కొత్త కథలు మా ఇన్‌బాక్స్‌లో పడిపోతున్నాయి. దేనికదే అత్యుత్తమం. ఆ రచనలు అన్ని తరాలకూ, అన్ని స్వరాలకూ ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. నమస్తే తెలంగాణ– ముల్కనూరు సాహితీ పీఠం అక్షర బంధం.. పత్రికకు మంచి కథలను ప్రోత్సహించే వేదికగా నిలుస్తున్నది. పాఠకులకు ఉత్తమ సాహిత్యాన్ని అందిస్తున్నది. తెలుగు సాహితీ సరస్వతికి ఏటా ఓ సంకలనాన్ని మహా నైవేద్యంగా సమర్పిస్తున్నది. అక్షయమైనది ఈ అక్షర సేవ. నమస్తే తెలంగాణ– ముల్కనూరు సాహితి పీఠం కథామైత్రి.. ఇంతే ప్రగాఢంగా కొనసాగాలని కోరుకుంటూ..

# మేము సైతం



**వేముల శ్రీనివాసులు**
**ముఖ్య సలహాదారులు,**
**ముల్కనూరు సాహితీ పీఠం**

"యద్భావం తద్భవతి" అనే మాట ముల్కనూరు ప్రజా గ్రంథాలయం – నమస్తే తెలంగాణ సంయుక్తంగా నిర్వహిస్తున్న కథల పోటీకి సంబంధించి అక్షర సత్యం. తెలుగు కథ సాహిత్య ఉన్నతికి మన వంతు కృషి చేద్దాం అన్న సంకల్పం తీసుకున్న నాటి నుండి నేటి వరకు మా ప్రయత్నాలు మంచి ఫలితాన్నిచ్చాయి. కథా–2021 ముచ్చటగా మూడో కథల పండుగ. 2019, 2020 ల మాదిరిగానే విశేష స్పందన వచ్చింది. ఈ కథల పోటీకి జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి రావడం మా మీద మరింత బాధ్యత పెరిగింది.

పోటీకి వచ్చిన వందల కథల్లో మంచి కథలను గుర్తించి ఆరుగురు న్యాయ నిర్ణేతలకు కథ రచయితల పేర్లు లేకుండా.. కథలను పంపించాం. వారి నిర్ణయానికి అనుగుణంగా ఫలితాలను ప్రకటించడం మేము చాలా పవిత్రంగా చేస్తున్న యాగం.

కథ వస్తువును, శిల్పంను చక్కగా మలిచి రచయితలు ఎన్నో మంచి కథలను పోటీకి పంపారు.సంచార జాతులు జానపద కళారూపాలు పొట్టకూటికి ఇబ్బంది పడుతున్న స్థితిని 'డిమ్కీ' కథలో యువ రచయిత్రి స్ఫూర్తి కందివనం పాఠకుల్ని వారి జీవితాల్లోకి తీసుకెళ్లి ఆ బాధలో సహానుభూతి పొందేలా చెప్పిన తీరు ఈ సంవత్సరపు అగ్ర తాంబూలానికి అర్హత పొందింది. నెల్లుట్ల రమాదేవి గారి 'పొద్దు గూకకముందే' కథ చక్కని మాండలికంలో తల్లికి బిడ్డల మీద ప్రేమ మాత్రమే కాదు, ప్రపంచీకరణ నేపథ్యంలో తను ఆర్థిక సామాజిక మార్పులను తట్టుకుని ఎలా నిలబడాలో తెలిసిన మేధావిగా చూపిన తీరు గొప్పగా ఉంది.

చందు తులసి తన మోదుగు పువ్వు కథలో అమ్మాయి పుట్టగానే తండ్రి తనకు ఆపద వచ్చిందనే మనస్తత్వం నుండి కొడుకయితే చేతికి అందిస్తాడనే పిచ్చి ఆలోచన నుండి బిడ్డకు పెట్టిన కష్టాలు, తర్వాత ఆ బిడ్డ గొంగళి పురుగు సీతాకోకచిలుకగా

మారిన చందాన అన్ని పరీక్షలు నెగ్గి నిజాయితీగా నిలవడం.. మోదుగు విత్తనం కొన్ని సంవత్సరాల తర్వాత అనుకూలత ఏర్పడగానే మొలకెత్తి జీవ చైతన్యాన్ని చాటినట్లు.. ఎవరైనా కష్టాలుంటే పారిపోవద్దని బతికి కొట్లాడాలని చూపిన మంచి కథ.

నస్రీన్ ఖాన్ 'దిశ మార్చుకున్న గాలి' తో బిడ్డ విడాకుల విషయంలో మధ్య తరగతి ముస్లిం కుటుంబపు సంఘర్షణను సాక్షాత్కరించారు. పొసగని భయంకరమైన సంసారంలో బాధితురాలిగా ఉన్న స్త్రీ వివాహ బంధం నుండి బయటకు రావడానికి ఎంత కష్టమో. మధ్యతరగతి మనస్తత్వంలో తమ తల్లిదండ్రులు సమాజం ఏమనుకుంటుందో అనే బాధలో ఉన్నారే తప్ప, బిడ్డ పడుతున్న కష్టాల గురించి ఆలోచించకపోవడం, త్వరగా అక్క జీవితం నేర్చుకున్న పాఠాల నుండి చెల్లి ఏ విధంగా తన దిశను మార్చుకుందో చక్కగా చెప్పిన కథ. కాటుక కన్నుల సాక్షిగా కథలో వేణు మారీడు ప్రతి పాఠకుని బాల్యంలోకి, కౌమారంలోకి సుకెళ్ళాడు. మహిళలు వంటింటే పరిమితం చేసే సామాజిక చట్రాలను చేధించి, ఉద్యోగాల్లో చేరిన కొందరి మహిళలకూ ఉద్యోగ నిబంధనలు, యాజమాన్యా వేధింపులు కూడా సవాలుగా ఉంటాయి. ఈ ఇబ్బందులను బోన్గిరి టూ లష్కర్ లో చూపించారు జైని ప్రభాకర్. సేల్స్ గర్ల్ గా పని చేస్తున్న సునిత తను కూర్చోవడానికి కూడా పోరాటం చేయాల్సిన ఘటనను, తద్వారా ప్రభుత్వాలే స్పందించి చట్టం చేయడం వరకూ జరిగిన తీరు ప్రాంతీయ వాతావరణంలోకి మల్చి అందించారు. దీనిద్వారా మహిళలకు ఎదురయ్యే సమస్యలు ఎక్కడైనా ఒక్కటే అని అర్థంకాకమానదు.

అలా ఒక్కో కథలో ఒక్కో వైవిధ్యం, వైవిధ్యతా కనిపిస్తుంది. వేటికవే గొప్ప సామాజిక సందేశాన్నిస్తాయి. ఇలాంటి ఎన్నో మంచి కథలకు ముల్కనూర్ పెద్దపీట వేయడం, ఆధునిక కాలంలో జరుగుతున్న ఈ సాహిత్య సేవ మేము అదృష్టంగా భావిస్తున్నాం.

ముల్కనూర్ సాహితీ పీఠం ద్వారా మహాయజ్ఞంలాంటి కార్యక్రమాల విజయవంతానికి ముల్కనూరు మిత్రబృందం కృషి ఎనలేనిది. వారికి ప్రత్యేక ధన్యవాదాలు. కార్యవర్గ సభ్యులందరి ఉమ్మడి కార్యచరణ, కృషితో ఏటా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది సరస్వతీ మాత ఆలయ నిర్మాణం విజయవంతమైంది. పిల్లల కోసం క్విజ్, వ్యక్తిత్వ, వ్యాస రచన, ఆటల పోటీలు నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ముల్కనూర్ సాహితీ పీఠం చేస్తున్న ఈ సాహితీ సేవకు దేవుని కృప, తెలుగు పాఠకుల, సాహితీ ప్రేమికుల అభిమానం ఎప్పుడూ ఉండాలని ఆశిస్తున్నాను.

# కృతజ్ఞతలు

కథ 2021 విజయవంతం కావడానికి ఆర్థిక సాయం చేసిన మహా కవి శ్రీ గింజల నరసింహ రెడ్డి గారికి, సహృదయులు శ్రీ మల్రాజు జనార్ధన్ రావు గారికి, సహృదయులు శ్రీ మాడుగుల రంగా రావు గారికి, ధన్యవాదాలు, కృతజ్ఞతలు.

వందల కథలను చదివి ఉత్తమ కథలను ఎంపిక చేసిన జడ్జిలకు, ఎంపికైన ప్రతి కథను వారం వారం ప్రచురించిన నమస్తే తెలంగాణ బతుకమ్మకు, ఈ విశిష్ఠ కార్యంలో పాలుపంచుకున్న యాజమాన్యానికి ఎడిటర్ కృష్ణ మూర్తి గారికి, ఫీచర్స్ ఎడిటర్ కరణం జనార్ధన్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. ప్రతి ఏటా సంకలానికి తన సృజనాత్మకతకు పదును పెట్టి ముఖచిత్రం వేస్తున్న మల్లిభట్ వాసు గారికి ధన్యవాదాలు.

Katha PART 1_Layout 1 6/29/2023 2:38 PM Page 7

పోటీకి వచ్చిన వందల కథలను చదివి, మంచి కథలను గుర్తించిన

# ఆరుగురు న్యాయ నిర్ణేతలు



పెద్దింటి
అశోక్ కుమార్



గింజల
మధుసూధన్ రెడ్డి



దేవారాజు
విష్ణు వర్ధన్ రాజు



కొమఱ్ఱాజు
అనంత కుమార్



కోడూరి
విజయ్ కుమార్



గోగు శ్యామల

## నమస్తే తెలంగాణ - ముల్కనూరు ప్రజా గ్రంథాలయం

# కథల పోటీ - 2021 విజేతల వివరాలు

| క్ర.సం. | కథ పేరు | రచయిత పేరు |
|---|---|---|

### మొదటి బహుమతి (1) :

| | | |
|---|---|---|
| 1 | డిమ్కి | స్ఫూర్తి కందివనం |

### ద్వితీయ బహుమతులు (2) :

| | | |
|---|---|---|
| 2 | మోదుగు పువ్వు | చందు తులసి |
| 3 | దిశ మార్చుకున్న గాలి | నస్రీన్ ఖాన్ |

### తృతీయ బహుమతులు (3) :

| | | |
|---|---|---|
| 4 | పొద్దు గుంకక ముందే | నెల్లుట్ల రమాదేవి |
| 5 | కాటుక కన్నుల సాక్షిగా | వేణు మరీదు |
| 6 | బోన్గిరి టూ లష్కర్ | డా.ప్రభాకర్ జైనీ |

### ప్రత్యేక బహుమతులు (10) :

| | | |
|---|---|---|
| 7 | కీడు గుడిసె | బొడ్డేడ బలరామ స్వామి |
| 8 | విష వలయం | అనిశెట్టి శ్రీధర్ |
| 9 | ఉల్టా బాజా | సయ్యద్ గఫార్ |
| 10 | పడగ నీడ | సలీం |
| 11 | తండ్లాట | అరుణ్ కుమార్ ఆలూరి |
| 12 | అద్దంలో మూట | త్రివిక్రమ్ |
| 13 | వ్యత్యాసం | నామని సుజనా దేవి |
| 14 | అంబేద్కర్ మనవాడు | మంచికంటి |
| 15 | జీవిత పాఠం | భాస్కరా చారి కశివొజ్జల |
| 16 | వారసత్వం | రాజ మోహన్ |

### రూ.5వేల బహుమతి కథలు (6) :

| | | |
|---|---|---|
| 17 | సహన శీలి | ఎం.టి. స్వర్ణలత |
| 18 | బతుకమ్మ | డాక్టర్. శ్రీదేవి శ్రీకాంత్ |
| 19 | అర్ధనారి | మండ శ్రీకర్ |
| 20 | ప్రేమంటే ఏమిటి? | బలభద్రపాత్రుని ఉదయ శంకర్ |
| 21 | శర్వమ్మ మరణం | జయంతి వాసరచెట్ల |
| 22 | ధీర వనిత | ఎనుగంటి వేణుగోపాల్ |

## రూ.2వేల బహుమతి కథలు (10) :

| | | |
|---|---|---|
| 23 | విశ్వాసపాత్రుడు | వై.ఎల్.వి. ప్రసాద్ |
| 24 | అపరంజి | తులసి బాలకృష్ణ |
| 25 | ఇంకా తెలవారదేమీ! | ఉమా మహేశ్ ఆచళ్ల |
| 26 | భద్రత | కె.విజయేంద్ర ప్రసాద్ |
| 27 | కాముని కంత | హుమాయూన్ సంఘీర్ |
| 28 | బుడ్డ శనగ | మ్యాకం రవి కుమార్ |
| 29 | ఆపుడు | కటుకోజ్వల మనోహరా చారి |
| 30 | మట్టి పరిమళం | బి.వి.రమణ మూర్తి |
| 31 | అయినా మనిషి మారలేదు! | సంగనపట్ల నర్సయ్య |
| 32 | నాటు పడింది | వివేకానంద రెడ్డి లోమటి |

## రూ.వెయ్యి బహుమతి కథలు (28) :

| | | |
|---|---|---|
| 33 | రోహిణీ ఐపిఎస్ | తటవర్తి నాగేశ్వరి |
| 34 | బతుకు బొమ్మ | హైమావతి కలివే |
| 35 | అస్థిత్వం | గాగోజు నాగభూషణం |
| 36 | నిషేధిత స్వప్నం | కడెం లక్ష్మీ ప్రశాంతి |
| 37 | సెల్యూట్ | శ్రీ సుధామయి |
| 38 | ఆడ పులి | పుట్టగంటి గోపీకృష్ణ |
| 39 | బోగం ఎంకటి | చిప్పబత్తు శ్రీనివాస్ |
| 40 | నేరము - శిక్ష | ఇంద్రగంటి నరసింహ మూర్తి |
| 41 | మళ్లీ విత్తనంలోకి | సింహ ప్రసాద్ |
| 42 | ఫుట్‌బాల్ | కె.వి.ఎస్.వర్మ |
| 43 | ఆకలి | దాసరి వెంకట రమణ |
| 44 | మొట్టమొదటి కడపటి వాడు | డా.కె.ఎల్.సుధాకర్ |
| 45 | పావురాలు | కె.వరలక్ష్మి |
| 46 | ఫుట్‌బాల్ | టి. సంపత్ కుమార్ |
| 47 | బోగన్విలియా | అమృత లత |
| 48 | స్వాతంత్ర్యం | చింతకింది శివశంకర్ |
| 49 | వస్తు మారకం | డాక్టర్ ఎం.సుగుణ రావు |
| 50 | ది అన్‌టోల్డ్ స్టోరీస్ ఆఫ్ ఉమెన్ సప్రెషన్ | పద్మజా బొలిశెట్టి |
| 51 | గడువు | రావుల పుల్లాచారి |
| 52 | నిరుపేద | ఎం.సూర్య ప్రసాద రావు |
| 53 | జీవన తీరాలు | బద్రి నర్సన్ |
| 54 | వడ్లు | రాయపాటి హైమావతి |
| 55 | బతుకే ఓ కయ్యం | డాక్టర్ జనపాల శంకరయ్య |
| 56 | మూడు దావల దిష్టి | పాలగిరి విశ్వ ప్రసాద్ |
| 57 | యోగక్షేమం వహామ్యహమ్ | బి.లక్ష్మి గాయత్రి |
| 58 | వెనుకకు నడుస్తున్న మనిషి | బి.మురళీధర్ |
| 59 | నీవు పాడే పాట | ఎం.రామలక్ష్మి |
| 60 | కాకతీయ కేతనం | మత్తి భానుమూర్తి |

## విశిష్ట బహుమతులు (4) :

| | | |
|---|---|---|
| 61 | కొలిమి | రామా చంద్రమౌళి |
| 62 | సాధనా శూరత్వము | ఐతా చంద్రయ్య |
| 63 | మట్టి బంధం | ఎ.ఎం. అయోధ్య రెడ్డి |
| 64 | ఆకాశం | గుమ్మడి రవీంద్రనాథ్ |

Katha PART 1_Layout 1  6/29/2023  2:38 PM  Page 10

# డిమ్కి



**స్ఫూర్తి కందివనం**
**9652745117**

**'దైవాన దైవానందాన..**
**నేనెల్లిపోతా భాగమంతా.. దైవాన దైవానందాన..**
**ధనముందీ భాగ్యముందీ శంకరా.. దైవాన దైవానందాన..**
**కడుపూ.. లోపటా సంతూ బలమూ లేదయ్యా.. దైవాన దైవానందాన!'**

తెల్ల నిలువుటంగీ తొడుక్కొని, తలకు గులాబీ రంగు తలపాగా చుట్టుకొని, భుజానికి జోలె, ఆనిగెపుకాయ బుర్ర (తంబూర) తగిలిచ్చుకొని, ఎడమ చేతి వేళ్లకున్న అందెలను తంబూరకు తట్టుతూ, కుడి చేతి వేళ్లతోని తంబూర తీగలను లయబద్ధంగా మీటుకుంటూ ఓ ఇంటి గేటు ముందర నిలవడి పాడుతున్నడు శంకరయ్య. అతని కండ్లు ఎంత తూడ్సుకున్నా తడి తడిగనే ఉంటున్నయ్. పాడుతుంటే నడ్మ నడ్మల గొంతు బొంగురువోతున్నది. గుండెలున్న బాధ సముద్రపు అలల్లాగ ఉప్పొంగుకొస్తుంటే.. ఆ బాధను దిగమింగుకుంట అట్లే పాడుతున్నడు.

కొద్దిసేపటికి ఒకాయన బయటికొచ్చి..

'మొన్న గుడ్క నీవే గదా వొచ్చింది. మొన్న రెండ్రూపాలిస్తిగద! మల్లొచ్చినవా? అందుకే ఇయ్యగూడదు. ఒక్కసారిస్తే మల్ల మల్లొస్తరు. పో.. పో.. ఇప్పుడేం లేవు పో!' అని కసిరిండు.

'అయ్యా.. సారూ! కాల్మొక్త బాంచన్! ఎంతో అంత ఇయ్యి సారూ! పున్యముంటది!' దీనంగ బతిమ్లాడిండు శంకరయ్య.

'అరే.. పొయిరా పోయ్యా.. ఇప్పుడేం లేవంటున్న గద' చెప్పి ఎల్లిపోయిండతను.

తంబూరను మల్ల వాయించుకుంట ఇంగో ఇంటి ముందుకు వొయి పాడుతున్నడు శంకరయ్య.

'బిడ్డె బలమూ దీసుకోని యెల్లిపోరాదా..

అయ్యో రామా.. దేవా రామా!

దేవా రామో.. దైవ రామా..

యేమే వో బాల నాగు బిడ్డె బలమూ నీవద్దకొస్తది..

బిడ్డ బలమూ ఇత్త నీకు.. తీసుకోని యెల్లిపోరాదా!'.

ఓ పోరగాడు గుమ్మం బయిటికొచ్చి రెండు చెవులల్లున్న ఇయర్ ఫోన్లు బయిటికి దీసి..

'పొద్దున్పొద్దున్నే యేమ్ లొల్లి వెట్టినవయ్యా..! పోయిరాపో..' అని గదిరిచ్చి, మల్ల చెవులల్ల ఇయర్ ఫోన్లు కుక్కుకొని ఇంట్లకు వోయిండు.

ఇసొంటి అగుమానాలు కొత్తేమి కాకున్నా, ఇయ్యాల ఆ మాటలకు గుండెల కలుక్కుమంటున్నది శంకరయ్యకు.

చిన్నగ ముందుకు నడిచిండు. ఆ గల్లిపొంటి వర్సగ ఒక్కో ఇంటి ముంగట నిలవడి పాడిండు. అదే అగుమానం మల్లమల్ల ఎదురయ్యింది.

ఆఖరుకు ఆ గల్లీ చివరి ఇంట్లకెల్లి ఓ ముసలామె బయిటికొచ్చింది. ఆశగ ఆమె చేతుల దిక్కే జూసిండు. ఆమె చేతిలున్న గిన్నె జూసి ఆమె తెచ్చేది పైసలు గాదు.. సద్ది బువ్వనో, ఎండిన రొట్టె ముక్కలో, నూకలో అయ్యుంటయని అర్థమయ్యింది శంకరయ్యకు.

నిరాశగ నిట్టూర్చిండు.

జోలెల ఇన్ని నూకలు వోషి పోయిందామె. అండ్ల అక్కడక్కడ నల్లరాళ్లతోపాటు పురుగులు గూడ ఉన్నయి.

'నాయిన! ఇయాలనన్న నూకలన్నం వొండుకుందమే. మూడ్రోజులకేంచి బిస్కెట్లే తింటున్నం. మొకం గొట్టినట్టయ్యింది. కడుపుల బాగ నొప్పి గుడంగ లేస్తున్నది'.. ఇంటినుంచి వొచ్చేటప్పుడు చిన్న బిడ్డన్న మాటలు యాదికొచ్చినయ్. జోలెను సర్దుకొని మల్ల ఇంకో గల్లీకి వోయిండు. ఆడ కొన్ని ఇండ్లు తిరిగినాక ఓ ఇంటామొచ్చి రెండు రూపాయి బిళ్లలిచ్చింది.

'గీ రెం[డ్రూపాలకేమొస్తయమ్మ..! కాల్మొక్త తల్లి.. జెర సూశియ్ తల్లి...' అన్నడు.

'అగనే..! పాపం గదా అంటాని పాత సీరిస్తే, గోడ సాటుకుబోయి మూరేసుకొని పైట కొంగు సాలదని పంచాయితీకొచ్చిందంట ఎన్కటికి నీ అసొంటిదే! ఎంతనో అంత ఇస్తి గద.. పోయిరాపో ఇగ' కసిరి లోపలికెళ్లిపోయిందామె. మొకమంత చిన్నగ జేస్కొని అక్కడి నుంచి కదిలిండు శంకరయ్య.

'భలె భలె రామన్నా రాయుడా..

అయ్యో.. భలె భలె రామా రాయుడు.. రాయుడు!

భలె భలె రామా రాయుడా.. రాయుడా..

రాయుడు కొండలరాయుడే.. రాయుడు!

రాయుడు ఏడుకొండల రాయుడే.. రాయుడు..'

సందులల్ల గొందులల్ల ఇల్లిల్లు దిరిగిండు. ఊరంత దిరిగిండు. గొంతెండుకపోయినా పాడిండు. కానీ, అంతగలిపి వంద రూపాలు గుడ్క పోగు గాలేదు.

'పొద్దట్సంది దిరుగుతుంటే ఇవిన్నే వొచ్చినయ్. గిప్పుడెట్ల! యేమ్ జేతు.. యాడికి వోదు..' తనలో తానే రందివడ్డడు.

'థు.. నీయవ్వ! యేమ్ బత్కులో ఏమో. ఊర్లపొంటి దిరుగుడు, గుడిసెలేసుకొనుడు, కథలు జెప్పుడు, పాటలు వాడుడు. అడుక్కదినుడు! గింతేనా మా బత్కులు! గీ ఉరుకులాట ఉత్తచాటనేనా? యేమ్ రాత రాశినవయ్యా మాకు. గిదేం జీవితమిచ్చినవ్ మాకు! గీ అడుక్కునే పని మాకప్పజెప్తివి.. నీ గుడిల మన్నువొయ్య! రూపాయికి.. ఆతానకు.. శారడు గింజలకు యేమ్ దిరుగుళ్లివి'.. గుండెలున్న ఆవేదనంతా యెల్లగక్కిండు. లొట్టలు వడ్డ చెంపల గుంతలకెల్లి కండ్ల నీళ్లు గారి కిందకు జరజరా రాలిపడుతున్నయ్.

సూర్యుడు నడినెత్తి మీదికొచ్చిండు. చెమట వట్టిన మొకాన్ని తుండు గుడ్డతోని తూడ్సుకుంట నడుస్తున్నడు.

అతని పొట్ట ఎముకలకు అంటుకపోయింది. అయినా ఓపికదెచ్చుకొని అడుగులేస్తున్నడు. ఎటు జూసినా కండ్ల ముంగట సుక్కమ్మనే మెదులుతున్నది.

***

తెలంజామున.. కూచున్నచోటనే కునికిపాట్లు పడుతున్న శంకరయ్యకు సడన్ల ఎవరో వొచ్చి గట్టిగ నూకినట్టనిపిచ్చేటాలకు ఉలికిపడి కండ్లు దెరిసి జూసిండు. నిన్నటిసంది మూసిన కన్ను తెరవలేకుండున్న తన పెండ్లాం సుక్కమ్మ చేయి వట్టుకొని, రాత్రంత ఆమె పక్కన్నే కూచున్నడు. ఎప్పుడు నిద్రవోయిండో అతనికే తెల్వదు. రాత్రంత వెచ్చగనే ఉన్న సుక్కమ్మ చేయి.. పొద్దటికి సల్లగనిపిచ్చింది. బెదురుబెదురుగా

ఆమె మొకంలకు తొంగి జూసిండు. ప్రశాంతంగ నిద్రవోతున్నది. కాదు.. నిద్రవోతున్నట్టు ఉంది.

చూస్తుండంగనే పొద్దు పొడుచుకొచ్చింది. సుక్కమ్మ నిద్రలనే అస్తమించిందని అర్థమయిన శంకరయ్యకు ఒక్కసారిగా గుండెలు లబలబమన్నయ్. మొదటిసారి ఆమె చేయి పట్టుకుంటే శంకరయ్యకు చెయ్యి వొణికింది. నెత్తి దిమ్మన్నది. ఉలుకూపలుకూ లేకుండ అట్లే ఉండిపోయిండు. కొద్దిసేపటివరకు మైండు పన్జేయలేదు.

'నన్నిట్ల ఆగం జేసి పోతవనుకోలేదు సుక్కమ్మ!'..

తన కండ్ల నీళ్లు తన మాట వినలేదు. పిల్లలు ఎక్కడ నిద్ర లేస్తరో, తల్లి ఊపిరిడిసిందని దెలుస్తే యాడ గుండెవల్గుతరోనని ఏడుపు బిగవట్టుకున్నడు.

అంతలనే ఏదో మతికొచ్చినోడిలాగ తన అంగి జేబుల చేయి వెట్టి జూస్కున్నడు. ఎంత దేవులాడినా ఓ పది రూపాల నోటు, నాలుగు రూపాయి బిళ్లలు తప్ప ఇంకేం దొరికిలేవు.

'సుక్కమ్మను సాగనంపేదెట్లా..! గీ శిల్లర తప్ప నాతాన ఇంగేం లేవు. కనీస్రం పాడెగట్టనీకె గుడంగ పైసల్ లేవు. థు.. బత్కుల మన్నువడా!'. శంకరయ్య కండ్లపొంటి బిరబిరా నీళ్లు గారినయ్. పానమంత కశిబిశయ్యింది. యెక్కడ దోస్తలేదు.

'నాయిన.. ఏంటికే గంతగానం ఫికర్జేస్తున్నవ్! ఏం గాదులే. అమ్మకు మంచిగయితది గాని'.

అప్పుడే నిద్ర లేసొచ్చిన తన పన్నెండేండ్ల కొడుకు మొకం జూడంగనే ఇంగింత యేడ్పొచ్చింది శంకరయ్యకు.

చేతిలున్న చిల్లర పైసల దిక్కు జూసిండు. సుక్కమ్మకు పానం బాగలేనప్పట్సంది ఎప్పుడన్నిట్ల పదో పరకో ఉన్ననాడు పొద్దుగాల్నే ఇంత నీళ్ల చాయ్ వెట్టి, పక్క గల్లీలున్న మల్లయ్య దుకునం కాడికి వొయి ఆమె కోస్రం డబల్ రొట్టె దెచ్చెటోడు. సుక్కమ్మకు చాయ్ల డబల్ రొట్టె అద్దుకొని తినడమంటే చానిష్టం. పోయిన వారం ఆమెకు మందులు కొనంగ మిగిలిన చిల్లరతోని తెచ్చిండు.

డబల్ రొట్టె తెచ్చిన్నాడు తృప్తిగ తిని గోలీలేసుకునేది. లేకుంటే వట్టి చాయ్ తాగి ఏసుకునేది. చాపత్త లేన్నాడు వట్టిగనే ఏసుకొని కడుపునిండ నీళ్లు తాగేది.

వందల రూపాలు వెట్టి గోలీలు దెచ్చుకునే సొక్రం లేక ఈ మధ్య అయి గుడ్క లేకుండయినయ్. వట్టి నీళ్లే తాగుతున్నది.

'ఇగిప్పుడు మల్లయ్య దుకునం కాడికి వొయ్యే పన్లేదు' మనసులనే అనుకొని, గుడ్లనిండ నీళ్లు వెట్టుకున్నడు.

'గీ.. పై.. సలు కొండవోయి నీకు, తమ్ముడికి, శెల్లెల్లిద్దరికి బిస్కోట్లు దెచ్చుకొని తినుండ్రి' అన్నడు. గొంతులో ఎక్కడలేని తత్తరపాటు.

'హొద్దులే నాయిన! అమ్మకు డబల్ రొట్టంటే ఇష్టం. ఇయి అమ్మ కోస్రమని తీష్పెట్నం గద. మేము సద్ది బువ్వ అడుక్కొచ్చుకుంటంలే! ఎవలన్న వెడ్తే తెచ్చుకొని తింటంగాని. నీవేమ్ ఫికర్జేయకు. ఇయాలనన్న అమ్మ లేషి గింత ఎంగిలివడ్తే మంచిగుండు'.. అంటున్న కొడుకు కండ్లల్లోకి సూటిగ జూడలేకపోయిండు.

'ఇగ మీయమ్మ కోస్రం పైసలు దీష్పెట్టే అవ్సరం లేదు బిడ్డా!'.. పైకి అనే ధైర్నం రాక, మనసులనే అనుకున్నడు.

'తల్లి గురించి గిప్పుడే దెలుస్తే నేనొచ్చేటాలకు పిల్లలెంత బుగుల్వట్కుంటరో. గందికే గిప్పుడు జెప్పకపోవుడే మంచిది' అనుకున్నడు.

'ఇవి నీతాననే ఉంచు బిడ్డా! నేనట్ల ఊర్లక్వొయ్యొస్త!'. కొడుకు చేతికి పైసలిచ్చి నెత్తికి తలపాగా చుట్టుకొని, ఎడమ భుజానికి జోలె తగిలిచ్చుకున్నడు. గుడిసెకు మూలపక్కకు ఆనిచ్చున్న ఆనిగెపుకాయ బుర్రను భుజమ్మీదికెత్తుకొని, ఎడమ చేతి వేళ్లకు అందెలు తొడుక్కున్నడు. అదే మూలపక్కకున్న డిమ్కి దిక్కు జూషిండు. అది రెండు వారాలకేంచి ఆడ్నే ఉంది.

'దాన్ని మల్ల సుక్కమ్మ చేతిల ఎన్నడు జూస్తనా' అని ఎదురుజూడని దినం లేదు శంకరయ్యకు. ఇంకిప్పుడు ఆ అవ్సరం లేదని గుర్తుకొచ్చి లోపలోపల్నే కుమిలిపోయిండు.

ఆమెకొచ్చింది ఏ కాన్సర్ రోగమో, గుండె జబ్బో లేక ప్రపంచాన్నే వణికించిన కరోనానో కాదు. అంతకంటే పెద్దరోగం.. పేదోళ్ల రోగం.. ఆకలి రోగం! అవును ఆకలి రోగం.. ఈ భూమ్మీద అన్ని రోగాలకంటే భయంకరమైన రోగం.

***

శంకరయ్య, సుక్కమ్మ ఊరూరు తిరుక్కుంట బుర్ర కథలు, భాగవతం చెప్తుంటరు. వాళ్లకు నలుగురు పిల్లలు. వాళ్లకంటూ ఓ ఇల్లు లేదు, జాగ లేదు. ఊర్లపొంటి తిరగడం, ఎక్కడికి వోతే అక్కడ పొయ్యి వెట్టుకోడం, గుడిసెలు ఏసుకోనుండటం, ఇంటింటికి వోయి అడుక్కోడం.. ఇదే వాళ్ల బతుకు చిత్రం.

యాడాది క్రితమే ఇదివరకుంటున్న ఊరి నుంచి మరో ఊరికొచ్చిన్రు ఈ సంచార జీవులు. ఊరి బయటనే మూడు వంకర్ల గుడిసేసుకొని ఉంటున్నరు. అప్పటికే ఒకసారి కరోనా మహమ్మారి వీళ్ల కడుపులు గొట్టింది. యెట్లనో ఇకమతులు వడి అప్పుడప్పుడే ఆ పరిస్థితుల నుంచి జెర కోలుకుంటున్నరనంగ మల్ల రెండోసారొచ్చి వీళ్ల బతుకులను ఇంగింత ఆగం జేశింది.

కొత్త ఊరికొచ్చినాక కుటుంబమంతా కడుపునిండ తిని కొన్ని నెలలైతున్నది. ఆలుమగలిద్దరు రోజంతా ఊర్ల ఇంటింటికి వోయి బుర్ర కథలు జెప్పుకుంట యాచన చేసొస్తేనే కశికిన్ని నూకలు, చిల్లర పైసలొచ్చేవి. ఎవలన్న సద్ది బువ్వనో, ఎండిన రొట్టె

ముక్కలో ఇస్తే.. ఇగ ఆ పూటకు అయి తిని, ఆపత్కాలంల పనికొస్తయని నూకలు తీసిపెట్టేది సుక్కమ్మ.

బుర్ర కథలు చెప్పని టైంల తాటాకులు దెచ్చి అవిటిని ఎండవెట్టి చాపలు, బుట్టలు అల్లి ఊర్లకు వోయి అమ్ముకొచ్చేది. కుదార్థంగ ఓ తాన ఉండలేని బతుకులు గావట్టి, పిల్లలను సదివియ్యనీకె గుడంగ లేకపాయే. అంతేగాకుండా.. పెద్ద కొడుకును బడికి పంపుదమని చూస్తే ఓ తాన కులం సర్టిఫికెట్ లేదని, ఇంకోతాన అంటరానోళ్లని బల్లెకు రానియ్యలేదు. ఇగ అట్ల పెద్దోడికి సదువు లేకపాయే. గసొంటి అగుమానాలు వడలేక తక్కిన పిల్లలను గూడ బళ్లెకు పంపే ధైర్నం జేయలేదు.

ఇగ బతుకుదెరువు కోస్రం, ఎట్లనో ఓలాగ బతుకీడ్సాలె గావట్టి వాళ్లు గుడ్క తలా ఒక పని జేస్కుంట అమ్మ నాయినకు ఆసరయ్యేది.

పెద్ద కొడుకు రబ్బరు బిందెలమ్ముతే, మిగతా ముగ్గురు చుట్టుపక్కల పాత బట్టలు అమ్ముకొచ్చేటోళ్లు. దమ్మిడి ఆదాయం లేకున్నా గడియ తీరిక లేకపోతుండే. కుటుంబమంత కష్టపడితే వొచ్చే పైసలతోని అట్లిట్ల ఆ దినం గడిచిపోయేది.

కానీ, కరోన వొచ్చినంక వాళ్ల బతుకులు పూర అద్వానమైనయ్. ఇల్లిల్లు దిరిగి అడుక్కుంటెనే వాళ్లకు బతుకెల్లేది. కానీ, ఊర్లపొంటి తిరుగుతుంటరని వాళ్లను ఇండ్ల ముంగటికి గుడంగ రానిచ్చేటోళ్లు గాదు. పూట గడువడం గూడ కష్టమైపోయింది. చేతికి పనిలేదు.. కడుపుకు ఆసర లేదన్నట్లయ్యింది.

అసలే ప్రతి ఒక్కరి చేతులల్ల సెల్ ఫోన్లుంటున్న ఈ రోజుల్లో వీళ్లను పిలిసి కథలు చెప్పించుకునేటోళ్లే కరువయ్యిన్రంటే.. ఇగ కరోనా వొచ్చేటాలకు వాళ్ల జీవనాధారమే ప్రశ్నార్థకమయ్యింది.

దినాము దొరికే సద్ది బువ్వ గుడ్క లేకపాయే. ఇదివరకు వాళ్లూ వీళ్లూ ఇచ్చిన నూకలను రోజుకొక్క పూటనే.. అదీ పిల్లల వరకే కొన్ని వోషి వండేది సుక్కమ్మ. వండిన ఆ పిడికెడు నూకలన్నంతోని నలుగురు పిల్లల కడుపులు పూర్తిగ నింపలేకపోయినా వాళ్ల ఆకలిని కొంతవరకు తీర్చగలిగేది. ఎప్పుడన్న అవి గుడంగ కరువైనప్పుడు చిల్లర పైసలేమన్నుంటె బిస్కెట్లు తెచ్చుకొని నీళ్లల్లద్దుకొని తిని ఆకలి తీర్చుకునేది పిల్లలు.

కానీ.. కడుపుల పేగులూకుంటయా! అవి వెట్టే తిప్పలకు శంకరయ్య అట్లిట్ల తట్టుకోనుంటున్నడేమో గానీ సుక్కమ్మ కొన్ని రోజులకు తట్టుకోలేకపోయింది. రాత్రిపూట కడుపుల నొప్పిలేషి గిలగిల కొట్టుకలాడేది. ఆయిమెనట్ల జూషినప్పుడల్ల శంకరయ్య పానం తన్నుకలాడేది. ఉన్న ఆయిన్ని నూకలు వండుకుంటే రేపట్నాడు పిల్లలు ఆకలికి నకనకలాడాల్సొస్తది. అందుకే ఇగ కడుపు నింపుకోమని గిలాసడు నీళ్లు తెచ్చియ్యడం తప్ప ఇంకేం చెయ్యలేని పరిస్థితి శంకరయ్యది.

ఓనాడిట్లే తాటాకులు దెచ్చుకోనీకె వోతుంటే నడ్మలనే చెక్కరొచ్చి పడిపోయింది

సుక్కమ్మ. వాళ్ల కాళ్లూ వీళ్ల కాళ్లూ పట్టుకొని శంకరయ్య ఎట్లనో ఓలాగ ఆమెను దవాఖానకు దోల్కవోతే కడుపునిండ తినమన్నడు డాక్టర్ సాబ్.

తిన్నది.. కడుపునిండ ఆకలిని తిని గోలీలేసుకుంది.. నాలుగైదు రోజుల కింద అవి గుడ్క అయిపోయినయ్. అందుకే హాయిగ, శాశ్వతంగ నిద్రవోయిందియ్యాల.

'తమ్ముడు, శెల్లెల్లు భద్రం! నేనొచ్చిందాంక మీయమ్మను లేపకుండ్రి. పాపం దినాము కడుపుల నొప్పిలేషి తన్లాడుకుంట నిద్రవోకుంటుండే. ఇయ్యాల నొప్పి లేనట్టుంది. మంచిగ నిద్రవట్టినట్టుందేమో పండుకుంది. నేను వొయ్యొస్త!'..

కొడుక్కు జెప్పి కండ్లల్లకెల్లి దుంకుతున్న నీళ్లను అంగీతోని వొత్తుకొని, కొంచెం ముందరికి వొంగి గుడిసె బయటికి నడిచిండు.

'దినాము పొట్టకూటి కోస్రం కథలు జెప్పిన. ఇయ్యాల నీ కోస్రం జెప్త సుక్కమ్మ! పెండ్లినాడు నా ఎంబడేసిన ఏడడుగులతోని మొదలువెట్టి, నా ఎంబడి వంత పాడుకుంట, డిమ్కి వాయించుకుంట ఊరూరు, ఇల్లిల్లు తిరిగి తిరిగి ఇయ్యాల అల్శిపోయి పండుకున్నవ్. యేనాడూ నీకోస్రం ఏమీ అడగని నీవు.. ఆ నాడు మొదట్సారి నోరు దెరిషి 'గీ గాజులేపిచ్చుకొని రెండేండ్లయితుంది. పండ్గకు కొత్త గాజులేపిస్తవాయ్యా..!' అంటాని అడిగితివి. గాయింత ముచ్చట గుడ్క దీర్చలేకపోతి. కనీస్రం సావులనన్న యేమ్ లోటు లేకుండ నిన్ను సాగనంపనీకే జెప్త'.. సుక్కమ్మ యాదులన్ని ఒక్కోటి కండ్ల ముందుకొచ్చి కదలాడేటాలకు గుండె వాగయ్యింది శంకరయ్యకు. చిన్నగ ఊరి బాట వట్టిండు.

***

వొచ్చిన ఆ కొన్ని పైసలను జేబులేస్కొని బుగులు బుగులుగ నడుస్తున్నడు శంకరయ్య.

'ఓ జంగమయ్యా! ఇగో నిన్నే!' ఎన్కనుంచి ఎవరో పిల్శిండ్రు. కండ్లు తూడ్సుకొని తిరిగి చూసిండు. దూరంకెల్లే ఒకాయన రమ్మని సైగ జేస్తున్నడు. శంకరయ్యకు మనసుల ఎదో ఆశ చిగురించింది. జెప్పజెప్ప నడ్సుకుంట వోయిండు.

'మా తాత సచ్చిపోయిండు. ఇయ్యాల దినాలున్నయ్. పొద్దట్సంది ఎవలన్న కథ జెప్పేటోళ్లు గనవడ్తరేమో అంటాని సూస్తుంటే నీవ్ గనవడ్తివి. వొస్తవా మా ఇంటికి!' అతనన్న మాటలకు శంకరయ్యకు పానం లేసొచ్చినట్టయ్యింది.

'శంకరా! గీ శంకరయ్య తిప్పలు సూడలేక ఆదుకోనీకొస్తివా'.. మనసులనే శివయ్యకు దండం బెట్టుకొని, ఊపిరి పీల్చుకున్నడు. ఇంకేం ఆలోచించకుండా వెంటనే..

'అట్లనే సారు!' అన్నడు.

'అవ్.. వంతెగాల్లెవ్వరు లేరా? నీవొక్కనివే పాడ్తవా?' అడిగిండతను.

'మా ఇంటాయిమెకు జెర సుస్తయ్యి రాలేదు సారు. నేనే వాడ్త బాంచెన్!' అన్నడు శంకరయ్య.

***

'ఇంటో రాజుబాబు.. ఇంట రాజుబాబు.. బాల!

హయ్యో రామ రామా.. బాల!

నీ తాత రంగరాజే.. బాల!

నువు సిన్నగున్నాడు.. బాల!

సంకల్ల యెత్తుకోని.. బాల!'

ఓ పక్క సుక్కమ్మను సాగనంపనీకె పైసలొస్తయన్న సంతోషం.. మరో పక్క తన సుక్కమ్మ ఇంక లేదన్న దుఃఖం.. రెండూ కలిపి గుండెలను మెలితిప్పుతున్నా దిగమింగుకొని పాడుతున్నడు.

శంకరయ్య పాడుతుంటే పెద్దాయనను తల్సుకొని ఆ ఇంటిల్లపాది కండ్లు తడయినయ్. అక్కడున్నవాళ్లల్ల మరో ఇద్దరు గూడ వాళ్ల ఇంట్లోవాళ్ల పేరు మీద కతలు చెప్పించుకున్నరు.

శంకరయ్య ఆపకుండ పాడ్తనే ఉన్నడు. మాపట్దాంక పాడ్తనే ఉన్నడు. అందరు తలా కొన్ని పైసలిచ్చిన్రు. సద్ది బువ్వ వెట్టిన్రు. అప్పటివరకు ఖాళీగున్న శంకరయ్య జేబు, జోలె రెండు ఒకేసారి నిండినయ్. ఇగ సంతోషంగ ఇంటిబాట వట్టిండు. పోత పోత సంతల సుక్కమ్మ కోస్రం గాజులు కొన్నడు.

***

గుడిసె బయట బిక్కుబిక్కుమంటూ కూచున్న పిల్లల మొకాలు జూస్తెనే అర్థమయ్యింది.. తల్లి ఇగ నిద్రలేవదని వాళ్లకు గుడంగ తెలిసిపోయినట్టుందని. వాళ్ల చెంపల నిండా కన్నీటి చారలే కనపడుతున్నయ్.

'నాయిన! నాకు నూకలన్నమొద్దు. అమ్మ గావాలే' వెక్కి వెక్కి ఏడుస్తున్న చిన్న బిడ్డను జూడంగనే పొద్దట్సంది తన గుండెల్లోనే దాచుకున్న దుఃఖమంతా ఒక్కసారిగ బయిటికి తన్నుకొచ్చింది. పిల్లలను ఎదకు బిగ్గిత అదుముకొని బోరుమన్నడు. దాచుకున్న కన్నీళ్లన్నీ ఇంకిపోయేవరకు యేడ్సిండు.

తర్వాత గుడిసెలోపలికి పోయిండు. తన భుజమ్మీదున్న తుండు గుడ్డను దీసి సుక్కమ్మ సుట్టే తిరుగుతున్న ఈగలను తోలిండు. ఆమె పక్కన్నే కూసోని ఆమెకోస్రం తెచ్చిన మట్టి గాజులు ఆమె చేతులకు తొడిగిండు.

'నీ పాటంటే నాకు పానం. రేపట్నాడు ఒకాల నాకేమన్నయితే నీవే పాడాలె!' మూడ్రోజుల కింద సుక్కమ్మ అన్న మాట యాదికొచ్చింది. తంబూరను అందుకున్నడు...

'నేనెళ్లిపోత కొడకా.. బాల!
నా యిల్లిడిసి నేనువోతా.. బాల!
జాగిడిసి నేనువోతా.. బాల!'

గొంతు పూడుకుపోతున్నా అక్షరం అక్షరం కూడబలుక్కొని పాడుతున్నడు. తంబూరతోపాటు మూలకున్న డిమ్కి సప్పుడు గూడ ఇనవడ్తుంది శంకరయ్యకు. సుక్కమ్మ కొత్త గాజులు గలగలమంటున్నట్లే ఉంది.

'చెట్లోలె రాలిపాయే.. బాల!
పాడెమీద వండవెట్టి.. బాల!
ఎత్తుకుందురు నలుగురేమో.. బాల!
కుమ్మరింటి కుండతోటి.. బాల!
మాయడప్పులతోటి.. బాల!
సాగనాంప పదిమందీ.. బాల!'..

పొద్దు పొడిచేవరకు అస్తమించిన తన సుక్కమ్మ కోస్రం పాడ్తనే ఉన్నడు.

***

## స్ఫూర్తి కందివనం

స్ఫూర్తి కందివనం స్వస్థలం మహబూబ్ నగర్. ప్రస్తుతం హైదరాబాద్ లో ఉంటున్నారు. బయోటెక్నాలజీలో పీజీ చేసిన స్ఫూర్తి, కొన్నాళ్లపాటు సైంటిఫిక్ ఈ జర్నల్స్ పబ్లిషింగ్ సంస్థలో మేనేజింగ్ ఎడిటర్ గా పని చేశారు. సాహిత్యం పట్ల ఆసక్తితో 2019 నుంచి రచనలు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఇంగ్లిష్ లో 12 కథలు, తెలుగులో 36 కథలు, 3 నవలలు రాశారు.

# మోదుగు పువ్వు!



పి.చంద్రశేఖర్
(చందు తులసి)
9985583022

ఆ రోజు ఇక నేను ఎలాగైనా సరే.. చనిపోవాల్సిందేనని నిర్ణయించుకున్నాను. నిజం.. 'ఇక నేను బతకడం దండగ' అనిపించింది. అందుకే ఈ నిర్ణయం! ఈ ప్రపంచంలో ఉన్న దారులన్నీ మూసుకొని పోయి.. బతకడం కంటే చావడం మేలు అనుకునే క్షణం.. జీవితంలో ఎంతమందికి వస్తుందో తెలీదు కానీ, ఒంటరి ఆడపిల్లనైన నాకు ఇరవై ఏళ్లు నిండకుండానే వచ్చింది.

***

నాపేరు సైది. దేవరకొండ తాలూకాలో అడివికి దగ్గర ఉన్న మారుమూల లంబాడా తండా మాది. నేను పుట్టక ముందే మా అమ్మ – నాయినకు నలుగురు ఆడ పిల్లలు పుట్టినరట. మగ పిల్లగాడు కావాలని వరుసగా కంటనే పోయినరు. నాకు ఊహ తెలిసేటప్పటికే పెద్ద అక్కకు పెండ్లి అయిపోయింది. పెద్ద అక్క తర్వాత పుట్టిన ఇద్దరు పిల్లలు పురిట్లోనే పోయినరట. నాలుగో అక్కను.. అందంగా ఉందని పుట్టిన ఏడాదికే, ఎవరో హైదరాబాద్‌లో ఉండేటోళ్లు కొనుక్కొని పోయినరట. పిల్లలను కనడమే తప్ప సాకలేని నాయిన ఐదువేలకు బిడ్డను అమ్మినడు. ఆ తర్వాత రెండేళ్లకు నేను పుట్టిన్నంట. ఇయ్యన్నీ మా అమ్మ చెప్పిన ముచ్చట్లు.

మా దేవరకొండ లంబాడా తండాల్లో కొడుకు పుడితే బాగా సంబరం చేసుకుంటరు. పదేళ్లు సాకితే ఏ ఆసామి దగ్గర జీతానికి పెట్టినా డబ్బులు వస్తాయని. అదే ఆడపిల్ల పుడితే ఎవలకో ఒకలకు అమ్ముతరు. మా తండాలో

కొంతమంది ఏజెంట్లు ఉంటరు. పురిట్ల పాప నుంచి, నలబై ఏండ్ల నడికారు మనిషి దాంక ఎవరినైనా అమ్మిపెడతారు. చానామంది ఆడబిడ్డలు పుట్టేది మా తండా మట్టిల.. కానీ, కలిసేది మాత్రం ఏ బొంబాయి, పూనా మట్టిలోనో!

ఇరవై ముప్పై ఏళ్ల కిందట మా తండాలు ఇప్పటిలా ఉండేయి కాదు. ఎంత పిలిచినా చుక్క వాన వచ్చేది కాదు. కానీ, పిలవకుండానే కరువు వచ్చేది. అప్పట్లో వరుసగా ఏటా కరువులే. తాగడానికే గుక్కెడు నీళ్లు దొరికేయి కాదు. బుక్కెడు బువ్వ దొరక్క.. కళ్లు లోపలికి గుంజుకపోయి, బొక్కలు తేలిపోయి.. మడుసులు నడిచే అస్థిపంజరాల మాదిరి ఉండేవారు. తల్లికే తిండిలేకపోతే ఇంగ పసిపిల్లలకు పాలు ఏడికెల్లి వస్తయి. పిల్లలను సంపుకుని బొందల గడ్డ సమాధి చేసే కంటే.. అమ్ముకోవడం మేలు అనుకునేటోళ్లు. కన్నపేగును కూడా దూరం చేసుకునేంత కటిక పేదరికం ఆ రోజుల్లో ఉండేది.

నేను మా నాయిన పోలికతోని నల్లగా పుట్టిన. కాకి నలుపు. అందుకే నన్ను ఎవలూ కొనుక్కోలేదు. నా వల్ల డబ్బులు రాలేదని నాయినకు కోపం. నా పోలిక ఆయనదే ఐనా కాలీ చ్వారీ (నల్ల పోరీ) అని తిట్టేవాడు. రోజూ సాయంత్రం తాగి వచ్చి అమ్మను, నన్ను బాగా కొట్టేవాడు. నన్ను 'ఎటైనా వెళ్లిపో' అని.. 'ఏ చెరువులోనో దూకి సచ్చిపో' అని గొడ్డును బాదినట్టు బాదేవాడు. సాయంత్రం అవుతుంటే నా గుండెల నిండా చీకటి కమ్ముకునేది. భయం, భయంగా నిద్రపోయినట్లు కళ్లు మూసుకొని పడుకునేదాన్ని. తాగడం మర్చిపోని నాయిన.. నన్ను కొట్టడం కూడా మర్చిపోయేటోడు కాదు. అన్ని చిత్రహింసలు పడ్డ రోజు కూడా నేను చచ్చిపోవాలని అనుకోలేదు. కానీ, ఈరోజు అలాంటి పరిస్థితి వచ్చింది.

***

నా చిన్నపుడు అమ్మతోపాటే అడివిలోకి పోయేదాన్ని. పొయిలకు కట్టెలో, తునికి పండ్లో.. ఏవి దొరికితే అవి తెచ్చుకునేటోళ్లం. అమ్మ మోదుగు చెట్టును చూపించి ఒక ముచ్చట చెప్పేది.

మోదుగు విత్తనం నేల మీద పడితే చాలు. యాభై ఏండ్ల పాటు వర్షాలు కురవకపోయినా సరే.. ఆ గింజ తట్టుకొని నిలబడతదంట. వానలు పడి తడి తగలగానే, మళ్లీ మొలక వస్తుందట. మెల్లగ మొక్కై పెరిగి, పెద్ద చెట్టై.. వేయి పూలై విరబూస్తుందట. మనిషి కూడా తన కష్టకాలంలో పానం నిలుపుకోవాలని.. ఆపదలు తట్టుకొని నిలబడాలని చెప్పేది.

మా తండా పక్కన పెద్ద తండాల స్కూలు ఉంది. అది ఆడపిల్లల స్కూలు, హాస్టల్ కూడా ఉంది. ఆ సార్లు మా తండాలో పిల్లల సర్వే కోసం వచ్చినపుడు నన్ను హాస్టల్ల జాయిన్ చేయమని అమ్మకు చెప్పినరు. అట్ల తిండి కోసం నేను హాస్టల్ల జాయిన్ అయిన. మా అమ్మను వదిలిపెట్టి ఉండలేను కానీ.. హాస్టల్లో నాయిన ఉండడు, కొట్టడు కద. అందుకని హాస్టల్‌కి పోయిన. బడి నడిచినన్ని రోజులు బానే ఉండేది. కానీ, దసరాకు, ఎండాకాలానికి సెలవులు వచ్చినయంటే గుబులు. ఇంటికి పోవాలంటే రంది. ఇంటికి పోతే నాయిన కొడుతడు. సంపుతడేమో అన్న భయం. అందుకే మా ఇంటికి పోయినా.. రాత్రి నాయినకు కనపడకుండా

మా అమ్మమ్మ ఇంటికో, వేరే వాళ్ల ఇంటిదగ్గరో పడుకునేదాన్ని. అట్ల స్కూలు, హాస్టల్ తెరిచేదాక మిడుకు మిడుకుమంటూ బతికేదాన్ని.

ఓరోజు అటువంటి సెలవుల్లోనే.. నాయిన అడివిలో పాము కరిచి చనిపోయిండు. పాము కాటుకు ముఖం నల్లగా మారిన నాయినను చూసి.. నాకు మాట రాలేదు. జనం కోసమైనా ఏడ్వడానికి ఎంత తన్నుకున్నా దుఃఖం రాలేదు. నాయిన చనిపోయిడన్న బాధకంటే.. ఇక నన్ను నాయిన కొట్టడన్న సంగతే సంతోషంగా అనిపించింది.

నా చదువు గురించి చెప్పాలంటే అదో పెద్ద కథ. బాగ చదువుకోవాలని మా టీచర్లు చెప్పే ముచ్చట బాగా నచ్చేది. నేను బాగ చదువుకోని ఉద్యోగం సంపాదించి.. పుట్టెడు కష్టాలు పడిన మా అమ్మను సుఖంగా చూసుకోవాలని అనుకునేదాన్ని. కానీ, ఎంత ప్రయత్నించినా మా భాషకు.. టీచర్లు మాట్లాడే భాషకు చాలా తేడా ఉండేది. ఆ సదువు, మా భాష ఒక్కటి కాదు. నానా తిప్పలు పడి తెలుగు భాష పూర్తిగా నేర్చుకునే సరికి.. పిడుగులాగ ఇంగ్లిష్ భాష వచ్చింది. పొట్ట కోసినా ఇంగ్లిష్ పలకడం రాకపోయేది. మా సార్లు కొట్టికొట్టి చేతులు కాయలు కాసినయి కానీ.. ఇంగ్లిషు భాష మాత్రం రాలేదు. అసలు ఏమన్న అర్థమైతే కద.. చెప్పడానికి.

ఏడో తరగతిల ముందో ఎనకో చూసి పరీక్ష రాసి నెట్టుకొచ్చిన. కానీ, పదో తరగతిల మాత్రం ఫెయిలై పోయిన. ఇప్పుడు హాస్టల్ నుంచి ఎల్లిపోవాలె. మల్ల తండాకు పోవాలె. సప్లిమెంటరీ పరీక్ష రాసి పాసు కావాలె. పాసైతేనే ఇంటర్. లేదంటే అంతే.. అన్ని సబ్జెక్టులు పాసైన కానీ అది ఇంగ్లిష్ కాబట్టి ఫెయిలైన.

'అన్నీ పాసైన.. ఒకటే కద సారు ఫెయిలైంది. నన్ను పైక్లాసుకు పంపించండి సారూ!' అని మా సార్లను బతిమాలిన.

'అట్ల కుదరదు' అని చెప్పినరు. ఏం చేయాల్నో అర్థం కాలేదు. ఈ ఇంగ్లిష్ పాడుకానూ.. ఈ ఇంగ్లిష్ నాశనం కాను.. ఇంగ్లిష్ కాబట్టి నా బతుకు అన్యాయం ఐపోయిందని తిట్టుకున్న.

నా ఇనుప సందుక పెట్టె నెత్తిన పెట్టుకొని.. వలవలా ఏడ్సుకుంట మా తండాకు పోయిన. ఒకటే దుఃఖం. పది సంవత్సరాలు చదువుకొని మల్లా తండాకు పోవడం నాకు ఏదో తప్పు చేసినట్లు అనిపించింది. అంత బాధలో కూడా నేను చచ్చిపోదాం అనుకోలేదు. కానీ.. నేను ఇప్పుడు చేసిన తప్పు నాకు చావు తప్ప ఇంకో మార్గం లేకుండా చేసింది.

***

పదో తరగతి ఫెయిలై తండాకు వచ్చిన. మా అమ్మకు తెలిసినా ఏమీ అనలేదు. అసలు పాస్, ఫెయిల్ ఏందో కూడా తనకు అర్థం కాలేదు. నేను 'ఏ పని చేయాలా?' అని ఆలోచిస్తున్నపుడు.. మా తండాలో సారా యాపారం చేసే వసురాం మా ఇంటికి వచ్చినడు. ఆయన మా తండాలో సారా కాచి.. దేవరకొండ టౌనుకు దొంగతనంగా తీసుకొని పోయి యాపారం చేస్తడు. లోపల సారా పాకెట్లు, పైన కూరగాయలు పోసి సైకిల్ మీద తీసుకుపోయేటోడు. కానీ, ఒకసారి పోలీసులకు దొరికిపోయిండు. అట్ల వసురాం మీద నిఘా

పెరిగింది. అందుకని దేవరకొండలో ఉన్న సారా దుకాణం కాడికి.. నేను స్కూలుకు పోయే అమ్మాయిలాగా, బ్యాగులో సారా ప్యాకెట్లు తీసుకుని పోయి ఇవ్వాలి. స్టూడెంట్ కాబట్టి పోలీసులు అనుమానించరని వసురాం తాత ఉపాయం.

ఉదయం పది లీటర్లు, సాయంత్రం పది లీటర్లు.. సీక్రెట్‌గా చేరవేస్తే రోజుకు వంద రూపాయలు కూలీ ఇస్తనన్నడు. నాకది బానే అనిపించింది. వసురాం తాత ఇచ్చిన సైకిల్ తొక్కుతూ, కాలేజీ బ్యాగులో సారా ప్యాకెట్లు పెట్టుకొని పోయేదాన్ని. కాలేజీ అమ్మాయి అనుకొని ఎవరూ అనుమానించేవాళ్లు కాదు.

ఆరు నెలలు బానే గడిచింది. కాలం ఎప్పుడూ మన చేతుల్లో ఉండదు కద. ఎవరో ఎక్సైజ్ పోలీసులకు ఉప్పందించారు. నన్ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని స్టేషన్‌లో పెట్టారు. రెండు రోజులైనా వసురాం తాత కానీ, ఎవ్వరు కానీ జామీను ఇవ్వడానికి రాలేదు. పోలీసులు నేనే సొంతంగా సారా కాసి యాపారం చేస్తున్న అనుకొని పదివేలు లంచం అడిగినరు. రోజుకు వంద రూపాయల కూలీ చేసే నా దగ్గర పదివేలు ఎక్కడియి. కాళ్లావేళ్లా పడి మొక్కినా వదిలిపెట్టలేదు. ఆడపిల్లనని కూడా చూడకుండా కొట్టినరు. అప్పుడే ఆ స్టేషన్‌లోనే ఉండే కానిస్టేబుల్ సార్ పరశురాములు నా మీద కనికరం చూపించాడు. రెండు వేలు ఎస్సై చేతుల్లో పెట్టి నన్ను ఇంటికి పంపించాడు. పరశురాములు సార్‌కు రెండు చేతులతో కాళ్లు మొక్కి ఇంటికి చేరుకున్న.

ఇక నేనే సొంతంగా సారా కాయడం, అమ్మడం మొదలు పెట్టాను. పోలీసు కానిస్టేబుల్ పరశురాములు కూడా పరిచయం ఉండటంతో నెలనెలా పోలీసోళ్లకు మామూళ్లు ఇచ్చేదాన్ని. పరశురాములు సార్‌కు నా సారా అంటే ఇష్టం. ఘాటుగా, తాగంగనే మత్తుగా ఉంటదని నా సారా కోసం తండాకు వచ్చేవాడు. కొంత కాలానికి.. 'సారా కోసం కాదు.. నీకోసమే' అని మనసులో మాట బైట పెట్టాడు. అట్ల మెల్లగా ఇద్దరి మధ్య సావాసం పెరిగింది. అన్నిరకాలుగా దగ్గరైపోయినం. మా అమ్మకానీ, తండా వాళ్లు కానీ.. వచ్చేది పోలీసు కాబట్టి ఎదురు చెప్పలేకపోయారు. పైగా నాతో పోలీస్ స్టేషన్‌లో పనుల కోసం పైరవీ చేయించుకునే వారు.

కొన్నాళ్లకు ఓరోజు నాలో ఇంకో పానం పెరుగుతున్న సంగతి అర్థమైంది. నేరుగా పోలీస్ స్టేషన్‌కు పోయి పరుశురాములుకి ఆ సంగతి చెప్పాను. సంతోషపడతాడు అనుకుంటే.. ఏమీ మాట్లాడకుండా ఆసుపత్రికి తీసుకొని పోయాడు. 'కడుపు తీసేస్కో!' అన్నడు. నేను ఒప్పుకోలేదు. పెళ్లి చేసుకోమన్నాను.

'సారాయి అమ్ముకొనే బజారు దానివి నువ్వు. నీలాంటి వాళ్లు పదిమందితో పోతాను. వాళ్లందరిని పెళ్లి చేసుకుంటానా లం..' అన్నాడు. 'నాకెప్పుడో పెళ్లయ్యింది. నాకు భార్య, పిల్లలు ఉన్నారు' అని అప్పుడు బయట పెట్టాడు.

నేను మొండికేసేసరికి అక్కడనే అందరి ముందూ కొట్టాడు.

'ఎక్కువ మాట్లాడితే సారా కేసులో మళ్లీ జైల్లో పెడతా' అని బెదిరించి, భయపెట్టి మా తండాకు పంపించాడు.

ఎంత మోసం చేసిండు. వీణ్ని నమ్మి ఎంతపని చేసిన. అదిగో అప్పుడే నాకు జీవితం మీద

విరక్తి పుట్టింది. కన్నకష్టాలు పడి పెంచింది అమ్మ. ఏ ముఖం పెట్టుకొని అమ్మకు మొఖం చూపించను. నేను చేసిన తప్పు తెలిస్తే అమ్మ బతుకుతుందా..? అందుకే ఇంటికి పోయే ధైర్యం చేయలేదు. ఛీ.. నేను బతకడం దండగ. అందుకే చచ్చిపోవాలని అనుకున్నాను. ఇంకాసేపట్లో నేను చచ్చిపోబోతున్నాను.

***

ఎలా చచ్చి పోవడం.. బాయిలో దూకనా..? చెట్టుకు ఉరి పెట్టుకోవడమా..? ఆ క్షణంలో నేను ఏం చేస్తున్నానో గుర్తులేదు. నేను చచ్చిపోవడం ఒకటే నాకు కావాల్సిందని.. పిచ్చి పట్టినట్లు, దయ్యం ఆవహించినట్లు అనిపించింది.

తండా పక్కనే ఉన్న అడివిలోకి నడుచుకుంటూ పోయాను. ఏ చెట్టుకైనా చున్నీతో ఉరి పెట్టుకుందామని చూశాను. దూరంగా పెద్ద మోదుగు చెట్టు కనిపించింది. కొమ్మల నిండా నిప్పుల పూలు పూసినట్లు.. తళతళా మెరిసిపోతున్న మోదుగు చెట్టును చూస్తే ఏదో గుర్తుకు వచ్చింది. అదేంటో గుర్తు చేసుకోవడానికి ప్రయత్నించాను. అప్పుడు తటాలున మెరుపు మెరిసినట్లు.. అమ్మ చిన్నప్పుడు చెప్పిన మాటలు గుర్తువచ్చాయి.

'ఎన్ని కష్టాలు వచ్చినా మోదుగు చెట్టులాగా తట్టుకొని నిలబడాలె బిడ్డా! వానలు వచ్చేదాక ఎదురు చూడాలె. చినుకు పడినంక మొక్కై ఎదగాలె. పెద్ద మానై.. వెయ్యి పూలు పూయాలె'.. అమ్మ చెప్పిన మాటలు మళ్ల మళ్ల యాదికొచ్చినయి.

అప్పుడు ఆలోచించిన.. అసలు మోసం చేసింది వాడు. నమ్మడం నా తప్పు కాదు కదా. నేనెందుకు చావాలి? మోసం చేసినందుకు వాడుకదా చావాలి. పుట్టెడు కష్టాలు పడి సాకింది అమ్మ. ఆమె కోసమైనా బతకాలి అనుకొని సక్కగ ఇంటి దారి పట్టిన.

ఇంటికొచ్చిన నాకు ఊహించని దెబ్బ. ఏం జరిగిందో ఏమో.. అమ్మ చనిపోయింది. నా కోసం ఉదయం నుంచి వెతుకుతున్నరట.

ఐదుగురు బిడ్డలను కన్నా సాదుకొనే అదృష్టం దొరకని తల్లి. ఒక్కదాన్ని నన్ను కంటికి రెప్పలా పెంచుకున్న అమ్మ వెళ్లిపోయింది. ఏం జరుగుతున్నదో అర్థం కాలేదు. కుప్పకూలి పోయాను. అక్క, బావ వాళ్లు, తండా మనుషులు మిగిలిన పనులు పూర్తి చేసి వెళ్లిపోయారు.

***

అమ్మ పోయిన తర్వాత ఒంటరినయ్యాను. నేను పోలీసోడి మడిసిగా ఉన్నంత కాలం అంతా బాగున్నరు. ఎప్పుడైతే వాడితో చెడిపోయిందని తెలిసిందో.. అందరూ మారిపోయారు. నన్ను చూసే చూపు.. పిలిచే పిలుపూ మారిపోయింది. కొన్ని కొండ చిలువలు అర్ధరాత్రుళ్లు వచ్చి చుట్టుకోవడానికి తడకలు తీసేవాళ్లు. వాళ్ల నుంచి తప్పించుకోవడానికి రాత్రుళ్లు అడివిలోకి పారిపోయేదాన్ని. అడవిలో పాములు, మృగాల కన్న తండా మనుషులే ఎక్కువ భయపెట్టేవాళ్లు.

ఎదిగీ ఎదగని వయసు. సరైన తిండి లేక నా ఒళ్లు పిండాన్ని మోయలేక పోయింది. పోలీసోడి పాపం.. రక్తం ముద్దలుగా వెళ్లిపోయింది. చానా రక్తం పోవడంతో ఆరునెలలు

మంచంలో పడిపోయాను. తిండిపెట్టిన నాథుడు లేడు. అప్పుడప్పుడు గవర్నమెంటు స్కూలు దగ్గర పిల్లలకు మధ్యాహ్న భోజనం పెట్టే యాళ్లకు పోయి, వాళ్ల దగ్గర అన్నం అడుక్కునేదాన్ని. అట్ల ఆరునెలలు నరక యాతన పడి మెల్లగా కోలుకున్నాను.

బతకడానికి సారా యాపారం కాకుండా ఏదైనా కష్టపడి పని చేయాలని అనుకున్నాను. అప్పుడే మా తండాలో అంగన్వాడీ సెంటర్ మొదలైంది. తండాలో పదో తరగతి చదివిన ఆడపిల్లను నేను ఒక్కదాన్నే ఉన్నాను. నాకు బతకడానికి కూడా ఏమీ ఆధారం లేదని తండా పెద్దలు ఒక మార్గం చూపించారు.

అలా మెల్లగా నా జీవితం అంగన్‌వాడీ టీచర్‌గా మారింది. మా తండాలోనే ఖాళీ జాగాను బాగు చేసి, చిన్న పాక వేయించాను. నేనే పార తీసుకొని రాళ్లు రప్పలు తొలగించి.. పిల్లలకోసం ఆటస్థలం సిద్ధం చేశాను. చుట్టూ కంచె పాతాను. లోపల బంతి, చామంతి ఇలా చాలా పూలమొక్కలు పెంచాను. పిల్లలను తీసుకురావడం ఆడించడం, పాడించడం. ఇప్పుడు పిల్లలే నా లోకం. ఆ పిల్లలే నా పిల్లలు. అలా మెల్లగా నా గతాన్ని కుబుసంలా వదిలించుకొని కొత్త మనిషిగా తయారయ్యాను. జనాలు కూడా పాత సైదిని మర్చిపోయారు.

ఎన్ని కష్టాలు, ఎన్ని కన్నీళ్లు.. ఎక్కడో పురిట్లో ఆడపిల్లగా చనిపోవాల్సిన నేను. మా నాయిన కొట్టిన దెబ్బలకు ఏ బాయిలోనో దూకి సావాల్సిన నేను.. ప్రేమ పేరుతో మోసపోయిన నేను.. ఏ పేదరికమో, ఏ ఆకలితోనో.. ఏ మగపురుగులో కరిచి ఏనాడో మట్టిలో కలిసిపోవాల్సిన నేను.. అన్నిటినీ తట్టుకొని మోదుగు చెట్టులా నిలబడ్డాను. మోదుగు పువ్వులా నవ్వుతూ తండాలో పిల్లలకు తల్లిగా మారాను. ఒకనాడు గుడుంబా యాపారం చేసిన సైది.. ఇప్పుడు 'సైదమ్మ టీచర్' అయ్యింది.

***

# చంద్రశేఖర్

*చంద్రశేఖర్ స్వస్థలం సూర్యాపేట జిల్లాలోని బండమీది చందుపట్ల. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. వృత్తి రీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడు. జీవిత సహచరి 'తులసి' పేరుతో కలిపి 'చందు తులసి' కలం పేరుతో కథలు రాస్తుంటారు. సినిమా రంగంలోనూ రచయితగా పనిచేస్తున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల జీవితాలే ఈయన కథలకు ప్రధాన ఇతివృత్తాలు. 2015లో తొలికథ 'ఊరవతల ఊడలమర్రి' మంచి గుర్తింపు తీసుకొచ్చింది. 'నమస్తే తెలంగాణ బతుకమ్మ' సంచికలో వచ్చిన 'పాలపిట్టల పాట' కథ, నేషనల్ బుక్‌ట్రస్ట్ యువ కథా సంకలనానికి ఎంపికైంది. వివిధ భారతీయ భాషల్లోకి అనువాదమైంది. 'బతుకమ్మ పుట్టింది' కథ 'గుర్రాల లక్ష్మీప్రసాద్ అవార్డు' గెలుచుకున్నది. 'నీళ్ల బిందె', 'బుక్కెడు బువ్వ', 'తల్లి గారిల్లు' కథలు పలు కథా సంకలనాలకు ఎంపికయ్యాయి. గతంలో 'గడి', 'తక్కెడ' కథలకు నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజాగ్రంథాలయం కథల పోటీల్లో బహుమతులు అందుకొన్నారు.*

# దిశ మార్చుకున్న గాలి



నస్రీన్ ఖాన్,
96524 32981

'తప్పు చేసిండు. శిక్ష పడాల్సిందే. అంత హింసను ఖాలీపీలీ నేను అనుభవించలేదా? ఎందుకు క్షమించాలె?'.. కోర్టు ప్రాంగణంలో పార్కు చేసి ఉన్న కారు డోర్ తెరుచుకుంట అన్నది జైనబ్. తాను అనుభవించిన హింస తాలూకు గాయాలు ఇంకా పచ్చిగా సలుపుతనే ఉన్నయి. అట్లా అని ఆమె ఆవేశంగా ఏమీ అనలేదు. గొంతు స్థిరంగానే పలుకుతున్నది. దిశ మారినా.. నావ సరైన గమ్యాన్ని నిర్దేశించుకునేందుకే ముందుకు సాగుతున్నది.

'నిండా పాతికేళ్లు లేని పిల్ల. ఇంత స్పష్టంగా ఎట్ల చెప్పగలుగుతున్నది? నాకా వయసుల బతుకు గురించి ఏమన్న తెల్వకపోయె' నూటా ఒకటోసారి బాధపడుతా ఆశ్చర్యపోయింది జైనబ్ కన్నా పదేళ్లు పెద్దదైన ముంతాజ్ ఆపా.

'ఇట్ల జిద్ చేసి జిందగీ ఏం చేస్కోవాలనుకుంటున్నరో ఏమో!' విచారపడుకుంట మల్లోసారి జైనబ్ నిర్ణయంపై నిరసన వ్యక్తం చేసిండు అబ్బా షరీఫ్.. కారు స్టార్ట్ చేస్తూ.

'జైనబ్ తప్పేం చేయలేదు పప్పా. కేసు పెట్టి మంచిపని చేసింది. చచ్చిపోయుంటే వాడికి ఇంకో పిల్ల దొరుకుతది. కానీ, మనకు మాత్రం మన పిల్లొస్తదా?' అలవాటు ప్రకారం తండ్రిని సముదాయించింది ముంతాజ్.

'క్యా.. హైకీ. జిందగీ అంతా ఉలట్ పలట్ అయింది.

ఇన్నేళ్లు కష్టపడి సంపాదించిన ఇజ్జత్ అంత ఇప్పుడీ కోర్టుల పోతున్నది. నెల నెలా వాయిదాలు పడుతనే ఉంటయ్. మనమే తప్పు చేసినట్లున్నది కత' దిగులు పడ్డడు షరీఫ్. కారు రవీంద్రభారతివైపు దూసుకుపోయింది. తెలుగుతల్లి ఫ్లైఓవర్ మీదుగా కారును తీసుకుపోవడం అలవాటు.

'వాళ్లదే తప్పయినా ఇట్ల మాట్లాడతవేంది పప్పా? మరిప్పుడు ఊకోవాల్నా ఏంది?' కంట్రోల్ రూమ్ వెనుక ఉన్న పోలీసు స్టేషన్ వైపు తొంగి చూసుకుంట ప్రశ్నించింది జైనబ్. తను 498ఏ, డీవీసీ కేసులు పెట్టినప్పుడు ఆ రోడ్డుపైన, దానికి పక్కనున్న నౌబత్ పహాడ్ రోడ్లపైన పడ్డ పడిగాపులు కండ్ల ముందు మెదిలినయ్.

మూడు నెలలైనా నిండని గర్భం ఆమెది. వేవిళ్లతోటి కిందామీదా అయితుంటే కడుపుల మెతుకు నిలుస్తలేదు. అట్లాంటి రోజుల్ల ఒకరోజు పొద్దున్నే లేచి బాత్రూమ్‌కు పోవాల్నని మంచం దిగి నిలబడంగనే.. నిండు కుండ పగిలినట్టు తెల్లటి టైల్స్ ఉన్న ఫ్లోర్ మొత్తం ఎర్రటి రక్తం. బట్టల నిండా రక్తం. ఏనాడూ అంతటి రక్తాన్ని చూడని జైనబ్‌కు నీరసం తోడైంది. కండ్లు తిరిగి పడిపోయింది. స్పృహ లేనేలేదు. అబార్షన్ అయిపోతుందని డాక్టర్లు చెబితే అంతటి నీరసంలోనూ విలవిలలాడుకుంట ఎట్లనన్న కాపాడమని ప్రాధేయపడింది తను. ఎట్లనోకట్ల మూడు రోజులు హాస్పిటల్ల ఐసీయూల ఉంచి, ఖరీదైన మందులతోటి కాపాడిన్రు డాక్టర్లు.

'గాజు లెక్క సున్నితంగ ఉన్న నా పరిస్థితిని వాడు ఏమన్నడు? ప్రెగ్నెన్సీ సాకుతోటి లాభపడుతున్న అని..' నిర్లిప్తంగ అన్నది జైనబ్. తన ప్రమేయం లేకుండనే కండ్లు నిండుకున్నయ్.

భుజాలపైన చేయేసింది ముంతాజ్. రవీంద్రభారతి సిగ్నల్ దగ్గర ఆగింది కారు.

'ఏ.. జానేదో మా! వాడికి నిన్ను పొందే అర్హతే లేదు. దురదృష్టవంతుడు. అందుకనే అట్ల మాట్లాడి యాడిదాంక తెచ్చుకున్నడు. మూర్ఖుడు. వదిలెయ్..' ఓదార్చుతున్నది ముంతాజ్.

ఏడాదైన సజావుగా సాగని చెల్లెలి వైవాహిక జీవితం ఆ కుటుంబానికి తలవని తలంపు. అయితే తనలెక్క కుంగిపోయి రోగాలు తెచ్చుకోలేదు చెల్లెలు. లీగల్‌గ పోరాడుతున్నది. ఆమె చేయలేకపోయిన పని చెల్లెలు చేస్తున్నందుకు చానా సంతోష పడుతున్నది. అందుకనే ఎప్పుడు కోర్టు పేషీ ఉందన్నా చెల్లెలుకు తోడు వస్తనే ఉన్నది.

'పైసలు నష్టం. పరువు నష్టం. క్యా జిందగీ ఆగయి!' మనసులనే విరక్తిగ అనుకున్నడు షరీఫ్. కానీ, వెనుక సీట్ల కూసోనున్న అక్కాచెల్లెళ్ల చెవుల్ల పడనే పడ్డయి ఈ మాటలు.

'ఇజ్జత్ పోతదని నన్ను నేను చంపుకోవాల్నా పప్పా? అయినా నాదేం తప్పుందని నీ పరువు పోతుంది చెప్పు?'.. ఫ్లై ఓవర్ మీదుగా కనిపిస్తున్న ట్యాంక్‌బండ్‌ను చూసుకుంట అడిగింది జైనబ్. ఆమె కండ్ల నుంచి ధారగ కురుస్తున్నయి కన్నీళ్లు. ముంతాజ్ కండ్లూ నిండుకున్నయి.

'కేసు పెడితే పరువు పోతదా?' అన్న సందేహం అక్కాచెల్లెళ్లను తొలుస్తున్నది. అసలు కేసు

పెట్టడమే తప్పంటే.. మరి జైనబ్ చేయాల్సిందేందో స్పష్టంగా చెప్పనైనా చెప్పడు.

'వాడు నిద్ర లేచిండో ఏమో. పాల కోసం ఏడుస్తున్నడంటవా?' టాపిక్ మార్చింది ముంతాజ్.

'లేవకపోవచ్చు. అమ్మీ కాల్ చేసేదిగా?' అంచనా వేసుకుంట, పది నెలల కొడుకు కండ్లముందల తిరుగుతుండంగ అన్నది జైనబ్ జవాబుగా.

నిలుస్తుందో, నిలవదో తెలియని గర్భాన్ని అతి జాగ్రత్తగా మోసుకుంట పోలీసు స్టేషన్లు, లాయర్లు, కోర్టుల చుట్టూ తిరిగింది జైనబ్. ఎట్లాగూ పోయే గర్భమే. మందులతోటి నిలిపినా పిండంల లోపాలు ఉండొచ్చని, అబార్షన్ చేయించుకోమని రకరకాలుగ సలహాలు ఇచ్చిన్రు జైనబ్ సంగతి తెలిసిన ప్రతిఒక్కరూ. అట్లున్నప్పుడే జైనబ్ ఫ్రెండ్ ద్వారా తెలిసిన లాయర్ కాడికి పోయిన్రు అందరు. ఆమె చెప్పిన మాటలు విన్న జైనబ్‌కు అసలు దుఃఖమే ఆగలేదు.

'అసలే విడాకులు తీసుకోవాలని అనుకుంటున్నప్పుడు ఆడపిల్ల ఫ్యూచర్ బాగుండాలంటే అబార్షన్ చేయించడమే మంచిది' అని ఆ లాయర్ సలహా ఇచ్చింది. ఆ సలహా నచ్చింది షరీఫ్‌కు. అయితే ఇచ్చిన కట్నం డబ్బుల్ల పది శాతం ఫీజుగ ఇయ్యాలనేసరికి కోపమొచ్చింది.

లాయర్ ఇంట్ల నుంచి బయటికొచ్చి మాట్లాడుకుంటుంటే వాళ్ల చూపు.. ఆ లాయర్ నేమ్‌ప్లేట్‌పై రాసి ఉన్న అక్షరాలపై పడింది.

'బాలల హక్కుల ఉద్యమకర్త' అన్న ఆ అక్షరాలు చదివి అసహ్యించుకున్నది జైనబ్. చీమకు కూడా హాని చేయడం తెల్వని జైనబ్.. తన కడుపుల పిండానికి ఏ నెలల ఏయే అవయవాలు రూపుదిద్దుకుంటున్నయో గూగుల్ చూస్కుంట తన్మయత్వం చెందుతున్నది. అట్లాంటి జైనబ్ బిడ్డను కనాలనే తీర్మానించుకున్నది. దాంతోటి అబార్షన్ గురించిన చర్చలకు అడ్డుకట్ట పడింది. ఇప్పుడు కొడుకు కండ్ల ముందల కనబడుతుంటే ఏ దుఃఖాలు కనబడ్తలేవు. వినబడ్తలేవు. కేసు వాయిదా తారీఖున హాజరైతున్నది. మామూలు రోజుల్ల సాఫ్ట్‌వేర్ డెవలపర్ జాబ్‌ను కంటిన్యూ చేసుకుంటున్నది.

'ఆడపిల్ల అంటే తరీఖాల మాటున ఎదగాలె. తల్లిదండ్రులు చూపినోడి చేయి పట్టుకొనే నడవాలె. అత్తామామలు, మొగుడు దయాదాక్షిణ్యాల నీడన పడుండాలె. అట్ల చేస్తేనే నిన్ను కన్నోళ్ల రుణం నువ్వు తీర్చుకున్నట్లు. వాళ్ల అడుగుజాడల్ల నడిస్తేనే పుట్టింటి పరువు ప్రతిష్ఠలు అంతస్తుల కొద్దీ పెరుగుతయి. ఈ ముచ్చట్లేగా మాకు చెప్పి పెంచేది'..

విరక్తిగ వంకర నవ్వు మొలిచింది ముంతాజ్ పెదవుల్ల. ఇయ్యాల చెల్లెలుతోటి కోర్టుకు పోయేటందుకు మూడురోజుల ముందుగాల నుంచే పర్మిషన్లు అడిగిన సంగతి గుర్తుకొచ్చింది.

***

'ముందుగాల మా అమ్మీ అబ్బాకు చెప్పినవా? వాళ్లు పొమ్మంటే ఆలోచిద్దాంలే' అని తన మెకానిక్ జాబ్‌కు ఎల్లిపోయిండు ముంతాజ్ భర్త.

తప్పదనుకొని అహ్మదాబాద్‌ల ఉన్న ఆమె అత్తకు ఫోన్ చేసింది హైదరాబాద్‌ల ఉన్న

ముంతాజ్. 'నాట్ రీచబుల్' వచ్చింది. మల్ల మామగారి ఫోన్‌కు రింగ్ చేసింది. 'ఔటాఫ్ కవరేజ్ ఏరియా' అని వచ్చింది. నాలుగైదు సార్లు ప్రయత్నించి, సాయంత్రం ఇంటికి చేరిన భర్తకు ఆ ముక్కే చెప్పింది.

'ఏడాది నుంచి ఇదే గోల. మన గురించి పట్టించుకునేదేమన్న ఉందా?' చిరాకు పడి కసురుకున్నడు.

'చెల్లెలుకు తోడు నిలబడాల్నంటే భర్తను బతిమిలాడాల్నా? ఒప్పించాల్నా?' మనసంత చేదు నిండుకున్నది ముంతాజ్‌కు.

'పిల్లలను బడికి పంపిన తర్వాత నేను ఇంట్ల ఖాళీగనే ఉంటున్న కదా! నా చెల్లెలు ఒంటరి కాదన్న భరోసా ఈయడానికి నేను పోకపోతే ఎట్లా? ఒక్కపూట మా అమ్మీ ఇంటికి పోయేటందుకు యాడనో ఉన్న అత్తామామలకు చెప్పాల్నా? ఎవరిదన్న షాదీ పిలుపొచ్చినా ముందుగాల ఆల్లకు వెడ్డింగ్ కార్డ్ పోస్ట్ చేయాలె? ఇంటి పనితోటి ఎంత చావొస్తున్నదో, ఈ తరీఖాలతోటి అంతచావు. మెసలాయితీకాని జిందగీ అయింది' చానాసార్లు ఇట్లనే అనుకుంటది గానీ భర్తను నిలదీయలేకపోయింది. అందుకనే ఒక్క ముంతాజ్ ఇటు పుట్టింటి పరువు, అటు అత్తింటి పరువును అప్రతిహతంగా కాపాడుతుందని అనుకుంటున్నరు. ఆమె మనసు చదవకుండా ఈ భ్రమలేందో జనాలకి.

'నేనేమనుకుంటున్ననో యిాల్లకు అవసరమే లేదనుకుంట. యిాల్లందరి పరువులు కాపాడుకునేటందుకు పుట్టిన ఆదర్శ వీర వనితను'.. మల్ల వంకర నవ్వు విరిసింది ముంతాజ్ ముఖంల.

'ఈ బానిస బతుకు నాకొద్దు' అనిపించింది ఆమెకు షాదీ అయిన కొత్తలనే. ససురాల్‌ల ఇమడలేక పుట్టింటికి వచ్చింది.

'తెలవక వచ్చింది బేటా! మేం సంఝాయించినం. మల్ల ఇట్ల చేయదు. నేను మాటిస్తున్న' అల్లుడికి హామీ ఇచ్చి, ముంతాజ్‌ను తోడిచ్చి పంపించిండు షరీఫ్.

'బతికినంత కాలం ఒంటరినే!' అనే నిర్ణయానికి వచ్చింది. ఏదన్నా సమస్య వచ్చినా కన్నోల్లకు చెప్పుకొనే ఖిస్మత్ చేసుకోలేదని ఆమె బతుకుపై ఆమెకే జాలి పుట్టుకొచ్చింది. రాజీ పడక తప్పదని భావించింది. అత్తింటి తరీఖాలను పొల్లుపోకుండా పాటించుకుంట సంతోష పెడుతున్నది. కానీ, చెల్లెలు 'తప్పు' అనిపించిన చోట అడుగుతది. తండ్రి గుడ్లురిమి చూస్కుంట బెదిరించినా తనలెక్క బెదిరిపోదు. గట్టిగ జవాబ్ చెప్తది.

జైనబ్ ఐదో తరగతి చదువుతున్నప్పటి సంగతి. పదో తరగతి పాసై ఇంట్లనే ఎంబ్రాయిడరీ, మెహందీ డిజైన్స్ నేర్చుకుంటున్న ముంతాజ్‌కు పైగాంలు సూడబట్టిర్రు. ఏదో పైగాం గురించి మాట్లాడుకుంటున్న అమ్మీ, పప్పా మద్దెన మాటామాటా పెరిగింది. అంతే! కోపంతోటి పిల్లలు చూస్తున్నరన్న సంగతి గూడా మరిచి అమ్మీని విపరీతంగా కొట్టిండు పప్పా. వణికిపోయిన ముంతాజ్ గప్‌చుప్‌గ లోపలికి పోయింది. జైనబ్ మాత్రం అమ్మీకాడికి పోయింది.

'పప్పాను నువ్వెందుకు కొట్టలేదు?' అని అడిగింది.

అది విన్న షరీఫ్ మరింత రెచ్చిపోయిండు. తల్లీబిడ్డలిద్దర్నీ చితకబాదిండు. అట్లాంటి పప్పా.. 'కొడతవో, తిడతవో, సంపుకుంటవో.. నీ ఇష్టం' అని అల్లుడిని సమర్థించకపోతే నిందిస్తడా? ఆ తాను ముక్కేగా అనుకుంట పెదవి విరిచింది ముంతాజ్. చేదు గతంల నానుతున్న సంగతులు గుర్తుకొస్తున్న కొద్దీ దాష్టీకాలను ఎదురిస్తున్న చెల్లెలిపై గౌరవం, ప్రేమ పుట్టుకొచ్చినయి. జైనబ్ వెన్నంటే ఉండాల్నని మల్లోసారి అనుకున్నది.

***

'పెద్దోళ్లు షాదీ చేసిన్రని ఫెయిల్ కాకుండ ఉంటయా? ఫెయిల్ అయితే ఆమె లైఫంతా పోయినట్లేనా?'.. ఇంటికి చేరి బుర్ఖా విప్పేసి, కాళ్లూ చేతులూ కడుక్కొని కొడుకును చూసి మురిసిపోతున్న జైనబ్‌ను చూస్కుంట అనుకున్నది ముంతాజ్.

'కష్టాలు వచ్చినయ్. అయితేనేం? మానసికంగా బలంగా ఉంది కాబట్టే ఫైట్ చేస్తున్నది జైనబ్. అదే నేనైతే నా గురించి అమ్మీ, పప్పా ఏడుస్తున్నప్పుడే వెన్కకు మళ్లిపోయేదాన్ని. పీజీ చదవబట్టే జెరంత బయటిలోకం తెలిసింది జైనబ్‌కు. జాబ్ చేస్తుండబట్కే లోకజ్ఞానం అబ్బింది. నాలెక్క ఒకళ్లమీద ఆధారపడాల్సిన పనేలేదు. అబార్షన్ కావాల్సిన పిలగాడ్ని కాపాడుకున్నదంటే.. ధైర్యం, మానవత్వం ఉండబట్టే కదా! అందమైన మనసు జైనబ్‌ది'.. అనుకున్న ముంతాజ్, ఆ మాటే జైనబ్‌తోటి అన్నది. జైనబ్ ముస్కురాయించింది.

'ఆపీ! భాయ్‌జాన్ నిన్నిడిచి ఉండలేకనే కదా ఎంటనే పరుగెత్తుకొస్తడు. ఈ ఎదవ జూడు. నెల తప్పినప్పుడు పంచాయితీ పెట్టుకొని, పోనన్నదాన్ని తీస్కపోమని పప్పాకు ఫోన్ల మీద ఫోన్లు చేసి పంపినోడు. ఇప్పుడు వీడు పుట్టే పది నెలలు దాటింది'.. కొడుకును చూపించుకుంట అన్నది.

'కనీసం కొడుకునన్న తొంగిచూడని కఠినాత్ముడి నీడ నా కొడుకు మీద పడొద్దు. కోపతాపాలు ఎవ్వరికైన వస్తయనే అనుకుందాం. భాయ్ జాన్ చూడు పిల్లలను పువ్వులెక్క చూసుకుంటడు. ఈడు పాలు మర్సినంక నీకాడనే ఉంచుత. నీ పిల్లల్ల వాడు ఒంటరికాడు. ఏమంటవ్?'. అడుగుతున్న జైనబ్‌ను చూసి ముంతాజ్ కదిలిపోయింది.

జైనబ్ ఎప్పుడూ ఇంతే. పరిణతితోటి ఆలోచిస్తది. ప్రేమగ మాట్లాడతది. అమాయకంగ ఈ లోకంలకు అడుగుపెట్టిన ఆ పసికూన తన ఒడిల వెలుగులు నింపాల్సి ఉంటే కాదనుకుంటుందా?

'సరే!' అన్నది చెల్లెలు నుదుట ముద్దు పెట్టుకుంట.

'మరి జెరంత ధైర్యం నేర్పాలె పిల్లలందరికీ..' అని అల్లరిగ నవ్వింది జైనబ్.

'అదే ట్రై చేయాలె. జిందగీ అంటే ఏందో ఇప్పుడిప్పుడే అర్థమైతుంది' అన్నది ముంతాజ్ సీరియస్‌గా.

'మేము కావాలనుకుంటేనే వాడు కడుపున పడ్డడు. బాధ్యత లేకుండా మొఖం

చాటేసినోడితోపాటు నేను వదులుకుంటనా నా ప్రాణాన్ని'.. అబార్షన్ గురించి చర్చ అయినప్పుడు చెల్లెలు అన్న మాటలు గుర్తుకు వచ్చినయి ముంతాజ్‌కు.

'మంచోడో చెడ్డోడో. కలిసి ఉంటే గౌరవం'.. గొడవలు అయిన కొత్తల జైనబ్ తోటి ముంతాజ్ అన్నప్పుడు ఇచ్చిన జవాబ్ అది.

'సమాజం మొత్తం పప్పా లెక్క, భాయ్‌జాన్ లెక్కనే ఉన్నరు. ఇట్లాంటోల్లు మారాల్నంటే చదువుతోపాటు సమాజం మీద అవగాహన పెరగాలె. ఇది ఒక్కసారికే జరగదనుకో. మనం మన పిల్లలకు నేర్పుతుండాలె' అన్నది జైనబ్.

'బాగ చదువుకున్నోడికేగా నిన్నిచ్చింది' దిగులు పడింది ముంతాజ్.

'ఆపీ! చదువుకుంటెనే సంస్కారం వస్తదా? మనస్తత్వాలు, పరిస్థితులు అని కొన్ని ఉంటయి కదా? నాకొచ్చిన అత్త మన నానీమా బ్యాచ్. లేట్ గ పిల్లలు పుట్టిన్రంట. నాకంటే ఆరేళ్లు పెద్దోడు. అయినా చదువుకుంటున్న నేను షాదీ వద్దంటుంటే విన్నరా? షాదీ అయిన ఆరు నెల్లకేగా కరోనా వచ్చి పడ్డది. లాక్‌డౌన్ ఉండబట్టి ఆల్ల నిజస్వరూపం బయటపడింది. లేకుంటే నా జిందగీ మొత్తం ఎట్లుండేదో? బయటపడినకదా! వర్క్ ఫ్రం హోమ్ చేస్తుండంగనే కంపెనీ మూసేయడంతోటి జాబ్ పోయింది. అతనిది కూడా పోయిందన్నడు. ఇంట్ల ఉన్నప్పుడు గమనిస్తే ఆర్నెల్ల నుంచి నా జీతమే ఆల్ల ఇల్లు నడిపిందని అర్థమైంది. పెద్ద కొడుకు జీతమంత చిట్టీలకు, చిన్నకొడుకు పైసలేమో కొనుక్కున్న సొంతజాగ ఈఎమ్ఐలకు కట్టుకుంటున్నడంట. ముసలాయన పెన్షన్ పైసలుగూడ కొడుకులే గుంజుకుంటరంట. ఇగ మిగిలింది మా ఇద్దరి జీతం. అసలు అతనికి సాలరీ పడంగ ఆ ఆర్నెలల్ల చూడలే. ఆడబిడ్డ రెండో డెలివరీకి ఈడికే వచ్చింది. ఆమె ఏడాదిన్నర బిడ్డ బాగోగులన్నీ నామీదనే ఏసిన్రు. డెలివరీ అయినంక ఈ పిల్లను నేనే చూస్కోవాలని అంటుండేది ఆమె. ఇగ అల్లుడి మర్యాదలకు పైసలు, ఇంటికి సరుకులు, ముసలోల్ల మందులు అన్నీటికి నా ఏటీఎం కార్డే. మొదట్ల నా భర్త, నా ఇల్లే కదా అని ఇచ్చిన. నలభై రూపాయల బ్యాలెన్స్ తోటి నా కార్డు నా చేతిల పెట్టిండు. పైసల గురించి ఒక్కమాట అడగలేదు. నా ఉద్యోగం పోయినంక ఇంట్ల పనిచేస్తున్న పనిమనిషిని తీసేసిన్రు. ఆ ఇంటెడు పని నా ఒక్కదాని మీదనే. నాకు రాకపోయినా ఆడబిడ్డ బిడ్డకు తిండీ తిప్పలు నేనే చూసిన. వీటికి తోడు వేవిళ్లు మొదలైనయ్. నాకు బ్లడ్‌టెస్ట్‌లు చేయించాల్సి వస్తే మాత్రం వేలకు వేలు ఖర్చయిపోతున్నయనీ నెత్తీనోరు బాదుకున్నరు'.. చెప్పుకుంటపోతున్న చెల్లెలిని చూస్తుండిపోయింది ముంతాజ్.

'అంతేనా! యాభై లక్షలతోటి పప్పా షాదీ చేసిండా! ఆల్లకు తృప్తే లేదు. ఎనిమిది లక్షలు అడగమని మా ఆయన, అత్త నన్ను వెంటాడిన్రు. పొద్దున్నా సాయంత్రం.. 'మీ పప్పాకు కాల్ చేసినవా? పైసలు అడిగినవా?' అని ఒకటే బ్లాక్ మెయిలింగ్.. నేను కాల్ చేయకపోయే సరికి పగబట్టిన్రు. నా కొలీగ్స్‌తోటి మాట్లాడితే చాలు. ఆ మాటలు వినుకుంట నాకు బాయ్ ఫ్రెండ్స్ ఉన్నరని రకరకాలుగ నా క్యారెక్టర్‌నే అవమానించిండు. నమ్ముతవా ఆపీ? కనీసం ఇరవై

మందితోటన్న నాకు సంబంధాలు అంటగట్టిండు. నాకంటూ వ్యక్తిత్వం లేదా? నలుగురిచేత ఒప్పించుకుని కాపురం చేయాల్నా నేను? నా నజర్‌ల క్యారెక్టర్ లేనోడిగ దిగజారిపోయిండు. అట్లాంటోడిని నా భర్తగ భరించలేను అసలు. నేను పప్పాకు కూడా భారం కావాల్ననుకోవట్లేదు. నా జిందగీని సరైన దారిలకు నడిపించుకునే కెపాసిటీ నాకుంది. మీరందరు ఉన్నరుగా నాకు సపోర్టుకు. అతడు నాకు స్పెర్మ్ డోనర్ తప్ప మరేమీ కాడు'.. స్థిరంగా ఉన్న జైనబ్ మాటలకు నిర్ఘాంతపోయింది ముంతాజ్.

'ఉద్యోగం చేస్తున్న పిల్ల కావాల్నంటున్నడు మా కొడుకు'.. అన్న జైనబ్ అత్తగారి మాటలు గుర్తుకొచ్చినయి ముంతాజ్‌కు.

'నిజమే! వెన్నెముక లేనోడికి ఉద్యోగం చేసుకుంట కట్నం తెచ్చే పిల్లొస్తే తప్ప ఆ కుటుంబం గట్టెక్కదేమో!'.. నిట్టూర్చింది ముంతాజ్.

గారాబంగా పెరిగిన చెల్లెలు జిందగీ ఇట్ల మలుపు తిరుగుతుందనుకోలేదని కళ్లనీళ్లు పెట్టుకుంది. ఇంత అయినా బతుకు మీద ఆశ పోగొట్టుకోని జైనబ్.. మారిన ఈనాటి ఆడపిల్లలకు ప్రతీకగా అనిపించింది ఆమెకు. ఒకే రక్తం పంచుకుని, ఒకేచోట పెరిగినా ఇద్దరిలోని తేడాకు ఆశ్చర్యపడింది.

'ఇది మారుతున్న జమానాకు నిశాని. హవా కా రూహ్ బదల్ గయా'.. ఏదో అర్థమైనట్టుగా ముంతాజ్ ముఖంపై కొత్త వెలుగు కనబడింది.

'బతుకు మీద మంచి నమ్మకం ఉందిలే! నేనే భయపడకుండా చెల్లెలి వెనుక నడిస్తే సరి. చిన్నబాబును సంబాళిస్తే చాలు తనే తన బతుకును దిద్దుకుంటది. ఇంక నలుగురికి ధైర్యం నూరిపోస్తది. ముందున్నది నేనే!' నమ్మకంగా అనుకున్నది ముంతాజ్.

***

**నస్రీన్ ఖాన్ స్వస్థలం హైదరాబాద్. జర్నలిజంలో మాస్టర్స్ చేశారు. ప్రస్తుతం 'సమీక్ష' మాసపత్రిక, 'తెలంగాణ పవర్' దినపత్రిక ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2006లో తొలి కవిత 'అతడు X ఆమె', 2012లో తొలికథ 'హీనా' రాశారు. ఇప్పటివరకు 20కి పైగా కథలు రాశారు. 2019లో 'జఖ్మీ' కవితా సంకలనం వెలువరించారు. లాపతా, కొత్త పొద్దు, భరోసా కథలు పాఠకుల మన్ననలు పొందాయి. 2020లో డాక్టర్ పుట్ల హేమలత అవార్డు, హుస్నాబాద్ వారి ఉదయ సాహితీ అవార్డు, 2021లో కవితా భూషణ్, 2022లో వెంకటసుబ్బు స్మారక పురస్కారం అందుకొన్నారు. తెలంగాణ సాహితి సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పనిచేస్తూ, కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు, కవి పరిచయాలు, కవులు, కథకుల వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒక సామాన్య కుటుంబంలో 'విడాకులు' సృష్టించే సంక్షోభాన్ని నేటితరం అమ్మాయిలు ఎంత నిబ్బరంగా ఎదుర్కొంటున్నారో, వారికి పదేళ్ల ముందు పుట్టిన మహిళలు చూస్తున్న తీరును ప్రతిబింబించే ప్రయత్నమే ఈ 'దిశ మార్చుకున్న గాలి'.**

Katha PART 1_Layout 1 6/29/2023 2:38 PM Page 32

# పొద్దు గుంకక ముందే



**రమాదేవి నెల్లుట్ల,**

**94406 22781**

ఇంటికి వస్తూనే అరుగుమీద కూర్చున్న పెద్ద కొడుకును చూసి..‘ఎప్పుడొచ్చినవ్ కొడుకా? వొస్తున్ననని చెప్పకపోతివి?’ అన్నది సుగుణ.. వీరేష్‌తో.

‘మా ఫ్రెండ్‌గాన్ని కలువనీకి పొద్దున ఆలేర్ వొచ్చిన. గప్పుడు నువ్వేట్లయిన బాయికాడ ఉంటవు గద! పొద్దుమూకి కలుస్తనని రిటన్ల ఇటొచ్చిన’ అన్నాడు వీరేష్.

‘కోడలు, పిల్లలు గిట్ల మంచిగున్నరా? తీస్కరాక పోయినవ్!’ అంటూ ఇంటి తాళం తీసింది సుగుణ.

చిన్న సంచీలో పెట్టుకున్న స్టీల్ డబ్బా, నీళ్ల బాటిల్ తీసి, ఇంకో దర్వాజా నుంచి పెరట్లోకి వెళ్లి.. గోలెం దగ్గర వేసింది.

గోలెంలోని నీళ్లతో కాళ్లూ, చేతులు కడుక్కొని లోపలికి వచ్చింది. ఇంటినానుకొని చుట్టూ తడికెలతో, పైన తాటాకుల కమ్మలతో కప్పిన దడిలో పొయ్యి వెలిగించి, ఎసరుకు నీళ్లు పడేసింది. ఓ మూల రేకు డబ్బాలోంచి కొన్ని బియ్యం చాట్లో పోసుకొని, చెరిగి పక్కన పెట్టింది.

రెండే గదుల గుడిసెలాంటి పెంకుటిల్లు అది. ఒక గది మరీ చిన్నది. దాన్నానుకొని ఉన్నది కొంచెం పెద్దది, ఉండటానికి కాస్త అనుకూలంగా ఉన్నది. ఓ నులక మంచం, ఓ చెక్క బల్ల వేసి ఉన్నాయి. గూట్లో ఎక్క దీపం, అగ్గిపెట్టె ఉన్నాయి. ఎనుగర్రకు కిందున్న దూలానికి బట్టల

మూట వేలాడగట్టి ఉంది. అందులో కూరగాయల విత్తనాలు ఉంటాయని వీరేష్‌కి తెలుసు.

'ఇప్పుడే వొస్త కొడుకా!' అంటూనే బయటికి వెళ్లి, వెంటనే వచ్చింది.. చేతిలో రెండు కోడిగుడ్లతో! అప్పటిదాకా వీరేష్ అలాగే కూర్చొని ఉన్నాడు. గదిలో లైట్ వేయగానే ఇల్లంతా కొద్దిపాటి వెలుతురు పరుచుకుంది.

'కాల్జేతులు కడుక్కోరాదు బిడ్డా! తిందాం. ఎప్పుడనంగ తిన్నవో ఏందో!' అంటూ వంట కాగానే కొడుకును పిలిచింది.

'ఏం అర్జెంటులే! తిందాం తియ్యి. మా ఇంట్ల రాత్రికి పొద్దుపోయినంకనే తింటం!' అన్నాడు వీరేష్.

'మీ బస్తీలోళ్లు గట్లనే ఉంటరు. పగలు నాత్రి లెక్క.. నాత్రి పగలు లెక్క. గీడ మీమైతే దిగూట్లె దీపం – కడుపుల మెతుకు అన్నట్టె పొద్దుమూకె యాల్లకే తినాలె.. పండాలె! మల్ల ఎగిలిబారంగనే లేవాలె!' అన్నది సుగుణ.

వీరేష్ ఏమీ మాట్లాడకుండా లేచాడు. అప్పుడే బయట కూడా చీకటి చిక్కపడుతున్నది. బజారు లైట్ పడుతున్నంత మేరా.. ఇంటివెనుక కొద్దిపాటి స్థలంలో వెలుగు నిండింది. దొండ, చిక్కుడు, ఆనప లాంటి ఐదారు పాదులున్నాయి. తీగలు పాకడానికి కర్రలతో పందిళ్లు వేసి ఉన్నాయి. కాళ్లు కడుక్కొని లోపలికి వచ్చాడు వీరేష్.

'పొద్దున రాజమ్మత్త తెచ్చుకున్నదట. నాకింతిస్తె వొండిన. నేను తెచ్చుకున్నప్పుడు గామెకు ఇస్త' అంటూ కోడి కూర వడ్డించింది.

'నువ్వు కోడి కూర మస్తు చేస్తవ్!' అంటూ తల్లిని మెచ్చుకున్నాడు వీరేష్. ఆ తరువాత పొడిపొడిగా మాట్లాడుతూ తల్లీకొడుకులిద్దరూ భోజనం ముగించారు.

'ఈ ఇంట్ల గింత తిప్పలబడుకుంట ఎన్ని దినాలుంటవ్ అమ్మా?' నిద్రలోకి జారుకుంటుండగా, వీరేష్ ప్రశ్నకు కళ్లు విప్పిన సుగుణకు ముందు అర్థంకాలేదు. అర్థమయ్యాక అన్నది..

'నేను పట్నం వొచ్చి ఏం జేస్త కొడుకా? నీ ఇల్లు గూడ శిన్నదే గద! నేనేడ ఉందు?'.

'గట్ల గాదమ్మ, గీ ఇల్లు పడగొట్టి స్లాబ్ బోసి ఇల్లు గడదాం! మేమొచ్చినా, నీ మనుమలు, మనుమరాండ్లొచ్చినా తిప్పలుండది'.

'ఇల్లు శిన్నదనేనార.. వాళ్లు గీడికి వొస్తలేరు!'. 'ఏ..గట్లగాదుగని, నువ్వుమటుకు ఎన్ని దినాలు తిప్పలబడ్తవ్? కట్టుకుంటె మంచిగుంటదని!'.

'ఏమన్న పైసలు కూడబెట్టుకుంటె మీరు బస్తిల ఒగ ఇల్లు వొనరు జేసుకోండి. గీడ నాకు కొత్తిల్లు ఎందుకురా? గీ ఇల్లు నాకు నడువదా బిడ్డా!'.

తడబడ్డాడు వీరేష్... 'గట్ల గాదమ్మా! నాకాడ గన్ని పైసలేడున్నయ్? మన శెల్క అమ్ముదామని!' అన్నాడు మెల్లగా.

ఆ మాటకు సుగుణ నిద్ర ఎగిరిపోయింది.

'ఏందిరా.. శెల్క అమ్ముతావ్? అమ్మి ఇల్లు గడ్తవా? ఇల్లు కాలబెట్టి పేలాలు ఏంచినట్టు

ఉన్నది నీ కత! గీ బుద్ధి నీకే పుట్టిందా? ఎవలన్న జెప్పిన్లా?' అన్నది కోపంగా.

'గట్ల గాదమ్మా! మా దోస్తుగాడు జెప్పిండు. వాళ్లకు ఎరుకున్నోళ్లు బాగ పైసలిచ్చి కొంటమన్నరట! గంత రేటు మల్ల కావాల్నంటె వొస్తదా? ఒగ చిన్న ఇల్లు ఏసుకోవచ్చు. కడుమ పైసలు నేను పనిజేసే చిట్‌ఫండ్ కంపెనీల పెట్టుకుంటె మస్తు వడ్డీ ఇస్తరు. నీకీ కష్టం లేకుండ ఇంట్ల ఉండొచ్చు'. నచ్చజెప్పు చూశాడు వీరేష్.

'వడ్డీ ఇచ్చుడేమో గాని, వాడు అసలుకే ముంచుతె ఏం జేస్తవ్‌రా?' సూటిగా కొడుకును అడిగింది సుగుణ.

ఏమీ చెప్పలేకపోయాడు వీరేష్.. 'గట్లుండదమ్మా! ఎందుకు ముంచుతరు?' అన్నాడు చివరికి. సుగుణకు కోపం, బాధ, ఉక్రోషం ఒకేసారి తన్నుకొచ్చాయి.

'మీ నాయిన తాగితాగి వాళ్ల అమ్మ – నాయిన ఇచ్చిన రెండెకరాలు అప్పులకింద అమ్మినంక రోగానబడితె.. ఉన్న గాయిన్ని పైసలు, నేను కూలినాలి జేసి కూడబెట్టిన పైసలు, నా గంటెపుస్తెలు కతం అయినయి. నేనెంత కష్టపడ్డనో, ఏం పని చేసిన్నో, తినీతినక బతికి మీ పెండ్లిల్లు జేసిన. కోడండ్లకు గంతో గింతో బంగారం పెట్టిన. నా బతుకు నేను బతుకుతున్న. గా ఎకురం శెల్క మీ నాయినది గాదు. మా అవ్వగారోల్లు ఇచ్చింది. నేను పోయేటప్పుడు కొంచపోతనా? నా మనుమరాండ్లకు ఇస్త! గిప్పుడు అమ్మేటిదే లేదు'.. అన్నది నిక్కచ్చిగా.

'గదే పైసలు భూమి అమ్మి నీ మనుమరాండ్లకే ఇయ్యరాదు! నాకో బిడ్డ, తమ్మునికో బిడ్డ ఉండిరి. భూమిల ఏమొస్తున్నది.. దుక్కమే గద!' అన్నాడు వీరేష్.

సుగుణ మాట్లాడలేదు. ఆలోచిస్తున్నది.. తల్లి మెత్తబడుతున్నదని మళ్లీ అన్నాడు వీరేష్..

'ఎకరానికి లక్షగూడ పల్కని కాడ నలభై లక్షలిస్తరట! మనం ఇంకింత గుంజితే యాభై పడొచ్చు.. ఏమంటవమ్మా?'.

సుగుణ నుంచి జవాబు లేదు. అప్పటికే నిద్రలోకి జారుకుంది. మర్నాడు తెల్లారగానే తల్లి ఇచ్చిన చాయ్ తాగి బయల్దేరుతూ.. 'ఎప్పుడు తీసుకరాను వాళ్లను?' అనడిగాడు వీరేష్.

'ఎవల్లను?' అన్నది మళ్లీ కొత్తగా సుగుణ.

'ఇంకెవల్లను? భూమి కొనేటోల్లను!' అన్నాడు వీరేష్ అసహనం అణుచుకొని.

'అయితే మొదలే వాళ్లను కనుక్కొని ఇటొచ్చినవా? అయినా తమ్మున్ని సుత అడుగాలె గద!' అన్నది సుగుణ. 'మరి నిన్న మా దోస్తు దగ్గరికి ఎందుకు పోయిన అనుకున్నవ్? వాడే నడిమిట్ల బ్రోకర్ అన్నట్టు! మనకు మంచి రేట్ ఇప్పిస్తడు. తమ్ముడు మటుకు వొద్దంటడా? ఈ తాప వాన్ని తీసుకొనే వొస్త!' అన్నాడు వీరేష్.

'ఇప్పుడే ఏం జెప్పకు! ఎందుకో భూమి అమ్మేటందుకు నా మనసుకొస్తలేదు!' అన్నది సుగుణ. 'సరే తియ్యి. ఫోన్ జేసి వొస్త!' అంటూ వెళ్లిపోయాడు వీరేష్.

సుగుణ పత్తి చేనులో కూలీకి బయల్దేరింది.

***

**మూడ్రోజుల తరువాత..**

పొద్దంతా పత్తి ఏరి కుప్పపోసి జోకించుకొని కూలి తీసుకొని బయల్దేరారు సుగుణ, పద్మ. పొలాల నుంచి ఇంటి బాట పట్టంగానే దారిలోనే బైక్ మీద ఎదురయ్యాడు మల్లేష్.

'ఎక్కు.. ఇంటికి బోదాం!' అన్నాడు.

'ఎప్పుడొచ్చినవ్ రా! గీడికెట్ల వొచ్చినవ్?' అన్నది సుగుణ చిన్న కొడుకుతో.

'ఇంటికి పోతే తాళం బెట్టి ఉన్నది. వాళ్లను, వీళ్లను అడుక్కుంట వొచ్చిన!' అన్నాడు మల్లేష్.

'నువ్వు పా! మేం నడుసుకుంట ఎంతెల్లం వొస్తం. గీ చిన్నమ్మ ఉన్నది గద!' అన్నది సుగుణ.

'నువ్వు పో అక్కా ! నీ కొడుకు పిలుస్తున్నడు. నేను నడిశి వొస్తలే!' అన్నది పద్మ.

'ఏ.. గట్లుంటదా! ఏం గాదు. ఇద్దరం కల్సే పోదాం. నువ్వు పోరా!' అన్నది సుగుణ.

ఇంటికి పోగానే తొందరగా వంట చేసి పెట్టింది సుగుణ. ఇద్దరూ కింద కూర్చుని తింటున్నారు.

'మన శెల్కల ఏం పండుతున్నదే! ఎంతొస్తున్నది?' అడిగాడు మల్లేష్ సడన్‌గా.

సుగుణ ఈసారి కంగారు పడలేదు.

'గిన్ని దినాలకు 'శెల్కల ఏం పండుతున్నది? ఏమొస్తున్నది?' అని అడుగుతున్నావురా?' అన్నది నవ్వుతూ. 'ఎహె.. చెప్పరాదు!' అన్నాడు మల్లేష్.

'ఉన్న ఒక్క ఎకురంల ఏమేస్త? మక్కజొన్న, కందులు, పల్లికాయ, పత్తి.. గివే ఏస్త!'.

'ఎంతొస్తది ఏడాదికి?'.

'ఏమొస్తదిరా? ఖర్చులన్నీ పోను.. పదిహేను – ఇరువై వేలొస్తయి. ఒక్కొక్కసారి గవ్వి గూడ రావు'. 'మరెందుకా ఎవుసం చేసుడు? పెట్టుబడి దండుగ. పని దండుగ!'.

'గదొక్క దానిమీన బతుకుతనా రా? అన్నొద్దులు ఆడనే కూసుంటనా? మన శెల్కల పనిలేనప్పుడు బయటోళ్లకు కూలికి పోతగాదుర!'.

'గిట్ల తిప్పలబడే కన్న గా శెల్క అమ్మరాదే! పైసలొస్తే కాలు మీన కాలేసుకొని సుకంగ ఉండొచ్చు'. 'పని చేయకుండ సుకంగ ఎట్లుంటం కొడుకా? లేని రోగాలస్తయి. అట్లుండే పైసలు ఎన్ని దినాలుంటయి? అయిన సుత ఒగ సర్వ ఉంటె అండ్ల ఒండుక తినాలె గని.. గా సర్వ అమ్ముకొని సౌదలు తెచ్చుక తింటె తెల్లారి ఎండ్ల తింటం? భూమి ఉంటెనే ఊర్లె గింత విలువుంటది. భూమి లేకుంటె ఎవడు దేకుతడురా? గడికి శెల్క అమ్ముతనంటరేంది?' అన్నది సుగుణ విసుగ్గా.

'మన శెల్క పక్కన పెద్ద హోటల్ కడ్తాన్రు. ఉండేటందుకు రూములు, తినేటందుకు అన్ని తీర్ల పెద్ద పెద్ద హాళ్లు, బాగ పైసలు పెట్టేటోల్ల గురించి! వాండ్లే మన భూమి కొంటరంట. అటుదిక్కు ఇద్దరి ముగ్గురివి కొన్నరట. ఇగ మనదే ఉన్నదంట! వాండ్ల కంటె ఎక్వ ఇస్తమంటున్రు. నువ్వు ఒప్పుకొంటే మాట్లాడుదం' అన్నాడు మల్లేష్.

'యాదగిరి గుట్టకు పొయ్యే.. గదేందో ఔటర్ రోడ్డు వొస్తుందట గద! మన శెల్క రోడ్డుకు తాక్కుంట ముంగటికి ఉన్నది. వాండ్లు కొన్న భూమి జర ఎన్కకు ఉన్నది. మనది కొంటెనే

వాండ్లకు రోడ్డు మొకాన తొవ్వ అయితది. గందుకే మన ఎన్క పడ్తున్రు' నెమ్మదిగా చెప్పింది సుగుణ. 'ఇంకేంది? నీకన్నీ ఎరికే! ఎవలు చెప్పిన్లు?' అన్నాడు ఉక్రోషంగా మల్లేష్.

'ఎవలు జెప్తె ఏంది? నేనైతె భూమి అమ్మ!' నిక్కచ్చిగా చెప్పింది.

'నీకు దండం పెడ్తనే! నాకు శాన తిప్పలున్నది. బగ్గ అప్పులైనయ్. ఇజ్జత్ పోయెటట్టు ఉన్నది. ఒక్క పది లక్షలు గావాల్నే.. పానం మీదికి వొచ్చేటట్టు ఉన్నది..' ఏడుపొక్కటే తక్కువన్నట్టు ఉన్నాడు మల్లేష్.

'అప్పులెందుకు అయినయ్? నీ కొడుకు పుట్టిన్రోజుకు అప్పు జేయాల్నా? నీ బిడ్డ పెద్ద మనిషి ఐతే అప్పు జేసి, గంత పెద్ద ఓటల్‌ల ఫంక్షన్ జేయాల్నా? నీ ఆమ్‌దానికి అప్పు జేసి.. కారు కొనాల్నా? కప్పు ఎంతో కాలు గంతే సాపుకోవాలె.. లేకుంటే అప్పులు ఎక్వయి కుతికె మీదికి ఒస్తది!'.

'టాక్సీ నడుపుతనని కారు కొన్న గాదె!'.

'గండ్ల నువ్వు, నీ పెండ్లం, పిల్లలు తిరుగుడే ఎక్వ ఆయె! గీ వయిసుల అప్పులయినయని భూమి అమ్మితే గా పైసలుంటాయిర? రేపు గింతకన్న పెద్ద తిప్పలొస్తె ఏం జేస్తవ్? బతుకు కొసదానుక ఎల్లొద్దా?'.

'అమ్మా! నువ్ తిట్టినా పడ్తగని, భూమి అమ్మకుంటే దిక్కు లేదే! నేను ఉరి బెట్టుకోవాలె, లేకుంటె బండికింద తలకాయ బెట్టాలె!'.

'నన్ను బెదిరిస్తున్నావుర? నీకు గంత తిప్పలుంటె మా గ్రూపుల లోను ఎత్తి రెండు లక్షలిస్త! నువ్వు ఇచ్చినా, ఇయ్యకున్నా నేనే ఏదో కష్టం చేసుకొని కిస్తు కట్టుకుంట. ఇగ గా ముచ్చట తియ్యకు'.

**రెండు నిమిషాల్లో నిద్రపోయింది సుగుణ.**

***

హైవే మీద పది కిలోమీటర్ల దూరం నుంచే.. 'హోటల్ సంతోషం' వాళ్ల వెల్కమ్ బోర్డులు చూస్తూ వస్తున్నారు వీరేష్, మల్లేష్.

పెట్రోల్ బంక్‌లూ, ఫ్రూట్ జ్యూస్ పాయింట్లూ, పండ్ల బండ్లూ దారికి ఇరుపక్కలా వెలిశాయి. సడన్‌గా వాళ్ల దృష్టి రోడ్ పక్కగా ఉన్న టిఫిన్ సెంటర్ పైన పడింది. కారును ఆపి దిగారు వాళ్లు.

అందమైన చిన్న గుడిసె. ఎర్రమట్టి గోడలపై తెల్లని ముగ్గులు వేసి ఉన్నాయి. బయట పొడుగ్గా పందిరి వేసి ఉంది. దాని కింద పొడుగాటి చెక్క బెంచీలు, టేబుల్స్, కొన్ని ప్లాస్టిక్ కుర్చీలు వేసి ఉన్నాయి. వాటిలో కొందరు మనుషులు కూర్చుని ఉన్నారు. వెనకాలే మొక్కజొన్న చేను ఏపుగా పెరిగి కంకి తొడిగి ఉంది. కొందరు అక్కడ ఫొటోలు దిగుతున్నారు. ఒకరిద్దరు ఆ పక్కనే పంపులోంచి చేనుకు నీళ్లు వెళ్తుంటే అక్కడ కాళ్లూ, చేతులూ కడుక్కుంటూ ఫొటోలకు ఫోజులిస్తున్నారు. రోడ్డు పక్కన ఉన్న చెట్ల నీడకు రెండు కార్లు, నాలుగైదు బైకులు

ఆగి ఉన్నాయి.

రెండు పొయ్యిలు పక్కపక్కనే వెలిగించి ఉన్నాయి. ఒకదాని మీద పెనంపై జొన్నరొట్టెలు కాల్చి వేడిగా ప్లేట్లలో వేస్తున్నది పద్మ. ఇంకో పొయ్యిమీద టీనీళ్లు మరుగుతున్నట్టు ఉన్నాయి. దాని పక్కనే అరుగు మీద కూర్చుని కుంపట్లో మక్కజొన్న కంకులు కాలుస్తున్నది సుగుణ.

సుమారు ఇరవై ఏళ్లున్న ఓ యువకుడు ప్లేట్లలో అందరికీ అడిగినవి తెచ్చి ఇస్తున్నాడు.

కొడుకులనూ, వాళ్ల వెంట కొత్త వ్యక్తినీ చూసిన సుగుణ..

'కూసోండి బిడ్డా! గిప్పుడే వొస్తాన్రా!' అన్నది కంకిని నిప్పుల్లో తిప్పుతూనే.

ఏమీ మాట్లాడకుండా బెంచీ మీద కూర్చున్నారు వాళ్లు.

'మంచినీళ్లు ఉత్తయా సర్! బాటిల్ ఇయ్యమంటారా?' వినయంగా అడిగాడు ఆ యువకుడు.

'అరేయ్ రవీ! వాళ్లు నా కొడుకులేరా!' అన్నది సుగుణ నవ్వుతూ.

'అయ్యో పెద్దమ్మా! నాకు తెల్వదు.. సారీ అన్నా! ఏం తింటరు?' అడిగాడు రవి.

'ఏమున్నయ్?' అన్నాడు వీరేష్.

'మిర్చి బజ్జి, జొన్నరొట్టె, మక్క గారెలు, సర్వపిండి, చికెన్ కర్రీ, పప్పు.. లేకుంటే మక్క కంకులు, చాయ్.. ఇంక కూల్ డ్రింక్స్ కావాల్నంటె కూడ ఉన్నయి' అన్నాడు రవి గబగబా.

'మేం జర సేపు వెయిట్ చేస్తంలే! నీ గిరాకీ చూసుకో!' అన్నాడు మల్లేష్.

'మీ అమ్మను ఒప్పిస్తామన్నారు. ఆవిడేమో ఇక్కడ ఓ ఎస్టాబ్లిష్‌మెంట్ స్టార్ట్ చేసింది!' అన్నాడు వెంట వచ్చిన దోస్తు.

కొద్దిగా రద్దీ తగ్గగానే, తల్లి దగ్గరికి చేరారు కొడుకులిద్దరూ.

'అన్నం కాంగనే తిందాం. కాళ్లూజేతులు కడుక్కొమ్మను మీ దోస్తును!' అన్నది సుగుణ.

అక్కడే అన్నం తింటూ.. 'గింత జల్దిన.. గిదంత ఎట్ల జేసినవమ్మా!' అన్నాడు ఆశ్చర్యంగా వీరేష్.

'ఎంత మిగుల్తాంది రోజుకు? ఇంక గూడ డెవలప్ జెయ్యొచ్చు' అన్నాడు చిన్న కొడుకు.

'ఊర్లె ఉండే దానికన్న ఈడ్నే గుడిసె ఏస్కొని ఉంటె మంచిగుంది. గుట్టమీద దేవుని కాడికి రోజు వొచ్చేటోల్లు, పొయ్యేటోల్లు శానమంది ఉంటరు. వాళ్లు ఆకలి మీన ఉన్నప్పుడు మన కాడ ఉండేటిది మనం జేసి అమ్మితె మంచిగుంటది గదా అనుకున్న. పద్మ మొగడు గూడ తాగితాగి సచ్చిపోయిండు. గామెకు ఒక్కడే కొడుకు. జర సదువుకున్నడు గానీ, ఊరు వొదిలిపెట్టి పోనంటండు. 'నేను గూడ కలుస్త అక్కా!' అన్నది. పెట్టుబడి, కష్టం ఇద్దరిది. గీ రవి ఎట్లయినా ఉంటడు. ఇప్పటికైతే మంచిగనే ఉన్నది' అన్నది సుగుణ.

'వంటలు బాగా రుచిగా ఉన్నాయి. మీ టిఫిన్ సెంటర్ బాగానే నడుస్తుంది. లొకేషన్ అడ్వాంటేజ్ మీకు' అన్నాడు దోస్తు.

'ఇప్పుడు మంచిగనే ఉండొచ్చు గని, ముందుముందు గా హోటల్ ఓపెన్ అయితే ఎట్లుంటదో?!' అన్నాడు మల్లేష్.

వీరేష్ అవుననలేదు.. కాదనలేదు.

సుగుణ వెంటనే జవాబిచ్చింది.. 'గట్ల ఎందుకు అనుకోవాలె కొడుకా? ఎవల గిరాకీ వాళ్లది. అగ్వకు తినాలె, జల్ది తినాలె, గివ్వే తినాలె అనేటోల్లే గేడికి ఒస్తరు. వాళ్ల ముంగట్నే ఉడుకు ఉడుగ్గ జేసి పెడుతం. గట్లకావాల్ననేటోళ్లు కూడ ఉంటరు. అందరు పైసలు బగ్గ ఉన్నోళ్లే ఉంటరా? మీరు గిప్పుడు వొచ్చే తొవ్వల రోడ్డు మీన కార్లు, సైకిళ్లు, ఆటోలు, లారీలు, బస్సులు, సైకిల్ మోటర్లు, ట్రాలీబండ్లు.. ఎన్ని పోతలేవు? ఎవని జాగ వానిదే! 'నువ్వు గిట్ల రావొద్దు' అని ఒకడు ఇంకోన్ని అంటడా? టక్కర్ పెట్టకుండ నడుపుకుంటె బాయే. గిది గంతే!'

సాయంత్రం అవుతున్న సూచనగా మెల్లమెల్లగా నీడలు పరుచుకుంటున్నాయి. మళ్లీ జనం రావడం మొదలయింది.

'ఇగ పోండ్రి బిడ్డా! పొద్దు గుంకుతున్నది. చీకటయితె తొవ్వ కనబడది. ఎదురుంగొచ్చే బండ్ల లైట్లు కండ్లల్లకొడ్తయ్.. సరిగ్గ నడుపరాదు. పయిలం!' అంటూ కొన్ని జొన్నరొట్టెలు, గారెలు, మిర్చీ బజ్జీలు పిల్లల కోసం పొట్లంకట్టి ఇచ్చింది.

పద్మ మళ్లీ పొయ్యి వెలిగించింది.

***

రమాదేవి నెల్లుట్ల స్వస్థలం ఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్. ఎంఏ చేశారు. వృత్తిరీత్యా ఆంధ్రాబ్యాంక్‌లో సీనియర్ మేనేజర్‌గా పనిచేసి విరమణ పొందారు. కార్టూన్లు గీయడం, కథలు, కవిత్వం రాయడాన్ని ప్రవృత్తిగా ఎంచుకొన్నారు. ఇప్పటివరకూ మనసు భాష (కవిత్వం), రమణీయం (కార్టూన్లు), మనసు మనసుకూ మధ్య (కథలు), చినుకులు (నానీలు), తల్లి వేరు (కథలు) పుస్తకాలను వెలువరించారు. 2004లో సుశీలా నారాయణ రెడ్డి పురస్కారం, 2014లో అపురూప అవార్డు అందుకొన్నారు. 2015లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా స్థాయిలో ఉత్తమ రచయిత్రి పురస్కారాన్ని దక్కించుకొన్నారు. అదే ఏడాది పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి పురస్కారం, జాతీయ సాహిత్య పరిషత్తు, సిద్దిపేట వారి ఐతా భారతి – చంద్రయ్య సంప్రదాయ కథా సాహితీ పురస్కారం అందుకొన్నారు. గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ అవార్డు, పర్చా రంగారావు స్మారక పురస్కారం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ప్రతిభా పురస్కారం, వెంకటసుబ్బు స్మారక అవార్డు, తిరుమల స్వరాజ్యలక్ష్మి సాహితీ పురస్కారం దక్కించుకున్నారు. ఉత్తమ కార్టూనిస్టుగా బాపు – రమణ అకాడమీ నుంచి రాగతి పండరి స్మారక పురస్కారం అందుకొన్నారు.

Katha PART 1_Layout 1 6/29/2023 2:38 PM Page 39

# కాటుక కన్నుల సాక్షిగా



వేణు మరీదు,
85550 53547

మా ఊళ్లో ఆ రోజుల్లో కాకులు, కోకిలలు కూడా కాటుక పెట్టుకున్నట్లే కనపడేవి నాకు. పూర్తిగా కూలిపోయి నల్లతుమ్మలు, రేగుపొదలతో చిట్టడివిలా మారిన దొర గడీ వెనుక ఎప్పుడో ఒకసారి కనపడే నెమలీ, పటేలు మామింట్లో నెమలి పుంజు కూడా! అలా అని నాకనిపించేవా? లేక నిజంగానే వాటికీ కాటుకేమైనా ఉండేదా?

ఊరిలో ఆడవారంతా మహా కళాత్మకంగా కాటుక దిద్దుకునేవారు. రేచీకటి రమణక్కతో సహా! ఒకటో తరగతి వరకూ నాకూ మా అమ్మ కాటుకద్ది బడికి పంపేది. ఒకరోజు బళ్లో రామయ్య సారు..

'అరేయ్! ఈడు రోజూ కాటుక పెట్టుకుని వస్తున్నాడు. అమ్మాయిల మద్దెలో కూసోబెట్టండ్రా'.. అనేసరికి, మా పోర్లు పోరగాళ్లంతా ఒక్కపెట్టున నవ్వారు. అప్పుడు నాకు తెలిసింది.. ఆడ, మగను 'వేరుచేసేది' కాటుక అని!

ఎఱ్ఱ దమయంతి కాటుక ఎంతో ఇష్టంగా, అందంగా పెట్టుకునేది. ఆమె 'నలుడు' పోయి చాలా యేళ్లవుతున్నా, ఆమె ముత్తయిదువలకుండే ఐదుతనాల్ని వదిలేసినా.. ఎందుకో కాటుకను మాత్రం వదల్లేదు. కాటుకద్దుకున్న ఆమె కళ్లు రెక్కలు తొడుక్కున్న గండు చీమల్లా కనిపించేవి. ఊళ్లో ఎక్కడైనా 'చక్కెర' దొరుకుతుందా? అని అవి వెతుక్కుంటున్నట్లుగా అనిపించేవి! ఎంత ఇంపుగా కాటుక దిద్దుకున్నా ఆమె కన్నుల్లో పొద్దుజారుతున్న వేళ నారింజ రంగు మబ్బుల గీతల్లా ఎరుపు జీరలు కదలాడుతుండేవి. వాటిల్లో ఆమె కన్నీరంతా దాచుకున్నట్లు అనిపించేది.

నల్ల శ్రీదేవి కాటుకను దిద్దుకునేది, అద్దుకునేది, ఇంకా.. రాసుకునేది, పూసుకునేది అనేకంటే పొద్దున్నే లేచి కళ్లకు కాటుక 'తినిపించేది' అంటే బాగుంటదేమో! ఆ అమ్మాయి ఎంత మందంగా కాటుక దిద్దుకునేదంటే.. ఆమె అప్పట్లో

అమెరికాలో పుట్టి ఉంటే 'థామస్ విలియమ్స్' అనే ఆయన ఎగిరి గంతేసేవాడు. ఒకరోజు తన చెల్లెలు మెత్తని బొగ్గుపొడి, వేజలైన్‌లాంటి జెల్లీతో కలిపి కాటుకలా పెట్టుకుంటుంటే చూసిన అతను ఆ ఫార్ములాతో మొట్టమొదటి కమర్షియల్ కాజల్‌ను తయారుచేసి, ఆమె పేరుతోనే 'మేబిలీన్ కాస్మోటిక్స్' సంస్థను ప్రారంభించాడట. అదే మెల్లగా ఒక మల్టీనేషనల్ కాస్మటిక్ కంపెనీగా ఎదిగింది. మా ఊరి శ్రీదేవి అక్కడ పుట్టి ఉంటే.. వాళ్లు తమ సంస్థకు బ్రాండ్ ఐకన్‌గా ఆమెను పెట్టుకునేవాళ్లేమో! కన్నయ్య మేనిఛాయ తనది. తన నలుపు ముఖానికి తెల్లని మధ్యహద్దులుగా ఉన్న ఆ కన్నులకు శ్రీదేవి తన చూపుడు వేలితో చాలా బారుగా కాటుక రాసుకునేది. మధ్యలో ఆమె ఎప్పుడైనా ఓసారి లిప్తపాటు రెప్పలు మూస్తే ఒక గుండ్రని నీలి తటాకంలో ఉన్న రెండే రెండు పెద్ద కలువల్ని చటుక్కున ఎవడో వచ్చి తెంపుకెళ్లినట్టు ఉండేది. పక్క టౌన్‌లో కాలేజీ నుంచి సాయంత్రానికల్లా ఇంటికొచ్చిన శ్రీదేవి జడలోని కనకాంబరాలు వాడిపోయి మ్యాచింగ్‌గా వేసిన ఆ పూలరంగు ఓణీతోపాటు ఆమె కన్నుల కాటుక కూడా చెదిరిపోయి ఉండేది!

సాలోళ్ల రుక్కమ్మక్క కళ్ల కాటుక గురించి చెప్పకపోతే కాటుక్కాయ అలిగి ఆత్మహత్య చేసుకుంటదేమో! నిండార తలంటుపోసుకుని అమ్మవారికి దీపారాధన చేసొచ్చి, మగ్గం ఆడిస్తూ కూర్చున్న రుక్కమ్మ పండరీపురంలో ఆషాఢ ఏకాదశి రోజున ఎంతో శోభతో మెరుస్తున్న రుక్మిణీదేవిలానే ఉండేది. రుక్కమ్మ కన్నులు బంగారు చేపలే! గాజుతొట్టెలోవి కావు.. పాల సంద్రంలోవి! తెలతెల్లని ఆమె మోముపై చుట్టూ వలయంగా కాపలా కాస్తున్నట్లుండే నల్లని భటుల్లాంటి ఆమె మందపాటి కనురెప్పలు.. అసలా కన్నులకు కాటుకే అవసరం లేదు! ఐనా శివమ్మత్త చెప్పిందట.. కాటుక సైతాను పీడలేకుండా చేస్తుందని! ఆ నమ్మకంతోనే ఏ రోజూ మర్చిపోకుండా కాటుక ధరిస్తుంది రుక్కమ్మ. రుక్కమ్మ కళ్లు ఎంత బంగారు చేపల్లా ఉన్నా.. ఆమె పెనిమిటి వాటిని చూసుకోకుండా సానికొంపల్లో పిత్తపరిగెల పులుసులకు మరిగాడు. రుక్కమ్మకున్న సైతాను పీడ అదొక్కటే. భర్త తమను పట్టించుకోకున్నా తన ఇద్దరు ఆడపిల్లల రేపటికోసం రేయింబవళ్లూ మగ్గం తొక్కే రుక్కమ్మ.. కాళ్లు బలహీనమవుతున్నా ఆమె కాటుక కళ్లు మాత్రం ఎప్పటికీ వెలుతురు నదులే! మగ్గంపై జరీదారాల కాంతులు ఆ కళ్లల్లోపడి ప్రతిఫలించి ఇంద్రచాపాలయ్యేవి! మా రుక్కమ్మక్క కాటుక కళ్లు చేయి తిరిగిన చిత్ర లేఖకులు పాలరాతి ఫలకాలపై అద్దిన తెలుగక్షరాలలోని స్వర్ణాల వృత్తాలు.

నూర్ పర్వీన్ కాటుక కళ్లను దగ్గరగా చూస్తే అంతే మరి. నూర్ పూర్వీకులు నవాబులంట. నిమ్మపండు రంగు మేనిఛాయతో పందిరెత్తుండే నూర్‌కు ఊరిలో మిగతా ముస్లిం అమ్మాయిలంటే కొంచెం చులకన. వాళ్లంతా దూదేకులోళ్లనీ, తమది మాత్రం పూర్వం నుంచీ గొప్ప నవాబుల 'జనానా' సంప్రదాయమని ముక్కుపుటాలెగరేస్తూ గర్వంగా చెప్పుకొచ్చేది. వాళ్ల జమానా నాటి వైభవపు రోజుల్లో వాళ్లిళ్లల్లో మూలికలు, ముత్యాల పొడులతో ఇంకేవో

కలిపి 'సుర్మా' తయారు చేసేవారని, దానిని ఎంతో ఇష్టంగా తమ కుటుంబాల్లో స్త్రీలు, రంజాన్ మాసంలో పురుషులు కూడా చక్కగా దిద్దుకునేవారని కథాకథనంగా చెప్పేది. ఇప్పుడు మాత్రం వాళ్లు సిబ్బిరేకు మీద దీపం మసితోనే కాటుక చేస్తున్నారు. తల, ముఖానికి ఆమె హిజాబ్ చుట్టుకున్నా.. నేత్రభాగం వదలాలి కాబట్టి నూర్ పర్వీన్ కాటుక కళ్లు ఆ హిజబ్ వస్త్రం అనబడే నల్లని దిక్చక్రంపై రెండు చిరుముత్యాల్లా మెరుస్తూ కనిపించేవి. పర్వీన్‌వి కొంచెం చిన్నగా ఏనుగు కన్నుల్లా ఉన్నా.. తెలుగు మాస్టారు గారి అబ్బాయి రంగనాథను చూస్తే మాత్రం పొంగడాల్లా పొంగేవి. 'మియ్యాలకు అయ్యోర్లకు సెట్ కాదులేంద్రా.. ఈ లేత బాపన శరీరంపై మటన్ కత్తుల థిల్లానా ఆడిస్తారా ఏంట్రోయ్..' అంటూ నవ్విస్తూ తప్పుకునేవాడు రంగనాథ. వాడిప్పుడు ఎస్పీ. మా దోస్తుల్లో సివిల్ సర్వీసెస్ సాధించిన ఏకైక వ్యక్తి.

ఏ మగాడైనా సాధారణంగా ఓ సౌందర్యరాశిని నిండారా నఖశిఖం చూస్తే చలిస్తాడు.. జ్వలిస్తాడు.. ఉద్రేకాలు తట్టుకోలేనోడయితే స్ఖలిస్తాడు! ఒకటి కాదు.. రెండు దాల్ లేక్‌లను పక్కనుంచి కాటుక సింగారిస్తే ఎలా ఉంటుందో అలా చక్కగా ఉంటాయి దయామణి కాటుక పెట్టుకున్న కన్నులు. ఆమె కన్నులు చూస్తే పాషాండుడైనా రసిక పిపాసి అవ్వాల్సిందే! మా ఊళ్లో కమ్మోళ్ల, కాపోళ్ల పిల్లగాళ్లు 'కాలనీ'లోకి వెళ్లారంటే కూలీకి మనుషుల్ని పిల్చుకురావడానికి, లేదంటే దయామణి నేత్రజ్యోతులను దర్శించి రావడానికే! దేవాలయాల్లో స్త్రీమూర్తుల ప్రతిమల ముఖాలలో కొన్నిచోట్ల కళ్లను ముఖానికి ఇరువైపులా మించి ఆర్చీ వంపుల్లా, పూరేకుల కొసల్లా మిగులు కనురెప్పలు బయటకు చెక్కి ఉన్నట్లు దయామణి కన్నులు వైభవంగా మెరిసేవి. ఆ అమ్మాయి వాళ్లది ఆర్‌సీఎమ్ విశ్వాసుల కుటుంబం. పసుపు కుంకుమలు పెట్టకపోయినా కాటుక మాత్రం దిద్దుకునేది. అప్పట్లో నీలం రంగు లంగా జాకెట్టుపై తెల్ల జార్జెట్ ఓణీ యూనిఫాంతో సగం తెల్లని మేఘాలొకవైపు సగం నీలి మేఘాలొకవైపు ప్రతిబింబించే తేట ఊట చెరువులా గంభీరంగా అగుపించేది దయామణి.

అసలు మా ఊరే ఒక పెద్ద కాటుక కన్ను. నల్లటి రేగడి మట్టి రోడ్లు.. పేడ, నల్ల బంకమన్నుతో అలికిన గోడలు, అరుగులు, వాకిళ్లు! ఎండీ తడిసీ వెలిసిపోయి నల్ల అట్టల్లా కనిపించే జమ్మిగడ్డితో వేసిన పై కప్పులు. గట్టున నల్ల తుమ్మల నీడల్ని వాటేసుకుని పడుకున్న పెద్ద చెరువు. కొండప్రాంతం కాబట్టి పిలిస్తే వస్తాయి అన్నట్లు ముసురుకునే వానమబ్బుల్తో, శివుని జటాజూటాల్లా వీధి వీధినా పెరిగిన నల్లవేప మానులు. ఊరంతా చెట్లపై కాకుల గుంపుల్తో, కాకుల్లాంటి ఎందరో మనుషుల గుంపుల్తో మా ఊరే దట్టంగా కాటుకద్దుకున్న చక్కని కన్నులా ఉండేది.

తెల్లవారు జాముకల్లా కోనేట్లో విడిచిన కార్తీక దీపాల్లా.. మా ఊరి ఆడవాళ్ల కాటుక కళ్లన్నీ ఇప్పుడు నా జ్ఞాపకాల్లో కొండెక్కాయి. కానీ నా 'ఆరా'లో అంతర్భాగంగా ఉంటూ, నా చుట్టూ లక్షల దివ్వెల్లా ఇప్పటికీ వెలుగుతూనే ఉన్నాయి.. 'కార్తీక' కన్నులు.

***

కార్తీక కన్నడిగ. ఆమె తండ్రి రామకృష్ణ షాజీ ఇంజినీర్. మా ప్రాంతంలో నాగార్జునసాగర్ కాలువల తవ్వకం జరిగే సమయంలో పాలమూరు కార్మికులకు బిస్తర్ మా ఊరి పొలిమేరలోనే. వాళ్ల బట్వాడా, బాగోగులు చూసుకునే పనిని కాంట్రాక్టర్లు షాజీకే అప్పగించారు. అందుకే ఆ కార్మికుల గుడారాలకు దగ్గరగా ఉండాలని మా ఊళ్లోనే ఉండేది వాళ్ల కుటుంబం. దానితో కార్తీక మాతోనే, మా ఊరి బడిలోనే చదివింది. తెలుగు బాగా నేర్చుకుంది. కానీ, ఆమె తండ్రికి కన్నడ సంస్కృతి, కర్నాటక అంటే మితిమీరిన స్వాభిమానం.. తెలుగును, తెలుగోళ్లనూ విమర్శించేవాడు!

ఆ రోజుల్లో కాటుకను ఇళ్లలోనే చేసుకునేవారు. కార్తీక తల్లి స్వచ్ఛమైన గానుగ నూనెతో కోడిగుడ్డు దీపం వెలిగించి, తాంబూలంపై ఆ మసి పట్టించి, అందులో రవ్వంత కేరళ కర్పూరం కలిపి, సంపంగి పూల రేకులు నానబెట్టిన స్వచ్ఛమైన రెండు కొబ్బరినూనె చుక్కలేసి కాటుక వండేది. ఆ కాటుకను మొదటి రోజు దిద్దుకున్న కార్తీక బడికి రాగానే మా అక్క దగ్గరికి వచ్చేది.

'అమ్మ నిన్ననే చేసింది చూడు!'.. అని మా అక్క ముఖానికి, నా ముఖానికి దగ్గరగా తన ముఖాన్ని ఉంచేది. భరతనాట్యంలో 'ఆలోకిత' అనే దృష్టిభేదాన్ని ప్రదర్శించేటప్పుడు నృత్యకారిణి తన కళ్లను టపటపమని వర్తులంగా ఎలా ఆడిస్తుందో అలా కళ్లను కదిల్చేది ఆ క్షణంలో.. చక్కని కాటుక కళ్లు దృశ్యమానం.. కానీ, కార్తీక కళ్లు అప్పుడు 'ఘ్రాణమానం'.. 'అరోమా ఆఫ్ ది ఐ'.. పరిమళ నేత్రాలు! ఒక అందగత్తె ఏ మగపిల్లవాడి ముఖానికైనా తన ముఖాన్ని అతి దగ్గరగా తీసుకొచ్చి, అతడి చెక్కిళ్లపై తన పెద్ద గుండ్రని కళ్లను ప్రతిబింబిస్తే.. వాడు నిలువగలడా?

ప్రతి ఉదయం లేవగానే అమ్మ ముఖం చూసేవాడిని. అది మర్చిపోయి లేపాక్షి నోట్‌బుక్ నిండా రేనాల్డ్స్ బ్లాక్ పెన్నుతో జీవకళ ఉట్టిపడేలా గీసుకున్న కార్తీక కాటుక కన్నులు చూసుకోవడం మొదలుపెట్టా. నా చుట్టూ ప్రతి పరిసరంలోకి కార్తీక కన్నులు పరకాయ ప్రవేశం చేసేవి. నేలకు చూస్తే ప్రతిమొక్క, ప్రతి మొగ్గ.. పైకి చూస్తే ప్రతి మేఘం, ప్రతి మెరుపూ, ప్రతి చుక్క, ప్రతి ఉల్క, ప్రతి నెలపొడుపు నాటి జాబిలి కూడా కాటుక ధరించినట్లు దర్శనమిచ్చేవి. అవన్నీ నావైపే చూస్తూ నవ్వుతున్నట్లు అనిపించి, విశ్రాంతి లేని భ్రాంతిలోకి నన్ను నెట్టివేసేవి. 'సితార' ఇరవై రోజులాడితే ప్రతిరోజూ ఫస్ట్‌షో చూశా. భానుప్రియ కన్నుల్లో నా కార్తీక కన్నులు! అవే ఇవి.. ఇవే అవి.. ఇప్పటికీ కాటుక దిద్దుకున్న ప్రతి కన్నుల్లో కార్తీక కన్నులే కనిపిస్తాయి నాకు.

పదిలో 'ఫీలింగ్' మొదలైంది. డిగ్రీ ఫైనలియర్లో 'మ్యాటర్' ఫైనల్‌కొచ్చింది! ఒకరోజు ఆ మ్యాటర్ సీదా బైటపెట్టేశా!

'కార్తీకా.. లవ్ యువర్ ఐజ్ సోమచ్'..

'కళ్లనేనా?'..

'అవును!'..

'ఐతే నే భక్తకన్నప్పలా ఈ కన్నులు తీసివ్వనా?'..

'నేనేమీ శివుణ్ని కాదులే!'..

'నేను మాత్రం నీ పార్వతినే..!'..

ఈ మాట అంటూ కొంచెం కొంచెంగా కాకుండా ఒక్కసారే ఒక్క నిమిషంలోనే బ్రహ్మ కమలం వికసిస్తే ఎలా ఉంటుందో అలా విప్పారింది ఆమె ముఖం.. ఎలా తట్టుకోగలను? లిప్తపాటులో కదిలి ఆమెను గట్టిగా హత్తుకుని, నా వెచ్చని పెదాలు ఆమె చల్లని కాటుక కన్నులపై ఉంచి గట్టిగా అదిమి ముద్దుల సునామీ సృష్టించాను. ఆమె శరీరంలో చక్కిలిగింతలకు మొత్తం కేంద్రక స్థానం కళ్ల చుట్టూతా ఉన్నట్లు ఆమె ఒకటే గిలిగింతలతో ఉక్కిరిబిక్కిరై నవ్వుతోంది. పైన కనుబొమ్మల నుంచి కింద చెంపలపై అంచుల వరకూ చెల్లాచెదురైన ఆమె ఆ కాటుక రేఖల మోము అలలు.. అప్పుడే వేగంగా మోసుకొచ్చి చెల్లాచెదురుగా విసిరేసిన నల్లని గవ్వలు నిండిన తీరంలా అయిపోయింది. ఇక కాటుక, నా నోటితడి కలగలిసి అంటుకుపోయిన నా పెదాలు మాత్రం మిగలపండి రసాలూరుతున్న నేరేడు పళ్లలా అయ్యాయి.

'అబ్బో! ఎన్నాళ్లు నడిచిందలా?'.

'కొన్నాళ్లే!'.

'పెళ్లెందుకు చేసుకోలే మరి?'.

'గంగతో రాసిపెట్టుందిగా!'.

గంగ నా భార్య! ఇప్పటివరకూ పై ముచ్చట్లన్నీ తనకే చెపుతూ ఉన్నా.. ఆ పూట!

'శివుడు గంగమ్మని వదులుకున్నాడు. పార్వతిని కాదుగా! ఆ కార్తీకే నీకు పార్వతిలా ఇంకా గుండెల్లో ఉందన్నమాట.. నేను కాదు!'.

'అమ్మో అట్లా అనకే! నా హృదయం పెద్ద హైరైజ్ ఆకాశహర్మ్యం లేవోయ్. అందులో హై ఎండ్ లగ్జరీ ఫ్లాట్‌వి నువ్వేనోయ్!'.

'చాల్లెండి మీ బడాయి బిల్డర్ మాటలు'.

'బిల్డర్లకు మాటలే సగం పెట్టుబడి'.

'సర్లే.. అన్ని మాటలూ చెప్పారు. ఇన్నేళ్లూ ఈ ముచ్చటెలా దాచారు?'.

'వయసులో ఉన్నపుడు రహస్యం దాచుకోవాల్సి ఉంటుంది. వయసు దాటేకొద్దీ ఏదీ దాయబుద్ధవ్వదు!'.

'ఇదేమీ రహస్యం కాదులెండి!'.

'రహస్యం కాదా!?'.

'అవును. నాకెప్పుడో తెలుసు శ్రీవారూ!'.

దిమ్మ తిరిగిపోయింది నాకు.

'నిజంగానా ! ఎలానే గంగా?'.

'కార్తీక డిగ్రీ వరకు నీకు క్లాస్‌మేట్. నాకు తను మైసూర్ ఆర్.ఐ.ఈ.లో క్లాస్‌మేట్. అక్కడ మేం ఎడ్యుకేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ కలిసి చదువుకున్నాం. అప్పుడు తెలియదు మీ లవ్ ముచ్చట. ఆ మధ్య మా బ్యాచ్ గెట్ టుగెదర్ జరిగింది. గుర్తుందా మీకు. ఆర్నెల్లక్రితం నేను మైసూర్ వెళ్లొచ్చా!'.

'హా.. ఔనౌను. టికెట్స్ నేనే కదా బుక్ చేసింది!'.

'మేమిద్దరం కలిసి చదువుకునేప్పుడు తన లవ్‌స్టోరీ గురించి ఎప్పుడూ చెప్పలేదు కార్తీక. మా గెట్ టుగెదర్ పార్టీలో నేను ఈ టౌన్‌లో ఉంటున్నానని, ఫలానా కుటుంబం వాళ్లు నా అత్తిల్లనీ చెబితే.. ఇంకా వివరాలడిగింది. మా వారని మీ పేరు చెప్పగానే.. ముందు చిగురాకులా కంపించింది. భళ్లున ఏడ్చింది. మన టౌన్ ఒకప్పుడు చిన్న పల్లెటూరనీ, వాళ్ల నాన్న ఇక్కడ చాలాకాలం ఇరిగేషన్ ఇంజినీర్‌గా చేశాడనీ, ఇక్కడ తాము చాలా యేళ్లు ఉన్నామనీ చెప్పింది. మెల్లిగా మీ విషయమూ చెప్పింది! మీ ప్రేమ ముదిరి పాకానబడుతుందని గమనించి, కార్తీక తండ్రి రాత్రికి రాత్రే కుటుంబాన్ని ఇక్కడినుంచి తరలించాడంట. తర్వాత ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్నాడు. తను కనిపించక నువ్వు పిచ్చోడివి అయ్యుంటావని అనుకుంటూ ఉందట.. కానీ, నువ్వు కుదుటపడ్డావనీ, పెళ్లాడావనీ, పిల్లల్ని కూడా కన్నావని తెలిసి సంతోషించిందిలే!'.

'మరి నువ్వేమనుకుంటున్నావు గంగా?'.. చాలా గిల్టీ కాన్షస్‌గా అడిగా.

'ఇన్నాళ్లూ మనిద్దరి మధ్య రహస్యాలు లేవనుకుంటూ ఉన్నా! అయినా పెద్దవాళ్లమై పోతున్నాం. పిల్లలూ సెటిలయ్యారు. ఇంకా గత జల సేతుబంధనాలు ఎందుకులెండి! మన పెళ్లికి ముందుకదా అది జరిగింది'.

'జోహార్లు.. నీ పెద్దమనసుకి గంగా! అది సరే.. అసలు విషయం చెప్పవా.. కార్తీక ఇంకా కాటుక పెట్టుకుంటూనే ఉందా?'.

'అవును.. అబ్బ! ఏం కళ్లండీ దానివి!'.

'తననోసారి చూడాలి!'.

'మైసూరెళ్లి చూద్దురులే.. పర్మిషనిస్తా! అందాక ఈ ఫొటో చూసుకోండి'.

తన ఫోన్‌లో గూగుల్ ఫొటోస్ ఓపెన్ చేసి, ఒక ఫొటోను జూమ్ చేసి చూపించింది గంగ.

'ఈ కాటుకలద్దిన కళ్లే నన్ను ఇన్నేళ్లూ బాధిస్తున్నాయి గంగా!'.

'నాకర్థమైందిలెండి. నాతో తమరు గొడవ పడ్డప్పుడల్లా ఈ కాటుక కళ్లే వందలు వేలుగా మీ ముందు మెదిలేవని!'.

'ఎప్పుడు బయల్దేరమంటావు?'.

'మీ ఇష్టం. వాళ్ల ఇంటిదైవం చాముండీ అమ్మవారు. ఈ శరవన్నవరాత్రులూ ప్రతి ఉదయం, సాయంత్రం తను చాముండీ హిల్స్ గుడికెళ్తుంది. అక్కడ కచ్చితంగా కనిపిస్తుంది. చూసి రండి!'.

'శ్రీమతీ.. జిందాబాద్!'.

'ఆగండాగండి శ్రీవారు.. షరతులు వర్తిస్తాయి'.

'చెప్పండి మేమ్!'.

'కార్తీక కలిసినా మీరు ఆమెతో ఏమీ మాట్లాడొద్దు. నో రికాలింగ్స్. నో రెమినిసెన్సెస్ ప్లీజ్. పూర్వ పరిచయాలు, పురానీ ప్యార్ కహానీలొద్దు. కార్తీక తండ్రి ఇప్పుడు లేడు. కానీ, దాని భర్త పెద్ద మూర్ఖుడంట. అదీగాక వాళ్ల ఒక్కతే కూతురికి మొన్నీమధ్యనే పెళ్లయిందట. పెద్దరికం రెండువైపులా ఏపుగా పెరిగిపోయి ఉంది. కాపాడండి.. కాపాడుకోండి!'.

'ఐ స్వేర్ ఇట్.. హండ్రెడ్ పర్సెంట్ గంగా! ఒకే ఒక్కసారి తన కాటుక కళ్లని చూసొస్తా!'.

'ఒకే.. ఐతే జర్నీ టికెట్స్ బుక్ చేసుకోవచ్చు !'.

తనను దగ్గరికి తీసుకొని, నుదిటిపై పెదాలుంచి చాలాసేపు అలాగే ఉండిపోయా. నన్ను పొదివి పట్టుకుని తనూ అలాగే ఉండిపోయింది.

హిమాద్రి శిఖరాల మధ్య సమున్నతంగా ప్రవహించే ఆ గంగనే.. నా ఈ గంగ!

***

శరవన్నవరాత్రుల వేడుకలు. చాముండీ హిల్స్‌పై ప్రతి అణువూ అమ్మవారి ఆరాధనలో మునిగితేలుతున్నట్లు అనిపిస్తున్నది నాకు. ఆశ్వయుజ సప్తమి. దుర్గాదేవి అలంకరణలోని అమ్మవారిని దర్శించుకుని, అంతరాలయ మంటపాన్ని దాటగానే ఉత్తరాభిముఖంగా ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం పక్కనే ఉన్న మెట్లపై కూర్చొని ఎదురుచూడసాగాను. ఈ శరవన్నవరాత్రులు ప్రతిరోజూ కార్తీక అమ్మవారిని దర్శించుకుని వచ్చి తను ఆ దగ్గరలోనే కూర్చుంటుందట.. గంగ చెప్పింది! కానీ, ఈ రోజు వస్తుందో లేదో మరి? నన్ను చూస్తే గుర్తుపడుతుందా? నేను మాత్రం గుర్తుపట్టగలను. ఫోన్ స్క్రీన్‌పై తన ఫొటోను జూమ్ చేస్తూ చాలా సేపు కూర్చున్నాను. ఒకవేళ రాకపోతే తనకు ఫోన్‌చేస్తే? గంగ ఫోన్‌లో కార్తీక నెంబర్‌ని తస్కరించా! తప్పే కదా.. తప్పని తప్పు!

కొంచెం దూరంలో.. ప్రాకారం పక్కనే ఉన్న ఒక స్త్రీ మూర్తి కార్తీకలా అనిపించింది. లేచి నాలుగడుగులు ముందుకేసి చూస్తే.. తను కార్తీకే! ఫొటోలో ఉన్న రూపునకు కొంచెం మార్పు.. మరో స్త్రీ కాదు. తనే.. అదిగో ఆ కన్నులు.. ఆ కాటుక కన్నులే ఆమె ఉనికి! ఆ కాటుక దిద్దుకునే తీరే ఆమె ఆచూకీ! స్త్రీ మూర్తులు తాము ధరించిన దేహాల కాన్వాస్‌లపై గీసుకునే కళాకృతులే కన్నులు! కార్తీక ముఖంపై రెండు నీలి చిత్తరువుల్ని గుర్తుపట్టకుండా ఎలా ఉండగలను?

దగ్గరికెళ్లి నవ్వుతూ.. 'ఇంకా ఇంకులేని రీఫిల్‌తో, నెమలీకతోనే కాటుక అద్దుకుంటున్నావా కార్తీకా?' అని అడుగుదాం అనుకున్నాను. నాలుగడుగులు ముందుకేశా.. కానీ, రెండడుగులు వెనక్కు. మళ్లీ నాలుగడుగులు ముందుకు.. రెండడుగులు వెనక్కు. ఆమె కన్నులు ఆ సమయంలో కొద్ది సమయం క్రితం తాను చూసిన అమ్మవారి కళ్లలానే ఉన్నాయి. స్పెషల్ దర్శనం టికెట్‌తో ఆ ఉదయం అమ్మవారిని దగ్గరగా చూడగలిగా! అమ్మవారు ఒక్కసారి తనవైపు పెద్ద కళ్లతో చూసినట్లనిపించింది. ఉలిక్కిపడ్డాను ఆ క్షణంలో! ఇప్పుడు నా ఎదురుగా

అటువంటి దివ్య నేత్రాలే! కార్తీక కళ్లు.. వయసుతోపాటు పెద్దగా మారని కన్నులు. అయితే ఆ కళ్లల్లో ఇప్పుడు ఎర్రజీరలు మాత్రం ఎక్కువగా కనిపిస్తున్నాయి. వయసు ప్రభావమేమో.. నల్లగుడ్డు కొంచెం కళ కోల్పోయింది. ఇంకో రెండడుగులు ముందుకేశా. అంతలో ఒకసారి టపటపమని కళ్లాడించింది తను. కనురెప్పలు చిరు వింజామరల్లా కదిలాయి. ఇప్పుడు ఆ కళ్లు నన్నే చూస్తున్నాయి. ఆ సుందర చక్షవులు.. ఎన్నో సాయంత్రాలు ఏటి ఒడ్డున తనకై ఎదురుచూసిన చకోరాలు.. తను మౌనముద్రలో అలానే కూర్చొనుంది. తను కదలకుండా తన కళ్లు నన్నే చూస్తున్నాయి. ఆమె కనుపాపల, నా కనుపాపల చివర్లను బిందువులుగా కలుపుతూ, ఎవరైనా ఓ బారు రెక్టాంగిల్‌ను గీస్తే ఎంత బాగుండు! తలను అలాగే కదపకుండా నిలిపి నావైపే ఇంకా చూస్తున్నది. మరెందుకు గుర్తుపట్టడం లేదు నన్ను? గుర్తుపట్టినా పట్టనట్లు నటిస్తున్నదా? ఒక్కోసారి అది ఆడవాళ్లకు అవసరమే కదా! మరొక్క మూడడుగులు ముందుకేశా. ఒకడుగు వెనక్కి! ఇదేం న్యాయం? కార్తీక కూడా చాలా మంది ఆడోళ్ల మాదిరేనా? నేను ప్రొసీడ్ కాలేను.. గంగకు మాటిచ్చాను! తప్పే.. అయినా తప్పేలా లేదు. ఒక్కసారి.. ఒక్కసారంటే ఒక్కసారి.. నా ఆ పాత ఆస్తులు.. ఆ కాటుక కన్నులను ఒక్కసారే బాగా దగ్గరగా.. ఇంకా దగ్గరగా చూసుకుంటూ.. ఒక్కసారి తనను పలకరిస్తేనో! నో ప్రాబ్లం.. ఒట్టుతీసి గట్టునపడేయ్.. ఊం.. పద.. కదులు.. ఇంకో రెండడుగులు ముందుకు..

'కా.. కా.. కార్తీ.. కా..'.

మా ఇద్దరి మధ్యకు చిలుక పిల్లలా ఒక పాప తుర్రున పరుగెత్తుకొచ్చింది.

'సారీ తాయీ.. అక్కడ ప్రసాదం తీసుకునేటప్పుడూ పక్కనబెట్టి మర్చిపోయా! ఇదిగో అక్కడే దొరికిందిలే! పదండి తాయీ పోదాం'.. అంటూ చెంగున కార్తీక ముందుకు దూకి, ఒక తెల్లటి పొడవాటి బ్లైండ్ స్టిక్‌ను ఆమె ఒడిలో ఉంచింది ఆ పాప.

అచేతనుడినయ్యాను. నా తలలో వందల డ్రోన్‌ల రొదలా అలజడి రేగింది. మాట పడిపోయింది. ఆ క్షణమే నన్నెవరో విగ్రహంగా మార్చి ఒక రాతి పీఠానికి నన్ను అతికించి పోయినట్లుగా నిలబడ్డా. మైగాడ్.. కార్తీక కన్నులున్నాయి.. కాటుక ఉంది.. చూపులేదా?

కార్తీకకు సహాయకురాలిగా వచ్చిన ఆ పాప..

'కింద పార్కింగ్‌లోనే డ్రైవరన్నయ్య వెయిట్ చేస్తున్నాడంట తాయీ.. ఫోన్ చేశాడు' అని అంటూ, కార్తీకకు పెద్ద గాగుల్స్ పెడుతూ, ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని.. ఒక్కో మెట్టూ చాలా జాగ్రత్తగా నెమ్మదిగా దింపుతూ గుడి బయటికి తీసుకెళ్తున్నది.

'మిన్నూ.. అక్కడిందాక నన్నెవరైనా పిలిచినట్లుందా?'.. కుడిచేతిలో బ్లైండ్‌స్టిక్, ఎడమచేతితో ఆ పాప ఆసరాతో ముందుకు నడుస్తూ అడుగుతున్నది కార్తీక.

'లేదు తాయీ.. ఎవరూ పిల్చినట్టు లేదే!'.. ముద్దుగా బదులిచ్చింది పాప.

దృశ్యంగా చూపలేనివాటిని మనసు నాదంగా వినిపిస్తుందంటారు. కార్తీక విన్నదా? విని ఉంటే.. విన్నది నా అర్థ పిలుపునా? వ్యర్థ తలపునా?

***

కార్తీక వెళ్లిపోగానే శ్రీమతికి కాల్ చేశా.

'గంగా.. నాకెందుకు చెప్పలేదు?'.

'తట్టుకోలేవని!'.

'ఎలా జరిగిందట?'.

'గ్లకోమా.. టైంకి తెలుసుకోలేదట. క్రానిక్ అయ్యింది'.

'అయినా తనింకా కాటుక దిద్దుకుంటూనే..!'.

'నీ గురించే!'.

'నా గురించా.. ఎందుకు?'.

'ఎప్పుడో మాట తీసుకున్నావటగా'.

'ఏమని?'.

'తన ఆ కన్నుల జ్యోతులు కొండెక్కే వరకూ కాటుకను వదలొద్దని !'.

'ఆ.. అవును.. అవును..'.

'అయితే మరెందుకు అడిగావు?'.

'మర్చిపోయానులే!'.

'మగాడివి గదా!'.

***

***వేణు మరీదు స్వస్థలం ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వంగా ముత్యాల బంజర్ గ్రామం. ఉద్యోగ రీత్యా ప్రస్తుతం ఖమ్మంలో నివసిస్తున్నారు. తల్లిదండ్రులు రాధ - రుక్మాంగద. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో ఎంఏ. ఇంగ్లిష్ లిటరేచర్, నల్లగొండ గోకుల్ కళాశాలలో బీఈడీ చేశారు. 27 సంవత్సరాలుగా పాఠశాల, కళాశాల స్థాయిల్లో ఆంగ్ల భాషోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. భార్య శివలక్ష్మి, బిడ్డలు మధుమిత గౌడ్, నాగమ వైష్ణవీ గౌడ్ ప్రోత్సాహంతో సాహితీ సేవలో ముందుకెళ్తున్నారు. చిన్నప్పటి నుంచీ కవితా రచన చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే కథలు రాయడంపై ఆసక్తి పెంచుకొన్నారు. ఇప్పటిదాకా 15 కథలు రాశారు. 'నాక్కొంచెం ఇంగ్లీషు కావాలి', 'ప్రెజెంటెడ్ బై వసుధ', 'నలుగురూ లేనినాడు', 'బొమ్మ' కథలు పాఠకుల మన్ననలు పొందాయి. ఇంగ్లిష్‌లో రాసిన కవిత్వం, చిరువ్యాసాలు ప్రముఖ ఆంగ్ల దినపత్రికలు, వెబ్ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. నమస్తే తెలంగాణ - ముల్కనూరు ప్రజా గ్రంథాలయం నిర్వహించిన కథల పోటీ 2021లో 'కాటుక కన్నుల సాక్షిగా' కథకు తృతీయ బహుమతి అందుకున్నారు. పేదరికంలో పుట్టిన తనకు అక్షరాలే ఆస్తులని వేణు చెబుతున్నారు.***

Katha PART 1_Layout 1 6/29/2023 2:38 PM Page 48

# బోన్గిరి టూ లష్కర్



డాక్టర్ ప్రభాకర్ జైనీ,
79898 25420

ఇయ్యాల నాకు చానా సంతోషంగ ఉన్నది. ఇంటర్మీడియట్ పరీక్షల ఫస్ట్ క్లాసుల పాసయిన. ఇంటర్నెట్ సెంటర్ల ఇచ్చిన కాగితాన్ని తీసుకొని బయటకొచ్చి.. ఇంటి ముఖం పట్టిన. కనీ, దూరం పంటి కూలిపోయేటట్టున్న మా ఇల్లు చూసెటాళ్లకు, నాకు నా భవిష్యత్తు ఎట్లుంటదో కండ్లల్ల మెదిలింది. పై చదువులు చదివించే స్తోమత మా ఇంట్లోల్లకు లేదని నాకర్థమైంది. మనసు చంపుకొన్న. పై చదువులు చదువాలనే ఆశను మొగ్గల్నే తుంచేసుకున్న.

మా ఊరు.. పట్నానికి గదే.. హైద్రాబాదుకు నలభై రెండు కిలోమీటర్ల దూరంల ఉండే బోన్గిరి. గందుకె అభివృద్ధికి నోచుకోనేలే. మా ఊర్లె జనాలకు ఏ వస్తువు కావాలన్నా పట్నం బోయి కొనుక్కొచ్చుకుంటరు. కాబట్టే, మా ఊర్లె ఏ వ్యాపారమూ పెద్దగా జరగదు. చిన్న చిన్న కిరాణా దుకాన్లు, చిన్న మడిగెలల్ల చీరెలు, లోపటి లంగాలు అమ్మే బట్టల దుకాన్లు, బోన్గిరి నుంచి చుట్టుపక్కల పల్లెటూర్లకు పోయేటోల్ల కోసం ఛాయ్ బండ్లు, టిక్కీ హోటల్లు తప్ప ఇంకో పెద్ద వ్యాపారమే లేదు. పోరగాండ్లకు ఏ నౌకరీ దొరికే చాన్సే లేదు.

మా ఊర్లె పనిచేసే సర్కార్ నౌకరోల్లు, బ్యాంకు సార్లు, పంతుల్లు కూడా మా ఊర్లె ఉండరు. పట్నం నుంచే ప్రతిరోజూ అప్ అండ్ డౌన్ చేస్తుంటరు. మా ఊర్లుండె సగం కంటె ఎక్కువ మంది పడుచు పోరగాల్లు, ఆడోల్లు,

మగోల్లు నౌకరీల కోసం పట్నం మీదనే ఆధారపడి జీవిస్తున్నరు. చానామంది రకరకాల దుకాన్లల్ల హెల్పర్ల లెక్క, సేల్స్ బాయిల లెక్క, డెలివరీ బాయిల లెక్క, కొరియర్ సెంటర్లల్ల పనిచేస్తుంటరు. అమ్మాయిలు చానామంది బట్టల దుకాన్లల్ల, షాపింగ్ మాళ్లల్ల అరకొర జీతాలకు పనిచేసేందుకు, ప్రతిరోజూ పొద్దున్నే పట్నానికి బయల్దేరుతరు.

నిత్యం పొద్దుగాల అందరి ఇండ్లల్ల నుంచి పొట్ట చేతబట్టుకొని, వలస పోయే పక్షుల్లెక్క.. చిన్నచిన్న పిల్లలంత, మా ఊర్లె సందులల్ల ఉరుక్కుంట పోయి రైల్వేస్టేషనుకు చేరుకుంటరు. గా పోరగాల్లంత పోయినంక, మా ఊరు.. బోన్గిరి, బిక్కుబిక్కుమంటున్న వృద్ధాశ్రమం లెక్క నిర్మానుష్యమైతది. గా జనమే లేని సందులల్ల నేను దయ్యం లెక్క తిరుగుతుంట.

***

మా ఊరి మీది నుంచి పొద్దున్నె పట్నానికి పోయెటందుకు చానా రైళ్లుంటయి. పట్నం నుంచి నూటా యాభై కిలోమీటర్ల దూరంల ఉన్న మరో పెద్ద నగరం.. వరంగల్. అక్కడి నుంచి పట్నం పోవడానికి కాకతీయ ఫాస్ట్‌ప్యాసెంజర్, పుష్ పుల్ రైళ్లుంటయి. ఇంక చానా ఎక్స్‌ప్రెస్ రైళ్లు గూడ మా బోన్గిరిల ఆగుతయి. కనీ కాలే కడుపు నింపుకొనేటందుకు వందల కిలోమీటర్ల దూరంలోని వరంగల్లు నుంచి పట్నానికి, ఈ మహా కార్మిక లోకం.. ప్రతిరోజూ తరలి వస్తుంటరు. కాబట్టి రైళ్లన్నీ కిటకిటలాడుతుంటయి. బోన్గిరికి రైలొచ్చే టయానికి, రైల్ల సరిగ్గా నిల్చోవడానికి కూడా జాగా దొరకది. కానీ, ఎట్లనో గట్ల వేలాడుకుంటనో, నిలబడో, కూసున్న ప్యాసింజర్లను బతిమిలాడో.. సీటు సంపాయించుకొని పట్నానికి పరుగు పెట్టాలె. సీటు దొరికి కూర్చున్న రోజు మాత్రం.. పానం హాయిగుంటది. ఏదో.. సింహాసనం దొరికినట్టనిపిస్తది.

గీ రైళ్లు సికింద్రాబాద్ స్టేషనుల ఆగంగనే, నేల ఈనిందా అన్నట్టుగ.. వర్షాకాలంల పుట్టలల్ల నుంచి మూకుమ్మడిగా చీమలు బయటికి వొచ్చినట్టు వేలాది మంది పిల్లలు రైళ్లు దిగి పరుగులు తీస్తుంటరు. చానా వరకు జల్దీజల్దీ నడిచి, రెండు మూడు మైళ్ల దూరంల ఉన్న తమ గమ్యస్థానాలకు చేరుకుంటరు. ఇంకా ఎక్కువ దూరం ఉంటే ఆర్టీసీ బస్సుల్లోనో, మెట్రోలనో ప్రయాణం సాగిస్తరు. గిదే మా బోన్గిరి యువత జీవనపోరాటం.

ఈ హైద్రాబాదు పట్నపు మహా వాణిజ్య యంత్రాన్ని నిరంతరం నడిపే చోదకశక్తే మా కార్మికలోకం. కనీ, వాళ్లకు ఏ హక్కులూ, గౌరవాలూ, చట్టాలూ వర్తించవు. ఇంటర్మీడియట్ పాసయిన తర్వాత కొన్ని దినాలు బేకారుగ గడిపిన నేను.. సోమరిగ ఉండలేక, మా అన్న, అక్క లెక్క నేనూ పట్నానికి పొయ్యే దినం వచ్చింది. ఆనాడు మా అమ్మ నన్ను పోవొద్దని ఏడ్చుకుంట..

'మీరంతా ప్రతిరోజూ పొద్దున్నే ఇల్లొదిలి పోతే ఇల్లంత చిన్నబోతాందే! ఇగ గిప్పుడు నువ్వు గూడ పోతనంటున్నవు. మీ అక్క చూడు! ఏం సంపాయిస్తాంది? అందులో ఎంత మిగుల్తాంది? రక్తమాంసాలు ఆ పట్నానికి ధారపోసి నా బిడ్డ, అందాల రాశి ఎట్ల తయారయిందో చూసినవ! ఎముకల గూడులెక్క అయింది' అని శోకాండాలు పెట్టుకున్నది.

గది గూడ నిజమే! మా అక్క ప్రణీత. మూడేళ్ల క్రితం వరకు, చక్కని చుక్క లెక్క ఉండేటిది! చానా అందంగ ఉండేది. ఏ రాజకుమారుడో వచ్చి ఎగరేసుకొని పోతాడనుకున్నం. కానీ, గిట్ల గీ

మహానగరం హైద్రాబాదు పట్నపు పదఘట్టనల కిందబడి, వసివాడిపోతదని అనుకోలే.

పాపం, రోజూ పొద్దున్నే ఉరుకుతున్నట్టె పోయి రైలు, బస్సులెక్కి ప్రయాణం. దుకాన్లల్ల పెట్టే అనేక ఆంక్షల మధ్యన ఉద్యోగం. మల్ల రాత్రికి బస్సు, రైలు ప్రయాణం. కన్ను మూస్కోని పంటదో లేదో.. భళ్లున తెల్లార్తది. సరిగ్గా తినీ తినకపోవడంతోటి, మల్ల ప్రయాణం మొదలు కావడంతోటి నవయవ్వనవతైన మా అక్కకు జవసత్వాలుడిగినయి. మూడేండ్లల్ల బక్కచిక్కిపోయింది, మా అక్క – సక్కదనాల సుక్క.

గందుకే, కంటికి మంటికి ఏడుస్తున్న మా అమ్మను ఊరడించి..

'అమ్మా! మరి నన్నేం చేయమంటవే? నువ్వే చెప్పు! వాళ్లు సంపాదించి తెచ్చింది తక్కువనే అయిన.. గా పైసలతోనే కాదే మనం కడుపులు నింపుకుంటున్నది. అన్న, అక్కా.. గా పట్నంల రెక్కలు ముక్కలు జేసుకుంటాంటె నేను తిండిపోతు లెక్క ఇంట్ల కూర్చోని తింటె బాగుంటదా? నువ్వు మా అందరికి గూడ అమ్మవే గద? నీ మనసు అందుకు అంగీకరిస్తదా? చెప్పు?' అని అడిగితే.. మా అమ్మ కండ్ల నీళ్లు తుడుచుకుంట,

'నేనేం సమాధానం చెప్పగలనే? నువ్వంటె సదువుకున్నదానివి! నీకు చెప్పేటంత తెలివి నాకే ఉంటే, మీ అయ్యను ఒక దారిల పెట్టుకునేటి దాన్ని కాదా? నిన్ను పైకి చదివించేటి దాన్ని కాదా?' అని అడిగింది.

నేను మా అమ్మను ఓదార్చిన. ఒప్పించిన. మహానగరం వైపు నా మహాప్రస్థానాన్ని ప్రారంభించిన.

కానీ, ఆ రోజున భవిష్యత్తుల నేనొక చరిత్ర సృష్టించబోతున్ననని నేనప్పుడు అనుకోలే! మా అమ్మయితే అస్సలు ఊహించలే!

***

రెండు మూడు రోజులు ప్రయత్నించంగ ఒక మంచి షాపింగ్ మాల్‌ల నౌకరీ దొరికింది. నెలకు ఎనిమిది వేల జీతం. గా నౌకరీ దొరకంగనే నేను ఊహల లోకంల తేలిపోయిన. రంగురంగుల లైట్ల వెలుతుర్ల, ఏసీల నౌకరీ అనంగనె మురిసిపోయింది నా మనసు. కానీ, నెల రోజులు గడిచేటప్పటికె నాకు నీరసం వొచ్చింది. దుకాణం పది గంటలకే తెరిచినా, మా సేల్స్ గర్ల్స్ మాత్రం తొమ్మిది కొట్టేసరికే అక్కడ ఉండాలె. గంట సేపట్ల షో రూమంత ఊడ్చి శుభ్రం చేయాలె. ఏసీ షోరూం కాబట్టి కొత్త బట్టల్లో నుంచి రాలే సన్నటి దుమ్మూ, ధూళితోటి షోరూం అంతా నిండి ఉంటది. దాన్నంతా తడి, పొడి గుడ్డలతోటి తూడ్వాలె. అద్దాలను రుద్దిరుద్ది తళతళా మెరిసేటట్టు చేయాలె. మానెక్విన్స్, రబ్బరు బొమ్మలకు, ప్రతిరోజూ కొత్త చీరెలు కట్టి ముస్తాబు చేయాలె. బొమ్మలను ముస్తాబు చేయడం అయ్యేటిసరికి, మా సేల్ గర్ల్స్ అందాల ముఖాలన్నీ చెమటలు కక్కుకుంట జిడ్డు కారుతుంటయి. అది అంతా సిద్ధం చేసి, పది గంట గొట్టేసరికి మేం దుకాణం తలుపులు తెరవాలె.

గప్పుడు.. గా పది గంటలకు కౌంటర్ల నిలబడుడు షురువు చేస్తే, మధ్యాహ్నం రెండింటి దాక మాకు నిలువు కాళ్ల జీతమే. కూర్చోనీకి పర్మిషన్ లేదు. అసలు కూర్చునేటందుకు కుర్చీలు, స్టూళ్లు గిన మాకు అందుబాటుల ఉండయి. పై అరల్లోని చీరెలు సర్దేటప్పుడు గిన, కస్టమర్లకు పై అరలల్ల

ఉన్న ఎక్కువ ధర చీరెలు చూపించడానికి గిన తెచ్చిన స్టూళ్లను, బల్లలను.. ఆ పని కాగానే యాజమాన్యం వెంటనే తీసేయిస్తుంది. ఇటువంటి దుకాండ్లల్ల సేల్స్ గర్ల్స్ పని గంటల సమయంలో కూర్చోగూడదని ఒక అన్ రిటెన్ రూల్ ఉంది. అన్ని షాపుల్ల గూడ గంతే! షాపుల కస్టమర్లు లేనప్పుడు కూడ సేల్స్ గర్ల్స్ కూర్చోనీకి పర్మిషన్ లేదు. కూర్చుంటే బద్ధకం పెరుగుతదని యాజమాన్యం భావిస్తది. కౌంటరు ముందు అందంగ, ముద్దుగ, లేత కుందేలు పిల్లల లెక్కున్న సోఫాలను చూస్తుంటే.. నాకు కాళ్ల నొప్పులు మరింత ఎక్కువయ్యేటివి. అప్పుడప్పుడు కాళ్లు పట్టుదప్పి కూలబడిపోయేటిదాన్ని. ఒక రోజు గట్ల కౌంటరు పక్కన కూలబడిపోయిన నన్ను సూపర్‌వైజర్ చూసి మందలించిండు. నేను జల్దీ లేచి నిలబడి 'సారీ' చెప్పిన.

ఓ పదిహేను రోజుల తర్వాత నాకు మంత్లీ పీరియడ్ రావడం తోటి, ఋతుస్రావం ఎక్కువయితాంటె.. మర్నాటికి సెలవు పెడ్తనని చెప్పిన. దానికి యజమాని కొట్టినంత పని చేసిండు. 'పండుగ రోజులల్ల సెలవూ గిలవూ జాన్తా నై' అనడంతో.. తప్పనిసరై డ్యూటీకి వచ్చిన. కనీ, మధ్యలనే బాత్రూంకి పోయి, కౌంటర్ దిక్కు నడుస్తాంటె శోషొచ్చినట్టయి గోదాముల గట్టాలపై పడిపోయిన. అప్పుడే, అక్కడికి వచ్చిన సూపర్‌వైజర్, యజమానిని పిల్చుకోని వచ్చి నన్ను చూపించాడు. యజమాని కోపంతో దుర్భాషలాడుతూ తిట్టడంతో.. నేను లేచి నీరసంగనే కౌంటర్లకు వచ్చి నిలబడ్డ. సేటు.. ఆ నెల జీతం ఏడు వేలే ఇచ్చిండు. నేను కోపంగ.. 'ఎందుకు?' అని ప్రశ్నించిన.

'నువ్వు గా రోజునాడు గోదాంలకు పోయి పండుకున్నవు. గందుకే పెనాల్టీ కింద వేయి రూపాయలు కట్ చేసిన' అని చెప్పడంతో, నేను ఖిన్నురాలునయిన.

'గింత అన్యాయమా?' అని నా మనసు ఆక్రోశించింది.

అసలైతే, గా మూడు నెలల ఉద్యోగంలనే నేను బాగా డస్సిపోయిన. ఒక పెద్ద కారాగారంలో బందీగ ఇరుక్కపోయినట్టు ఫీలింగ్. ఊపిరాడనట్టనిపించేది. ఒక పెద్ద రాక్షసి నన్ను నిరంతరం గమనిస్తుందన్న భయంతోటి బతకాలంటే నాకు అస్సలే నచ్చుడం లేదు. చచ్చీ చెడీ రోజుకు పది గంటలు నిలబడీ, నిలబడీ.. ఒక్క పది నిమిషాలు కూర్చుంటనే వెయ్యి రూపాయల పెనాల్టీ అంటే నాకు దారుణం అనిపించింది. నా తోటి సేల్స్ గర్ల్స్ కష్టాలు చూసి నేను కన్నీరు మున్నీరయ్యేటిదాన్ని. ఏ వయసుల ఉన్న వాండ్లయినా సరే, కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు వచ్చినా సరే.. ఆడోల్లకొచ్చే మరే ఆరోగ్య సమస్య అయినా సరే నిలబడి ఉండాల్సిందే! గా సమస్యనే ఇప్పుడు నేనూ స్వయంగ అనుభవిస్తున్న. అసలు మాకు ఇస్తున్న జీతమే, రోజుకింత అని లెక్కగడితే.. మూడు వందలు కూడ గిట్టడం లేదు. గీ మహానగరంల అడ్డా మీద కూలీకే రోజుకు ఐదారు వందలు లభిస్తున్నయి. మేము అంతకంటె నాలుగు గంటలు ఎక్కువ పని చేసిన గూడ, వారికి ఇచ్చే కూలీల సగం గూడ మాకు గిట్టుత లేదు. మేము, గింత సదువుకోని గా మోటు కూలీ పని చేయలేక, గింత తక్కువ జీతానికి కూడా సిద్ధపడి పని చేస్తుంటే గూడ.. మమ్మల్ని పశువుల్లెక్క, మల్ల ఇంకా మాట్లాడితే పశువుల కంటే హీనంగా.. పశువులకన్నా విరామం, విశ్రాంతి ఉంటయి. లేకపోతే అవి తిరగబడి కొమ్ములతో పొడుస్తాయి. తమ నిరసనను తెలియచేస్తాయి. ఒక్క నిమిషం కూడా

కూర్చోనియ్యకుండ పని చేయించే గీ దాష్టీకానికి చరమగీతం పాడాలని, నేను నిర్ణయించుకున్న!

నేను చదువుకున్న గా కొద్దిపాటి చదువే నాకా ధైర్యాన్నిచ్చింది.

***

మరుసటి దినం నేను ఒక దృఢ సంకల్పంతోటి బోన్గిరి నుంచి మహానగరానికి బయల్దేరిన. కనీ, నేను పనిచేసే దుకాణంకు పోలేదు. నా బాధనంతా వెళ్లగక్కుకుంట, క్రితం రాత్రంత కూసోని రాసిన కరపత్రాన్ని పదివేల కాపీలు ప్రింటు తీయించిన. మహిళా సంఘాలను, కార్మిక నాయకులను, వాళ్ల సహాయం తోటి కార్మిక సంక్షేమ శాఖ అధికారులను కలిసిన. నా గోడును వెళ్లబోసుకున్న.

తెల్లారి.. ఆపై రోజు నుంచి నిత్యం మహానగరంలోని ప్రతి దుకాణానికి పోయి, అక్కడ పనిచేసే మహిళా ఉద్యోగులను కలిసి వారి సమస్యలను పరిష్కరించేటందుకు నడుం బిగించాల్నని చెప్పిన.

చిన్నచిన్నగనే అయినా ఉద్యోగులల్ల అసంతృప్తి రాజుకుంటున్న టైముకు, మా ఊర్లె నుంచి రోజూ మా తోటి సిటీకి వచ్చే ఒక టీవీ చానెల్ల పనిచేసే చిన్నపాటి ఉద్యోగి సహాయంతోటి ఒక టీవీల ఇంటర్వ్యూ ఇచ్చిన.

నాలుగైదు నెలల హైద్రాబాద్ నగర జీవితం నాకు ఎన్నో నేర్పించింది. అందుల, కష్టమర్లతోటి అద్భుతంగ మాట్లాడే విద్య కూడ అబ్బడంతోటి, టీవీ షోలో కన్నీళ్ల తోటి, హావభావాలతోటి.. నా మనసులోని భావాలను స్పష్టంగ చెప్పి అదరగొట్టిన.

'మేడమ్! నేను కూర్చోకూడదా?' అని.. ఇంటర్వ్యూ ప్రారంభం కాంగనే యాంకరును ప్రశ్నించిన. ఆ మేడమ్ ముందుగాల బిత్తరపోయి, తరువాత నా మాటల్లోని శ్లేష అర్థమయి ఫక్కున నవ్వింది. ఆ కార్యక్రమానికి గా పేరే పెట్టి ప్రసారం చేసిన్రు. ఆ కార్యక్రమం బాగా పాపులర్ అయింది. హైద్రాబాద్ మహానగరంల పనిచేసే లక్షల మంది సేల్స్ గర్ల్స్ గొంతుకను నేనై.. 'రైట్ టూ సిట్' అనే ఉద్యమానికి నాంది పలికిన.

ఒక టీవీ నుంచి మరో టీవీకి ఈ న్యూస్ పాకడంతోటి.. 'రైట్ టూ సిట్' అనే సమస్యపై నా పోరాటం మస్తు వైరల్ అయింది.

సేల్స్ గర్ల్స్‌ను పది గంటలపాటు కూర్చోనివ్వక పోవడమన్న యాజమాన్యపు అమానవీయ ప్రవర్తనను ప్రజలు ఈసడించుకున్నరు. ఒక సామాజిక సమస్యల మానవీయ కోణం ఉంటే, అది అందరి దృష్టినీ ఆకర్షిస్తదని నాకర్థమైంది. సమాజం సానుభూతి చూపిస్తది. ప్రస్తుత సమాజంల సోషల్ మీడియా ప్రభావం వల్ల ఇటువంటి కొన్ని సమస్యలకు ప్రాధాన్యత బాగా లభించి, వైరల్ అయిపోయి ప్రభుత్వాలను సైతం గడగడలాడిస్తున్నయి.

రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇటువంటి సున్నితమైన సమస్యను, నేను వాళ్ల దృష్టికి తీసుకు వచ్చినందుకు మెచ్చుకొని వెంటనే స్పందించింది. ఇది రాజకీయంగా కూడా వారికి లాభదాయకంగ ఉంటది కాబట్టి, ప్రభుత్వం కూడ వెంటనే రంగంలోకి దిగింది.

కార్మిక సంక్షేమ శాఖ అధికారులతోటి నన్ను కూడా సభ్యురాలిగా చేర్చి, ఒక కమిటీని ఏర్పాటు చేసింది. మూడు నెలలల్ల మా కమిటీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా ఒక బిల్లును తయారు చేసి అసెంబ్లీల ప్రవేశపెట్టింది. గా బిల్లు ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

అందరి హర్షధ్వానాల మధ్య ఆ బిల్లుకు నా పేరు మీదనే.. 'సునీత బిల్ ఆఫ్ రైట్ టూ సిట్' అని నామకరణం చేసిన్రు. గా రోజు నుంచి సేల్స్ గర్ల్స్ పని లేనప్పుడు, కూర్చునేటందుకు హక్కుతోపాటుగ పనిచేసే చోట మహిళా ఉద్యోగులకు అనేక వసతులు కల్పించాల్నన్న ప్రభుత్వ చట్టం అమల్లకు వొచ్చింది.

నా ఆరు నెలల కృషి ఫలితంగనే.. నా పేరు మీదనే ఒక చట్టం అమల్లకు వొచ్చింది.

***

ఆ రోజు సాయంత్రం, నేను గా బిల్లు కాపీ పట్టుకోని సికింద్రాబాద్.. గదే లష్కర్ నుంచి మా ఊరు బోన్గిరికి పోయేటందుకు 'కాకతీయ' ప్యాసెంజర్ రైలెక్కినప్పుడు నాకు ఘనస్వాగతం లభించింది.

అందరూ 'కూర్చోమని' చెప్పి, తమ సీట్లల్ల నుంచి లేచి నిలబడి నన్ను ఆహ్వానించిన్రు.

గంతే.. ఇగోనుల్ల నేను, 'సునీత బిల్ ఆఫ్ రైట్ టూ సిట్' జీవో కాపీని పట్టుకొని గర్వంగ కూర్చున్న!

***

(యథార్థ సంఘటన ఆధారంగా రాసిన కథ. ఇటువంటి చట్టాన్ని సెప్టెంబర్ 13, 2021న తమిళనాడు శాసనసభ ఆమోదించింది. అంతకు ముందే కేరళ ప్రభుత్వం చట్టం చేసింది

**డాక్టర్ ప్రభాకర్ జైనీ స్వస్థలం వరంగల్. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. సాహితీవేత్తగా, సినీ దర్శకుడిగా సుపరిచితులు. వాణిజ్య పన్నుల శాఖలో సీటీవోగా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందారు. సామాజిక కోణంలో కథా రచన చేస్తుంటారు. 1981లో 'ఎదను ధర్మం' ఈయన మొదటి కథ. ఇప్పటివరకూ వందల సంఖ్యలో కథలు, 24 నవలలు వెలువరించారు. 2013లో కథ, మాటలు, పాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహిస్తూ 'అమ్మా! నీకు వందనం', 'ప్రణయ వీధుల్లో.. పోరాడే ప్రిన్స్' సినిమాలను నిర్మించారు. 2021లో యథార్థ సంఘటనల ఆధారంగా 'గర్భశోకం' అనే చిత్రాన్ని ప్రారంభించారు. ఒక్క దశాబ్దంలోనే (2012 నుండి 2021 వరకు) 17 నవలలు, రెండు కథా సంపుటాలు, రెండు కవితా సంపుటాలు వెలువరించారు. ఐదు ఫీచర్ ఫిల్మ్స్ నిర్మించారు. ఈయన రాసిన 'క్షమాభిక్ష దొరికింది' కథ ఇంగ్లీషులోకి అనువాదం కాగా, 'టెలీస్కోప్' అనే ప్రముఖ ఆంగ్ల పత్రికలో ప్రచురితమైంది. సాహిత్య సేవతోపాటు సమాజసేవలోనూ ప్రభాకర్ జైనీ పాలుపంచుకొంటున్నారు. తన అక్షర సేద్యం వెనుక భార్య విజయలక్ష్మీ జైనీ సహకారం, తోడ్పాటు, శ్రమ, సూచన ఉన్నాయని ప్రభాకర్ జైనీ చెబుతున్నారు.**

Katha PART 1_Layout 1 6/29/2023 2:38 PM Page 54

# కీడు గుడిసె



బొడ్డేడ
బలరామస్వామి
89197 07141

తూర్పు కనుమలు ఆ చలికాలపు ఉదయాన మంచు ముసుగు కప్పుకొన్నాయి. చెట్టూపుట్టా, పశుపక్ష్యాదులూ మంచులో తడిసిముద్దయి చలికి వణుకుతున్నాయి. గోదావరి పరీవాహక ప్రాంతంలో, దట్టమైన కీకారణ్యంలో.. ఎత్తయిన కొండలమీదుంది ఆ గూడెం. నాగరికతకు చాలా దూరంగా ఉన్న ఆ గూడెంలో ఓ ఆటవిక తెగకు చెందిన ఇరవైమూడు కుటుంబాలు.. మాయామర్మం లేకుండా జీవిస్తున్నాయి. అనాదిగా వస్తున్న ఆచారాలను, కట్టుబాట్లను గౌరవిస్తూ ప్రశాంతజీవనం సాగిస్తున్నాయి. పోడు వ్యవసాయం, వేట, బుట్టల అల్లిక వీరి ప్రధాన జీవనాధారం!

గూడేనికి కాస్త ఎడంగా, చుట్టూ రక్షణగోడలా ఉన్న వెదురు తడికల మధ్య ఉంది ఆ గుడిసె. అందులో వెదురు బొంగులతో కట్టిన అటకమీద ముడుచుకుని పడుకున్న సోము.. చలికి గజగజా వణికిపోతున్నాడు. పక్కన అతని భార్య సిసిరి ఉండుంటే.. ఆమె కౌగిలిలో వెచ్చగా నిద్రపోయేవాడు. ఆమె లేకపోవడంతో రాత్రంతా సరిగ్గా నిద్రపట్టలేదు. చలిపులి గుండెల్లోకి దూరి గిలిగింతలు పెడుతుంటే.. సిసిరి గురించి ఆలోచనలు ముసురుతుంటే.. అతనికి నిద్రెలా పడుతుంది?

హఠాత్తుగా ఏదో ఆక్రందన చెవికి సోగ్గానే దిగ్గునలేచి,

అటక దిగాడు సోము. బయట మంచు తప్ప ఏమీ కనిపించలేదు, వినిపించలేదు. అతడు చలికి వణుకుతూ.. 'అంతా నా బెమ' అనుకున్నాడు. గుడిసెలో ఓ మూలనున్న పొయ్యి దగ్గరికెళ్లి, ముట్టించాడు. చిన్న మంట వెచ్చగా తగిలి ప్రాణం లేచొచ్చింది. చలి కాగుతుంటే అతనికి సిసిరి గుర్తుకొచ్చింది. 'ఈ సలిలో అదెట్టా ఉందో ఏటో?' అనుకుని బాధగా నిట్టూర్చాడు.

'ఒగ రేత్రి ఎట్టాగో గడిసింది. ఇట్టాంటి రేత్రులు ఇంకెన్నో గడవాల! ఆలూమగలను ఇడదీసే ఈ ఆసారమేటి? దాన్నట్టుకుని గూడెం పెద్ద యాలాడ్డమేటి?' అనుకుంటూ మొహం చిరాగ్గా పెట్టాడు.

పక్క పక్క గూడేలకు చెందిన సోము, సిసిరి ఒకరినొకరు ఇష్టపడ్డారు. రెండు గూడేల పెద్దలను తమ మనువుకు ఒప్పించారు. ఆచారం ప్రకారం మనువుకు ముందు గుడిసె కట్టి, ఆనక మనువాడారు. ఆ కొత్తగుడిసెలో కాపురం పెట్టి ఏడాదిన్నరయింది.

సోము చలాకీతనంతోనూ, సిసిరి కలివిడితనంతోనూ గూడెం ప్రజలకు ఇష్టులైపోయారు. పండుగల సమయంలో తుండి, మోరి, డప్పువంటి సంప్రదాయ వాద్యాలు మోగుతుంటే.. వారిద్దరూ హుషారుగా నృత్యంచేసి అందర్నీ అబ్బుర పరిచేవారు. ఇప్పసారా తాగుతూ విందులు ఆరగిస్తున్నప్పుడు ఉత్సాహపరిచే కబుర్లు చెప్పేవారు. సిసిరి రాత్రుళ్లు గంగమ్మతల్లి, ముత్యాలమ్మతల్లి, కొండదేవతల పాటలు పాడుతుంటే విన్నవాళ్లు పూనకంతో ఊగిపోయేవారు. 'సోము సిసిరితో జోడి కట్టినాకే గూడేనికి సందడొచ్చింది' అని అంతా అనుకునేవారు.

సిసిరిని విడిచి క్షణం కూడా ఉండలేక పోయేవాడు సోము. వారిద్దరూ కలిసి అడవిలో తిరుగుతూ తేనె, ఇప్పపువ్వు, నల్ల జీడిగింజలు, కుంకుడుకాయలు వంటివి సేకరించేవారు. దుంపలను తవ్వేవారు. విల్లుకు తుందురు ఎక్కుపెట్టి పిట్టలను, ఉడుతలను కొట్టేవారు. వేటకుక్కల సాయంతో ఉడుములను, అడవి పందులను పట్టేవారు. డొంకలను చాటు చేసుకుని సరసాలాడుకునేవారు. అడవిలో స్వేచ్ఛగా, దర్జాగా తిరిగి ఏ సాయంత్రమో గుడిసెకు చేరుకునేవారు.

***

నిరంతరం ఒకరినొకరు అంటిపెట్టుకునుండే వారిద్దరినీ, సిసిరి నెలసరి సమయంలో తమ కీడు ఆచారం విడదీసేది. దాంతో ఆ ఆచారం పట్ల సోముకు ఎక్కడలేని కోపమూ వచ్చేది. సిసిరిని ఆచారం తప్పమనేవాడు.

'గూడెం కట్టుబాటు దప్పితే తొప్పు గట్టాలి గద మావ' అని నచ్చచెప్పేది సిసిరి. కీడు గుడిసెకు వెళ్లి, అక్కడ మూడ్రోజులుండి వచ్చేది.

ప్రస్తుతం సిసిరి నిండు చూలాలు! దాంతో ఆమె మకాం కొద్దిరోజుల క్రితం కీడు గుడిసెకు మారింది. రెండునెలలు అక్కడే ఉంటుంది. దాంతో 'అన్నిరోజులు ఆమెను విడిచి

ఉండగలనా?' అని తెగ గింజుకుంటున్నాడు సోము.

కొన్ని ఆటవిక తెగల్లో ఉండే ఆచారం, ఆ ఆటవిక తెగలోనూ ఉంది. స్త్రీలు నెలసరి అయితే మూడ్రోజులు, గర్భిణులు, రజస్వలైన వాళ్లూ రెండునెలలు గూడేనికి కాస్త దూరంలో ఉండే కీడు గుడిసెలో ఉండాలి. వారు గూడెంలో ఉంటే వారి కీడు (మైల) గూడేనికి అశుభం కలిగిస్తుందని భావిస్తారు. వారు ఆ కీడు గుడిసెలోనే ఉంటూ, వారికి కేటాయించిన దారుల్లోనే బయటికెళ్లి రావాలి. వారికి వారి బంధువులైన స్త్రీలు తినడానికి పట్టుకెళ్లిస్తారు. ఎవరైనా ఆచారం తప్పితే శిక్షలు కఠినంగా ఉంటాయి. గూడెం నుంచి నిర్దాక్షిణ్యంగా వెలివేస్తారు.

పురుడుకోసం కీడు గుడిసెలోకి వెళ్లిన వాళ్లు క్షేమంగా గూడేనికి తిరిగొస్తారన్నది సందేహమే! కీడు గుడిసెలో మంత్రసాని పురుళ్లు పోస్తుంది. ఒక్కోసారి కాన్పు కష్టమై ప్రాణాల మీదికి వచ్చినా సరే.. ఆసుపత్రికి తీసుకెళ్లరు. బలవంతంగా మోటుపద్ధతులలో కాన్పు చేయడానికి ప్రయత్నిస్తారు. ఆ ప్రయత్నంలో కీడు గుడిసెలోనే కన్నుమూసిన అభాగ్యులెందరో?

సోము అలాంటి సంఘటనలు ఎన్నో చూశాడు. మరెన్నో విన్నాడు. అందుకే అతను భయపడుతున్నాడు. చలి కాగుతూ సిసిరికి ఏం కాకూడదని కొండదేవతను వేడుకుంటున్నాడు.

తమ ఆచారాల్లో కొన్నిటిని మూఢాచారాలుగా భావిస్తాడు సోము. అడవిలో తాము సేకరించినవి అమ్మి, కావలసిన సరుకులు తెచ్చుకోవడం కోసం.. అప్పుడప్పుడూ ఆ దట్టమైన అడవిలోంచి, ఎత్తయిన కొండల్లోంచి తమ సమీప పట్టణంలోకి వెళ్లేవాడు. వెళ్లినప్పుడల్లా పట్టణ ప్రజల జీవనవిధానాన్ని పరిశీలించేవాడు. అక్కడ కీడు గుడిసె ఆచారంతోపాటు తాము పాటిస్తున్న మరికొన్ని ఆచారాలు కూడా లేవని తెలుసుకునేవాడు. ఆ విషయమే తన నేస్తాలతో చెప్పి బాధపడేవాడు.

ఓ రోజు గూడెం పెద్ద గుర్రప్ప, కీడు గుడిసెకు మరమ్మతులు చేయడానికి మనుషులను పురమాయిస్తుంటే సోము ధైర్యంచేసి..

'పట్నంల యాడ ఇట్టాంటి కీడు ఆసారం నేదు. మనంగూడ మానుకుందాం' అన్నాడు.

గుర్రప్ప గుర్రుగా చూసి.. 'నక్కబుట్టి నాలుగు వోరాలు గానేదు, ఈ గాలీవోన యెన్నడు సూడనేదన్నదంట. అట్టాగుంది నీ యెవ్వారం. మూతిమీద మీసమే సక్కంగ రానేదు. పెద్దకొబుర్లు ఆడేత్తున్నవు' వెటకారంగా అన్నాడు.

'ఆడోల్ని ఇబ్బందెట్టే.. ఆల్ల పేనంమ్మీదకు దెచ్చే ఆసారం యెంతసెడ్డదో తెల్డానికి మీసమే రానొవసరం నేదు' అన్నాడు సోము ఆవేశంగా.

గుర్రప్ప అగ్గిమీద గుగ్గిలమైపోయాడు.

'ఏట్రా.. ఇప్పసారా తలకెక్కేసినదేటి? ఏటేటో వోగుతున్నవు. గూడెం బాగుకోసరం మన పెద్దోల్లెట్టిన ఆసారం మనం పాటించాల. మానుకుంతే కొండదేవతకు కోపమొస్తది. ఆసారం

దప్పినప్పుడల్ల గూడెంల పీనుగులెగుతున్న ఇసయం నీకుతెల్ద? మల్ల ఇట్టాగ ఆసారాన్ని ఎటకారం సేత్తే గూడెంపెద్దగ ఏటి సేయాల్నో అదే సేస్తను' అంటూ హెచ్చరించాడు.

గుర్రప్పకు యాభై యేళ్లకు పైనే ఉంటాయి. మొరటు మనిషి! ఆయనకు ఎదురుచెప్పి ఆ గూడెంలో ఎవరూ బతకలేరు. ఆ విషయం సోముకు తెలుసు. దాంతో ఆ మాట మళ్లా ఎత్తలేదు.

'ఒరే సోముగే! లెగిసినవ.. గుర్రెట్టుకొని నిద్రోతున్నవ?' అంటూ గుడిసెలోకి దూరాడు సోము అయ్య కన్నప్ప.

చలి కాగుతున్న సోము..

'నిద్రడితేనే కదర నిద్రోడనీకి! సిసిరికి ఎట్టుందో తెలిసినాదేటి?' ఆత్రుతగా అడిగాడు.

'అది సెప్పడానికే వొచ్చినను. సిసిరి పెరిస్తితి ఏం బాగోనేదంట. కాన్పు సేయడం కట్టమని మంత్రసాని అందంట. కోడలికేటి అవుతాదోనని మీయమ్మ రాగాలుదీత్తు నెత్తి బాదుకుంతున్నది' చెప్పాడు కన్నప్ప.

అది విని సోము భయంతో వణికిపోయాడు. సిసిరికి ఏం కాకూడదని తమ దేవతలకు మొరపెట్టుకుని..

'ఒరే అయ్యా.. మరిప్పుడేటి సేయడం?' అన్నాడు బేలగా.

'సేసేదేటుందిర. సిసిరికి ఏటిగాకుండ కాన్పయితే కొండదేవతకు అడవిపందిని బలిత్తమని మొక్కీసుకోడమే! అంతకుమించి మనం సేసేది ఏటినేదు' అన్నాడు కన్నప్ప విచారంగా.

'ఒరే అయ్యా.. అలాగనకుర. సిసిరి నా పేనం! అది సావగూడదు. ఆలిస్యెం సెయ్యకుండ ఆసుపెత్రికి దీస్కుపోదం. దాన్ని బతికించుకుందం' అన్నాడు సోము ఏడుస్తూ.

'నీకేటి మతి పోనదేటిర? గూడెం ఆసారం నీకు తెల్దేటి? పోనేడు కాసమ్మ కాన్పుజెరక్క గిలగిల కొట్టుకుంతుంటే, దాని పెనిమిటి కొండప్ప ఆసుపెత్రికి దీస్కుపోతన్నడు. గుర్రప్ప ఒప్పుకున్నడేటి? 'ఆసారం దప్పుతావేట్ర ఎదవ నాయాల' అంటు.. గయ్యిన లేసినడు గద!'.

'పేనంకంటే ఆసారం గొప్పదేటి? నాకు సిసిరికంటే మరేటి గొప్పది గాదు. దాన్ని బతికించుకుందానికి నాను ఆసారం దప్పుతను. గుర్రప్ప ఏటిసేస్తడో సేసుకోమను'.. తెగింపుగా అన్నాడు సోము.

'గుర్రప్ప దయాదాచ్చన్యం నేనోడు. గూడెం కట్టుబాటు దప్పితే సిచ్చేసి, ఎలేస్తడు. గూడెం ఇడిసి మనం బతకలేం. దేవతమీద బారమేసి వొల్లకుండుడే మంచిది' నచ్చజెప్తూ అన్నాడు కన్నప్ప.

'ఎలేస్తడని బయిపడితే సిసిరి సస్తది. అది సచ్చినాక నానుమాత్రం బతికి నాబమేటి? సిసిరికి ఉసురుంతే ఈడగాకబోతే ఏడన్న బతుకుతం. ఒరే అయ్యా.. నా మాటిని సాయం సెయ్యి. సిసిరిని డోలీ గట్టుకుని ఆసుపెత్రికి దీస్కుపోదం' దీనంగా బతిమాలాడు సోము.

గూడెం కట్టుబాటు తప్పడమంటే గుర్రప్పకు ఎదురు తిరగడమే! ఆయన ఆగ్రహానికి

గురికావడమే! గూడెం ప్రజల సహాయాన్ని కోల్పోవడమే! అయితే కన్నప్ప కొడుకు బాధను చూడలేకపోయాడు. ఆచారం కోసం కోడల్ని చంపుకోవడం ఆయనకూ ఇష్టం లేదు. దాంతో ఆయనలోనూ తెగింపు పొడచూపింది.

'సరే బయిలెల్లయితే!' అంటూ డోలీ కట్టడానికి దుప్పట్లు, పొడవైన వెదురుబొంగు అందుకున్నాడు. సోము గాబరాగా అటకెక్కి పెట్టెలో దాచుకున్న డబ్బులను మొల్లో దోపుకున్నాడు.

***

మంచుతెరలు ఇంకా తొలగిపోలేదు. డోలీ ముందు కొమ్ము కన్నప్ప, వెనుక కొమ్ము సోము భుజాలమీద ఉంచుకుని మోసుకుపోతున్నారు. మంచును చీల్చుకుంటూ, రాయీరప్పను దాటుకుంటూ, తుప్పలు డొంకలను తప్పించుకుంటూ దూసుకుపోతున్నారు. డోలీకి పక్కగా సోము అమ్మ నారమ్మ కంగారుగా నడుస్తున్నది. ఏ క్షణంలో గుర్రప్పొచ్చి తమను అడ్డుకుంటాడోనని ఆమె భయపడుతున్నది. మరోపక్క సిసిరిని ఆపదనుంచి గట్టెక్కించమని కొండదేవతకు పదేపదే మొరపెట్టుకుంటున్నది.

కీడు గుడిసెలో పురిటినొప్పులతో లుంగలు చుట్టుకుపోతున్న సిసిరిని, డోలీలోకి చేరుస్తుంటే మంత్రసాని అడ్డుచెప్పింది. ఆమెను సోము పక్కకు తోసేశాడు. చేసేదిలేక గుర్రప్పతో చెప్పడానికి ఆమె పరుగుతీసింది. అదే అదనుగా సోము, కన్నప్ప డోలీని భుజాలకెత్తుకొని కీడు గుడిసెలోంచి వేగంగా ముందుకురికారు.

గంటపాటు ఆగకుండా ప్రయాణించి చాలా దూరమొచ్చేశారు. గుర్రప్ప తమనిక చేరుకోలేడని నమ్మకం కుదిరాక, అలుపు తీర్చుకోవడం కోసం ఆగారు. అయితే కొన్ని క్షణాలు మాత్రమే! నొప్పులకు తాళలేక సిసిరి చేస్తున్న ఆక్రందనలను చూడలేక, అలసటగానే డోలీనెత్తుకుని ముందుకు కదిలారు.

సిసిరి రోదన తప్ప మరే శబ్దమూ లేని ఆ అడవిలో ఒక్కసారిగా అలజడి రేగింది. ఆయాసపడుతూ అడుగులేస్తున్న కన్నప్ప, సోము హఠాత్తుగా ఆగిపోయారు. ఓ అమ్ము వారిపక్కనుంచి రివ్వున దూసుకొచ్చి ఎదురుగా ఉన్న జువ్విచెట్టుకు గుచ్చుకుంది. వెనక్కి తిరిగి చూసి హడలిపోయారు. ముంచుకొస్తున్న విపత్తును చూసి నారమ్మ గుండెలు బాదుకుంటూ కూలబడిపోయింది.

అల్లంత దూరంలో గుర్రప్ప. విల్లంబులు పట్టుకుని, గూడెం ప్రజలను వెంటేసుకుని వడివడిగా అడుగులేస్తూ వస్తున్నాడు. ప్రాణాలు తోడేసే యమకింకరుడిలా ఉన్న ఆయన్ను చూసి.. కన్నప్ప, సోము జడుసుకుని డోలీని కిందికి దించారు.

గుర్రప్ప వస్తూనే కన్నప్పను మెడపట్టుకొని పక్కనున్న డొంకలోకి తోసేశాడు. నారమ్మవైపు కొరకొర చూసి బండబూతులు తిట్టాడు. సోమును పట్టుకొని చెంపలు వాయించేశాడు.

'ఏరా గుంట నాయాల.. గూడెం కట్టుబాటును దప్పే దయిర్నం వొచ్చేసినాదన్న మాట

నీకు' అంటూ నిప్పులు కక్కాడు.

సోము గుర్రప్ప కాళ్లమీద పడిపోయాడు.

'నీకు దన్నం పెడత గుర్రప్ప. సిసిరికి వయిద్యమందకబోతే సచ్చిపోద్ది. అది సస్తే నాను బతకనేను. ఈ పాలికి మా తొప్పుకాసి ఒగ్గియ్యి' అంటూ ఏడుస్తూ ప్రాధేయపడ్డాడు.

'ఒగ్గియ్యడానికేట్ర.. మామంత పరుగు పరుగునొచ్చింది. ఆసారాన్ని కాపాడుకోనీకి. కట్టుబాటు దప్పినోల్లను అట్టుకుని సిచ్చించనీకి!' గుర్రప్ప కోపంగా అన్నాడు.

సోము ధైర్యం కూడగట్టుకొని..

'ఆసారం కోసరం సిసిరిని బలిదీసుకోడం నాకిట్టంనేదు. మడిసి పేనాలు తీసే ఆసారం మాకొద్దు. కాలం మారినది గుర్రప్ప! దిగువున సాన గూడేలు మార్నయి. మనము మారదం. పాత సింతకాయిల్లాంటి ఆసారాలను ఇడిసేద్దం' అన్నాడు.

'గుంటడు సెప్పే కొబుర్లు ఇనీడానికి నానేమి ఎర్రిమేకను గాదు. మేకల్ని నమిలేసే పెద్దపులిని! గూడెం పెద్దగ ఆసారాన్ని రచ్చించడం కోసరం ఎంతకైన తెగిత్తను'.

డొంకలో పడ్డ కన్నప్ప నెమ్మదిగా లేచి, గుర్రప్పవైపు దీనంగా చూశాడు.

'గుర్రప్ప.. కోపమిడిసి సాంతంగ ఆలోసించు. ఇంతవొరకు ఆసారం కోసరం అన్నెంపున్నెం ఎరగని ఎందరో ఆడకూతుర్ల ఉసురోసుకున్నం. ఇంతటితో యీ బలిని ఆపుదం. పురుడు రాక గిలగిలకొట్టుకుంతున్న సిసిరిని బతికించుకుందం. కూస్త పెద్దమనుసు సేసుకుని మమ్ము ఆసుపెత్రికి అంపు' బతిమాలుతూ అన్నాడు.

'అరే కన్నప్ప.. ఉప్పుడువొరకు కట్టుబాట్లకు అడ్డుసెప్పని నువ్వు, నీవొరకు వొచ్చేసరికి ఆటిని దప్పమంతన్నవు. నీకో నాయం, మరోల్లకింకో నాయం సేయమంతున్నవు? ఇదేమన్న బావుంద? ఇలగయితే రేపు మరోడు మరో ఆసారం దప్పుతడు. అప్పుడు గూడ నాను సూస్తు కూకోవాలా? ఈల్లేదు. గూడెం ఆసారాలు, కట్టుబాట్లు అందరు ఆచెరించాల్సిందే! ఆట్ని దప్పినోల్లని సిచ్చించాల్సిందే!' అన్నాడు గుర్రప్ప కళ్లెర్రజేసి.

మంచు క్రమంగా తొలగిపోతున్నది. సూర్యకిరణాలు చెట్ల మధ్యనుంచి విచ్చుకుంటున్నాయి. సిసిరి ప్రసవవేదనతో గింజుకుంటున్నది. కాళ్లు తన్నిపెట్టి పిడికిలి బిగించి, గుండెలవిసేలా గగ్గోలుపెడుతున్నది. అక్కడికి దగ్గరలో ఏ క్రూరజంతువుకు అడవిపంది చిక్కిందోగాని.. సిసిరి రోదనతో శ్రుతి కలుపుతున్నది. అడవి ఏకకాలంలో రెండు విషాద సంఘటనలను మౌనంగా తిలకిస్తున్నది.

గుర్రప్ప సిసిరిని సమీపించి..

'నొప్పులోర్సుకుని కులదేవతకు మొక్కుకోయే.. నీకేటిగాదు!' అంటూ ధైర్యం చెప్పి, డోలీని కీడు గుడిసెకు చేర్చమని ఓ ఇద్దరు యువకులకు పురమాయించాడు. వారు డోలీని భుజాలకు ఎత్తుకుంటుంటే సోము, కన్నప్ప.. ఆచారానికి సిసిరిని బలివ్వొద్దని ఏడుస్తూ అడ్డుపడ్డారు. వారిని అక్కడున్న మగోళ్లు తలోమాటతో దూషిస్తూ పక్కకు లాగారు. ఆడోళ్లు చోద్యం చూస్తూ

నిల్చున్నారు.

అంతలో ఆ ఆడోళ్ల మధ్యనున్న గుర్రప్ప పెళ్లాం చుక్కమ్మ.. జుట్టు విరబోసుకుని గట్టిగా అరుస్తూ పూనకంతో ఊగిపోతున్నది. ఆమెకు తమ కులదేవత పూనిందని, ఎవరో వేపకొమ్మలు విరిచి ఆమె చేతిలో పెట్టారు. ఆమె తల గుండ్రంగా ఊపుతూ, రాగాలు తీస్తూ..

'నాను కొండదేవతన్రో గుర్రప్ప! నువ్వు తొప్పు సేత్తున్నవ్రో.. తొప్పు సేత్తున్నవు' అంటూ గుర్రప్పను వేపకొమ్మలతో కొడుతున్నది. ఆడోళ్లు చుక్కమ్మను గట్టిగా పట్టుకుని..

'తల్లీ.. అమ్మా! తప్పేటో సెప్పు తల్లీ.. సెప్పు!' అని అడుగుతున్నారు.

చుక్కమ్మ రౌద్రంగా మొహంపెట్టి..

'సిసిరి నా బిడ్డరో బిడ్డ! అది పాపంపున్నెం దెలీని పిల్లరో.. అది గూడేనికి ఎలుగురో! దాని కడుపులో బిడ్డ అడ్డం దిరిగినదిరో.. దాన్ని ఆసుపెత్రికి దీసుకుబోనివ్వండ్రో! అది సస్తే గూడేనికి సేటు కాలమొస్తదిరో.. గూడెం వొల్లకాడవుద్దిరో! నా మాటినికోండ్రో!' అంటూ రాగాలు తీసి చెబుతూ, హఠాత్తుగా సొమ్మసిల్లి కింద పడిపోయింది.

అది విని గుర్రప్పతో సహా అంతా కొయ్యబారిపోయారు. ఏనాడూ చుక్కమ్మ మీదికి రాని కులదేవత, ఇప్పుడిలా వచ్చి చెప్పడంతో అంతా ఆశ్చర్యపోయారు. చుక్కమ్మ చెప్పింది నిజమని గట్టిగా నమ్మారు. సిసిరి చచ్చిపోతే గూడేనికి అరిష్టమని అంతా ఊసులెట్టుకున్నారు.

గుర్రప్ప తన పెళ్లాం మీదికి కులదేవత రావడంతో తెగ భయపడిపోయాడు. ఆకాశంలోకి చూసి దండం పెడుతూ..

'తప్పయిపోనాది.. సెమించు తల్లీ! గూడెమ్మీద గుర్రెట్టుకోకు. దయిసూపు తల్లీ! నువ్వు సెప్పినట్టే సిసిరిని ఆసుపెత్రికి దీస్కుబోతం' అని లెంపలేసుకున్నాడు. సిసిరిని ఆసుపత్రికి తీసుకుపొమ్మని ఆజ్ఞాపించాడు.

అంతే.. సోము, కన్నప్ప వేగంగా కదిలి డోలీని భుజాలకెత్తుకున్నారు. నారమ్మతోపాటు కొందరు యువతీయువకులు సాయంగా డోలీవెంట నడిచారు. మధ్యాహ్నానికి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి సిసిరిని చేర్చారు. డాక్టర్లు వెంటనే స్పందించి, వైద్యం అందించారు. ఆపరేషన్ చేసి తల్లీబిడ్డలను కాపాడారు.

***

చలికాలం గడిచి, ఎండాకాలం ఆఖరుకొచ్చింది. గుర్రప్పలో నెమ్మదిగా మార్పు మొదలైంది. కట్టుబాట్లను కొద్దిగా సడలిస్తున్నాడు. ఓ నిండు చూలాలును తానే దగ్గరుండి కాన్పుకోసం ఆసుపత్రికి పంపించాడు.

ఆ రోజు ఉదయం సోము గుడిసెలో ఒంటరిగా కూర్చుని, మూడ్రోజుల కిందట కీడు గుడిసెకెళ్లిన సిసిరి కోసం ఎదురుచూస్తున్నాడు. కాసేపటికి గెడ్డలో తలారా స్నానంచేసి బిడ్డను చంకనేసుకుని వచ్చింది సిసిరి. సోము పక్కన కూర్చుని..

'ఎవురుతోటి సెప్పనంటే నీకో రహస్యం సెప్పుతను!' అంది నెమ్మదిగా.

'సెప్పనుగనీ ఏటా రహస్యెం?' అడిగాడు ఆత్రుతగా సోము.

'సుక్కమ్మ నిన్న కీడు గుడిసెకొచ్చినది. ఆసారాన్ని దిట్టుకుంట కూకున్నది. ఎవురుతోటి సెప్పొద్దని రేత్రి ఓ రహస్యెం సెవినేసింది. ఆ రోజున సుక్కమ్మమీదన నిజెంగ కొండదేవత పూన్లేదంట. నా పేనాలు గాపాడానీకి ఇంకో మార్గంనేక దేవతకు సెమాపన సెప్పి.. అట్టా నాటకమాడినదంట. ఇన్నాక నా కల్లమ్మట నీల్లొచ్చిసినయి. సుక్కమ్మ కాల్లమీద పడిపోనను' చెప్పింది ఉద్విగ్నంగా.

అది విని సోము ఆశ్చర్యపోయాడు. చుక్కమ్మ చేసిన సాయానికి అతని మనసు పులకించింది. గూడెం ఆచారాలకు, కట్టుబాట్లకు గుర్రప్ప ఇంటిలోనే వ్యతిరేకత మొదలైంది. ఇక తమ మూఢాచారాలకు త్వరలోనే చెల్లుచీటి పడుతుందని భావించాడు. గూడెం ఆడవాళ్లకు మంచిరోజులు రాబోతున్నాయని సంతోషించాడు.

సిసిరి ఒళ్లోని బిడ్డ హఠాత్తుగా ఏడుపు మొదలెట్టడంతో, సోము ప్రేమగా తన చేతుల్లోకి తీసుకుని..

'సిట్టితల్లీ.. మీయమ్మడుతున్న ఇక్కట్లు సూసి, ఆడబుట్టుక బుట్టినానని బెంగెట్టుకుంతున్నవ? ఇగ బెంగనేదమ్మ! నువ్వు పెద్దయ్యేసెరికి యీ ఆసారాలేం ఉండవునే! గూడెం పెద్దతోనే కీడు గుడిసెకు అగ్గెట్టేసే రోజు తొందర్లోనే వస్తది. ఆ రోజు కోసరం నాను పోరాడతనే ఉంట!' అన్నాడు దృఢంగా.. ఆశగా!

ఆ చంటిబిడ్డకు ఏమర్థమయిందో.. ఏడుపాపి తండ్రివైపు చూస్తూ బోసినవ్వు నవ్వింది.

***

**విశాఖపట్నం జిల్లా కశింకోట గ్రామం.. బొడ్డేడ బలరామస్వామి స్వస్థలం. తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే, వ్యవసాయాన్నీ చూసుకుంటున్నారు. సాహిత్యమంటే ఇష్టం. చరిత్ర, గ్రామీణ నేపథ్యంలో కథలు రాస్తున్నారు. ఇప్పటివరకూ 30కి పైగా కథలు, కొన్ని కవితలు వివిధ పత్రికలు, సంకలనాలలో ప్రచురితమయ్యాయి. చతురలో 'ఆకుపచ్చని చంద్రుడు' నవల అచ్చయ్యింది. స్వాతి మాస పత్రిక నుంచి 'సముద్రం' కథకు 2017లో 'అనిల్ అవార్డు' అందుకున్నారు. గౌరీ గ్రంథాలయం, అనకాపల్లి వారు నిర్వహించిన కథలపోటీలో 'ఆడపిల్ల' కథకు డా. సి. నారాయణ రెడ్డి గారి చేతుల మీదుగా ద్వితీయ బహుమతి అందుకున్నారు. 'కళింగ పౌరుషం' చారిత్రక కథకు జాగృతి వార పత్రిక నుంచి, 'పట్టుచీర' కథకు హాస్యానందం పత్రిక నుంచి ప్రత్యేక బహుమతులను గెలుచుకున్నారు. ఈయన రాసిన 'సముద్రం' కథ హిందీలోకి, 'ఒక ప్రయాణం' కథ కన్నడంలోకి అనువాదమయ్యాయి. అశోక్ ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ సంస్థకు అధ్యక్షుడిగా కళా సేవలో పాలుపంచుకుంటున్నారు.**

Katha PART 1_Layout 1 6/29/2023 2:38 PM Page 62

# విషవలయం



అనిసెట్టి శ్రీధర్
**98660 97518**

ఒకప్పుడు వేలాది భారీ ట్రక్కులు నడిచి నడ్డి విరిగిన రోడ్డుపై.. వాటినుంచి జారిపడి ఇంకా మిగిలిన ఖనిజాల అవశేషాలను తొక్కుకుంటూ.. దుమ్మూ, ధూళీ రేపుతూ భారంగా జోడా నుంచి కియోంజర్ వైపుగా కదులుతున్నది ఓ ముసలి ట్రక్కు. అందులో ఇరవైమంది దాకా కూర్చుని ఉన్నారు. ఎవరి ముఖంలోనూ సంతోషం లేదు. జీవితంలో ఓడిపోయినవాళ్లలా ఉన్నారు.

యుద్ధం ముగిశాక మిగిలిన మరుభూమిలా ఉంది. రోడ్డుకు ఇరువైపులా వదిలేసిన ట్రక్కులు, ఎక్స్‌కవేటర్లు.. సగం కాలిన కాష్టంలా ఉన్నాయి. దారి పొడుగూతా లాడ్జిలు, మెకానిక్ షెడ్లు, చిన్న చిన్న హోటళ్లు, వాటిని ఆనుకుని కిళ్లీ కొట్లు.. అన్నీ మూతపడినవే! ఈ రోడ్డు అనే కాదు.. ఒరిస్సా రాష్ట్రంలో మూతపడిన గనులు ఉన్న ఏ ప్రాంతంలోనైనా ఇవే దృశ్యాలు. అవన్నీ చూస్తుంటే ట్రక్కులో కూర్చున్నవాళ్లకు తమ గతం, వర్తమానం గుర్తుకు వచ్చి.. తెలియని భవిష్యత్తు గురించి కడుపులో దేవినట్టయింది. మైనింగ్ జరుగుతున్న రోజుల్లో జన సందోహంతో, కేరింతలతో తిరుణాల్లలా ఉండేది ఆ ప్రాంతమంతా. కాసుల, మందుగ్లాసుల, చేతిగాజుల గలగలలూ. బడా కంపెనీలతో సహా అందరూ అనుమతి ఇచ్చినవాటికి ఎన్నోరెట్ల వైశాల్యంలో తవ్వుకుని

తరలించేశారు. గనులు అక్రమంగా తవ్వారని, మైనింగ్ ఆపేయమని కోర్టు ఉత్తర్వులు ఇచ్చి నాలుగేళ్లవుతున్నది. తిరుణాల్లలో వందల బాంబులు పేలినట్టయింది. ట్రక్కులో కూర్చున్నవాళ్ల జీవితాలన్నీ అప్పుడే ఛిన్నాభిన్నమయ్యాయి.

చిన్నగా చినుకులు మొదలై.. ఓ మోస్తరు వర్షం పడుతున్నది. ఎవ్వరూ ఆగుదామని కానీ, ఒంటిపై గుడ్డ కప్పుకొనే ప్రయత్నం కానీ చేయలేదు. చిన్నపాటి వర్షాలకు చెట్టు కిందో, గోడవారో ఆశ్రయం చూసుకునే.. తడిస్తే జలుబు, జ్వరాలు తెచ్చుకునే శరీరాలు కావవి. బతుకుదెరువు కోసం రోజూ పరుగులెత్తవలసిన వాడితో ఎండా, వానా కూడా స్నేహం చేస్తాయి. వారిలో ఎవరిని కదిలించినా ఒక కన్నీటి కథే.

'మా కథలు మేమే చెప్పుకొంటాం!' అంటున్నారు.

***

సాహు :

నా పేరు అశోక్ సాహు. మాది కియొంజర్ జిల్లా. నేను దుబాయిలో సూపర్‌వైజర్‌గా కొన్నేళ్లు పనిచేశాను. కొంత డబ్బు వెనకేసుకున్నాక కుటుంబానికి దూరంగా ఉండలేక, 2009లో మా రాష్ట్రానికి తిరిగొచ్చేశాను. మా ప్రాంతమంతా మైనింగ్ కార్యకలాపాలతో చాలా సందడిగా ఉండేది. ఎటు చూసినా డబ్బే!

ఒకటి, రెండు ట్రక్కులు ఉన్నవాళ్లు ఖనిజం తోలడానికి తమ బండ్లను కాంట్రాక్టర్లకు అప్పజెప్పేవాళ్లు. నా స్నేహితుడు పట్నాయక్ జీతానికి పనిచేసే ట్రక్కు డ్రైవర్. ఒక కాంట్రాక్టర్ దగ్గర నమ్మకంగా పనిచేసేవాడు. రాబడి చూసి కాంట్రాక్టర్ సలహా మీద వాడు అప్పుచేసి రెండు బండ్లు కొనుక్కుని, ఒక డ్రైవర్‌ను పెట్టుకున్నాడు.

దుబాయి నుంచి వచ్చి.. 'ఏం చెయ్యాలా?' అని ఆలోచిస్తున్న నేను కూడా.. మూడు ఎక్స్‌కవేటర్లు కొని అద్దెకిచ్చాను. సరిగ్గా సంవత్సరానికి అక్రమ మైనింగ్ అంటూ కోర్టు రాష్ట్రంలోని అన్ని గనులపైనా నిషేధం విధించింది. ఇవ్వాల్సిన డబ్బులో కొంత కాంట్రాక్టర్లూ ఎగ్గొట్టారు. ఇలాంటి వందలాది ట్రక్కులు, ఎక్స్‌కవేటర్లకు పనిలేక, వేలంలో అమ్ముడుపోక ఇలా రోడ్డు పక్కన అనాథ శవాల్లా పడి ఉన్నాయి.

నేనూ నా ఎక్స్‌కవేటర్లను ఎక్కడో అక్రమంగా పుట్టిన బిడ్డల్లా ఇక్కడే వదిలేశాను. అప్పు ఇచ్చిన బ్యాంక్ వాళ్లు స్వాధీనం చేసుకుని వేలం వేసినా సగం బాకీ కూడా తీరలేదట. మిగిలిన మొత్తం వసూలుకు కోర్టులో కేసు వేశారు.

'బడా కంపెనీలకైతే వేలకోట్లు రుణాలు తీసుకొని.. వ్యాపారం దెబ్బతిన్నా, కంపెనీ వాడు దెబ్బేసినా బ్యాంకుల వాళ్లు అంతగా పట్టించుకోరు. కొంత మొత్తం వసూలు చేసి.. మిగిలిన మొత్తం మాఫీ చేస్తారు' అని దాస్‌బాబు చెప్పాడు. అలా ఎగ్గొట్టినవాళ్లు ఇప్పటికీ విలాసవంతమైన భవనాల్లో జీవిస్తూ, ఖరీదైన కార్లలోనే తిరుగుతున్నారు. ఇదెలా సాధ్యం?

నా పరిస్థితే కొంత మెరుగు. పట్నాయక్‌కు అన్నీ అప్పులే. బండ్లన్నీ అప్పులవాళ్ల

పరమైపోయాయి. కానీ, అవి కొనేవాళ్లే లేక రోజూ వచ్చి బండబూతులు తిడుతూ, ఇంట్లో చేతికందిన సామాను పట్టుకుపోయారు. వాడి కథ నేనెందుకు చెబుతున్నానంటే.. వాడే చెప్పుకోవడానికి ఇప్పుడు లేడు. 'ఈత కొట్టడానికి బైతరిణీ నదికి వెళ్లి ప్రమాదవశాత్తూ మునిగిపోయాడు' అంటారు ఇంట్లోవాళ్లు. అలా చెప్పకపోతే ఇన్సూరెన్స్ రాదు కదా! వాడు రాసిపెట్టిన ఉత్తరం దాచిపెట్టేశారు. కొందరు తెలివితక్కువ వాళ్లు ఉరేసుకున్నారు. పురుగుల మందు తాగారు.

విత్తనాల్లాంటి మమ్మల్ని మా ప్రమేయం లేకుండానే బడా కంపెనీలు అనబడే కలుపు మొక్కల మధ్యకు ఎవరు విసిరారు? బతుకుదామని ఆశపడి చిగురించి లేత కొమ్మలైన మా మనుగడ పరిస్థితి ఏమిటి?

***

మాఝి :

నా పేరు నారాయణచంద్ర మాఝి. నేను గనుల్లో పనిచేసేటోడిని. గనులు మూతపడి చాలా రోజులు పని లేకపోవడంతో, మా యజమానిని బామాలి ఆయనదే మూతపడిన స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీగా కుదురుకున్నాను. నేను చేసిన అప్పులు, నా అవసరాలు మీనవడి ఇరవైవేల కోసం ఫ్యాక్టరీలో బిల్లెట్లు దొంగతనం సేసి దొరికిపోయినాను. ఆర్నెల్లు జైలు సిచ్చ అనుభవించి, ఈ మధ్యే బైటికొచ్చినాను.

'ఇన్ని వేల కోట్ల ఖనిజం అక్కరమంగా తరలిపోనాది కదా! కోరటు ఏం సెప్పింది బాబూ!' అని దాస్‌బాబును అడిగినాను.

'దండిగా జరిమానాలు ఏసారు.. అదంతా ప్రభుత్వానికి జమ అయ్యి, ఆపై ప్రజలకు చేరతాది' అని అన్నాడు దాస్‌బాబు. జరిమానాలు ఏసారే తప్ప.. ఒక్క యజమానికి కానీ, పెబుత్వ అధికారికి కానీ జైలు సిచ్చ పడలేదే! అని ఆశ్చర్యమేసినాది. అంటే దొంగతనం సేసిన సొమ్ము ఎనక్కి ఇచ్చేత్తే.. జైలుకు ఎల్లక్కర్లేదన్నమాట. 'నా దగ్గరా సొమ్మంత వసూలు సేసినా.. మరి నాతో ఊచలు ఎందుకు లెక్కెట్టించినారు?' అనేది నా ప్రశ్న. సదూకున్నోడు కదాని సాహుబాబుని అడిగినాను. 'నువ్వో వ్యక్తి సొమ్ము దొంగతనం చేశావు. వాళ్లు ప్రజల సొమ్ము దిగమింగారు.. అదే తేడా!' అన్నాడు.

***

బారిక్ :

నా పేరు గోపాల్ బారిక్. మా ఊళ్ల చుట్టూ గనులు వెలిశాక దేవతలకు మొక్కినట్టు మేమూ వాటికి మొక్కినాం. మా చేతి వృత్తులు, మా తెలివితేటలు, మేం చేసేటి ప్రయోగాలు.. అన్నీ ఈ కొత్త ఉద్యోగాలతో మట్టికొట్టుకు పోయినాయి. వచ్చిన డబ్బుతో జలసాలు, నేరాలు, అక్రమ సంబంధాలు, విడాకులు పెరిగినాయి. మా జిల్లానుంచి లక్షల కోట్ల ఖనిజం తవ్వుతారు. మా ఊళ్లను ముంచెత్తిన దుమ్మూ, ధూళీ మా ఊపిరితిత్తుల్ని, ఒంటిని తినేసినాయి. మా పొలాలు

పండవు. మంచినీళ్లు దొరకవు. మందు దొరుకుతాది. గనులు తవ్వితే కలిగే నస్టాలను పూడ్సడానికి కంపెనీలు ఏం చెయ్యాల్నో కాయితాల మీన ఉంటై. గమనించాల్సిన ప్రభుత్వం నిదరోతా ఉంటది. మైనింగ్ కోసరం కొంపా, గోడూ లాకున్నవాల్ల గోస యేరే! గనులుంటేనే పనులు. బడా కంపెనీలు తప్పుడు లెక్కలు చూపించినాయని, ఎక్కువ తవ్వకెళ్లి పోయినారని గనులు మొత్తంగా మూసేసి.. మా ఊరి జనాల నోట్లో మళ్లీ మట్టికొట్టినారు.

మా తమ్ముడిదీ నాలాంటి బతుకే. తను మాత్రం బేవార్సుగా తిరుగుతూ ఏ చింతా లేకుండా కాలం యెల్లమారుస్తున్నడు. కనీసం నా భార్య నాలుగిళ్లలో పనులు చేస్తాది. మా మరదలు అయితే రోగిష్టిది. ఏ పనీ చెయ్యలేదు పాపం! మరి సంపాదన ఎలా అంటారా? ఎదిగిన వాడి కూతురు సంపాయిస్తంది. ఏం చేస్తందని మాత్రం అడగమాకండి. నా నోటితో సెప్పలేను. నాకూ కూతురే కదా అయ్యేది. తనే కాదు. మా ఊళ్లో చాలామంది అమ్మాయిలు అదే చేస్తారు. 'బతకాలి కదా!' అంటారు.

కలి పురుషుడు నాలుకను ఒక చేత్తో, పురుషాంగాన్ని రెండో చేత్తో పట్టుకుని వచ్చినాడని చెబుతారు కదా! నాలుక రుచి తీరగానే మగాడికి రెండో చేత్తో పట్టుకున్నదాని ఆకలి మొదలవుతాది. పాపం ఆడదానికి కడుపు నిండాలంటే.. ఆ ఆకలి తీర్చేదానికి మగాడి పక్కన పండాలి. మాకీ దుస్థితి ఎందుకు కలిగినాది? మా ఉద్యోగాలు ఎందుకు పోయినయి? కష్టపడి పనిచేసే చేతులకు ఆదరువు చూపించే బాద్యత ఎవురిది?

***

నాయుడు :

నా పేరు అప్పల్నాయుడు. మాది సికాకుళం జిల్లా. ట్రాక్టర్‌తో మట్టి తోలే పని. మా ఊరు ఒరిస్సా రాష్ట్రానికి సరిహద్దులో ఉంటది. మా అత్తోరిది ఒరిస్సా రాష్ట్రమే! అంచేత రాకపోకలూ ఎక్కువే. మావోడొకడు అక్కడ గనుల్లో జేసీబీ తిప్పుతా.. బాగా సంపాయించాడు. వాడి సలహామీదనే మేమూ ఇక్కడ చేరాం. మాలాంటి తెలుగు వాళ్లూ బాగానే ఎగబడ్డారు. నేను డ్రైవర్‌గా పనిసేస్తానే.. అప్పులు సేసి మరీ మాయావిడతో హొటేలు పెట్టించిన. మా బామ్మర్ది పక్కనే కిళ్లీకొట్టు పెట్టేడు. గనులతోపాటు మా బతుకుదారీ మూసుకుపోనాది. ఇదే మా తెలుగు సిన్మా హీరో అయితే అక్రమ గనుల్ని బాంబులేసి పేల్చేసి, యజమానుల్ని సంపేసి వాళ్ల ఆస్తులన్నీ మాకు రాసిచ్చేటోడు. నా పెళ్లాం సాహుబాబుతో ఆళ్ల బాసలో సెప్పుకొని ఏడ్సింది.

'అన్నా! నాకు నలభై ఐదు దాట్నాదా? మా ఆంధ్రాలో మా కులపు ఆడోళ్లకు పదేనేలు ఇత్తన్నారా? మా ముసిలోల్లిద్దరికీ కలిపి నెలకి నాలుగేలు పెన్సనా? నా పెనిమిటి ఆటొ తోలతా ఉండుంటే పదేలా. మా బొట్టిలిద్దర్నీ ఇస్కూలికి పంపతా ఉంటే ముప్పై ఏలా? పని సెయ్యకుండా తిని తొంగున్నా సమ్మచ్చరానికి లచ్చ రూపాయలు వచ్చి పడేటియి. ఈ ముదనట్టపోడు ఈడ్నేదో నొల్లేసుకుందావని తెచ్చి పడేసిండు. ఇక్కడ ఇంటిల్లిపాదీ రెక్కలు ముక్కలు సేసుకున్నవేగానీ.. ఊరక వచ్చిపడే సొమ్ము ఆసించలే. మరి మా బతుకులు ఇలా

ఎందుకు కాలినయ్?'..

***

బేరాలు బాగున్నాయని స్థలం లీజుకు తీసుకుని, పెద్ద షెడ్డు వేసి భారీగా అడ్వాన్సులు ఇచ్చి కుర్రాళ్లను పెట్టుకుని.. నష్టపోయిన ట్రక్కుల మెకానిక్ రత్నాకర్ ముదులి, గనుల మూసివేతతో మూతపడిన పరిశ్రమల్లో ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులు.. ఇలా ట్రక్కులో ఉన్న మిగిలిన అందరిదీ తలా ఒక కథ, అదే వ్యథ.

'మనమెందుకు నష్టపోవాల? మనమేమైనా గంజాయి పండించినామా? సరుకు నల్లబజారులో అమ్ముకున్నమా? గనులు అక్రమంగా తొవ్వినమా? పుకార్లు నమ్మి అత్యాశతో రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోయిన జనాలు కాము మనం. మన నష్టాన్ని ఎవరు పూడుస్తారు?' ఈ ప్రశ్నలు వాళ్లను తొలిచేస్తున్నాయి.'దీనికంతటికీ కారణం ఏట్రా? మన బతుకులిలా ఎందుకు తగలడ్డాయ్?' అని అడిగాడు ఒకడు.

'దాస్‌బాబునే నిలదీయాల్రా!' అన్నాడు మరొకడు.

అందుకే మూకుమ్మడిగా బయలుదేరారు.

ఉపాధి పోయి, వ్యాపారాలు నష్టపోయి జీవితాలు అగమ్యగోచరంగా తయారైనపుడు.. వీళ్లంతా ఏ గమ్యం వైపు వెళ్తున్నారు? ఏ ప్రశ్నను సంధించడానికి వెళ్తున్నారు? తమ జీవితాలు గాడిన పడటానికి ఏం సమాధానం కోరుకుంటున్నారు?

తమ ప్రశ్నకు సమాధానం దాస్‌బాబు చెప్పాలని వాళ్ల మొండిపట్టు. దాస్ బాబు అంటే.. బిశ్వజిత్ దాస్.

ఎవరీ బిశ్వజిత్ దాస్?

***

దాస్ బాబు :

నమస్కారం. నా పేరు బిశ్వజిత్ దాస్. కియొంజర్ జిల్లా కేంద్రంలో నేనొక పాత్రికేయుడిని.

దోపిడీ, దొంగతనాలు, ఆక్రమణలకు గురికాకుండా డబ్బు బ్యాంకుల్లో, బంగారం, దస్తావేజులు లాకర్లలో. ఖాళీ స్థలానికి ప్రహరీ. వస్తువులకు ఇన్సూరెన్స్. ఇంటికి సీసీ కెమెరాలు, సెక్యూరిటీ అలారాలు.. మనిషికి తనది అనేసరికి ఎన్ని జాగ్రత్తలో! అదే ప్రభుత్వ సొమ్మును ప్రజలు తమ సొమ్ముగా భావించరు. తమదిగా తాదాత్మ్యం చెందరు. వాటివల్ల నేరుగా, ఇప్పటికిప్పుడు తమకు వచ్చే, కనిపించే రాబడి ఏమీ ఉండదు. భవిష్యత్ తరాల గురించి చింత ఉండదు. ఇలాంటి ఆస్తులు, సంపద అన్యాక్రాంతం కావడం సులభం. వీటిని నిత్యం పహారా కాస్తూ, కంట కనిపెట్టుకునుండే కాపలాదారులు కొంతమంది ఉంటారు. బతుకుపోరాటంలో ఎవరికివారు తలమునకలై ఉంటే.. సమాజం కోసం శంఖారావం పూరించేవాడు ఒకడుంటాడు. అలాంటి వాళ్లల్లో నేనూ ఒకడిడని అందరూ అంటారు.

రాజకీయ నాయకుల అండదండలతో నిబంధనల్ని అతిక్రమించి, తుంగలో తొక్కి,

ప్రభుత్వాధికార్లను బాగా మేపి.. ఒడిశా రాష్ట్రమంతటా ఒక దశాబ్దం పాటు అడ్డంగా, అక్రమంగా మైనింగ్ చేసి, కొన్ని కంపెనీలు వేల కోట్లకు పడగలెత్తాయి. ఇదే మేము బయటపెట్టాం. తవ్వినకొద్దీ ఖనిజం అయినా అయిపోతుంది కానీ.. నిజాలు బయటపడుతూనే ఉన్నాయి. ఆ రాశి ఎత్తు, వైశాల్యం మానవమాత్రుడు కొలవలేనంతగా ఉన్నాయి. న్యాయస్థానం ఉత్తర్వులతో మైనింగ్ చాలా సంవత్సరాలు దాదాపు పూర్తిగా స్తంభించిపోయింది.

మానసిక, శారీరక ఉద్వేగాల్లాగే.. ఆర్థిక ఉద్వేగం అని ఒకటుంటుంది. అది ఉత్తేజంలానే కనిపిస్తుంది. రియల్ ఎస్టేట్, షేర్లు.. అలాగే మైనింగ్. ప్రగతిరథం పరుగులెడుతున్నట్టే కనిపిస్తుంది. అది వాలులో అదుపు లేకుండా జారిపోతోందనీ, తమను ఎక్కడో కింద పడేసి తొక్కుకుంటూ వెళ్లి ఆగిపోతుందనే ఎరుక సామాన్య ప్రజలకు కలగదు. అవకాశాలు ఎలా వస్తున్నాయనేది అసంగతం. సామాన్య ప్రజలతో సహా అందరూ పెట్టుబడులు పెడుతూనే ఉంటారు. అనుమతి ఇచ్చిన దానికన్నా ఇన్ని రెట్ల అక్రమ మైనింగ్ జరగకుండా చర్యలు తీసుకుని ఉంటే.. పాపం వాళ్లీ పెట్టుబడులు పెట్టేవాళ్లే కాదు.

మనం, మన పిల్లలు బాగుంటే సరిపోతుందా? ముని మనవళ్లు, వాళ్ల ముని మనవళ్లు బతకొద్దా? మన ముత్తాతలు, మన పూర్వీకులు ఇలానే స్వార్థంతో ఆలోచించి ఉంటే పరిస్థితులు ఎలా ఉండేవి? మనం సంపాదించిన దాంట్లో అంతా ఖర్చు పెట్టెయ్యం కదా! దాచిపెట్టుకుంటాం కదా! మరి ఇది కూడా ప్రకృతి ఇచ్చిన సంపద కాదా? కనీసం మనం సంపాదించింది కూడా కాదని వాళ్లకు చెప్పేవాడిని. 'అధర్మయుద్ధం చేస్తున్నవాడికి కాకుండా క్షతగాత్రులకు నీతి బోధిస్తున్నానా?' అనిపించేది నాకు. విచ్చలవిడి మైనింగ్ వల్ల దెబ్బతినే ప్రకృతి సమతుల్యత, మానవ సంబంధాలు.. వీటి గురించి చెప్పినా వాళ్లకు అర్థం కాదు.

ప్రభుత్వపరంగా తీసుకునే అరకొర చర్యలు, న్యాయస్థానాల్లో జరిగే జాప్యం, అహేతుకమైన నిర్ణయాలు మీకు తెలియంది కాదు. మైనింగ్ ఆగిపోవడంతో పరిశ్రమలు మూతపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేకమంది జీవితాల్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేసింది. మొదటి రెండు, మూడేళ్లలోనే ఉపాధి కోల్పోయి, వ్యాపారాల్లో పెట్టిన పెట్టుబడులు నష్టపోయి, చేసిన అప్పులు తీర్చలేక చితికిపోయిన వాళ్లు వేలల్లో ఉన్నారు. 'ఎవరు చేసిన తప్పు.. ఎవరు బలయ్యారు?' అది తల్చుకుంటేనే వేదనగా ఉంటుంది.

అలా నష్టపోయిన సాహులాంటి వాళ్లు..

'మీతో పని ఉంది సార్! వస్తున్నాం..' అని ఫోన్ చేస్తే, వాళ్లకోసం ఇంటి దగ్గర ఎదురు చూస్తున్నాను.

***

జోరున వర్షం కురుస్తున్నది. గమ్యస్థానం చేరిన ట్రక్కునుంచి వాళ్లంతా కిందికి దిగారు. అప్పటికే ఆ చుట్టుపక్కల నివసించే ఓ పదిమంది అక్కడ వేచి ఉన్నారు. దాస్‌బాబు ఇంటి

తలుపు తట్టారు.

దాస్‌బాబు ఆశ్చర్యపోయాడు.

'ఇంత వర్షంలో ఇంతమంది కలిసి ఎందుకు వచ్చారో? ఏమైనా జరిగిందా?' అనుకున్నాడు. వాళ్లల్లో చాలామంది తనకు తెలిసినవాళ్లే.

'ఏంటి సాహూ? ఇలా వచ్చారు?' అడిగాడు దాస్‌బాబు. 'మిమ్మల్ని ఒకటడగాలని వచ్చాం దాస్‌బాబు!'. 'అడగండి!'. ముప్పై కంఠాలు ఒక్కటై.. సాహు గొంతు నుంచి బాణంలా సూటిగా.. గాలి హోరును అధిగమించి, వర్షపుధారను చీల్చుకుంటూ వెలువడిందో ప్రశ్న!

ఆశ్రయమిస్తున్న చెట్టుపైనే పడిన పిడుగులా ఉందా ప్రశ్న. 'కాళీయమర్దనం ఎందుకు చేశావ్?' అని కృష్ణుడిని ఆబాల గోపాలం నిలదీసినట్టుందా ప్రశ్న!

దాస్‌బాబుకు కాళ్ల కింద భూమి కంపించినట్టయింది. తాము పోరాటాలు చేస్తూ సమన్యాయం, పారదర్శకత అనే సామగ్రితో కడుతున్న ప్రజాసౌధం కుప్పకూలినట్టయింది.

ప్రజల ఉమ్మడి సంపదను దోచేస్తూ, అవినీతి సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటున్న రాజకీయ నాయకుల, బడాబాబుల, అధికారుల చర్యలకు వత్తాసు పలుకుతూ, న్యాయాన్ని ప్రశ్నించే గొంతుకలుగా ఎందుకు మారాయి? 'మాకు బతుకుదెరువు ముఖ్యం. ఏ దారైతేనేంటి' అనే నిస్సహాయత వాళ్లను ఆ ప్రశ్న వేయడానికి ఉసిగొల్పింది. ఇంతకూ ఏమిటా ప్రశ్న?

'గనులు అక్రమంగా తవ్వితే తప్పేంటి దాస్‌బాబూ?'.

**అనిసెట్టి శ్రీధర్ స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా నరసరావుపేట. బి.ఎస్సీ చేశారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో చీఫ్ మేనేజర్‌గా ఉద్యోగ విరమణ పొందారు. 1990 నుంచీ కథలు రాయడం మొదలుపెట్టారు. ఇప్పటి వరకూ 32 కథలు రాశారు. 15 కథలతో 2008లో తీసుకొచ్చిన 'కొత్త బంగారులోకం' కథా సంపుటిని కారా మాస్టారు ఆవిష్కరించారు. మరో 16 కథలతో సరికొత్త సంపుటిని ఈ ఏడాది తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. 2011లో 'నివేదన' కవితా సంపుటిని తీసుకొచ్చారు. పలు ప్రముఖ పత్రికలు నిర్వహించిన కథల పోటీల్లో ఈయన 'పాతసామాను', 'మద్దతు', 'జనజీవన స్రవంతి', 'శాహో వర్సెస్ మాహో' కథలకు బహుమతులు అందుకున్నారు. 'కొత్తబంగారు లోకం' కథకు సి.పి.బ్రౌన్ అకాడమీ నుంచి బహుమతి దక్కించుకున్నారు. 1993లో వచ్చిన ఇరవై ఉత్తమ కథల్లో ఒకటిగా ఈయన రాసిన 'నెత్తురు కూడు' కథ ఎంపికైంది. 'జాతి సమష్టి సంపదను బలవంతులు, ధనవంతులు దోపిడీ చేయడాన్ని బలహీనులు సమర్థించవలసిన అగత్యం ఎందుకు వచ్చింది?' అనే కథా వస్తువుకు.. రచయిత స్వయంగా గమనించిన పరిస్థితుల్ని జోడించి రాసిన కథ.. 'విషవలయం'!**

# ఉల్టాబాజా



సయ్యద్ గఫార్,
**81432 53116**

అప్పటిదాక ఉరుములు మెరుపులతో దంచికొట్టిన వాన.. జరంత తగ్గి సన్నటి ముసురువట్టింది.

మట్టిగాడు పెంచుకుంటున్న ఊర కుక్కపిల్ల.. 'కూం.. కుంయ్.. కుంయ్..' అన్కుంట గుడిసె బయటికీ లోపట్కి ఒకటే తిరగవట్టింది. దాని కాళ్లు ఒక్కాడ నిలుస్తలేవ్.

అది వీర్లపూడి ఊరికి దూరంగా ఉన్న మాదిగ్గూడెంలోని డప్పు మట్టిగాని గుడిసె. ఊరోల్ల భయానికి గూడెపోల్లందరూ గూడెం ఇడ్సివెట్టి పారిపోంగ.. మిగిలిన గుడిసె అదొక్కటే. పుట్టి భూమ్మీద కాలు మోపిన కాన్నుంచి గీ గుడిసెల్నే బతుకీడ్సిన మట్టిగానికి యాభైఏండ్లు దాటినయి. ఇయ్యాల పొద్దుగాల్నే.. నూరేండ్లు నిండినయి.

కాళ్ల పాదాల కాన్నుంచి ముఖంపైదాంక నిండుగా దుప్పటి కప్పి.. ఒక నిట్టూర్పు ఇడ్సి, కండ్లు తుడ్సుకుంటా గుడిసె బైటికొచ్చిండు మట్టిగాని దోస్తు గోరేమియా. మట్టిగానికి గోరేమియా తప్ప నా అనేవాల్లెవ్వరూ లేరు.

గోరేమియాది కూరగాయల యాపారమైతే, మట్టిగాడు ఊర్లె పండగలకూ పబ్బాలకూ డప్పు కొట్టి.. వచ్చే డబ్బుల్తోనే కాలం ఎల్లదీసేటోడు.

ఎప్పుడో ఓపాలి మందు తాగుడు అలవాటున్న మట్టిగానికి ఊరోళ్లు డప్పు కొట్టడానికి పిల్సకపొయి, వాణ్ని సంతోష వెట్టడానికని గింత మందు తాపించేటోళ్లు. వానికేమైందో ఏమో.. ఆర్నెల్లవట్టి ఇపరీతంగ తాగవట్టిండు. ఆరోగ్యం చెడివోద్దని మట్టిగానికి అప్పుడప్పుడు గోరేమియా ఎచ్చరిస్తనే ఉన్నడు. ఆ మాటల్ని పెడచెవినవెట్టి బిర్రుగ తాగుతనే ఉండు మట్టిగాడు. పది రోజుల కిందట మట్టిగానికి కడుపు ఉబ్బుకొచ్చింది. ఏం తినవోతలేదు. గోరేమియా ఎంటవెట్కపొయి దవాఖానల సూవెట్టిండు. తాగి తాగీ కార్జెం

చెడిపోయిందని, బతుకుడు కష్టమని చెప్పిండు డాక్టరు. ఏవో మందులైతే రాసిచ్చిండు. అయి మింగుతనే ఉండు. మూడు రోజుల కిందట్నే కోమాలకు వొయిన మట్టిగాడు.. ఇయ్యాల తెల్లార్జామున పానమొదిలిండు.

వానికి లగ్గం కాలే. వాని శవం మీదవడి ఏడ్సేటోళ్లు లేరు. ఊర్లె అయినోళ్లు గని, కులపోళ్లు గని ఎవలూ లేరు.

'మట్టిగాని శవం ఎట్లా లేవాలే?' అనే ప్రశ్న.. గోరేమియా దిమాఖ్‌ల పెద్ద సవాలయి కూకుంది. అట్లా ఆలోచిస్తున్న గోరేమియా చూపులు, గూడెంల సగం కూలిన గుడిసెల మొండిగోడల మీదవడ్డయి.

'నిజమో.. అబద్ధమో గని.. కూలిన రాజుల కోట గోడలకు వీరగాథల చరిత్రలున్నట్లే.. దళిత వాడల్లో కూలిన గుడిసెల మొండిగోడలకు విషాద కథలుంటయ్యేమో!' అనుకున్నడు గోరేమియా.

సుమారు నలభై ఏండ్ల కిందట గూడెపోల్లకు జరిగిన అన్యాయం యాదికొచ్చింది.

***

గోరేమియాకు మట్టిగానితో దోస్తి కుదిరిన కొత్తలో, వానితో ఆడుకోనీకి మాదిగ్గూడేనికి వచ్చేటోడు. ఆ రోజుల్లనే గూడేనికి ఎక్కడినుంచో ఓ సాధు సన్నాసి వచ్చిండు. పాపం ఒంటరోడు కదా అనుకొని గూడెపోళ్లు చేరదీసింరు. గా సాధు సన్నాసి కూడా.. తనకు తెల్సిన చిట్కా వైద్యంతో గూడెపోల్లకు సేవలు చేస్తూ, వాళ్లకు దగ్గరయిండు. అట్లా కొన్నాళ్లు గడ్సినంక, ఆ సాధు సన్నాసి ఎవల్లకు చెప్పా పెట్టకుండా ఓ అర్ధరాత్రి గూడెం వదిలి మాయమైండు. అతనెవరో? ఏడికెల్లి వచ్చిండో? ఏడికి వోయిండో? ఎవల్లకు తెల్వదు. అతను గూడెంలో ఉన్నన్నాళ్లు గూడెపోళ్లు గుండెల్ల పెట్కోని సూస్కున్నరు. గదే గూడెపోల్లకు పెద్ద శాపమై కూకుంది.

గూడెపోళ్లు సాధు సన్నాసిని పిలిపించుకొని.. ఆయన దగ్గర 'చేతబడి' నేర్చుకున్నరని ఊర్లె ఎవరో పుకారు లేవదీసింరు. అది ఊరంతా పాకింది. అప్పటికెల్లి.. ఊర్లె ఎవల్లకు సర్ది, జొరం వచ్చినా, బర్రె పాలియ్యకవొయినా, ఆఖరికి కోడిపిల్లను కాకెత్తుకవొయినా.. గూడెపోల్ల చేతబడే కారణమని ఊరోల్లు గుంపులుగా గూడెమ్మీదవడెటోళ్లు. ఆళ్లను బండ బూతులు తిట్టుకుంట.. ముసలోల్లు, ఆడోల్లు, పిల్లలని సూడకుండా, ఒకల్ల మీద ఒకల్లనేసి చావ బాదేటోళ్లు. ఇయ్యాల గాకున్నా, మరి కొన్నాళ్లకైనా తమకే పాపం తెల్వదనే నిజాన్ని ఊరోళ్లు తెల్సుకోకవోతరా.. అనుకొని బాధల్ని భరిస్తూ కాలం గడుపుతుంరు గూడెపోళ్లు.

గా బాధలట్టుండంగనే.. ఓ అమాస అర్ధరాత్రి పండు ముసలి, గూడేనికి పెద్ద దిక్కయిన కాశయ్య తాత సచ్చిండు. అసలు.. గూడెంలో చేతబడి నేర్చుకోనీకి కారణమే కాశయ్య తాత అని, గా ముసలోని శవాన్ని ఊరి పొలిమేర్ల గూడ బొందవెట్టడానికి వీల్లేదని ఊరోళ్లు పట్టువట్టింరు. గూడెపోళ్లు ఓ అర్ధరాత్రి కాశయ్య తాత శవాన్ని తీస్కవొయి, ఊరికి రెండు మైళ్ల దూరంలో, ఎవ్వరూ ఎర్కవట్టని కాడ పారేసొచ్చింరు.

గూడెపోళ్లమీద ఊరోళ్లు వెడ్తున్న అనుమానపు హింసకు అంతులేకుండా వోయింది. గా నరకాన్ని

భరించలేక, తమ బతుకులకు భరోసా ఉన్న ఊర్లకు వలసెల్లివొయింరు. వాళ్లల్లో కొందరికి మాన్యం భూములున్నప్పటికీ, ఆటిని ఏకాడికకంటే ఆకాడికి బైనామాలు రాసిచ్చి ఎల్లివొయింరు. మట్టిగానోల్ల గుడిసె ఒక్కటే గూడెంల మిగిలింది.

***

మట్టిగాని అయ్య.. కాటయ్య. ఊర్లె గ్రామ పంచాయతీ చాటింపులకు డప్పు కొట్టేటోడు. ఇంకా ఊర్లె శుభకార్యాలకు, పండుగలకు, చావులకు కూడా డప్పు వాయించేటోడు. అస్వంటోడొకడు ఊరికి అవుసరం కాబట్కి, కాటయ్యను ఊరొదిలి పోకుండా ఆపుకున్నరు ఊరోళ్లు. మట్టిగాని అమ్మ ఊర్లె యవసాయ కూలీ పనులల్లకు వోయేది.

అట్టా కాలం నెట్టుకొస్తున్న వాళ్లకు.. గుంటూరులో ఉన్న దూరపు సుట్టాల నుంచి కబురొచ్చింది. అక్కడ మిర్చి తోటలల్ల, మిర్చి ఏర మనుషులు అవుసరముందని, ఒక నెల కష్టవడ్తే నాలుగు పైసలు ఎనకేసుకోవచ్చని. పదిహేనేండ్లు నిండిన మట్టిగాడు డప్పు వాయించడం బాగనే నేర్సుకున్నడు. వానికి మంచిశెబ్బర చెప్పి, వాడిని ఊర్లె ఇంటికాన్నే ఇడ్సివెట్టి.. మొగుడు పెండ్లాలిద్దరు మిర్చి ఏరనీకి గుంటూరు వొయింరు. వాళ్లు గుంటూరు వోయిన పది దినాలు గడ్సినంక.. వాళ్ల ఆరోగ్యం చెడిందని, వాంతులు, విరేచనాలతో గవర్నమెంటు దవాకానల చేరినట్లు ఫోనొచ్చింది. గుంటూరు బోవటానికి డబ్బుల్లేక మట్టిగాడు ఏడ్సుకుంట కూకుంటే.. ఊరోళ్లు తలా కాసిన్ని డబ్బులు జమ జేసిచ్చి, వాన్ని గుంటూరు తోలింరు.

వాడు గుంటూరు చేరుకొని దవాకానకు ఎల్లేటప్పటికే.. వాడి అయ్యా అమ్మ ఇద్దరూ సచ్చివొయింరని శవాల గదికి తీస్కవొయి సూపిచ్చింరు దవాఖాన సిబ్బంది. పానం లేకుండా ఉత్త కట్టెపుల్లల్లెక్క పడి ఉన్న అమ్మను, అయ్యను సూసి తట్టుకోలేక మీదవడి బోరున ఏడుస్తూంటే.. వాడిని సంజాయించి దవాఖానల ఏడ్వకూడదని, శవాలు చెడిపోకముందే ఊరికి తీస్కపొమ్మని కూడా చెప్పింరు. వానితాన డబ్బుల్లేవు. ఒకేల ఊర్లెకు తెచ్చినా.. ఊర్లె సుట్టపోళ్లు లేరు. తమ కులపోళ్లు లేరు. యాడ బొందవెట్టాల్నో ఎర్కలేదు. ఈ యవ్వారమంతా ఎట్టయితదో అర్థంకాక, ఏడ్సి ఏడ్సి ఆఖర్కి శవాలను దవాకానల్నే ఇడ్సివెట్టి.. అక్కడ ఎవల్లకు చెప్పకుండ ఏడ్సుకుంటా ఊరికి తిరిగొచ్చిండు.

ఇది జరిగి గూడా శానేండ్లు గడ్సివోయింది. ఇప్పుడు ఊర్లె అసలు మాదిగ కులపోల్లే లేరు. వాళ్లు సచ్చిందీ లేదు.. బొందవెట్టిందీ లేదు. అంతకుముందు ఏం జరిగిందో ఎవల్లకు తెల్వదు.

***

'ఇప్పుడు మట్టిగాని శవం ఎట్టా లేవాలె?'..

ఎంత ఆలోచించినా గోరేమియా బుర్రకు అర్థమైతలేదు. ఊర్లె పెద్ద మనుషుల్ని అడిగితేనే ఓదారి దొరుకుద్దనుకొని.. సర్పంచుకు, మాజీ సర్పంచుకు, ఎంపీటీసీలకు, ఇంకొందరు పెద్దమనుషులకు ఫోన్జేసి చెప్పిండు. వాళ్లు గూడ బాధవడి..

'గ్రామపంచాయితీ దగ్గరికి రా.. మాట్లాడ్దాం' అన్నరు.

కాళ్లల్ల తిర్గుతున్న కుక్కపిల్లను గుడిసె లోపట్కి తోలి.. బయటంగ బేడంవెట్టి, గ్రామపంచాయితీ కాడికొచ్చి కూకుండు గోరేమియా. వాన ముసురు తగ్గినట్టే తగ్గి మల్ల సన్న జల్లుగా ముసురుకుంటంది.

కొద్దిసేపయినంక సర్పంచ్ గొల్ల కిట్టన్న, మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డి పటేల్, వార్డు మెంబరు సూరమ్మ, వాళ్ల ఎన్కంగనే ఎంపీటీసీ దూకుడు దుర్గయ్య, ఇంకొంతమంది పెద్ద మనుషులు వచ్చింరు. మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డి పటేల్ అందరి వైపు ఓపాలి సూసి..

'మనం ఇప్పుడు ఇక్కడ కూడిన సంగతి అందరికీ ఎర్కయిందే. ఇయ్యాల మన డప్పు మట్టిగాడు సచ్చిపోయి.. మనూల్లే డప్పు కొట్టేటోడు లేకుండ జేసిండు. వాని సావు మనందరికీ శానా బాధాకరం. వాడి కాలం తీరింది.. వాడు వోయిండు. ఇప్పుడు జరగాల్సింది మన చేతులల్ల ఉంది. వాడు సొంతోడంటూ ఎవ్వరూ లేని ఒంటరోడు. ఏంజేద్దాం? ఎట్టా జేద్దామంటరు?' అని చెప్పి, అక్కడున్నోల్లందరి వైపు సూసిండు.

వాల్లెవరూ పెదాలిప్పలే.

'ఎవల్లేం మాట్లాడ్తలేరు గదా!' అనుకొని..

'ఇంగ నువ్వే చెప్పు గోరేమియా.. ఏం చేద్దమంటవ్?' అనడిగిండు ఎల్లారెడ్డి పటేల్.

'పెద్దోళ్లు.. అన్నీ ఎర్కయినోల్లు. మీరందరున్నంక నేను చెప్పేది ఏముంటది పటేల్ సాబ్! మట్టిగాడు మనూర్లనే పుట్టిండు. ఊరిని నమ్ముకొనే బతికిండు. ఈడనే సచ్చిండు. వాని శవాన్ని పాతివెట్టనీకీ, మన హిందువుల బొందల గడ్డల్నే జరంత సోటు సూపిస్తే వాన్నక్కడే బొందవెడ్దాం. గీ సంగతే చెబ్దామనీ.. మిమ్ములను కూడేసిన' అన్నడు గోరేమియా.

ఆడ కూకున్నోల్లందరూ ఒకళ్ల మొకాల్లొకరు సూస్కున్నరు.

'నీ దగ్గర దాచేదేముంది గోరేమియా! జరిగిన సంగతి పొద్దుగాల్నే ఊర్లే అందరి చెవులల్ల ఏసిన. వాల్లేమన్నరంటే.. 'ఎన్కటి కాలంకెల్లి గూడ.. మాదిగల శవాలను హిందువుల బొందలగడ్డల బొంద వెట్టిన దాఖలాల్లేవు. ఇప్పుడు గూడ అదే పద్ధతిల నడ్సుకుంటెనే మంచిగుంటది' అని అంటుంరు. ఏంజేద్దామంటవ్?' అన్నడు ఎల్లారెడ్డి పటేల్.

'అదేంది పటేలా అట్లంటరు? వాడు ఊర్లే శుభకార్యాలకు, ఊరుమ్మడి పండుగలకు, చావులకు, జాతర్లకు డప్పు కొట్టుకుంటనే బతికిండు. వాడు మాదిగ కులపోడనే గని.. హిందువే కదా! జాతర్ల దేవుని ఊరేగింపులో వాడు డప్పుకొడ్తే దేవునికి లేని అంటు.. బొందలగడ్డల మట్టికుంటదా! నాకెర్కలేక అడుగుతా? మట్టిగాడు మాతో కల్సి తిరిగేటోడెగని, ఏనాడైనా మాతో మసీదుకు వచ్చి నమాజు సద్విండా, చర్చిలల్లకు వోయి కిరిస్తానల్ల కల్సిండా? వాడు అందరు హిందువుల్లాగనే బతికిండు. వాడు నూరుబాల్ల హిందువే పటేల! అందరూ మంచి మనసుతో జర ఆలోచించురి' అన్నడు గోరేమియా.

అప్పటిదాంక జరుగుతున్న చర్చనంతా ఇంటున్న సర్పంచ్ కిట్టన్న.. మాటల్ని పక్కతోవ వట్టిస్తూ..

'మన మట్టిగాడు సచ్చి, వాడి ఆత్మ ఏడుందోగని.. వానోతిగా డప్పు కట్టేటోడు ఈ సుట్టుపక్కల్నే ఇంకెవ్వరూ లేరంటే నమ్మురి. మా గొల్లోల్ల ఈర్ల పండగనాడు, పిల్లలకు పెద్దలకూ ఉషారంతా వాని డప్పు మోతదే. రేపొచ్చే ఈర్ల పండక్కి డప్పు కొట్టేటోన్ని యాడంగ తోల్కరావాల్నో ఏమో?' అన్నడు.

'ఒక ఈర్ల పండక్కే కాదు.. పీర్ల పండక్కి మాత్రం? వాడి డప్పు మోగందే పీర్లు అలావ గుండంల దుంకేటియా? వాడు పులి దెబ్బ కొట్టాలె, మా గోరేమియా కాక పులి చిందేసి దుంకుతూంటే సూడాలే.. రెండు కండ్లు సరివొయ్యేటియా? అస్వంటిది మల్ల సూత్తమా మనం?' అన్నడు దుర్గయ్య.

ఇస్వంటి మీటింగులల్ల మద్దెన వచ్చి మద్దెన దూరే సాలె సాంబయ్య, వచ్చి చర్చల దూరనే దూరిండు.

'మీకెర్కనా? ఇయ్యాల మంగళారం. మట్టిగాడు గీ పొద్దున్నే సచ్చిండు. ఉన్న ఊర్లే మంగళారం పీనుగ లేస్తే, మల్లొచ్చే మంగళారానికల్లా మారు పీనుగ లేస్తదని ఊర్లే జనం భయంతో గజగజ వణికి సస్తుంరు' అన్నడు.

'మరేం జేద్దమంటవ్ సాంబయ్య? సచ్చినోన్ని లేపి రెండు చెంపలు వాయించి.. హౌలేగా! నీకేమైనా బుద్ధి గ్యానం ఉందా? ఇయ్యాల మంగళారమని ఎర్కలేదా? ఓ సెలవు దినం సూస్కొని సరదాగా సావకవొయినవా అన్చెప్దమా? పాపం వాడు ఒంటరోడై తాగితాగీ, యాలకింత తినీతినక పేగులెండి.. కార్జెం చెడి.. వాడి సావు వాడు సచ్చిండు. ఇంకా నయం ఏ కరోనా వచ్చో సచ్చుంటే.. ఈపాటికే ఊరు ఊరంత ఎవరి కొంపల్లో వాళ్లు, ఎప్పుడు సస్తమో తెల్వక బిక్కుబిక్కుమన్కుంట కోరంటైన్ల దినాలు లెక్కవెట్కుంట ఉండాల్సి వచ్చేది నీకెర్కనా?' అన్నడు ఎల్లారెడ్డి పటేల్.

సాలె సాంబయ్య చిన్నబుచ్చుకొని అక్కడంగ జారుకున్నడు.

ఎవల్లేం మాటాడ్తుంరో సూస్కుంట కూకున్న వార్డు మెంబర్ సూరమ్మ మాటందుకుంది.

'డప్పు మట్టయ్య ఎంత మంచోడంటే.. ఎవరైనా పల్కరిస్తేనే పల్కేటోడు. తనకంటే చిన్నోల్లని గూడ 'అక్కా.. అన్నా' అని, పెద్దోల్లను 'పెద్దమ్మా పెద్దయ్య, చిన్నమ్మా.. కాకయ్యా' అని నోరారా పిల్సేటోడు. ఏ చిన్న కార్యమైనా పిల్వంగనే వచ్చి డప్పు కొట్టి వోయేటోడు. పెట్టిందే తిని ఇచ్చినంతే తీస్కవోయేటోడు. తాగేటోడె గని ఎంత తాగినా మాట తూలి మాటాడేటోడు కాదు. పాపం.. చిన్న వయసుల్నే సచ్చిండు. ఎన్కట పెద్దోళ్లు అనేటోళ్లు.. మంచోల్లను దేవుడు జల్ది తీస్కవోతడని!' అంది మట్టిగాని యాదిల బాధవడ్తూ.

'అంతేనంటవా సూరమ్మా? అట్టయితే సర్పంచ్ కిట్టన్నకు అరవైయ్యేండ్లుంటయి. నాకేమో ఇంకో ఐదేండ్లు ఎక్కువుంటయి. ఈ లెక్కన మేం వానికంటే పెద్దోల్లం. మేమింకా సావలేదు కాబట్టి.. మేం పాపులం, దుష్టులం, దుర్మార్గులం అన్నట్లేనా సూరమ్మా?' అనడిగిండు ఎల్లారెడ్డి పటేల్ ఆమెను ఉడికించడానికి.

సూరమ్మ ఖంగుతిని..

'వాల్లో.. గిదేం పాపమల్ల? నేనొకటంటే ఇంకో అర్థం తీస్తరేందుల్లా! ఇదెక్కడి కతల్లా! సచ్చినోని గురించి మంచి మాటాడ్తే తప్పు వడ్తరేందుల్లా! వామ్మో ఇదెక్కడి సిత్రమల్లా! ఇంగ నే వోతున్నగని మీరే గోరేమియా అన్నకు ఏదో ఒకటి చెప్పి పంపుర్రి. ఇంటి కాడ బిడ్డా, అల్లుడు వచ్చి ఉన్నరు. నేవోతున్న!' అనుకుంట లేసి ఎల్లివోయింది సూరమ్మ.

'ఇంక నువ్వు చెప్పు దుర్గయ్య.. ఏం జేద్దమంటవ్?' అడిగిండు ఎల్లారెడ్డి పటేల్.

'నేను రెండు మార్గాలు చెప్త పటేల. ఒకటి మాదిగ్గూడెంల ఎవ్వరూ కాపురముంటలేరు కాబట్టి, మట్టిగాని శవాన్ని వాని గుడిసెల్నే పెట్టి దహనం జేస్తే సరిపోద్ది. లేకపోతే.. రెండో తరీక ఏందంటే, వాని గుడిసెల్నే బొంద తవ్వి పూడ్సిపెడ్తే కిస్స ఖతమైతది. నాకు తోచింది నేను చెప్పిన. పెద్దోళ్లు మంచీ చెడూ ఆలోచించడం మీ వంతు' అన్నడు ఎంపీటీసీ దుర్గయ్య.

'నీమాట కాదంటున్నందుకు ఏమనుకోకు దుర్గయ్య. మట్టిగాన్ని వాని గుడిసెల్నే దహనం చేయడం అనేది మహా పాపం, అపరాధం కూడా. రెండోది.. వాని గుడిసెల్నే పాతి పెట్టడమంటే.. సర్పంచ్ చెప్తెనే బాగుంటది. నూ చెప్పు సర్పంచు. నీ అభిప్రాయం ఏంది?' అనడిగిండు ఎల్లారెడ్డి పటేల్.

'లోతుగా ఆలోచిస్తే వాని గుడిసెల్నే బొందవెట్టుడు ఊరికి మంచిది కాదన్పిస్తుంది. ఎందుకంటే.. మనూరి పిల్లలు మాదిగ్గూడెం పక్క బాటలంగనే హైస్కూలు సదువులకు పక్కూరికి బోవాల. గతంలో మాదిగ్గూడెపోల్లకు చేతబడి వస్తదని ఎవరో పుకారు లేవదీస్తే, గూడెపోల్లను సావగొట్టి తరిమేసిన చరిత్ర మనూరోల్లకుంది. ఇంగ ఇప్పుడు మట్టిగాని శవాన్ని వాని గుడిసెల్నె బొందవెడ్తే.. వాడు దెయ్యమై తిరుగుతుండని ఎవరైన పుకారు లేవదీస్తే.. ఆ బాటంగా పిలగాళ్లు బడికి వోతరా? ఆల్ల సద్వులు చెక్క బండలైతయి. అట్టా వద్దుగని, నేనో మాట చెప్త ఇను గోరేమియా!'.. అని గోరేమియా వైపు సూసిండు సర్పంచ్ కిట్టన్న.

'ఇంటనే ఉన్నగని చెప్పే!' అన్నడు గోరేమియా.

'మన పక్కూరు సకినాలపల్లిలో మాదిగ కులపోళ్లు శానామంది ఉన్నరు. ఎట్టనో ఓగట్టా.. మట్టిగాని శవాన్ని గా ఊరికి తీస్కపోర్రి. అక్కడున్నోళ్లతో మాట్టాడి ఈసారికి పని కానియ్యురి!' అన్నడు సర్పంచ్ కిట్టన్న.

'అబ్బో.. మా గొప్పగ చెప్తివి కిట్టన్న. మక్కెలిరగ దన్నించుకునే సలహా మంచిగనే ఇస్తవ్ గద! ఒక ఊరి శవాన్ని, ఇంకో ఊరి పొలిమేర దాటి వచ్చి బొందవెడ్తే.. ఆ ఊరి జనం ఊకుంటరనుకుంటున్నవా? బడ్తెలు వట్టుకొని ఉరికించి కొడ్తరు ఎర్కేనా?' అన్నడు ఎల్లారెడ్డి పటేల్.

'ఓరెక్క అట్టనా? గా సంగతి నాకెర్కలే పటేల. ఇంగ ఏదో ఒకటి గోరేమియాకు మీరే చెప్పి పంపుర్రి!' అనిజెప్పి.. జేబులంగ సెల్‌ఫోన్ తీసి, ఎవరికో కలిపి మాట్లాడుకుంటా అక్కడంగ ఎల్లిపోయిండు సర్పంచ్ కిట్టన్న.

తన సలహాను పట్టించుకోలేదని, ముఖం మాడ్చుకొని అంతకు ముందుగాల్నే ఎల్లివోయిండు ఎంపీటీసీ దుర్గయ్య.

'సూస్తున్నవ్ గదా గోరేమియా! మనూరోళ్ల తమాషాలు. సరే పగటేలప్పుడు ఇంకోసారి అందర్నీ అడిగి సూద్దాం.. ఏమంటరో? వాల్లేమన్నది నీకు ఫోన్ జేసి చెప్త సరేనా! నూ గూడ ఇంటికి వోయి కాసింత తిను పో!' అని చెప్పి, ఎల్లారెడ్డి పటేల్ గూడ ఎల్లివోయిండు.

అక్కడ గోరేమియా ఒక్కడే మిగిలిండు. సమస్య మొదటికొచ్చింది. అయినా ఎల్లారెడ్డి పటేల్, ఊరోల్లని ఇంకోపాలి అడిగి ఫోన్ చేస్తనన్నడనే ఆశ. 'ఏమో చెప్పలేం.. పెద్ద మనుషులందరు ఒప్పుకొని, తలా ఓ చెయ్యేసి వాని అంతిమ సంస్కారం చేస్తరేమో!' అనుకున్నడు గోరేమియా. మల్ల మట్టిగాడు యాదికొచ్చిండు. ఎప్పుడో తెల్లారగట్ట పానమొదిలిన మట్టిగాని శవాన్ని తానం చేపించడం ఆలిస్యమయి కుళ్లిపోతే? అట్లా కాకూడదు. ముందుగాల్నే వాడికి తానం చేపించాలే అనుకొని.. ఆడి నుంచి లేసి గూడెం బాటవట్టిండు గోరేమియా.

***

ఊరికి – గూడేనికి మద్దిన బాటకానుకొని చింత తోపుంటది. గోరేమియా గా చింత తోపు కాడికి రాంగనే కాళ్లు ఆగినయి. అక్కడున్న గూని చింతచెట్టు మీదికి చూపులు వోయినయి. గా చింతచెట్టే మట్టిగాన్ని తనను దోస్తులను చేసింది అనుకున్నడు.

అప్పుడు గోరేమియాకు పన్నెండేండ్లుంటయి. ఊరి పిలగాల్లతో కల్సి చిగురు కోయనీకి గూని చింత చెట్టెక్కిండు గోరేమియా. గూని చెట్టని పేరేగని, బాగా ఎత్తుగుంటది. గోరేమియా చిగురు తెంపే ధ్యాసలో, చిటారు కొమ్మలకు వోయిండు. అది జరంత తెగి పెడుసుబారి ఉంది. సూస్కోకుండా దాని మీద కాలువెట్టిండు. అంతే.. అది పుటుక్కుమని ఇరిగింది. పదిహేను అడుగుల ఎత్తునుంచి దబ్బుమని పడిపోయి, సోయి తప్పిండు గోరేమియా. అది సూసి ఆడున్న పిల్లలందరూ భయంతో ఇండ్లకు పారిపోయింరు.

అప్పుడే బాటెమ్మటి వోతున్న మట్టిగానికి, చెట్టుకింద సోయి తప్పి పడున్న గోరేమియా అగుపడ్డడు. వానికేదో అనుమానమొచ్చి దగ్గరికివోయి సూసిండు. ఎంటనే గోరేమియాను ఉప్పుబస్త లెక్క ఈపునేసుకొని వాల్లింటికి తీస్కవోయిండు. ఇంట్లే వాళ్ల నాయిన లేడు. వాళ్లమ్మ ఒక్కతే ఉంది. సోయి తప్పిన కొడుకును సూసి వాళ్లమ్మ ఏడ్వబట్టింది. ఆమె ఏడ్పు ఇని సుట్టుపక్కలున్నోళ్లు వచ్చింరు. అప్పటికే గోరేమియా కుడికాలు మోకాలి కింద జరంత వాపు వచ్చింది. వాళ్లలెవరో పసరు కట్టుకట్టే డాక్టర్ ఆచారి గారిని పిల్సుక రమ్మంటే.. మట్టిగాడే ఉరికివోయి ఆచారి గారిని పిల్సుకొచ్చిండు. ఆయన గోరేమియాను అటూఇటూ తిప్పి సూసి, ప్రమాదకరమైన దెబ్బలేమి తగల్లేదని, కుడికాలి మోకాలికింది బొక్క జరంత చిట్లిందని చెప్పి.. పసరుకట్టు కట్టి ఎల్లివోయిండు. గోరేమియా సక్కంగ నడ్వనీకి నాలుగు నెలలువట్టింది. అప్పటి నుంచే ఇద్దరికీ మంచి దోస్తీ కుదిరింది.

గోరేమియా దోస్తీ, వాళ్లమ్మ సూపించిన ప్రేమతోని.. అమ్మ, అయ్య సచ్చివోయిన బాధను గూడ మర్సివోయిండు మట్టయ్య.

గోరేమియాకు పాతికేండ్లప్పుడు, వాళ్ల చుట్టాలమ్మాయితో పెండ్లయ్యింది. మట్టిగాడు,

గోరేమియా కంటే మూడేళ్లు పెద్దోడు. అయినా లగ్గం జేస్కోలే. ఊర్లే పెద్ద మనుషులెవరైనా.. 'పెండ్లెప్పుడు జేస్కుంటవురా మట్టయ్యా?' అనడిగితే.. వేదాంతిలా నవ్వి ఊర్కునేటోడు.

గోరేమియాకు పెండ్లయిన రెండేండ్లకు ఆడపిల్ల పుట్టింది. ఆ పిల్ల తప్పటడుగులు ఏసేటప్పుడు ఏదో.. ఎర్కపట్టని జబ్బుతో గోరేమియా అమ్మా, నాయినలిద్దరూ ఏడాది తేడాతో సచ్చివోయింరు. అప్పటిదాంక 'అమ్మా' అంటూ చనువుగా అన్నం పెట్టించుకొని తిన్న మట్టిగాడు.. ఆమె సచ్చినంక అంత చనువుగా ఆ ఇంటికి వోయేటోడు కాదు.

గోరేమియా బిడ్డకు పద్దెనిమిదేండ్లు నిండంగనే పెండ్లి చేసి అత్తారింటికి పంపిండు.

ఇంటికొచ్చి తినిపోవడానికి మొఖమాటవడ్తున్న మట్టిగానితో.. 'ఎప్పటితీర్గనే ఇంటికొచ్చి తినిపో మట్టన్న!' అని గోరేమియా భార్యా భర్తలిద్దరు ఎన్నిసార్లు చెప్పినా.. 'వస్తతీ!' అనేటోడుగని పోక పోయేటోడు. ఊర్లే ఎవరు మందు తాపిస్తే వాళ్లతో మందు తాగి, యాళ్లకు తినీ తినక అట్లనే పడుకునేటోడు. అట్లా వాడి ఒంటరితనానికి మందు నిషాను తోడుజేస్కొని బతికిండు.

***

అట్లా ఆలోచించుకుంటనే మట్టిగాని గుడిసె కాడికొచ్చిండు గోరేమియా. తలుపు బేడెం తీసి లోపలికి వోయిండు. మట్టిగాని కుక్కపిల్ల గోరేమియాను సూడంగనే 'కూంయ్ కూంయ్' అన్కుంట కాళ్లల్లకొచ్చింది. దాని ఈపు నిమిరి గుడిసె మూలన కూకోవెట్టిండు.

అది బుద్ధిగ కూకుంది. కట్టెలపొయి రాజేసి నీల్ల బిందె వెట్టిండు. నీళ్లు మంచిగ కాగినంక నులక మంచంమ్మీదున్న మట్టిగాని కాయాన్ని అట్టనే మంచం మీదుంచి, తానం జేపించిండు.

మట్టిగాడు కోమాలకు వోయినప్పుడు.. వాడు బతకడం కష్టమని డాక్టర్ చెప్పింది యాదుంచుకొని, వానికి తెల్వకుండనే వాని శవ సంస్కారానికి కావల్సినయి అన్ని తెచ్చివెట్టిండు గోరేమియా. అందులంగనే కొత్త పొడిగుడ్డ తీసి సుబ్బరంగ తుడిసి, కొత్త బట్టసుట్టి కింద సాప మీద పడుకోవెట్టిండు. నుదుట పెద్ద కుంకుమ బొట్టు దిద్దిండు. రోజ్ వాటర్ సల్లిండు. కొత్తగ తెచ్చిన పూలదండ మెడలేసిండు. పెండ్లిగాని మట్టిగాన్ని పెండ్లికొడుకులా తయారుజేసిండు. గుడిసె సూరులంగా, సర్వేబార్లు గడెబొంగులు గుంజి పాడె తయారుజేసిండు. లేసి నిలబడి ఊపిరి పీల్చుకున్నడు గోరేమియా.

తిరిగి పాత ప్రశ్నలే పీకుతున్నయి దిమాక్ల. 'పాడె మోస్కపోయేదెవలు? పాతివెట్టేదెక్కడ?'..

మల్లొక్కపాలి ఊరోళ్లను అడిగి సూద్దమన్న ఎల్లారెడ్డి పటేల్‌కు ఫోన్ కలిపిండు. 'స్విచ్ఛాఫ్' వచ్చింది. ఇంకొందరికి కలిపి సూసిండు. రింగ్ అయితుంది గని ఫోన్ ఎత్తి మాట్లాడ్తలేరు. అర్థమైంది గోరేమియాకు. 'గిదేం ఊరు? ఈల్లేం మనుషులు?' అనుకున్నడు. ఏం తోస్తలేదు. గుడిసెలంగ బయటికొచ్చిండు. వాన తుంపర తగ్గిందిగని సలివెడ్తాంది.. లోపటంగా ఉక్కవోసి వల్లు చిటపటలాడ్తుంది. టైం రెండు గావస్తుంది. 'ఇంటికివోయి తానం జెయ్యాల.. ముందుగాల!' అనుకున్నడు. గుడిసె బయటంగ బేడం వెట్టి ఇంటికొచ్చిండు గోరేమియా.

నీరసంగ కూకున్న భర్తను సూసి..

'ఊర్లే పెద్ద మనుషుల్ని అడిగి సూస్తనంటివి గదా.. అడిగినవా? ఏమన్నరు?' అన్నది గోరేమియా భార్య ఖతీజ.

'హిందువుల బొందలగడ్డల మాదిగోల్ల శవాలను బొందవెట్టే ఆచారం లేదంట. ఊరోల్లెవరూ ఒప్పుకుంటలేరు..' అన్నడు గోరేమియా.

భర్త మాటలల్ల బాధను కనిపెట్టింది ఖతీజ.

'బాధపడకు. నీ గుబులు అర్థమైతుందిగని.. అక్కడ బొందవెట్టనీకుంటే, ఇంత పెద్ద ఊర్లే.. మట్టన్న శవాన్ని బొందవెట్టనీకి సోటే దొర్కదా ఏంది?' అన్నది.

'ఖాళీ సోటు యాడుంది? ఊరి సుట్టూ రైతుల పట్టా భూములు, పంట పొలాలేనాయే! ఎవరి భూమిల బొందవెడ్తే ఎవరూకుంటరు చెప్పు?' అన్నడు గోరేమియా ముఖం యాలాడేసి.

'ఎవల్ల భూమిల ఎందుకు పాతివెట్టాలే! వాల్లందరికున్నట్లే.. మనక్కూడ రెండెకరాల చెలక భూమి ఉంది కదా! మన చెలకల్నే బొందవెట్టు. మట్టన్న దెయ్యమై మనల్ని పీక్కు తింటడా? తింటే తిన్నీ. అందరం ఏదో ఒకరోజు పోయేటోల్లమే కదా!' అన్నది ఖతీజ.

భార్య సలహాతో గోరేమియాకు ధైర్యమొచ్చింది. మల్లంతల్నే ముఖం పాలివోయింది.

భర్త ముఖంల వచ్చిన మార్పుల్ని గమనించిన ఖతీజ..

'మల్లేమైంది.. అట్టా దిగాలు వడ్తివి?' అనడిగింది.

'నూ చెప్పింది బాగనే ఉందిగని.. మన చెలక ఊరికి కిలోమీటర్ దూరంల ఉంటది. అంత దూరం పాడెను తీస్కబోవుడెట్టా?' అన్నడు.

'ఎవల్లనన్నా అడిగి సూడు. వత్తరేమో!'.

'అడిగి సూసిన. మందు వోయిస్త, డబ్బులిస్తనన్న.. ఏమన్నరో ఎర్కనా! 'మాదిగోని శవాన్ని మోయ.. మంచి ముత్యాలిచ్చినా ఎవల్లు రారు' అన్నరు. నాకు చాలా బాధేసింది ఖతీజ. ఈల్లేం మనుషులో? ఈల్లయి ఏం నమ్మకాలో? పట్టణాలు, నగరాలే కాస్త నయం ఇస్వంటి ఇషయాల్ల.. ఏ పట్టింపులుండవు. పల్లెటూర్లల్నే గీ అర్థం పర్థం లేని పట్టింపులు' అన్నడు గోరేమియా.

'పోనీతీ.. ఎవళ్లు రాట్లేరని మట్టన్న శవాన్ని అట్టనే వెట్కోని కూకుంటమా ఏంది?'.

ఖతీజ దగ్గర ఏదో మార్గం లేకవోతె అట్ల మాట్లాడదనుకొని..

'నేనేం జెయ్యాల్నో తోస్తలేదు ఖతీజ' అన్నడు దిగాలుగా ఆమె వైపే చూస్తూ.

మట్టయ్య పాడెను తమ చెల్కదాంక ఎట్ల తీస్కబోవాలో ఇవరంగ చెప్పింది ఖతీజ.

భార్య చెప్పింది ఇన్నంక.. రాత్రికెల్లి మోస్తున్న బరువేదో దిగివోయినట్లయింది. కొత్త హుషారొచ్చింది గోరేమియాకు. భార్య ఖతీజకు చాయ్ వోయమని చెప్పి, పలుగు, పార టెంకె సర్దుకున్నడు. ఇంతల్నే భార్య చాయ్ తెచ్చిస్తే తాగిండు. గోరేమియాకు టీవీఎస్ బండి ఉంది గని, పెట్రోలు ధరలు పెరిగినంక మండికివోయి కూరగాయలు తేనీకి మాత్రమే వాడుతుండే. ఇప్పుడు.. బొంద తవ్వనీకి సర్దుకున్న పనిముట్లను మోపెడ్ పైన వెట్టుకొని చెల్క కాడికి వోయిండు.

వాన ముసురుకు నేల తడిసి నాని ఉంటాన.. బొంద తవ్వుడు రెండు గంటలల్ల అయిపుచ్చుకొని ఇంటికొచ్చిండు గోరేమియా.

ఖతీజ వేడి నీళ్లు తోడి వెడ్తే తానం జేసిండు. పాత ట్రంకు పెట్టలంగ తన పెండ్లికి కుట్టించుకున్న బులుగు రంగు షేర్వానీ పైజామా తీసి తొడుక్కున్నడు. ఎర్రటి పున్నా టోపీ పెట్టుకున్నడు. దుమ్ము పట్టిన బూట్లను దులిపి తొడుక్కొని నవాబు లెక్క తయారైండు.

అప్పటికే తాము కూరగాయలమ్మే నాలుగ్గీరల బండిని సుబ్బరంగ కడిగి, పూలదండలు కట్టి సింగారించి వెట్టింది ఖతీజ.

పది బార్ల ప్లాస్టిక్ తాడు, క్యాన్ల నీళ్లు నింపి బండి మీద వెట్టి గోరేమియాతో బండి తీస్కవొమ్మని చెప్పింది.

గోరేమియా బండి నెట్టుకుంటా మట్టిగాని గుడిసెకాడికొచ్చి బేడం దీసిండు. ముందుగాల్నే తయారుజేసి పెట్టిన పాడెను పట్టుకొచ్చి నాలుగ్గీరల బండి మీదవెట్టిండు. నౌశి అలకంగా ఉన్న మట్టిగాని కాయాన్ని ఎత్తుకొచ్చి పాడెమీద పడుకోవెట్టిడు. ఎత్తుపల్లాల్లో పాడె పడిపోకుండా తాళ్లతో కట్టిండు. గుడిసె లోపటంగ జమ్ము పీకి మంటవెట్టిండు. మట్టిగాని డప్పు పట్కొచ్చి.. బాగ 'ఖణ్ ఖణ్' అని మోగేటట్టు కాపిండు. చిడతలు దీస్కున్నడు. కుక్కపిల్లను బయటికి తోలి గుడిసె బయటంగ బేడం వెట్టిండు. భార్య ఖతీజ ఇచ్చిన ప్లాస్టిక్ తాడును ఒక కొసను బండికి కట్టి, మరో కొసను తన నడుముకు కట్టుకున్నడు. ఎనకంగ కుక్కపిల్ల నడుస్తుంటే, మట్టిగాని దోస్తీల నేర్చుకున్న.. 'ఉల్టాబాజా' వాయించుకుంట నడి ఊర్లంగ మట్టిగాని శవయాత్ర దీసిండు. గోరేమియా వాళ్ల చెలకకు బోవాలంటే ఊర్లంగనే బోవాలె. ఏరే బాట లేదు.

షేర్వానీ పైజామా, నెత్తిన ఎర్రని పున్నావాలా రూమీ టోపి, కాళ్లకు మహారాజా బూట్లేసుకొని.. మట్టిగాని శవమున్న నాలుగ్గీరల బండిని నడుముకు కట్టుకొని ఊరేగింపుగా తీస్కవోతున్న గోరేమియాను సిత్రంగ సూస్తుంరు ఊర్లే జనం. కొందరు భయపడి లోపటంగ తలుపులేస్కొని తలుపు సందులల్లంగ సూడవట్టింరు. ఆల్లను గమనిస్తూనే అట్టా ఊరి బయటిదాంక వచ్చి, నడుముకు బండికి కట్టిన తాడు ఇప్పి, బండిని నెట్టుకుంటా తమ చెలక కాడికొచ్చిండు.

బట్టలిప్పి లుంగీ కట్టుకున్నడు. బొందను తవ్వేటప్పుడే వెడల్పుగా మెట్లుగా చెక్కిండు. పాడెకు బండికి కట్టిన తాళ్లు ఇప్పి, మట్టిగాని కాయాన్ని చేతులల్ల అడ్డంగా ఎత్తుకొని మెల్లిగ బొందలోనికి దింపిండు. ఆఖరిసారిగా దోస్తు ముఖం సూసిండు. గోరేమియా కండ్లల్ల రెండు కన్నీటి బొట్లు మట్టిగాని ముఖం మీదవడ్డయి. ఇంకా పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకొంటా.. మట్టిగాని ముఖం మీద బట్ట కప్పి కట్టేసిండు. వాడు బతికినన్నాల్లు ఆధారం చేసుకొని బతికిన డప్పును, చిడతల్ని వాని తల పక్కనేవెట్టి, ముందుగాల దోశిల్లతోని మట్టిపెడ్డలేసిండు. అటెన్క పారతో మట్టి లాగి బొంద పూడ్సిండు. క్యాన్ల తెచ్చిన నీళ్లతో బొందను అలికిండు.

కాళ్లు, చేతులు, ముఖం కడుక్కొని.. లుంగి ఇప్పి బట్టలేస్కుండు. టోపి వెట్టుకుండు. ఆకాశంకెల్లి రెండు దోశిల్లు సాచి, తల పైకెత్తి..

'యా అల్లాహ్ దయామయుడా! అపార కృపాశీలుడా, నా దోస్తు.. ఏ కులపోడో, ఏ మతపోడో నీకెర్కే! వాడు అందరిలాగే పుట్టిండు. బతికినన్నాల్లు పది మందికోసమే బతికిండు. వాడు నీవు సృష్టించిన ఈ మానవ సమూహంలోని మనిషే! తెలిసీ తెలియక వాడు ఏవైనా తప్పులు చేసి ఉంటే

మాఫ్ జెయి.. సకల లోక రక్షకుడా! చావు పుట్టుకల జన్నత్.. దోజఖ్‌ల నిర్ణయాధికారివి నువ్వు. ప్రేమమయుడా! అనంత దయాశీలుడా.. యా అల్లాహ్! నా దోస్తు ఉత్త అమాయకుడు. వానికి జన్నత్ ప్రాప్తింపజెయ్యి' అని అల్లాహ్‌ను ప్రార్థించుకొని.. రెండు అరిచేతులను ముఖం పైన తిప్పుకున్నడు.

అక్కడినుంచి కదిలి తిరిగి బండి నెట్టుకుంటూ.. భారమైన మనసుతో ఇంటి దారివట్టిండు. పది అడుగులు ఏసినంక ఏదో మరిచినట్లు అనిపించి ఎనక్కి తిరిగి సూసిండు.

మట్టిగాని కుక్కపిల్ల వాని బొందకాన్నే కూకొని.. 'కుంయ్.. కుంయ్..' అంటున్నది. దానినట్లా సూడంగనే గోరేమియా కండ్లు చెమర్చినయి. దాని దగ్గరికి వోయి.. దాన్నెత్తుకొచ్చి బండిమీద కూకోవెట్టుకొని బండి నెట్టుకుంట ఊరి బాట వట్టిండు. కుక్కపిల్ల మట్టిగాని బొంద కనుమరుగయ్యేంతవరకు అటువైపు సూస్తూనే ఉంది. 'ఈ జాతికున్నంత ఇస్వాసంలో ఈసమెత్తయినా మనిషిజాతికుంటే ఎంత బాగుండు!' అనుకుంట ఊళ్లెకొచ్చిండు.

ఊళ్లె ఎదురువడ్డ ప్రతి మనిషి గోరేమియాను సూసి భయంతోనో, సిగ్గుతోనో.. తలలు దించుకొని వోతుంరు. గోరేమియా ఒక్కడే మనిషిలా తలెత్తుకొని తమ ఇంటి వైపు అడుగులేసుకుంటూ...!

***

జన్నత్ – స్వర్గం

దోజఖ్ – నరకం

ఉల్టాబాజా – తిరగల డప్పు, చావు డప్పు.

***

సయ్యద్ గఫార్ స్వస్థలం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. 'పంచాయతీ రాజ్ లీడర్' స్థానిక సంస్థల విశ్లేషణ మాస పత్రికను ఎనిమిదేళ్లు నడిపించారు. స్టేజీ నాటకాల్లో నటన, దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. 1973 నుంచీ రచనా వ్యాసంగంలో ఉన్నారు. ఈయన రాసిన మొదటి కథ.. 'పాపం పండిన రాత్రి'. 2018లో 'జనన వాంగ్మూలం' కవితా సంపుటిని వెలువరించారు. నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజా గ్రంథాలయం నిర్వహించిన కథల పోటీల్లో.. ఖుర్బానీ (2020), నషా (2021), ఉల్టాబాజా (2022) కథలకు ప్రత్యేక బహుమతులు దక్కించుకున్నారు. తెలుగు నాటక కళా పరిషత్తు వైజాగ్ వారు నిర్వహించిన తెలుగు కథా, నాటక పోటీల్లో 'మౌనధ్వని' నాటికకు ప్రత్యేక బహుమతి లభించింది. నవతెలంగాణ పత్రిక నిర్వహించిన బండారు అచ్చమాంబ స్మారక కథలపోటీలో 'హంస' కథకు మొదటి బహుమతి వచ్చింది. ఈ కథను 'హంస' పేరుతో స్వీయ దర్శకత్వంలో లఘుచిత్రంగా నిర్మించారు. 'ఖుర్బానీ' కథల సంపుటి, 'మౌనధ్వని' నాటికను త్వరలోనే పుస్తకం రూపంలో తీసుకురానున్నారు.

Katha PART 1_Layout 1 6/29/2023 2:38 PM Page 80

# పడగ నీడ



**సయ్యద్ సలీం,**
**95886 30243**

ఓ చేతిలో సుత్తి, మరో చేతిలో శానం పట్టుకుని.. గొయ్యిలోకి దిగడానికి తయారుగా నిలబడి ఉన్న పదేళ్ల తన కొడుకు శీను వైపు దిగులుగా చూస్తూ..

'జాగర్త బాబూ!' అన్నది అచ్చమ్మ. వాడు మెత్తగా నవ్వుతూ..

'రోజూ ఇదే మాట.. ఎందుకమ్మా బయపడ్తావు? నేను జాగర్తగానే ఉంటాలే!' అన్నాడు. మొహం మీద పడుతున్న ఎండకు వాడి మొహం మెరుస్తున్న బూడిద రంగు అబ్రకపు పలకలా కనిపించింది.

వాడి పక్కనే నిలబడి ఉన్న పన్నెండేళ్ల ఎంకడి చేతిలో కూడా అవే పనిముట్లు ఉన్నాయి. వాటితోపాటు ప్లాస్టిక్ బుట్ట కూడా ఉంది.

'మా అమ్మ కూడా ఇంతేరా. ఇంటినుంచి బయల్దేరేముందే వంద జాగర్తలు చెప్తుంది తెలుసా!' అన్నాడు.

'పిల్లల మీద తల్లికుండే కడుపు తీపి మీకర్థం కాదులే! ఆ మాయదారి అబ్రకం కోసం నువ్వూ, శీనుగాడు గొయ్యిలోకి దిగిన ఛణం నుంచి బైటికొచ్చేవరకు గుండె దడదడలాడ్తూనే ఉంటుంది తెలుసా?' అన్నది వాడి అమ్మ మంగమ్మ.

'మాకేం కాదులేమ్మా!' అంటూ ఎంకడు గొయ్యిలోకి మెల్లగా దిగి, శీనుకు చేయందించి దింపుకొన్నాడు.

ఇద్దరూ జాగ్రత్తగా లోపలికి దిగసాగారు. గొయ్యిలోకి కిందికి దిగేకొద్దీ చీకటి నీటి ఊటలా ఊరసాగింది.

'లోతుకు తవ్వింది చాలు. ఇక పక్కలనుంచి తవ్వుదాం!' అన్నాడు ఎంకడు.

ఇద్దరూ తమ చేతుల్లో ఉన్న పనిముట్లతో అభ్రకం కలిసిన రాళ్లను పెకిలించి, ప్లాస్టిక్ బుట్టలో వేయసాగారు. బుట్ట నిండగానే..

'నేను పైకెళ్లి వీటిని ఇచ్చొస్తాను' అన్నాడు ఎంకడు. రాళ్లతో నిండి ఉన్న బుట్టను నెత్తిమీద మోసుకుంటూ పైకితెచ్చి వేశాడు. మళ్లీ వెంటనే కలుగులోకి ఎలుక దూరినట్టు.. ఆ బిలంలోకి దూరి మాయమైపోయాడు.

అచ్చమ్మ, మంగమ్మ ఆ రాళ్లలోంచి అభ్రకపు ముక్కల్ని వేరు చేసి తమ పక్కన పెట్టుకున్న ప్లాస్టిక్ బుట్టలో వేయసాగారు.

మధ్యాహ్నం దాటింది. ఎండ తెల్లటి అభ్రకపు పొరలా నేలంతా పరుచుకుని, ఎర్రటి నిప్పులా కాలుస్తున్నది. భూమి తన కుహరంలో దాచుకున్న ఖనిజాల్ని తవ్వి తీసే గని కార్మికుల్లా పనిచేస్తున్న శీను, ఎంకడు అప్పటికే స్వేద నదుల్లా మారిపోయారు.

'ఆకలేస్తంది. బువ్వ తిని కొద్దిసేపు కూసుంటే గానీ పనిచేసే ఓపిక రాదు' అన్నాడు ఎంకడు.

రెండు మట్టి రంగు కుందేళ్లు బొరియలోంచి బైటికొస్తున్నట్టు ఇద్దరూ బైటికొచ్చి చేతులు కడుక్కని అన్నాల కోసం కూర్చున్నారు. అచ్చమ్మ శీను కంచంలో అన్నం, గోంగూర పచ్చడి వడ్డించాక.. వాడు తింటున్నప్పుడు గోరింటాకు పూసినట్టు ఎర్రగా కందిన వాడి అరచేతుల వైపు చూసి పక్కకు తిరిగి కళ్లొత్తుకుంది. దుఃఖం ఉండలా మారి అడ్డుపడటంతో ఆమెకు ముద్ద గొంతులోకి దిగలేదు.

పిల్లలు తినేసి, మళ్లా గొయ్యి లోపలికి దిగాక అచ్చమ్మను ఊరడిస్తూ..

'ఎన్ని కన్నీళ్లు కార్సినా మన బతుకులు మారవు వదినా. నా మొగుడు సచ్చిపోయే నాటికి ఎంకడికి ఆరేండ్లు. ఇల్లు గడవడం కోసం ఆ పసోణ్ని కూడా పన్లో పెట్టక తప్పలేదు. బొబ్బలెక్కిన వాడి లేత సేతులు సూసి.. ఎన్ని రాత్రుళ్లు ఏడ్సానో నాకే తెలుసు. ఇప్పుడు ఏడుద్దామన్నా కన్నీళ్లు రావడం లేదొదినా. ఎప్పుడో ఇంకిపోయినయి' అన్నది మంగమ్మ.

మంగమ్మ జీవితంలో జరిగిన విషాదాలన్నీ అచ్చమ్మకు తెలుసు. వాళ్లవి పక్క పక్క గుడిసెలే.

'నా బతుకు నీ బతుక్కన్నా మెరుగేం కాదులే మంగమ్మా!' అని మనసులోనే అనుకుంది అచ్చమ్మ. తనూ తన మొగుడు పన్లోకెళ్తున్న రోజుల్లో ఇల్లు గడవడం కష్టమయ్యేది కాదు. ఓ కొడుకు పుట్టిన ఏడాదిన్నరకు కూతురు పుడ్తే ఎంత సంతోషపడ్డారో! పిల్లల్ని అల్లారుముద్దుగా పెంచుకోవాలనీ, బాగా చదివించి ప్రయోజకుల్ని చేయాలనీ ఎన్ని కలలు కన్నారో..

ఓ రోజు రాత్రి గొంతుదాకా తాగున్న ఎదవెవడో బైకును రోడ్డుమీద కాకుండా తన మొగుడి వీపు మీదనుంచి పోనివ్వడంతో అతని వెన్నెముక దెబ్బతిన్నది. అప్పటినుంచి మంచానికే పరిమితమై పోయాడు. నాలుగు పొట్టలు నిండాలంటే.. ఎనిమిదేళ్ల శీనును పనిలో పెట్టక తప్పలేదు.

ఆ రోజు తన మొగుడు వెక్కి వెక్కి ఎలా ఏడ్చాడో తనకింకా గుర్తుంది. శీనును చదువు మానిపించి, నోరు తెరుచుకుని ఉన్న కొండచిలువల్లాంటి అభ్రకపు గోతుల్లోకి పంపడం అతనికి సుతరామూ ఇష్టం లేదు. తనకూ ఇష్టం లేదు. కానీ, తప్పని పరిస్థితి.

'కనీసం మన బిడ్డనైనా సదివిద్దాం' అన్నాడు కండ్లనిండా నీళ్లు నింపుకొని.

'నువ్వు ఏడ్వబాకయ్యా! ఎంత కట్టమైనా పర్లేదు. మన బిడ్డను సదివిద్దాం'.. అతనికి భరోసా ఇస్తూ అన్నది తను.

ఒక మగ మనిషి, ఒక ఆడ మనిషి తమ దిక్కే రావడం చూసి.. ఆలోచనల్లోంచి బైటపడి మంగమ్మ వైపు చూస్తూ..

'ఎవరై ఉంటారు?' అన్నది.

మంగమ్మ కూడా వాళ్లవైపు ఆశ్చర్యంగా చూసింది. వస్తున్నామెకు పాతికేళ్లకు మించి వయసుండదు. బ్లూ జీన్స్ ప్యాంట్‌లో చెక్స్ షర్ట్‌ను టక్ చేసి ఉంది. భుజానికి హ్యాండ్‌బ్యాగ్ వేలాడుతున్నది. ఆమె పక్కన ఉన్న వ్యక్తికి ముప్పై ఏళ్లు ఉంటాయి. బాగా చదువుకున్న వాడిలా ఉన్నాడు.

ఆమె నేరుగా వాళ్ల ముందుకొచ్చి నిలబడి.. స్నేహపూర్వకంగా నవ్వింది.

'నా పేరు ఆద్య. ఇతను మోహన్. ఇద్దరం ఓ ఎన్జీవోలో పనిచేస్తున్నాం. ఇక్కడ కూచోవచ్చా' అంటూనే.. వాళ్లేదో అనేలోపల గొంతుక్కూర్చుంటూ..

'ఈ పని ఎన్నాళ్ల నుంచి చేస్తున్నారు?' అని అడిగింది.

అదే సమయంలో రాళ్లను మోసుకొచ్చిన ఎంకణ్ని చూస్తూ..

'లోపల ఇంకా ఎంతమంది పిల్లలు పనిచేస్తున్నారు?' అని ప్రశ్నించింది.

అచ్చమ్మ చెప్పిన సమాధానం విన్నాక..

'పద్దెనిమిదేళ్లు నిండని పిల్లల చేత పని చేయించడం నేరమని మీకు తెలుసా? ప్రభుత్వ అనుమతి లేకుండా మైకాను తవ్వి తీయడం చట్ట వ్యతిరేకమని తెలుసా? రెండు వేల ఒకటి తర్వాత ఇక్కడి మైకా గనుల లీజులను ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలుసా?' అని అడిగింది.

వాళ్లనుంచి సమాధానం రాకపోవడంతో..

'పిల్లల చేత మీరు చేయిస్తున్న పనివల్ల వాళ్లకెంత ప్రమాదమో ఆలోచించారా? కాళ్లకూ, చేతులకూ గాయాలు కావొచ్చు. చర్మ వ్యాధులు, ఉబ్బసంలాంటి రోగాలు రావొచ్చు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కూడా పోవచ్చు' అన్నది.

'ఈ పని సేయకపోతే మా కడుపులెలా నిండుతాయమ్మా? అప్పుడు ఆకలితో పేనాలు పోతాయి కదమ్మా!' అన్నది అచ్చమ్మ.

'మీరు రోజుకు ఎంత సంపాదిస్తారు?' అని అడిగాడు మోహన్.

'పది కేజీల వరకు తవ్వి తీస్తే గుడివాడ నుంచి ఓ ఆసామి వచ్చి నాలుగు వందలిచ్చి తీసుకెళ్తాడయ్యా. చెరో రెండొందలు తీసుకుంటాం..' ఈసారి మంగమ్మ సమాధానమిచ్చింది.

'ఎవరా ఆసామి? అతని పేరేంటి? మీరెంత మోసపోతున్నారో తెలుసా? మార్కెట్లో కేజీ అభ్రకం ధర ఎన్ని వేలు పలుకుతుందో తెలుసా?'అన్నాడు మోహన్.

అచ్చమ్మ ఏదో చెప్పబోయే లోపల రెండు స్కూటర్లమీద నలుగురు మనుషులు వచ్చారు. వాళ్లలో మైకా స్క్రాప్ కొనే సుబ్బయ్య కూడా ఉన్నాడు.

వాళ్లు రావడంతోటే..

'మీరీ చుట్టుపక్కల కనిపించారో మర్యాద దక్కదు. వెంటనే వెళ్లిపొండి..' అంటూ ఆద్యనూ, మోహన్‌నూ తరిమేశారు.

అచ్చమ్మ, మంగమ్మల వైపు కోపంగా చూస్తూ..

'ఎవరేం అడిగినా చెప్పేయడమేనా? వాళ్లెవరో.. ఏమిటో.. తెలుసుకోవద్దా? వాళ్లతో మీరేం చెప్పారు? నా పేరు చెప్పారా?' అంటూ హూంకరించాడు సుబ్బయ్య.

వాళ్లిద్దరూ వణికిపోతూ..

'మేమేమీ సెప్పలేదయ్యా! మీ పేరు అసలు సెప్పనే లేదయ్యా!' అన్నారు.

'జాగర్తగా ఉండండి. ఎవరేం అడిగినా తెలియదని చెప్పండి. తెలిసిందా?' అంటూ మరోసారి గద్దించి, మిగతావాళ్లను తీసుకుని వెళ్లిపోయాడు సుబ్బయ్య.

***

మట్టితో చివరి స్నానం చేయించినట్టు ఉంది.. గుడిసె ముందు పెట్టి ఉన్న శీను శరీరం. కోసుగా ఉన్న రాళ్లు చీరుకుపోవడం వల్ల కారిన రక్తం గడ్డకట్టి, శరీరంమీద అక్కడక్కడా కుంకుమ చల్లినట్టుంది.

శీను శరీరాన్ని ఇంటికి మోసుకొచ్చి అప్పటికి అరగంట కావస్తున్నది. అచ్చమ్మ కన్నీటి వరదలా ఉంది. ఎనిమిది నెలలనుంచి గొయ్యిలోపల అడ్డంగా తవ్వడంవల్ల ఏర్పడిన సొరంగం పైకప్పు.. 'ధడేల్' మంటూ కూలిపోయిన శబ్దంతోపాటు.. శీను 'అమ్మా' అంటూ అరిచిన హృదయ విదారకమైన అరుపు ఆమె చెవుల్లో ఇంకా గింగురుమంటూనే ఉంది.

జరగాల్సిన ఘోరమంతా క్షణాల్లో జరిగిపోయింది. ఎప్పటి మాదిరే తనూ, మంగమ్మ కబుర్లు చెప్పుకొంటూ.. రాళ్ల నుంచి అభ్రకపు ముక్కల్ని వేరుచేసే పనిలో ఉన్నారు. గంటక్రితమే ఎంకడు బుట్టనిండా రాళ్లను తెచ్చి, వాళ్లముందు వేసి వెళ్లాడు. మరి కొద్దిసేపట్లో ఎంకడు పైకొస్తాడని ఎదురు చూస్తున్నంతలో.. భూమి కంపించినట్టు శబ్దం వచ్చింది. దాంతోపాటు శీను పెట్టిన కేక.. ఆమె గుండె ఆ క్షణమే డైనమైట్ పెట్టి పేల్చినట్టు వేయి

ముక్కలుగా బద్దలైంది. అదే సమయంలో ఎంకడు పెద్దగా ఏడుస్తున్న శబ్దం కూడా వినొచ్చింది.

తనతోపాటు మంగమ్మ కూడా లేచి, గొయ్యి దిక్కు పరుగెత్తింది. ఆరడుగుల లోతు వరకు వెళ్లాక.. దారి చాలా సన్నగా ఉండటంతో ఇద్దరూ లోపలికి వెళ్లలేక పెద్దగా కేకలు పెడుతూ.. గుండెల్ని బాదుకుంటూ ఏడవసాగారు. పోగైన వాళ్లలో పద్నాలుగేళ్ల పిల్లలిద్దరు గొయ్యిలోకి దిగి, ఎంకణ్ని పైకి మోసుకొచ్చారు.

'సొరంగం మొత్తం రాళ్లు, మట్టితో కూరుకుపోయింది. ఎంకడి కాళ్లు, వీపు మీద బాగా దెబ్బలు తాకినయి. శీను కనిపించలేదు. రాళ్ల కింద ఇరుక్కున్నడు కావచ్చు. మొత్తం రాళ్లూ, మట్టినీ తీస్తే కానీ.. శీనును బయటికి తీయలేం!' అన్నారు.

'ఎంకడికి దెబ్బలు తగిలాయి సరే! మరి నా బిడ్డో! వాడికేమైంది? పదేళ్లు కూడా పూర్తిగా నిండని పసివాడు.. నా పాణం! వాడేమైపోయిండు? అసలు కనిపించనేలేదా? మూలుగుతున్న శబ్దం కూడా ఇనిపించలేదా?'..

ఆ మాటే వాళ్లతో అంటే.. 'ఇనిపించనే లేదు!' అని చెప్పారు వాళ్లు.

'అంటే వాడి శరీరం పూర్తిగా రాళ్లు, మట్టిలో కూరుకుపోయిందా? అయ్యో.. నా తండ్రికి ఊపిరెలా ఆడుతుంది? ఆ రాళ్లు ఎంత బరువున్నయో? అసలే బక్క పాణం! ఎంత బరువని మోస్తయి? భూమంత బరువు!'..

ఎవరో సుబ్బయ్యకు ఫోన్ చేశారు. అరగంట లోపలే సుబ్బయ్య ముగ్గురు పనివాళ్లను వెంటబెట్టుకుని వచ్చాడు. వెంటనే ఎంకణ్ని ప్రభుత్వాసుపత్రికి పంపించే ఏర్పాటుచేశాడు. మంగమ్మ శోకాలు పెట్టి ఏడుస్తూ వాడితోపాటు వెళ్లింది.

ఆరు గంటలు శ్రమిస్తేనే కానీ.. శీను శరీరం బైటికి రాలేదు. పైకప్పు కూలి మీదపడిన కొన్ని నిమిషాలకే పిల్లాడు చచ్చిపోయి ఉంటాడని తీర్మానించారు.

ప్రాణంలేని శీను శరీరంతోపాటు, ప్రాణమున్న శవంలా మారిన తన శరీరాన్ని కూడా గుడిసెకు చేర్చారు. తన మొగుడు ఏడుస్తున్నాడు. ఎనిమిదేళ్ల కూతురు కూడా ఏడుస్తున్నది. ఇంక జీవితంలో ఏడుపు తప్ప ఏం మిగిలిందని?

ఏడ్చి ఏడ్చి అచ్చమ్మ సొమ్మసిల్లినట్టు పడిపోయింది.

'మొదట జరగాల్సిన కార్యక్రమం చూడండి. బాబుకు చివరి స్నానం చేయించండి' అన్నాడు సుబ్బయ్య.

'నా కొడుక్కు చివరి స్నానం చేయిస్తారా? చనిపోయినవాళ్ల శరీరాన్ని మొదట నీళ్లతో కడిగాక.. మట్టిలో పడుకోబెడ్తారు. నా కొడుకు మొదట మట్టిలో కొన్ని గంటలు పడుకున్నాక.. ఇప్పుడు నీళ్లతో ఒంటిని కడుగుతామంటున్నారు. వాడికి ఆ మట్టిస్నానం చాలు కదా! ఇక ముందంతా వాడికి మట్టి స్నానమేగా!'..

అచ్చమ్మ హృదయంలో వాడి గురించి తను కన్న వేల కలల సమాధులు మొలిచాయి.

***

శీను చనిపోయి పద్నాలుగు రోజులు. అచ్చమ్మకు దిగులుగా ఉంది. పోలీసులకు సమాచారం ఇవ్వకుండా ఉండటం కోసం ఆమె చేతిలో సుబ్బయ్య పెట్టిన డబ్బులు రెండ్రోజుల క్రితమే అయిపోయాయి. కొద్దికొద్దిగా కడుపుని నమిలి తినేస్తున్న ఆకలిని తనూ తన మొగుడు ఎలాగో ఓర్చుకుంటున్నారు. కానీ, కూతురు ఆకలని ఏడుస్తుంటే కడుపు తరుక్కుపోతున్నది.

ఏం పని చేసి తన కుటుంబాన్ని పోషించుకోవాలో ఆమెకు అర్థం కావడం లేదు. శీను చనిపోయిన రోజే నిర్ణయించుకుంది.. ప్రాణం పోయినా సరే మొసలి నోళ్లలా తెరుచుకుని ఉండే అభ్రకపు గోతుల దరిదాపులకు కూడా పోకూడదని. కానీ, చేయడానికి ఆ ఊళ్లో మరేమీ పని లేదు. ఊరంటే ఊరు కూడా కాదు. గూడూరుకు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతంలో అభ్రకం దొరుకుతుందని తెలియడంతో ఎక్కడెక్కడినుంచో దాదాపు యాభై కుటుంబాల వాళ్లు వచ్చి గుడిసెలు ఏసుకున్నారు అంతే! ఈ యాభై కుటుంబాలకు జీవనాధారం.. నేలను తవ్వి తీసే అభ్రకపు ముక్కలే!

పోనీ తన మొగుడికి ఆరోగ్యం బాగుంటే గూడూరు వెళ్లి ఏదో ఓ పనిచేసి నాలుగు డబ్బులు సంపాదించుకుని వచ్చేవాడు. తనకా అదృష్టం కూడా లేదు. తన కూతురితోపాటు మొగుణ్ని కూడా తనే సాకాలి.

శీను చనిపోయాక ఎన్ని పీడకలలో! ఓ కలలో అభ్రకం కోసం తవ్విన గొయ్యి అగాధంలా మారి చుట్టుపక్కల ఉన్న మనుషులందర్నీ తనలోకి లాక్కుంటున్నట్టు! మరో కలలో అది రెండు బారల నాగుపాములా మారి ఊళ్లో అందర్నీ కాటేస్తున్నట్టు! ఎన్నిసార్లు నిద్రలోంచి పెద్దగా అరుస్తూ లేచి కూర్చుందో!

ఎలాగో మరో రోజు గడిచింది. ఆకలికి తాళలేక తన మొగుడు, కూతురు శోషొచ్చినట్టు పడిపోయారు. తన పరిస్థితి కూడా అంతే! ఇలానే మరో రెండ్రోజులు పస్తులుంటే.. చచ్చిపోతారేమో అని భయమేస్తున్నది. పాము పడగ నీడలో బతికే తమలాంటి వాళ్లు.. పాము నుంచి ఎక్కడికని పారిపోగలరు?

మంగమ్మ పరిస్థితి కూడా అలానే ఉంది. ఎంకడికైన గాయాలు ఇప్పుడిప్పుడే మాను పడ్తున్నాయి. వాడు గాయపడిన రోజే ఒట్టేసుకుంది.. ఎట్టి పరిస్థితుల్లోనూ తన కొడుకుని ప్రమాదాల అంచుల్లోకి పంపనని. తనకు భర్త ఎలాగూ లేడు. మిగిలింది వాడొక్కడే! ఆ రోజు అదృష్టం కొద్దీ గాయాలతో బైటపడ్డాడు గానీ.. ఏ కాలో, చెయ్యో విరిగుంటే ఏమయ్యేది? ప్రాణాలే పోయుంటే! ఆ ఆలోచనకే ఆమె ఒళ్లు భయంతో జలదరించింది.

కానీ, రోజులు గడిచేకొద్దీ ఆమె మెత్తబడసాగింది. పనిలోకి వెళ్లకపోతే ఆకలి క్షమించేలా లేదు. ఎంకడు నడవడానికి ఇప్పటికీ ఇబ్బంది పడుతున్నాడు. అయినా.. 'మూడు పొట్టలు నిండాలంటే రేపటినుంచి పనిలోకి వెళ్లక తప్పదు!' అనుకుంది.

***

అచ్చమ్మ ఆ రాత్రంతా ఆలోచిస్తూనే ఉంది.

'ఎంకడు గొయ్యిలోకి దిగి రాళ్లను పగలకొడ్తే.. వాటిని పైకెవరు మోసుకొస్తారు? ఆ పని కూడా ఎంకడు చేస్తే వచ్చే నాలుగొందల్లో మూడొందలు మంగమ్మకే ఇవ్వాల్సి వస్తుంది. నా వాటాకొచ్చే వంద రూపాయల్తో ఇల్లెలా గడుస్తుంది?'..

ఆమె తన పక్కన పడుకుని నిద్రపోతున్న కూతురి అమాయకమైన మొహం వైపు చూసింది. అనాయాసంగానే ఆమెకు కన్నీళ్లు పొంగుకొచ్చాయి. 'ఎంత కట్టమైనా సరే.. నిన్ను సదివిత్తనని మీ అయ్యకు మాటిచ్చిన. అన్ని కట్టాలకన్నా ఆకలిని తట్టుకోడం శానా కట్టం తెలుసా తల్లీ! కట్టాలకు లొంగిపోయి.. మాట నిలుపుకోలేక పోతున్న ఈ తల్లిని ఛమిస్తావు కదూ!' అనుకుంది.

మరునాడు ఉదయం అచ్చమ్మ తన కూతురి చేయి పట్టుకొని పనికి బయల్దేరింది.

ఎంకడితోపాటు తన కూతురు కూడా గొయ్యిలోకి దిగుతుంటే.. ఆకలితో నోరు తెరుచుకుని ఎదురుచూస్తున్న రాక్షసుడి నోట్లోకి పిల్లల్ని పంపిస్తున్నట్టు అనిపించింది అచ్చమ్మకు. నేలను రెండు చేతుల్తో బాదుతూ గుండెలవిసేలా ఏడ్చింది!

***

**సయ్యద్ సలీం స్వస్థలం.. ప్రకాశం జిల్లా, త్రోవగుంట గ్రామం.. . ఎమ్మెస్సీ (టెక్) చేశారు. ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లో అడిషనల్ కమిషనర్‌గా ఉద్యోగ విరమణ పొందారు. కాలేజీ రోజుల నుంచే కవితలు రాయడం మొదలుపెట్టారు. ఇప్పటి వరకూ మూడు కవితా సంపుటాలు, పది కథా సంపుటాలు, 27 నవలలను వెలువరించారు. ఈయన రాసిన మొదటి కథ 'మనీషి'.. 1980లో ఆంధ్రభూమి పత్రికలో ప్రచురితమైంది. 150కిపైగా కవితలు, 50కి పైగా కథలు.. వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఈయన రచనలు ఇంగ్లిష్, హిందీ, మరాఠీ, ఒరియా, కన్నడ, మలయాళం, తమిళ భాషల్లోకి అనువాదం అయ్యాయి. 'కాలుతున్న పూలతోట' నవలకు 2010లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. 'వెండి మేఘం' నవల, 'తలాక్', 'లాకులు', 'నూకలు' కథలను పలు విశ్వవిద్యాలయాలు పాఠ్యాంశాలుగా చేర్చాయి. వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన 10మంది విద్యార్థులు ఈయన రచనల మీద పీహెచ్‌డీ/ఎంఫిల్ చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారంతోపాటు ఎన్నో అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు.**

# తండ్లాట



**అరుణ్ కుమార్ ఆలూరి,**

**63058 16242**

ఇంటి ముంగటున్న సౌతరి మీద కూసొని మల్లా ఓల్లకో ఫోన్ జేశింది అమ్మ.. స్పీకర్ చాల్ జేస్కొని.

'యాడైతదక్క! నాకే శిన్న బాదైతలేదు. ఆకు సక్కగస్తలేదు. దొడ్డు, ముక్క ముక్క అస్తున్నది. మల్ల అవి జోకెటప్పుడు ఆ ముండకొడుకు దండె కొడ్తున్నడు. అజార్ బీడీలకు ఐదునూర్లే ఎల్తున్నయి. బైట దొర్కక ఆడి దగ్గర్నే వంద వెట్టి కొనుడైతున్నది'.. అని ఫోన్లకెంచి మాటలు ఇన్పిచ్చినయి.

'అయ్.. గా ఆకుకు వందనా? యే కంపిన్ల లేదిట్ల. లవ్‌కడ్లు జమైండ్రు ఈ దాదలు' అనుకుంట, తోడెంసేపు మాట్లాడి ఫోన్ పెట్టేశింది.

ఈ ఐదు రోజులల్ల ఇది పదోసారో ఇర్వయ్యోసారో.. తనతోటి కార్ఖాన్ల పన్జేస్తున్న ఓల్లకో ఒకల్లకు ఫోన్ జేశి అడుగవట్టి! కారణం తెల్వదిగని, ఎవ్వలు గుడ ముందటికస్తలేరు.

అమ్మ దగ్గరికివొయి..

'అమ్మా! ఇడ్సవెట్టు. ఈ పరిస్తితులల్ల ఈ నెత్తినొప్పి ఎందుకు వెట్టుకునుడు? అన్ని మనం అనుకున్నట్టు ఐతయా?' అని, బుడ్డదానికి ఎండ తగ్లాలని అమ్మ పక్కన కూసున్న.

అమ్మ సప్పుడు జెయ్యలేదు. శేతికున్న పట్టిని

సూస్కుంట సోంచాయిస్తున్నది. ఇంకో రెండేండ్లు ఐనంక రాజీనామ వెడ్తె, నెలకు కమస్కం మూడెయిల పింఛను అస్తదట! అదే ఇప్పుడు వెడ్తె పద్నాలు వందలు అస్తున్నదట. దీని ఎన్క ఉన్నలెక్కలు నాకు, అమ్మకు గుడ తెల్వయి. బీడీల రేటు, పింఛను ఎక్వజెయ్యాలని కంపినిని గట్టిగ అడుగుతున్నరట యూనియన్ లీడర్లు. అయ్యి పెరిగితె రాజీనామ వెట్టొచ్చని సూస్తున్నది.

ఇంతట్లనే మామ ఎంబట అత్త బైటికి అచ్చి బుడ్డదాన్ని సూస్కుంట..

'ఓయ్.. ఏం జేత్తున్నవ్? పొలానికి వొయత్తం. మంచిగ ఆడుకో!' అని చెప్పి, ఉరుక్కుంట వొయి మామను అందుకున్నది.

ఆళ్లు పొయిన దిక్కే సూస్కుంట..

'నేను బీడీల్ జేసుడు మొదలువెట్టినప్పుడు తొమ్మిదేండ్లు ఉండె. అప్పుడు అజార్ బీడీలకు నాల్గు రూపాల్ ఇస్తుండె. అర్తాల్లు జేశి, కార్కాన్లు బందు వెట్టి, రోడ్ల మీదికెక్కి కొట్లాడుకుంట ఉంటె.. పెంచుకుంట అచ్చిండ్రు. ఇప్పుడు రెన్నూర్లయ్యింది!' అన్నది అమ్మ.

'అప్పుడే గంత కట్టవడ్డప్పుడు.. ఇప్పుడెట్ల ఇడ్సవెడ్తది?' అన్పిచ్చింది నాకు.

***

ఇంటి మైశవ్వకు దీపాలు ముట్టిస్తుండంగ అత్తామామ అచ్చిండ్రు.. చేతుల రవాట వట్టుకొని. ఏటి కాల్వలకెంచి పొలాలకు కొట్టుకచ్చిందట. మేం పొయి దగ్గరుంటె మామ బుడ్డదాని పక్కకు కూసున్నడు. సన్నం శెద్దరి దాని కాళ్ల మీద ఏశిండు. అదేమొ దాన్ని తండేసుకుంట నవ్వతంది. తినేటిదాక అదొక ఆట ఆళ్లకు.

రాత్రికి బుడ్డదాని బాపు వీడియో కాల్ చేశిండు. బిడ్డెతోని కొంచెం సేపు ముచ్చట వెట్టి..

'మల్లా పొద్దున లెవ్వాల!' అని పెట్టేశిండు. ఇప్పుడంటె ఇంత సౌలత్ ఉన్నదిగని, శిన్నప్పుడు మా ఇంటిపక్కకు ఉండె కర్రెన్న తాత దుబాయ్ వోతె, భూలచ్చిమాయి ఒక కాసెట్ కొనుక్కచ్చి టేప్‌రికార్డుల మాట్లాడి నింపి పంపిస్తె.. అది ముట్టేసరికి నెలైతుండె. రోజులెంత గమ్మతుగ మారుతున్నయో!

***

అత్తామామ పొలానికి వోంగనె.. బుడ్డదాని మాడమీద నూనె సుక్కలేశి, రాస్కుంట అర్రల కూసున్న. అమ్మ ఆకిట్ల నిలవడి మల్లా ఓల్లకో ఫోన్ జేశి, ఫస్టుకెంచి చెప్పుకస్తున్నది.

'ఇగో.. నా బిడ్డె నిండు మనిషుండె. పిల్లగాడేమో మస్కట్ల ఉన్నడు. 'కాన్పుకోసం తీస్కవోతా' అంటే.. నా ఒక్కదాంతోని యాడైతదని నన్నే ఇటు రమ్మన్నరు. నా అంతుకు బీడీల్ వెట్టుమని నా కారటి నర్సవ్వకు ఇచ్చచ్చిన. మంచిగ ఆడివిల్ల పుట్టి నాన్నెల్లు దాటింది. ఓరోజు గాచారం మంచిగ లేక ఆకిట్ల నడంగ కాల్ జారి కింద వడవేన. ఆపుకొందమని శేతిని అడ్డం వెడితె పుటుక్కుమని ఇరిగింది. అప్పట్సంది ఊరి మొకం సూసుడైతలేదు. గిసుంటి టైంల.. అది నా కారటి బందువెట్టి, వేరోల్ల కారటి మీద జేస్తున్నదట.. గిదేమన్న నియ్యతేనా? అడుగుదమంటె ఫోను లేస్తలేదు' అని అంటున్నది.

అవతలోళ్లు ఏమన్నరో తెల్వది. శెవులల్ల రొద వెట్టినట్టు అనిపించిందో ఏమో.. ఫోన్ల స్పీకర్ చాల్ జేశి మల్లా అమ్మనే..

'అదే గద.. ఆ నల్లికుట్ల మొకందానికి కారటే లేదు. ఇప్పుడు వేరోళ్లదైన, నాదైన గదే కారటి. గవ్వే పైసలు. మరి శెప్పకశెయ్యక నాదేంటికి ఆపాల? ఇప్పటికి నెల పదిగేను రోజులాయెనట. వేరోళ్లు శెప్తె తెలిశింది. మూడు నెల్లు కాడలైతె రాజీనామ వెట్టుమంటరు. అట్లయితె పించను దగ్గర నుక్సానయితది. అదొక్కసారి చాల్ అయ్యిందంటె.. మల్ల పదేండ్ల దాక ముట్టుకోరు. బయటెంత పెరిగినా సంబందం ఉండది' అన్నది.

'ఇసాబ్ ఎట్ల కట్టిత్తున్నవ్ నర్సవ్వకు..' అన్నది అవతలామె.

'మాపులు వెట్టిన కాడికి ఆడ్నే కార్కాన్ల తీస్కుంటది. దాంట్ల కట్ అయిన పించను పైసలు, దావకాన కోసం కట్ అయిన యాభై రూపాలు, మీటింగులకు నిజాంబాద్ వోతె కైకిలి, బస్ కిరాయిలు, యూనియనోళ్లకు యాడాదికి వంద ఇవన్ని నేనే కట్టిత్తున్న' అన్నది అమ్మ.

'మరి దాదలకిచ్చే పది రూపాలు ఇత్తున్నవా?' అన్నది అవతలామె.

అమ్మ సల్లవడ్డది. అవతలామె ఇంట్లకు ఓల్లో సుట్టాలు అచ్చినట్టు ఉన్నరు..

'ఆ.. ఉన్న! అత్తున్న' అనుకుంట పోను వెట్టేశిందామె.

లంగోట తడ్శిందని బైటికచ్చి దండెం మీదికెంచి కొత్తది తీస్కొని.. బుడ్డదాన్ని కాళ్లమీద పండవెట్టుకొని మారుస్తున్న. నన్ను సూశి..

'అయ్.. ఇదేం నసీబై పాయె! మన్మరాలికి తానం గుడ జేపిచ్చుడు ఐతలేదు' అన్నది.

'పట్టి తీశేశినంక జేపిద్దువు తియ్!' అన్న.

అమ్మని జూస్తె ఇప్పట్ల రాజీనామ వెట్టెటట్టు కొడ్తలేదు. అమ్మ.. ఆల్ల అమ్మని యాజ్జేస్కున్నది. అమ్మమ్మ రెండు వేల రెండుల రాజీనామ వెడ్తె.. అప్పుడు అజార్ బీడీలకు తొంబై రూపాలున్న టైంల.. రెన్నూర్ల యాభై రూపాల పించను కూసున్నది. రోజురోజుకు రేట్లు పెరుగుతుంటె, అంత తక్వ పించనుతోని ఎట్ల ఎల్లదియ్యాల్నో అమ్మకు సమజైతలేదు.

నాకు ఐదేండ్లప్పుడు బాపును ఏదో బండి టక్కరిచ్చి తీస్కవోతె, బీడీలు చేస్కుంటనే కడ్పుల వెట్టుకొని సాదింది. రోజుండేటి ఇంట్ల పనులు శేస్కుంటనే, పద్నాల్గు పదిగేను గంటలు బీడీల మీద కూసుంటుండె. అమ్మ నాయంత ఉన్నప్పుడు రోజుకు మూడు శేర్లు శేస్తుండెనట. ఒక శేరు బీడీలు తన కార్డు మీద మాపు వెట్టుకుంటె, కడుమయి తక్వ వడ్డోల్లకు కట్టల సొప్పున ఇస్తుండెనట.

ఎన్కటి ముచ్చట.. అప్పట్ల పొలం పనికి కైకిలి మొగోళ్లకు రూపాయి, ఆడోళ్లకు ఆఠాన ఉండెనట. శేరు బీడీలగ్గుడ గంతేనట. అప్పుడు మా అమ్మ రోజుకు రెండు శేర్లు శేస్తుండెనట, దాంతోని మొగోళ్ల కైకిలి వడ్తున్నదని బీడీల మీదనే ఉంచిందట మా అమ్మమ్మ.

'అదే ఆడోళ్లకు, మొగోళ్లకు సమానం కైకిలి ఇస్తె.. గీ బీడీలు ఓల్లు జేస్తుండే!' అన్నది అమ్మ.

అమ్మమ్మతోని కలిపి ఊరు మొత్తానికి బీడీలు జేశెటోళ్లు ఐదుగురే ఉండెనట. పక్కకున్న మండలంల కార్కాన ఉంటుండెనట. తర్వాత ఈళ్లను సూశి, ఒకటి తెచ్చి ఊళ్లె పెట్టింద్రట.

ఇప్పుడు ఇదే ఊర్ల ఆరువందల మంది బీడీలు జేశెటోళ్లు, ఐదు కార్కాన్లు అయినయి. ‘వానలు పడని కరువు కాలంల ఎవుసం లేక.. గీ బీడీలే ఆదుకున్నయి’ అని నెమరేసుకున్నది అమ్మ.

***

అమ్మ పట్టి తీపిచ్చుకుందమని ఇందూరు వోయింది. ఎక్స్‌రే తీపిచ్చి సూశి..

‘నీ బొక్కలు గట్టిగ లేవు! ఇంకొక నెలరోజులు ఉంచుకో!’ అన్నడట డాక్టరు.

ఇంటికచ్చి.. ‘ఇదేం కతైపాయె!’ అనుకుంట ముచ్చటంత శెప్పింది.

ఒక నిమిషం కూసున్నదో లేదో, ఫోన్ తీసుకొని మల్లా ఓల్లకో జేశింది.

‘దాదకు ఇచ్చే గా పది రూపాల్ నేనే ఇస్త. ఏమంటవు?’ అన్నది.

‘లేదక్క. నాకు జేసుడు ఐతలేదని రాజీనామ వెడ్డమని సూశిన కని నాపేరు తప్పు వడ్డదట. నా బ్యాంకు పాసుబుక్కు, ఆదారు కారటి ఇచ్చినంక ఎట్ల తప్పు వడ్తది శెప్పు? ఆపీసుల గా కంపూటరి ముంగట కూసుండెటోడు కావలనే అందరియి తప్పు గొట్టినట్టు అన్పిస్తున్నది. ఇప్పుడు సరి జెయ్యాలంటే రెండువేలు ఐతయంటున్నడు’ అన్నది అవతలామె.

‘రెండు వేలేంటికియ్యాల ఆ మూతగండ్ల మొకపోనికి. ఆంత జమైంద్రు మనల్ను దోస్కునదల్గి. నువ్వు గదేదో నెట్టు సెంటర్కు ఓల్లనన్న పట్కావోయి ఆనులైన్ల మార్పిచ్చుకో! నాకట్లనే అయితే మా అల్లుడు ఆల్ల దోస్తుకు శెప్పి జేపిచ్చిండు. యాభయ్యో వందనో తీస్కుంటరు గంతే. అది మారిందాక బీడీలు బందువెట్టకు!’ అని ఇగురం శెప్పి వెట్టేశింది.

నేను అడిగిన.. ‘ఈ పది రూపాల సంగతేంది?’ అని.

‘ఏ.. ఏంలే! బీడీలు ఇచ్చెటప్పుడు కారట్ ఉన్నోళ్లు ఉండాల గద. ఆల్లు లేకుండ వేరేటోళ్లు మాపులు వెట్టవోతె, ఆ దాదలు అజార్ బీడీలకు ఐదు రూపాల్ అడుగుతుండె పాపం. కొత్త దాదలచ్చిండ్రట. దాన్నిప్పుడు పది రూపాల్ జేశిండ్రట!’ అన్నది.

‘నువ్వు లేకున్నా మాపులు తీస్కుంటున్నందుకు పాపం ఐపోయిండ్రు కద?’ అన్న నవ్వుకుంట. ‘తక్వ జీతానికి పెండ్లాం పిల్లల్ని ఇడ్సవెట్టి పడమటకెంచి అచ్చి ఉంటరు. మామీద వడి బత్కుడికి సై మరిగిండ్రు. ఏం జేద్దం మరి!’ అనుకుంట లోపట్లకు వోయింది.

***

మాపటికి చాయ తాగినంక, అమ్మ నర్సవ్వకు మల్లా ఫోన్ జేస్తె.. ఈసారి ఎట్లెట్లనో లేపింది.

‘గిట్లెట్ల జేస్తివే? గిదేమన్న పద్ధతేనా?’ అన్నది అమ్మ.

‘నేనెమన్న రెండేండ్లు జేత్తనని నీకు మాటిచ్చిన్నా అక్క? నువ్వు ఎప్పుడు రాజినామ వెడ్తవో అని నా భయం నాకుంటది కదా? ఇంకో కారటి దొర్కింది.. మూడేండ్లు జేసుకోమన్నరు. అందుకే నీదిడ్సవెట్టిన’ అని శెప్పింది.

‘అట్లంటప్పుడు ఒక నెల ముందు జెప్తె నేను వేరోళ్లని సూస్కుంట గద? ఇదేం లెక్క అన్నట్టు?’. ‘ఏమన్ననుకో.. నాకైతె జేసుడు కాదు’ అని కట్ చేసింది నర్సవ్వ.

'బౌరూపుల మొకంది' అని గునుక్కుంట, నా దిక్కు తిరిగి..

'ఒక పన్జేస్తె?' అన్నది.

'ఏందమ్మ?'.

'నేను ఇంటికి వొయి కొన్ని రోజులు ఆడ్నె ఉండి, ఓల్లకన్న కారటిచ్చి అస్త. ఏమంటవ్?'.

నాకు కోపం పాము పడగోలె సర్రున లేశింది.

'అమ్మా ఏం మాట్లాడుతున్నవే? నువ్వసలే క్యాన్సర్ పేషెంటువి. గా బీడీలతోనే రొమ్ముకచ్చింది. అదృష్టం మంచిగుండి గా ఆరోగ్యశ్రీ స్కీము ఉండవట్టి ఆపరేషన్ జేశింద్రు. లేకపోతె ఉన్న పొలం అమ్ముడైతుండె. గప్పుడు చేశ్న రేడియేషన్‌కు బొక్కలన్ని పల్సవడి, గిట్ల కిందవడంగనె శెయ్యిరిగె. అంతకుముందు ఎన్నిసార్ల వడలే.. ఎప్పుడన్న ఇరిగిందా?' అన్న నేను.

అమ్మ అటీటు సూస్తున్నది.

'అదిగాక బీడీలకోసం గంటలు గంటలు కూసుండుడుకు బీపీ, షుగర్ ఎప్పుడో అచ్చినయి. నువ్వు ఈ పరిస్తితిల ఇంటికి వోయి, తుంటి శెత్తోని వంట జేస్కుంట, బీడీలు పెట్టేటామెని లెంకుకుంట కూసుంటవ? అసలే కేసులెక్వ అయితున్నయి. అందరు మల్లా లాకుడౌను వెట్టమంటున్నరు. నువ్వు అటు పోంగనె ఇటు వెట్టింద్రనుకో.. ఎట్ల జేద్దం' అన్న.

ఉలుకులేదు పలుకులేదు.

లోపట్లకు వొయి కొంచెం నీళ్లుతాగచ్చి..

'నేను నీ అల్లునితోని మాట్లడిపెట్టిన. నువ్వు రాజినామ జేశినంక మాతోని ఈడ్నే ఉంటవు. అత్తమ్మ నువ్వు ఓల్లకోల్లు సోపతి లెక్క ఉంటరు' అన్న నిమ్మలంగ.

అమ్మ నమ్మనట్టె సూశింది.

'పిల్లగాడు మంచోడె కని.. కూతురింట్ల ఉండుడు, అల్లుడు సంపాదించుకస్తె తినుడు మంచిగుండది. నాకు నెలకు మూడువేలు పించని అస్తె నా పొట్టకు, నెలనెల మందులకు పనికొస్తయి!' అని అంటుండగనే.. అత్త, మామ అచ్చింద్రు.

అమ్మ మాటలను మామ ఇన్నట్టున్నడు..

'బిడ్డె, కొడుకు అందరూ సమానమే! ఆస్తిపాస్తులు అందరికీ సమానంగ పంచియ్యాల. అట్లనే ఆళ్లు గుడ అయ్యవ్వల్ని ముసలోల్లైనంక సమానంగ సూస్కోవాల. నీకున్నది ఒకతే బిడ్డ. మాకున్నది ఒక్కడే కొడుకు. ఇగ నువ్వో జాగల, మేమో జాగల ఏంది శెల్లె? జేశినకాడికి సాలు, రాజినామ వెట్టెయ్యి' అన్నడు.

అమ్మ కండ్లల్ల నీళ్లు తిరిగినయి.

'నిన్ను ఉండదల్గి అల్లుడు ఒప్పుకొన్నడు' అంటె.. అంత నమ్మకం కనిపియ్యలె. ఇప్పుడు ఇంటి పెద్ద శెప్పంగనె నమ్మింది.

'నా బిడ్డె కిస్మత్ మంచిగున్నది. మారాజులున్న ఇంట్ల వడ్డది. నేను ఒక్కదాణ్ని ఆడ ఉండుడెందుకు అంటున్నరు. మరి పిల్లగాడు ఆడ, పిల్ల ఈడ ఉంటె ఏం మంచిగుంటదన్న?

అల్లుణ్ని గుడ రమ్మందం. పెట్టువడికి పైసలు ఇస్తున్నది సర్కారు. కాల్వల నీళ్లు మొక్కల్గ అస్తున్నయి. ఆడున్న రెండెకరాల పొలం అమ్మేద్దం. ఆ పైసల్తోని ఈడ్నే తీస్కుందం. అందరం ఒక జాగలుండి నూనె కారం తిన్నా.. కమ్మగనే ఉంటది!' అన్నది.

'భూమిని అమ్ముడద్దు. అదట్లనె ఉండని. కౌలుకియ్యచ్చు లేకపోతె ఇంకేమన్న జెయ్యచ్చు. నువ్వన్న మాట కుడ కరెక్టె. బిడ్డె పుట్టినంక గుడ ఆడు ఆడెందుకు ఉండాల? మాట్లాడ్త ఒకసారి' అన్నడు మామ.

రాత్రి తినుడు అయినంక మామ, అయినెకు ఫోన్ చేసుకుంట బైటికి నడిశిండు. అద్దగంటకు ఇంట్లకు అచ్చి..

'ఇంక నాల్గు నెల్లు ఐతె దసరత్తది గద.. ఆ టైంకు అచ్చేత్తడట. ఇప్పుడు రాజీనామ వెడ్తె అచ్చేటి పైసలు అప్పటికి కరెక్ట్ అస్తయట. టికెట్ అయితె ఇప్పుడే బుక్ చేసుకుంటనన్నడు' అని శెప్పిండు మామ.

నాకన్న ఎక్వ అమ్మకు సంతోషం అయ్యింది. బాపు లేకున్న ఒంటరిగ ఉండి, వేరే ఆలోచన లేకుండ బీడీల పనిమీదనే పెయ్యి పిండి పిండి జేస్కొని నన్ను వెంచింది. అసలు నేను ఎట్ల పెరిగిన అని గుడ అమ్మకు సక్కగ గుర్తు లేదు. ఇప్పుడన్న మా బుడ్డదాని పెరుగుడు సూస్కుంటనన్న సంతోష పడ్తది అనుకున్న.

* * *

పొద్దుగూకినంక అమ్మకు ఫోన్ అచ్చింది. మీది వాడకట్టుకు ఉండే సాయమ్మ దగ్గర్నుంచి. మస్తు సేపు మాట్లాడింది.

'అవ్.. అవన్ని పైసలిస్త, మీదికెంచి దాదలకు ఇచ్చె పది రూపాలు కుడ ఇస్త' అన్నది.

ఆమె ఏమన్నదో తెల్వది గని, ఫోన్ వెట్టేశి నాబిడ్డె దగ్గరికచ్చి..

'ఆమె నా కారటి మీద శెయ్యదల్గి ఒప్పుకున్నది. రాజినామ వెట్టినంక అచ్చిన పైసలతోని నీకు బంగారు గొలుసు జేపిత్త. ఇదంత నీతోనె అయ్యిందే నా లచ్చిమితల్లి' అని బుగ్గమీద ముద్దు వెట్టుకున్నది.

బుడ్డది అమ్మను సూస్కుంట కిలకిల నవ్వింది. అమ్మకున్న టెన్షన్ పోయినందుకు నాగ్గూడ మంచిగనిపిచ్చింది. ఇంతట్లనే యాదికచ్చి..

'నువ్వు రాజినామ వెడ్తలేవానె?' అని అడిగిన.

'లేదు.. నా సోపతిది గా సాయమ్మ నా కారటి మీద శెయ్యదల్గి ఒప్పుకొన్నది'.

'ఎట్లొప్పుకొన్నదే?'.

'ఐదు రూపాలకు శేరు జేశినోళ్లం. దాదలకు ఇచ్చే పదిరూపాలు గుడ ఇస్త అనేసరికి ఒప్పుకొన్నది. మీకు పది రూపాలంటె లెక్క లేదుగని, మాకు ఎన్నై కట్టల బీడీలతోని సమానం. పాపం దానిగ్గూడ వేరే ఆదారం లేకుంట వోయింది. సర్కార్ ఇస్తున్న గా దోఅజార్‌లకెంచి ఓల్లకు తెల్వకుండ ఎన్నో కొన్ని శేతిల వెట్టస్త' అన్నది.

'ఇస్తె మంచిదే కని.. మామకు 'రాజినామ వెడ్తా!' అని చెప్తివి గదనే!'.

'ఆడికి వొాయి జేత్తలేను కద!'.

'మంచిగుండదే!'.

'ఊకో.. ఏం తెల్వది నీకు. అది అయిన కాడికి జేత్తది. కానిరోజు రాజినామ వెడ్త. పైసలేమన్న పుక్కానికి అస్తున్నయా? నేను మింగే మందులకు శిన్న పైసల్ అయితున్నయా? నువ్వు సప్పుడుదాక కూసో! అన్న అడిగితె నేను సంజాయిస్తా' అన్నది.

'ఇదింతే! శెప్తె అస్సలు ఇనది. మల్లొక కత వెట్టింది' అనుకున్న మనసుల.

నా బిడ్డెకు ఏమర్థమయ్యిందో ఏమో.. నన్ను సూస్కుంట నవ్వింది. నవ్వుతుంటె.. ఒక పన్ను అచ్చినట్టు కనిపిచ్చింది.

'అమ్మా.. నీ మన్మరాలికి పన్నచ్చిందే!' అన్న.

'నిజంగనా?' అనుకుంట అచ్చి సూశింది.

మమ్మల్ని సూస్కుంట కాల్లు ఎగిరేసుకుంట ముస్కురాయిస్తున్నది. ఆనంద్ కలర్ కుల్ల కట్టుకున్న బుడ్డది ఒక పన్నుతోని నవ్వితె.. ఇంకింత మంచిగ కనిపిస్తున్నది.

'పారపూస కట్టాల.. జిట్టి కాకుండ!' అన్నం ఇద్దరం ఒకటేసారి.

* * *

అరుణ్ కుమార్ ఆలూరి స్వస్థలం నిజామాబాద్ జిల్లా అభంగపట్నం. ప్రస్తుత నివాసం జోగిపేట. బీటెక్ చేశారు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ.. సినిమాలపై ఆసక్తితో స్క్రిప్ట్ రైటర్‌గా అడుగులు వేస్తున్నారు. ఒక సినిమాకు రచనా సహకారం అందించారు. రెండు సినిమాలకు స్క్రిప్ట్ ఎడిటింగ్ చేశారు. 80వ దశకంలో సంచలనం సృష్టించిన ఒక నవలను స్క్రీన్‌ప్లే రూపంలోకి మార్చే పనిలో ఉన్నారు. ఈయన రాసిన మొదటి కథ 'పిల్లి పోయి ఎలుక వచ్చె డాం డాం డాం'. మేడిపండు, మిణుకుమనే ఆశలు, సుబ్బయ్యతాత పెళ్లి, సూపర్ ఫాస్ట్ రైటర్ కథలు మంచి గుర్తింపు పొందాయి. వివిధ పత్రికల్లో 19 కథలు, మరికొన్ని నానీలు ప్రచురితం అయ్యాయి. కలర్స్ ఆఫ్ లవ్, కొత్తకథ 2022 సంకలనాల్లోనూ చోటు సంపాదించుకున్నాయి. 2008 ఆటా కథల పోటీల్లో వంద డాలర్లను బహుమతిగా గెలుచుకొన్నారు. కణిక, వాసా ఫౌండేషన్ – సాహితీ కిరణం, తెలుగు తల్లి కెనడా, విశాలాక్షి పత్రికలు నిర్వహించిన పోటీల్లో బహుమతులు గెలుపొందారు. నవ సాహితీ ఇంటర్నేషనల్ వారి ముళ్లపూడి ఉత్తమ హాస్య కథ పురస్కారం అందుకున్నారు.

Katha PART 1_Layout 1 6/29/2023 2:38 PM Page 94

# అద్దంలో మూట



త్రివిక్రమ్,
99010 65406

'వసుమతీ! అన్నం తిందువురా!' అని పిలిచింది ఎంకటమ్మ. సమాధానం రాలేదు. టైమ్ చూసింది. రాత్రి ఎనిమిదైంది.

'ఏందిమే! మెత్తగుండావే? జరమేమన్నా వచ్చిందా?'.. బడి నుంచొచ్చి కాళ్లయినా కడుక్కోకుండా, అంతసేపూ ఒదుక్కొని పడుకున్న కూతుర్ని చూసి అడిగింది.

పలక్క పోయేసరికి దగ్గరికొచ్చి చెయ్యి పట్టుకుని చూసింది. వేడిగా తగిలింది.

'జరమొచ్చినట్టుంది. రోంత శారన్నం మెత్తంగ పిసికిస్చా.. తిను! ఈలోపల మాత్తర దెచ్చిస్చా. ఏసుకోని దుప్పటి గప్పుకోని గమ్మున పనుకో! వొల్లంతా సెమట పట్టిందంటే అదే తగ్గిపోతాది. రేపు బడికేం బోవద్దులే!'.. అన్నది.

అన్నం తినే గిన్నెలో అప్పటికే వేసిపెట్టిన ఊరిమిండి, కొంత అన్నం తీసేసి, మిగిలిన అన్నంలో చారు వేసి బాగా మెత్తగా పిసికిచ్చి, తినమని చెప్పి బయలుదేరింది. ఆర్ఎంపీ వాళ్లింటికి పోయి జ్వరం మాత్ర తీసుకుని వచ్చేసరికి అర్ధగంటైంది. వసుమతికి అన్నం సహించలేదు కాబోలు.. ఇంకా చారన్నం కెలుకుతూనే ఉంది.

పక్కింట్లో నుంచి టీవీలో ప్రధానమంత్రి ప్రసంగం వినిపిస్తున్నది. కొన్ని నిమిషాలు గడిచేసరికి కాస్త బిగ్గరగా మాటలు వినిపించాయి. ఏమైందోనని అటు కదలబోయిందల్లా ఆగి.. ముందు పాపతో మాత్ర మింగించి

పడుకోబెట్టిన తర్వాత, నిదానంగా కనుక్కోవచ్చు లెమ్మనుకుంది. చారన్నం తినిపించి, మాత్రను సగానికి తుంచి చేతిలో పెట్టి, గ్లాసుతో నీళ్లు అందించింది. పాప నీళ్లు తాగి పడుకున్నాక తన పనిలో పడి పక్కింటి నుంచి వినిపించిన గోల విషయమే మర్చిపోయింది. ఆ రోజు 2016 నవంబర్ 8. అప్పుడు సమయం దాదాపు ఎనిమిదిన్నర.

మరుసటి రోజుకల్లా తగ్గిపోతుందని అనుకున్న జ్వరం రెండు రోజులైనా తగ్గలేదు. ఆలోచిస్తూ కూర్చుంది. మూడు పూటలా వెయ్యమని రెండు రోజులకూ పారాసిటమాల్ మాత్రలిచ్చిన ఆర్ఎంపీ కూడా.. ఇది మాత్రలతో తగ్గేటట్టుగా లేదని, టౌనుకు తీసుకుపోయి ఆసుపత్రిలో చూపించమని చెప్పాడు.

'ఆసుపత్రికి తోడ్కబొవ్వాలంటే రొండు మూడు నూర్లన్నా గావాల. ఏమన్నా పరీచ్చలు రాపిస్చే అయి జేపియ్యడానికి ఇంగొక యెయ్యి రూపాలన్నా గావాల. యాడుంది అంత లెక్క? యాన్నించి దేవాల?' అని దిగులుపడుతూ కూర్చుంది.

ఎవరిని చేబదులు అడగబోయినా.. అందరూ లేదనే అన్నారు. వాళ్లు, వీళ్లు అని లేకుండా అందరినీ అడిగి చూసింది. ఎవరి దగ్గరా సమయానికి డబ్బు లేదు. ఒక్క రూపాయి అప్పు పుట్టలేదు.

'ఏమి ఉపద్రమొచ్చిందర్రా! ఎవరికాడా లెక్క లేకండా పొయ్యేదాన్కి? నాకిచ్చేదాన్కే ఎవురికి సేతులాడ్డం లేదే?' అని నడివీధిలో అంగలార్చింది.

ఆమె మాటలిన్న ఒకాయన..

'మ్మోవ్.. ఎంకటమ్మా! నిజంగానే దేశంలో ఉపద్రమే వొచ్చినట్టుండాది రొండ్రోజుల నుంచీ. ఎయ్యి, ఐదు నూర్ల నోట్లు ఎవురికాడ ఉన్నా చెల్లవని, అయ్యన్నీ దెచ్చి బ్యాంకీల్లో ఇచ్చి కొత్తనోట్లు దెచ్చుకోమనీ ఆర్డరేసింది గవుర్మెంటు. ఇంగ మిగిలిండేది చిల్లర నోట్లే. ఎవురికి వాళ్లు పెద్దనోట్లు బ్యాంకీల్లో కట్టేసి, చిన్ననోట్లు తెచ్చుకుండేదాంట్లో తలమునకలై ఉండారు. నీకిచ్చేదానికి చేతుర్లాగ్గాదు ఇయ్యింది. ఎవురికాడా లెక్క లేకనే. ఎవురికి వాళ్లు వాళ్ల దగ్గరుండే చిన్ననోట్లు వాళ్ల అవసరాల కోసం పెట్టుకోనుండారు. ఉండే ఆ రోంత లెక్కా నీకిస్చే రేప్పొద్దున వాళ్ల అవసరాలకెట్టా?' అని చెప్పి వెళ్లిపోయాడు.

అది ఆమెకు అర్థం కాలేదు. 'ఒకేరోజులో లెక్క చెల్లకుండా పొయ్యేదేందబ్బా? యాడా ఇన్లేదే!' అని విచిత్రపడుతూ నిలబడిపోయింది.

ప్రతి కరెన్సీ నోటూ 'గ్యారంటీడ్ బై ద గవర్నమెంట్ ఆఫ్ ఇండియా' అని, ఆ గ్యారంటీని ఆ ప్రభుత్వమే తూచ్ అనేసి వెనక్కి తీసేసుకున్నదని ఆమెకు తెలియదు. ప్రస్తుతం ఆమె ఆలోచనల్లా ఒకటే..

'అమ్మిని ఆసుపత్రిలో జూపియ్యాలంటే ఎయ్యి, పదైదు నూర్లన్నా గావాల. అంత లెక్క నా కాడ యాడుంది? ఏ బ్యాంకీలో అన్నా దొంగతనానికి బోవాల్సిందే!'.. మనసులో మాటనే బయటికి అనేసింది.

'దొంగతనానికెందుకూ? బ్యాంకీలో నీ అకౌంటే ఉంది గదా?'.. ఆ దారిన పోతూ, ఆమె

మాటలు విన్న జన్మభూమి కమిటీ మెంబరు గుర్తుచేశాడు.

అప్పుడు గుర్తొచ్చింది రెండేండ్ల కింద తన పేరుమీద బ్యాంకులో అకౌంటు తెరిచిన సంగతి. దానిపేరు 'జన్ ధన్' అకౌంట్.

* * *

'నాకెందుకు బ్యాంకకౌంటు?'.. ఊర్లో బ్యాంక్ అకౌంట్లు లేనోళ్లందరికీ అకౌంట్లు తెరిపించాలని వచ్చిన జన్మభూమి కార్యకర్తను అడిగింది.

'ఇప్పుడు నువ్వు ఉపాధి హామీ పనికి పోయినప్పుడు అదేరోజు నీకు లెక్క ముట్టలేదనుకో.. నువ్వు రోజూ పని మానుకొని కోఆర్డినేటరు చుట్టూ ఎప్పుడిస్తాడోనని తిరగనవసరం ల్యాకండా జీతం పడినట్టే నేరుగా నీ అకౌంట్లో వచ్చి పడతాది'.

'ఆ నా బట్ట ఏసిందీ లేన్దీ నాకెట్టా తెలుస్తాది?'.

'నీ ఫోనుకు మెసేజొస్తాది. ఎవురన్నా నీ అకౌంట్లో లెక్క ఏసినా తీసినా.. టింగు టింగుమని బెల్లు కొడ్తాది'.

'అది రోజుకు ముప్పైసార్లు ఒకటే మొఖాన కొడ్తానే ఉంటాది. ఎన్నిసార్లని జూసుకునేది?'.

'చూసుకోవాల. 'డీఎన్డీ' అని ఒకటుందిలే! అది బెట్టుకుంటే అన్ని ఫోన్లూ, మెసేజీలూ రావు. నీగ్గావాలంటే నేను సెట్ జేసిస్తా'.

'ముందాపని జేసిబెట్టు నాయనా! నీకు పున్నెముంటాది'.

'సరే.. సేస్తాలేగానీ నీ ఆధార్ కార్డు తీసకరా'.

'అద్దేనికి?'.

'రామాన్నెమంతా యిని నీ యట్టాట్టే అడిగిందంట.. రామునికి సీతేమైతాదని. ఇంగెందుకు నేనొచ్చింది? బ్యాంకీలో నీకు అకౌంటు తెరిసేదానికి'.

'నాకు రావాల్సిన లెక్కంతా బొయ్యి బ్యాంకీలో గూచ్చుంటే నేను దెచ్చుకుండేదెట్టా?'.

'నీకు అకౌంటుతో బాటే ఏటీఎం కార్డు గుడకా ఇస్తారు. అదుంటే నువ్వు బ్యాంకీకి బొవ్వాల్సిన పన్లా. టౌన్లో ఈదికొకటుండాయి ఏటీఎం మిసన్లు. అయ్యి ఇరవై నాలుగ్గంటలూ తెరిసే ఉంటాయి. నీకెప్పుడు గావాలంటే అప్పుడు బొయ్యి ఆ కార్డు ఆ మిసన్లో బెట్టి.. నాకింత లెక్కగావాలని బటన్లు వొత్తుతే నోట్లు మిసన్లోనుంచి వస్తాయి'.

'యా బటనొత్తాలో నాకెట్ట దెలుస్తాది?'.

'ఒక్కసారి జూస్చే అన్నీ నీకే దెలుస్తాయి. ఒకటి మాత్రం బాగ గుర్తుబెట్టుకో! ఎవురికే గానీ.. ఆకిరికి ఆ బ్యాంకీవోడే అడిగినా గానీ నీ కార్డు మీదుండే నంబర్లు గానీ, నీకు మెసేజ్లో వొచ్చే నంబర్లు గానీ చెప్పనేవొద్దు'.

'ఆ నంబర్లేమన్నా బాగ్గెమా? సెప్తే ఏమైతాది?'.

'నీ అకౌంట్లో ఉండే లెక్క మొత్తం ఊడ్చుకోని బోతాది'.

'ఓయమ్మో! ఈ అకౌంటు జేసియ్యమని నేన్నిన్ను అడిగినానా? ఇప్పుడు నాకెందుకియ్యన్నీ?'.

'కేంద్రంలో ప్రభుత్వం మారిపోయిండ్లా? ఇంతకు ముందున్నె కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి మనిషికీ ఆధార్ కార్డ్ ఇచ్చింటే తీసుకున్నారా లేదా? పనికి ఆహార పథకం అని రోజు కూలీకి ఉపాధి హామీ పనులు ఇస్చే సేస్చండారా లేదా? ఇప్పుడు మోడీ ప్రభుత్వమొచ్చింది. ఇన్నేండ్లూ పెద్దపెద్దోళ్లు విదేశాల్లో దాసిపెట్టుకోనుండే లప్పలన్నీ తీసుకచ్చి అందరికీ పంచుతారంట. తర్వాత ఎవరికీ పనికి ఆహార పథకాలు పెట్టాల్సిన పన్లే!'.

'అయ్యన్నీ అయ్యే పనులు గావులేగానీ.. ఇదో ఆదార్ కారటు'.

'ఇదో ఈ ఫారమ్మింద సంతకంబెట్టు!'.

'ఎంకటమ్మ' అని సంతకాలు పెట్టించి, తీసుకుపోయి రెండ్రోజుల తర్వాత పాసుబుక్కు, ఏటీఎం కార్డు తెచ్చి ఇచ్చాడు.

'నీకు రోజూ ఏదో ఒకదానికి లెక్క అవసరమైతానే ఉంటాది. కానీ, ఎప్పుడో ఒకసారి మాత్రం పానం మిందికొస్చాది. అది అత్యవసరం. అప్పుడు వాడుకోవడానికి నీ చేతిలో లెక్కలేకుండా పోయే పరిస్థితి తెచ్చుకోకుండా అప్పుడప్పుడూ రోంత లెక్క ఈ అకౌంట్లో ఏసుకుంటా ఉండు. అది అత్యవసరమైన పరిస్తితుల్లో నీకు అక్కరకొస్చాది'.. అని అతడు చెప్పిన మాట వంటబట్టించుకుని, మొదట్లో చేతికి డబ్బు వచ్చినప్పుడల్లా ఎంత వీలైతే అంత అతనికే ఇచ్చి.. అకౌంట్లో వెయ్యమని చెప్పింది. ఆ అకౌంట్‌లో దాదాపు రూ.1,500/- జమజేసి పెట్టింది. తర్వాత మెల్లగా దాని గురించి మర్చిపోయింది.

* * *

'ఈ రొండేండ్లల్లో దాని మిందొచ్చిన వొడ్డీ దగ్గర దగ్గర నూర్రూపాయలైనా అయ్యింటాది. రేబ్బొయ్యి అద్దెచ్చుకోవాల!' అనుకుంది.

అప్పుడట్లా అనుకుని ధైర్యం తెచ్చుకుంది గానీ, మరుసటిరోజు టౌనుకు పోయి అక్కడి పరిస్థితి చూసేసరికి ఆమెకు దిమ్మ తిరిగిపోయింది.

బస్టాండుకు దగ్గరగా ఉండి, తనకు బాగా తెలిసిన ఏటీఎం దగ్గరికి పోయి చూసింది. ఎవ్వరూ లేరు. కాసేపు అక్కడే నిలబడింది. ఈలోపు ఆ దారెంట ఎవరో పోతూ ఉంటే దగ్గరికి పోయి పిలిచింది.

'అన్నా! అకౌంటులో నుంచి లెక్క దీసుకోవాల'.. ఆమె చెప్పేది ఇంకా పూర్తికాక ముందే అతను సమాధానం ఇచ్చాడు..

'ఏ ఏటీఎంలో గానీ లెక్క లేదు మ్మో! దాని గురించే మూడ్రోజుల్నించి దేశమంతా అగ్గయితా ఉంది. నీకు తెలియదా?'.

'ఏందీ? ఈ మిసన్లలో గుడకా లెక్క లేదా? అయితే ఇప్పుడెట్ట జెయ్యాలన్నా? లెక్క బ్యాంకీకి బొయ్యి దెచ్చుకోవాల్నా?'..

ఒకవేళ అవునంటే బ్యాంకులో ఎట్లా తెచ్చుకోవాలో తెలియకపోయినా అయోమయంగా అడిగింది. అతను విసుక్కోకుండా పెద్దనోట్ల రద్దు గురించి వివరంగా చెప్పాడు.

అక్కడినుంచి మొదలుపెట్టి టౌన్లో ఉండే ఏటీఎం సెంటర్లన్నీ చుట్టబెడుతూ కాలుగాలిన

పిల్లిలా రోజంతా తిరుగుతూనే ఉంది. యర్రముక్కపల్లెలో ఎక్కడో ఏటీఎంలో డబ్బు నింపారని విని ఆపసోపాలు పడుతూ అక్కడికి పరుగెత్తింది. అక్కడ చేంతాడంత క్యూ ఉంది. ఇద్దరు ముగ్గురి వంతు కాగానే ఏటీఎం ఖాళీ. ఉసూరుమని కూలబడగానే ఇంకెక్కడో ఏటీఎంలో డబ్బు నింపుతున్నారని విని అక్కడికి పరుగు.

ఎండాకాలంలో నీళ్లకోసం పడిన కష్టాలు గుర్తొచ్చినాయి.

ఊర్లోని బావులు, చేతి పంపులన్నీ ఎండిపోయిన కాలంలోనే వ్యవసాయ భూముల్లో సాగునీళ్లకు కరెంటు మోటార్ల వాడకం మొదలైంది. అప్పట్లో మోటార్లకు కరెంటు రాగానే పొలాలకు నీళ్లకోసం మోటారు వేసి ఉంటారు కాబట్టి.. ఊరివాళ్లంతా పొలోమని బిందెలు చేతబట్టుకుని పడుతూ లేస్తూ కిలోమీటరు దూరం పరుగెత్తి, ఉరుకులు పరుగుల మీద నీళ్లు తెచ్చుకునేవాళ్లు. ఒక మోటార్ ఆడకపోతే అక్కడికి దగ్గర్లో ఉండే ఇంకొక మోటర్ దగ్గరికి, అక్కడా లేదంటే మరొక మోటార్ దగ్గరికి.. నడుస్తున్న మోటార్ ఆఫ్ కాకముందే చేరుకోవాలని బిందెలు పట్టుకుని పోటీల మీద పరుగెత్తేవాళ్లు.

ఇప్పుడు తన లెక్క (డబ్బు) తను తీసుకోవడానికి ఊరంతా పరుగులు తియ్యాల్సి రావడంతో ఏడుపొచ్చింది. మూడు రోజులు అదే విధంగా గడిచింది. రోజురోజుకూ గంటగంటకూ ధైర్యం దిగజారిపోతూ ఉంది. నాలుగో రోజు.. ఏ దేవుడో తన మొర ఆలకించినట్లు నగదు నిల్వలున్న ఏటీఎంలోకి ప్రవేశం లభించింది. దేవుడిని మొక్కుకుని ఏటీఎం కార్డు బయటికి తీసి తన వెనకున్న అతనికి ఇచ్చి..

'ఇది ఎట్ట వాడాల్నో నాకు తెలవదు! ఎప్పుడూ వాడిన్దాన్ని గాదు. ఇప్పుడంటే పానమ్మిందికొచ్చి ఇట్టొచ్చినా. రోంత లెక్క తీసిస్తావా సారూ?' అని అడిగింది.

అతను పిన్ అడిగి, ఏటీఎం కార్డును స్లాట్‌లో పెట్టాడు.

పిన్ వెరిఫికేషన్ తర్వాత..

'ఎంత గావాల?' అని అడిగాడు.

'పద్దైదు నూర్లు!' అని చెప్పింది. అతను వింతగా చూశాడు. మాట్లాడకుండా 1500 ఎంటర్ చెయ్యగానే, స్క్రీన్ మీద ఏదో మెసేజ్ కనిపించింది. ఇంగ్లీషు కాబట్టి.. అదేమిటో ఆమెకు అర్థం కాలేదు.

అతను వివరించాడు..

'అమ్మా! ఇప్పుడు ఐదు నూర్ల నోట్లు, వెయ్యి రూపాయల నోట్లు లేవుగదా? నూర్రూపాయల నోట్లకు దేశంలో కొరతొచ్చింది. ఇందులో రెండువేల నోట్లే ఉండాయి. కాబట్టి రెండువేల రూపాయలకు తక్కువైతే రావు'..

నాలుగు రోజులనుంచి ఎదురవుతున్న పరిణామాల వల్ల మెదడు మొద్దుబారిపోయి, బాహ్యస్మృతి కోల్పోయినదానిలా ఆమె రెండువేల రూపాయలే తియ్యమని చెప్పింది. అతను అమె చెప్పినట్లే 2000 ఎంటర్ చేసి..

'ఇన్‌సఫీషియంట్ బ్యాలన్స్!' అని చదివాడు.

'ఏమ్మా! నీ అకౌంట్లో ఎంతుంది?' అని అడిగాడు.

'ఉంటే ఒక పద్దైదు.. పదారు నూర్లుంటాది నాయనా!' అని చెప్పింది.

'ఇప్పుడు ఏటీఎంలో రెండువేల కంటే తక్కువ తీసుకోవడానికి లేదు. నీ అకౌంట్లోనేమో అంత డబ్బు లేదు. బ్యాంకుకు పోయి అడిగి చూడు' అని సలహా ఇచ్చాడు.

బ్యాంకుకు పోయి చూస్తే అదొక పెద్ద తిరునాళ్లలా ఉంది. రద్దయిన నోట్లు డిపాజిట్ చెయ్యడానికి కౌంటర్ల చుట్టూ గోలగోలగా ఫోన్లలోనూ, ఎదుటి మనుషులతోనూ మాట్లాడుతూ.. ఇసుకేస్తే రాలనట్లు కిక్కిరిసిపోయిన జనం. అక్కడ ఒకరిద్దరిని అడగబోయినా పట్టించుకునే స్థితిలో ఎవరూ లేరు. ఇంకెవరిని ఏమడగాలో తెలియక తిరిగి వెనక్కి వచ్చేసింది.

దిగులుగా ఇల్లు చేరుకుంది. మగతగా పడుకుని ఉన్న కూతురికి, ఆమె వచ్చినట్లయినా తెలుసో లేదో అర్థం కావడం లేదు. బలవంతంగా లేపి కూర్చోబెట్టి గంజి తాగించింది. కూతురి పరిస్థితి చూస్తుంటే దిగులుగా ఉంది. ఇంకా ఆలస్యం చేస్తే ఏమవుతుందోనని భయం కూడా వేసింది.

మరుసటిరోజు పొద్దున్నే ఏమైతే అదైందని కూతుర్ని వెంటబెట్టుకుని ఆసుపత్రికి బయల్దేరింది. అప్పటికి జ్వరం మొదలై వారం రోజులు దాటింది. తనవంతు రాగానే కన్సల్టేషన్ రూములో డాక్టర్‌కు రెండు చేతులెత్తి నమస్కారం చేసి.. పరిస్థితి వివరించింది. డాక్టర్ సానుభూతితో విన్నాడు.

'నగదు లేకపోతే పోయింది.. పేటీఎం ఉందా?' అని అడిగాడు.

'ఏటీఎం కారటుంది'.

'ఏటీఎం గాదు. పేటీఎం!'.

'అదేందో తెల్దు సారూ. నా కాడ ఏటీఎం కారటు, ఆదార్ కారటు ఇయ్యే ఉండాయి'.

'పేటీఎం అనేది కార్డు గాదు. ఫోన్లో ఉంటాది. అదుంటే అకౌంట్లో నుంచి ఎవురికైనా లెక్క పంపియ్యొచ్చు'.

'అదేందో కూడా నాకు దెలియదు. ఇప్పుడు ఏటీఎంలో ఇరక్కపోయినట్లు దాంట్లో కూడా లెక్క ఇరక్కపోతే?'. డాక్టరు నవ్వాడు. 'అది నా పోన్లో బెట్టను ఐతాదా?'.. అంటూ ఫోన్ తీసి చూపించింది. 'నీది స్మార్ట్‌ఫోన్ కాదే? దీంట్లో పేటీఎం కుదరదు. ఏం చేద్దాం..? సరే! నా ఫీజు సంగతి తర్వాత చూసుకోవచ్చు. పాపను బెంచి మీద పడుకోబెట్టు' అని పరీక్ష చేసి చూశాడు. టైఫాయిడ్, మరికొన్ని రోగనిర్ధారణ రక్త పరీక్షలు రాసిచ్చాడు.

పరీక్షలు రాసిచ్చిన చీటీ తీసుకుని, కూతుర్ని ఎత్తుకుని ల్యాబ్‌కు బయల్దేరింది. ల్యాబ్ కౌంటర్లోని వ్యక్తికి చీటీ అందిస్తూ..

'డాక్టరు ఈ పరీచ్చలు రాసిచ్చినాడు. గానీ నా డబ్బంతా బ్యాంకీలోనే ఉండాది. బిల్లెట్లా కట్టాలో తెల్దం లేదు' అని చెప్పింది.

వాళ్ల దగ్గర స్వైపింగ్ మెషీన్ లేదు. వాళ్ల దగ్గరే కాదు, ఒక మాదిరి పేరున్న ఆసుపత్రుల్లో, ల్యాబుల్లో, ఇతర షాపుల్లో ఎక్కడా ఇంకా కార్డు పేమెంట్లకు మారలేదు.

బిల్లు కట్టకపోతే టెస్టులు చెయ్యడం కుదరదని చెప్పారు. వాళ్లకు సాయపడాలనే ఉన్నా.. టెస్టులకయ్యే ఖర్చు చేతినుంచి పెట్టుకోవడానికి సిద్ధంగా లేరు. అదైనా పదో ఇరవయ్యో కాదు కాబట్టి. మళ్లా ఈసురోమని ఆసుపత్రికి తిరుగుముఖం పట్టింది.

'ఈ పరీచ్చలు నా పానం మిందికొచ్చినాయి సారూ! అయ్యి లేకుండా మాత్తర్లు, మందులు రాసియ్యలేవా?' అని దీనంగా అడిగింది.

'టెస్టుల్లేకుండా మందులివ్వగలిగితే ఏ డాక్టరైనా ఈ ఖరీదైన పరీక్షలెందుకు రాయిస్తారమ్మా? ఈ జ్వరం ఎందుకొచ్చిందో, మామూలు పారాసిటమాల్ మాత్రలకు ఎందుకు తగ్గడం లేదో తెలుసుకుంటే తప్ప సరైన మందు ఇవ్వలేం. ఏం జ్వరమో కేవలం లక్షణాలను బట్టి కనుక్కోలేనప్పుడే పరీక్షలు రాయిస్తాం. అవసరమైన మందుకు బదులు వేరే మందులు వాడటమంటే.. ఏ ఊరికి పోతుందో తెలియని బస్సెక్కి మీ ఊరికి పోవాలనుకున్నట్లే! అన్ని మందులూ ఇచ్చి చూద్దామంటే.. అన్ని మందులు ఒకేసారి వాడితే శరీరం తట్టుకోలేదు. వాటిలో కొన్ని మందులు రోగం లేనప్పుడు వాడటం ప్రమాదం కూడా!' అని చెప్పాడు డాక్టర్.

ఇంకేమనాలో తెలియక చివరిసారి గట్టిగా నిట్టూర్చి.. అప్పటికే కొనప్రాణంతో ఈడిగిలపడి ఉన్న కూతుర్ని భుజాన వేసుకుని ఊరి దారిపట్టింది. కూతురి ఒళ్లు మెల్లగా చల్లబడటం.. ఇల్లు చేరేవరకూ ఆమె గమనించనే లేదు.

* * *

త్రివిక్రమ్ స్వస్థలం కడప జిల్లా పడిగెలపల్లె. ఎంసీఏ చేసి, సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారు. ఇంటర్‌నెట్‌లో యూనికోడ్ తెలుగువ్యాప్తికి విశేషంగా కృషిచేసిన తొలితరం తెలుగు బ్లాగర్లలో ఈయన ఒకరు. అదే లక్ష్యంతో ఏర్పడిన 'ఈ-తెలుగు' సంస్థకు వ్యవస్థాపక ఉపాధ్యక్షుడిగా, తెలుగు వికీపీడియా నిర్వాహకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 'పొద్దు' తెలుగు వెబ్ మాగజైన్‌కు వ్యవస్థాపక సంపాదకుడిగా, 'ఈమాట' సహ సంపాదకుడిగా వ్యవహరించారు. ఇంటర్‌నెట్‌లో సొంత పేరుతోనూ, 'సుగాత్రి' కలం పేరుతోనూ విభిన్న అంశాల గురించి విస్తృతంగా వ్యాసాలు రాశారు. కథకుడిగా 'అద్దంలో మూట' కథే.. మొదటిది. అంతకుముందు చందమామలో శాస్త్ర జ్ఞానం – లోక జ్ఞానం సింగిల్ పేజీ కథ, చతురలో మినీ కథల రూపంలో కొన్ని హాస్య సన్నివేశాలు ప్రచురితమయ్యాయి. పెద్దనోట్ల రద్దు సమయంలో జరిగిన ఒక యథార్థ సంఘటనను స్ఫూర్తిగా తీసుకొని 'అద్దంలో మూట' కథను రాశారు.

Katha PART 1_Layout 1 6/29/2023 2:38 PM Page 101

# వ్యత్యాసం



**నామని సుజనాదేవి,**

**77993 05575**

'మీరెన్నన్నా అనండి! కానీ, పాపం నోరులేని ఆ జీవాలను ఎవరైనా ఏమైనా అంటే మాత్రం నేను ఊరుకోను! అది మామయ్యే కానీ.. మీరే కానీ!'.

'అదికాదే! మొన్ననే కదా అమ్మ చనిపోయింది. అమ్మతో నాన్నకు ఎంతలేదన్నా యాభై ఏళ్ల అనుబంధం. అలాంటిది.. అంత బాధలో ఉన్న ఆయన మనసు బాలేక ఏమైనా అన్నా నువ్వు ఊర్కో.. ఏమీ అనకు'.

'అరె! నేనేమన్నానని?.. 'మీరు మమ్మల్ని ఏమైనా అనండి మామయ్యగారు! కానీ, నోరులేని ఈ మూగజీవాలను మాత్రం ఏమీ అనకండి' అన్నాను. అంతే కదా! అయినా నాకు మాత్రం అత్తయ్య లేని ఆయన ఎంతో బాధలో ఉన్నాడని తెలీదా ఏం? అందుకే కదా.. అత్తయ్య కార్యక్రమాలన్నీ కాగానే.. గుళ్లో, వాళ్ల అత్తగారింట్లో నిద్ర అయ్యాక, ముందుగా మనమే మన ఇంటికి తీసుకొద్దామని అన్నది'.

'నిజమే మధూ! నేను కాదన్నానా? ఆయన మనసు చాలా సున్నితం. మొదటినుంచీ మా అమ్మకూడా ఆయన్ని అలాగే చూసుకుంది. ఏదో ఆయన మన టామీని పట్టుకుని.. 'ఛీ! వెధవ సంత' అన్నాడే అనుకో.. దానికి వెంటనే ఆయన మొహంపై కొట్టినట్లు అలా.. 'మామయ్యా! నన్నేమైనా అనండి కానీ, వాటిని ఏమైనా అంటే నేను ఊరుకోను' అంటూ అల్టిమేటం ఇవ్వాలా?.. 'ఏదో నోరులేని జంతువు

కదా మామయ్యా! ఏదో ఇంత పడేసినా జీవితాంతం విశ్వాసంగా ఉంటుంది' అంటూ సున్నితంగా మాట్లాడితే అయిపోయేది కదా అనీ!'.

'ఛీ! ఛీ! వెధవ బతుకు! ఈ ఇంట్లో ఎంత చేసినా ఇంతే! ఆయన బాధలో ఉన్నాడని నేనెంత మంచిగా చూసుకుంటున్నాను. అదేం కనిపించదు మీకు. నేను ఒక్కమాట కొంచెం కటువుగా అన్నదే కనిపిస్తుంది. పొద్దున లేవగానే ఎప్పటిలా హడావుడి అయినా.. గుర్తుపెట్టుకుని ఆయనకు కాఫీ కలుపుతున్నానా? మళ్లీ వేడివేడిగా టిఫిన్ చేసి.. 'తినండి మామయ్య గారూ!' అంటున్నానా? 'మీకు ఏ కూరలు ఇష్టమో చెప్పండి.. అవే వండుతాను' అంటూ అడుగుతున్నానా? ఇలా ఎప్పటికీ ఆయన బాగోగులు చూస్తూనే ఉన్నాను కదా! ఏ కోడలైనా ఇంతకన్నా బాగా చేస్తుందా?'.. ముక్కు చీదింది మాధవి.

'అబ్బా! నీకో నమస్కారం తల్లీ! కుళాయి కట్టేయి. పొరపాటున అన్నాలే కానీ. ఇక ఊర్కో!'.

'అదిగో! ఎంత వెటకారమో! అప్పటికీ అందరూ మంచివాళ్లు.. నేనే ఏదో రాద్ధాంతం చేస్తున్నట్లు!'.. ఇంకా ఏదో అనబోతుంటే, అప్పటికే వాకింగ్ నుంచి ఇంట్లో అడుగుపెట్టి, అంతా విన్న సీతారామయ్య.. ఆ వివాదం తప్పించడానికి, దగ్గుతూ తన ఉనికి తెలియజేస్తూ..

'ఏంరా! ఏంటీ గొడవ?' అన్నాడు.

'అబ్బే! ఏంలేదు నాన్నా! మన టామీకి ఆరోగ్యం బాలేదట. 'ఈవేళ సాయంత్రం త్వరగా రండి. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాలి. అలానే రేష్మీని కూడా చెకప్ చేయించినట్లు ఉంటుంది' అంటున్నది మధు'.

టామీ, రేష్మీ.. రెండూ వాళ్లు పెంచుకునే కుక్కలు.

'కాసిన్ని మంచినీళ్లు వేడిచేసి ఇవ్వరా నాన్నా!' దగ్గుతూ అన్నాడు సీతారామయ్య.

'ఏమయ్యింది నాన్నా! దగ్గుతున్నారు?'.

'నిన్నటినుంచి కొంచెం బాలేదురా. చల్లగాలిలో నడిచినందుకేమో జలుబు, దగ్గు'.

'అయ్యో! అలాగా నాన్నా! కాస్తంత ఎండ వచ్చాక వాకింగ్‌కు వెళ్లు. చెవుల చుట్టూ మఫ్లర్ చుట్టుకో! ఆగు నా దగ్గర ట్యాబ్లెట్స్ ఉన్నాయి. ఇవి వేసుకుని టీ తాగు నాన్నా!'.

'బీపీ ట్యాబ్లెట్స్ అయిపోయాయి రా! అలాగే జండూబామ్ లేకపోతే రోజు గడవదు'.

'అలాగే లే నాన్నా! ఈవేళ ఆఫీసు నుంచి వచ్చేప్పుడు తెస్తాలే! మరి వెళ్లొస్తాను'.

'ఏమండీ! అలాగే మన టామీ బిస్కెట్లు.. దాని టానిక్ అయిపోయింది. వచ్చేప్పుడు తెండి!'.

'అలాగే!'.. అంటూ వెళ్లిపోయాడు రామకృష్ణ.

సాయంత్రం వస్తూనే..

'త్వరగా టామీని, రేష్మీని తీసుకుని వచ్చేయి మధూ! లేటయితే డాక్టర్ వెళ్లిపోతాడు'.. అంటూ తొందరపెట్టగానే, ఉన్నపళాన టామీతో కారెక్కేసింది మాధవి. వచ్చేసరికి చాలా

పొద్దుపోయింది.

ఆ తెల్లవారి రెండో కొడుకు రాఘవ వచ్చి రమ్మనగానే.. ఆయనకున్న ఆస్తి అయిన బట్టలు, మందుగోళీలు అన్నీ సర్దుకుని రాఘవతో బయల్దేరాడు సీతారామయ్య.

* * *

'భౌ! భౌ!'..

గేటు తెరవడంతోనే గయ్యిమంటూ మీదికొచ్చిన కుక్కను చూసేసరికి.. సీతారామయ్య పై ప్రాణాలు పైనే పోయాయి. వెంటనే భయంతో రాఘవ వెనక్కి వచ్చేశాడు.

'హే స్వీటీ! యూ నాటీ! గో ఇన్‌సైడ్.. అదేమనదు నాన్నా!'.. నవ్వుతూ అంటూ, తండ్రి చేయి పట్టుకుని లోపలికి నడిపించుకెళ్లాడు. కోడలు పలకరించి మంచినీళ్లు అందించింది. తాగుతూ ఉంటే.. ఎదురుగా కనిపించిన రెండు అల్మారాలలో ఉన్న మందులను చూసి ఆశ్చర్యపోయాడు.

'ఏమిట్రా ఇవి! ఇన్ని మందులు ఏంటి?' అడిగాడు కొడుకును.

'అయ్యో నాన్నా! కంగారు పడకు. అవి మావికావు. మన స్వీటీవి. ఇటీవల దానికి ఆరోగ్యం బాగా ఖరాబైందని డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాం. అప్పుడు కొన్నవి. అంతకుముందువి. దాని ఆహారం, బిస్కెట్లు వగైరా అన్నమాట! ఆ డబ్బాలపై రాసి ఉంది చదువు' అన్నాడు.

'కళ్లద్దాలు అంతగా అగుపడటం లేదురా! అక్కడ అన్నయ్యతో అన్నా గానీ.. పాపం వాడికి తీరలేదు'.

'ఇక్కడ ఒకసారి వెళ్దాంలే నాన్నా!'.

'షుగర్, బీపీకూడా చెక్ చేయించుకుని చాలా రోజులయ్యింది రా!'.

'వీలు చూసుకుని ఒకరోజు వెళ్దాంలే నాన్నా!'.. అంటూ హడావుడిగా బయటికి వెళ్లిపోయాడు.

'మామయ్యా! స్వీటీకి ఇవ్వాళ ఆలస్యం అయిందని ఒకటే గునుస్తుంది. పిచ్చిముండ! దానికి కొన్ని పాలు, బిస్కెట్స్ వేసి.. మీకు టిఫిన్ తెస్తాను. టీవీ చూస్తుండండి మామయ్యా!..' అంటూ లోనికెళ్లింది కోడలు శ్రావణి.

ఉదయం తొమ్మిదే అయినా.. లోపల ఆకలి నకనకలాడుతున్నది. అదే తన స్వరాజ్యం ఉంటేనా!

'అసలే షుగర్! ఇంతసేపు ఎలా ఉంటారు?' అంటూ ముందు ఏదో ఒకటి తినడానికి ఇస్తుంది. ఆమెకు పూజలో ఆలస్యమైనా తనే వంట గదిలోకి వెళ్లేవాడు. తనకోసం ఇలా అర్జెంట్‌గా పనికొస్తాయని, ఎక్కువ నూనెలేని వస్తువులు, అటుకుల చుడువా, పేలాలు, మొలకలు లాంటివేవో తనకోసం సిద్ధంగా ఉంచేది. ఇప్పుడు అలా వంటింట్లోకి చనువుగా వెళ్లలేడు. అలా అని.. నోరు తెరిచి చనువుగా ఆకలంటూ అడగనూ లేడు.

తన భార్యను తలుచుకొంటూ.. ఉస్సురని నిట్టూర్చాడు.

అరగంటలో ఉప్మా తీసుకొచ్చింది శ్రావణి. అది చూడగానే నీరసం ముంచుకొచ్చింది ఆయనకు. నిజానికి ఆయనకు మొదటి నుంచీ ఉప్మా అంటే అస్సలు ఇష్టం ఉండదు. భార్యకు ఆయన ఇష్టాయిష్టాలు తెలుసు కాబట్టి.. ఆయనకు ఎప్పుడూ ఉప్మా పెట్టేది కాదు. కానీ, ఇప్పుడు ఆమెలేని తాను ఏకాకి అయ్యాడు. ఆత్మీయులందరూ ఉన్నా.. ఎవరూ లేని ఒంటరిలా మిగిలాడు. భార్య గుర్తుకురాగానే కళ్లు చెమర్చాయి ఆయనకు.

ఇక్కడ రాఘవ, శ్రావణి ఇద్దరూ బిజీగానే ఉంటారు. ఇద్దరు పిల్లలు. వాళ్లూ.. పెద్దబ్బాయి పిల్లల్లాగే పొద్దున స్కూల్, సాయంత్రం ట్యూషన్, సంగీతం క్లాసులతో బిజీగానే ఉంటారు. ఖాళీగా ఉండేది సీతారామయ్య మాత్రమే. పొద్దున లేవగానే రాఘవ కుక్కను పట్టుకుని అలా కాలనీలో దాని కాలకృత్యాలకు తీసుకెళ్తాడు. ఒక్కోసారి అరగంట పైనే అవుతుంది. రాగానే ఫోన్లు అటెండ్ అవుతూ, ఆఫీసుకు తయారయ్యే బిజీలో ఉంటాడు. కోడలు శ్రావణి పనిమనిషికి పనులు పురమాయిస్తూ, వంట చేస్తూ.. బిజీగా ఉంటుంది.

పొద్దునే అలా పెరట్లోకెళ్లి మొక్కలను పరామర్శిస్తూ, అవి తలలూపుతూ పలికే స్వాగతాన్ని ఆస్వాదిస్తూ, అర్ధాంగితో చెప్పాలని అనుకున్నవన్నీ వాటితో పంచుకుంటూ.. కాలం గడపడం అలవాటు చేసుకున్నాడు సీతారామయ్య. కళ్లద్దాలు ఇంకా మార్చకపోవడంతో తనకు ఇష్టమైన.. 'చదవడం' అనే వ్యాసంగాన్ని కొనసాగించలేక పోతున్నాడు. పొద్దున మొక్కలతో ముచ్చట్లు అయిపోయాక.. స్నానం, పూజ ముగించుకునేసరికి కాఫీ, టిఫిన్ సిద్ధంగా ఉంటుంది.

ఆయనకు ముందునుంచే కుక్కలంటే చాలా భయం. చాలా ఏళ్లకింద ఒకసారి కుక్క కరిస్తే.. ఆయనపడ్డ నరకం అంతా ఇంతా కాదు. ఆ ఇంజక్షన్ల బాధ ఒకెత్తయితే.. పథ్యం అంటూ కడుపు మాడ్చుకోవడం, పొరపాటున ఏ రేబిస్ వ్యాధో వస్తుందని భయపడి చావడం.. ఇదంతా మరో ఎత్తు. ఆయనెంత భయపడతాడో అందుకు తగ్గట్లు కొడుకులిద్దరి ఇళ్లలో కుక్కలు ఉండటం ఆయనకింకా చిరాకు తెప్పించింది. అందుకే చిన్నవాడు రమణ వచ్చి, తన ఇంటికి తీసుకెళ్తానంటే ఆనందంగా బయల్దేరాడు.

* * *

ఇంటికి వెళ్లిన ఆయనను కోడలు, మనవళ్లు ఆప్యాయంగా పలకరించారు. అయితే ఒకరోజు పొద్దునే మనవడు అన్న మాటలు.. ఆయనకు పక్కన బాంబు పడ్డట్లు ఉలిక్కిపడేలా చేశాయి. ఇంతకీ మనవడు హర్ష ఏమన్నాడంటే..

'నాన్నా! మరే.. పెద్దనాన్నల అందరి ఇళ్లలో ఎంచక్కా మంచి కుక్కలు ఉన్నాయి. మా ఫ్రెండ్స్ ఇళ్లలో కూడా ఉన్నాయి. మనంకూడా కుక్కను పెంచుకుందాం నాన్నా!' అని.

'అవునండీ! ఇప్పుడు అది మంచి స్టేటస్ సింబల్ కూడా! అంతేనా! ఇవ్వాళ రేపు దొంగల భయం కూడా ఉంది కదా! అది ఇంట్లో ఉంటే.. ఏ భయమూ ఉండదు' అన్నది చిన్న కోడలు.

'అలాగే తెచ్చుకుందాం లెద్దూ!'.. అన్న చిన్న కొడుకు మాటలతో ఉలిక్కిపడి..

'వద్దు! ఎంతమాత్రం వద్దు..' గట్టిగా అన్నాడు సీతారామయ్య.

'ఏం నాన్నా? ఎందుకు వద్దు?' అన్నాడు చిన్నోడు. ఆయనేమీ మాట్లాడలేదు.

'తాతయ్యా! చాలా బావుంటుంది కదా! నీతో ఎంచక్కా వాకింగ్‌కి కూడా వస్తుంది. ఎందుకు వద్దంటున్నావు?'.. ఒకింత సందేహంగానే అడిగాడు మనవడు.

మౌనం వహించాడు ఆయన. అప్పటికి ఎవరో రావడంతో ఆ ప్రసక్తి అక్కడితోనే ఆగిపోయింది.

'నాన్నా! నీతో ఎన్నిసార్లు అన్నాను.. కుక్కను పెంచుకుందామని. ఆ బన్నీగాడు! పేద్ద.. తనకే ఆల్సేషన్ డాగ్ ఉన్నట్లు నా వంక చూస్తూ, వాడి కుక్కతో ఆటలు ఆడుతూ, నాపైకి ఉసిగొలిపి నవ్వుతున్నాడు. వాడి పొగరు అణచాల్సిందే! ఈ రోజు నువ్వు కుక్కను తీసుకురాకపోతే నేను అన్నం ముట్టను అంతే!'..

మనవడి అలకతో గుండెల్లో రాయి పడ్డట్లు అయ్యింది సీతారామయ్యకు.

'వద్దు! ఎట్టి పరిస్థితుల్లోనూ వద్దు..' తనకు తెలియకుండానే వణుకుతున్న గొంతుతో గట్టిగా అరిచాడు మళ్లీ.

ఉలిక్కిపడ్డాడు రమణ. తండ్రిలో ఇంతటి భయం ఇంతకుముందు ఎప్పుడూ చూసి ఉండలేదు అతను.

'పిల్లవాడు ఏదో సంబరపడుతున్నాడు. పోనీ లే నాన్నా! నువ్వెందుకు అంతగా 'వద్దు' అంటున్నావు?'.

మౌనంగా ఉన్న ఆయన్ను చూసి..

'పోనీలే నాన్నా.. వాడి సంతోషం కోసం కొన్నిరోజులు ఉంచుకుని పంపుదాం లెద్దూ!' అన్నాడు మళ్లీ తనే.

'వద్దు. వద్దంటే వద్దు! ఒకవేళ తీసుకురావాలని అనుకుంటే.. నేను ఇక్కడ ఉండను. వృద్ధాశ్రమానికి వెళ్తాను' గంభీరంగా, స్థిరంగా అన్నాడు.

నివ్వెరపోయాడు రమణ. వెంటనే లేచి..

'అదేంటి నాన్నా! ఒకేసారి అంతమాట అన్నావు. ఎందుకో చెప్పు నాన్నా!' అన్నాడు తండ్రి దగ్గరికి వచ్చి, ఆయన చేయిని తన చేతిలోకి తీసుకుంటూ.

కోడలు, మనవళ్లు కూడా అదే అడిగారు.. రెట్టిస్తూ!

'ఎందుకంటే.. ఎందుకంటే.. వాటిని చూస్తే నాకు చాలా అసూయగా ఉంటుంది కాబట్టి!'.

'ఏంటీ?'.. అంతా ఒకేసారి ఆశ్చర్యంగా అడిగారు. వాళ్లకు ఆయన అన్నది అర్థం కాలేదు.

'అసలు వాటిని చూస్తే నీకు అసూయ ఎందుకు నాన్నా? పాపం నోరులేని జీవాలు. ఏదో మిగిలింది ఇంత పెడితే ఎంతో విశ్వాసంగా జీవితాంతం పడి ఉంటాయి. వాటిపై అంత కోపం ఎందుకు నాన్నా? నువ్వే చిన్నప్పటి నుంచి మూగజీవాల పట్ల దయతో ఉండాలని చెప్పావు కదా! చెప్పు నాన్నా..' రెట్టించాడు రమణ.

'ఎందుకంటే.. అవి నన్ను చూసి వెక్కిరిస్తున్నట్లు అనిపిస్తుంది!'.

'అవి వెక్కిరించడం ఏంటి నాన్నా?'.

'పొద్దున్నే వాటిని కాలకృత్యాలకు తీసుకెళ్తారు. కనీసం వాటితో గడిపే ఆ అరగంటైనా నాతో గడపడానికి ఇష్టపడరు. వాటి ఆహారం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ప్రతిరోజూ సమయం ప్రకారం వాటికి పాలు, తినుబండారాలు.. క్రమం తప్పకుండా ఇస్తారు. ఎందుకంటే మూగజీవి.. అడగలేదు కాబట్టి. నాకు మాత్రం ఆకలి నకనకలాడుతున్నా, నోరున్నా అడగలేను. దానికి ఆరోగ్యం బాగాలేకపోతే వెంటనే డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తారు. కానీ, అదే నాకు ఆరోగ్యం బాగాలేక పోతే మాత్రం పట్టించుకోరు. బీపీ, షుగర్ ఉన్నప్పటికీ డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లకుండా, ఇంట్లో ఉన్న ఏవో మందులు వేసుకోమంటారు. ఎందుకంటే.. అందుకు మీ దగ్గర సమయం ఉండదు. ఆహారం దగ్గర.. దానికి పాటించే సమయపాలన నాకు ఉండదు. దానిని హాస్పిటల్‌కి తీసుకెళ్తూ.. అదే దారిలో నన్ను కూడా హాస్పిటల్‌లో చూపించవచ్చు. కానీ, మీకెవరికీ ఆ విషయమే అర్థంకాదు. దానికి ఆహారం అయిపోయినా, మందులు కావాల్సి వచ్చినా.. గుర్తు పెట్టుకుని తెస్తారు. నాకు ట్యాబ్లెట్లు అయిపోయినా, కళ్లద్దాలు విరిగిపోయినా, ఏవి ఎంత అత్యవసరం అయినా.. నేను చెప్పినవి ఏవీ మీకు గుర్తుండవు. కనీసం కుక్కకు ఇచ్చే గౌరవం కూడా నాకు ఇవ్వడం లేదని, అవి నన్ను వెక్కిరిస్తున్నట్లుగా అనిపిస్తుంది. అది నేను భరించలేను!' ఏడుస్తూ అంటున్న ఆయనను.. అక్కున చేర్చుకున్నాడు చిన్నోడు కూడా ఏడుస్తూ!

* * *

**నామని సుజనాదేవి స్వస్థలం హనుమకొండ. ఎంఏ (తెలుగు) చేశారు. భారతీయ జీవిత బీమా సంస్థలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. మూడు దశాబ్దాలుగా రచనా వ్యాసంగంలో ఉన్నారు. ఇప్పటివరకు 250కి పైగా కథలు, 125పైగా కవితలు, 3 నవలలు రాశారు. 4 కథా సంపుటాలు, 2 కవితా సంపుటాలు వెలువరించారు. వీరి మొదటి కథ 'ప్రేమ తపన'. 1991లో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఈ కథకు ఎంతోమంది ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. సాహిత్య సేవలో భాగంగా వందకు పైగా పురస్కారాలు, నగదు బహుమతులు, సన్మానాలు పొందారు. అనేక కథల పోటీల్లో బహుమతులు గెలుచుకున్నారు. వీరి 'స్పందించే హృదయం' కథా సంపుటికి.. ఇప్పటివరకూ ఆరు జాతీయ పురస్కారాలు వచ్చాయి. దాదాపు అన్ని ప్రముఖ పత్రికల్లో వీరి కథలు ప్రచురితమయ్యాయి. వివిధ సంస్థలతో కలిసి సాహిత్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు.**

Katha PART 1_Layout 1 6/29/2023 2:38 PM Page 107

# అంబేద్కర్ మనవాడు



మంచికంటి
9949535695

ఎన్నో అద్భుతమైన నాటకాలు రాసిన రచయిత డాక్టర్ రామారావు. 'అంబేద్కర్ మనవాడు' నాటకాన్ని కూడా ఆయనే రాశాడు. ఈ మధ్యకాలంలో టికెట్టు పెట్టి ఆడించిన నాటకాలన్నీ ఆయనవే. ఈ నాటకం ద్వారా అంబేద్కర్ ఖ్యాతిని దేశ, విదేశాలలో ప్రచారం చేయాలని సంకల్పించాడు.

అంబేద్కర్ భవన్‌లో ఆరోజు సిట్టింగ్ రిహార్సల్స్ మొదలు పెడుతున్నారు. నటులందరూ సమావేశమయ్యారు. ఆదిమూలం డేవిడ్ రాజు.. ప్రధాన పాత్ర అయిన అంబేద్కర్ పాత్రను పోషిస్తున్నాడు. నాటకంలో వివిధ పాత్రలను అనేక కులాలు, మతాలకు చెందినవాళ్లు పోషిస్తున్నారు. స్టేజీ మీదున్న అంబేద్కర్ చిత్రపటానికి ఎదురుగా నాటకం ప్రతిని ఉంచారు. నటులందరూ వేదిక మీదికి వెళ్లి.. అంబేద్కర్ పటానికి పూలు జల్లి, నమస్కరించి వచ్చి కుర్చీల మీద కూర్చుంటున్నారు.

డాక్టర్ రామారావు స్టేజీపైకి వెళ్లి, అంబేద్కర్ పటానికి నమస్కరించి వచ్చి కూర్చున్నాడు. ఒక్కక్షణం ధ్యానంలోకి వెళ్లాడు. అంబేద్కర్‌ను మనసులోనే స్మరించుకున్నాడు. కళ్లు తెరిచి.. నాటకం పుస్తకాన్ని తెరిచాడు. మొదటి డైలాగ్ తానే చెప్పాడు. తరువాత ఒక్కొక్కరి పేరు చదువుతుంటే ఆ పాత్రధారులు తమతమ డైలాగులు చెప్పసాగారు.

అంబేద్కర్ పాత్రధారి డేవిడ్ రాజు రిహార్సల్స్ జరుగుతున్నంత సేపు ఎంతో ఉద్వేగంగా కనిపించాడు. ఆయన మనసులో కొత్త అలజడి చెలరేగ సాగింది. అయినా చాలా నిగ్రహంతో కూర్చున్నాడు.

ఎవరి తరువాత ఎవరు డైలాగులు చెప్పాలో.. రామారావు చెబుతుంటే, నటులు డైలాగులు చదువుతున్నారు.

ఆరోజు రిహార్సల్స్ అయిపోయే సరికి రాత్రి పన్నెండు గంటలైంది. అందరి హృదయాలూ ఎంతో సంతోషంతో బరువెక్కాయి.

డేవిడ్ రాజు రామారావు దగ్గరికి వచ్చి, ఆయన చేతులు పట్టుకున్నాడు.

'అంబేద్కర్ డైలాగులు నా నోటివెంట పలకడం.. నిజంగా నా పూర్వజన్మ సుకృతం. ఏదో పుణ్యం చేసుకోకపోతే ఈ పాత్ర నన్ను వరించేది కాదు' అంటూ తలవంచి నమస్కరించాడు.

రామారావు ఆయన భుజం తట్టాడు.

'నువ్వు బాగా నటిస్తావు. నీ ఆకారం కూడా డాక్టర్ అంబేద్కర్ రూపానికి సరిగ్గా సరిపోతుంది' అని చెప్పాడు రామారావు.

డేవిడ్ రాజు కళ్లు చెమ్మగిల్లాయి.

డాక్టర్ రామారావుకు ధన్యవాదాలు చెప్పి.. తడి కళ్లతోనే ఇంటికి బయలుదేరాడు డేవిడ్ రాజు.

ఇంటికి వచ్చిన తరువాత కూడా ఉద్వేగాన్ని ఆపుకోలేక సతమతమై పోతున్నాడు.

ఆయన పరిస్థితి చూసి..

'ఏం జరిగింది?' అని అడిగింది భార్య.

'ఏమీలేదు! నువ్వు పడుకో' అని చెప్పాడు.

రాత్రంతా ఆయనకు నిద్రలేదు. తెల్లవార్లూ అంబేద్కర్ కలలోనే ఉన్నాడు. తన గతాన్నంతా తవ్వి పోస్తున్నాడు.

'నువ్వు చేస్తున్న పని ఏమిటి?' అని నిలదీసి అడుగుతున్నాడు.

'నీలాంటి పిల్లలు ఎందరు మీ హాస్టల్‌లో చదువుకుంటున్నారు? వాళ్లకు నువ్వు చేస్తున్న మేలు ఏమిటి? ఇప్పుడు నా పాత్ర వేయడానికి కూడా తయారయ్యావా?' అని ప్రశ్నిస్తూ ఉన్నాడు.

ఆ రాత్రి ఆయనకు కాళరాత్రిగా మారింది.

అప్పుడే ఒక నిర్ణయానికి వచ్చాడు.

ఉదయాన్నే తన బ్యాగులో బట్టలు సర్దుతున్నాడు డేవిడ్ రాజు.

'ఎక్కడికి వెళ్తున్నారు?' ఆశ్చర్యంగా అడిగింది భార్య.

అతను సమాధానం చెప్పలేదు.

మళ్లీ ఆందోళనగా అడిగింది.

'కొన్నిరోజులు నేను పనిచేసే హాస్టల్‌లోనే ఉందామని వెళ్తున్నాను' అన్నాడు.

'ఏందయ్యా.. ఏమైంది నీకు?'.

మౌనమే సమాధానం.

బ్యాగ్ తీసుకొని నేరుగా హాస్టల్‌కు పోయాడు.

ఆ సమయంలో ఎప్పుడూ వార్డెన్‌ను అక్కడ చూడని పిల్లలు బిత్తరపోయారు.

కొందరికి ఒంటిమీద చొక్కాలు లేవు. స్కూలుకు సిద్ధం కావాల్సిన పిల్లలు ఎగురుతున్నారు. ఆటలు ఆడుతున్నారు. కొట్టుకుంటున్నారు.

వార్డెన్‌ను చూసి ఎక్కడివాళ్లు అక్కడ పరుగులు తీశారు.

డేవిడ్ రాజు బ్యాగు లోపలపెట్టి బయటికి వచ్చాడు. ఒక్కసారి చుట్టూ చూశాడు.

రాత్రి అన్నం తిన్న పళ్లాలు.. నీటి పంపుల దగ్గర గుట్టలుగా పడున్నాయి.

'రేయ్! ఇటు రండి' పిల్లల్ని కేకవేశాడు డేవిడ్ రాజు.

పరుగెత్తుకుంటూ కొంతమంది పిల్లలు బయటికి వచ్చారు.

'ఈ పళ్లాలేంది?' అనడంతో పిల్లలందరూ మౌనంగా తలవంచుకుని నిలబడ్డారు.

అందరూ ఎంతో మురికిగా ఉన్నారు. నిద్రలేచి ముఖాలు కూడా కడగలేదు. జుట్టు చిందరవందరగా ఉంది.

వాళ్లను చూసిన డేవిడ్ రాజుకు భోరున ఏడవాలనిపించింది.

'అంతా నావల్లే!'..

'నా పని నేను సక్రమంగా నిర్వహించక పోవడం వల్లే!'..

'నేను ఉద్యోగం సరిగ్గా చేయకపోవడం వల్లే!'..

'నా స్వార్థం వల్లే!'..

'నా అపరాధం వల్లే వీళ్లంతా ఈవిధంగా తయారయ్యారు!'..

'నా అవినీతి వల్లే ఈ హాస్టల్ ఈ విధంగా ఉంది'..

'ఈరోజు నుంచి నన్ను నేను సరి చేసుకుంటా!'..

'ఈ హాస్టల్‌ను సరిచేస్తా!'.. అనుకున్నాడు.

అప్పటికి ఆయన మనసు కాస్త కుదుటపడింది.

* * *

మరుసటి రోజు నుంచే హాస్టల్‌ను సమూలంగా మార్చాలనే కృతనిశ్చయంతో పని చేయసాగాడు.

అదేరోజు హాస్టల్ సంస్కరణను ప్రారంభించాడు. ఉదయాన్నే ఐదు గంటలకు పిల్లల్ని నిద్ర లేపసాగాడు.

అలవాటు లేని పనికావడం వల్ల పిల్లలు నిద్ర లేవడంలేదు. స్టడీ అవర్‌లో కూర్చున్న పిల్లలు నిద్రలో జోగుతున్నారు.

వాళ్లను చూసి... 'అలవాటు లేని పని కదా!' అనుకున్నాడు

'అదే అలవాటు అవుతుందిలే! కాదు.. అలవాటు చేయాల్సిందే!' అనుకున్నాడు డేవిడ్ రాజు.

వంటవాళ్లను పిలిచాడు.

'ఇవాల్టి నుంచి బియ్యంలో పురుగులు, రాళ్లు ఏరి.. బాగా చెరిగించి వంట చేయాలి.

బియ్యాన్ని రెండుమూడు సార్లు కడిగి, వాసన లేకుండా వండాలి' అని చెప్పాడు.

'అలాగేనయ్యా!' అంటూ.. తలలు ఊపుతూ వెళ్లిపోయారు వాళ్లు.

ఆ తరువాత డేవిడ్ రాజు కూరగాయల దుకాణానికి వెళ్లాడు.

డేవిడ్ రాజును చూడటంతోనే..

'అయ్యా నమస్కారం!' అంటూ నిలబడి నమస్కారం చేశాడు సుబ్బారావు.

'ఈరోజు నుంచి కూరగాయల్లో పుచ్చిపోయినవి గానీ, కుళ్లిపోయినవి గానీ కనిపించొద్దు..' అన్నాడు.

'అదేంటి సార్! మీరిచ్చే రేటుకు ఎలా గిట్టుబాటు అవుతుంది?' అన్నాడు.

'గిట్టుబాటు రేటే వేసుకో!' అన్నాడు.

'అవునా!?..' ఆశ్చర్యంగా కళ్లు పెద్దవి చేసి, అనుమానంగా చూశాడు.

'అవును!'.. గట్టిగానే సమాధానం చెప్పి, వెనుదిరిగాడు డేవిడ్ రాజు.

అక్కడినుంచి బడికి వెళ్లాడు.

హెడ్‌మాస్టర్ గదిలో ప్రవేశించి..

'నమస్కారం సార్!' అంటూ రెండు చేతులూ జోడించాడు.

ఫైల్‌లో తలమునకలైన హెడ్‌మాస్టర్.. తల పైకెత్తి, కళ్లజోడు నుంచి ఓరకంటితో చూస్తూ..

'ఓ.. మీరా సార్! రండి రండి. చాలా కాలానికి తమ దర్శనం!' అన్నాడు.

ఆ మాటల్లో వ్యంగ్యం డేవిడ్ రాజుకు అర్థమైంది.

ఆ పక్కనే ఉన్న తెలుగు మాస్టారు..

'బాగున్నారా?' అని అడిగాడు.

'ఆ బాగానే ఉన్నాను!' అంటూ కుర్చీలో కూర్చున్నాడు డేవిడ్ రాజు.

తెలుగు మాస్టారు తన కుర్చీని కొంచెం దూరంగా జరుపుకొన్నాడు.

'ఏంటి సార్ విశేషాలు?' అన్నాడు హెడ్‌మాస్టర్.. వెటకారాన్ని పెదవుల మీద చూపిస్తూ.

'ఏమీ లేదు సార్! హాస్టల్‌ను బాగు చేద్దాం అనుకుంటున్నాం'.. నేరుగా విషయంలోకి వచ్చేశాడు.

'పిల్లల చదువులు కూడా.. దారిలో పెట్టాలి' అన్నాడు.

పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు హెడ్‌మాస్టర్.

'హాస్టల్ పిల్లల్నా!? మీరు దారిలో పెడతారా!? చూడయ్యా మాస్టారూ.. చోద్యం కాకపోతే! హాస్టల్ పిల్లల్ని ఈయన గాడిలో పెడతాడంట!' అన్నాడు.

'వాళ్లు డెకాయిట్లు సార్.. డెకాయిట్లు!' అన్నాడు తెలుగు మాస్టారు.

డేవిడ్ రాజు తలవంచుకున్నాడు.

'కానీయండి సార్! ప్రయత్నం చేస్తే పోయేదేం లేదుగా! ఒక ప్రయత్నం చేద్దాం అనుకుంటున్నాను' చెప్పాడు.. పైకి లేస్తూ.

'అవునా!?' నోరు తెరిచి అనుమానంగా చూశాడు హెడ్‌మాస్టర్.

'అవును.. అప్పుడప్పుడూ స్కూలుకు కూడా వస్తూ ఉంటాను' అని చెప్పి, నమస్కరించి వెనుదిరిగాడు.

'బియ్యం అమ్ముకొని బిల్డింగ్ కట్టాడు. హాస్టల్ పిల్లల్ని ఏదో చేస్తాడంట!' గుసగుసగా అన్నాడు తెలుగు మాస్టారు.

అతడి గుసగుసలు వినిపిస్తూనే ఉన్నాయి.

'నిజమే! నాకు జరగాల్సిన శాస్తే!' అనుకున్నాడు డేవిడ్ రాజు.

ఆ ఆలోచనలతోనే హాస్టల్ దారిపట్టాడు.

ఆ వెంటనే పెయింటర్‌ను పిలిపించి..

'మొత్తం భవనానికి, ప్రహరీకి రంగులు వేయాలి' అన్నాడు.

'ఎందుకు సార్? ఈ బిల్డింగ్‌కు రంగులు వేయడం దండగ. పోయినసారి లాగా బిల్లు పెట్టేద్దాం సార్! బిల్లులు నేను తెస్తాగా!' అన్నాడు పెయింటర్.

అతనివంక తీక్షణంగా చూశాడు డేవిడ్ రాజు.

'ఈసారి నా జేబులో డబ్బుతో ఈ పెయింటింగ్ వేయిస్తున్నాను. వెంటనే పని మొదలుపెట్టు. పెయింట్లు తీసుకురా! ఇదుగో అడ్వాన్స్!' అంటూ డబ్బులు తీసి ఇచ్చాడు.

అతను అనుమానంగా చూస్తూ వెళ్లాడు..

* * *

మిత్రుడు శేషగిరితో కలిసి డేవిడ్ రాజు సంగతి కనుక్కోవడానికి హాస్టల్‌కు వచ్చాడు డాక్టర్ రామారావు.

బొడ్డు కాడికి లుంగీ ఎగగట్టి.. పనిచేస్తూ కనిపించాడు రాజు.

ఆయన పక్కనే మామిడి, ఉసిరి, జామ, నేరేడు మొక్కలు కనిపించాయి. కూలీవాళ్లు గోతులు తవ్వుతూ ఉంటే.. తానూ, వాచ్‌మన్ కలిసి మొక్కలు నాటుతున్నారు.

'రాజు గారూ.. నమస్తే!' అన్నాడు రామారావు.

పనిచేస్తున్న డేవిడ్ రాజు, తల పైకెత్తి 'ఎవరా?' అని చూశాడు.

ఎదురుగా డాక్టర్ రావు, శేషగిరి కనిపించారు.

'అయ్యయ్యో.. మీరేమిటి ఇక్కడ!?' అంటూ లుంగీని కిందికి దించేసి, చేతిలో మొక్కను పక్కన పెట్టి..

'రావుగారూ.. రండి రండి! మీకు శ్రమ కలిగించినట్టు ఉన్నాను' అన్నాడు డేవిడ్ రాజు.

'ఇవాళ గొప్ప సుదినం మాకు. ఎంత గొప్పకార్యం చూసే భాగ్యాన్ని కలిగించారు. ఆహాహా! ఏమిటీ వింత!? హాస్టల్ రూపురేఖలను మార్చేస్తున్నారే!' అన్నాడు రామారావు.

పంపు దగ్గరికి వెళ్లి చేతులు కడుక్కుని, తుడుచుకుంటూ వరండాలోకి వచ్చాడు డేవిడ్ రాజు.

ఆయనను డాక్టర్ రావు, శేషగిరి అనుసరించారు. టేబుల్ ముందున్న కుర్చీలలో ముగ్గురూ కూర్చున్నారు.

'ఏమిటి.. ఆరోజు చెప్పాపెట్టకుండా కన్నీళ్లు కారుస్తూ వచ్చేశారు. ఆ తర్వాత అంతేలేరు! ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ వస్తున్నది. ఒకరోజు మీరు లేకుండానే రిహార్సల్స్ కానిచ్చాం. అంబేద్కర్ పాత్రధారి లేకుండా రిహార్సల్స్ అనవసరమని అర్థమైంది. 'అంబేద్కర్ పాత్రధారి వచ్చేంతవరకు రిహార్సల్స్ వద్దు' అన్నారు అందరూ. అందుకే, మీ ఇంటికి వెళ్లి వాకబు చేశాం. 'సార్ హాస్టల్‌లోనే ఉంటున్నారు!' అని చెప్పారు. ఇక్కడికి వస్తేగానీ విషయం అర్థం కాదని వచ్చాం. మీ ఇంట్లో వాళ్లతోకూడా మాట్లాడటం లేదని చెప్పారు. ఏంటీ? అంత సీరియస్ విషయం' అడిగాడు డాక్టర్ రామారావు.

తల పైకీ.. కిందికి ఊపాడు డేవిడ్ రాజు.

వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు. ఎక్కడో లోతుల్లో ఆలోచిస్తున్న వాడిలా కనిపించాడు. పురాతనకాలాన్ని తవ్వుకుంటున్న మనిషిలా కనిపించాడు.

'ఏదో చెప్పరాని మార్పు మీలో కనిపిస్తున్నది. ఇక్కడ ఈ గవర్నమెంట్ హాస్టల్‌ను ఇంతగా ముస్తాబు చేయడానికి కారణం ఏమిటి?' మళ్లీ అడిగాడు డాక్టర్ రామారావు.

చాలాసేపటి మౌనం తరువాత గొంతు సవరించుకున్నాడు డేవిడ్ రాజు.

'ఆరోజు అంబేద్కర్ నాటకం మొత్తం వినడమే.. నాలో ఈ మార్పునకు ప్రధాన కారణం. దాని ప్రభావంతో ఒక్కసారిగా నా గతంలోకి తొంగిచూశాను' చెప్పాడు డేవిడ్ రాజు.

'నీ గతమా!?' ఆసక్తిగా అడిగాడు రామారావు.

'అవును!' అంటూ.. చెప్పసాగాడు డేవిడ్ రాజు.

* * *

'మాది చాలా పేద కుటుంబం. ఒక నిట్రాడి గుడిసెలో ముసలీ ముతకా అందరూ కలిసి పదిమందిమి ఉండేవాళ్లం. ఊరి బడిలో ఐదో తరగతి దాకా ఉండేది. మా ఇంట్లో పిల్లలందర్నీ ఐదో తరగతి దాకా చదివించి, తరవాత మానిపించి పనులకు పంపేవాడు మా నాన్న. నన్ను కూడా ఐదో తరగతి తర్వాత బడి మానేసి పనిలోకి వెళ్లమన్నాడు.

'కాదు.. నేను చదువుకుంటాను' అన్నాను.

'యాడ్రా నువ్వు చదివేది! అందరూ చేస్తేనే నాలుగు వేళ్లూ నోట్లోకి పోయేది!' అన్నాడు నాన్న.

'కాదు.. నేను చదువుకోవాల్సిందే!' అని మొండికేశాను.

'ఎక్కడ్రా!? చదువు ఊర్లో లేదుగా!' అన్నాడు నాన్న.

'ఒక్క రూపాయి కూడా లేకుండా, ఉద్యోగం వచ్చేదాకా ఫ్రీగా చదువుకోవచ్చని అంబేద్కర్ మీటింగులో చెప్పారు' అని చెప్పాను.

'ఓరి.. చెప్పేరు లేరా! వాళ్లు చాలా మాటలు చెబుతారు గానీ..' అన్నాడు నాన్న.

ఎలాగూ నాన్న ఒప్పుకొనేటట్లు లేడని.. స్కూల్లో మాస్టర్‌ను అడిగి, వివరాలు తెలుసుకున్నా. సర్టిఫికెట్ ఇప్పించుకుని, ఎవరికీ తెలియకుండా ఒంగోలు హాస్టల్‌కి వెళ్లి చేరా. నన్ను వెతుక్కుంటూ వచ్చాడు నాన్న.

కోపంతో కొట్టబోయాడు. అయితే అక్కడే ఉన్న హాస్టల్ వార్డెన్ జోసెఫ్ సార్ నన్ను పక్కకు తీశాడు.

'చూడండి.. మీవాడు చాలా ఇష్టంగా చదువుకోవడానికి వచ్చాడు. వాడి సంగతి నేను చూసుకుంటా. మీరు వెళ్లండి!' అని మా నాన్నను సాగనంపాడు.

అప్పటినుంచి చదువు మీద శ్రద్ధ పెట్టాను. హాస్టల్‌లో అన్నం ఎలా ఉండేదో తెలుసుగా!? రాళ్లూరప్పలు.. పురుగుల అన్నం. నీళ్ల సాంబారు. వీటితోపాటే కదా పెరిగి పెద్దవాడిని అయ్యింది. చివరికి ఈ హాస్టల్ వార్డెన్ ఉద్యోగానికి వచ్చింది. అయితే అందరిలాగా నేనుకూడా.. నా గతాన్ని మర్చిపోయి అనేకరకాలుగా అవినీతికి పాల్పడ్డాను. మీరు అంబేద్కర్ నాటకాన్ని రాసి నా కళ్లు తెరిపించారు'.. కళ్లు తుడుచుకుంటూ చెప్పాడు.

* * *

'అంతకుముందు అంబేద్కర్ గురించి ఎక్కడా చదవలేదా!?'.. అడిగాడు రామారావు.

'ఏదో జయంతి, వర్ధంతి నాడు అందరూ చెప్పిన నాలుగు మాటలు వినడమే తప్ప, అంబేద్కర్ గురించి ఎప్పుడూ కూలంకషంగా చదివింది లేదు. నాటకం మొత్తం మీరు చదివి వినిపించడంతో నేను చేస్తున్న తప్పేమిటో తెలిసింది. అంబేద్కర్ నన్ను చదివించి, కూలివాడిని కాకుండా చేశాడు. కానీ, నేనేం చేస్తున్నాను. మనవాళ్లను మర్చిపోయి, వాళ్లకు చెందాల్సిన వాటిని నేనే స్వాహా చేస్తున్నాను. మీ నాటకంతో నా కళ్లు తెరుచుకున్నాయి. అందుకని వెంటనే నిర్ణయం తీసుకున్నాను. అందుకే చెప్పాపెట్టకుండా వచ్చేశాను. ఇక్కడికి వచ్చి ఈ మార్పులు చేశాను..' కళ్లలో వెలుతురు పూలు కనిపిస్తుండగా, డేవిడ్ రాజు చెప్పాడు.

'ఎక్సలెంట్ రాజు! తప్పులు ఎవరైనా చేస్తారు. వాటిని దిద్దుకోవడంలోనే గొప్పతనం ఉంది. మనం నాటకం వేయకుండానే ఒక గొప్ప మార్పును చూశాను. ఇక నాటకం వేస్తే ఎంత మార్పు వస్తుందో!' అన్నాడు డాక్టర్ రావు ఆనందంగా.

'అవును.. చాలా మార్పు వస్తుంది' అన్నాడు డేవిడ్ రాజు.

'మరి రిహార్సల్స్‌కు ఎప్పుడు వస్తావు?' అడిగాడు డాక్టర్ రావు.

తల అడ్డంగా ఊపుతూ.. 'రాలేను సార్' అన్నాడు డేవిడ్ రాజు.

'అదేంటి.. నీ ఆకారం అంబేద్కర్‌కు సరిగ్గా సరిపోతుందని కదా నిన్ను సెలెక్ట్ చేసింది' అన్నాడు డాక్టర్ రావు.

మళ్లీ తల అడ్డంగా ఊపుతూ..

'నేను కాకుంటే మీరు ఇంకొకర్ని సెలెక్ట్ చేసుకోవచ్చు. కానీ, ఇక్కడ నేను ఉంటేనే పిల్లల్లో మార్పు సాధ్యమవుతుంది. ఎక్కడెక్కడినుంచో దిక్కూ దివాణం లేకుండా వస్తారు సార్ వీళ్లంతా. అందరూ నాలాంటి వాళ్లే! వాళ్లకు ఒక మంచి భవిష్యత్తు ఇవ్వాలని నిర్ణయించుకున్నా' అని దృఢంగా చెప్పాడు డేవిడ్ రాజు.

'చాలా గొప్పపని రాజూ. అయితే నేను ఒక మంచి నటుణ్ని మిస్ అవుతున్నాను' అన్నాడు డాక్టర్ రావు.

తల నిలువుగా ఊపాడు రాజు.

'ఇదే నీ నిర్ణయమా!' కొంచెం ముభావంగా పైకిలేచాడు డాక్టర్ రావు.

'దయచేసి నన్ను అపార్థం చేసుకోవద్దు. మీవల్ల నా జీవితానికి ఒక లక్ష్యం ఏర్పడింది'.. రెండు చేతులూ పైకెత్తి నమస్కరించాడు డేవిడ్ రాజు.

'అరెరె.. ఏంటిది?' అంటూ ఆయన చేతులు పట్టుకొని..

'మళ్లీ అంబేద్కర్‌ను వెతుక్కునే పనిపెట్టావ్ నాకు' అన్నాడు డాక్టర్ రావు.

'దయచేసి నన్ను మన్నించండి సార్! నేను ఆ పాత్రకు అర్హుడిని కాదు. నన్ను క్షమించండి' మళ్లీ నమస్కారం చేశాడు డేవిడ్ రాజు.

'అబ్బే! అలాగ అనకు' అంటూ డేవిడ్ రాజును ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు డాక్టర్ రావు.

'నేను ఈ నాటకం రాసినందుకు చాలా సంతోష పడుతున్నాను. కాదుకాదు.. గర్వపడుతున్నాను. నాటకం వేయకుండానే ఒక గొప్ప మార్పును చూశాను. ఈ విషయాన్ని నాటకం వేసే ప్రతిచోటా చెబుతాను. అంతేకాదు దళితుల్లో మనం కోరుకుంటున్న మార్పునకు ఇది ప్రస్థానం కావాలి. మీరు చేస్తున్న పని ఒక ప్రయోగం కావాలి. ఈ హాస్టల్ ఒక ప్రయోగశాల కావాలి. చేస్తూనే ఉండండి. మేం కూడా మీ వెంటే ఉన్నాం! ఉంటాం! జై భీమ్!' అన్నాడు డాక్టర్ రావు.

'జై భీమ్!' అన్నాడు డేవిడ్ రాజు కూడా..

* * *

మంచికంటి స్వస్థలం ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలంలోని కలికివాయ గ్రామం. తల్లిదండ్రులు: కీ.శే. నరసారెడ్డి, వెంకటరత్నమ్మ

విద్యలో ప్రయోగాలు చేస్తున్న శాంతివనం ఫౌండేషన్ ఊరు: నాయుడుపాలెం, చీమకుర్తి మండలం. ఉద్యోగం: ఉపాధ్యాయవృత్తి, కథా సంకలనాలు.. మిత్తవ ,మారాజులు, చదువు చదువు చదువు, గబ్బ గీము—— నవల. కవిత్వం.. వసంతా ఊసెత్తకు, నీటి పొద్దు, మేం పావురాలను ప్రేమిస్తాం, జీవితము-యుద్ధము-శాంతి, నా సైకిల్ యాత్రాదర్శనం- సైకిల్ యాత్ర పుస్తకం, విద్యలో నా ప్రయోగాలు..శాంతివనం -పిల్లల అనుభవాలు- ప్రయోగాలు పుస్తకం, చదువు బి ఎస్ సి బి ఎడ్ ,రెండు దశాబ్దాల నుండి రచనలు,యాభై కథలు వరకు రాశాను. తానా బహుమతి అజోవిభో బహుమతి, పలు కథలకు పలు బహుమతులు, అనేక ప్రాంతాలలో పలు సన్మానాలు.

# జీవిత పాఠం



**కశిఒజ్జల భాస్కరా చారి,**

**73960 16164**

డాక్టర్ రామారావు ఎదుట కూర్చున్నాను. ఆయన ఈ సిటీలోనే పెద్ద డాక్టర్. నాకు ఆయనతో పూర్వపరిచయం ఉంది.

'అసలు నాకేమైంది డాక్టర్ గారు? ఎందుకు నాకు ఆకలి వేయదు. నిద్ర రాదు! ఎప్పుడూ ఏవో ఆలోచనలు కందిరీగల్లా చుట్టుముడుతాయి. జీవితంమీద విరక్తి లాంటిది కలుగుతున్నది. నన్ను చూడండి.. రోజురోజుకూ ఎలా చిక్కిపోతున్నానో!? నా ఆరోగ్యం గురించి చాలా ఆందోళనగా ఉందండి' అన్నాను దిగులుగా.

డాక్టర్ నాకు ధైర్యం చెప్పి, అన్నిరకాల పరీక్షలు చేశారు. రిపోర్టులన్నీ పదినిమిషాల పాటు క్షుణ్ణంగా పరిశీలించి..

'శివప్రసాద్ గారూ.. కంగారు పడకండి. మీ రిపోర్టులన్ని నార్మల్‌గా ఉన్నాయి. సో.. మీకు శారీరకంగా ఏ జబ్బూ లేదు' అంటూ తేల్చేశారు డాక్టర్.

ఏ జబ్బూ లేదంటే ఎవరైనా వెంటనే ఎగిరి గంతేస్తారు. కానీ, నాకుమాత్రం ఆయన మాటలు సంతృప్తిని కలిగించలేదు. కుర్చీలో ముందుకు జరిగి ఆయన టేబుల్‌పై చేతులుంచి..

'లేదు డాక్టర్ గారు! చాలారోజుల నుంచి నాకేదో

అయ్యిందండీ! ఇదిగో నాకళ్ల కింద నల్లచారలు చూశారా!? సరిగా నిద్రపోక ఎన్నో రోజులైంది..' అన్నాను బాధగా.

కానీ, ఆయన శాంతంగా.. 'శివప్రసాద్ గారూ! మీ వయసు యాభైలో పడినా, మీకు ఇంకా బీపీ, షుగర్ వంటి సమస్యలు లేవు. అదృష్టవంతులే కదండీ మరి! కాకపోతే కొన్నిరోజులుగా నిద్ర సరిగా లేదంటున్నారు. కాబట్టి ఒత్తిడికి గురై ఉంటారు. దేని గురించైనా బాగా ఆలోచిస్తున్నారా? చెప్పండి' అన్నాడు ఆరాతీస్తూ.

'బ్యాంక్ మేనేజర్‌గా వృత్తిపరమైన ఒత్తిళ్లు ఎప్పుడూ ఉండేవే! వాటిని పెద్దగా ఖాతరు చేయను. కానీ, ఇప్పుడు నా సమస్య అది కాదండీ! డాక్టర్ దగ్గర ఏదీ దాచకూడదంటారు. కాబట్టి మీతో అంతా ఉన్నదున్నట్టు చెబుతాను. అసలు సమస్య నా మనసు, ఆలోచనలేనండి. జీవితం పట్ల నాలో నిరాసక్తత, నిర్లిప్తతా చోటుచేసుకొన్నది'.. అంటూ మొదలుపెట్టాను.

నా మాటలకు డాక్టర్ రామారావు తన మెడలోని స్టెతస్కోప్ పక్కన పెట్టేసి.. అటెన్షన్ అయ్యారు.

'ఓ సాయంత్రం బ్యాంక్ నుంచి ఇంటికొస్తుంటే హైవే మీద ఘోరమైన యాక్సిడెంట్ జరిగిందండి. ఓ లారీ, బైక్‌ను గుద్దేసింది. ఒక మహిళ స్వల్ప గాయాలతో బయట పడింది. కానీ, తన కళ్లముందే భర్త, కూతురు ఆ లారీకింద ఇరుక్కుపోయి చనిపోయారు. ఆమె వాళ్ల శవాలపైపడి ఏడ్చే తీరుంది చూశారూ! అది చూస్తే ఎంత కఠినాత్ముడైన కంటనీరు పెట్టాల్సిందేనండి. ఎంత పాషాణ హృదయమైనా.. కరిగి తీరాల్సిందే! కానీ, అదేం చిత్రమో నాకు కొంచెంకూడా బాధ వేయలేదు. అక్కడ గుమిగూడిన అందరిలాగే నేనుకూడా ఊరికే అలా చూస్తుండి పోయాను. అదలా ఉంచండి. మరోరోజు ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర నా కారు ఆపాను. ఇంతలో ఒక పచ్చిబాలింతరాలు తన చంటిబిడ్డతో నా కారు వద్దకు పరిగెత్తుకొచ్చి, చెయ్యి చాచి.. 'బాబయ్యా! ధర్మం!' అన్నది. ఓ వైపు మిట్టమధ్యాహ్నం ఎండ మండిపోతున్నది. మరోవైపు కేర్ కేర్‌మంటు ఆ పసిపాప పాలకోసం కాబోలు.. గుక్క తిప్పుకోకుండా ఏడుస్తున్నది. అప్పుడు మీరైతే ఏం చేస్తారండీ!? అయ్యో పాపం! అనుకొని జేబులోంచి పదో, పరకో తీసి ఆమె చేతిలో పెడతారు కదా! కానీ, నేను మాత్రం ఆమెవంక చూడనేలేదండి! ఇలా యాక్సిడెంట్లు, అడుక్కోవడాలు.. మనం పట్టించుకోకపోవడాలు ఈ రోజుల్లో ఇదంతా కామన్ అంటారా!? నిజమే! డాక్టర్ గారూ.. నేను కూడా ఇంతకాలం అలా అనుకొనే సరిపెట్టుకున్నాను. కానీ.. కానీ.. మీతో సిగ్గువిడిచి అసలు విషయం ఇప్పుడు చెబుతున్నాను. టుబీ ఫ్రాంక్ అండీ.. రామారావు గారు! మా నాన్న డెభ్బై ఏళ్ల మనుషండి. పెరాలసిస్ పేషెంట్. సరిగా మాట్లాడలేడు. తన పనులు తాను చేసుకోలేడు. అమ్మ ఉన్నన్ని రోజులూ అన్నీ తానై చూసుకున్నది. ఆమె ఈమధ్యనే చనిపోయింది. ఇప్పుడు అమ్మతోడు కూడా లేని అలాంటి నిస్సహాయున్ని నా భార్య మాటలు విని మారు మాట్లాడకుండా నిర్దాక్షిణ్యంగా వృద్ధాశ్రమంలో వదిలేసి వచ్చానండి. నెలకు కొంత డబ్బు చెల్లిస్తే ఇక వాళ్లే చూసుకుంటారని చేతులు దులుపుకున్నానండి. లంకంత కొంప నాది. ఇంట్లనే నాన్నను నా

కళ్ల ముందే ఉంచుకొని, ఎవరితోనైనా శుభ్రంగా అన్ని పనులూ చేయించుకోవచ్చన్న స్పృహే రాలేదు నాకు. ఇది కూడా కామన్ అనగలరా చెప్పండి?'.

'యాక్సిడెంట్ దగ్గరి మహిళ, ఆ పసిపాప తల్లి.. ఇద్దరూ బయటివాళ్లు. నాతో ఎలాంటి రక్తసంబంధ బాంధవ్యాలు లేనివాళ్లు. వాళ్లపట్ల నేనలా ప్రవర్తించానంటే కొంత అర్థం ఉంది. కానీ, మా నాన్న అలా కాదు కదా! నా రక్త సంబంధం. నన్ను కని, పెంచి, పోషించి.. ఎన్నో కష్టాలకు ఓర్చి చదివించి.. నేను బ్యాంక్ మేనేజర్‌గా ఈ స్థాయిలో ఉండటానికి కారణమైన వ్యక్తి. నన్ను తీర్చిదిద్దిన రూపశిల్పి. అలాంటి నాన్నకోసం ఒక్కసారి కూడా నా ప్రాణం కొట్టుకోదే! ఆలోచించదే!! ఆవేదన చెందదే!!! నా భార్యను బతిమిలాడో, భయపెట్టో నాన్నను నా కళ్లముందు ఉంచుకోవాలన్న ఆరాటంలేదే నాలో! ఇక నేను ఆయనకు కొడుకునని ఎలా చెప్పుకోగలను? అసలు మనిషినని ఎలా అనుకోగలను? పూర్తిగా మనఃశాంతికి దూరమైన నేను.. మనిషిలో ఉండాల్సిన ఏదో ముఖ్యమైన లక్షణం కోల్పోయి ఇలా తయారయ్యానని అనిపిస్తున్నది' అంటూ చెప్పడం ముగించాను.

డాక్టర్ రామారావు అంతా ఓపిగ్గా విన్నారు. బహుశా నా మాటలు ఎలా తోచాయోమో.. కొద్దిసేపు ఏమీ మాట్లాడలేదు. తర్వాత నెమ్మదిగా అన్నారు.

'శివప్రసాద్ గారు.. మీరు పదేళ్లుగా నాకు తెలుసు. మీరెంతో సెన్సిటివ్! మంచివారు. మీరిలా మారారు అంటే నమ్మశక్యంగా లేదు. మీ భార్య ప్రవర్తనతో మీరెంత విసిగి పోతుండేవారో తరుచూ నాతో చెబుతుండేవారు. గుర్తుందా? మీ నాన్నను వృద్ధాశ్రమంలో వదిలేసి రావడం నిజంగా దురదృష్టకరం! మీలో ఆందోళనకు అదే కారణం కావచ్చు. ఇటు మీ భార్యకు నచ్చజెప్పలేక అటు మీ నాన్నగారిని మీ వద్ద ఉంచుకోలేక లోలోపల నలిగిపోతున్నట్టు ఉన్నారు. సమాజంలో ఒక హోదాలో ఉన్న మీకు ఈ పరిస్థితి రావడం నిజంగా బాధాకరం! శివప్రసాద్ గారూ.. ఓ పని చేద్దాం! మీ సమస్య మానసికమైనది కాబట్టి నా మిత్రుడు సైకియాట్రిస్ట్ కమ్ సైకాలజిస్ట్ డా.నిపున్‌ను కలవండి. ఆయన మీకు తప్పక ఈ విషయంలో సాయం చేయగలరు..' అన్నారు డాక్టర్ రామారావు.

నేను 'సరే' అనడంతో.. నా ముందే ఆయనతో ఫోన్‌లో మాట్లాడారు.

* * *

తర్వాతి రోజు నేను వెళ్లి డాక్టర్ నిపున్‌ను కలిశాను. నా సమస్యను మొదటి నుంచి అంతా వివరించాను. నా భార్య రమణి ప్రవర్తన గురించి కూడా చెప్పాను. ఆయన అంతా కూల్‌గా విన్నారు.

'ఎంతకాలం నుంచి మీకు ఇలా అనిపిస్తున్నది?' అంటూ.. నన్ను కొన్ని ప్రశ్నలడిగి, నోట్స్ రాసుకున్నాడు. తర్వాత అన్నాడు కదా..

'మీకు వచ్చింది మేజర్ డిప్రెష్ అండీ! ఇలా నిద్రపట్టక పోవడం, కళ్లు లోతుకు పోవడం, దిగులు, మనుషుల పొడ గిట్టకపోవడం, తన వల్ల ఏమీ కాదని ఒంటరిగా, విషాదంగా గడపటం దీని లక్షణాలు. ఏ మనిషి అయితే తనకు ఎదురైన సమస్యను ఎదుర్కోలేక డీలా

పడతాడో.. అతను ఆటోమేటిక్‌గా ఒత్తిడి బారిన పడతాడు. అది చాలాకాలం కొనసాగితే.. మేజర్ డిప్రెషన్‌లోకి వెళ్లిపోతాడు. మీ విషయంలోనూ అదే జరిగింది. ఇప్పుడు మీ సమస్య.. మీ నాన్నగారిని ఒంటరిగా వదిలివేయలేరు. అలాగని మీ భార్య వల్ల మీదగ్గర ఉంచుకోలేరు. కానీ, మీరిప్పుడు చెయ్యాల్సింది.. ఫైట్ ఆర్ ఫ్లయిట్! అంటే ఈ సమస్యను ఎదిరించడం లేదా సమస్యకు లొంగిపోవడం. అంటే దాని నుంచి పారిపోవడం! ఈరెండిటిలో మీరు ఏదో ఒకటి ఎన్నుకోవాలి. చేయాలి. మీరు ఇంతకాలం ఈ రెండిటిలో ఏదీ తేల్చుకోలేక సతమవుతున్నారు. కానీ, తప్పదు ప్రయత్నించండి. అప్పటిదాకా మీలో డిప్రెషన్ పోదండి. మెడికల్ సపోర్ట్‌కోసం కొన్ని మందులు అయితే రాస్తాను. వాడుకోండి' అన్నారు.

నా మనసులోని బాధనంత చదివేసినట్టు చెప్పిన ఆయన మాటలు.. నాకు కొంత ఊరట, ఉత్తేజాన్ని ఇచ్చాయి. మందులు తీసుకొని ఇంటికి బయలు దేరాను. కొంతదూరం వెళ్లానో లేదో.. హఠాత్తుగా ఓ పంది, మూడు కుక్కలు కొట్లాడుకుంటూ నా కారుకు అడ్డంగా వచ్చాయి. సడెన్ బ్రేక్ వేసి కారు ఆపాను. కారు గ్లాస్ దించి వాటిని అదిలించబోయాను. అక్కడి దృశ్యం చూసి, టక్కున ఆగిపోయాను. అక్కడి వాతావరణం ఓ యుద్ధరంగాన్నే తలపిస్తున్నది. పక్కన చెత్త కుండీ ఉన్నది. ఆ పంది తన పిల్లల్ని కబళించాలని చూస్తున్న ఆ మూడు కుక్కలతో భీకర పోరు సలుపుతున్నది. తమ నాలుకల్ని బైటపెట్టి, చొంగ కారుస్తు.. భయంకరంగా అరుస్తూ మూడు వైపులనుంచీ దానిపై దాడి చేస్తూ.. పిల్లల్ని ఎత్తుకెల్లాలని చూస్తున్నాయి ఆ కుక్కలు. ఇక ఆ పంది తన బుజ్జి పిల్లలపై ఆశ వదులుకోవాల్సిందే! అనిపించింది నాకు. ఆ మూడు బలమైన కుక్కల నుంచి ఒక్కత్తే తన పిల్లల్ని ఎలా రక్షించుకోగలదు? అసాధ్యమే! కానీ, కన్నపేగు మమకారం, తీపి దానిలో పోరాట పటిమను తట్టి లేపింది. అది కోపంతో అరుస్తూ, పరిగెడుతూ వాటిని తరుముతున్నది. ఐదు, పది నిమిషాలు కాదు. ఏకంగా గంటన్నరసేపు వాటితో అలుపెరగకుండా పోరాడింది. అవి కుయుక్తులతో దానిని ఏమర్చాలని చూసినా.. వాటి ఆటలు సాగనివ్వలేదు. ఎట్టకేలకు అలసి సొలసి గాయాలతో ఆ కుక్కలే తోకముడిచి పారిపోయాయి. పంది.. తన పిల్లల్ని కాపాడుకున్న ఆనందంలో గాయాల్ని సైతం మరచిపోయి, వాటిని సంతోషంతో నాకుతున్నది. అంతసేపూ కనురెప్ప వేయకుండా అదంతా చూసిన నేను.. నిజంగా షాక్ తిన్నాను. నేను అసాధ్యం అనుకున్న దాన్ని.. ఆ పంది సుసాధ్యం చేసి చూపింది. డాక్టర్ నిపున్ చెప్పిన ఫైట్ ఆర్ ఫ్లయిట్‌ను ఇప్పుడు ప్రత్యక్షంగా చూశాను. దాని పిల్లల్ని కాపాడుకోవడం కోసం ఆ పంది ఫైట్ (ఎదిరించడం) చేసింది. తన ప్రాణాలను పణంగా పెట్టి పోరాడి గెలిచింది. కానీ, నేను చేసింది ఏమిటి? 'అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిని ఆదరించి, అక్కున చేర్చుకోవాల్సింది పోయి.. భార్య మాటలకు జడిసి, తలొగ్గి అనాథగా ఆశ్రమంలో వదిలేసి వచ్చాను. మలివయసులోని తల్లితండ్రులు పిల్లలతో సమానం అంటారే!? ఐతే అప్పుడు నా తండ్రి నాకు పెద్ద కొడుకేగా! మరి నా ఇంటి పెద్దదిక్కును ఎలా ఒంటరిని చేశాను?'.. గట్టు తెగిన నీటి ప్రవాహంలా ఆలోచనలు ఒక్కసారిగా నన్ను నిండా ముంచెత్తాయి. ఎవరు దీనికి కారణం.. నా భార్య రమణినే కదా?!

* * *

తను నా మేనమామ కూతురు. కాలు కింద పెట్టకుండా గారాబంగా పెరిగింది. కోటీశ్వరుల సంబంధాలు కాదని, తమ్ముడి కూతురని చెప్పి అమ్మ ప్రేమతో నాకు కట్టబెట్టింది. ఆ కృతజ్ఞతా భావం రమణిలో ఏనాడూ అణువంత కూడా చూడలేదు. ఆమెకు తన అందం పట్ల మిడిసిపాటు. ఎవరినీ లెక్కచేయని పెంకితనంతో అందరినీ బాధపెట్టడం ఒక్కటే తెలుసు. ఆమె కోరితే కొండమీద కోతినైన పట్టి తేవాలి. లేదంటే అలకపాన్పు! అరిచి గీ పెట్టేది. ఏడ్చేది. నచ్చిన నగలు, బట్టలు, ఇల్లు, చుట్టాలు.. అన్నీ ఆమె కోరుకున్నట్టే జరగాలి. జరిగాయి కూడా! మొదట్లో అమ్మకోసం చూసీ చూడనట్టు ఉన్నాను. ఏదో చిన్నపిల్లల మనస్తత్వం.. తనే నెమ్మదిగా అర్థం చేసుకొని మారుతుందిలే.. అనుకున్నాను. కానీ, నన్నే తనకు అనుకూలంగా మార్చుకుంటుందని ఆలస్యంగా గ్రహించాను. ఓ రోజు తన ప్రవర్తనతో చిరాకేసి ఎదురుతిరిగాను. అంతే! అరచి గోలగోల చేసింది. చస్తానని బెదిరించింది. ఉత్తి బెదిరింసే కదా! అనుకున్నా.. నిజంగానే నిద్ర మాత్రలు మింగింది. ఇక ఆ దెబ్బతో ఒక్కగానొక్క కొడుకు సమిత్‌ను తల్లిలేని వాడిగా చేయడం ఇష్టంలేక.. వాడికోసం ఆమెకు లొంగిపోయాను. పూర్తిగా రాజీపడిపోయి తను ఆడమన్నట్లు ఆడుతున్నాను. నా చదువు, తెలివితేటలు, అనుభవం.. రమణి ముందు తేలిపోయాయి. ఎందుకూ కొరగాకుండా పోయాయి.

'మొన్నటిదాకా మీ అమ్మకు సేవలు చేసిచేసి నా చేతులు పడిపోయాయి. ఇప్పుడిక మీ నాన్నవంతా? నావల్ల కాదు. పైగా ఆయన రోగిష్టి మనిషి. మల మూత్రాలతో ఇల్లంతా రొచ్చురొచ్చు. వెంటనే ఏదైనా వృద్ధాశ్రమంలో చేర్పించండి'.. అన్నది రమణి ముక్కు మూసుకుంటూ.

ఆ మాటలకు నాలోని కోపాన్ని అణిచిపెట్టుకున్నాను.

'ఒక్కక్షణం ఆలోచించు రమణి. మా అమ్మకు పనిమనిషితోనే అన్ని పనులూ చేయించాం కదా! ఇప్పుడు కూడా ఒక మేల్ సర్వెంట్‌ను పెట్టుకుందాం. అతనే నాన్నకు అన్ని పనులూ చేసి పెడతాడు. ఈ ఒక్కసారికి నా మాట విను. అసలే నాన్న పేషంట్!' అని బతిమిలాడాలని అనుకున్నాను. వినకపోతే ఆ చెంపా, ఈ చెంపా వాయించాలని అనుకున్నాను. కానీ, ఏదీ చేయలేక పోయాను. ససేమీరా నా మాట వినదు. అది ప్రతిసారీ రుజువు అవుతూనే ఉంది. కాదని ఎదురు తిరిగితే జరిగే పరిణామాలు తెలుసు. అందుకే ఇక చేసేదిలేక, మారు మాట్లాడకుండా.. బేలగా నావైపే చూస్తున్న నాన్నను ఈ చేతులతో ఆశ్రమంలో దిగబెట్టి వచ్చాను.

* * *

కానీ, ఇప్పుడు ఇదంతా చూశాక నాకు అనిపిస్తున్నది. ఒక నోరులేని జీవి తన బిడ్డల్ని కాపాడుకోవడం కోసం ఇంతలా తెగించింది. తెలివి, డబ్బు, హోదా అన్నీ ఉండికూడా నా కన్నతండ్రిని రక్షించుకోలేక పోతున్నానే! కేవలం భార్య బ్లాక్‌మెయిలింగ్‌కు భయపడి, నా రక్తబంధాన్ని చిన్నచూపు చూస్తున్నానే! ఇలా ఎంతకాలం? ఎందుకు భరించాలి? జీవితపు

చివరి అంచున నిల్చిన నాన్నను ఎందుకు క్షోభకు గురిచేయ్యాలి? ఇంతకాలం కొడుకు కోసం, పరువు కోసం రమణి పట్ల ఓర్పు వహించాను. ఇకపై ఆమె ఆటలు నా దగ్గర సాగవు. డాక్టర్ నిపున్ చెప్పిన ఫైట్ ఆర్ ఫ్లయిట్‌కు ఇప్పుడు నా దగ్గర తగిన సమాధానం ఉంది. ఇలా అనుకొనేసరికి ఇన్నాళ్లూ అణచివేసుకున్న ఆవేశం, ఆక్రోశం ఒక్కసారిగా.. లావాలా నాలో ఉప్పొంగింది. నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. అంతే! మెడిసిన్స్ ఆ చెత్తకుండీలో వేసి, రమణికి ఫోన్ చేశాను.

'ఆ.. చెప్పండి!' అన్నది తను.

'నేను.. నేను నాన్నను తీసుకు వస్తున్నాను!' నా గొంతులో కొంచెం తడబాటు.

'ఎక్కడికి?!' ఆమెలో విస్మయం.

నేను వెంటనే తడబాటు నుంచి తేరుకొని దృఢంగా అన్నాను..

'మన ఇంటికి.. నాన్నను మన ఇంటికి తీసుకు రావాలని అనుకుంటున్నాను!'.

కొద్దిసేపు అటువైపు నిశ్శబ్దం! ఊహించని నా ధోరణికి బిత్తరపోయి ఉంటుంది.

'అదేమిటి? వారం రోజుల క్రితమే వృద్ధాశ్రమంలో వేశాం కదా!' గట్టిగా అన్నది.

ఆమెలో కోపం, చిరాకు మొదలైంది.

'అవును.. కానీ, ఇక నాన్న మనతోపాటే ఉంటాడు'.

'నిర్ణయం తీసేసుకున్నారా! వచ్చే నెలలో అబ్బాయి సమీత్ అమెరికా నుంచి వస్తాడు. వాడికి పెళ్లి చెయ్యాలని అనుకుంటున్నాం. నట్టింట్లో రోగిష్టి మనిషిని పెట్టుకొని శుభకార్యం ఎలా చేద్దాం అనుకంటున్నారు?'.

నేను ఏమాత్రం తగ్గలేదు.

'మంచిదే! నాన్న తన మనవడి పెళ్లిని కళ్లారా చూసి ఆశీర్వదిస్తారు'.

అంతే! అటువైపు నుంచి భళ్లున ఏదో పగిలిన శబ్దం! ఏదో పింగాణీ పాత్రను నేలకేసి కొట్టి ఉంటుంది. కానీ, నేను అవేం పట్టించుకోకుండా చెప్పాల్సింది అంతా చెప్పాను.

'చూడు రమణి.. ఇన్నాళ్లూ నువ్వు చెప్పిందల్లా చేశాను. ఆడమన్నట్లు ఆడాను. నీ ప్రవర్తనతో నాతోపాటు అందరినీ బాధపెట్టావ్. ఇంతకాలం నీ మాట కాదంటే ఏ అఘాయిత్యం చేసుకుంటావోనని నా వ్యక్తిత్వాన్ని చంపుకొని బతికాను. ఇక చాలు. దేనికైనా ఓ లిమిట్ ఉంటుంది రమణి. నువ్వు అది దాటిపోయావు. అయినా రేపు కొడుకు, కోడలు కూడా నీలాగే చేస్తే ఏం చేస్తావ్. ఆవు చేలో మేస్తే.. దూడ గట్టున మేస్తుందా!?'.

'ఏమో మరి! ఈరోజు కొత్తగా మాట్లాడుతున్నారు. జరుగబోయే పరిణామాలకు సిద్ధంగా ఉండండి'..

'నీతో అన్నిటికీ సిద్ధపడే ఈ నిర్ణయం తీసుకున్నాను'..

వెంటనే కాల్ కట్ చేసింది రమణి. తనతో మాట్లాడాక.. ఎందుకో ఒప్పించగలనన్న ఆశ నాలో చిగురించింది. చాలా రోజుల తర్వాత నా మనసుకు మొదటిసారిగా ప్రశాంతత కలిగింది. నా మానసిక స్థితి నాకు క్రమంగా అర్థం కాసాగింది. రమణి చేష్టలతో ఇంతకాలం

విసిగిపోయి డిప్రెషన్‌లోకి జారుకొని.. మనుషుల మీద నమ్మకం, విశ్వాసం కోల్పోయి.. ఎవరు ఎటుపోతే నాకేంటని నా చుట్టూ ఒక గిరి గీసుకుని బతికాను. నా చుట్టూ జరుగుతున్న వాటిపట్ల స్పందించడం మానేసి.. వివేకం, విచక్షణ మరచిపోయి ఒక జంతువుల బతికిడుస్తున్నందుకే.. ఆ ఘోరమైన యాక్సిడెంట్‌కు చలించలేదు. దయనీయమైన బాలింతపై జాలి కలుగలేదు. నా ప్రియమైన నాన్ననూ ఒంటరిగా, దిక్కులేని అనాథగా ఆశ్రమంలో వదిలేసి రాగలిగాను. హే భగవంతుడా! ఎంత పొరపాటు చేశాను. ఇలా ఆలోచించేసరికి నాన్నతో నాకున్న గత స్మృతులు ఒక్కొక్కటీ గుర్తుకు రాగా.. నాగుండె చెరువైంది. ఆశ్రమంలో వదిలేసి వస్తున్నప్పుడు.. నాన్న నావైపు చూసిన చూపులు ఇప్పుడు గుర్తొస్తున్నాయి.

'ఇదిగో నాన్నా.. ఇప్పుడే నీ దగ్గరికి వచ్చేస్తున్నా!' అంటూ ఫోన్ తీసి, వణికే చేతులతో ఆశ్రమం ఫోన్ నెంబర్ కోసం వెతకసాగాను. కంటికి అద్దాలున్నా కూడా అంతా మసక మసగ్గా కనిపించింది. ఒక్కక్షణం అద్దాలు తీసేసరికి.. జలజలా కన్నీళ్లు ధారాపాతంగా చెంపలపై ఆగకుండా రాలుతునే ఉన్నాయి. రమణి గయ్యాళితనం, నాన్న ఒంటరితనం, అనారోగ్యం మూడు శునకాలై.. ఆయన్ని కబళించాలని చూస్తున్నట్టు అనిపించింది. అంతే.. ఇక ఆగలేకపోయాను. కారును ఆశ్రమం వైపు వేగంగా దూకించాను. జీవితంలో సమస్యలు ఎదురైతే పారిపోవడం, కృంగిపోవడం చేయకూడదు. కన్నవారి కోసం ప్రాణాలు కూడా లెక్కచేయకూడదని ఆ నోరు లేని జీవి నాకు నేర్పిన జీవిత పాఠాన్ని నా మనసులో పదిలంగా దాచుకున్నాను.

* * *

**కశిఒజ్జల భాస్కరా చారి స్వస్థలం వరంగల్ జిల్లా పైడిపెల్లి గ్రామం. వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లాలో పనిచేస్తున్నారు. 2012 నుంచి కథలు రాస్తున్నారు. ఈయన రాసిన మొదటి కథ.. 'వేపచెట్టు' ఆంధ్రభూమి వార పత్రి–కలో ప్రచురితమైంది. 2014లో రాసిన 'జీవితార్థం' కథ.. స్వాతి మాస పత్రికలో వచ్చింది. చాలాకాలం విరామం తర్వాత గత ఏడాదిన్నరగా మళ్లీ కథలు రాస్తున్నారు. ఇప్పటివరకు తొమ్మిది కథలు రాశారు. ఇవన్నీ తెలుగు వెలుగు, నమస్తే తెలంగాణ, వెలుగు, నవతెలం–గాణ ఆదివారం అనుబంధంలో ప్రచురితమయ్యాయి. తొమ్మిదో కథ 'జీవిత పాఠం'.. నమస్తే తెలంగాణ, ముల్కనూర్ ప్రజా గ్రంథాలయం నిర్వహించిన 'కథల పోటీ – 2021'లో ప్రత్యేక బహుమతి దక్కించుకున్నది. 'కథ అంటే కదిలించాలి. చదివిన తర్వాత ఈ ప్రపంచం కొత్తగా కనిపించాలి' అని నమ్ముతారు.**

# వారసత్వం



రాజమోహన్
ఇవటూరి

పదవీ విరమణకు నెల రోజుల ముందునుంచే నా సహోద్యోగులు చేసిన హడావుడికి తెరపడే రోజు వచ్చింది. ఎందుకంటే ఈరోజే ఇక్కడ నా ఉద్యోగానికి ఆఖరు రోజు.

అన్ని విభాగాలలో నాతో పనిచేసిన వారంతా నాతో మాట్లాడేముందు కన్నీళ్లు ఆపుకొంటున్నట్టు అనిపించడం.. నా భ్రమే అయ్యుండొచ్చు. కానీ, అదొక అందమైన భ్రమ కదా!

పెద్దసభలా కాకుండా నేను పనిచేసే బల్లముందే వీడ్కోలు సభకు అన్ని ఏర్పాట్లూ చేశారు. నా పని గంటలు పూర్తయ్యి, కంపెనీకి తిరిగి ఇవ్వాల్సిన వస్తువులన్నీ ఇచ్చేసి బరువు తీర్చుకున్నాక.. కార్యక్రమం ప్రారంభమయింది.

దయామోయ్.. తాను ఒక రోజువారీ కూలీగా చేరాక, తనకు చదువుమీద ఉన్న ఉత్సాహం గమనించి.. అతణ్ని ప్రోత్సహించి, అక్కడే ఒక టెక్నీషియన్‌గా పనిచేసే స్థాయికి చేరడానికి నేను చేసిన సహాయం గురించి చెప్పాడు. అలాగే బర్మన్.. తన తోటి ఆపరేటర్ల తరపున ఎన్నో ఏళ్లుగా ఆపరేటర్లుగా పనిచేస్తున్న ఎంతోమందికి దారిచూపి, పాలిటెక్నిక్ పాస్ చేయించి.. పదిహేను ఇరవై ఏళ్లకుగానీ చేరలేని సూపర్‌వైజర్ స్థాయికి ఎదిగే అవకాశం కల్పించానని నాకు ధన్యవాదాలు చెప్పారు. ఉద్యోగుల్ని ప్రోత్సహించడానికి అధికారులకు ఇచ్చే 'ఇంప్రెస్ మనీ' అని ఒకటి ఉందని కూడా తెలియని పరిస్థితులలో..

తనకొచ్చిన నిధులన్నీ తన సిబ్బంది కోసమే వినియోగించి ఇంజినీర్, సూపర్‌వైజర్ టెక్నీషియన్, రోజు కూలీ అనే భేదాలు లేకుండా అందరినీ ఒకవర్గంగా పని చేయించినందుకు కమల్ ఝా.. తన జట్టు తరపున నాకు కృతజ్ఞతలు చెప్పారు.

ఇదంతా అయ్యాక ఉద్యోగంలో చేరినప్పటి నుంచీ నాతో ఎంతో సన్నిహితంగా పనిచేసిన సహచరుడు మూర్తి మాట్లాడాడు.

'రాజాగారు నాకు ఈ ఉద్యోగానికి ముందునుంచీ తెలుసు. ఆయన స్వయంకృషితో పైకొచ్చిన మనిషి. వారసత్వ ఆస్తులతో, అధికారాలతో ఎదిగిపోయిన ఎంతోమంది గొప్పవాళ్లు మనకు తెలుసు. కానీ, ఎంతో సామాన్యమైన ఆర్థిక పరిస్థితులతో జీవితం ప్రారంభమైనా స్వయంకృషితో పైకొచ్చి, తనతోపాటు తన సహచరులను కూడా ముందుకు తీసుకువెళ్లిన నాయకుడు రాజాగారు మాత్రమే. ఈయన తండ్రి నిజంగా సామ్యవాదాన్ని ఆచరించాలని ప్రయత్నించిన అతికొద్దిమందిలో ఒకరు. సొంత ఆస్తులకూ, అవసరానికి మించి డబ్బు కూడబెట్టడానికి వ్యతిరేకి. కనుకే తోచిన సాయాలు చేసుకుంటూ తనకోసం కానీ, పిల్లల కోసం కానీ ఏమీ వెనకేసుకోలేదు. ఆ ధోరణితోనే తన భార్యకూ, పిల్లలకూ వారసత్వంగా ఏమీ ఇవ్వకుండా చిన్న వయసులోనే ప్రపంచాన్ని వదిలి వెళ్లిపోయారు. అటువంటి పరిస్థితులలో రాజాగారు అన్ని అడ్డంకులనూ ఎదుర్కొని, ఇంత పైకి రావడానికి కారణం.. ఆయన మనోబలమూ, తెలివితేటలూ అని చెప్పడానికి ఏ సందేహమూ లేదు. ఇటువంటి మనిషితో ఇన్నేళ్లు పనిచేయడం నా అదృష్టం' అన్నాడు.

తర్వాత వీరపరాజు మాట్లాడుతూ..

'తండ్రి బుద్ధులతోనే రాజాగారు కూడా ప్రతిరోజూ ఒక తెలియని వ్యక్తికి సాయం చేసే వ్రతాన్ని చిన్నప్పటి నుంచీ పాటించారు. కానీ, ఆయన తండ్రిలా ఉన్నదంతా అందరికీ పంచి పిల్లలను రోడ్డుమీద పడేయకుండా కొంచెమైనా దాచుకోవాలి' అన్నాడు.

ఇక కర్మాకర్..

'ఆయన ఇంకా చదువుకోవాలని అనుకున్నా పెద్దల బలవంతంతో పెద్ద చదువులు వదిలి ఉద్యోగంలో చేరారు. ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు చదివి ఎంతో ఎదిగారు. మనందరికీ ఆదర్శమయ్యారు. ఇక్కడ కిక్కిరిసిన సభలో వారి సాయం తీసుకోని వారు ఒక్కరు కూడా లేరనేది పచ్చినిజం. స్వయంకృషితో పైకొచ్చిన రాజాగారు ఉద్యోగ విరమణ చేసినా ఇంకా ఎంతో ఎదుగుతారు' అని కరతాళ ధ్వనుల మధ్య చెప్పాడు.

ఎందరో ఇలా మాట్లాడాక నావంతు వచ్చింది. అందరికీ కృతజ్ఞతలు చెప్పుకొన్నాక నా వైపునుంచి మాట్లాడటం మొదలుపెట్టాను.

'మీరందరూ నాకు కూడా తెలియని ఎన్నో మంచి విషయాలను గుర్తుకుతెచ్చి మరోసారి నా సంతృప్తికరమైన జీవితాన్ని గుర్తుచేశారు. నిజానికి మీరందరూ కూడా సంస్కారవంతులు కనుక నన్నెంతో పొగిడారు తప్ప.. నేను మీరందరూ చెప్పినంత గొప్పవాడిని కాను. మన ఇంటి అరుగు ఒకరికి కూర్చోవడానికి చోటిస్తే.. మన ఇంటి చెట్టు నలుగురికి నీడనిస్తే

సంతోషించడం మనమంతా పాటించే పద్ధతే కదా! నా దృక్పథానికి సరిపోయేలా నా ఆఖరు పనిదినంలో ఆఖరు గంట వరకూ నేను నా బాధ్యత నిర్వహించే వరకూ వేచి ఉండి, నాకు సౌకర్యంగా నా దగ్గరికే మీరొచ్చి ఈ వేడుక ఏర్పాటు చేసినందుకు మీ అందరికీ చాలా కృతజ్ఞతలు' అని చెప్పి ముగించబోయాను.

'రాజాగారూ! ముప్పై ఏళ్లకు పైగా మాతో పనిచేసి, మీరు ఇంత క్లుప్తంగా ముగిస్తే కుదరదు. మీ అనుభవాలను, నేర్చుకున్న విషయాలనూ మీరు చెప్తారనీ.. ఈరోజు కూడా మీనుంచి ఏమైనా తెలుసుకుందామని అనుకునేవాళ్లం ఎందరో ఉన్నాం. దయచేసి మరికొంచెం సేపు మాట్లాడండి' అన్నాడు నూకరాజు.

'మీ సహనానికి చాలా సంతోషం. నాకూ చెప్పుకోవాలనే ఉంది. మీకు ఒక అరగంట ఎక్కువ సమయం కాదనుకుంటే ఇంతవరకూ ఎవరికీ చెప్పని ఎన్నో విషయాలు ఈరోజు చెప్పాలని అనుకుంటున్నాను'.. అని మొదలుపెట్టాను.

* * *

మాది ఒక దిగువ మధ్య తరగతి కుటుంబం.

నాన్నకు మాతోపాటు తన తమ్ములతోనూ, చెల్లెళ్లతోనూ ఉన్న బాధ్యతల వల్ల నాకు ఆయనతో ఎక్కువ సమయం గడిపే అవకాశం ఉండేది కాదు.

ఆ రోజుల్లో ఎందరో ఇంటికి వచ్చేవారు. వచ్చినది ఎవరైనా నాన్న తలుపు వరకూ వచ్చి స్వాగతం చెప్పడం, ఆ అతిథుల్ని ఒక్కక్షణం కూడా నిర్లక్ష్యం చేయకుండా వారితో గడిపి.. వారు వచ్చినప్పుడు ఎంత మర్యాద చూపారో అదే స్థాయిలో వెళ్లేవారికి వీడ్కోలు ఇచ్చేవారు. వచ్చినవారికి జరిగే మధ్యతరగతి స్థాయి మర్యాదలు కూడా అందరికీ సమానమే. ప్రెసిడెంట్ రాధాకృష్ణగారు వచ్చారు.. ఆరుద్రగారు వచ్చారు, యువ రాజకీయ నాయకుడిగా ఉన్న వెంకయ్య నాయుడు గారూ వచ్చారు. ఎప్పుడో మా ఇంట్లో పనిచేసిన గోవిందమ్మ వచ్చేవారు. ఆయన దగ్గరికి సందేహాలతో విద్యార్థులు వచ్చేవారు. మా కాలేజీలో వడ్రంగి పనిచేసే జోగారావు వచ్చేవారు. మా వీధిలో దొంగతనం చేసి దెబ్బలు తింటుంటే, నాన్న రక్షించిన పాషా వచ్చేవారు. అందరికీ ఒకే మర్యాద.

దీపావళికి సరుకులు కొన్నప్పుడు మా ఇంట్లో పనిచేసే ఆవిడ పిల్లలకు కూడా మాతో సమానంగా సరుకులు తీసుకొస్తే మేము అలిగేవాళ్లం. మేము తినే ఫలహారాలు వారికి కూడా పెడితే కోపగించుకునే వాళ్లం. నెమ్మదిగా మాలో ఆయన కోరుకున్న మార్పు వచ్చింది. అందువల్ల మాలో జీవితం పట్ల ఇంకా ఉత్సాహం పెరిగింది. మనవారు అనుకున్న వారి దగ్గర ఎంతో సర్దుకుని బతికే మనం.. ఎక్కువమందిని మనవారు అనుకుంటే మరింత సంతోషంగా బతకగలం కదా!

నేను కొంచెం ఆలోచించే స్థాయికి ఎదుగుతున్న రోజుల్లో.. ఒకరోజు ఓ యువకుడు జంకుతూ ఇంటి ముందుకు వచ్చి..

'నాన్నగారు ఉన్నారా బాబూ?!' అని అడిగాడు.

నాన్న శిక్షణ పొందిన నేను ఎంతో మర్యాదగా..

'ఉన్నారు. లోపలికి వచ్చి కూర్చోండి' అని మాదగ్గర ఉన్న ఏకైక రేకుల కుర్చీ తెరిచి వేశాను.

ఇంతలో నాన్న రానే వచ్చారు.

'నమస్కారమండీ. నా పేరు బాబూరావు. ఇక్కడే ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదువుకోవడానికి సీట్ దొరికింది సార్. మీకు కుదిరితే మీరు వారంలో ఏదో ఒకపూట చెప్తే ఆరోజు భోజనానికి వస్తాను' అన్నాడతను.

'అలాగే బాబూ. ఈరోజు తిన్నావా?' అని అడిగింది మా అమ్మ.

'ఇంకా లేదండీ!'.

'నీకు మిగతా వారాలు కుదిరేవరకూ మా దగ్గరే ఉండు' అన్నారు నాన్న.

(అలా చేరిన బాబూరావు వారంలో అన్నిరోజులూ మా దగ్గరే భోజనం చేస్తూ పూర్తిగా చదువుకున్నాడు. అలాగే మరెందరో.. అతను ఇప్పటికీ మమ్మల్ని మరిచిపోలేదు)

అప్పుడప్పుడే ఎదుగుతున్న నేను మొదటిసారి నాన్న గురించి తెలుసుకోవడానికి దోహదం చేసిన సంఘటన అది.

తర్వాత ఇలాంటివి మా జీవితంలో భాగమని అర్థం చేసుకున్నాను.

ఎలాంటి సాయమైనా నాన్న చేయగలరా లేదా అనే సంకోచం లేకుండా ఎవరో ఒకరు వస్తూనే ఉన్నారు. అంతేకాదు నాన్నకేవో తరతరాల ఆస్తులు ఉన్నాయనీ, అందుకే సులువుగా ఎవరికైనా సాయం చేసేస్తున్నారనీ కొంతమంది అనుకోవడం విన్నాను. ఆయనకు జీతం తప్ప మరే సంపాదన లేదనీ, ఆఖరికి తన దగ్గర ప్రతిరోజూ సందేహాలు తీర్చుకునే విద్యార్థుల నుంచి కూడా ఏమీ తీసుకోరనీ చెప్పినా వారు నమ్మరు. ఎందుకంటే ఈ లోకంలో తెగబలిసిన వారు తప్ప ఊరికే సాయం ఎవరూ చేయరని లోకం నమ్ముతుంది కాబట్టి.

నేను ఉన్నత విద్యలో ఆఖరు సంవత్సరం పరీక్షలకు ప్రతిరోజూ నలుగురు స్నేహితులతో కలిసి చదువుకుంటూ ఉండేవాడిని. అలాగే నా స్నేహితుడి ఇంటికే వెళ్తున్నపుడు ఓ రోజు నాన్న..

'ఏరా ఈ రోజు వెళ్లకపోతే ఏమైనా నష్టమా?' అని అడిగారు.

'మేమందరం ఒక్కొక్క అంశం చదువుకుని ఒకరికొకరం వివరించుకుంటున్నాం. నేనీరోజు వెళ్లకపోతే మిగిలిన వారికి కూడా కొంచెం ఇబ్బంది అవుతుంది' అని నేను బయల్దేరాను. అదేరోజు నా తమ్ముడు రాత్రి ఆటకు సినిమాకు వెళ్లాడు. ఎప్పుడూ లేనిది బస్సు ఎక్కేవరకూ టార్చ్‌లైట్ సాయంతో వాడిని దింపి వచ్చారు నాన్న. ఆ అర్ధరాత్రే.. గుండెపోటుతో ఈ లోకాన్ని వదిలి వెళ్లిపోయారు. ఆ రోజే నాన్న శాశ్వతంగా మమ్మల్ని వదిలి వెళ్లిపోతున్నారని తెలిసి ఉంటే ఇద్దరం ఇంట్లోనే ఉండే వాళ్లమేమో!

జరిగిన నష్టం నాకు తెలియడానికి, అందువల్ల కలిగిన అపారమైన నష్టం అర్థం చేసుకోవడానికి కొంత సమయం పట్టింది.

పరీక్షలు మానెయ్యాలనుకున్నా.. అన్నయ్య బలవంతంగా రాయించాడు.

ఏ రోజుకారోజు చదువుకునేలా మాకు దినచర్య అలవాటు చేయించి, వర్షాలు వచ్చినా, బందులు జరిగినా కుంగకుండా కళాశాలకు వచ్చి పాఠాలు చెప్పిన గురువుల ఆశీస్సులతో, ఎన్ని కష్టాలలోనైనా పక్కన నిలబడి చదువులో సాయం చేసిన మిత్రుల సహకారంతో నేను పాసయ్యాను. బంగారు పతకం కూడా దక్కించుకున్నాను.

కానీ, ఆ ఆనందం పంచుకోవడానికి నాన్న లేరు. ఆ విషాదంలో ఉన్న మిగిలినవారు కూడా నిర్లిప్తంగా ఉండిపోయారు.

ఈ వాతావరణంలోనే నేను పెద్ద చదువు కోసం ఖరగ్‌పూర్ బయల్దేరాను.

* * *

నాన్నకు రావాల్సిన పించన్ కోసం తిరుగుతున్నాను. నేను ఏ ఆఫీస్‌కు వెళ్లినా అందరూ లేచి నిల్చొని, నాన్నలేని లోటును గుర్తు చేసుకొని నాకు వీలైనంత త్వరగా సహాయం చేశారు.

మా నాన్న డిపార్ట్‌మెంట్ హెడ్ గణపతిరావు గారు. ఆయన చెడ్డవాడు కాదుగానీ అదోరకం.

'మీ నాన్న పేరుమీద ఒక కాలిక్యులేటర్ వెనక్కి రావాలి. అది మీరు తెచ్చి జమ చేసేస్తే.. నేను ఏ బకాయిలూ లేవని రాసి ఇస్తాను' అన్నారు.

'ఇల్లంతా వెతికాం సర్. ఎక్కడా కనిపించలేదు. అసలు ఆయన వాడుతుండగా ఎప్పుడూ చూడలేదండీ!' అన్నాను.

'అదంతా నాకు తెలియదు. మరొకసారి వెతికి చూడండి' అన్నారాయన.

ముక్కుసూటిగా పోయే మనిషి. వేరే విషయాలలో అంతవరకూ ఆయన నాకు సాయంగానే ఉన్నారు.

నాకేం చెయ్యాలో తెలియలేదు. ఆ రోజుల్లో కాలిక్యులేటర్ అనేది ప్రదర్శనలో మాత్రమే కనిపించే ఒక వింతవస్తువు. అది ఎక్కడ దొరుకుతుందో, ఒకవేళ నేనే కొంటే ఎంత ఖర్చవుతుందో కూడా తెలియదు. అయోమయంగా నేను నడుచుకుంటూ పోతుంటే..

'బాబూ ఆగండి!' అని వినిపించి, వెనక్కి తిరిగాను.

అతను హరగోపాల్. రొప్పుతూ నా దగ్గరికి వచ్చారు. కళాశాల వర్క్‌షాప్‌లో వడ్రంగి పనులు నేర్పిస్తారు. మా ఇంటికి అప్పుడప్పుడూ వచ్చేవారు.

'ఈ కాలిక్యులేటర్ తీసుకుని గణపతిరావు గారికి ఇచ్చేయండి' అన్నారు.. ఒక కాలిక్యులేటర్ నా చేతిలో పెడుతూ.

'అయ్యో ఇది జమ చేసేస్తే మరి మీరెలా..?' అని నేను అడుగుతుంటే..

'నేను చూసుకుంటా లెండి. నాకింకా చాలా ఏళ్ల సర్వీస్ ఉంది కదా!' అన్నాడు.

నేను ఇంకా తటపటాయిస్తుంటే..

'పరవాలేదు. వెళ్లండి' అన్నాడతను.

'ఇక అంతా అయ్యింది కదా!' అని పించను ఆఫీస్‌కు వెళ్లాను.

ఆ సమయంలోనే పర్వతాలరావు అని నాన్న సహోద్యోగి కొడుకు గిరి కూడా అదే పనిమీద వచ్చాడు. వాళ్ల నాన్న కూడా ఇంచుమించు అదే సమయంలో పోయారు. అతణ్ని చూడగానే

గుమస్తా కళ్లెర్రజేసి..

'నిన్ను ఈవారం రావద్దని చెప్పాను కదా! మళ్లీ మళ్లీ వచ్చి ఎందుకిలా విసిగిస్తావ్?' అని గట్టిగా అరిచాడు.

'నాకుకూడా అదే గౌరవం పడుతుందేమో?!' అని నా గుండె గతుక్కుమని పోయింది.

'నేనింకా మొదటిసారే వచ్చాను కదా!' అనుకుంటూ, భయం భయంగా అతని దగ్గరికి వెళ్లి, అన్ని కాగితాలూ అతని ముందుపెట్టాను.

గిరి వెళ్లాక కూడా అవే ముఖ కవళికలతో, కోపంగా ఉన్న అతని ముఖంలో.. నన్ను చూడగానే ఒక్కసారిగా మార్పు వచ్చింది.

'మీరా బాబూ! మీకు చాలా అన్యాయం జరిగిపోయింది. ఇప్పుడు చేయగలిగింది చేద్దాం! రిటైర్ అయ్యి పించనుకోసం వచ్చేవారయితే వాళ్లే తిరుగుతారు గానీ, పుట్టెడు దుఃఖంలో ఉన్న మీరిలా రాకూడదు. నేను అన్ని కాగితాలూ చూసి పని పూర్తయ్యాక మీ ఇంటికే వస్తాను' అన్నారు.

ఊహించని ఆ మంచితనానికి నేను ఆశ్చర్యపోయాను. ఏమిటీ విచిత్రం? అనుకున్నాను.

'నేను వారంలో ఖరగ్‌పూర్ వెళ్లిపోవాలండీ' అన్నాను దుఃఖం అణచుకుంటూ.

'అలాగా! పరవాలేదు బాబూ. ఈ లోపలే పనైపోతుంది. కాకపోయినా నేను ఇంటికి వచ్చి ఇస్తాను లెండి' అన్నారతను.

మనస్ఫూర్తిగా ఆయనకు నమస్కరించి ఇంటికి వెళ్లాను.

* * *

మొదటిసారి ఒక్కడినీ వేరే ఊరికి వెళ్లాల్సిరావడం వలన చాలా దిగులుగా ఉంది. నన్ను స్టేషన్ వరకూ సాగనంపటానికి వచ్చే సందర్భం కాదు కనుక.. బంధువులంతా అమ్మ దగ్గరే ఉండిపోయారు.

ఒంటరిగా రైలెక్కాక బెంగ ఇంకా పెరిగింది. ఇంతలోనే పదిమంది కుర్రాళ్లు వచ్చారు.

'నువ్వు ఖరగ్‌పూర్‌కే కదా! పద మనవాళ్లంతా ఎస్-ఫోర్ కోచ్‌లో ఉన్నారు' అని నన్ను తీసుకుపోయారు. వాళ్లతో కబుర్లు చెప్పుకొంటూ బాధను మరిచిపోయాను.

బెంగను మరిచిపోవడానికి అందరితో స్నేహం చేసుకుని, నాకు ఏమాత్రం సమయం మిగలకుండా ఏదో ఒక వ్యాపకంలో పడిపోయాను.

నా స్నేహితులు కేవలం నా వయసువారే కాదు. రీసెర్చ్ స్కాలర్స్, ఉద్యోగంలో సెలవు తీసుకుని నాలాంటి చదువులు చదివేవారు, కొత్తగా చేరిన కుర్ర గురువులు, మెస్ ఉద్యోగులు, మా కళాశాల ఉద్యోగులు అందరూ స్నేహితులే.

ఇంత హడావుడిలో కూడా బాధ్యత మరిచిపోలేదు. ఇంత పెద్దచదువు చదువుకుంటూ సంపాదన లేకుండా ఉండకూడదని తెలుసు కనుక నా డిగ్రీ అర్హతలతో ఉద్యోగాలకు దరఖాస్తులు పెట్టుకున్నాను.

వరుసగా ఇంటర్వ్యూలకు ఉత్తరాలు వచ్చాయి. అందులో మొదటిది.. రాష్ట్రీయ విద్యుత్

కేంద్రం నుంచి వచ్చింది. ఢిల్లీకి మొదటిసారి ప్రయాణం చేశాను. మొదటిసారి ముఖాముఖి సమావేశానికి వెళ్లేటప్పుడు భయం వేసింది.

ఆ పెద్దగదిలో అయిదుగురు పెద్దవారు కూర్చుని ఉన్నారు. మధ్యలో ఉన్నాయన వాళ్లకు నాయకుడిలా ఉన్నారు.

నన్నేవో ప్రశ్నలు వేశారు. అడిగిన నాలుగైదు ప్రశ్నలకు సమాధానం బాగానే చెప్పాను. నేను జవాబులు చెప్తున్నపుడే ఆయన నా దరఖాస్తు పరిశీలిస్తున్నారు. మరేమీ ప్రశ్నలు అడగకుండా.. నన్నిక వెళ్లవచ్చని అన్నారు.

ఆయన పక్కనున్నతను..

'ఇంకా బొగ్గు నిర్వహణ, ఓడల్లో విద్యుత్తు ఉత్పత్తి చేయడం అవన్నీ అడగలేదు కదా!' అంటుంటే..

'చాలు.. మనకు వచ్చిన జవాబులను బట్టి నిర్ణయం తీసుకోవచ్చు' అంటూ ముందుకు వంగి ఏదో రాసుకున్నారాయన.

నేను అయోమయంగా ఖరగ్‌పూర్ వచ్చేశాను. నెల రోజుల తర్వాత ఆ సంస్థలో నియామకం అయినట్టు తెలియజేస్తూ ఉత్తరం వచ్చింది.

ఆరోజు సంతోషంతో ఉప్పొంగిపోయాను.

చేరడానికి ఏమేమి కావాలో వారు పంపిన పెద్ద కాగితాల కట్టలో ఉన్నాయి. వారు జమ చేసిన పూచీకత్తు పత్రం మీద నేను రెండేళ్లు ఉద్యోగం వదలకుండా ఉంటానని నిర్ధారిస్తూ ఒకరి సంతకం అవసరం.

'అరే! ఇక్కడ నీకెవరు సంతకం పెడతారురా!?' అన్నాడు మిత్రుడు సాయి.

'ఒరేయ్! ఇక్కడ నాకున్న వందల మిత్రులలో ఆదాయపు పన్ను కడుతూ చదువుకుంటున్న వారు చాలామంది ఉన్నారు. ఎవరో ఒకరు కచ్చితంగా సాయం చేస్తారు' అన్నాను నిశ్చింతగా.

'అదీ నిజమే!' అన్నాడు సాయి.

అందరిలో మంచి స్నేహితుడైన యోగీంద్రనాథ్ దగ్గరికి వెళ్లాను.

'నాకు ఉద్యోగం వచ్చిందండీ!' అని చెప్పాను.

'ఆహా! ఎంత సంతోషకరమైన వార్త. ఇంత సులువుగా చెప్తే ఎలా? మిఠాయిలేవీ?' అన్నారతను.

'అవి కూడా ఉన్నాయండీ' అంటూ అతని చేతికి రెండు మిఠాయిలు ఇచ్చాను.

'ఇది కరెక్ట్!' అని అతను తింటుంటే..

'ఒక చిన్న చిక్కొచ్చిందండీ. మీకేం కష్టం కాదనుకోండి! నేను రెండేళ్లు ఉద్యోగం వదలనని పూచీకత్తు పత్రం మీద మీరొక సంతకం పెట్టాలి' అని ఎంతో నమ్మకంగా అతని చేతిలో కాగితాలు ఉంచి కలాన్ని చేతికిచ్చాను.

యోగీంద్ర ఆ కాగితాలను అటూ ఇటూ తిరగేస్తున్నాడు. పది నిమిషాలైనా.. మళ్లీమళ్లీ కాగితాలను తిరగేస్తాడు తప్ప.. సంతకం పెట్టడేమిటి?

అలాగే అటూ ఇటూ చూసి కాగితాలు వెనక్కి ఇచ్చేస్తూ..

'నా దగ్గర ఆదాయపు పన్ను అంకె లేదయ్యా! గుర్తు లేదు. అది లేకుండా నేను సంతకం పెట్టినా చెల్లదు' అన్నారు.

'మీరు పనిచేస్తున్న సంస్థ పేరు రాస్తే సరిపోతుందేమోనండీ!'.

'అబ్బెబ్బే అలా కాదు. మీకే ప్రమాదం. ఇంకెవరినైనా అడగండి' అన్నారు.

నాకు ఒళ్లు మండింది.

'అతని థీసిస్ కోసం నేను ఎంతో సాయం చేశాను. ఇప్పుడు నాకు సాయం చెయ్యాల్సి వచ్చేసరికి అర్థం లేని కారణాలు చెప్తున్నారు' అనుకున్నాను.

ఇంతలో నాన్న చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి.

'మనం చేసిన సాయం నుంచి ఏదైనా ఆశిస్తే.. అది సాయం కాదు. వ్యాపారం. ఎవరికి ఏం కుదిరితే అంతే సాయం చెయ్యగలరు'..

'నిజమే! నాకు రూమ్‌లో వంట చేసుకోవడానికి ఇతనే సాయం చేశారు. నడిచివెళ్తున్న నాకు మంచి బేరంతో సైకిల్ ఇప్పించి, నాకు చదువుకోవడానికి ఇంకాస్త సమయం మిగిలేలా చేశారు. ఇప్పుడు నేనడిగిన సాయం.. ఆయన వల్ల కాదేమో లే. అయినా ఇంకా ఎందరో మిత్రులున్నారు కదా!' అనుకొని అతని గదిలోంచి బయటికి వచ్చాను.

'ఏమయ్యా బావున్నావా' అన్నారు రామకృష్ణ.

రామకృష్ణగారు మా కాలేజీలో అధ్యాపకుడు. ఇక్కడ రీసెర్చ్‌స్కాలర్. ఆయన ముక్కు పొడవుగా వంపులు తిరిగి ఉంటుందని అందరూ 'చిలక మాస్టారు' అని చెప్పుకొనేవారు.

'బాగానే ఉన్నానండీ' అంటూ ముందుకు నడిచాను.

ఈ సారి చిన్మయి బెనర్జీ దగ్గరికి వెళ్లాను. ముందు ఉద్యోగం వచ్చిందని చెప్పి, మిఠాయిలు ఇచ్చి నెమ్మదిగా విషయం చెప్పాను.

'అయ్యో! మా జ్యోతిష్కుడు ఈ ఏడాది ఏ పత్రం మీదా సంతకాలు చేయవద్దన్నాడే!' అన్నారు బెనర్జీ.

'ఇది ఆస్తుల లావాదేవీల వంటిది కాదు కదా!?'.

'ఏమో! ఆయన 'సంతకం వద్దు' అన్నాడంటే వద్దనుకోవడమే మంచిది కదా!'.

'నిజమేనండి!' అని గది బయటికి వచ్చాను.

మరో రెండురోజుల్లో నాకు అర్థమయ్యింది. ఒక్కరు కూడా నాకు సహాయం చెయ్యడానికి ముందుకు రావడం లేదు. మా ప్రొఫెసర్లను కూడా అడిగి లేదనిపించుకున్నాను. ఒక్కొక్కరూ వారి నిస్సహాయతకు చెప్పిన కారణాలు వినూత్నంగా, వైవిధ్యంగా.. కథలు రాసుకోవడానికి ఎంతో అనువుగా ఉన్నాయి. నేను ఉద్యోగంలో చేరడానికి ఆఖరు రోజు దగ్గర పడుతున్న కొద్దీ.. నాలో ఆందోళన పెరుగుతున్నది.

వేసవికాలం ఎండల్లో నేను పిచ్చోడిలా తిరుగుతుంటే.. మళ్లీ చిలక మాస్టారు (రామకృష్ణ గారు) నాకు ఎదురొచ్చారు.

'ఏమయ్యా బావున్నావా?' అని పలకరించారు.

అసలే నా పని ఏమవుతుందో అనే ఆందోళనతో తిరుగుతున్న స్థితిలో ఆయనకు ప్రతినమస్కారం కూడా చేసే ప్రయత్నం చేయకుండా ముందుకు వెళ్తూంటే..

'ఏమయ్యా రాజా! చాలారోజుల నుంచి చూస్తున్నాను. చేతిలో ఫైల్ పట్టుకుని తిరుగుతున్నావు. ఏమిటి విషయం?' అన్నారతను.

ఇక తప్పదని విషయం చెప్పాను.

'ఉద్యోగం వచ్చిందా! చాలా మంచిది. ఫామ్ నింపుకొని రా.. సంతకం పెట్టేస్తాను' అన్నారాయన.

ఊహించని ఆ మాటకు ఆశ్చర్యపోతూ, అయినా ఒకింత అనుమానంతోనే..

'చాలా థాంక్స్ సర్. అందులో ఏమి రాసుందో ఒకసారి చదివితే మంచిదేమో' అన్నాను.

'అవసరం లేదు. బసవరాజు గారి కొడుకువి. నువ్వేమీ మోసం చెయ్యవులే. చెయ్యలేవు. రేప్పొద్దున్నే మా ఇంటికి వచ్చేయ్. భోజనం చేసి వెళ్దువు గాని. ఇలా ఎండలో తిరగకు' అన్నారు.

ఆయనకు కృతజ్ఞత ఎలా చెప్పాలో తెలియక ఇబ్బందిగా నుంచుంటే..

'మీ నాన్న అయితే ఒక్క ప్రశ్న కూడా అడగకుండా ఎంతోమందిని నమ్మి సహాయం చెయ్యలేదూ. మరి ఆయన శిష్యుడిగా నేను మరోలా ఉండలేను కదా! రేపు ఇంటికి వచ్చేయ్' అని నన్నింకా ఇబ్బంది పెట్టకుండా, అక్కడినుంచి కదిలారు చిలక మాస్టారు. కాదుకాదు.. రామకృష్ణ మాస్టారు.

నాన్న మరో సందర్భంలో చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి.

'మనం ఒకరికి అప్పు ఇస్తే వారు తీర్చేయడం మన వ్యావహారికం. కానీ, దేవుడి లెక్కలు చాలా సంక్లిష్టమైనవి. నీకు సాయం చేసే వారు నీనుంచి సాయం పొందిన వారే కానక్కరలేదు!'.

సమస్య ఆ విధంగా పరిష్కారం అయ్యింది కనుక అన్ని డాక్యుమెంట్లు తీసుకుని ఢిల్లీ వెళ్లాను.

ఇరవై అంతస్తుల భవనంలో వెతుక్కుని మానవ వనరుల అధికారి రాధాకృష్ణ గారి దగ్గరికి వెళ్లాను.

నేను వెళ్లేసరికి అతను ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతున్నారు.

'కష్టం శాస్త్రిగారూ ! రోజుకు వందమంది పైగా చేరుతున్నారు. అప్పుడప్పుడూ నేను ఉండను' అంటున్నారు రాధాకృష్ణ.

అవతలి నుంచి ఎవరో మాట్లాడుతుంటే.. మళ్లీ సమాధానంగా..

'సరే నా ప్రయత్నం చేస్తాను' అని అతను చెప్తుంటే.. నా అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఆయన ముందు ఉంచాను.

ఆ ఆర్డర్‌పైనే కనిపిస్తున్న నా పేరు చూడగానే అతను..

'ఒక్కసారి ఆగండి శాస్త్రిగారూ! అతను ఇప్పుడే వచ్చాడు' అని చెప్పి, 'మిస్టర్ రాజా! సీతారామశాస్త్రి గారు మీతో మాట్లాడాలని అనుకుంటున్నారు' అన్నారు.

'ఆయనెవరు?' అన్నాను అయోమయంగా.

'ఆయనకు మీరు తెలుసు. ఒకసారి మాట్లాడండి' అంటూ ఫోన్ అందించారు.

నేను అయోమయంగా ఫోన్ తీసుకుంటే.. అవతల నుంచి,

'నేను సీతారామశాస్త్రిని మాట్లాడుతున్నాను' అన్నారు ఎవరో.

ఆయనెవరో తెలియక నేను మౌనంగా ఉంటే..

'మీ నాన్న, నేనూ స్నేహితులం. సాయంత్రం మా ఇంటికి రా' అని ఇంటిదారి చెప్పారు.

నేను వెతుక్కుంటూ ఆయన ఇంటికి వెళ్లేసరికి.. నన్ను ఇంటర్వ్యూ చేసిన జట్టుకు నాయకుడే సీతారామశాస్త్రి గారని అర్థమయ్యింది. నాలో నాన్న పోలికలు గమనించగానే, ఆయన నా దరఖాస్తు పరిశీలించి మరెక్కువ ప్రశ్నలు వేయకుండా ఉద్యోగానికి ఎంపిక చేసి ఉండొచ్చని నాకు అర్థమయ్యింది. ఆ మాటే అంటే ఆయన నవ్వేసి..

'చదువులో బంగారు పతకం కూడా సంపాదించుకుని ఉత్తీర్ణుడివైన నిన్ను ఎన్నుకుంటే ఎవరూ ప్రశ్నించలేరు' అన్నారు.

కానీ.. నిజం నిజమే. ఈ ఉద్యోగం నాన్న చలవే!

వాళ్ల పిల్లలను పరిచయం చేశాక.. వాళ్లు లోపలికి వెళ్తే, ఎందుకో వాళ్ల రెండో అమ్మాయి అక్కడే ఉండి నాతో చాలాసేపు మాట్లాడింది. తను బొద్దుగా ఉన్నా కొన్నాళ్లు సరదాలు వదులుకోకూడదనే ప్రస్తుతం ఎటువంటి వ్యాయామాలు చెయ్యడం లేదనీ, ఒక్కసారి తలుచుకుంటే అవన్నీ పెద్దకష్టం కాదనీ ఇంకా ఏమేమో మాట్లాడింది. తర్వాత మా అన్నయ్యకు ఇంకా పెళ్లి కాలేదనే విషయం కూడా పెద్దవాళ్లు తెలుసుకున్నారు. అప్పుడు వారి ముఖంలో కొంచెం నిరాశ కనిపించింది. ఆ వయసులో నాకు అర్థం కాకపోయినా.. వారు నాకు పిల్లను ఇవ్వాలనుకున్నారని తర్వాత తెలిసింది. ఏ ఆస్తీలేని నన్ను అల్లుడిగా చేసుకోవాలనుకుంటే అందులో నా గొప్పతనం కన్నా నాన్న మంచితనమే కారణమని త్వరలోనే అర్థమయ్యింది.

ఆ తర్వాత నాకు ఫరక్కాలో పోస్టింగ్ వచ్చినప్పుడు ఊరుకాని ఊరిలో భాషరాక కొట్టుమిట్టాడుతున్న నన్ను ఆదుకున్నది.. నాన్న శిష్యులు చంద్రశేఖర్ గారే! ఇలా చెప్పుకొంటూ పోతే చాలానే ఉంది. కానీ, అనుక్షణం నాతోపాటు నాన్న మంచితనం దన్నుగా వస్తూనే ఉంది. అవసరానికి ఆదుకుంటూనే ఉంది.

* * *

'నామీద ఎంతో ప్రేమతో కొందరు మా తండ్రి మాకు వారసత్వంగా ఏ ఆస్తీ ఇవ్వకుండా వెళ్లిపోయారని అన్నారు. వారి ఆప్యాయతకు సంతోషించినా.. వారి మాటను మాత్రం ఒప్పుకోలేను. పదవీ విరమణ రోజు ప్రతివారూ వారెంత స్వయంశక్తితో పైకొచ్చారో, ఎంతో కొంత కల్పించి కూడా చెప్తారు. నేను కూడ అంతేనేమో.. కానీ, నేను నిజాయితీగా

చెప్పాలనుకున్నది ఒకటే. నేను సంపాదించింది ఏమిటంటే.. నాన్న ఆశీర్వాదం. ఆయనిచ్చిన జన్మ. మా నాన్న నేనెప్పటికీ కోల్పోని వారసత్వాన్ని ఇచ్చారు. ఆయన మంచితనమే నాకు తరగని ఆస్తిగా మిగిలింది. ఆయన బాటలోనే నడిచి నేను కూడా మీలాంటి ఎందరో ఆప్తులను సంపాదించుకున్నాను. ఈ ఆస్తినే నేను నా పిల్లలకు వదిలివెళ్తాను. అలా అని మీరందరూ నాకేదో ప్రతిఫలంగా మా పిల్లలకు సాయం చేస్తారని నా ఉద్దేశం కానే కాదు. నాన్న చెప్పినట్టు దేవుడి లెక్కలు వేరే ఉంటాయి' అని ముగించాను. నా ఉపన్యాసానికి ఎలా స్పందించాలో తెలియక నిశ్శబ్దంగా ఉన్న ఆ సభకు నమస్కరించి, నెమ్మదిగా వేదిక నుంచి దిగుతుంటే.. నాన్న నా పక్కనే నడుస్తూ ఇంకా నా వెనకే ఒక దన్నుగా వస్తున్నట్టు అనిపించింది.

* * *

రాజమోహన్ ఇవటూరి స్వస్థలం విశాఖపట్నం. ఆంధ్ర విశ్వ విద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ చేశారు. టెక్ మహీంద్రాలో వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేసి, 2021 నుంచి సొంత సంస్థను నడుపుతున్నారు. 1994 నుంచి కథలు రాస్తున్నారు. మొదటి కథ 'ఓ తమ్ముడి కథ'.. రచనలో ప్రచురితమయింది. ఇప్పటివరకూ యాభైకి పైగా కథలు రాశారు. తిక్క శంకరయ్య కథ.. విమర్శకుల ప్రశంసలు పొందడంతోపాటు 'మిసిమి' పత్రికలో అచ్చయ్యింది. ఓ తమ్ముడి కథ, అవ్వగారు కథలకు బహుమతులు దక్కాయి. వీరి తండ్రి జ్యేష్ఠ పేరిట ఏర్పాటుచేసిన 'జ్యేష్ఠ లిటరరీ ట్రస్ట్' ఆధ్వర్యంలో 1990 నుంచి ఏటా ఉత్తమ కథ, ఉత్తమ కథా సంకలనాలకు పురస్కారాలు అందిస్తున్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పుస్తకాలను ప్రచురిస్తున్నారు. తన స్వీయ అనుభవాల నుంచే.. 'వారసత్వం' కథకు ప్రాణం పోశారు రచయిత రాజమోహన్.

Katha PART 1_Layout 1  6/29/2023  2:38 PM  Page 133

# సహనశీలి



**ఎం.టి. స్వర్ణలత**

**984972512**

'గీతా.. గీతా.. ఎక్కడున్నావు?'.

'ఆ.. వస్తున్నానత్తయ్యా!'.

'తల నొప్పిగా ఉంది. ఓ కప్పు కాఫీ ఇస్తావేమోనని పిలుస్తుంటే పలకవేం.. ఇంట్లో పెద్దవాళ్లను పట్టించుకోవాలన్న జ్ఞానం ఉండాలి కదా! అయినా నిన్నని ఏం లాభం.. అది మా తలరాత..' అన్నది జానకమ్మ.

'ఇంతకుముందు మీ అత్తగారింట్లో ఇలాగే వెలగబెట్టావా కాపురం? ఎప్పుడూ ఏడుపు మొహం వేసుకుని ఇంట్లో తిరుగుతావు. చచ్చినవాడిని ఇంకా మర్చిపోలేదా!? ఇలా అయితే నా కొడుకు సుఖపడినట్టే!' అన్నది మళ్లీ తానే.

'అబ్బే అదేం లేదత్తయ్యా.. బాబు ఏడుస్తుంటే వాణ్ని సముదాయిస్తున్నా..' తన వెనుక నక్కి, భయంగా తొంగిచూస్తున్న మూడేళ్ల బాబును చేతితో తాకుతూ అన్నది గీత.

'వేలెడు లేడు వీడు ఎప్పుడూ.. 'అమ్మా .. అమ్మా' అని కొంగుపట్టుకు వేలాడుతాడు. చక్కగా బొమ్మలతో ఆడుకోవచ్చు. మేమూ కన్నాం పెంచాం.. కానీ, మా పిల్లలు ఎప్పుడూ ఇలా అమ్మకూచీలా పనులకు అడ్డం పడలేదు. పాపం ఏమాట కామాటే చెప్పుకోవాలి.. అది ఉన్నప్పుడు అన్ని పనులూ చక్కబెట్టి, మమ్మల్ని కూడా

చక్కగా చూసుకునేది. అల్పాయుష్షుది.. మధ్యలోనే పోయింది'.. చనిపోయిన కోడల్ని గుర్తు చేసుకుంటూ అన్నది జానకమ్మ.

కళ్లనుంచి ఉబికి వచ్చే నీటిని పంటిబిగువున ఆపుతూ.. వంటింట్లోకి నడిచింది గీత.

పాలు మరుగుతున్నట్లే.. ఆమె ఆలోచనలూ కదులుతున్నాయి.

* * *

ఎంత చిత్రమైన జీవితం తనది. చిన్నతనంలోనే అమ్మానాన్నలు చనిపోతే.. అన్నయ్యా వదిన అమ్మనాన్నలై ఆ లోటు తెలియకుండా పెంచారు. ఎంతగానో ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు యశ్వంత్. తనను ఎంతో అపురూపంగా చూసుకునేవాడు. అత్తయ్య, మామయ్య.. తనను సొంత కూతురిలా ఆదరించేవారు. ఏడాది తిరిగే సరికల్లా తను నెలతప్పడంతో ఎంతో ఆనందపడ్డారు. అమ్మాయి పుట్టాలని ఆశపడ్డారు. బాబు పుట్టాడనీ, అచ్చు వాళ్ల నాన్నలా ఉన్నాడని తెలియగానే.. చూడాలని బయల్దేరిన ముగ్గురూ.. బాబును చూడకుండానే కారు ఆక్సిడెంట్‌లో చనిపోయారు. తన జీవితం తల్లకిందులైంది. బాబుతోడిదే లోకంగా కన్నీళ్లతో కాపురం చేస్తున్న తనను..

'తండ్రిలేని పిల్లాడిలా పెరగడం.. బాబుకు మంచిది కాదు. వాడికి ఊహ తెలియకముందే నువ్వు మరో పెళ్లి చేసుకోవాలి'.. అంటూ శతవిధాలా ప్రయత్నం చేసి సుధీర్‌తో మరోపెళ్లికి ఒప్పించారు అన్నయ్య వాళ్లు. జీవితాంతం వారికి భారంగా ఉండకూడదని ఈ పెళ్లికి ఒప్పుకున్నది.

అన్నయ్య వాళ్ల కోలిగ్ ఫ్రెండ్ సుధీర్. చాలా మంచివాడు. భార్య క్యాన్సర్‌తో చనిపోయిందని చెప్పారు.

* * *

'గీతా!'.. హాల్ లోంచి అత్తయ్య అరుపులకు ఈ లోకంలోకి వచ్చింది.

కాఫీ కప్పుతో హడావుడిగా హాల్‌లోకి వెళ్లి కాఫీ అందించింది.

ఎప్పుడు వచ్చిందో అత్త పక్కనే కూర్చుని చూస్తున్నది.. ఆడపడుచు సునీత. ఆవిడ భర్తకు విడాకులు ఇచ్చింది. ఇంట్లోనే ఉంటుంది. ప్రతీ విషయానికి వాళ్లమ్మకు వంత పాడుతూ ఉంటుంది.

వెళ్లి ఆవిడకుకూడా కాఫీ తెచ్చి ఇచ్చింది గీత.

'వదినా ఇక్కడికి దగ్గరలోనే ఓ క్రెష్ ఉంది. అందులో చేర్పించు బాబును. ఎంతసేపూ నిన్ను వదలడం లేదు. పిల్లలను స్వేచ్ఛగా పెంచాలి'.. సలహా ఇచ్చింది సునీత.

'నేనేం ఉద్యోగం చేయడం లేదు కదా.. బాబును వదిలి ఉండటానికి. ఉద్యోగస్థులు తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడ ఉంచుతారు. అయినా వాడిని దూరం పెట్టే అవసరం ఏముంది? నా యశ్వంత్ ప్రతిరూపం వాడు.. అచ్చం వాళ్ల నాన్న పోలికలను పుణికి పుచ్చుకున్నాడు. వాణ్ని చూస్తూనే జీవితం గడిపేయొచ్చు. అయినా అన్ని పనులూ చేస్తున్నా

కదా! చేసిన పనులలో తప్పులు వెతకడం తల్లీ కూతుళ్లకు అలవాటైంది!' మనసులో అనుకుంది గీత.

* * *

సోఫాలో కోసి పెట్టిఉన్న ఆపిల్ ముక్కలను బాబు రెశ్వంత్ తినడం మొదలుపెట్టాడు. లోపలినుంచి వచ్చిన సునీత మండిపడింది. తాను తినాలని కోసి పెట్టుకున్న ముక్కలు తినేసాడని వాడిని ఈడ్చేసింది. ఆ ఊపుతో వాడు దూరంగా పడి, ఏడుపు మొదలు పెట్టాడు.

'దరిద్రపు వెధవ.. దరిద్రపు వెధవ.. శనిలా దాపురించాడు! ఎవడికి పుట్టాడో ఏంటో?' అంటూ ఈసడించుకుంది.

గీత రావడం చూసి..

'పిల్లాడు ఎక్కడికి వెళ్లాడో చూసుకోవాలి కదా..' అన్నది

'నేను టాయిలెట్‌కి వెళ్లి వచ్చేలోగా వీడు బయటికి వచ్చాడు' అన్నది గీత.

'పిల్లలంటే ఎక్కడ ఉండమంటే అక్కడ ఉండాలి. ఇలాంటి అల్లరి పిల్లాడిని ఎక్కడా చూడలేదమ్మా!' అన్నది జానకమ్మ.

సుధీర్ రాగానే ఇద్దరూ ఆ విషయాన్ని చిలువలు వలువలు చేసి చెప్పారు.

గదిలోకి వచ్చిన సుధీర్..

'చూడూ నువ్వు తెలివైన దానివి అనుకున్నాను. నాకు చాలా సమస్యలు ఉన్నాయి. నువ్వో సమస్యగా మారొద్దు..' కటువుగా చెప్పి, బయటికి వెళ్లిపోయాడు.

పెళ్లయ్యాక తనతో మాట్లాడిన మొదటి మాట అది. తన తప్పు లేకపోయినా.. తననే అనేసరికి తనను ప్రాణంగా చూసే భర్త.. కూతురిలా చూసే

అత్తామామలు గుర్తొచ్చి.. ఏడుస్తూ కూర్చుంది.

మరుసటి రోజు ఉదయం సుధీర్ ఆఫీస్‌కు వెళ్తున్నాడు. అప్పుడే రెశ్వంత్ బయటి నుంచి లోపలికి వస్తున్నాడు.

అప్పుడే వచ్చిన జానకమ్మ..

'ఈ వెధవ పుట్టగానే అందరినీ పొట్టన పెట్టుకున్న నష్టజాతకుడు. నా కొడుక్కు ఎదురువెళ్తుంటే ఆపేది లేదా!?'.. అంటూ అరిచింది.

'ఆ పసివాడి తప్పు ఏముంది? అంతా వీళ్ల మనసులలోనే ఉంది!' అనుకుంది గీత.

'ఆపవే.. అవేం మాటలు' అన్నాడు మామ వెంకట్.

'మహాతల్లి కొడుకును వాళ్లవాళ్ల దగ్గరే వదిలేసి వస్తుంది అనుకుంటే.. వాడితో మాట్లాడి ఇక్కడికీ తెచ్చింది' అన్నది జానకమ్మ.

'అంత చిన్నపిల్లవాడిని వదిలి ఎలా వస్తుంది అనుకున్నావే!'.

'మన కర్మ.. మన కర్మ ఇలా తగలబడింది. ఏం చేస్తాం!' అన్నది జానకమ్మ.

రోజూ ఏదో ఓ విషయంలో.. బాబును గీతను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు తల్లీ

కూతుళ్లు.

'ఏం చేయాలా!?' అని ఆలోచించడం మొదలుపెట్టింది గీత.

'అవును.. వీళ్లంతా ఇలా ఖాళీగా ఉండటం వల్లే ఇటువంటి చెత్త ఆలోచనలు వస్తున్నాయి. వీళ్లను ఏదైనా పనిలో బిజీగా ఉండేలా చూడాలి!'

అనుకుంది మనసులో..

ఇంట్లో మార్పు తనే తీసుకురావాలని నిర్ణయించుకుంది.

'యశ్వంత్.. నాకా శక్తిని ఇవ్వు! మన బిడ్డకు మంచి కుటుంబాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను. ఎక్కడ ఉన్నా నాకు సహకరించు!' అనుకుంటూ, కన్నీటిని తుడుచుకున్నది.

* * *

సమయం రాత్రి తొమ్మిది గంటలు. సుధీర్ ల్యాప్‌టాప్‌లో ఏదో వర్క్ చేసుకుంటున్నాడు. బాబును తీసుకుని పాలున్న ఫ్లాస్క్‌తో గదిలోకి అడుగు పెట్టింది గీత. పాలను గ్లాస్‌లో పోసి సుధీర్‌కు ఇవ్వబోయింది..

'అక్కడ పెట్టు..' అన్నాడు.. తనవైపు చూడకుండానే!

గ్లాస్ టేబుల్‌పై ఉంచి.. మరో గ్లాస్‌లో పాలు పోసి బాబుకు తాగించబోయింది.

'అమ్మా.. నాన్న ఏం చేస్తున్నారు' అన్నాడు వాడు.

'నాన్న పని చేసుకుంటున్నారు.. అల్లరి చేయొద్దు' అన్నది.

'మరి నేను నాన్నతో ఎప్పుడు ఆడుకోవాలి?'.. చక్రాల్లాంటి కళ్లు తిప్పుతూ అడిగాడు.

'ష్.. ఇప్పుడు కాదు! సెలవురోజు ఆడుకోవాలి. ఇక పడుకో!' అని చెప్పింది.. సుధీర్ వైపు చూస్తూ!

ఇదేమీ పట్టనట్టు తన పనిలో మునిగిపోయాడు అతను.

'అయితే నాకు కథ చెప్పు..' అన్నాడు వాడు.

'సరే.. అల్లరి చేయొద్దు. కళ్లు మూసుకో నేను కథ చెబుతాను'.

కాసేపటికి నిద్రలోకి జారిన ఆ పిల్లాణ్ని.. పక్కనే ఉన్న చిన్న మంచంపై పడుకోబెట్టింది.

'ఏమండీ! మీకు బాబుతో ఏమైనా ప్రాబ్లమ్‌గా ఉందా..?' అని అడిగింది.

'అదేంలేదు! నువ్వు పడుకో!'.. మంచానికి ఆ చివరన, అటు తిరిగి పడుకుని చెప్పాడు సుధీర్

అటువైపు.. చనిపోయిన ఆయన భార్య ఫొటో ఉంది.

సుధీర్ కూడా భార్యను మరిచిపోలేక ఇంట్లో వాళ్ల ఒత్తిడి తట్టుకోలేక పెళ్లికి ఒప్పుకొన్నాడు. తనకూ పదేళ్ల పాప ఉంది. హైదరాబాద్‌లో హాస్టల్లో ఉండి చదువుకుంటుంది. పాపను సవతి తల్లిలా చూస్తే తను భరించగలడా?! అందుకే హాస్టల్లో ఉంచాడు.

కన్నుల్లో నింపుకొన్న యశ్వంత్ రూపం.. బాధతో కళ్లు గట్టిగా మూసుకుంది గీత.

మరుసటి రోజు రాత్రి పడుకున్నాక.. కాసేపటికి గీతపై చెయ్యి వేశాడు సుధీర్.

ఒక్కసారిగా ప్రాణం పోయినట్టుగా అనిపించింది ఆమెకు. ఆ స్పర్శకు ఒళ్లంతా గొంగళి పురుగు పాకినట్టుగా అనిపించింది.

ఇంతలో..

'సారీ.. నాకు కొంతకాలం సమయం కావాలి. నేను తనను మర్చిపోలేక పోతున్నాను' అంటూ చేయి తీసి, అటు తిరిగి పడుకున్నాడు.

బతుకు జీవుడా! అని హాయిగా ఊపిరి పీల్చుకుంది గీత.

యశ్వంత్ సొంతమైన తాను మరొకరి సొంతం కాగలదా!? కళ్లవెంట కన్నీళ్లు ధారలా కారుతున్నాయి.

బాబుకోసం.. వాడి ఉన్నతికోసం.. తప్పదేమో! పెళ్లికి ఒప్పుకొన్నదంటేనే.. అన్నిటికీ సిద్ధమైనట్టు కదా!?.

ఏడుస్తూనే ఉంది రాత్రంతా.. ఏ తెల్లవారుజామునో నిద్రపోయింది.

* * *

ఉదయం గీత లేచేసరికి.. వాకింగ్‌కు వెళ్లొచ్చిన మామయ్య వెంకట్, చెట్లకు పాదులు చేస్తూ కనిపించాడు.

ఆ ఇంట్లో తనను అందరికంటే ఆదరంగా చూసేది ఆయనే.

ఆయన దగ్గరికి వెళ్లింది..

'మామయ్యా! మనం మిద్దెతోట పెంచుదాం. మన కూరగాయలు మనమే పండించుకోవచ్చు' సాయం చేస్తూ చెప్పింది.

'అంత ఓపిక ఎక్కడుందమ్మా! ఏదో ఈ నాలుగు మొక్కలనైతే చూడగలను కానీ..' అన్నాడాయన.

'నేనున్నాను కదా మామయ్యా! ఆయన ఆఫీస్‌కు వెళ్లాక.. పనులన్నీ అయ్యాక.. ఆ పని చూద్దాం' అన్నది.

ఆ ఆలోచన నచ్చింది ఆయనకు.

'ఏం చేస్తున్నారు అక్కడ! పొద్దున్నే పనులన్నీ వదిలేసి'.. అత్తగారి అరుపు.

'పచ్చడి కోసం ఉసిరికాయలు తెమ్మన్నాను.. తెచ్చారా?'.. మళ్లీ అన్నది.

'హాల్లో ఉన్నాయి చూడు.. ' చెప్పాడు వెంకట్.

లోపలికి వెళ్లి పనులలో మునిగిపోయింది గీత.

బాబు నిద్రలేచిన అలికిడితో హడావుడిగా గదిలోకి వెళ్లింది. బయటికి వస్తున్న సుధీర్‌ను ఢీ కొట్టడంతో పడిపోబోయాడు. పట్టుకుని ఆపింది. ఇద్దరిలోనూ ఏదో తడబాటు..

తనను వదిలేసి బాబు దగ్గరికి వెళ్లింది.

'ఇక వాడు లేచాడు కదా! ఈ మహాతల్లి వాడితోనే ఉంటుంది. ఎవరైనా కన్నారో లేదో..

తనకు ఒక్కదానికే కొడుకు ఉన్నట్టు!'..

లోపల్నుంచి సునీత అంటున్న మాటలు వినిపిస్తున్నాయి.

అప్పుడే వచ్చిన సుధీర్..

'మాట కటువు కానీ.. అక్క చాలా మంచిది. తన జీవితం అలా అవడం వల్ల ఆ బాధతో అలా మాట్లాడుతుంది'.. సంజాయిషీ ఇచ్చినట్టు చెప్పాడు.

మళ్లీ తనే..

'రేపు పాప వస్తుంది.. నేను ఉదయాన్నే హైదరాబాద్ వెళ్లి తీసుకొస్తాను' చెప్పాడు.

'నాన్నా.. నాకు చాక్లెట్ తెస్తావా!?' అడిగాడు రెశ్వంత్.

మాట్లాడకుండా వెళ్లిపోయాడు సుధీర్.. ఆఫీస్‌కు.

'ఏం.. మహారాణి! మాకు టిఫిన్ పెట్టేది ఉందా లేదా!?' అని పిలిచింది సునీత.

'అత్తయ్యా! ఉసిరికాయ పచ్చడి చాలా బాగుంది..' చెప్పింది గీత, భోజనాల దగ్గర.

'అమ్మా గీతా.. ఏమాట కామాటే చెప్పుకోవాలి. మీ అత్తయ్య పచ్చళ్లు బ్రహ్మాండగా పెడుతుంది..' అన్నాడు మామయ్య వెంకట్.

'అయితే అత్తయ్య పెట్టినప్పుడు నేర్చుకోవాల్సిందే!' అన్నది గీత.

* * *

'పాపను తీసుకు రావడానికి వెళ్తున్నాను..' చెప్పాడు సుధీర్.

'ఒక్క నిమిషం ఆగండి!' అంటూ లోపలికి వెళ్లి, మంచి డ్రెస్ తీసుకుని వచ్చింది గీత.

'ఇది పాపకు ఇవ్వండి..' అన్నది.

'ఎక్కడిది ఇది!?' ఆశ్చర్యంగా అడిగాడు.

'నాకు పెళ్లికి వచ్చిన కొత్త చీరలు చాలా ఉన్నాయి. అందులో ఒకటి పాపకు డ్రెస్ కైతే బాగుంటుందని అనిపించింది.. అందుకే కుట్టాను' అని చెప్పింది.

'అయితే పాప వచ్చాక నువ్వే ఇద్దువుగానీ.. లోపల పెట్టు' అన్నాడు.

ఇంతలో అక్కడికి వచ్చిన రెశ్వంత్..

'నాన్నా.. నా చాక్లెట్!' అన్నాడు.

జేబులోంచి చాక్లెట్ తీసి, వాడి చేతిలో పెట్టాడు సుధీర్.

ఆనందంగా సుధీర్ బుగ్గన ముద్దు పెట్టి పరిగెత్తాడు వాడు.

అది చూసి నవ్వింది గీత.

అప్రయత్నంగా సుధీర్ పెదవులపైనా నవ్వు ఉదయించింది.

* * *

'అత్తయ్య.. అత్తయ్యా..' పిలిచింది గీత.

'ఏమైందే! ఎందుకలా అరుస్తున్నావు!?' అన్నది జానకమ్మ.

'ఇది చూడండి.. మీరు చేసే పచ్చడి వీడియో యూ ట్యూబ్‌లో తెగ వైరల్ అయ్యింది.

'మాకు పచ్చడి పంపించగలరా?' అని అడుగుతున్నారు' అన్నది.

'అవునా! నా పచ్చడిని ఇంతమంది మెచ్చుకున్నారా'.. ఆశ్చర్యపోతూ అడిగింది జానకమ్మ.

'అవును అత్తయ్యా! కొంతమంది మీతో కలిసి పచ్చళ్ల బిజినెస్ చేయాలని అనుకుంటున్నారు. కొందరైతే 'మా హోటళ్లకు సప్లయి చేస్తారా?' అని అడుగుతున్నారు. ఇది మంచి అవకాశం అత్తయ్యా! నలుగురు మనుషులను పనిలో పెట్టుకుని మీరు ఈ బిజినెస్ చెయ్యవచ్చు!'..

గీత చెబుతూ ఉంటే.. విప్పారిన మొహంతో వింటున్నది జానకమ్మ.

'అత్తయ్యా.. మనం మరో వీడియో చేద్దాం! మీరు పార్లర్‌కి వెళ్లి ఫేషియల్ చేయించుకోండి బాగుంటుంది' అని చెప్పింది.

'మా అమ్మకు ఫేషియల్ నేనే చేస్తాను!' అన్నది సునీత.

'నువ్వెలా చేస్తావు!?' అడిగింది గీత.

'నేను పెళ్లి కాకముందు బ్యూటీషియన్ కోర్స్ చేశాను..' చెప్పింది సునీత.

'అయితే పార్లర్ ఓపెన్ చెయ్యచ్చు కదా!'.

'దానికి డబ్బు ఎవరిస్తారు? నా పెళ్లికి, వదిన క్యాన్సర్‌కు చాలా డబ్బు ఖర్చయ్యింది. అప్పు కూడా అయ్యింది'.

'అయితే గవర్నమెంట్ లోన్ అప్లయి చేద్దాం! మీ దగ్గర కోర్స్ సర్టిఫికెట్ ఉందా?'.

'ఉంది'.

'అయితే రేపే మనం బ్యాంకుకు వెళ్దాం'..

అన్నది గీత, సునీత మొహంలో వెలుగును గమనిస్తూ!

సునీతతో బ్యూటీపార్లర్ పెట్టించాలని దృఢంగా నిశ్చయించుకుంది.

* * *

ఇప్పుడు మిద్దెతోటలతో మామగారు. పచ్చళ్లతో అత్తగారు. బ్యూటీపార్లర్‌తో ఆడపడుచు.. అందరూ బిజీ అయ్యారు.

సెలవులు పూర్తయ్యేలోగా.. పాప రోషిణి కూడా గీతకు బాగా దగ్గరైంది. ఆమెకు తల్లిలేని లోటు తెలియకుండా.. తానే తల్లిగా మారింది గీత.

ఆ అభిమానంతో రోషిణి చిన్ని మనసు.. తొందరగానే గీతవైపు మళ్లింది.

పాపా, బాబూ కలిసి ఆడుకోవడం చూసిన సుధీర్.. హాయిగా నిట్టూర్చాడు.

'ఏమండీ. పాపను ఇక్కడే స్కూల్‌లో వేద్దామండీ! హాస్టల్‌కు పంపించొద్దు' బతిమాలినట్టే అడిగింది గీత.

'గీతా! నువ్వు నా భార్యగా రావడం.. నా అదృష్టం! ప్రతికూలంగా ఉన్న పరిస్థితులను అనుకూలంగా మార్చుకున్నావు. అందరి మనసులనూ గెలుచుకున్నావు' అన్నాడు.. గీతను

దగ్గరికి తీసుకుంటూ.

ఇప్పుడు.. ఇప్పుడు.. ఈ స్పర్శ యశ్వంత్ స్పర్శలాగే ఉంది.

'నా యశ్వంత్ సుధీర్‌లో పరకాయ ప్రవేశం చేశాడా!?' అనుకుంటూ.. మనస్ఫూర్తిగా అతని భుజంపై తలవాల్చింది గీత.

'ఇంకో పని మిగిలి ఉందండీ! సునీతకు కూడా మళ్లీ పెళ్లి చేయాలి' అని అన్నది.

'తప్పకుండా.. అర్థం చేసుకునే వాడు దొరికితే చేద్దాం' అన్నాడు సుధీర్.

'అవును! ఇప్పుడు ఇది నా ఇల్లు. నా పిల్లలు. అన్నీ చక్కదిద్దాల్సిన బాధ్యత కూడా నాదే కదా!' అనుకుంది గీత.

తన కొడుకు భవిష్యత్తుకు బంగారు బాటలు వేసింది.

* * *

**ఎం.టి. స్వర్ణలత స్వస్థలం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని. ఇక్కడి సింగరేణి ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నాలుగేళ్ల కిందే.. సాహిత్యం వైపు అడుగులు వేశారు. ఇప్పటివరకూ రెండు వేలకు పైగా.. కవితలు, గజల్స్, రుబాయీలు, కైతిక శతకం, నానీలు, ఇష్టపదులు, కవితా మాలికలు, ఆటవెలదులు, తేటగీతులు రాశారు. సోషల్ మీడియా వేదికగా పదుల సంఖ్యలో సింగిల్ పేజీ కథలు రాశారు. 'మా నాన్న మంచోడే', 'వంటల వల్లభుడు'.. కథలకు సోషల్ మీడియాలో బహుమతులు అందుకున్నారు. ఇటీవల సాహితీ కిరణం పత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన కథల పోటీలో 'నిర్ణయం' బహుమతి గెలుచుకున్నది. నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజా గ్రంథాలయం సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీ (కథ–2021)లో 'సహనశీలి' కథ.. రూ.5 వేల నగదు బహుమతికి ఎంపికైంది.**

# బతుకమ్మ



డాక్టర్ శ్రీదేవీ శ్రీకాంత్
+26776279761

నేను పుట్టినప్పుడు నాకు ఏం పేరు పెట్టింంద్రో నాకు ఎరుకలే. అమ్మ.. 'తల్లీ' అని, అయ్య.. 'బొమ్మా!' అని, అయ్యమ్మ 'బుడ్డదానా!' అని, మొగిలయ్య 'బతుకమ్మా!' అని, ముగ్గురు అన్నలు 'సెల్లి' అని పిలిచేటోళ్లు.

మా అమ్మ, అయ్య బంగారం దుకాన్ల దగ్గర కాలువలో రజను తీసేటోళ్లు. చెత్త ఏరుకుని అమ్మేటోళ్లు. ఒక్కొక్కసారి.. "జుట్టుకు బదులు ఉల్లిగడ్డలు, మిఠాయి ఇస్తం!" అని ఇండ్లెంబడి తిరిగేటోళ్లు. రోజు గడవడానికి రకరకాల పనులు జేసేటోళ్లు.

ఒక్కోపాలి అయ్య బురదలో దిగి చేపలు పట్టి, వాటాలు బెట్టి అమ్మేటోడు. ఎన్ని జేసినా మాకు తిండి, బట్టా ఉండేటివి కాకుండే. మా అయ్యమ్మ మాతోనే ఉండేటిది. ఆమె ఎప్పుడూ అమ్మ మీద అయ్యకు ఏదోటి పితూరీలు జెప్పి, అమ్మను కొట్టించేటిది.

దెబ్బలు తిని అమ్మ ఏడుస్తాంటే.. అయ్యమ్మకు మస్తు ఖుషీ. అయ్యమ్మ నన్ను తన దగ్గిర పడుకో బెట్టుకుంటుండే. రాత్రిగాల అయ్యమ్మ చేసే పనులకు నిద్ర వచ్చేటిది లేకుండే నాకు. గందుకే.. అయ్యమ్మ దగ్గిర పండుకోవడం నాకు ఇష్టం లే.

అమ్మ పాలి గుడిసెలో పండుకోవాల్నని ఉండేటిది.

"అయ్యమ్మ దగ్గరికి పో!" అని తోసేటోడు అయ్య.

అమ్మ నాకు పొద్దుటే తల దువ్వి, పూలు పెట్టేటిది. అమ్మ, అయ్యా.. పనిలోకి బయటికి పోంగానే, అయ్యమ్మ మా పక్కటాల గుడిసెల ఆళ్లతో దాడి, సింత పిక్కలు ఆడేటానికి కూర్చుండేటిది.

నాకూ ఆ ఆటలు చూడటం మస్తు ఖుషీ.

అయ్యమ్మ నాకు చిరిగిన గౌను తొడిగి, పూలు పీకేసి, దూసిన జుట్టును చింపిరి జేసేటాళ్లకు..

“బతుకమ్మా!”.. అంటూ అచ్చేటోడు మొగిలయ్య. అయ్యమ్మ రెండు నువ్వు జీడీలు నా చేతిలో పెట్టి.. “ఇంక బయలుదేరు” అనేటిది. చిరిగిన బట్టలేసుకుంటేనే బిచ్చపోళ్లకు పైసలు ఏస్తరు. అందుకే నా గౌను ఎప్పుడూ చిరిగే ఉండేటిది.

రక్తబంధం గిట్లుంటాది? అసలు కన్నా వడ్డీ

ముద్దంటరే!..

అయ్యమ్మ చేతిలో నేను గుడియానే. అయ్యమ్మ సోపతి నాకు నచ్చేటిది కాదు.

“నేను మొగిలయ్యతో ఎళ్ల..” అని మారాం చేస్తుండే. ఏడ్వబట్టినా.. అయ్యమ్మకు జాలి లేకుండేటిది. మొగిలయ్యతో పంపేటిది.

“బతుకమ్మా! నే సెప్పేటిది ఇను బిడ్డా.. ‘రెండు రోజులైనాదమ్మా బువ్వతిని! బాంచన్ నీ కాళ్లు మొక్కుత! పాంచ్ రూపియా ఇయ్యుండ్రి’ అని జరంత నీరసంగా ముఖం పెట్టి అనాల!” అని తొడపాశం పెట్టేటోడు.

నే చెప్పింది ఇని..

“ఔ మల్లా! మస్తు జెప్పినావే బిడ్డా! అట్ల అడుక్కోవాలా..” అని నన్ను రైలులో దింపేటోడు.

రైలు కదుల్తాంటే.. నేను నడుస్తూ, తూలి పడిపోతి మొదట్ల. ఒకరైలుల పంపించి.. మరో రైలులో దింపేటోడు. మస్తు పైసలు అచ్చేటియి.

సాయంకాలం నన్ను ఇంటి దగ్గర దింపి.. అయ్యమ్మకు యాభై రూపాయలు ఇచ్చేటోడు.

దినాం రైలు ఎక్కి రకరకాల మనుషులను చూడటం అలవాటయ్యుండే. పేచీ పెట్టకుండనే మొగిలయ్యతో ఎళ్లడం అలవాటు జేసుకున్న.

* * *

ఒక దినం బాగా నీరసంగా ఉండే. మొగిలయ్యతో ఎళ్లనని మారాం జేసిన. అయ్యమ్మ చింత బరికతో వీపు మీద కొట్టుండే. అల్లాడి ఏడ్చుంటి. వీపు బాగా వాచిపోయుండే. పొద్దుగాల్ల అమ్మ స్నానం జేయించేప్పుడు..

“తల్లీ! ఈపు మీదట ఈ వాతలేంటే?” అని.. అయ్యమ్మే కొట్టి ఉంటదని సమజయిన

దానిలా, నా వైపు జూసి మస్తు ఏడ్చింది.

ఎప్పటిలాగే అమ్మ, అయ్య బయటికి ఎళ్లంగనే.. మొగిలయ్య అచ్చిండు. ఆ పొద్దు మస్తు వాన పడబట్టే.

“వాన సినుకు సుట్టే తెలంగాణ కోక.. మా తెలంగాణ గడ్డ మీన వాన చినుకు సిత్రం.. తుళ్లిపడే వాన జల్లు.. మా దిల్ లా ఖుషయితాదీ.. ఇచిత్రమే!”

అని హుషారుగా పాట పాడుతుంటి. ఎప్పుడొచ్చిండో.. మొగిలయ్య చప్పట్లు కొట్టబట్టినాడు నా పాట ఇని.

నా దిక్కు జూస్తూ..

“బతుకమ్మా! ఎంత మంచిగా పాడబట్టినావే! నీకు వచ్చిన పాటలు పాడుతూ డబ్బులడుగు! ఎక్కువ డబ్బులు ఏస్తరు!” అన్నడు.

“గీ దినం నేను రాను. వాన నీళ్లల్లో పడవలు ఏసి ఆడుకుంటా!” అంటిని.

“నీకు పాటల పుత్తకోలు కొంట బిడ్డా..” అంటూ నన్ను ఎత్తుకుండు.

రైలు ఎక్కిన. పాట షురూ జేసిన.

అందరూ నా దిక్కు చూడబట్టిండ్రు. అందరూ..

“శెభాష్ బిడ్డా! మస్తు టైంపాస్” అంటా డబ్బు ఇస్తున్రు. గా దినంకెల్లి నేను పాడుతా అడుక్కోబట్టిన.

ఏ విషయం అయినా ఒకమారు ఇంటే పట్టుడు నా దిమాక్‌లో ఉండే.

నా పాట రైలుల అందరికీ నచ్చేటిది.

“పోరి గొంతు మస్తు ఉంది.. పెద్ద అయ్యేటాలకు మంగ్లీలా పాడుతది”.. అనుకొన బట్టిన్రు.

“ఓ పోరీ! నీ పేరేంది?” అనేటోళ్లు కొందరు. “అడుక్కునే పిల్లా!” అని ఇంకొందరు అందురు.

ఎవరైనా నా పేరు అడిగిన్రనుకోండ్రి.. ‘బొమ్మ’ అనే చెప్పేటిదాన్ని.

“అవును.. బుట్టబొమ్మలా.. ముద్దుగున్నవు” అనేటోళ్లు వాళ్లు.

“ఈ పోరికి చక్కగా తలదూసి, మంచి బట్టలేసినమా మస్తుగుంటుండే!” అనుకునేటోళ్లు.

వాళ్లకేమెరుక.. మా అమ్మ నాకు సక్కని జడలేసి, ఆ జడలో పూలు పెట్టి తయారుజేస్తదని.

* * *

ఒక దినం ఏసీ బోగీలో అడుక్కుంటున్న. గప్పుడు ఒక పోరడు తెల్ల కాగితాల పుస్తకంలో బొమ్మలు ఏసుకుంటున్నడు. ఆ పోరనికి బరాబర్ నా వయసే ఉండొచ్చు.

నేను ఆ బొమ్మలు జూస్తూ.. గక్కడ్నే ఆగిన. ఆ ఏస్తున్న బొమ్మను జూసిన. ఆ పోరడు నా కెల్లి జూసి..

"నీకు బొమ్మలు గీయడం వచ్చా?" అన్నడు.

"వచ్చు" అన్న.

"గట్లయితే ఎయ్యి" అన్నడు.

పక్కపొంటి వాళ్ల అమ్మ అనుకుంట.. గా పోరన్ని అన్నం తినమని బతిమాలి తినిపిస్తుండే.

"మామ్! ఐ యాం ఫుల్" అంటుండు ఆ పోరడు.

రోజూ ఏసీ బోగీలో అడుక్కోడంతో.. నాకూ ఇంగ్లీషు అబ్బింది.

'గొప్పోళ్ల బిడ్డలు బువ్వ వద్దని మారాం జేసినా.. ఆళ్ల తల్లులు కుక్కి కుక్కి పెడుతరు' అనుకున్న.

ఇంతట్లకే..

"నీ పేరేంది?" అన్నడు ఆ పోరడు.

నన్ను ఎవరెట్ల పిలుస్తరో అన్ని పేర్లూ జెప్పిన.

"పేర్లు రెండే ఉంటాయి. ఒకటి స్కూల్‌లో పేరు. ఇంకోటి ఇంట్లో పిలిచేటిది. నీకు ఇన్ని పేర్లా?" అన్నడు.

"గది సరే! ఫస్టయితే బొమ్మ ఎయ్యి".. అని మళ్లా అన్నడు.

"నిన్ను చూసి ఏస్తాను" అనుంటి.

"నే ఈ కాగితంపై పట్టను గానీ.. ఇదిగో ఈ జామకాయ చూసి ఎయ్యి" అన్నడు.

నేను ఆ పోరని బొమ్మే గీసిన.

పక్కపొంటి ఉన్న ముసలామె వాళ్ల అవ్వ గావచ్చు..

"గమన్! గా పిల్ల అడుక్కోవాలి.. ఆమెను పోనీ" అన్నది.

నేను ఆమె మాటలు పట్టించుకోకుండ.. బొమ్మ గీసిన.

ఆ బొమ్మ చూసిన ఆ పోరడు ఆశ్చర్యంగా ముఖం పెట్టిండు. గాళ్ల అమ్మ, నాయిన ఆ బొమ్మను ఆ బోగీలో ఉన్న ఆళ్ల సోపతోళ్లందరికీ చూపించిండ్రు.

నాకు గమన్ బాబు.. రంగు పెన్సిళ్లు, తెల్ల కాగితాల పుస్తకం ఇచ్చిండు. ఆ బోగీలో అందరూ డబ్బు ఇచ్చి, ఎంతో మెచ్చుకున్నరు. సరస్వతీ దేవి కటాక్షం అన్నరు. అలా నేను ఏసిన గమన్ బొమ్మ.. ఒకరి చేతిలోంచి ఇంకొకరు తీస్కొని జూసుకుంట..

"గింత చిన్న వయసులో బొమ్మ మస్తు ఏసింది. అచ్చు గమన్ లెక్క కొడుతుండె బొమ్మ! అచ్చుగుద్దినట్టు దింపేసింది:" అని అన్నరు.

"నువ్వు పాటలు కూడా మస్తు పాడుతున్నవు. మాతో వస్తావా? బాగా చదివిస్తాం"

అన్నడు గమన్‌వాళ్ల నాయిన.

"అమ్మను సూడకపోతే బుగులైతాది. నేను రాను" అని చెప్పిన.

"ఈ పైసల్ ఎవరికిస్తవు?" అనడిగింది గమన్ వాళ్ల అమ్మ.

"మొగిలయ్య తీస్కుంటడు" అన్న.

"మొగిలయ్య యెవరూ?" అని మళ్లా అడిగింది.

దాంతోని నా ముచ్చట మొత్తం జెప్పిన. అంతా ఇన్నంక..

"అయ్యో పాపం! ఎంత అన్యాయం. మొగిలయ్య లాంటివాళ్లను నిలువునా నరికి పాతేసినా పాపం ఉండదు! ఈ పిల్ల కష్టం ఆడు గుంజుతుండు" అని కోపానికి అచ్చిండ్రు.

"నువ్వు ఇయ్యాల అచ్చిన పైసల్ మీ అమ్మకు ఇయ్యి. మస్తు పాడుతున్నవు జరంత మంచి పాటలు నేర్చుకో" అని చెప్పిండ్రు.

ఆ రోజు మస్తు పైసల్ వచ్చినయి.

'అవును! ఈ పైసల్ అమ్మకే ఇయ్యాలే. మంచి చీర కొనుక్కుంటది' అనుకొంటి.

నేను ఏసుకున్న లాగుల ఆ పైసల్ దాచిన. మస్తు ఖుషీ అయిన. పాడుకుంట ఇంటికిపోయిన. పుస్తకం, పెన్సిల్ దిక్కు గట్లనే చూడబట్టిన.

ఇన్ని దినాలూ మస్తు పైసల్ సంపాదించి ఉంటి. కానీ, దాచి అమ్మకియ్యాల్ననే ఆలోచన దిమాక్‌ల లేకుండే!

* * *

అమ్మ నా కోసం పూలు తెచ్చింది.

"అమ్మా! పూలు పెట్టు" అని మారాం జేసిన.

'పండుకునేటేల ఎందుకే తల్లీ! నిద్రపోతే నలిగిపోతాయి. బయట గుడిసె మీద పెట్టి పొద్దుగాల పెడతాలే!" అంది.

"సరేలే!" అన్న.

లాంతరు బుడ్డి ఎలిగించి దగ్గర పెట్టుకుని.. అమ్మను చూసుకుంట ఆ పుస్తకంల 'అమ్మ బొమ్మ' గీసిన. దాన్ని చూసి అమ్మ మస్తు సంబురపడ్డది.

"నేనెప్పుడూ పోటో దిగలే! అచ్చు నాలాగే గీసినావు! నా కళ్లల్లో కెల్లి సూసి మాట్లాడుతున్నట్టు గీసినావ్" అన్నది అమ్మ.

'మా అయ్యమ్మ సూడకుండా అమ్మకు పైసలు ఇయ్యాల. ఎట్ల ఇయ్యాల?' అని అనుకున్న.

అయ్యమ్మ కల్లు తాగనీకి బయటికి ఎల్లుండే. గప్పుడు ఎవరూ సూడకుండా అమ్మకు పైసలిచ్చిన.

"అమ్మా! నువ్వు ఆకాశం రంగు చీర కొనుక్కో" అని చెప్పిన.

అమ్మ కళ్లల్లో నీళ్లు నిండినాయ్. వస్తున్న కన్నీళ్లు తుడుసుకుంటూ..

"తల్లీ! గిన్ని పైసల్ ఎట్ల అచ్చినయ్?" అని

అడిగింది.

"అమ్మా! శానాకాలంగా నన్ను అయ్యమ్మ అడుక్కోడానికి పంపి పైసలు తీసుకుంటున్నది" అని చెప్పిన.

దానికి అమ్మ మస్తు ఏడ్చింది.

నన్ను అయ్యమ్మ కొడ్తదని.. అయ్యమ్మను అమ్మ అడగలే. అయ్యకూ చెప్పలే.

* * *

పొద్దుగాల్నే నిద్రలేచి.. బొమ్మలు గీసిన పుస్తకం చూసుకున్న. అమ్మ బొమ్మ, అయ్య బొమ్మ, అన్నల బొమ్మలు.. ఆ పుస్తకంలో ఏసుకుని చాలా సంబురపడ్డా.

అమ్మ నన్ను దగ్గరికి పిలిచి, తలనిమిరి,

ముద్దు పెట్టి..

"నువ్వు అడుక్కోడం నాకు ఇష్టంలే తల్లీ! మీ అయ్యకు సెబుతా. నువ్వు అడుక్కోడానికి ఎల్లకే!" అన్నది ఏడుత్తా.

"అయ్యమ్మ! అయ్యకు తాగనీకి పైసల్ ఇస్తది. తాగినంక నిన్ను కొడ్తడేమో.. నువ్వు ఏడ్వకు అమ్మా!" అన్న.

ఎప్పటిలానే మొగిలయ్య అచ్చిండు.

"నేను అడుక్కోడానికి ఎల్ల" అని మారాం జేసిన.

అయ్యమ్మ నన్ను బాగా కొట్టి, బూతులు తిట్టి..

మొగిలయ్యతో పంపింది. ఆ రోజు ఎప్పటిలానే మొగిలయ్యతో ఎల్లిన.

జరంత పెయ్యి కాలబట్టె. పక్క స్టేషన్‌లో దిగాల్సిన నేను.. రైలులోనే నిద్రపోయిన. రైలు ఎళ్లి పోయింది. నాకు మెలుకువ వచ్చేసరికి అక్కడ అందరూ దిగిపోతున్నరు. నేను కూడా అక్కడే దిగిన.

నాకు బాగా జ్వరంగ ఉన్నది. అక్కడే స్టేషన్‌లో పండుకున్న.

'కరోనా కాబట్టి ఇక రైళ్లు తిరగవు' అని అందరూ అంటుండ్రు. గింతల్నే నాకు జ్వరం ఎక్కువాయే. ప్లాట్‌ఫాం పైనే ఒళ్లు తెలియక నిద్రపోయిన.

నాకు మెలుకువ వచ్చేసరికి ఆ స్టేషన్ మాస్టరు ఇంట్లో ఉన్న. కరోనాతో లాక్‌డౌన్ పెట్టిండ్రు. రైళ్ల రాకపోకలు లేవాయే.

'దేవుడు నా పైన జాలితో వాళ్ల ఇంట్లో ఆశ్రయం ఇచ్చిండ్రు' అనుకున్న. వాళ్ల ఇంట్ల నా అంత పాప ఉండె. పేరు రూపసి. నేనంటే చాలా ఇష్టం.

అమ్మ గుర్తొచ్చి రోజూ ఏడ్చేటిదాన్ని.

నా డ్రాయింగు పుస్తకంల అమ్మ బొమ్మను చూసుకునే దాన్ని. వాళ్లింట్లో వాళ్లకు నా బొమ్మలు, నా పాటతోనే లాక్‌డౌన్‌లో మస్తు టైం పాస్. రెండు నెలల లాక్‌డౌన్ సమయంల నేను వాళ్లింట్లో టీవీ చూసి, చాలా పాటలు నేర్చుకున్న. కానీ, నా మనసంతా అమ్మే.

'ఎప్పుడెప్పుడు లాక్‌డౌన్ ఎత్తేస్తరా?! అమ్మను సూద్దామా!' అని ఉండేటిది.

'అమ్మకు నేను నేర్సుకున్న పాటలన్నీ పాడి ఇనిపియ్యాలే!' అని అనుకునేటి దాన్ని.

ఏడుపొస్తే రాత్రి దుప్పటి కప్పుకొని ఏడ్చేటిదాన్ని. లాక్‌డౌన్‌తో పని అమ్మాయి రావడంలే. నేనే గిన్నెలు తోమి, ఇల్లు ఊడ్చి వారికి పనిలో సాయం జేసిన.

లాక్‌డౌన్ ఎత్తేసింద్రు. ఆ రోజు నాకు మస్తు ఖుషీగ ఉండే. ఆ స్టేషన్ మాస్టరు టిక్కెట్టు కొని రైలు ఎక్కించిండు.

"బొమ్మా! వెళ్లగానే మా అమ్మ నంబర్‌కు ఫోన్ చెయ్యి" అన్నది రూపసి.. రైలెక్కే ముందు.

* * *

రైలు మా ఊరిల ఆగింది. నేను రైలు దిగి నడవడం లేదు. లేగ దూడలా చెంగు చెంగున ఉరుకుతూ.. మేము ఉండే గుడారాల దగ్గరికి పోయిన. అక్కడ మా గుడారాలు ఒక్కటి కూడా లేకుండె. కరోనా టెస్టుల కోసం చెక్క గదులు వరసగా కట్టింద్రు. గవ్విటిని చూసిన నాకు ఏడుపు ఆగడం లే. ఆ చుట్టుపక్కల అంతా తిరిగిన. ఎక్కడా నాకు ఎరుక ఉన్నోళ్లు కనిపించలే. తిరిగి తిరిగి యాష్టకొచ్చె. ఎస్టీడీ బూత్‌కు పోయిన. రూపసికి ఫోన్ చేయాల్నని.. ఫోన్ నంబర్ ఉన్న చిన్న కాగితం ముక్క చేత్తో పట్టుకుని చాలాసేపు తిరగడంతో.. చెమటకు ఆ కాగితం తడిసిపోయి నంబర్లు కనిపించలే. అంకెలన్నీ అలుక్కుపోయినయి!

.. జీవితంలో ఒక్కచోట పేరుకున్న కష్టాల్లా ఉంది నా పరిస్థితి.

శూన్యంలకు చూస్తున్న నా దగ్గరికి మొగిలయ్య వచ్చిండు.

"బతుకమ్మా! ఏమైనవే గిన్నాళ్లు?" అన్నడు.

"మా అమ్మావాళ్లు ఎక్కడా?" అని అడిగిన.. ఆశగా.

"నాకు తెల్వది. బతుకమ్మా! పద రైళ్లు వచ్చే సమయం అయింది" అన్నడు.

'బొమ్మా! నీకు మంచి జీవితం ఉంది. నీ చేతిలో మంచి కళ ఉంది. మంచి గాత్రం ఉంది. కష్టపడు. అడుక్కోకు!' అన్న స్టేషన్ మాస్టరు మాటలు యాదికొచ్చినయి.

'అవును నేను గొప్పదాన్ని అవ్వాల. అమ్మకు నేను అడుక్కోడం ఇష్టంలే' అని అనుకున్న.

'కళ అంటే సంపద. కళ మనిషికి గౌరవాన్ని ఇస్తుంది' అని టీవీలో ఇన్నాను. ఆ

మాటలు నా చెవుల్లో మారుమోగుతున్నయ్.

"మన బతుకు మనదే కాదు. మన బతుకు ఎదుటివాళ్లకు ఉపయోగపడాల. ఈ ఊరికి ఉపయోగపడాల. మన దేశానికి ఉపయోగపడాల. ఈ దునియాకే ఉపయోగపడాల. శానామంది అవయవాలు లేకపోయినా కష్టపడి.. గొప్పోళ్లు అవుతుండ్రు. నేనూ కష్టపడాలే. ఈ అడుక్కునే బతుకు నా జీవితాన్ని బర్బాద్ చేస్తది. ఈ బతుకమ్మ ఇక నీతో రాదు మొగిలయ్యా! నేను బతుకమ్మను.. అవును ఎందరికో బతుకునిచ్చే అమ్మను అవుతా!" అని.. అమ్మ బొమ్మ చూస్తా దౌడు తీస్తుండా.

దూరంగా.. 'కృషి ఉంటే మనుషులు రుషులవుతారు.. మహా పురుషులవుతారు!' పాట వస్తున్నది.

**డాక్టర్ శ్రీదేవీ శ్రీకాంత్ స్వస్థలం హైదరాబాద్. ప్రస్తుతం ఆఫ్రికాలోని బోట్స్వానా దేశంలో ఉంటున్నారు. ఐదు పీజీలు, రెండు పీహెచ్డీలు (క్లినికల్ సైకాలజీ, ట్రాన్స్లేషన్ స్టడీస్) చేశారు. ప్రస్తుతం క్లినికల్ సైకాలజిస్ట్గా పనిచేస్తున్నారు. ఇప్పటివరకూ 150కిపైగా కథలు, రెండు వందలకుపైగా గజల్స్, రెండు వందలకుపైగా కవితలు, అనేక నానీలు, భక్తి పాటలు, హైకూలు, జానపద పాటలు రాశారు. ఆంగ్ల కవితలు, సైకాలజీలో నాలుగు పుస్తకాలు (ఆంగ్లంలో) తీసుకొచ్చారు. మానసికతత్త్వానికి సంబంధించి మూడు పుస్తకాలు వెలువరించారు. గజల్స్, కవితలు, ఆంగ్ల కవితల పుస్తకాలను ప్రచురించారు. మరికొన్ని కథల పుస్తకాలు ప్రచురణకు సిద్ధంగా ఉన్నాయి. రేడియోలోనూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. కథలపై లోతైన సమీక్షలు చేస్తుంటారు. సాహిత్యంతోపాటు చిత్ర లేఖనంలోనూ అనేక బహుమతులు, సన్మానాలు అందుకొన్నారు. కూచిపూడి, భరతనాట్యం, వీణ వాద్యంలో ప్రావీణ్యం సాధించారు.**

# అర్ధనారి



మండ శ్రీకర్
**7799813109**

"అమ్మమ్మా! అటు చూడు. ఆ అంకుల్ చీర కట్టుకుని, చప్పట్లు కొట్టుకుంటూ.. అందరి దగ్గరా డబ్బులు అడుగుతూ ఇటే వస్తున్నాడు. నాకు భయమేస్తున్నది. వెంటనే కిటికీలు మూయి!" అంటూ.. చటుక్కున నా కొంగు చాటున దాక్కున్నాడు చింటు. అప్పటివరకు ట్రాఫిక్ సిగ్నల్ వైపు చూస్తున్న నా కళ్లు, ఆ అర్ధనారి వైపునకు మళ్లాయి. నా కళ్లకు అడ్డుగా వచ్చిన కన్నీటి చుక్కలను పక్కకు నెట్టేలోపే, కారు చక్రాలు గిర్రున తిరిగాయి. నా ఆలోచనలు, నన్ను గతంలోకి నెట్టాయి.

* * *

"ఏంటీ! చిన్న పిల్లాడని కూడా చూడకుండా అంతలా కొట్టాలా?!" అన్న నా అరుపు వినగానే..

"కొట్టాలా.. కొయ్యాలా?! ఈ నా కొడుకు, నాకున్న కాసింత పరువూ తీసేశాడు. ఈడి ఆడంగేశాలతో ఊళ్లో నా తల ఎక్కడ తాకట్టెట్టాలో, నాకెరుకైతలేదు. రేపటేల ఈడు నా కంటపడ్డాడో.. ఉప్పు పాతరేస్తా!" అంటూ తూగుతూ, మంచానపడ్డాడు నానిగాడి తాగుబోతు తండ్రి.

"ఆడి చేతులిరిగిపోను! పాపం నా చిన్ని తండ్రికెంత కష్టమొచ్చె. తొమ్మిది నెల్లు మోసిన నాకంటే, ఆ దేవుడు

చేసిన గందరగోళంలో చిక్కుకొని తల్లడిల్లిపోతున్న ఆ పసివాడికే తెలుసు.. ఆ బాధెంతో!?.. ఆ బాధేంటో!?".. అంటూ కన్నీరు

మున్నీరయ్యా..

* * *

"అమ్మమ్మా లే! ఇల్లొచ్చింది" అన్న చింటుగాడి అరుపు వినేదాక.. నా మనసు ఆ పాత రోజుల్లోనే చిక్కుకుంది. వెంటనే నన్ను నేను సముదాయించుకొని కారు దిగి, ఇంటి గుమ్మం వైపు అడుగులేశాను. మా అల్లుడు నా పాత బ్యాగు పట్టుకొని, నా ముందు అతి మర్యాదగా నడుస్తున్నాడు.

"ఏంటమ్మమ్మా! ఈ డొక్కు బ్యాగు పట్టుకొచ్చావు" అంటూ చింటుగాడు వెక్కిరించాడు. వాడికేం తెలుసు అది నానిగాడికి ఇష్టమైన బ్యాగని.

కవిత వంట పనుల్లో బిజీగా ఉంది. తనను చూసి..

"బాగున్నావా!" అని అడగలేను. ఎందుకంటే తన వాలిపోయిన ముఖం, పల్చబడిన జుట్టు, ఒంటిపైనున్న గాయాలు, ఆ విషయాన్ని స్పష్టంగా వివరిస్తున్నాయి. నన్ను చూసిన వెంటనే..

"అమ్మా! వంట తయారైంది. కాళ్లూ, చేతులు కడుక్కో!" అని లేని నవ్వును వెంబడేసుకొని చెప్పింది.

'సరే!' అంటూ తలూపడమే నా వంతయింది.

సూర్యుడు తల మీదికొచ్చి గంటయింది. పళ్లెం ముందు కూర్చున్నామో లేదో.. గుమ్మం నుంచి గయ్యిమంటూ కేకలు వినిపించాయి. అప్పులోడు కావచ్చు.. అరుపు వినగానే అల్లుడు అటకెక్కాడు. ఇంట్లో ఉన్న అల్లుడిని లేడని చెప్పి, కంచం ముందుకొచ్చింది కవిత. అప్పులోడేదో అన్నట్టున్నాడు. కవిత ముఖం కళ తప్పింది. అసలు ఇప్పుడు కాదు.. అల్లుడు దారి తప్పినప్పటి నుంచే, దాని జీవితంలో సొంత నవ్వులు దూరమయ్యాయి. ఏదో తిని, మంచం మీద కూర్చున్న నాకు.. నిద్ర ఎప్పుడు పట్టిందో ఆ దేవుడికే ఎరుక.

* * *

"వాని చేతులిరిగిపోను. పుట్టినరోజని కూడ చూడకుండా, వాతలొచ్చేటట్టు కొట్టిండు. వండిన అన్నమంతా చల్లగయ్యింది. నానీ.. లే! అన్నం తిందువ్. పొద్దున్నుంచి ఏం తినలే!"..

"అమ్మా! ఈరోజు నా పుట్టినరోజు కదా. ఏదైనా గౌనేసి నన్ను తయారుచేయవా!?" అంటూ బోరున ఏడ్చాడు.

వాడి బాధ చూసి.. కవిత తన గౌనిచ్చింది. అదేసుకొని, తిట్లతో బాధపడ్డ వాడి మనసుకు వాడే మందు రాసుకున్నాడు. పొద్దున లేచేసరికి వాడు కనిపించలేదు. ఊరంతా వెతికినా.. వాడి ఆచూకీ దొరకలేదు. కొడుకు పోయిన బాధకూడ లేకుండా.. తూగుతూ పన్నడు నా తాగుబోతు మొగడు.

సూర్యుడు మబ్బుల చాటున దాక్కోగానే.. నిద్ర లేవమంటూ గోల చేశాడు చంటిగాడు. ముఖంమీద నీళ్లు పోసుకొని, నా ముడతల ముఖానికి పౌడర్ అద్దుకున్నా. కవితతో బయటికెళ్లి చాలా రోజులయింది. అడగంగ అడగంగ.. అరగంటకు ఒప్పుకొన్నది. అల్లుడికి బయట ముఖం లేదు కాబట్టి.. మేం ముగ్గురమే బయల్దేరాం.

కవితకు ఒకప్పుడు షాపింగ్ అంటే చచ్చేంత ఇష్టం. తను పనిచేసే రోజుల్లో ఇంటికి వింత వింత సామాన్లన్నీ తీసుకొచ్చేది. నా తాగుబోతు భర్త, మందు దుకాణముందని ఈ మాయ మాటలోడికిచ్చి, దాని గొంతు కోసిండు. పెండ్లయిన నాలుగేళ్లకే అప్పులోళ్లకు దుకాణం అమ్మి.. అప్పటినుంచి కవిత కష్టంమీద బతుకుతూ, దాని బతుకును ఆగమాగం చేస్తున్నడు.

భానుడు సెలవంటూ, పడమటి దిక్కుకు పోతున్నడు. ఆటో పొద్దునాగిన ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఆగింది. పొద్దున చింటుగాడికి కనిపించిన ఆ అర్ధనారి కోసం నా కళ్లు వెతుకుతున్నాయి.

“అమ్మమ్మా! ఆ అంకుల్ అక్కడే ఉన్నాడు!” అంటూ నా కొంగు చాటున దాక్కున్నాడు చింటు. వెంటనే నా కళ్లు.. ఆ దిక్కుకు మళ్లాయి. ఉండబట్టలేక.. నా పాదాలు ఆ వైపుగా కదిలాయి. సరాసరి వెళ్లి ఆ వ్యక్తి ముందు నిల్చున్నాను. నన్ను చూసిన వెంటనే..

“అమ్మా!” అంటూ.. నా మీద పడి ఏడ్చింది ఆ అర్ధనారి.

‘నాని గాడేనా?!.. అవును వాడే!’.. ఒక్కొక్కటిగా దాచుకున్న నా కన్నీటి చుక్కలు, సంద్రంలా నేలను తాకాయి. చుట్టూ ఉన్న అన్ని కండ్లూ మమ్మల్ని వింతగా చూస్తున్నాయి. అదేదో.. వాళ్ల బిడ్డలను వాళ్లెప్పుడూ కౌగిలించుకోనట్టు. ఆ కండ్ల మధ్యలోంచి కవిత మా దగ్గరికి వచ్చి, తను ఏడుస్తూ మమ్మల్ని ఓదార్చింది. అదంతా చూస్తూ చింటు ఓ పక్కనే ఆగిపోయాడు.

మా కన్నీళ్లకు కరిగిపోయిన ఆకాశం, తన నల్లని మబ్బులను కరిగించి.. ఒక్కసారిగా మాపై నీళ్లు గుమ్మరించింది. ఆ చినుకులు మా కన్నీటి చినుకులను తమలో కలుపుకొన్నాయి. ఆ వర్షంలో తడుస్తున్న మమ్మల్ని, నానిగాడు తన ఇంటికి రమ్మన్నాడు. అలా.. మా గమనం మారింది.

నేను నానిగాడి చేతులు పట్టుకొని ధైర్యంగా ముందు నడుస్తుంటే, మా వెనక చింటుగాడు వాళ్లమ్మను పట్టుకొని భయంగా నడుస్తున్నాడు. “అమ్మా! ఇదే మా ఇల్లు” అంటూ లోపలికి తీసుకెళ్లాడు నాని.

* * *

ఇల్లు చాలా విశాలంగా ఉంది. ఎక్కడ చూసినా పుస్తకాలే. డజనుకుపైగా కుర్చీలు, ఓ దిక్కున సిమెంటు గోడకు వేలాడుతున్న నల్ల బోర్డు, రంగురంగుల పేపర్లు, మరెన్నో ఆట వస్తువులు. ఆ ప్రదేశం విద్యార్థులు లేని పాఠశాలలా ఉంది.

"నానీ! ఇది ఇల్లా? బడా?" అంటున్న నా మాట ముగిసేలోపే..

"అమ్మా! ఈ పాఠశాలే నా ఇల్లు. నాలాంటి వారెందరికో, ఇక్కడే నేను చదువు నేర్పిస్తున్నాను".. అన్న వాడి మాటలు వింటుంటే, గర్వం నా మనసును తాకింది.

"ఎక్కడిదాకా చదువుకున్నావురా?" అంటూ కవిత నా మనసులో మాటనడిగింది.

"అక్కా! ఈ సమాజం నన్ను నాలా ఉండనివ్వలేదు. చదవనివ్వలేదు. అబ్బాయిలా చదువుదామంటే, అవహేళన చేశారు. అమ్మాయిలా చదువుదామంటే అవమానించారు. కూటికి కూడా డబ్బులుండేవి కాదు. పని చేస్తానంటే పనిచ్చేవారు కాదు. అందుకే అడుక్కుంటూ నాలాంటి పిల్లలకు, పెద్దలకు నాకు వచ్చిన చదువు నేర్పిస్తున్నాను".. అంటూ కన్నీరు కారుస్తున్న నాని మాటలు విని..

"మామయ్యా! సారీ! ఏడ్వకు!" అంటూ వాడి చిట్టి చేతులతో నానిగాడి కన్నీరు తుడిచాడు చింటూ. ఆ చిట్టి చేతులు తాకగానే వాడి కన్నీళ్లు.. ఆనందబాష్పాలుగా మారాయి.

'నానిగాడికి పుస్తకాలంటే చచ్చేంత ఇష్టం. ఎంత పెద్ద లెక్కనైనా చిటికెలో చేసేవాడు. అలాంటిది పదహారో ఏటే.. పదో తరగతి మధ్యలోనే ఆపేసి, ఇక్కడికొచ్చి పడరాని పాట్లుపడ్డాడు. అయినా మంచిదే అయింది. లేకుంటే వాడి తాగుబోతు తండ్రి, వాడిని బతకనిచ్చే వాడా?'.. నా మనసులోని ఎన్నో ఇరుకైన ప్రశ్నలు ఒక్కొక్కటిగా నన్ను పలకరించి మాయమవుతున్నాయి.

వచ్చి రెండు గంటలైనా కాలేదు. కవిత కండ్లు మాటిమాటికీ గడియారం వంక చూస్తున్నాయి.

"ఏంటక్కా? అప్పటినుంచి ఆ గడియారం వైపే చూస్తున్నావు" అన్న నాని మాటలు పూర్తికాకముందే.. కవిత ఫోన్ జుమ్మని మోగింది. చింటుగాడు వెంటనే ఫోనెత్తి, స్పీకర్ ఆన్ చేశాడు.

"ఏమేవ్? ఎక్కడున్నవ్? మీ అమ్మ ఏడికి తీసుకెళ్లింది. అరగంటలో ఇంటికాడ లేకుంటే.. కాళ్లి రగ్గొడుతా!" అంటూ మొత్తుకుంటున్నడు. ఆ మాటలు వినగానే.. ఒక్కసారిగా తేరుకొని తొందరగా ఫోన్ ఆఫ్ చేసింది కవిత.

"అమ్మా! నీ చేతి చాయ తాగి ఎన్ని రోజులయింది. ఒక్కసారి చేయవా!?" అంటూ వంటగదిలోకి తీసుకెళ్లి..

"అమ్మా! నిజం చెప్పు. అక్క.. బావగారికి ఎందుకు భయపడుతుంది. అది సంతోషంగా లేదా!?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు నాని. నా కంటికి అలుముకున్న తడిని తుడిచి, కవిత కన్నీటి గాథను వివరించాను. కనీసం ఈ జవాబులతోనైనా తన జీవితానికి సమాధానం దొరుకుతుందని అనుకున్నా.

అప్పటినుంచి కవిత ఫోన్ మోగుతూనే ఉంది. దాని ముఖంలో క్షణక్షణానికి ఆందోళన ఎక్కువైపోతున్నది.

"అక్కా! ఎందుకంత భయం? నా చేయి పట్టుకుని ధైర్యం నేర్పిన రోజులు మరిచిపోయావా? నేను మీతో వచ్చి, బావగారికంతా చెబుతాను" అంటూ కవితకు భరోసా ఇచ్చాడు నాని.

నిజమే! కవిత ఒకప్పుడు ధైర్యవంతురాలే. కానీ, తన బాధను ఇతరులతో పంచుకునే ధైర్యం దానికి లేదు. ప్లాస్టిక్ నవ్వులతో తన కన్నీటి కథలను దాచిపెడుతుంది. పెళ్లి కొడుకు నచ్చలేదని, వాళ్ల నాన్నకు ధైర్యంగా చెబితే.. ఆ తాగుబోతు కుటుంబానికిచ్చి తగవులతో జీవితాన్ని గడపమని పంపాడు ఆ కసాయి తండ్రి. తనవల్ల తన కూతురికి జరిగిన అన్యాయం తెలుసుకునే లోపే.. తన ఊపిరాగిపోయింది.

* * *

మబ్బుల మధ్యనుంచి వెన్నెల దర్శనమిచ్చింది. ఆకాశానికి ఆయాసమొచ్చి వర్షాన్ని వెనక్కి పిలిచినట్టుంది. "అమ్మా! ఇక వెళ్దామా?" అంటూ కవిత తన కంగారులో ముప్పావువంతు నాకిచ్చింది. మా కంగారును చూసి, నాని మా వెంట రావడానికి సిద్ధమయ్యాడు. కండ్లకు కాటుక పెట్టుకొని, ముఖాన్ని స్కార్ఫ్‌తో దాచుకున్నాడు. మా అడుగులు గుమ్మం బయటికి కదిలాయి.

బయట రోడ్డంతా బురదతో నిండిపోయింది. ఆటో ఎక్కిన అరగంటకు ఇంటి ముందర దిగాం. వాకిట్లోనే మందు పరిమళం మా ముక్కునంటుకున్నది. గేటు చప్పుడు కాగానే.. తిట్ల పురాణం మా చెవికంటుకున్నది. ఆ అరుపులు వినగానే కవితకు భయం పట్టుకున్నది. చింటుగాడు నా చేయిని గట్టిగా పట్టుకుని ఏడుస్తున్నాడు.

కవిత చేయి పట్టుకుని గుమ్మం వైపు కదిలాడు నాని. వాడి అడుగుజాడల్లో మా పాదాలు కదిలాయి. గుమ్మంలోకి వెళ్లగానే.. ఆ తాగుబోతు గుర్రుమంటూ దానిమీదికి చేయిలేపాడు.

"ఆపు బావా!" అంటూ తన ముఖానికి ఉన్న స్కార్ఫ్‌ను తీసేశాడు నాని. వాణ్ని చూడగానే తాగిందంతా దిగినట్టుంది. ఒక్కసారిగా బిక్కముఖం వేశాడు చింటుగాడి తండ్రి.

"బావా! నేను నీ బావమరిదిని. చిన్నప్పుడే ఇంటినుంచి పారిపోయాను. ఈరోజు వీళ్లకు కనిపించాను. ఇక మీదట తాగి ఇలా రచ్చ చేస్తే బాగుండదు" అని కాస్త గట్టిగానే చెప్పాడు నాని.

"ఎవడ్రా.. నీకు బావా?! ఇట్లాంటి ఆడ–మొగ కానోణ్ని ఇంటికి తీసుకొచ్చి, నా మీదికే పంపుతావా!" అని నానిగాడిని అనరాని మాటలంటూ, వాడి మీదికి చెయ్యెత్తాడు.

తమ్ముడి మీద చేయి పడగానే.. కవిత మరిచిపోయిన కోపమంతా ఒక్కసారిగా బయటికి తెచ్చి, ఆ నీచుణ్ని ఒక్క తన్ను తన్నింది.

"అరేయ్! నువ్వు నా తమ్ముడిని ఆడ–మొగ కానోడంటావా? మరి పదేండ్ల నుంచి ఆడదాని జీతంమీద ఆధారపడ్డ నిన్నేమనాలి? నువ్వు మారుతావన్న ఆశ.. ఎప్పుడో చచ్చిపోయింది. ఇక ఇప్పటినుంచి నీ బతుకు నీది.. నా బతుకు నాది" అంటూ వీరనారిలా

మమ్మల్ని ఒప్పించి బయటికి కదిలింది.

అవును నిజమే! ఎప్పుడూ తాగుతూ పెళ్లాం బిడ్డలను చూసుకోనోడు.. పదేళ్లుగా ఇంటికి ఒక్క రూపాయీ తేనోడు.. దాని బతుకును ఆగమాగం చేసినోడు.. మగాడు ఎలా అవుతాడు? దాని జీవితమంతా గొడవలతోనే గడిచింది. ఇప్పుడు ఆ గొడవల నుంచి బయటపడాలని అనుకుంటున్నది. ఇప్పుడు కూడా నేను వద్దంటే.. దాని జీవితం నాలానే అవుతుంది. సమాజం దాన్ని భర్త వదిలేశాడని అనుకున్నా.. అది భయాన్ని వదిలేసిందని మాకు తెలుసు.

నలుగురం కలిసి నానిగాడి ఇంటికి బయల్దేరాం. నా దగ్గరున్న డబ్బులతో నానిగాడి ఇంటిని బాగుచేశాం. కింద టిఫిన్ బండి పెట్టాం. పైన ఓ తరగతి గదితోపాటు మరెన్నో మంచి మంచి పుస్తకాలను ఏర్పాటుచేశాం. ఇకనుంచి వాడు అడుక్కోవాల్సిన అవసరం లేదు. కవిత తన కాళ్లమీద తాను నిల్చుంది. తను ఎన్నో ఏళ్లుగా సంపాదిస్తున్నా.. ఇప్పుడే తన కాళ్ల మీద తాను నిల్చుంది. తొందరగానే టిఫిన్ బండి, హోటల్‌గా మారింది. నానిలాంటి వారెందరో ఇప్పుడక్కడ పనిచేస్తూ చదువుకుంటున్నారు. వాళ్లందరికీ నేను అమ్మనయ్యాను. వాళ్లు నాకు బిడ్డలయ్యారు. ఇదంతా ఫొటోలోంచి చూస్తూ.. నానిగాడి తండ్రి ఆనందబాష్పాలతో ఆనందపడ్డాడు.

**(ఆనందం + విషాదం = జీవితం)**

**మంద శ్రీకర్ స్వస్థలం వరంగల్ జిల్లా కమలాపూర్ మండలం వంగపల్లి గ్రామం. తల్లి దండ్రులు మంద మంజుల – సాంబయ్య. 21 అగస్టు, 1999న జన్మించిన శ్రీకర్, కరీంనగర్‌లోని ధన్గర్‌వాడి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నారు. ప్రస్తుతం నర్సంపేట బిట్స్ కళాశాలలో బీటెక్ (సివిల్) చివరి సంవత్సరం చదువుతున్నారు. తొలి రచన 'మరో ప్రపంచం పిలిచింది'.. గతేడాది 'నమస్తే తెలంగాణ – ముల్కనూర్ ప్రజా గ్రంథాలయం' నిర్వహించిన కథల పోటీలో బహుమతి గెలుచుకున్నది. ఇది (అర్ధనారి) రెండో రచన. 2016లో ఈనాడు పత్రిక నిర్వహించిన డా. బీఆర్. అంబేద్కర్ వ్యాసరచన పోటీలో (ఉమ్మడి కరీంనగర్) స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. పాఠశాల స్థాయిలో అనేక వ్యాసరచన పోటీల్లో పాల్గొని, బహుమతులు అందుకున్నారు. తాను చదువుకున్న కరీంనగర్ మంకమ్మతోటలోని ధన్గర్‌వాడి ప్రభుత్వ పాఠశాలకు ఈ కథ ద్వారా కృతజ్ఞతలు చెబుతున్నారు శ్రీకర్.**

# ప్రేమంటే ఏమిటి?



బలభద్రపాత్రుని ఉదయ శంకర్
9494536524

'అసలు ప్రేమంటే ఏమిటి?'.. ఈ ప్రశ్న నన్ను ఎప్పటినుంచో వేధిస్తున్నది. చిన్నప్పుడు అమ్మను అడిగాను. పెద్ద చదువులు చదువుకోని అమ్మ చిన్నగా నవ్వి.. 'ప్రేమంటే ఇష్టం రా కన్నా!' అన్నది, నా తల నిమురుతూ.

మా మేనత్త పెళ్లప్పుడు బామ్మ సున్నుండలు చేస్తూ, నా చేతిలో రెండు పెట్టింది. 'నాకు సున్నుండలు అంటే ప్రేమ బామ్మా! ఇంకో రెండివ్వు' అన్నాను.. రెండో చెయ్యి చాపి.

బామ్మ నా నెత్తిన చిన్నగా మొట్టి.. 'సున్నుండలంటే ప్రేమ ఏవింట్రా పిచ్చి సన్నాసి!? ఇష్టం అనాలి' అన్నది. అంటే.. ప్రేమ వేరు, ఇష్టం వేరు! అన్నమాట. 'మరి అమ్మ అలా ఎందుకు చెప్పింది?' అని బుర్ర గోక్కున్నాను.

హెడ్‌మాస్టర్ గారు స్కూల్ అసెంబ్లీలో.. 'భారతదేశము నా మాతృభూమి, భారతీయులందరూ నా సహోదరులు. నేను నా దేశమును ప్రేమించుచున్నాను..' అని రోజూ మాతో చెప్పిస్తారు.

'దేశాన్ని ప్రేమించడమేంటి? దేశభక్తి అంటారు కానీ.. దేశప్రేమ అనరు కదా!?' అని ఒకసారి మాస్టారును అడిగాను. ఆయన నా భుజం తట్టి..

'చొప్పదంటు ప్రశ్నలు వేయడంలో నువ్వే

ఫస్టురా!' అని నవ్వి.. 'దేశాన్ని ప్రేమించడమే దేశభక్తి!' అన్నారు.

అమ్మ ఎప్పుడైనా బామ్మ మాట వినకపోతే.. 'మొగుడి మీద ప్రేమ ఉంటే సరిపోదు. అత్తగారన్నా కాస్త భయం, భక్తీ ఉండాలి' అనేది.. బామ్మ కోపంగా. అప్పుడు మాస్టారు మాటలు గుర్తొచ్చి.. 'ప్రేమ, భక్తి ఒకటేనా! కాదా?' అని నాలో నేను మధనపడేవాణ్ని.

ఒకరోజు బామ్మ గుళ్లో స్వామీజీ ప్రవచనాలకు వెళ్తూ నన్ను కూడా వెంటబెట్టుకొని వెళ్లింది. ఆయన భక్తులను 'ప్రేమ మూర్తులారా!' అని సంబోధించారు. అసలే ప్రేమకు అర్థం తెలియక కొట్టుమిట్టాడుతుంటే స్వాముల వారి మాటలు నన్ను మరింత తికమకపెట్టాయి.

హైస్కూల్లో చేరిన తర్వాత నాకు స్నేహితులు పెరిగారు. వాళ్లలో కొంతమంది సినిమాలు చూసొచ్చి వాటిమీద చర్చించుకుంటూ.. ప్రేమ గురించి అప్పటివరకూ నేను విన్నది కాకుండా, కొత్త అర్థంలో మాట్లాడుకొనేవారు. 'ప్రేమంటే ఏమిటి?' అని వాళ్లను అడిగితే నాలుగు పచ్చి బూతులు చెప్పి ఎగతాళిగా మాట్లాడేవారు.

నాన్నకు తెలియని విషయం లేదు. అందుకని నాన్నను ప్రేమ గురించి అడిగాను. ఆయన నన్ను కొట్టినంత పనిచేసి.. 'వేలెడంత లేవు. ఇప్పటినుంచే నీకెందుకురా పెద్ద విషయాలు? బుద్ధిగా చదువుకో! లేకపోతే తాటతీస్తా!' అని కన్నెర్ర చేశాడు.

'ప్రేమంటే పిల్లలు తెలుసుకోకూడని పెద్ద విషయమేమో!' అనిపించింది నాకు. మా కాలనీలో ఉంటున్న కాలేజీ కుర్రాళ్ల మాటల్లో ప్రేమ ప్రస్తావన తరచుగా వచ్చేది. ఒకడు.. 'ఆమె అందం నన్ను అయస్కాంతంలా ఆకర్షించిందిరా!' అంటే, మరొకడు.. 'ప్రేమిస్తున్నానని చెప్పేయ్ గురూ!'అనేవాడు. అప్పుడు, 'ప్రేమంటే.. ఆకర్షణ!' అని అర్థమైంది.

బయాలజీ లెక్చరర్‌గా పనిచేస్తున్న మా బాబాయికి ఈ సంగతి చెబితే.. 'వాళ్ల మొహం. అది ప్రేమ కాదురా.. ఆకర్షణ!' అన్నాడు. అయితే ప్రేమ వేరు, ఆకర్షణ వేరు! అన్నమాట. నేను గందరగోళంలో పడిపోయాను. నాకంటే ఆరేళ్లు పెద్దదైన పక్కింటి సునీత పుస్తకాలు బాగా చదివేది. ప్రేమ గురించి ఆమెను అడిగితే..

'నీ అమాయకత్వం చూస్తుంటే ముచ్చటేస్తుందిరా! నాకంటే చిన్నవాడివి అయిపోయావు కానీ, లేకపోతేనా!..' అని నా బుగ్గమీద ముద్దుపెట్టింది. నేను తనకంటే పెద్దయి ఉంటే ఏం చేసేదో మరి?

* * *

పట్టువదలని విక్రమార్కుడిలా ప్రేమకు అర్థం శోధిస్తూనే.. స్కూలు దశ దాటి ఇంటర్లో చేరాను. సీతాకోకచిలుకల్లా రెపరెపలాడుతున్న అమ్మాయిలను చూస్తే నాలో ఏదో అలజడి మొదలయ్యేది. వాళ్లతో మాటలు కలపాలని ఉన్నా మనసులో ఏదో బెరుకుగా ఉండేది.

మా క్లాస్‌మేట్ లత అందరికన్నా భిన్నంగా ఉంటుంది. ఎన్నిసార్లు చూసినా, మళ్లీమళ్లీ చూడాలనిపిస్తుంది. తను కాలేజీకి రాని రోజు, నాకు ఏదో వెలితిగా ఉండేది. 'నేను ఆమెను చూస్తున్నట్లే, తనూ నన్ను చూస్తుందా!?' అనే సందేహం కలిగేది. లత తలపునకు వస్తే చాలు..

ఏదో తెలియని ఆనందం కలిగేది.

ఈ సంగతి సునీతకు చెప్పాను. 'ఇప్పటికి పెద్దమనిషివి అయ్యావన్నమాట!' అని గలగలా నవ్వింది. నేను కోపం నటించి.. 'ఛీ! పాడు.. నేనేం ఆడపిల్లనా? పెద్దమనిషి అవడం ఏంటి?' అన్నాను. ఆమె నవ్వి.. 'ఏదో సరదాగా అన్నాలే. ముందు బాగా చదువుకో! ఆ తర్వాత తీరిగ్గా ప్రేమించుకోవచ్చు' అన్నది భుజం తట్టి.

'అయితే ఇది ప్రేమేనంటావా?' అన్నాను ఆశ్చర్యంగా. సునీత ఎటో చూస్తూ.. 'కావచ్చు! కాకపోవచ్చు. కానీ, బాధ్యతలేని ప్రేమ వాసన లేని పువ్వులాంటిది' అన్నది. కొన్నాళ్లకు సునీత పెళ్లి చేసుకొని అత్తవారింటికి వెళ్లిపోయింది. కానీ ఆమె మాటలు, జ్ఞాపకాలు మాత్రం నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. సునీత లేని లోటును లతతో భర్తీ చేయాలని ప్రయత్నం చేశాను. మా ఇద్దరి స్నేహబంధం కాస్త బలపడగానే.. 'నీ దృష్టిలో ప్రేమంటే ఏమిటి?' అన్నాను. ఆమె తీక్షణంగా చూసి.. 'అదొక జడ పదార్థం. మనిషిని ఎదగనివ్వదు' అని విసురుగా వెళ్లిపోయింది. అప్పటినుంచి ఆమె నాతో ముభావంగా ఉండటం గమనించాను.

ప్రేమ.. బంధాలను పెంచుతుందని విన్నాను. కానీ, లత నాతో మాట్లాడటం తగ్గించినప్పుడే తెలిసింది.. స్నేహాన్ని తెంచుతుందని! డిగ్రీ రెండో సంవత్సరంలో లతకు పెళ్లి అయిపోయింది. నా మనోఫలకం నుంచి లత రూపం తొలగించడానికి చాలాకాలమే పట్టింది నాకు.

డిగ్రీ పూర్తి చేసి, పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న నన్ను చూసి, మా మావయ్య.. 'మరీ అంత పుస్తకాల పురుగైతే ఎలారా అబ్బాయ్?' అని ఎగతాళి చేశాడు. అత్తయ్య నవ్వుతూ.. 'ఆనందంగాడు చిన్నప్పటి నుంచీ అంతే! పుస్తకాలను ప్రేమించినంతగా వాడు వాళ్ల అమ్మానాన్నల్ని కూడా ప్రేమించి ఉండడు' అన్నది.

అంటే ఏదైనా ఒక వస్తువును అమితంగా ఇష్టపడితేనో, లేదా దానిని సొంతం చేసుకోవాలని అనుకుంటేనో.. ఆ భావాన్ని ప్రేమ అంటారన్న మాట. అప్పుడే తెలిసింది లోకంలో జీవంలేని వస్తువులను కూడా ప్రేమిస్తారని!

మరి సినిమాల్లోనూ, కథల్లోనూ కేవలం స్త్రీ పురుషుల సంబంధాల్లోనే ప్రేమ ఉన్నట్లు చూపిస్తారెందుకు? అదికూడా ప్రేమ అంతిమ లక్ష్యం పెళ్లే అయినట్లు! 'ఆడా – మగ మధ్య ప్రేమ తప్ప ఇంకేం సంబంధం ఉండే అవకాశం లేదా?' అనే కొత్త ప్రశ్న నాలో ఉదయించింది.

* * *

నాకు ఒక ప్రభుత్వ సంస్థలో ఉద్యోగం వచ్చింది. కొత్తగా ఉద్యోగంలో చేరిన వాళ్లను ఉద్దేశించి.. 'చేస్తున్న పనిని ప్రేమించండి. మీ కెరీర్ బాగుంటుంది. మీవల్ల సంస్థ కూడా అభివృద్ధి చెందుతుంది' అన్నాడు మా బాస్. 'పిడుక్కీ, బియ్యానికి ఒకటే మంత్రం అయినట్లు.. ఈ ప్రపంచంలో ఏ పని చెయ్యాలన్నా ప్రేమ కావల్సిందేనా!' అన్నాను, నాతోపాటే కొత్తగా చేరిన కస్తూరితో. ఆమె నవ్వి.. 'ప్రేమే.. సృష్టికి మూలం. ప్రేమలేని

ప్రపంచం ఎడారి. ప్రేమించలేని మనిషి కసాయి' అన్నది ప్రశాంతంగా.

నేను అడిగిన దానికి సూటిగా చెప్పకుండా మాటలతోనే ఏదో మాయచేసింది కస్తూరి. కస్తూరి, నేనూ ఒకే వయసువాళ్లం కావడంతో, కొద్దిరోజులకే మా మధ్య స్నేహం ఏర్పడింది. ఆమె తన వ్యక్తిగత విషయాలన్నీ నాతో పంచుకునేది. తను వాడే లోదుస్తుల కొలతల దగ్గర నుంచీ నెలసరి తేదీల వరకూ అన్నీ నాకు చెపుతుంటే, మొదట్లో విస్మయం కలిగినా క్రమంగా వాటికి అలవాటుపడ్డాను.

ప్రేమికుల మధ్యా, భార్యాభర్తల మధ్యా రహస్యాలనేవి అడ్డు గోడల్లాంటివని, అవి ఉంటే ఆ బంధం నిలవదని కస్తూరి చాలాసార్లు చెప్పింది. ఆమె నన్ను ప్రేమిస్తుందని అనుకోవడానికి అంతకంటే నిదర్శనం ఏం కావాలి? కానీ, ఒకరోజు నా చేతిలో పెళ్లి శుభలేఖ పెట్టి, నన్ను ఆశ్చర్యపరిచింది కస్తూరి. 'ఇంకా నయం! తొందరపడి ప్రేమిస్తున్నానని చెప్పలేదు' అని ఊపిరి పీల్చుకున్నాను. 'అసలు నీకు ప్రేమంటే తెలుసా?' అని ఆమె నన్ను నిలదీసి ఉంటే, అభాసుపాలు అయ్యేవాణ్ని.

ఏవిఁటో పాతికేళ్లు దాటుతున్నా నాకు ప్రేమకు అర్థం తెలియట్లేదు. పెళ్లి చేసుకోమని పెద్దవాళ్లు ఒత్తిడి చేస్తున్నారు. చివరికి అమ్మానాన్నలు చూసిన సంబంధం చేసుకోక తప్పలేదు. ప్రేమంటే అర్థం తెలుసుకోకుండానే పూర్ణిమతో నా పెళ్లి జరిగిపోయింది. తొలిరాత్రే నా భార్యను అడిగాను.. 'ప్రేమంటే ఏమిటి?' అని. ఆమె సిగ్గుపడుతూ.. 'ఏమో! నాకేం తెలుసు?' అన్నది అమాయకంగా. ఆమె చుబుకం పట్టుకొని.. 'నువ్వు ఇంతవరకూ ఎవరినీ ప్రేమించలేదా?' అన్నాను. పూర్ణిమ నన్ను ఓ వింత జంతువును చూసినట్లు చూసి.. 'ఇప్పటిదాకా లేదు. ఇక మొదలుపెట్టాలి' అన్నది.

ఆ రాత్రి నేను పూర్ణిమ సాంగత్యంలో స్వర్గ సుఖాలు అనుభవించాను. 'ప్రేమకు పరాకాష్ఠ.. కామం!' అని ఒక సందర్భంలో కస్తూరి అన్న మాటలు గుర్తొచ్చాయి. అంటే, నేను పూర్ణిమను ప్రేమిస్తున్నట్లేగా! మరి ఆమె కూడా నన్ను ప్రేమించాలి కదా! కానీ, నాకు ఆమె మొహంలో ప్రేమకు బదులు భయం, కంగారు కనిపించాయేమిటి? రోజులు గడుస్తున్నకొద్దీ.. 'ప్రేమకు పరాకాష్ఠ శృంగారమే!' అని పూర్ణిమ గ్రహించినట్లుంది. ఆమె కూడా నన్ను ప్రేమించడం మొదలుపెట్టింది. సంధ్యవేళ నుంచే.. నా 'ప్రేమ' కోసం తహతహలాడసాగింది. బహుశా నేను ఒక మెట్టు పైకెక్కి.. ప్రేమించడం నుంచి ప్రేమించబడే స్థితికి చేరుకుని ఉంటాను.

పూర్ణిమ వచ్చిన తర్వాత నాలో బద్ధకం పెరిగిపోయింది. ప్రతి చిన్న అవసరానికి ఆమె మీద ఆధారపడుతుంటే.. 'పెళ్లాం రాకముందు దొరగారు ఏం చేసేవారో!?' అని నవ్వుతూనే అన్నీ అమర్చేది. నాకు మాత్రం 'అది కూడా ప్రేమలో భాగమేనేమో!?' అనిపించేది. అయినా నిర్ధారణ కోసం.. 'నేనంటే నీకు ఎంత ప్రేమ!' అంటూ దగ్గరికి తీసుకోబోతే.. 'మిమ్మల్ని ప్రేమిస్తూ కూర్చుంటే ఇంటెడు చాకిరీ ఎవరు చేస్తారు బాబూ?' అని తప్పించుకునేది. 'నా భార్యది శాశ్వతమైన, నికార్సయిన ప్రేమ కాదేమో!?' అని అనుమానం వచ్చింది. దానికి

కారణం.. ఆమె నామీద కన్నా పిల్లాడి మీద ఎక్కువ శ్రద్ధ పెట్టడం కావచ్చు. పరిపూర్ణమైన స్త్రీత్వం సంతరించుకున్న పూర్ణిమను చూస్తుంటే.. నాలో ప్రేమ మళ్లీ పరాకాష్ఠకు చేరుతుంది. కానీ, పిల్లాడి ఆలనా పాలనలో పడిపోయిన పూర్ణిమ నన్ను ప్రేమించే స్థితిలో లేదు.

* * *

ఒకరోజు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో లత కనిపించింది. పలకరిస్తే వాళ్లాయన ఏమన్నా అనుకుంటాడేమోనని నేను సంశయిస్తుంటే.. తనే చొరవ చేసి మాట్లాడింది. నన్ను తన భర్తకు పరిచయం చేసి.. 'నా క్లాస్‌మేట్ ఆనంద్. నేనంటే పడి చచ్చేవాడని చెప్పానే!' అన్నది నవ్వుతూ. నాకు తల కొట్టేసినట్లయ్యింది. మా ఆవిడ నోటికి అరచెయ్యి అడ్డం పెట్టుకొని నవ్వింది.

నేను దిక్కులు చూస్తుంటే.. 'మీరు అదృష్టవంతులు. ఈ శూర్పణఖని పెళ్లాడి ఉంటే.. 'బలి'చక్రవర్తి అయ్యేవారే!' అన్నాడు లత భర్త దయాకర్ నవ్వుతూ. లత మూతి ముడుచుకుని.. 'ఆయనంతేలే ఆనంద్! మా ఇంటికెళ్దాం రండి. ఇక్కడికి దగ్గరే' అని మా ఆవిడ భుజంమీద చెయ్యి వేసి, ముందుకు నడిచింది. లత వాళ్లింట్లోకి అడుగుపెడుతూ..'మీ పిల్లలేరి?' అన్నాను. ఒక్కక్షణం వారి మొఖాల్లో కళ తప్పింది. వెంటనే సర్దుకుని.. 'మాకు మేమే పిల్లలం!' అంటూ పెద్దగా నవ్వారు ఇద్దరూ. అప్పుడు గుర్తొచ్చింది నాకు. 'ప్రేమంటే జడ పదార్థం!' అని నమ్మిన లతకు పిల్లలెలా పుడతారు? అంటే ఆ దంపతుల మధ్య ప్రేమ లేదన్నమాట. అంతుచిక్కని ఆలోచనలు నా బుర్రను తొలిచేస్తున్నాయి.

పూర్ణిమ బాబును ఎత్తుకొని గోడలకు ఉన్న పెయింటింగ్స్ చూడటంలో మునిగిపోయింది. లత టిఫిన్ చేయడానికి వంట గదిలోకి వెళ్లింది. అప్పుడు దయాకర్ చెప్పిన విషయాలు నన్ను దిగ్భ్రాంతికి గురి చేశాయి. లతకు పుట్టుకతోనే ఉన్న గుండె జబ్బు, ఆమె గర్భం దాల్చిన సమయంలో బయటపడింది. ఆపరేషన్ చేసే స్థాయికూడా దాటిపోవటంతో గర్భస్రావం చేసి, పెద్ద ప్రాణాన్ని మాత్రం కాపాడగలిగారు డాక్టర్లు. ఆమె ఎప్పటికీ గర్భం దాల్చకూడదని, భావోద్వేగాలకు గురికాకూడదని, శారీరక శ్రమ చేయకూడదని గట్టిగా హెచ్చరించారు డాక్టర్లు. ఆమెను ఒక అపురూపమైన గాజుబొమ్మలా చూసుకోవాలి. తనవల్ల దాంపత్య సుఖం కోల్పోయిన భర్తను రెండో పెళ్లి చేసుకోమని లత ఎంత ఒత్తిడి చేసినా అతడు ఒప్పుకోలేదు.

లత టిఫిన్ ప్లేట్లతో వచ్చి.. 'నువ్వే చెప్పు ఆనంద్. తను నా వల్ల ఏం సుఖపడుతున్నారని? ఆయన మళ్లీ పెళ్లి చేసుకుంటే మంచిది కదా!' అన్నది. దయాకర్ మౌనంగా ఉండిపోయాడు. నా మెదడు మొద్దుబారి పోగా, ఎటూ చెప్పలేక నిస్సహాయంగా చూశాను. లతకు ఇంత తీవ్రమైన జబ్బు ఉందని తెలిసినప్పటి నుంచీ నా మనసంతా బాధతో నిండిపోయింది. ఇంటికి వచ్చాక కూడా నేను విచారంగా ఉండటం చూసి.. 'విధి కొందరి జీవితాలతో ఆడుకుంటుంది. వాళ్లమీద సానుభూతి చూపడం కన్నా మనం చేయగలిగింది ఏమీ లేదు' అన్నది పూర్ణిమ.

లత భర్త పరిస్థితి తల్చుకుంటూ.. 'భార్య కోసం తన సుఖాన్ని త్యాగం చేసిన దయాకర్

నిజంగా గొప్పవాడు. సముద్రమంత దుఃఖాన్ని మనసులో దాచుకుని భార్యకు సేవ చేస్తున్నాడు' అన్నాను బాధాతప్త హృదయంతో. పూర్ణిమ తల పంకిస్తూ.. 'అదే ప్రేమకు పరాకాష్ఠ. మనం ఇష్టపడేవారు సుఖంగా ఉండాలని కోరుకోవడం, దాని కోసం ఎంతటి త్యాగమైనా చేయడమే నిజమైన ప్రేమ!' అన్నది ఒక తత్వవేత్తలా.

ఎన్నో ఏళ్లుగా నన్ను వేధిస్తున్న ప్రశ్నకు సమాధానం దొరికినట్టే దొరికి మాయమైంది. 'ఒంటరి అవుతానని తెలిసినా భర్త సుఖం కోరి మళ్లీ పెళ్లి చేసుకోమనడం లత ప్రేమకు నిదర్శనం కాదా? దయాకర్ మళ్లీ పెళ్లి చేసుకొని ఉంటే ఆమె సంతోషించేది కదా! ఇద్దరిలో ఎవరి ప్రేమ గొప్పది?' అన్నాను అమాయకంగా.

'భార్యాభర్తల మధ్య ఉండే దైహిక ప్రేమ ఎంత గొప్పదో.. అలౌకిక ప్రేమ అంతకంటే గొప్పది. 'నాతిచరామి' అని భర్త చేసిన ప్రమాణం ఎన్ని కష్టనష్టాలనైనా భరించే శక్తిని ఇస్తుంది. అప్పుడు జనించే ప్రేమకు ఏ కొలమానాలూ ఉండవు. అది అనుభవం ద్వారా తెలుసుకోవాల్సిందే!' అన్నది పూర్ణిమ.

పూర్ణిమ చెప్పింది నిజమేనేమో! ఈ సృష్టిలో ప్రేమను నిర్వచించడానికి, ప్రేమను కొలవడానికి అనుభవాలను మించిన సాధనాలు ఏం ఉంటాయి? నాకు ఏమీ కాని లత గురించి బాధపడటం, దయాకర్ చేసిన త్యాగం చూసి చలించిపోవడం.. సాటి మనిషి మీద నాకుండే ప్రేమకు తార్కాణం కావచ్చు!

కాలం వేగంగా పరుగెడుతూనే ఉంది. నాకు సందేహ నివృత్తి అయిందో లేదో నేను చెప్పలేను. కానీ నేను మాత్రం.. 'ప్రేమంటే ఏమిటి?' అని ఇప్పుడు ఎవరినీ అడగట్లేదు.

* * *

**బలభద్రపాత్రుని ఉదయ శంకర్**

**ఈయన స్వస్థలం గుంటూరు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మేనేజర్‌గా పనిచేశారు. ఈయన చాలా చిన్న వయసులోనే రచనా వ్యాసంగం మొదలుపెట్టారు. పది సంవత్సరాల వయసులోనే కథలు రాశారు. అయితే ఇంటర్ చదువుతున్నప్పుడు 1982లో ఈయన రాసిన మొదటి కవిత కళాశాల మ్యాగ్జిన్‌లో అచ్చయింది. ఆ తరువాత 1984లో ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈయన రాసిన వ్యాసం ప్రచురితమయింది. ఇప్పటి వరకు వందకు పైగానే రచనలు పలు పత్రికల్లో అచ్చయ్యాయి. బలభద్రపాత్రుని ఉదయ శంకర్ కొన్ని ఆంగ్ల కవితలు కూడా రాశారు. అలాగే ఈయన రాసిన కథ "స్వర్ణ మంజీరాలు" కన్నడ భాషలోకి కూడా అనువాదమయింది. ప్రస్తుతం ఈయన సాహో పత్రికలో "సాహో కలం వీరా!" శీర్షిక నిర్వహిస్తున్నారు. బలభద్రపాత్రుని ఉదయ శంకర్‌కు కృష్ణశాస్త్రి కవిత్వమంటే చాలా ఇష్టం. మంచి పుస్తకాలు చదవటం, మంచి సంగీతం వినటం ఈయన అభిరుచులు.**

Katha PART 1_Layout 1 6/29/2023 2:38 PM Page 161

# శర్వమ్మ మరణం కథ

రాజయ్యా ..ఓ రాజయ్యా .. అంటూ ఎదురింటి శేఖర్ కేకలేస్తున్నాడు. బుజ్జీ.. ఎవరో చూడమ్మా! ఏందో అడుగు బిడ్డా.. అని గీత కు చెప్పేసరికి భోజనం తింటున్నదల్లా అలాగే ఎంగిలి చెయ్యితోనే లేచి బయటకు వెళ్ళి చూసి ఒక్కింత నిర్ఘాంతపోయి నిలుచుని వెంటనే సర్దుకుంది గీత.

కళ్ళెదుట జరుగుతున్న దృశ్యం చూసి ఒకింత సిగ్గుగా ఒకింత అవమానంగా తోచింది. పరిగెత్తుకుంటూ వెళ్లి 'నాన్నా నాన్నా అంటూ కంగారుగా భయం భయంగా 'తండ్రి దగ్గరగా వెళ్ళి మరే .శారవ్వ నూ..,అంటూ బయట జరుగుతున్న సంఘటన చెప్పింది.

పెరట్లో కట్టెల కుచ్చెన నుండి తడిసిన కట్టెల్ని తీసి ఆరబెడుతున్న రామయ్య ..చేతిలోని కట్టెల్ని కిందపడేసి బయటకు వేగంగా వచ్చాడు. పక్కింటి సూరయ్య కొడుకు శేఖర్ కనిపించాడు. అతనికీ రామయ్య కొడుకు వయసు ఉంటుంది.

ఇదే వీధిలో ఉంటారు కదా!ఈ పిల్లగాడు .మర్యాద లేకుండా పిలుస్తున్నాడు. 'అంత పొరపాటు ఏంజరిగిందబ్బా ' అనుకోసాగారు అక్కడున్న జనాలు. రామయ్య కు ఇంటికెదురుగా సొంత రైస్ మిల్లు,పిండిమర ఉంది. వడ్లు పట్టించుకోవడానికి వచ్చినవాళ్లు, పిండి పట్టించుకోవడానికి వచ్చినవాళ్ళు క్యూ కట్టారు. అందరూ రామయ్య గుమ్మం ముందు గుమ్మి గుడారు. ఆ వీధిలో దాదాపు 20 ఇండ్లు ఉంటాయి అందరూ వ్యవసాయం చేసుకునే వారే .!



**వాసరచెట్ల జయంతి**
**9985525355**

పొద్దున సమయం కావడం వల్ల అందరూ ఇళ్ళల్లో నే ఉన్నారు.బయట జరుగుతున్న గొడవకి అందరూ బయటకు వచ్చి ఏందీ! రామయ్య ఇంటిమీదికి ఈపిలగాడు పోయిండు? అని ఆశ్చర్యంగా చూస్తున్నారు. వేరే ఊళ్ళ నుంచి మిల్లుకు వచ్చిన వాళ్ళు ఏం జరుగుతుందో అని చోద్యం చూస్తున్నారు. శేఖర్ చేతిలో ఒక బట్టతో ముడివేసిన మూట కనిపిస్తుంది.

విసురుగా తెచ్చి రామయ్య గుమ్మంలోకి మూటను విసిరాడు. విసిరినప్పుడు ముడి ఊడిపోయి అందులో ఉన్న రొట్టెలు బయటపడ్డాయి. అంతే విసురుగా నాలుగడుగుల్లో వెనక్కి వెళ్ళి వాళ్ళింటిలోంచి శర్వమ్మ ను జుట్టు పట్టుకొని లాక్కొచ్చి రామయ్య వాకిట్లోకి తోసాడు. తూలి క్రింద పడబోయిన శర్వమ్మ ను రామయ్య రెట్టపట్టుకుని ఆపాడు.ఏం శేఖర్ 'నాయనమ్మ ను అట్లెనేనా తోసేదీ! అన్నాడు కోపంగా రామయ్య.ఆమె నాకెందుకు నాయనమ్మ అయితది అన్నాడు విసుగ్గా...శేఖర్.'ఏం పిల్లగా మీ నాయనమ్మ కాదా..!మరి ఎవరామే అన్నారు అక్కడున్న వాళ్ళు.మీరు ఇందుట్ల మాట్లాడకుండి ఇది మాకు మాకు జరిగిన ముచ్చట అన్నాడు శేఖర్.మీకు మీకు జరిగితే మీ ఇండ్లల్ల చూసుకోండి బజార్లకు వచ్చి కొట్లాట ఎందుకయ్యా? ఆముసలామె ను దొబ్బితివి కిందపడి ప్రాణం పోతే? అన్నారక్కడున్నమరొకాయన. ఆమె ప్రాణం పోతే ఎవళ్ళకు అక్కెరా? అన్నాడు.

వేలెడంత లేడు ...పెద్దాయనను పట్టుకొని పేరువెట్టి పిలుస్తున్నవేందయ్యా ! అన్నాడొకాయన. మీకు పెద్దాయన అయితే అయ్యిండు మాకెందుకు అయితడు! 'అసలు గీ పెద్దమనిషి ఏంజేసిండో ఎరుకేనా మీకు!' అన్నాడు శేఖర్.అంత చెడ్డపని ఏంజేసిండయ్యా? అంటూ కోపంగా ముందుకొచ్చి అన్నాడొక పెద్దమనిషి. ' శేఖర్ రామయ్య దిక్కు తిరిగి మేము తిండి లేక బాధపడుతున్నమని మీకు చెప్పినమా! ఈ ముసల్ది చెప్పిందా! బిచ్చమేసినట్లు రొట్టెలు చేసి మూటగట్టి ఇచ్చిండ్రు ?అంత మీకు ఎక్కువైతే ఇంకెవరికన్నా దానంజెయ్యుండి. మాకు మీ ముష్టి అవుసరం లేదు అన్నాడు శేఖర్.రామయ్యకు తలతీసేసినట్లు అయ్యింది. ఈ ముసల్ది అని అంటూన్న సమయం లో శర్వమ్మను చూస్తే జాలేసింది. ఏంమాట్లాడవూ ముసల్ది వచ్చి నిన్ను అడిగిందా ? చెప్పు అని నోటికొచ్చినట్లు అంటున్నాడు శేఖర్. శర్వమ్మ దిక్కు చూసిండు రామయ్య. 'భయంభయంగా బిక్కు బిక్కుమంటూ వణుకుతూ బిత్తరపోయి 'రామయ్య నిజం చెప్తాడేమో నని భయపడ్తుంది ఆమె.

' శర్వమ్మ నేనడిగితేనే ఇచ్చిండని చెప్తదేమోనని' రామయ్య భార్య లక్ష్మి శర్వమ్మ దిక్కు చూసింది. ఆమె ఏమీ అంటలేదు. నిన్న ఆకలయితుంది ఏమన్న ఉంటే ఇయ్యమని శారవ్వ బ్రతిమాలితే 'లక్ష్మీ పాపం పెద్దమనిషి మనతో పాటే నాలుగు రొట్టెలు ఎక్కువ చేసెయ్యే' అన్నాడు రామయ్య. అక్కడికీ వద్దయ్యా వాళ్ళింటోళ్ళకు తెలిస్తే రాద్ధాంతం చేస్తరు అంది. 'ఎవరిపాపం వాళ్ళది పోనీయే 'అన్నడు రామయ్య. ఆబగా ఇచ్చిన రొట్టెను నిముషంలో అక్కడే తిన్నది శర్వమ్మ . పాపం అనిపించింది లక్ష్మీ కి. కడుపునిండినంక మీ కుటుంబం సల్లగుండా లెకొడుకా నాలుగు దినాలైంది తినక కొడుకూ కోడలు పిల్లలను తీసుకుని వాళ్ళ

ఊరుకు పోయింద్రు. సౌదలన్నీ తనాభిల పెట్టుకున్నరు. ఆకలికి తట్టుకోలేక అడిగిన. ఎవ్వరికీ చెప్పకుండి కొడుకా ..వాళ్ళకు తెలిస్తే నన్ను బతుకనియ్యరు అంటూ రెండుచేతులూ పట్టుకుని బ్రతిమాలుతున్నట్లు అన్నది శారవ్వ. సరేనవ్వ ఎవ్వరికీ జెప్పంగానీ నీవు ఇంకపో ! అన్నరు వాళ్ళు. ఆమెను చూస్తే రామయ్య భార్య కు కూడా జాలేసింది. అమాయకంగా రామయ్యా మొఖం చూసి దండం పెడుతుంది అవ్వ. రామయ్యా పిల్లలకు కోపం కట్టలు తెంచుకుంది. పిల్లలు ముందుకొచ్చి శేఖర్ ను నాలుగుతందామన్నంత కోపంగా ఉన్నారు.

తండ్రిని అంతలేసిమాటలంటుంటే ఆయనకూడా ఏమీ అంటలేడని వాళ్ళకు ఉగ్రోషం వస్తుంది. తండ్రి దిక్కు చూసింద్రు. వద్దు అనీ కళ్ళతోటే సైగజేసిండు రామయ్యా. కాసేపు అంతా మౌనంగా ఊరుకున్నారు. అంతలోనే శేఖర్ తల్లిదండ్రులు వచ్చారక్కడికి. ఏమయ్యా రామయ్యా ...మనం ఒక గేరిలో ఉన్నంత మాత్రాన మీఇంట్లో వండింది మాఇంటికి పంపుతవా..! నీకులం ఏంటిదీ ? మాకులం ఏంటిది? అనుకుంట ఉరుకొచ్చింద్రు..

అంతసేపు ఊరుకున్న రామయ్యా కు వాళ్ళను చూడంగనే కోపం కట్టలు తెంచుకుంది. అవును వాయ నేనే ఇచ్చిన ఏంది సంగతి ..! 'అన్నాడు ధైర్యం తెచ్చుకుని. ఇచ్చిందే గాక నేనే ఇచ్చిన అని ధైర్యం గ చెప్తున్నవేంది? అది దాని దగ్గరున్న బంగారం గానీ నీకు ఇచ్చిందా ? ఆస్తిపాస్తులు రాస్తందా.అన్నారు వాళ్ళు.

ఇంతసేపు ఊరుకున్ననని నోటికెంతొస్తే అంతా ..ఓ..తెగ ఎగురుతున్నరు.. పిల్లగానితోటి నాప్రతాపం ఎందుకని గమ్మునున్న . సిగ్గు లేదుమీకు? పక్షులసోంటిది మరోపక్షి కి తెచ్చుకున్న ఆహారాన్ని పంచుతయి. సాటి మనిషి ఆకలితోటి ఉంటే మనిషన్నోడికి కడుపుతరుక్కపోతది ! అసోంటిది ఆముసలామె నాలుగు రోజులనుంచి తిండిలేక అల్లాడుతుంది. సౌదలన్నింటికీ తాలాలేసుకొని అందరూ కట్టగట్టుకుని ఊరికి పోతే ఆమె ఏంతినాలే ..! ఆలోచించింద్రా.,?కులం మతం అనుకునేటోల్లైతే అన్నీ అందేటట్లు పెట్టి పోయేదుండె సక్కగజూసుకుంటే... మేమెందుకు వస్తాం మీ ఇంటికి . అన్నడు రామయ్యా.

ఏమీ అనలేదు వాళ్ళందరూ ! శేఖర్ కల్పించుకుని ఏందీ .! ఈముసల్ది మీదగ్గరికొచ్చి చెప్పిందా .? ఇంట్లో ఏమీలేవని అన్నాడు. చెప్పాల్నా ..తెల్వదా ..? ఈ సుట్టుపక్కల ఉన్న ఇండ్లోల్లనుఎవరిని అడిగినా మీ ఇంటి భాగోతం చెప్తరు. అన్నాడు రామయ్యా.

అసలు మీరు మనుషులేనా ? మీ కంటే పెద్దది . ఒంట్లె ప్రాణం లేదు . గొడ్డు చాకిరి చేపిస్తున్నరు. ఆమెకేం కర్మ పట్టిందయ్యా .! కనకపోయినా నిన్ను పెంచి పెద్ద జేసి ఆమె ఆస్తినంతా నీపరంజేస్తే ఈ వయసులో తిండికి గూడా సక్కగ నోచుకుంటలేదు ..! నిన్న రొట్టెల పండుగ ఉండె ఇంట్లో మీరు ఎవరూ లేరని మా లక్ష్మి రొట్టెలు చేస్తే .అవ్వ తింటదని ఇచ్చింద్రు .నా తల్లితో పాటు ఆమె అనుకున్న అంతేగానీ ఏంలేదు. అన్నాడు రామయ్యా.

' నీ తల్లిని నువ్వు సక్కగ చూసుకో మా ఇంట్లోళ్ళ దగ్గర రాకు . చెప్తున్నా అని వేలు చూపించిండు శేఖర్. మిల్లుకు వచ్చినోళ్ళందరూ అరే ఓ పోరగా మీరు పెద్ద కులపోళ్లు గిస్వంటి

విలువ తక్కువ పనులు ఎందుకు చేస్తున్నవు. ఏమనుకుంటున్నవ్ .ఆ పెద్దమనిషిని ఇంతగనం మాముందలనే తిప్పలపెడుతున్నరు ..ఇంకజెరసేపు ఇక్కడున్నరంటే మీరు పెద్దింటోళ్ళని చిన్నింటోళ్ళని ఏమీ చూడం చెప్తున్నం . ఆమెను ఇంట్లెకు తీసుకుని పోండి అన్నారు అక్కడున్న జనాలు ఏకకంఠంతో..,! అందరూ ఎగబడేసరికి అందరూ వెళ్ళిపోయారు .

***

శర్వమ్మ సుబ్బయ్య దంపతులకు పిల్లలు కలుగలేదు లక్షల ఆస్తి ఉంది. సుబ్బయ్య తన అన్న కొడుకునే తెచ్చి పెంచుకున్నాడు. అంతవరకూ శర్వమ్మ ఊళ్ళోని వాళ్ళకు తలలో నాలుకలా ఉండేది. ఎవరికి ఏకష్టం వచ్చినా సాయం చేసేది. శర్వమ్మది' పెట్టే చెయ్యేకానీ పట్టే చెయ్యికాదు' సల్లగబ్రతకాలే అనేవాళ్ళు. కొడుకు పెద్దగైనంక పెండ్లి చేశింగ్రు.

కొంతకాలానికి శర్వమ్మ భర్త సుబ్బయ్య అనుకోకుండా చనిపోయాడు. భర్త మరణం శర్వమ్మను కృంగదీసింది. చాలా రోజులు ఇంటినుండి బయటకు రాలేదు.భర్త చనిపోయాక బ్యాంకు బ్యాలెన్స్ కొన్ని ఇన్సూరెన్స్ డబ్బులు బాగానే వచ్చాయి. పొలం , డబ్బు లావాదేవీలు కొడుకే చూడసాగాడు. ఆస్తిపాస్తులు మొత్తం నెమ్మదిగా వారి అధీనంలోకి వెళ్ళిపోయాయి. రానురాను కోడలు కొడుకు ఇంటి బాధ్యతలను తీసుకున్నారు. ఉప్పు ,పప్పు ,చింతపండు ,బియ్యం ప్రతీ ఒక్కటీ అల్మారా నుండి తీసి వంట చేసేవారు. ఇంటికి పెద్ద దిక్కు ఆస్తంతా ఆమెదే అనికూడా చూడకుండా శర్వమ్మను పనిమనిషిని చేసింగ్రు. రానురాను ఆమె పరిస్థితి దారుణంగా తయారయింది . ఇంటెడు చాకిరీ చేయించి దొడ్లో పశువుల పాక ఊడ్పించి. ఆతర్వాతనే తిండి పెట్టేవాళ్ళు. ఒక రోజు అనారోగ్యం కారణంగా శార్వమ్మ నిద్ర లేవ లేదు. కోడలు కొడుకు నోటికొచ్చినట్లు తిట్టి ఏం సోంగులు పడుతున్నవే.అని కోడలు అనడం... ' అమ్మా లేవే ఇంకా... లేవకపోతే ఇంట్లో పని అంతా నా పెళ్ళాం ఒక్కతే ఎట్ల జేస్తది.' అని కొడుకు ప్రేమగా అన్నాడు. 'ఒరేయ్ సూరయ్యా నాకు చేతనైత లేదురా బాగా సుస్తీ చేసినట్టుంది. 'డాక్టర్ ను పిలిపించి సూదిమందు ఇప్పించురా నీకు పుణ్యం ఉంటది అంది .అంతగనం ఏం సుస్తీ చేసిందే నీకు! డాక్టర్‌ను తోలుకొనిరాణింకె నాకాడ పైసలు లేవు.'లంకణం పరమౌషధం 'అంటవ్ గదా అట్లనే పండుకో తగ్గిపోతుంది అన్నాడు చెయ్యి తో ముట్టకుండానే. ఎవరూ పట్టించుకోలేదు శర్వమ్మను. అందరూ చేను కాడికి వెళ్లి పోయింగ్రు.

***

పెరటి వైపు తలుపుల దగ్గరకొచ్చి లక్ష్మమ్మా అని కేకలు వేసింది. వంటచేస్తున్న లక్ష్మి ఏమి పెద్దమ్మ అంటూ తలుపు తీసింది. శర్వమ్మ తూలుతూ వచ్చి లక్ష్మి రెండు చేతులు పట్టుకొని బోరున ఏడ్చేసింది. అర్థం కాలేదు లక్ష్మి కి. ఏడవకు ఊకో అని పక్కనే ఉన్న ముక్కాలి పీట జరిపి కూర్చోబెట్టింది. కొన్ని మంచినీళ్లు ఇచ్చి పొయ్యి మీద ఉన్న ఉడుకు రొట్టె పప్పు పెట్టి తిను పెద్దమ్మ అన్నది. ' నేను తిననీకి రాలేదు బిడ్డా .ఏమన్న గోలి ఉంటే ఇయ్యవా అని అడిగింది దీనంగా.. ఒళ్ళుపట్టుకుని చూస్తే సలసలా కాలిపోతున్నది . నేను నీ బిడ్డలాంటిదాన్ని

కానా పెద్దమ్మ ఒక్క రొట్టె తిను అని ఇస్తే ఆవురావురుమని తిన్నది . ఒక గోలి ఇచ్చి వేసుకోమని మంచినీళ్ళు ఇచ్చింది. పొద్దుమూకి కొడుకు కోడలు వచ్చేసరికి జ్వరం తగ్గిపోయింది. అది చూసిన కొడుకు నేనుజెప్పలేదానే ఉపాసంఉంటే అదే తగ్గిపోతుందని. పొద్దుమూకేసరికి లేషితిరుగుతుందిజూడు అన్నాడు. 'ఒరేయ్ నాకొచ్చింది ఆకలి జ్వరం రా నాయనా ' నేను చస్తే గొంతులో ఇన్ని తులసి నీళ్ళైనా పోస్తావోలేదో !అని మనసులోనే అనుకుంది. రానురాను తన పరిస్థితి ఏంటో అర్థమవ్వసాగింది ఒక నిర్ణయానికి వచ్చింది.

ఆరోజు లాగే... ఈరోజు కూడా పక్కింటిలో తెచ్చుకుని దాచుకుంటే ఎవ్వరికీ తెల్వదేమో అనుకుంది శర్వమ్మ . కానీ అంతమంది ముందు పంచాయితీ చేసి ఇన్నేండ్లు తను కడుపులపెట్టుకున్నదంతా వెల్లడి చేసింద్రు. నాపరువుమొత్తం పోయింది అనుకుంది. వారంరోజులు గడిచినయ్ .అంతా ఆరోజు జరిగింది మర్చిపోయింద్రు. ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటున్నరు. శార్వమ్మ పరిస్థితి మాత్రం ఏమీ మారలేదు.

***

కొన్నిరోజులకు ఒకనాడు పొద్దున్నే 7 గంటలు అవుతుంది. ఆ వీధిలో కి అంబులెన్స్ కూతపెడుతూ వచ్చింది. ఇండ్లల్ల ఉన్నోళ్ళంతా బయటకొచ్చింద్రు. ఇక్కడ సూరయ్య ఎవరయ్యా అని అడింగింద్రు అందులోనుండి దిగిన పోలీసు వాళ్ళు. అందరూ ఇతనే అని బయట నిలబడి వేపపుల్ల నములుతున్న సూరయ్యను చూపింద్రు. ఎందుకడుగుతున్నరు అన్నడు సురయ్యా వాళ్ళ దగ్గరికెళ్ళి .! శర్వమ్మ మీ అమ్మనా అన్నడు పోలీసు. అవును పిల్వాల్నా అన్నాడు. ఇంట్లో శర్వమ్మ లేదని తెలియని సూరయ్య. ... మీ దగ్గర కు కూడా అడుక్కోనింకె ఒచ్చిందా .ఏంది? మా అమ్మకు జర మతిస్థిమితం లేదయ్యా .. అన్నాడు సూరయ్యా .!

వచ్చిన పోలీసులు తలపైనుండి టోపీ తీసి ' నిన్న రాత్రి రైలు పట్టాలపై ఒక ముసలామె శవం దొరికింది . ఆరాతీస్తే ఆమె చెక్కుడు సంచిలోని ఆధార్ కార్డు ద్వారా మీ అమ్మగారని తెలిసింది. చేతిపై నీపేరు పచ్చబొట్టు ఉంది అదిచూసి గుర్తుపట్టినం అన్నారు వాళ్ళు. సూరయ్యా లేని దుఃఖం నటిస్తూ అమ్మా అంటూ పరుగెత్తాడు. తన తల్లే అని గుర్తించాడు. సూరయ్య భార్యా పిల్లలు పీడా పోయింది. ఆమె చస్తే ఎవరికంటా నష్టం అని మనసులో మురిసిపోతూ బయటకు దుఃఖం నటిస్తూ వచ్చారు. ' దహన సంస్కారాలు చాలా గొప్పగా చేసారు పూలరథాన్ని తయారుచేసారు. పూలతో. నడుస్తున్న తోవంతా నిండిపోయింది. పాలరాతి సమాధి తో గుడి కట్టారు. వచ్చిన బంధువులు సూరయ్య కు తల్లిమీదున్న ప్రేమను పొగిడి ఇంత మంచి కొడుకు ఉండంగ పోయి రైలు పట్టాలమీద ఎందుకు పడింది అనుకున్నరు. నిజంగానే మతితప్పిందేమో అని నసుగుతూ వెళ్ళిపోయారు. ఊర్లోవాళ్ళు మాత్రం బ్రతికున్నప్పుడు ఒక్కపూట తిండి సరిగా పెట్టలేడు పాపాత్ముడు పోయిన తర్వాత పైసలు సల్లుతున్నడు. అనుకున్నరు. నెలరోజులుగడిచిపోయాయి.

***

ఒకరోజు సూరయ్య ఇంటికి ఒక లాయర్ వచ్చాడు. నాపేరు రామనాథం మీ ఫ్యామిలీ లాయర్ ను అన్నాడు. అట్లనా .! ఇంకా ఏమన్నా ఇన్స్యూరెన్స్ డబ్బులు వస్తాయేమో అనుకున్నారు సూరయ్య ఆయన భార్య లోలోపలే. సూరయ్య అంటే నీవేనా ..? హా...ఆ..అవును అన్నాడు ఉలిక్కిపడిన సూరయ్య ! ఈ పత్రాల్లో ఉన్నఆస్తి పాస్తులు ఎక్కడెక్కడున్నాయో చెప్పగలరా ? ఎందుకు చెప్పలేం ఇదంతా మాదే అన్నాడు పత్రాలలో ఉన్న నక్షను చూస్తూ .! అయితే ఇక్కడ సంతకాలు చేయండి అన్నాడు లాయర్. తరువాత జరిగేదేంటి తెలియక సంతోషంగా అందరూ సంతకాలు చేసారు.

“ఇంక నేను వెళ్తాను.' ఒక వారం రోజుల్లో వస్తాం ఈఆస్తులన్నీ స్వాధీనం చేసుకోవడానికి అన్నాడు. ఏమంటున్నారు సారూ అన్నాడు సూరయ్య. మీ తండ్రిగారు పోతుపోతూ శర్వమ్మను మీరు సరిగా చూసుకోకపోతే మీ అమ్మ తన తదనంతరం ఈఆస్తులన్నీ ఎవరికైనా ఇచ్చేసే అధికారం ఆమెకు నచ్చిన విధంగా ఉపయోగించుకోవచ్చు అని వీలునామా లో రాసారు. ఆవిషయం శర్వమ్మ గారికి తెలుసు.

నెలక్రితం నన్ను కలిసి తన ఆస్తినంతా అనాథాశ్రమానికి రాసిచ్చేట్లుగా పత్రాలు రాసి అనుకోకుండా తనకేమయినా జరుగుతే ఆ బాధ్యత నన్ను తీసుకుని పూర్తిచేయమని అంగీకార పత్రం రాసిచ్చారు. మీరు శర్వమ్మకు చూపిన నరకం, చేసిన అన్యాయం మొత్తం రికార్డు చేయించింది. ఆ క్యాసెట్ మిగతా అన్ని పత్రాలు ఇప్పుడు నాదగ్గర భద్రంగా ఉన్నాయి. మీరేమైనా చెప్పాలనుకున్నా .సుదేహాలున్నా కోర్టు ద్వారా తెలుసుకోవచ్చు ! ఇక నేను వెళ్తాను అని వెళ్ళిపోయాడు లాయర్ !

ఈమె బ్రతికి ఇంకా ఎవరిని ఉద్ధరిస్తుందంట? చస్తే ఎవరికి నష్టం అని అంతకుముందు అనుకున్న భార్యా భర్తలు ఇద్దరూ ... ఇప్పుడు ఏంచేయాలో తెలియక నిశ్చేష్టులై అలాగే చూస్తూ నిలబడ్డారు.

***

**వాసర చెట్ల జయంతి జన్మస్థలం మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపురం గ్రామం. (ఎం.ఎ బిఇడి) ఫ్యాషన్ డిజైనింగ్ చేసి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఈమె రాసిన 80 కి పైగా పుస్తక సమీక్షలు పలు దినపత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఇప్పటి వరకు ఈమె 20 కథలు రాసారు. తంగేడు, నేటి నిజం, సంచిక ఆన్లైన్, మయూఖ, బహుళ పత్రికలు మొదలైన పలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఈమె రాసిన మొదటి కథ “మోదరన్ భక్తి”. అలాగే నవతెలంగాణ పత్రికలో ప్రచురితమయిన ఈమె రాసిన “తండ్రిరుణం” అనే కథ మంచి గుర్తింపునిచ్చింది. వివిధ సంస్థలు నిర్వహించిన కథలు, కవితల పోటీల్లో ఈమె పలుమార్లు బహుమతులు అందుకున్నారు.**

# ధీరవనిత



ఎనుగంటి వేణుగోపాల్
9440236055

అది.. ఓరుగల్లు. పాలకుర్తి గ్రామ పొలిమేర.

ఊరవతల చెరువొడ్డున చాకలి బండల కాడ రజకుల కుటుంబీకులైన నాలుగైదు జంటలు తమ కులవృత్తిలో నిమగ్నులై ఉన్నారు.

చాకలి ఐలమ్మ.. తనవంతు బట్టలు ఉతుకుడు అయిపోయింది.

ఒక్కటొక్కటి పిండుకుంట మైదానంల, బీడువడ్డ పొలాల ఒడ్లమీద యేడ గొడంత జాగుంటె ఆడ బట్టలు ఆరేత్తంది.

ఆయాస పడుకుంట అచ్చిన మొగుడు చిట్యాల నర్సయ్యను చూసుకుంట..

"నన్ను గీ సాకిరేవు కాడికి వొమ్మని సెప్పి.. 'గిప్పుడే వత్త.. దొర రమ్మన్నడు' అనుకుంట, గుడిసె కాన్నుండటే వోతివి. అవ్! గింత సేపాయె!" నిలదీసింది ఐలమ్మ.

నీళ్లు విండిన ఆమె సేతిలోని గొన్నన్ని తడి బట్టల్ని తీసుకుని తను ఆరేసుడు షురూ జేసిండు నర్సయ్య.

"పక్కూరుకు దొర వంపిండు గాదె!".

"అయితమాయె తియ్ గని.. ఇగో ముత్తెమన్ని బట్టలున్నయ్! గివి ఆరేసి రా. గింతెసరు వెట్టాలె. నేనింటికి బోత" అన్నది.

"ఆగాగు! దొర్సానవ్వ నిన్ను తోల్క రమ్మన్నది. గడీకి వోవాలె. పనుందట" అన్నడు నర్సయ్య.

"నీకు దొర, గడి.. గివ్విదప్ప మల్లోటి దెల్వదా? మీ

తాతల కాన్నుంచి దొరలకు వూడిగం సేయనే వడితిరి. మల్ల నన్ను గూడ గీ రొంపిలోకి దింపితిరి".

ఆరేసిన బట్టల మీద వాలుతున్న పక్షులను 'ఉష్.. ఉష్..' అని ఎల్లగొట్టుకుంట..

"ఏం జేసుడు మల్ల? మనకు దిక్కేది?" అన్నడు విచారంగ మొకం బెట్టి.

రైక దప్పిన చీరను సరిజేసుకుంట..

"వొకటి జెప్త. యేవనుకోకయ్యా!" అన్నదామె.

"ఏందో సెప్పరాదె!".

"గా దొర్సానవ్వ తనను, తన బిడ్డను గూడా 'దొరా!' అని పిల్వమంటంది".

గా మాటలకు పడీ పడీ నవ్విండు.

"దొర్సానవ్వను ఆమె ముందట నేను 'దొరా!' అంటలేనానే!".

"నాకు మంచిగనిపిత్తలేదు.

నేను పిల్వ!".

"ఊరంతా అననే వట్టిరి. దానికి నామోషీ ఎందుకు? అంటె మన సొమ్మేంబాయె!".

"ఆడోళ్లను గూడ 'దొరా' అనుడేంది? ఇసిత్రం గాక పోతె!".

"గట్ల పిల్వని ఎందరో ఆడోళ్లను దగ్గరుండి దొరతోని బలాత్కారం జేయించింది. గయన్ని మనకెందుకే?".

"మనకెందుకంటే ఎట్లయ్యా? మనమీద వొకల్ల పెత్తనం ఏందయ్యా? మన గురించి మనం పట్టించుకోకపోతే ఎట్లయ్యా?!".

"కిష్టాపురం పిల్లవు. నన్ను లగ్గం జేసుకొని గీ పాలకుర్తి ఊరికత్తివి. అన్నిటిని మతికి ఎక్కించుకోకు! గీ ఊర్లె అందరెట్లుంటె గట్లనే మెదల్రాదె!".

"మనం మనుషులమే కదా! పశువులం గాదు కదా! గట్లయితే ఆళ్లకాడ పని బందువెడదం!".

భార్య చివరి మాటకు అదిరిపడ్డడు నర్సయ్య.

చేస్తున్న పనాపి..

"దొరకాడ పని బందువెట్టి గీ ఊల్లె బతికి బట్ట కడుతవా?" అన్నడు భయపడుకుంట.

"బతికి బట్టగట్టుడే గాదు. బందూకు సేతుల వట్టి సూపెడదం.." అన్నదామె కాస్త ఆవేశంగా.

ఎన్నడూ లేంది భార్య ఐలమ్మ నోటివెంట బందూకు ముచ్చట ఇనంగనే.. ముచ్చెమటలు పట్టినయి

నర్సయ్యకు. భార్య తెగింపు చూసి కాసేపు ఏం మాట్లాడాలో తోచక బిత్ర

బిగుసుకు పోయిండు.

ఎలాగోలా గొంతు దెచ్చుకొని..

"సెప్తే వినవు! సేసేది సెప్పవు. యేమోనే ఐలవ్వా!" అని మాత్రం అనగలిగిండు.. అరచేతితో నుదురు మీద చరుచుకుంట.

పొద్దు గూకినంక. గుడిసె ముందు ఆకిట్ల.. తాటాకు పందిరి కింద.. నుల్క మంచం మీద కూచున్నడు నర్సయ్య.

ఎదురుంగ కింద కూచున్న ఐలమ్మ దిక్కు చూసుకుంట..

"పొద్దుగాల గడీకి రానందుకు దొరసాని మస్తు కోపంగున్నది" అన్నడు.

భర్త మాటలు పట్టించుకోకుండా..

"మల్లంపల్లికి పోయచ్చిన. గా ఊరి కొండలరావు దొరను భూమి మఖ్తు (కౌలు)కు ఇమ్మంటే.. ఇత్తనన్నడు" అన్నది ఐలమ్మ.

'మొండిది. మతికచ్చిందంటె ఇడ్సవెట్టది' అని మనసుల అనుకుంట..

"గియన్ని మనతోని అయితయా?" అన్నడు పైకి.

"పిలగాండ్లు పెరుగుతున్నరు. ఖర్సులు మోపెడు గావట్టె! దొర గడీల ఎట్టిసేసుకుంట.. ఇంకెన్నేండ్లు గిట్ల జానెడు బతుకు బతుకుడు?".

"రాతెట్లుంటే గట్లయితది. భగమంతుడు మన నుదిటి రాత గట్లనే రాసి వంపిండేమో గీ భూమ్మీదికి!"..

నర్సయ్య నోటి వెంట వేదాంతం ఉరికచ్చింది.

"మనం గిట్లనే సూసుకుంట గూసుంటే.. ఆళ్లు గట్లనే జేత్తరు. మన బతుకును మనమే సక్కగ జేసుకోవాలె. నాకు ఎర్కయ్యింది గంతే!".. తన మనసులోని మాటను నిర్భయంగా జెప్పింది ఐలమ్మ.

"గా ఊరికి వోయి కౌలుకు సేసుడా?".

"గట్లేంగాదు గని.. గా దొరకు మనూర్ల నలభై ఎకురాలు ఉందట".

"గదంత మనతోనేడ అయితది?" నిట్టూర్చిండు నర్సయ్య.

"గదయితదా.. గిదయితదా..? అని కూసుంటే ఏదీ గాదు గని. మనతోని అయినకాడికి, కొన్నెకురాలైతే దున్నుకుందం".

ఇగ చప్పుడు చెయ్యలేదు నర్సయ్య.

పాలకుర్తి పట్వారి శేషగిరిరావు ఇంటి గుమ్మానికి ఎదురుంగ చేతులు కట్టుకుని

నిలవడ్డరు ఐలమ్మ, నర్సయ్య.

పాలేరు లోపలికి వోయి ఈళ్లచ్చింర్రని పట్వారికి చెప్పిండు.

లోపల పనేం లేకపోయినా గీళ్లను బగ్గసేపు గట్లనే నిలవెట్టి.. నింపాదిగ బయటికచ్చిండు పట్వారి.

"దండాలు..!".. పట్వారి కనవడంగనే రెండు చేతులెత్తి.. వంగి వంగి దండం బెట్టిండు నర్సయ్య.

ఐలమ్మ పట్వారి దిక్కు చూడలేదు.

"రమ్మన్నరట పట్వారి!" అన్నడు నర్సయ్య.

"రేపట్నుంది మా పొలాలు కోతలు షురూ జేత్తున్నం. మనుషులు తక్కువ వడ్డరు".

"గట్లనా!?".

"మీ ఇంటోళ్లందరు రేపు మా పొలం పనికి రావాలె!" హుకుం జారీ చేసిండు పట్వారి.

నర్సయ్య కంటే ముందే ఐలమ్మ గొంతు విప్పింది..

"మల్లంపల్లి బూసామి బూమి కౌలుకు తీసుకున్నం. గా పొలం కోతలే ఇంక గాలేదు!" అంటూ..

"గవన్ని జెప్తురా ఐలమ్మ! పట్వారి పిలిత్తె రావాలె గని.." చికాగ్గా అన్నడు పట్వారి.

"కానూనుందా యాదనన్నా!"..

"సంగంల జేరినవు గద.. గాయింత మాట్లాడకుంటెట్ల గని"..

"మామీద నీ జులుం ఏంది పట్వారీ?".

"పనికి రాకపోతే ఏమైతదో ఎర్కేనా?".. కన్నెర్ర జేసిండు.

"ఆ.. ఏం గాదు!".. పట్వారికి బిగ్గరగా జవాబిచ్చి..

భర్త చేయి వట్టుకొని.. "రా అయ్యా!" అనుకుంట ఎన్కకు దిరిగింది.

ఎన్కనుంచి పాము బుస ఇనవడలేదు ఐలమ్మకు.

గడీల ఆరుబయట వాలుకుర్చీల గూసున్నడు విస్నూరు దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి.

ఎదురుంగ చేతులు కట్టుకొని నిలవడ్డడు పట్వారి శేషగిరిరావు.

"గా ఐలమ్మ కుటుంబం మొత్తం ఆంధ్ర మహాసభ సంగంల జేరింర్రట దొరా!".. వినయంగ చెప్పిండు.

"ఇనవడ్డది.. ఇనవడ్డది!".

"గా ఐలమ్మ గూడ బగ్గ ఉషారైతంది దొరా!".

"ఏం జేత్తంది?".. కుడి చేత్తో మీసాలు దువ్వుకుంటూ అడిగిండు రామచంద్రారెడ్డి.

"ఊల్లె అందర్ని మాయ మాటల్తోని ఆకట్టుకుంటంది".

"గీ ఊరికి కోడలుగ అచ్చిన ఐలమ్మ మాయమాటలు గూడ మనోళ్లు ఇంటున్నరా?".. ఆశ్చర్యపోయిండు రామచంద్రారెడ్డి.

"వాళ్లు ఇనేటట్టు చెప్తున్నది. మనసొంటోల్ల మీదికి ఎర్గనట్టు ఉసిగొల్పుతంది దొరా!".. బాగా నూరి పోసిండు పట్వారి.

పండ్లు పటపట కొరుక్కుంట..

"గా సంగం అగ్రనాయకులందరి మీద కోర్టుల కేసేయించు పట్వారీ!" అన్నడు రామచంద్రారెడ్డి.

వినయంగ తల ఊపిండు పట్వారి శేషగిరిరావు.

సాలోచనగా తలపంకిస్తూ..

"పనిలో పని.. గా ఐలమ్మను గూడ గా కేసుల ఇరికించు. ఒక పనైపోతది!".. ఆదేశించిండు

రామచంద్రారెడ్డి.

"గట్లనే దొరా!" తలూపిండు పట్వారి శేషగిరిరావు.. దొర కంటపడకుండా వంకరగా నవ్వుతూ.

ఆంధ్ర మహాసభ సంగం కార్యకలాపాలు చురుగ్గా జరుగుతున్నయి.

సంగపోల్లు ఎప్పుడు సభ జరిపినా ఐలమ్మ గా సభకు పోయేది. తన మాటలతో మహిళలను ఉత్తేజపరిచేది.

"మడిసికి దైర్నం, తెగింపు ఉండాలె! బానిస బతుకులు ఎన్నేండ్లు బతుకుడు? దొరలే మనుషులు గని, మనం మనుషులం గాదా? ఎట్టి సాకిరిని మట్టువెట్టుండ్రి! గొడంత సొంత బూమి కోసం ఆరాట పడుండ్రి. మట్టితోనే మనిషికి బతుకు!" అంటూ జనంలో ఆలోచనలు రేకెత్తించేది. ఆవేశం రగిలించేది. వారిలో పోరాట స్ఫూర్తిని అణువణువునా నింపేది.

గిసువంటి పనులే.. దొరకు మింగుడు పడ్తలేవు.

"కొండా లక్ష్మణ్ బాపూజీ సహకారంతో ఐలమ్మకు అనుకూలంగ తీర్పచ్చింది దొరా!".. రామచంద్రారెడ్డికి ఉప్పందించిండు పట్వారి శేషగిరిరావు.

దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి రగిలిపోతున్నడు.. గీ విషయం ఎరుకైనంక.

తను వేయించిన కేసు ఓడిపోవడంతో అతని అహంమీద దెబ్బ కొట్టినట్టు అయ్యింది.

దొర ఏం మాట్లాడక పోయేసరికి..

"గిది రెండో మల్క దొరా! మనం కేసు ఓడిపోవుడు".. గుర్తుచేసి అగ్నికి ఆజ్యం పోసిండు పట్వారి.

"మనూరికచ్చిన ఒక ఆడ మనిషి నన్ను, నా గడీని సవాల్ జేసుడేంది?".

"గిప్పుడు సవాల్ చేస్తున్నది ఐలమ్మ ఒక్కతే కాదు దొరా! ఆమె ఎనుకాల పెద్ద దండే తయారైంది".

మెలమెల్లగా విసునూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డికి కాక పుట్టిస్తున్నడు పట్వారి శేషగిరిరావు.

"గీ అలగా జనం ఆమె ఎంట నడుసుడేంది?".

"కాలెత్తి నలిపేసే దాకా చీమలదండు కదుల్తనే ఉంటది దొరా!".

భగభగ మండిపోయిండు రామచంద్రారెడ్డి.

మనిషి శివాలెత్తి పోతూ..

"చేతులు కట్టుకుని ఊకునేది లేదు".. అంటూ ఆవేశంతో రగిలి పోయిండు.

పట్వారికి గూడ కావల్సిందదే!

"ఐలమ్మను మెసలకుంట జేయాలె.. సర్వ నాశనం జేయాలె!".

ఒక సరికొత్త పథకం పట్వారి మదిలో ఊపిరి పోసుకుంటుండగా.. దొరకు వంగి వంగి నక్క వినయంతో దండాలు పెడుతూ అక్కడినుంచి వెళ్లిపోయిండు.

"గా రాపాక రామచంద్రారెడ్డి మన కుటుంబం మీద పగవట్టినట్టున్నడు!".. భార్య ఐలమ్మ ముందర వాపోయిండు నర్సయ్య.

"బయమైతందా?" ప్రశ్నించింది ఐలమ్మ.

"గా పెద్దోళ్లతోని పేదోళ్లం మనకెందుకు సెప్పు?".

"మన ఇసయం మనం కాకపోతే మల్లెవలు పట్టించుకోవాలె.. సెప్పు?".. భర్త కండ్లలోకి సూటిగా చూస్తూ ప్రశ్నించింది ఐలమ్మ.

"కేసుల మీద కేసులు వెట్టి బెదరగొట్టాల్నని సూత్తున్నడు. గీ కేసులల్ల వోడిపేయిండు. మల్లేం జేత్తడో అని నా బాధ!".

"ఇంకేం జేత్తడు? తలదీసి గడీకి ఏలాడ దీత్తడా? సూద్దాం! పోరు సంద్రంల దిగినం. మునిగినా.. తేలినా.. జనం కోసమే గద".

బెదురే లేని ఐలమ్మ ఆత్మ స్థయిర్యానికి.. బదులుగా తలూపిండు నర్సయ్య.

"పట్వారీ! ఆంధ్ర మహాసభ సంగం పట్టు కోల్పోవాల్నంటే అందులోని సభ్యులను దొంగదెబ్బ తీయాలె!".. ఓ పన్నాగం పన్నిండు దేశ్‌ముఖ్.

"ఎట్లంటరు?" అమాయకంగ అడిగిండు పట్వారి.

"మనిషి గొడన్ని పైసలు జమైతే ఎగుర్తడు. ముందుగాల ఐలమ్మ కుటుంబాన్ని ఆర్థికంగా పడ గొట్టాలె".

"మీరెట్లంటె గట్లనే!".

"ఐలమ్మ కౌలుకు తీసుకున్న గా బూమినైతే ముందుగాల నా పేరుమీద రాయుండ్రి!".

నసిగిండు పట్వారి.

"నీకందేటియి అందుతయ్ గని. నేను

జెప్పింది చెయ్యి!".

తలూపిండు పట్వారి.

"గీ మల్క మనూరి పొలాలన్నీ మంచిగనే పండినయ్. బగ్గ దినాలకు రైతు మొకం మీద జరంత నవ్వు మొలిసేటట్లు..!".. అన్నడు చిట్యాల నర్సయ్య.

"అవును మల్ల. ఏ పొలం కాడ జూసినా వరి కోతలే కోతలు! మొదాలుకు మొదాలు వరి నాట్లేసినోళ్లు కోతలు మొదలు వెట్టిన్రు. కల్లం పనులు గూడ జరుగుతున్నయ్" బదులిచ్చింది ఐలమ్మ.

చిట్యాల ఐలమ్మ, నర్సయ్య దంపతులు కైకిలోళ్లతోని గల్సి తమ పొలం కాడ వడ్లు తూర్పార బడుతున్నరు.

ఎండ సుర్రు మంటంది.

నెత్తిమీంచి కారి.. కింద వడుతున్న గాల్ల సెమట సుక్కలు తాకుతంటె.. వడ్లగింజలు పరవశించిపోతూ జాతరలోని చిన్నపిల్లల లెక్క సంబురంగ కుప్పలోంచి ఎగిరెగిరి వడుతున్నయ్.

గంభీరమైన మొకం, చింత నిప్పులెక్కున్న కండ్లతోని దొర జీతగాళ్లు.. రౌడీ సమూహంతో కలిసి గప్పుడురికచ్చిండ్రు గా కల్లం కాడికి. పొడవాటి కంకకర్రలు చేతుల వట్టుకొని నేలను గొట్టుకుంట.

ఎత్తుగ బలంగ ఉన్న పాలేరు దుబ్బడు ఎడ్మ చేత్తోని మీసాలు మెలేసి..

"అరి నర్సిగా! గీ బూమి దొరదట. తన పంట బాపతు అడ్లు తీసుకురమ్మని మమ్మల్ని పంపిండు గాదుర!".. వడ్ల కుప్ప కాడ నర్సయ్యకు ఎదురుంగ నిలవడి గట్టిగ కేకలేసిండు.

పారతోని వడ్లు కుప్పదిక్కు లాగుతున్న నర్సయ్య పనాపి ఏదో అనబోయిండు.

చేతిలో ఉన్న చాట కింద పడేసింది ఐలమ్మ.

కొంగు నడుం చుట్టు దిప్పి బొడ్లె దోపుకొంది. పక్కనున్న కొడవలి చేత బట్టింది.

చిరుతపులి లెక్క దుబ్బయ్య దగ్గరికి ఉరికచ్చింది.

నుదుటిన దిద్దిన కుంకుమ లెక్క ముకమంత ఎర్రగ జేసుకుని..

"నకరాలు జేత్తున్నరా? బాజాప్త కౌలుకు తీసుకున్నం. కట్టపడ్డం. పంట పండించుకున్నం! పండిన గీ పంట మాది! మద్దెన గా దొరెవ్వలు? పంట గాయినకు ఇచ్చుడేంది?".. అచ్చం పోశవ్వ తల్లే ఎదురుంగ నిలవడ్డట్టు గర్జిస్తున్న ఐలమ్మను జూసిన దుబ్బయ్య.. ఉన్నపళంగ ఒక్కడుగు ఎన్కకేసిండు.

నీళ్లు నములుకుంట..

"నువ్వేమంటవ్? నర్సయ్య బావా!" అని నర్సయ్య దిక్కు చూసిండు.

భార్య ఐలమ్మ మాటలల్ల వేగుచుక్క లెక్క పొడిచిన ధైర్యాన్ని చూసి అబ్బురపడుతున్న నర్సయ్య నోట్లోంచి ఒక్కమాట రాలేదు.

గాడున్న పనోళ్లందరికీ ఇనవడేటట్టు..

"గీ మాటే ఖరారు గద!" అన్నడు దుబ్బయ్య గట్టిగ.

"ఏంది ఖరారు? ఎవల తాత జాగీరు గాదు!"..

శివమెత్తినట్టు ఐలమ్మ ఎత్తిన కొడవలి దిక్కు చూసుకుంట ఎన్కకు మర్లిండు దుబ్బయ్య.. రౌడీమూక తోని.

ఐలమ్మ కష్టపడి పండించిన పంటపై దేశముఖ్ కన్నుపడి, ఐలమ్మ పంటపై దాడి చేయబోయిండని తెలుసుకున్న ఆంధ్ర మహాసభ కార్యకర్తలు దగ్గరుండి తామే కూలీలై మిగిలిన పంట పనులు చేసింద్రు.

భీంరెడ్డి నరసింహారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, చకిలం యాదగిరి లాంటి ఆంధ్ర మహాసభ సంఘం ప్రముఖులు స్వయంగా ధాన్యపు బస్తాలను భుజాలపై మోసింద్రు.

"అవ్వా! పట్వారి మన ఇంటిని తగుల
బెట్టించిండట్నే!"..

చాకిరేవు కాడున్న తల్లికి చెప్పిండు ఐలమ్మ కొడుకు, పొలం కాడినుంచి ఉరికచ్చి.

"మనల్నేమీ సేయలేక గిసువంటి పనికి పూనుకుంటడా?"..

కండ్లెమ్మట నీళ్లచ్చినయి ఐలమ్మకు.

"దొర వంపిన రౌడీలు మనింట్ల నుంచి పైసలు, ధాన్యం ముందుగాల్నే ఎత్తుకు పోయింద్రట".

"నన్నింట్ల కట్టాలు వెడితెనన్న సంగం నుంచి బయటికి అత్తననుకున్నరేమో? నేనే నిలువెత్తు ఎర్రజెండను. ఇంక గాల్లేంజేత్తరో సూత్త! నేనే నిలువెత్తు తిరుగుబాటును. జనం కోసం పోరాటం జేత్తున్న నన్ను సంపుతరేమో సూత్త! ఎట్టి సాకిరీ నుంచి జనాన్ని విముక్తి సేసేటందుకు సావుకైనా సిద్ధంగున్న".. చెయ్యెత్తి పిడికిలి బిగించింది

ఐలమ్మ.

ఇల్లు కాలి బూడిదైనా ఐలమ్మ కొడుకులు నోరు మెదపలేదు. కానీ, తమ సోదరిపై రజాకార్లు అత్యాచారానికి పాల్పడినప్పుడు ఉడుకునెత్తురుతో ఊగిపోయింద్రు. పోయి గా పట్వారి ఇంటిని కూల్చేసింద్రు. అటెన్క గా జాగల మక్కజొన్న పంటేసింద్రు.

కాలం ఒక్క తరీఖ ఉండదు.

గీ కారణాలతోని ఐలమ్మ ఇద్దరు కొడుకులను, భర్తను జైలుపాలు చేయించింద్రు.

అయినా ఐలమ్మను వదల్లేదు పాలకుర్తి దొర రామచంద్రారెడ్డి.

మెల్లమెల్లగ జనంల తన ఉనికికి భంగం కలిగి, దొరతనం ఉట్టికి ఎక్కుతుండటంతో ఐలమ్మను గడీకి పిలిపించిండు.

"గీడ గిప్పుడే నిన్ను సంపుత! ఎవలత్తరో సూత్త!" అని బెదిరించుకుంట కోపంతో రగిలిపోయిండు ఐలమ్మ కంట వడంగనే.

గా మాటలకు బెదిరిపోలేదు ఐలమ్మ.

"నన్ను సంపితే నా కొడుకులు ఊరుకుంటరా?

సంగపోల్లు నిన్నిడిసి పెడ్తరా? గీ జనం నిన్ను

బతకనిత్తరా?"..

గడీ దద్దరిల్లేటట్టు పులిబిడ్డ లెక్క అరిచింది ఐలమ్మ.

ఆమె ధైర్యానికి రామచంద్రారెడ్డి నిరుత్తరుడు అయ్యిండు.

"నన్నాపినంత మాత్రాన గీ పోరు ఆగది. ఎట్టి నుంచి విముక్తి కోసం జనానికి పోరాటం జేసుడు నేర్పిన! ఎట్టి సాకిరిపై తూటా గురి వెట్టుడెట్లనో బందూకు తర్ఫీదిచ్చిన! ఎప్పటికైనా గీ నిజాం పాలన మట్టి కొట్టుకుపోవుడే! దొరతనం గీ గడీ గోడలల్ల పాతరవుడే!"..

గడీల ప్రతిధ్వనించిన ఐలమ్మ మాటలకు దొరకు గుండెల దడ వుట్టింది.

ఐలమ్మ సవాల్ విసిరి.. ధీర వనిత లెక్క పౌరుషంగ గడి దాటుతుంటె.. రామచంద్రారెడ్డి ఏం చేయలేక నిస్సత్తువగా చతికిలపడి పోయిండు.

కణకణ మండే నిప్పురవ్వ లెక్క ఎగిసిపడుతూ.. జలజల పారే నీటి లెక్కపరుగులు వెడుతూ..

ధీరవనిత చిట్యాల ఐలమ్మ గడీ కంచుకోట దాటుతూ.. వడివడిగా కదిలిపోతున్నది.

తూర్పున పొడిచే పొద్దు సాయంత్రానికి పడమటిన అస్తమిస్తుంది.

అది ప్రకృతి ధర్మం!

తరతరాలకు సరిపడా పోరాట స్ఫూర్తిని ప్రజల గుండెల్లో నింపి.. వార్ధక్య దశలో అనారోగ్య కారణాలతో ఐలమ్మ భౌతికంగా అంతర్ధానమైనా..

ఆమె అమరురాలు! అజేయురాలు!!

మరణానంతరం మార్గదర్శకురాలిగా పాలకుర్తిలో ఆమె స్మారకస్తూపం, స్మారక భవనం నిర్మితమయ్యాయి.

ఆమె చూపిన ఉద్యమబాట నిత్య చైతన్య విప్లవ గీతికై.. తాడిత పీడిత జనం గుండెల్లో పల్లవిస్తుంటుంది.

ఇప్పటికీ.. ఎప్పటికీ..

కిష్టాపురంలో ఓరుగంటి వారింట ఆడబిడ్డగా పుట్టిన ఐలమ్మ.. పాలకుర్తిలో చిట్యాల వారింట కోడలిగా అడుగుపెట్టి.. తెగింపుతో వెట్టిచాకిరీకి ముగింపు పలికించి.. తన విలక్షణ జీవన ప్రస్థానాన్ని చరిత్రలో ఒక ప్రత్యేక పుటగా చిరస్మరణీయం చేసుకున్నది.

ఎనుగంటి వేణుగోపాల్

**ఎనుగంటి వేణుగోపాల్ స్వస్థలం జగిత్యాల. ఎంఏ (తెలుగు), ఎంఏ(సోషియాలజీ) చేశారు. ప్రస్తుతం సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఇప్పటివరకూ 172 పైగా కథలు, నాలుగు నవలలు రాశారు. ఆధ్యాత్మికత, వ్యక్తిత్వ వికాసం, సినిమాలు, సాహిత్యానికి సంబంధించి పలు వ్యాసాలు వెలువరించారు. అమ్మా నాన్న (పేరెంట్స్ కథలు), గోపాలం (హాస్య కథల సంపుటి), నవరసభరితం (నవరసాలపై కథలు), నాలుగు పుటలు (నాలుగు పార్శ్వాల కథలు), బుజ్జిగాడి బెంగ (పిల్లల సాంఘిక కథలు), నాలుగు మెతుకులు పుస్తకాలు పాఠకాదరణ పొందాయి. అమ్మ నాన్న పిల్లలు (పిల్లలపై వ్యాసాలు), విజయానికి అన్నీ మెట్లే (వ్యక్తిత్వ వికాస వ్యాసాలు) శీర్షికలతో వ్యాస సంపుటాలను ప్రచురించారు. ఈయన రచనలను వివిధ సంస్థలు 13 పుస్తకాలుగా ప్రచురించాయి.**



వై. ఎల్.వి.ప్రసాద్
99661 26882

# విశ్వాసపాత్రుడు

ఆఫీసులో తన హెడ్ రమణమూర్తి అనుమతి తీసుకోకుండానే చనిపోయాడు వినయ్ బాబు. ఆత్మ ఇంకా ఇళ్లు దాటలేదు. దాదాపు అరగంట పడరాని పాట్లు పడ్డాక తను చనిపోయానని నిర్ణయానికి వచ్చాడు. విషయం తెలియగానే బాధతో గట్టిగా అరిచి ఏడ్చాడు చచ్చిన వినయ్. ఓదార్చే వాళ్లు ఎవరూ లేరని తెలిసి ఏడుపు త్వరగానే విరమించుకున్నాడు. గడియారం వైపు చూశాడు. సమయం ఒంటిగంట అయింది. ముళ్లు కదులుతున్న కొద్దీ తనలో భయం పెరిగిపోతోంది. దానికి కారణం ప్రతీ రోజు సరిగ్గా 8.30 గంటలకు తను ఆఫీసులో వేలిముద్రతో హాజరు వేయాలి. లేదంటే ఆలస్యానికి కారణం చెబుతూ లెటర్ రాసి హెచ్ ఆర్‌కు సంజాయిషీ ఇచ్చుకోవాలి. ఇదంతా ఒకెత్తయితే ఆ లెటర్ మీద ఖచ్చితంగా తన హెడ్ సంతకం ఉండాలి. ఆ సంతకం పెట్టేముందు ఒక తిట్టో లేదా ఒక చిరాకైన చూపో హెడ్ రమణమూర్తి నుంచి బహుమతిగా తీసుకోవాల్సి ఉంటుంది. సంస్థ తెచ్చిన కొత్త పాలసీ మూలాన తన

సెలవులన్నీ ఎగిరిపోయాయి. ఇప్పుడు తను పెట్టే ప్రతీ సెలవు 'లాస్ ఆఫ్ పే'నే అవుతుంది. ఈ చావు మూలన తను ఈ రోజు నుంచి ఆఫీసుకి వెళ్ళలేడు. ఈ విషయం తనను ఎంతో బాధకు గురిచేసింది.

తన చావు గురించి తెలిసి బయటికి బాధ నటించినా ఆఫీసుకు అటెండ కానందుకు మనసులో తనను రమణ మూర్తి తప్పక తిట్టుకుంటాడని వినయ్ బాబుకు తెలుసు. ఆ విషయం గురించి తలుచుకుని మళ్లీ కుమిలిపోయాడు. ఆపిల్ పండు తింటూనో, కాసేపు గురకపెట్టి నిద్రపోతూనో, అందరిచేత పని చేయించగల సమర్థుడు రమణమూర్తి. తాను పనిచేయకపోయినా సంస్థమీద, చైర్మన్ గారి మీద భక్తి చూపించడంలో మూర్తి తనకు తానే సాటి. తన భక్తిని అంటురోగంలా కింది ఉద్యోగులకూ అంటిస్తుంటాడు. వినయ్ కూడా సంస్థాగ్రస్తుడే. సంస్థలో పనిచేసే ప్రతీ మేనేజర్ చైర్మన్ గారి లీలల్ని అవకాశం దొరికినప్పుడల్లా కింది స్థాయి ఉద్యోగులకు వినిపించి మురిసిపోతుంటారు.

'ఛీ అన్నం పెట్టిన సంస్థకు ఎంత అన్యాయం చేశాను. నా కష్టానికి ఇవ్వాల్సిన జీతం కన్నా తక్కువే ఇస్తుండొచ్చు, ప్రతీ సంవత్సరం ఐదు లీటర్ల పెట్రోల్ కొనగలిగేంత జీతమే పెంచుతుండొచ్చు. నాకంటూ సొంత గౌరవం గట్రాలాంటివి ఇవ్వకపోయినా, నాకు ఉద్యోగి హోదా కల్పించింది నా సంస్థ. నేను ఛాతీని పెద్దగా చేసుకుని సమాజంలో తిరుగగలుగుతున్నానంటే అందుకు కారణం ఎవరు మా సంస్థే కదా!

నా చావు విషయం చైర్మన్ గారికి తెలిస్తే 'చెప్పాపెట్టకుండ చనిపోయేవాన్ని పనిలో ఎందుకు పెట్టుకున్నారయ్యా' అని హెచ్. ఆర్‌ని, తనను ఇంటర్వ్యూ చేసిన రమణమూర్తిని ఎన్ని చివాట్లు పెడతాడో?! దానికి తోడు తను పూర్తిచేయాల్సిన పని అంతా అలానే ఉంది. కనీసం ఆ పని పూర్తి చేసైనా చావకపోయానే' అని వినయ్ బాబు ఆత్మ ఆత్మన్యూనతకు లోనయింది.

ఇంతలో బాబుకు తన పక్కడెస్కు అమ్మాయి కామ్రేడ్ శ్రీవాణి గుర్తుకు వచ్చింది. ఆ అమ్మాయి ఈ మధ్యనే ఆఫీసులో చేరింది. తెలివైన అమ్మాయి. చదువు ఈ మధ్యనే పూర్తిచేసుకుంది. చదువుతో పాటు కాస్త కమ్యునిజం కూడా చదువుకుంది. మాట్లాడిన ప్రతీసారి లెనిన్‌నో, మార్క్స్‌నో స్మరిస్తూనే ఉంటుంది. ఆ పదాలు విన్న ప్రతిసారి డెస్క్‌లో అందరూ ఉలిక్కిపడి ఆ అమ్మాయి వైపు చూసేవాళ్లు. వినయ్ బాబుకు ఆ అమ్మాయంటే ఎనలేని అసహ్యం. తమలో కలవని వారంటే గుంపుకు ఎప్పుడూ అసహ్యమే కదా! అవకాశం దొరికినప్పుడల్లా ఆ అమ్మాయి పనిలో లేని తప్పులెతికి రమణమూర్తి దగ్గర ఆ అమ్మాయికి పనిరాదని నిరూపించేవాడు. ఈ టెక్నిక్ తన సీనియర్ రాజమల్లు దగ్గర ఒంట పట్టించుకున్నాడు.

ఒక రోజు ఆ అమ్మాయి అంతు చూడాలని ''చైర్మన్ గారు గొప్పవారా? లెనిన్ గొప్పవాడా?' అని ప్రశ్నించాడు వినయ్. క్షణం కూడా ఆలోచించకుండా ఆ అమ్మాయి

''లెనినే గొప్ప' అంది. ఈ విషయం నేరుగా అప్పుడే నిద్రలోకి జారుకుంటున్న రమణమూర్తి డెస్కు మీద వాలింది. నిద్రమత్తు విదిలించుకుని కళ్లజోడు పెట్టుకుంటూ ''అమ్మాయి చైర్మన్ సార్ కన్నా లెనిన్ గొప్ప అన్నావా?' అడిగాడు రమణ. ''అవునం'ది శ్రీవాణి. ''మరైతే ఇక్కన్నుంచి వెళ్లిపోమ్మా ఉద్యోగం వేరే చోట చూసుకోపో అన్నం పెట్టేవాన్ని కాకుండా ఎక్కడో పుట్టిన పరదేశీయున్ని గొప్పంటావా! సిగ్గులేదూ?!' గట్టిగా అరిచాడు మూర్తి. వినయ్ లోపల్లోపల భలే నవ్వుకున్నాడు. ఆ అమ్మాయి ఏం మాట్లాకుండా కూర్చుంది. ''ఇంకా కుర్చున్నావేంటి అమ్మాయ్? రష్యాకెళ్లిపో ఇక్కడెందుకున్నావ్!? అయినా నీలాంటోళ్లను ఇంటర్వ్యూ చేసి తీసుకున్నందుకు నాకుండాలి బుద్ధి. పాపం పేదపిల్ల బుద్ధిగా పనిచేసుకుంటుందని ఉద్యోగం ఇస్తే చైర్మన్ సార్నే తక్కువచేసి మాట్లాడతావా?! వెళ్లు' అన్నాడు కోపంగా. ఇంటి పరిస్థితి, ఉద్యోగం అవసరం గుర్తుకొచ్చి తనలోని విప్లవం పోయి ఏడుపు వచ్చింది శ్రీవాణికి. ''సారీ సార్ నన్ను క్షమించండి' కన్నీళ్లు పెట్టుకుంది వాణి. ''ఇప్పుడు చెప్పు ఎవరు గొప్ప?' అడిగాడు రమణమూర్తి. ఆ క్షణం ఉద్యోగ దాత చైర్మన్‌గారి ముందు ప్రపంచ కార్మిక సంక్షేమం కోసం పోరాడిన లెనిన్ పరాయి దేశం వాడై ఓడిపోయాడు.

ఆ సంఘటన తరువాత కామ్రేడ్ శ్రీవాణి వుత్తి శ్రీవాణి అయింది. 'ఇప్పుడు తను చనిపోయాడు గనుక తన పనికూడా శ్రీవాణే చేసి రమణమూర్తి దగ్గర మంచి మార్కులు కొట్టేస్తుంది. కొన్నాళ్ల తర్వాత రమణమూర్తి గారు వినయ్ బాబు కన్నా నువ్వే చాలా నయం అమ్మాయ్ అన్నా అంటాడేమో' ఈ ఆలోచన వినయ్ బాబు ఆత్మను మరింత అలజడికి గురిచేసింది.

సంస్థలో చేరి ఐడీ కార్డు మెడలో పడగానే ఎలాంటి వారినైనా సరే వారి సొంత భావాలను వదిలిపెట్టేలా చేసి సంపూర్ణ ఉద్యోగిగా మార్చడమే ఇందులోని మేనేజర్ల పని. అవును నిరుద్యోగం తాండవిస్తున్న ఈ భారతావనిలో తమ ఆత్మాభిమానం, వ్యక్తిత్వం కోసం ఎంతమంది నిలబడగలరు!? ఈ సాతంత్ర్య భారతంలో చైర్మన్‌గారి లాంటి వారు బానిసత్వాన్ని చక్కగా సాగు చేస్తున్నారు. ఈ సంస్థలో ఉద్యోగుల ఎంపిక విధానం భలే చిత్రంగా ఉంటుంది. పళ్లు ఎన్నున్నాయి, కాళ్లు చేతులు ఏమైనా విరిగాయా, కండ పుష్టి ఎలా ఉంది అని పరీక్షించి పూర్వం బానిసల్ని కొనేవాళ్లు చూడండి దాదాపు అలానే ఉంటుంది. ఈ సంస్థలో ఉద్యోగి ఎంపికలో ప్రధాన అంశాలు అతడు పేదవాడై ఉండాలి, అతనికి ఈ ఉద్యోగం అత్యవసరమై ఉండాలి, ఎంతో సున్నితస్తుడు, మంచివాడై ఉండాలి. స్పష్టంగా చెప్పాలంటే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చచ్చినట్టు ఇక్కడే పనిచేసే పరిస్థితిలో ఆ వ్యక్తి ఉండాలి. ఈ విధానమే చైర్మన్ గారి విజయ రహస్యం. పై పరీక్షలన్నీ పాసై పదేళ్లనుంచి సంస్థకు విశ్వాసంగా ఉన్నవాడే మన వినయ్ బాబు.

ఇంతలో ఉరుములాంటి శబ్దం విని తల పైకెత్తాడు ఎవరికీ కనిపించని బాబు. ఎలాంటి

దిగులూ లేకుండా హాయిగా నిద్రపోతున్న భార్య రజిత కనిపించింది. భార్యను చూడగానే వినయ్ కి ఎక్కడలేని కోపం వచ్చింది. 'వద్దే మా మేనేజర్ గారి ఇంట్లోనే చిన్న సైజ్ టీవీ ఉంది మనకెందుకే ఇంత పెద్దది అని ఎంత చెప్పినా వినకుండా నన్ను సతాయించి మరీ కొనిపించావ్ కదే ఈ పలక టీవీ. ఇప్పుడు దానికి ఈ ఎం ఐలు ఎలా కట్టాలి. నేను బతికుంటేనే కదా ఉద్యోగం చేయగలను, జీతం తీసుకోగలను, ఈ ఎం ఐ కట్టగలను' అని గట్టి గట్టిగా అరుస్తూ నిట్టూర్పు విడిచాడు బాబు. ఇంతలో తన వెనకాల ఉన్న గూడులో వినయ్ బాబుకు కరెంటు బిల్లు కనిపించింది. తరువాత గ్యాస్ బిల్లు ఇతరాత్ర బిల్లులన్నీ వరసకట్టి వినయ్ ఆత్మ అంతరంగంలో మెదిలాయి. ఇంతలో భార్య పక్కనే ముదురుకుని పడుకున్న కొడుకు కనిపించాడు. అంతే గోడకానుకుని కూలిపోయి కూర్చుండిపోయాడు. సార్ అంటూనే తనకు క్షవరం చేసే కొడుకు స్కూలు, దానికి కట్టాల్సిన ఫీజు గుర్తుకొచ్చింది మరి. ఈ దేశంలో బిల్లులు కట్టడానికి, ప్రభుత్వానికి పన్నులు కట్టడానికే బ్రతికే చాలా మందిలో ఒకడిలాంటోడే వినయ్.

సమయం 2గంటలైంది. ఇంతలో వినయ్ బాబు ఆత్మకి ధర్మసందేహం బయలుదేరింది. 'చచ్చి గంట దాటినా నన్ను స్వర్గానికో, నరకానికో ఎక్కడికో ఏదో ఓ చోటుకి తీసుకెళ్లిపోవాలిగా!? అంటే అలాంటివేం లేవా? మరి ఎందుకని ఎవరూ నాకోసం రాలేదు?' అని తనలో తాను మధనపడుతుండగా అచ్చం సినిమాల్లోలాగానే ఒక కిరణపుంజం వినయ్ బాబును చేరుకుంది. అంతే కళ్లు తెరిచి చూసే సరికి ఏదో ఒక కొత్త ప్రపంచంలో ఉన్నాడు. నూనె వేపుడులు, శూలదండనలు ఏమీ కనిపించలేదు. రాక్షసుల వంటి అందవికారమైన ఆకారాలు కూడా లేవు. కాబట్టి నరకమైతే కాదు. కాబట్టి ఖచ్చితంగా స్వర్గమై ఉండాలని నిర్ణయానికి వచ్చాడు. చిన్నప్పుడు వినయ్ బాబుకు స్వర్గం గురించి తన అవ్వ చెప్పినట్టు పాల సెలయేర్లు, వెన్నకొండలుగట్రాలాంటివి ఏమీ కనిపించలేదుగానీ పచ్చని కొండలు, జలపాతాలు, అక్కడక్కడా అందమైన కట్టడాలు, మంచి సువాసన నిచ్చే గాలులతో ఓ మంచి విహారయాత్రా స్థలంలానే ఉంది. అక్కడక్కడా ఉన్న మనుషుల ముందు అందమైన అమ్మాయిలైతే నాట్యం చేస్తున్నారు. అప్సరసలయ్యుంటా రనుకున్నాడు. కనిపించిన మనుషులందరూ తాగి తూగుతూ ఆనందంగా గడుపుతున్నారు. వాళ్లను చూసి 'ఛీ తాగుడుబోతు వెధవలు' అని మనసులోనే తిట్టుకున్నాడు వినయ్ బాబు. ఇంకా చిత్రచిత్రమైన జీవరాశులున్నాయి. కొన్ని భూమ్మీద తను చూడను కూడా చూల్లేదు. బహుశా గ్రహాంతర జీవులై ఉంటాయనుకున్నాడు. చూడటానికి ఆహ్లాదంగా ఉన్నా ఆ వాతావరణం అంతా వినయ్ బాబుకి గందరగోళంగా అనిపిస్తోంది. పండ్ల చెట్లు చాలా ఉన్నాయి. ఒక మామిడి పండు తెంచుకుని తిందామనుకున్నాడు. ఇంతలో ఓ సారి ఇలానే ఆఫీసులో తను మామిడిపండు తెంపడం చూసిన రాజమల్లు రమణమూర్తికి చెప్పి చివాట్లు పెట్టించిన విషయం గుర్తుకు వచ్చి ఆగిపోయాడు.

తన భుజం మీద ఎవరో వెనక నుంచి చెయ్యి వేశారు. తిరిగి చూస్తే ఓ అందమైన

అమ్మాయి. తన చేతిని వినయ్ బాబు ముఖం మీద వేసి సుతారంగా నిమురుతోంది. వినయ్ ఉక్కిరి బిక్కిరయిపోతున్నాడు. కౌగిలించుకోబోయింది. వెంటనే ఆ అమ్మాయిని విదిలించుకుని ''పాపిష్టిదానా నేను పద్ధతిగల కుటుంబం నుంచి వచ్చాను ఏమనుకున్నావో. నేను నీలా భరితెగించలేదు. ఇంకోసారి ఇలా ప్రవర్తించావంటే మీ పై ఆఫీసర్‌కి చెప్పి నిన్ను ఉద్యోగంలోంచి పీకేపిస్తానేమనుకున్నావో' అని గర్జించాడు. ఆ మాటలకు ఆ అప్సరస నోరుపెగలక బెదిరిపోయి నిలుచుని ''సురాపానం' అని గ్లాసు అందించపోయింది. ''ఏం నన్ను తాగుడుబోతు వెదవ అనుకున్నావా ఈ విషయం గనుక మా హెడ్ కు తెలిస్తే నా సంగతంతే వెళ్లు వెళ్లమ్మా మహాతల్లి' అని గదురుకున్నాడు. వెంటనే ఆ అమ్మాయి అక్కడి నుంచి పారిపోయింది.

చుట్టూ అంత ఆనందం ఉన్నా వినయ్ బాబుకు మాత్రం మనసు నిండా దిగులు నిండుకుంది. ఇంతలో కాస్త దూరంలో ఉన్న లోయ దాని గట్టునే ఓ చెట్టు కనిపించింది. అక్కడికి వెళ్లి దాని కింద ఒంటరిగా కూర్చున్నాడు. తనకు ఏడుపు పొంగుకొస్తోంది. కుటుంబం, ఉద్యోగం తప్ప వినయ్ బాబుకు వేరే లోకం తెలీదు. తను ఉద్యోగంలో చేరిన రెండు సంవత్సరాలకే విసుగెత్తి ఊరు వెళ్లిపోవాలనుకున్నాడు. కానీ తన సీనియర్లు ఇక్కడి నుంచి వెళ్లిన వాళ్లు బయటెక్కడా బతకలేరని భయపెట్టేవాళ్లు. సంస్థ నుంచి వెళ్లి ఉద్యోగాలు దొరక్క ఇబ్బందులు పడుతున్న వాళ్లను, ఆత్మహత్య చేసుకున్న వాళ్లను ఉదాహరణగా చూపించే వాళ్లు. సంవత్సరాలు గడిచేకొద్దీ ఆ సంస్థకు, భయపెట్టే ఆ వ్యవస్థకు చచ్చినా తను వేరే లోకంలో బతకలేనంతగా అలవాటు పడిపోయాడు. తనకు అర్థం కానీ, అలవాటులేని ఈ ప్రపంచం స్వర్గమే అయినా తనకు అక్కరలేదనిపిస్తోంది. తల పైకెత్తి దూరంగా ఆకాశంలోకి చూశాడు. గిర గిర తిరుగుతూ నీలిరంగులో భూగోళం వినయ్ బాబు కంటపడింది. పట్టరాని ఆనందంతో బుగ్గల మీద కారిన కన్నీళ్లు తుడుచుకున్నాడు. కానీ అది చాలా దూరంగా ఉంది. 'కాస్త దగ్గరగా అయినా లేదు ఉండుంటే దూకి ఎలాగైనే ఇంటికి చేరుకుని ఈ రోజే ఈ నెల టీవీ ఈ ఎం ఐ కట్టేద్దును లేదంటే రేపటికి ఫైన్ పడుతుంది. నా భార్యకు కోరికలు కోరడమే తప్ప ఇలాంటి విషయాలు అస్సలు తెలీవు. నేను లేకుండా ఎలా బతుకీడుస్తుందో ఏమో' అనుకున్నాడు. ఆలోచనలతో తనకు పిచ్చిపట్టినట్టు అవుతోంది. వినయ్ బాబు ఆత్మకు ఆత్మహత్య చేసుకోవాలనే ఆశ కలిగింది. గట్టు మీద నుంచి లోయలోకి దూకాలని రెండు మూడు సార్లు ప్రయత్నించి ధైర్యం చాలక భయపడి వెనక్కు వచ్చి స్వర్గంలో ఆ చెట్టుకింద చిరాకు పడుతూ కూర్చున్నాడు.

''ఏంటి ఆత్మహత్య చేసుకోడానికి ధైర్యం చాల్లేదు కదూ' వినయ్ బాబుకు ఓ గొంతు వినిపించింది. ''అలా ఏంలేదు లోతెంతుందో చూడటానికే చివరకు వెళ్లాను. అయినా దాక్కుని మాట్లాడుతున్నావ్ నువ్వెవరూ?' అడిగాడు.

''నా గురించెందుకులేగానీ అందరూ అక్కడ హాయిగా ఆడుతూ పడుతూ ఆనందంగా

ఉంటే నువ్వు ఇక్కడ ఒంటరిగా కూర్చున్నావెందుకు?'

''నాకు ఈ లోకం నచ్చలేదు ఇక్కడి నుంచి వెళ్లడానికి నువ్వు సాయం చేయగలవా?' క్షణం వ్యవధి ఇవ్వకుండా సమాధానం చెప్పాడు వినయ్ బాబు.

''తప్పకుండా అయినా ఈ లోకానికేమైంది ఇక్కడ నీకు నచ్చిట్టు ఉండొచ్చు. అందమైన, ఆహ్లాదకరమైన వాతావరణం, సమానత్వం, గౌరవం, హద్దులేలేని ఆనందం ఇంతకన్నా నీకు ఏం కావాలి? ఇక్కడ నువ్వు ఎవరికీ విశ్వాసం చూపించాల్సిన అవసరం ఉండదు. నీకు పూర్తి స్వేచ్ఛ దొరుకుతుంది' అని ఆ గొంతు చెప్పింది.

''నాకు నువ్వు చెప్పినవేవీ వద్దు అయినా స్వేచ్ఛ నేనేంచేసుకోను' కోపంగా అన్నాడు వినయ్ బాబు. కొన్ని క్షణాల నిశ్శబ్దం తరువాత ''నిజమే సొంత నిర్ణయాలు తీసుకోలేనివాడికి స్వేచ్ఛ భారంగా, బానిసత్వం కన్నా దారుణంగానే ఉంటుంది. కానీ దాని విలువ, అది ఇచ్చే ఆనందం అర్థమయితే నువ్వు ఇక్కడి నుంచి వెళ్లమన్నా వెళ్లవు ఒక్క సారి ఆలోచించుకో. మొదట్లో మీ మనుషులందరూ ఇలానే అన్నారు. తరువాత అలవాటు చేసుకుని ఇక్కడే ఆనందంగా ఉంటున్నారు' అంది గొంతు.

''నాకు అర్థం కానీ విషయాలను చెప్పి నన్ను ఇబ్బంది పెట్టకు దయచేసి నేను అడిగేది మాత్రం నాకు ఇవ్వు' బ్రతిమలాడాడు వినయ్ బాబు.

'' నేను సాయం చేస్తానని మాటిచ్చానుగా సరే మరి నీకేంకావాలో చెప్పు' ఆ గొంతు అంది.

''నాకు నా పాత జీవితం కావాలి' అడిగాడు వినయ్ బాబు.

ఆ గొంతు ''తదాస్తు' అంది.

వినయ్ బాబు ఆత్మ తిరిగి శరీరంలోకి చేరుకుంది. 'ఆఫీసుకు టైమయింది లేవండి' అని భార్య పిలిచిన పిలుపుకు ఉలిక్కిపడిలేశాడు. సమయం 7గం.30నిమి. అయింది. ఈ రోజు అరగంట ఆలస్యంగా నిద్రలేచాడు. వినయ్ బాబుకు రాత్రి జరిగిందేదీ గుర్తు లేదు. చకచకా ఆఫీసుకు తయారయ్యాడు. క్యారేజీ సంచి చేతిలోపెట్టుకుని బస్టాండ్‌కు పరుగుతీశాడు. అప్పటికే తన ఆఫీసు బస్సు వెళ్లిపోయింది. సిటీ సర్వీస్ బస్సులో ఎక్కి కూర్చున్నాడు. మనసు మొత్తం భయంతో నిండుకుంది. ఈ మధ్య కాలంలో ఒక్క రోజు కూడ తను ఆఫీసుకు ఆలస్యంగా వెళ్లలేదు. ఈ రోజు ఆలస్యం అయితే మూర్తిగారికి ఏం కారణం చెబితే బాగుండు అని ఆలోచిస్తూ కూర్చున్నాడు. తరువాత కారణలు ఎన్ని చెప్పినా తిట్లయితే తప్పేవి కాదనిపించింది. ఈ రోజు శ్రీవాణి ముందు తనకు పరువుపోవడం కాయం అనుకున్నాడు. 'అయినా ఎందుకింత బండనిద్రపోయాను నాకు కావాల్సిందేలే' అని తనను తాను తిట్టుకున్నాడు. ఆలోచనల్లో ఉండగానే దిగాల్సిన స్టాప్ వచ్చింది. వాచీ చూసుకున్నాడు సమయం 8గం.26నిమి.. ఇక వేలిముద్ర వేయడానికి నాలుగు నిమిషాలే ఉంది. ఆఫీసుగేటు దగ్గరికి వెళ్లాలంటే ఇంకా రెండు వందల మీటర్లు దాకా నడవాలి. పరుగు మొదలెట్టాడు. గేటు

దగ్గరికి చేరే సరికి సమయం 8గం.28నిమి. గేటు దగ్గర సెక్యూరిటీ వాడికి తన ఐడీ కార్డు చూపించి, తన సంచిలో క్యారేజీ తప్ప మారణాయుధాలేమీ లేవని నిరూపించుకుని లోపలికి రావడానికి కనీసం ఒకటిన్నర నిమిషం పట్టింది. ఆగమేఘాల మీద వేలిముద్ర తీసుకునే మోషన్ ని చేరుకున్నాడు. క్యూలో ఇద్దరి వెనక నిలుచుకున్నాడు. ఇంకా ఇరవై సెకన్లు మాత్రమే ఉన్నాయి. ఎదురు ఉన్న వాళ్లలో మొదటి వ్యక్తి తన పనిపూర్తిచేసుకుని వెళ్లాడు. వినయ్ బాబు ముందు ఉన్న వ్యక్తి వేలిముద్రను మోషన్ తీసుకోవడంలేదు. వినయ్ బాబుకు గుండె గుబేళుమన్నట్టయింది. ఇంకా నాలుగు సెకన్లే ఉన్నాయి. ఎదుటి వ్యక్తి వేలిముద్రను స్వీకరిస్తూ మోషన్ 'కుయ్' మని శబ్దం చేసింది. చివరి సెకను పూర్తయ్యేలోపు వినయ్ బాబు తన హాజరు వేసుకున్నాడు. వినయ్ బాబు విజయం సాధించాడు. ఆ విజయ గర్వంతో చెక్కిళ్లను వెడల్పు చేసుకుని చిన్నగా నవ్వాడు. చేతిగుడ్డతో ముఖానికిపట్టిన చెమట తుడుచుకుని, ఛాతిని విచ్చుకుని హుందాగా ఆఫీసులోని తన డెస్కు వైపు అడుగులు వేశాడు.

## వై.ఎల్.వి. ప్రసాద్

**వై.ఎల్.వి. ప్రసాద్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా యాడికి గ్రామం. ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్ చేశారు. 2018లో చదువు పూర్తయ్యాక, 'విపుల' పత్రికలో సబ్ ఎడిటర్‌గా రెండేండ్లపాటు పనిచేశారు. చిన్నతనం నుంచే పుస్తకాలు చదివే అలవాటు ఉన్న ప్రసాద్.. క్రమంగా రచనల వైపు మళ్లారు. 'నేనెందుకు ఏడ్వాలి?', 'ఏటీఎం', 'తొండచెప్పే ప్రేమ కథ'.. విపుల, తెలుగు వెలుగు పత్రికలలో ప్రచురితం అయ్యాయి. 'హంతకి' కథ ఈనాడు ఎఫ్ఎంలో ప్రసారమైంది. 'ఇది రాక్షసుడు రావాల్సిన సమయం', 'అసమర్థుడు' పేర్లతో తెలుగు వెలుగు పత్రికలలో రెండు గల్పికలు ప్రచురితం అయ్యాయి.**

# అపరంజి



తులసి బాలకృష్ణ
8790115544

ఏదో పిక్నిక్ స్పాట్ లాగా అందంగా ఆహ్లాదంగా ఉంటుందనుకున్న అడవిలోని ఈ కేంపక్వార్టర్స్ చుట్టూ వాతావరణం అంతా.. చికాకు కలిగించేలాగా వుండేసరికి బాగా డీలా పడిపోయాడు రాజారావు. గోపీ చందనం రంగు వెల్ల వేసిన ఇంటి గోడల్లోకి ఇంకి పోయి, కాఫీ ఒలకబోసినట్లు ప్రపంచ మ్యాపులు సృష్టించిన వర్షపు నీళ్ళు.. నేలంతా చిత్తడి... ఎండిన ఆకుల కుప్పలు .. ఆ ఆకుల కుప్పల్లో జరజరా ఏవో భూచరాలు పాకుతూన్న సవ్వడి.. గాలంతా ఏదో నిలవ వాసన.. రొజ్జగాలి...

చా గిట్ల ఏమన్నా తెస్తునా? అంటూన్న నర్సిమ్మ ముఖంలోకి చూసాడు రాజారావు. నల్లగా, పొట్టిగా, ముఖం మీద స్ఫోటకపు మచ్చలతో వున్న అతని ముఖంలోకి చూడడానికి ఇబ్బంది అనిపించింది. ఇన్స్పెక్షన్ పని మీద వచ్చిన తనకి వ్యక్తిగత పనులన్నీ చేసిపెట్టడానికి అతన్ని అప్పగించారు ఇక్కడి ఫారెస్ట్ కార్యాలయం

వాళ్ళు. ఇక్కడుండే ఈ పదిహేను రోజులూ ఈ చికాకు వాతావరణంలో ఈ మొరటు మనిషి సాయం పొందుతూ గడపాల్సిన్దేనన్న మాట!? హతవిధీ! నగర జీవితాన్నీ, సంసార చికాకుల్నీ తప్పించుకుని కొన్నాళ్ళ బాటు ఒంటరిగా స్వేచ్ఛగా హాయిగా కులాసాగా గడపగలను .. అనుకుంటే .. మై గాడ్! ఇట్సె కర్స్!... ఊc.. ఏదో కానియ్ అన్నాడు నర్సిమ్మతో అయిష్టంగానే.

గిప్పుడే.. ఒక్క మినట్ల తెస్త అని నర్సిమ్మ వెళ్ళగానే, దిగులుగా సోఫాలో కూలబడ్డాడు రాజారావు..నొసలు రుద్దుకుంటూ. పది నిముషాలు గడిచాయి. 'చాయ్ కి కూడా గంటల తరబడి వెయిట్ చెయ్యాలేమో ఇక్కడ .. ఖర్మ. ఆకలి కూడా వేస్తోంది. తిండి రెండు రోజులకి ఒఖ్ఖసారే దొరుకుతుందేమో అనుకుంటూండగా నర్సిమ్మ పెద్ద టిఫిన్ బాక్స్, సాసర్ మూత పెట్టిన చాయ్ కప్పు ఓ ట్రేలో పట్టుకుని, ప్రత్యక్షమై, రాజారావు ముందున్న టీపాయ్ మీద పెట్టాడు. టిఫిన్ బాక్స్ మూత తెరిచిన రాజారావు ..అందులో వున్న పొగలు కక్కుతూన్న మసాలా వడలని చూస్తూనే కళ్ళు మిటకరించి.. ఓ వడని అప్రయత్నంగానే నోట్లో పెట్టుకుని కసిక్కున కొరికి నమిలాడు. అద్భుతమయిన రుచి అనిపించి.. ఇవెక్కడివి? దగ్గరలో హోటల్ ఏమయినా ఉందా? లేక నువ్వు చేసుకొచ్చావా? అనడిగాడు మెచ్చుకోలుగా కళ్ళెగరేస్తూ. నర్సిమ్మ తల అడ్డంగా ఆడిస్తూ, గీడ హోటల్ ఏడది? అన్నాడు. నన్నడుగుతావేంటయ్యా? ఆయితే నువ్వు చేసుకొచ్చావా? అయ్.. చెయ్యనీకి నాకొస్తదా సారూ?

పంటిక్రింద మరో వడని చితకగొడ్తూ .. నర్సిమ్మ అమాయకపు స్వభావానికి లోనుండి నవ్వు తన్నుకొస్తూండగా.. మరెక్కడ్నుంచి తెచ్చావో చెప్పవయ్యా బాబూ ఇంత మంచి వడలు? అన్నాడు రాజారావు. అపరంజి సేసింది సారూ. ఒక్కసారిగా రాజారావులో చిన్న కుదుపు వచ్చింది. అపరంజా? అపరంజి ఎవరు?

ఆచిమన్ బిడ్డ. అగొ .. గా సెట్టవతల రూమ్ ల వుంటరు అని, నే బోయి ఉడుకు నీల్లు తెస్త మీకు తానమాడనీకి అని బయల్దేరబోయాడు. ఆగాగు ఆన్న రాజారావు. రెండు వడలు తీసి ఇస్తూ తిను. చాలా బావున్నాయి అన్నాడు .. మొహమాట పడుతూనే తీసుకుని, వెళ్ళాడు నర్సిమ్మ.

అపరంజి! ఎంత మంచి పేరు అనుకున్నాడు రాజారావు. సూట్ కేస్ లోంచి బట్టలు తీసుకుని, మిగిలిన రూములూ, బాత్ రూము ఎలా వున్నాయో ఓసారి చూసుకుని వచ్చాడు. పెద్ద బకెట్ తొ వేడి నీళ్ళు మోసుకొచ్చి, బాత్ రూములో పెట్టిన నర్సిమ్మ అచ్చ సారూ! తమరు తానంజేసి, ఇస్రాంతి తీసుకునుద్రి. నేమల్ల పొద్దుగాల్నే అస్త అన్నాడు వెళ్ళడానికి

సిద్ధపడుతూ. ఉలిక్కిపడ్డ రాజారావు, నువ్వెళ్ళిపోతావా? రాత్రి నాకు భోజనం? అనడిగాడు కంగారుగా.

అపరంజి సేసిపెడ్తది సారూ. నేను గీ మబ్బుల ఆరు కిలో మీటర్లు పోవాల సైకిల్మీద. సరే..పోయిరా. వెళ్ళిపోయాడు నర్సిమ్మ. స్నానం చేసి వచ్చి, మంచం మీద వాలాడు రాజారావు. వాతావరణం క్రమేపీ అలవాటు పడుతూండడంతో ఫర్వాలేదు .. ఇక్కడ బాగానే ఉండొచ్చు అనుకుంటూండగానే ప్రయాణ బడలిక కారణంగా కునుకు పట్టేసింది.

నిద్రలో మంచి తియ్యటి కల... అందమైన అటవీ ప్రాంతం.. లోయలు.. కొండలు గుట్టలు... సుందరమైన తీగలు చుట్టుకున్న పెద్ద పెద్ద వృక్షాలు, చెంగు చెంగున గెంతుతూన్న జింక పిల్లలు, చెట్ల కొమ్మల గుబురుల్లోంచి కోయిలల కుహూరవాలు, పిట్టల కువకువలూ, సెలయేళ్ల గలగలలూ ... తను స్వేచ్ఛగా గొంతు విప్పి పాడుతూ .. ఒడలు మరచి చిందులు వేస్తూ నృత్యం చేస్తూ.. అంతలోనే ఎక్కడ్నుంచో కాలి గజ్జెల రవళులు .. చేతి గాజుల గలగలలు.. ఎవరివవి.. తన చూపుకి అందవేం?....

సారూ ఓ తియ్యని స్వరం. ఎవరో స్త్రీది. ఎక్కడ? ఆ పొదలమాటునా?.. ఆ చెట్ల చాటునా?.. పిలిచి కనబడకుండా ఎందుకు తప్పించుకుంటోంది? ఆట పట్టిస్తోందా?...

సారూ ఈసారి స్వరం స్థాయి పెరిగింది. రాజారావు కల చెదిరింది. ప్రయత్నం మీద అర తెరిచిన కన్నులతో తల తిప్పి చూసాడు. అంతే! ఒక్కసారిగా పగిలిన పత్తికాయల్లా విచ్చు కున్నాయి కళ్ళు. ఎదురుగా ఓ పోతపోసిన రామప్ప శిల్పం. సారూ..బువ్వ అంటోంది శిల్పం. కనురెప్పలు మూయడం మరచిపోయాడు రాజారావు. అసలు తనని తనే మరచిపోయాడు రాజారావు. బువ్వ. లోపల బెట్టిన. తినున్రి

అలా చూస్తూ వుండడం సభ్యత కాదన్న విషయం మరచిపోయిన రాజారావు... శాపగ్రస్తుడై శిలా ప్రతిమయిపోయిన వాడిలా కదలిక లేకుండా అలా చూస్తూనే వున్నాడు. ఇది కలా నిజమా? ఇంత అందం.. తను దేవాలయ శిల్పాలలో చూసాడు .. మ్యూజియంలలో చూసాడు .. ఆర్ట్ గ్యాలరీలలో చూసాడు .. కానీ .. సజీవంగా .. తన కళ్ళెదుట ... తనతోనే మాట్లాడుతూ ...

రాజారావు అలా చూస్తూంటే .. ఒక్కసారిగా కొద్దిగా చలించినట్లయి.. బువ్వ సల్లబడిపోద్ది.. జల్ది తినున్రి.. అని ఆమె వెళ్లి పోతూంటే .. స్పృహలోకి వచ్చి గబుక్కున, అప్రయత్నంగా ఇదుగో మాట.. అన్నాడు కంగారుగా.

ఆగి 'ఏమిట'న్నట్లు భ్రుకుటి మడిచి చూసింది. ఒయ్యారంగా సగం తిరిగి నిలబడిన ఆమె భంగిమ లోని ఒంపు సొంపులకి మరింత మతిపోయి చూస్తూండి పోయిన రాజారావు కి ఎందుకు ఆగమన్నాడో చెప్పడానికి ఏమీ తోచలేదు. ఇంకా నిద్దర్లోనే వుండు సారూ అంటూ

ఆమె కిలకిలా నవ్వి, వెళ్లిపోబోయింది. ని..న్నీ పేరూ? అన్నాడు రాజారావు గబుక్కున – తడబడుతూ. అపరంజి అదే నవ్వు సాయంతో అని, మెరుపు తీగలా మాయంయ్యిందామె.

నెమ్మదిగా తేరుకుంటూ 'మనిషే అనుకుంటే పేరు కూడా ఎంత బాగుందీ! లంబాడా పిల్లలా వుంది. ఇంత మంచి పేరు ఎలా తట్టిందో? సినిమా హీరోయిన్లు ఈమె ముందు బలాదూరు. ఈ అడవులలోంచి తీసుకెళ్ళి, ఎండా వానల తాకిడి లేకుండా ఒఖ్ఖ మూడు నెలలు ఉంచితే .. జానపద కథల్లో మనం చదివే రాచకన్యలు ఈమె ముందు దిగదుడుపే.'

రాజారావు గుండెలు ఓ వింత ఆనందంతో రవళించ సాగాయి. ఈ ఇన్స్పెక్షన్ డ్యూటీ ఓ వరం అనిపించ సాగింది. ఆ నర్సిమ్మ గాడు రాకుండా వుంటే.. అపరంజే స్నానానికి నీళ్ళూ, టిఫిను, భోజనం .. అంటూ తరుచూ వచ్చి కనబడుతూంటే... తరుచు తను ఆమెతో మాట్లాడుతూంటే .. అవకాశం వుండి తను ఏదో మిష మీద ఆమెని ముట్టుకో గలిగితే.. తను తీసుకునే ఆ చనువుకి ఆమె అభ్యంతరం చెప్పక పోతే.. తను ఇంకొంచెం చొరవ తీసుకుని... ఆలోచనలతో ఆపాదమస్తకం పులకించిపోయింది రాజారావుకి.

దండాల్దొరా బండరాళ్ళు దొర్లుతూన్నట్లున్న స్వరం. అదిరిపడ్డంత పనయ్యింది రాజారావుకి. చటుక్కున తల తిప్పి చూసాడు. ఎదురుగా చేతిలో పెద్ద దుడ్డు కఱ్ఱతో నల్లగా .. మొరటుగా వున్న చెయ్యెత్తు బుఱ్ఱ మీసాల మనిషి. అపరంజి అయ్యని. 'కొంపదీసి ఇందాక తను ఒళ్ళు తెలియక అపరంజితో అతి చనువుగా ప్రవర్తించాడా? తండ్రికి కంప్లైంట్ ఇచ్చిందా?'

ఈడ ఆచ్మన్ని. పేరు కురంగి. తమకేంగావాలన్న నాకయినా, నా బిడ్డకయినా జెప్పుర్రి

'హమ్మయ్య! గొడవకి రాలేదు. థాంక్ గాడ .. భయం స్థానంలో దర్పం చోటు చేసుకుంది. అట్లానేలే అన్నాడు రాజారావు. ఇంతలో ఎక్కడ్నుంచి వచ్చిందో పెద్ద సింహంలాంటి కుక్క ఒకటి ఎగురుతూ వచ్చి, గుఱ్ఱున చూస్తూ.. రాజారావు మీదకి రాబోయింది. భయంతో కంపించిపోయాడు రాజారావు. కురంగి దాన్ని ఆఁ .. అని గదమాయించి, లంబాడా భాషలో ఏదో అన్నాడు. మరుక్షణం అది అతి సాత్వికంగా మారిపోయి, వెనక రెండు కాళ్ళ మీద నిలబడి, ముందు కాళ్ళని జోడించి నమస్కరించింది రాజారావుకి.

ఇగ మిమ్ములేన్నం సెయ్యదు. దీని పేర బీముడు దొరా అభయమిచ్చాడు కురంగి. రెండు రోజులు గడిచాయి. అపరంజి అందం రాజారావు మెదడుని కుదుపుతోంది.. మనసుని చెదరగొడుతోంది. ముఖ్యంగా ఓరగా సన్నగా నవ్వే ఆమె నవ్వు గుండెలకి గిలిగింతలు పెడ్తోంది. ఆమెతో అలా మాట్లాడుతూనే ఉండాలనీ.. అవకాశం వస్తే లక్ష్మణ రేఖ దాటాలనీ.. తెగ ఉబలాటంగా వుంది. అంతలోనే.. తెలిస్తే కురంగి చంపేస్తాడన్న భయం. పైగా అపరంజి

కూడా అవసరమైనంత మేరకే తన సమక్షంలో ఉంటోంది తప్ప ఆపైన ఒక్క క్షణం కూడా వుండడం లేదు. తన నేర్పంతా చూపిస్తూ మాటలతో పడగొట్టాలంటే అవకాశమే చిక్కడం లేదు.

మరో రెండు రోజులు గడిచాయి. ఈ తండ్రీ కూతుళ్ళకి సంబంధించిన సమాచారాన్ని నర్సిమ్మ నుంచి రాబట్టాడు రాజారావు. అపరంజికి తల్లి లేదు. తండ్రే సర్వస్వం ఆమెకి. ఎంత అమాయకంగా కనిపిస్తుందో అంత సాహసవంతురాలు, ధైర్యవంతురాలు అపరంజి. నిప్పులాంటి మనిషి. కురంగి పెద్ద త్రాగుబోతు. అదే అతని బలహీనత. అంతకి మించిన అవలక్షణాలుగాని, దౌర్జన్య లక్షణాలు గాని ఏమీ లేవు.

కురంగికున్న అవలక్షణమయిన త్రాగుడుని తనకి అనువుగా మార్చుకునే అవకాశం ఏమన్నా ఉంటుందా అన్న ఆశ పొటమరించింది రాజారావులో.

కురంగీ! నువ్వు తాగుతావా? అనడిగాడు .. రాత్రి పడుకునే ముందు కర్ర చప్పుడు చేస్తూ బిల్డింగ్ చుట్టూ ప్రక్కల అంతా అతగాడు చెక్ చేస్తూన్నప్పుడు. జవాబు చెప్పడానికి సిగ్గుపడ్డాడు కురంగి. లోపలి గదిలోకి వెళ్ళి, సూట్ కేస్ లోంచి ఫారెన్ విస్కీ బాటిల్ తెచ్చి, ఇదుగో.. ఎవరో బహుమతిగా ఇచ్చారు నాకు. నేను తాగను. నువ్వు తీసుకో అన్నాడు.

సిగ్గుపడ్డ కురంగి, చేతులు జోడించి, నాకెందుకు దొరా గంత ఖరీదైన సీమ సరుకు? అన్నాడు. ఫర్వాలేదులే తీసుకో. బాగుంటుంది అంటూ బలవంతంగా అతని చేతిలో పెట్టాడు రాజారావ్.

ఆ మర్నాటి నుంచీ మరింత వినయంగా ప్రవర్తిస్తూన్నాడు కురంగి. 'నా బహుమానం బాగానే పని చేసిందన్న మాట అనుకుంటూ చిరు గర్వంగా నవ్వుకుని, ఇంక నేనిక్కడ ఉండేది నాలుగు రోజులే. ఈ నాలుగు రోజుల్లోనూ వీడిని మరింత లొంగదీసుకుని, మత్తులో ముంచి, అపరంజిని మాటల్లో పడగొట్టి, ఆరంగేట్రం కానియ్యాలి' అని నిశ్చయించుకున్నాడు రాజారావు. అతని కోరిక నిర్వహణకి బలం చేకూరుస్తూ ఈరోజు ఉదయం మరో శుభవార్త చెప్పాడు కురంగి. అతని దగ్గర బంధువు ఎవరో పొరుగూర్లో చనిపోయాట్ట. అందుకని ఓ రెండ్రోజులపాటు తను వెళ్ళు తూన్నానని.. రాజారావుకి కావాల్సిన పన్లన్నీ అపరంజి చేస్తుందని. రాజారావు మనస్సు ఆనందంతొ త్రుళ్ళి త్రుళ్ళి పడసాగింది. ఇంతకంటే మంచి అవకాశం ఏముంటుంది? పోయిరా. నువ్వు వచ్చాక మరో బుడ్డి ఇస్తాలే అన్నాడు కురంగితో. రెండు చేతులూ జోడించి వెళ్ళాడు కురంగి.

పగలంతా డ్యూటీలో ఉన్నంత సేపూ ఈ రాత్రికి అపరంజిని ఎలా లొంగ దీసుకోవాలనే ఆలోచనే. అల్లరి జరగ కూడదు. తనకి గాని, తన ఉద్యోగానికి గాని, పరువు ప్రతిష్టలకి గాని ఎటువంటి ప్రమాదం రాకూడదు. అపరంజి మనసు గాయ పడకుండా .. ఆనందంగానే ..

తండ్రి వూళ్ళో లేని అవకాశాన్ని వినియోగించుకుని.. తనతో సహకరించాలి. ఏది మార్గం? మాటలతో పడగొట్టడం సాధ్యమేనా? ఆమె బీదరికాన్ని ఎత్తి చూపుతూ డబ్బో, తన మెళ్ళో వున్న బంగారం గొలుసునో ఆశ చూపితే? ఆలోచనలు.. బుర్రని తింటూన్నాయి...

సాయంత్రం డ్యూటీ అయ్యాక క్వార్టర్స్ కి వచ్చాడు రాజారావు.

నర్సిమ్మ ఉన్నాడు అక్కడ. 'వీడు త్వరగా పోతే బాగుండును' గొణుక్కున్నాడు రాజారావు లోలోనే. నర్సిమ్మ త్వరగా పోలేదు సరికదా.. రాజారావు దిమ్మ తిరిగిపోయే వార్తని చెప్పాడు. సారూ! గీ వార్త ఇన్నరా మీరు? అనడిగాడు ముందు. విషయం తను చెప్పకుండా అవతలి మనిషిని ప్రశ్నించే అతని స్వభావం ఈసారి తనున్న పరిస్థితిలో విపరీతంగా కోపం తెప్పించింది రాజారావు కి –. ఏ విషయమయ్యా? అని కసురుకున్నాడు.

మన అపరంజి పోరి లేదా... అంటూ ప్రారంభించి ..జరిగిన సంఘటనని వివరిస్తూ .. వర్ణిస్తూ చెప్పిన విషయం విని, రాజారావు వెన్నులో చలి ప్రారంభమయ్యింది. నర్సిమ్మ చెప్పిన సంఘటన వివరాలు ఏమిటంటే...

'ఈరోజు మధ్యాహ్నం అపరంజి ఇప్ప పూలు ఎరుకు రావడానికి అడవి లోపలికి వెళ్లిందట. జీపులో వస్తూన్న నలుగురు పోతుల్లాంటి యువకులు ఎదురుపడి.. అపరంజిని లైంగికంగా లొంగదీసుకోవడానికి బల ప్రదర్శన చేసారట. అంత నాజూకుగా వుండే అపరంజీ కూడా అపర కాళికా దేవతావతారమెత్తి.. ఓ కట్టె తీసుకుని, నలుగురు పోతులనీ ఎదుర్కొందట. ఆయుధాలు లేకుండా ఆమెని స్వాధీనం చేసుకోవడం సాధ్యం కాదని గ్రహించిన ఆ పోతులు జీపులోంచి మారణాయుధాలు తీసుకుని వచ్చారట. అయినా అపరంజి ధైర్యంగానే నిలబదిందట. ఇంతలో ఆమెకి అత్యంత విశ్వాస పాత్రురాలయిన భీముడు ఎలా పసిగట్టిందో మరి – వాయు వేగంతో ఉరికి ఉరికి వచ్చి .. వాళ్ళ ఆయుధాల దెబ్బలని చాకచక్యంగా తప్పించుకుంటూ.. వాళ్ళ మీద పడి, కండలు పీకేసిందట. దెబ్బకి తోక ముడిచారుట దున్నపోతులు. అపరంజి, భీముడు కలిసి వాళ్ళని అడవి పోలిమేరలవరకూ తరిమి తరిమి కొట్టి తిరిగొచ్చారట.' ఏదో సస్పెన్స్ థ్రిల్లర్

స్టోరీ చెప్పుతూన్నట్లు ఆంగిక సాత్వికాభినయాలతో నర్సిమ్మ వర్ణించి చెప్పుతూన్నకొద్దీ రాజారావు లో ఒణుకు అధికమవ సాగింది. అపరంజి నిప్పులాంటి పోరి సారూ. మంచోల్లకి పాణమిస్తది. ఏసాల్ గిట్లేస్తే పాణం దీస్తది అని ముక్తాయించాడు నర్సిమ్మ.

స్నానానికి వేడి నీళ్ళు, తినడానికి పకోడీలు, చాయ్ తెచ్చి రాజారావు ముందు పెట్టి, ఇంటికి వెళ్ళిపోయాడు నర్సిమ్మ. తిన బుద్ధి కాక, అతి కష్టం మీద రెండు పకోడీలు తిని, చాయ్ తాగాడు రాజారావు. స్నానం చెయ్యడానికి శరీరం, మనస్సూ సహకరించక.. జ్వరం వచ్చిన భావం కూడా కలిగి, మంచం మీద వాలాడు.

తను తొందర పడి వుంటే .. తన పరిస్థితి ఏమయి ఉండేదో తలుచు కుంటూంటే .. ఒణుకు ఎక్కువై.. దానికి జ్వరం కూడా తోడై.. ఒంటిని కుదిపెయ్యసాగింది. హైదరాబాద్ లో తను బయల్దేరినప్పుడు ఎండలు చంపేస్తూండడంతొ అన్నీ పల్చని నూలు బట్టలే తెచ్చుకున్నాడు తను. ఈ చలిని ఆ బట్టలతో తట్టుకోవడం అసాధ్యం అనిపిస్తోంది. కాని చేసేదేముంది? ఉన్నవాటి తోనే సర్దుకుని, దుప్పటీ కప్పుకున్నాడు. కొద్ది సేపట్లోనే చలి, జ్వరం ఎక్కువ అయ్యాయి. ముడుచుకున్నాడు. క్రమేపీ మగత కమ్మేసింది....

నిద్దర్లో .. జ్వర తీవ్రతలో పలవరింతలు కూడా మొదలయ్యాయి.. లోనుండి సెగలు సెగలుగా  వేడి తన్నుకొస్తోంది... మాత్రలు ఏవీ లేవు.. గొంతు ఎండిపోతోంది.. లేచి మంచినీళ్ళు తాగుదామన్నా శక్తీ చాలడం లేదు.. రాత్రి ఎంత టైమయ్యిందో కూడా తెలియదు.. తెల్లారితే తను ప్రాణంతో నిలుస్తానా అన్న కొత్త సంశయం... నిద్దర్లో ఏవేవో పీడ కలలు... అడవిలోని భయంకర క్రూర మృగాలన్నీ తన మీదకి దాడికి వచ్చి పీక్కు తింటూన్నట్లు భయ భ్రాంతులు..అంతలో ఎవరో తన మీద జాలి చూపిస్తూ వచ్చి, తనకి వెచ్చని రగ్గులు కప్పుతూన్నట్లు, తనని అక్కున జేర్చుకుని అభయమిస్తూ తనలో ధైర్యం కలిగిస్తూన్న ఓదార్పు భ్రాంతి...

కొన్ని గంటలు అలా ఆ అవస్థలో గడిచాక కొద్దిగా జ్వరం, చలి తగ్గు ముఖం పట్టుతోందని అనిపిస్తూండగా... కొద్ది పాటి మెలకువ వచ్చి .. అతి నెమ్మదిగా కళ్ళని అర తెరచి .... అత్యంత సంభ్రమాశ్చర్యాలకి లోనయి పోయాడు రాజారావు.

తన ఒంటి మీద ఎంతటి చలిని అయినా కాసే ఓ ముతక కంబళీ వుంది.. అంతకంటే ఆశ్చర్యం .. ఆ కంబళీ మీదుగా .. ఒత్తిగిల్లి పడుకుని వున్న తనని వెనకనుంచి చుట్టుకుని పడుకుని వున్న ఓ స్త్రీ తాలూకు చేతులు. ఇదీ కలలో భాగమేనా అనిపిస్తోంది. కొద్దిగా కదిలినా ఈ 'కల' చెదిరిపోతుందేమోననిపిస్తోంది. అంత చలి జ్వరంతో వున్న తనకి కంబళీ కప్పడమే కాక అంతగా తనని పొదివి కౌగలించుకుని పట్టుకుని పడుకున్న స్త్రీ ఎవరి వుంటారు?! ఇంకేవరుంటారు?.. అపరంజియే అయి వుంటుంది. ఏమిటి ఈ అమ్మాయి ఉద్దేశం?

ఎంత కదలకుండా అలా పడుకునే ఉందామనుకున్నా .. సాధ్యపడక కొద్దిగా కదలక తప్పలేదు రాజారావు కి. అంతే.. తన పట్టుని సడలించి.. చేతుల్ని గబుక్కున వెనక్కి తీసుకుని.. మంచం మీది నుంచి దూకింది ఆమె.

ఓపిక వచ్చి దిగ్గున మంచం మీద లేచి కూర్చుని ఆమె ముఖం లోకి చూసాడు రాజారావు. అపరంజి! ఆమె ముఖంలో విజయం సాధించిన, సంతృప్తితో కూడిన ఓ వింత సంతోషం.. చప్పట్లు కొట్టి, సారుకి బీమార్ తగ్గిపోయిందీ .. అని, అంతలోనే సర్దుకుని, కొంచెం దూరం జరిగి, రేత్రి నున్చెల్లి మీకు బూకారుంది. ఒల్లు కొలిమి లెక్క కాలిపోబట్టె. సలిజొరంతో ఊఖే

ఒణికిపోబట్టిన్రు. కంబళి గప్పినా. సలికి సాల్లే. గందుకని.. నువ్వుభీ మా బాపులేక్కేననీ.. అని ఆగి మళ్ళీ మా బాపుకి ఓసార్లే.. గిట్లనే బూకారొస్తే.. గట్లనే అంటిబెట్టుకు పండిన. తగ్గిబోనాది. నీకుభీ గట్లనే సేస్తే తగ్గుద్దని... అంటూండగా ఆమె గొంతు అనుమతి తీసుకోలేదన్న అపరాధభావంతో సన్నగా ఒణికింది.

రాజారావు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఇట్లా రా అన్నాడు వేలు ఆడిస్తూ తనవైపుకి చూపిస్తూ.

భయపడుతూనే దగ్గరకొచ్చింది. కూర్చో అన్నాడు. మోకాళ్ళ మీద కూర్చుంది. ఆమె ముఖం చుట్టూ చేతులు వుంచి, ఆత్మీయంగా దగ్గరగా తీసుకుని, నొసట చుంబించి, అరచేతిని తల మీద వుంచి దీర్ఘాయుష్మాన్ భవ. శీఘ్రమే కళ్యాణ ప్రాప్తి రస్తు. నీ పెళ్ళికి మీ బాపూకి నేను కూడా సాయం చేస్తా. నూరేళ్ళూ చక్కటి భర్తతో, పండంటి పిల్లా పాపలతో సుఖంగా జీవించు తల్లీ అని ఆశీర్వదించాడు.

అపరంజి బుగ్గల్లో కెంపులు పూసాయి. అతని పాదాలని కళ్ళకద్దుకుంది.అపరాధ భావంతో  కుమిలిపోతూన్న రాజారావు కళ్ళ నుంచి జర్రున జారిన రెండు కన్నీటి బొట్లు .. కృతజ్ఞతా భావంతో  ఆమెని ఆశీర్వదిస్తూన్న అక్షింతలుగా .. ఆమె తల మీద వ్రాలాయి.

***

**తులసి బాలకృష్ణ స్వస్థలం హైదరాబాద్. బ్యాంక్ మేనేజర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ఈయన నాలుగున్నర దశాబ్దాల నుంచి కథలు రాస్తున్నారు. మొట్టమొదటి కథ నైజం. స్వాతి మాసపత్రికలో ముద్రితమయ్యింది. ఇప్పటికి 400లకు పైగా కథలు రాసారు. ఇవి వివిధ ప్రముఖ పత్రికలలో అచ్చయ్యాయి.  నాలుగు నవలలు రాసారు. అలాగే రెండు నాటకాలు, ముప్పై ఆరు నాటికలు, నలభై రేడియో నాటికలు రాసారు. ఆయన తులసీ దళాలు, గిలిగింతలు అనే పుస్తకాలను సైతం వెలువరించారు. చెప్పుకోదగ్గ సంఖ్యలోనే బహుమతులు, సన్మానాలు, పురస్కారాలు పొందారు. రచయి-ంతగా, రంగస్థల నటుడిగా, దర్శకుడిగా, ఉభయ తెలుగు రాష్ట్రాలలోని ప్రముఖ సాహిత్య, సాంస్కృతిక సంస్థలచే పలుమార్లు సన్మానింపబడినారు. గురజాడ పురస్కారం, శ్రీశ్రీ పురస్కారం అందుకున్నారు.**

Katha PART 1_Layout 1 6/29/2023 2:38 PM Page 192

# ఇంకా తెలవారదేమీ



ఉమా మహేష్ ఆచాళ్ళ
9849303247

అడుగులేసినంత మేరా ఆక్రమించే అదేదో యాగంలో అశ్వానికి మాత్రం అలుపే మిగిలినట్టు, ప్రగతికి బాట లేసే తాతబ్బాయి మొహానికి పట్టిన చెమటని చొక్కాతో తుడుచుకుంటూనే మరోచేత్తో రోడ రోలరు స్టీరింగ్ తిప్పుతున్నాడు.

నాతో పోటీయా అన్న ట్టు సాయంత్రం ఆరైనా సూర్యుడు కూడా డ్యూటీ దిగలేదు. వారం రోజులుగా తార్రోడ్డు మెయిన్టెనెన్సు లో భాగంగా పేచ్ వర్క్ జరుగుతోంది. ఆరోజే ఆఖరు. గంటకి ఐదు కిలోమీటర్ల వేగంతో నడుపుతున్న రోలరు కిందనింది ఏభై డిగ్రీల వేడి నేరుగా తగులుతోంది. తారు, డీజిల్, ఎమల్షన్, కలిసిన వాసనతో ముతక గుడ్డ ముక్కులో కుక్కినట్టు ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు తాతబ్బాయి.

ఏడాదిలో ఓ ఆరు నెలల పని. ఆ ఆరు నెలలూ ఇంటికెళ్ళాక కూడా చేపల పులుసొండినా, చేమదుంపల కూరొండినా ఇదే వాసన వెంటాడుతూ ఉంటుంది. జీతం మాత్రం పద్దెనిమిది వేలు చొప్పున పన్నెండు నెలలూ ఇస్తాడు కాంట్రాక్టర్. కాళ్ళ వాపులు కిడ్నీలనీ, ఆయాసం హార్టునీ చెక్ చేయించమని చెబుతున్నా, ఖాళీ జేబు కాలక్షేపం

చేయిస్తోంది. ఇలాంటి వృత్తి పరమైన ఆరోగ్య సమస్యల కారణంగా అతను నలభై ఐదేళ్ళ క్రితం పుట్టినా ఏభై ఐదేళ్ళ క్రితం పుట్టిన వాడిలా ఉంటాడు.

నోరులేని రోలరుని చల్లార్చటానికి నాజిల్స్ ద్వారా నీటి చుక్కలు పడుతున్నాయి. అలాంటి సదుపాయం లేని తాతబ్బాయి తన సీట్ పక్కనే ఉన్న వాడేసిన కూల్ డ్రింక్ బాటిల్ లో వేడెక్కిన నీళ్ళని తాగలేక, మొహం మీద పోసుకోనూలేక ఉసూరు మంటూ రోలరు దిగాడు.

పనైపోయిందని సూపర్ వైజర్ ఫోన్ చేసినట్టున్నాడు డైలీ వర్కర్స్ కి పేమెంట్ ఇవ్వటానికి కాంట్రాక్టర్ శ్రీపతి వచ్చి కారు దిగి రోడ్డునోసారి పరీక్షించి చూసి ఎవరితోనో ఫోన్లో మాట్లాడి, తాతబ్బాయిని పిలిచాడు. కాళ్ళూ చేతులూ మొహం కడుక్కుని, తుడుచుకుని వచ్చి చేతులు రెండూ దగ్గరగా పెట్టుకుని నించున్నాడు తాతబ్బాయి.

ఏం తాతబ్బాయి ఎలా ఉన్నావు. ఈరోజుతో పనైపోనట్టేనా? అయిపోయింది సర్, ఓ గంటలో ఆరిపోద్ది. రోడ్డు అప్పుజేప్పేయొచ్చు అన్నాడు తాతబ్బాయి వినయంగా. గుడ్ . అవునూ, మీ అబ్బాయి పాలిటెక్నిక్ చదివాడన్నావు కదా. ఇప్పుడేం చేస్తున్నాడు. ఏవో కోర్సులు నేర్చుకున్నాడయ్యా. గల్ఫ్ లో ఏదో ఆఫర్ వచ్చిందట. అమౌంట్ కావాలి. దానికోసం తిరుగుతున్నాడు. అవునా?. నువ్వు కుడా అప్పట్లో ఐ.టి.ఐ పూర్తి చేసుంటే ఈపాటికి ఎక్కడో ఉండేవాడివి అని నవ్వి, మన పరిస్థితి నీకూ తెలుసుగా. ఎక్కడి పేమెంట్లు అక్కడ ఆగిపోయాయి. వడ్డీకి తెచ్చి మరీ పనులు పూర్తి చేస్తున్నా. అవును సర్. పనుల్లేకపోయినా మా జీతాలు కూడా ఆపకుండా ఇస్తున్నారు. అందుకే మిమ్మల్ని అడగటానికి మనసొప్పలేదు . ఏమాత్రం అవకాశం ఉన్నా మీరే ఇచ్చేవారు అన్నాడు తాతబ్బాయి కృతజ్ఞతగా.

అంతలో శ్రీపతి ఫోన్ మోగింది. కొడుకు ఈవెనింగ్ బయటకి వెళ్ళాలట. కారు కావాలని ఫోన్. ఓకే, నాన్నా, వచ్చేస్తున్నా. ఫైవ్ మినిట్స్ అంటూ ఫోన్ పెట్టేసి, సరే చూద్దాంలే, వచ్చే వారం పనెక్కడో సూపర్ వైజర్ చెబుతాడులే. నువ్వెళ్ళు. మళ్ళీ నీకు లేటవుతోంది. ఇంటికెళ్ళి వంట చేసుకోవాలి కాబోలు అంటూ తాతబ్బాయిని పంపేసి, సూపర్ వైజర్ కి పేమెంట్ ఇచ్చేసి కారెక్కి ఇంటికి వెళ్ళిపోయాడు శ్రీపతి.

* * *

ఇంటికొచ్చి స్నానం చేసి ఇండాలియం గిన్నెలో బియ్యం పెట్టి, టమోటాలు, ఉల్లిపాయలు కోసి పక్కన పెట్టుకున్నాడు తాతబ్బాయి. నాన్నా, ఫ్రెండ ఇంటికి వెళ్తున్నా చదువుకోడానికి. రాత్రి అక్కడే పడుకుంటా, త్వరగా అన్నం పెట్టు అన్నాడు మల్లేసు. గుడ్లు ఇంకా రాలేదురా. కాసేపు ఉంటావా లేక మధ్యాన్నం రసం ఉంది దాంతో తినేస్తావా ? ఏదో ఒకటి త్వరగా పెట్టేయ్ అంటూ హడావిడిగా తినేసి వెళ్ళిపోయాడు మల్లేసు.

వళ్ళంతా పులిసిపోయి, కళ్ళు మండుతూ ఉండటంతో ఇంత మజ్జిగా అన్నం తిని పడుకుందామని కంచంలో అన్నం పెట్టుకుని మజ్జిగ పోసుకున్నాడు తాతబ్బాయి.

జ్ఞాపకాల తెరలు తెరుచుకున్నాయి. రోజూ ఉదయాన్నే టీ తో మొదలు, మూడుపూట్లా మూడు ఐటమ్స్ కి తక్కువలేకుండా వేడిగా పెట్టేది. డ్యూటీ లో తన కేరేజీ విప్పగానే అంతా చుట్టూ మూగేవారు. అలాంటిది ఇప్పుడు పొద్దున్నే ఇంత టీ చుక్క కలుపుకుని తాగి, రెండు పూటలా రసమో, పప్పో , కూరో, ఒక్క ఐటెం వండుకుని డ్యూటీ కి వెళ్ళటం కష్టమైపోతోంది. ముద్ద నోట్లో పెట్టుకోబోతూ ఉండగా ఆలోచనలు చెదిరేలా ఫోన్ మోగింది. చూస్తే శ్రీపతి. సర్ నమస్తే , చెప్పండి సర్ అన్నాడు నర్సింగ్. తాతబ్బాయి ఎక్కడున్నావు ? ఇంటిదగ్గరే సర్.. నువ్వు అర్జెంటు గా రావాలి. షేర్ ఆటో గురించి చూడకు, బేరం ఆడకు. దొరికిన ఆటో పట్టుకుని ఇంటికి రా మాట్లాడాలి

* * *

తాతాబ్బాయి వెళ్ళేటప్పటికి శ్రీపతి తన ఇరవై ఏళ్ల కొడుకుని ముద్దుగా తిడుతున్నాడు. సిటీ లో నెమ్మదిగా వెళ్ళాలి కదా నాన్నా. ఏం కాదులే. నువ్వు కంగారు పడకు. నేనున్నాను గా అంటూ బుజ్జగిస్తున్నాడు. సార్, అర్జెంటు గా రమ్మనారు నెమ్మదిగా అడిగాడు తాతాబ్బాయి.

కూర్చో తాతబ్బాయి. పర్లేదయ్యా . ఏంటి సర్ ఏదైనా సమస్యా అడిగాడు కంగారుగా తాతాబ్బాయి . ఓ ప్రాబ్లం వచ్చింది తాతబ్బాయి. చిన్న ఆక్సిడెంట్. మన ఏరియా లోనే ఎవరో కుర్రాడు కారుకి అడ్డుగా వచ్చి పడ్డాడట. అక్కడికీ బాబు నెమ్మదిగానే వెళుతున్నాడట అంటూ నెమ్మదిగా విషయం చెప్పాడు శ్రీపతి. నాలుసార్లు అడిగితే గానీ తండ్రికే చెప్పలేదు స్పీడో మీటర్ నూట ఇరవై దగ్గర స్టక్ అయ్యిందని. అడక్కుండా తాతబ్బాయి కి మాత్రం నిజం ఎలా చెబుతాడు.

అతన్నెందుకు పిలిచాడో తాతబ్బాయి కి చూచాయిగా అర్థం అవుతోంది. దెబ్బ తగిలిన కుర్రాడు ఎలా ఉన్నాడు సర్ అడిగాడు. వెంటనే హాస్పిటల్ లో జాయిన్ చేసాం. చిన్న హెడ్ ఇంజురీ అట. మెడికో లీగల్ కేసు అయ్యేటట్టుంది. ఇంకా పెర్మనెంట్ లైసెన్స్ రాలేదు. అందుకని బాబు భయపడుతున్నాడు. చదువుకి కాస్త ఇబ్బంది అవ్తుందేమో అని కూడా కంగారు పడుతున్నాడు. లక్కీ గా అక్కడ సి.సి కెమేరాలేవీ లేవు. వెహికల్ స్టేషన్ లోనే ఉంది. 'బాబు వెనక సీట్లో ఉన్నాడు, డ్రైవర్ భయపడి పారిపోయాడు, ఫోన్ చేసాము. వచ్చి రిపోర్ట్ చేస్తాడు' అని సేఫ్ సైడ్ కి చెప్పి ఉంచాము. మన లాయర్ తో కూడా మాట్లాడాను. నువ్వెళ్ళి ఎస్. ఐ ని కలిస్తే చాలు. ఎఫ్ .ఐ. ఆర్ కట్టి స్టేషన్ బెయిల్ ఇస్తాడు. ఇవ్వకపోయినా రేపు కోర్ట్ తెరిచిన వెంటనే బెయిలు తెచ్చేద్దాం. కాంప్రమైజ్ కి వస్తే సరి, లేదంటే కేసు నడుస్తుంది. ఎలాగైనా కొట్టించేద్దాం. నీకేం ఇబ్బంది ఉండదు. ఇలా అంటున్నానని ఏమీ అనుకోకు. మీ అబ్బాయి ఉద్యోగానికి ఏదో అమౌంట్ కావాలన్నావు కదా. అది నేను ఎరేంజ్ చేస్తాను నెమ్మదిగా చెప్పవలసింది చెప్పి ముగించాడు శ్రీపతి.

అతనికి టెన్షన్ గా ఉంది. రాత్రిలోగా ఎవరో ఒకర్ని తీసుకెళ్ళి అప్పజెప్పేస్తే మేనేజ్ చెయ్యొచ్చు. తాతాబ్బాయి ఎంత మంచివాడైనా ఒప్పుకుంటాడో లేదో. ఒప్పుకోకపోతే

ఇప్పటికిప్పుడు మరొకర్ని వెతుక్కోవాలి.

తాతబ్బాయి కి విషయం పూర్తిగా అర్థమైంది. లారీ డ్రైవర్ గా ఉండేటప్పుడు ఇలాంటివి ఒకటి రెండు విని ఉన్నాడు. అతనకి పెద్దగా అభ్యంతరం ఏమీ కనబడలేదు. అయ్యా, పదేళ్లనించి నా మంచి, చెడ్డ మీరే చూస్తున్నారు. స్టేషన్ కి వెళ్ళటం పెద్ద పనేముందయ్యా. మీరు అంతగా చెప్పాలా. బాబూ, నువ్వేం కంగారు పడకు. నేను చూసుకుంటా అంటూ తాతబ్బాయి ఒప్పుకునేసరికి శ్రీపతి తేలిగ్గా ఊపిరి తీసుకుని కొడుకు చేత తాతాబ్బాయి కి థాంక్స్ చెప్పించి లోపలి పంపేసాడు.

తాతాబ్బాయి భుజం మీద చెయ్యేసి గేటు వరకూ తీసికెళ్తూ మరోసారి చెబుతున్నాను తాతబ్బాయి. మీ అబ్బాయి గల్ఫ్ వెళ్ళటానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ చేస్తాను. ఈ చిన్న సాయం చేసిపెట్టు అన్నాడు శ్రీపతి అతని చేతులు పట్టుకుని. సర్ మీరు ఇంక ఈ విషయం మర్చిపోండి. దయచేసి డబ్బు మాట మాత్రం ఎత్తకండి సర్. అంతగా అవసరమైతే ష్యూరిటీ ఉండి లోను ఇప్పించండి చాలు. అయినా ఆ విషయం దీంతో ముడిపెట్టకండి సర్. నాకు ఇబ్బందిగా ఉంటుంది. నా కొదిలేయండి అన్నాడు తాతబ్బాయి.

చాలా థాంక్స్ తాతబ్బాయి అంటూ తన ఫ్రెండ కార్లో కూర్చోబెట్టి స్టేషన్ వరకూ దింపి రమ్మన్నాడు. శ్రీపతి స్పర్శతో పునీతమైన తన రెండు భుజాలు చూసుకుని మురిసిపోతూ మొదటి సారి మెత్తటి కారు సీట్ లో కూర్చుని బయలు దేరాడు తాతాబ్బాయి ముస్తాబైన మేకలా.

* * *

అర్థరాత్రి రెండు. తండ్రి మీదున్న నమ్మకంతో శ్రీపతి కొడుకు ధైర్యంగానే ఉన్నా నిద్ర మాత్రం రావటం లేదు. అన్నీ బావుంటే అతనీపాటికి ఫార్మ్ హౌస్ లో పార్టీ లో ఉండేవాడు. అదొక్కటే దిగులు.

పక్కగదిలో ఎవరెవరికో ఫోన్లు చేస్తూ, 'అంతా ఓకే' అని స్టేషన్ నించి సంకేతం కోసం ఎదురు చూస్తూ, అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు శ్రీపతి. ఇవేవీ తెలియని అతని భార్య మేడపైన నిద్రపోతోంది. అంతలో కాలింగ్ బెల్ మోగేటప్పటికి ఒక్క ఉదుటున లేచి తలుపు తీసి చూస్తే ఎదురుగా తాతాబ్బాయి. లోపలికి రా తాతాబ్బాయి ఏం ప్రాబ్లం లేదుగా? ఎఫ్.ఐ.ఆర్ కట్టారా? స్టేషన్ బెయిల్ ఇచ్చారా ? అడిగాడు ఆదుర్దాగా తాతబ్బాయిని లోపలికి తీసుకెళ్తూ.

స్టేషన్ నించి హాస్పిటల్ కి వెళ్లి వస్తున్నాను సర్. ఆ కుర్రాడు పోయాడు సర్ అన్నాడు తాతబ్బాయి. అతని కళ్ళల్లో ఎరుపుకి కారణం రోజూ పీల్చే తారూ, డీజిలే అనుకున్న శ్రీపతి అదేం పట్టించుకోకుండా, నిన్ను స్టేషన్ కి వెళ్ళమంటే హాస్పిటల్ కి ఎందుకెళ్ళావు? నువ్వెళ్ళిన పనేమైందో అది చెప్పు అన్నాడు ఆదుర్దాగా.

నా వల్ల కాదు సర్ క్షమించండి. ఏమైంది తాతాబ్బాయి. నువ్వు ఎలా అంటే అలాగే అన్నానుగా. మీ అబ్బాయి కి డబ్బు సర్దుతానన్నాను. నువ్వే వద్దన్నావు. మళ్ళీ ఇప్పుడేంటి

అడిగాడు విసుగ్గా. లాయర్ కానీ పోలీసులు కానీ ఇతని బుర్ర పాడు చేసారా, మీడియాకి తెలిసిపోయిందా, లాంటి అనుమానాలు మొదలయ్యాయి అతనిలో. అదేం లేదు సర్. మా అబ్బాయి ఇకపై గల్ఫ్ వెళ్ళాల్సిన పని లేదు. అదేం ? ఏమైంది ? అనుమానంగా అడిగాడు శ్రీపతి. ఏం లేదు సర్ ఇకపై వాడు నాతోనే ఉంటాడు చెబుతూ ఉంటే తాతబ్బాయి గొంతు వణుకుతోంది. ఏమైంది తాతబ్బాయి, సరిగా చెప్పు. అయ్యా, మీ దగ్గర చేరక ముందు లారీ నడిపేవాడిని. రోజూ డ్యూటీ కి వెళ్ళేముందు నెమ్మదిగా తోలమని చెప్పి మరీ పంపేది నా భార్య. నెమ్మదిగా నడుపుతున్నానని, సరుక్కి డెమరేజీలు పడుతున్నాయని తీసేస్తే, రోలరయితే పదికి మించి స్పీడ తొక్కక్కర్లేదని మీ దగ్గర చేరాను.

నా భార్య ఎలా పోయిందో తెలుసా సర్. పక్కింటి వాళ్ళ కోడలు నీళ్ళోసుకుంటే సాయానికి ఈమెని వెళ్ళమన్నారు. నేను ఇబ్బంది పడతానని మొదట వెళ్ళనంది. కడుపుతో ఉన్న పిల్లకి సాయం కదా అని బలవంతంగా పంపిస్తే వెళ్ళింది. పురుడయ్యాక తిరుగు ప్రయాణానికి రైల్లో టికెట్ దొరకలేదు. ఏదో బందని ఆర్టీసీ బస్సులు తిరగలేదు. టికెట్ కి రెట్టింపు డబ్బిచ్చి ఓ ప్రైవేట్ బస్సులో బయలుదేరింది. ఆ డ్రైవర్ అర్ధరాత్రి నూట ఇరవై స్పీడ్లో నిద్రమత్తుకి కన్ను జోగి బస్సుని ఓ నదిలో కూలేశాడు. నా భార్యతో సహా ముప్పై మంది చచ్చిపోయారు అంటూ ఒక్క క్షణం ఆగి... నా మాటగా మీ అబ్బాయికి చెప్పండయ్యా, వేగం అంటే త్వరగా చేరుకోవటం కాదు, త్వరగా బయల్దేరటం అని అని లేచి నిలబడ్డాడు వెళ్ళడానికి సిద్దపడుతూ, కంట్లో ఆపుకున్న ఏడుపు గొంతులో ఆపలేకపోతున్నాడు.

శ్రీపతికి చిర్రెత్తుకొచ్చింది. చూడు, నిన్ను చిన్న సాయం అడిగాను. చేస్తే చేస్తానని చెప్పు. చెయ్యకపోతే చెయ్యనని చెప్పు. అంతే. వాడేం కావాలని చెయ్యలేదు. పొరపాటున జరిగింది. ఆ పోయినవాడు నీ కొడుకైనట్టు ఇంత అర్ధరాత్రి నీ ప్రవచనాలు వినాల్సిన అవసరం నాకు లేదు. ఆ మాత్రం సాయం చేసే మనుషులు లేకపోలేదు నాకు. నువ్వుకాకపోతే ఇంకా చాలా మంది ఉన్నారు. నువ్వంటే చేసిన సాయం మర్చిపోతావేమో కోపంతో ఊగిపోతు అన్నాడు శ్రీపతి.

అంతే, వెళ్ళ బోయే వాడల్లా ఆగి, ఆయాసంగా ఉంటే ఒక్క క్షణం ఊపిరి తీసుకుని నెమ్మదిగా చెప్పాడు తాతబ్బాయి. అయ్యా, మీరు చెప్పినట్టే స్టేషన్ కి వెళ్ళా. అక్కడ మన కారు చూసా. దానిమీద గుడ్డు సొన తాలూకు మరకలు ఎండిపోయి ఉన్నాయి. అనుమానం వచ్చి హాస్పిటల్ కి పరిగెత్తా. బాడీ ని అప్పజెప్పడానికి ఇంకా టైం పడుతుందంటే మీకు విషయం చెప్పి వెళదామని ఇలా వచ్చా. పదహారేళ్ళ పసిగుడ్డయ్యా. కరెంటు పోతే బుడ్డి దీపం వెలుగులో బుద్దిగా చదువుకుంటున్నవాణ్ణి వాళ్ళ అన్న కోసం గుడ్లు తెమ్మని పాపిష్టోణ్ణి నేనే బైటకి పంపానయ్యా. రోడ్డుని నమ్ముకుని బతికేటోళ్ళం రోడ్డు మీదే చస్తున్నాం.

టి.వి లో పెద్దాయన చెప్పాడయ్యా. తనకి తగిలిన బాణం రాముడిదే అయినా, తన బాధ ఆయనకే చెప్పుకుందట కప్ప. ఈరోజు వరకూ రోజూ భోజనం చేసేటప్పుడు మిమ్మల్నే తలుచుకున్నా. రేపు నా బిడ్డ దినం భోజనాలకి అప్పు చెయ్యాలన్నా మీరు తప్ప నాకింకెవరూ

తెలీదయ్యా .. అయ్యా, నిన్నటివరకు అక్కడ రోడ్డంతా గతుకులు. బళ్ళు పాడవుతాయని అందరు నెమ్మదిగా వెళ్లేవారు. నాబిడ్డని చంపుకోడానికి నేనే రోడ్డేసినట్టయ్యిందయ్యా. ఇకపై ఈ పన్లోకి రాలేను. రేపట్నించి మిగిలిన ఒక్క నలుసునీ రోడ్డెక్కకుండా చూసుకోవటమే నా డ్యూటీ అనుకుంటా. ఉంటాను సర్ అంటూ గేటు దగ్గరకేసి బయిటకొచ్చేసాడు తాతబ్బాయి.

కృష్ణ పక్షం కావటంతో బయటంతా చీకటి. ఎంతకీ తరగని ఆ రాత్రిలో, తెల్లవారుతుందన్న ఆశ కూడా చావగా, దిగులు బరువు మోస్తూ, రోడ్డుకి ఓ వారగా అటూ ఇటూ బెదురూ చూపులు చూస్తూ, భారంగా అడుగులేస్తూ, హాస్పిటల్ దారి పట్టాడు తాతాబ్బాయి. ముద్దుగా పెంచుకున్న కొడుకుని ముద్దగా తెచ్చుకోడానికి.

* * *

**ఉమా మహేష్ ఆచాళ్ళ, స్వస్థలం.. తూర్పు గోదావరి జిల్లా, 'తుని', ఆంధ్ర ప్రదేశ్, ఎం.కాం చదివారు. కేంద్ర ప్రభుత్వ పరోక్ష పన్నుల విభాగమైన కస్టమ్స్ డిపార్టుమెంటులో 27 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారు. 2016 డిసెంబర్ లో 'వార్త' లో ప్రచురితమైన మొదటి కథ 'మా తుఝే సలాం' తో మొదలుపెట్టి ఇప్పటివరకూ 35 కథలు 'నమస్తే తెలంగాణా(బతుకమ్మ) (2), ఈనాడు (8 కథలు) , సాక్షి(9), ఆంధ్రజ్యోతి(3), స్వాతి(6), వార్త(5), 'దర్వాజా', 'కౌముది' , వంటి ప్రముఖ పత్రికల్లో ప్రచురించబడ్డాయి. వీటిలో 21 కథలతో 'సంఘే శక్తి కలియుగే' అనే కథా సంపుటి అతి త్వరలో 'విశాలాంధ్ర పబ్లిషర్స్' ద్వారా వెలువడనుంది. 'వానకారు కోయిల', 'మల్లెల తీరం' 'క్యాచ్ 22', 'ఒక రాత్రి' , ' అన్నదాత', 'ఆదివారం అనుబంధం' వంటి కథలకి పాఠకులనుండి, సాటి రచయితలనుండి, మంచి స్పందన వచ్చింది. ఈనాడు కథా విజయం 2019 లో 'భువి కోరని భ్రమణం' కథకి, ఈనాడు కథా విజయం 2020 లో 'అడ్డుగోడ' కథకి, నమస్తే తెలంగాణా - ముల్కనూర్ ప్రజా గ్రంథాలయం సంయుక్తంగా నిర్వహించిన 2020, 2021 కథల పోటీలలో 'వానకారు కోయిల' మరియు 'ఇంకా తెలవారదేమీ' కథలకి వరుసగా బహుమతులు లభించాయి.**

Katha PART 1_Layout 1 6/29/2023 2:38 PM Page 198



# భద్రత

**కోపల్లె విజయ ప్రసాద్**

**77948 20104**

వాడికీ, నాకూ చుట్టరికం ఏమీ లేదు. కానీ.. చలపతి నన్ను 'బాబాయ్' అని పిలుస్తాడు. ఆ పిలుపులోని మాధుర్యమో ఏమో.. నేను ఎప్పుడూ వాడిని అలా పిలవొద్దని చెప్పక పోవడం ఒక కారణమైతే, వాడు నన్ను 'అరే! ఒరే! ప్రసాదూ!' అని పిలిస్తే చూసేవారికీ, వినే నాకూ బాగుండదని భావించడం ఇంకో కారణం. కానీ, ఆ 'బాబాయ్' అన్న పిలుపు వల్ల చాలామంది వాడికీ, నాకూ చుట్టరికం ఉందని భావిస్తూ ఉంటారు.

ఆ రోజు కూడా చలపతి ఆఫీసుకు వచ్చి నా ఎదురుగా కూర్చున్నాడు. అర్జెంటుగా పాతికవేలు కావాలట.. 'చే బదులు!' అన్నాడు. కానీ, గత ఐదేండ్లుగా నా దగ్గర మూడు లక్షలకుపైనే తీసుకున్నాడు.. తొందరలోనే ఇస్తానంటూ. అది చెల్లించమని గట్టిగా అడగడానికి నాకు మొహమాటం. పాత బాకీ గురించి నేను అడిగేలోగా.. ముందరి కాళ్లకు బంధం లాగా ఏవో కథలు వినిపించే వాడు. మానవత్వం ఉన్న మనిషి ఎవడైనా ఆ కథలకు లొంగిపోవాల్సిందే! కానీ, ఈసారి నేను వాడు చెప్పే కథలు వినదల్చుకోలేదు.

"పతీ! నా దగ్గర పైసా దొరకదు. నన్ను ఇబ్బంది పెట్టకు" అని చెప్పాను.

చలపతి మొహంలో నిరాశ, నిస్పృహగోచరించాయి. బతిమాలడం మొదలెట్టాడు. నేను విననట్లు నటిస్తూ ఆఫీసు ఫైలులో తల దూర్చాను. రొద పెడుతూనే ఉన్నాడు పది నిమిషాలు.

“బాబాయ్! ఈ ఒక్కసారికి సర్దు. మళ్లీ నిన్ను అడగను. ఒక్క పాతికవేలు చూడు”.

“పతీ! నా దగ్గర లేవు”.. ఇంకోసారి చెప్పాను.

“అలా అంటే ఎలా బాబాయ్! కష్టాల్లో నువ్వు కాకపోతే నన్ను ఇంకెవరు ఆదుకుంటారు? ఈసారి తప్పకుండా రెండు నెలల్లో ఇచ్చేస్తాను”.. చలపతి మళ్లీ తలమీద చెయ్యి పెట్టి ప్రమాణం చేశాడు. ఐదేండ్లుగా ఇలాంటి ప్రమాణాలు చాలానే చూశాను.

“పతీ! నీ సంపాదన ఏమవుతున్నది? పైగా నాలాగా సంసారివి కాదు.. బ్రహ్మచారివి. వచ్చిందంతా ఏం చేస్తున్నావు?” అసహనంగా అడిగాను.

“పీత కష్టాలు పీతవి.. సీత కష్టాలు సీతవి” నిట్టూరుస్తూ చెప్పాడు.

“ఇంతకీ నీకు అంత అవసరం ఏం వచ్చిపడింది?” మెత్తబడి అడిగాను. వాడేదో కహానీ వినిపించాడు. అది కథో, నిజమో నాకు అర్థం కాలేదు. కానీ, ప్రస్తుతం అతనికి డబ్బుతో చాలా అవసరం పడిందని నాకు అర్థమైంది. చలపతి నుదురు చెమటతో తడిసిపోయి ఉంది. నలభై ఐదు సంవత్సరాలు ఉంటాయి. సాదా సీదా బట్టలు ధరిస్తాడు. అతడు ఓ జాతీయ బ్యాంకులో పని చేస్తున్నాడు. జీతం కూడా తక్కువేమీ కాదు. జుట్టూ, గడ్డం నెరిసింది. బక్క పలుచగా, పొట్టిగా ఉంటాడు. కండ్లకు దళసరి కండ్లద్దాలు ఉన్నాయి.

“రేపు రారా పతీ! పిన్నిని ఒక మాట అడుగుతాను”.. అని చెప్పాను. ఆ మాటలకే వాడి కండ్లు మెరిశాయి.

“రేపు ఇక్కడికే వస్తాను. నన్ను గట్టెక్కించు!” అంటూ చేతులు జోడించి వెళ్లిపోయాడు. ఆ రాత్రి నాకు నిద్ర కరువైంది. అసలు వీడితో నాకు పరిచయం ఎలాగైందంటే..

అవి నేను నెల్లూరులో పనిచేస్తున్న రోజులు. ఒక పెద్ద ఇంటిలో ఒక వాటాలో అద్దెకు ఉండేవాణ్ని. మా కాంపౌండులో నాలుగు కుటుంబాలు ఉండేవి. మా ఎదురు పోర్షనులో రామబ్రహ్మం, జానకి వాళ్లు అద్దెకుండేవాళ్లు. ఆయన గవర్నమెంటు స్కూల్లో పనిచేస్తూ ఉండేవాడు. ఆమె ఒక ప్రైవేటు స్కూలులో పనిచేస్తూ ఉండేది. వాళ్లకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి. వాడే ఈ చలపతి.

రామబ్రహ్మం చిన్న వయసులోనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసేశాడు. చలపతికి కూడా చేద్దామనుకున్నాడు. కానీ, మంచి ఉద్యోగం వచ్చేదాకా తనను వదిలిపెట్టమని భీష్మించుకు కూర్చున్నాడు. అప్పట్లో వాడు పోస్టల్, ఎల్ఐసీ ఏజెంటుగా పని చేస్తూ.. కాస్తో కూస్తో సంపాదించేవాడు. బీఎస్సీ, బీఈడీ చేసి గవర్నమెంట్ టీచర్ల భర్తీ ప్రకటన కోసం ఎదురు చూస్తూ ఉండేవాడు. నేను ఎల్ఐసీలో మంచి ఉద్యోగం చేస్తున్నాను కాబట్టి.. నన్ను ఆరాధనగా చూసేవాడు. నేనే ఒకసారి వాడికి సలహా ఇచ్చాను.

"చూడబ్బాయి చలపతీ! గవర్నమెంటు జాబుకోసం కాచుకుని కూర్చోవడం మూరత్వం! ఉద్యోగ ప్రకటన వచ్చినా ఖాళీలు భర్తీ అవుతాయన్న నమ్మకం ఉండదు. ఎవడో ఒకడు కోర్టుకు పోయి రిక్రూట్‌మెంటును ఆపుతాడు. ఒక పోస్టుకు కనీసం వెయ్యిమంది పోటీ పడతారు. నువ్వు మెరిట్‌లో పాసైనా ఇంటర్వ్యూలో ఉత్తర దక్షిణాలు చూస్తారు. కనుక నా మాట విని ఏ బ్యాంకింగో, ఇన్సూరెన్సో కంపెనీల జాబుల కోసం తయారవ్వు. మంచి కోచింగ్ సెంటర్‌లో చేరి పోటీ పరీక్షలకు సిద్ధమవ్వు!"..

నా సలహా వాడికి తారకమంత్రంలా పనిచేసింది. అప్పటిదాకా టీచరు పోస్టుకు అర్రులు చాస్తున్నవాడు.. దాన్ని వదిలి పెట్టి, కోచింగ్ సెంటర్‌లో చేరాడు. రెండు సంవత్సరాలు కష్టపడే సరికి చివరికి ఒక బ్యాంకులో క్లరికల్ జాబ్ దొరికింది.

వాడి తల్లిదండ్రులు రామబ్రహ్మం, జానకి.. పాము %--% ముంగిసల్లా.. రోజూ పోట్లాడుకుంటూ ఉండేవాళ్లు.

జానకమ్మ కూతుళ్లకు బాగానే పెట్టేది. అల్లుళ్లు కూతుళ్లను చిన్నచూపు చూడకూడదని వాళ్లు అడిగినవన్నీ కొనిపించేది. మనవళ్లు, మనవరాళ్లకు ఉంగరాలు, గొలుసులు చేయించడం, మంచిమంచి బహుమతులు ఇవ్వడం చేసేది. రామబ్రహ్మం కొడుకు చలపతికి వచ్చే జీతం కూడా కరిమింగిన వెలగపండు లాగా నెలనెలా ఖర్చయిపోయేది.

బ్యాంకులో కుదురుకోగానే చలపతికి సంబంధాలు రాసాగాయి. రామబ్రహ్మానికి, జానకికి.. కోడలు ఇలా ఉండాలని చాలా కోరికలుండేవి. కోడలు బాగా చదువుకొని అత్తామామల అడుగులకు మడుగులొత్తాలి. ఎన్ని మాటలన్నా పడి ఉండాలి. ఇంటి చాకిరీ అంతా కిమ్మనకుండా చెయ్యాలి. కట్నం కూడా భారీగా తేవాలి.

చలపతికి కూడా కాబోయే భార్య గురించి కొన్ని కలలుండేవి. ఆమె శ్రీదేవిలా అందంగా ఉండాలి. చక్కగా పాడాలి. మంచి ఉద్యోగం చేస్తూ భర్తను దైవంగా భావించి, అతని మాటకు ఎదురు చెప్పకూడదు.

కొన్ని సంబంధాలు అయితే వచ్చాయి కానీ, అమ్మాయి వాళ్లు అతణ్ని విడి కాపురం పెట్టాలని షరతు విధించారు. తల్లిదండ్రులతో ఉండకూడదని, అల్లుడు అమ్మాయి మాటకు ఎదురు చెప్పకూడదని కోరారు. కొందరికి రామబ్రహ్మం, జానకి మధ్య కీచులాటలు తెలిసిపోయి, తమ పిల్లను ఇవ్వడానికి జంకారు. కానీ, కొన్ని సంబంధాలు చివరి దాకా వచ్చి తప్పిపోయాయి. కొన్ని విషయాల్లో రాజీపడమని చాలాసార్లు ముగ్గురికీ చెప్పాను. కానీ, వాళ్లు చెవికి ఎక్కించుకోలేదు.

అలా కొంతకాలం గడిచింది. చలపతికి బుర్ర తిరిగిపోయింది. ఇంట్లో తల్లిదండ్రుల కొట్లాటలు, అక్కడ అక్కాబావల సతాయింపులు ఎక్కువై పోయాయి. సంసార జీవితం అంటే విరక్తి పుట్టింది. పెళ్లి చేసుకుని ఎవరు సుఖపడుతున్నారులే! అన్న వేదాంతంలోకి వెళ్లిపోయాడు.

ఒకరోజు రామబ్రహ్మం హఠాత్తుగా కన్నుమూశాడు. అప్పటికే మొదటి అక్క భర్తతో విడిపోయి పిల్లలతో పుట్టింటికి చేరుకుంది. అక్క సంసార భారం కూడా చలపతిపైన పడింది. జానకమ్మలాగే అతని అక్క కూడా బహు గడసరి. బాగా డిమాండ్ చేసి తమ్ముడితో అన్ని పనులూ చేయించుకునేది. తన ఇద్దరి పిల్లల్ని మంచి కాన్వెంట్‌లో చేర్పించింది. దానికే చలపతికి బోలెడు ఖర్చయింది. తల్లి అనారోగ్యానికి డాక్టర్ల ఫీజులు, మందులకు చేతి చమురు వదులుతున్నది.

మిగతా ఇద్దరి అక్కల కాపురాలకు కూడా చలపతి ధన సహాయం చేయాల్సిన అగత్యం ఏర్పడింది. దాంతో చలపతి ఉన్న రుణ వనరులన్నీ వాడుకునేవాడు. జీతం మీద బ్యాంకులో తీసుకున్న లోన్లు కాక, అవసరానికి బయట రెండు రూపాయల వడ్డీకి కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించింది.

ఇంతలో నాకు కర్నూలుకు బదిలీ అయింది. ఒక పదేండ్లు చలపతి నాకు టచ్‌లో లేడు.

ఐదేండ్ల కిందట ఒకసారి మా బాసుకు సర్జరీ అయితే గౌరీ గోపాలు ఆసుపత్రికి పోయి అతణ్ని పలకరించి వస్తూ.. మెట్లు దిగుతూ ఉండగా, ఒక వ్యక్తి వచ్చి

'బాబాయ్!' అంటూ కావలించుకున్నాడు. తేరిపార చూస్తే.. చలపతి. అప్పటికీ ఇప్పటికీ మనిషిలో చాలా మార్పు వచ్చింది. వాళ్ల అక్క కొడుక్కు కాలు విరిగితే ఆపరేషన్ చేయించాడట. ఈ మధ్యనే తనకూ కర్నూలు బదిలీ అయిందని చెప్పాడు. ఇంకేముంది.. ఒకరి చిరునామాలు ఇంకొకరం ఇచ్చి పుచ్చుకున్నాం.

"మీ శ్రీమతిని తీసుకొని ఒకసారి మా ఇంటికి రారా చలపతి!" అని పిలిచాను.

"హహా! నాకున్నది ఒక్క మతే! శ్రీమతి లేదు" అని నవ్వాడు.కొంచెం ఆశ్చర్యపోయి..

"ఏం.. పుట్టింట్లో ఉందా?" అని అడిగాను.

"మీకు తెలుసుగా బాబాయ్! నేను పెళ్లి చేసుకోకూడదని అనుకున్నానని.." అంటూ జవాబిచ్చాడు.

"ఒరే! బెండకాయ ముదిరినా, బ్రహ్మచారి ముదిరినా పనికి రారని తెలియదా? ఎందుకు చేసుకోలేదు పెళ్లి?".. కోప్పడ్డాను.

"నా సంసారభారం మీకు తెలియదా బాబాయ్! అటు అమ్మను, ఇటు అక్కను, ఆమె పిల్లల్ని సాకాలి. ఆపైన ఇద్దరు అక్కలను ఎల్లప్పుడూ ఆదుకుంటూ ఉండాలి. దీనికే నా జీతం సరిపోవడం లేదు. మళ్లీ పెళ్లి చేసుకుని ఇంకొకళ్లను పోషించాలంటే నాకు ఎలా సాధ్యం? పెళ్లికాగానే పిల్లలు, ఈతిబాధలూ ఉంటాయి కదా! అందుకే వద్దనుకున్నాను" అన్నాడు చలపతి.

"నువ్వు అలా అనుకున్నావా? నీకు పిల్ల దొరకలేదా?".. చనువు కొద్దీ నా సందేహం వెలిబుచ్చాను.

దానికి వాడి మొహం కొంచెం నల్లబడింది కూడా. అప్పటినుంచి చలపతి

అడపాదడపా నా ఆఫీసుకు వచ్చి పోతూ ఉండేవాడు. ఒకప్పటి స్నేహితుడు దొరికాడు కదా అని మనసు విప్పి మాట్లాడుకుందాం అనుకుంటే.. వాడు ఎప్పుడూ తన ఆర్థిక బాధలు వెల్లడించేవాడు. కొన్ని బలహీన క్షణాలలో వాడిని నమ్మి నేను వాడికి అప్పులు కూడా ఇచ్చాను. నిజానికి వాడు నా అప్పును రెండు నెలల్లో వెంటనే తీర్చేస్తానని చెబుతూ ఉండేవాడు. ఎప్పుడు అడిగినా అమ్మకు బాగోలేదని, అక్కకు అవసరం అయిందని, ఖర్చు అయిపోయిందని చెప్పేవాడు.

అందుకే ఈ రాత్రి మథనపడుతున్నాను. 'రేపు వాడికి పాతిక వేలు ఇవ్వాలా? వద్దా?' అని. అప్పు ఇస్తే దానిని వాడు ఎప్పుడు తీర్చగలడు? ఇప్పటికే మూడు లక్షలు బాకీ ఉన్నాడు. 'ఇవ్వను' అని గట్టిగా చెప్పవచ్చు కానీ, మానవత్వం అడ్డు వస్తున్నది. 'నిజంగా పాపం వాడు ఎంత అవసరంలో ఉన్నాడో!?' అని జాలి కలుగుతున్నది. నిజానికి మానవ సంబంధాల్ని కలుషితం చేసేది, ఉన్నతీకరించేది డబ్బే! లేనివాడిని సకాలంలో ఆదుకుంటే వాడు చూపించే కృతజ్ఞత జీవితాంతం గుర్తుండిపోతుంది. డబ్బు దగ్గర మోసపోతే ఆ గాయం హృదయాన్ని తొలిచేసి జీవితాంతం వెంటాడుతుంది.

నాకు తెలిసి చలపతికి మోసం చేసే నైజం లేదు. కాకపోతే పరిస్థితుల ప్రాబల్యం వల్ల నాకు ఇవ్వాల్సిన డబ్బులు ఆలస్యం చేస్తున్నాడు. మనం సమాజాన్ని ఉద్ధరించలేం కానీ, మనకు తెలిసిన వారికి సహాయపడితే కొంత ఆత్మ సంతృప్తి కలుగుతుంది. అందుకని మరునాడు పాతికవేలు తీసుకుని ఆఫీస్‌కు వెళ్లి.. వాడి రాకకోసం ఎదురు చూడసాగాను. ఆ రోజు కొంచెం అర్జెంటు ఆఫీస్ పనులు పడ్డాయి. బయటికి వెళ్లి రావాల్సి వచ్చింది. వచ్చిన తరువాత.. 'నా కోసం ఎవరైనా వచ్చి వెళ్లారా!?' అని కూడా విచారించాను. సెల్‌ఫోన్‌లో కూడా ఎక్కడా మిస్డ్ కాల్ పడలేదు చలపతి నుంచి. ఆఫీస్ మూసేసే వేళ అయింది. మళ్లీ రాత్రికి ఇంటికి తయారవుతాడేమోనని భయపడి వాడికి కాల్ చేశాను. 'స్విచ్చాఫ్' వచ్చింది. అంతకుమునుపు ఒకటి రెండుసార్లు వాళ్లింటికి వెళ్లాను కూడా. అందుకని ఇంటికి పోయి కలుద్దామని అనిపించింది. ఇంటికి వెళ్లాను. బయటి నుంచి కేక పెట్టాను.

"ఒరే చలపతి!" అని. కాసేపటికి బయటికి వచ్చి.. నన్ను చూసి చేటంత మొహం చేసుకున్నాడు.

"లోనికి రా బాబాయ్!" అంటూ హాల్ లోపలికి పిలుచుకు పోయాడు.

జానకమ్మ, చలపతి పెద్దక్క సుందరమ్మ నన్ను చూసి గుర్తుపట్టి పలకరించారు.

"కాఫీ తీసుకు వస్తా బాబాయ్!" అని లోనికి వెళ్లింది సుందరమ్మ.

"ఏరా పతీ! వస్తానని రాలేదు?".. దబాయించాను. వాడి మొహం పాలిపోయింది. 'చెప్పాలా? వద్దా?' అన్న సందిగ్ధంలో పడినట్లున్నాడు. జానకమ్మ గారు కలుగచేసుకున్నారు.

"పొద్దుటినుంచి ఇంట్లో తుఫాను వాతావరణం! ఆఫీసుకు కూడా వెళ్లలేక పోయాడు నాయినా!"..

"ఎందుకు వదినగారు!?" ఆశ్చర్యంగా అడిగాను.

కొన్ని సెకండ్లు మౌనమే రాజ్యమేలింది. దానిని సుందరమ్మ కాఫీ కప్పులతో వచ్చి ఛేదించింది.

"ఏం చెప్పమంటారు బాబాయ్‌గారు! మా పెద్దాడు భాస్కరాన్ని చూశారుగా.. కిందటి సంవత్సరం బీటెక్ పాసయ్యాడు. వాడికి ఇంకా చదువుకోవాలని ఉంది. మనం పరాయి పంచన ఉన్నామన్న జ్ఞానం వాడికి లేదు. 'మావయ్యా! నన్ను చదివిస్తావా? ఆత్మహత్య చేసుకోమంటావా?' అని మొదలుపెట్టాడు పొద్దున్నే!".. కళ్లు తుడుచుకుంది సుందరమ్మ.నేను నివ్వెరపోయాను. భాస్కరం చదువులో మంచి శ్రద్ధ కనబరుస్తున్నాడని నాకు తెలుసు. బీటెక్ కాగానే ఏదో ఒక జాబులో వాడు సెటిలవుతాడని చలపతి అనుకున్నాడు. ఆ మాట నాతో కూడా అన్నాడు. తన రుణభారం తీరిపోతుందని ఆశించాడు.

"అట్లానా! ఇంకా ఏం చదువుతాడట?".. కొంచెం కోపంగా, నిరసనగా అడిగాను. భాస్కరం పైన నాకు కూడా అధికారం ఉన్నట్లు.

"ఎంబీఏ చేస్తాడట. అది కూడా టాప్ ర్యాంకు ఉన్న కాలేజీల్లో చెయ్యాలట. అప్పుడు కానీ మంచి ప్యాకేజీ ఉన్న ఉద్యోగాలు రావట. అక్కడ మెరిట్‌లో సీట్ రాదు. డొనేషన్లు కట్టి చదివించాలి" బాధగా అన్నాడు చలపతి.

"ఎంత అవుతుందేమిటి?" ఆలోచిస్తూ అడిగాను.

"ఆ చదువు పూర్తయ్యే సరికి ఎంత లేదన్నా పది లక్షలు కావచ్చు".

ఉలిక్కి పడ్డాను. చలపతి స్తోమతకు అంత భారం మోయగలడా? కోరికలే గుర్రాలైతే ఇలానే ఉంటుంది.

"అంత పెట్టగలవా వాడికోసం!?" అడిగాను నమ్మలేనట్లు.

వాడు ఏం చెబితే ఏం తంటా వస్తుందో అన్నట్లు దిక్కులు చూశాడు.

"చూడండి బాబాయ్ గారు! భాస్కరం తండ్రి దగ్గరే ఉంటే వాడి చదువుకు వెనకా ముందూ ఆలోచించేవాడా? మా వాడు బుద్ధిమంతుడు. చదువుకుంటానంటున్నాడు. అదేమీ పిచ్చి కోరిక కాదు. మా చలపతికి పోనీ.. పెళ్లీపెటాకులై, భార్యా పిల్లలు ఉంటే ఆలోచించాలి కానీ, ఒంటిలింగం శొంఠికొమ్ము. వాడు మమ్మల్ని కాకపోతే ఎవరిని ఉద్ధరిస్తాడట? వాడి మనసు కష్టపడి పొద్దున్నే ఉరేసుకోబోయాడు. పసిపిల్లలు వాళ్లకు ఏం తెలుసు? పెద్దలం మనమే వాళ్ల మనసు తెలుసుకుని నడుచుకోవాలి".. సుందరమ్మ సుద్దులు పెట్టింది.

"అది కాదు బాబాయ్! ఆర్థికంగా నేను ఎంత బాధల్లో ఉన్నానో మీకు తెలుసు కదా! ఇంకో సంవత్సరం పోతే మా మేనకోడలు సంధ్య చదువు పూర్తవుతుంది. దానికి పెళ్లి చెయ్యాలి. భాస్కర్ చేతికి అందివస్తాడని ఆశించాను. వాడు మొండి పట్టుదలతో ఉన్నాడు. చదువో చావో తేల్చుకోమని నాకు అల్టిమేటం ఇచ్చాడు".. ఏడుపే తక్కువ.

నాకు పరిస్థితి అర్థమైంది. ఆ ఇంట్లో చివరికి వీడు విలన్‌గా మిగిలి పోయేటట్లున్నాడు. అందులోనూ భాస్కర్‌కు ఆవేశం ఎక్కువ.

"చలపతీ! భాస్కర్‌ను వాడు కోరినట్లే చదివించు. ఎడ్యుకేషన్ లోన్ ఇస్తారుగా. ప్రయత్నించు. వాడు ప్రయోజకుడైతే వాడే ఈ కుటుంబ భారం మోస్తాడులే. అక్కయ్య చెప్పినట్లు వాళ్ళు తప్పించి నీకు ఇంకెవరున్నారులే! పిల్లల మనసు నొప్పించకూడదు. అందులోనూ ఈ కాలం పిల్లలు ప్రతి చిన్నదానికీ ఆత్మహత్యలంటారు" అంటూ నచ్చజెప్పాను. వాడిని బయటికి తీసుకొచ్చాను.. ఓదారుద్దామని. పాతిక వేలు వాడి చేతిలో పెట్టి, మొత్తం బాకీ తొందరలో తీర్చేదారి వెతకమని చెప్పి వచ్చేశాను.

అనుకోకుండా నాకు వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయింది. హడావుడిగా ఫ్యామిలీని తీసుకొని వచ్చేశాను. చలపతిని కలుద్దామని ప్రయత్నించాను కానీ వీలు కాలేదు.

నాకు వైజాగ్‌లో తలమునకలయ్యే పనులు పడటంతో కర్నూలు రావడానికి టైమ్ దొరకలేదు. కొన్ని నెలలు సెల్‌ఫోన్‌లో యోగక్షేమాలు కనుక్కున్నాను. ఆ తర్వాత వాడి సెల్ అందుబాటులోకి రాలేదు.

భగవంతుడి మీద భారంవేసి నాకు రావాల్సిన డబ్బుల గురించి ఆలోచించడం మానేశాను. ఎక్కువ వర్రీ అయితే బీపీ పెరుగుతుంది తప్ప.. ఫలితం శూన్యమని సమాధానపడ్డాను.

ఐదేండ్లు గడిచిపోయాయి. చలపతి నుంచి వాడి మేనకోడలు పెళ్లి శుభలేఖ అందింది. వీలు చేసుకుని హైదరాబాద్‌కు వచ్చాను. చలపతి ఇప్పుడు అక్కడ పని చేస్తున్నాడు. సంధ్య పెళ్లి కల్యాణ మంటపంలో బాగా జరిగింది. లక్షల్లో ఖర్చయి ఉంటుంది. వాడి స్థాయికి మించిన సంబంధం తెచ్చి చేశాడు. సంధ్య మామూలు సంబంధాలు ఒప్పుకోలేదట. వరుడు ఫారిన్‌లో జాబ్ చేస్తున్నాడు. పెళ్లి సందడి తగ్గిన తరువాత వాణ్నికలిశాను.

"ఏరా చలపతి! నాకు ఇవ్వాల్సిన డబ్బులు మర్చిపోయావా?" అని అడిగాను.

"బాబాయ్! ఎలా మర్చిపోతాను. తప్పకుండా ఇస్తాను" అని చెప్పాడు.

"ఇంకెప్పుడు? భాస్కరం కూడా బాగా సంపాదిస్తున్నాడు కదా? నా డబ్బులు నాకు ఇవ్వడానికి ఏం రోగం?".. నిష్ఠూరంగా అడిగాను.వాడు నవ్వాడు.

"భాస్కరం సంగతి మర్చిపోవాలి! వాడి సంపాదన మాకు పైసా ఇవ్వడు. లవ్ మ్యారేజ్ చేసుకుని ఇల్లరికం వెళ్లిపోయాడు. ఈ పెళ్లి ఖర్చులన్నీ నావే! అక్క బాధ్యత కూడా నాదే! అమ్మకు సీరియస్ అయినా పట్టించుకోడు. వాడు చాలా స్వార్థపరుడై పోయాడు. నాన్న కట్టించిన ఇల్లు అమ్ముకున్నాను. ఆడపిల్లలకు పోను నా వాటా డబ్బులతో ఈ పెళ్లి చేశాను".. అని చెబుతుండగానే, పెళ్లివారు పిలిస్తే వెళ్లిపోయాడు.

హాల్‌లో ఒంటరిగా కూర్చున్న జానకమ్మగారిని పలకరించాను. ఆమె ఆరోగ్యం బాగా దిగజారిపోయింది. మొహంలో ప్రేతకళ కనిపిస్తున్నది. నన్ను చూసి కన్నీళ్లు పెట్టుకుంది. పరామర్శ తరువాత ఇలా అన్నది.

"ప్రసాద్ బాబూ! నీకో రహస్యం చెప్పాలి. చేసిన పాపం చెబితే పోతుందంటారు. మా చలపతికి పెళ్లి కాకపోవడానికి కారణం నేనే! కోడలు వస్తే మా బతుకులు ఏమవుతాయోనని

భయపడి వచ్చిన సంబంధాలు చెడగొట్టాను. మా భద్రత గురించి ఆలోచించాను కానీ, ఇప్పుడు వాడి పరిస్థితి చూస్తే బాధగా ఉంది. నా తదనంతరం వృద్ధాప్యంలో వాడు ఒంటరిగా ఎలా బతకగలడు? భాస్కర్, సంధ్య మీద నమ్మకం లేదు. ఆడపిల్లలందరూ వాడి సొమ్ము తిన్నారే కానీ, వాణ్ని ఎవరూ చూడరు. సుందరమ్మ కూడా ఎక్కువ కాలం బతకదు. దానికి క్యాన్సర్. ఇప్పుడు మా చలపతికి పెళ్లి చేయాలన్నా ఏ అమ్మాయి ముందుకు వస్తుంది? అంతా చేతులారా చేసుకున్నాను" అంటూ ఏడ్చింది.

నేను నివ్వెరపోయాను. చలపతి మీద జాలి కలిగింది. జానకమ్మ గారి మీద కోపం వచ్చింది. అతణ్ని తమ స్వార్థానికి వాడుకున్న వాడి అక్కల మీద, పిల్లలమీద కోపం వచ్చింది. మర్నాడు బయల్దేరబోతూ, చలపతి దగ్గర వీడ్కోలు తీసుకుంటుండగా..

"బాబాయ్! నీ డబ్బులు పువ్వుల్లో పెట్టి ఇస్తాను. వర్రీ కాకు" అన్నాడు నవ్వుతూ.

"అది సరే! అందరి బాధ్యతలు మోశావు! మరి నిన్ను చూసేవాళ్లు ఎవరున్నారు? ఇప్పటికైనా పెళ్లి చేసుకో!".. సలహా ఇచ్చాను.

"ఈ వయసులోనా?! జోకుకైనా హద్దులుండాలి. బాబాయ్! నా గురించి బెంగపడకు. నాలాంటి వారికోసం వృద్ధాశ్రమాలు స్వాగతం పలుకుతున్నాయి".. వాడు నవ్వుతూ అన్నా, అప్రయత్నంగా వాడి కండ్లవెంట రెండు కన్నీటి చుక్కలు వెలువడ్డాయి.

"ఏమీ అనుకోకు రా.. నీకో సంగతి తెలియదు. మీ వాళ్లు చాలా స్వార్థపరులు. వారి భద్రత వారు చూసుకున్నారు కానీ.. నీ గురించి ఎవరూ ఆలోచించలేదు" సానుభూతి చూపిస్తూ అన్నాను.

"తప్పేముంది బాబాయ్! సొంత తల్లికే కొడుకు గురించి పట్టనప్పుడు.. తోబుట్టువులకు, వారి పిల్లలకు ఏం అవసరం నా గురించి ఆలోచించడానికి? ఎవరి భద్రత వాళ్లు చూసుకుంటున్నారు ఈ లోకంలో".. వేదాంతిలా వాడు చెప్పాడు జీరగొంతుతో. నా గుండె మెలిపెట్టినట్లయింది. నా కంటికి వాడు నిష్కామకర్మ వీరుడిలా గోచరించాడు.

***

# కాముని కంత



**హుమాయున్ సంఘీర్,**
9398178380

బాలంగిరిల్లు ముంగట శిక్కగ సాన్పేశి, అక్కడక్కడ తెల్లటి సున్నంతోని ముగ్గులు వెట్టిన ఆకిట్ల కూసొని ఎల్త బొంగులు నరుకుతున్నడు మేదరి దుర్గయ్య. లావుపాటి బద్దలుగా నరికి అవిటిని కట్టెల మోపు లెక్కట కడుతున్నడు. హాఫారం ఏసుకొని గోచి కట్టుకొని ఉన్నడు. తెల్ల మీసాలను, మొకంల పౌరుషం పొంగినట్టు అడివెట్టిండు. నెత్తికి కాటన్ రుమాలు సుట్టుకొని ఉన్నడు. అర్వై ఏండ్లకు దెగ్గర ఉంటడు గనీ, పనిల శాన శెల్తిగ ఉంటడు దుర్గయ్య. ఆకిట్ల వేపచెట్టు నీడ విశాలంగా, దట్టంగ అలుముకొని ఉన్నది. పండ్లు అయిన వేప పండ్లు కింద రాలినయి వాకిలంత. వాటిని ఏరుకుంట అటుపక్క వాకిట్ల ఎండకు ఏస్తున్నది దుర్గయ్య భార్య నర్సవ్వ. పండుగా ఉన్నయి ఒకదెగ్గర ఎండినవిటిని ఇంకో జాగల ఏస్తున్నది. అటుదిక్కు సగం వాకిలిని ఆవరించుకున్నయి వేపకాయలు. ఇంటి గోడకు ఆనుకొని కట్టె నాగలి, రొప్పు నాగలి లిలవెట్టి ఉన్నయి. ఇటు దిక్కు ఎడ్ల బండి నిలవడి ఉన్నది. ఆ బండి కానికి రెండు ఎడ్లు కట్టేశి ఉన్నయి. కట కట బొంగులను నరుకుతున్న దుర్గయ్య చూపు నర్సవ్వ మీద పడింది. ‘లచ్చిమీ.. ఇంత చాబొట్టు తీస్కరా‘ అని కేకేసిండు. ఆ మాట వినగానే వేపకాయలను అరికాళ్లతో దున్నుతున్న నర్సవ్వ మనసు చివుక్కుమంది. అంతవరకు ఆమె వేపకాయలు దున్నుతుంటే ఎండిన ఆ వేపకాయల్లోంచి గలగలమని విత్తనాల సౌండు వస్తున్నది కాస్త ఆగిపోయింది. ఆమె మొకం ఫికర్ల వడ్డది. మోకాలి మంటి కట్టిన ఆమె కాటన్ చీరకొంగును నడుముకు చెక్కుకున్నది. ఆ కొంగు ఇప్పి కండ్లల్ల దుంకుతున్న కన్నీళ్లను తుడుసుకున్నది.

కండ్లనీళ్లు ఒత్తుకుంటున్న ఆమె దండెకడియం ఎండకు చెక్కున మెరుస్తున్నది. మోకాళ్లకున్న కడియాలు గూడ ఆ నిట్టెండకు మెరుస్తున్నయి. మెడల తులం గుండ్లు ఉన్నయి, ఆ

గుండ్లల్ల పగుడాలు ఏసుకున్నది. ఒక ముత్యాల దండ గూడ ఉన్నది. అన్లనే పుస్తెల తాడు గూడ ఉన్నది. ఆ పుస్తెల తాడుకు శెవుల జివిలి తీసుకునే రాగి పుల్లలు గూడ పోగేసుకున్నది. శెవులకు అద్దులం గుంటీలు యాలాడుతున్నయి. చెవులు తెగి ఆ గెంటీలు కింద వడిపోతయన్నట్టు అంచుకున్నయి. చెవులకు మీద సైడు కమ్మలు, ముక్కుకు అటు ఇటు ముక్కుపుల్లలు ఉన్నయి. అవిటికున్న చిన్న చిన్న రంగు రాళ్లు మెరుస్తున్నయి. నుదురు మీద రూపాయి బిట్టంత ఎలుము ఎర్రటి కుంకుమ ఆమె నల్లటి మొకాన్కి కళ తీస్కస్తున్నది. తెల్లగైపోయిన ఎంటికెలకు మంచిగ నూనె అంటుకొని దువ్వుకొని శికేసుకున్నది. ఆ శికెల శేతుమీద అల్లుకున్న పసుప్పచ్చ గుర్మాశి పూలు వెట్టుకున్నది. ఆమె నిలువు రూపం జూస్తే.. లచ్చిందేవి భూమ్మీదికచ్చి పల్లె లచ్చిందేవి అవతారం ఎత్తిందేమో అన్నట్టే ఉంటది. 'తెస్తా ఉండు సైసు జర' అన్నది తన కాలును కదుపుకుంట. భార్య నుంచి వచ్చిన సమాధానం ఇనంగనే కొడుకు, కోడలు, మన్మలు, మన్మరాండ్లు ఇల్లు ఇడ్శిపెట్టి పట్నం బత్కవోయిర్రు అనే మచ్చట యాదికచ్చింది దుర్గయ్యకు. మనసు మార్మానం వోయినట్టైంది. కటకట కొడుతున్న కత్తిని ఆపేశి నెత్తికి సుట్టుకున్న రుమాలు ఇప్పిండు. జరశేపు సుట్టతాగి గావరైతున్న పానం తుర్తి జేస్కుందాం అనుకున్నడు. రుమాల్ల మూలకు ముడివెట్టిన సుట్టాకు కాడను ఒగదాన్ని అరిశేతులకు తీస్కొని నల్శిండు. అట్లనే లేశి పోయి జూరాడు దెగ్గర నీళ్ల కుండికాడ బండ కింద వెట్టిన మర్రి ఆకుల్ల కెల్లి ఒక ఆకును తీసుకున్నడు. మల్ల తను కూసున్న జాగలకు అచ్చిండు.

ఆ ఆకును సుట్ట లెక్కట సుట్టి అన్ల తంబాకు నింపిండు. సుట్ట నోట్లె వెట్టుకొని అగ్గిపెట్టె కోసం తన ముడ్డి కిందున్న జోరసంచి కింద శేతులతోని పునికిండు గనీ అగ్గిపెట్టె దొర్కలే. కూసున్నజాగలనే సుట్టుముట్టు జరుక్కుంట సూశిండు కనీ, అగ్గిపెట్టె కానరాలె. లేశి ఇంట్లెకు వోదామనుకున్నడు. ఇంతట్లనే చేతుల కాలుతున్న పొయిల కట్టెను పట్టుకచ్చి దుర్గయ్య మొకం ముంగట్కి సాపింది. ఆ ఎర్రటి నిప్పుకను సూడంగనే దుర్గయ్య మొకంల శాంతం కానచ్చింది. కృతజ్ఞతతోని పెండ్లాం మొకంలకు తల్కాయ ఎత్తి సూశిండు. ఆమె తీస్కో అన్నట్టు కండ్లతోని సైగ జేశింది. ఆమె శేతుల కెంచి కట్టెను తీసుకొని సుట్ట అంటిచ్చుకున్నడు. గప్పు గప్పు పొగ వీలుస్కుంట ఇడుస్తున్నడు దుర్గయ్య. జర్ర శేపట్లనే సుట్ట వాసనంత ఆ సుట్టుపక్కలక పాకింది. పట్నం వోయిన కొడుకు, కోడలు గురించి ఆలోశన్ల వడ్డడు. దుర్గయ్యకు ఒక కొడుకు నలుగురు బిడ్డెలు. ఐదెకరాల ఎవుసం ఉండె. బర్లు, గొర్లు మంచిగనే ఉండె. బిడ్డెలందరు డిగ్రీ దాంక మంచిగనే సదువుకున్నరు గనీ, కొడుకు అడ్వ సోపతులు వట్టి పదోది దాంకనే సదివిండు. అది గూడ పదిల ఫెయిలైండు. ఇద్దరాల్ మొగోళ్లు పిల్లలు ఉన్నరని అటు ఎవుసం, ఇటు బర్లు గొర్లను సూస్కునుడే గాదు కుల వృత్తి అయిన మేదరి పని గూడ శేస్కుంట అచ్చిర్రు.

సోమారం గోపాల్ పేట్ అంగల్ల అమ్మనీకి గుల్లలు, శాట్లు, శిబ్బీలు అల్లి తయారు వెట్టుకునేటోళ్లు. పిల్లలు పెద్దగైతున్నరు చేసి చేసి వీళ్లకు గూడ పెయిల జిగి లేకుంట అయింది. నలుగురు బిడ్డెల లగ్గాలు జెయ్య ఒక్కొక్కటి అమ్ముకుంట అచ్చిండు దుర్గయ్య. మంచి ఇంట్లకు బిడ్డెలను ఇయ్య వాళ్లు అడిగినంత కట్నం ఇచ్చిండు. కట్నం కింద ఒక్కొక్క బిడ్డెకు ఎక్ర ఎక్ర

Katha PART 1_Layout 1 6/29/2023 2:38 PM Page 208

పొలం రాశిచ్చిండు. కొడుకుకు ఒక ఎకురం పొలం ఉంచిండు. ఇంత ఇల్లు ఉంచిండు. ఇచ్చిన ఇంటికాడ ఆడివిల్లలు ఖుషీగనే ఉన్నరు. బిడ్డెలయి అందరియి అయినంక కొడుకు లగ్గం గూడ జేశిండు. అందర్కి పిల్లలు అయిగ్రు. పండుగులకు, పబ్బాలకు బిడ్డెలు, అల్లుండ్లు, మన్మలు, మన్మరాండ్లు ఇంటికస్తే ఇల్లంత నిండిపొయ్యేది. చిత్తారి పెండ్లి అయిందాంక గూడ ఏ పనిని వట్టిచ్చుకోకుంట మీద మీద రివుట లెక్కట తిరిగిండు. ఎవుసం వచ్చు గనీ, పెయ్యి అంచి పనిజెయ్య శాతగాదు. పెండ్లి అయినంక పెండ్లాం ఊకె ఎంబటవడే సరికి ఎవుసానికి వంగిండు.

ఒకింటికి వోయిన బిడ్డెలకు ఎగ్ర ఎగ్ర పొలం ఎట్లిస్తడని కోడలు సుగుణ కొడుకు చెవుల ఊదింది. ఆ కాన్నుంచి చిత్తారి శాన మారిపోయిండు. 'అంత ఆడివిల్లలకు ఊడ్శిపెట్టి నాకు శిప్ప మిగిలిచ్చిండు' అని రీకునాలు తీసుడు, అయ్య కొడుకుల నడ్మ కయ్యాలు ముదురుడు దినాం అదే కత అయిపోయింది. ఒగనాడు ముసలోల్లకు ఒక అఱ్ర అని ఇచ్చి మిగిలిన ఇంట్ల ఏరువడ్డడు. ఉన్న ఒక్క కొడుకు ఏరువడుడుతోని వాళ్లిద్దరు శాన ఫికర్ల వడ్డరు. ఎవుసం జెయ్య మునుపటోలె శాతనైతలేదు. అయినా ఆమరతాన్కి ఇద్దరు కల్శి పొలంను ఏ ఏడు గూడ బీడు ఉంచ వాళ్ల పానాలు దరియ్యలేవు. ఇటు మేదరి పని జేస్కుంట కొడుకు ముంగట చేయి సాపకుంట వాళ్ల బతుకు వాళ్లు బతుకుతున్నరు. ఏరువడ్డంక బిడ్డెలు, అల్లున్లు ఇంటికస్తే వాళ్లకు మర్యాదలు గూడ శెయ్యనంత కాట్కానికి వచ్చిండు చిత్తారి. పొద్దుగాల్ల వచ్చి అయ్యవ్వలున్న ఆ శిన్న అఱ్రల ఉండి.. కుండల్ల కలిగింది ఏదో తిని పొద్దిమీకెటాకల్ల ఎల్లిపోయేటోళ్లు. 'ఈ వూర్లె ఇట్లనే పడుంటే ఏం ముంగటవడం. యాడేశిన గొంగడి ఆడనే ఉంటది' అని సుగుణ చిత్తారిని పట్నం తొవ్వ వట్టిచ్చింది.

పట్నంల తన అన్నదమ్ములు బిస్కిట్ల కంపిన్ల పని జేస్తున్నరు. అదే కంపిన్ల ఇద్దరాల్ మొగోళ్లం శెరీకైతే ఇన్ని పైసలు ఎన్కేసుకోవచ్చు అనుకున్నది. చిత్తారి గూడ పెండ్లాం మాట ఇనకుంట ఉండలేకపోయిండు. అట్ల మూడేండ్ల కింద హైదరాబాద్కు బత్కవోయిగ్రు. ఇంతట్లనే కరోనా రోగం అచ్చె. దీంతోని వాళ్లు పని జేశే కంపిన్ మూత వడ్డది. శేతుల పనులు లేక చిత్తారి ఊర్లున్న ఒక్కొక్కటి అమ్ముడు సురువు జేశిండు.

సప్పుడుదాంక ఆ హైదరాబాద్ నుంచి ఊరికి అచ్చెయ్యమంటే అచ్చినట్టే అచ్చిగ్రు గనీ ఇక్కడ ఉండలేకపోయిగ్రు. కరోనా జఱ్ర బందుగాంగనే మల్ల అక్కడికే వోయిగ్రు. మల్ల రెండో మల్క కరోనా దెబ్బ వెట్టేటాకల్ల ఇంకిన్ని అప్పులు జేశిండు. 'ఇట్ల ఇంతింతగానం అప్పులు జేసుకుంట వోతే పర్షాన్ అయితవురా పోడా' అని నర్సవ్వ ఎంత జెప్పినా ఇనలేదు చిత్తారి. తన రివాయి తనదే. మీదికెల్లి తాగుడుకు గూడ బగ్గ మర్గిండు. 'ఇగ వాడు ఎప్పుడన్న బాగుపడని. శెప్పి శెప్పి యాష్టకు అస్తున్నది. వచ్చి ఇక్కడనే ఎవుసం జేస్కోరా అంటే ఇనడు' అనుకొని దుర్గయ్య గూడ కొడుకుకు ఊకె జెప్పుడు బందు జేస్కున్నడు. ఇట్ల కొడుకు గురించి ఇంకా ఏమేమో ఆలోశిస్తున్నది దుర్గయ్య మైండు. ఇంతట్లనే ఆమె ముంగట్కి గరం గరం చాయి గిలాస అచ్చింది. అన్లకెల్లస్తున్న ఆవిర్లు ఆయన కండ్లల్ల మెరుపులు నింపినయి. ఆ గిలాస వట్టుకున్న శేయి దిక్కు సూశింది. నర్సవ్వ తీస్కో అన్నట్టు కండ్లతోని సైగ జేశింది. చాయి గిలాస అందుకొని

తాగుతున్నడు. 'ఇయ్యాల్ల పాలు పల్సగ వోశింది బేగమవ్వ. జర ఏమనుకోకుంట చాయి తాగు' అంటున్న నర్సవ్వ మొకంలకు నిరాశగ సూశిండు దుర్గయ్య. 'ఇయ్యాల్నన్న ఈ యాపకాయలు తీస్కునేటాయిన అచ్చుంటే బాగుండు. దినాం ఎండల ఏస్తున్న మల్ల ఇంట్లకు మోస్తున్న.

ఆ సంచులు లావట్టి లావట్టి నా నడుములు టింగు మంటున్నయి' అంటున్న పెండ్లాం మొకంలకు నగినట్టు సూశిండు. 'ఇయ్యాల్ల అస్తనన్నడే. నాలుగు కింటళ్లు అయితయి గదా యాపకాయలు?' అడిగిండు. 'ఆ, అయితుండచ్చునే' అనుకుంట ఆమె ఇంట్లెకు వోయింది. గరం గరం చాయి తాగుతున్న దుర్గయ్యకు జర పానం శెల్తికచ్చినట్టు అనిపియ్యవట్టింది. శేతులున్న సుట్టల తంబాకు అయిపోయి సల్లారిపోయింది. దాన్ని సూశి అటు ఇస్రేశిండు. చాయి గిలాస పక్కకు వెట్టి యాప శెట్టు మీద తల్లి కాకి పిల్ల కాకి కడుపు నింపుతున్నది సూస్తున్నడు. ఇంతట్లనే దోసపల్లి సాయిలు సైకిల్ మీద అచ్చి గంట గొట్టుకుంట ఆకిట్ల సైకిల్ ఆపిండు. ఆ గంట సప్పుడుకు తల్కాయ తింపి సాయిలు దిక్కు సూశి శిన్నగ మురిశిపోయిండు. 'రారా బావా.. రా ఇట్ల కూసుందాం' అంటున్న దుర్గయ్య మాటలకు సాయిలు ఇంకింత ముర్శిపోకుంట వచ్చి అరుగు మీద కూసున్నడు. 'కూసుంట గనీ, నాకు ముందుగాల్ల సుట్ట ఇయ్ బామ్మర్దీ. పానమంత గావర గావర అయితున్నది' అడిగిండు సాయిలు. 'ఎంతమాటనే గది.. ఇస్త ఉండు. కాకపోతే నేనిప్పుడే సుట్ట ఒగటి తాగిన. నేను ఇప్పుడే మల్ల తాగ. నీకిస్త సరేనా' అన్నడు దుర్గయ్య. 'అట్లైతే జర్రాగుదాం మల్ల. ఇద్దరం ఒకటేసారి తాగుదాం' సాయిలు మాటకు సరే అనకుంట ఉండలేకవోయిండు దుర్గయ్య.

'శెప్పు బావా, ఏమున్నయే ఊరి ముచ్చట్లు?' దుర్గయ్య మాటలకు సాయిలు మొకంల జరంత బాధ కనిపిచ్చింది. 'ఏమున్నయి బామ్మర్దీ.. నలుగురు కొడుకులు అని ఎంత ముర్శిపోయిన గనీ.. ఏ కొడ్కు గూడ కానకుంట అయిపోయిండు' అని కండ్లల్ల నీళ్లు ఒత్తుకున్నడు. 'నాకున్న ఒక్క కొడుకు గూడ గాడికే అచ్చిండే.

గందుకే మన రెక్కలు మంచిగున్నన్ని దినాలు మన కష్టం మనమే శేస్కొని గట్లనే బతుకుదాం. శాతగానప్పుడు సూద్దాం' అంటున్న దుర్గయ్య మొకం జూస్కుంట ఇంకింత బాధవడ్తున్నడు సాయిలు. 'మంచిగ సదివిపిస్తే వాళ్లు మనలను మంచిగ జూస్కుంటరు అనుకున్న గనీ.. ఎవరి బతుకులు వాళ్లు జూస్కొని అవుతల వడ్డరు. నువ్వంటే నువ్వు అనుకుంట అమ్మానాయినలను వంచుకుంటున్నరు. ఏం బతుకే ఇది?' 'ఇగో బావా.. మనం ఏం జెయ్యాల్నో అది జేశినం గంతే. మన బాధ్యతలు, బరువులు గూడ దింపుకున్నం. ఇప్పుడు కొడుకులు కాస్తలేరని ఊకె బాధవడుకుంట ఇంకింత మన పానం కరాబ్ జేస్కోవద్దే. ఇట్లనే కష్టం జేసుకుంట హాయిగ ఉందాం. అస్సలు ఫికర్లు వెట్టుకోవద్దు' అంటూ తంబాకు తీశి, పోయి జూరాట్ల బండ కిందున్న మర్రి ఆకులు రెండు తీస్కచ్చిండు. సాయిలు ఆలోశించుకుంట కూసున్నడు.

ఆకు ఈనెలు చీరేశి, తంబాకు నింపి రెండు సుట్టలు తయారుజేశిండు. చెరొక్కటి తీసుకున్నరు. సాయిలు అగ్గిపెట్టె తీశి ముట్టిచ్చిండు. ఇద్దరు సుట్ట పొగ వీల్చుకుంట ఇడుస్తున్నరు.

ఇంతట్లనే నర్సవ్వ ఇంట్లకెల్లి బైటికి వచ్చింది పసగడుగుల లీల్లు వారెయ్యనీకి. సాయిలును సూడంగనే నక్కుంట 'సాయన్నా తిన్నవానె' అని అడిగింది అడుగు ఆపుకుంట. 'ఆఆ.. అప్పుడే యాడ శెల్లే. మీ వదిన ఇంకా పొయి ముట్టియ్యలేదు. పొద్దుగాల్ల పచ్చిగడ్డి కోస్కరాన వోయి అక్కడ పొలంల ఉన్న పుంటికూర తెచ్చిచ్చిన. ఆమె ఎప్పుడు తొక్కు నూరుతే అప్పుడు వోయి తింట' అని చెప్తున్న సాయిలును జూస్కుంట మురుసుకుంట లోపటికి వోయింది. పోయినామె అంతే రువ్వడి మీద బైటికచ్చింది శేతుల చాయి గిలాస వట్టుకొని. 'మీ శెల్లెను సూశినవా బావా.. నువ్వు అస్తవని నీకోసం గూడ చాయి కాశి పెట్టింది' దుర్గయ్య కిసుక్కుమన్నడు. 'అన్న మనసు శెల్లెకే తెల్సు బావా' అనుకుంట ఆ చాయి తీసుకున్నడు సాయిలు. నర్సవ్వ ఇంట్లకు వోయింది ముర్సుకుంట. సాయిలు, దుర్గయ్యలు చిన్నప్పటినుంచి మంచి దోస్తులు. అదే వూర్లె వుట్టి అదే ఊర్ల అయ్యవ్వల నుంచి వారసత్వంగ వచ్చిన వ్యవుసంను జేస్కొని అదే ఊరి మట్టిల కలవాల్నని గట్టిగ నిర్ణయించుకున్నోళ్లు. పొద్దుందాంక ఎండకు కష్టవడుడు, పొద్దిమీకంగనే ఇంత కల్లు బొట్టు తాగి ముదురుకుడు. పిల్లలతోని కుషీగ ఉండుడు ఇదే వాళ్లకు తెల్శిన బంగారు బతుకు. సాయిలుకు నలుగురు కొడుకులు. ఆడిబిడ్డెలు లేరని శాన కుదెం వెట్టుకున్నడు సాయిలు. కోడండ్లు అస్తే వాళ్లల్లనే బిడ్డెను జూస్కుందాం అనుకున్నరు గనీ, కోడండ్లు పరాయోళ్ల లెక్కట దూరం ఎల్లిపోయిరి. 'జగితి శిద్దయ్య కొడుకు గూడ పట్నం గడ్డ ఎక్కిండంట బావా' అన్నడు 'ఏమో పో.. ఊరంతా పిల్లలున్న గొడ్డుది అయిపోతున్నది కదా? ఒకోక్కోళ్లు ఇట్ల పట్నం తొవ్వ వట్టినంక మనసుంటి తండ్రులు అనాథల లెక్క మిగుల్తున్నరు' మనసు శిక్కవట్టుకొని అన్నడు దుర్గయ్య.

'ఏమో బావా.. ఊర్ల మన తరం తర్వాత ఎవుసం జేశేటోళ్లు ఇగ ఉండరు. మనమే భూతల్లికి లాష్టు రైతు వారసులం అనుకుంట. ఇగ ఆ తల్లితోని కాదు రైతు బిడ్డలను కనుడీ. మంచిగ సదువుకుంటరనుకుంటే వాళ్లు మనకు అందనంత దూరంకు వోతున్నరు. ఇప్పటికే నాకున్న పదెకరాల పొలం ఆయింత పంచుకొని ఎవన్ది వాడు అమ్ముకొని పట్నం వోయిర్రు. నాకు మిగిలిన గా నాలుగిసాల పొలం జేస్కుంట బతుకుతున్న' అంటున్న సాయిలు ఈసారి సుట్ట పొగ ఛాతి నిండ వీల్శి ఒదిలిండు.

'నాకున్న ఒక్క కొడుకు ఎవుసం జేస్తే సూశి ముర్శిపోవాలె అనుకున్న. కనీ, వాడు గూడ మీవోళ్ల లెక్కనే తేలిండు. ఇంత సదువు సదివి గీ ఊర్లె మట్టి విస్కాల్నా అని మాట్లాడిండే. ఆ పట్నంల వానికి ఏం మజా తల్గిందో ఏమో అక్కన్నుంచి రానంటే రానుంటున్నడే. ఇక్కడిదంత అమ్మేశి మమ్ములనే అక్కడికి రమ్మంటున్నడు' దీనంగా అన్నడు దుర్గయ్య. 'మావోళ్లు అదే మాటంటున్నరు. ఇంత బతుకు ఊర్ల బతికి గా పట్నంల ఎవలో ఏమో యాడ వోతం? మనకు అక్కడ యాడ మన్నుకు వద్దది? ఇట్లనే ఒక్కొక్కోళ్లు పెద్ద పెద్ద సదువులు సదువుకుంట పట్నం తొవ్వ వడ్తె ఊరు గొడ్డువోతది' అనుకుంట తుమ్మిండు సాయిలు. 'సచ్చమే.. గొడ్డువోతది ఊరు. మనం గా పట్నం వోయి అక్కడ అస్సలు ఉండలేం. మనసుంటోళ్లకు అక్కడ గాలి ఆడక సచ్చిపోతం. పొద్దిమీకుతే ఇట్ల నీతోని నాతోని నాలుగు ముచ్చట్లు మాట్లాడుకొని, ఎండల,

వానల పనిజేస్కొని పొద్దీకంగనే ఇంత కల్లుబొట్టుతోని కుత్కె తడుపుకొని బతుకు ఎల్లదీశేటోళ్లం. గా పట్నంల యాడ ఇముడుతం?' అన్నడు దుర్గయ్య. 'ఇట్లనే మన కడుపుల వుట్టినోళ్లంత పట్నాలకు, ఏరే దేశాలకు ఎగిరి పోతే ఇక్కడి భూములన్ని బీడువార్తయి గావచ్చు బామ్మర్ది' సాయిలు మాట నిజమౌతుందేమోననే బాధతో మనసు నొచ్చుకున్నడు దుర్గయ్య. 'అవునే ఆలోశిస్తుంటే కామునికంతల మన ఎన్క ఇగ ఎవలు గూడ పంచాదులు తెంపరేమో అనిపిస్తున్నది. ఊరు గొడ్డువోవుడు ఖాయం అనిపిస్తున్నది. కాలం మంచిగైతే అందరం శివారు మీద ఏం పంట ఏద్దాం అని కూసుండి మాట్లాడుకోరేమో? ఏం జేస్తం.. మన పెయిల జిగి సచ్చిపోయింది. వాళ్ల బతుకులు అట్ల బత్కాల్నని వాళ్లు అనుకున్నంక ఇగ మనం వాళ్లకు ఏం జెప్తమే?' కండ్లు తుడ్సుకుంట అన్నడు దుర్గయ్య. 'సదువుకున్నోళ్లు ఎవుసం జేస్తే ఎంత ముద్దుగుంటదో. వాళ్లకు అన్ని తెలుస్తయి గావట్టి.. ఎప్పుడు ఏ పంట ఎయ్యాల్నో ఏస్తరు. అట్లైతై రైతులు ఉరికి బలిగారేమో. ఎవుసం శాన సొక్కమైన పని అని బగ్గ సదువుకుంటున్న వాళ్ల దమాక్కు ఎప్పుడు ఎక్కుతదో? దేశం సరిహద్దుల జవాన్ ఎంతనో దేశంల ఉన్న ప్రజల కడుపు నింపుతున్న రైతు గూడ గంతే ఇలువైనోళ్లు. కనీ, యాడున్నది ఆ ఇల్వ? దేశంలకు శత్రువులు రాకుంట సరిహద్దుల లిలవడి కలెవడుతున్న జవాన్ కానస్తే సెల్యూట్ కొడ్తరు. కనీ, మన లోపటున్న ఆకలి దుష్మన్ను సంపుతున్న రైతుకు ఎవలు గూడ ఇల్వ ఇయ్యరు' అనుకుంట సాయిలు ఇంకింత శిన్నవోయిండు.

'ఏమోనే.. మనం గిన్ని మాట్లాడుకుంటున్నం గనీ.. తొల్త నేను నా కొడుకును ఈ మట్టి విసుక్కోకంట ఏ డాక్టరో, పెద్దసారో కావాలనుకున్న. కనీ, కొన్నొద్దులకు అనిపిచ్చింది నా ఆలోశన తప్పు అని. మనలెక్క శానమంది రైతులు వాళ్ల పిల్లలను రైతులు జెయ్యాలనుకుంటలేరు' శూన్యంలకు సూస్కుంట అన్నడు దుర్గయ్య. 'నీకు తెల్సా బామ్మర్దీ గీ ముచ్చట.. మన సంటర్ సర్కార్ రైతులను ముంచే సట్టాలు తెస్తున్నదంట. ఢిల్లీల రైతులంత కల్శి పది నెల్ల సంది ఎండనక, వాననక, సలనక నిరసన జేస్తున్నరట' సాయిలు నోటి నుంచి ఆ మాటలు విని చగావరైతున్నడు దుర్గయ్య. 'రైతులు ఇప్పటికే పండిచ్చిన పంటకు పెట్టిన లాగోడు రాక మునుగుతున్నరు. అసుంటి మనలను సర్కార్ ఆదుకునాలె గనీ, ముంచుడేందే?' కనుబొమ్మలు ముడివడ్డయి దుర్గయ్యయి. 'మన భూమి జాగల మీద ఎన్కట దొరలు, భూసాములు ఎట్ల పెత్తనం జేశిరో ఇప్పుడు అదే పని జేస్తున్నది సర్కార్. మన భూముల మీద వాళ్ల పెత్తనం అన్నమాట. మన భూమిల మనం కైకిలోళ్లం అయితం' అంటున్న సాయిలు మాట పూర్తి గానేలేదు దుర్గయ్య అందుకున్నడు.

'అట్లెట్ల అయితది. మన భూమి ఎవలిదో పెత్తనం ఏంది? నేను ఒప్పుకోను. నాకు గింత జరుగుతున్నదని తెల్వది. పా బావా, మనం గూడ ఢిల్లీకి వోయి మన రైతన్నలను సొద్దారి ఇద్దాం ' అంటున్నడు మెడ నరాలు పొంగంగ. 'పోదాం పోదాం.. పోకపోతే మనలను ఇన భూమిలనే బొంద వెడ్తది ఈ సర్కార్' అన్నడు సాయిలు. అట్ల శాన శేపటిదాంక సాగినయి వాళ్ల ముచ్చట్లు. ఒక సుట్ట అయిపోంగనే మల్ల ఒక్కొక్క సుట్ట ముట్టిచ్చిరు. ఇంతట్లనే సాయిలు పెండ్లాం రుక్కవ్వ

పిలుస్తున్నది. 'ఓ అయ్యా.. రా బువ్వ తిందువు గనీ' పక్క వీధిల కెంచి అస్తున్న పెండ్లాం పిలుపు వినంగనే సాయిలు లేశి నిలవడ్డడు. 'అస్తున్ననే' అని గట్టిగా అరుస్తూ చెప్పి లేశి నిలవడిండు. 'బామ్మర్దీ.. మీ శెల్లె అండినట్టుంది. ఆమె వెట్టినప్పుడే తినాలె. లేకవోతే ఉపాసం ఉండవల్శి అస్తది. పొలంకాడ కలుద్దాం తియ్' అని లేచి గోశి సదురుకుంట సైకిల్ తీశి ఎల్లిపోయిండు సాయిలు.

* * *

పొద్దుపొద్దుగాల్లనే ఇంటి ముంగట్కి ఒగ తెల్లటి కారు అచ్చి ఆగింది. బైట పొయిల గొట్టంతోని మంట ఊదుతున్న నర్సవ్వ ఆ కారును శిత్రంగ సూశింది. 'కార్ల ఎవలు అచ్చిర్రు మా ఇంటికి' అన్నట్టు అటు దిక్కే జూస్తున్నది. అన్లకెల్లి తెల్ల బట్టలు ఏసుకున్న ఒగ పొడావ్ మన్షి దిగిండు. ఊర్ల ఉన్నయన్ని అమ్ముకొని పట్నం గడ్డెక్కిన లక్ష్మీకాంత రెడ్డి పెద్ద కొడుకు రవికాంత్ రెడ్డి లెక్కటనే కనిపిచ్చిండు నర్సవ్వ కండ్లకు. ఆయిన ఎన్కకెల్లి ఊర్లుండె శింతకాయల రాజయ్యా అచ్చిండు. 'నర్సవ్వా.. దుర్గన్న లేడా?' అని అడిగిండు రాజయ్య. 'ఉన్నడే ఇంకా లెవ్వలేదు' అన్నది గొట్టం పక్కకు వెట్టుకుంట. 'పోయి లేపుపో' అన్నడు. 'ఆఆ' అనుకుంట లోపటికి ఉర్కింది నర్సవ్వ. రాత్రి తాగిన కల్లు మైకం మాంచిగ ఎక్కింది దుర్గయ్యకు. కాళ్లు ఇర్రదన్ని పండుకొని ఉన్నడు. దూలంకు యాలాడుతున్న ఫ్యాను గాలికి సోయి లేకుంట వన్నడు దుర్గయ్య. 'ఓ అయ్య లెవ్వు నువ్వు. ఎవలో దొర అచ్చిండు' అని భూజాలు వట్టి ఊపుకుంట లేపింది నర్సవ్వ. దుర్గయ్య లేశి 'ఏందే, బంగారమసుంటి నిద్ర కరాబ్ జేశినవు' అనుకుంట కండ్లు నులుముకుంట లేశిండు. 'అగో బైట ఎవలో దొర అచ్చిండే' అన్నది. 'దొరనా? ఎవలే ఆయిన?' అనుకుంట లేశి బైటకు నడిశిండు. అక్కడున్న ముంతల లీల్లు తీస్కొని పుక్కలిచ్చి ఉమ్మి, భజంకు ఉన్న తువాలతోని తుడుసుకొని ఆ పెద్దమన్శి ముంగట్కి వోయి నిలవడ్డడు.

'నమస్తే' అన్నడు. ఆయిన గూడ ప్రతి నమస్కారం కింద ఇట్ల శెయ్యి ఊపిండు. 'దుర్గన్నా.. తిన పేరు భుజంగరావు. మన ఎల్లారెడ్డి ప్యాటల ఉంటడు. హైదరవాదులు శాన యాపారాలు ఉన్నయి ఈ సారుకు' అని శెప్పుకస్తున్న రాజయ్యను, ఇటు భుజంగ రావును సూస్కుంట నోరు ఎల్లవెట్టిండు దుర్గయ్య. దుర్గయ్య ఎన్కనే నర్సవ్వ గూడ వచ్చి నిలవడ్డది. అయినా ఇప్పుడు వీళ్లు మా ఇంటికి ఎందుకు వచ్చిర్రు? అనే ప్రశ్న ఇద్దరి మొకాళ్ల శాన క్లియర్గ కానస్తున్నది. 'ఇగో దుర్గన్నా.. ఈ సారు నీ పొలం కొన్నడు' అంటున్న రాజయ్య మాటలకు ఇంకింత షాక్ అయిర్రు దుర్గయ్య, నర్సవ్వలు. ఒకరి మొకాలు జూస్కుంట భీరిపోతున్నరు. 'మీ అబ్బాయి చిత్తారి నాకు మీ ఎకరం పొలం అమ్మాడు. ఇరవై ఐదు లక్షలకు కొన్నాను. రేపటినుంచి మీరు ఆ పొలంలోకి రావొద్దని చెప్పడానికి వచ్చాను. నేను ఆ పొలంలో పూల తోట పెట్టాలనుకుంటున్న. అలాగే మా ఫ్యామిలీ కోసం ఓ గెస్ట్ హౌజ్ కట్టాలనుకుంటున్నా' అంటున్న ఆయిన మొకం జూస్తున్న ఇద్దరి గుండెల్ల ఆటం బాంబు పేలినట్టు అయింది. 'ఏంది నా పొలం అమ్మిండా వాడు?' అడిగిండు దుర్గయ్య. 'నీకు తెల్వదానె? గిసుంటి కతలు ఉంటయనే నీ సంతుకం గూడ తీస్క రమ్మనుంటిమి' రాజయ్య క్లారిటీ ఇచ్చిండు. ఆ మాట ఇనంగనే నెల రోజులు ముందు చిత్తారి

హైదరాబాద్ నుంచి వచ్చి ఏవో కాయిదాల మీద ఇద్దరి సంతకాలు తీస్కున్నది యాదికచ్చింది. ఏంటియి ఆ కాయిదాలు అంటే, ఏదో లోన్ తీస్కుంటున్న అన్న మాటలు గుర్తచ్చి గుండెల అడివట్టినట్టు అయితున్నది దుర్గయ్యకు. అవి పొలం కాయిదాలని సదువురాని తాము తెల్సుకోలేకపోయినం అనుకొని ఇద్దరు ఒకరి మొకాలు ఒకరు జూస్కుంట నోర్లు ఎల్లవెట్టిగ్రు. కొడుకు జేశిన మోసం గురించి తల్సుకుంటుంటే వాళ్లకు దుఃఖం ఆగుతలేదు. దుర్గయ్య లోపట లోపట ఉడుకుతున్నడు గనీ, నర్సవ్వ అయితే బరస్ట్ అయిపోయింది. సోకం వెట్టి ఏడుస్తనే ఉన్నది. 'ఎంత పని జేస్తివిరా చిత్తారీ.. ఏవో లోన్ కాయిదాలని తెచ్చి మాతోని సంతకాలు జేపిచ్చుకొని అమ్ముకుంటివారా?' అని ఆరోజు జరిగినదాని గురించి తల్సుకొని కుమిలిపోతున్నది. 'నర్సవ్వా ఏడ్వకు.. మీ కొడుకు మీకంత జెప్పే శేస్తున్నడని అనుకున్నం మేము. అయినా ఇంతకు ముందుగాల్ల నాలుగు ఎక్రాల భూమి అమ్ముకున్నరు గదా మీ బిడ్డెలు. ఇది గూడ కొడుకు అమ్ముకున్నడని అనుకోగ్రి' అంటున్న రాజయ్య మాటలకు ఇంకింత కుమిలిపోతున్నది నర్సవ్వ. భుజంగరావు రాజయ్యను జూస్కుంట 'పా ఇక్కణ్నుంచి' అన్నట్టు కండ్లతోని సైగ జేశిండు. ఆ సైగను అర్థం జేస్కున్న రాజయ్య సదరుకుంట 'ఆఆ.. ఏడ్వకుగ్రి మీరిట్ల. ఉన్న ఈ ఇల్లు గూడ అమ్ముకొని కొడుకు దెగ్గర ఉండిపోగ్రి. ఏముంటరు ఈ ఊల్లె ఒంటి పిట్టెల లెక్కట' అంటున్న రాజయ్య మాటలకు దుర్గయ్యకు కోపం తన్నుకస్తుంటే ఆపుకుంటున్నడు.

దాన్ని గుర్తువట్టిండు రాజయ్య. 'ఈడ ఎక్కశేపు ఉంటే పెద్ద కొట్లాటనే అయితది' అనుకున్నడు. 'సరే పా దొరా పోదాం మల్ల. దుర్గన్నా ఇగ ఆ పొలం ఈ కాన్నుంచి మీది గాదు, ఈనది. పైసలన్నీ ముట్టిపోయినయి. రిజిస్ట్రేషన్ గూడ అయిపోయింది' అనుకుంట కదిలిండు రాజయ్య. భుజంగరావు ఈల్ల దిక్కు జూస్కుంట నమస్కారం వెట్టుకుంట కదిలి కార్ల కూసున్నడు. కారు స్టార్ట్ అయి రుయ్యున వోయింది. కారు వోయింది గూడ సోయి లేకుంట అయింది దుర్గయ్యకు. అట్లనే లిలవడ్డరు మాలాస్క శేపటిదాంక. ఇంతట్లనే దోసపల్లి సాయిలు అచ్చిండు సైకిల్ మీద. సైకిల్ గంట గొట్టంగనే ఈ ప్రపంచంలకు వచ్చిగ్రు ఇద్దరాల్ మొగోళ్లు. సాయిలు దిక్కు సూశిగ్రు పిచ్చోళ్ల లెక్కట. సాయిలు సైకిల్ను పక్కపొంటి స్టాండ ఏశి లిలవెట్టిండు. ఎంటనే ఇద్దరి భుజాల మీద చెయ్యేశి అరుగు మీదికి తోల్కపోయిండు. 'కాముని పున్నమి పీడ దినంగోలె మంచి పనే జేశిండు మీ కొడుకు' అంటున్న సాయిలును పట్టుకొని బోరున ఏడ్శిండు దుర్గయ్య. నర్సవ్వ గూడ పల్లపల్ల మల్ల ఏడుపు అందుకున్నది. 'ఏడ్వకుగ్రి ఏడ్వకుగ్రి.. ఇప్పుడు ఏడుస్తే పోయిన పొలం అస్తదా? కడుపుల వుట్టినోళ్లు కడుపు మీద తంతరే. కన్నోళ్లం మనం అసుంటి శేదును మింగ గూడ తయారుండాలె. లేకపోతే అనవసరంగ బాధవడి ఇంకా నాలుగొద్దులు ఎక్క బత్కాల్శినోళ్లం బరాన వోతం బోడిగడ్డకు' అనుకుంట అరుగు మీద కూసుండవెట్టిండు. ఎంటనే ఇంట్లకు ఉర్కి ముంతల తాగేలీల్లు తెచ్చి ఇచ్చిండు. 'ముందుగాల్ల ఈ లీల్లు తాగి దమాక్ సల్లగ జేస్కోగ్రి' అన్నడు. ఇద్దరూ చెరిన్ని లీల్లు తాగిగ్రు. 'శెల్లె, బావ మీరిట్ల బాధవడకుగ్రి. పోతెవాయె తియ్ తొప్పెల పొలం అనుకో. ఇప్పటికే మీకు శాతనైతలేదు. ఇంకా

పేగు పేగు అయికుంట ఎన్నొద్దులు జేస్తరు కష్టం. మనం ఎవుసం జేశి బతికినట్టు మన కడుపుల వుట్టినోళ్లు గూడ గా ఎన్న కష్టం జెయ్యుమంటే ఎందుకు జేస్తరు? బావా... నువ్వు నీ కొడుకును రైతును జెయ్యాలనుకున్నవు గనీ, వాడు పట్నం కంపిన్ల పంచకు బల్లి లెక్కట బతుకుతనంటున్నడు. అసుంటోళ్లను ఇడ్సవెట్టాలె. మనం బతికినన్నొద్దులు ఏం పికర్లు వడకుంట బతకాలె. పోని తియ్. శెల్లే ఊకో నువ్వు.. గట్టిదానివి నువ్వు గుండె దైర్నం జెయ్.. ఏడ్వకుర్రి.. ఇప్పుడు ఏడుస్తే పోయిన పొలం అస్తదా? ఓటు ఏశిన ప్రజలను కాసుకునే సర్కార్ అడ్డమైన సట్టాలతోని రైతులను బలి పశువులను జేస్తున్నది. కడుపుల వుట్టినోళ్లేమో కడుపు మీద తంతున్నరు. ఒగ పక్క రైతులం, ఇంకో పక్క కన్నోళ్లం.' అనుకుంట ఇంట్లకు ఉర్కి ముంతల తాగే లీల్లు తెచ్చి ఇచ్చిండు సాయిలు. 'ముందుగాల్ల ఈ లీల్లు తాగి దమాక్ సల్లగ జేస్కోర్రి' అన్నడు. ఇద్దరూ చెరిన్ని లీల్లు తాగిర్రు. సాయిలు మొకంలకు ధీనంగ జూస్తున్నరు ఇద్దరు. ఆరోజు పొద్దిమీకిందాంక సాయిలు వాళ్లను సంజాకుంట, ధైర్యం జెప్పుకుంట కూసున్నడు.

సాయిలు పెండ్లాం రుక్కవ్వ గూడ వచ్చి ధైర్యం జెప్పింది. అట్ల సాయిలు శానా సేపటిదాంక ఉండి బల్మీట్కి ఇంత తినిపిచ్చిండు. రెండు సీసల కల్లు తాపి పోయిండు. ఏం ఆలోశించకుంట సప్పుదాంక ముదురుకోర్రని కొట్టి కొట్టి శెప్పి పోయిండు. ఈ ముచ్చట తెల్శి ఊర్ల శానమంది వచ్చుకుంట పికర్ జెయ్యద్దని శెప్పుకుంట వోతున్నరు. బిడ్డెలు, అల్లుండ్లు గూడ ఫోన్ల ఎన్క ఫోన్లు జేశి మాట్లాడి మనసు తీరం జేస్తున్నరు. కనీ, కొడుకు చిత్తారి మాత్రం ఒక్కపారి గూడ ఫోన్ జెయ్యలేదు. 'నాయినా, నేను పొలం అమ్ముతున్న అని ఒక్క మాటన్న జెప్పుంటే నేను ఏమంటుంటినో? నన్ను హౌలని జేశి లోన్ కోసమని అవద్దం జెప్పి సంతకాలు వెట్టిపిచ్చుకొని పొలం అమ్ముకొని ఎంత మోసం జేశిండు ' ఇదే ప్రశ్న ఇద్దరాల్ మొగోళ్ల మనుసుల మెరమెర అంటున్నది. అస్సలు మన్సుకు వడ్తలేదు వాళ్లకు. ఉన్న ఒక్క కొడుకు ఇట్ల జేశిండని మనసు మార్మానం వోయినట్టు ఎర్రి సూపులు జూస్కుంట ఉన్నరు ఒకోళ్లనొకోళ్లు. తన తండ్రి నుంచి వచ్చిన ఎవుసంను తరతరాలకు ముంగట్కి తీస్కపోవాల్నని దుర్గయ్య ఎన్నో కలలు కన్నడు. గీ ప్రపంచంల ఎవుసంను మించిన నిస్వార్థమైన, నిజాయితీగల్ల పని ఏదీ లేదని శానా బలంగ నమ్మినోడు దుర్గయ్య. కనీ, తనతోనే ఎవుసం ఆగిపోతుందనే మాట దుర్గయ్యను అస్సలు సైను వట్టనిస్తలేదు. కొడుకుకు ఎవుసం గురించి ఎంత గొప్పగ జెప్పినా నెత్తికెక్కలేదు. పెండ్లాం అచ్చినంక పట్నం యావ ఎక్కి ఎగిరిపోయిండు. అయినా ఇయ్యాల్లనో రేపో పట్నం మీద మొకం మొత్తి ఊరి బాటన వడ్తడు, ఎవుసం జేస్తడు నా కొడుకు అని ఎన్నో నమ్మకాలు వెట్టుకున్నడు. గనీ అవన్నీ అవద్దం జేశిండు చిత్తారి. ఐదు ఎక్రాల్ల నాలుగు ఎక్రాలు బిడ్డెలకు ఇచ్చినా.. ఉన్న ఎక్ర పొలం కొడ్కుకు మాస్తు అయితదని, రేపు రేపు వాడే కష్టం జేశి ఇంకిన్ని ఎక్రాల భూమిని సంపాంచడా? అని అనుకున్నదంతా ఉత్త కతనే జేశిండు??

* * *

ఆ రాత్రి ఇద్దర్కి మచ్చుంవోయిన నిద్రనే వడ్తలేదు. కరంటు లేకపోవుడుతోని చిమ్నీ ఎలిగిచ్చి పెట్టిర్రు. దాని ఒత్తి మీద కొడిగట్టుకుపోయి గుడ్డి గుడ్డి కనిపిస్తున్నది ఎలుగు. దోమలు గూడ

మాలాసనే ముసురుకున్నయి. దుర్గయ్య మాటిమాటికి లేశి కూసుంటున్నడు. దుర్గయ్య ఊకె లేస్తున్నడని నర్సవ్వ గూడ లేశి ఆయిననే జూస్తున్నది. 'ఇగ నా మన్సు గట్టిగ జేస్కోకపోతే ఈ పెద్దమన్షి ఆగమైతట్టే ఉన్నడు' అనుకొని అప్పటిదప్పుడే మన్సును రౌతు జేస్కుంటున్నది. 'ఓ పెద్దమన్షీ.. ఎందుకే గంతగానం అర్వర్వ వోతున్నవు? పొలం అమ్మితే అమ్మిండు తియ్. ఎందుకంత ఆగమైతున్నవు నువ్వు.

వానికి బలం వట్టుకచ్చినప్పుడు మల్ల పొలం కొంటడేమో తియ్' అంటున్న నర్సవ్వ మొకంలకు సూశి తల్కాయ దించుకున్నడు. ఎంటనే తన రుమాల్ పేల్కల కట్టి పెట్టుకున్న సగం కాల్శిన సుట్టను తీశిండు. అగ్గిపెట్టె కోసం అటీటు జూస్తున్నడు. ఎంటనే నర్సవ్వ లేశచ్చి నోట్లె ఉన్న సుట్టను గుంజుకున్నది. 'ఊకె సుట్టలు ఎన్నిగానం తాగుతవు? ఇప్పటికే మాలాస్క తాగినవు. ఇవి తాగి తాగి ఇంకింత పానం కరాబ్ జేస్కుంటవా? ఏది వోయినా నా జాత్ మరే అని, నన్ను సంజాచేటోనివి ఇయ్యాల్ల ఇట్ల మెత్తవడ్తె నాకు సూడబుద్ధి అయితలేదే. నువ్వు ఏం ఆగం గాకు. మనిద్దరి రెక్కలు సలామత్ ఉన్నన్ని దినాలు గిట్లనే కష్టం జేస్కుంట బతుకుదాం. మనకు పిల్లలు వుట్టలేదని అనుకుంటే సాలు ఏ రంది ఉండది' అంటున్న నర్సవ్వ మాటలు దుర్గయ్య మన్సుకు జర ధైర్యం జెప్పినట్టు అనిపిచ్చినయి. అంతట్లనే మల్ల పొలం జట్టన యాదికచ్చి అప్పదప్పుడే గుండెల నిండిన ధైర్యం ఉడ్కు లీల్లు ఆవిరైనట్టు ఆవిరిగావట్టె? 'నువ్విట్ల పండుకో.. ' అని తన పక్కకు మెత్త జూపిచ్చింది. నిద్ర రాకపోయినా మెల్లెగ మెత్త మీద తల్కాయ ఆన్శిండు. కండ్లు మూతలు వడ్తలేవు.

అటు ఇటు బొర్రుతున్నడు. నర్సవ్వ శేయి దుర్గయ్య ఛాతి మీద సరుస్తున్నది. ఆమెకు కన్ను మీద కన్నువడ్డది. దుర్గయ్యకు మాత్రం పొలమే యాదికస్తున్నది. కొడుకుకు ఎట్ల జెయ్యబుద్ధి అయింది ఈ పని? అని మన్సుల ఊకూకె అడుక్కుంటున్నడు. 'నేనిట్ల జెయ్యాలనుకుంటున్నా నాయినా.. అని ఒక్కమాట నన్ను అడుగుంటె అవునంటుంటినో, కాదంటుంటినో గదా? వానికి ఎట్ల జెయ్య బుద్ధి అయిందో ఏమో' అనుకొని కండ్లు నల్సుకుంటున్నడు. బైట కీకెలు, పెద్దపెద్దగ లొల్లి వెట్టుకున్నట్టు సప్పుళ్లు ఇనవడ్తున్నయి. హోళీ పండుగు గదా.. కాముడు కాల్వ ఊరి పోరగాండ్లంత ఒక్కటై తయ్యున ఆడుతున్నరు. వాళ్లిండ్లయి వీళ్లండ్ల ముంగటున్న ఆ సామాన్లు ఈ సామాన్లు గుంజుకచ్చుకుంట మంటల్ల ఏస్తున్నరు. వాళ్ల కీకెలు ఇంటున్న దుర్గయ్య మన్సుల ఏదో మెరమెర అన్నది. ఎంటనే నర్సవ్వ దిక్కు తల్కాయ మల్పి సూశిండు. ఆమెకు మంచిగ నిద్రవట్టింది. తన మీదున్న ఆమె శెయ్యిని మెల్లెగ తీశి పక్కకు వెట్టి లేశిండు. రుమాలు నెత్తికి సుట్టుకున్నడు, గోశి నడుముకు మంచిగ శెక్కుకున్నడు. దర్వాజ తీస్కొని బైటకచ్చిండు. మల్ల దర్వాజ ముంగటికేశి ఆకిట్లకు వోయిండు. అక్కడున్న నాగలి, బండి, పార, కొడవలి, కొంకులను జూస్తున్నడు. అవిటితోని తను పొలంల వడ్డ కష్టాలను తల్సుకొని ఆ సామాన్లిట్నే ఆఖరిసారి అన్నట్టు కండ్లార జూస్తున్నడు. అన్నిటి మీద శేయితోని ప్రేమగ నిమురుతున్నడు. 'ఇగ మీకు నాకు బాకీ తీరిపోయింది' అనుకున్నడు మనుసుల. నాగలి మొన్నమొన్ననే కొత్తగ కమ్మరి అంజన్నతోని శెక్కిపిచ్చుట్ల ఇంకా కొత్తగా మెరుస్తున్నది.

కండ్లల్ల లీల్లు దుంకుతున్నయి. మనసును ఎవలో వట్టి అడివెట్టినట్టైతున్నది. ఇంక ఏరే ఆలోశించలేదు. శెక్కిలి నరాలు బిగవట్టిండు, నాగలిని లేపి భుజం మీద వెట్టుకున్నడు. కొడవలి, కొంకులున్న సంచిని శేతుల వట్టుకొని కామునికంతలకు నడుస్తున్నడు. తొవ్వ పొర్త రప్పరప్ప వోతున్నడు ఆ శీకట్ల. కరంటు లేక శీకట్ల ఆయిన తెల్లబట్టలు మాత్రమే కానస్తున్నయి. ఇప్పటిదాంక ఒర్లినోళ్ల సప్పుళ్లు బంద్దైనయి. కాముని కంతల మంట వెట్టిన కాముని మంటను జూస్కుంట గుడ్లల్ల లీల్లు తింపుకున్నడు. దుఖ్ఖం పొంగుకస్తున్నది.. పండ్లు నూరుకుంట దుంఖ్ఖం ఆపుకుంట ఆ నాగలిని ఆ మంటల్ల ఏశిండు.

సంచిలున్న సామాన్లను గూడ అన్ల గుమ్మరిచ్చిండు. అప్పుడే మనసు రౌతు అయినట్టే అయితున్నది దుర్గయ్యాల. మల్ల ఆగలేదక్కడ. ఎన్కకు మల్లి ఇంటితొవ్వ వట్టిండు. ఇంటికాడున్న రొప్పు నాగలిని బండ్లె ఏశిండు. ఎడ్లను బండికి కట్టిండు. ఆకిట్ల కెంచి గెదుముతున్నడు. ఎడ్లకు ఏం అర్థం అయితలేదు. అద్దుమరాత్రి యాడికి తీస్కపోతున్నడు అన్నట్టు అవి కల్లివిల్లి జేస్తుంటే.. అవిటి ఈపు మీద మెత్తగ నిమిరిండు. దుర్గయ్య శెయ్యి వడంగనే అవి తాదనకు అచ్చినయి. అట్లనే మెల్లెగ గెదుముకుంట కామునికంతలకు వోయిండు. ఊరంత వండుకొని ఉన్నది. కాముడు కాలుస్తున్న పోరగాండ్లు సప్పుళ్లు రూముల్ల దిక్కు దూరంగ ఇనిపిస్తున్నయి. కుక్కలు బండిని సూశి భౌభౌ అంటున్నయి. కాముని కంతలకు బండి రాంగనే ఎడ్లను ఇడ్శిండు. నాలుగు తొవ్వలు కల్శే జాగ అది.

కాముని పున్నమి రోజు ఆ చౌరస్తలనే కామ దహనం చేస్తరు గావట్టి అక్కడి జాగకు కాముని కంత అని పేరు వడ్డది. గోపాల్పేట్ల కాముని కంత అంటే అక్కడి సుట్టుపక్కల ఊర్లల్ల శానా ఫేమస్. ఆలుమొగల పంచాదులు, అన్నదమ్ముల గెట్టు లొల్లులు, పాలోల్ల తాకులాటలు ఇట్ల ఒకటా రెండా.., శానా పంచాదులు కాముని కంతలనే తెగుతయి. బూర్గుపల్లి రోషయ్య, తుర్క రసూల్, శిల్గెపురం బాగయ్య, పెండ పోషయ్య, కమ్మరి అంజన్న, తిమ్మాయిపల్లి కిష్టయ్య, మాసుల సులేమాన్, కొమటూరు సిద్దిరాములు ఇట్ల శానమంది పెద్ద మన్సులు ఉన్నరు ఇసుంటి పంచాదులు తెంప. కాముని కంతల లిలవెట్టిన అంబేద్కర్ విగ్రహం దిక్కు జరశేపటి దాంక అట్లనే సూశిండు. ఆ విగ్రహం ఎన్కదిక్కు పోషెట్టి కిరాణ దుకుణం ఉంటది. సుట్టుపక్కల ఊరోళ్లయి ఇండ్లు ఉంటయి. దానికి దెగ్గర్లనే పీర్ల చావిడి ఉంటది. అంబేద్కర్ నే సూస్తున్న దుర్గయ్యకు గుండెల బాధ ఎగదన్నుకొని అస్తుంటే కండ్లల్ల లీల్లు కుక్కుకుంటున్నడు.

బండి దెగ్గరికి వోయి దాని మీద చేయితోని నిమిరిండు. ఇంకింత బాధ కలిగింది. కండ్లల్ల లీల్లు ఆగకుంట దుంకి బండి మీద వడ్తున్నయి. టేకు, ఇప్ప కట్టెతోని కమ్మరి అంజన్నతోని చెక్కిపిచ్చుకున్న యాదులను తల్సుకొని బండికి కడసారి వీడ్కోలు అన్నట్టు మల్ల మల్ల నిమిరిండు. గుండె బిగవట్టుకొని అట్లనే నూక్కుంట వోయి ఆ మంటల్ల బండిని నూకిండు. తనెన్క తెచ్చుకున్న గ్యాస్ నూనె డబ్బను తీశి అన్లున్న నూనెనె బండి మీద గుమ్మరిస్తున్నడు. జర్ర శేపట్లనే బండికంత మంట అంటుకున్నది. ఇంత పెద్ద మంట అయితున్నది. ఎడ్లు అటు పక్కకు లిలవడి ధీనంగ జూస్తున్నయి. దుర్గయ్య నెత్తి కొట్టుకుంట ఏడుపు సప్పుడు బైటికి

రాకుంట లోపట లోపట కుమిలి కుమిలి ఏడుస్తున్నడు. కండ్లల్ల లీల్లు మాత్రం ఏరు ధారలు అయినయి. తనెంతో పాయిరంగ జేపిచ్చుకున్న బండి, నాగలి ఇట్ల అన్నీ ఎవుసం సామాన్లు కండ్ల ముంగట కాలి బూడిద అయితుంటే ఆయిన మన్సు గూడ కాలిపోతున్నది. ఎక్కడి కోపం? ఏం రేషం ఇది?? ఎవుసాన్ని నమ్ముకున్న రైతు మనసు మండుతే సర్వం బూడిదనే అయితది అనుకున్నట్టున్నడు?? 'భూమి వోయింది, ఇంక ఆ ఎవుసం సామాన్లను ఇంటి ముంగట వెట్టుకొని ఎందుకు బాధవడాలె? రైతు వారసత్వం నాతోనే అంతమైతున్నది ఇట్ల అగ్గిల కాలుకుంట' అని అనుకొనే తన లోపటున్న రైతును ఇట్ల కాల్సుకున్నడు దుర్గయ్య. అట్లనే ఆ మంటను జూస్కుంట శాన శేపటిదాంక కూసున్నడు. ఎడ్లు అటు పక్కకు లిలవడి జూస్తున్నయి. ఇంతట్లనే అటు పక్కకెల్లి పోరగాండ్ల కీకెలు ఇనవడ్డయి. అంతే సటుక్కున లేశిండు. వాళ్ల కండ్లల్ల వడద్దనుకున్నడు. ఎడ్లను దమాంచుకుంట ఇంటి తొవ్వ వట్టిండు.

ముంగట నడుస్తున్న ఎడ్లకు దుర్గయ్య తర్వాయి అర్తమైనట్టు మెల్లెగ నడుస్తున్నయి. 'ఇగ ఈనకు, మాకు గూడ రుణం తీరిపోయెటట్టే ఉన్నది' అన్నట్టు నడక సాగిస్తున్నయి. కాముని మంటలు ఎగిసెగిసి పడుతున్నయి అచ్చం దుర్గయ్య గుండెలు మండుతున్నట్టే?

* * *

అటు కాముని కంతల నాగలి, బండి మండిపోతున్నయి గనీ, ఇటు దుర్గయ్య గుండెల మంట తగ్గుతలేదు. కొడుకు మోసానికి ఇది తన నిరసన అనుకుంటున్నడు. ఇటు కొడుకు జేశిన మోసం గురించి అటు ఢిల్లీల రైతు ఉద్యమం గురించి సాయిలు జెప్పిన మాటలను యాజ్జేసుకుంట మస్తుగ బాధపడ్డడు. 'అయ్యకు కొడుకు ఆదెరువు గాకపోవచ్చు గనీ, రైతుకు రైతే ఆదెరువు గావాలె. గీ సర్కార్ మెడలు వంచవల్శిందే. లేకపోతే భవిష్యత్తుల రైతు జాగల కూలోడే మిగుల్తడు' అని బగ్గ ఆలోశించి ఒగ ఫైస్ల తీసుకొన్నడు. శూన్యంలకు సీరియస్గ సూస్కుంట శాన సేపటికి కండ్లు మూసుకున్నడు.

* * *

ఢిల్లీల జరుగుతున్న రైతు ఉద్యమంలకు వోయి శెరీక్కైర్రు దుర్గయ్య, సాయిలు. ఎవరు గూడ అడగక ముందే పొలంల దుక్కి దున్ని ఆరుగాలం కష్టపడుతున్న రైతులను రోడ్డెక్కిచ్చి అరార గోస వెడుతున్నరని మనసుల్ల కలుక్కుమన్నది. ఇప్పటికి ఆరు వందల మంది రైతులు జీవిడ్శిర్రు అని తెల్శి పానమంత కలకల అన్నరు. రైతు ఏడ్శిన రాజ్యం ఎప్పటికి ముంగటవడది అనుకుంటున్నరు. రైతుల మీద ఖలిస్తానీలు అని ముద్ర ఏశిన సర్కార్ మీద వాళ్లకు దయ కలిగింది. రైతుల పోరాటంల న్యాయమున్నది.. సర్కార్ మొండి యవ్వారంల దొంగలకు సద్దులు గట్టే మర్మం ఉన్నదని అర్థమైతున్నది. రోడ్ల మీద సలాకలు దింపుడు, వాళ్లకు మంచినీళ్లు అందకుంట కుట్రజేస్తున్న పోలీసోళ్ల తాత, ముత్తాతలు రైతులే అయ్యుంటరు గదా? సర్కార్కు సపోర్ట్ జేస్తున్న ఆ పార్టీ కార్యకర్తల ఇంట్ల రైతులే లేరా? మన దేశ ముఖ్యమైన వనరు ఎవుసమే గదా.. ఈ తరంల ఎంతమంది సదువుకొని ఎవుసం జెయ్యకున్నా మన మూలాలల్ల ఖచ్చితంగ రైతులు ఉంటరు గదా? మనం నలుగురికి బువ్వ వెట్టే రైతు వారసత్వం నుంచే గదా అచ్చినం??

ఈ సట్టాలతోని రైతు పూరగనే మిగలకుంట సచ్చిపోతడు.. అప్పుడు వీళ్లంత ఏం తింటరు? ఎన్ని కోట్లు సంపాంచినా గా పైసనైతే తినరు గదా.. రైతు పండిచ్చిన గింజలే గదా కొన్క తినాలె? గీ గురాతనం ఎందుకు ఉంటలేదు సర్కార్కు? ఇట్ల శాన ప్రశ్నలు వాళ్లల్ల? 'ఉన్న పొలం అమ్మి కొడుకులు కానకుంట పట్నం తొవ్వ వట్టిర్రు.. పుట్టినం రైతుగనే, పోతం సాటి రైతు కోసమే..' అని ఇద్దరు గట్టిగ మోరు గుద్దుకున్నరు మనసులల్ల. వీళ్లు అక్కడికి పోవుడుతోని ఇక్కడి శానమంది రైతులు ఆ ఉద్యమంకు మద్దతు పల్క రైలెక్కుతున్నరు ఢిల్లీకి.

* * *

ఆయాల్ల రైతులు రోడ మీద కూసుండి నిరసన జేస్తుంటే అక్కడికచ్చిన కేంద్రమంత్రి కొడుకు రౌడీ లెక్కట వాళ్ల మీదికి కారెక్కిచ్చి తొమ్మిది మంది రైతుల పానాలు తిన్నడు. ఆ తొమ్మిది మందిల దుర్గయ్య గూడ ఉన్నడు?? మంత్రి కొడుకు కావురం పని మీద దేశం మొత్తం అట్టుడికిపోతున్నది. ఆ మంత్రి కొడుకుకు ఉరిశిక్ష ఎయ్యాల్నని దేశం మొత్తంల రైతులంత ఉడికిపోతున్నరు. శానమంది రైతులకు మద్దతు ఇస్తున్నరు. 'న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్న రైతులను సంపుతున్న ఈ సర్కార్ దిగిపోవల్సిందే' అని ఇంకా ఉద్యమంను ఉదృతం జేశిర్రు.

దేశంలున్న రైతులంత సర్కార్ మీద సైరన్ మోగిచ్చిర్రు. దీంతోని కేంద్రం దిగచ్చింది. ఆ రైతు వ్యతిరేక సట్టాలను ఎన్కకు తీసుకున్నది.

* * *

దుర్గయ్య మరణం గోపాల్పేట్ల ఎంతో మందిని కదిలిచ్చింది. రెండు తెలుగు రాష్ట్రాల్ల దుర్గయ్యకు శానమంది నివాళులు అర్పిస్తున్నరు. రైతుగ వుట్టిన దుర్గయ్య రైతుల కోసమే తన పానం అర్పిచ్చి చరిత్రల నిలిశిండు. రైతుల కోసం పానం అర్పిచ్చిండని ఆ ఊరోళ్లంత కల్శి సర్పంచ్తోని మాట్లాడి దుర్గయ్య విగ్రహం జేపిచ్చి కాముని కంతల ఉన్న అంబేద్కర్ విగ్రహం పక్కపొంటి లిలవెట్టిర్రు.

* * *

ఇంట్ల దీపం ముంగట కూసొని గోడకున్న దుర్గయ్య ఫోటో జూస్కుంట బాధ వడుతున్నది నర్సవ్వ. 'ఇగ నేనెందుకు బతకాలె? ఎవర్ని జూస్కొని బతకాలె? పిల్లలు దెగ్గర లేరు? శేస్కున్నాయిన అర్వంద్రం జేశి పోయిండు? పొలంలనన్న ఇంత పని జేస్కుంట పొద్దు ఎల్లదీస్కుందాం అంటే అదీ లేదు? ఇట్ల నర్సవ్వ మనసుల ప్రశ్నలు??? ఇంతట్లనే ఆమె ఎన్కకెల్లి భుజం మీద ఒగ శెయ్యి పడింది. షాక్ అయిన నర్సవ్వ ఎవలని ఎన్కకు మల్లి సూశింది. కొడుకు చిత్తారిని జూశి ఆమె మొకం ఎల్లుగుతున్న బల్బు బుగ్గ అయిపోయింది. 'కొడుకా' అని అన్నది. చిత్తారి ఎన్కాలె కోడలు లచ్చిమి, మన్మడు మన్మరాలు లిలవడి ఉన్నరు. వాళ్లందర్ని ఎంతో మురిపెంగ జూస్తున్నది. 'నాయినమ్మా' అన్న వాళ్ల మాటలు ఇని పిల్లలిద్దర్ని దెగ్గర్కి తీస్కొని గుండెలకు అదుముకుంట ముద్దాడుతున్నది. 'అమ్మా.. ఈ కాన్నుంచి నేను నీతోనే ఇదే ఇంట్ల ఉంట' అంటున్న కొడుకు జెప్తున్నది నిజమా? అన్నట్టు కోడలు మొకంలకు జూశింది.

'అవునత్తమ్మా.. ఈడనే బతుకుదామని అచ్చినం' అన్నది లచ్చిమి. 'అమ్మా.. నాయిన రైతు ఉత్యమంల పాల్గొని అమరుడైండు. బతుకుతే అట్ల నాయిన లెక్కట బత్కాల్నని డిసైడ్ అయిన అమ్మా. పొలం అమ్మి నేను శాన పెద్ద తప్పు జేశిన్నని నాయిన సచ్చినంక అర్థమైంది నాకు. గందుకే, అమ్మిన పొలంను వాళ్ల పైసలు వాళ్లకు ముట్టజెప్పి మల్ల ఎన్కకు తీసుకున్న. ఇగ ఈ కాన్నుంచి నేను నాయిన లెక్కట ఎవుసం జేస్కొని నిన్ను మంచిగ జూస్కుంట.. నాయిన వారసత్వంను ముంగటికి తీస్కపోత. నాకు నాయిన సచ్చినంకనే బుద్ధి అచ్చిందమ్మా బుద్ధి అచ్చింది..' అని తల్కాయ కొట్టుకుంట చిన్న పిలగాడు ఏడ్శినట్టు ఏడుస్తున్నడు చిత్తారి. గోడకున్న తండ్రి ఫోటో జూశి ఇంకింత బాధ వడుతున్నడు. 'నాయినా.. నన్ను మన్నించు. నువ్వుండంగ నీ ఇల్వ, ఎవుసం ఇల్వ తెల్వలేదు నాకు. నువ్వు వోయినంకనే నాకు నువ్వేందో, ఎవుసం ఎసుంటిదో తెల్శి అచ్చిందే' అనుకుంట లెంపలు ఏసుకున్నడు. కొడుకు మాటలు ఇనుకుంట గోడకున్న దుర్గయ్య ఫోటోను జూస్కుంట శానా ముర్శిపోతున్నది నర్సవ్వ. సంబురంతోని ఆమెకు నోటి నుంచి మాటలు అస్తలేవు.. ఆనంద భాష్పాలు కారుస్తున్నది. మల్ల చిత్తారే జెప్తున్నడు. 'ఈ ఊర్లకెంచి నా అసుంటోళ్లు ఎవలెవలు పోయిర్రో.. వాళ్లందర్ని ఎన్కకు తీస్కచ్చి ఎవుసం గొప్పతనం గురించి వాళ్లకు శెప్త. ఊరి శివారును మల్ల పచ్చగ మెర్శిపోయేటట్టు జేస్తా' అని ఒట్టు ఏసుకున్నట్టు మాట్లాడుతున్నడు చిత్తారి. ఆ మాటలు ఇంటుంటే.. కొడుకు మొకంల దుర్గయ్యనే కానస్తున్నడు నర్సవ్వకు.

* * *

తెల్లారి లేవంగనే కాముని కంతలకు వోయిండు చిత్తారి. అంబేద్కర్ విగ్రహం పక్కపొంటి లిలవడ్డ నాయిన విగ్రహం జూశి చిత్తారి కండ్లల్ల లీల్లు తిరిగినయి.

శాన శేపటివరకు దుర్గయ్య విగ్రహం జూస్కుంట భీరిపోయిండు. అట్లనే రెండు శేతులు ఎత్తి మొక్కుతున్నడు. ఇంతట్లనే అక్కడికి కమ్మరి రాజయ్య వచ్చిండు. ఆయినతోని మాట్లాడి బండి, నాగలి ఇట్ల ఎవుసం పనిముట్లు ఎవేవి ఉన్నయో అవన్నీ కొత్తగ తయారు జెయ్యుమని చెప్పిండు. కమ్మరి అంజయ్య గూడ ఆ పని ముంగటేస్కున్నడు. కామును కంతలనే దుర్గయ్య విగ్రహం సాక్షిగా ఆ పని మునుము వట్టిండు.

* * *

ఊరు ఇడ్సవెట్టి హైదరాబాదుకు ఎవరెవరు బత్కవోయిర్రో వాళ్లందరి ఫోన్ నంబర్లు తీస్కొని వాళ్లందర్ని ఊరికి రమ్మంటున్నడు చిత్తారి. అందర్ని కాముని కంతల కూసుండవెట్టి ఎవుసం గొప్పతనం గురించి వాళ్లకు జెప్తున్నడు. 'మనం, మన తండ్రులు ఎవుసం వారసత్వంను ముంగటికి తీస్కపోవాలె. ఎవుసం దిక్కు మనం రాక.. మన రైతులు ఢీల వడిపోతున్నరు. ఢీలవడ్డ రైతుల మీద సర్కార్ అడ్డమైన సట్టాలతోని నడ్మల కార్పొరేట్ శక్తులను తీస్కచ్చి మన రైతన్నలను ఇంకింత తొక్కి పెట్టాలనుకుంటున్నది. గందుకే మనం ఉషార్ గావాలె. ఎవుసంను మించిన మంచి పని ఇంకోటి లేదు. మనం సదువుకున్నోళ్లం.. అసుంటి మనం ఎవుసం జేస్తే పంటల్ల ఇంకా రాబడి, గిగుబడి మాలాస తియ్యచ్చు. మనమంత కల్శి ఎవుసం జేద్దాం.

ఒకోళ్లకు ఒకోళ్లం ఆదెరువు అయిదాం. మనమంతా కల్శి ఈ సుట్టుపక్కల ఊర్రల్ల అందర్ని ఎవుసం దిక్కు మలుపుదాం. అట్ల ఊర్లే గాదు దేశం మొత్తం మనం యువతను మొత్తం ఎవుసం దిక్కు రండ్రి అని ఘన స్వాగతం జెప్పుదాం. రైతు బల్గం వెర్గుతే బలవంతులం అయితం. అప్పుడు రైతుల తర్వాయి ఎవలు రారు' అనుకుంట చిత్తారి అందట్ల ఎవుసం మీద పాయిరం నింపుతున్నడు. అక్కడికచ్చిన అందరు నిజమే గదా అని వాళ్లు ఎవుసం జెయ్యనీకి సిద్ధం అయితున్నరు. అక్కడ కూసున్న పెద్దమన్సులంతా ముర్శిపోతున్నరు. 'మన ఊరు ఇగ గొడ్డువోదు.. శివారు శిన్నవోదు' అని ఒకోళ్ల మొకాలు ఒకోళ్లు సూస్కుంట, అటు దుర్గయ్యా విగ్రహంను జూస్కుంట ముర్శిపోతున్నరు. వాళ్ల పక్కపొంటే కూసున్న సాయిలు దుర్గయ్యా విగ్రహం మీదికెల్లి సూపు దించుతలేడు. అట్లనే జూస్తున్నడు. ఆయాల్ల మంత్రి కొడుకు దుర్గయ్యా మీద కారు ఎక్కిచ్చి సంపిన దృశ్యం ఆయిన కండ్లల్ల మెదలవట్టింది. 'కారు పయ్యాకింద నేను వడేటోన్ని. అది జూశి నా పక్కకున్న దుర్గయ్యా నన్ను ఈడ్శి గుంజిండు. నన్ను గడ్డకేశి వాడు పయ్యా కింద వడ్డడ్డు. కారు గొరగొర శాన దూరం దుర్గయ్యాను గుంజుకపోయింది. ఆ రైతు ఉద్యమానికి దుర్గడు రక్తం చిందిచ్చి జీవిడ్శిండు. ఎంత పని జేస్తివి బామ్మర్దీ..' అని మనసుల అనుకుంట దుర్గయ్యా విగ్రహానికి రెండు చేతులెత్తి మొక్కిండు.

**హుమాయున్ సంఘీర్, స్వస్థలం : గోపాల్ పేట్ గ్రామం, నాగిరెడ్డిపేట్ మండలం, జిల్లా కామారెడ్డి. ప్రస్తుత నివాసం హైదరాబాద్. కొన్ని సినిమాలకు రచనా సహకారం అందించారు. దర్శకత్వ విభాగంలో పలు సినిమాలకు, సీరియళ్ళకు పనిచేశారు. షార్ట్ ఫిల్మ్స్ , వెబ్ సిరీస్ లలో (మూలుగుబొక్క, ఏం బతుకురా నీది, తంగేడుపూలు) నటించారు, దర్శకత్వం వహించాను. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖావారి 'కోలాటం' అనే డాక్యుమెంటరీ చేశారు. 'దొరసాని' సినిమాలో కామ్రేడ్ యాదగిరిగా నటించారు. రచయి-తగా, నటుడిగా, దర్శకుడిగా రాణిస్తున్నారు. కథలు సిద్ధం చేసుకున్నారు. పూర్తిస్థాయి సినిమా దర్శకుడిగా రాణించాలి అనేది సంఘీర్ కల. 2006లో ఆంధ్రభూమి పత్రికలో 'ఎటుపాయె' అనే కవిత ఫస్ట్ టైం అచ్చయింది. ఆ తర్వాత 2008లో మొదటి కథ 'శ్రేయోభిలాషి' చెన్నై నుంచి వచ్చే స్వప్న మాస పత్రికలో అచ్చయింది. ఇప్పటివరకు 35 కథలు రాశారు.**

***(ఢిల్లీ శివారులో ఏడాది పాటు ఉద్యమం చేసి 700లకు పైగా ప్రాణాలు అర్పించి అమరులైన రైతులకు ఈ కథ అంకితం చేస్తున్నాను. – సంఘీర్)***



మ్యాకం రవికుమార్
94929 10065

# బుడ్డశనగ

'మావ.. ఓ కొంరయ్యా మావ' అంటూ పిల్సుకుంట ఆకిట్ల అడుగువెట్టింది లచ్చవ్వ. లోపలి నుంచే 'ఎవలూ' అని కేకేసింది బుచ్చవ్వ. ఎంబడే 'నేనే అత్త. లచ్చవ్వను' అని అనంగనే సాయబాన్ల తోముతున్న బోళ్లను పక్కనపడేసి 'నువ్వేనా కోడలా. మావ చేన్ల నుంచి వచ్చి ఇప్పుడే కల్లుబొట్టుకని మండువకు వేయిండు' అని అనుకుంటనే బుచ్చవ్వ ముందటర్రలకు వచ్చింది. బుచ్చవ్వను చూడంగనే గలుమ దాటి లోపలికి వచ్చి 'మావ వచ్చేటాళ్లకు ఎంత సేపయితదత్తా' అంటూ అడిగింది లచ్చవ్వ. మూలకున్న పీటలు తను ఒకటి తనేసుకుని, మరొకటి లచ్చవ్వకిస్తూ 'ఎందుకు. ఏం పని' అంటూ అడిగింది బుచ్చవ్వ. 'ఏం లేదత్తా. వారం కిందే మావకు జెప్పిన. నాగళ్లు కట్టాల్నని. శెర్ల బుడ్డశెనగ ఏసేందుంది. మల్లో తేప

యాది జేద్దామనొచ్చిన' అంటూ లచ్చవ్వ అసలు ముచ్చట జెప్పింది. మళ్లీ ఏదో చెప్పవోతుండగనే అడ్డంపడి 'మావ ఏం మరచిపోలె. చేన్ల నుంచి వచ్చుడుతోనే జెప్పిండు. కొడుకు మహేందర్ గాన్ని సుత ఎటుపోవద్దన్నడు. మావ మాటంటే మాటే. వత్తా అన్నడంటే వత్తడు.' అంటూ బుచ్చవ్వ నమ్మకంగా బదులిచ్చింది. ఆ మాటలినంగనే లచ్చవ్వకు పాణం తిరిగచ్చింది. 'సరే అత్త. పొద్దున్నే ఇత్తునాలు దీస్కొని వత్తనన్నదని మావకు జెప్పు. మనవడు ఒక్కడే ఉన్నడు ఇంటికాడ. నేను పోతున్న' అంటూ లచ్చవ్వ లేవంగనే 'ఎప్పుడూ ఇట్లచ్చి అట్ల పోతవ్. రాజిగాడు ఏం జేత్తాండు.' అని అడిగింది బుచ్చవ్వ. ఆ మాటతో గట్టిగా నిట్టూర్చుతూ 'ఏనాడు ఏం పన్జేసిండు గనుక. ఉన్నంత కాలం అయ్యవ్వను గోసపుచ్చుకున్నడు. ఇప్పుడు నన్ను చంపుకుతింటాండు. అడ్డశారగం పన్జేయ్యడు. ఎప్పుడూ అరుగుల మీద కూసునుడు. అచ్చెటోన్ని.. పోయేటోన్ని బీడీలు అడుక్కుంట తాగుడు. యాల్లకు తినుడు. పండుడు. ఆడదాన్ని ఎంతగనం ఏగియ్యాలె. ఏనాడు జేసుకున్న పాపమో. నా గండాన దాపురించిండు' మొగుడు రాజయ్యను తిట్టుకుంటూ గుడ్ల నీళ్లు గుడ్లల్లే ఒత్తుకుంట 'సరే అత్త మావకైతే జెప్పు' అని మల్లోతేప చెప్పి ఇంటిబాట పట్టింది లచ్చవ్వ.

ఇంటికి చేరంగనే రాజయ్యకు, మనవడు రాజుకు అన్నం పెట్టింది. తనూ రెండు ముద్దలు తిని నడుం వాల్చింది. కళ్లు మూసుకున్నదే కని నిద్రవడ్తలేదు. మంచాలనే అటూ ఇటూ బొర్రుతాంది. మరోవైపు గుర్రు కొడుతున్న కొంరయ్యను చూడంగనే ఒక్కసారి పెయ్యిమీద తేళ్లు, జెర్రులు పాకినంత కంపరం పుట్టింది లచ్చవ్వకు కోపంగా 'నిరందిగా ఎట్ల నిద్ర వడుతున్నదో' అని లోలోపలే తిట్టుకుంట మొఖం పక్కకు తిప్పుకున్నది. మల్లా ఆలోచనల వడ్డది. 'నాది ఏం రాత.. ఏం జెట్ట బతుకు. అవ్వయ్యలకు ఒక్కగానొక్క బిడ్డనైతి. అరికాలుకు మట్టంటకుంట చేతుల మీదుగనే పెరిగితి. పెండ్లీడుకు రాంగనే భూమిజాగలు.. డబ్బుదస్కమున్నదని జూసి రాజయ్యకు ఇచ్చి పెండ్లి జేత్తే ఆ సంసారం మూణ్నాళ్ల ముచ్చటాయె. బతుకు అడివిల పడ్డట్టాయె. మొగుడు ఈసంకొత్త పన్జేయడాయె. ఊర్ల రాజకీయాలు చేసుకుంట.. పంచాయతీలు చెప్పుకుంట.. పత్తాలు ఆడుకుంట సాయితగాళ్లతోని గల్సి తిర్గమరిగిండు. బిడ్డ కమల పుట్టినంకా ఇంటిముచ్చట పట్టించుకోకపాయె. ఇంటికి పెద్దదిక్కులెక్క ఉన్నరనుకున్న అత్తమావా నడిమిట్లనే ఆగం జేసిపాయె. చేన్ల పాము కర్సి మామ, ఆ మనాదితో ఏడాది తిరగకముందే అత్తా నన్ను ఒక్కదాన్ని జేసి ఇడ్సిపాయె. అవ్వయ్య పోయినంకైనా మార్తడనుకుంటే మొగుడు పురంగ ఏగిడిశిపాయె. ఇదేందని నోరు మెదిపితే చాలు ఈపు మెదిపే. బిడ్డను జూసుకుంట బతుకుదామంటే అదీ నడమంత్రానే పాయె. పెండ్లి జేసిన ఏడాది తిర్గకముందే మొగపిలగాడాయెనని సంబురపడుతుంటేనే తెల్లకామిండ్ల

రోగం పాడుగాను ఏం దెల్వకుంటనే అల్లుడ్ని కొంటపాయె. బిడ్డన్న ఉన్నదనుకుంటే అదీ మొగుని మనాది పెట్టుకుని బాయిలవడి సచ్చె. కొడుకును, మమ్ముల ఎటుగానోళ్లను జేసె. ఏ జన్మల ఏ పాపం జేసుకున్ననో. నా నొస్ట ఈ రాత రాసిండు. ఇదేం చాకిరి. ఏనాడు తీర్తదో. నన్నెప్పుడు కొంటవోతడో ఆ దేవుడు' అని రందిపడుతూ కనుకొలుకుల్ల నుంచి జారుతున్న కన్నీళ్లను తుడుసుకున్నది. లచ్చవ్వ కండ్లళ్ల కమల మొఖం కదలాడ్తుంది. మనసంతా బిడ్డ జ్ఞాపకాలు కమ్ముకున్నయ్.

ఉన్నట్టుండి ఒక్కసారిగా లచ్చవ్వ ఆలోచనలు బుడ్డశెనగ మీదికి మళ్లినయ్. శెర్ల నాలుగెకరాల భూమి తప్ప అత్తమావ సంపాయించిన భూమి మొత్తం పదేండ్లు తిరగకముందే హారతికర్పూరం చేసె. అయినా ఓ బర్రెను కొని పాలను, ఇన్ని కోళ్లను పెంచి అమ్ముకుంటూ, ఇంటి చుట్టున్న నాలుగ్గుంటల జాగలనే ఇన్ని కూరగాయాలను పెట్టుకుని పొట్ట గడుపుతున్నా ఆ బుడ్డశెనగలే ఎయ్యకపోతే సంసారం రోడ్డున పడుతుండె. అదేమన్నా అల్కగయితందా. పంట శెనగలు ఇంటికి రాంగనే ఇత్తునం కోసం మంచి గింజలన్నీ ఏరి తీసి పెట్టి, మట్టిపెళ్ల లేకుంట, ఒక్క పుల్ల కనవడకుండా చెరిగి, ఇంత బూడిద కలిపి పురుగు పట్టకుంట అమాసకొకసారి ఎండవోసుకుంట కాపాడాలాయె. అదేమోగానీ శెర్ల నీళ్లు ఇంగుడు మొదలై కొద్దికొద్దిగా భూమి తేలుతుంటే, ఎప్పటికప్పుడు భూమిని పదునారక ముందే దున్నుతూ, సంక్రాంతికి పూతవచ్చేలా అదును చూసుకుని ఇత్తునమేయాలె. ఏమాత్రం అదును తప్పినా, పదునారిపోయినా ఆ ఏడాది గుండుసున్నేనాయె. అట్ల ఇగురం కొద్ది.. అన్ని ముందుగనే తయారుగా పెట్టుకుని, ఎంటబడి జేసుకుంటే తప్ప పంట పండదాయె. తిట్లకు బయపడి బల్మీటికి కల్లం కావాలి పోతడు గనీ ఒక్కచారగం చేయడాయె. ఒక్కదాన్ని ఎంతగనం జేసుడు. పోయినేడు అదును మీదేసినా పంట మంచిగ పండకపాయె. ఏటా 30 బత్తాలు వచ్చేకాడ 20 బత్తాలే వచ్చె. ఈ ఏడు ఎట్లుంటదో' అని గుబులు పట్టుకున్నది లచ్చవ్వకు. అట్లా అట్లా ఏవో ఏవో ఆలోచిస్తూ అదుమరాత్రి నిద్రలోకి జారుకుంది.

తెల్లారి కోడి కూతతోనే లేచింది లచ్చవ్వ. ఆకిలి జారగొట్టింది. బోళ్లు తొమి కూరబువ్వండుకు ఆదరాబాదరా ఇంతతిని సద్దిపెట్టుకుని, మనవన్ని ఎంబడేసుకుని కొంరయ్య ఇంటికి జేరింది. అప్పటికే కొడుకుతోని కల్సి ఎడ్లను నాగలికి కడతాండు కొంరయ్య. అది చూడంగనే లచ్చవ్వ మనసు నిమ్మలమైంది. 'మావ మేం శెర్లకు నడుత్తానం' అంటూ చెప్పి ముందుకు కదలింది లచ్చవ్వ. శెరువుకట్టపైకి జేరింది. కట్టమైసమ్మకు మొక్కి భూమివైపు నడిచింది లచ్చవ్వ. అంత నల్లరేగడి. కాళ్లకు

అతుకుతంటే 'ఇంకా పదునారలె బాంచెన్' అని మనసులోనే అనుకున్నది. లచ్చవ్వ ఎనకనే కొంరయ్య అక్కడికి జేరిండు. ఎంబడి దెచ్చుకున్న కొబ్బరికాయ దీసింది లచ్చవ్వ. చేతుల పట్కోని మంచిగ మొక్కి నాగాలి మీద కొట్టి పక్కకు జరిగింది. కొంరయ్య నాగలి పట్టుకుని ముందుకు కదలగా, ఎన్కనే గింజలు ఏసుకుంట సాలువట్టి సాగింది. వారం రోజుల్లోనే ఇత్తునమేసుడైపోయింది. సంక్రాతి రానే వచ్చింది. శెనగ మస్తు పూతకచ్చింది. గొడ్డుగోదా పడి మేయకుండా పెండ్లా బల్మీటికి రాజయ్య రోజూ కావాలివోతుండు. జూత్తంటనే పంట చేతికచ్చింది. రెండు రోజులు నాలుగురు కూలోళ్లలను దీస్కపోయి శెనగ పీక్కచ్చింది. ఊరవతల పెద్ద బండపైన కల్లంల ఏసింది. బంతి కొట్టించింది. తూర్పార పట్టింది. కుప్ప జేసిన శెనగలను జూసి లచ్చవ్వ మనసు నిండిపోయింది. బత్తాలు నింపేటాళ్లకు ఏటా వచ్చినట్లు కాకుండా ఈసారి 10 బత్తాలు ఎక్కువ పండినయ్. లోలోపల సంబురమైతున్నా బైటికి మాత్రం ఎప్పటితీర్గనే మొఖం పెట్టుకుని ఉన్నది లచ్చవ్వ. ఇగ నాగళ్లు కట్టినందుకు, బంతికొట్టినందుకు కొంరయ్యకు, వచ్చిన కూలోళ్లకు కల్లంలనే శెనగలు కొలిసిచ్చింది. బత్తాలను ఇంటికి దెచ్చుకున్నది. లచ్చవ్వకు మనసు నిమ్మలమైంది.

మొగుడు రాజయ్యను పైసలు ఏడ కమాయిస్తడోనని నమ్మక రెండు రోజుల తరువాత ఎప్పటితీర్గనే పది బత్తాలను ఉంచుకుని, మిగతా శెనగబత్తాలను తనే మార్కెట్టుకు దీస్కపోయింది. లచ్చవ్వ అదృష్టం మంచిగున్నది. పోయినేడుకన్నా ఈ సారి ధర ఎక్కువే పలికింది. 40వేల దాన్క వచ్చినయ్. ఎంబటే ఇంటిముందు సుబ్బయ్య యాదికచ్చిండు. తన పెండ్లిగాక ముందు అత్తమావలు కట్టిన ఇల్లు. పరాటంతా చీకిపోయి, పెంకులన్నీ ఇరిగిపోయినయ్. వానపడితే చాలు మొత్తం ఉర్సుడే. అయినా ఏ ఏడుకాయేడు ఎల్లదీస్కుంట వచ్చింది. కానీ పోయినేడు వానాకాలంల ఇంటిపైకప్పు మొత్తం కూలిపోయింది. నెలరోజుల పాటు బర్రె కొట్టంల తలదాల్చుకున్నరు. వానకాలం ఎల్లినంక కాళ్లా వేళ్ల పడి సుబయ్య దగ్గర 25వేల అప్పు దీస్కచ్చింది. పాలమ్మి, కోళ్లమ్మి కూడబెట్టిన పైసలు కలిపి మంచిగ రేకులు ఏసుకున్నది. ఇల్లు మంచిగయింది. కాలం కలిసివచ్చింది. ఇప్పుడు పంట నిరుటికన్నా ఎక్కువే పండింది. సుబ్బన్న బాకి తీరిపోతదని లోలోపల సంబురపడుకుంట.. మనసులనే కోటి దేవుళ్లకు మొక్కుకుంట ఇంటికచ్చింది. పైసలన్నీ బట్టల చుట్టి సందుగడుగున పెట్టింది. సంబురంగా మొగునికి ముచ్చట జెప్పింది. కోటంచ నర్సింహసామికి కోడ్ని కోద్దామన్నది. ఎంబడే 'ఎప్పుడేదగిడినా ఎన్కకు దీయకుంట సాయం జేత్తడు. కొంరయ్య మావను కూడా సాయంత్రం ఈడికే తినేతందుకు రమ్మంట.' అని అనంగనే సరేనన్నడు రాజయ్య. అంతే 'తెల్లకల్లు పట్టుకురాపో'అంటూ పైసలిచ్చి రాజయ్యను

మండువకు తోలింది. బడి నుంచి అప్పుడే వచ్చిన మనవడ్ని సంబురంగా నిమిరి 'ఏటూ తిరగపోకు. నేను అచ్చేదాన్క ఇంట్లనే ఉండు. కొంరయ్య తాత దగ్గరికి పోయివత్త' అని చెప్పి బైటికి నడిచింది లచ్చవ్వ.

కొంరయ్య దగ్గరికి పోయి ఇంటికి వచ్చేటాళ్లకు తలుపులన్నీ తెర్లవెట్టి ఉన్నయ్. మనవడేమో లేడు. ఆదరాబదరాగా సందుగ దగ్గరికి వోయింది. తెరిచి చూసింది. ఒక్కసారి కాళ్ల కింది భూమి కంపించినట్లయింది. పైసల కనవడకపోవడంతో గుండెగిపోయినంత పనైంది. ఆగమాగమైతంది. సందుగులన్న బట్టలన్నీ కిందపడేసి దేవులాడింది. దుఃఖం పొంగుకత్తంది. ఇల్లంత, మూలమూల జూసింది. ఎక్కడ ఏం కనవడపోయేటాళ్లకు గుండెలు బాదుకుంటూ వచ్చి గలుమల కూసోని కంటికి మంటికి ధారగా ఏడుత్తంది. లచ్చవ్వ పెడుతున్న శోకాలు ఊరవతలికి ఇనవడుతున్నయ్. అమ్మమ్మ ఏడుపిని ఎక్కన్నోంచో పరుగుపరుగునా ఉరికచ్చిండు. మనవడ్ని జూసుడు జూసుడే ఒక్క ఉదుటున లేచి మీదపడింది. 'ఇంట్లనే ఉండుమన్న గదా. ఏడవోయినవ్. ఎవలచ్చిన్రు. పైసలెవత్తుకుపోయిన్రు. నీ తాడు తెంప. నా గండాన కని పారేసింది' అని ఇయ్యరమయ్యర కొడుతూ దుఃఖాన్ని వెల్లదీస్తున్నది లచ్చవ్వ. అప్పటికే అక్కడున్న ఇంటెనుక ఈరమ్మ 'పోరన్ని కొట్టిసంపుతవ ఏంది' అంటూ రాజును పక్కగిగ్గిపడేసింది. 'పిలగా ఇంటికాడ ఉండక ఏడ తిర్గవోయినవ్' అంటూ కోపం జేసుకుంటూ వెళ్లి లచ్చవ్వను గుండెలకు అదిమిపట్టుకుంది. 'ఊకో బిడ్డా. ఈ పన్జేసింది బైటోళ్లు ఎవలు కాదు బిడ్డ. తెల్సినోళ్లే ఈ పని జేసిండ్లు. అందరిండ్లు వదిలి నీ ఇంట్లకే వచ్చి పైసలెట్ల ఎత్కపోతరు. నీ ఇంట్ల పైసలున్నయని ఈ వాడోనికి, ఈ సుట్టుపక్కల ఉన్నోనికి దప్ప ఎవనికి దెల్సు. నీ రెక్కల కట్టం దీస్కున్న ఆని చేతులకు జెట్టలుపుట్ట. ఆ పైసలతోని వాడేం పెద్దగయితడు'. ఆంటూ శాపనార్థలు పెట్టింది. 'దుబ్బబుక్కి, ఉప్పిడుపాసముండి, నిద్ర చంపుకుని. రెక్కలు ముక్కలు జేసుకుని సంపాయించుకున్న పైసలు. ఏడ వోవు. ఏం కాదు బిడ్డ' అంటూ లచ్చవ్వకు ధైర్యం చెప్పింది. ఎంబడే 'పంబాల రామయ్యతోని మంత్రబియ్యం పెట్టిద్దాం. పైసలవే బయటపడ్తయ్' అంటూ నమ్మకంగా జెప్పింది ఈరమ్మ. అక్కడున్నందరూ ఈరమ్మకు వంతపాడిన్రు. పైసలు దొర్కతయనే ఆశతో లచ్చవ్వ సుత 'సరే' అన్నది. 'అయితే నువ్ ఊర్ల చాటింపు చేయించు. నేను రామయ్యకు ముచ్చట జెప్పి వత్త' అంటూ ఈరమ్మ పోయింది. ఆ తర్వాత ఎక్కడోళ్లు అక్కడ పోయినంక మెల్లగా లేచింది. కంటికి రెండుధారలు కారంగా, బిక్కుబిక్కుమంటూ దూరంగా కూర్చున్న మనవని దగ్గరికిపోయి నెత్తిమీద చెయ్యేసి నిమిరింది లచ్చవ్వ. 'సపాయి సారయ్యను దీస్కరాపో' అని అమ్మమ్మ చెప్పంగనే మారుమాట్లడకుండ లేచి ఉరికిండు రాజు. అట్ల పోయి ఇట్ల ఎంబడి వెట్టుకుని

దీస్కచ్చిండు. ఏం జేయ్యాల్నో జెప్పి సారయ్య చేతుల 50 రూపాయలు పెట్టింది లచ్చవ్వ. సరే అంటూ ఇంటికి పోయి డప్పు పట్టుకుని వచ్చిండు. వాడకట్టు మొదలు నుంచి చివరి వరకు డప్పుకొట్టుకుంటూ 'లచ్చవ్వ ఇంట్ల పైసలు పోయినయ్. రేప్పొద్దున మంత్రబియ్యం పెట్టిపిత్తాంది. వాడకట్టులున్న చిన్న, పెద్దా అందరూ రేప్పొద్దున లచ్చవ్వ ఇంటికాడికి రావాల్నహో' అని చాటింపు జేసి పోయిండు. లచ్చవ్వ ఏం తినకుంటనే మంచాల ఒరిగింది. కంటికి ధారలు పోతూనే ఉన్నయ్. పైసలున్నయని ఎవలకు దెల్సు? ఎవలు దీసుంటరు? గంటలనే ఎట్ల మాయం జేసిండ్లు.? అని ఒకసారి ప్రశ్నలు వేసుకుని ఆలోచించినా జవాబు దొర్కలె. మొగుడు రాజయ్యను అనుమానించినా 'ఈయన పొద్దున్నే ఎవలిదో పంచాయతీ ఉన్నదని పర్కాల పాయె. ఇప్పుడే వచ్చె.' అని తనే కాదని నిర్ధారించుకున్నది. తికమక , పైసలు దొర్కుతయా? దొర్కయా? దొర్కపోతే ఎట్ల? సుబ్బన్న బాకీ ఎట్ల కట్టాలె. మాటవోతది. మల్లచ్చేటికి ఇద్దామన్న మిత్తి ఎంత గావాలె? అని తనకు తనే ప్రశ్నలు వేసుకుంటున్నది లచ్చవ్వ. మనసంతా వే ఎడతెగని ఆలోచనలు. కంటిమీద రెప్పమూయకుండ అట్లనే తెల్లవార్లు ఆలోచించుకుంట కూసున్నది.

ఏడ్చి ఏడ్చి ముఖం గుంజుకుపోయింది. నిద్రలేక కండ్లు ఎర్రవడ్డయ్. పొద్దున తొమ్మిది గంటలకు పంబాల రామయ్యను ఎంబడేసుకుని వస్తున్న ఈరమ్మను చూడంగనే లచ్చవ్వకు పాణం లేచివచ్చింది. అప్పటికే వాడకట్టోళ్లు కూడా శానా మంది వచ్చి కూసున్నరు ఆడ. ఈరమ్మ, రామయ్య ఇంట్లకు పోయిన్రు. లచ్చవ్వను అడిగి జరిగిన విషయం తెల్సుకున్నడు పంబాల రామయ్య. అంతా విన్నతరువాత 'ఒక కుంచెడు బియ్యం, అట్లనే దేవుని పోట్వ, పీట, పసుపు, కొంచెం నూనె, ఒక పల్లెం, దీపం చెమ్మ దీస్కర తల్లి' అంటూ లచ్చవ్వకు చెప్పిండు.  అడిగినయన్ని దీస్కచ్చి లచ్చవ్వ పెట్టంగనే రామయ్య తన పనిల వడ్డడు. గోడకు పీటేసి దేవుని పోట్వ నిలబెట్టి, దీపం ముట్టించిండు. కుంచంలోంచి పల్లెం నిండా బియ్యం దీస్కున్నడు. పసుపు, నూనె కలిపిండు. అరగంటపాటు ఏవో మంత్రాలు చదువుతూ పూజలు జేసి పల్లెం దీస్కుని ఇంట్ల నుంచి బయటకువచ్చిండు రామయ్య. ఇంటోళ్లందరినీ బయటకు రమ్మడు. ఎదురు దర్వాజా తలుపులు మూసి, పక్క దర్వాజ తలుపులు మాత్రమే తెరచిపెట్టమన్నడు. రామయ్య చెప్పినట్టుగనే చేసింది లచ్చవ్వ. తర్వాత వాడకట్టోళ్లందరినీదగ్గరికి పిల్సుకుని ' ఇంటి తలుపులన్నీ పెట్టి ఉన్నయ్. లోపలున్న మనిషి ఎవలికీ కనిపించడు. ఒక్కొక్కలు వచ్చి మంత్రించిన ఈ పసుపు బియ్యం దీస్కోండి. ఆ ఇంట్లకు పోయి దేవుని పటం ముందు వేయండి. ఇక్కడ ఒక్క మాట. లచ్చవ్వ పైసలు ఎవలు దీసిండ్లో మీ అంతట మీరే మంచిగ ఆడ కుంచంల ఉన్న

బియ్యంల పెట్టుండ్రి. లేకుంటే రగతం కక్కుకుని సత్తరు. పాపం ఏడేడు తరాలకు గొడ్డది. మీ గొడ్లు, గోదా సత్తయి. ఆడ మీరు పైసలు పెట్టిండ్లనే సంగతి ఎవలికీ దెల్వదు. ఆ తరువాత మీ ఇష్టం' అంటూ అందరినీ మాటలతోనే హడలగొట్టుకుంటూ ఒక్కొక్కరినీ పిలుచుకుంటూ బియ్యం పెడుతూ ఇంట్లోకి పంపుతున్నడు. మధ్యాహ్నం రెండు గంటల వరకు వాడల ఉన్నోళ్లందరూ వచ్చిపోయిండ్లు. తలుపులు దీస్కొని రామయ్యతోపాటు లచ్చవ్వ, రాజయ్య, ఈరమ్మ అందరూ ఇంట్లకు పోయిండ్లు. రాజయ్యవైపు చూస్తూ కుంచంల ఉన్న బియ్యం కింద పోయమన్నడు రామయ్య. నిదానంగా కుంచం పైకెత్తి చిన్న ధారగా బియ్యం పోస్తున్నడు రాజయ్య. కుంచంల నుంచి వస్తున్న బియ్యం ధారనే కన్నార్పకుండా చూస్తున్నరు అందరూ. లచ్చవ్వ గుండె వేగంగా కొట్టుకుంటున్నది. 'పైసలు దొర్కుతయ? దొర్కయ' ఇదే ఆదుర్ద. ఒక్కసారిగా నాలుగు నోట్ల కట్టలు కిందపడ్డయ్. అందరిలో సంతోషం. సంబురంతో లచ్చవ్వ నోట మాట రావడం లేదు. కండ్లపొంటి నీళ్లు పొంగుకస్తున్నయ్. నోట్ల కట్టలను చేతులకు దీస్కొని వాటినే చూస్తూ నోట మాట రాక అట్లనే చూసున్నది.

**మ్యాకం రవికుమార్ స్వగ్రామం కరీంనగర్ జిల్లా జమ్మికుంట. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి 'మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్' చేశారు. వృత్తిరీత్యా పాత్రికేయులు. ప్రవృత్తిరీత్యా కథకులు. 2013 నుంచి కథలు రాయడం ప్రారంభించారు. మొదటి కథ 'బలిదానం' తెలుగు వెలుగు మాసపత్రికలో ప్రచురితమైంది. ఇప్పటివరకు 18 కథలు రాశారు. 'ఎదురు చూపులు', 'జిట్టపులి', 'కంటెగోడ', 'గొల్ల మల్లన్న', 'యాపచెట్టు', 'సుక్కబర్రె' కథలు పాఠకుల ప్రశంసలు అందుకున్నాయి. 11 కథలు వివిధ ప్రముఖ దిన, మాస పత్రికల్లో అచ్చయ్యాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలన్నీ.. మట్టి మనుషుల యథార్థ జీవితాలను కండ్లకు కడుతాయి. సాహిత్య సేవలో భాగంగా 2014లో నోముల సాహిత్య పురస్కారం అందుకున్నారు. నమస్తే తెలంగాణ-ముల్కనూర్ ప్రజా గ్రంథాలయం కథల పోటీల్లో.. 2019లో 'సుక్కబర్రె', 2021లో 'బుడ్డ శెనగ' కథలకు బహుమతులు దక్కించుకున్నారు.**

Katha PART 1_Layout 1 6/29/2023 2:38 PM Page 228

# ఆప్తుడు



కటుకోజ్వల మనోహరాచారి
**9441023599**

వేగంగా వస్తున్న కారుకు అడ్డుగా నిలబడి చేయూపుతున్నాడు ఓ వ్యక్తి ఆపండన్నట్టు. నేను కారు స్లోచేసి ఏమిటన్నట్టు చూశాను. నడివయసు వ్యక్తి అతడు. వ్యవసాయదారునిలా ఉన్నాడు. నేను కారు ఆపగానే నావైపుకొచ్చి జర గా గోపాలావుప్యాట దాక గీ ముసలోన్ని తీస్కపోవాలె సారు! గాడ సర్కార్ దవకాన కాడ దించిపోతె సాలు... అన్నాడు రోడ్డుపక్కన ఉన్న కూలబడి ఉన్న వృద్ధునివైపు చూపుతూ.

నేను అతన్నే చూస్తూ ఏ.. బస్సుల్లేవా? నా కార్లనే ఎందుకు ఎక్కించుకోవాలి? అన్నాను. ఈ మధ్యన ప్రతొక్కడికీ కార్లను ఆపి లిఫ్టు అడగడం ఫ్యాషనైపోయింది అనుకుంటూ.

గా బస్సోడే గీడ దించిపోయిండు సారు. పైసల్ తక్కువున్నయని దిగుమని ఆగం బట్టించిండ్రట. కాల్జారి కిందవడ్డడు. కాలు కదిలిత్తలేడు. ఇరిగిందో పాడో..! గీనె కెవ్వలు లేనట్టున్నరు సారు. పాపం గా సర్కారు దవకాన దాక తీస్కపోతే.. గాళ్లు ఏదన్న జేత్తరు.. అతను టకటకా చెప్పుకుపోతున్నడు.

రోడ్డుపక్కన వాలిపోయినట్టుగా పడిఉన్న వృద్ధునివైపు చూశాను. తలతిప్పుకోబోతూ మళ్లీ ఆ వృద్ధునివైపు తిరిగి చూశాను. అరవై ఏండ్లు పైబడి ఉంటాడు. జీవితంలో

చాలా ఒడిదొడుకులు చవిచూసిన వ్యక్తిలా శరీరం శుష్కించి కని పిస్తున్నాడు. ఆదరించేవారు లేని అసహాయుడిలా, లేచి నిలువలేని స్థితిలో అల్లాడి పోతున్నాడు. నా మనసు పొరల్లో ఎక్కడో ఏదో కదలినట్లైంది. వృద్ధున్ని తేరిపార చూసిన నేను కారుదిగాను. ఏం పేరు ఈయనది..? అతనివైపు నడుస్తూ అన్నాను. తెల్వది సార్.. అన్నాడు. ఈ లోపు వృద్ధుడు ఏదో గొణిగాడు. కాని సరిగా అర్థంకాలేదు. నేను దగ్గరగా వెళ్లి పెద్దాయనా..! ఏం పేరు నీది..? అన్నాను గట్టిగా.

ఆతను బాధను పంటిబిగువున భరిస్తున్నట్టు ఇబ్బంది పడుతూ .. వెం.. వెం..కట..రాములు.. అన్నాడు. ఎక్కడుంటారు? మీ వాళ్ల అడ్రసేమైనా చెబుతారా... అతను అసహాయంగా తల వెనక్కివాల్చాడు. తొంటి యెముక బాధిస్తున్నట్టు విలవిల్లాడిపోయాడు. ఏ ఊరోగనీ బతికిసెడిన మనిసి లెక్కనే ఉన్నడు. గీనెకు ఎవలు లేనట్టున్నరు సారూ అన్నాడు ఆ వ్యక్తి. నేను మరో ఆలోచన చేయలేదు. ఏదైతేనేమి? ఎక్కించు అన్నాను. గా దవకాన్ల జైన్ చేసినంక ఆళ్ల మనుసులు ఎవలన్న ఉన్నరేమొ ఆరాతీస్తా సారు. పదండ్రి.. అంటూ పక్కనే ఉన్న మరో వ్యక్తిని పిలిచి ఇద్దరూ అతని భుజాలు పట్టి లేపారు. ప్రాణాలు పోయినట్టుగా అల్లాడిపోయాడు. నేనూ సాయంపట్టి చాలా కష్టంగా కారు వెనుకసీట్లోకి చేర్చాం.

అతడి పేరు సాంబుడని నిర్ధారించుకొన్నాక ముందుకొచ్చి కూర్చో సాంబన్నా! అన్నాను. అతను కూర్చోగానే కారు కదిలింది. గ్రామీణరోడ్డు కావడంతో తారురోడ్డైనా గతుకుల మయంగా ఉంది. మధ్యమధ్యలో వెనక్కి తిరిగి చూసుకుంటూ నిదానంగా పోనిచ్చాను కారును. మీరు దేవునోలె వచ్చిండ్రు సారూ! లేకపోతె గీ ముసలోన్ని ఎవలు పట్టించుకునెటోళ్లు కాదు. మా లింగడు కూడ రమ్మంటె రాకపాయె.. సాంబుడు దారెంట మాట్లాడుతునే ఉన్నాడు. ఈయన వివరాలేవీ నిజంగానే తెలియదా సాంబన్నా..?

లేదు సారూ! ఈనెది గా పెగడపెల్లి ఆని ఎవలో సెప్పిండ్రు. జెర పదిమందికి తెల్సిన మనిసి అయ్యుంటడు. తెల్పు కునుడు కష్టమేం గాదు. మధ్యమధ్యలో పెద్దాయనకు ధైర్యం చెబుతూ ముందుకు సాగుతుంటే గోపాల్రావుపేట వచ్చింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రోడ్డు పక్కనే ఉంది. కారు అది దాటి వెళ్తుంటే సాంబుడు అరిచాడు అగో.. గదే గదే సారూ... దవకాన. ఆపుండ్రి..

నేను కారును ఆపకుండానే నీకేం పనిలేకపోతే సాంబన్నా! ఈపూట నువ్వు నాతోనే ఉండు. ఈ పెద్దాయన్ను కరీంనగర్ ఆస్పత్రిలో చూపిద్దాం.. అన్నాను నిదానంగా. సాంబుడు కంగారు పడ్డాడు. అయ్యో సారూ! నాకాడ పైసల్లేవు. గంత దూరమచ్చి నేనేం జేయాలె? అయినా మీకెందుకు లొల్లి. గాలికోయె కంప! గీ ఆసుపత్రిలేత్తె పాయె! అన్నాడు. తొందరపడకు సాంబన్నా! ఎట్లాగూ ఓ మంచిపనికి దిగినవ్. పూర్తిగా చేస్తేనేకదా ఫలితం

ఉండేది. పాపం పెద్దా యనకు ఎవరున్నారో లేదో అంటున్నావ్, నువ్వే పెద్దకొడుకనుకో! అన్నాను అతని మనసు మార్చే ప్రయత్నం చేస్తూ. ఏం పెద్దకొడుకో ఏమో! నాకాడైతే పైసల్లేవు. అన్నాడు రెట్టిస్తూ. పైసలెందుకు సాంబన్నా! నేనున్నాగదా! నువ్వు నాతో ఉండు చాలు అంటూ రోడ్డు బాగా ఉండడంతో స్పీడు పెంచాను. పైసల విషయం ఎత్తకపోయేసరికి సాంబుడు కూడా సైలెంటు అయిపోయిండు. నలభై నిముషాలకు కరీంనగర్‌లోని లక్ష్మణ్ ఆర్థోపెడిక్ సెంటర్‌లో అడ్మిట్ చేశాము. డాక్టర్ ఆపరేషన్ థియేటర్‌లో ఉండడంతో రెండుగంటలు నిరీక్షించాల్సి వచ్చింది. అప్పటికే చీకటి పడుతుండడంతో సాంబుడు ఏం చేద్దాం సార్..? అన్నాడు నిరాశగా. అతనికి ఎప్పుడెప్పుడు ఆ బాధ్యత నుండి విముక్తుడైతే బాగుండు అన్నట్టుంది.

అతని స్థితిని అర్థం చేసుకున్నాను. వాళ్లూరికి బస్సులో వెళ్లడానికి గంట పడుతుంది. సాంబన్నా! నా ఫోన్‌నంబర్ తీసుకొని నువ్వెళ్లిపో! నేను ఏరాత్రి వరకైనా పెద్దాయనకు ఎక్సరే తీయించి, అవసరమైన చికిత్స చేయిస్తాను. నువ్వు ఎట్లాగైనా వాళ్ల కుటుంబ సభ్యులు ఎక్కడుంటారో కనుక్కొని వాళ్లకు తెలియజేసి, నాకూ ఫోన్‌చేయి అన్నాను. సాంబుని మొహంలో భారం తొలగిపోయిన భావన కనిపించింది. గట్లనే సారు. నేను ఎట్లనన్న రేపు మాపటేల వరకు గీయన కుటుంబం గురించి తెల్సుకొని ఆళ్లకు, మీకు తెలియజెప్పుత.. మరి నే బోయత్త..

నేను అతని జేబులో ఐదొందల నోటు ఉంచాను. అయ్యో... ఎందుకు సారూ గిన్ని పైసలు? మా ఊరికి బస్కిరాయి యాభై రూపాయలే అన్నాడు. ఉండనీ సాంబన్నా.. బతుకు జీవుడా అంటూ బయటపడ్డాడు సాంబుడు. సాయంత్రం బస్సుకు వాళ్లూరు వెళ్లిపోయాడు. నేను జ్యోతిర్మయికి ఫోన్‌చేసి విషయమంతా వివరించాను.

రెండుగంటల తర్వాత డాక్టర్ వచ్చాడు. నిదానంగా పరీక్షించాడు. ఎక్సరే రిపోర్టు వచ్చింది. కుడివైపు తొడభాగం నుండి తొంటి వరకు పగులు ఏర్పడింది. యాభై రోజులు కదలకుండా పడుకోబెట్టాల్సిందే నన్నాడు డాక్టర్. పాదం నుండి తొంటి వరకు పిఓపి కట్టు కట్టారు. నెలరోజులపాటు వాడాల్సిన మందులు గట్రా రాసిచ్చారు. అన్నీ పూర్తయ్యే సరికి రాత్రి పది గంటలైంది. అప్పుటి వరకూ అలసిన శరీరం బెడ్‌మీద ప్రశాంతంగా నిద్రపోతోంది. తెల్లవారితే గాని ఆయన కుటుంబ వివరాలు తెలిసేలా లేవు. సాంబుడు ఏదైనా సమాచారం ఇవ్వొచ్చు. అప్పటివరకూ ఎలా?? పళ్లరసం ఆహారంగా ఇచ్చి, ఆరాత్రికి నేను ఆయనతోనే ఉండిపోవడానికి సిద్ధపడ్డాను.

* * *

ఆఫీసుకు సెలవుపెట్టి తెల్లవారి మధ్యాహ్నం వరకూ వెంకట్రాములుతోనే ఉండిపోయాను. ఈలోపు ఆయన ఏదైనా మాట్లాడతాడేమోనని చూశాను. కానీ ఇంకా నీరసంగానే

ఉండడంతో ఏమీ మాట్లాడలేకపోయాడు. అయినా ఒకటి రెండు ప్రశ్నలు వేసి చూశాను. కానీ అశక్తత వల్లనేమో.. కళ్లనీరు కార్చుతూ పైకి చూస్తూ ఉండిపోయాడు. నేను జాలిగా చూస్తూ ఉండడం తప్ప ఏమీ చేయలేకపోయాను. కొంచెం ఒత్తిడి చేసి పాలు, బ్రెడ్డు మాత్రం తినిపించగలిగాను. ఒంటిగంట సమయంలో సాంబుడు ఫోన్‌చేశాడు. ఎంకట్రాములు గురించి వివరాలు తెల్సుకున్న సారూ! గాయినది మా పక్కూరు పెగడపెల్లే. గిప్పుడు నేను గాయిన ఇంటికాన్నే ఉన్న. అన్నాడు.

నాలో ఆనందం పొంగింది. చెప్పు సాంబన్నా! ఇంట్లో ఎవరున్నారు? ఒవలూ లేరు సారూ! తాళం ఏసుంది. పక్కోళ్లను విచారించిన. గాయిన భార్య ఏడెనిమిదేండ్ల కిందనే కాలం జేసిందట. ఉన్న ఒక్క కొడుకూ యాన్నో దూరదేశాన పెద్దనౌకరే సేత్తుండటగని గీనెను పట్టించుకోడట. లగ్గమైనసంది గంతేనటా! గప్పట్ల ఒకట్రెండు సార్ల ఒచ్చి పోయిండట సారూ! గీ నాలుగైదేండ్ల సంది గిటుమొకాన అత్తలేడట. గిప్పుడు గా ఎంకట్రాములు ఒక్కడే కాలం ఎలదీత్తుండట...

నా మనసు మళ్లీ మౌనంగా మూల్గింది. కొడుకు ఎక్కడుంటాడో సరిగ్గా తెల్సుకోలేక పోయావా? లేదు సారు. పదిరువై మందిని అడిగిన. ఎవలకు తెల్వదట. నేను వెంకట్రాములు వైపు దీనంగా చూస్తుండిపోయాను. భార్య లేదు. కొడుకు ఉన్నా తండ్రి బాగోగులు విస్మరించి తనదారి చూసుకున్నాడు. వృద్ధాప్యం! తొంటి వరకు బ్యాండేజితో దాదాపు రెండునెల్ల వరకూ కదలలేని పరిస్థితి. ఏం చేసేది??

జ్యోతిర్మయికి ఫోన్‌చేసి విషయమంతా వివరించి ఆమే వచ్చేవరకూ ఆలోచిస్తూ ఉండిపోయాను. రెండు గంటల సమయంలో జ్యోతిర్మయి క్యారేజ్ తీసుకొని వచ్చింది. ఇద్దరం కలిసి ముందుగా వెంకట్రాములుకు కాస్త ధైర్యం చెప్పి భోజనం చేయించాం. అప్పటికి ఆయనలో కొంత మార్పు కనిపించింది. పరిసరాల మీద అవగాహన కల్గింది. అప్పుడు మాట్లాడాడు. బాబూ! ఎవరోగానీ దేవుడోలె చూసుకున్నావ్.. ఖర్చుగూడా బాగానే అయినట్టుంది. నాకు తీర్చే స్తోమత లేదు బాబూ! మా పల్లెలో నాకో పాతిల్లు తప్ప ఇంకేమీ లేదు. ఎట్లన్నా నన్ను మా ఇంటిదగ్గర పడేయి బిడ్డా. నీ బాకీలో ఉండిపోవుడు తప్ప ఇంకేం చేయలేను.. అన్నాడు కాస్త ఓపిక తెచ్చుకుంటూ.

మీ కొడుకు ఇప్పుడు ఎక్కడుంటున్నారో చెప్పగలరా... అన్నాను ఆతృతగా. ఆయనేమీ మాట్లాడలేదు. పైకి శూన్యంలోకి చూస్తుండి పోయాడు. మీ కొడుకు గురించి చెప్పండి.. నేను రెట్టించాను. ఆయన్నుండి మౌనమే సమాధానమైంది తప్ప ఎలాంటి జవాబు రాలేదు. కళ్లనుండి మాత్రం సన్నటి నీటి దార కనిపించింది. ఆయన్ను ఇబ్బంది పెట్టడం సరైంది కాదని అర్థమైంది. అప్పటికే జ్యోతిర్మయితో చర్చించి ఓ నిర్ణయానికొచ్చిన నేను ఆయనకు దగ్గరగా కూర్చొని స్థిరంగా అన్నాను. మీరేమీ అనుకోకపోతే... మిమ్మల్ని మా

ఇంటికి తీసుకెల్దా మనుకుంటున్నాను.

వెంకట్రాములు విస్తుబోయి చూశాడు. నేనెవల్ని బాబూ? మీఇంటికి తీసుకపోయేంత గొప్పోన్ని కాదు. ఉద్యోగం సద్యోగం లేక కాలం వెళ్లదీసినవాన్ని. నా భార్య లోకం విడిసిపెట్టి పోయింది. తనతోపాటే కాలు బయటపెట్టిన నా కొడుకే నన్ను పట్టించుకున్న పాపాన పోలేదు. నన్ను భరించడంవల్ల మీకేం వస్తుంది బిడ్డా? ఇప్పటికే మీ బాకీలో పడిపోయిన. నా ఇంటిదాకా తీసుకెళ్లి పడేస్తే ఎట్లో వెళ్లదీస్తా..బతికుంటే నీ రుణంకూడా తీర్చుకునేందుకు ప్రయత్నిస్తా అన్నాడు రెండుచేతులెత్తి మొక్కుతూ. ఆయన ఎత్తిన చేతుల్ని వారిస్తూ లేదండీ! మేం ఆలోచించే నిర్ణయం తీసుకున్నాం. తోడు లేకుండా మీరు ఈ రెన్నెళ్లపాటు ఉండలేరు. కదలలేరు. కదిలితే పగిలిన భాగం అతకదు. శాశ్వతంగా లేవలేకపోతారు. కనుక మా ఇంటికి తీసుకపోదామంటున్నాం.. అంది జ్యోతిర్మయి. ఆయన తల విధిలించాడు. అయినా సరే బిడ్డా! నేనెవర్నని మీకు భారం కావడానికి? వయసు మళ్లినోన్ని. ఎట్లో అవుతది. నా ఇంటిదాకా చేర్చండి చాలు. అన్నాడు మళ్లీ చేతులెత్తుతూ.

మీరిట్లా మాటిమాటికీ చేతులెత్తడం మానండి. ఇప్పటికి నేనూ మీ కొడుకునే అనుకోండి.. అంటూ ఆయన రెండు చేతుల్నీ కిందికి దించాను. వ్యక్తం చేయలేని భావోద్వేగంతో లేవబోయాడు వెంకట్రాములు. కానీ అశక్తుడయ్యాడు. పక్కనే ఉన్న జ్యోతి వారించింది.

అప్పటికే హాస్పిటల్‌వాళ్లు ఫార్మాలిటీస్‌అన్నీ పూర్తిచేసి బిల్లు సిద్ధం చేశారు. నేను అటువైపు నడిచాను. కావాల్సిన మందులు, అవసరమైన సామగ్రి కొనుగోలు చేసి బిల్లు చెల్లించాను. ఈలోపు ఆసుపత్రి సిబ్బంది సాయంపట్టి వెంకట్రాముల్ని అంబులెన్సు లోకి ఎక్కించారు. అరగంట తర్వాత పెద్దాయన మా ఇంటికి చేర్చబడ్డాడు. స్ట్రెచర్‌సాయంతో ఇంట్లోని గెస్టురూంలోకి తీసుకొచ్చారు వెంటవచ్చిన సిబ్బంది. గదిలోఉన్న బల్లను పేషెంటుకు అనుగుణంగా అమర్చి, దానిమీద పరుపు వేసి పడుకోబెట్టాం.

గెస్టురూం ఆయనకు అనుకూలంగానే ఉంది. అటాచ్డ్ బాత్‌రూం, పెద్దపెద్ద వెంటిలేషన్లు, బయట పూలమొక్కల నుండి వచ్చే గాలితో ఒకరకంగా ఆయనకు హాయి కలిగించే వాతావరణమే. ఇంట్లో కూడా ఎవరూ లేరు. పిల్లలిద్దరు చదువుల కోసం సిటీలో ఉన్నారు. అమ్మ చెల్లెలింటికి వెళ్లింది. ప్రస్తుతానికి మేమిద్దరం, మాతో ఆయన!

అప్పటికి సాయంత్రం ఐదవుతుంది. అన్నీ అమర్చాక పాలు, పళ్లరసం అందించింది మా అవిడ. అప్పటికే వెంకట్రాములు మలమూత్ర విసర్జనకు ఇబ్బంది పడుతున్నాడు. ఆయనకు ఏం మాట్లాడాలో... ఎందుకు తాము ఆయన్ని ఆదరిస్తున్నామో అర్థంకాని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నాడు. నేను ఆయన పక్కనే కూర్చొని ఓపెన్‌గా చెప్పాను.

చూడండీ! మేమెవరము, వీళ్లు నాకెందుకు సేవచేస్తున్నారు అనే ఆలోచన మానండి. మేమిది సేవ అనుకోవడం లేదు. మీరు మీ శరీరాన్ని కనీసం నెలరోజులపాటు కదిలించరాదు.

కనుక మలమూత్ర విసర్జనకు చైరూ, బేషిన్‌తో సహా ఏర్పాటు చేశాం. నేను బయట ఉంటాను. మీరు కానిచ్చేయండి. తర్వాత నేను క్లీన్ చేస్తాను అని తలుపువేసి బయటకొచ్చాను.

పదిహేను నిముషాల తర్వాత ఆయన పిలిచాడు. రెండు నిముషాలు బేషిన్ వాష్‌రూంలోకి తీసుకెళ్లి క్లీన్‌చేసి వచ్చాను. వెంకట్రాములు చలించిపోయాడు. బిడ్డా..! నాలాంటి దౌర్భాగ్యుడికి మలమూత్రాలు తీసే ఖర్మ నీకెందుకు బిడ్డా. నన్ను... వదిలేయ్... నన్ను వదిలేయ్.. ఆతను చిన్నపిల్లాడిలా బావురుమన్నాడు. జీవితంలో ఎన్నో కష్టాలను చవిచూసినా ఎన్నడూ రోదించి ఉండడు. ఇప్పుడు మాత్రం భరించలేని దుఃఖం పొంగుకొస్తుంటే కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు. ఒక అనామకున్నైన తాను ఇంతటి సేవకు అర్హున్ని కానేమో అని విలపిస్తున్నాడు.

నేను ఆయన్ను ఓదార్చే ప్రయత్నం చేయలేదు. కడుపులో ఉన్న దుఃఖం మంచుగడ్డలా పూర్తిగా కరిగిపోవాలని చూశాను. ఏడ్చి ఏడ్చి కాస్త ఉపశమించాక నెమ్మదిగా దగ్గరకు జరిగి ఆయన పక్కనే కూర్చున్నాను. మనసులో ఉన్న సందేహాలు, బాధలన్నీ దుఃఖం రూపంలో వెళ్లిపోవాలని ఆగాను. ఇంకా ఏడ్వాలనిపిస్తే ఏడవండి. రేపట్నుండి మళ్లీ మీకు దుఃఖం రావద్దు. మిమ్మల్ని పూర్తిగా ఆరోగ్యవంతులుగా చేశాకే మీ ఇంటికి తీసుకెళ్తాను. ఇక ఏ సందేహాలు లేకుండా హాయిగా నిద్రపోండి. అని లేచాను.

నేను బయటకు వెళ్లిపోబోతుంటే వెనుక నుండి చేయిపట్టి పిలిచాడు. బిడ్డా! ఒక్కటి.. ఈ ఒక్క ప్రశ్నకు జవాబు చెప్పు. లేకుంటే నేను నిద్ర పోలేను అన్నాడు వెంకట్రాములు. నేను క్షణం ఆగి అడగండి. అన్నాను. నువ్వెవరు? ఇంత ఖర్చు, శ్రమను భరిస్తూ నాకెందుకు సేవ చేస్తున్నావు? ఇది మాత్రం చెప్పు బిడ్డా!

నేను నిముషం పాటు మౌనంగా ఉండిపోయాను. మా నాన్న కళ్లముందు మెదిలాడు. మనసు ఉద్విగ్న స్థితిలోకి మారుతుంటే నెమ్మదిగా మనసు విప్పాను. ఇరవైఏళ్ల క్రితం మీరు విద్యార్థి జూనియర్ కళాశాల' నడుపుతున్నప్పుడు నేను ఆ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థిగా మీకు శిష్యున్ని. గణితంలో నా రాతను గీతను మార్చిన మీరు నాకు గురువులు. మీరు లేకుంటే ఈరోజు నేనిట్లా ఉండేవాడిని కాను సార్.. అన్నాను.

వెంకట్రాములు బృకుటి ముడివేసి చూస్తుంటే కొనసాగించాను. మీకు గుర్తుందో లేదో సార్, నాకు ఎంసెట్ పరీక్ష రోజే మా నాన్న చనిపోయాడు. నేను ఆయన శవం దగ్గర ఏడుస్తుంటే నన్ను పక్కకు తీసుకెళ్లారు. నా పేదరికాన్ని గుర్తుచేశారు. మా కుటుంబం పట్ల నా బాధ్యత ఏమిటో గుర్తుచేశారు. 'అనారోగ్యంతో చనిపోయిన మీ నాన్న తిరిగిరాడు, కానీ మీ అమ్మనూ చెల్లెనూ చూడాల్సిన బాధ్యత నీదే'నన్నారు. అందర్నీ ఒప్పించి బలవంతంగా నన్ను మీ బైకు మీద కరీంనగర్ తీసుకెళ్లి ఎంసెట్ ఎంట్రన్స్ రాయించి తీసుకొచ్చారు. ఆ తర్వాతే

అంత్యక్రియలు చేయించారు. దాని ఫలితమే... నేను పంచాయిత్‌రాజ్ శాఖలో ఇంజనీరునయ్యాను. చెల్లెలి పెండ్లి చేయగలిగాను. ఈ రోజు ఈ స్థితిలో ఉన్నాను.

నేను ఇంజనీరింగ్ చేస్తున్నప్పుడు మిమ్మల్ని కలవాలని వస్తే ఆ కాలేజీని మీరు ఇతరులకు దారాదత్తం చేశారని విన్నాను. వేరే ఏదో కాలేజీలో పార్ట్‌టైంగా పనిచేస్తున్నారని తెలిసింది. అయితే అక్కడా దొరకలేదు. ఎక్కడుంటున్నారో ఎవరూ చెప్పలేదు. అప్పట్నుండి ఇప్పటికీ మీరు నా మదిలో మెదలుతూనే ఉన్నారు. నాకు ఉద్యోగం వచ్చాక కూడా చాలా ప్రయత్నించాను. ఎక్కడా మీ వివరాలు తెలియలేదు. నా అదృష్టమో, దురదృష్టమో మీరు ఈ స్టితిలో దొరికారు. ఏదైతేనేం.. ఇన్నాళ్లకు మీరు మా నాన్నలా మా ఇంట్లోకి చేరారు. మీకు సేవ చేయడం మా నాన్నకు చేస్తున్నట్లే భావిస్తున్నాను ఓ క్షణం ఊపిరి పీల్చుకొని నా ఈ జీవితం మీరు పెట్టిన భిక్ష సార్! నా కంఠంలో అదోరకమైన ఉద్విగ్నత.

మొహంలో ప్రసన్నత తాండవిస్తుండగా ఆయన చేతిలోనున్న నా చేయిని మరింత బిగించాడాయన. పక్కనే నిలబడి కొంగుతో కన్నీళ్లద్దుకొంటున్న నాభార్య జ్యోతిర్మయిని దగ్గరకు పిలిచాడు. ఆమె చేయిని తన ఎడంచేతిలోకి తీసుకున్నాడు. ఇద్దరి చేతుల్నీ తన రెండు చేతుల్తో బిగించిపట్టాడు. ఆ బిగింపులో వేనవేల భావాలు... పలుకుతున్నాయి.

* * *

**జగిత్యాల జిల్లా, కోరుట్ల స్వస్థలం.తెలుగులో ఎంఏ చేసి, డా. డింగరి రామాచార్య సాహిత్యంపై పరిశోధనచేసి కాకతీయ విశ్వవిద్యాలయం నుండి ఎంఫిల్ పట్టా పొందారు. కోరుట్ల బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్నారు. 1996లో స్వాతి వీక్లీ సరసమైన కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన 'వర్షంలోవనకన్య' మొదటికథ. ఇప్పటికి 52 కథలు ప్రముఖ దిన,వారపత్రికల్లోప్రచురించబడ్డాయి. 150 కవితలు, 25 నాటికలు, 50 పాటలు రాశారు.'నవ్వుతున్ననేలతల్లి' 'సుదూరతీరాలు' కథాసంపుటులు, 'అక్షరం - అభిమతం' కవితాసంపుటి, 'మందారమాలిక' గేయసంపుటితోపాటు ఏకలవ్య, వినాయకచవితి, సుమమాలవంటి 8 పుస్తకాలువెలువరించారు. తెలుగు పాఠ్య పుస్తక రచయితల బృందంలో సభ్యుడిగా ఉండి తెలుగు పాఠ్యపుస్తకాలరూపకల్పనలో పాలుపంచుకొన్నారు. ప్రపంచ తెలుగు మహా సభల సందర్భంగా రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో రూపొందించబడిన 'తెలంగాణవైభవం' పుస్తక రూపకల్పనలో భాగం పంచుకున్నారు.**

# మట్టి పరిమళం



బి.వి.రమణమూర్తి,
సెల్ : 9848987239

మిట్ట మధ్యాహ్నం... ఎండ తీక్షణంగా ఉంది. నేల తడిసి నెలలు గడిచిన ఆనవాళ్లు... ఆ మట్టి రోడ్డులో జీవం లేదు. ఆ జీవం లేని రోడ్డుపై జీపు భారంగా కదులుతోంది. ఒత్తిడి భరించలేని నేల తల్లి బెంబేలెత్తుతున్నట్టు ధూళి ఎగసిపడుతోంది. ఎగుడు దిగుడులు కారణంగా జీపు అటూ ఇటూ ఊగుతోంది.

ప్రధాన రహదారిని వదిలి పాము మెలికల్లాంటి ఆ మట్టి రోడ్డు పైకి జీపు వచ్చి చాలా సేపయ్యింది. జీపులో కూర్చున్న రామయ్యకు అయోమయంగా ఉంది. అతని రైతు కళ్లు పరిసరాలను నిశితంగా గమనిస్తున్నాయి. కనుచూపు మేరలో పంట పొలం లేదు. జనావాసాల జాడ కనిపించడం లేదు.

'అసలెవరితను, ఆత్మహత్య చేసుకోబోతున్న తననెందుకు రక్షించాడు. నా మానాన నన్ను వదిలేయక ఎక్కడికి తీసుకువెళ్తున్నాడు. అసలు ఇప్పుడు తానెక్కడ ఉన్నాను. ఇదేదో కొత్త ప్రాంతంలా ఉందే? అసలు ఇతని ఉద్దేశం ఏమిటి?' ఆశ్చర్యం, భయం, ఆందోళన చుట్టుముడుతున్నా ఏమీ చేయలేని నిస్సహాయత.

కాసేపటికి జీపు ఓ ఊరికి దగ్గరయ్యింది.. 'పర్వాలేదు, జనారణ్యంలోనే ఉన్నాను. ఇతగాడిది ఈ ఊరేమో' మనసులోనే అనుకున్నాడు. మలుపుల రోడ్డుపై ఏకాగ్రతతో

Katha PART 1_Layout 1 6/29/2023 2:38 PM Page 236

జీపు నడుపుతున్న అతని వైపు చూశాడు. అతనిలో ఏ భావం లేదు.

రామయ్యకు ఆస్పత్రిలో జరిగింది గుర్తుకు వచ్చింది. పక్షం రోజుల తర్వాత కళ్లు తెరిచాడు. 'నన్నెందుకు రక్షించారు. నన్ను చనిపోనివ్వండి. నిత్యం ఓడిపోతూ బతకడం నావల్ల కాదు. నేను చావాలి... నేను చావాలి' అరుస్తున్న అతనివైపు డ్యూటీ నర్సు అయోమయంగా చూసింది. తనకు తెలిసింది చెప్పి సముదాయిస్తోంది.

'అలాగే, చనిపో. నీ ప్రాణం నీ యిష్టం. కానీ చనిపోయే ముందు ఒక్కసారి నీవాళ్ల గురించి ఆలోచించావా?' అప్పుడే ఆ గదిలోకి అడుగుపెట్టిన అతను ప్రశ్నించాడు. తానెప్పుడూ చూడని వ్యక్తి, అలా సొంత మనిషిలా ప్రశ్నించే సరికి రామయ్య ఆశ్చర్యంగా అతనివైపు చూశాడు.

'అవన్నీ నీకెందుకు. నా గురించి నీకేం తెలుసు. నా చావు నన్ను చావనివ్వకుండా రక్షించడానికి నువ్వెవరు' రామయ్య మాటల్లో ఆవేదన ధ్వనిస్తోంది. 'తన చావుకు తానే ముహూర్తం పెట్టుకున్న వాడు పిరికివాడు. గెలుపు ఓటములు పట్టించుకోకుండా పోరాడిన వాడు యోధుడు' బాణంలా దూసుకువచ్చాయి అతని నోటి నుంచి మాటలు.

'ఈ మాటలకేం, అన్నీవున్న వాడు ఎన్నయినా చెబుతాడు. వినీ వినీ విసిగిపోయాను. నిత్యం బతుకు పోరాటం చేసే ఓపిక నాకు లేదు. నా మానాన నన్ను వదిలేయ్' 'కష్టాలేవో నీ ఒక్కడినే చుట్టుముట్టినట్టు మాట్లాడుతున్నావే'...అతను వ్యంగ్యంగా అన్నాడు.

'నా వేదన నీకు నవ్వుతెప్పిస్తోందా? శ్వేదాన్ని ఇంధనంగా మార్చి ఆరుగాలం బతుకు బండి నడిపే మట్టిమనిషిని నేను. నేల తల్లి కరుణించకుంటే బాధపడేవాడిని కాదు. ప్రకృతి ముఖం చాటేస్తే ఇది మామూలే అని సరిపెట్టుకునే వాడిని. మనిషే మనిషిని మోసం చేస్తున్నాడు. స్వార్థంతో అన్నదాత గొంతు కోస్తున్నాడు. ఇటువంటి మనుషుల మధ్య నేను బతకలేను'

'ఏం నువ్వు మనిషివి కాదా, నువ్వు ఈ జనారణ్యంలో బతకడం లేదా'...కోపంగా అన్నాడతను. 'బతక లేకే కదా చావాలనుకున్నాను. నా సాగు భూమిని లాక్కున్నారు. ఏమంటే అభివృద్ధి అన్నారు. ఫ్యాక్టరీ కడతామంటున్నారు. ఆ ముసుగులో చేస్తున్న వ్యాపారం. పెద్దోళ్ల భూములు వదిలేసి నాలాంటి పేదోళ్ల భూములపై పడ్డారు. ఒప్పుకుంటే సరి, నాలా మొండి కేసిన వారిని దారీతెన్నూ లేకుండా చేశారు. ఊరి పెద్దల్నే కాదు అడ్డొచ్చే వారందరినీ కొనేసారు. చట్టాన్ని చుట్టంగా మార్చుకున్నారు. కళ్లముందే న్యాయాన్ని సమాధి చేశారు. ఇస్తామన్నది కూడా సరిగా ఇవ్వలేదు. నాకు, నా కుటుంబానికి ఇంత అన్నంపెట్టే భూమి లేకుండా చేస్తే నేనెలా బతకాలి, ఎవరికోసం బతకాలి'

'అన్నింటికీ చావే శరణ్యమా' ఓదార్పుగా అన్నాడు. 'కాకపోవచ్చు, స్వార్థపరులైన మనుషుల మధ్య న్యాయం జరగనప్పుడు మనశ్శాంతికి ఆదే సరైన దారి' 'నువ్వు చనిపోతే నీ భార్యాబిడ్డల గతేం కాను' 'నేనుండి మాత్రం వారికి ఒరిగింది ఏమిటి, పట్టెడన్నం పెట్టలేని అసమర్థుడిని నేను' 'అంటే... నిన్నే నమ్ముకున్న నీ వాళ్లను వదిలేసి నీ మానాన నువ్వు చనిపోతాననడం స్వార్థం కాదా?'

రామయ్య ఆలోచనలో పడ్డాడు. సమాధానం కోసం తడబడ్డాడు. అతనికి భార్యా, పిల్లలు గుర్తుకు వచ్చారు. అర్ధాకలి జీవితం జ్ఞాపకం వచ్చింది. కళ్లు చెమ్మగిల్లాయి. చిరిగిన చీరలో తన గౌరవాన్ని కాపాడుకునేందుకు తంటాలు పడుతున్న భార్య, అవసరం చెప్పాల్సి ఉన్నా తండ్రిముందు నోరు తెరవొచ్చో, తెరవ కూడదో తెలియని అయోమయంతో చూస్తున్న పిల్లల ముఖాలు గుర్తుకు వచ్చాయి.

'నాది స్వార్థమే. కానీ,. ఏం చేయమంటావు. నాకు మరో దారేదీ కనిపించ లేదు' 'మార్గమేగా, నీకు కావాల్సింది. నాతో వస్తావా? నీకు నచ్చిన మార్గం చూపిస్తాను. అదీ నీకు నచ్చక పోతే ఇక నీ ఇష్టం'...అతను సూటిగా చూస్తూ చెప్పాడు. 'దిగు రామయ్య, ఊరొచ్చింది'... జీపు నడుపుతున్న వ్యక్తి పిలుపుతో ఆస్పత్రి ఆలోచన నుంచి బయటకు వచ్చాడు రామయ్య.

ఎదురుగా పెంకుటిల్లు. దూరం నుంచి కనిపించిన ఊరు అదే అనుకున్నాడు. గట్టిగా వందిళ్లు కూడా లేవు. అవి కూడా విసిరేసినట్టు అక్కడక్కడా ఉన్నాయి. కనుచూపు మేరలో ఖాళీ భూములు. సమీపంలో మరో ఊరు జాడ లేదు.

ఇంట్లోకి అడుగుపెట్టిన రామయ్యకు అదో డబ్బున్న వాళ్ల ఇల్లనిపించక పోయినా పేదరికం ఛాయలు కనిపించ లేదు. ఇద్దరు ఆడవాళ్లతో సహా నలుగురైదుగురు మనుషులున్నారు. 'రామయ్యా...ఆ మర్చిపోయాను. నీ పేరు రామయ్యే కదా' అడిగాడు అతను ఆశ్చర్యంగా. 'పూర్తి పేరు రామచంద్రయ్య బాబూ, అంతా రామయ్యా అని పిలుస్తుంటారు' 'బాబూ... అని పిలవకు. నేను నీ బిడ్డలాంటి వాడిని, పేరు పెట్టి పిలువు పర్వాలేదు' 'మా పల్లెటూర్లలో అదో గౌరవనీయ సంబోధం బాబూ. నోటి ముందుంటుంది. అంత వేగంగా మార్చుకోలేం'

'సరేలే, నా పేరు కృష్ణమోహన్. ఈ ఊరు కొండవీడు. ఇది నా సొంతూరు. మీ ఊరికి చాలా దూరంలో ఉంది. కంగారు పడకు. నువ్వు వద్దనుకుంటే నీ ఇంటికి నిన్ను చేర్చే బాధ్యత నాది'. 'చావు కోరుకునే వాడిని బాబూ. నాకు ఇల్లయినా, శ్మశానమైనా ఒకటే'. 'అతను నవ్వేశాడు, సరేలే.... భోజనం అయ్యాక విశ్రాంతి తీసుకో. సాయంత్రం అన్ని విషయాలు మాట్లాడుకుందాం. నీకు అవసరమైన పంచె, తువ్వాలు తెచ్చాను. వంటిపై ఉన్నవి ఉతికేందుకు పడేసి, స్నానం చేసి అవి కట్టుకో' చెప్పి అతను వెళ్లిపోయాడు.

భోజనం అయ్యాక పడుకున్న రామయ్యకు ప్రయాణ బడలిక వల్ల బాగా నిద్రపట్టేసింది. కళ్లు తెరిచేసరికి ఎదురుగా కుర్చీలో కృష్ణమోహన్. తననే చూసి నవ్వుతుండడంతో ఉలిక్కిపడి లేచాడు. 'ఏం రామయ్యా, బాగా నిద్రపట్టిందా' అభిమానంగా అడిగాడతను. 'పీడకలలు వెంటాడుతున్నాయి బాబు, అవి నా జీవితాన్ని వదిలి పోవేమో' ఆవేదనగా అన్నాడు.

'అవి పీడకలలు కావు రామయ్యా, నీలోని భయం. ఆ భయం పోవాలంటే నీపై నీకు నమ్మకం పెరగాలి. ఇందుకు చిన్న పిట్ట కథ చెబుతాను, వింటావా?' 'చెప్పు బాబూ' అన్నట్టు చూశాడు. 'అతనో సైనికుడు. సరిహద్దులోని కీలక ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నాడు.

తోటి సైనికులతో కలిసి డేగ కళ్లతో కాపలా కాస్తున్నాడు. ఊహించని విధంగా శత్రువులు దాడి మొదలు పెట్టారు. వారి సంఖ్యా బలం ఎక్కువ. అయినా భయపడ లేదు. ధైర్యంగా పోరాడారు. శత్రువుకు చావు దెబ్బ తగిలింది. కానీ తోటి సైనికులంతా చనిపోయారు. అతనొక్కడే మిగిలాడు. శత్రువులు సమీపిస్తున్నారు. చావు చెంతనే ఉంది. అయినా ఏదో తెలియని ఆశ. గెలవలగలనన్న నమ్మకం. చివరి ప్రయత్నంగా శత్రు సైనికుల మధ్యకు ఓ గ్రెనేడ విసిరాడు. అదే సమయంలో అటు నుంచి ఓ గ్రెనేడ్ వచ్చి అతని సమీపంలో పడింది. అతను తప్పించుకులోగానే ఇరువైపులా భారీ పేలుళ్లు. శత్రు సైనికులంతా చనిపోయారు. అతను మాత్రం ప్రాణాలతో మిగిలాడు. కళ్లు తెరిచి చూసేసరికి సైనిక ఆస్పత్రి బ్బె ఉన్నాడు. మోకాళ్ల వరకు తొలగించిన కాళ్లు దర్శనమిచ్చాయి'

ఈ కథ విన్నాకా నీకేమనిపిస్తోంది. అతను గెలిచాడా ? ఓడిపోయాడా ? 'వ్యక్తిగతంగా ఓడిపోవచ్చు, కానీ దేశాన్ని గెలిపించాడు'. 'శెభాష్ రామయ్యా. హృదయం ఉప్పొంగే సమాధానం చెప్పావు'. 'ఇంతకీ ఎవరు బాబూ ఆ సైనికుడు'. 'నేనే!.. అవును రామయ్య. ఆ ఓడి గెలిచిన సైనికుడిని నేనే. ఇప్పటి వరకు నువ్వు గమనించలేదేమో. నేను నడవగలుగుతున్నది నా కాళ్లపై కాదు. కృత్రిమ కాళ్లపై'...అంటూ పంచె ఎత్తి చూపాడు.

ఒక్క క్షణం రామయ్య దిగ్భ్రమకు లోనయ్యాడు. కాసేపు నిరుత్తరుడయ్యాడు. ఆశ్చర్యంగా అతనివైపు చూశాడు. అతని ధైర్యం, ఆత్మవిశ్వాసం చూసి ఆశ్చర్యపోయాడు. ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. ఆవేదనగా అతని వైపు చూశాడు.

'యోధుడు ఎప్పుడూ ఓడిపోడు రామయ్యా. ఓటమి అంచుకు చేరినప్పుడే విజయానికి దగ్గరయినట్టు. విజయమో, వీర స్వర్గమో. గెలిస్తే చరిత్రలో నిలిచిపోతాం. ఓడిపోతే ఊహించిందే జరుగుతుంది. అటువంటి సందర్భంలో కావాల్సింది మనోధైర్యం'. నాలుగు పదుల వయసు కూడా లేని అతని మాటలు వింటూ రామయ్య విస్తుపోతున్నాడు.

'చూడు రామయ్యా, నువ్వు కర్షకుడిగా గెలిచావు. నేను సైనికుడిగా గెలిచాను. అనుకోని పరిస్థితుల్లో ఇద్దరం వ్యక్తిగతంగా ఓడిపోయాం. జీవితంలో కాదు. అంతేనంటావా? కాదా'

'నిజమే బాబూ'..'చీకటి ఎంత భయంకరమైనదైనా చిరు దీపం దాన్ని పారద్రోలగలదు. జీవితం కూడా అంతే. కష్టనష్టాలు ఎలాంటివైనా ఆత్మవిశ్వాసం అనే చిరు దీపం మనలో వెలుగుతున్నంత కాలం ఓడిపోయే అవకాశం లేదు. ఇది నా నమ్మకం'. రామయ్యకు ఏం చెప్పాలో తోచ లేదు. మౌనంగా అతనివైపు చూస్తున్నాడు.

'రామయ్యా.... రైతు అసమాన్యుడు. అతనో శాస్త్రవేత్త...ఓ డాక్టర్... ఓ శ్రామికుడు...మరెందరో సమ్మిళితం. రైతే దేశానికి వెన్నెముక. నీలాంటి రైతులు దేశానికి మార్గదర్శకులు కావాలి. నా సైనికుడి భాషలో చెబుతాను విను. ఆత్మస్థైర్యం దెబ్బతింటే చేతిలో ఏకె-47 ఉన్నా శత్రువుని ఓడించలేం. ధైర్యంతో ముందడుగు వేయగలిగితే ఖాళీ చేతుల్తోనూ మట్టి కరిపించగలం. ఇది నేను అనుభవంతో చెబుతున్న మాట. దేశ రక్షణకు సైనికుడు, జనం

రక్షణకు కర్షకుడు అవసరం'

'అవును బాబు. అన్నదాత లేకుంటే కడుపు నిండదు. సైనికుడే లేకపోతే కంటిపై కునుకుండదు'. 'మరి అంతటి విలువ, గొప్పతనం నీలో దాచుకుని బేలగా చనిపోతానంటావేం. అందుకే నిన్ను రక్షించాను' నవ్వుతూ అన్నాడు కృష్ణమోహన్.

ఆ సాయంత్రం కృష్ణమోహన్ ఊరికి కిలోమీటరు దూరంలో ఉన్న కొండవాలు ప్రాంతానికి తీసుకువెళ్లాడు. చిన్నచిన్న కమతాలుగా ఉన్న కొంత భూమి చూపించాడు.

'సరిహద్దు పోరులో కాళ్లు పోగొట్టుకుని నిస్సహాయకుడిగా మారినందుకు ప్రభుత్వం నాకిచ్చిన ఐదెకరాల భూమి ఇది రామయ్యా. గడచిన ఐదేళ్లుగా వృథాగా పడివుంది. పండించాలన్న ఆశవున్నా నాకు వ్యవసాయం రాదు'.

రామయ్య అతనివైపు ఆశ్చర్యంగా చూశాడు. ప్రస్తుతం నా జీవితానికి తోడు నా భార్య, ఇద్దరు పిల్లలు, ఈ రెండు కృత్రిమ కాళ్లు, ఈ వాలు కుర్చీ, ఈ విశాలమైన పెంకుటిల్లు మాత్రమే. ప్రభుత్వం పెన్షన్ ఇస్తోంది. ఓడి గెలిచిన సైనికుడిగా ప్రభుత్వం ఇచ్చిన నగదు సాయం బ్యాంకు డిపాజిట్ రూపంలో ఉంది. ఉద్యోగం చేస్తూ నేను కూడబెట్టిన మొత్తంతో పట్నంలో సమకూర్చుకున్న స్థిరాస్తిపై ఆదాయం వస్తోంది. నా భార్యా, బిడ్డల్ని పోషించుకునేందుకు ఇవి చాలు? కానీ ఓ స్వార్థం నన్ను నడిపిస్తోంది, ఆ స్వార్థమే నిన్ను రక్షించేలా చేసింది'

'ఏమిటి బాబూ ఆ స్వార్థం' 'ఊరికి ఉపకారం చేయాలన్న స్వార్థం. బీడు వారిన ఈ నేల తల్లిని పంట భూమిగా మార్చాలన్న స్వార్థం. ఇది బీడు భూమి కాదు, పంట పండే బంగారు లక్ష్మి అని నిరూపించాలన్న స్వార్థం. కాలం కత్తివేటుకు ఇక్కడి రైతులు బలైపోయినా ప్రత్యామ్నాయం లభిస్తే ఈ నేల తల్లి సిరులు కురిపిస్తుందని నిరూపించాలన్న స్వార్థం' హృదయాన్ని మెలిపెడుతున్న ఆవేదన వల్ల కావచ్చు. అతను కాసేపు ఆగి మొదలు పెట్టాడు.

'కను చూపు మేరలో కనిపించే ఈ భూములన్నీ మా ఊరు, చుట్టుపక్కల మరో రెండూళ్ల రైతులవే రామయ్యా. అంతా సన్నచిన్నకారు రైతులే. భూగర్భ జలాలు లేకున్నా, వానాకాలంలో నీటి తడితోనే ఖరీఫ్, తర్వాత అపరాల పంటలు పండించే వారు. భుక్తికి లోటు లేకుండా జరిగిపోయేది. కాలంతోపాటు వచ్చిన మార్పులు ఈ భూములకు శాపంగా మారాయి. పర్యావరణ మార్పులతో వర్షాలు అదను తప్పాయి. వరుసగా రెండు సీజన్లలో పంటలు పోయాయి. ఆ తర్వాత ఓ ఏడాది పంట పండినా తర్వాత మరో మూడేళ్లు అవే కష్టాలు. రైతులకు ప్రత్యామ్నాయం లేదు. రానురాను అర్థాకలి బతుకులతో జనంలో విసుగు, కోపం మొదలయ్యాయి. భూమిని నమ్ముకుంటే పస్తులే అన్న నిర్ధారణకు వచ్చేశారు. ప్రత్యామ్నాయం వెతుక్కుంటూ చాలామంది పట్నానికి వెళ్లిపోయారు. ఊరు శ్మశానంలా మారింది. ఉన్నవారు వ్యక్తిగత కారణాలతో నెట్టుకొస్తున్న వారే తప్ప బతుకుపై ఆశతో కాదు'

రామయ్య మనసులోని చాలా సందేహాలకు అప్పుడప్పుడే సమాధానాలు

దొరుకుతున్నాయి. అతను కృష్ణమోహన్ చెబుతున్నది మరింత శ్రద్ధగా వింటున్నాడు. 'ఇవి ఎందుకూ కొరగాని భూములు కావు రామయ్య. పరిస్థితులు కారణంగా అలా మారాయి. కష్టపడితే సాగుయోగ్యం చేయొచ్చన్నది నా నమ్మకం. చేసి చూపించాలన్న తపన. ఇందుకు నా ఐదెకరాలు నాంది కావాలి. అందుకే నీ సాయం కోరుతున్నాను. ఎంత ఖర్చయినా భరిస్తాను. ఎంత నష్టపోయినా ఆనందంగా స్వీకరిస్తాను. నీ భార్యా, పిల్లల మంచిచెడ్డలన్నీ చూసుకుంటాను. రెండేళ్లయినా, మూడేళ్లయినా ఒక్క ఖరీఫ్ సీజన్లో అయినా నా ఐదెకరాలు పచ్చని పంటతో కళకళలాడాలి. అది మరికొందరిలో స్ఫూర్తి నింపాలి. ప్రభుత్వంలో కదలిక తేవాలి. సాగునీటి సదుపాయంపై దృష్టిసారించాలి. ఈ భూముల్లో బంగారం పండాలి. అదే నా ఆశయం'

అప్పటి వరకు మౌనంగా ఉన్న రామయ్య నోరు విప్పాడు. 'బాబూ, వ్యవసాయం అంటే విసుగొచ్చింది. భూమిని నమ్ముకోవడం అంత చెడ్డపని మరొకటి లేదనుకున్నా. కానీ, నీ ఆకాంక్ష విన్నాక నాలో ఏదో తెలియని శక్తి ఆవహిస్తోంది. నాలోని రైతు మేలుకొంటున్నాడు. నా అనుభవాన్నంత రంగరించి నీ భూమిని పచ్చని పైరుతో కళకళలాడిస్తాను' రామయ్య ఆత్మవిశ్వాసంతో చెప్పాడు. కృష్ణమోహన్ ముఖంలో 'నువ్వు చెయ్యగలవు రామయ్యా' అన్న సంతృప్తి కనిపించింది.

* * *

ఆకాశం మేఘావృతమై వుంది. కొండవాలులోని బండరాయిపై కూర్చున్నాడు రామయ్య. అతని ముఖం దైన్యంతో నిండివుంది. అప్పుడే రెండు ఖరీఫ్ సీజన్లు వెళ్లిపోయాయి. వానల్లేక పంట దక్కలేదు. 'నన్ను, నా కుటుంబాన్ని అప్పనంగా పెంచుతున్నాడు ఆ పిచ్చి మారాజు. నేనేదో సాధిస్తానని అడిగినవన్నీ సమకూర్చుతున్నాడు. నా భార్యా బిడ్డలు బతికేందుకు డబ్బు పంపిస్తున్నాడు. ఆ అవిటి వాడిని నేను మోసం చేస్తున్నాను... నేను మోసం చేస్తున్నాను. అతనికి నా ముఖం ఎలా చూపించగలను' రామయ్య మనసు విలవిల్లాడిపోతోంది.

నిరాశగా ఆకాశం వైపు చూశాడు. కారు మబ్బులు ఢీకొన్న ఆనవాలుగా మెరుపు మెరిసింది. కాసేపటికి ఉరుము ఉరిమింది. విరుచుకుపడే ప్రళయానికి ముందు వినిపించని (నిశ్శబ్ద) గీతంలా అప్పటి వరకు ఉన్న ప్రశాంతతను చీలుస్తూ ఆకాశంలో అలజడి. ఉత్కంఠతో చూస్తున్న రామయ్య నుదుటిపై ఓ చినుకుపడి చెదిరిపోయింది. కాసేపటికి వర్షం జోరందుకుంది.

'లాభం ఏమిటి? ఖైదీని ఉరితీసిన తర్వాత నిజం తెలిసినట్టు... పంట ఎండిపోయాక కురిసిన ఈ వర్షంతో ఏం ప్రయోజనం? పది రోజుల ముందు ఇదే వర్షం కురిస్తే ఎంతబాగున్ను' అసహనంతో తిట్టుకున్నాడు రామయ్య.

జోరు వానలో గంటపాటు తడిసి ముద్దయ్యాడు. అయినా అక్కడి నుంచి కదల్లేదు. ఆవేదనతో ఆలోచిస్తూ కూర్చున్న రామయ్య చెవిని నీటి గలగలల శబ్దం సోకింది. ఏదో

తెలియని ఆశ...చీకటిలో చిరు దీపంలా మనసును పెనవేసుకున్న కుతూహలం. అతనికి తెలియకుండా అడుగులు అటువైపు పడ్డాయి. శబ్దం వస్తున్న కొండపైకి వందడుగులు ఎక్కాక వర్షం నీరు కిందికి జారుతుండడం గమనించాడు.

'గుబురు పొదలు, రాళ్లు, ఎర్రమట్టి నిండిన ఎత్తుపల్లాల కొండ వాలుల్లో వర్షం కురిసిన చాలా రోజుల వరకు నీటి చెమ్మ ఉంటుందని అతనికి తెలుసు. పొదలు, చెట్లు, రాతి నీడల కారణంగా ఆ నీరు అంత వేగంగా ఆవిరి కాదని అనుభవంలో తెలుసుకున్నాడు. కొండ కోనల్లోనే నదీ ముఖద్వారాలు ఉండేందుకు కారణం కూడా ఇదేనని ఎవరో చెప్పగా విన్నాడు'...ఈ విషయం గుర్తుకురాగానే రామయ్యకు కొండంత శక్తి వచ్చినట్టయింది. 'ఈ కొండపై నీటి ఊటలకు ఈ మట్టిలోని ప్రత్యేకత కారణం కావచ్చు. ఈ నీటిని ఒడిసి పడితే నా శ్రమ ఫలిస్తుంది. కృష్ణమోహన్ ఆశయం నెరవేరుతుంది'... ఈ ఆలోచన రాగానే రామయ్య ముఖం విప్పారింది. లక్ష్యం సాధ్యమే అన్న ధైర్యం వచ్చింది. అప్పుడే అతని మనసులో ఓ ప్రణాళిక రూపుదిద్దుకుంది.

* * *

కొండవీడు గ్రామంలో సరికొత్త అధ్యాయం. ఇప్పుడందరి నోట వినిపిస్తున్న మాట రామయ్య, కృష్ణమోహన్లదే. ఎడారి లాంటి భూముల్లో పచ్చ'ధనం' పరవళ్లు తొక్కించిన ఘనత వారిది. 'కాడి' కింద పడేసి ఊరినే వద్దనుకుని సుదూర ప్రాంతాలకు తరలిపోయిన వారిలో తిరిగి ఊరికి రావాలన్న ఆశ మొగ్గ తొడిగిన సందర్భం. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్న ఆర్యోక్తిని అక్షర సత్యమని నిరూపించిన నేలతల్లి ముద్దుబిడ్డ రామయ్య. ఆత్మహత్యే శరణ్యమనుకునే రైతును రక్షించి అతనిలో ఆత్మవిశ్వాసాన్ని నింపి కర్షక శ్రామికుడిగా మార్చిన ఘనత కృష్ణమోహన్ది. ఈ శ్రమ ఫలితమే ఇద్దరినీ ఆ ప్రాంతంలో ప్రత్యేకంగా నిలబెట్టింది.

బంజరు భూముల్లో పంట పండించేందుకు తాపత్రయ పడుతున్న ఇద్దరినీ కొన్ని నెలల క్రితం చూసి న వాళ్లు పిచ్చోళ్లనుకున్నారు. అలా అనుకున్న వారే ఇప్పుడు పశ్చాత్తాపంతో తలదించుకుని వెళ్తున్నారు. 'వర్షం కురిసాక కొండపై రాళ్ల కింద నిల్వవున్న నీటి ఊటల్ని ఒడిసి పట్టగలిగితే పంట దక్కించుకోవడం పెద్ద కష్టం కాదు' అంటూ ఏడాది క్రితం రామయ్య చెప్పిన మాట విన్న కృష్ణమోహన్ 'అది సాధ్యమేనా' అనుకున్నాడు. రామయ్యలోని పట్టుదల చూసి సరే అన్నాడు. అతను కోరిన సాధన సామగ్రి సమకూర్చాడు. దాదాపు ఆరు నెలలపాటు నిద్రాహారాలు పట్టించుకోకుండా రామయ్య పడ్డ కష్టం కృష్ణమోహన్ కళ్లముందు మెదిలింది. గడ్డి పూచతో కొండను కదిలించాలన్న అతని తాపత్రయం చూసి ఊరివాళ్లు, దారిన పోయిన వాళ్లు, తెలిసిన వాళ్లు హేళన చేస్తున్నా, మౌనంగా తన పని తాను చేసుకుపోయిన రామయ్య పట్టుదల చూస్తే యుద్ధ క్షేత్రంలోని సైనికుడు గుర్తుకు వచ్చాడు.

కృష్ణమోహన్ ఐదెకరాల భూమిని ఒకే కమతంగా మార్చాడు రామయ్య. చుట్టూ బలమైన గట్టు నిర్మించాడు. మధ్యలో అక్కడక్కడా పిల్ల గట్లు వేశాడు. ఆ భూమిని ఆనుకుని ఉన్న

బంజరు భూమిలో చిన్న చెరువు లాంటిది తవ్వాడు. పొలానికి సమీపంలో కొండ పైనుంచి కింది వరకు పలు చోట్ల చెక్ డ్యాంలు నిర్మించాడు. వర్షం కురిసినప్పుడు జాలువారే నీటిని ఒడిసిపట్టి కొండ దిగువన తవ్విన చెరువులోకి చేరేలా సన్నటి కాలువలు నిర్మించాడు. వర్షాకాలంలో కొండవాలు నుంచి జాలువారే ప్రతి నీటి బొట్టును చెరువులోకి మళ్లేలా చేశాడు.

తొలకరి ప్రారంభం నుంచే ఖరీఫ్కు పొలాన్ని సన్నద్ధం చేశాడు. వర్షాలతోపాటు సాగు కొనసాగిస్తూ నీటి తడికోసం ఎదురు చూడాల్సిన సందర్భంలో చెరువు నీటిని పొలంలోకి మళ్లించాడు. అతని కృషి వృథా పోలేదు. కృష్ణమోహన్ ఐదెకరాల పొలం వరిపంటతో కళకళలాడింది. రెండు నెలల్లో పంట చేతికొచ్చింది. ఊరి వాళ్లకు అదో అద్భుతం. వారిలో ఏదో తెలియని కొత్త ఉత్సాహం.

'శభాష్ రామయ్యా....రైతు అసమాన్యుడని నిరూపించావు. నా ఆకాంక్ష నెరవేర్చావు. ఊరి రైతుల జీవన మార్గానికి ఊపిరి పోశావు. ఎడారిలాంటి భూమిని పచ్చని లోగిలిగా మార్చావు. నా నమ్మకం వృథా పోలేదు'... తన ఐదెకరాల పంటపొలం వద్ద నిల్చుని ఉబ్బితబ్బిబ్బయిపోతున్న కృష్ణమోహన్ రామయ్యపై అభినందనల వర్షం కురిపిస్తున్నాడు. భవిష్యత్తులో ఆ ప్రాంతం సస్యశ్యామలమయ్యేందు తాను నాంది పలికినందుకు గర్వంగా ఫీలవుతున్నాడు.

'రామయ్య అడుగు వేశాడు. మిగిలిన రైతులు ఆ అడుగులో అడుగు కలపకుండా ఉంటారా?' అనుకున్నాడు. రామయ్య, కృష్ణమోహన్ల కృషి, బీడు భూమిని సాగు యోగ్యం చేసిన వారి పట్టుదల, శ్రమ కథలు కథలుగా మీడియా ప్రచురించింది. కొండవీడు గ్రామ రైతుల్లో నవోదయం అని ఓ పత్రిక కీర్తిస్తే, 'జై జవాన్...జై కిసాన్' అంటూ శీర్షిక పెట్టి మరో పత్రిక స్ఫూర్తి నింపింది.

**బత్తుల వెంకట రమణమూర్తి స్వస్థలం విశాఖ నగరం మధురవాడ. శ్రీకాకుళం జిల్లాలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సీనియర్ డెస్క్ జర్నలిస్ట్ గా దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు ప్రధాన పత్రికల్లో పనిచేసిన ఆయన ఇటీవలే ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరారు. 2016 నుంచి కథలు రాస్తున్నారు. తొలి కథ గోమాలచ్చిమి, నవ్య వారపత్రికలో 2018లో ప్రచురితమైంది. ఇప్పటివరకు నలభైకి పైగా కథలు రాశారు. 18 కథలు వివిధ పోటీల్లో బహుమతులు గెలుచుకున్నాయి. నమస్తే తెలంగాణ-ముల్కనూరు గ్రంథాలయం సంయుక్తంగా నిర్వహించిన 'కథ-2020' పోటీల్లో ఈయన కథ 'ఆకుపచ్చ తివాచీ'.. పదివేల రూపాయల బహుమతిని గెల్చుకుంది. 2021 పోటీల్లో 'మట్టి పరిమళం' కథ సాధారణ ప్రచురణకు ఎంపికైంది. సామాజిక ప్రయోజనంతోపాటు పాఠకులను ఆలోచింపజేసే కథలు, హాస్య, వ్యంగ్య కథలు రాయడాన్ని రమణమూర్తి ఇష్టపడతారు.**

# అయినా మనిషి మారలేదు



**సంగనభట్ల నర్సయ్య**
**94400 73124**

"రామేశ్వరరావ్ గారూ! మీ క్వారంటైన్ నేటితో ముగుస్తుంది. రేపు మీ ఇంటికి వెళ్లవచ్చు. ఉదయం పరీక్షలో కరోనా నెగెటివ్ కూడా వచ్చింది. మీకు అభినందనలు".

డాక్టర్ కోటేశ్వర్, రామేశ్వరరావును అభినందించగా మిగతా వారు విని సంతోషించారు. కాని రామేశ్వరరావు సంతోషించలేదు. నిస్తేజమైన చూపులతో ఆయన డాక్టర్ను చూసాడు. డాక్టర్కు కూడా ఆ నీరసానికి అర్థం తెలియలేదు. ఉండబట్టలేక అడిగాడు కూడా. దానికి జవాబుగా రామేశ్వరరావు చెప్పింది.

చుట్టుపక్కలవారికి కూడా షాక్ ఇచ్చింది.

"డాక్టర్గారూ! 14 రోజులు ఐనా, నెలైనా, నా పిల్లలకు నేను తిరిగి ఇంటికి రావాలని లేదు. అంతకుముందు నుంచే నన్ను అనాథాశ్రమంలో జాయిన్ చేయాలని అనుకున్నారు. కాని బంధువులకు, మా సోదరులవైపు వారికి భయపడి ఏం చేద్దాం అని సందేహిస్తూ వచ్చారు. తక్షణం తీసికొనివచ్చి ఇక్కడ క్వారంటైన్లో వేసారు. ఇపుడు తిరిగి ఇంటికెలా తీసుకొని వెళతారు? వారికది యిష్టంలేదు. ముఖ్యంగా మా కోడలికి.

"రావు గారూ! మీ ఆవిడ ఎక్కడ? ఆవిడ పరిస్థితి ఏమిటి?" అడిగాడు డాక్టర్.

"డాక్టర్ గారూ! మా ఆవిడ పోయి ఏడాది ఐంది. అప్పటినుండి నాకు నరకం మొదలైంది. నాకు ప్రత్యేకమైన గది. దాంట్లో పడవేసారు. అందరూ తిన్నాక ఏ ఒంటిగంటకో మా కోడలు పళ్లెంలో ఇంత భోజనం తెచ్చి పడేస్తుంది. అంతవరకు నా ఆకలిదప్పులు అదిమిపెట్టుకోవాలి. తింటుండగా మారు వేసేందుకు ఏం కావాలని అడగరు. పళ్లెం తీసికొనివెళ్లి నా గదిలోని బాత్రూంలో కడుక్కొని వచ్చి పక్కన పెడతాను. మళ్లీ రాత్రికే భోజనం. కరోనాకు ముందు ప్రపంచం, కరోన తరువాతి ప్రపంచం అని మీరు నేటి సమాజాన్ని విశ్లేషిస్తున్నారు. నాకు మాత్రం కరోనాకు ముందూ, వెనుకా ఒకటే. మా ఆవిడ మతికి ముందు, వెనుకా అని మాత్రమే. నా జీవితంలో అదే పెద్ద మార్పు.

రామేశ్వరరావుగార్కి దూరపు బంధువు కూడా ఐన డాక్టర్ కోటేశ్వర్ తాను వాళ్ల ఇంటి సంగతి తెలియక అభినందించాడు. విషయం తెలిసాక నొచ్చుకొని బాధపడ్డాడు. తాను కొడుకుకు చెప్పి చూస్తానని అన్నాడు.

"కోటేశ్వర్ గారూ! అక్కర్లేదు. భయంకర ఏకాంతం భరించాను ఇంట్లో. దానికంటే మీ హాస్పిటలే నయం.

నన్ను చూసుకునే ముగ్గురు, నలుగురు వైద్య సిబ్బంది ఉన్నారు. వేళలకు ఆహారం వచ్చింది. నన్నింకో నెల ఉంచుకోండి, వీలైతే" అని అడిగాడు.

"రావు గారూ! ఇది  అసాధ్యం. నెగెటివ్ వచ్చాక మేం ఉంచుకోలేం. బెడ్ ఖాళీ ఐతే మరొకరికి ఇవ్వవలసి ఉంటుంది. మీ అబ్బాయి హాస్పిటల్ ఖర్చు భరించలేడు. ఈ పధ్నాల్గు రోజులకే ఎంతో ఖర్చు ఐందని గొణిగాడు. తగ్గింపుకై నన్ను అడిగాడు. సరే చెప్పి చూస్తానోసారి అన్నాను" అన్నాడు డాక్టర్.

కోటేశ్వర్గారూ! అక్కర్లేదు. మీ మాటతో ఫీజు తగ్గింపు చేస్తారని, డాక్టర్ మీ మాటను గౌరవించినట్టు నా విషయంలో మా వాడు నటిస్తాడు. కాని వానికిష్టం లేదు. కరోనాతో పోతే శ్మశానానికి, కరోనాతో పోకుంటే వద్ధాశ్రమానికి అని వారే రెండు దారులు ఇప్పటికే నిర్ణయించుకున్నారు.

"ఇది ముందే నిర్ణయమా? మీ ఇల్లు, ఆస్తి వాళ్లకు అక్కర్లేదా? ఇంత దారుణమా?"

"డాక్టర్! అది ముందే నిర్ణయం ఐంది. నా ఇల్లు వారికి రాసాను. వేరే ఆస్తి లేదు. కరోనా వచ్చాక తొలిరోజే ఈ నిర్ణయం. ఇపుడైతే తప్పు పట్టరని మా కోడలుఈ సందర్భాన్ని వినియోగించుకొమ్మని పోరింది".

"ఇంత తొందరగా ఇల్లు ఎందుకు రాసివేసారు?"

"తప్పలేదు. అంతకుముందు నుండే పోరు నడుస్తోంది. సరేనన్నాను. కరోనా పాజిటివ్ రాగానే అర్జంటుగా కాగితాలు సిద్ధం చేయించి సంతకం పెట్టించి, హాస్పిటల్లో జాయిన్ చేసారు. సంతకం పెట్టకుంటే దవాఖానాలో చేర్చమని బెదిరించారు. మీద కరోనా కత్తి వేళ్లాడుతోంది. ఒక నిస్పృహ, ఒక దుఃఖం, ఒక మత్యుభీతి చేత సంతకం చేయించింది".

అతని దీనగాథ వింటుంటే డాక్టర్ నోట మాట రాలేదు. సామాజిక విలువలను కరోనా

ధ్వంసం చేసిందని ఏడుపే కాని విలువలు కరోనాకు ముందే ధ్వంసం అయ్యాయి అని అనుకొన్నాడు.

రామేశ్వరరావు కొడుకు కోరినా డాక్టర్ ఫీజు తగ్గింపుకై సిఫారస్ చేయలేదు. ఈ రాక్షసులకు తాను సాయం చేయడం ఎందుకనుకున్నాడు.

కౌంటర్లో బిల్లు చెల్లింపులు కాగానే రామేశ్వర్రావును కొడుకు డిశ్చార్జి చేయించుకుని ప్రైవేట్ వాహనంలో తరలించాడు. తండ్రిని కనీసం అడగనైనా అడగకుండా నేరుగా వద్ధాశ్రమానికే తీసుకొనిపోయాడు.

"నాన్నా! నీకు తెలియందేముంది? కోడలు నిన్ను సరిగా చూస్తూ లేదు. ఇక్కడ వేళకు చక్కగా తిండి సౌకర్యం ఉంది. నలుగురు వద్ధులుంటారు. ఇది మంచి నిర్వహణగల ఆశ్రమం. ఇక్కడి ఖర్చులకు నీ పెన్షన్ డబ్బులు సరిపోగా, కొంత మిగులుతుంది. మేమూ మధ్యమధ్యలో చూసి పోతుంటాం. పట్నం శివార్లలో ఉంది గనుక మేం రావడం సులభం. ధైర్యంగా ఉండు" అన్న కొడుకు ఆఖరి వాక్యాలతో రామేశ్వరరావు కరోనానంతర జీవితం ప్రారంభమైంది.

కొడుకు ఇంట్లో వారికి, చుట్టుపక్కల వారికి నాన్న ఇంకా డిశ్చార్జి కాలేదని చెప్పాడు. ఒక్క కోడలికి మాత్రం అనాథాశ్రమంలో చేర్చినట్టు తెలుసు.

దయానిధి శరణాలయంలో రామేశ్వరరావు గార్కి రోజులు బాగానే సాగుతున్నాయి. ఆ వాతావరణానికి అలవాటైంది. ఈ లోగా ఒక సంఘటన జరిగింది. వాళ్లింటి పెంపుడు కుక్క దారి తెలుసుకుని అనాథ శరణాలయానికి వచ్చింది. తనింట్లో ఈ కుక్క రామేశ్వరరావుగార్కి బాగా దగ్గరగా ఉండేది. దాన్ని తానే వీధిలో అనాధగా ఉంటే తెచ్చి పెంచాడు. మమకారంతో ఇక్కడ రామేశ్వరరావు వద్దకు వచ్చి చేరింది. అనాథ శరణాలయంలో కుక్కలను ఉంచకూడదనే నియమం వల్ల కొడుక్కి ఫోన్ చేసి, కుక్కను తీసుకొని పొమ్మని నిర్వాహకులు చెప్పారు. కొడుకు కారులో భార్య, పిల్లలతో వచ్చాడు. కోడలు మాట వరుసకు "ఇక్కడ ఏర్పాట్లు అన్నీ బాగున్నాయా" అంది. "ఇంటికంటే బాగుందని" రామేశ్వరరావు సమాధానమిచ్చాడు. కుక్క పేరిట మనుమలను చూసే అవకాశం తాతకు లభించింది. కుక్కను వారి వెంబడి తీసుకొని వెళ్ళిపొయ్యారు.

రామేశ్వరరావుకు సన్నిహితంగా ఉండే జోగయ్యగారు "కుక్కను తీసుకొని వెళ్లారు కాని, తండ్రిని వదిలి వెళ్తున్నారని" కరుగ్గా కొడుకుముందే అన్నాడు. ఆయనకు ఇలాంటి సంతానమంటే ద్వేషం. ఆయన సంతానమూ అలాంటివారే.

రామేశ్వరరావుగారికి వచ్చే 40 వేల రూపాయల పెన్షన్లో 20 వేలు వద్ధాశ్రమానికి కట్టగా మిగిలినవి మొదట్లో నీవే ఉంచుకోమని అన్నా, భార్య సలహామేరకు పెద్ద టీవీ కొనడాన్కి బ్యాంక్ అప్పులకు బదులు తండ్రినుండే ఊడ్చుకున్నాడు. ఇది అలవాటుగా మారి ప్రతినెలా ఏదో ఖర్చు చెప్పి తండ్రికి మిగిలిన పెన్షన్ కూడా లాగేసేవాడు. ఇంటిపక్కనేగల

ఆంధ్రాబ్యాంక్ బ్రాంచిలో ఉన్న ఆ ఖాతా డబ్బులు తీయడానికి కనీసం ఇంటివరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రామేశ్వరరావుకు ఆన్లైన్ బ్యాంకింగ్ ఏర్పాటు చేసి, ఆ అవకాశం పోగొట్టాడు. జోగయ్య "నీకు సౌకర్యం అంటూ నువ్వు ఇంటికి రాకుండా ఆన్లైన్ బ్యాంకింగ్ ఏర్పాటు చేసా"డన్నాడు. నిజమే. ఈ సౌకర్యాలు మనుషుల మధ్య దూరాలను పెంచాయి. ఆ బ్రాంచి మేనేజర్ తన కొలీగ్ కొడుకు.బ్రాంచికి వెళ్లినపుడల్లా ప్రేమగా పలకరించేవాడు. త్వరగా పని చేసిపెట్టేవాడు. ఇపుడు అదీ కరువైంది. ఆన్ లైన్ లో జీతం అందరిసొమ్మైంది.

"నీకేమైనా జబ్బు వస్తే నీ కొడుకు వైద్యం చేయించేలా లేడు. ఆశ్రమం నియమాల ప్రకారం కొడుకు వచ్చి సొమ్ము చెల్లించక ఆసుపత్రిలో చేర్చరు. నీ కొడుకు నిన్ను తీసికొనిపోయి, ఏదైనా హాస్పిటల్లో వైద్యం చేయించాలి. అది జరుగుతుందని నేననుకోను. పెన్షన్లోమందులకు పోను ఒక్క రూపాయి మిగుల్తులేదు.

అంతా కొడుకు ప్రతినెలా ఐదవ తేదీకే ఊడుస్తున్నాడు. నీ గతేమిటని" జోగయ్య ప్రశ్నించాడు. ఈ మధ్య జోగయ్య రామేశ్వరావుకి మరీ సన్నిహితుడైనాడు. ఇద్దరు అన్నదమ్ముల్లా ఉన్నారు. జోగయ్య సాహిత్యం బాగా చదివినవాడు. అనేక విషయాలు విప్పి చెప్పడంలో, తర్కంలో, కథాకథనంలో దిట్ట.

వీరిద్దరినీ ఆశ్రమంలో రామయ్య–జోగయ్య జంట అని పిలువసాగారు.

"నిజమే. దీని గురించి ఆలోచించలేదు" అన్నాడు రామయ్య.

"సాఫీగా సాగితే జీవితం కాదు. మలుపులు తిప్పేదే జీవితం. ఇక మన జీవితాల్లో ఎక్కువ మలుపులు

లేవు. "తీవ్ర అనారోగ్యం, మరణం" రెండే మలుపులు అన్నాడు జోగయ్య.

"మరణం తరువాత మనకక్కరలేదు. ఆలోపు జీవితానికి వద్ధాప్యంలో తీవ్ర అనారోగ్యమే ఓ గుదిబండ, ఏం చేద్దాం?" అన్నాడు రామయ్యగా మారిన రామేశ్వరరావు. రామయ్యకు లంగ్ కాన్సర్. సూచనలను విజిట్కు వచ్చిన డాక్టర్లు అప్పటికే సూచించారు. ఆ విషయం జోగయ్యకు తెలుసు.

"నీ ఇంటి రిజిస్ట్రేషన్ కాగితాలు ఎక్కడ" అని అడిగాడు సాలోచనగా జోగయ్య.

"అవి ఇంట్లోనే నా వద్ద ఫైల్లో భద్రంగా ఉన్నాయి. ఐనా కొడుక్కి ఇల్లు రాసిచ్చానుగా" అన్నాడు.

"ఫర్వాలేదు. ఈసారి వచ్చే ఆదివారం మీ అబ్బాయి నిన్ను ఇంటికి తీసుకొని వెళ్తానన్నాడుగా మనుమరాలి బర్త్ డేకి. అపుడు తీసుకురా" అన్నాడు జోగయ్య.

"అది తెస్తే వాడికి అనుమానం వేస్తుంది ఎలా?" అన్నాడు.

"నీకు పుస్తకాలు చదువుకోవడానికి కావాలని చెప్పి, కొన్ని పుస్తకాలను అట్టపెట్టెలో సర్ది, ఈ కాగితాలు పుస్తకాలతోబాటు పెట్టుకొని రా" అన్నాడు జోగయ్య.

వచ్చే ఆదివారం రానే వచ్చింది. అనుకోకుండా రామేశ్వరరావుతో జోగయ్య కూడా వారింటికి వెళ్ళాడు. ఫంక్షన్ అయ్యాక ఇద్దరూ వస్తూ ఇంటి కాగితాలు, పుస్తకాల మధ్య

పెట్టిన అట్టపెట్టెతో తెచ్చారు.

"ఏం చేద్దాం ఇపుడు" అడిగాడు తెల్లవారి రోజు రామయ్య.

"ఈ ఆస్తి నీది. కాగితాలు నీ వద్ద ఉన్నాయంటే, ఆస్తి మార్పిడి జరుగలేదు. ఇవి బ్యాంక్లో మార్టిగేజ్ చేసి అప్పు తెచ్చుకో. అది నీ ఖాతాలో వెయ్యి. ఆంధ్రాబ్యాంక్ ఖాతాను ఆన్లైన్ నుండి తీసివేసి ఆఫ్లైన్ చెయ్యి. మార్టిగేజ్ డబ్బు అందులో వేసుకో. ఆ డబ్బు నీవు వెళ్ళితేనే ఇస్తారు. అలా చేద్దాం".

"నాకు ఈ వయసులో అప్పా? ఎలా సాధ్యం?" అడిగాడు రామయ్య.

"అలాగే ఇస్తారు. పైగా నువు డబ్బు కట్టనక్కరలేదు. అప్పు తీరిస్తే ఇల్లు నీది, తీర్చకుంటే ఇల్లు బ్యాంక్.

ఇది వద్దులకో వరం లాంటిది. ఆంధ్రాబ్యాంక్ నుండి మేనేజర్ నీ కొలీగ్ అబ్బాయే కదా! అడుగు" అన్నాడు.

ఇద్దరు ఆటోలో రామయ్య ఇంటి వీధిలోని ఆంధ్రాబ్యాంక్కు వెళ్ళినారు. మేనేజర్ వద్దులకిచ్చే ఇంటిపై మార్టిగేజ్ (కుదువ పెట్టి ఇచ్చే) అప్పుకై సుముఖత వ్యక్తం చేసాడు. కాగితాలు జిరాక్స్ తీసికొన్నాడు.

.....

రామయ్యకు ఇంకా తాను తప్పు చేస్తున్నానేమో అన్న భావన వదలలేదు. కొడుక్కి రాసిచ్చి మళ్లీ ఆ ఇంటి పైనే అప్పు తీసుకోవడం ఎలా అని. ఆ విషయమే జోగయ్యతో చెప్పాడు.

"నీ అత్యవసర చికిత్స కోసం వద్ధాశ్రమ నిర్వాహకులకు ఓ యాభై వేలు కట్టమని నీవు నీ కుమారుణ్ణి అడుగు. నీకు లంగ్ కాన్సర్ అని కొడుక్కు తెల్సిందిగా. ఏం చెప్తాడో విను. ఆపై నిర్ణయించుకో". కాస్త కటువుగానే జోగయ్య సలహా ఇచ్చాడు. రామయ్య జోగయ్యవైపు బేలగా చూసాడు.

తరువాత ఓ నెలకు కొడుకు రావడం మానేసి, ఫోన్ మీదే "ఎలా ఉన్నావు నాన్నా!" అని అడిగాడు. అప్పటికి విజిటింగ్ డాక్టర్ గారు రామేశ్వరరావుకు లంగ్ కాన్సర్ ట్రీట్మెంట్ గూర్చి తొందరగా నిర్ణయం తీసికొమ్మన్నాడు. ఆ విషయం చెప్పాడు. "నాన్నా! ప్రస్తుతం డబ్బు లేదు. మొన్నే రేట్లు పెరుగుతున్నాయని గోల్డు కొన్నాం. ఇంకో రెట్టెల్లాగి చూద్దాం. ఈసారి నీ పెన్షన్ వచ్చిందా? స్కూల్ ఫీజు కట్టాలి. లాగిన్ ఐతే బ్యాంక్ వెబ్సైట్లో ఏదో ప్రాబ్లం చూపిస్తోంది" అన్నాడు. ఆన్లైన్ బ్యాంకింగ్ సౌకర్యం తాను తీసివేయమని

మేనేజర్తో చెప్పింది కొడుక్కు చెప్పలేదు. మేనేజర్ ఆ సౌకర్యం తీసివేసాడేమో అని అనుకున్నాడు. రామేశ్వరరావు మనసు పూర్తిగా విరిగింది. డాక్టర్ విజిట్లోగా జోగయ్యతో బ్యాంక్కి వెళ్ళి లోన్ తీసుకున్నాడు. ఇంటిపై మార్టిగేజ్ అప్పు పెట్టి, కాగితాలు అన్నీ బ్యాంకు సరెండర్ చేసాడు.

ఇపుడు రామేశ్వర్ మనసులో ఎవరూలేరు. తప్పు భావనా లేదు. నా ఆస్తి నా ఆరోగ్యం

కోసం అనే భావన కలిగింది. ఇల్లు తాకట్టు కూడా కొడుక్కు చెప్పలేదు. రిజిస్ట్రేషన్ వరకు తెలుస్తుంది లే అనుకున్నాడు. ఇపుడు వద్ధాశ్రమమే సర్వం ఐంది. జోగయ్యకు మరీ ఆత్మీయుడైనాడు. డాక్టర్తో డబ్బు సిద్ధమని చెప్పాడు.

కొడుక్కు ఆన్లైన్ బ్యాంకింగ్ ఆగిపోయినట్టు, తండ్రి ఆపాదన్న సంగతి తెలిసిపోయింది. పెన్షన్లో మిగులు ఇవ్వబోడని అర్థం అయింది. ఫోన్ చేస్తే లంగ్ కాన్సర్కు డబ్బు అడుగుతాడని భయం వేసింది.

ఫోన్లు ఆగిపొయ్యాయి.

రామేశ్వరరావు కాన్సర్ హాస్పిట్లో చేరాడు. జోగయ్యకు ఏదో జబ్బు వచ్చి గాంధీ హాస్పిటల్లో చేరి ఒంటరిగా మిగిలాడు. ఇద్దరికి రెండే దారులున్నాయి. బతికితే వద్ధాశ్రమం, బతకకుంటే ఈశ్వరుని నిలయం.

కరోనాతో భూమిపై ప్రజలకు బుద్ధి వస్తుందనుకొన్న దేవునికి ఏమీ తోచలేదు. మనుషులు ఎప్పటిలాగే బతికేస్తున్నారు.

చైనా వాడు దురాక్రమణల తర తేతి బతికేస్తున్నా తండ్రి ప్రణాళికల్లో, అమెరికావాడు ఎన్నికల్లో, ప్రపంచం ఎవరి బాధలో వాళ్లున్నారు.

భారత్లో మంత్రులు, అధికారులు, కరోనా విలయం పట్ల హదయం కలచి వేస్తోందని, కన్నీరు తెప్పిస్తోందని, ప్రజాసేవలో నిమగ్నమైనట్లు పత్రికా ప్రకటనలు గుప్పిస్తున్నారు. కర్మ సిద్ధాంతానికి మంచి ప్రచారం వచ్చింది. ప్రజలు అర్ధ ముఖాలతో, అర్ధ జీవితాలతో భయం భయంగా బతుకీడుస్తున్నారు. భయం లేనివారు హాయిగా బతికేస్తున్నారు. కరోనా చిరునవ్వుతో భూగోళమంతా చిందులు వేస్తూనే ఉంది.

**కవిగా, చరిత్రకారుడిగా, వ్యాకరణవేత్తగా, విమర్శకుడిగా, నాటకరంగ కళాకారుడిగా సంగనభట్ల నర్సయ్య సుపరిచితులు. ప్రస్తుతం హైదరాబాద్లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో విజిటింగ్ ప్రొఫెసర్గా పనిచేస్తున్నారు. ఇంతకుముందు సంస్కృత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్గా బాధ్యతలు నిర్వర్తించారు. ఉద్యోగ విరమణ తర్వాత.. తెలుగు అకాడమీలో సబ్జెక్ట్ ఎక్స్పర్ట్గా సేవలు అందించారు. రామోజీ ఫౌండేషన్ కోసం డిక్షనరీ ప్రాజెక్ట్లో కన్సల్టెంట్గా పనిచేశారు. నాటకాలు, అనువాదాలు, జీవిత చరిత్రలు, తెలంగాణ చరిత్రకు సంబంధించిన 20కి పైగా పుస్తకాలను వెలువరించారు. వివిధ ప్రాంతీయ, జాతీయ పత్రికలలో 400కు పైగా వ్యాసాలు రాశారు. నాటక, సాహిత్య రంగాల్లో కృషికి తెలంగాణ ప్రభుత్వం, తెలుగు విశ్వవిద్యాలయం, సీపీ బ్రౌన్ అకాడమీ, రంజనీ కుందుర్తి, నమస్తే తెలంగాణ దినపత్రిక.. మొదలైన సంస్థల నుంచి అనేక అవార్డులు, బహుమానాలు అందుకున్నారు.**

# నాటు పడింది



వివేకానంద రెడ్డి లోమాటి
95819 39039

శంకరయ్య ఈ మధ్య రెండు చేతులా బాగా సంపాదిస్తున్నాడు. బెల్లం చుట్టూ ఈగలన్నెట్టు డబ్బుతో పాటు జనాల రాకడ చిన్నగా మొదలైంది. అప్పులకోసమని వచ్చే పనిబాటలోల్లు, ఎలక్షన్లోస్తే ఇంటి ముందు తచ్చాడే కార్లు, తెల్ల చొక్కాలు నేలమిందున్న మనిషిని కాస్తా గాల్లోకి ఎక్కిస్తున్నాయి. అవన్నీ చూసి చూసి తనకు తెలియకుండా తనే ఒక గొప్ప వ్యక్తిలా, తనకెదురెవరు వస్తార్లే అని ఒక రకమైన కుంచిత స్వభావంలోకి కూరుకుపోతున్నాడు రోజు రోజుకూ. ఎవరూ ఎదురు తిరగనన్ని రోజులూ శంకరయ్య వీరత్వాలు బాగనే సాగినాయి గానీ ఒక దెబ్బ మాత్రం గట్టిగా తగిలింది. ఆ దెబ్బ కొట్టినోడు అతనికంటే బలవంతుడో లేకుంటే ఎక్కువ పలుకుబడున్నోడో అయ్యుంటే పెద్దగా పట్టించుకోకపోవును గానీ ఆమె ఒక ఆడామె కావడంతోనే వచ్చి పడింది చిక్కంతా.

***

మల్లన్నది చిన్న సంసారం. లోకం పోకడ పెద్దగా ఒంటబట్టలేదు మనిషి కూడా బాగా మెతక. నాయన పంచిచ్చిన తాతల కాలం నాటి కొంచెం భూమినే దున్నుకుంటూ, అందుబాటులో ఉన్న భూములు

కౌలుకో, గుత్తకో చేసుకుంటూ రేయింబవళ్లు ఒళ్లు దాచుకోకుండా కష్టపడి ఇద్దరు కూతుర్లకు పెళ్లి చేసినాడు సంవత్సరం అటు ఇటుగా. అంతా అయిన తర్వాత చూస్తే రెండు లక్షలు అప్పు తేలింది. దానికి తోడు కొడుకు చదువు ఉండనే ఉంది. చదువు లేక మంచో చెడో చెప్పే వాళ్లు లేక పొలాల గెట్లమ్మిటి తిరుక్కుంటూ తనెంత ఇబ్బందులు పడింది తెలుసు కాబట్టి కొడుకును మాత్రం బాగా చదివించి ఈ రొంపిలోనుంచి బయటపడెయ్యాలని ఎప్పట్నుంచో ఆశ. ఒంట్లోని చెమట మొత్తం చిందించైనా కష్టపడి పని చేసేంత శక్తి ఉంది గానీ ఆ శ్రమకు తగ్గ భూమే సరిగా లేదు. కౌలుకు గుత్తకు చేస్తూ ఎన్ని రోజులని అనుకుంటాండగా గంగన్న తన ఎకరా భూమి అమ్మాలనుకుంటున్నాడు అనే మాట మల్లన్న చెవినపడింది.ఆలోచనల్లో పడ్డాడు మల్లన్న. ఎకరా ఎనభై వేలు. అది చదును చూసి తయారు చేపించడానికి ఇంకో ఇరవై ముప్పై వేలు అవుతుంది. పొలం మంచి పొలమే కాబట్టి కాలం కలిసొస్తే చేతినిండా పైరు తియ్యొచ్చులే అని కొనుక్కున్నెడు. కొన్నెడే గానీ అది మాన్యం భూములైందాన రిజిస్ట్రేషన్ కాలేదు కానీ పైర పెట్టుకోడానికేం ఇబ్బంది లేదు. అలా గడిచిపోయినింటే ఏ సమస్య ల్యాకుండా అయిపోయినిందును గానీ కాలం ఊరకెక్కడ ఉన్నిస్తుంది.

గొడవంటే పెద్ద గొడవేమీ కాదు గెట్టిగా నాలుగు సెంట్ల నేల. మల్లన్న కొన్న పొలం కింద రెండెకరాల డీకేటి భూమిని శంకరయ్య పట్టా చేపించుకున్నాడు. ఎంత కాదనుకున్నా మల్లన్న తన దాయాదే నాలుగు సెంట్ల నేల పోతే పోయిందిలే లెక్క పెట్టి కొనుక్కున్నాడు నాది డీకేటీ గదా అని శంకరయ్య అనుకుంటే సరిపోవును గానీ నాకు అడ్డమెక్కడ వస్తార్లే అని సర్వేయర్ ద్వారా కొలతలేపిచ్చి నాకు అక్కడిదాంకా వస్తాది మీ ఉద్ది అక్కడికి పెట్టుకోండి అని రాయి పాతించాడు.

మల్లన్న ఒప్పుకోలేదు. ఇప్పుడున్నెది పాత ఉద్ది కదా దాన్ని కదిలిస్తే నా పొలం జేడెలు పడి నాశనమవుతుంది కదా అని ఒప్పుకోలేదు. నువ్వెంతంటే నువ్వెంతని అర్సుకున్నారు. గొడవ పెద్దదైంది. ఈ గొడవ దెబ్బకు మల్లన్న ఒంటరి వాడుగా మిగిలితే తమ్ముళ్ల బలంతో శంకరయ్య మరింత బలవంతుడయ్యాడు. అప్పటి వరకూ శంకరయ్యదే తప్పని మల్లన్న దగ్గర ఊదరగొట్టినోళ్లంతా తీరా గొడవ ముదిరాక ఏమీ తెలీనట్టు మౌనంగా జారుకున్నారు. పెద్ద గెట్టు తవ్వియ్యాలని మర్సటి రోజు మనుషుల్ని పిలుచుకొచ్చాడు శంకరయ్య. ఆయనకు అదనపు బలం అన్నట్టుగా వాళ్ల నాయిన తమ్ముడు ఇంగా కొంతమంది మనుసులు కూడా వచ్చినారు. ఇవతల పక్క మల్లన్న మల్లన్న భార్య సంటెమ్మ మాత్రమే.

తవ్వడం మొదులుపెట్టగానే పొయి ఆపినాడు ఆపినాడు మల్లన్న. 'నా సర్వే నెంబరు ప్రకారం నాకు అక్కడ వరకూ వస్తుంది నువ్వెవరు నన్ను ఆపేదానికని' మల్లన్న మీదకొచ్చాడు శంకరయ్య. 'నీదెట్టైతది..! డీకేటీ భూమిని పట్టా చేపిచ్చుకున్నోడివి నువ్వు

లెక్క పెట్టి కొన్నోన్ని నేను. అదిగాక పాత గెట్టు పోతే పొలం నాశనం అవ్వదో' ఆవేశంగా అన్నాడే గానీ వాళ్ల చుట్టూ ఉన్న జనబలం చూసి లోపల జంకుగానే ఉంది మల్లన్నకి.

'వాటన్నింటితో నాకు పని లేదు. నా సర్వే నెంబరు ఉన్న కాడికి నేను తీసుకుంటా' అని అందరూ నాయనా కొడుకులు చుట్టుకున్నారు. దిక్కు తెలీలేదు మల్లన్నకు. ఆ మాట ఈ మాట అనుకుంటాండగా 'రేయ్ ఏందిరా నీది నా కొడకా' అంటా ముసిలాయన మల్లన్న చెంపమింద కొట్టాడు. ఆ దెబ్బకు అదిరి కింద పడ్డాడు మల్లన్న.

పడినోడు లేచి తిరగబడింటే ఇంకోలా ఉండేదేమో గానీ భయపడి నోటికొచ్చినట్టు గొనుక్కుంటూ గమ్మగయిపొయ్యాడు మల్లన్న.

మొగున్ని తన కళ్ళముందే కొట్టి కిందపడేసేసరికి కోపంతో రగిలిపోయింది సంటెమ్మ. ఒకపక్క మొగుని చేతగాని తనాన్ని తిట్టుకుంటూనే వాళ్లమిందికి నోరు చేసుకునింది.

మట్టి తవ్వుతున్న కూళోల్లను ఆపించింది. ఒక ఆడదాని ముందు వెనక్కి తగ్గితే అవమానం గాదో అని ఆవేశంతో ఊగిపోతున్నాడు శంకరయ్య కూడా. ఆమెను ఏమీ చెయ్యలేక ఆ అక్కసుతో మల్లన్న తన అన్న అనే విషయం కూడా మరిచి మల్లన్న మిందకు కాలి చెప్పుత్తాడు. వెనక్కి తగ్గలేదు సంటెమ్మ. తనూ ఎత్తింది. ఆమె తెగువకు అదిరిపడ్డారు ఆ సంఘటన చూస్తున్న వాళ్లంతా.

పరిస్థితి శృతిమించేట్టుందని గమనించిన పనివాళ్లలో ఒకతను బలవంతంగా ఆపాడు. మనిషి మనిషిలా లేడు శంకరయ్య. ఇంత బతుకూ బతికి ఒక ఆడదాని ముందు వెనక్కి తగ్గాల్నా అని పొయ్యి మీద అన్నం ఉడికినట్టు కుతకుత ఉడికిపోతున్నాడు. 'మీ అంతు చూస్తా పైరు ఎట్ట పెడ్తారో మాన్యం భూమిని రిజిస్ట్రేసన్ ఎట్టా చేపిచ్చుకుంటారో చూస్తా' అని మీసం తిప్పి తొడగొట్టాడు అందరి ముందు. 'నీకిష్టమొచ్చింది చేసుకోపో. నీ కళ్ళముందే పైరు పెడ్తా సూచ్చాండు' అంతే పౌరుషంగా సవాలు చేసింది సంటెమ్మ. ఆ క్షణం ఆమె ఒక సాధారణ ఆడ మనిషిలా కనిపించడంలేదు. సమస్త మొఘల్ సైన్యాన్ని, సింహాసనాన్ని ఎదిరించి కదనానికి కాలు దువ్విన రుద్రమ్మలా రౌద్రంగా మారిపోయింది. ఈమేనా ఇన్ని రోజులు మనం చూసిన సంటెమ్మ అనిపిస్తోంది అక్కడి వాళ్లకి.

***

రోజులు గడుస్తున్నాయి. ఇప్పుడు పొలం అనే దానికంటే పరువు సమస్య అయి కూర్చుంది. ఎక్కడ తిరుగుతున్నా ఏం చేస్తున్నా సంటెమ్మ చేసిన సవాలే గుర్తొస్తోంది శంకరయ్యకు. ఇంత పలుకుబడుంది రాజకీయముంది ఒక్క ఆడదాని దగ్గర జంకాల్నా అని ఒకపక్క మనసు తొలుస్తోంది. ఎన్నెన్నో కుట్రలు మనసులో మొలకెత్తుతున్నాయి. ఎమ్మార్వో ఆఫీసులో విచారిస్తే 'డీకేటీ భూముల్లో మేము తలదూర్చలేము వేరే దారిలో చూడు అదీ గాక నాలుగైదు సెంట్ల నేల కోసం ఎందుకుపో అంత గొడవ' అన్నారు. ఆ

మాటలు రుచించలేదు శంకరయ్యకు.

నేరుగా పోలీస్ స్టేషనుకు వెళ్లాడు. విషయం చెప్తే సివిల్ కేసుల్లో మేం నేరుగా రాకూడదు అన్నాడు ఎస్సై. ఏం చెయ్యాలో అర్థం కాలేదు శంకరయ్యకు. అయినా ఆశ తీరక 'సరే అయితే కేసులు గీసులు ఏమొద్దు గానీ ఊరికే అలా వచ్చి బెదిరిచ్చిపోండి సాలు' అన్నాడు పళ్లిగిలిస్తూ. సరే అని ఇద్దరు కానిస్టేబుళ్లను పిలిపించి 'ఆ శంకరయ్య విషయం ఒక్కరవ్వ చూసిరాపోండి' ఆర్డర్ వేశాడు ఎస్సై. సాయంత్రం పది వెయ్యి రూపాయల నోట్లు వచ్చి చేరాయి ఆ ఎస్సై పర్సులోకి.

***

'మల్లన్నంటే నువ్వేనారా?' దబాయించాడు పోలీసు. 'నేనే సార్' చేతులు కట్టుకోని భయపడ్తా భయపడ్తా చెప్పాడు మల్లన్న. 'ఏంటీ పొలం దగ్గర రౌడీయిజం చేస్తున్నావంట' అన్నాడు. 'నేనేం దౌర్జన్యం సార్. డీకేటీ భూములు రాపిచ్చుకోని మామిందికొచ్చి వాళ్లే చేస్తున్నారు' 'చ్చా ముయ్ నోరు. పద పొలం దగ్గరికి నీ చూద్దాం నీ యవ్వారమేంటో' అని బండ్లో ఎక్కించుకునిపొయ్యారు ఇద్దరు కానిస్టేబుల్లు.

పొలం దగ్గరికి వెళ్లి చూసి 'రేయ్ మీ పొలం మీరుండకుండా ఆయన పొలంతో మీకేం పనిరా. మర్యాదగా ఉండకపోతే జైల్లో తన్నులు తింటావు కొడకా నువ్వు' గద్దించగానే వణికిపొయ్యాడు మల్లన్న. ఏమంటే ఏమవుతుందో అని భయంగా చేతులు కట్టుకుని నిలబడ్డాడు. పొలం దగ్గర పోలీసులు ఉండే సరికి ఏమైందా ఏమా అని బర్రెలు అక్కడ బీట్లో తోలి అక్కడికి వచ్చింది సంటెమ్మ. ఆమెను చూసి 'నువ్వేనామ్మా సంటెమ్మంటే' అడిగాడు పోలీసు. అవునన్నెట్టు తలూపింది సంటెమ్మ. 'ఏమ్మో.. నీకు నోరు పెద్దదంట. మొగోళ్లని కూడా లెక్క చెయ్యవంట. ఒక్కరవ్వ తగ్గిచ్చుకో. పెద్దోళ్లతో యవ్వారాలు గాదు' మెత్తగా బెదిరిస్తున్నట్టుగా అన్నాడు. 'వాళ్లాడిన ఆటలన్నీ చూస్తూ మేం గమ్మున కూర్చోవాల్నా' మాటల్లో బెరుకనేది లేకుండా చెప్పింది.

ఆమె మాటల్లో కనపడుతున్న స్థిర చిత్తానికి అదిరిపడ్డాడు ఆ పోలీసు కానిస్టేబుల్. 'ఎవర్తో మాట్లాడ్తాండావో గుర్తుపెట్టుకోమ్మో సంటెమ్మా. నీకు నీ కుటుంబానికి మంచిది' అన్నాడు. 'దౌర్జన్యం చేసేవాళ్లనేం ఏమనలేక మా దగ్గరికి వచ్చి బెదిరిస్తున్నారు. ఇదేం పద్ధతి సార్' అన్నది.

'అన్ని అతి మాటల్తో నీకు పనిలేదు. ఎస్సై సారు చెప్పాడు చేలో పైరు పెట్టాగాకండీ' అన్నాడు. ఆ మాటలు సంటెమ్మను భయపెట్టకపోగా మరింత బలంగా తయారుచేశాయి. అదే అన్నది 'పైరు పెట్టేది పెట్టడమే. ఎవరొచ్చి ఆపుతారో నేనూ చూస్తా' అన్నది.

***

నారు ఎదిగి వరి మడికి బురదపెట్టేసరికి దాదాపూ నెల గడిచింది. ఇంకో పక్క ఎలాగైనా

పైరు పెట్టకుండా ఆపాలని సతపోరాడుతున్నాడు శంకరయ్య. ఈ నెల రోజుల్లో పోలీసులొచ్చారు, వీఆర్వోలొచ్చారు రాజకీయల్లో తిరిగే పెద్దమనుషులొచ్చారు ఎవరెన్ని చెప్పినా మల్లన్న దగ్గర ఆగిపోతున్నాయి గానీ సంటెమ్మ దగ్గర నిలబడ్డంలేదు. 'ఏం పొయ్యేకాలమో ఆ నా కొడుకు దీన్నే పట్టుకుని ఊగుతున్నాడు ఈసారికి పైరు వద్దులేయే. చాలిద్దాం' పోలీసులంటే ఉన్నె భయంతో అన్యాడు మల్లన్న.

'ఏం పొడుచ్చురా వాళ్లంతా వచ్చి. నీకంత భయమైతే పొలం దగ్గరికి కూడా రాకుండా ఇంట్లోనే కూర్చో. నేనే నాటిచ్చా' మొగునిలోని భయాన్ని కసురుకున్నెది సంటెమ్మ. ఆమెకంత మొండి ధైర్యం పట్టుదల ఎక్కన్నుంచి వచ్చినాయో అర్థం కాలేదు మల్లన్నకు. నారు నాటడానికి కూళోల్లను పిలిస్తే గొడవ గురించి తెలిసి ఊర్లో ఎవ్వరూ రాలేదు. ఎక్కువ డబ్బులిచ్చి వేరే ఊరోళ్లను గుత్తకు మాట్లాడింది. 'సరేమ్మా మొన్నాడొచ్చి నాటి పోతము మధ్యాహ్నానికి అన్నం చేసిపెట్టు సాలు' అన్నారు కూళోల్లు.

***

పొద్దున ఎనిమిది గంటలకల్లా పన్నెండు మంది కూళోల్లు వచ్చారు. నారుమడి చూపించి ఎకరాకు సరేపోయేమాయిన నారు పీకమని చెప్పింది. ఇంగోపక్క శంకరయ్య భార్య వీళ్లు చేసే ప్రతిపనినీ దూరం నుంచి కనిపెట్టుకోని చూస్తోంది. ఇంక కొద్దిసేపట్లో నారు పీకడం అయిపోతుంది అనంగా ఆ సమాచారం మొగునికి చేరవేసింది ఆమె. ఇలా జరుగుతుంది ముందే గ్రహించాడోమో పోలీసుల్ను పిలిపించాడు శంకరయ్య. పీకిన నారు కట్టలన్నింటినీ బాయి దగ్గన్నుంచి గంపలో పెట్టుకుని బురద మడి దగ్గరికి మోస్తున్నాడు మల్లన్న.

పోలీసులు వచ్చీ రాగానే 'రేయ్ పైరు పెట్టాకండి అని ఒక్కసారి చెప్తే అర్థంగాలేదా నీకు. రా స్టేషన్ కు ఎస్సు సారు పిలుచ్చాండు' అన్నాడు పోలీసు. ఆ మాటనంగానే భయపడ్డ మల్లన్న భయపడి జీపు ఎక్కడానికి పోతుంటే మొగున్ని ఆగమనింది సంటెమ్మ. పోలీసు దగ్గరికి వెళ్లి 'ఎందుకు రావాల స్టేషనుకు?' అడిగింది. 'ఎందుకో తెలీదో.. ' వెటకారంగా సమాధానమిచ్చాడు అతడు.

తమ తప్పు లేనప్పుడు ఎందుకు భయపడ్డం అనే తత్వం సంటెమ్మది. మేమంటే లెక్కలేదా నీకు అనే పంతం పోలీసులది. మాటా మాటా పెరిగింది. 'తీసకపొయ్యేది తీసకపొయ్యేదే. మీరు నాటాకాండి ఇంటికి పోండి' అని కూళోల్లను బెదిరిచ్చి మల్లన్నను జీబులో ఎక్కించుకుని సక్కా పొయినారు వాళ్లు. ఏం చెయ్యాలో దిక్కు తెలీలేదు సంటెమ్మకి. యట్ట తిరిగీ నాటియ్యాల. పొద్దు చూస్తే అప్పటికే టైం పదకొండు కావొస్తోంది. ఏం చేద్దామని కూళోల్లను అడిగితే 'నీ ఇష్టమమ్మా నాటుకు వరి ఎదిగిచ్చా అంటే నాటిపోతాము' అన్నెరు వాళ్లు. అప్పటికప్పుడు పరుగు పరుగున ఊళ్లోకొచ్చి నారు

మోపీడానికని ఒకరిద్దర్ని పిలిస్తే మాకెందుకులే లేనిపోని గొడవలనుకున్నెరేమో ఎవ్వరూ రాలేదు.

మరోపక్క నాటు ఆపేడానికి లేదు గెట్టిగా తీర్మాణించుకుని కోక రొండికి చెక్కుకుని నారు వేసుకోవడానికి గోతం సంచి తీసుకుని బయల్దేరబోతుంటే 'ఆడ కూతురివి బురద గెనాలమ్మిటి అంత దూరం నుంచి యాడ మోసకొస్తవుమ్మా' అన్నారు ఆమె పరిస్థితి చూసి జాలిగా. 'నా గురించి వదిలెయ్యండి మీరు మొదలు పెట్టండి. మీకు నారు ఎదిగిచ్చే బాధ్యత నాది' అని చెప్పి నారమడి వైపు కదిలింది. పొద్దున లేచి తాగిన కొన్ని కాపీ నీళ్లు తప్ప కడుపులోకి ఏం పోలేదు. పళ్లు కూడా తోమింది లేదు. కడుపులో తిప్పినట్టుంది.

దానికి తోడు పన్నెండు మంది నాడ్తాంటే ఒక్క మనిషి నారు ఎదిగియ్యాలంటే సావుజంపలైతాంది. కానీ తప్పదు. ఎందుకొచ్చిన తంటా నిదానంగా నాటుకోవచ్చులే అనుకున్న ప్రతిసారీ గతమంతా కళ్ళముందు కదలాడుతోంది. తమని ఒంటరి చేసి వాళ్లంతా ఆటలాడ్డం, మొగున్ని కొట్టడం, స్టేషను మొహం ఎరుగని భర్తను జీపులో ఎక్కించుకుపోవడం మరీ ముఖ్యంగా 'మీ అంతు చూస్తా' అని పొగరుబట్టి శంకరయ్యకొట్టిన తొడ తాలూకు శబ్ధం ఇంకా చెవులు దాటి పోలేదు. అన్నీ ఒక్కకొక్కటే మరింత శక్తినిస్తున్నాయి.

ఆ ఊపులో పరుగు పరుగున పోవడం ఒక్కటే అరవై డెబ్బై నారు కట్టలు సంచిలో కుక్కడం భుజానికెత్తుకుని ఆ బురదగెనాలమ్మిటి జారకుండా అర్థ కిలోమీటరు మాయిన నడవడం. అదొక యజ్ఞంలా సాగిపోతోంది. 'ఇదెక్కడి రాక్షసిరా నాయనా' అనుకుంటున్నారు ఆమె పంతం చూసేవాళ్లు. శంకరయ్యకైతే మొహంలే నెత్తురు చుక్క అనేదే లేదు. మధ్యాహ్నం సంగేటేల దాటింది. అన్నం చేసే వాళ్లెవురుండారు. ఎవ్వరూ లేరు ఇంటి దగ్గర. అన్నం లేకుంటే కూళోళ్లు బురదలో ఎక్కువ సేపు పని చెయ్యలేరు. యట్టరా భగమంతుడా అనుకుంటూ 'ఓబ్బీబ్బీ అంగడికాడికిపొయి అన్నం పార్సల్లు తెచ్చువా' బంగప్పడింది పక్క కయ్య వెంకట్రామున్ని. 'సరేత్తా' అని పొయి తెచ్చిచ్చాడు. ఆమె పడ్తున్న నరకయాతనకు మనసు కరిగిందేమో 'నువ్వు అన్నం తిని రాపోత్తా నారు నేను మోపిచ్చా' అని రెండు మూడు మూటెలు మోపిచ్చినాడు. అయినా గాని తిన్లేదు సంటెమ్మ. నారెదిగయ్యాల నారెదిగియ్యాలని ఖాళీ కడుపున అట్నే తిరిగుతాంది.

మొగున్ని పోలీసులు తీసుకపొయ్యారే అనే దిగులొకపక్క, ముందల్లా అవీ ఇవీ బాగా మట్లాడ్తారు ఇలా ఇరుకూ ఇబ్బందైనప్పుడు మాత్రం ఒక్కరూ తోడురాని ఈ పల్లె జనాలమింద ఒక రకమైన విరక్తి భావం మరోపక్క పొద్దటాంచి ఏమీ తినందాన కడుపులో తిప్పుతున్నా కూడా అట్నే తిరిగింది కసిగా. తొందర తొందరగా నడ్సడం వల్ల బురద గెనాలమ్మిటి నడుచ్చా ఒకసారి కిందకూడా పడింది. అయినా ఆమె పయణం ఆగలేదు.

ఉదయం మొదలైన వరి నాటు అనే యజ్ఞాన్ని ఎంతమంది రాక్షసులు అడ్డుకున్నా అంతులేని ఆత్మస్థైర్యంతో తనే దగ్గరుండి పూర్తి చేయించింది సంటెమ్మ. అప్పటికి ఎండ గుఱ్రాలను తోలి తోలి అలసిన సూర్యుడు పడమటి కొండల్లోకి దిగుపోవడానికి సిద్ధంగా ఉన్నాడు. గెట్టుమింద చూడగానే పచ్చని గాలికి నవ్వుతూ కదలాడాయి అప్పుడే పడిన నాట్లు. వాటిని చూసి ఒక మహా సామ్రాజ్యాన్ని ఒంటి చేత్తో జయించిన వీర సైనికుని మందహాసంలా చిక్కటి చిరు నవ్వు ఒకటి విరిసింది సంటెమ్మ మొహం మింద.

(సమాప్తం)

**వివేకానంద రెడ్డి లోమాటి వివేకానంద రెడ్డి లోమాటి స్వస్థలం కడప జిల్లా బద్వేల్ మండలం నందిపల్లె గ్రామం. తల్లిదండ్రులు సత్య నారాయణమ్మ, బాలవీరారెడ్డి. బీటెక్ (మెకానికల్ ఇంజినీరింగ్) చదివారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. పుస్తకాలు చదవడం, ట్రెక్కింగ్ అంటే విపరీతమైన ఆసక్తి. ఆ అనుభవాలనే.. 'వివేక్ లంకమల' కలంపేరుతో కథలుగా మలుస్తున్నారు. పుట్టి పెరిగిందంతా పల్లెటూళ్లోనే. అందుకే.. ఈయన రచనల్లో కుటుంబం, వ్యవసాయం, పశువులు, అడవి నేపథ్యాలుగా కనిపిస్తాయి. కరువు సీమ, ఓబుల్రెడ్డి ఎద్దులు, యామయ్య గుఱ్రం కథలు పాఠకుల మెప్పు పొందాయి. తొంభైల కాలంనాటి పల్లెటూరి ప్రేమ కథ నేపథ్యంలో తీసిన 'అరణ్యావాసం' సినిమాకు కథ, కథనం, మాటలు అందించారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ పూర్తయి, పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మన చుట్టూ ఉన్న సమాజాన్ని, మనం చూసిన సంస్కృతిని అక్షరబద్ధం చేసి.. తర్వాతి తరాలకు కానుకగా అందించడమే కథ, నవల అంతిమ లక్ష్యమని వివేకానంద రెడ్డి విశ్వాసం.**

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 25



హైమావతికలివె
8333983542

# బతుకు బొమ్మ

''ఒకసారి ఆలోచించు కీర్తి ! ఇంకో పది రోజుల్లో శ్రీజకు ఐదేళ్లు నిండుతాయి. ఇంకా ఆలస్యం చెయ్యకు. దానికి తోడుగా చెల్లెలో, తమ్ముడో వుంటే ఆడుకుంటుంది కదా. పెద్దయ్యాక కష్ట సుఖాల్లో తోడబుట్టిన వాళ్ళు తోడుగా వుంటారు.... ఇంకా ఏదో చెప్పబోతున్న తల్లి సుశీల మాటల్ని మధ్యలోనే అడ్డుకుంది కీర్తి.

అమ్మా ! ఎప్పుడూ ఈ టాపిక్ తప్ప ఇంకోటి మాట్లాడవా ? నీకు చాలా సార్లు చెప్పాను. శ్రీజకు మేము ఏ విషయంలోను తక్కువ చెయ్యడం లేదు. మంచి స్కూల్ లో చదివిస్తున్నాము. చాలా మంచి బొమ్మలు కొనిస్తున్నాము. మంచి ఏక్టివిటీ వున్న క్లాసుల్లో చేర్పిస్తున్నాము. అంతకంటే ఏమి కావాలి ? హాయిగా, సంతోషంగా వుంది. ఇంకోళ్ళుంటే తలనొప్పే. నర్సరీ క్లాసులో చేర్పించాలంటే ఒకటిన్నర లక్ష తీసుకుంటున్నారు,

అదీ కాస్త డీసెంట్ గా వుండే స్కూల్లో చేర్పిస్తే. ఉన్న ఒక్కరిని సక్రమంగా పెంచితే చాలు. తోబుట్టువులు సాయం చేస్తారనే ఆశలు పెట్టుకోకు. మీలాగా ఇప్పటి వాళ్ళు లేరు. కొట్టుకు ఛస్తున్నారు చిరాగ్గా అంది కీర్తి.

ఈ బీదరుపులు ఎందుకే ? ఇద్దరూ సాఫ్ట్ వేర్ ఇంజనీర్లుగా వున్నారు. ఆమాత్రం ఇంకో బిడ్డను పెంచలేరా ? మరీ విచిత్రం. తోడుగా ఇంకో బిడ్డ వుంటే పిల్లలు సంతోషంగా వుంటారు. ఎంత కొట్టుకున్నా ఒకరి మీద మరొకరికి ప్రేమ వుంటుంది. ఆ విషయం మర్చిపోకు. రెండో బిడ్డ విలువ వాళ్ళు పుట్టాక తెలుస్తుంది. నీకు అనవసరమైన ఆలోచనలు ఎక్కువయ్యాయి. ఇంకా ఆలస్యం చేయకండి..... కాస్త కోపంగా అంది సుశీల.

అమ్మా ! ఈ విషయం గురించి ఇంక మాట్లాడకు. నాకు చిరాకేస్తోంది. నీ కన్నా మా అత్తగారు ఎంతో నయం. ఒకసారి చెప్పారు. మా ఇద్దరి అభిప్రాయాలు చెప్పేశాము. ఆ తర్వాత ఆవిడ, మామగారు ఈ విషయంగా మాట్లాడ లేదు. నువ్వే సుత్తి కొడుతున్నావు. చిరాగ్గా అంటూ, శ్రీజ బర్త్ డేకి రెండ్రోజుల ముందే రండి... నాకు కాల్ టైమ్ అయ్యింది. వస్తా .... అంది కీర్తి.

సరే. అలాగే వస్తాము.... అంది సుశీల. ఇప్పుడు తృప్తిగా వుందా? అంటున్న భర్త మాటలకు తలెత్తి అతని వైపు చూసింది. ఏ మ ం టు నా ్న రు ? అర్థమయ్యేట్లు చెప్పండి.... అంది. మీ తల్లీ కూతుళ్ళ సంభాషణ వినబడుతూనే వుంది. అన్నిసార్లు నీ కూతురికి చెప్పి సుత్తి కొట్టొద్దు అనిపించుకోవడం బాగుందా ? ఇప్పుడు వాళ్ళు పెద్ద వాళ్ళయ్యారు. వాళ్ళ విషయంలో దూరి మాట్లాడితే బాగుండదు. మనకెందుకు ఈ విషయాలు. హాయిగా, ప్రశాంతంగా వుండాల్సిన వయసు మనది... అన్నాడు మాధవరావు. మీరలా అనుకుంటారు గానీ నేను అనుకోను. మన పిల్లలకు మంచి, చెడు చెప్పాల్సిన వాళ్ళం మనమే. వేరే వాళ్ళు చెప్పలేరు. సాధ్యమైనంత వరకు మనం నచ్చ జెప్పే ప్రయత్నం చెయ్యాలి. అది మన బాధ్యత... అంది సుశీల. అయితే చెప్పి వాళ్ళ చేత తిట్టించుకో. నేను మాత్రం చెప్పను.... అన్నాడు మాధవరావు.

అలాగే. పిల్లలకు మనం చెబితే బాగుండదు అని పరాయివాళ్ళలా నేను వుండలేను. సాధ్యమైనంత వరకు ప్రయత్నిస్తాను. 'పెదవికి మించిన పన్ను' అని తెలిసిన తర్వాత వూరుకుంటాను. తల్లిగా నేను కొన్ని విషయాలు చెప్పక తప్పదు.... అంటూ అక్కడి నుండి వెళ్ళి పోయింది సుశీల. 'తల్లులకు తాపత్రయం ఎక్కువ' .... అనుకుంటూ టీవీలో మొదలైన క్రికెట్ మేచ్ చూడసాగాడు మాధవరావు.

****

కరోనా ఉధృతం తగ్గడం వల్ల, ఒకే వూరు కావడం వల్ల చాలా నెలల తర్వాత కూతురి ఇంటికి వెళ్ళారు సుశీల, మాధవరావు. తనను చూడగానే సంబరంగా ఎదురొచ్చి, సంతోషంగా కౌగలించుకున్న కూతురిని చూడగానే సుశీలకు కంటనీరు తిరిగింది. ఎన్నాళ్ళయింది సుశీలా నిన్ను చూసి... అంటూ కౌగలించుకున్న తన స్నేహితురాలు, వియ్యపురాలు అయిన ఇందిరను చూసి సంతోషంతో ఉప్పొంగింది సుశీల మనసు. కరోనా వల్ల ఆత్మీయులకు దూరంగా వుండాల్సి వచ్చినందుకు నొచ్చుకుంటూ అందరూ ఆ విషయాల గురించే మాట్లాడుకున్నారు.

ఎన్నో రోజుల తర్వాత అమ్మమ్మను, తాతయ్యను చూసిన శ్రీజ వాళ్ళ దగ్గరే కూర్చుని ఆడుకోసాగింది. మర్నాడు జరగబోయే తన బర్త్ డే గురించి అందరికీ చెబుతూ సంబరంగా తిరిగింది.

శ్రీజ కోసం ఆన్ లైన్ లో బొమ్మ తెప్పిస్తానని అన్నావు. తెప్పించావా ? ఆత్రుతగా అడిగింది సుశీల. తెప్పించానమ్మా. అదే సెలెక్ట్ చేసుకుంది. విడియోలో చూసి ఆ బొమ్మ కావాలంది. అందుకనే దాన్ని తెప్పించాను. మీ గిఫ్ట్ అని చెప్పాను. రేపు రాత్రి వరకు శ్రీజకు చూపించను. సర్ ప్రైజ్ .అమెజాన్ లో వచ్చింది... అంది కీర్తి. పోనీలే దానికి నచ్చింది. సంతోషం. మాకు ఇవన్నీ తెలియవు. అందుకే నీకు చెప్పాను తెప్పించమని... అంది సుశీల. బయట ప్రపంచంతో సంబంధం లేకపోయే సరికి ఆన్ లైన్ వాళ్ళ పంట పండింది... అంది ఇందిర. నిజమే ఇందూ ! బైటికి వెళ్లాలంటే భయపడే పరిస్థితి కాబట్టే ఒకే వూర్లో వున్నా ఆరు నెలల తర్వాత మీ ఇంటికొచ్చాను. ఎంత భయంకరమైన పరిస్థితో చూడు అంది సుశీల.

మా మాధురి వాళ్ళు పక్క బిల్డింగ్ లో వుండే ఫ్లాట్ లో చేరడం వలన నాకు అంత ఇబ్బంది కలగలేదు. లేకపోతే నీలాగే బాధ పడే దాన్నేమో... అంది ఇందిర. నిజం. మాధురి కూతురు పూజి, శ్రీజ ఒకే వయస్సు కాబట్టి ఇద్దరు కలిసి ఆడుకునే వాళ్ళు. లేకపోతే శ్రీజ సతాయించేది.. అంది కీర్తి. చాలా రోజుల తర్వాత కలిసిన సుశీల, ఇందిర కాలేజీ రోజుల నుండి మనవల పుట్టుక వరకు ఎన్నో సందర్భాలలో తాము కలిసి, ఆనందించిన మధురమైన ఘట్టాలను జ్ఞప్తికి తెచ్చుకుంటూ కబుర్లు చెప్పుకున్నారు.

***

కోవిడ ప్రభావం తగ్గినా, అయిదారు మంది పిల్లలను మాత్రమే శ్రీజ పుట్టిన రోజు వేడుకకు పిలిచింది కీర్తి. పిల్లల కేరింతల మధ్య, ఆటల మధ్య ఆనాటి సాయంత్రం సందడిగా గడిచింది. శ్రీజ తమకు ఇచ్చిన బహుమతులను తీసుకుని పిల్లలు వెళ్ళిపోయారు. తమ పేర్లతో వున్న బహుమతులను శ్రీజకు అండ జేశారు ఇందిర, సుశీల దంపతులు.

తల్లి సహాయంతో ఆ గిఫ్ట్ బాక్స్ లను తీసి బొమ్మలను చూసిన శ్రీజ కళ్ళు సంతోషంతో మెరిసాయి. అధునాతనమైన వంట ఇంటి సామాను, ముద్దుగా వున్న ఆడపిల్ల బొమ్మ తెగ నచ్చేసి వాటితో ఆడటం మొదలు పెట్టింది శ్రీజ. అమ్మమ్మా ! ఈ బొమ్మ పేరు 'లైవ్ డాల్' . ఇది నీళ్ళు తాగుతుంది తెలుసా.. అంది

అందరూ ఆసక్తిగా ఆ బొమ్మ వైపు చూశారు. ముద్దుగా వున్న ఆ విదేశీ బొమ్మ నోరు కాస్త తెరిచినట్లుగా వుంది. చిన్న గ్లాస్ లో చిన్న చెంచా తీసుకొచ్చి ఆ బొమ్మ నోట్లో పోసింది. ఆ నీళ్ళు బొమ్మ గొంతులోకి వెళ్ళిపోయాయి. శ్రీజ సంబరంగా అమ్మమ్మ వైపు చూసింది. చూశావా ? బొమ్మ నీళ్ళు తాగేసింది.. అంది. అందరికీ చూసేందుకు సరదాగా అనిపించింది. ఆసక్తిగా చూడసాగారు.

శ్రీజ బొమ్మ ఫ్రాక్ ను పైకి జరిపి తడిసిన డైపర్ ను, బొమ్మను చూపించింది. చూశావా ! బామ్మా ! బొమ్మ నీళ్ళు తాగింది కదా ! ఇప్పుడు 'సు సు' పోయింది. అంటూ బొమ్మకు డైపర్ ను మార్చి ఇంకో డైపర్ ను వేసింది. అందరు పెద్దగా నవ్వారు. ఈ బొమ్మ నీళ్ళు తాగుతుంది. సు సు పోతుంది. అందుకే దీన్ని 'లైవ్ డాల్' అంటారు అంటూ తనకు చేతనైన భాషలో చెప్పింది శ్రీజ. సుశీల, ఇందిర ఒకరినొకరు చూసి నవ్వుకున్నారు. నీళ్ళు తాగడం, సు సు పోవడం తప్ప ఈ బొమ్మ ఇంకే పని చెయ్యదా ? ఇదేనా లైవ్ డాల్ ? గొంతు తగ్గించి మెల్లగా ఇందిరతో అంది సుశీల.

ఇద్దరికీ నవ్వాగ లేదు. అయినా ఇదెక్కడి ఖర్మే. చిన్న పిల్లలు హాయిగా ఆడుకోకుండా నీళ్ళు తాగించడం, పొత్తి గుడ్డలు మార్చడం .... ఇదేమి ఆట. పెద్దయ్యాక తప్పదు. ఇంత చిన్న వయసులో కూడా ఇదే ఆటా ...నవ్వుతూనే చిరాకు పడింది సుశీల. ఇద్దరు గొంతు తగ్గించి మాట్లాడుకున్నారు.

కీర్తికి అర్థమై నవ్వుకుంది. ఏం చెయ్యనమ్మా ? ఈ బొమ్మ కావాలని గోల. అందుకనే తెప్పించాను .. అంది. ఈ బొమ్మ వెల ఎంత ? అంది సుశీల. మూడు వేలా అయిదొందలు.. అంది కీర్తి. మూడు వేలా అయిదొందలా ? ఆశ్చర్యంగా అడిగింది సుశీల. అవునమ్మా .. అంది కీర్తి. సుశీలకు ఆ విషయం మింగుడు పడలేదు. డైపర్లు మారుస్తున్న మనవరాలిని చూస్తుంటే ఏమనాలో అర్థం కాలేదు. ఆ డైపర్లు కూడా టిష్యూ పేపర్లతో చేసినట్లు వున్నాయి. పడెయ్యాక తప్పదు. అలాంటివి ఆరో ఏడో ఇచ్చారు. గంట లోపల ఖాళీ అయిపోతాయి. ఫారెన్ బొమ్మలు అబ్బో అనుకుంటాము. ఎంత దోపిడీ!. పోనీ గొప్పగా వుంటే పర్వాలేదు. ఆ బొమ్మ కూడా చూసేందుకు అంత గొప్పగా లేదు. బొమ్మలో పైనుండి కింది వరకు గొట్టం పెట్టి ఎంత దోపిడీ చేసారు ! ఎంత దండగ ! రెండ్రోజులు ఆడాక పిల్లలు ఒక పక్కన పడేస్తారు....

సుశీల మాటలు విని ఇందిర నవ్వాపుకోలేక అవస్థ పడింది. కాసేపటికి ఇద్దరూ

కుదుట పడ్డారు. పోనీలే ... పిల్ల ఇష్ట పడి ఆడుకుంటుంది... అని సర్దుకున్నారు. తనతో బాటు ఆ బొమ్మతో ఆడుకునేందుకు తన వెంట తిరుగుతున్న పూజీకి బొమ్మను ఇవ్వకుండా శ్రీజ కోప్పడటం సుశీల దృష్టిలో పడింది. అలా చెయ్యకూడదు శ్రీజా ! పూజీతో కలసి ఆడుకోవాలి అంటూ నచ్చజెప్పింది.

***

మాధురి ఆహ్వానం మేరకు మాధవరావు, సుశీల వాళ్ళ ఇంటికి వెళ్లారు. ఇందిర సుశీలతో బాటు వెళ్ళింది. భోజనాలయ్యాక అందరూ కబుర్లలో పడ్డారు. పూజీ ! అన్నం తినిందా ? అంటున్న ఇందిరతో లేదమ్మా. అది రెండు రోజులుగా సరిగా తినడం లేదు. పేచీ పెడుతోంది. శ్రీజకు కొనిచ్చిన లైవ్ డాల్ కావాలని గొడవ. శ్రీజ కూడా చిన్న పిల్ల కదా. దాని బొమ్మ అది ఆడుకోవడానికి ఇవ్వదు. ఇది కూడా అలాగే చేస్తుంది. కొనిస్తాను అంటే వినదు. అర్జెంట్ గా కావాలంటుంది. ఆ బొమ్మ కొనడం వేస్ట్ అని అందరూ అంటుంటే నిజమే అనిపిస్తోంది. కానీ ఇవన్నీ పిల్లలకు అర్థం కావు. ఆ బొమ్మ కావాలని ఏడుపు. పిల్లలు అడగ్గానే కొనిస్తూ వుంటే అదే అలవాటై పోతుందని భయంగా వుంటుంది. అందుకే నేను ఆ బొమ్మ కోసం ఆర్డర్ చేయలేదు.. అంది మాధురి. ఇంతలో నెలల పాపాయిగా వున్న చిన్న కూతురు కావ్య ఏడవడంతో పాపను సముదాయించ సాగింది. ఇందిర, సుశీల పూజీని మాట్లాడించే ప్రయత్నం చేశారు.పూజీ పెద్దగా ఏడుస్తూ అమ్మమ్మా ! అంటూ ఇందిర ఒళ్ళో వాలింది. వెక్కిళ్ళ మధ్య 'లైవ్ డాల్' కావాలని చెప్పింది. ఇందిరకు ఎలా సముదాయించాలో అర్థం కాలేదు. చూడు పూజీ ! బొమ్మ కోసం ఇలా ఏడుస్తారా ? నీ దగ్గర ఎన్నో బొమ్మలున్నాయి. ఇవే బాగున్నాయి. అమ్మ, నాన్న ఎన్నో మంచి బొమ్మలు నీకు కొనిచ్చారు కదా. ఆ లైవ్ డాల్ బొమ్మ బాగా లేదు... అంది.

లేదు అమ్మమ్మా. చాలా బాగుంది. నేను కొనుక్కుంటా... అంది ఏడుస్తూ. జానకి సుశీల వైపు చూసింది. వినే స్థితిలో లేదు... మెల్లగా సుశీలకు మాత్రమే వినబడేటట్లు అంది. సుశీల పూజీ చెయ్యి పట్టుకుని ముద్దు పెట్టుకుంది. పూజీ ! శ్రీజ లైవ్ డాల్ నిజంగా బాగా లేదు. ఆ బొమ్మ నీళ్ళు తాగుతోందని అనుకుంటున్నావా ? అది నిజంగా తాగదు. దాని గొంతులో ట్యూబ్ లాగా పెట్టారు. మనం నీళ్ళు పోస్తే అవి ట్యూబ్ లోకి వెళ్తాయి. కిందకు వస్తాయి. అది సు సు అనుకుని డైపర్ మారుస్తోంది శ్రీజ... అంది.

పూజీ సుశీల వైపు చూసింది. నిజమా ? .. అంది. అవును పూజీ ! అది నిజం. ఆ బొమ్మ నవ్వుతుందా? సుశీల అడిగిన ప్రశ్నకు నవ్వదు అంటూ సమాధానం ఇచ్చింది పూజీ. పోనీ నువ్వు పిలిస్తే నీ వైపు చూస్తుందా ?. చూడదు. నువ్వు ఆడిస్తే

ఆడుకుంటుందా ? ఆడుకోదు. అలాంటప్పుడు అది లైవ్ డాల్ ఎలా అవుతుంది ? లైవ్ డాల్ అంటే కదులుతూ ఆడాలి కదా ? సుశీల మాటలకు పూజీ ఆలోచనలో పడింది. కేరింతలు కొడుతూ, పాకుతూ, చిరునవ్వులు చిందిస్తున్న చిన్న మనవరాలు కావ్యను ఎత్తుకుని పూజీ పక్కన కూర్చుంది ఇందిర. కావ్య కేరింతలకు పూజీ నవ్వేసాగింది. మళ్ళీ బొమ్మ గుర్తుకు వచ్చి పేచీ పెట్టింది.

చూశావా పూజీ ! పాపాయి నిన్ను చూసి నవ్వుతుంది. ఆడుకుంటుంది. అన్నం తింటుంది. నువ్వు కూడా పాపతో ఆడుకోవచ్చు. ఇంకొంచం పెద్దదైతే బుజ్జి పండు మాట్లాడుతుంది. కానీ లైవ్ డాల్ ఇవన్నీ చేయలేదు కదా. శ్రీజకు చెల్లెలు లేదు. ఆ బొమ్మతో ఆడుకుంటుంది. ఇప్పుడు చెప్పు. నీ చెల్లి బాగుందా ? ఆ బొమ్మ బాగుందా ? అంటున్న సుశీలతో చెల్లే బాగుంది. ఆ బొమ్మ పిచ్చిది... అంటూ చెల్లెల్ని ముద్దు పెట్టుకుంది పూజీ. రక్షించావు సుశీలా ! అంటూ ఇందిర పూజీతో మాట్లాడుతూ అన్నం తినిపించింది.

***

మూడు రోజులు గడిచాయి. ఈ పిచ్చి బొమ్మ నాకొద్దు. నీళ్ళు తాగుతుంది. సు సు పోతుంది. అంతే. చెల్లెలు, తమ్ముడు వుంటే నవ్వుతారు, ఆడుకుంటారు, మాట్లాడుతారు. నాకు బుజ్జి పండు లాగా చెల్లెలు కావాలి... ఏడుస్తున్న శ్రీజను చూసి ఇంట్లో అందరూ ఆశ్చర్యపోయారు. ఎవరెంత సముదాయించినా శ్రీజ కుదుట పడలేదు. పూజీయే చెప్పింది. ఇది పిచ్చి బొమ్మని. చెల్లెలు బాగుంటుందని. ... వెక్కుతూ అంది శ్రీజ. పొరబాటు చేశాను ఇందూ ! పూజీని సమాధాన పరిచేందుకు అన్న మాటలు ఇలా ఇంకో సమస్యను తెచ్చిపెడతాయని అనుకోలేదు. దిగులుగా అంటున్న సుశీలను ఓదార్చింది ఇందిర. చిన్న పిల్లల మాటలను పట్టించుకోకు. ఈ రోజు ఇలా అన్నా, మళ్ళీ మరచి పోతారు. అంది ఇందిర.

***

రెండ్రోజుల తర్వాత తమ ఇంటికి వెళ్ళారు సుశీలా, మాధవ రావులు. మూడు నెలలైనా శ్రీజ చెల్లెలు కావాలని అడుగుతూనే వుందని ఇందిర ద్వారా తెలిసినప్పుడు సుశీల తనను తాను మరోసారి తిట్టుకుంది.

***

ఏడాది తర్వాత రెండో మనవరాలి బారసాల చూస్తున్న సుశీల కళ్ళు ఆనందాశ్రువులతో నిండిపోయాయి. చెల్లెల్ని ప్రేమగా చూస్తూ సంబర పడుతున్న

శ్రీజను, పాపాయిని ముద్దు పెట్టుకుంటున్న తన కూతురు కీర్తిని చూస్తుంటే మనసులోని దిగులు మాయమైంది. తెలియని ఉత్సాహం, సంతోషం మనసులో నిండాయి. తడి బట్టతో శ్రీజ బొమ్మల మీద వున్న మట్టిని తుడుస్తున్న సుశీలకు 'లైవ్ డాల్' కనబడింది. దాన్ని కూడా శుభ్రం చేసింది. ఒక ప్రాణం లేని బొమ్మ ఒక జీవి పుట్టేందుకు ఎంత దోహదం చేసింది !... అనుకుంటూ నవ్వుకుంది.

***

హైమావతి కలివె డిసెంబర్ **16, 1957**లో మద్రాసులో జన్మించారు. బి.ఏ పూర్తి చేశారు. వివాహం అనంతరం భర్త ఉద్యోగరీత్యా మహారాష్ట్ర, హైదరాబాద్, బెంగుళూర్, పూనా, ఢిల్లీ మొదలైన ప్రాంతాల్లోనూ నివసించారు. ఆమె ఎన్నో కథలు, వ్యాసాలు రచించారు. ఆమె ఇంటర్మీడియెట్ చదివేటపుడు ఆంధ్రజ్యోతి దీపావళి సంచికలో "ఐస్‌క్రీం" అనే తొలి కథ ప్రచురించబడింది. తర్వాత అదే పత్రికలో అనేక వ్యాసాలు, పేరడీలు ప్రచురితమయ్యాయి. ఇప్పటి వరకు **11** నవలలు రాశారు. "శ్రీకృష్ణ దేవరాయలు" నవలకు సిరి కోన సాహితీ వాక్షులి లో నిర్వహించబడిన పోటీలో ప్రత్యేక బహుమతి పొందారు. ఈమె రాసిన కొన్ని కథలు, రేడియో నాటకం ఆకాశ వాణిలో ప్రసారమయ్యాయి. హిందీలోని "తీస్రీ మంజిల్" సినిమాను తెలుగులో నిర్మించినపుడు దాన్ని తెలుగులోకి అనువాదం చేశారు. హైమావతి కలివె రాసిన కథల్లో "బతుకు బొమ్మ" కథ ఆమెకు మరింత గుర్తింపు తీసుకువచ్చింది. ఈమె కలం పేరు "హైమా భార్గవ్".

# అస్తిత్వం



**గాజోజు నాగభూషణం**
**9885462052**

కలో...నిజమో.. తేల్చుకోలేని భ్రాంతిలో భర్త, పిల్లలు మిగతా కుటుంబ సభ్యులంతా ఆశ్యర్య పోతున్నారు. కోపమంటే ఏమిటో తెలియని ప్రసన్నవదనంలో ప్రకంపనలు.. అనునయంగా, మృదు మధురంగా మాట్లాడే కంఠంలో కల్లోల కెరటాల ఘోష, ఆవేశపు ఆనవాళ్ళు ఆవగింజంతైనా అగుపించని మనిషిలో కట్టలు తెంచుకుంటున్న ఆగ్రహం. లోలోన మసిలీ, మసిలీ ఒక్కసారిగా బద్దలైన అగ్ని పర్వతంలోంచి ఉప్పొంగిన లావాలా ఎన్నేళ్ళుగానో అణచిపెట్టుకున్న ఆలోచనల సునామీ సుడిగుండపు తాకిడికి వాళ్ళంతా కొంతసేపు స్థాణువులై పోయారు.

భర్త, ఇద్దరు పిల్లలు ఒకవైపు తానొక్కతే ఒకవైపు ఉండి వాళ్ళు లేవనెత్తుతున్న ప్రతి ప్రశ్నకు ధీటైన సమాధానం చెప్పడమే కాకుండా భార్యగా, తల్లిగా, స్త్రీగా తాను పోషించిన భిన్న పాత్రల్లో తనకు దక్కిన గౌరవం, దొరికిన స్వేచ్ఛ, పొందిన తృప్తి గురించి తన మ్ఫు ఏళ్ళ సంసార జీవితం

గడిచిన తరువాత, అందులోని డొల్లతనాన్ని సుమతి వెల్లడిస్తుంటే, ఒకింత న్యూనత భావనలో పడిపోయారు భర్త, ఇద్దరు పిల్లలు.

ఈ ఉత్కంఠకంతటికీ కారణం తన కూతురు శైలు పెళ్ళి

విషయం. రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామికవేత్త సురేంద్ర కొడుకుతో కూతురు శైలు పెళ్ళి ఖాయం చేద్దామని సుమతి భర్త మనోహర్ ఇంట్లో ప్రతిపాదించినపుడు, తను ప్రేమించి పెళ్ళి చేసుకుందామని అనుకున్న అబ్బాయి గురించి చెప్పింది శైలు. దానితో మొదలైంది ఇంట్లో యుద్ధం.

తన బిజినెస్ పార్టనర్ అయిన సురేంద్ర తనలాగే కోట్లకు అధిపతి. తన మనసులోని మాట చెప్పినపుడు సురేంద్ర అంగీకరించడంతో ఎంతో ఉప్పొంగిపోయాడు మనోహర్. తన బిడ్డకు దక్కబోతున్న గొప్ప అదృష్టంగా భావించాడు. కానీ, ఇప్పుడు తన కూతురు ఒక ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌ను ప్రేమించి పెళ్ళి చేసుకుంటానని చెప్పడంతో ఇంట్లో భీభత్స వాతావరణం నెలకొంది. భర్త, కొడుకులు శైలు నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నపుడు, కూతురుకు రక్షణ గోడగా నిలవాలనుకుంది సుమతి. అందుకు బిడ్డపై తనకున్న ప్రేమ ఒక్కటే కారణం కాదు. తన జీవితంలో స్త్రీ అనుభవించిన మానసిక సంఘర్షణ కూడా కారణమే.

ఇంత ఆస్తి, అంతస్తు, సొసైటీలో మనకున్న పేరు ప్రతిష్ఠలు ఏవీ నీకు సంతృప్తినివ్వలేకపోగా, నీలో అనేక అసంతృప్తులు దాగి వున్నాయంటున్నావంటే దీన్ని ఎట్లా అర్థం చేసుకోవాలో తెలియడం లేదు సుమతీ!

మీకే కాదు, చాలామంది మగవాళ్ళకు అర్థం కాదండీ. ఎందుకంటే, మీరు మీ కళ్ళతో మమ్మల్ని చూస్తూ, మీ మనసుతోనే అంచనా వేస్తారు. మీ అవగాహనా చట్రంలోంచే నిర్ధారణలు చేసి నిర్ణయాలు తీసుకుంటారు. మా గుండెపై చెవిపెట్టి, మా హృదయ స్పందనలు అర్థం చేసుకొనే స్నేహతత్వం ఎంతమంది మగవాళ్ళకు ఉంటుందండీ?

అదేంటమ్మా అట్లా అంటావు. నాన్నగారు నీకేం తక్కువ చేశారని. ఎన్నడూ నిన్ను అగౌరవ పరిచినట్లుగానీ, తక్కువ చేసినట్లు గానీ, నేనైతే చూడలేదమ్మా.

పెద్దవాడు ముగించగానే, చిన్నవాడు అందుకొని ఎన్ని కంఫరట్స్ ఉన్నాయమ్మా. నువ్వు ఏది కావాలంటే అది పొందే అవకాశముంది. పెద్ద బిజినెస్ మేన్ భార్యగా నీకుండే గౌరవ మర్యాదలున్నాయి. అయినా ఎన్నడూ లేని ఇంత అసంతృప్తి ఇప్పుడెందుకమ్మా?

నిజమేరా! అన్నీ ఎక్కువగానే ఉన్నట్లనిపిస్తుంది. దేనికీ లోటు లేనట్లే ఉంటుంది. నిర్ధారించేది మీరు కదా! మీరూ ఆ తాను ముక్కలే కదా! నాన్నగారిని రోల్ మాడల్ గా తీసుకొని, యువ పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతున్న సంపద పుష్పాలే కదా! పావురానికి పంజరానికి మధ్యనుండే పెనుగులాటను పసిగట్టే దృష్టి మీకెక్కడిదిరా! అగౌరవ పరచక పోవడమే మమ్మల్ని గౌరవించినట్లు కాదు. మా అభిప్రాయాల్ని గౌరవించినపుడే మమ్మల్ని గౌరవించినట్లు. ఒక తల్లిగా, నా బిడ్డ తీసుకున్న నిర్ణయాన్ని స్పష్టమైన అవగాహనతోనే సమర్థిస్తున్నాను. ఒక స్త్రీగా సరియైన సహానుభూతితోనే ఆమె ఆలోచనను స్వాగతిస్తున్నాను.

నాకు మాత్రం నా కూతురు జీవితం బాగుండాలని ఉండదా సుమతీ! ఆమె భవిష్యత్తు గురించి, నాకు మించి ఎవరు ఆలోచిస్తారు? సురేంద్ర కుటుంబం సంబంధాన్ని ఒప్పుకోవడమే అదృష్టంగా నేను భావిస్తుంటే, తల్లీ-బిడ్డలు మీరిద్దరూ అసాధారణమైన వాదన చేస్తున్నారు.

కోటీశ్వరుల సంబంధాన్ని కాదని, ఒక సాధారణ కుటుంబంలోకి వెళ్ళి మన కూతురు ఏం బావుకుంటుందో, సమర్థిస్తున్న నువ్వు సరియైన కారణాలను చూపగలవా?

కోట్ల సంపదతో కోర్కెలన్నీ తీరుతాయన్న భ్రమలో మీరున్నారండీ! నిజానికి సంపదలు ఎన్ని రకాల సర్దుబాట్లను జీవితంలోకి మోసుకొస్తాయన్న నాణానికి రెండోవైపున్న కోణాన్ని మీరు గమనించలేరు. బాల్యం నుంచీ కన్న కలలు బంగారు పంజరంలో శిథిలమౌతాయి. మాకు తెలియకుండానే మా చుట్టూ అతిమర్యాదల అడ్డుగోడలు మొలుచుకొస్తాయి. క్రమక్రమంగా, వ్యవస్థీకృతమైన ఈ రంగుల ప్రపంచంలో మేము వివర్ణమై పోతుంటాము.

చెల్లెలికి సపోర్ట్ చేయాలన్న ఒకే ఒక అభిప్రాయంతో వాస్తవానికతీతంగా వాదిస్తున్నావు. కోటీశ్వరుడైన నాన్నను చేసుకొని, నీవేం కోల్పోయావో చెప్పగలవా అమ్మా అన్న పెద్దకొడుకు మాటలకు వ్యంగ్యమైన నవ్వొకటి నవ్వింది సుమతి.

నేను కోల్పోయినవి చాలానే ఉన్నాయి కాబట్టే, నా కూతురు జీవితంలో పదిలపర్చుకోవాల్సిన కొన్ని మధురమైన అనుభూతులు చెదిరిపోవద్దని కోరుకుంటున్నా. నేను ఎం.ఏ. సోషియాలజీ చేసింది, సామాజిక శాస్త్రంగా మానవ సమాజాన్ని అధ్యయనం చేయాలన్న తీవ్రమైన కోరికతో. పి.హెచ్.డీ. చేయాలన్న నా ఆశలు పెళ్ళి పేరుతో ఆవిరయ్యాయి. ముప్పై ఏళ్ళ క్రితం అప్పుడప్పుడే బిజినెస్ లో నిలదొక్కుకుంటున్న మీ నాన్న నా ఉన్నత చదువును చూసి ఉత్సాహపడే నన్ను పెళ్ళి చేసుకోవడానికి ముందుకొచ్చారు. మా స్థాయికి మించి ఎంతో పైస్థాయిలో ఉన్న సంబంధం రాగానే, రీసర్చ్ వైపు వెళ్ళాలన్న నా కోరికను తుంచేసి, పెళ్ళిపీటల మీదికెక్కించారు మా నాన్న. పెళ్ళయ్యాక మీ నాన్న క్రమక్రమంగా అందనంత ఎత్తుకు ఎదిగారు.

సమాజ సంబంధాలను అధ్యయనం చేయాలన్న కోరిక గానీ, బోధనా రంగంలోకి వచ్చి, భావితరాన్ని తయారు చేయాలన్న ఆకాంక్ష గానీ, అథః పాతాళానికి చేరుకున్నాయి. వ్యాపారం విస్తరిస్తున్న కొద్దీ, ఆయన ప్రాథమ్యాలను పట్టించుకోవడానికే నా సమయమంతా వెచ్చించడమనేది, నాకు తెలియకుండానే చాప కింద నీరులా జరిగిపోయింది. మంచులా నా కల శాశ్వతంగా కరిగి పోయింది. ఎన్నిసార్లు అనుకున్నానో... మన ఇంటి పనీ, వంట పనీ చేస్తున్న నౌకర్లకూ, నాకూ ఏమిటి తేడా అని. చదువుకున్న నేనూ, చదువుకోని వాళ్ళు అందరం ఈ నాలుగు గోడల మధ్యన పనుల కోసమే పరిమితమైన వాళ్ళమని.

నీ ఇంట్లో నీకు స్వేచ్ఛ లేదని, నీ సంపద నీకు ప్రతిబంధకమని ఎట్లా అనుకుంటావమ్మా అన్న చిన్న కొడుకు మాటలకు చిరాగ్గా చూసింది సుమతి.

ఇల్లంటే ఇన్నేసి రూములుండి, ఇన్ని అలంకారాలు – సౌకర్యాలతో ఇంద్రభవనంలా ఉంచుకోవడం కేవలం సోషల్ స్టేటస్ కోసమే. కడుపుకు కావలసిన ఆరోగ్యకరమైన ఫుడ్డు, అలసిన దేహాన్ని నిద్ర పుచ్చడానికి ఒక బెడ్డు, ఇంతకన్నా మించి కోట్ల రూపాయల విలువ చేసే ఈ ఇంటిలో ఏం వాడుకుంటామురా.. ఇక స్వేచ్ఛ అంటే ఎవరికి వాళ్ళు నిర్వచించుకొనేది. పుట్టినిల్లంటే ఆడపిల్లకు అత్యంత అపురూపమైనది. ఇక్కడి సౌకర్యాలు, మధ్యతరగతి వాళ్ళైన మా పుట్టింట్లో లేవన్న మిషతో అక్కడికి వెళ్ళడమే బంద్ అయిపోయింది. మా పుట్టింటి

సంబంధాల వాళ్ళిండ్లకు మనం పోము.. మన స్థితికి జంకి వాళ్ళు ఇక్కడికి రారు. ఆ సంబంధాలన్నీ దాదాపు కట్. ఎక్కడ నా స్వేచ్ఛ నాకు దొరికినట్లు.

మ్ఫు ఏళ్ళ సంసార జీవితంలో నీకు అన్నీ ఎక్కువే ఇచ్చానని ఇన్నాళ్ళు గర్వంగా ఫీల్ అయ్యే వాడిని సుమతీ! ఈ సంపద, బడా పారిశ్రామిక వేత్త మనోహర్ భార్యగా నీకున్న గౌరవం, ముఖ్యంగా ఎలైట్ గ్రూపుల్లో నీపట్ల చూపే ఆదరణ అన్నీ.. అన్నీ నీ హోదాను పెంచేవి, నిన్ను సంతృప్తిగా ఉంచేవే అనుకున్నాను. కానీ, ఒక్కసారి నేను గర్వంగా ఫీల్ అయ్యే అంశాలను, నువ్వు పనికిరానివన్నంత తేలికగా తీసిపారేశావు– దీనిని ఎలా చూడాలో తెలియడం లేదు.

ధనవంతుల ఇండ్లల్లో అందరూ అసంతృప్తులతోనే జీవిస్తారని నేను సాధారణీకరించి చెప్పడం లేదండీ! వ్యక్తుల మనస్తత్వాలు, ప్రాథమ్యాలపై ఆధారపడి మనుగడ ప్రకటితమవుతుంది! మీరన్నట్లు నాకు దక్కిన ప్రతి గౌరవమూ, మీ భార్యగా పొందుతున్నదే. నా స్వీయ అస్తిత్వాన్ని కోల్పోయి మీ నీడగానే గుర్తింపు పొందుతున్నాను. విద్యార్థిగా ఉన్నపుడు స్కూల్ టాపర్ గా ఉండి, టీచర్స్ చే అభినందనలందుకున్న ప్రతీసారీ, జీవితంలో నాకంటూ ఒక గుర్తింపును పొందాలి అని బలంగా అనుకొనేదాన్ని. అది కాలేజీ దాటి, యూనివర్సిటీ కొచ్చేసరికి మరింత బలంగా నాటుకుపోయింది. యూనివర్సిటీ కేంద్రంగా జరిగే అనేక ఉద్యమాలు, ప్రముఖుల ప్రసంగాలు నన్ను ఎంతో ఉద్వేగ పరిచేవి. స్త్రీలు, అణగారిన వర్గాల పట్ల జరుగుతున్న అన్యాయాలు, సమాజంలో పేరుకుపోయిన అంతరాలకు కారణాలను అన్వేషించి పరిష్కార మార్గాలు కనుగొనాలని స్థిరంగా అనుకొనేదాన్ని. కానీ, పి.జీ. అయిపోగానే పి.హెచ్.డి. చేయాలన్న నా కోరికల వెలుగును, పెళ్ళి అనే మేఘం కమ్మేసింది. నా చదువు, అందాన్ని చూసి కానీ కట్నం లేకుండా చేసుకుంటానన్న మీ ప్రతిపాదన మా నాన్నపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. నాకిప్పుడే పెళ్ళి వద్దు. ఇంకా చదువుకుంటానన్న నా వాదన వేదనగానే మిగిలిపోయింది. ఏడాది తిరిగేలోపు పెద్దవాడు, మరో రెండేళ్ళలో మరో ఇద్దరు పిల్లలు. ఊపిరి సలుపని ఒత్తిడే మిగిలింది.

'పెళ్ళి తరువాతనైనా నీ మనసులో కోరిక చెప్పి ఉండవచ్చు కదా సుమతీ!

పెళ్ళి తరువాత నా ప్రయారిటీస్ అన్నీ.. మీరు, మీ అవసరాలు, పిల్లలు– వారి పెంపకాల చుట్టే తిరిగాయి. విద్యార్థి నుండి ఇల్లాలిగా మారిన తరువాత నాకంటూ మిగిలిన చిన్న చిన్న కోరికలు చూడా క్రమంగా ఆవిరైపోయాయి. మీకు నా మీద అవ్యాజమైన ప్రేమ ఉంది. ఆ ప్రేమ సంపద రూపంలో, కంఫర్ట్స్ రూపంలో మీ మనసుకు కనిపిస్తుంది. మీ మగవాళ్ళకు విశాలమైన ప్రపంచం ఉంటుంది. మా ఆడవాళ్ళకు భర్త, పిల్లలు ఇల్లే లోకంగా మారిపోతుంది. కొత్త కొత్త స్నేహాలు, విస్తృతమైన సంబంధాలతో మీ ప్రపంచం విస్తరిస్తూనే ఉంటుంది. సమాజ సంబంధాలకు దూరమై, సంసార బంధాల్లో బందీ అయ్యి క్రమక్రమంగా ఏకాంత వాసంలోకి వెళ్ళిపోతాము మేము. ఇదంతా ఏదో కుట్రగానో, పథకం ప్రకారమో జరుగడమంటూ ఉండదండీ! ప్రకృతి నిర్దేశించిన పునరుత్పాదక బాధ్యత అనివార్యమైనదే అయినా, కుటుంబ వ్యవస్థ నిర్మాణం చేసిన ఇల్లాలి పాత్రే మా రెక్కలు కత్తిరించి ఎగిరే స్వేచ్ఛను హరిస్తుంది. నా కూతురు మళ్ళీ ఇదే సంపద సాలెగూటిలో చిక్కి గిలగిలలాడే కంటే, తను కోరుకున్న వ్యక్తితో,

కోరుకున్న జీవితాన్ని దక్కించుకుంటే నేనెంతగానో సంతోషిస్తాను.

ఎప్పుడో కానీ నోరు విప్పని అమ్మ, అప్పుడప్పుడు నా దగ్గరే తన మనసు విప్పి మాట్లాడేది నాన్నా! మీ అందరి ముందూ మౌనమునిలా ఉన్న అమ్మ ఎదలో ఎన్ని ఎండిన చెలిమెలున్నాయో తెలిసిన తరువాత, అమ్మ మనసుకు కావాలనే దగ్గరైన కొద్దీ స్త్రీగా నాలో అస్తిత్వ చైతన్యం మేలుకొంది.

అదే మన ఇంటికి వచ్చిన ఇద్దరు వదినలూ సంపన్న కుటుంబాల నుంచి వచ్చి, అదే సంపదకు కేంద్రమైన మన ఇంటి వాతావరణంలో హాయిగా, ఒకింత గర్వంగా జీవిస్తున్నారు. మధ్యతరగతి కుటుంబంలోంచి వచ్చినందుకే కాబోలు, అమ్మకు ఆ జీవితాల్లోని కలలు, కాంక్షలు, సొంత కాళ్ళపై ఎదిగి జీవితాన్ని గెలుచుకోవాలన్న ఆర్తి అధికంగా ఉండిందేమో!

నువ్వూ ఈ సంపన్న కుటుంబంలోనే పుట్టి పెరిగావు కదమ్మా! ఈ జీవితాన్ని కాదని, సాధారణ జీవితాన్నే కోరుకుంటున్నావా? వాస్తవాలు వేరుగా ఉంటాయి. అనుభవంలోకి వస్తే గానీ అవగతం కావు తల్లీ! నీ ముందుకు వచ్చిన విలాసవంతమైన జీవితాన్ని కాదని, ఒడిదుడుకుల జీవితాన్నే స్వాగతిస్తావా?'

విలాసాలు విశ్వాసాలకు విఘాతంగా మారుతాయని అమ్మ నుండే నేర్చుకున్నాను నాన్నా! ఇక మీరు ఒడిదుడుకులు అనుకుంటున్నారు. నేను జీవితాన్ని గెలుచుకోవడంలో ఉన్న ఆనందాన్ని.. అదీనూ, నిత్య నూతన అనుభవాల సమాహారమైన అనుభూతుల సారమైన జీవితాన్ని జీవించాలన్న స్పష్టమైన అవగాహనతోనే ఈ నిర్ణయం తీసుకున్నాను. అందుకు మీ ఆశీర్వాదం కావాలి నాన్నా!

ఇప్పుడు మనోహరకు వాదించడానికి ఏ కారణాలు కనిపించడం లేదు. అనుమానించడానికి ఏ సంశయాలూ లేవు. ఉరుములు, మెరుపులతో అల్లకల్లోలమైన ఆకాశం నిర్మలంగా మారినట్లు, అనేక సంఘర్షణలతో సతమతమైన మనోహర్ మనసు తేలికపడగా, రెండు చేతులూ సాచి సుమతినీ, శైలునూ చెరోవైపు పొదివి పట్టుకున్నాడు.

* * *

***గాజోజు నాగభూషణం వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ప్రవృత్తిరీత్యా కవి, రచయిత, గాయకుడు కూడా! 'మట్టి సరిగమలు', 'ప్రాణ దీపం' కవిత్వ సంకలనాలను వెలువరించారు. తెలంగాణ ఉద్యమ గేయాలు రాసి, స్వయంగా పాడి.. 'నెత్తుటి గాయాలు' పేరుతో సీడీలుగా తీసుకొచ్చారు. ఇప్పటివరకు పది కథలు రాశారు. 'ప్రాణ దీపం' పుస్తకానికి రెండు రాష్ట్రస్థాయి పురస్కారాలు దక్కాయి. అలిశెట్టి ప్రభాకర్ సాహిత్య పురస్కారంతోపాటు ఇతర పురస్కారాలను అందుకున్నారు. ఉత్తమ చిత్రాలను ప్రోత్సహించే కరీంనగర్ ఫిలిం సొసైటీలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. '2009 టీవీ నంది అవార్డ్స్' జ్యూరీ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం 'తెలంగాణ రచయితల వేదిక' రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు.***

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 268

# నిషేధిత స్వప్నం



**కడెం లక్ష్మీ ప్రశాంతి**
**78933 99773**

"అనూ.. అనూ! పిలుస్తుంటే పలకవేం!? ఏంటా పరధ్యానం? ఎప్పుడూ ఏదో లోకంలో ఉంటావ్! ఆఫీస్‌కు వెళ్తున్నా.. తలుపేసుకో!" అంటూ లంచ్‌బాక్స్ తీసుకుని హడావుడిగా వెళ్లిపోయాడు హర్ష. తన సమాధానం కోసం కూడా చూడకుండా వెళ్తున్న అతణ్ని చూసి.. దీర్ఘంగా నిటూర్చింది అనూహ్య. ఈమధ్య ఆమెకు జీవితం పట్ల చాలా అసంతృప్తిగా ఉంది. నిజం చెప్పాలంటే పెళ్లయినప్పటి నుంచీ అలాగే ఉంది. ఈమధ్య కాలంలో తారాస్థాయికి చేరిందంతే! అనూహ్య ఈ విషయం చాలాసార్లు భర్తకు చెప్పాలని ప్రయత్నించింది. కొన్నిసార్లు చెప్పింది కూడా. అయినా అతని ధోరణిలో మార్పు రాకపోగా.. ఎక్కడలేని ఆశ్చర్యాన్ని ప్రదర్శించాడు."పనికిమాలిన పుస్తకాలు చదివి మనసు పాడు చేసుకుంటున్నావు" అన్నాడు.

అనూహ్యకు ఒక్కసారిగా తన జీవితమంతా కళ్లముందు కదిలింది.

అనూహ్యకు చిన్నప్పటి నుంచీ నానమ్మ %--% తాతయ్య దగ్గరే చేరిక ఎక్కువ. సాహిత్యాభిమానులైన వాళ్లిద్దరూ, అనూహ్యకు కూడా బాల్యం నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేశారు. ఆమె ఇంజినీరింగ్‌కు వచ్చేసరికి.. విశ్వనాథ నుంచి చలం వరకూ అందరి పుస్తకాలూ చదివేసింది. ముఖ్యంగా చలం.. అభిమానిగా మారిపోయింది. ఇంజినీరింగ్ పూర్తికావడంతోనే ఉద్యోగం రావడంతో వెంటనే జాయిన్ అయిపోయింది అనూహ్య. తన కజిన్ పెళ్లికి వెళ్లిన అనూహ్యను చూసిన హర్ష, ఆమెను ఇష్టపడి తన తల్లితండ్రులతో అనూహ్య వాళ్లింట్లో మాట్లాడించాడు. పేరున్న కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. మంచి జీతం. ఎలాంటి బాధ్యతలు లేవు.

ఏ ఆడపిల్ల తల్లిదండ్రులకైనా.. చాలా అనుకూలమైన సంబంధం. అందువల్ల కాదనడానికి ఏ అభ్యంతరం కనిపించలేదు. అయినా కూడా తుది నిర్ణయం అనూహ్యకే వదిలేశారు. హర్ష, అనూహ్య ఇద్దరూ ఓ రెస్టారెంట్‌లో కలుసుకున్నారు. పరిచయాలు అయ్యాక.. అనూహ్య తన అభిప్రాయాల్ని చెప్పడం మొదలుపెట్టింది.

"హర్షా! నేను మొదటినుంచీ చాలా స్వేచ్ఛగా పెరిగాను. నా జీవితాన్ని నాకు నచ్చినట్టుగా తీర్చిదిద్దుకున్నాను. పెళ్లి తర్వాత కూడా నేను జాబ్ చేస్తాను. నా స్వేచ్ఛనూ, ఇండిపెండెన్సీని వదులుకోను. పెళ్లి తర్వాత ఇంటి పనులే కాదు. పిల్లల బాధ్యత కూడా ఇద్దరం పంచుకోవాలి".

ఆమె చెప్పిందంతా చిరునవ్వుతో విన్న హర్ష..

"అనూహ్యా! నేను ఏరోజూ నీ స్వేచ్ఛకు అడ్డురాను. జాబ్ చెయ్యాలా? వద్దా? అనేది కూడా నీ ఇష్టం. ఇంటి పనులు, పిల్లల పెంపకం పూర్తిగా ఆడవాళ్ల పని అనుకునేంత మూరు□ణ్ని కాదు!" అన్నాడు అదే చిరునవ్వుతో!

అనూహ్య తనకు పుస్తకాలు చదవడం చాలా ఇష్టమని, చలం తన అభిమాన రచయి-ఽతని చెప్తే.. అతను మాత్రం తను పెద్దగా బుక్స్ చదవననీ, సినిమాలు చూస్తానని చెప్పాడు. కాకపోతే ఆమె అభిరుచులకు ఏనాడూ అడ్డు చెప్పనన్నాడు. ఆ మాటతో అనూహ్య మొహం వికసించింది. ఇద్దరూ తమ అంగీకారాన్ని ఇంట్లో తెలియజేశారు. నెలలోనే మంచి ముహూర్తం కుదరడంతో.. వాళ్ల పెళ్లి జరిగిపోవడం, అనూహ్య అత్తారింటికి వెళ్లిపోవడం చకచకా జరిగిపోయాయి. అనూహ్య చెప్పినట్టుగానే.. ప్రతిరోజూ ఇంటి పనుల్లో భాగం పంచుకుంటున్నాడు హర్ష. వారాంతాల్లో సినిమాకో, రెస్టారెంట్‌కో వెళ్లడం.. అప్పుడప్పుడూ లాంగ్‌డ్రైవ్‌లతో జీవితం సాగిపోతున్నది.

కాలం గడిచేకొద్దీ అనూహ్యలో అసంతృప్తి చోటు చేసుకుంటున్నది. హర్ష తనకేమీ లోటు చెయ్యడు. ప్రేమగానే చూసుకుంటాడు. కానీ, రాత్రి అయ్యేసరికి తన ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా అతనికి నచ్చినట్టు ప్రవర్తిస్తాడు. తన అవసరం తీరగానే పడుకోవడమో లేదంటే ఫోన్ చూసుకోవడమో చేస్తాడు తప్ప.. తనను పట్టించుకోవడం కాదు కదా, కనీసం తన ఉనికిని కూడా గుర్తించనట్టుగా ఉంటాడు. ఈ పరిస్థితిని కొన్ని నెలలవరకూ భరించిన అనూహ్య, ఇక భరించడం తనవల్లకాక హర్షతో మాట్లాడటానికి నిశ్చయించుకుంది. తనను దగ్గరికి తీసుకుంటున్న భర్తతో..

"నీతో మాట్లాడాలి హర్షా!" అన్నది.

"ఇది మాట్లాడే టైమా అనూ!? ఏదైనా ఉంటే మార్నింగ్ మాట్లాడుకుందాం".

"ప్లీజ్! నేను చెప్పేది విను".

"సరే! ఏంటో చెప్పు?".

"నీ బిహేవియర్ ఇబ్బందిగా ఉంది హర్షా! బెడ్రూమ్‌లో నీకు నచ్చినట్లు ఉండమని ఒత్తిడి చేస్తావే కానీ, నాకెలా ఉంటే ఇష్టమో ఒక్కసారైనా ఆలోచించావా?".

"అనూహ్యా!" అన్నాడు ఎర్రబడ్డ మొహంతో.

"నన్ను పూర్తిగా మాట్లాడనివ్వు హర్షా! నేనూ మనిషినే. బొమ్మను కాను.. నీకు నచ్చినట్టు వాడుకొని పక్కకు తోసేయ్యడానికి. నాకూ కొన్ని కోరికలు ఉంటాయని ఎందుకు ఆలోచించవ్? భార్యాభర్తల సంగమంలో ఇద్దరూ ఆనందాన్ని చవిచూడాలి కానీ, ఒకరి ఆనందం ఇంకొకరికి బాధను మిగల్చకూడదు. అణువణువూ ప్రేమ తొణికిసలాడే అనుభవం, రెండు మనసులు సంతోషంతో నర్తించే అనుభవం కావాలి హర్షా! ఏ అనుభూతిలేని అనుభవాన్ని భరించలేకపోతున్నా. ఈ సంగతి నీకు మన ఫస్ట్‌నైట్ అప్పుడే చెప్పాల్సింది. నువ్వే అర్థం చేసుకుంటావని అనుకున్నా. పెళ్లయి పదినెలలు అవుతున్నా.. నువ్వు నావైపు నుంచి ఆలోచించక పోవడంతో, నేనే చొరవ తీసుకొని చెప్తున్నాను"..

తన మనసులో మాట చెప్పింది అనూహ్య.

"నువ్వేం మాట్లాడుతున్నావో తెలుస్తున్నదా అనూహ్యా! అసలు ఏ భార్యయినా భర్తతో ఇలా మాట్లాడుతుందా? నువ్వింత విచ్చలవిడిగా మాట్లాడుతావని నేనస్సలు అనుకోలేదు"..

కోపంతో ఊగిపోతూ అంటున్న అతణ్ని చూసి ఆశ్చర్యపోయింది ఆమె. తను ఏం తప్పుగా మాట్లాడిందో ఆమెకు అర్థం కాలేదు. ఏ భార్యయినా తన కోరికల్ని భర్తతో కాక ఎవరితో చెప్పుకొంటుంది? ఇందులో విచ్చలవిడి తనమేముంది? ఒక స్త్రీ తన శారీరక వాంఛల గురించి కట్టుకున్న భర్తకు కూడా చెప్పకూడదా? ఆలోచనల్లో మునిగిపోయిన అనూహ్య.. హర్ష కోపంతో వేరే బెడ్రూమ్‌లోకి వెళ్లిన సంగతి గమనించలేదు.

"పెళ్లికి ముందు.. 'నాకు పుస్తకాలు చదవడమంటే చాలా ఇష్టం' అని నువ్వు చెప్తే ఏంటో అనుకున్నాను.. ఇలాంటివి చదువుతావని అనుకోలేదు"..

వ్యంగ్యంగా అంటున్న భర్తవైపు ఆశ్చర్యంగా చూసింది అనూహ్య.

"మీ చలం గురించి గూగుల్ చేశాను. అతను స్త్రీ స్వేచ్ఛ పేరుతో ఆమెలోని సెక్సువల్ ఫీలింగ్స్‌ను ప్రోత్సహిస్తూ కథలు రాస్తాడట కదా!? ఇలాంటి పుస్తకాలు చదివే ఆడవాళ్లతో కాపురం చెయ్యడం చాలాకష్టం. ఇకనుంచైనా ఆ పుస్తకాలు చదవడం మానెయ్"..

అంటున్న అతణ్ని చూస్తే అసహ్యం వేసింది.

'ఇలాంటి వాళ్లకు చలం పుస్తకాలే కాదు.. స్త్రీ హృదయమూ ఎన్ని జన్మలెత్తినా అర్థం కాదు. ఇక అతనితో మాట్లాడటం వల్ల లాభం లేదు' అనుకొని మౌనంగా ఉంది. హర్ష మాత్రం రోజూ ఏదో ఒక వంకన ఎత్తిపొడుపు మాటలు మాట్లాడటం మానలేదు.

ఆ సూటిపోటి మాటలు అనూహ్యకు విసుగు తెప్పిస్తున్నాయి. ఎలాంటి స్పందనలు లేకుండా, కేవలం మగవాడు కోరున్నట్లు నడుచుకోవడానికే స్త్రీ ఉన్నదని భావించే అతణ్ని చూస్తుంటే చిరాగ్గా అనిపిస్తున్నది. చక్కగా చదువుకొని, మంచి పొజిషన్‌లో ఉన్న అతను.. ఆడవాళ్ల విషయంలో ఇంత సంకుచితంగా ఆలోచించడం అనూహ్య జీర్ణించుకోలేక పోతున్నది.

తనమీద చెయ్యి పడ్డట్టుగా అనిపించడంతో మెలకువ వచ్చింది అనూహ్యకు. ఎదురుగా తనను దగ్గరికి తీసుకుంటున్న భర్తను చూడగానే.. ఆమెకు ఎక్కడలేని కోపం వచ్చింది. వారం నుంచి తనను మాటలతో వేధిస్తున్న అతను, తన అవసరానికి

దగ్గరవడం సహించలేక పోయింది. అతని చేతిని విసురుగా నెట్టేసి వెళ్లిపోబోతున్న ఆమెకు.. బలవంతంగా దగ్గరయ్యాడు.

జరిగింది తలుచుకుంటుంటే అనూహ్య మనసు అవమానంతో రగిలిపోతున్నది. భార్యను రేప్ చేసే స్థాయికి దిగజారిన హర్ష అంటే.. ఆమెకు అసహ్యం వేస్తున్నది.

ఏమనుకుంటున్నాడు తన గురించి? భార్యే కదా.. ఏం చేసినా పడుంటుందని అనుకుంటున్నాడేమో!? ఆయనలో మార్పు వస్తుందేమోననే ఇంతకాలంగా ఎదురుచూసింది. మారడం కాదు కదా.. మరీ రాక్షసుడిలా తయారవుతున్నాడు. ఇక సహించే ఓపిక తనకు లేదు. ఏం చేయాలో నిర్ణయించుకుంది అనూహ్య. చెప్పా పెట్టకుండా ఇంటికి వచ్చిన కూతుర్ని చూసి ఆశ్చర్యపోయింది రాధ.

"బాగున్నావా అనూ!? ఫోన్ అయినా చేయలేదు. ఒక్కదానివే వచ్చావేం. అల్లుడుగారు ఏరీ?".

ప్రశ్నల వర్షం కురిపిస్తున్న కోడల్ని..

"అబ్బా రాధా! ముందు దానికి తాగడానికి ఏమన్నా తీసుకురా!".. అని కోడల్ని మందలిస్తూనే.. మనవరాలి చేతిని ఆప్యాయంగా తన చేతుల్లోకి తీసుకున్నది తులసమ్మ.

తిండీ, నిద్ర లేనట్టు పీక్కుపోయి ఉన్న ఆమె మొహాన్ని చూసి గతుక్కుమంది రాధ.

"ఏంటే అలా ఉన్నావు? హర్షా, నువ్వూ బానే ఉన్నారు కదా!?"..

కంగారుగా అడుగుతున్న తల్లిని చూసి, క్షణకాలం కలవరపాటు చెందినా అంతలోనే తేరుకొని..

"అమ్మా! అనవసరంగా టెన్షన్ అవ్వకు. మేమిద్దరం బాగానే ఉన్నాం. ఆఫీస్ పని ఎక్కువ అవడం వల్ల కాస్త రెస్ట్‌లెస్‌గా ఉందంతే!" తల్లికి సర్దిచెప్పింది.

కూతురి మాటలతో తేలికపడ్డ రాధ.. అనూహ్యకు ఇష్టమైన ఉల్లిపకోడీ చేయడానికి వంటింట్లోకి వెళ్లింది. మనవరాలు నిజం చెప్పడంలేదన్న సంగతి తులసమ్మ గ్రహించినా.. అడగడానికి సమయం కాదని ఊరుకుంది. తల్లి చేసిపెట్టిన పకోడీ తింటూ కబుర్లలో మునిగిపోయిన అనూహ్య.. ఫోన్ రింగ్ అవడంతో హ్యాండ్‌బ్యాగ్‌లోంచి ఫోన్ తీసింది. డిస్‌ప్లేపై నెంబర్ చూడగానే.. తాత్కాలికంగా మర్చిపోయిన కోపం, బాధ ఒక్కసారిగా ఎగసిపడ్డాయి. పక్కన అమ్మ, నానమ్మ ఉండటంతో సర్దుకొని, ఫోన్ లిఫ్ట్ చేసింది.

"అనూ! నేను ఆఫీస్ పని మీద చెన్నై వెళ్తున్నాను. నువ్వు ఆఫీస్ నుంచి మీ ఇంటికి వెళ్లు. నేను తిరిగి రాగానే మన ఇంటికి వద్దువు!"..

అసలేం జరగనట్టు మాట్లాడుతున్న భర్తపై కోపం రెట్టింపయ్యింది. ఇంట్లో వాళ్లముందు బయటపడటం ఇష్టంలేక.. అన్నిటికీ 'ఊఁ' కొట్టింది.

రాత్రి భోజనాల్లో అనూహ్యకు ఇష్టమైన వంటలన్నీ చేసి కొసరికొసరి తినిపించారు రాధ, తులసమ్మ.

అన్నం తినగానే బల్లున వాంతి చేసుకుంటున్న అనూహ్యను చూసి, ఇంటిల్లిపాది కంగారుపడ్డారు. హాస్పి

టల్‌కు వెళ్దామని హడావుడి చేస్తున్నవారిని వారించి తన గదిలోకి వెళ్లింది. వంటిల్లు

సర్ది, కూతురి గదిలోకి వచ్చిన రాధ.. అనూహ్యను తన ఒళ్లోకి తీసుకుంటూ..

"అనూ తల్లీ! ఆరోగ్యం బానే ఉంటుందా? పీరియడ్స్ రెగ్యులర్‌గా వస్తున్నాయా?" అని అడిగింది.

అప్పుడు గుర్తొచ్చింది తనకు.. డేట్ అయిపోయి పదిరోజులు దాటినా, తనకు ఇంకా పీరియడ్స్ రాలేదని. ఈ గొడవల్లో పడి ఆ సంగతే గమనించలేదు. కాస్త ఒంట్లో నలతగా ఉన్నా పట్టించుకోలేదు.

"ఎప్పుడూ రెగ్యులర్‌గానే ఉంటాయి. ఈ నెలలోనే రాలేదు" అని చెప్పింది.

ఆ మాట వినగానే.. తన అనుమానం నిజమేనేమోనని సంతోషించింది రాధ.

"రేపు ఆఫీస్‌కు సెలవు పెట్టు. హాస్పిటల్‌కు వెళ్దాం!" అన్నది కూతురితో!

తల్లి ఆంతర్యాన్ని గ్రహించిన అనూహ్య..

"ఈమాత్రం దానికి లీవ్ ఎందుకమ్మా? నేను ఆఫీస్ నుంచి వచ్చేటప్పుడు కిట్ తెచ్చుకొని, ఇంట్లో టెస్ట్ చేసుకుంటాను" అన్నది.

అంతకుముందే అక్కడికి వచ్చి, వాళ్ల సంభాషణ విన్న తులసమ్మ..

"అమ్మ చెప్పినట్టు వినవే అమ్మడూ! రేపొక్కరోజు సెలవు పడేస్తే.. శనివారం, ఆదివారం కలిసొస్తాయి. నువ్వూ కాస్త విశ్రాంతి తీసుకున్నట్టు ఉంటుంది. రెండ్రోజులు మాతో ఉన్నట్టూ ఉంటుంది!".

"సరే నానమ్మా!" అంటూ తలూపింది అనూహ్య.

అనూహ్యను సిటీలోనే పేరున్న హాస్పిటల్‌కు తీసుకెళ్లింది రాధ. పరీక్షల అనంతరం అనూహ్య తల్లి కాబోతున్నదని నిర్ధారించారు డాక్టర్. ప్రిస్క్రిప్షన్‌తోపాటు తీసుకోవాల్సిన ఆహారం, చెకప్‌కు ఎప్పుడు రావాలో తదితర వివరాలతో కూడిన చార్ట్ ఇచ్చారు.

అనూహ్య ఇంట్లో పండగ వాతావరణం నెలకొంది.'అనూహ్యను ఎంతో జాగ్రత్తగా చూసుకోవాలి. పుట్టబోయేది పాపా? బాబా? పాప అయితే ఏం పేరు పెట్టాలి? బాబు అయితే ఏం పేరు పెట్టాలి?' అని సంబురంగా మాట్లాడుకుంటున్నారు ఇంట్లోవాళ్లు.

వీళ్ల మాటలతో తనకేం సంబంధం లేదన్నట్టు.. మందలోంచి తప్పిపోయిన మేకపిల్లలా ఒక పక్కన కూర్చుంది అనూహ్య. తనకు తానుగా దగ్గరయ్యే అవకాశం హర్ష ఎప్పుడూ కల్పించలేదు. అతని సాన్నిధ్యంలోని ఆనందాన్ని చవిచూడకుండానే తాను తల్లి కాబోతున్నదంటే.. తన హృదయం బాధగా మూలిగింది. అప్రయత్నంగా ఆమె చేతులు పొట్ట మీదికి వెళ్లాయి. తనలో ఒక జీవి ప్రాణం పోసుకుంటున్నదనే ఊహే.. ఆమెకు అద్భుతంగా అనిపించింది. పూర్తి ఆకృతైనా దాల్చని ఆ బిడ్డపై అవ్యాజమైన ప్రేమ కలిగింది ఆమెకు.

"అనూ! అల్లుడుగారి నుంచి ఫోన్!"..

అంటూ వచ్చిన తల్లి చేతిలోంచి ఫోన్ తీసుకుని..

"హలో!" అన్నది అనూహ్య.

"థాంక్యూ వెరీమచ్ రా! నాకెంత హ్యాపీగా ఉందో తెలుసా!? ఆంటీ చెప్పగానే

నీముందు వాలిపోవాలని అనిపించింది. కానీ, ఏం చేయను? వర్క్ ఉండిపోయింది. టూడేస్‌లో వచ్చేస్తాను. టేక్ కేర్ రా!"..

అంటూ అతను ఇంకా ఏదో చెప్పబోతుంటే..

"హర్షా! నాకు చాలా నీరసంగా ఉంది. రెస్ట్ తీసుకుంటాను".. మరోమాటకు అవకాశం ఇవ్వకుండా ఫోన్ పెట్టేసింది. భర్త ఫోన్.. తన సంతోషాన్ని నాశనం చేసినట్టు అనిపించింది.

"అల్లుడుగారు ఎన్నిసార్లు ఫోన్ చేసినా నువ్వు తియ్యకపోతే ఏమైందోనని నాకు కాల్ చేశారు. మాటల సందర్భంలో విషయం చెప్పేశాను. సారీ రా!"..

అపాలజిక్‌గా అంటున్న తల్లిని చూసి,

"పర్లేదమ్మా!" అంటూ నవ్వేసింది అనూహ్య.

"అమ్మడూ! ఆదివారం కూడా పనేంటే? ఆ ల్యాప్‌టాప్ పక్కన పెట్టు. సరదాగా మాట్లాడుకుందాం. మళ్లీ మీ ఆయనొస్తే తుర్రుమంటూ వెళ్లిపోతావ్".. అనూహ్య దగ్గర కూర్చుంటూ అన్నది తులసమ్మ.

నానమ్మ మాటలకు ల్యాప్‌టాప్ మూసేసింది.

"అమ్మడూ! వచ్చినప్పటినుంచీ చూస్తున్నా. అదోలా ఉన్నావ్. ఏమైంది నా తల్లికి?".. మనవరాలి తలను ఆప్యాయంగా నిమురుతూ అడిగింది. ఆమె చూపించే ప్రేమకు కరిగిపోయిన అనూహ్య..

తులసమ్మ గుండెలపై వాలిపోయి, తన మనసులో గూడు కట్టుకున్న ఆవేదనంతా చెప్పింది.

అక్కడే ఉండి వాళ్ల మాటలు విన్న రాధ..

"ఏం మాట్లాడుతున్నావ్ అనూ!? ఏ అనుభూతులూ లేకుండానే తల్లివి అవుతున్నావా? మగడన్నాక కాస్త తొందరపాటు సహజం. చూసీచూడనట్టు సర్దుకుపోవాలి కానీ, సంసారాన్ని పాడు చేసుకుంటావా? పదినెలలుగా హర్షను చూస్తూనే ఉన్నాం. అతను చాలా మంచివాడు. నువ్వు లేనిపోనివి ఆలోచించడం మానేసి అతనితో సవ్యంగా ఉండు.." అంటున్న కోడల్ని వారించింది తులసమ్మ.

"అది మీ గారాబం వల్లే ఇలా తయారయ్యింది. ఇప్పుడు ఎలా నచ్చచెప్తారో చెప్పి వాళ్లిద్దరూ అన్యోన్యంగా ఉండేటట్టు చూడండి".. రుసరుసలాడుతూ అక్కణ్నుంచి వెళ్లిపోయింది రాధ.

తల్లి మాటలకు స్థాణువైపోయిన మనవరాల్ని చూస్తుంటే జాలేసింది తులసమ్మకు.

"నానమ్మా! నా భర్త నా ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా నాతో సంసారం చేస్తున్నాడు. కాదంటే రేప్ చేస్తున్నాడు" అని చెప్తున్న మనవరాలితో..

'సర్దుకుపో తల్లీ!' అని ఎలా చెప్పగలదు. కానీ, చెప్పాలి. తప్పదు.

"అమ్మడూ! నీ బాధ నేనర్థం చేసుకోగలను. కాలం మారినా ఆడది తన లైంగిక

వాంఛలను వెల్లడించుకునే స్వేచ్ఛ రాలేదు. మగాడికి అనుకూలంగా ఉండాల్సిందే తప్ప మన కోరికల్ని బయటపెడితే తట్టుకునే భర్తలు ఎక్కడున్నారు? వినడానికి కష్టంగా ఉన్నా ఇదే నిజం. నువ్వు నీకోసమే కాదు. నీ కడుపులో బిడ్డ కోసం కూడా ఆలోచించి, మంచి నిర్ణయం తీసుకోరా!"..

కన్నీళ్లతో తన మొహంలోకి చూస్తున్న మనవరాలి చూపుల్ని తట్టుకునే శక్తి లేక.. అక్కణ్నుంచి వెళ్లిపోయింది తులసమ్మ.

ఇంట్లో అందరూ ఒకటేమాట. తనను సర్దుకుపొమ్మని. హర్షను తప్పు పట్టకపోగా.. మగాడు అలాగే ఉంటాడని సమర్థింపు. ఆడదాని సుఖసంసారానికి పిల్లలు పుట్టడమే చిహ్నంగా భావిస్తున్నది అమ్మ. పిల్లలు ఉన్నవాళ్లందరూ భర్తతో సుఖంగా ఉన్నట్టేనా? తమ అమ్మాయిని ఎవరైనా కామెంట్ చేస్తేనే సహించని కుటుంబసభ్యులు.. పెళ్లిపేరుతో ఆమెపై అత్యాచారం జరుగుతున్నా చూసీ చూడనట్టు ఉంటారు. మూరెడు పసుపుతాడు ముడేసి, అమ్మాయి మనసు తెలుసుకోకుండా ఏం చేసినా ఎవ్వరూ.. ఇదేమని అడగరు. స్త్రీ శరీరం పట్ల అతనికి హక్కు ఎవరిచ్చారు? ఆమే ఒక మనిషేనని, ఆమెకూ శారీరకపరమైన కోరికలు ఉంటాయనే స్పృహేలేని వాళ్లకు ఏం చెప్తే అర్థమవుతుంది. ఆడపిల్ల తన రొమాంటిక్ లైఫ్ గురించి కలలు కనడం తప్పా? తన శరీరానికి ఎలా ఆనందం కలుగుతుందో జీవిత భాగస్వామికి చెప్పడం నేరమా?..

సమాధానంలేని ప్రశ్నలతో రాత్రంతా నిద్రలేకుండానే గడిపింది అనూహ్య.

హర్షతో ఇంటికి వెళ్తున్న కూతుర్ని దగ్గరికి తీసుకొని.. "అనూ! నేను చెప్పేది అర్థం చేసుకో. నీ భర్త చెడ్డవాడేం కాదు. ఆ ఒక్క విషయంలో నువ్వు సర్దుకు పోయావంటే.. నీ జీవితం బాగుంటుంది" కూతురికి హితబోధ చేసింది రాధ. ఆమెకూ కూతుర్ని చూస్తుంటే కష్టంగానే ఉంది. కానీ, తనుమాత్రం ఏం చేయగలదు? ఇంటి పని, ఆఫీస్ పనికి తోడు.. వేవిళ్ల బాధతో సతమతమైపోతున్నది అనూహ్య. భర్త ధోరణిలో మార్పేమీ లేదు. రాత్రి ఓ అరగంట తన శరీరం తనది కాదనుకొని అతనికి అప్పగిస్తున్నది. అయినా అతనికి తృప్తి లేదు. బెడ్ మీద శవంలా ఉంటున్నావంటూ సతాయిస్తుంటాడు. భర్త ప్రవర్తనతో ఆమెలో అసహనం పెరిగిపోతున్నది.

నాలుగురోజుల క్రితం జ్వరం వచ్చి తగ్గడంతో.. నీరసంగా ఉంటున్నది అనూహ్యకు. నాలుగు మెతుకులు తిన్నాననిపించి.. వంటిల్లు సర్దుకొని పడుకోడానికి బెడ్రూమ్‌లోకి వెళ్లింది. ఆమె కోసమే ఎదురుచూస్తున్న హర్ష.. రెండుచేతులతో అనూహ్యను చుట్టేశాడు. ఆమె తన పరిస్థితిని చెప్తున్నా వినిపించుకోవడం లేదు. అంతే.. ఇన్నాళ్ల నుంచీ లోలోపలే ఉన్న అసహనం, అసంతృప్తి లావాలా బయటికి వచ్చాయి. తన బలాన్నంతా కూడదీ–సుకుని అతణ్ని ఒక్కతోపు తోసింది. చేతికందిన ఫ్లవర్‌వాజ్ తీసుకుని భర్త మీదికి విసిరేసి..

"నాకు ఇష్టం లేకుండా నన్ను తాకితే సహించేది లేదు".. గట్టిగా చెప్పి, గదిలోంచి బయటికి వచ్చేసింది. అనూహ్య ఇచ్చిన షాక్ నుంచి తేరుకొని హాల్‌లోకి వచ్చిన హర్ష.. సోఫాలో కూర్చొని 'మైదానం' చదువుతున్న అనూహ్యను అలా చూస్తుండి పోయాడు. కడెం లక్ష్మీ ప్రశాంతి

లక్ష్మీ ప్రశాంతి స్వస్థలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల గ్రామం. బాల్యం నుంచే చందమామ మొదలైన కథల పుస్తకాలను చదివిస్తూ, ప్రశాంతికి పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించారు తల్లి లక్ష్మి. ఆ ఆసక్తితోనే కళాశాల స్థాయి నుంచి కవితలు రాయడం మొదలుపెట్టారు. తనకు మార్గదర్శిగా నిలిచిన తల్లి పేరును ముందు చేర్చుకొని, 'లక్ష్మీ ప్రశాంతి' పేరుతో పాఠకులకు దగ్గరయ్యారు. భర్త అశ్విన్ శ్యామా సాహచర్యంలో ఇతర భాషల సాహిత్యం.. ముఖ్యంగా బెంగాలీ, రష్యన్ సాహిత్యం పరిచయమయ్యాయి. కొన్నేళ్ల విరామం తర్వాత కవిత్వం రాయడంపై దృష్టి పెట్టి, అనేక పోటీలలో బహుమతులు అందుకున్నారు. తల్లి కోరికపై కథలు రాయడం ప్రారంభించారు. 'నిషేధిత స్వప్నం'.. రచయిత్రి మూడో కథ. ఒక స్త్రీ తన లైంగిక స్వేచ్ఛ గురించి, కోరికల గురించి మాట్లాడటం.. ఈనాటికీ పూర్తిస్థాయిలో ఆమోదయోగ్యం కాకపోవడం, లైంగిక చర్యలో ఆమె భావాలకు విలువ లేకపోవడాన్ని ఆధారంగా చేసుకొని రాసిన కథ 'నిషేధిత స్వప్నం'.

**లక్ష్మీ ప్రశాంతి స్వస్థలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల గ్రామం. ఈమె కడెం సోమేశ్వరరావు, కొండపల్లి లక్ష్మి దంపతులకు జన్మించారు. ఈమెకు ఒక సోదరుడు. బాల్యం నుండి లక్ష్మీ ప్రశాంతి తల్లిగారు చందమామ మొదలగు కథల పుస్తకాలు ఆమెతో చదివిస్తూ పుస్తకపఠనం పట్ల ఆసక్తి కలిగించారు. ఆ ఆసక్తే ప్రశాంతి కళాశాల స్థాయికి చేరుకున్నాక చదవడంతో పాటు రాయాలనే తపన కలిగించింది. అలా కవితలు రాస్తూ తన పేరుకి ముందు తనకు మార్గదర్శిగా నిలిచిన తన తల్లిగారి పేరు అయిన లక్ష్మిని చేర్చుకొని "లక్ష్మీ ప్రశాంతి" పేరుతో కవితలు వ్రాస్తూ అనేక పత్రికలకు పంపేవారు. డిగ్రీ తర్వాత అశ్విన్ శ్యామాతో ఆమె వివాహం జరిగింది. అశ్విన్ సహచర్యంలో ఆమెకు ఇతర భాషాసాహిత్యం, ముఖ్యంగా బెంగాలీ, రష్యన్ సాహిత్యం పరిచయమయ్యాయి. లక్ష్మీ ప్రశాంతి రాసిన కవితలకు అనేక పోటీలలో బహుమతులు సైతం అందుకున్నారు.**

**కేవలం కవిత్వానికే పరిమితమైన ఆమె.. వారి అమ్మగారి కోరికపై కథలు వ్రాయడం మొదలుపెట్టారు. అలా ఆమె రాసిన "నిషేధిత స్వప్నం" కథ ఆమె మూడోవ కథ. ఒక స్త్రీ తన లైంగిక స్వేచ్ఛ గురించి, కోరికల్ని గురించి మాట్లాడటం ఈనాటికి పూర్తిస్థాయిలో ఆమోదయోగ్యం కాకపోవడం, లైంగిక చర్యలో ఆమె ఫీలింగ్స్‌కి విలువ లేకపోవడాన్ని బేస్ చేసుకొని వ్రాసిన కథ "నిషేధిత స్వప్నం".**

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 276

# సెల్యూట్



శ్రీసుధామయి
**79810 85444**

పువ్వులన్నీ కొలువు తీరాయి. పూలవనాలు బారులు తీరాయి. వీర జవానులకు స్వాగతం చెప్పడానికి.. అన్నట్టు. పూలతోటల స్వర్గంగా భాసిల్లుతున్న ప్రాంతం.. 'ఈశాన్య రాష్ట్రాలలో అక్కాచెల్లెళ్లు' అని పేరు గాంచిన రాష్ట్రాలలో ఒకటైన అరుణాచల్ ప్రదేశ్. వీర జవానుల కవాతును విస్ఫారిత నేత్రాలతో వీక్షిస్తూ.. తమకు తాముగా కొమ్మలను వీడి.. వారి శిరస్సులను పూలవర్షంతో అభిషేకిస్తున్నాయి. తల మీదుగా నేలరాలిన పువ్వులు.. వీర జవానుల పాదాల స్పర్శను తమ వీపున మోస్తూ, సగర్వంగా తలెత్తి చూసి సెల్యూట్ చేస్తున్నాయి.

మెక్‌మోహన్ రేఖ. సరిహద్దులో భారత సైన్యం డేగ కళ్లతో పహరా కాస్తున్నది. సరిహద్దుకు ఆవలివైపున.. ఓ కొండ ప్రాంతంలో ఓ గుడారం. అక్కడ వందల సంఖ్యలో చైనా సైనికులు మోహరించి ఉన్నారు. క్రమంగా చీకటి పడింది.

గుడారం చుట్టూ లైట్లు వెలిగాయి. ఇంతలో రెండు వాహనాలు దుమ్ము లేపుకొంటూ వచ్చి, ఆ గుడారం వద్ద ఆగాయి. అందులోంచి పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన ఇద్దరు ఆర్మీ కమాండర్లు దిగారు. వారిని చూసి అక్కడ ఉన్నవారంతా సెల్యూట్ చేశారు. వారిద్దరూ గుడారంలోకి ప్రవేశించి, ఏదో మాట్లాడుకుంటూ.. ఎవరికోసమో ఎదురు చూస్తూ ఉండిపోయారు. మరికాసేపటికి అక్కడికి మరో వాహనం వచ్చి ఆగింది. అందులోంచి దిగిన ఒక కెప్టెన్.. వడివడిగా గుడారంలోకి ప్రవేశించాడు. కొద్దిసేపటి తర్వాత ఆ గుడారంలో రహస్య సమావేశం మొదలైంది. ఇద్దరు కమాండర్లలో ఒకరు తన దగ్గరున్న మ్యాప్‌ను బయటికి తీశాడు. మ్యాప్‌ను కెప్టెన్‌కు చూపిస్తూ వివరించడం మొదలుపెట్టాడు.

"భారత భూభాగంలో మన సైనికులు ఎంత మేరకు ఆక్రమించారో తెలిపే మ్యాప్ అది".. అని చెప్పాడు. అది చూసిన కెప్టెన్..

"మనం అనుకున్నది సాధించడానికి చాలా దగ్గరలో ఉన్నాం!" అన్నాడు. ఇంకొక కమాండర్‌ను చూస్తూ..

"మనం ఇక్కడినుంచి కొన్ని కిలోమీటర్ల దూరంలోని డోక్లామ్ వరకూ తవ్విన సొరంగం ఉంది కదా.. దానికి సరైన రక్షణ ఏర్పాటు చేశారా?" అని అడిగాడు. దాంతో ఆ కమాండర్..

"మన సైనిక బలగం ఆ పరిసర ప్రాంతంలో బంకర్లు ఏర్పాటు చేసుకుంది. ఆ బంకర్ల నుంచే వారు తమ విధులు నిర్వహిస్తున్నారు కెప్టెన్!" అని చెప్పాడు.

"నేను మీకు ఆయుధాలతో నింపిన మిలటరీ వాహనాలు, కొన్ని డిస్ట్రాయర్లు, ఇంకా రాకెట్ ప్రొజెక్టర్లు ఏర్పాటుచేస్తాను. మీరు ఎంత తొందరగా గ్రామాలు నిర్మిస్తే అంత తొందరగా మనం ఈ ప్రాంతాలను స్వాధీనం చేసుకోవచ్చు" అన్నాడు కెప్టెన్.

"మీరు ఆయుధ సంపత్తిని మాత్రం అందజేయండి. మిగిలింది మేం చూసుకుంటాం" అన్నారు ఇద్దరు కమాండర్లు. క్రూరమైన నవ్వు మొహంలో కదలాడుతుండగా.. ఒక కమాండర్ పైకి లేచి, ఇండియా మ్యాప్ తీసుకున్నాడు. కెప్టెన్ ఎదుట ఉన్న టేబుల్ మీద పరిచాడు. మ్యాప్‌ను చూపిస్తూ.. బలంగా కొట్టి కెవ్వున అరిచాడు. అతని చేయి టేబుల్ మీద ఉన్న మేకును బలంగా తాకింది. రక్తం చివ్వున పొంగి.. మ్యాప్‌లో తాము ఆక్రమించిన భాగంలో చిమ్మింది. మ్యాప్‌లోని ఆ ప్రాంతం రక్తవర్ణంతో తడిసిపోయింది. ఆ కమాండర్ తన కుట్రకు తగిన మూల్యం చెల్లించుకున్నాడు. అది చూసిన కెప్టెన్ వారిద్దరిని చూస్తూ..

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 278

"ఇదే పనికిరాని ఆవేశం.. ఇదే తెలివి తక్కువతనం.. ఇదే మూర□త్వం.. మనల్ని చావుదెబ్బ తీసింది తెలుసా?" అన్నాడు. ఆ మాటలు వింటూ, రక్తమోడుతున్న చేతిని చూస్తూ తల కిందికి వంచుకున్నాడు ఆ కమాండర్.

"సరిగ్గా యాభై ఎనిమిది సంవత్సరాల కింద మనం ఇలాగే తల వంచుకున్నాం!" అంటూ కుర్చీలోంచి పైకి లేచాడు. సిగరెట్ వెలిగించుకుని, గుప్పున పొగ వదులుతూ గుడారం బయటికి నడిచాడు. దూరంగా అక్కడక్కడా సైనికులు గస్తీ తిరుగుతున్న భారత భూభాగం. ఆ భూమిని తదేకంగా చూస్తున్న కెప్టెన్‌కు ఒక్కసారిగా వెన్ను జలదరించింది. ఆ జలదరింపు.. తెలియని ఒక హెచ్చరికలా అనిపించింది. తిరిగి గుడారంలోకి వచ్చి, అక్కడున్న కుర్చీలో కూర్చుని కళ్లు మూసుకున్నాడు. దీర్ఘమైన శ్వాస తీసుకుని వదులుతూ వారిని చూస్తూ గతాన్ని చెప్పడం ఆరంభించాడు.

"అది 1962వ సంవత్సరం. మనకు ఇండియాకు నూరనాంగ్ యుద్ధం మొదలైన కాలం. ఆ యుద్ధంలో చావు తప్పి కన్ను లొట్టబోయింది అన్న తీరులో మనం విజయం సాధించాం. శత్రువైనా మెచ్చుకోక తప్పనిసరి పరిస్థితి. కారణం.. జస్వంత్ సింగ్ రావత్ అనే ఇండియన్ రైఫిల్ మాన్. మన సైనికులు ఇండియా సైన్యాన్ని విజయవంతంగా ఎదుర్కోవడంతో వారందరూ వెనుతిరిగారు. కానీ, వారిలో ఒకే ఒక్కడు.. అతడే ఒక సైన్యమై.. మనవాళ్లను ముప్పుతిప్పలు పెట్టాడు. ఒక్కడే మూడు రోజులపాటు పోరాడి మన సైనికులను దాదాపు మూడొందల మందిని మట్టుబెట్టాడు. ఇదంతా ఆ ఒక్కడు కొండ మీద ఉన్న కనుమల్లో ఉండి, ఎంతోమంది సైన్యం ఉన్నట్టు మనకు భ్రమ కల్పించాడు. ఈ వ్యూహంలో అతడు ఎంతో విజయం సాధించాడు. మన సైనికులను ముప్పుతిప్పలు పెట్టి ఏం జరుగుతున్నదో అర్థం కాని పరిస్థితిని కలిగించాడు. ఆ వీరోచిత పోరాటం చూసిన మన సైనికులు భయంతో వెనక్కి తగ్గారు. ఏం చేయాలో తెలియక మన సైనికులు.. జస్వంత్ సింగ్ ఉన్న కనుమల చుట్టూ కాపలా ఉండిపోయారు. అక్కడ ఎంతమంది ఉన్నారో తెలుసుకోవడానికి ప్రయత్నాలు చేయసాగారు. అదే సమయంలో ఆ వీరుడికి ఆహారం తీసుకెళ్తున్న ఒక వ్యక్తి మన సైనికులకు దొరికాడు. మన సైన్యం అతణ్ని పెట్టిన చిత్రహింసలను భరించలేక అతడు నిజం చెప్పేశాడు. అది విన్న మన సైనికులతోపాటు నేను కూడా ఆశ్చర్యపోయాను. కారణం.. అప్పుడు మన బెటాలియన్‌కు నాయకుణ్ని నేనే. ఆ ఆశ్చర్యం నుంచి తేరుకోకముందే మన సైన్యం జస్వంత్ సింగ్ శిబిరాన్ని చుట్టుముట్టింది. అతడి వీరత్వాన్ని, దేశభక్తిని చూసి నేను క్షణకాలం అసూయ

చెందాను. దేశభక్తికి నిజమైన నిర్వచనం జస్వంత్ సింగ్ రావత్.

అంతమంది తన శిబిరాన్ని చుట్టుముట్టినా, అంతటి క్లిష్ట సమయంలోనూ జస్వంత్ తన పోరాటాన్ని వదలలేదు. ఒక్కడే చివరి నిమిషం వరకు వీరోచితంగా పోరాడి.. మన సైనికులను రెండొందల మందిని మట్టుబెట్టాడు. చివరికి ఎవరికీ దొరకకుండా తనను తాను కాల్చుకుని మరణించాడు"..

మాటలు పూర్తికాగానే.. ఒక్కసారి దీర్ఘంగా శ్వాస తీసుకుని, కళ్లు మూసుకుని అలా ఉండిపోయాడు కెప్టెన్. ఆ శిబిరంలో జస్వంత్ సింగ్ గురించి వివరిస్తుంటే గాలి కూడా స్తంభించిపోయింది.జస్వంత్ సింగ్ వీరత్వం గురించి ఊపిరి పీల్చుకోవడం కూడా మర్చిపోయి వింటున్న ఇద్దరు కమాండర్లు తెప్పరిల్లి నోటమాట రాక ఉండిపోయారు. కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత.. కెప్టెన్‌ను చూస్తూ ..

"ఇప్పటికీ తవాంగ్ జిల్లాలో బాబా జస్వంత్ పేరుతో స్థానికులు ఆరాధిస్తున్న వ్యక్తి. మరణించిన తర్వాత కూడా సరిహద్దుల్లో ఇప్పటికీ అతడి ఆత్మ విధులను నిర్వహిస్తున్న వ్యక్తిగా పేరు పొందిన జస్వంత్ సింగ్! మీరు చెప్పిన జస్వంత్ సింగ్.." అంటూ అర్ధోక్తిలో ఆగిపోయాడు ఒక కమాండర్. ఆ మాటలకు కెప్టెన్ తలూపుతూ..

"ఆ ముగ్గురూ ఒక్కడే!" అన్నాడు. కెప్టెన్ మాటలను విన్న ఇద్దరు కమాండర్లు జస్వంత్ సింగ్ దేశ భక్తికి తలవంచి అలా ఉండిపోయారు. కొద్దిసేపటి తర్వాత కెప్టెన్ పైకి లేచాడు.

"మనం ఇక సమావేశం ముగిస్తున్నాం. మీరు ఆవేశంతో కాకుండా ఆలోచనతో ప్రవర్తించండి. ఇండియా సైన్యం మనకంటే ఎన్నో రెట్లు బలమైనది. ఇండియన్ ఆర్మీలో ఒక్కో సైనికుడు ఒక్కో మిసైల్‌తో సమానం. మన ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయాలి. మన దగ్గర ఆయుధాలు మాత్రమే ఉంటాయి. కానీ, వారి దగ్గర దేశభక్తి అనే మారణాయుధం.. హ్యూమన్ బాంబ్ లాంటిది. దేశం కోసం మృత్యువుతోనైనా కలబడే తెగింపు వాళ్లది. అప్రమత్తంగా మెలగండి" అని చెప్పి, అక్కడి నుంచి నిష్క్రమించాడు.

కెప్టెన్ వెంటే.. ఆ కమాండర్లు కూడా అక్కడినుంచి వెళ్లిపోయారు. కొంతసేపటి తర్వాత డ్రాగన్ సైనికులంతా ఏమరుపాటుగా ఉన్న సమయంలో.. ఒక సైనికుడు ఆ ప్రదేశం నుంచి మెల్లగా ముందుకు వెళ్లడం మొదలుపెట్టాడు. గస్తీ తిరగడానికే అన్నట్టు

మరింత ముందుకు నడిచాడు. అక్కడ కొద్దిసేపు అటూఇటూ తిరిగాడు. చుట్టుపక్కల నిశితంగా పరిశీలించి, తనను ఎవరూ గమనించడం లేదని నిర్ధారించుకున్న తర్వాత.. ఆ సైనికుడు చీకటిలో కలిసిపోయాడు. వడివడిగా అడుగులు వేస్తూ మెక్‌మోహన్ సరిహద్దు రేఖను చేరుకున్నాడు. ఒక పెద్దగుట్ట చాటున నెగడు ఏర్పాటు చేసి.. తన దుస్తులపై ధరించిన డ్రాగన్ సైనిక దుస్తులను ఆ మంటలో తగలబెట్టాడు. తన ఒంటిపై ఉన్న దుస్తులను ఒకసారి చూసుకున్నాడు. తన భుజం మీదుగా.. యూనిఫాంపై ఉన్న 'మువ్వన్నెల జెండా'.. ఆ మంటల వెలుతురులో మరింత వెలిగిపోతూ కనిపించింది. అది చూసిన ఆ వ్యక్తి పెదాలు సన్నగా విచ్చుకున్నాయి. వెంటనే అక్కడినుంచి వెళ్లిపోవడానికి సిద్ధమయ్యాడు. సుదూరంగా కనిపిస్తున్న శిబిరాన్ని చేరుకోవాలని ముందుకు నడిచాడు. అప్పటికే తూర్పు దిక్కున వెలుగురేఖలు విచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి.

భారత భూభాగంలోని శిబిరం. లోపల ఇద్దరు మేజర్ జనరల్స్. ఇద్దరు బ్రిగేడియర్స్. సరిహద్దు ఉద్రిక్తతల గురించి, డ్రాగన్ దురాక్రమణల గురించి తీవ్రమైన చర్చలు కొనసాగిస్తున్నారు. డ్రాగన్ సరిహద్దుల నుంచి వచ్చిన ఆ సైనికుడు భారత శిబిరం వద్దకు చేరుకున్నాడు. ఆ సైనికుణ్ని చూసిన అక్కడున్న సైనికుల వదనాలలో చిరునవ్వు విరిసింది. శిబిరం లోపలికి అడుగుపెట్టి.. అక్కడున్న అధికారులకు సెల్యూట్ చేశాడు.

"దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టడం భారత సైన్యం తన శ్వాసగా జీవిస్తున్నది" అని ఒక బ్రిగేడియర్.. పక్కనున్న మరో బ్రిగేడియర్‌తో చెప్పాడు.

ఈ సైనికుడు తన భుజాన ఉన్న మువ్వన్నెల జెండాను జాగ్రత్తగా తీసి, ఆ జెండా వెనుక అమర్చి ఉన్న శక్తివంతమైన చిన్న రికార్డర్‌ను బయటికి తీశాడు. దాన్ని జాగ్రత్తగా మేజర్‌కు అందించాడు. తిరిగి వారికి సెల్యూట్ చేసి.. శిబిరం బయటికి వచ్చాడు. తన తోటి సైనికుల దగ్గరికి వెళ్లి.. ఏమీ జరగనట్టే తన విధుల్లో మునిగిపోయాడు. శిబిరంలో ఉన్న నలుగురు ఆ రికార్డును జాగ్రత్తగా వినసాగారు. అది వింటుంటే వారందరి వదనాలు జేవురించాయి. డ్రాగన్ దేశ కుట్రలు, పన్నాగాలు విన్న వారందరూ.. వాటిని ఎలా నిలువరించాలో తమలో తామే చర్చించుకోసాగారు.

"ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి మన సైనిక బలగం సరిపోయినా, ఇది సైన్యం మాత్రమే ఎదుర్కోగల విషయం కాదు" అని ఒక బ్రిగేడియర్ అన్నాడు.

"డ్రాగన్ దేశాన్ని, వారి ఆగడాలను ఎదుర్కోవడానికి వారి వ్యూహాలను తిప్పికొట్టడానికి తగిన సమర్థులు కావాలి" అని ఇంకొక బ్రిగేడియర్ చెప్పాడు.

"వారి ఎత్తులను చిత్తు చేస్తూ.. పైఎత్తు వేసే సమర్థుడు ఇప్పుడు ఎంతో అవసరం" అని అక్కడున్న ఒక మేజర్ అన్నాడు. ఇంకొక మేజర్ ఏమీ మాట్లాడకుండా ఆలోచిస్తూ ఉండిపోయాడు. కొద్దిసేపటి తర్వాత..

"డ్రాగన్ దేశం ఆగడాలను నిలువరించడానికి నా దృష్టిలో ఒకే ఒక వ్యక్తి ఉన్నాడు" అన్నాడు ఆ మేజర్. మిగిలిన ముగ్గురూ కుతూహలంతో.. 'ఆ వ్యక్తి ఎవరా? మేజర్ ఏం చెప్తాడా?' అని చూడసాగారు. మేజర్ అక్కడున్న ప్రొజెక్టర్ ఆన్ చేశాడు. స్క్రీన్‌పైన ఒక వ్యక్తి. చురుకైన చూపులతో కొదమసింహంలా కనిపిస్తున్నాడు. ఉరుమును ఒడిసిపట్టగల పిడుగులా ఉన్నాడు. మేజర్ ప్రొజెక్టర్ ఆఫ్ చేసి..

"విక్రమ్ సింగ్ రావత్! ఆవేశం కొండంత.. దేశభక్తి ఆకాశమంత.." అని చెప్పాడు. ఇంకొక మేజర్ మిగిలిన వారిని చూస్తూ..

"ఈ వ్యక్తిని ఆర్మీలోకి తీసుకోవడానికి మనం తిరస్కరించాం కదా!" అన్నాడు.

"ఎస్.. విక్రమ్ సింగ్ రావత్ ఆర్మీలో సెలెక్ట్ కాకుండా తిరస్కరించడానికి కారణం.. అతని ఆవేశం మాత్రమే!" అన్నాడు మేజర్.

"ఇంటర్వ్యూలో 'శత్రుసైనికులు దాడి చేస్తేనో.. ఎదురైతేనో ఏం చేస్తావు?' అని అడిగిన ప్రశ్నకు ఇతని సమాధానం.. 'శత్రు సైనికులు కంటబడితే చంపేస్తాను!' అని. క్రమశిక్షణను కటువుగా పాటించే భారత ఆర్మీలో, ఇలాంటి ఆవేశపరుణ్ని ఎలా తీసుకోవాలి? అనే కారణంతో అతన్ని పక్కన పెట్టాం. కానీ, అతడి రికార్డు చూస్తే.. ఆ వ్యక్తి ఊరి నుంచి కొన్ని వివరాలు మనకు చేరాయి. విక్రమ్ అన్యాయాన్ని సహించే మనిషి కాదనీ, న్యాయం కోసం ఎంతవరకైనా తెగించి పోరాడుతాడని ఆ రికార్డులు చెప్తున్నాయి. దేశభక్తి, ఆవేశం, ఆలోచన.. అన్నిటికీ మించి యునిఫామ్ ధరించాలన్న అతనిలోని బలమైన కోరిక మనకు అనుకూలంగా ఉన్నాయి. విక్రమ్ సింగ్ రావత్ ఈ సర్జికల్ స్ట్రయిక్‌కు సమర్థుడని నా అభిప్రాయం!" చెప్పాడు మేజర్. అతని మాటలతో అంతా ఏకీభవించారు. అత్యవసర సమావేశంలో ప్రధాని, కేంద్ర హోంమంత్రి, త్రివిధ దళాధిపతి.. రాష్ట్రపతి తమ ఆమోదముద్ర వేశారు. 'లైసెన్స్ టు కిల్'.. అంటూ డ్రాగన్‌పై యుద్ధానికి అండర్ కవర్ వన్‌మ్యాన్ ఆర్మీగా విక్రమ్ సింగ్ రావత్‌ను ఎంపిక చేశారు.

మెక్‌మోహన్ రేఖ దాపునే ఉన్న శిబిరం.. లోపల ఉన్న ఓ వ్యక్తిని చూస్తూ..

"మిస్టర్ విక్రమ్ సింగ్ రావత్! జరిగినదంతా విన్నావు కదా! నీతో ఒక సైనిక

బెటాలియన్ వస్తుంది. డ్రాగన్ దేశాన్ని, ఆ దేశ ఆగడాలను నిలువరించాలి. అవసరమైన ఆయుధాలు కూడా మీతో వస్తాయి" అన్నాడు కల్నల్. అందుకు విక్రమ్ సింగ్ ఏదో చెప్పబోయేంతలో.. శిబిరానికి కొద్ది దూరంలో ఏదో కలకలం. ఇంతలో శిబిరంలోకి ఒక సైనికుడు పరుగుపరుగున వచ్చాడు.

"కల్నల్ సాబ్.. డ్రాగన్ సైనికులు మన సైనికుల మీద దాడి చేశారు. సరిహద్దు వెంట యుద్ధ వాతావరణం నెలకొని ఉంది" అని చెప్పాడు. అది విన్న విక్రమ్ సింగ్ ఆవేశంతో పైకి లేచాడు. కల్నల్ వెంటనే..

"విక్రమ్ సింగ్.. మీరు వెళ్లండి. మీకు కావాల్సిన ఆయుధాలను మన బెటాలియన్ మీకు అందజేస్తుంది" అన్నాడు.

"కల్నల్ సాబ్! నాకు మామూలు ఆయుధాలతో పని లేదు. ఈ ఆపరేషన్‌కు నాకు కావాల్సినవి ఇవే!".. అంటూ ఒక పేపర్‌పై రాశాడు. దాన్ని కల్నల్‌కు అందించి అక్కడి నుంచి బయల్దేరాడు.

విక్రమ్ రాసిన వివరాలు చూసి కల్నల్ ఆశ్చర్యపోయాడు. శత్రు సైనికులను విక్రమ్ ఎలా నిలువరిస్తాడో అర్థమైన కల్నల్ మోముపై చిరునవ్వు విరిసింది.

సరిహద్దు ప్రాంతాన్ని చేరుకున్నాడు విక్రమ్. అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. ఎదురుగా ఉన్న కొండల చాటు నుంచి డ్రాగన్ సైనికులు విచక్షణరహితంగా కాల్పులు జరుపుతున్నారు. మన సైనికులు దీటుగా ఎదుర్కొంటున్నారు. అక్కడికి వెళ్లిన విక్రమ్ సింగ్ పరిసరాలన్నీ జాగ్రత్తగా పరికిస్తున్నాడు. ఇంతలో అక్కడికి చేరుకున్న బెటాలియన్ సైనికులు విక్రమ్ దగ్గరికి వచ్చారు. వారు తెచ్చిన వస్తువులను తాను చెప్పినట్టు అమ–ర్చమని కోరాడు విక్రమ్ సింగ్. అన్ని వస్తువులనూ విక్రమ్ సింగ్ చెప్పినట్టుగానే ఆ ప్రాంతంలో అమర్చారు సైనికులు. వారందరినీ పక్కకు వెళ్లమని చెప్పి తన పని మొదలుపెట్టాడు విక్రమ్ సింగ్.

విద్యుదయస్కాంత వికిరణ రూపాలైన మైక్రోవేవ్ తరంగాలు అవి. వాటినే తన ఆయుధాలుగా మార్చుకున్నాడు విక్రమ్. డైరెక్ట్ ఎనర్జీ వెపన్స్ అయిన మైక్రోవేవ్ కిరణాలను దూరంగా కనిపిస్తున్న కొండల మీదికి ప్రసరింప చేయసాగాడు. క్రమంగా ఆ కిరణాల వేవ్‌లెంగ్త్ (తరంగ దైర్ఘ్యం) ఒక మిల్లీ మీటర్ నుంచి ఒక మీటర్ వరకు మారింది. హై ఎనర్జీ రేడియో ఫ్రీక్వెన్సీలు కంటికి కనిపించని వేగంతో, తరంగాల రూపంలో దూసుకెళు_న్నాయి. ఆ ఫ్రీక్వెన్సీని క్రమంగా పెంచసాగాడు విక్రమ్.

ఫిరంగులు, తుపాకులు, బుల్లెట్లు ఉపయోగించకుండా.. కేవలం అతి నీలలోహిత కిరణాలను ప్రయోగించి శత్రుమూకలతో యుద్ధం చేస్తున్నాడు విక్రమ్.

ఆ నాన్–కాంటాక్ట్ వార్ ఫేర్‌లో.. ఎక్కడో కొండలలో, గుట్టల మాటున ఉన్న కొన్ని వందలాది మంది డ్రాగన్ సైనికులు ఆ కిరణాల ప్రభావంతో ఎక్కడి వారక్కడ కుప్పకూలిపోసాగారు. కేవలం కొన్ని గంటల్లోనే వారందరూ నిర్వీర్యులై ఒక్కరు కూడా ప్రతిదాడి చేయడానికి వీలు లేకుండా చేశాడు విక్రమ్ సింగ్. అది చూసిన మన సైనికులు హర్షధ్వానాలు చేస్తూ విక్రమ్ సింగ్‌ను అభినందించారు. తర్వాత అక్కడున్న బెటాలియన్ సైనికులకు కొన్ని సూచనలు అందచేసి, వారితోపాటు డ్రాగన్ దేశం సొరంగాలు, గ్రామాలు నిర్మించిన ప్రదేశానికి బయల్దేరాడు విక్రమ్ సింగ్. ఎదురుగా కొన్ని కిలోమీటర్ల దూరంలో డ్రాగన్ దేశం నిర్మించిన సొరంగాలు, గ్రామాలు ఉన్నాయని గుర్తించాడు. తనతో వచ్చిన బెటాలియన్ సైనికులకు.. 'టి.. రెక్స్' అనే నిఘా పరికరాలను అందించాడు. లాంగ్ రేంజ్ అబ్జర్వేషన్ సిస్టం అని పిలిచే ఆ నిఘా వ్యవస్థ పరికరాల ద్వారా కొన్ని కిలోమీటర్ల దూరంలో డ్రాగన్ దేశం నిర్మించిన గ్రామాలను చూడటం మొదలుపెట్టారు. ఎదురుగా ఉన్న గ్రామాలలో ఇళ్లలాంటి నిర్మాణాలు దాదాపు వంద వరకూ ఉన్నాయి. గ్రామాలను కలిపే తారు రోడ్లు అప్పటికే పూర్తయ్యాయి. అవన్నీ భారత భూభాగంలోకి చొచ్చుకుని వచ్చి మరీ నిర్మించారు. ఎక్కడ చూసినా ఆలివ్ గ్రీన్ రంగు ట్రక్కులు నిలబెట్టి ఉన్నాయి. సొరంగాలు తవ్వుతున్నట్టు ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అవన్నీ గమనిస్తున్న మన సైనికులకు ఆవేశం ఉప్పొంగుతున్నది. అన్నిటినీ నిశితంగా పరిశీలిస్తున్న విక్రమ్ సింగ్ ఆదేశాల కోసం వేచి ఉన్నారు వారందరూ. ఒక్కసారిగా..

"ఫైర్!" అని ఆదేశించాడు విక్రమ్ సింగ్.

అందుకోసమే ఎదురుచూస్తున్న సైనికులంతా ఒక్కసారిగా ఆ నిర్మాణాలపై ఫిరంగి గుళ్ల వర్షం కురిపించారు. దీంతో నిర్మాణాలన్నీ ఒక్కసారిగా భూకంపం వచ్చినట్టుగా కుప్ప కూలిపోయాయి. అది చూసిన భారత సైనికులు దేశభక్తిని అణువణువునా నింపుకొని హర్షధ్వానాలు చేయసాగారు. డ్రాగన్ దేశంపై సర్జికల్ స్ట్రయిక్‌ను విజయవంతంగా పూర్తిచేసిన విక్రమ్ సింగ్ రావత్.. కల్నల్ ఎదురుగా ఉన్నాడు. తాను ధరించిన సైనిక యూనిఫామ్‌ను కల్నల్ ఎదుట ఉంచాడు.

"ఇక నాకు ఈ యూనిఫామ్‌తో పనిలేదు. ఒక్కసారైనా ఈ యూనిఫామ్ ధరించాలనే

కోరిక ఉండేది. దేశభక్తినే యూనిఫామ్‌గా ధరించాను. ఈ దేశంకోసం ఎప్పుడైనా.. నా ప్రాణాలు త్యాగం చేయడానికి నేను సిద్ధంగా ఉంటాను".. సెల్యూట్ చేస్తూ చెప్పాడు విక్రమ్ సింగ్ రావత్. శత్రువులను వేటాడిన సింహం వెనుతిరిగింది.

"మిస్టర్ విక్రమ్ సింగ్ రావత్.. గ్రాండ్ సన్ అఫ్ గ్రేట్ వారియర్ జస్వంత్ సింగ్! మీ తాత రక్తం, దేశభక్తి నీలో నిలువెల్లా నిండి ఉంది. ఈ క్షణం నుంచి యూనిఫామ్ లేని సైనికుడివి నువ్వు. దేశాన్ని కాపాడే యోధుడివి. రాష్ట్రపతి ప్రత్యేక అనుమతితో నియమించబడ్డ సోల్జర్‌వి. నీ సాహసాన్ని భారతసైన్యం విస్మరించదు!".. విక్రమ్ సింగ్ రావత్ భుజం తట్టి, చెప్పాడు కల్నల్.

సాహసమే శ్వాసగా ముందుకు నడుస్తున్నాడు విక్రమ్ సింగ్ రావత్.

**శ్రీసుధామయి.**

**శ్రీసుధామయి స్వస్థలం వజ్రకరూరు మండలం, గంజికుంట గ్రామం. ఎంబీఏ పూర్తిచేశారు. ఆమె దాదాపుగా 80 కథలు, పదహారు నవలలు రాశారు. ఈనాడు, స్వాతి, విపుల, ఆంధ్రభూమి, డైలీ, వీక్లీ, మంత్లీ, అంతర్జాల పత్రికల్లో ఈమె రచనలు అచ్చయ్యాయి. హారర్. కామెడి, క్రైమ్, థ్రిల్లర్, ఫిక్షన్, రొమాన్స్, మానవ సంబంధాలు, ఇలా అన్ని జోనర్స్‌లో రచనలు చేశారు. డిటెక్టివ్ సిద్ధార్థ, జ్వాలాముఖి మంత్రాలదీవి, మాయాద్వీపం, పచ్చల లోయ- పాతాళసుందరి .. అద్భుతలోకం, నాగకిరీటం, మణిద్వీపరహస్యం, మహాతలం-మాయాదర్పణం, భూతాలదీవి-భేతాళమాంత్రికుడు, అదృశ్యవనం, గుప్పెడంత ఆకాశం.. ఇలా విభిన్నమైన జోనర్లలో, తెలుగులో వున్న అన్ని పత్రికల్లో ఈమె రచనలు ప్రచురితమయ్యాయి.**

# ఆడపులి



**పుట్టగండి గోపీకృష్ణ**
**9491091620**

గూడెం ఘొల్లుమంది.

లోతువాగులో చేపలు పట్టటానికి పోయిన కుర్రాడిని పులి కరుచుకు పోయిందని తెలిసి ఆడామగ, పిల్లజెల్ల, ముసలిముతక & అందరు కన్నీరుమున్నీరయ్యారు. గూడెం పెద్ద పోచయ్య ఆగమేఘాల మీద దహెగాంలోని ఫారెస్టు ఆఫీసుకు బయలుదేరాడు.

ఆఫీసు బయటే ఆపిన సిబ్బందికి జరిగింది ఏంటో చెప్పాడు పోచయ్య. 'మళ్లీ పులి బెడద మొదలయ్యిందన్న మాట' అన్నాడు గార్డు యాదగిరి. 'కడుపు నిండ తింటానికి బువ్వ లేకపోయినా ఏసంది మీకు చెప్పుకోనీకి రాలె. సెలిమల్ల సుక్క నీళ్లు లేకపోయినా సాయం అడగలే. అబంసుబం తెలీని పిల్లల్ని కనేది మెకానికి తినబెట్టనీకా అని అడగటానికి వచ్చిన' ఆవేశంగా అన్నాడు పోచయ్య.

'ఏం పోచయ్యో! నోరు లేస్తందే మేమేమన్నా పులిని తీసుకొచ్చి మీ గూడెంలో వదిలామా? అదేదో మా తప్పయినట్లు అంటుండవే' అన్నాడు యాదగిరి.

'ఇయ్యన్నీ కాదు గానీ, మెకాన్ని మీరు సంపుతరా? మమ్మల్ని సంపమంటరా?' అన్నాడు పోచయ్య. 'సంపుతాడంట, సంపుతాడు. అట్ల చేస్తే బొక్కలో పెడతారు. అయినా పోయి లోపల ఆఫీసరుతో చెప్పుకో.

ఏం దారి చూపిస్తుందో?' అని వెటకారం చేస్తూ, లోపలకు దారి చూపించాడు యాదగిరి.

లోపల గదిలో కొత్తగా వచ్చిన, పట్టుమని పాతికేళ్లు లేని యువతి కూర్చుని ఉంది. ఆమే ఫారెస్టు రేంజ్ ఆఫీసరని తెలిశాక ఏం చెప్పుకోవాలో అర్థం కాలేదు పోచయ్యకి. పెద్ద చదువులు చదివిన ఆడాళ్లతో ఎట్ట మాట్లాడాలో అతనికి తెలియదు.

పోచయ్యకి, తమ గార్డు యాదగిరికి మధ్య జరిగిన సంభాషణ లోపల గదిలో కూర్చుని ఉన్న కళ్యాణికి వినిపిస్తూనే ఉంది. నిజానికి ఆమెకు వినపడాలనే అవసరానికి మించి గొంతు పెంచి మాట్లాడుతున్నాడు యాదగిరి. ఉద్యోగంలో చేరిన రోజు నుండి యాదగిరి ఇలాంటి వ్యంగ్యపు మాటలు మాట్లాడటం వింటూనే ఉంది కళ్యాణి. అవి ఒక స్త్రీని తమ పై అధికారిగా చూడలేని మగ అహంభావపు ప్రేలాపనలని ఆమె అర్థం చేసుకుంది. ఊరుకున్న కొద్దీ& అవి మరింత ఎక్కువవుతున్నాయి. అయినా ప్రస్తుతం ఇది సందర్భం కాదు కాబట్టి, లోపలకు వచ్చిన పోచయ్యను, 'ఏమయింది పెద్దయ్యా?' అని సౌమ్యంగా అడిగింది ఆమె.

ఏం జరిగిందో వివరించాడతను.

వెంటనే అతన్ని జీపులో ఎక్కించుకుని తన సిబ్బందితో గూడానికి బయలుదేరింది కళ్యాణి. తెలంగాణ, మహరాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న కొమరం భీమ్ జిల్లాలోని పెంచికల్పేట్ ప్రాంతం దట్టమయిన అడవులకు ఆనుకుని ఉంటుంది. పెద్దపులులు గడ్డి మేయటానికి వెళ్ళిన ఏ పశువునో, ఊర్లో కట్టేసి ఉన్న మేకనో పట్టుకు పోవటం అప్పుడప్పుడూ జరుగుతుంటుంది. అయితే మనిషి మీద దాడి చేయటం అన్నది ఎప్పుడో కానీ జరగదు.

జీపు లోతువాగుని సమీపించింది. అప్పటికే అక్కడకు గుంపులు గుంపులుగా జనం చేరుకున్నారు. చనిపోయిన కుర్రాడి బంధువుల రోదనలు బిగ్గరగా వినిపిస్తున్నాయి. కళ్యాణి పరిసరాలు జాగ్రత్తగా పరీక్షించింది. కుర్రాడిని అడవిలోకి ఈడ్చుకుపోయిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కళ్యాణితో ఉన్న సిబ్బందిలో మల్లేశం అనుభవజ్ఞుడు. ఇలాంటివి ఎన్నో చూశాడు. అక్కడి కాలి ముద్రలు చూసి, 'ఇది పెద్ద పులే' అని ఖరారు చేశాడు.

కళ్యాణి గూడెం వాళ్లని సముదాయించి, అతి త్వరలో ఆ పులిని బంధించటం జరుగుతుందని, అప్పటివరకు ఎవరూ ఒంటరిగా బయట తిరగవద్దని చెప్పింది. ఆమె చెప్పిన మాటలు ఎవరూ నమ్మకపోయినా, అంత కంటే చేయగలిగింది లేక అప్పటికి ఊరుకున్నారు.

వెను తిరిగి ఆఫీసుకు వచ్చి, జరిగిన సంగతులన్నీ అప్పటికప్పుడు తన పై అధికారులకు వివరించింది. విని ఊరుకోవటం తప్ప వారి నుండి ఎలాంటి రెస్పాన్స్ లేదు.

మల్లేశం ఒక్కడే ఆమెకు సానుకూలంగా ఉన్నాడు. అతను కూడా అక్కడ గార్డే. అందరిలోకీ సీనియర్. ఆమెకు మంచి, చెడూ చెప్తున్నాడు. 'మీరు టెన్షన్ పడకండి' అని ఆమెకు ధైర్యం నూరి పోశాడు.

'అసలు అడవిలో హాయిగా ఉండాల్సిన పులులు ఇలా ఊరి మీదకు ఎందుకు వస్తాయో?' అంది కళ్యాణి. 'అవి మన దిక్కుకి రాటం లేదమ్మా, మనమే అవి వచ్చేట్టు చేస్తున్నాం. అడవులు

కొట్టేస్తున్నం. లారీలు, జేసీబీలు పెట్టి ఏట్లో ఇసుక తోడుతుంటే నీరు నిలువ ఎట్టా ఉంటది? మెకాలకి తిండి, నీరు లేకపోతే అవి గూడేల మీద పడక ఏం చేస్తాయి?...' అన్నాడు మల్లేశం నిర్వేదంగా.

గూడెంలో మనుషులు బెదిరి పోకుండా, నలుగురు గార్డులను పంపింది కళ్యాణి. వారికి రైఫిల్సుతో పాటు ట్రాంక్విలైజర్ గన్స్ కూడా ఇచ్చింది. కొద్ది దూరం వెళ్లాక తన మీద జోకులు వేస్తూ యాదగిరి నవ్వుతున్న వెకిలి నవ్వులు ఆమె చెవిని దాటి పోలేదు. 'మీరు కొద్దిగా స్ట్రిక్టుగా ఉండకపోతే ఆ యాదగిరి ఇలానే నెత్తికి ఎక్కుతాడమ్మా' అన్నాడు మల్లేశం.
'స్ట్రిక్టుగా ఉండటం అంటే ఏమి చెయ్యాలి? కొట్టాలా, తిట్టాలా' అని మనసులో అనుకుంది కళ్యాణి. పైకి మాత్రం, 'దానికంటే ముందు పులిని పట్టుకోవాలి. యాదగిరి సంగతి ఆ తరువాత చూద్దాం' అంది.

రెండు రోజులు గడిచాయి. ఏ దుర్ఘటనా జరగలేదు. గండం గడిచినట్లే అనుకుంటుంటే, గూడేనికి ఉత్తరాన ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో చిన్న పల్లెలో పత్తి పీకటానికి వెళ్ళిన పన్నెండేళ్ల బాలికని నోట కరుచుకుని పోయింది పులి. మొదటిసారి ఆ పులి మ్యాన్ ఈటర్ ఏమో అన్న అనుమానం ఫారెస్ట్ అధికారులకు కూడా వచ్చింది. మరి కొంత మంది సిబ్బందిని ఆ ప్రాంతానికి తాత్కాలికంగా పంపారు. చుట్టు పక్కల దాదాపు పాతిక చిన్న చిన్న గ్రామాలు ఉన్నాయి. పులి రెండు రోజుల్లో ఆరు కిలోమీటర్ల దూరం ప్రయాణించిందంటే, తన తదుపరి దాడి ఎక్కడయినా చేయవచ్చు.

కొత్తగా వచ్చిన సిబ్బందితో పాటు తను కూడా అలుపెరగకుండా గస్తీ తిరుగుతోంది ఆమె. 'మనం డిఫెన్సులో ఉండటం కాదు. ఆ పులిని పట్టుకోవాలి. అందుకు ఏమి చేయాలి?' మల్లేశాన్ని అడిగింది కళ్యాణి. 'మెకానికి తెలివి ఎక్కువ. అది ఎక్కడ ఉందో తెలిస్తే మాటు వేసి మత్తు ఇంజెక్షన్ ఇచ్చి పట్టొచ్చు. లేదూ ట్రాప్ పెట్టొచ్చు. కానీ ఇలా రోజుకొక ఊరిలో దాడి చేస్తున్న మ్యాన్‌ఈటర్ని పట్టుకోవటం చాలా కష్టం' చెప్పాడు మల్లేశం.

మరో రెండు రోజుల తరువాత మరింత ఉత్తరాన ఉన్న మరో ఊరిలో, అర్ధరాత్రి మందు కొట్టి సైకిల్ మీద వస్తున్న ఒక యువకుడిని పొట్టన పెట్టుకుంది ఆ పులి. 'జరుగుతున్న హత్యలను చోద్యం చూస్తున్నట్లు చూడటానికి కాదు నేను ఇక్కడ ఉంది' అనుకున్న కళ్యాణి, తన స్నేహితురాలు మానసకు కబురు చేసింది. మానస డ్రోన్ ఆపరేటర్. ఆమె దగ్గర వివిధ రకాల డ్రోనులు ఉన్నాయి. పైగా మానస కూడా అడ్వంచర్ అంటే ఇష్టపడుతుంది. పెద్దపులినే పట్టుకునే అవకాశం అని తెలియగానే హుటాహుటిన హైదరాబాద్ నుండి అక్కడకు చేరుకుంది మానస. రావటమే కాదు, తనతో కొన్ని డ్రోనులు కూడా తెచ్చి వెంటనే కార్యరంగంలోకి దూకింది.

'డ్రోన్ కెమెరాలు కొంత మంది ఆపరేట్ చేస్తూ ఉంటే మరికొందరు కంట్రోల్ రూములో ఏర్పాటు చేసిన మానిటర్లలో పులి కనిపిస్తుందేమో అని వెతుకుతూ ఉండాలి. అలా

మొత్తం అడవిని జల్లెడ పట్టవచ్చు' చెప్పింది మానస. 'ఎక్సలెంట్' ఆమె ఐడియా నచ్చి మెచ్చుకుంటూ అంది కళ్యాణి. 'కానీ డ్రోన్ ఆపరేట్ చేయటం అందరి వల్లా కాదుగా' అంది. 'దాన్ని నాకు వదులు. లోకల్గా ఉన్న కాస్త చదువుకున్న యువతీ యువకులను పిలిపించు. వారికి ఒక గంటలో నేర్పిస్తాను' అంది మానస.

ఈలోపు లోకల్ ప్రజాప్రతినిధి నుండి విమర్శలు ఎక్కువయ్యాయి. 'ఇంత రిస్కుతో కూడుకున్న పోస్టులోకి మహిళని పంపి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వెంటనే మహిళా రేంజర్ని మార్చి మగ ఆఫీసర్ని పంపండి.' అని డిమాండ్ చేయసాగాడు. డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్ నుండి కళ్యాణికి ఫోన్ వచ్చింది. 'నిన్ను అక్కడ నుండి ట్రాన్సఫర్ చేద్దామనుకుంటున్నాం' అని చెప్పాడాయన.

కళ్యాణి ఉద్యోగంలో చేరటానికి వచ్చినపుడు మారుమూల ఉన్న ఆ ఊరిని చూసి ఇక్కడ నుండి ఎప్పుడెప్పుడు విముక్తి కలుగుతుందా? అని అనుకున్న మాట వాస్తవం. కానీ ఇలా ఒక పెద్దపులి చేతిలో ఓడిపోయి, వెళ్ళిపోవటం అంటే అది తనకు మాత్రమే కాదు, ఆడవాళ్లందరికీ అవమానమని ఆమె భావించింది. అందుకే, 'నాకు ఒక వారం సమయం ఇవ్వండి సార్' అని అడిగింది.

'వారంలో ఏమవుతుంది కళ్యాణీ! మగవాళ్ళయితే నీకంటే ఏదో ఎక్కువ సాధిస్తారని కాదు. ఈ ప్రజా ప్రతినిధుల విమర్శలకు కొన్ని రోజులు విరామం దొరుకుతుందని' అన్నాడాయన. 'లేదు సార్. వారంలో ఆ పెద్దపులిని పట్టుకుంటాను' ఆత్మ విశ్వాసంతో చెప్పింది కళ్యాణి. కొద్దిగా ఆలోచించి, 'సరే వారం సమయం ఇస్తున్నాను. వారం తరువాత కూడా పులిని పట్టుకోలేక పోతే, నీ అంతట నువ్వే అక్కడ నుండి వచ్చేయాలి' అంటూ ఫోన్ పెట్టేశాడాయన.

ఈలోపు మానస అక్కడి యువతీ యువకులను ఉపయోగించుకుని డ్రోన్ కెమెరాలతో అడవిని జల్లెడ పట్టటం ప్రారంభించింది. 48 గంటల్లో వారి కృషి ఫలించింది. పులి ఆచూకీ తెలిసింది. నీరు తాగటానికి సెలయేరుకు వచ్చిన పులి డ్రోన్ కెమెరాకి చిక్కింది. అది ఆడ పులి. పిల్లలతో ఉంది. పైగా దాని నడకని పరీక్షించిన కళ్యాణి దాని ఒక కాలు విరిగి ఉందని గమనించింది. 'విరిగిన కాలుతో పులి అడవిలో జంతువులను వేటాడ లేదు. అందుకే అది నెమ్మదిగా కదిలే మనిషిని ఆహారంగా ఎంచుకుంటోంది' చెప్పింది.

వెంటనే రియాక్టయిన ఆమె పులి కనిపించిన ప్రదేశానికి బయలుదేరింది. పులి నీరు తాగటానికి వచ్చిన సెలయేరు దగ్గర ఉన్న ఒక చెట్టు మీద కళ్యాణి తన బృందంతో మాటు వేసింది. కళ్యాణి మిగిలిన సిబ్బందికి జాగ్రత్తలు చెప్పింది. 'ఈ ట్రాంక్విలైజర్ గన్ పేలిస్తే మత్తు మందు ఉన్న సిరంజి దూసుకు వెళ్ళి పులి శరీరంలో గుచ్చుకుంటుంది. 30 నుండి 45 నిమిషాల వ్యవధిలో అది మత్తులో కూరుకు పోతుంది. కానీ ట్రాంక్విలైజర్ ప్లాస్టిక్తో చేసి ఉంటుంది. లోహంతో చేసిన బుల్లెట్లా గురి కుదరదు. ఏ మాత్రం గాలి ఉన్నా గురి

తప్పుతుంది. అందుకే, పులి నిలకడగా ఉందనుకున్నప్పుడే కాల్చాలి' అని తను నేర్చుకున్న మాటలు వారికి చెప్తూ, 'అది నీళ్ళు తాగేందుకు సెలయేటి వద్దకు వెళ్ళేవరకు ఎవరూ కాల్చవద్దు. అప్పుడయితే అది కదలకుండా చాలా సేపు ఉంటుంది' అని హెచ్చరించింది.

ఒక రోజు గడిచేటప్పటికి ఎప్పుడు వస్తుందో తెలియని పులి కోసం చెట్టు మీద మాటు వేసి కూర్చోవటం అంత తేలిక కాదని ఆమెకు అర్థమయింది. రెండవ రోజు రాత్రి పులి సెలయేటి దగ్గరకు వచ్చిన అలికిడి అయి చెట్టు మీద ఉన్న అందరూ అప్రమత్తమయ్యారు. అసలే రాత్రి. దట్టమయిన చెట్లు చీకటిని మరింత పెంచి పోషిస్తున్నాయి.

చెట్ల గుబుర్లను అడ్డుగా చేసుకుని పులి నీటి వైపు నెమ్మదిగా అడుగులు వేస్తోంది. అలా వెళ్తున్న పులి ఒక్కసారిగా ఆగింది. మనుషుల వాసన దానికి తగిలినట్లు ఉంది, చుట్టూ చూడబోయింది. కళ్యాణి ఇచ్చిన సూచనలు మరచిపోయాడో, ఆమె విజయం సాధించటం రుచించలేదో& ఆమె సూచనలకు విరుద్ధంగా గన్ పేల్చాడు యాదగిరి. ఠప్ మన్న శబ్దంతో ట్రాంక్విలైజర్ దూసుకెళ్లింది. అయితే అది పులికి తగలలేదు. దాని పక్కగా వెళ్ళి గడ్డిలో పడిపోయింది.

ఈలోపు గన్ పేల్చిన శబ్దానికి అలెర్ట్ అయిన పులి క్షణంలో పొదల్లోకి దూరి మాయమయింది. యాదగిరిని ఏమి అన్నా ఇప్పుడు ఉపయోగం లేదని తెలుసు కాబట్టి కళ్యాణి ఏమీ మాట్లాడ లేదు. అతని కళ్లలో కనీసం విచారం కనపడలేదు కళ్యాణికి. 'ఇక ఇక్కడ కాపు కాయటం వృథా. మళ్ళీ అది ఇక్కడకు రాదు' అంది ఆమె. తిరిగి డ్రోన్ కెమెరాలతో ట్రాకింగ్ మొదలయింది. ఈలోపు ఎరగా వేసే బోనులు వచ్చాయి. అడవి లోపల వరకు వాహనాలు రావు కాబట్టి ఆరేడుగురు మనుషులు కలిసి ఆ బోనులను మోసుకు వెళ్లాలి. పులి ఎక్కడకు వస్తుందో అంచనా వేసి అక్కడ ఈ బోనులు పెట్టాలి.

మరో రెండు రోజుల తరువాత బహిర్భూమికి వెళ్ళిన ఒక మహిళని పులి ఈడ్చుకు పోవటం డ్రోన్ కెమెరాలో రికార్డ్ అయింది. అది ఈసారి ఉత్తరానికి కాకుండా వెనక్కి ప్రయాణిస్తోంది. 'మనం అనుకున్నదాని కంటే ఇది జిత్తులమారి పులి' అని డిక్లేర్ చేసింది కళ్యాణి.

'పులికి ఆహారం దొరికింది కాబట్టి దాహం కూడా తీరాలి. దానికోసం అది ఎక్కడకు వస్తుందో అంచనా వేసి అక్కడ బోను పెడదాం' చెప్పాడు మల్లేశం. పులి కనిపించిన ప్రదేశానికి దగ్గరలో ఉన్న ఒక నీటి మడుగును గుర్తించి అక్కడకు బోనును చేర్పించారు. అప్పటికి డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఇచ్చిన వారం గడువు ముగియటానికి ఇంకా ఒక్క రోజు సమయం మాత్రమే ఉంది. బోనులో ఉంచటానికి తెచ్చిన మేకను పక్కకు జరిపి, 'బోనులో అది కాదు, నేను కూర్చుంటాను' అంది కళ్యాణి. 'అది ప్రమాదం అమ్మా' అంటూ ఏదో చెప్పబోయిన మల్లేశాన్ని మధ్యలో అడ్డుకున్న కళ్యాణి, 'మేక కంటే మనిషి రుచే ఇప్పుడు దానికి ఇష్టం. దానిని పట్టుకోవాలంటే ఇదొక్కటే మార్గం. నాకు ఏమీ కాదు, మీరు వెళ్లండి. పులికి మత్తు ఎక్కగానే

మీకు కబురు చేస్తాను'' అంటూ వాకీటాకీ చూపించింది.

అందరు ఆమె చెప్పిన సూచనలు పాటించినా, యాదగిరి మాత్రం ఎవరికీ తెలియకుండా వెనక్కి వచ్చి ఒక చెట్టు ఎక్కి కూర్చున్నాడు. నిజంగానే కళ్యాణి పులిని పట్టుకుంటే ఆమెకు ఎక్కడ పేరు వస్తుందో అని అతని దుగ్ధ. తనే మత్తు ఇంజెక్షన్తో పులిని కాల్చి ఆమెకు వచ్చే పేరు రాకుండా చేయాలని అతని ఊహ.

బోనులో మేకని పెడితే బోను తలుపు తెరచి ఉంచుతారు. మేక కోసం బోనులోకి వచ్చిన పులికి మేక చిక్కుతుంది. అప్పుడు బోను తలుపు వేసుకు పోయి పులి బంధింపబడుతుంది. ఇప్పుడు ఇక్కడ లోపల ఉంది మనిషి కాబట్టి బోను తలుపు వేసి ఉంచుతారు. మనిషి కోసం బోను దగ్గరకు పులి వస్తే మనిషి మత్తు ఇంజెక్షన్తో దానిని కాల్చాలి.

కూర్చున్న కళ్యాణి ఉన్న భాగం తప్ప మిగిలిన బోను కనపడకుండా పచ్చటి చెట్ల కొమ్మలు, తీగలు బోను మీద కప్పారు. చీకటి పడింది. అడవి మొత్తం కీటకాలు చేస్తున్న శబ్దాలతో నిండి పోయింది. బోను మేక కోసం చేసింది కాబట్టి మనిషికి విశ్రాంతిగా కూర్చునే వీలు ఉండదు. వంగి కూర్చోవాలి. గంట మీద గంట గడుస్తున్నా పులి జాడ లేదు. నడుము లాగేస్తోంది. సమయం చూస్తే రాత్రి రెండవుతోంది. తెల్లవారితే తను ఓడిపోయినట్లు ఒప్పుకుని వెళ్ళిపోవాలి. ఓటమి అన్న భావం సహించరానిదిగా తోస్తోంది ఆమెకు. ఇది పులికీ తనకీ మధ్య వ్యక్తిగత పోరాటంలా మారింది. బోనులో మేక ఉంటే దాని అరుపులకు ఎట్రాక్ట్ అయి పులి వచ్చేదేమో. ఇప్పుడు తను ఏమీ చప్పుడు చేయకపోవటంతో అది రావటం లేదేమో. అలా అనిపించిన మరుక్షణం బోను తలుపు పెద్ద శబ్దంతో తెరచింది కళ్యాణి. తోచిన పాట పాడుతూ శబ్దం చేస్తూ బోను బయట నిలబడింది. దాదాపు అరగంట పాటు అలా ఏదో ఒక శబ్దం చేస్తూనే ఉంది కళ్యాణి.

అయినా పులి జాడ లేదు. వాకీటాకీ లో తన సిబ్బందిని సంప్రదిద్దామా అనుకుని కూడా ఆ సమయంలో వారు చేయగలిగింది ఏమీ ఉండదని, ఆ ఆలోచన విరమించుకుంది. ఇక తను ఓడిపోయానని నిశ్చయించుకుని తిరిగి బోనులోకి వెళ్లటానికి వెను తిరిగిన కళ్యాణి ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఎప్పుడు వచ్చిందో, ఎదురుగా పులి ఉంది. సరిగ్గా బోనుకు, తనకు మధ్య ఉంది అది. ఇప్పుడు తను వెళ్లాలన్నా బోనులోకి వెళ్లలేదు. చేతిలోని ట్రాంక్విలైజర్ గన్ ఎక్కుపెట్టి గురి చూసింది కళ్యాణి. తన చేతులు వణకటం స్పష్టంగా తెలుస్తోంది కళ్యాణికి. పులి ఒక అడుగు వెనక్కు వేసింది. అది కూడా దాడికి సన్నద్ధం అవుతోందని అర్ధమవుతోంది. కళ్యాణి సరిగ్గా గురి చూసుకునే లోపే పులి పెద్దగా గాండ్రించి కళ్యాణి మీదకు దూకింది.

అదే సమయంలో కళ్యాణి చేతిలోని గన్ పేలింది. మత్తు మందు ఇంజెక్షన్ పులికి గుచ్చుకుందో లేదో చీకట్లో తెలిసే అవకాశం లేదు. ఇంకోసారి పేల్చేందుకు స్పేర్ ట్రాంక్విలైజర్ తన దగ్గర లేదు. బోనులో ఉంది. మీదకు దూసుకు వస్తున్న పులి విరిగిన కాలు, అది

అనుకున్న విధంగా దూకటానికి సహకరించ లేదు. కళ్యాణి మీద పడాల్సిన పులి కొద్దిగా ముందు పడింది. కళ్యాణి పక్కకి తప్పుకుంది. ఆ పడటంతో దాని విరిగిన కాలు మరింత నొప్పి పెట్టినట్లు ఉంది, పులి భయంకరంగా గర్జించింది. ఆ గర్జనకు చెట్టు మీద కూర్చున్న యాదగిరి పట్టు తప్పింది. బిళ్ళబీటుగా వచ్చి పులికి ఎదురుగా పడ్డాడు. కళ్యాణికి తను తప్పించుకోవటమే కాదు యాదగిరిని రక్షించాల్సిన బాధ్యత కూడా మీద పడింది.

కింద పడటంతో యాదగిరి చెయ్యో, కాలో విరిగినట్లుంది. బాధతో విలవిలలాడుతున్నాడు. అతడిని భుజాల దగ్గర పట్టుకుని బోను దగ్గరకు లాక్కెళ్లి లోపలకు తోసింది. తను కూడా బోనులోకి వెళ్ళి తలుపు వేసేసుకుంది. అయితే ఆమె వాకీటాకీ కిందకు జారిపోయింది. సిబ్బందిని పిలిచే అవకాశం లేకుండా పోయింది.

పులి కూడా విరిగిన కాలు కలిగిస్తున్న నొప్పి నుండి కోలుకుంది. ఆ తరువాత అరగంట పాటు పులి బోను చుట్టూ తిరుగుతూ అడవి అంతా దద్దరిల్లేలా గాండ్రిస్తూనే ఉంది. అంత దగ్గరగా పులి పెడుతున్న గాండ్రింపులకు ధైర్యం సడలిపోయి యాదగిరి గజగజ వణుకుతున్నాడు. కొంతసేపటికి భయంతో స్పృహ తప్పి పోయాడు. కళ్యాణికి కూడా ఆ అరుపులకే తన గుండె ఆగుతుందేమో అనిపించింది. ఆమెకు ఉన్న ధైర్యమల్లా ఒకటే, పులి శరీరానికి వేలాడుతున్న ట్రాంక్విలైజర్. ఆ మందు పనిచేసి పులి స్పృహ తప్పే క్షణాల కోసం ఎదురు చూస్తోంది కళ్యాణి.

సరిగ్గా నలభై నిమిషాలకు పులి కింద పడి పోయింది. ఆ తరువాత బోను నుండి బయటకు వచ్చి కింద పడిన వాకీటాకీ తీసి మల్లేశానికి జరిగింది చెప్పింది. మరో అరగంటలో వలలు తీసుకుని సిబ్బంది వచ్చారు. పులిని ప్రాణాలతో బంధించారు. మరుసటి రోజు అక్కడకు వచ్చిన డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్, 'మొత్తానికి అనుకున్నది సాధించావ్. ఒక మ్యాన్ ఈటర్ని ప్రాణాలతో పట్టుకోవటం అంటే సామాన్యమయిన విషయం కాదు& మేకకు బదులు బోనులో కూర్చుని మరీ పులిని పట్టుకునే అంత ధైర్యం నీకు ఎలా వచ్చింది?' అన్నాడు మెచ్చుకోలుగా.

'ఆ ఆడపులి విరిగిన కాలు వలన, పిల్లలకు ఆహారం సంపాదించటానికి మరో దారి లేక మ్యాన్ ఈటర్గా మారింది. కానీ మన డిపార్టుమెంటులోనే, ఒక స్త్రీ తమ అధికారిగా రావటాన్ని సహించని ఒకడు నన్ను మరింత దారుణంగా హింసించబోయాడు. అలాంటి వారికి సమాధానం చెప్పటానికే ఈ సాహసం చేయవలసి వచ్చింది సార్.' అంది. 'ఎవరతను? ఇప్పుడే అతని మీద చర్య తీసుకుంటాను' అంటూ ఏదో అనబోయాడు డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్.

'అక్కర్లేదు సర్. మ్యాన్ ఈటర్గా మారిన పులి పిల్లలతో సహా జ్యూకి వెళ్ళి పోయింది. దానిని బంధించే ప్రక్రియలో నాకు కూడా నిజం భయం అంటే ఏంటో తెలిసింది. ఆ భయం అనుభవించిన నాకు ఇక ఏ యాదగిరి భయం లేదు. ఆ పులిని చూసి నా ముందే బట్టల్లో

ఉచ్చు పోసుకున్నాడు యాదగిరి. వాడు నన్నేం చేస్తాడు. ఇక నుండి ఎవరిని ఎలా కంట్రోల్ చెయ్యాలో అలా చేస్తాను' అంది కళ్యాణి ఆత్మవిశ్వాసంతో. 'ఒక ఆడపులి ఇంకో ఆడపులికి జీవిత పాఠం నేర్పిందన్నమాట' అన్నాడు డీఎఫ్వో వెళ్ళిపోతూ.

సమాప్తం

* * *

**పుట్టగంటి గోపీకృష్ణ స్వస్థలం గుంటూరు జిల్లా తెనాలి. ప్రస్తుతం కర్ణాటకలోని ధార్వాడ జిల్లాలో కర్ణాటక గ్రామీణ వికాస్ బ్యాంకు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2007 నుంచి రచనలు చేస్తున్నారు. ఇప్పటివరకూ 35 నవలలు, 130 కథలు ప్రచురితమయ్యాయి. ఇద్దరి కలయిక, ఇటు తూరుపు అటు పశ్చిమం, క్వీన్ మేరీ, డూప్లికేట్ నవలలు పాఠకాదరణ పొందాయి. వివిధ పత్రికలు నిర్వహించిన నవలల పోటీల్లో 'నిన్నటి నేడే రేపు', 'రణక్షేత్రం', 'రాజగురువు' ప్రథమ బహుమతులు దక్కించుకున్నాయి. 'గౌరీ కళ్యాణం' నవలకు అనిల్ అవార్డు వచ్చింది. వివిధ సాహితీ సంస్థలు, పత్రికలు నిర్వహించిన పోటీల్లో వైరస్, ఎన్‌కౌంటర్, ఫాంటసీ, రోకలి ఓబవ్వ, తనదాక వస్తే.. రచనలు బహుమతులు గెలుచుకున్నాయి. 'సాహిత్యం' అనేది చదివే పాఠకుడికి ఏదో ఒక రసాస్వాదన కలగజేయాలని, రచనలో చదివించే గుణం ముఖ్యమని గోపీకృష్ణ నమ్ముతారు.**

# బోగం ఎంకటి



చిప్పబత్తుల శ్రీనివాస్
7730065637

ఎన్నీలలో కూసొని ఎక్కెక్కి ఏడ్సుకుంట ఆ సమాధులను తడుముతున్నడు. ఇలా ఎన్నాళ్లని ఏడుస్తూ బతకడం! నిజానికి ఆ పన్నెండేండ్ల పిలగానికి భూమ్మీద ఉండాలనే లేదు. కానీ, సావుకు చేతులు సాచి ఏడ్వడం శాతగానితనం కిందనే లెక్కకదా!

'..అయితే ఎదురీదైనా బతకాలి. లేదంటే వరద కొట్టుడుకు మునకలేస్తూనైనా పోవాలి. సస్తూ బతకడం, బతుకుతూ సావడం చేసుకుంట, దానికింకా 'బతుకు' అని పేరు పెట్టుడెందుకు?! ఉన్నచోటు నచ్చని చేపపిల్ల కలగన్న చోటును చేరేదాకా ముందుకు కదులుతూనే ఉంటది. బాధల్లో బందీ అయిన మనిషి జిందగీని, సుఖాలను తాకట్టుపెట్టి ఇడిపించుకోవాలి. కష్టాలు నిన్నిష్టపడి కోలాటమాడుతుంటే కూడా, నువ్వు కొసదాకా ఓపిక పట్టాలి. పుట్టినోడల్లా సావాల్సిందే! కానీ, సచ్చేలోపు ఈ భూమ్మీద నీ గెలుపు ముద్రలు పడాలి. అవి చెరిగిపోనివి కావాలి. బతుకంటే కథగా మిగలడం. ఇది గుర్తుంచుకో కొడుకా!'

తండ్రి చెప్పిన మాటలు గుర్తుకొచ్చి అంత దుఃఖంలోనూ నవ్వుకున్నాడు తను. కొండంత ధైర్యం గుండెల నిండా నిండిపోయింది. మనిషికి నిజమైన ధనమూ, ఈ బండికి ఇంధనమూ.. ధైర్యమే! అది అనుభవించినవారికే

అర్థమవుతుంది.

* * *

'ఎంకటికి బాకీ పడనోళ్లు ఎవరుంటార్రా భాస్కరా? అందరమూ అతని రుణంలో ఉన్నోళ్లమే! నిజానికి ఊరే ఆయనకు బాకీ పడిపోయింది'.. కొడుకుతో ఎన్నడూ లేనంత విచారంగా మాట్లాడుతున్నాడు రాములు. 'చిన్నప్పటి నుంచీ చూస్తూనే పెరిగిన కదా! ఎంకటి మామను. మీ ఇద్దరీ స్నేహమూ, అంతకుమించిన అనుబంధమూ నాకు తెలియందా నాన్నా!'.. మనసులో అనుకున్నాడు భాస్కర్.

'భాస్కరా! నువ్వు ఎలాగైనా కోడలును తీసుకురావాల్సిందే! నువ్వేం చెప్తవో ఏమో గానీ.. కోడలు మాత్రం వచ్చి తీరాలి!'.. ఈ మాటలు వింటూనే అదిరిపడ్డాడు భాస్కర్. 'నాన్నా.. సుమతి సంగతి నీకు తెల్సిందే కదా! ఆమెను ఒప్పించడం నావల్ల కాదు. అంతగా కావాలంటే నీతో రెండ్రోజులు ఉండి వెళ్తాలే!' అనునయిస్తూ అన్నాడు భాస్కర్. '..అయితే నువ్వు కూడా రానక్కర్లేదు!'. 'అదికాదు నాన్నా!'.. భాస్కర్ ఏదో చెప్పబోయాడు. '..ఇది నా చివరి కోరికనుకో!' అంటూ ఫోన్ పెట్టేశాడు రాములు.

'ఎంకటి మామ చనిపోతే నన్ను రమ్మనడంలో ఒక అర్థముంది. కానీ, సుమతిని తప్పనిసరి రమ్మనడం ఏంటి? ఎంకటి మామ చనిపోయాడట. నాన్న ఫోన్ చేసి మనిద్దర్నీ రమ్మన్నాడని చెప్పగానే, ఉన్నపళంగా వెంట బయల్దేరడానికి ఆమె మామూలు ఇల్లాలు కాదు.. సుమతి. ఈ భూమ్మీద ఉన్నంత వైవిధ్యమూ, వైరుధ్యమూ, వైశిష్ట్యమూ.. అన్నీ ఆమెలోనే నిబిడీకృతమై ఉన్నట్లు అనిపిస్తుంది. సుమతి ప్రాక్టికాలిటీ భరించడం చాలా కష్టం. కొన్ని విషయాల్లో కఠినంగా ఉంటుంది. ఎదుటివారి అభిప్రాయాలను చాదస్తంగానో, తెలివి తక్కువతనంగానో తీసిపారేయడంలో ఆమెకు ఆమే సాటి. మేనమామ కూతురే అయినా.. మా కుటుంబంలో తనింకా కలిసిపోయినట్లు అనిపించదు. అదేంటో గానీ మా నాన్న మాత్రం ఆమెను చిన్నమాట కూడా అనడు. ఆమె తల బిరుసుతనం పొగరనిపిస్తుంది. ఆ వెంటనే తెలియనితనమని తేలిపోతుంది. పల్లెలన్నా, మట్టిమనుషులన్నా.. తనకు మొదట్నుంచీ చులకన భావనే! అంత గొప్ప డాక్టర్‌గా పేరు సంపాదించుకుంది గానీ, మట్టి మనుషులను దగ్గరికి రానీయదు. అందులో ఎంకటి మామకు మినహాయింపు అస్సలు లేదు. ఆమెకు నచ్చని వ్యక్తుల్లో ఎంకటి మామ ముందు వరుసలో ఉంటాడు. ముతక బట్టలు వేసుకుని, చేతుల నిండా కాయలతో, ఎడమ కాలికి బేడీ వేసుకొని ఎంకటి మామ ఎదురుపడితే చాలు.. సుమతికి కోపం అదుపు తప్పుతుంది. వయసులో పెద్దాయన అనికూడా చూడకుండా ఎలా పడితే అలా మాటలు అనేస్తుంది. అలాంటి వ్యక్తి చివరి చూపునకు ఆమె వస్తుందని ఆశించడం ఆత్మవంచనే అవుతుంది!'..

భాస్కర్ అంతర్మథనంలో మునిగిపోయాడు.

* * *

'మీరెళ్లిరండి!' అన్నది. ఆ విషయం అసలు తనకు అనవసరం అయినట్లు. 'సుమతీ!'.. భాస్కర్ ఏదో చెప్పబోయాడు. చురుక్కున తలెత్తి చూసింది.. 'చెబితే అర్థం కాదా!?' అనే తీక్షణతా భావానికి జోడీగా తిరస్కరణ బాణం కూడా విసిరింది. చేసేదేమీ లేక తండ్రికి ఫోన్ చేశాడు భాస్కర్. రెండు నిమిషాలయ్యాక సుమతి ఫోన్ మోగింది. '..అమ్మా! ఇప్పటిదాకా నోరు తెరిచి నిన్నేమీ అడగలేదు నేను. ఈ ఒక్కసారి ఈ ముసలోడి మాట కాదనకు. దీనికి బదులు నా చావుకు నువ్వు రాకున్నా ఫరవాలేదు'.. తండ్రి మాటలు భాస్కర్‌కు స్పష్టంగా వినిపిస్తున్నాయి. ఎక్కడో గుండె కలుక్కుమంది. తట్టుకోలేక బాల్కనీలో నిల్చుండిపోయాడు. కొంతసేపయ్యాక.. 'వెళ్దాం పదండి!' అంటూ భాస్కర్ వెనకాల సుమతి గొంతు.

* * *

'..నేనెలా తలకొరివి పెడతాను మామయ్యా!? ఎంకటికి నాకు.. ఐమీన్ మనకు ఏ రిలేషన్ ఉందని? నా కన్న తల్లిదండ్రులు ఉండగా ఆ అనాథ శవానికి నాతో అంత్యక్రియలు చేయించడంలో మీ ఉద్దేశం ఏమిటి? మీ మధ్య స్నేహం ఉంటే మాత్రం.. నన్ను ఇన్‌వాల్వ్ చేయడం, దానికో రిలేషన్ క్రియేట్ చేయడం మాత్రం కరెక్టు కాదు' అంటూ సుమతి అసహనంగా రాములు వైపు చూసింది.

సుమతి మాటలు మౌనంగానే వింటున్నాడు రాములు. 'నాన్న ఇలా చేస్తున్నాడేమిటి?' అని భాస్కర్ అయోమయంగా చూస్తున్నాడు. రాములు ఆలోచనల్లోంచి బయటపడి దీర్ఘంగా నిట్టూర్చి.. సుమతి వైపు నింపాదిగా చూశాడు. 'నీకెట్లా చెప్పాలో అర్థం కావడం లేదమ్మా! చెప్పినా నువ్వది జీర్ణించుకోలేవు. నీ పరిస్థితి నేనర్థం చేసుకోగలను'.. నెమ్మదిగా అన్నాడు రాములు. 'మీరంతగా బాధ పడేసరికి రావాల్సి వచ్చింది. ఇలా మీ పెద్దరికాన్ని అడ్డుపెట్టుకొని పిచ్చి పనులు చేయిస్తారనుకుంటే.. మీ మీదున్న గౌరవం తగ్గుతుంది'.. సుమతి మాటలు వాడిగా, వేడిగా గుచ్చుకునేలా..

'మిత్రద్రోహం చేస్తూ ఇచ్చిన మాట తప్పుతున్నా.. అమ్మా! ఇక చెప్పక తప్పదు. నువ్వు.. నువ్వు..' అంటూ ఆగాడు రాములు. సుమతి, భాస్కర్ ఇద్దరూ రాములు వైపే చూస్తున్నారు.

'నువ్వు.. ఎంకటి కన్న కూతురువు!' గద్గద స్వరంతో.. రాములు ఇన్నాళ్లూ దాచిన రహస్యం చెప్పాడు. కళ్లు బైర్లు కమ్మి తూలిపడబోయారు.. ఆ భార్యాభర్తలు.

* * *

డెబ్బై అయిదేండ్ల కిందటి ముచ్చట. రజాకార్ల జమానాలో సంగంలో కల్సిండు మోహన్ దొర. నాలుగూర్లకు పెద్దొరగా హడల్ సాగించుకునే నరోత్తం దొరకు ఇది మింగుడు పడలేదు. పెద్ద కొడుకు జనంకోసం నిలబడుతుండు అంటే.. ఇగ దొరతనానికి డొల్లవడ్డట్టే! పెద్ద కొడుకు మీద ఆశలొదిలేసుకుని మిగిలిన ఇద్దరు కొడుకులను ముందట నిలవెట్టిండు.

నాలుగేండ్లు గిర్రున తిరిగిపోయినయ్. భూమ్మీద ఉన్నాడో లేడో అనుకుంటున్న సమయానికి ఊళ్లోకి అడుగువెట్టిండు మోహన్ దొర. వెంట ఓ అమ్మాయి. ఆమె చంకలో ఓ

పిలగాడు. మొదట్నుంచీ ఆదర్శభావాలు గల మోహన్ దొర, సంగంలో సభ్యురాలైన చంద్రకళను ఆదర్శ వివాహం చేసుకున్నడు. దొర గడీలో చంద్రకళకు కోడలు హోదా దొరకలేదు. అసలు నరోత్తం దొర వారిని ఇంట్లోకే రానీయలేదు. తండ్రికి దూరమైన మోహన్ దొరకు ఊరి జనాలు దగ్గరయ్యారు.

ఇలాగైతే కొడుకు దారికి రాడని ఆస్తిలో వాటా ఇవ్వనన్నాడు నరోత్తం దొర. వాటా కావాలంటే దొరోరి పిల్లను మళ్లా పెళ్లి చేసుకోవాలని ఎర వేశాడు. పెళ్లి వెనుక మతలబు అర్థం చేసుకున్న మోహన్ దొర.. తండ్రి మాటను ఎడమ చేత పక్కకు జరిపి, ఆస్తి వాటాకోసం కోర్టులో దావా వేశాడు. ఊరి జనంతో కలిసిమెలిసి తిరుగుతున్నడనీ, ఆస్తి కోసం కోర్టుకు పోయాడనీ నరోత్తం దొర, కొడుకును కంట్ల పెట్టుకొనేటోడు. కాలం కూడా పగబట్టింది.

భూమిలేని పేదోళ్లతో కలిసి పరంపోగును సాగులోకి తెచ్చారు మోహన్ దొర దంపతులు. ఎండనకా, వాననకా చెమట చిందించేటోళ్లు.. ఆ భార్యాభర్తలు. రాత్రిళ్లు పేదోళ్లకు చదువు చెప్పేవారు. ఇవన్నీ చూడలేని కాలం.. పొలం దగ్గర పని చేసుకుంటుంటే, పిడుగు రూపంలో వారిని మింగేసింది. అప్పటికి పన్నెండేండ్లకొచ్చిన వెంకటాద్రి.. ఏకాకి అయ్యిండు.

* * *

'ఎంకటి బతుకుల జరిగినవన్నీ నాకొక్కనికే తెలుసు. అందుకే, ఎవరికీ చెప్పొద్దని ఒట్టు పెట్టుకున్నడు. తన బతుకును అవమానంగా, జన్మను ఒక అపరాధంగా బాధ పడేటోడు. నెత్తురు కారుతున్న నిలువెత్తు గాయం లెక్క కనిపించేటోడు'.. రాములు కన్నీళ్లు తుడుచుకుంటూ చెబుతున్నాడు. 'ఇన్ని రోజుల్నుంచీ ఈ నిజాన్ని మింగలేక, కక్కలేక.. గరళాన్ని కంఠాన దాచిన శంకరుని బతుకైంది నాది. చెబితే మాట తప్పినవాడిగా, చెప్పకపోతే ధర్మం తప్పినవాడిగా.. ఇలా అంతరాత్మ ముందు ముద్దాయిగా నిలబడని రోజులేదు. ఇన్ని బాధలు పడేకంటే.. ముందు నేనే చచ్చిపోతే బాగుండని ఎన్నిసార్లు ఆ దేవునికి మొక్కుకున్ననో!' అంటూ ఆగిపోయాడు రాములు. సగం దూరం నడిచాక.. మనదారి అది కాదని, మన గమ్యానికది చేర్చదని తెలిసినప్పుడు ఆ మనిషి పరిస్థితి ఎలా ఉంటుంది? ఇప్పుడు సుమతికీ అలాగే ఉంది. భాస్కర్.. అయోమయం, అనుమానం ఈ రెండిటి మధ్య ఇరుక్కుపోయాడు. 'అసలు.. నేనెవర్ని?'.. రాములు చేతులు పట్టుకొని అడిగింది సుమతి.

* * *

ముందుముందు ఆస్తి వాటాల్లో గొడవలెక్కడ వస్తాయోనని నరోత్తం దొర వెంకటాద్రిని వెంట తీసుకెళ్లిండు. కొడుకు కొడుకన్న కనికరం లేకుండా ఇంటి వారసుణ్ని ఇంటికి చిన్న పాలేరుగా మార్చేశిండు. పొట్టకు, కట్టుబట్టకు లోటు రాకుండా కట్టు బానిసత్వంలో వెట్టి చేసుకుంట.. కండలు కలికలి చేసుకొని మంచి పనిమంతుడు అయ్యిండు వెంకటాద్రి. కాలం వెనుకముందు జరిగిందంతా వెళ్లగక్కింది. కోర్టు దావాలో మోహన్ దొర గెలిచిండు. వారసునిగా వెంకటాద్రి నిలిచిండు. వందల ఎకరాల భూమి.. చేను, చెలక, తోటలు..!

అదంతా కాదని వాళ్ల నాయన ఎవుసం చేసిన పరంపోగు, దాని పక్కనున్న పదెకరాలు తీసుకున్నడు. నరోత్తం దొర మొకం శిన్నగైపోయింది. పెళ్లీడుకొచ్చిన వెంకటాద్రికి పిల్లను చూసేవాళ్లు లేరు. పిల్లను ఇచ్చేవాళ్లూ లేరు. ఆ ఇంటికి కోడలు వరుసైన నీరజ.. వెంకటాద్రిని ఇష్టపడ్డది. ఆడపిల్ల అయ్యుండి కూడా ఆశగా మనసును గొంతులోకి ఒలికించి అడిగింది.

తరతరాలుగా అంతరాలను లెక్కలోకి తీసుకొనే ఈ లోకం.. మనసు ఊసులను పట్టించుకుంటదా? అందుకే నా అనేవాళ్లు లేని వెంకటాద్రి పెళ్లి ముచ్చట దూరం పెట్టిండు. పట్టుపట్టిన నీరజ.. వెకటాద్రి చెయ్యి పట్టేదాకా వదిలిపెట్టలేదు. దానికోసం కన్నోళ్లనే కాదనుకున్నది. అదృష్టం అమాంతం పూలవాన కురిపించినట్టు సంబురపడ్డడు వెంకటాద్రి.

సంవత్సరం తిరిగేసరికల్లా కలల పంటగా ఓ పాప ఒడిలోకి చేరింది. బతుకును మొలకెత్తించిన ఆ పసిబిడ్డకు సుమతి.. అని పేరు పెట్టుకున్నరు. అంతలోనే అంతా తలకిందులైంది. దురదృష్టం ముందు అదృష్టం చిన్నదైపోయింది. నెలల పాపనొదిలి, కోరి కట్టుకున్న భర్తనొదిలి హఠాత్తుగా తనువు చాలించింది నీరజ.

* * *

'జీవితం విసిరిన ఆ సవాళ్లకు మీ నాన్న దగ్గరే కాదు.. మరెవ్వరి దగ్గరా జవాబులుండయ్! మా ఇద్దరి మధ్యనున్న స్నేహంతోనే పసిపిల్లగా ఉన్న నిన్ను మా పెద్ద బామ్మర్దికి సాదుకోనిచ్చిండు. నువ్వే ఎంకటి బిడ్డవి. ఎంకటే నీ కన్నతండ్రని నాకొక్కనికే తెలుసు. నిన్ను సాదుకున్న తండ్రికి కూడా నువ్వెవరి బిడ్డవో ఇప్పటికీ తెల్వది. ఈ ఊళ్లో ఎంకటిని సాయం అడగనోళ్లు లేరు. అతని సాయం పొందనోళ్లూ లేరు. అంతెందుకు భాస్కర్ పెద్ద సదువులకు పైసలు సాయం చేసింది మీ నాన్నే! పేరుకే మా బామ్మర్ది నీకు తండ్రి.. నీకైన ఖర్చులన్నీ నేనే పెట్టెటోణ్ని. అవన్నీ ఎంకటి పైసలే!'..

సముద్ర కెరటమొకటి ముఖాన్ని తాకినంతగా తల్లడిల్లిపోయింది సుమతి. ఇదంతా నిజమేనా అన్నట్లు, నమ్మలేనట్లు చూస్తున్నాడు భాస్కర్. 'మనిషి చూస్తే మోటుగా కనిపించేటోడు గానీ, ఎంకటి మనసెంత తేటదో నాకు తెలుసు. రంది నుంచి తప్పించుకోవడానికి పనికి మించిన మందులేదు. అది మీ నాన్నకు బాగా తెలుసు. 'ఎంకటి బావా! నీ కష్టాలకు లెక్క లేకపాయె!' అంటే ఏమనేవాడో తెలుసా!?.. 'బళ్లె బడి పంతులు గట్టోనికి గొట్టు లెక్కలేస్తడు. మోస్తడనుకున్న మొండోనికి దేవుడు బరువు లెక్కువ ఇస్తడు. అదంతే రాములు బావా!' అంటూ ముద్దుగా నవ్వేటోడు. గట్టువాగు చుట్టూ మొలకలు నాటి.. నాటి.. గుట్టనంతా పెద్ద జంగల్ లెక్క చేసిండు. ఊళ్లె బడి ఉండాలని పట్టుబట్టి కట్టించిండు. ఎనుకటెప్పుడో కూలిపోయిన శివాలయాన్ని బాగు చేయించిండు. గొడ్డు కష్టం చేసుకుంట సంపాదించెటోడు. వచ్చిన పైసలన్నీ మంచి పనులకు కర్సు వెట్టేటోడు. అష్టకష్టాలు వెట్టిన నరోత్తం దొర తొంటిరిగి మంచాన వడితే, మనసులో కల్మషం లేని మనిషాయె ఎంకటి.. ఎత్తిపోసి ఒంటి పుండ్లన్నీ కడిగిండు. ఈ లోకం పాడుగాను. ముంగట

ముచ్చట వెట్టి ఎనుకాల ఎక్కిరించేది ఎంకటిని. నేనెప్పుడన్నా రేషానికి వోతె.. 'రాములు బావా! నున్నగున్న రాయిమీద దుమ్ము నిలువది. నల్లగున్న వరుని మీది మరక ఆనది! ఎవలెట్ల అనుకుంటె.. గట్లనే అనుకోనియ్యి. కుడి ఎడమలను అటీటు చేసి అద్దం జూపంగనే.. మన అంతరాత్మ నమ్ముతదా ఏంది?!' అనేటోడు'..

ఏండ్ల నుంచి జమైన బాయిల పూడిక తీసినట్లు రాములు మనసు అల్కగయ్యింది. సుమతినే చూస్తున్నాడు భాస్కర్. 'ఎన్నిసార్లు చీదరించుకుందో తను. ముఖమ్మీదే సూటిపోటి మాటలన్నా.. ఏమాత్రం చిన్నబుచ్చుకునేటోడు కాదు ఎంకటి మామ! పండుగకో, ఫంక్షన్‌కో ఊళ్లోకి మేమొస్తే చాలు.. మా ఇంటి చుట్టే తిరిగెటోడు పాపం! కళ్ల ముందర కన్నబిడ్డ పరాయిదానిలా పట్టించుకోకున్నా.. బయటపడకుండా ఎట్లా తట్టుకున్నాడో!? పిల్లల్ని ముట్టుకోవద్దని గద్దరించి పెట్టినప్పుడు చిన్నబోయినట్లు ముఖం పెట్టిన ఎంకటి మామ ఏమనుకున్నడో?!' భాస్కర్ అపరాధ భావంతో తల పట్టుకున్నాడు.

ఎవల నుంచి ఏదీ ఆశించని ఎంకటి ఈ లోకానికి మాత్రం ఇచ్చుకుంటనే బతికిండు. మార్చుడు, ఏమార్చుడు ఈ మనుషులకు కొత్తకాదు కదా! తండ్రి కులం కొడుక్కు చెందనీయకుండా చేసి.. వెంకటాద్రిని ఎంకటిగా మార్చారు వీళ్లు. తల్లి కులం ఏంటిదో తెల్వనందుకు ఇదే మనుషులు ఎంకటిని 'బోగం ఎంకటి'ని చేశారు.

'నాలాంటి వాడి బిడ్డనని నలుగురికి తెలిస్తే.. నా బిడ్డ నారాజ్ అయితది రాములు బావా! ఈ ఒక్క ముచ్చట మాత్రం మనతోనే మట్టిల కల్వనీ..' అంటూ కాళ్లు మొక్కబోతున్న ఎంకటి గుర్తొచ్చి అప్రయత్నంగా కాళ్లు వెనక్కి జరపుకొన్నాడు రాములు. కానీ, ఇప్పుడు సుమతి ..

'మామయ్యా! ఆ దేవునికి ఒక్కపూట తిండి పెట్టలేని దౌర్భాగ్యురాలిని..' అంటూ రాములు కాళ్లు చుట్టేసి గుండెలవిసేలా ఏడుస్తున్నది.

* * *

ఎంకటి మరణాన్ని తట్టుకోలేక నింగి మనసుక్కూడా మబ్బు పట్టిందేమోనన్నట్లు ఒక్కసారిగా వాతావరణం మారింది. కదిలిస్తే కన్నీరుగా కురుస్తాయేమోనన్నంత బరువెక్కాయి మేఘాలు. అక్కడి దృశ్యం చూస్తే ఎవరో రాజకీయ నాయకుడో, గొప్ప పేరుమోసిన వ్యక్తో చనిపోయినట్లు అనిపిస్తున్నది. అనాథలా పెరిగి, అనాథలా బతికిన వ్యక్తంటే ఎవ్వరూ నమ్మరు.

'డెడ్‌బాడీ మెడికల్ కాలేజీకి డొనేట్ అయ్యింది. ఫార్మాలిటీస్ పూర్తయి చాలా సేపైంది. ఇప్పుడు ముట్టుకోవడం కుదరదు. ప్లీజ్ అర్థం చేసుకోండి!'.. శవం దగ్గరికి వెళ్లబోతున్న ముగ్గుర్నీ ఆపారు వైద్యులు. 'అంటే!?'.. కొన్ని క్షణాలకు అర్థమైంది సుమతికి. నేత్ర దానమో, అవయవ దానమో కాకుండా.. ఎంకటి ఏకంగా తన పార్థివదేహాన్ని దానం చేస్తానని బతికున్నప్పుడే బాండ్ రాసిచ్చాడన్న మాట. సుమతి ముఖం మీద మబ్బులు ముసుకున్నాయి. 'పుట్టుడు పుట్టుడే ఏడ్సుకుంట పుడుతం! పోయేటప్పుడు కూడా

ఏడ్సుకుంట పోతరా బావా!? మనం నవ్వుకుంట బోతంటే.. లోకం ఏడ్సుకుంట ఎనుక రావాలె! ఔ.. బావా! నేను వోతె నువ్వు తప్ప నాకేడ్చేటోళ్లు ఎవలున్నరు ఇంక!'.. అని వారం రోజుల కింద పరాచికాలాడిన ఎంకటి మాటలు గుర్తుకొచ్చి రాములు దీనంగా ఏడుస్తున్నాడు.

ఏడుస్తున్న తండ్రిని పొదివి పట్టుకున్న భాస్కర్ కళ్లనిండా నీళ్లు. 'ఎవ్వరికీ ఏ ఇబ్బందీ కలిగించుడు ఇష్టపడని ఎంకటి, మారాజు లెక్క తనదారి తాను చూసుకున్నడు'.. వెనక నుంచి ఎవరో అన్న మాటలు అవి. సుమతి గుండెను ఈటెల్లా పొడిచాయి. అప్పుడే ఎవరో కొన్ని పేపర్లను ఆమె చేతిలో పెట్టారు. అవి ఆస్తి వీలునామా పత్రాలు.

'ఎందుకు నాన్నా! ఇంత పెద్ద శిక్ష వేశావ్! ఒక్కసారి మాట్లాడు నాన్నా!' అంటూ ఆకాశం వైపు చేతులు చాచి, గట్టిగా అరిచింది సుమతి. చెంపలపై జారుతున్న కన్నీళ్లను వర్షం తుడిచేస్తుంటే.. అభిషిక్తమవుతున్నది సుమతి.

* * *

**చిప్పబత్తుల శ్రీనివాస్ స్వస్థలం కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం, ఊటూర్ గ్రామం. ఈయన పోస్ట్‌గ్రాడ్యుయేషన్, టీచర్ ట్రైనింగ్ చేశారు. విద్యాభ్యాసం అనంతరం 2002 నుండి ప్రభుత్వ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. చిప్పబత్తుల శ్రీనివాస్‌కి చిన్ననాటి నుండే పుస్తక పఠనంపై ఆసక్తి ఉండేది. అయితే వికారాబాద్‌లో టీచర్ ట్రైనింగ్‌లో ఉన్నపుడు ఆయన గురువు చెన్నయ్య సర్ కవితలు, కథలు రాయమని ప్రోత్సహించడంతో రాయడంపై కూడా ఆసక్తి కలిగింది. అలా ఆయన రాసిన మొదటి కవిత 2000 సంవత్సరంలో ఆంధ్రప్రభ వీక్లీలో ప్రచురితమయింది. అలా 2004 లో ప్రియదత్తా వీక్లీ వారు నిర్వహించిన పోటీలో "సప్త వర్ణాల ఆశ" కథ రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతికి ఎంపికైంది. 2006లో "మా మంచి నాన్న" అనే కథను రచించారు. అనంతరం ఆయన చాలా ఏండ్ల (14 సంవత్సరాలు) తరువాత "గంగిరెద్దు-గానుగెద్దు" కథ రచించారు. ఈ కథ ఈయనకి గొప్ప గొప్ప రచయితల ప్రశంసలు దక్కేలా చేసింది. ఇప్పటి వరకు ఈయన 23 కథలు, డజనుకు పైగా కవితలు, కొన్ని వ్యక్తిత్వ వికాస వ్యాసాలు రాశారు. అలాగే ఈయన కలం పేరు సుగంధ. కలం పేరును పేరుతో కలుపుకుని సుగంధ శ్రీనివాస్‌గా రచనలు చేస్తుంటారు.**

# నేరము – శిక్ష



ఇంద్రగంటి నరసింహ మూర్తి
**9959352900**

మూడు గంటలు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నగరంలో రోడ్లు జలమయమయ్యాయి. రాత్రి ఏడు గంటల సమయంలో కరెంటు లేక నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడసాగారు. విపరీతమయిన ఆలోచనలతో వేడెక్కిన అరవింద్ రెయిన్ కోటు వేసుకుని హెల్మెట్ పెట్టుకుని బైక్ తీశాడు. స్పోర్ట్స్ బైక్ వేగంగా రోడ్డెక్కింది. గంట తరువాత ఇంట్లోకి అడుగుపెడుతున్న కొడుకుని చూసి తండ్రి కిరీటి ఆందోళనకు గురయ్యాడు.

"ఇంత వర్షంలో ఎక్కడికి వెళ్లావురా" ప్రశ్నించింది తల్లి కృష్ణవేణి. మాట్లాడకుండా తన గదిలోకి వెళ్ళిపోయాడు అరవింద్ అరగంట తరువాత డిన్నర్ కు రమ్మని పిలిచింది కృష్ణవేణి. డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్న కొడుకు చేతిపై కాలిన మచ్చలు గమనించిన తల్లి "ఆ మచ్చలేమిట్రా" అని ఆదుర్దాగా అడిగింది. జవాబివ్వకుండా అన్నం కలుపుకోబోయి అరచేతిని ఊదుకున్నాడు అరవింద్. కుడి అరచేతిలో చిన్న పుండును గమనించి అరవింద్‌కు అన్నం తినడానికి

స్పూన్ అందించింది తల్లి.

కొడుకు వాలకం తండ్రి మనసులో అనుమానం రగిల్చింది. "వర్షంలో ఎక్కడికి వెళ్లావు ... ఏం ఘనకార్యం చేశావు" గద్దించాడు కిరీటి. "అర్జంటు పనిమీద ఒక స్నేహితుడిని కలవడానికి వెళ్లాను. చిన్న దెబ్బ తగిలిందంతే ..." అంటూ అన్నం కెలికి ఆకలి లేదంటూ డైనింగ్ టేబుల్ దగ్గరనుండి లేచిపోయాడు అరవింద్. చేతులు కడుక్కొని తన గదిలోకి వెళ్లి తలుపేసు కున్నాడు. కిరీటి మదిలో ఆందోళన మొదలైంది. కృష్ణవేణికీ గాభరాగా ఉంది. ఇద్దరికీ తిండి మీద ధ్యాస పోయింది. కంచంలో నీళ్లు పోసి లేచిపోయాడు కిరీటి. కృష్ణవేణి భర్తను అనుసరించింది. ఇన్వర్టర్ వీక్ అవడంతో గదుల్లో లైట్లు ఆరిపోయాయి. హాలులో చీకటిలో కూర్చున్నారిద్దరూ. కొడుకు ఏదో నేరం చేసిఉంటాడని వారి మనసు హెచ్చరించసాగింది.

కృష్ణవేణితో వివాహం నాటికి కిరీటి డిగ్రీ చేసి చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. వివాహమయ్యాక భర్తను ఎంబిఎ చేయమని ప్రోత్సహించింది కృష్ణవేణి. భార్య ప్రోత్సాహంతో ఉత్సాహంగా ఎంబిఎ పూర్తి చేశాక కిరీటి దృష్టి బిజినెస్ వైపు మళ్ళింది. ఉద్యోగానికి రాజీనామా చేశాడు. కృష్ణవేణి తండ్రిని ఒప్పించి భర్త వ్యాపారానికి పెట్టుబడి అప్పుగా ఇప్పించింది. మామగారి మద్దతుతో కిరీటి ఫ్యాన్సీ స్టోర్ తెరిచాడు. భార్య, బావమరుదులు అతనికి అండగా నిలిచారు. వారి సేవాదృక్పథం కస్టమర్లను ఆకట్టుకుంది. వ్యాపారం పుంజుకుంది. ఏడాదిలో ఫ్యాన్సీ స్టోర్ సూపర్ మార్కెట్ గా మారింది. నాణ్యమైన సరకులకు చిరునామాగా నిలిచింది. రెండేళ్ల తరువాత మరో బ్రాంచి వెలసింది. ఆర్థికంగా బలపడుతున్న జంట రెట్టించిన ఉత్సాహంతో వ్యాపారాన్ని అభివృద్ధి చేయసాగారు. కాలం వేగంగా పరుగెడుతోంది. పదవ వివాహ వార్షికోత్సవం నాడు భార్యాభర్తలు స్టార్ హోటల్ లో లంచ్‌కు వెళ్లారు.

"మన పెళ్లయి పదేళ్లయింది. వ్యాపారంలో స్థిరపడాలనే ఆలోచనతో ఇన్నాళ్లూ కుటుంబ నియంత్రణ పాటించాం. అనుకున్నట్లు వ్యాపారాన్ని విస్తరించాం. స్వంత నివాసం ఏర్పరచుకున్నాం. నేను తల్లిని కావాలనుకుంటున్నాను. ఇద్దరు పిల్లలు నట్టింట్లో తిరిగే ముచ్చట చూడాలని మనసు ఉవ్విళ్లూరుతోంది." అంటూ తన కోరికను వెల్లడించింది కృష్ణవేణి లంచ్ చేస్తూ ... గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు కిరీటి భార్యవైపు ప్రేమగా చూస్తూ ...

మూడు నెలల తరువాత కృష్ణవేణికి తను నెల తప్పినట్లు అర్థమయింది. భార్య నోట శుభసంకేతం విన్న కిరీటి ఆనందం అంబరాన్నంటింది. కృష్ణవేణిని అపురూపంగా చూసుకోసాగాడు. తొమ్మిదో నెలలో కృష్ణవేణికి గైనిక్ ప్రోబ్లమ్స్ మొదలయ్యాయి. బిడ్డ అడ్డం తిరిగిందన్నారు. ఆపరేషన్ చేసి మగబిడ్డను బయటకు తీశారు. తల్లి ఆరోగ్య రక్షణకు గర్భసంచి తీసేయాల్సి వచ్చింది. రెండు నెలల తరువాత కృష్ణవేణి ఆరోగ్యం కుదుటపడింది. తనకిక పిల్లలు పుట్టే యోగం లేదని బాధపడుతున్న కృష్ణవేణిని కిరీటి ఓదార్చాడు. మూడో

నెలలో బారసాల నాడు తమ బిడ్డకు 'అరవింద్' అని నామకరణం చేశారు తల్లిదండ్రులు.

* * *

ఒక్కగానొక్క బిడ్డ అరవింద్‌ను గారాబంగా పెంచసాగారు తల్లిదండ్రులు. అరవింద్ ఖరీదైన బట్టలలో మెరిసేవాడు. మెడలో బంగారు పతకం ధగధగలాడేది. తమ పుత్రరత్నాన్ని రాజకుమారుడిలా పెంచాలని తలపోసారు కిరీటి దంపతులు. "మన అబ్బాయిని డాక్టర్ చేయాలి" అన్న కృష్ణవేణి కోరికకు తన మద్దతు ప్రకటించాడు కిరీటి. అరవింద్ డాక్టరు పట్టాతో హుందాగా నడచివస్తున్నట్లు ఊహించుకుని పరవశించేది కృష్ణవేణి.

మూడేళ్ల వయసు నుండే అరవింద్ విపరీతమైన అల్లరి చేయసాగాడు. అరవింద్ అల్లరి భరిస్తూ, కుమారుడిని ముద్దు చేయసాగింది కృష్ణవేణి. కిరీటి కుమారుడిని పల్లెత్తు మాట అనేవాడు కాదు. తన మాట నెగ్గేవరకు పంతం పట్టడం అరవింద్‌కి అలవాటైంది. ఒక్కగానొక్క బిడ్డ ఏడిస్తే తట్టుకోలేకపోయేది తల్లి. కొడుకు ఏంకోరినా కాదనలేకపోయేవాడు తండ్రి. మంకుపట్టుకు మారుపేరుగా మారాడు అరవింద్.

* * *

అరవింద్ కు నాలుగేళ్లు నిండాయి. పేరున్న కాన్వెంటులో చేరిస్తే క్రమశిక్షణ పేరుతో పిల్లాడిని శిక్షిస్తారనే భయంతో అంతగా పేరులేని ప్రయివేట్ స్కూల్ లో అరవింద్‌ను చేర్చారు తల్లిదండ్రులు. తన కొడుకు తప్పుచేసినా దండించకూడదని షరతు విధించాడు కిరీటి. స్కూల్లో అరవింద్ అల్లరికి అడ్డులేకుండా పోయింది. తోటి విద్యార్థులను కొట్టడం, వారి పుస్తకాలు, పెన్సిల్స్ వంటివి లాక్కోవడం లాంటి పనులలో అరవింద్ ఆరితేరాడు.

ఏడో తరగతిలో సుధాకర్ తోటి విద్యార్థితో తగవుపడి అతనిని రక్తం వచ్చేలా కొట్టాడని స్కూలు నుండి సస్పెండ్ చేశారు. కిరీటి స్కూల్‌కి వెళ్లి పెనాల్టీగా అధికమొత్తం స్కూలు యాజమాన్యానికి చెల్లించి అరవింద్ సస్పెన్షన్‌ను రద్దు చేయించాడు.

మళ్లీ స్కూల్లో చేరిన అరవింద్ కాలరెత్తుకు తిరగసాగాడు. తను తప్పుచేసినా డబ్బు ఖర్చు పెట్టి తప్పు కప్పిపుచ్చుకోవచ్చు ననే భావన బలపడింది. తను ఐశ్వర్యవంతుడు కనుక చుట్టూ ఉన్నవారు తన మాటకు విలువనివ్వాలని, తనకు ఎదురు చెప్పినవారిని ఉపేక్షించకూడదన్న అహంకారం పెరిగింది. అరవింద్ ఇస్తున్న చిన్న చిన్న కానుకలకు ఆశపడిన తోటి విద్యార్థులు అతని అహంకారాన్ని హీరోయిజంగా పొగుడుతూ అరవింద్‌ను రెచ్చగొట్టసాగారు.

"మీరు మాకు ఆర్థికంగా సహాయం చేస్తున్నందున మీ అబ్బాయిని భరిస్తున్నాం. ఈమధ్య మీవాడు మరీ మితిమీరు తున్నాడు. కాస్త అదుపు చేయండి" అని స్కూల్ ప్రిన్స్‌పాల్ కిరీటికి ఫోన్‌లో చెప్పారు. ప్రిన్స్‌పాల్ చెప్పిన విషయాల్ని భార్యకు తెలియజేశాడు కిరీటి. "ఈ వయ-సులోనే మంచి బుద్ధులు నేర్పాలి. మొక్కయి వంగనిది మానయి వంగదన్నారు. నువ్వు వాడిని దండించు" అన్నాడు కిరీటి.

"ఒక్కగానొక్క కొడుకు. వాడి కాల్లో ముల్లు గుచ్చుకున్నా నా ప్రాణం విలవిలలాడుతుంది. వాడు బాధపడితే నేను చూడలేను. వాడినేం అనకండి. కాలంతోపాటే వాడూ మారతాడు." కన్నీళ్లతో చెప్పింది కృష్ణవేణి. కిరీటి మౌనం వహించాడు.

* * *

పదో తరగతి పరీక్షలో విజయం సాధించి, జూనియర్ కాలేజీలో చేరిన అరవింద్ సినీమాల్లో హీరోలా ధీరత్వం ప్రదర్శించాలనుకుంటూ కాలరెగరేసుకు తిరగసాగాడు. తన మాటకు ఎదురుచెప్పినవాళ్లని బెదిరించడం మామూలయింది. ఎమ్‌సెట్ కోచింగ్ కు వెడుతున్నట్లు ఇంట్లో చెపుతూ సినీమాలు, షికార్లతో సమయం వృధాచేయసాగాడు.

ఇంటర్ రెండు సంవత్సరాలు ఇట్టే గడిచిపోయాయి. ఇంటర్ సెకండ్ క్లాస్‌లో పాస్ అయ్యాడు అరవింద్. ఎమ్‌సెట్ లో ర్యాంకు తెచ్చుకోలేకపోయాడు. బి.ఎస్‌సి డిగ్రీలో చేరాడు.

డాక్టర్ అవుతాడనుకున్న కొడుకు డిగ్రీ కోర్సులో చేరడంతో కిరీటిని నిరుత్సాహం ఆవహించింది. "పోనీలెండి ... మీలాగే డిగ్రీ తర్వాత పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తాడు. చదువు పూర్తయ్యాక వాడినీ వ్యాపారం లోకి దింపుదాం. వాడిని డాక్టరు చదివిద్దామన్న డబ్బు పెట్టుబడిగా పెట్టి కొత్త వ్యాపారం ప్రారంభిద్దాం" సలహా ఇచ్చింది కృష్ణవేణి. "వాడికి సద్బుద్ధులు ప్రసాదించమని భగవంతుని ప్రార్థించడమే మన కర్తవ్యం" అన్నాడు కిరీటి.

* * *

డిగ్రీ కాలేజీలో చేరాక తండ్రిని ఒప్పించి స్పోర్ట్స్ బైక్ కొనిపించుకున్నాడు అరవింద్. కొడుకు ముచ్చట కాదనలేక పోయాడు తండ్రి. స్పోర్ట్స్ బైక్‌పై దర్జాగా కాలేజీకి వెళ్లసాగాడు అరవింద్. తనకు తిరుగులేదన్న అహంకారం మనసులో బలంగా నాటుకుంది. సాయంకాలం మోటార్ బైక్ పై నగర విహారం ఉత్సాహాన్నిస్తోంది. యవ్వనారంభంలో అమ్మాయిల వైపు మనసు లాగసాగింది. చూస్తున్న సినీమాలు వయసుకు మించిన ఆలోచనలు రేకెత్తిస్తున్నాయి. చేతిలో స్మార్ట్‌ఫోన్ కొత్తలోకం చూపిస్తోంది. కాలేజీ అనుభవాలు మధురానుభూతులుగా మార్చుకోమని మనసు హెచ్చరిస్తోంది. చదువుకోవలసిన వయసులో అమ్మాయిలను వలలో వేసుకునే మార్గాలు అన్వేషించసాగాడు అరవింద్. రెండు సంవత్సరాలు దొర్లిపోయాయి. డిగ్రీ ఫైనల్ ఇయర్ లో అడుగుపెట్టాడు అరవింద్. జాలీగా కాలం గడుస్తోంది.

* * *

"ఈరోజు సాయంత్రం నా మిత్రుడు రాఘవరావు తనకు ప్రమోషన్ వచ్చిన సందర్భంగా ఇస్తున్న పార్టీకి మనల్ని ఆహ్వానించాడు. సాయంత్రం ఆరింటికి అందరం వెడదాం" అన్నాడు కిరీటి లంచ్ చేస్తూ. "రాఘవరావు భార్య సునీత నాకూ ఫోన్ చేసింది. అలాగే వెడదాం" చెప్పింది కృష్ణవేణి. అనుకున్నట్లే సాయంకాలం ముగ్గురూ రాఘవరావు ఇంటికి చేరుకున్నారు. అతిథులను సాదరంగా ఆహ్వానించారు రాఘవరావు దంపతులు.

సునీత తన కూతురు అర్చనను కిరీటి కుటుంబానికి పరిచయం చేసింది. అర్చన బిటెక్ మూడో సంవత్సరం చదువుతున్నట్లు చెప్పింది. కృష్ణవేణి సునీతకు సహాయం చేయడానికి ఆమెతో లోపలికి వెళ్లింది. కిరీటి అక్కడ చేరిన మిత్రులతో కబుర్లు పంచుకోసాగాడు. అర్చనను చూడగానే అరవింద్ గుండె లయతప్పింది. ఆమె అందానికి ముగ్ధుడైన అరవింద్ చూపు తిప్పుకోలేక పోతున్నాడు.

'లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అంటే ఇదేనేమో ... అబ్బ ... అర్చన అందాలభామ. నా మనసు దోచింది. ఐ లవ్ హర్ ...' అనుకుంటూ మధురమైన ఊహలలో తేలిపోసాగాడు అరవింద్. అరవింద్ చూపులకు అర్చన తడబడింది. అతని చూపులు విషపు చూపులని ఆమె మనసు హెచ్చరించింది. అటూ ఇటూ తిరుగుతూ అరవింద్ చూపుల నుండి తప్పించుకోవాలని ప్రయత్నించింది. పార్టీ పూర్తయి అతిథులు వెళ్లిపోయాక అర్చనకు హృదయభారం తీరినట్లయింది.

* * *

ఆరాత్రి అరవింద్‌కు నిద్రపట్టలేదు. చంద్రబింబం లాంటి అర్చన ముఖం అతని మనసులో ముద్రపడింది. రాత్రి చాలాసేపు ఆలోచించి మరునాడు తన ప్రేమను అర్చన ముందు వ్యక్తపరచాలని నిశ్చయించుకున్నాడు. అనుకున్నట్లే మర్నాడు సాయంత్రం ఇంజనీరింగ్ కాలేజీ దగ్గర కాపుకాశాడు. కాలేజీ స్కూటర్ స్టాండ్ లో స్కూటీ స్టార్ట్ చేస్తున్న అర్చనను పలకరించాడు. "నువ్వు ఈ కాలం అమ్మాయిల్లా మోడరన్ డ్రెస్‌లో గాక సంప్రదాయ దుస్తుల్లో కాలేజీకి రావడం నాకు నచ్చింది. నువ్వు చాలా అందంగా ఉంటావు" అన్నాడు నవ్వుతూ. అతని మాటలు వినడం ఇష్టంలేనట్లు అర్చన ముఖం తిప్పుకుంది.

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను. మనిద్దరం మేడ్ ఫర్ ఈచ్ అదర్. మన పెళ్లికి మన తల్లిదండ్రులూ కాదనరు. ఏమంటావ్ ..." అన్నాడు తమకంగా. "సారీ ... నాకీ ప్రేమలూ అవీ నచ్చవు. ప్రస్తుతం చదువే నా లక్ష్యం. బి.టెక్ తరువాత ఎమ్.టెక్ చేసి ఫారిన్ వెళ్లాలనుకుంటున్నాను. నా దారికి అడ్డురాకు." అంటూ స్కూటీ స్టార్ట్ చేసి రివ్వున వెళ్లిపోయింది అర్చన.

అర్చన తిరస్కారాన్ని అవమానంగా భావించాడు అరవింద్. ఎలాగైనా అర్చనను తన దారిలోకి తెచ్చుకోవాలనుకున్నాడు. వరుసగా రెండు రోజులు అరవింద్ అర్చనను వెంబడించాడు. ఆమె ఇంటికి వెళ్ళే దారిలో ఎక్కడో ఒక చోట ఆమె స్కూటీకి తన బైక్ అడ్డుపెట్టి తన ప్రేమను వెల్లడించసాగాడు.

అరవింద్ ప్రవర్తనను తన తల్లిదండ్రులకు చెపితే వారు మనస్తాపానికి గురవుతారని భావించింది అర్చన. పోలీస్ కంప్లయింట్ ఇస్తే కుటుంబం అల్లరిపాలవుతుందని భయపడింది. అరవింద్‌కు తనే గట్టిగా బుద్ధి చెప్పాలని నిర్ణయించుకుంది.

* * *

చీకటి గదిలో అరగంట మౌనం రాజ్యమేలింది. కిరీటి, కృష్ణవేణిలు ఎవరి ఆలోచనల్లో వారు సతమత మవుతుండగా ఒక్కసారి లైట్లు వెలిగాయి. కరెంటు వచ్చిందంటూ వార్తలు చూద్దామని టివి ఆన్ చేశాడు కిరీటి. "బ్రేకింగ్ న్యూస్ ... అర్చన అనే ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థినిపై ఏసిడ్ దాడి జరిగింది. నిందితుడు చాలా తెలివిగా కటిక చీకట్లో అర్చన ముఖంపై ఏసిడ్ పోసి పారిపోయాడు. ఆమె వెంటనే మరణించింది. అర్చన తల్లిదండ్రులు నిందితుడి ఆచూకీ చెప్పలేక పోతున్నారు. వర్షం కారణంగా నిందితుడు సాక్ష్యాధారాలు లేకుండా చేయగలిగాడని పోలీసులు చెబుతున్నారు ..."

వార్తలు వింటూంటే కిరీటి చేతిలో రిమోట్ జారి కిందపడింది. కృష్ణవేణి గుండెలో మంట రగిలింది. తల్లి మనసు కంపించింది. "అరవింద్ చేతిపై కాలిన మచ్చలు ... ఏసిడ్ చుక్కలు పడడం వలన కాదుగదా ... అంటే ... అరవింద్ ..." ఆపైన ఊహించుకోలేకపోయింది మాతృమూర్తి.

కిరీటి గబగబా అరవింద్ గదిలోకి వెళ్లాడు. అతని కళ్లు నిప్పులు కురుస్తున్నాయి. "నువ్వు ... అర్చన అనే అమ్మాయి ముఖంపై ఏసిడ్ పోసి వచ్చావు కదూ" అరుస్తున్నట్టు అడిగాడు కిరీటి. "నీకెలా తెలిసింది నాన్నా ..." గాభరాగా అన్నాడు సుధాకర్. "అంటే నేననుకున్నది నిజమేనన్న మాట ... ఆ అమ్మాయి నీకేం అపకారం చేసిందిరా దుర్మార్గుడా ..." గద్గదస్వరంతో అంది కృష్ణవేణి.

"నా ప్రేమ తిరస్కరించింది. రెండు రోజుల క్రితం నన్ను చెప్పుతో కొట్టింది. తట్టుకోలేకపోయాను. ఈరోజు వర్షం రావడంతో నా ప్లాన్ సులభంగా అమలయింది. సాక్ష్యాధారాలు దొరక్కుండా జాగ్రత్త పడ్డాను. మీరేం కంగారు పడకండి. నన్నెవరూ పట్టుకోలేరు." తడబడుతూ చెప్పాడు అరవింద్. కోపంతో అరవింద్ చెంపలు వాయించాడు కిరీటి. కృష్ణవేణి కళ్లు వర్షించసాగాయి. నెత్తి మొత్తుకుని రోదించింది.

"మీరు గాభరాపడకండి ... నాకేం కాదు ..." దృఢంగా చెప్పాడు అరవింద్.
తన కసి తీరిందని పైశాచిక ఆనందం పొందుతున్నాడు అరవింద్. ఒక ప్రాణం హరించినా పశ్చాత్తాపపడకుండా నిబ్బరంగా ఉండగలుగుతున్న కొడుకు రాక్షస మనస్తత్వానికి కృష్ణవేణి మనసు వికలమైంది.

'తప్పు చేసిన పిల్లలను చిన్నవయసులో దండించకపోతే వయసు ముదిరాక అదుపు తప్పుతారని తెలిసీ అలక్ష్యం చేశాను. నా గారాబం వాడిని చెడగొట్టింది. కొడుకుకి మంచి నడత నేర్పడంలో తల్లిగా నా బాధ్యత నిర్వర్తించలేకపోయాను' అనుకుంటూ చెంపలు వాయించుకుంది కృష్ణవేణి.

అర్చన అమాయక ముఖం కళ్లముందు కనపడుతూంటే కృష్ణవేణి హృదయం ద్రవించింది. అరవింద్ మీద కోపం రగిలింది. 'ఏం చేయాలా ...' అని ఆలోచించసాగింది. ఎదురుగా గోడపై ఉన్న తైలవర్ణ చిత్రంలో అర్జునుడికి గీతాబోధ చేస్తున్న శ్రీకృష్ణ పరమాత్మ

వైపు దృష్టి సారించింది. మందహాసంతో కృష్ణ పరమాత్మ తనకేదో సందేశమిస్తున్నట్లు అనిపించింది. అర్చనపై విషం చిమ్మినప్పుడే అరవింద్ మృతప్రాయుడయ్యాడని బోధపడింది. కర్తవ్యం స్ఫురించింది. సెల్ తీసి పోలీస్ స్టేషన్‌కు ఫోను చేసింది.

అరగంటలో పోలీసులొచ్చారు. తన ప్రాణానికి ప్రాణంగా పెంచిన అరవింద్‌ను కన్నతల్లి స్వయంగా పోలీసుల కప్పగించింది. "వాడిని ఉరితీయండి" అరిచింది కృష్ణవేణి.

అరవింద్‌తో పాటు కిరీటిని పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. స్టేట్‌మెంటు రికార్డు చేసుకుని కిరీటిని విడిచిపెట్టారు. రెండు గంటల తరువాత పోలీస్ స్టేషన్ నుండి ఇంటికి బయలుదేరాడు కిరీటి.

* * *

"అరవింద్ చేసిన నేరానికి తగిన శిక్ష పడుతుంది. అంతమాత్రంచేత అర్చన తల్లి కడుపుమంట చల్లారుతుందనుకోను. ఒక సంఘవిద్రోహ శక్తిని సమాజానికి అందించిన తల్లిగా నాకు ఈ నేరంలో భాగం ఉంది. ఏ చట్టానికి చిక్కని నేరస్తురాలిని. నాకు నేను శిక్ష విధించుకుంటున్నాను". టేబుల్ మీద కృష్ణవేణి స్వదస్తూరితో రాసిన లేఖ ... ఎదురుగా ఫ్యాన్‌కు వేలాడుతున్న కృష్ణవేణి మృతదేహం చూస్తూ పోలీస్ స్టేషన్ నుండి ఇంటికి వచ్చిన కిరీటి కొయ్యబారిపోయాడు.

* * *

**ఇంద్రగంటి నరసింహ మూర్తి స్వస్థలం కాకినాడ. ఇక్కడే విద్యాభ్యాసం పూర్తి చేశారు. అనంతరం కెనరా బ్యాంకులో 30 సంవత్సరాలు విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు ఈయన రాసిన 200 లకు పైగా కథలు పలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఈయన రాసిన కథలలో ఆదిత్యహృదయం, జీవితచక్రం, స్థితప్రజ్ఞత, జీవనసమరం, ఆటుపోట్లు, జీవనరాగం కథలు పాఠకుల నుంచి మంచి ప్రశంసలు పొందినవి. ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్రం ద్వారా కొన్ని కథలు ప్రసారమయ్యాయి. అలాగే ఈనాడు అంతర్యామిలో 22 వ్యాసాలు ప్రచురితమయ్యాయి. ఈయన వెలువరించిన పుస్తకం "జీవ స్వరం" కథల సంపుటి.**

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 307



**సింహ ప్రసాద్**
**9849061668**

# మళ్ళీ విత్తనంలోకి

చీకటి అంతకంతకూ దట్టమవుతోంది. ఎన్నో రకాల భయాలు వికృత రూపం దాల్చి రత్తాలు గుండెల్లో నగ్నంగా నర్తిస్తున్నాయి.

ఉద్యోగం కోసం పొద్దుటనగా ఊరి మీద పడ్డ ఆమె మొగుడు అర్ధరాత్రవుతున్నా తిరిగి రాలేదు. నాన్న వస్తాడు, తినడానికేదో తెస్తాడని ఆశగా చూసి చూసి నిరాశపడ్డారు పిల్లలు. తల్లి పెట్టిన రెండు ఎంగిలి మెతుకులు తిని శోష వచ్చినట్టు పడుకుండి పోయారు.

రత్తాలుకి కాళ్ళూ, చేతులూ ఆడటం లేదు. ఇంతదాకా ఎక్కడున్నాడు? ఏం చేస్తున్నాడు? ఇంట్లో ఎదురు చూస్తోన్న పెళ్ళాం బిడ్డలు గుర్తు రాలేదా? లేక తన దారి తను చూసుకోవాలని ఎందులోనైనా దూకి....!

'ఛా ఛా ఆ ఆలోచనకు భయపడిపోయింది. కన్నీరు పొంగివస్తోంటే మెడలోని శిలువని కళ్ళకద్దుకుని ప్రార్థించింది.

మెరుపు మెరిసింది. ఆ వెలుగులో వాసు వస్తూ కన్పించాడు. వెర్రి సంబరంతో పరుగునెళ్ళి భర్తని వాటేసుకుంది. ముద్దులు కురిపించింది. 'పిచ్చిదానా. మనకి మంచిరోజులు వస్తున్నాయే...' 'ఉద్యోగం దొరికిందా?' ఆశగా అడిగింది. 'ఒకళ్ళిచ్చేదేంటి బోడి. నేనే కల్పించుకున్నాను. పిల్లలు నిద్రపోలేదు కదా. బిర్యానీ తెచ్చానే.. 'డబ్బెక్కడిది?' అనుమానంగా చూసింది.

'చెట్టంత మగాణ్ణి. ఆ మాత్రం సంపాదించలేనా. పద పద...' ఇంట్లో కెళ్ళారు. అడ్డదిడ్డంగా పడుకున్న పిల్లల్ని చూసేసరికి వాసు కళ్ళల్లో కన్నీటి అల భళ్ళున పగిలింది. 'పాపం ఇప్పటిదాకా నీ కోసం కలవరిస్తూనే వున్నారు....' వాళ్ళని లేపడానికెళ్తూ, 'మజ్జానం ఇంటాయనొచ్చాడు. రెండ్రోజుల్లో అద్దె బకాయి కట్టకపోతే ఇంట్లోని సామానంతా బయటపడేస్తానన్నాడు చెప్పింది రత్తాలు.

'వాడి మొఖం! రెండ్రోజులెందుకు. రేపే వాడికి దిమ్మ తిరిగే రaలక్ ఇస్తాను కళ్ళు తుడుచుకుంటూ నవ్వాడు. మొగుడి వంక చిత్రంగా చూసింది. పిల్లలు కళ్ళు నలుపుకుంటూ లేచి కూర్చున్నారు. 'మీ నాన్న బిర్యానీ తెచ్చాడు సంబరంగా చెప్పింది తల్లి. వాసు పార్సెల్ విప్పుతోంటే గుప్పుమని వచ్చిన బిర్యానీ వాసనకి పిల్లల ముఖాలు వికసించాయి. 'మా నాన్న మంచోడు అని కొడుకు అంటే, కూతురొచ్చి అమాంతం తండ్రి మెడని చుట్టేసింది. ముందు నాకు పెట్టమంటే నాకు పెట్టమని పిల్లలిద్దరూ పోటీపడ్డారు. 'చిన్నది కదా. ముందు నా బంగారానికి...' అంటూ బిర్యానీ ముద్ద కూతురు నోటికి అందివ్వబోతూ ఆగిపోయాడు. కళ్ళ నుంచి కన్నీళ్ళు ధారలుగా కారుతూ ముద్దని తడిపేస్తున్నాయి. 'వుహు. నీకొద్దు చిట్టి తల్లీ. నువ్వు మాఅదృష్టానివి. అన్న పెద్దోడు. నా తర్వాత నా అంతవాడు కదా....' అంటూ వాడికి పెట్టబోయి ఆగి బావురుమన్నాడు. వాసు ప్రవర్తనకి పిల్లలు ఆశ్చర్యపడితే, ఇల్లాలు అనుమాన పడింది.

'ముందు నాకు పెట్టు మావా...' అంటూ అతడి చేతిని పట్టుకుని ఆ ముద్దని తన నోట్లో పెట్టుకోబోయింది రత్తాలు. గభాల్న చేయి లాగేసుకుని బిర్యానీ పొట్లాన్ని చుట్టేసి బలంగా బయటికి విసిరేశాడు. మళ్ళీ ఏమనిపించిందో పరుగున వెళ్ళి తీసి ఇంటెనకాల వున్న మురుగు కాల్వలోకి విసిరేసి కాళ్ళీడ్చుకుంటూ వచ్చాడు. 'ఏడ్సేవాళ్ళూ మిగలకుండా అందరం కట్టగట్టుకుని చద్దామా మావా?' భార్యనీ, పిల్లల్నీ వాటేసుకుని ఆకాశం బద్దలైనట్టు ఏడ్చాడు. తల కొట్టుకున్నాడు. 'నేను చేతకాని వాడ్ని రత్తాలూ. ఎందుకూ పనికిరాను. దేనికీ పనికిరాను...' గోడకు చేరబడి అరచేతుల్తో ముఖం కప్పుకుని ఏడ్చాడు. పిల్లల్ని తన ఒళ్ళో పడుకోబెట్టుకుని జోకొడుతూ మొగుడి వంక ఆశ్చర్యంగా వేదనగా చూసింది. 'నువ్వేమీ సెయ్యకుండానే ఇలాగున్నామా. పిల్లగాళ్ళని ఇంతోళ్ళని చేశామా!' 'అదంతా ఎప్పటి మాటో. కితం జన్మలోది. ఇప్పుడదేం చెల్లదు. అదంతా తుడిచిపెట్టుకుపోయింది రత్తాలూ. నా పని అయిపోయింది. ఇంక బతకడం వేస్ట్....'

'నీ రెక్కలూ నా రెక్కలూ చల్లగా వున్నాయి మావా. ఏమీ మిగలనట్టు ఆ ఏడుపేంటి సెప్పు. ఉద్యోగం దొరక్కపోతే అంతా అయిపోయినట్టేనా. మనకంటే నిష్ఠ దరిద్రులెంతమంది లేరు. వారు బతకడం లేదా? మనల్నెందుకు మోయాలని భూదేవి మనల్నడిగిందా? లేదు కదా?' 'నీకు తెలీదు రత్తాలూ. బయటి పరిస్థితి చాలా ఘోరంగా వుంది....' 'నీ సిన్నప్పటి కన్నా సెడిపోయిందా?' ఆమె సూటిగా అడిగిన ప్రశ్న వాసు కాలర్ పట్టుకుని కూర్చోపెట్టింది. వెర్రిగా చూశాడు. జ్ఞాపకాల్లో కప్పడిపోయిన గతం పునరుద్ధానం చెంది కళ్ళ ముందు నిలిచింది.

అప్పట్లో పల్లెలో ఊరవతలున్న మాలపల్లెలో వుండేవారు. తల్లీ తండ్రీ వ్యవసాయ కూలీలు. తండ్రి కూల్డబ్బుల్ని తాగుడికి తగలేసేవాడు. తల్లి తన కష్టంతో తననీ మరి నలుగురు పిల్లల్నీ సాకేది. పేడ పోగేస్తూ, పరగ ఏరుతూ, గొడ్లు కాస్తూ రూపాయీ అర్ధా సంపాదించేవారు. అయినా అంబలి తప్ప అన్నం దొరికేది కాదు. తినీ తినక మాడుతోంటే, అమ్మమ్మ తనని నగరానికి తీసుకొచ్చింది. 'నా మనవడికి కూలి పనిప్పించు సామీ అని తెలిసిన అందర్నీ ప్రాధేయపడింది. అంతా విదిలించేసారు. అయినా అధైర్యపడకుండా సార్ గారి స్కూలుకి తీసుకెళ్ళింది.

'తిండి లేక మాడిపోతున్నాడయ్యా. వీడ్ని మీకాడ పెట్టుకుని ఒక ముద్ద పెట్టండి శాన. ఒక్క రూపాయి ఈయొద్దు అంటూ సార్గారి కాళ్ళ మీద పడిరది అమ్మమ్మ. తన వంక చూసి చప్పరించేశారాయన. 'మైనర్ని పనిలో పెట్టుకోకూడదు.

'అలాగనమాకండి. పెద్దదాన్ని, మీ కాళ్ళట్టుకున్నాను. కనికరించండి సామీ. ఏ పని సెప్పినా చేత్తాడు. కుక్కలా నమ్మకంగా పడుంటాడు. కడుపు కింత అన్నం పెట్టండి చాలు. పెద్ద మనస్సు సేసుకోండయ్యా ఆయన కాళ్ళని గట్టిగా పట్టుకుని బ్రతిమాలింది. ఆయనెంత చెప్పినా, కోప్పడ్డా వినక పోయేసరికి, 'సరేలే. ఏదోటి చూస్తాన్లే అన్నారు. 'స్కూల్లో ప్యూన్గా పెట్టుకుంటాను. నెలకు రెండు వేలిస్తాను. ఎవరైనా అడిగితే నీ వయస్సు పద్దెనిమిది అని చెప్పు...

'తమరు నిజంగా దేవుడే. అలా సూత్తావేంట్రా. అయ్యగారి కాళ్ళ మీద పడు అంటూ తనని వంచింది. సార్గారి పాదాలు పట్టుకుని నమస్కరించాడు. అలాగ తను పద్నాలుగేళ్ళ వయస్సులో సార్గారి ఆశ్రయంలో కెళ్ళిపోయాడు. ఆ తర్వాత మరి వెనుదిరిగి చూడలేదు. సార్ గారికీ, తర్వాత మేడమ్ గారికీ చేతికింది మనిషయ్యాడు. స్కూలు పనీ ఇంటిపనీ అని చూడకుండా చెప్పిన పనల్లా చేశాడు. ఇంట్లోనూ ఆఫీసులోనూ వ్యాక్యూమ్క్లీనర్తో శుభ్రం చేసేవాడు. కూరగాయలు తెచ్చేవాడు. అటక మీంచి సామాన్లు దించేవాడు. రోజూ సోఫాలూ, కుర్చీలూ మేడమ్ మెచ్చుకునేలా తుడిచేవాడు. మేడమ్ వెంట బజారు కెళ్ళేవాడు. సరుకులు మోసేవాడు.

'వాసు బాగా ఆసరాగా వుంటున్నాడు. వాడికి కారు డ్రైవింగ్ నేర్పిద్దాం. నమ్మకంగా మన దగ్గరే పడుంటాడు. ఎప్పుడంటే అప్పుడు ఎక్కడికంటే అక్కడికి వెళ్ళొచ్చు మేడమ్ సార్గారికి

చెప్పి ఒప్పించింది. ఆవిడే డ్రైవింగ్ స్కూల్లో చేర్పించింది. అది నేర్చుకుంటూ పొద్దుట్నుంచి రాత్రి దాకా ఇంట్లోనూ స్కూల్లోనూ పనిచేసేవాడు. డ్రైవింగ్ బాగా వచ్చాక సార్ గారి డ్రైవర్ అయ్యాడు. జీతం అయిదువేలు చేశారు. మరి రెండేళ్ళకు పెళ్లయ్యింది. ఊరి చర్చిలో జరిగిన పెళ్లికి సార్గారూ మేడమ్ వచ్చి ఆశీర్వదించారు. ఇంటికి కావాల్సిన సామాన్లు కొనిపెట్టారు.

రత్తాలు స్కూల్లోనే ఆయాగా చేరింది. కాలం చీకూ చింతా లేకుండా గడిచిపోతోంది. ఇద్దరు పిల్లలు పుట్టారు. ఒకరోజు తెల్లవారు జామున సార్గారికి గుండెపోటు వచ్చింది. త్వరగానే కోలుకున్నారు గాని అమెరికాలో వుంటోన్న వారబ్బాయి ఒత్తిడి తెచ్చి స్కూల్ అమ్మించేశాడు. ఆ తర్వాత అమెరికా వెళ్ళిపోయారు.

'ఇదీ మంచికే' అనుకున్నాడు తను. అప్పటికే చాలామంది డ్రైవర్లతో పరిచయాలయ్యాయి. ట్రావెల్ ఏజెంట్ దగ్గర కమీషన్కి పని చేస్తే ఎక్కువ సంపాదించొచ్చని గ్రహించాడు. అలాగే చేశాడు. ఆదాయం బావుంది. చక్కని ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. చెల్లెళ్ళకీ తమ్ముళ్ళకీ అండగా నిలబడ్డాడు.

'పిల్లల్ని స్కూల్లో చేర్చాలి. దానికి తగ్గట్టుగా సంపాదించాలి. డ్రైవర్గా వుండి పోకూడదు. ఓనర్ డ్రైవర్ని అవ్వాలి. అది నా కల అనేవాడు రత్తాలుతో మెరుస్తోన్న కళ్ళతో. షిర్డి, తిరుపతి, విజయవాడ లాంటి దూర ప్రదేశాల టూర్లకి ఇష్టంగా వెళ్ళేవాడు. ఎక్కువ కమీషన్ రావడమే గాక బేటాలు మిగిలేవి. మెల్లగా కూడబెట్టడం మొదలెట్టాడు. మూడేళ్ళు ఎద్దులా పనిచేశాడు. పిల్లల్ని స్కూల్లో చేర్చడమే కాదు ఫైనాన్స్ కంపెని సాయంతో కారు కొనగలిగాడు. రత్తాలు మాల్లో స్వీపర్గా చేరింది. ఆమె సంపాదనా బావుంది. పిల్లల్ని ప్రైవేటు స్కూల్లోకి మార్చారు. త్వరత్వరగా కారు అప్పు తీర్చేస్తే కారు సొంతమైపోతుందన్న ఆశతో అటు ఓలా కీ, ఇటు ఉబర్ కీ కూడా తిరిగాడు. ఎక్కువ గిట్టే సమయాల్లో ఎక్కువ తిరిగాడు. రోజు వారీ టార్గెట్లు పూర్తి చేశాక గాని డ్యూటీ దిగేవాడు కాదు.

గోదావరి మీద పడవ ప్రయాణంలా తమ బతుకులు సాఫీగా సాగిపోతున్నాయి. ఇంతలో కరోనా మహమ్మారి పంజా విసిరింది. లాక్డౌన్ ప్రకటించారు. కారు చక్రాలు ఆగాయి. భార్య పనీ పోయింది. అయినా కృంగిపోకుండా వున్నదంతా వూడ్చుకు తిన్నారు. అప్పులు చేశారు. కానీ కారు కిస్తీలు కట్టలేకపోయారు. ఫైనాన్స్ వాళ్ళు కారు తీసుకుపోయారు. సర్వం కోల్పోయినట్టు అయిపోయారు. చిన్నా చితకా ఉద్యోగాల కోసం రోడ్డున పడ్డారు. మాల్స్ తెరవలేదు. ఎన్నో షాపులు హోటళ్ళు మూతపడ్డాయి. ఇంటి నుండి పని వల్ల సాఫ్ట్వేర్ వాళ్ళు ఊళ్ళకెళ్ళిపోయారు. టాక్సీలకు డిమాండ పూర్తిగా పడిపోయింది. డ్రైవర్ ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. రత్తాలు మాత్రం నాలుగిళ్ళలో పనిమనిషిగా చేరింది. అదే తమకు ఒక ముద్ద పెడుతోంది.

అప్పులవాళ్ళూ ఇంటాయనా ఒత్తిళ్ళు పెంచారు. ఎన్నాళ్ళని ఇలా ఆర్థాకలితో బండి లాగించడం అన్పించింది. బతకడానికి దారి లేనప్పుడు చావడమే పరిష్కారం అనుకున్నాడు.

చచ్చిపోతే తమ కష్టాలు, కన్నీళ్ళు, బాధలు, వేదనలు అన్నీ హూష్కాకి అయిపోతాయని చెప్పి బిర్యానిలో విషం కలిపి తెచ్చాడు...! గాఢంగా నిట్టూర్చాడు వాసు. 'ఆ బిర్యానీ తినేశామనుకో. అంతా కట్టకట్టుకుని చచ్చామనుకో. ఇదివరకటిదంతా పోయిందనుకో. మళ్ళీ మొదలుకాడ్నుంచి స్టార్టు చేద్దాం మావా. నేను నాలుగు కాదు ఎనిమిదిళ్ళలో పని చేస్తా. నువ్వా డ్రైవర్ అనేగాక చిన్నదో చిటికెదో ఏది దొరికితే అది చెయ్యి. బతుకు గాడిలో పడితే పరుగెత్తడం ఎంతసేపు మావా..!'

రత్తాలు వంక పిచ్చిగా చూశాడు. ఆమె ధీమాకి అబ్బురపడ్డాడు. 'ఇంకిలాంటి పిచ్చిపని చెయ్యనని మాటియ్యి మావా చేయి చాచింది. 'అది కాదు రత్తాలూ. ఇంత బతుకూ బతికి ఇంటెనకాల చచ్చినట్టు...' ఆపై మాటలు పూర్తి చేయలేదు. నవ్వింది. 'ఇంటెనకాల కాదు ఇంట్లోనే చచ్చాం. ఇది కొత్త జనమ. ఉన్నదాంతోనే తృప్తిగా బతుకుదాం. నాకు మాటియ్యి మావా.. ఆమె చూపులు మంత్రించినట్టుగా ఆమె చేతిలో చేయి వేశాడు. ఆ మర్నాడు పనికెళ్ళిన రత్తాలు గాలిలో తేలుతూ వచ్చింది. 'నేను పనిచేస్తున్న అపార్టుమెంటుల్లోని వాచ్మేన్ భార్యకి జబ్బు చేసిందట. వాళ్ళ ఊరెళ్ళిపోయారు. నీ గురించి చెప్పాను. తీసుకు రమ్మన్నారు. రా మావా వెళ్దాం చెయ్యి పట్టుకుని లాగింది.

'వాచ్మేన్ పనా! ఫ్యాంటూ షర్టూ తొడుక్కుని సొంత కారు నడిపిన వాణ్ణి....!' 'మన ఇంటాయన. తన్ని తరిమేస్తే ఎక్కడ తల దాచుకోవాలన్న భయం, దిగులు పోయాయమని సంతోషించు మావా. మనం ఉండటానికి ఇల్లు ఇస్తారు. కార్లూ, బైకులూ తుడిస్తే అదనంగా ఎంతో కొంత ముడుతుంది. నేనందులోనే ఇంకో రెండు మూడిళ్లలో పని చూసుకుంటాను. ఆ దగ్గర్లోనే సర్కారోడి స్కూలుంది... సంబరంగా చెప్పుకుపోతోంది రత్తాలు. అతడా విషయాన్ని జీర్ణించుకోలేక రాయిలా వుండిపోయాడు. అయినా ఆమె పట్టించుకోలేదు. బలవంతాన అసోసియేషన్ సెక్రటరీ శ్రీరాములు దగ్గరికి లాక్కుపోయింది.

వాసునీ అతడి వాలకాన్నీ చూసి అన్నాడాయన. 'వాచ్మాన్ పని చేయగలవా?' తల నిలువుగా ఆడించాడు. 'ఒకసారి బిల్డింగులోని అన్ని ఫ్లోర్లూ చూసిరా. రోజూ అన్ని ఫ్లోర్ల బాల్కనీలూ తుడవాలి. ప్రతి శుక్రవారం కడగాలి. బోరు నీళ్ళు, మంజీరా నీళ్ళు ట్యాంకుల్లోకి ఎక్కించాలి. టైం ప్రకారం నీళ్ళు వదలాలి. నెలకోసారి ట్యాంకులు కడగాలి....'నేనుంటాను కదండి. ఇద్దరం కలిసి చేసుకుంటాం అంది రత్తాలు. ఏదో అనుమానం రాగా, 'నువ్వు బట్టలు ఇస్త్రీ చేస్తావు కదా?' అడిగారు. 'మేం చాకళ్ళం కాదండి.. కళ్ళు విప్పార్చి చూశారు. 'ఇదివరకేం పనిచేశావేంటి?' 'కారు డ్రైవర్నండి

'ఇప్పుడా పని లేకే కదా దీని కొచ్చావ్. కరోనా నిన్నే కాదు అన్ని వృత్తుల్నీ, ఉపాధుల్నీ దెబ్బతీసింది. ఎలాగోలా నిలదొక్కుకోవాలి. అల వచ్చినప్పుడు తల వంచుకుంటే తర్వాత తలెత్తుకుని నిలబడొచ్చు. చెట్టు మొదల్ని అడ్డంగా నరికినా మళ్ళీ చిగురిస్తుంది. ఎందుకంటే అది జీవలక్షణం!'

తలొంచుకున్నాడు వాసు. ఇబ్బందిగా చూసింది రత్తాలు. ఇస్త్రీ పని ఊహించలేదామె. 'ఇస్త్రీ పని చేయడానికి చాకళ్ళే కానక్కర్లేదు. ఎవరైనా నేర్చుకోవచ్చు. చేయొచ్చు. ఇష్టం, శ్రద్ధ వుంటే ఏ పనైనా సులువుగా వస్తుంది. ఇక్కడ మొదట్నుంచీ వాచ్ మ్యానే ఇస్త్రీ చేస్తున్నాడు. దానికోసం ఇంకొకర్ని ఎక్కడ్నుంచి తీసుకొస్తాం!'

వాసు తటపటాయిస్తుంటే అన్నాడాయన 'పనిని గౌరవించడం నేర్చుకున్నవారే చులాగ్గా పైకొస్తారు. నీకంత నామోషీగా వుంటే, వద్దులే'.. శ్రీరాములు లేచి వెళ్ళబోతోంటే ఆపింది రత్తాలు. 'అన్నీ నేర్చుకుంటాడు. నాదీ గేరంటీ. మీరెలా చెబితే అలా చేస్తాం. తిండికి లేక పిల్లలు మాడిపోతున్నారు. కనికరించండి చేతులు జోడించింది. 'అదీ భేషైన మాట. నాలుగు డబ్బులు కళ్ళ జూడాలంటే ముందు చేతినిండా పనుండాలి. దేవుడు రెండు చేతులిచ్చింది ఒక దానికి దెబ్బ తగిలితే రెండోది ఉపయోగిస్తుందనే..

ఆ మర్నాడే వాచ్మేన్ గదికి మారిపోయింది వాసు కుటుంబం. ఆ రూమ్ చాలా చిన్నది. పడకకీ, వంటకీ అన్నింటికీ అదే. చాలా ఇరుగ్గా వుంది. అసంతృప్తిగా చూశాడు. అనునయించింది రత్తాలు. వాసు ఉదయం అయిదింటికే లేచి స్పాంజి తీసుకుని పైపు నీళ్ళతో కార్లు కడుగుతోంటే మార్నింగ్ వాక్ కెళ్తూ ఆగారు శ్రీరాములు. 'ఇంకాస్త పొద్దుటే లేచి ఈపని కానివ్వాలి. త్వరగా తెమిలెళ్ళి చెత్త ఎత్తు

కార్లూ బైకులూ తుడిచాక, ప్లాస్టిక్ డ్రమ్ తీసుకుని ఒక్కో ఫ్లాట్కూ వెళ్ళాడు. గుమ్మం పక్కన పెట్టిన చెత్తని అందులో పోశాడు. కొన్నిట్లలోంచి దారుణమైన వాసన వచ్చింది. ముక్కుకి కర్చీఫ్ కట్టుకుని ఆ పని పూర్తి చేశాడు. దాన్ని తీసుకెళ్ళి గ్రౌండ ఫ్లోర్లో వెనక పక్కన ఉంచిన పెద్ద డ్రమ్ముల్లోకి చెత్తని మార్చాడు. పిమ్మట చీపురందుకుని బాల్కనీలు చిమ్మి, టెర్రేస్ మీదకెళ్ళి మంజీరా నీళ్ళు వదిలాడు.

ఆ సరికి పూర్తిగా డీలా పడిపోయాడు. సానుభూతిగా చూసింది రత్తాలు. 'పిల్లల చేత పాలప్యాకెట్లు, పేపర్ వేయిస్తే...' ఆమె మాటలు పూర్తికాకుండానే కయ్మన్నాడు. 'వాళ్ళ రాత నాలాగా కాకూడదు. బాగా చదువుకోవాలి. పస్తులుండైనా చదివిస్తా.. పిల్లల తలలు ఆప్యాయంగా నిమిరింది. 'అలవాటులేకే లే. మెల్లగా అలవాటు పడిపోతాను ఆమెని నొప్పించలేక అన్నాడు.

'వాసూ, ఇవాళ ఇస్త్రీ పెట్టె కొని తెచ్చేసుకో. ఇస్త్రీలు ఎప్పుడు మొదలుపెడతావని అంతా అడుగుతున్నారు అన్నారు శ్రీరాములు. 'ఇవాళ కొంటానండి. కానీ...' తలగోక్కున్నాడు. 'నీభార్య చెప్పిందిలే. ట్రెజరర్ శర్మకి చెప్పాను. అడ్వాన్సు ఇస్తాడు, తీసుకో. ప్రక్క అపార్టుమెంటులోని వాచ్మాన్ని కలిశాడు వాసు. ఇస్త్రీ చేస్తున్నాడతడు. 'కొత్త వాచ్మేన్వి నువ్వేనా. అక్కడంతా మంచి వాళ్ళులే. బాగా చూసుకుంటారు'.. 'అన్నా, ఇస్త్రీ పెట్టె కొనాలి. సాయం రావా.. 'మీరు చాకళ్ళు కాదా?'.. తల అడ్డంగా వూపాడు. 'నేర్చుకుని చేస్తావన్నమాట. ఇక మీ జనం కర్మ కాలినట్టే నవ్వి తిరిగి అన్నాడు. 'రెండ్రోజులు నాతో వుండు నేర్పేస్తాను..

అతడ్ని తీసుకుని బజారు కెళ్ళి ఇస్త్రీ పెట్టె కొన్నాడు. చాలా బరువుగా వుంది. బరువెక్కు వుంటేనే బట్ట బాగా నలుగుద్దని కొనిపించాడు.

ఒకరోజు నేర్చుకునే సరికే జబ్బలు పట్టేశాయి. ఏడుపు తన్నుకొచ్చింది. 'నేనీ బాడుకావ్ పని చేయలేను. నాతరం కాదు ఏడుస్తూనే కస్సుమని కరిచేశాడు. 'పిల్లల మొకాలు చూసి ఓపిక పట్టు మావా. ఇదివరకు మాల్లో స్వీపర్ని. ఇప్పుడు అంట్లూ, బాత్రూమ్లూ కడగటం లేదూ. హరిశ్చంద్ర మారాజంతటోడే కాలం కర్మం కలిసి రాక కాటికాపరయ్యేడు!' మ రి రెట్టించలేదూ తనలో తను రగుల్తూండిపోయాడు.

రోజులు భారంగా గడుస్తున్నాయి. అలాగని వాసు పని విషయంలో బద్ధకించలేదు. ఎంత బాగా చెయ్యగలడో అంతబాగానూ చేస్తున్నాడు. అంతా అతడి పనినీ, అంకిత భావాన్నీ మెచ్చుకొంటోంటే గుండెల మీంచి పెద్ద బరువు దిగిపోయినట్టు ఫీలవుతోంది రత్తాలు. కాని వాసుకి ఆనందంగా లేదు. ఎలాగైనా సరే పైకి ఎగబ్రాకాలన్న కసితో కష్టపడుతున్నాడు.

అదే అపార్టుమెంటులో వుంటున్న ఆనందరావు ఏదో ఏజెన్సీ తీసుకున్నాడు. ట్రక్ ఆటో కొన్నాడు. డ్రైవర్ కోసం చూస్తోంటే వెళ్ళి కలిశాడు వాసు. తన డ్రైవింగ్ లైసెన్సు చూపించి, అనుభవం ఏకరువు పెట్టాడు. 'రోజుకి నాలుగైదు గంటల పని వుంటుంది. డిస్ట్రిబ్యూటర్ దగ్గర సరుకు లోడ్ చేసుకుని, నేనిచ్చిన లిస్టు ప్రకారం సరుకుని షాపులకి సప్లై చేయాలి. అబ్బే నీకెలా కుదుర్తుందీ!' 'కుదిరించు కుంటాను. పగలు ఖాళీయే కదండి. ఎలాగైనా చేసేస్తాను. అదయ్యాకే ఇస్త్రీ పని పెట్టుకుంటాను సార్

'ఇక్కడుండే వాడివి గనుక నిన్ను పెట్టుకుంటే నాకూ మంచిదే అనుకో. సరే ముందు సెక్రటరీ అనుమతి తీసుకో.. ఎగిరి గంతేశాడు. 'నాకు డ్రైవింగ్ ఎంతో ఇష్టమండి. చిన్న అవకాశం వచ్చింది సార్. మీరు పర్మిషనిస్తే...' శ్రీరాములుని అడిగాడు వాసు. ఆయన కతడి మీద గుడ్ ఇంప్రెషన్ వుంది. ఇతడొచ్చేక అన్ని పనులూ సాఫీగా సాగి పోతున్నాయి మరి. 'వాచ్మాన్ డ్యూటీకి ఇబ్బంది లేకుండా చేసుకుంటానంటే చేసుకో. ఎవరి దగ్గర్నుంచీ ఎలాంటి కంప్లయింటూ రాకూడదు సుమా..

ఆ మర్నాడే కొత్త ట్రక్ ఆటో ముందు కొబ్బరికాయ కొట్టి ఎక్కాడు వాసు. భార్యా బిడ్డలకు సంతోషంగా వీడ్కోలిచ్చి ముందుకు దూకించాడు. అతళ్ళో ఉత్సాహం వెల్లువవడం చూసి మురిసిపోయింది రత్తాలు. భవిష్యత్తు మీద భరోసా చిక్కింది వాసుకి. భార్యతో పిల్లత్తో తెగ కబుర్లు చెబుతున్నాడు. చక్కగానూ, వేగంగానూ చేస్తున్నందుకు ఆనందరావు ఎంతో సంతోషించారు. 'నువ్విదే స్పీడుతో చేస్తానంటే మరిన్ని సరుకులకు ఏజెన్సీ తీసుకుంటాను.. 'తీసుకోండి సార్. అవసరమైతే కొన్ని బట్టలు ఇస్త్రీకి పక్క వాచ్మేన్కి ఇచ్చేస్తాను.. విషయం భార్యకి చెప్పి పొంగిపోయాడు. 'మనకి మళ్ళీ నిజంగానే మంచి రోజులొస్తున్నాయే

'మన కష్టమే మనల్ని కాపాడుతుంది భర్తని వాటేసుకుంటూ అంది. పిల్లలు కడుపు నిండా తింటూ బడికెళ్ళి శ్రద్ధగా చదువుకుంటున్నందుకే ఆమెకి చెప్పరానంత ఆనందంగా వుంది.

ఒకరోజున ఆటో దిగుతూనే వచ్చి రత్తాల్ని చుట్టేసి గిరగిరా తిప్పేశాడు వాసు. 'ఏవైంది మావా. ఈ పిచ్చి సంబరమేంటి.. 'నక్కని తొక్కానే. నేను సరుకు తెచ్చే డిస్ట్రిబ్యూటర్ గారబ్బాయికి నేనూ నా పనీ బాగా నచ్చాయి. వారి ఫార్మా కంపెనీలో ఉద్యోగుల్ని తీసుకురావడానికీ తీసుకెళ్ళడానికీ, టాక్సీల కాంట్రాక్టు ఇస్తున్నారట. నన్ను అప్లై చెయ్యమన్నారు

'మనకి కారు లేదుగా!' 'వస్తుందే. వాళ్ళే బ్యాంకుల్తో మాట్లాడి ఇప్పిస్తానన్నారు. బ్యాంకు కిస్తు తగ్గించుకుని వాళ్ళే తిన్నగా బ్యాంకుకి జమ చేసేస్తారు. మిగతాది మనకిస్తారు. నేను మళ్ళీ ఓనర్ డ్రైవర్ని అయిపోతున్నానోచ్ మిన్నంటేలా అరిచాడు వాసు. రత్తాలు నవ్వింది. వసంతకాలపు వేకువ వెలుగులా వుందది!

* * *

**చెలంకూరివరహ నరసింహ ప్రసాద్**

**చెలంకూరివరహ నరసింహ ప్రసాద్ స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలంలోని మల్లవరం గ్రామం. ఇండియన్ బ్యాంక్ లో సీనియర్ మేనేజర్ గా పనిచేస్తూ 2001 లో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. అనంతరం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఈయన రాసిన మొదటి కథ 'కథగా ముగియని కథ' 1973 లో స్వాతి మాస పత్రికలో ప్రచురింపబడింది. ఇప్పటివరకు 445 కథలు, 70 నవలలు, 2 నాటకాలు, కొన్ని కవితలు వివిధ పత్రికల్లో ప్రచురింపబడ్డాయి. 12 కథాసంపుటాలు వెలువడ్డాయి. 112 కథలకు, 18 నవలలకు, 2 నాటకాలకు బహుమతులందుకున్నారు. 40 కథలు కన్నడ, తమిళం, హిందీ లోకి అనువదింపబడ్డాయి. 2 నవలలు కన్నడంలోకి అనువదింపబడినవి. నా కథ "మళ్ళీ విత్తనంలోకి" కోవిడ్ కష్టకాలంలో ఒకప్పటి మా కారు డ్రైవర్ ఎదుర్కొన్న అనుభవాలకి కథారూపమే ఈ కథ.**

# ఫుట్ బాల్



కె.వి.యస్.వర్మ
9848787266

ఈ మధ్య సుహాస్ చాలా సమయం నాతోనే గడుపుతున్నాడు. కోవిడ కారణంగా స్కూళ్లు మూసివేయడంతో తరచూ నా కూడా పొలానికి వస్తున్నాడు. చదివేది ఏడో క్లాసే అయినా చాలా కబుర్లు చెబుతాడు. టచ్ ఫోన్ కొంచెం అలవాటు కావడంతో ఏవేవో చూస్తూ ఆసక్తికరమైన విషయాలుంటే నాకు చెబుతుంటాడు . సుహాస్ వాళ్ల అమ్మా నాన్నాతో యాప్రాల్ లో పెద్ద అపార్టుమెంటులో వుంటున్నాడు. ప్రతి శనివారం వెళ్లి వాడిని మా రాంపల్లి విలేజ్ కు తీసుకు వచ్చేవాడిని.

స్కూళ్లు బంద్ కావడంతో మా వూరిలోనే ఎక్కువగా వుంటున్నాడు. వచ్చేటప్పుడు కూడా ఫుట్ బాల్ తెచ్చుకున్నాడు. ఇక్కడ ఆడడానికి వాడి వయసు కుర్రాడొకడే వున్నాడు మా ఎదురింట్లో. అతను వచ్చే వరకూ మా ఇంటి ముందరి రోడ్డు మీద సుహాస్ ఒక్కడే ఫుట్ బాల్ ను పాదం మీంచి

మోకాలు వరకూ, ఆపై వరకూ తిప్పుతూ ఆడుతుంటాడు. అప్పుడప్పుడూ నేను ఆసక్తితో చూస్తుంటాను. అలా బాల్ ను చేత్తో పట్టుకోకుండా కాలితోనే తిప్పడానికి ఏమన్నా పేరుందా అని అడిగాను. ఉంది తాతయ్యా‘ అని ఫుట్ బాల్ ను చేత్తో పట్టుకుని, ’జగ్లింగ్ ‘ అంటారు అని చెప్పి , బంతి మీదనే ద్రుష్టి పెట్టి, మళ్లీ పాదం మీద నుంచి మోకాలు వరకూ అటూ ఇటూ తిప్పుతూ మధ్యలో బాల్ ను నేలమీదకు తెచ్చి, గట్టిగా తన్నాడు. కంకర రోడ్డు మీద రాళ్లు పైకి రావడంతో, కాలికి ఓ రాయి తగిలి ’అమ్మా‘ అన్నాడు. చదువుతున్న పుస్తకాన్ని పక్కన పెట్టి అటు చూశాను, గట్టిగానే తగిలినట్టుంది, రక్తం కారుతోంది. వాడి కళ్లల్లో నీళ్లు.

’లోపలికి రా‘ అని పైపు దగ్గరకు తీసుకెళ్లి కాలి మీద చల్లని నీళ్లు కాసేపు పడేలా చేశాను. తర్వాత మందు వేసి, కట్టు కట్టాను. ’తగ్గిపోతుంది. రెండ్రోజులు కాలికి దేన్నీ తగలనీకు. గాయం చిన్నదే అయినా రేగితే గబుక్కున మానదు‘ అన్నాను. ’రెండ్రోజులా‘ అన్నాడు అయిష్టంగా మొహం పెట్టి.

–2–

’అవును‘ అన్నట్టుగా తలూపాను. ’సరే తాతయ్యా. మీకూడా పొలం వస్తాను‘ అన్నాడు కుంటుకుంటూ నడుస్తూ. ’ఇవేళ వద్దులే‘ అన్నాను సుహాస్ కాలి వంక చూస్తూ . చిన్నప్పటి వాడి సుకుమారపు కాళ్లు కళ్ల ముందు కదిలాయి. అలాగే తెగిన వాడి చిటికన వేలూ గుర్తుకొచ్చింది.

* * *

పదినెలల సుహాస్ ను మంచం కొసన పడుకోబెట్టి, వాడి ముందు నేల మీద కూర్చుని పాదాలను ముద్దుపెట్టుకునేవాణ్ని. మంచుబిందువు సుతారంగా తాకిన గులాబీ రేకుల్లా వుండేవి వాడి లేత పాదాలు. కొద్దిగా కితకితలు పెడుతుంటే కాళ్లూ చేతులూ ఊపుతూ కిలాకిలా ఒకటే నవ్వు, తెల్లటి మల్లెపువ్వుల్లా కనువిందు చేస్తూ. పట్నానికి ఇరవై కిలోమీటర్ల దూరంలోనే వున్న మా ఊరి పల్లెటూరి కళ తగ్గుతున్నా పొలాలకు దగ్గరలో వుండడంతో చెట్టూ పుట్టా ఇంకా వున్నాయి. కాకి కావ్ కావ్ అంటే వాడూ అలా అనేవాడు.

సుహాస్ అమ్మా నాన్నా ఉద్యోగాలు చేస్తుండడంతో మా ఇంటికి దగ్గరలోనే వున్న ఓ కాన్వెంటులో ఎల్.కె.జి.లో చేర్పించాం సుహాస్ ను. ఒకనాడు వాడి టీచర్ ’మీ మనవడు గడుగ్గాయి అండీ‘ అంది పగలబడి నవ్వుతూ. ఏవిటన్నట్టు ఆమె వంక చూశాను. ’ఇవేళ ఎబిసిడిలు చెప్పు‘ అంటే, ’మీకొచ్చుగా‘ అన్నాడు అంటూ మళ్లీ నవ్వు. నాకూ నవ్వొచ్చేసింది. ముళ్లపూడి బుడుగు గొర్తొచ్చి, సుహాస్ భుజాల మీద చేతులు వేసి, ’బుడుగూ బుడుగూ అల్లరి పిడుగు‘ అన్నాను. వెంటనే వాడు చేతులు చాచాడు ఎత్తుకోమంటూ, మనవణ్ని ఎత్తుకుని గిరగారా తిప్పాను. తర్వాత కొన్ని రోజులకు ’ టీచర్ కొట్టింది‘ అన్నాడు వాడు. ’దేంతో‘ అన్నాను.

–3–

'నోటితో' అన్నాడు. నాకు అర్థమయింది, వాడి ద్రుష్టిలో కొట్టడం అంటే తిట్టడం అని. కార్తీకమాసం రావడంతో వాడి స్కూలు వాళ్లు వనభోజాలు ఏర్పాటు చేశారు మాతోటలో. మేమంతా వెళ్లాం. అంత వరకూ సరదాగా ఆడుకుంటున్న సుహాస్ 'ఇక్కడికీ వచ్చిందీ' అన్నాడు దూరంగా కనిపించిన టీచర్ ను చూసి, అదోలా మొహం పెట్టి. మాకు నవ్వాగలేదు. టీచర్ అంటే స్టూడెంట్ కు భయమో, కోపమో వుంటాయనుకుంటూ 'అలాగనకూడదురా' అన్నాను నెమ్మదిగా. వాడికామాట నచ్చినట్టులేదు.

రోజూ రాత్రి నా పక్కన పడుకున్న సుహాస్ ను జోకొడుతూ 'జో అచ్యుతానంద జోజో ముకుందా' అని పాడడం ఒక డ్యూటీగా పెట్టుకున్నాను. అలా జోకొడుతుంటే నెమ్మదిగా నిద్రలోకి జారుకునేవాడు. ఆ రాత్రి కూడా జోకొడుతూ ఏదో ఆలోచిస్తూ పాడుతుంటే, 'తాతయ్యా, తప్పు పాడుతున్నారు' అన్నాడు. 'లాలి పరమానంద లాలి గోవిందా'ను ముందు వెనకలుగా పాడినట్టు గమనించి, 'అమ్మ వెధవా' అంటూ ముద్దు పెట్టుకుని, నవ్వుకుంటూ సరిగా పాడాను.వీడికెంత గుర్తో అని మనసులోనే అభినందించాను.

మా ఇంట్లో ఓ చిన్న ఫంక్షన్ కు మా స్నేహితుడు వచ్చాడు. భోజనం చేశాక సుహాస్ కబుర్లకు ముచ్చటపడి,' చిన్న మ్యాజిక్ చేస్తాను. ఓ తాడు, బ్లేడు కావాలి' అన్నాడు. మనవడు ఆశ్చర్యపడతాడు కదా అని అవి తెచ్చి ఇచ్చాను. తాడును బ్లేడుతో సగానికి రెండు ముక్కలుగా కోసి, వాటిని చూపించి, చేతులతో వాటిని అటూ ఇటూ తిప్పి, ఒకే తాడుగా చూపించాడు. సుహాస్ ఆనందం పట్టలేక చప్పట్లు కొట్టాడు. మిత్రుడు భోజనం చేసి వెళ్లిపోయాడు.

మర్నాడు పొద్దుట సుహాస్ గుక్కపెట్టి ఏడుస్తుంటే, పెరట్లోకెళ్లి చూసేటప్పటికి చిటికన వేలు చివర కొద్దిగా తెగి, ఒకటే రక్తం.' ఎలా తెగిందిరా' అంటే తనూ మ్యాజిక్ చేద్దామని తాడు కోస్తుంటే వేలుకు బ్లేడు తగిలింది' అన్నాడు ఏడుస్తూనే. గబగబా దగ్గరే వున్న క్లినిక్ కు తీసుకెళ్లాను. డాక్టర్ కట్టు కట్టి, ఓ ఇంజక్షన్ చేసి,

మందులు రాశాడు.' మా ఫ్రెండుకు మ్యాజిక్ వచ్చు కాబట్టి ఓ ట్రిక్ చేశాడు. నువ్వూ అలా చేయాలనుకుంటే ఎలా? పులిని చూసి నక్క వాత పెట్టుకోవడమంటే అదే' అంటూ ఆ కథ చెప్పాను. సుహాస్ శ్రద్ధగా విన్నాడు.

–4–

పిల్లలందరిలాగే సుహాస్ బొమ్మలంటే ఇష్టపడేవాడు. అయితే, కాసేపు ఆడుకున్నాక బొమ్మలో ఏముందో చూడడం కోసం ప్రయత్నించేవాడు. ఒకోసారి దాన్ని పగలగొట్టేసేవాడు. వాళ్ల నాన్న తిడితే, 'వాడిష్టప్రకారం చెయ్యనిద్దూ. ఏమో ఏఆర్ రెహ్మాన్ అంతటి ముజీషియన్ అవుతాడేమో' అనే వాణ్ని. తను ప్రతి బొమ్మలోనూ ఏముందో చూడాలనుకునేవాణ్నని ఓ సందర్భంలో రెహ్మాన్ చెప్పిన సంగతి గుర్తొచ్చి అలా అన్నాను.

చేపలు పెంచుతాను, అక్వేరియం కావాలన్నాడు ఒకనాడు. దాన్ని కొని ఇంటికి తీసుకొచ్చాక అందులో రంగురంగుల చేపల్ని పెంచడం మొదలెట్టాడు. వాటికి ఆహారం వాడే

పెట్టేవాడు. స్కూలుకి వెళ్లేటప్పుడు మధ్యాహ్నం చేపలకు ఏ ఆహారం వేయాలో వాళ్ల నాన్నమ్మకు చెప్పేవాడు. కొన్నాళ్లకు వాడికి ఆ సరదా తీరిపోయింది. కుక్కను పెంచుకుందామన్నాడు.అది చాలా కష్టమైన వ్యవహారమంటూ వాళ్ల అమ్మా నాన్నా వద్దన్నారు. వాడు కాసేపు ఆలోచించి, 'అపార్టుమెంటులో అయితే వద్దంటున్నారు. తాతయ్యా మీ ఇంటి వెనక వున్న ఖాళీ స్థలంలో పెంచుకోవచ్చు కదా' అన్నాడు. నేను సరేనన్నాను. ఓ నల్ల కుక్క పిల్లను తెచ్చాను. దానికి తిండి పెట్టడం, దానితో ఆడుకోవడం వాడికి చాలా సరదాగా వుంది. దానికి బ్లాకీ అని పేరు పెట్టాడు. అది వాడికే కాకుండా ఇంట్లో అందరికీ బాగా చేరువ అయ్యింది.

తర్వాత కొన్నాళ్లకు మా ఇంటి దగ్గరి కాన్వెంట్ లో అయిదో తరగతి వరకే వుండడంతో సుహాస్ ను యాప్రాల్ లోని పెద్ద కాన్వెంట్ లో చేర్చారు. 'ఇక వాడి కుక్క సరదా కూడా తీరిపోతుందిలే ' అనుకున్నాను. అయితే, ప్రతి శనివారం సాయంత్రం మా వూరు వచ్చేసి, బ్లాకీతో ఆడుకుంటున్నాడు. వాళ్ల నాన్నో నేనో వాడిని తీసుకొచ్చేవాళ్లం. వాడు వచ్చేటప్పుడు బిస్కట్లు తప్పక కొనిపించేవాడు కుక్క కోసం. దానికి ఎప్పుడన్నాకాస్త బాగోలేకపోతే తెగ బాధపడేవాడు.

* * *

సుహాస్ 'తాతయ్యా' అంటూ నా భుజం తడుతుండడంతో నేనీ లోకంలోకి వచ్చాను.

–5–

'ఆన్ లైన్ క్లాసుకు టైమయ్యిందేమో' అన్నాను. 'ఇంకో పది నిమిషాల టైముంది లెండి. బ్లాకీ కనిపించడం లేదు. ఎక్కడికెళ్లిందో' అన్నాడు. 'ఇక్కడే ఎక్కడో తిరుగుతుంటుంది. దానికీ కాలక్షేపం కావాలి కదా. నువ్వు పుట్ బాల్ ఆడుకుంటుంటే ఎంతసేపని చూస్తుంది' అన్నాను.

'అవును కదా' అన్నట్టు చూసి, ఆన్ లైన్ క్లాసు కోసం ఫోన్ పట్టుకుని గదిలోకెళ్లిపోయాడు . నేను హాల్లోకి వెళ్లి టీవీ చూస్తూ కూర్చున్నాను. కొంతసేపటికి బ్లాకీ వచ్చింది. అటూఇటూ చూసింది. సుహాస్ కోసమేననుకున్నాను. అంతలో మా ఎదురింటి వాళ్లబ్బాయి వచ్చాడు పుట్ బాల్ ఆడడానికి. ఆన్ లైన్ క్లాసు పూర్తి చేసుకుని సుహాస్ బయటికొచ్చి,బ్లాకీ తల నిమిరాడు. అది రెండు కాళ్లూ పైకెత్తి, వాడి పొట్టమీద పెట్టి, తోక ఊపుతూ గారాలు పోయింది. తర్వాత సుహాస్ తన ఫ్రెండుతో పుట్ బాల్ ఆడడం మొదలెట్టాడు. రెండు ఇటుకలు అటూఇటూ దూరంగా పెట్టి, వాటి మధ్యకు బంతి వెళ్తే గోల్ కొట్టినట్టుగా ఏర్పాటు చేసుకన్నారు. గోల్ అంటూ సుహాసే చాలాసార్లు అరిచాడు.

తర్వాత ఏడుపు మొహంతో బంతి పట్టుకుని నా దగ్గరొచ్చాడు సుహాస్. 'తాతయ్యా, పుట్ బాల్ ఓ పక్కన చిట్లిపోయింది. ఇంక ఆడడానికి పనికి రాదు' అన్నాడు. 'మరోటి కొందాములే' అన్నాను. ఈ మధ్యే మీరు కొన్నారు కదా. నాన్నను రేపు ఇక్కడికొచ్చేటప్పుడు కొని తెమ్మంటాను' అంటూ అరుగు మీద వున్న ఫోన్ తీశాడు.కాసేపు 'ఆ, ఊ' అంటూ ఫోన్ ఆఫ్

చేసి, ముఖం మాడ్చుకుని కూర్చున్నాడు. 'ఏమయ్యిందిరా' అంటే, 'ఫుట్ బాల్ ఇప్పుడు కొనను.అస్తమానం పాడు చేస్తే కొనాలంటే సంపాదించేవాడికి తెలుస్తుంది. ముందు ఆన్ లైన్ క్లాసులు బాగా ఫాలో అవ్వు' అన్నారు నాన్న అని చెప్పాడు. సరే. యాప్రాల్ వెళ్లేటప్పుడు ఇసిఐల్ దగ్గర ఆగి, ఫుట్ బాల్ కొంటానులే' అన్నాను.

–6–

మీరు కొనవద్దు. నాన్న కొనకపోతే నేను కొనుక్కోలేనా' అన్నాడు కోపంగా. వాడి వంక ఆశ్చర్యంగానూ, అభిమానంగానూ చూస్తూ, 'ఎలా కొంటావురా' అన్నాను. సుహాస్ ఏమీ మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. కోపంగా ఉన్నాడు కదా అని నేనూ మౌనం పాటించాను. మర్నాటి నుంచి పొద్దుటే కాకుండా సాయంత్రం కూడా నాతో పొలానికి వస్తున్నాడు. మెంతి కూర, కొత్తిమీర వంటివి రెండో పంటగా నేను వేయడం ఇంతకు ముందే చూశాడు. ఇప్పుడు వాటి వివరాలు అడిగాడు. చెప్పాను. వరి చేలో నేను కలుపు తీస్తుంటే వాడూ వచ్చి తీశాడు. 'వద్దులే , కాళ్లకు బురద అంటుకుంటుంది ' అన్నాను. వాడు వినలేదు. 'తాతయ్యా, మీతో ఇలా చెయ్యడం నాకిష్టం' అన్నాడు. మనసులో ఆనందించాను.

'ఏరా, పెద్దయ్యాక ఏమవుదామనుకుంటున్నావు' అని అడిగాను. నేను కూడా మీలా వ్యవసాయం చేస్తాను. ఇక్కడి పచ్చని పైరూ, చెట్లూ, పక్షులూ బలేగుంటాయి' అన్నాడు. రెండురోజుల తర్వాత సుహాస్ ను తీసుకెళ్లడానికి వాళ్ల అమ్మ వచ్చింది. వెళ్లే దారిలో నాలుగు తొట్టెలు కొంటేనే వస్తాను అన్నాడు ఆమెతో. ఎందుకంటే ,కొత్తి మీర, మెంతికూర వాటిలో పండిస్తాను అన్నాడు. 'సర్లే, రా' కొంటానంది.

'తాతయ్యా, గోనె సంచిలో మట్టి వెయ్యండి పట్టుకెళ్తాను' అన్నాడు. సరేనని ఇంటి వెనకున్న మట్టిని తవ్వి, గోనెసంచిలో పోశాను. దాన్ని కారు డిక్కీలో వాడి సాయంతో పెట్టాను. మాకూ, బ్లాకీకి 'బాయ్' చెప్పి, అమ్మతో వెళ్లిపోయాడు. ఈసారి పదిహేను రోజుల వరకూ సుహాస్ మావూరు రాలేదు.నేనూ పొలం పనులతో వాళ్ల అపార్టుమెంటుకు వెళ్లలేకపోయాను. అయితే, అప్పుడప్పుడూ ఫోన్ చేస్తున్నాడు. కొత్తిమీర, మెంతికూర తమ బాల్కనీలోని తొట్టెల్లో ఎంత ఎత్తుకు పెరిగాయో చెబుతున్నాడు. ఈ సరదా ఎంతకాలం వుంటుందిలే అనుకున్నాను.అయితే,కుక్క సరదా అలానే వుంది. తనూ పండించాలనే సరదా కూడా అలాగే

–7–

వుంటుందేమోననుకున్నాను. పొలం పనులయిపోవడంతో నేనూ మా ఆవిడా యాప్రాల్ వెళ్లాం కొన్నాళ్లు వుందామని. కాన్వెంటు నుంచి రావడంతోనే సుహాస్ ఓ గంట ఆన్ లైన్ లో ట్యూషన్ చెప్పించుకుంటాడు. ఆ తర్వాత అపార్టుమెంటులో ఓ పక్కనున్న పచ్చని పచ్చికలో స్నేహితులతో ఫుట్ బాల్ ఆడుకుంటున్నాడు. 'నువ్వు ఆడుకుంటున్న ఫుట్ బాల్ ఎవరిది' అని అడిగాను.

'మా ఫ్రేండ ది. ఇంతకు ముందు నా బంతితోనే వాళ్లూ ఆడేవాళ్లు. నాది పోవడంతో అతనుకొన్న బాల్ తో ఆడుకుంటున్నాం. కొన్నాళ్లకు నేను కొన్నాక దాంతోనూ ఆడుకుంటాం' అన్నాడు సుహాస్. ఫుట్ బాల్ కొనుక్కోవాలన్న వాడి కోరిక అలానే వుందన్నమాట' అనుకుంటూ, 'ఫుట్ బాల్ ఆటగాళ్లలో నీకు ఎవరు ఇష్టం. ఎందువల్ల' అని అడిగాను.

'క్రిష్టియానో రొనాల్డో అంటే నాకిష్టం. అతను చిన్నప్పుడు తల్లిదండ్రులతోపాటు రోడ్లు ఊడ్చేవాడు. ఆ రోడ్లమీద తనతోటివాళ్లతో ఫుట్ బాల్ ఆడేవాడు. కష్టపడితే ఏదైనా సాధించవచ్చని రొనాల్డో నిరూపించాడు. మీకు గూగుల్ చూడ్డం వస్తే ఇంకా ఎన్నో వివరాలు తెలుస్తాయి' అన్నాడు. అవన్నీ చూసే ఓపిక నాకు లేదు. నేను వయసులో వున్నప్పుడు అర్జెంటీనా సాకర్ ఆటగాడు మారడోనా అంటే చాలా ఇష్టపడేవాడిని. అతని పరుగులో, నడకలో ఎంత అందముండేదో తెలుసా' అన్నాను. మారడోనా పేరు విన్నాను కానీ, అతని ఆట చూడలేదు. యూట్యూబ్ లో చూస్తాను లెండి తాతయ్యా' అంటూ ఫోన్ చేతిలోకి తీసుకున్నాడు.నేను టీవీ వైపు తల తిప్పాను. ఓ గంట పోయాక'తాతయ్యా, అతని ఆట బలే బాగుంది' అన్నాడు. ఏరా , అందరూ క్రికెట్ ఆడుతుంటారు కదా. నువ్వు ఫుట్ బాల్ ఆడతావేంటి' అని అడిగాను. 'క్రికెట్ లో అయితే అప్పుడప్పుడూ అటూ ఇటూ పరిగెడతారు, బ్యాటింగ్ లోనయినా బౌలింగ్ లోనయినా. అదే ఫుట్ బాల్

–8–

సాకర్ లో అయితే క్షణక్షణానికీ కదులుతూనే వుంటారు. అంతే కాదు, ఇందులో చాలా డేరింగ్ వుంటుంది' అన్నాడు. 'ఫుట్ బాల్ బాగా ఆడి, పెద్ద ఆటగాడివి అవ్వాలనుకుంటున్నావా'. లేదు, తాతయ్యా. సరదాగా ఆడుతున్నాను. ఒంటికి కూడా మంచిది కదా. ఏమో ఒక వేళ ఏమైనా అవకాశాలొస్తే, అప్పుడు ఆలోచించవచ్చు' అన్నాడు. సుహాస్ తో మాట్లాడేటప్పుడు వాడి వయసులో నన్ను గుర్తు చేసుకుంటాను.అలాగే మా అబ్బాయిని కూడా. నాకంటే మా అబ్బాయి, వాడి కంటే సుహీస్ చాలా తెలివిగా వ్యవహరిస్తుంటారనుకున్నాను. అంతలో , 'తాతయ్యా, మెంతికూర, కొత్తిమీర ఎలా పెరిగిందో చూద్దురుగానీ రండి' అంటూ బాల్కనీలోకి తీసుకెళ్లాడు. 'నాలుగు తొట్టెల్లో వేశావు. చాలా పండుతుంది' 'ఎన్ని కేజీలు వస్తుందంటారు''ఏడెనిమిది కేజీలు రావచ్చు. ఇంట్లోకి అంత అవసరం లేదు కదా'..'మీరు పొలంలో బోలెడు పండిస్తారు కదా. ఇంటికంత అవసరం వుంటుందా'.. 'మాది వ్యవసాయం. అలా ఎక్కువ పండిస్తేనే మంచి ఆదాయం వస్తుంది'.. 'ఆదాయం అంటే డబ్బులే కదా' అన్నాడు సుహాస్ నా ముఖంలోకి చూస్తూ. 'అవును' అన్నట్టు తలూపాను.

–9–

'నేనూ డబ్బుల కోసమే వాటిని ఇంటిలో పండించాను' అన్నాడు. నేను మనవడి వంక ఆశ్చర్యంగా చూశాను. తన ధ్యాసలో తనుండి, 'తాతయ్యా, ఇప్పుడు మెంతికూర, కొత్తిమీర

కేజీ ఎంత రేటు వుంది' అని అడిగాడు. చెప్పాను. ఫోన్ తీసుకుని, ఏదో చూసి,'మీరు చెప్పినదానికంటే ఎక్కువే వుంది' అన్నాడు. '.మార్కెట్ ధర కాస్త అటూ ఇటూ వుంటుంది' అన్నాను. మర్నాడు అపార్టుమెంటు పక్కనే కూరగాయలమ్మే ఆవిడ దగ్గరకు నాన్నమ్మను తీసుకెళ్లి కొత్తిమీర, మెంతికూర కేజీ ఎంతకు కొంటుందో అడిగించాడు. మొత్తానికి బేరాలాడి రెండు పెద్ద సంచిల్లో పట్టుకెళ్లి అమ్మేశాడు. అయిదొందలొచ్చాయని చెప్పాడు. మళ్లీ ఇంకో పంట వేస్తానన్నాడు.

'ఈ డబ్బులేం చేస్తావు 'తాతయ్యా, మర్చిపోయారు. ఫుట్ బాల్ నేనే కొనుక్కుంటానన్నాను కదా' గుర్తొచ్చింది నాకు. నేనప్పుడు పెద్దగా పట్టించుకోలేదు ' మిగతా డబ్బులు నేనిస్తాలే 'అన్నాను. వద్దులెండి. మరో పంట వచ్చాక నేనే కొనుక్కుంటాను' అన్నాడు. ఆలోచిస్తూ కాసేపున్నాక, 'ఫుట్ బాల్ కు డబ్బులొచ్చాక, ఈ తొట్టె పంటలు మానేస్తావా' అన్నాను. లేదు తాతయ్యా. నాకు వాటి మీద ఇష్టం పెరిగింది. అగ్రకల్చర్ బియస్సీ చదువుతాను. ఉద్యోగం వచ్చినా,మీలా వ్యవసాయం చేస్తాను. మీలా అంటే మీలాగ కాదు. కొత్త కొత్త పద్ధతుల్లో' అన్నాడు.

భూమిలా వుండే ఫుట్ బాల్ నా బుర్రలో తిరుగుతోంది. నన్ను మించిన కొడుకు, వాడిని మించిన మనవడు... సుహాస్ ఆలోచన్లు బాగానే వున్నాయి. ఏం జరుగుతుందో వేచి చూడాలనుకున్నాను.

## కలిదిండి వెంకట సుబ్రహ్మణ్య వర్మ

కె.వి.యస్.వర్మ స్వస్థలం తూర్పు గోదావరి జిల్లా పెనుమళ్ల. పలు దినపత్రికలు, న్యూస్ ఛానళ్లలో సీనియర్ జర్నలిస్టుగా బాధ్యతలు నిర్వహించి, విరమణ పొందారు. 1968లో వీరి మొదటి కథ 'స్త్రీ హృదయం' ప్రచురితమైంది. ఇప్పటివరకూ వందకుపైగా కథలు ప్రముఖ వార, మాస పత్రికల్లో ప్రచురితమయ్యాయి. కొన్ని కథలు హిందీ, తమిళం, కన్నడ భాషల్లోకి అనువాదమయ్యాయి. ఆంధ్రభూమి దినపత్రిక న్యూస్ ఎడిటర్‌గా 'కథాకళి', వార్త డైలీ డిప్యూటీ ఎడిటర్‌గా 'ప్రతిధ్వని' పేరుతో 500లకు పైగా ఫీచర్స్ కాలమ్స్ ప్రచురితమయ్యాయి. వందలాది సమీక్షలు చేశారు. ఐదు కథా సంపుటాలు, రెండు ఫీచర్స్ సంపుటాలు, శ్రీశ్రీపై వ్యాసాల పుస్తకం, ఒక కవితా సంపుటి వెలువరించారు. మరికొన్ని ప్రచురణకు సిద్ధంగా ఉన్నాయి.

# ఆకలి



దాసరి వెంకటరమణ
9000572573

రాత్రి తొమ్మిదవుతోంది. జోరున వర్షం కురుస్తోంది. కిటికీ పక్కన కూర్చొని, వీధి లైటు వెలుగులో కనిపిస్తున్న వర్షపు చినుకులను చూస్తున్నాను. సవ్యసాచి సంధించి బలంగా వదిలిన శర పరంపరలా వాన చినుకులు ధరణికి అభిముఖంగా ఏటవాలుగా కురుస్తున్నాయి. వేసంగి తాపానికి బాగా మగ్గిన శరీరానికి తొలకరి చినుకుల్లో తడిసి, మెత్తగా తగులుతున్న చిరుగాలి స్పర్శ ఆహ్లాదకరంగా ఉంది. అప్పుడప్పుడు ఒకటీ అరా వాహనాలు వైపర్స్ తో అద్దాలు తుడుచుకుంటూ హడావిడిగా వెళ్తున్నాయి. పక్కింటి ఐటీ వామనరావు వాళ్ళ ఇంటి ముందు కారు ఆపి గేట్ తెరవడం కోసం హారన్ కొడుతున్నాడు.

'తాతయ్యా! అమ్మ భోజనానికి రమ్మంటోంది' తల తిప్పి చూశాను. మనవరాలు మృదుల నిలబడి వుంది. కారు హారన్ సౌండ్ లో నాకు వినపడలేదు కానీ, ఆ పిలవడం రెండోసారో, మూడోసారో అనే ధ్వని ఆ పిలుపులో స్పష్టంగా వినపడుతోంది. తలతిప్పి చూసే సరికి మరోసారి డైలాగ్ అప్పజెప్పి రివ్వున వెళ్ళిపోయింది. ఒంట్లో నలతగా వుండి, వాకింగుకెళ్ళక రెండు

రోజులయింది. కడుపు నిండుగా వుంది. మధ్యాహ్నం తిన్నది అలాగే ఉన్నట్టుంది. వర్షం పెరగడం లేదు. అలాగని తరగడం లేదు. వర్షధ్వని ఒకే లయలో వినిపిస్తోంది. అయిదు నిముషాల తర్వాత మృదుల మళ్ళీ వచ్చింది.

'తాతయ్యా! అమ్మ త్వరగా రమ్మంటోంది.' 'నాకు ఆకలిగా లేదమ్మా! ఈ పూటకు పాలు తాగి పడుకుంటాలే! మీరు తినండి' మృదుల వెళ్ళిపోయింది. ఆకలి అనే పదం అప్రయత్నంగా మరో రెండు సార్లు నా నోట్లోంచి అస్పష్టంగా విన్పించీ విన్పించక బయటికి వచ్చింది. ఆకలి .... డెబ్బయ్యేళ్ళ నా జీవితంలో ఆ పదం నా చెవిన పడిన ప్రతిసారీ, వెంటనే ఒకానొక దృశ్యం కళ్ళముందు అలా కదలినట్టయి ఒక్కసారిగా నిశ్శబ్దం అయిపోతాను. ఇప్పుడూ అదే జరిగింది. చిన్ననాటి ఆ సంఘటన నా కళ్ళ ముందు సినిమా రీలులా కదిలింది.

అప్పుడు నాకు అయిదారేళ్ళు ఉంటాయేమో...... కర్నూల్ సత్యనారాయణ స్వామి గుడి పక్కనున్న బొగ్గు గనులకు ఎదురుగా నంద్యాల రోడ్డు పక్కన యాప చెట్టుకింద ఒక ఇంట్లో బాడుగకు ఉండేవాళ్ళం.

ఆ రోజు పగలు ఎప్పుడు పడుకున్నానో గుర్తు లేదు కానీ, లేచే సరికి బాగా ఆకలేస్తోంది. బైటికి వచ్చి సూస్తే యాప చెట్టు నీడ సూరిగాడి ఇంటిముందు కట్టేసిన మేక పిల్ల మీదకు పోయింది. అంటే పైటాల దాటిపోయిందని అర్థం. అందుకే ఆకలిగా ఉంది. బాగా నీర్సంగా గూడా ఉంది. మాయక్క యాడికి పోయింటాది. ఆస్పత్రికే పోయింటది. మా యమ్మకు చయ జబ్బంట. అందుకే పెద్దాసుపత్రిలో చేర్పిచ్చినాం. అసలు మా యమ్మను ఆస్పత్రిలో సూపిచ్చడానికే మేము ఈ కర్నూలొచ్చినామంటా. మా యక్క అప్పుడప్పుడు సెప్తాది.

రోడ్డు శానా ఎత్తు మీదుంది. అందుకే మెల్లగా పాక్కుంటా రోడ్డెక్కాను. బద్దరంగా రోడ్డు దాటినాను. సత్యనారాయణ సామి గుడి కాటికి రాంగానే మద్దిలేటి ఓటల్ల రెండు పైసల బిస్కట్ బన్నులు కంటపడినై. ఓటలంటే పెద్ద ఓటలు గాదు. గుడి గోడ నానుకొని చిన్న వారపాకు. దాని కింద ఒక టేబులు. పక్కన నాపరాళ్ళతోటి కట్టిన బెంచీ. టేబులు మీద సీసాలో బిస్కట్లూ, బన్నూ సూడగానే నోరూరింది. ఆ బెంచీ మీద కూసోని, గాజు పలకల గిలాసలో, కాపీల బన్ను అద్దుకొని తినాలని ఆ ఓటలు సూసినప్పుడల్లా అనిపిస్తది. అట్టా తినేటోల్లను మస్తుమందిని సూసినా. అందుకే ఆడికి రాగానే అది గుర్తుకొస్తాది. మల్ల మల్ల ఎనుకకు తిరిగి, ఆ బన్నుకెళ్ళి సూసుకుంటూ ముందుకు పోతుంటే, కాలికి రాయి తగుల్కొని బోర్లా పడినా. ఓటలు కాడున్న ఒక మనిసి బెరీత వురికొచ్చి, నన్ను లేపి నిలబెట్టిన, 'ముందు సూసి నడ్సు మొగోడా!' అన్న్యాడు. మోచేయి కొంచెం దోక్కపోయింది. నోట్లోంచి ఉమ్మి తీసి దానికి రాసినా. దెబ్బ తగిల్తే అట్టా జేయాలని మా యమ్మ జెప్పింది. గుండూడి పోయి, సెల్లాడం జారిపోతోంది. దాన్ని మీద్కి గుంజుకొని, మొల్తాడు ఎక్కిచ్చినా. మెల్లిగా కినాల్ కట్ట దాటినా.

పెద్దాసుపత్రిలోకి పోవాలంటే ఆ...డున్న పెద్ద గేటి కాట్కి పో పన్లా. కినాల్ కట్ట దాటినాంక ఆసుపత్రి గోడకు సన్న బొక్క ఉంటది. దాంట్ల దూరి కాలి బాటెంబడి పొతే, ఆస్పత్రి ఎనకాల

ఎర్రపూల సెట్లకాడ చయ వార్డుంటది. మా యక్కా నేను ఎప్పుడు పోయినా ఇట్టానే పోతం.

తీరా మాయమ్మ కాడికి పోయేతాలికి, మంచమ్మీద మా యమ్మ లేదు. నేను ఉరికి బైటికి వచ్చిన. వార్డు పక్కన సెట్టుకింద ఇస్కల మా జేజి కూసోనుంది. నన్ను సూడగానే, 'పాపోడూ! ఇక్కరా, మీ యమ్మను పరీచ్చలు జేపియ్యనీకి తోల్కబొయినారు.'అనింది.

'మల్ల అక్క' 'అక్క గూడ్క బోయింది. వస్తార్లె ... కూసో.... ఇంద... ఈ బన్ను తిను' అనింది. బన్ను అనగానే మల్ల నోరూరింది. జేజి తన పాతబట్టల ముల్లె ఇప్పి, దాంట్లోంచి, మల్ల ఒక సన్న ముల్లె ఇప్పి ఎర్రెర్ర గీతలున్న కాయితంలోపల సుట్టి పెట్టిన బన్ను తీసిచ్చింది. ఆ బన్ను తీస్కొని గబుక్కున నోట్ల పెట్టుకొని, తుపుక్కున వూసేసిన. బన్ను పాసిపోయింది. బాగా వాసనొస్తోంది. నోరంతా ఎట్టనో ఐపోయింది. బన్ను అనగానే రెండు పైసల బన్ను లాగుంటది అనుకుంటి. 'పాపోడూ! ఏందిరా అట్ట వుమ్మితివి'అనింది మా జేజి. 'తూ..... వాసనొస్తోంది.'అన్యా.

'వాసన రాని బన్నులు మీ నాయన సంపాచ్చి పెట్టి నాడుపో!' అనింది జేజి. నాకు వెంటనే మా నాయన గుర్తుకొచ్చినాడు. గిరుక్కున తిరిగి రోడ్డు మీదికొచ్చినా. మా నాయన సీ క్యాంపిల సుబ్రమన్నెం డిపోలో కట్టెలు గొడ్తాడు. నన్ను సూస్తానే గొడ్డలి పక్కన పడేసి. 'పులిపిల్ల... పులిపిల్ల వచ్చింది ' అని ఎదురొచ్చి నన్ను ఎత్తుకుంటాడు. కాసేపైనాంక 'పో! సిన్నెంకటి మామ కాడ బెల్లం చెరుకు తెచ్చుకపో' అని, 'ఒహోయ్! నీ అల్లు డొస్తున్నాడు బెల్లం చెర్కు కొట్టు' అంటాడు. కాసేపాగి 'మంచిజ్జాసి కొట్టు' అంటాడు. నేను బొయ్యి, బెల్లం చెర్కు తెచ్చుకొని, అవతాల ఇవతాల కణుపుల కాడికి మెల్లగా ఈనెలు ఒల్చుకొని నమిలి, నడిమిట్లోది నాయనకిస్తే, రప్ప రప్ప ఈనెలు ఒల్చి, కణుపులు కొరికి సన్న సన్న ముక్కలు సేసి నా కిచ్చేటోడు. బెల్లం చెరుకులు తల్చుకొనే తాల్కి నోట్ల నీళ్ళూరినాయి.

మెల్లిగా కినాల్ కట్ట దాటినా, మద్దిలేటి ఒటేల్ల సూరిగాడు బెంచీ మీద కూసోని, కాపీల బన్ను అద్దుకొని తింటున్నాడు. పక్కనే ఆల్ల నాయినున్నాడు. బన్ను సూడగానే, మల్లా కడుపుల ఆకలి గుర్తుకొచ్చింది. ఎందుకో నాకు సూరిగాడి కెల్లి సూడబుద్ధి కాలే. అన్ని సూడనట్టుగానే నేరుగా ముందుకొచ్చినా. బొగ్గు గనిల ఇనుప చక్కురాల టాక్టార్ గని బొక్కల్ని బూడ్చుతోంది. టాక్టారు ముందు పెద్ద ఇనుప రేకు లాంటిది ఉంటది. దాంతో ఆడీడ మన్ను కువ్వ జేసుకొని, తీస్కబోయి గని బొక్కలోకి నూకుతది. నేను మా యమ్మెంట రెండు మూడు సార్లు, బిర్ల కంపెనీ సబ్బు నీళ్ళ కాలవల బట్ట లుతుకనీకి బోయినప్పుడు సూసినా. ఇప్పుడు ఆ టాక్టార్ కాడ జనం మూగినారు. ఏందో అని పోయి సూసిన. టాక్టార్ ఒక గని లోన్కి పోయి ఇర్క పోయింది. బైటికి తియ్యనీకి తంటాలు బడ్తుండారు. నేను శానా సేపు నిలబన్యా. యాశీర్కొచ్చి, కడుపుల ఆకలి గుర్తుకొచ్చి, మల్ల రోడ్డు మీద్కి ఒచ్చినా.

రెండు రోడ్ల మధ్య పసుప్పచ్చ సిమెంటు రాయి వుంది. నడ్సనీక శాతగాక ఆ రాయిమీద కూసున్నా. దాని మీద అచ్చురాలున్నాయి. ఒక్కెల్లి నంద్యాల అనీ, మరొక్కెల్లి గుత్తి,

అనంతపురం అని వాటెన్కాల కర్నూలు అని రాసుంటదని మా యన్న సెప్పినాడు. నాకు సదవనీక రాదు గాని, మా యన్న సెప్పింది గుర్తుంది. మా యన్న ఉస్మానియా కాలేజీల పేద్ద సదువు సదువు తున్నడు. మా యింట్ల ఉండడు. యాన్నో దూరాన ఆస్టల్ల ఉంటాడంట మా యమ్మ జెప్పింది. కిందికి దిగి ఆ రాయి ముందు మోకాళ్ళ మీద కూసున్న. పచ్చరంగు మీద అచ్చురాల గుంతలుల్ల నల్ల రంగేసినారు. నేను సూపుడు ఏలు అచ్చురాల మీద పెట్టి ఆ వూరు పేర్లు సదువుకుంటా దిద్దుతున్నా. యా రోడ్డు యా వూర్కు బోతదో నాకు తెల్సు కదా! 'ఓయ్ బొట్టు సామీ ఆడేం జేత్తున్నావ్.' అని ఇనిపించే తాల్కి ఎనిక్కి తిర్గి సూసినా. సూరిగాడు అంగితో మూతి తుడ్సుకుంటా వస్తున్నాడు. 'ఏం... ల్యా' అని, మల్ల ఆడు దగ్గరి కొచ్చినాంక. 'మా యక్క ఆస్పత్రి కాడుంది. నాకు బాగా ఆకలైతుంది.' అన్యా. 'మద్దిలేటి ఓటల్ల బన్ను రొట్టె తింటావా?' అన్న్యాడు. నాకు నోటెంబడి మాట రాల్యా. తలకాయ మాత్రం ఊపినా. నా మడుసుల ఆడు తినిపియ్యడులే అనిపిచ్చింది. 'నువ్వు ఓ పంజెయ్యాల' అన్న్యాడు. నాకు కొంచెం ఆశ పుట్టింది. 'ఓ!....' అన్నా. 'ఐతే.. నా యెంట రా...' అన్నాడు. నీను వానేనకాల్నే నడిసినా. రోడ్డు దాటి మా ఇంటి కాడికి ఒచ్చినాం. నన్ను మా ఇంటిముందు చిన్న గద్దె మీద కూసోబెట్టి 'ఉండు ఇప్పుడే వస్తా' అని ఆళ్ళింట్లోకి పోయినాడు. కాసేపున్న్యాక ఒక సలాకి తీసుకొచ్చి, 'దీన్ని బట్టుకున్నవంటే బన్ను రొట్టె తినిపిస్తా...' అన్న్యాడు. నేను మరింకేమీ ఆలోచించకుండా, టక్కున దాన్ని పట్టుకొని, ఎంటనే 'అమ్మా! సస్తినే...'అని అరచి, చెయ్యి ఇదిలిచ్చుకుంటా కింద మన్నుల వడి దొర్లుతున్నా. సూరిగాడు 'అట్ట వదిలెయ్య గూడ్దు అట్నే కొంచేపన్నా పట్కాల... నేను నీకు బన్ను తినిపియ్యను పో...' అని సలాకి పడేసి వుర్కినాడు.

అప్పుడే మా యన్న సైకిల్ మీద ఒచ్చినాడు. నన్ను అట్ట సూడగానే, సైకిల్ స్టాండ కూడా ఎయ్యకుండా, ఆడ బడేసి, నన్ను లేపి గద్దె మీద కూసోబెట్టి, ఏం జరిగింది అనే. నేను ఏడ్చుకుంటానే అంతా సెప్పినా. మా యన్న సూరిగాన్ని నానా కూతలు తిట్టి 'నీకు బన్ను నేను తినిపిస్తా... పా.....' అని నన్ను మద్దిలేటి ఓటేలు కాడ్కి తోల్క పోయినాడు. బన్నూ, కాపి గూడ్క ఇప్పిచ్చినాడు. నేను నా సెయ్యి కెల్లి సూస్కున్న. సెయ్యంతా మసి అంటింది. బాగా మంటగుంది. ఇంకా సెయ్యి ఇదిలిచ్చుకుంటా ఎడుస్తానే వున్న్యా. మా యన్న పలకల కాపి గిలాస నా ముందుకు జరిపి 'తగ్గి పోతదిలే, నాక్కనపన్నీ ఆ సూరిగాడి గు...వలగొడ్తా, దీంట్ల బన్ను అద్దుకొని తిను..బాగుంటది'అన్నాడు. నేను ఆ మసి చెయ్యి తోనే బన్నును కొంచెం కొంచెం తుంచి, కాపిల అద్దుకొని తింటున్నా. కండ్లనుండి కారిన నీళ్ళు నా నోట్లోకి వచ్చినయ్. సల్లారిపోయిన కాపి, మసి అంటిన బన్ను, కండ్ల నీళ్ళు అన్ని కలిసిపోయినై. బన్ను కడుపుల పన్న్యాక లోపల మంట సల్లారింది. నేను తింటున్నంత సేపూ మాయన్న గొంతు గూసోని నా మొగం లోకే సూడబట్టే.

నేను తిన్న్యంక మా యన్న పై జోయిలోంచి పది పైసల బిళ్ళ మద్దిలేటి కిస్తే, ఆయప్ప సిల్లర తిరిగిచ్చినాడు. సిల్లర జోయిలేసుకుంటూ మా అన్న 'ఇంగ... పా ' అన్న్యాడు. నేనొక సారి

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 326

నా సెయ్యి జూసుకున్నా. మంట తగ్గి పోయింది. నేను నా సెయ్యికెల్లి సూస్కుంటుంటే, 'నేను మందు రాపిస్తా తగ్గి పోతది గానీ... ఇంగ పోదాం రా..' అన్న్యాడు. నేను ఆన్నుంచి లేయ్యలేదు. మెల్లిగా 'అన్నా!'అన్న్యా. మా యన్న ఏందని నాకెల్లి సూసినాడు. 'నేను కాలె కాలె సలాకి మల్లా పట్టుకుంటన్నా' అన్న్యా. మా యన్న గబుక్కున 'ఎందుకురా?' అన్న్యాడు.

'ఇప్పుడు శాంచేపు పట్టుకుంటాలే .. ఐతే ఈ పారి రెండు బన్నులు తినిపియ్యాల'అంటి. మా యన్న మాట్లాడ్ల్యా . కాసేపు గమ్మునుండి, కండ్లల్ల నీళ్ళు గార్తుంటే, మాట్లాడకుండా పోయి రెండు బన్నులు తీసుకొచ్చి ఇచ్చే. మద్దిలేటికి జెప్పి దుడ్లు మల్లొచ్చినప్పుడు ఇస్తా అని, శాంచేపు బంగపోయి కాపి ఇప్పిచ్చినాడు. బన్ను కాపీల అద్దుకొని తింటూంటే. అన్న నా ముందరొచ్చి కూసునే. అన్న కండ్ల నుండి నీళ్ళు కార్తానే ఉన్నయ్. అన్న ఎందుకేడ్సి నాడో నాకు అప్పుడు అర్థం కాల్యా.

'తాతయ్యా! ఇదిగో పాలు, ఈ బన్ను ముంచుకొని వేడి చల్లారక ముందే తాగమంది అమ్మ' మనవరాలు ఎంత స్పీడ గా వచ్చిందో అంతే స్పీడ గా వెళ్లి పోయింది. బయట వర్షం ఇంకా తగ్గలేదు. నేను గతం జ్ఞాపకాల వెల్లువలో తడిసిన గుర్తుగా నా కళ్ళనుండి జారిన కన్నీళ్లు. ఒక బన్ను ముక్క పాలల్లో ముంచుకొని, నోట్లో పెట్టుకుంటే, వెనుకటి రుచి గుర్తు చేసుకోవడంలో నా మనసు మునిగి పోయింది.

## దాసరి వెంకటరమణ

దాసరి వెంకటరమణ స్వస్థలం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ. విద్యాభ్యాసం హైదరాబాద్‌లో సాగింది. 'చందమామ కథలు – బాలల వ్యక్తిత్వ వికాసం' అనే అంశంపై పరిశోధన చేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. ప్రస్తుతం తెలంగాణ రిజిస్ట్రేషన్ శాఖలో పనిచేస్తున్నారు. 2014లో 'ఆనందం' పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న ఈయన.. 1982 నుంచి కథలు రాస్తు న్నారు. మొదటి కథ చందమామలో అచ్చయ్యింది. ఇప్పటివరకు దాదాపు 500 రచనలు.. వివిధ వార, మాస పత్రికల్లో ప్రచురితమయ్యాయి. పలు రచనలు పాఠ్యపుస్తకాల్లో చోటు సంపాదించుకున్నాయి. వివిధ సంస్థల నుంచి ఎన్నో పురస్కారాలు, బహుమతులు అందుకున్నారు.



డా ఎల్ కె సుధాకర్

# మొట్టమొదటి కడపటివాడు

పెద్ద కష్టమేమీ కాదు... నువు సులభం గానే గుర్తు పట్టగలవు. మిగలముగ్గిన దోస పండుని నిలువునా కోసినట్టు ఉంటాడాయన. వయసు తొంభై మూడు..అయినా అరవై మూడు కి మించవని పందెం వేయొచ్చు.రోజుకి రెండు మొక్కజొన్న పొత్తులు తిని బతికేస్తున్నా డు. ఆయనతో నడక లో పోటీ పడ్డం మనవల్ల కాదంటే కాదు.చాలా ముఖ్యమైన పనన్నారు. ఏంటో చెప్పరు. నువ్వే చూస్తావు గా. వెళ్లి రిసీవ్ చేసుకో. విమానం వచ్చేది పన్నెండు న్నరకీ. బయల్దేరు.

అన్నట్టు ఆయన పేరు కూడా విచిత్రం గా ఉంటాది. యాజ్ఞ వల్క్య కృష్ణ ...ఈ రోజుల్లో ఆ గోల ఎందుకులే అనీ...సింపుల్ గా కే.వై. కృష్ణ గారనో..బాగా దగ్గరి వాళ్లైతే యజ్ఞ కృష్ణ అనో పిలుస్తారు. అసలు ఇదేదీ కాదు ఆయన పేరు కృష్ణ సోమయాజులు అంటాడు మన శర్మ. తమాషా ఏంటంటే ఎలా పిలిచినా పలుకుతాడు మహానుభావుడు. తానంత గొప్ప సైంటిస్ట్ నని గానీ...ఈ దేశమే గర్వించదగ్గ పనులు ఇన్ని తన చేతుల మీదుగా ఆవిష్కరిం చబడ్డాయని గానీ..పిసరంత గర్వం వెదికినా కనబడదు. అసలు నేనే వద్దును. ఒప్పుకోడు. సీరియస్

అవుతాడు. ఆఫీస్ పని ఆగకూడదు. ఆయనతో మంచి అనుభవం నీకు.నాది పూచీ..వెళ్ళిరా...గాల్లోనే రెండు చేతులూ జోడించి నమస్కారం చేసుకుంటూ చెప్పుకు పోతున్నాడు ఆఫీసర్. ఆలోచనల తోనే రాజమండ్రీ ఎయిర్ పోర్టు కి చేరుకున్నాను. నిజవే..ఆయన్ని అంత మందిలోనూ గుర్తుపట్టడం అసలు కష్టం కాలేదు. పరిచయాలయ్యాయి. ఆయన పెర్సనల్ బాగ్ ఆయనే మోసుకుంటూ కారెక్కారు. లె మి హెల్ప్ మైసెల్ఫ్ డియర్ బాయ్....

ప్రభుత్వ వ్యవస్థ ప్రసాదించిన జన్మ హక్కు లాంటి అతి వినయం తో ముందు సీట్లో కూర్చో బోయాను. ఆయన నవ్వి నో ఫార్మాలిటీస్. ఇలా వచ్చి వెనక సీట్లో కూచో. మాట్లాడేప్పుడు మెడ నొప్పి రాకుండా ఉంటుంది.

ఆ..నీ పేరు నాకు చాలా ఇష్టం. అంబేడ్కర్...అన్నారాయన. ప్రయాణం మొదలైంది . మనం ఎలాగూ గంటన్నర ప్రయాణం చేశాక గానీ అమలాపురం లో నా బసకి చేరుకోలేం కదా??! కార్ అద్దాలు దించేసి హాయిగా గోదారి గాలిని తనివితీరా ఆస్వాదిస్తూ...ఆయన ధ్యానం లోకెలిపోయారు. నాలో ఒకటే ఉత్సుకత. సార్ మీ పేరేమిటి అని అడగాలి...ఎలా. పేరులో నేముంది..అనీ నవ్వేస్తాడా!!!

డ్రైవర్ సెల్ మోగింది...అవతల అతడి భార్యనుకుంటా. పిల్లాడి గురించో...పిల్ల గురించో రాంకుల పిర్యాదులు. సిజేరియన్ పిల్లలు మరీ..అంటున్నాడు డ్రైవర్. ఈయనది విన్నారు...చిన్నగా నవ్వుకున్నా రు. బయటినుంచి గోదారి గాలి చల్లగా మొహాన కొడుతోంది.

అంటే సిజరియన్ పిల్లలు చదువులు చదవ రంటావెంటోయ్...అన్నారు. డ్రైవర్ కి ఎందుకో ఏమి పాలుపోలేదు. నవ్వబోయి ఏం చెయ్యాలో తోచక... హారన్ కొట్టాడు. మళ్లీ నిశ్శబ్దం కార్లో...గాలి హోరు తప్ప ఏమీ లేదు.

నిశ్శబ్దాన్ని ఆయనే ఛేదించేరు. నేను ఇక్కడే పుట్టానోయ్. నేనూ సిజరీయన్ బేబీ నే...ఆ మాటకొస్తే బహుశా ఇండియా లోనే మొట్టమొదటి సిజేరియను ఆపరేషన్ మా అమ్మదే అయ్యుంటుంది... అన్నారు. పలకరిస్తూ న్నట్టు ధవళేశ్వరం గోదారి గాలి కార్లో మమ్మల్ని సృశిస్తూంది. జ్ఞాపకాల ఆనకట్ట తెగినట్టు...వరద గోదారిలా ఆయన భావోద్వేగం. ఆ! అన్నట్టు నువు కథలు రాస్తావంట కదా..అన్నారు నా వేపు తిరిగి. కొంచెం సిగ్గూ..కొంచెం గర్వం..ఒకేసారి ప్రదర్శిస్తూ తలూపాను. నా కథ చెప్పనా. కాలక్షేపం కూడానూ అన్నారు.

సరిగ్గా తొంభై మూడేళ్ళ క్రితం ..... మా అమ్మ సద్బ్రాహ్మణ కుటుంబం లో ఉన్న పిల్ల.... నెలలు నిండి ప్రసవానికి సిద్ధం గా ఉన్న రోజులు. అత్తగారు...అమ్మగారు ఒకే ఊరు కావడం తో ఇబ్బందులు లేవు. అంబాజీపేట లో దొరల ఆసుపత్రికి పరీక్షకి తీసుకెళ్లారు. ఆ డాక్టర్ నర్సూ ల పేర్లు కూడా నాకు గుర్తే .అమ్మ ఎంత మురిసి పోయేదో వాళ్ళని తలుచుకుని. పీటర్ సన్...మారియా. తెల్ల దొరలు. పరీక్ష చేసిన డాక్టర్ కి అమ్మ కడుపులో బిడ్డ తేడా గా ఉన్నట్టు తెలిసింది. అప్పటికప్పుడు పుస్తకాలు రిఫర్ చేసుకున్నాడు. ఫోనులూ...వగైరాలు లేవు. ఉన్నదల్లా చదువుకున్న పాటి జ్ఞానమూ,ఆసుపత్రి లో ఉన్న పుస్తకాలూనూ. తోడుగా తల్లుల

లాంటి నర్సులు. రెండు రోజుల తర్వాత మళ్లీ రమ్మన్నారు అమ్మని. పరీక్ష చేశారు. ఆపరేషన్ చేస్తే తప్ప తల్లీ బిడ్డా చెప్పలేమన్నారు. ఆపరేషన్ కి సిద్ధం కమ్మన్నారు.

పిదప కాలం కాకపోతే దేవుడిచ్చిన మేర కి కృష్ణా రామా అనుకోక ఈ ఆపరేషన్ ఏవిటి...ఖర్మ. ఇంటా వంటా లేని విడ్డూరం కాపోతే. చస్తే వాడి లీల అనుకోవాలి గానీ..వీళ్ళేం దిగొచ్చారా..తలరాతలు కూడా మార్చేస్తారే. ససేమిరా ఒప్పుకునేది లేదు. అంటూ తోక తొక్కిన తాచే అయ్యాడు యాజులు...మా నాన్న. నానమ్మ అయితే ఒకటే శోకన్నాలు పెరట్లో. సంప్రదాయాలు మంట గలిపెస్తున్నార్రా దేవుడో..వద్దురా ఆ పిల్ల వాళ్ళ నాన్న ఇంగిలేసు చదువు చదివిన వాడంటే విన్నారా.... ఇంత రాద్ధాంతం లోనూ తనని సమర్ధించిన వాడు పుట్టింటి దరపు న ఆమె తమ్ముడే. స్వతంత్ర పోరాటం లో చురుకైన కార్య కర్త గా అప్పుడప్పుడే ఎదుగుతున్న వాడు. బ్రిటిష్ వాళ్ళని ఎంత శత్రువులు గా చూసినా...వాళ్ళ ఆసుపత్రుల సేవలూ..రైల్వే తదితరాలు నిశితంగా గమనిస్తున్న తరం వాడు.

ఆ విధంగా గా మా అమ్మకి సిజేరియను ఆపరేషన్ పెట్రమాక్స్ లైట్ ల కాంతిలో పీటర్సన్ గారు విజయవంతం గా చేశారు. ఇదిగో ఇన్నేళ్ళకి నేనిలా. అంటూ నవ్వారాయన. డ్రైవర్ కి వింతగా చాలా విశేషం గా తోచిందన్నది అతడి చూపుల్లోనే తెలుస్తోంది. ఏవోయ్.. మరి నేనెలా సైంటిస్ట్  అయ్యానంటావు?? అంటూ మేళమాడేరు.

కారు రోడ్డు పక్కన టీ బంకు దగ్గర ఆపమన్నారు.  ముగ్గురం దిగేము. ఇలా రోడ్డు పక్క బంకు ల్లో టీ గానీ రొట్టెలు గానీ ఏ స్టార్ హోటల్ లో కన్నా బ్రహ్మాండం గా ఉంటాయి. తెలుసా..అంటూ అక్కడే నులక మంచం మీద కూర్చుంటూ..నన్నూ..డ్రైవర్ నీ కూడా కూర్చోమన్నారు. డ్రైవర్ ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాడు. ఆయన ప్రతిదీ గమనిస్తూనే ఉన్నారు. ఇక్కడ సరే. మరి కారు లో తప్పకుండా కూచో వలసిందే కదా!! అంటూ నవ్వారు. డ్రైవర్ కి ఓ క్షణం లో అర్థమయింది. వెంటనే కూచున్నాడు.టీ పకోడీ ఆర్డరు ఇచ్చేరు. వేడిగా పకోడీ లు నములుతూ మళ్లీ కబుర్లు మొదలెట్టారు. అలా నేను రికార్డులలో లేకపోయినప్పటికీ బహుశా ఈ దేశం లోనే మొట్టమొదటి సిజేరియన్ పిల్లాడినయ్యాను. ఇంటికొచ్చాక మా నాన్న అప్రాచ్యపు ముండా!! అన్నాట్ట అమ్మని. నన్ను చూడనే లేదంట.వాడా అప్రాచ్యపు వెధవ. వాడి మొహం చూస్తేనే అష్ట మహా పాతకాలూ మెడకు చుట్టుకున్నట్టు. నేను చూడను..ఆ అప్రాచ్యున్ని. మా మావయ్య నన్ను ఎత్తుకుని మురిపోతూ ఆడిస్తూ ఉన్నప్పుడల్లా నాన్న గారి తిట్ల దండకం మొదలయ్యేది.

పిల్లాడి జాతక చక్రం అంటూ మావయ్య ఓ కాయితం పట్టుకొచ్చి నాన్న కి వినబడేలా చదివిన రోజు నుంచీ ఆయన ధోరణి లో కొద్దిగా మార్పొచ్చింది. పిల్లాడు తండ్రి పుణ్యా కార్యాల ఫలం గా పుట్టాడు. ప్రపంచం గర్వించదగ్గ మహా పురుషుడి చిన్నెలు కొట్టొచ్చినట్టు కనబడుతున్నాయి. నక్షత్ర బలం ...ఆ తెల్లోడు తెలిసి చేశాడో..దైవ సంకల్పమో చెప్పలేం గానీ...భూపతన సమయం...అమోఘం. అద్భుతం. అంతెందుకు...ఒక్క మాటలో యాజులి కొడుకు కోటికి ఒక్కడు. అన్నిటికంటే ముఖ్యం తన తండ్రి తాలూకు పూర్వ జన్మ బాకీ గా

ఉన్న అకాల మరణ గండం వీడి జన్మ సమయం పుణ్యమా అనీ పూర్తిగా గడిచినట్టే. (ఏరా తమ్ముడూ! నిజం చెప్పు...ఇది నీ పనే గదూ!!! భడవా! బావకి టోపీ వేస్తావూ!! ).

అప్పటినుంచీ నేను యాజులు గారబ్బాయిగా గారాల పుతుడినయ్యాను. ఇంతలో నా నామకరణ మహోత్సవం. నామ కరణం అనగానే...ఉన్నట్టుండి నాలో ఉత్సుకత పెరిగింది. ముందుకు జరిగాను. కారు కడియం పూల తోటల మధ్య హైవే మీద పరిగెడుతోంది. రంగు రంగుల పూలు నేలకి ఇంద్రధనుస్సు లు దిగివచ్చినట్టు.

ఆయన కళ్ళు మూసుకుని తిరిగి చెప్పడం మొదలెట్టారు. పంతులు గారి లెక్కల ప్రకారం య తో మొదలవ్వాలి పిల్లా డి పేరు. అలానే పెట్టాడు మా నాన్న. ఆ రోజుల్లో ఘనం గా జరిగిన ఆ బ్రాహ్మణ మహోత్సవం లో మా అమ్మ ఓ అపురూపమైన నిర్ణయం తీసుకుంది. అంతా విని మా మావయ్య ముందు కాస్త ఆశ్చర్యం...ఆపై సంతోషం వెలిబుచ్చా డు. (అప్పుడు నువ్వు ఎంతో ముద్దొచ్చావ్ రా...మావయ్యకి).

ఆరో ఏట బళ్ళో వేయడానికి వెళ్ళినప్పుడు నా పేరు(ఏవిటి...ఈ అప్రాచ్యుడు అప్పుడే బడి ఈడుకొచ్చాడూ..) మాస్టారికి చెప్పి....ఇంటిపేరు తో కే.వై. కృష్ణ అని మాత్రం రాయించింది. నాన్న కి మాట్లాడే ఛాన్స్ ఇవ్వలేదు. మాస్టారు కాస్త తడబడ్డా డు. కానీ అక్కడున్నది బుచ్చమ్మ...మా అమ్మ. కొడుకు ను కన్నప్పటి నుంచీ అమ్మ లో ఆత్మ స్థైర్యం అలవోకగా పెరిగిపోయింది. ఇప్పుడు తను మామూలు అణిగి మణిగి ఉండే ఇంట్లో మనిషి కాదు మరి. ఆయనేం అనలేదు. ఎప్పటిలానే మానాన్న నన్ను ఈ అప్రాచ్యపు వాడికి ఇంగిలీసు స్టయిల్ పేరుట్టుకుంది చూసావుటే...అమ్మా. అంటూ దండకం మొదలెట్టాడు. అలా నేను అప్రాచుడి గా మా అగ్రహారం లో పేరెళ్ళి పోయాను.

ఇంతకీ అప్రాచ్యుడు అంటే..ఎంటి సార్!!?? ఆయన నవ్వేరు. కారు రావులపాలెం వంతెన మీదికొచ్చింది. గోదారిని చూడగానే అమ్మమ్మనో.. మేనత్తనో.. చూసినట్టు ఉంటుందయ్యా.. అన్నారు. విశాల ప్రశాంత గంభీరం గా ప్రవహిస్తోంది గోదారి. వందల సంవత్సరాల చరిత్ర ల్ని తనలో కలిపేసుకునీ ..ఏమీ తెలియని అమాయకత్వం నిండిన మార్మిక తత్వ వేత్త లా. ఆయన నిజం గానే ఎవరో చిన్నప్పటి చట్టాల్ని చూసినంత ఆప్యాయంగా గోదారి వేపు చూస్తూ మౌనంగా ఉండిపోయేరు. నేనూ కదిలించలేదు.

కారు బ్రిడ్జి దాటుతుండగా..అడిగేరు...నేను ఇక్కడికి ఎందుకొస్తు న్నానో తెలుసా..నీకూ??!!.లేదంటూ తలూపాను. ఆయన చెప్పిన సంగతిని విని ఆశ్చర్యపోవడం తప్ప ఏం చెయ్యాలో తోచలేదు. పిల్లలు ఇద్దరూ రెండు దేశాల్లో సెటిల్ అయిపోయారు. నేనేమో రిటైర్ అయ్యి చాలా ఏళ్ళు గడిచిపోయాయి. ఆవిడ వెళ్ళిపోయి...అవును ఆ మేన మావ గారి కూతురే..

ఇప్పటికే పాతికేళ్ళు దాటేసింది. హైదరాబాద్ లో ఉన్న (దాదాపు) కోటి రూపాయల ఆస్తి నీ ఇక్కడి కోన సీమ పల్లె లో ఒక ఆసుపత్రి అభివృద్ధి కీ..కొన్ని స్కూళ్ళ కోసమూ డొనేషన్ ఇద్దామని. దానికి మీ వాళ్ళ నడిగితే ఇదిగో నిన్ను పంపించేరు. నీకు ఇలాంటి విషయాలు

బాగా తెలుసనీ...న్వుతే నన్ను గైడ చెయ్యగలవనీనూ.

ఆయన చెప్తున్న ప్రతీ సంగతీ కొత్తగానే ఉంది. అది గతం లో జరిగింద యినా...ప్రస్తుతం ఆయన నిర్ణయమైనా...నన్ను విచిత్రమైన అనుభూతి కి లోను చేస్తోంది. అన్నింటికంటే ముఖ్యం ...ఆయన నామకరణం దగ్గరే ఆగిపోయిన నా ఆలోచనలు. అందులో ఏమీ విశేషం ఉన్నట్టు లేదు గానీ ఇంతవరకూ ఆయన అసలు పేరు ఎవరికీ తె లీదన్న తమాషా ..నన్ను ఆట పట్టిస్తోంది. ఆయనా అంతే సరదాగా దాటేస్తున్నారు. అయితే ఇప్పుడు పేరుకి బదులు ఆయన ఆశయాలు ఇంకా ముచ్చటే స్తున్నాయి.

కథ అర్ధాంతరంగా ఆపేసి...ప్రస్తుతం లోకొచ్చేరు. ఎంత సంపాయించి ఏం లాభం మై బోయ్...దాంతో నీవు బతకడం ..నీ కుటుంబం బతకడం ..ఇంకా..ఇంకేమీ లేనప్పుడు నీ జీవితానికి అర్థం ఏమిటి??. ఇంత ఆస్తినీ నేను ఏం చేసుకోను? పిల్లలా? రమ్మన్నా రారు(ఎన్ని యుగాలైనా ఈ డిసిప్లిన్ ఇండియా లో రాదు డాడీ..)

ఒక పేరొందిన సైంటిస్ట్ గా నా పిల్లలకి నేను నేర్పించింది ఇదా?? కార్పొరేట్ పరుగులు...ఆయాసాలు.. డబ్బులూ..ఆపైన జబ్బులూ...ఇంతేనా...అందుకే అమ్మ పుట్టిన ఊరికి నన్ను గన్న మా నేలకి నా వంతు సాయం గా ఈ చిన్న పని చేద్దామని నిశ్చయించుకున్నా. అందుకే ఈ ప్రయాణం. ఇప్పుడు నీ సాయం. నువ్వు చేయాల్సింది నాకు నిజం గా సేవ చేయగలిగే ఆసుపత్రిని నాకు చూపించడం..ఇంత కంటే కఠిన పరీక్ష..హే భగవాన్.....ఆపై నేను చెప్పిన గ్రామాల్లో కులాలకి అతీతంగా కొన్ని స్కూల్స్ సెలెక్ట్ చేద్దా ము. నేను కూడా ఇక్కడే వీలైనంత వరకూ గోదారొడ్డున ఒక చిన్న కుటీరం వేసుకుంటా. ఇక్కడే ఉంటా. ఏదో ట్రాన్స్ లో ఉన్నట్టు చెప్పుకు పోతున్నారాయన. ఇంకా ఎంత కాలమో ఈ ప్రయాణం నాకైతే తెలీదు. సంకల్పం చేసుకున్నాను. వచ్చేసాను. ఇక నువ్వు సహాయం చెయ్యడవే.నీ గురించి కనుక్కున్నా లే.

కారు అమలాపురం గెస్ట్ హౌస్ దగ్గర ఆగింది. ఆయన స్నానం చేసి రిఫ్రెష్ అవుతా అన్నారు.

నేను ఆఫీస్ కి ఫోన్ చేసాను. విషయం క్లుప్తంగా వివరించేను. నాకు తెలిసినంతలో ఆయన ఔదార్యానికి తగ్గ ప్లాన్ అప్పటికే నా మనసులో ఒకటి తయారయింది. అదే మా ఆఫీసర్ కి వివరించాను. అందుకే కదా నిన్ను పని గట్టుకుని ఆయనకి ప్రోటోకాల్ కి వేసాను. కానీయి. ఆల్ ది బెస్ట్ అన్నాడాయన.

ఆయన కాస్సేపు విశ్రాంతి తర్వాత లోపలికి పిలిచేరు. నేను అనుకున్నది చెప్పాను. మీలాంటి ఆయన ఇలా పల్లెల్లోకీ...దళిత వాడల్లోకి వచ్చి ఏ స్వార్థమూ లేకుండా ఇంత చేస్తానంటే బహుశా మా వాళ్ళు నమ్మరండి. ఆయన నవ్వేడు...నవ్వితే పారిజాతం చెట్టు ఊగినట్టు ఉంది. నిండా మానవత్వపు పరిమళం. ఓ పనిచే యి. నా పేరు చెప్పు. అప్పుడు నమ్ముతారు. మళ్లీ ఆయనే గుర్తు చేశారు. నాకు ఉత్సుకత...మళ్లీ.

నా పేరు చెప్పలేదు కదూ...యేసు కృష్ణ. ఆవేళ మా అమ్మ బళ్లో మాస్టారితో ఈ విషయం

చెప్పి ఎవరికీ తెలీకుండా ఇనిషియల్ మాత్రం రాయిం చింది. అప్పట్నుంచీ నా పేరు కే.వై. కృష్ణ గానీ అందరికీ తెలుసు. యేసు కృష్ణ అనీ దాదాపు ఎవరికీ తెలీదు. మా బ్రామ్మల మిత్రులు మిగతా కథ నంతా పుట్టించేరు. నాకు బోలెడంత సరదా...కామెడీ సినిమా అన్నమాట. మనుషులు మనుషులు గా కృతజ్ఞత తో ఉండడానికి పేరు తో పనేముంది... మత మార్పిడి చేస్తే మాత్రం ఉపయోగం ఏముంది...కావాల్సింది మనసు. కదా..అన్నారు. ఆపై ఆయన అకౌంట్ వివరాలు చెప్పేరు. ఇన్నాళ్ళూ ఉన్న ఫ్లాటు అడ్రెస్సు వగైరాలు. ఆయన రాబోయే రెండేళ్ళలో ఏమేమి పనులు అనుకుంటున్నారో వివరంగా చెప్పేరు.

ఇవన్నీ కొనసాగించడం అంతా సులువు కాదని నాకు తెలుసు. గానీ నువ్వు..నీలాంటి వాళ్ళూ తలుచుకుంటే చెయ్యగలరు. నిజాయితీ... అంతే..అంతకు మించిన పెట్టుబడి జీవితం లో ఇంకేం ఉండదు. డబ్బుం టావా..ఇదిగో నేనిస్తా. నీ గురించి పూర్తి వివరాలు చాలా కాలంగా కనుక్కున్నా కే నిన్ను నాకూడా పంపమన్నాను. ఎంతైనా సైంటిస్ట్ నీ కదా..ఏదీ ఊరకే నమ్మను. పిల్లాడు రత్నం సార్...సోషల్ వెల్ఫేర్ హాస్టల్ లో చదూకుని ఇంత వాడయ్యాడు. సిన్సియర్. తన కొచ్చే జీతం లోంచి ప్రతీ నెలా కొంత హాస్టల్లో పిల్లలకీ ఖర్చు పెడుతూ...రాత్రిళ్ళు వాళ్ళకి టూషన్లు చెప్తూ ఉంటాడు. మీకు నచ్చుతాడు..ఇదీ నీ గురించి నాకు వచ్చిన అచ్చమైన సమాచారం. నవ్వేరాయన.

కోటి రూపాయలా...బాబోయ్ అన్నాడు చంద్ర. అంతా చెప్పేసరికి వాడికి దాదాపు మతి పోయింది. ఎంత ఆస్తి ఉంటే మాత్రం ఇలా గుర్తు పెట్టుకుని మరీ మనూరొచ్చి ఈ మంచి పనులెంటీ... ఎవరో మామూలు ఆయనలా లేడీయన...రేపే వచ్చి ఓ పాలి చూడాలనుంది.

ఆ రాత్రి నాకో అంతర్జాతీయ కాల్ వచ్చింది.

నేను...ఆస్ట్రేలియా నుంచి కృష్ణ గారి అబ్బాయిని మాట్లాడుతున్నాను. ఆయన ఇవ్వాళే అక్కడ దిగారని తెలిసింది. కొడుకూ...వారసుడు... అనేం లేదా పెద్ద మనిషికి. కోట్ల రూపాయల ఆస్తిని ఏదో దానం చేస్తానని తిరుగుతున్నాడ ట. ఇలాంటి అప్రాచ్యపు వేషాలతోనే జీవితం అంతా గడిపాడు. మీరెవరో తెలీదు. వాకబు చేస్తే చెప్పేరు. చూడండి మిస్టర్... మీరీ విషయం లో జాగర్త గా ఉండడం మంచిది. మా చెల్లాయి అమెరికా లో ఉంటుంది..అది నా కంటే సీరియస్ గా ఉందీ విషయంలో. రేపు లీగల్ విషయాల్లో మీ పేరు చేర్చడం...మీరు అనవసరం గా ఇబ్బందుల్లో పడడం ...అందుకే ముందుగా ఓ మాట చెప్తున్నా. ఆయన్ని ఎలా కన్విన్స్ చేస్తారో మీ ఇష్టం. ముదనష్టపు మనిషి...అప్రాచ్యుడు. వుయి డోంట్ లైక్ హిం.

కాల్ కట్ అయ్యింది. నాకు ఏం చేయాలో పాలుపోలేదు. నిజానికి ఇది ఊహించిందే. గానీ ఇంత గొప్ప పెద్దాయన పెంపకం లో యిలాంటిది ఉంటుందని అనుకోక పోవడం తో వచ్చింది దిగులు. ఇంకో భాషలో చెప్పాలంటే అదీ నిజమేనేమో అని కూడా అనిపించింది ఓ క్షణం. కోటి రూపాయల ఆస్తి. దానం ఇచ్చేయడవే!!??.... వెంటనే..ఎందుకో నా మీద నాకే చిరాకేసింది. పొద్దున్నే ఈ సంగతి ఎలా వివరించాలా అంటూ ఆలోచిస్తూ కలత నిద్రలో

గడిపాను.

ఆరు లేరండి. తెల్లారగట్టే ఎలిపోయారు. మీరు వస్తే థాంక్స్ చెప్పమన్నారు...అన్నాడు వాచ్ మన్. ఆ తర్వాత ఆయన ఎక్కడున్నారో ఎవరికీ తెలియలేదు. హిమాలయాలకు వెళ్ళిపోయారని అన్నారు. ఎక్కడో మారుమూల వృద్ధాశ్రమం లో ఉంటున్నారని కొందరన్నారు. చనిపోయారని కొందరు కాదని కొందరూ అనుకుంటూనే ఉన్నారు. ఏమైనా ఆయనెక్కడున్నా వాళ్ళ పిల్లలకి మాత్రం తెలియ నివ్వరని నాకు తెలుసు.ఆయనతో సరదా పడి తీసుకున్న సెల్ఫీ లు చూస్తున్న ప్పుడెల్లా....తెలిసిందా...అప్రాచ్యుడు అంటే ఏంటో... అని కవ్విస్తూ నవుతుంటారాయన ఫోటో లోంచి.

***

## డా. ఎల్.కె. సుధాకర్

ఎల్.కె. సుధాకర్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం. రచయితలు, సాహితీ అభిమానులకు 'కొబ్బరాకు సుధాకర్'గా ఈయన సుపరిచితులు. ఆంధ్రప్రదేశ్ పశు సంవర్ధక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటివరకూ అనేక కథలు, కవితలు రాశారు. కొబ్బరాకు కవిత్వం, గొబ్బిపూలు కథలు పుస్తకాలను వెలువరించారు. కైలాస మానసరోవరం అనువాదం, కుంకుమ రజను పేరుతో భారతీయ కవితల అనువాదం, స్వామి నిగమానంద జీవిత చరిత్రను పుస్తకాలుగా తీసుకొచ్చారు. వివిధ పత్రికలు, సాహితీ సంస్థలు నిర్వహించిన రాష్ట్ర స్థాయి కథల పోటీల్లో 17 (ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక) బహుమతులు గెలుచుకున్నారు. మూడు బంగారు పతకాలు అందుకున్నారు.

# ఫుట్ బాల్



**టి. సంపత్ కుమార్**
**9840402895**

'ఏమండీ, ఈసారి అక్టోబర్లోనే రెండు పండగలొస్తున్నాయ్... మీ అమ్మని రెన్నెల్లు మీ తమ్ముని దగ్గరే ఉండేట్టుగా చూడండి. దసరా–దీపావళి పండగ రోజుల్లో నేను ఆమె మొహం చూస్తూ సేవలందించలేను.' శుక్రవారం పొద్దటిపూట తలస్నానం చేసి తలపై టర్కీటవల్ని గోవర్ధనగిరిలా చుట్టుకొని పూజకి సిద్ధమౌతూ భరించే మనిషికి హుకుం జారీచేసింది జయంతి.

సునిల్ లాప్టాప్ స్క్రీన్ వైపే సీరియస్ గా చూస్తూ వేళ్ళని టకటక లాడిస్తున్నాడు. వేళ్ళనొక్కులు తెరపై అక్షరాలరూపంలో కనబడుతున్నాయి. తన మాటలు సునిల్ చెవుల్లోకి దూరలేదని నిర్ధారించుకొంది . మెల్లిగా అడుగులేస్తూ సునిల్ వెనక నిల్చుంది.

ఉలుకులేదు. పలుకు అంతకీలేదు. టవల్నితీసి తలవెంట్రుకలని సునిల్ పై మృదువుగా జాడించాలనుకొంది. తుంపరతోనైనా లోకంలోకి వస్తాడన్న ఆశ. ఇలాటి చేష్టలు జయంతికి ఇష్టం. తెరపైన

అంకెలు, గ్రాపులు చూసి సీరియస్ పనిలో మునిగిపోయాడని వెనక్కి జరిగింది. సోఫాలోకూచోని సెల్ ఫోన్ తీసింది. ఫోన్లో సందేశం వచ్చిన మృదుసంగీతం వినగానే సునిల్ యాంత్రికంగా మెసేజ్ చూశాడు. జయంతినుండి. ఏమి తెలియనట్టుగా ఎటో చూస్తున్నట్టు నటిస్తున్న జయంతి.

'వచ్చేనెల మీ అమ్మని తీసుకురావద్దు. రెండు పండగలొస్తున్నాయ్. మీతమ్ముడి దగ్గరే ఉండేట్టుగా చూడండి. నవంబర్–డిసెంబర్ మన దగ్గర పడుండనీ. దసరా–దీపావళి పండగ రోజుల్లో ఆమె మొహం చూస్తూ నేను సేవలందించలేను.'సునిల్ కి సర్రున కోపంవచ్చింది. కనబడనీకుండా పనికొనసాగించి డాక్యుమెంట్ మూసేసాడు. నీళ్ళుతాగి జయంతికి ఎదురుగా కుర్చీలాక్కొని కూచున్నాడు సునిల్. ప్రాణమున్న పావుకదలికల్ని ఓ కంట గమనిస్తూనే ఉంది జయంతి. అపజయమెరుగని జయంతి! జయం దరిదాపుల్లోకి కూడా దూరలేని సునిల్!! వారి పెళ్ళయి మూడు దశాబ్దాలయ్యింది. ఒక్క కూతురు. రెసిడెన్షియల్ స్కూల్లో చదువుల పంజరపు చిలకై పైచదువులకోసం స్వేచ్ఛా విహంగమై కెనడాకి వెళ్లింది.

***

గోడపై సంపూర్ణకుటుంబ ఫోటో. అందులో నిత్యమూ నవ్వుతూనే ఉంటారందరూ! మధ్యలో మూలజంట. అటూయిటూ ఇద్దరు కొడుకులు. హత్తుకొని వారి భార్యలు. ప్రధానజంటకి వెనకాల కూతురు అల్లుడు. అమ్మ భుజాలపై అప్యాతతతో ఆనించిన కూతురిచేతులు. పిల్లలు అక్కడక్కడ... ఫోటో నిండుగా సొష్టవంతో ఉంది. ఫ్యామిలీఫోటోకి రెండడుగుల దూరంలో తండ్రి క్లోజప్ ఫోటో. సైజు పెద్దది. అద్దంపైనే అంటుకొన్న బొట్టు. ఎప్పటికీ చెదరని చిరునవ్వు. ఎన్నటికీ వాడని రంగురంగుల పూలమాల.

ఆయన పెద్దబొట్టుతో చిరునవ్వుతో గోడెక్కినప్పటినుండే ఆమె నుదటిబొట్టు మాయమైంది. నవ్వుకి సంకెళ్ళు. కొప్పుకి పూలు చుట్టుకోవిక. ఆమె అశుభమయ్యింది. స్వంత ఇంట్లో. పిల్లల ఇళ్ళల్లో. ఇరుగుపొరుగు వాడల్లో... ప్రపంచానికే... అంతకుమించి కన్నవారి హృదయాల్లో... ఇంటికి కోడళ్ళుగా వచ్చిన వారి మనసుల్లో మరీనూ... ఆమెని దూరంగానే ఉంచాలి. మొహంచూస్తే అశుభం. ఇంట్లో శుభకార్యాలు జరిగితే దరిదాపుల్లో ఉండొద్దు. కొడుకులఇళ్ళల్లో అమెకోసం చాటు గదులు. దాన్నే ప్రత్యేకగది అని అందరికీ గర్వంగా చెబుతారు.

ఇంట్లోనే ఉంటుంది. మనసుల్లో స్థలంలేదామెకు. వంతులవారిగా. ఒక్కో నెల ఒకకొడుకు దగ్గర. తేదీలుతప్పని ఒప్పందం. శుభకార్యాలుంటేనో, పండగలొస్తేనో, సోషల్ పార్టీలు జరిగేదుంటే, ఇళ్లువిడచి ప్రయాణాలు చేయాల్సివస్తే, దగ్గరి బంధువులొస్తే ఒప్పందాలు మెత్తబడతాయి. సర్దుబాట్లు తప్పవు. అందరికీ 'ఆమె' అక్కరలేదు. దూరంగా ఉంచాలి!

అమెలాటి వారెందరో ఇంకా అశుభంగానే లెక్కించబడే ఒక ఆడ ప్రజాతి! ఒక్కొక్క సంతానాన్ని తొమ్మిదినెలలు ఏకదాటిగా కడుపులో పెంచిన తల్లి ఇప్పుడు కొడుకులవద్ద నిక్కచ్చిగా నెలలవారిగా.

***

ఆమె ఆయనకి ఎంతచెప్పినా వినలేదు. పెళ్లయిన కొన్నాళ్లకే తెలిసింది భర్తకి సిగరెట్టు

పెదిమలమధ్యే ఉంటుందని. మానేయమని ప్రేమతోచెప్పింది. ఏష్ ట్రే ఎప్పటిమాదిరిగానే నిండుతుంది. మరికొన్నాళ్ళకు బుజ్జగించి చెప్పింది. ఫలితం శూన్యం. రాత్రిపూట తియ్యటి మాటల్తో చెప్పింది. సరే అన్నాడు. మరునాడే మరిచాడు. ఇలా ఎన్నిసార్లో! ఆయన దగ్గినప్పుడల్లా వింత శబ్దం. 'మీరు సిగరెట్టు తగ్గించకపోతే మీతో మాట్లాడను.' '..........' 'మీరు సిగరెట్టు మానెయ్యక పోతే నేను అన్నం ముట్టుకోను.' '..........''నువ్వు సిగరెట్టుతాగడం ఆపకపోతే నేనుచస్తాను.' ఏడుస్తూ నిలదీసింది. '..........''మనిషివా, పశువ్వా? గొడ్డుకు నాలుగు దెబ్బలేస్తే వింటుంది. నీకెంత చెప్పినా బుర్రకెక్కదు.''..........''నీ చావేదో చావు...' 'చస్తాను...'

సిగరెట్టు చివరన బూడిదని కప్పుకొన్న మంట పొగనిపీల్చినప్పుడల్లా ఎర్రగా కనబడుతుంది. ఆ మంటలోని ఎరుపు కణాలు నోటిద్వారా, ఆతరువాత గొంతుద్వారా నల్లబడ్డ ఊపిరితిత్తుల్లోకి చేరాయి. అక్కడే స్థిరనివాసమేర్పరచుకొని మినుకుమినుకు మంటూ రోజుల్ని లెక్కబెడుతున్నాయి. శరీరంలోనే చితిమంటకి ప్రతిష్ఠానం! కొన్ని రోజుల్లోనే ఎరుపు కణికలు ఇంటిబయట పిడకలతో రాజుకొంటున్న కణికల్లో కలిసిపోయాయి. సిగరెట్లని కాల్చిన శరీరాన్ని కాల్చడానికి సంసిద్ధమౌతున్నాయి.

ఆమెకి ఏడుపురాలేదు. పోయినందుకు భాదేంలేదు. సిగరెట్టు పీల్చినప్పుడల్లా కనిపించే ఎర్రనిమంటే వెంబడున్న చితిమంటలా కనిపించేది. శరీరాన్ని మెల్లగా కాలుస్తున్నట్టుగా ఊహించుకొనేది. ఆ రోజు వచ్చింది. సంసారజీవితం సమాప్తం. ఒంటరి స్త్రీజీవితం ఆరంభం.

** *

ఫ్యామిలి ఫోటోలోని ప్రాణులందరూ, కీలకవ్యక్తి మినహా, హాల్లో కూచోని ఉన్నారు. ఆమె ఎటోచూస్తూ అచేతనంగా ఓచోట శిలలా. ఆరోజటి చర్చాంశం 'ఆమె'! పిల్లలు తమ సబ్జెక్ట్ కాదని టీవీ రూములోకి చేరి రక్తమాంసాల్లేని కార్టూన్ ఫిల్మ్ చూస్తున్నారు. హాల్లో రక్తమాంసాలతో పాటు భావోద్రేకాలూ నిండిన ప్రాణులు. ఆమెచుట్టూ ఎన్నో ఊరించే ఉపగ్రహాలున్నాయి. ఇల్లు. నగలు, బాంకు బాలెన్సు. ప్రతినెలా వచ్చే పెన్షన్... ఇంకా... ఇంకా... పిల్లలు బాగా నవ్వుతున్నారు. కదలని కార్టూనే ప్రింటులో నవ్వు తెప్పిస్తుంది. తెరపై కదిలే కార్టూన్లంటే ఇంటి బాధ్యతలెరుగని పిల్లలకి మరెంతోఇష్టం. పెద్దలు సీరియస్ గా ఉన్నారు. ఆమె వింటూనేఉంది. పిల్లలు తనభవిష్యత్తుని నిర్ణయిస్తున్నారు. జీవితకాలాన్ని ముక్కలుచేసి నెలలవారిగా పం(ఉం)చుకొనే యోజన రూపం పోసుకొంటుంది.

తలుపుల్లేని చెవుల్లోకి చర్చలమాటలు దూరుతుంటే తన పిల్లలపట్ల ఆమెకు పరమ అసహ్యం కలిగింది. నాలోంచేనా వీళ్ళు పుట్టారా అన్న అనుమానమూ వేసింది. తరాజుల్లేకుండానే పంపకాలయ్యాయి. ఆమెని శారీరకంగా ముక్కలు చేయలేదు. కాని ఆమె భవిష్యత్తు కాలాన్ని నెలలకి కుదించి స్థానభ్రంశ ప్రణాళిక గీచారు. నెల పెద్దోడి వద్ద. చిన్నోడి వద్ద నెల. నెలమానం ఖచ్చితంగా పాటించాలి. ఒక్కరోజు అటు–ఇటు కాకూడదు. ఎవరిదగ్గరుంటే వారికే పెన్షన్. ఆమెకి ఇష్టమచ్చినప్పుడు కూతురుదగ్గరికి. నెలకాగానే దిగబెట్టాలి. వచ్చి తీసుకుపోవడం ఎవరికీ కుదరదు. ఆమెవిని లోలోపలే నవ్వుకొంది. తన రాతలు నుదటలేవని, పిల్లలచేతుల్లోనే

ఉన్నాయని గ్రహించింది.

పిల్లలు కడుపులో ఉన్నప్పుడు చేసిన కదలికల్ని 'వీడు తన్నుతున్నాడు' అని సంతోషాలతో, ఆ మధురక్షణాల్ని భర్తతో, అత్తగారితో, తల్లితో పంచుకొనేది. పరుగెత్తుకొంటూ వారు వచ్చి పొట్టపై చేయిపెట్టి చిట్టి కదలికల్ని అప్యాయతతో అనుభవించేవారు. లోపలున్నపుడు తీపితన్నులు. ఇప్పుడు బయటనుండి గట్టిగా తన్నుతున్నారు. గుండె

***

ఆమెకి పిల్లలు నిర్దేశించిన మాసవలసల కాలెండరయ్యింది. సూర్యచంద్రోదయాల్లో తేడా ఉండొచ్చు. ఒక్క రోజు అటుఇటూ కాదు. ప్రతినెలా చివరిరోజున ఆమె ఇల్లు మారుతుంది. రెండు ఇళ్ల మధ్యదూరం మూడువందల కిలోమీటర్లు. మార్పు కోసం అపుడపుడు చిన్నమజిలీ కూతురిదగ్గర. అల్లుడుండేది పొరుగు రాష్ట్రంలో.

ఇంటిదగ్గర్లో ఉన్న మైదానంలో పిల్లలు పుట్ బాల్ ఆడుతున్నారు. అందరి దృష్టి కదిలేబంతిపైనే. ఆటగాళ్లు బంతిచుట్టు. బంతి కాళ్ళ మధ్యలోంచి నెట్టువైపు దొర్లుతూ వెళ్లింది. ఆటగాడు పరుగెత్తి బంతిని మరోవైపున్న నెట్టువైపు లాంగ్ షాట్ కొట్టాడు. గాలిలో ఈదుతూ బంతి మరోవైపు. అక్కడున్న కిలాడి బంతినాపి అంతేవేగంతో వచ్చినవైపే తన్నాడు. బంతి అటునుండి ఇటు... ఇటునుండి అటు...

ఆమె అటునుండి ఇటు... ఇటునుండి అటూ.. ఏళ్ళుగడిచాయి. కొన్నిసవరింపులు. అవసరాలనిబట్టి ఒక కొడుకువద్ద వరసగా రెండునెల్లుంటే తరువాతి రెండునెల్లు ఇంకొకరివద్ద. పిల్లలపరీక్షలు ఉన్నాయని మీఇంట్లో పరీక్షలు రాసే పిల్లలులేరని... మేము వచ్చేనెల్లో ఇంట్లోఉండమనో, మాకు బంధువులస్తున్నారనో...శుభకార్యాలున్నాయనో...సవరింపులు కాలక్రమేణా రూపం మార్చుకొన్నాయి. వచ్చేనెల మా ఇంట్లో శుభకార్యాముందని, ఆమె ఇంట్లో ఉండకూడదనో...

వాళ్ళు అలాచేస్తే మనమేందుకు చేయకూడదని కోడళ్ళకి కొత్తకారణాలు దొరికాయి. బంతిని ఎవరు వారివారి మైదానల్లో ఉంచుకోకుండా అటునుండి ఇటు, ఇటునుండి అటు... తన్నుతూనే ఉన్నారు. తన్నుల్ని భరిస్తూ ఆమె ప్రయాణం చేస్తూనేఉంది. చిన్నకొడుకు దగ్గరినుండి పెద్దోడింటికి. పెద్దకొడుకు దగ్గరినుండి చిన్నోడింటికి.

***

సునిల్ ఓపిగ్గా జయంతివైపే చూస్తున్నాడు. చూడనట్టుగా ఆమె నటన. సహజ ప్రవర్తన – నటనల మధ్య నిమిషం గడిచింది. నిద్రపోతున్నట్టు నటించేవారిపై ఎన్నినీళ్ళు కుమ్మరించినా లేపలేం! మరింత దగ్గరిగా జరిగాడు. జయంతి తలతిప్పక తప్పలేదు. చేతుల్ని పట్టుకొన్నాడు.

'మీరు నన్ను ఓదార్చి ఒప్పించే ప్రయత్నం చేయద్దు.' చేతుల్ని వెనక్కిలాక్కొంటూ. 'నిన్ను బలవంతంగా నేనొప్పించను. నీ సహకారంలేకుండా ఏదీచెయ్యను. సరేనా?' ఒకరికళ్ళల్లోకి ఒకరుచూసుకొన్నారు. 'నాకొక మాటిస్తావా జయంతీ? ప్రేమతో సునిల్. 'మాటలగారడిలోకి దించొద్దు.' 'చెప్పానుకదా నీవొప్పుకోనిపని ఏదీచేయనని.' 'చెప్పండి.' 'రెండురోజుల

ప్రయోగం. నేనుచెప్పింది జాగ్రత్తగావిను. స్వతహాగా అనుభవించి అన్వయించుకొనే ప్రయోగం. నువ్వు నిజాయితీగా పాల్గొనాలి మరి.' 'తమాషాగా మాట్లాడకండి. వివరించి చెప్పండి.' 'కొన్నేళ్ళ క్రితం మనం వార్తల్లో చదివాం, గుర్తుంది కదూ? సాధారణమనుషులు జైలుజీవితాన్ని ఒక్కరోజు అనుభవించడానికి సంగారెడ్డిలో, దిల్లీలోని తిహార్ జైల్లో.. ఎవరైనా ఒక్కరోజు జైల్లోగడిపిరావచ్చు.'

విచిత్రంగాచూసింది జయంతి సునిల్ వైపు. మొహంలో భయం...'భయపడకు. నువ్వుఎక్కడికీ వెల్లద్దు. మనింట్లోనే ప్రయోగం. ఒప్పుకోన్నట్టేనా?' జయంతి సందిగ్ధంలోనే ఉంది. ప్రయోగవివరాలు తెలియకుండానే ఎలాఒప్పుకోను? 'నీవొప్పుకొంటే నేనూ ఓరకంగా ఈప్రయోగంలో పాల్గొన్నట్టే...' 'అయితే ఓకే.' 'నువ్వు అమ్మలా, నేను నీలా.' 'సరేలే! ఇప్పుడైనా క్లియర్గా చెప్పండి.' చిరాగ్గా జయంతి. సునిల్ జాగ్రత్తగా వివరించాడు. గమ్మత్తుగాఉందే, రెండురోజులు ఇంట్లోనేకదా అని జయంతి నవ్వుతూ ఉత్సాహంగా ఉంది. సునిల్ ప్రశాంతంగా ఊపిరిపీల్చాడు. రెండో శనివారం, మరునాడే వచ్చే ఆదివారం రంగానికి సిద్దమయ్యాయి.

** *

వచ్చినపుడల్లా ఆమెని 'ప్రత్యేకంగా' ఉంచే పైగదిలోకి జయంతి శనివారం పొద్దున్నే మారింది. వసతులు ఎప్పటిలాగే. అదనంగా ఏమిఉండవు. టీవీలో ఒకటే తెలుగుచానల్. న్యూస్ పేపర్ ఉండదు. ఫోనులో కాల్స్ వస్తాయి కాని బయటకు తాను చేయరాదు. తనపనులు తానుచేసుకొని గదిలోనే గడపాలి. సమయానికి తిండి వస్తుంది. మాట్లాడేందుకు ఎవరురారు. తాను కిందికి పోకూడదు.

గృహిణి పాత్రలో సునిల్ ఇల్లు, కిచెన్ చూసుకోవాలి. సమయానికి తిండి పైకివెళ్ళి ఇవ్వాలి. కావలసిన కనీసావసరాలు పైగదిలో ఉన్నాయోలేదో చూసుకోవాలి. టీ బిస్కట్లతో సునిల్ పైకి వెళ్ళాడు. జయంతి శూన్యంలోకి చూస్తుంది. టేబుల్ పై కప్పుపెట్టి జయంతివైపు చూడకనే మాట్లాడకుండా బయటకొచ్చాడు. ఆమెకి తాను అలాగే విసురుగాపెట్టి బయటపడే సంగతి గుర్తుకొచ్చింది.

జయంతి టీవీ ఆన్ చేసింది. కాస్సేపుచూసాక బోర్. ఒకటే చానెల్ పెట్టించారు. కూర్చిలోంచి లేచి కిటిల్లోంచి బయటకిచూసింది. గదిలో అటూఇటూ అడుగులేసింది. ఎనిమిదిన్నరవుతుంది. సునిల్ ఉప్మాతో వచ్చాడు. టేబుల్ పైన పెట్టి ఖాళీకప్పు తీసుకొని వెళ్ళాడు. సునిల్ని అదోవిధంగా చూసింది. కాస్సేపు ఒరిగింది. నిద్ర రాలేదు. టీవీ చూసింది. పన్నెండవుతుంది. కిందినుండి ఏవోశబ్దాలు వినబడుతున్నాయి. ఎవరో వచ్చినట్టున్నారు. 'ఒంటరిగావున్నారా?' బంధువడిగాడు. 'అవును. జయంతి రెండ్రోజులకోసం హైద్రాబాద్ వెళ్లింది.' 'మరైతే రాత్రికి మా ఇంటికిరండి భోజనానికి.' 'రెండ్రోజులేకదా. అన్నీచేసే వెల్లింది. మీకుతెలుసు నాకు వంటచేయడం ఇష్టమని.' 'వచ్చే నెల మీవంతు కదూ? అమ్మెపుడొస్తుంది? పండగలకి మీదగ్గరే ఉంటుందన్నమాట!' జయంతికి సంభాషణ మెల్లిగా వినబడుతుంది.

'అవునండి. ఈసారి అమ్మ పండగలకి మాదగ్గరే. సంతోషంగా ఎదిరిచూస్తున్నాం.' సునిల్ జవాబు. జయంతికి సర్రున కోపం.

బంధువు వెళ్ళిపోయినట్టున్నాడు. కింద నిశ్శబ్దం. లంచ్ కి ఇంకాటైముంది. ఆమె వచ్చేనెల్లో ఇంట్లో ఉండకూడదనుకొంటే ఈయనేమో పండగలకి తప్పక ఉంటుందంటున్నాడు. యుద్ధానికి జయంతి మాటలకత్తుల్ని పదునుపెడుతుంది. సునిల్ పళ్ళెంతోవచ్చి పెట్టివెళ్లబోతుంటే కోపంతో 'మీతో మాట్లాడాలి.' అంది. పట్టించుకోకుండా పెదిమలపై నిలువుగా వెలుని పెట్టి మాట్లాడకూడదు అనే సైగచేసి వేగంగా వెళ్లిపోయాడు. రోజు ఆమెతో ఏమీ మాట్లాడకుండా పళ్ళెం పెట్టి విసురుగా వెళ్ళే విషయం జయంతికి గుర్తుకొచ్చింది.

నిమిషాలు గంటలుగా గడుస్తున్నాయి. టీవీ ప్రోగ్రామ్స్ బోర్ బోర్. ఫోన్ అందుబాటులోలేదు. కిందికి దిగొద్దు. కాస్సేపు పడుకొందామని మంచంపై ఒరిగింది.
కునుకు పట్టిందోలేదో కింద పిల్లలమాటలు. పక్కింటి పాప తన బర్త్ డే కేకుముక్కలతో వచ్చింది. వెంబడి చిన్నపిల్లల గుంపు. అరుపులు... నవ్వులు... జయంతికి ఆ గొంతులన్నీ పరిచయమే! కిందికిపోయి అందరిని సరదాగా పలకరిద్దామనుకొంది. ఒప్పందం ప్రకారం కిందికిదిగొద్దు. కళ్ళల్లో నీళ్ళు. సునిల్ పుట్టినరోజు కేకుముక్కని ఆమెకోసం తను గదికి పంపిన విషయం గుర్తుకొచ్చింది. సునిల్ పిల్లల్తో క్యారమ్ ఆడాడు. ఆ వీధిలో పిల్లలు ఆయన్ని 'క్యారమ్ అంకుల్' అంటారు. జయంతికూడ ఆడేది.

భారంగా గడుస్తుంది. చీకట్లు పడుతున్నాయి. మొహంపై నీళ్ళుచల్లుకుంది. కిటికీలోంచి బయటకి చూసింది. తెలిసినవారు తిరుగుతున్నారు. వీదిలైట్లు వెలిగాయి. గుడినుండి పాటలు. అటూ ఇటూ తిరిగింది. మరోకిటికీ దగ్గరికెళ్లి చూసింది. ఎన్నోఆలోచనలు! ఎన్నడూ ఇంతతీరిగ్గా ఉండని జయంతి బుర్రలోకి మరెన్నో ఆలోచనలు. సవాళ్లుచేసే ఆలోచనలు. వేడెక్కిన బుర్రతో మంచం దగ్గరికి వచ్చింది. టేబుల్ పై డిన్నర్! సునిల్ ఎప్పుడు పెట్టివెల్లాడో తెలియనేలేదు!

ఆమెతో మాటాముచ్చట లేకుండా తాను ఎన్నిసార్లు టేబుల్ పై పెట్టివెళ్లలేదు! ఠక్కున గుర్తుకొచ్చింది. పళ్ళెంపట్టుకొని కిటికీదగ్గరికెళ్ళి బయటిలోకాన్ని చూస్తూ తినేసింది. రాత్రంతా నిద్రరాలేదు. ఏవేవో విషయాలు పీడించాయి. ప్రశ్నలపరంపర. గురుతుకొచ్చి గుబులుని నింపాయి. ఆమె మొహం స్పష్టంగా కనబడింది. ఎన్నడూలేనంత ప్రకాశవంతంగా! ఎంతో అప్యాయతతో తనవైపు చూస్తోంది. తనవైపేకాదు తన భర్త, పిల్లలవైపు... ప్రేమతో... వాత్సల్యంతో...నిద్రలేక గదిలోనే తిరిగింది. కిటికీలదగ్గరికెళ్లి చూసింది. లోకం నిద్రలోఉంది. ఎవరు

***

మరునాటి ఉదయం. ఇప్పటికి వేయి ఆరు వందల నిమిషాలు గడిచాయి. సునిల్ టేబుల్ పై టీ పెడుతున్నప్పుడు మెలకువ వచ్చింది. జయంతి మాట్లాడాలని ప్రయత్నం చేసింది. కానీ ఒప్పందం గుర్తుకొచ్చి మౌనంగా ఉండిపోయింది. బ్రేక్ ఫాస్ట్ తెచ్చినపుడు ఎలాగైనా మాట్లాడుతా అనుకొంది.

బ్రేక్ ఫాస్ట్ సమయం వరకు ఆగలేకపోయింది. ఇరవైఏడు గంటల్లో మొదటిసారి జయంతి గది దాటింది. పేపర్ చదువుతున్న సునిల్ వేగంగా మెట్లు దిగుతున్న జయంతిని ఆశ్చర్యంతో అపరాధం చేస్తున్నదానిలా చూసాడు.'ఏమండీ. అత్తమ్మని నెలనెలా కాదు. ఎప్పటికీ మనవద్దే ఉంచుకొందాం. పాప గది కింద ఖాళీగానే ఉంది. దాన్ని ఆమెకోసం రెడీ చేద్దాం. వచ్చేనెల్లో రెండు పండగలొస్తున్నాయి కదా. నాలుగురోజులు ముందుగానే తీసుకొద్దాం. అత్తమ్మని తీసుకెళ్లడానికి వస్తున్నామని మీ తమ్ముడికి ఫోన్ చేయండి.'

* * *

**టి. సంపత్ కుమార్ స్వస్థలం ఖానాపూర్ (నిర్మల్ జిల్లా). ఈయన చదువు, ఉద్యోగరీత్యా 40 సంవత్సరాలు ఢిల్లీలో ఉన్నారు. రిటైర్ అయ్యాక 2016 నుండి నిర్మల్‌లో ఉంటున్నారు. 1987 నుండి ఈయన కథలు రాస్తున్నారు. ఈయన రాసిన మొదటి కథ "బాగా సదుకో" మంచి గుర్తింపునిచ్చింది. ఇప్పటి వరకు సంపత్ కుమార్ 50 కథలు, "కదలికలు" అనే ఒక నవల రచించారు. లియోసా, రించిన్, పెన్నులు, చంద్రి-78,000, తాతయ్య దంతం, అనగా అనగా ఒక దేశం మొదలైనన కథలు ప్రశంసలు పొందాయి. చంద్రి-78,000 కథ కేంద్ర సాహిత్య అకాడెమీ హిందీ సంకలనంలో చోటుచేసుకొంది. లియోసా కథని ఐదు ప్రత్యేక సంకలనాల్లో ప్రచురించారు. ఈయన రాసిన కథలకు గాను ఎన్నో బహుమతులు, పురస్కారాలను పొందారు. కొన్ని కథలు ఇంగ్లీష్, పంజాబీ, హిందీల్లోకి అనువాదం అయ్యి ప్రచురింపబడ్డాయి.**

# బోగన్విలియా



**అమృత లత**
**98488 68068**

ఏమీ తోచనపుడు అద్దాల కిటికీలోంచి రోడ్డు మీద వచ్చేపోయే జనాలని చూడటం నాకు అలవాటు...దారెమ్మట పోయేవాళ్ళు ఈ అద్దాల మేడ వంక ఒక్కసారైనా తమ చూపు తిప్పి చూడకుండా వెళ్లడం నేను చూడలేదు!

అఫ్కోర్స్ ..ఎవరికైనా వారికి లేని వస్తువు మీద మనసు పారేసుకోవడం సహజం ! కానీ ఒకసారి అది హస్తగతమైతే దాని మీదున్న మోజు క్రమేణా తగ్గిపోతుందన్న విషయం ఎవరికి వారు తమ స్వానుభవంలో మాత్రమే తెలుసుకుంటారు !

నిజానికి ఇలాంటి చక్కటి ఇల్లుని నాకు తెలీకుండానే కట్టించి , దాన్ని మా మొదటి పెళ్లి రోజు కానుకగా చెప్పి నన్ను సర్ప్రైజ్ చేసాడు రవి ! ఈ ఇంటి అందాలను ఏ కోణంలో చూసినా –రవి అభిరుచిని అభినందించకుండా వుండలేను. రవి గురించి ఆలోచిస్తూ కిటికీ లోంచి బయటకు చూస్తున్నాను.

ఎదురుగా – రోడ్డు మీద ...డివైడర్ల మధ్య పూల

మొక్కలు పెడుతూ కన్పించారు కూలీలు .. పూల మొక్కలంటే ప్రాణమిచ్చే నేను .. వాళ్ళు ఆ మొక్కల్ని ఎలా పెడుతున్నారా అని బాల్కనీలో కూర్చుని ఎంతో ఆసక్తిగా గమనిస్తున్నాను.

కూలీలందరూ ఆడవాళ్లే ! వాళ్ళు ..తెల్లగా , అందంగా , బలిష్టంగా వున్నారు.ఎర్రటి ఎండలో పని చేస్తున్నారు. ఇద్దరు అమ్మాయిలు చక చకా మట్టి తవ్వుతూంటే.. మరో ఇద్దరు ఎరువులాంటిదేదో వేస్తున్నారు. ఇంకో ఇద్దరు పూల మొక్కల్ని నాటుతున్నారు. రోడ్డు పక్కన వున్న చెట్లకు తమ పాత చీరలని ఉయ్యాల్లా కట్టి , వాటిలో చంటి పిల్లల్ని పడుకోబెట్టి , రెండు మూడేళ్లున్న పిల్లలతో ఆ ఉయ్యాలలను ఊగిస్తున్నారు.

ఏ వస్తువైనా ఒక చోటు నుండి మరో చోట పెట్టడానికే ఆపసోపాలు పడే నాకు – ఇంచుమించు నా వయస్సులోనే వున్నట్టుగా వున్న ఆ అమ్మాయిలు ఆడుతూ పాడుతూ ఎంతో సునాయాసంగా పనులు చేసుకోవడం చూసి ముచ్చటేస్తోంది ! వాళ్ళ చేతుల్లో ఏవో పూల మొక్కలు .. అవి ఏ పూలవో కన్పించడం లేదు. కాకపోతే .. అవి ఏ ఎర్ర గన్నేరు మొక్కలో , తెల్ల గన్నేరు మొక్కలో కాకపోతే బావుణ్ణనిపించింది !

పూలు తక్కువ , ఆకులెక్కువగా వుండే ఆ గన్నేరు పూల మొక్కలకన్నా – ఆకుల్నే కన్పించకుండా విరగబూస్తూ –చాలా రోజుల పాటు వాడిపోకుండా నిత్యనూతనంగా కనిపించే బోగన్విలియా మొక్కల్ని... ఆ డివైడర్ల మధ్య నాటితే కంటికి ఇంపుగా వుంటాయి కదా అన్పించింది. అప్పుడే ఫ్యాక్టరీ నుండి తొందరగా ఇంటికి వచ్చిన రవితో అదే విషయం చెప్తే–' ఛ ! బోగన్విలియా మొక్కలా ? అవేం బావుంటాయి ఇందూ ? పైగా వాటికి సువాసన కూడా వుండదు ! ' అంటూ నన్ను ఆట పట్టించాడు.

'ఇల్లు కట్టిన కొత్తలో వాటిని మన కాంపౌండ వాల్ మీద పాకేలా పెట్టుకుందామని నేనోసారి అడిగితే – 'వాటికి ముళ్ళుంటాయ్ .. నువ్వు ఉత్తినే కూర్చోవు సరి కదా .. వాటికి నీళ్లు పోస్తానూ .. కత్తిరిస్తానూ అంటూ బయల్దేరుతావు ! అసలే సుకుమారమైన శరీరం నీది , వాటి ముళ్ళు గుచ్చుకుంటే – నేను తట్టుకోలేను ! కావాలంటే మల్లె పూల మొక్కలు పెట్టుకో..' అంటూ తప్పించుకున్నారు మీరు, గుర్తుందా ?' గుర్తు చేసాను.

రవి మాట్లాడలేదు. 'అయినా రవీ – నీకు మల్లె పూవులంటే ఎందుకంత మోజు ? అవి ఒక్క రోజులో విచ్చుకుని వాడిపోయే పూలు ! ఆ బోగన్విలియా పూలు చూడండీ ,ఎంతకీ వాడిపోవు– ఎండావానలకి తట్టుకుంటాయి ! కంటికి ఎంతో ఆహ్లాదం కలిగిస్తాయి !' అన్నాను

విననట్టు నిల్చున్నాడు రవి. ' అప్పుడు ఇంట్లో పడనివ్వలేదు సరే – కనీసం .. ఇప్పుడు ఈ వీధిలోనైనా ఆ పూలను చూసి తరించే భాగ్యం మాకు లేదేమిటి ? ' ఏడ్పించాను రవిని

' సర్లే – నేను అడ్డుపడిందీ ఇప్పుడు కాదు .. అప్పుడెప్పుడో మన పెళ్ళైన కొత్తలో కదా

! నీ కంటికి ఆ పూలు అంత ఆహ్లాదం కలిగిస్తే ఇప్పుడు నేనెందుకు అడ్డం పడతాను చెప్పు ! ' అంటూ వాతావరణం తేలిక చేద్దామని కాబోలు ..'పూవునైనా కాకపోతినీ ..నీ కంటి చూపూ సోకగా ... ' కూని రాగం తీస్తూ బాత్రూంలో దూరాడు. మరో పది నిముషాల్లో ట్రిమ్ గా తయారై –

'ఇందూ ! మా ఫ్రెండ వాళ్ళింట్లో ఈ రోజు స్టాగ్ పార్టీ వుంది .. ఏ అర్ధరాత్రో వస్తాను. పాపని స్కూల్ నుండి తీసుకొచ్చి – నేనొచ్చేదాకా డ్రైవర్ ఇక్కడే వుంటాడు. ఫస్ట్ టైమ్ మిమ్మల్ని వదిలి వెళ్తున్నాను కదా ... ఎమర్జెన్సీ లో మీకు తోడుంటాడని డ్రైవర్ని ఇక్కడే వుండమన్నాను .మళ్ళీ నా కోసం అతడిని పంపించకు .. నేనే డ్రైవ్ చేసుకుంటూ వస్తాను. జాగ్రత్త డాళింగ్ ! మా ఫ్రెండ కో చక్కటి గిఫ్ట్ కొనాలి .. మావాళ్లంతా నన్ను తొందరగా రమ్మంటూ ఒకటే గొడవ చేస్తున్నారు .. వస్తా ! బై ! ' అంటూ హడావిడిగా బయటపడ్డాడు.

టైమ్ చూసాను .. పదకొండున్నర అవుతోంది ! బయట ఇంకా ఎర్రటి ఎండ ! అంతటి ఎండలో కూడా డివైడర్ దగ్గర నవ్వుతూ తుళ్ళుతూ పనిచేసుకుంటున్నారు కూలీ అమ్మాయిలు.

పెళ్ళై అయిదేళ్ళు అవుతోంది ! నన్ను ఒంటరిగా వదిలిపెట్టి ఎప్పుడూ ఎక్కడికీ వెళ్ళలేదు రవి. స్టాగ్ పార్టీలో ఆడవాళ్లకు ప్రవేశం వుండదు కాబట్టి .. మొదటిసారిగా నన్ను వదల్లేక వదల్లేక ఒక్కడే వెళ్ళిపోయాడు. అవునూ ..ఎంతటి అదృష్టం చేసుకుంటే భార్యని కంటికి రెప్పలా చూసుకునే రవిలాంటి భర్త లభిస్తాడు అమ్మాయిలకు ? రవి ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి ..

***

పెళ్ళైన కొత్తలో ..'నా చెంప తాకగానే ..చెలీ నీ చేయి కందేనేమో – ' ' కుసుమాలు తాకగనే నలిగేను కాదా నీ మేను .. ' తనకి నచ్చిన పాటల్ని పాడుతూ ఏడ్పించేవాడు రవి. 'అవునూ.. నిన్ను చూడకముందు – సౌకుమార్యం ఆడవాళ్లకు అలంకారమంటూ కవులు అభివర్ణిస్తూంటే .. అదంతా ఉత్త ట్రాష్ అనుకునేవాణ్ణి ! కానీ చిదిమితే పాలుగారే సౌకుమార్యం నీది ! ఇలాంటి సౌకుమార్యం ఎంత అదృష్టం చేసుకుంటే లభిస్తుందో చెప్పు ! పైగా అది నీ సొంతం కావడానికి నీకు ఎన్ని తరాల జీన్స్ సాయం చేసి వుంటాయో ఆలోచించు ఇందూ ..' మోహావేశం ఎక్కువైనప్పుడల్లా మురిపెంగా అంటాడు రవి. కానీ ఈ సౌకుమార్యాన్ని ఏం చేసుకోనూ ? ఇది ఒక్కరోజులో వికసించి వాడిపోయే మల్లెపూవు లాంటిది కదా ! ఊటీలో , కొడైకెనాల్లో .. ఎక్కడ ఏ పార్కు లో తిరుగుతున్నా –' ఏయ్ ఇందూ ! అలా ఎండలో తిరగకు ... ఇదిగో ఇలా నీడ పట్టున నడువు !' అంటూ నా చేయి పట్టుకుని నేను చెట్ల నీడల కిందే నడిచేలా చేసేవాడు రవి ..

ఇంట్లో బోర్ కొట్టి ,ఎప్పుడైనా – 'వాకింగ్ కి వెళదాం ' అని అడిగితే – ' సన్నగా నాజూగ్గా వున్నావ్ కదా ! ఇంకా ఈ వాకింగ్ లు ఎందుకు చెప్పు ?' అనేవాడు. అథవా నా పోరు పడలేక వాకింగ్ కి వచ్చినా– చుట్టు పక్కల అటూ ఇటూ చూసి – ' నా దేవేరికి ఛత్రం పడతాను చూడూ !' అంటూ నా కొంగో , దుప్పట్టానో గొడుగులా చేసి, రెండు చేతుల్తో దాన్నెత్తి , నా మీద కప్పి నా వెనకాలే నడుస్తూ – ' నీ అడుగులోన అడుగు వేసి నడవనీ , నే నడవనీ ' పాడేవాడు. 'ఇలా అల్లరి చేస్తే – ఛస్తే మీతో వాకింగ్ రాను– పోండి !' అని మొండికేస్తే –'సర్లే ! నేను రాను , నువ్వెళ్లు ! కానీ ఎండ రాకముందే ఇంటికి వచ్చేయాలి ! ఎండలో నడిస్తే కందిపోతావ్ ..జాగ్రత్త ! పొద్దున్నే చలిగా వుంటుంది. చెవుల చుట్టూ స్కార్ఫ్ కట్టుకో ! చీరతో నడవకు..కుచ్చెళ్ళు తట్టుకుని పడిపోతావు ! చుడీదార్ వేసుకో, జీన్స్ అయితే ఇంకా కంఫర్టబుల్ గా వుంటుంది ' అంటూ సవాలక్ష జాగ్రత్తలు చెప్పేవాడు.

ఎప్పుడైనా జన్మకో శివరాత్రి పొద్దున్నే– 'ఒక్కదానికి నాకు బోరుకొడ్తోంది –మీరూ రండి ప్లీజ్ !' అంటూ రవిని వాకింగ్ కి బయల్దేర దీస్తే – ఇంటి బయట కాలెడుతూనే ..నా కొంగుచ్చుకు లాగుతూ .. నీకో సంగతి చెప్పనా ? నువ్వు నడుస్తూంటే – నీ నడుం వెనకాల కదిలీ కదలనట్టు కదిలే ఆ సన్నటి నడుం మడతలు .. నీకెంత అందంగా – నాకెంత టెంప్టింగా వుంటాయో తెలుసా ?' అంటూ ఆ మడతల్ని గిల్లి – నన్ను వివశురాల్ని చేసి – ఆ రోజటి మా వాకింగ్ కి ఎసరు పెట్టించేవాడు.

నేను మున్ముందు ఏ జబ్బు బారినపడో ఈ సౌకుమార్యాన్ని పోగొట్టుకుంటే ... చూసి తట్టుకోగలడా ? అప్పుడూ ఇంత అపురూపంగా నన్ను చూసుకోగలడా ? ఎందుకో రవి లోని ఆ 'సౌందర్య స్పృహ' నన్నెప్పుడూ ఏదో తెలీని అభద్రతాభావానికి లోను చేసేది. అదే మాట పైకి చెప్తే –

' యూ సిల్లీ గాళ్ ! గులాబీ పువ్వు సుకుమారమైంది. దానిది మనకన్నా షార్ట్ లైఫ్ ! అలా అని .. దాని రెక్కలు రాలిపోతూంటే చూస్తూ కూర్చోలేం కదా ! మరి కొన్ని గంటలపాటైనా అది తాజాగా వుండాలనుకుంటాం. నీళ్లు చిలకరించో .. తడి గుడ్డలో చుట్టో ..అది వాడిపోకుండా వుండేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తాం కదా ! ' అనేవాడు..అయితే .... నేను భయపడ్డట్టే – మా పెళ్ళై ఓ పాప పుట్టాక –ఎప్పుడో ఏ యాభై ఏళ్ళ వయసు తర్వాతో వచ్చే ఆస్టియోపోరాసిస్ ముప్పై ఏళ్ళ వయసులోనే నా ఎముకల్ని గుల్లబారేలా చేయడం, తుమ్మినా దగ్గినా చిన్న చిన్న ఫ్రాక్చర్స్ కావడం, కాలి వేళ్ళ కణుపుల మీద , చేతి వేళ్ళ కణుపుల మీద ఉబ్బెత్తుగా బొడిపెల్లా స్పర్స్ పెరిగి కీళ్లు నొప్పెట్టడం – తద్వారా నేను ఏ చిన్న వస్తువునీ లేపలేకపోవడం చూసి – షాక్ అయ్యాడు రవి.

'విటమిన్ – డీ మాత్రలు బాగా వేసుకోవాలి , ఎండలో తిప్పాలి ' అని డాక్టర్లు

చెప్పినపుడు .. తను నన్ను 'అసూర్యం పశ్య'లా అపురూపంగా చూసుకున్నందుకే నాకిలా జరిగిందేమోనన్న గిల్టీనెస్ మొదలయి... నా పట్ల అంతకు ముందున్న శ్రద్ధ రెట్టింపైంది రవికి ! అయితే .. ఇంతకు ముందులా ప్రతి దానికీ సున్నితంగా చూసుకోవడం మానేసి – ఎండలోనే వాకింగ్ చేయించడం, ఇవ్వాల్సిన మోతాదులో డీ విటమిన్ లాంటి టాబ్లెట్స్ ఇవ్వడం మొదలెట్టాడు రవి.

***

రాకింగ్ చైర్లో కళ్ళు మూసుకుని రవి తలపుల్లో మునిగితేలుతోన్న నేను –' అమ్మా ! ఒక్కమాట ..' ఆయా పిలుపుకి ఉలిక్కి పడి కళ్ళు తెరిచాను.' అమ్మా ! మన ఇంటి ముందున్న రోడ్డు మీద డివైడర్స్ లో మొక్కలు పెడుతున్నవాళ్లకి దాహంగా వుందట ! వాళ్ళు గేట్ ముందు నించుని మంచి నీళ్లు అడుగుతున్నారు... ఇవ్వమంటారా ? ' అడిగింది ఆయా. వాల్ క్లాక్ వంక చూసాను. మధ్యాహ్నం మూడవుతోంది. ' సర్లే ..వాళ్ళని లోపలికి రమ్మని పిలువు ! పొద్దుటినుండీ ఎండలో పనిచేస్తున్నారు కదా ! దాహంగా వుందేమో పాపం .. ఇంట్లో సకినాలూ , లడ్డూలూ వున్నాయి కదా ! వాళ్ళకీ , వాళ్ళ పిల్లలకీ తలా కొన్ని ఇవ్వు , టీ కూడా చేసివ్వు ' చెప్పాను.

' సరేనమ్మా ! ' అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది ఆయా. పాప స్కూల్ నుండి వచ్చే టైమ్ అయింది. ఈపాటికే డ్రైవర్ తీసుకు రావాలి ! ఏ ట్రాఫిక్ జామ్ లో ఇరుక్కున్నారో ... ఇంకా ఇంటికి రాలేదు! ఫోన్ చేస్తూంటే రిసీవ్ చేసుకోవడం లేదు.. డ్రైవింగ్ లో ఫోన్ మాట్లాడకూడదని మాట్లాడడం లేదేమో అని సరి పెట్టుకుందామనుకుంటే – కనీసం నా కాల్ చూసైనా .. ఎక్కడో ఓ చోట అతడు కారు అపి మాట్లాడవచ్చు కదా అన్పించింది !

నాలో అంతకంతకీ టెన్షన్ పెరిగిపోతోంది ..ప్రతి రోజూ అయిదు గంటలకల్లా ఇంటికి వచ్చే పాప .. ఈ రోజు ఆరైనా .. జాడే లేదు ! డ్రైవర్ కి ఎన్ని సార్లు ఫోన్ చేసినా..రిప్లై లేదు .. కాస్సేపటికి ఆ ఫోన్ కాస్తా స్విచాఫ్ వచ్చింది. మనసు ఎందుకో కీడు శంకిస్తోంది. రవికి ఫోన్ చేసాను, అదీ స్విచాఫ్ వస్తోంది...స్టాగ్ పార్టీ లో వాళ్ళ ఫ్రెండ్సందరూ స్విచాఫ్ చేసుకోవడం మామూలే ! ఇప్పుడెలా ? స్కూల్ కి ఫోన్ చేసాను .. 'పిల్లల్ని ఎప్పట్లా ..మూడున్నరకే వదిలారు, మీ డ్రైవర్ వచ్చి తీసుకెళ్లాడు' చెప్పాడు వాచ్ మాన్. ఇక లాభం లేదని .. పాపకి బ్యాండ ట్రాకింగ్ , బ్యాగ్ ట్రాకింగ్ గుర్తొచ్చి వాటినీ వెరిఫై చేసాను. బ్యాండ ఒక చోట , బ్యాగ్ ఒక చోట స్విచాఫ్ అయ్యాయి .. కారు జీపీఎస్ తో అనుసంధానమై వుంటుందని గుర్తొచ్చి , ఆ దిశగా చెక్ చేసాను. కారు మేడ్చల్ పరిసర ప్రాంతంలో ఔటర్ రింగ్ దగ్గర ఎక్కడో ఆగిపోయినట్టుగా ... తెలిసిపోయింది !

వెంటనే పోలీస్ వాళ్లకి ఫోన్ చేసాను...ఎంగేజ్ వస్తోంది ! ఇంట్లో ఇంకో కారు వుంది

! నాకు డ్రైవింగ్ వచ్చినా – చేతుల్లో చేవ లేక, కాళ్ళల్లో శక్తి లేక కారు బయటికి తీయలేని నా అశక్తత గుర్తొచ్చి, నాకు తెలిసిన ఫ్రెండ్సందరికీ ఫోన్ చేస్తూ ..కాలు గాలిన పిల్లిలా అటూ ఇటూ తిరగడం మొదలెట్టాను. ఫ్రెండ్స్ కూడా ఒక్కరొక్కరే రావడం మొదలైంది. ఇంతలో ఆయా లోపలికి వచ్చి –

' అమ్మా ! మీరు చెప్పినట్టు .. ఆ పూల మొక్కలు పెట్టినవాళ్లకి సకినాలూ , లడ్డూలూ ..టీ ఇచ్చాను.. వాళ్ళు మీతో మాట్లాడి వెళ్ళిపోతామంటున్నారు ' ' ఇప్పుడా ?' నా మనసంతా ఆందోళనగా వుంది ! ఎవరితోనూ మాట్లాడే స్థితిలో లేను .. అదే విషయం చెప్పాను... ఆయా బయటికి వెళ్లి – మరుక్షణం గోడకొట్టిన బంతిలా తిరిగి వచ్చింది ! ఆయాతో పాటు పొద్దుట్నుండీ మొక్కలు పెట్టిన ఆరుగురు అమ్మాయిలూ లోపలికి తోసుకొచ్చారు. వాళ్లంతా ...వేళ కాని వేళ .. ఎనిమిది గంటల రాత్రి .. అందులోనూ .. ఆందోళనగా వున్న సమయంలో లోపలికి చొచ్చుకు వచ్చినందుకూ , ఆయా వాళ్లకి అడ్డుపడనందుకూ ఆమె వంక ఒకింత చిరాగ్గా , అసహనంగా , కోపంగా చూసాను. నా చూపులు చూసి .. భయపడిపోయిందో .. మరే కారణమో ...ఓ మూలన బిత్తర చూపులు చూస్తూ నించుంది ఆయా. నా అసహనం గమనించిందేమో –

' మేడమ్ ! అయాం సంగీత ! వుయ్ నో యూ ఆర్ వర్రీడ అబౌట్ యువర్ డాటర్స్ సేఫ్టీ నౌ ! ' చొరవగా తనని తాను పరిచయం చేసుకుంది ఆ వచ్చిన వాళ్ళలోంచి ఓ అమ్మాయి. ఒక కూలీ అమ్మాయి ఇంగ్లీష్ మాట్లాడ్డం చూసి ఒకింత ఆశ్చర్యం, ఆమె నోటెమ్మట నా కూతురి ప్రస్తావన రావడం కొండంత ఆనందం, మరు క్షణం అంతకు మించిన ఆందోళనా నాలో ముప్పిరిగొన్నాయి.

' మేడమ్ ! నా పేరు రజని. ఈ సంగీతా నేనూ చైతన్యా ఇంజనీరింగ్ కాలేజీలో క్లాస్మేట్స్ !' అంది మిగితా ఐదుగురిలో మరో అమ్మాయి. 'ఏంటీ , మీరు స్టూడెంట్సా? పొద్దుటినుండీ మా ఇంటి ముందున్న డివైడర్స్ లో మొక్కలు పెడుతోన్న కూలీలు కదా ...మీరు ?' నాలోని అనుమానం ..ప్రశ్నల రూపంలో బయటికి తన్నుకు వచ్చింది !

'వీళ్ళు నిజంగానే కాలేజీ అమ్మాయిలు అమ్మా ! వారానికో రోజు హరిత హారంలో భాగంగా –మాలాంటి వాళ్ళతో కలిసి , ఎలాంటి ఫోటో ప్రదర్శనల్లేకుండా సింపుల్ గా మొక్కలు పెట్టడం వీళ్లకి సరదా ! ఈవారం వాళ్ళు మీ కాలనీని సెలెక్ట్ చేసుకున్నారు ! ఈ రోజు మొక్కలు పెట్టిన మా ఆరుగురిలో వీళ్ళిద్దరే కాలేజీ అమ్మాయిలు , మిగితా నలుగురం కూలీలం ! ' చెప్పింది కూలీల్లోని ఇంకో అమ్మాయి.

నా ప్రాణానికి ప్రాణం నా పాప గురించి నేను వర్రీ అవుతూంటే ... మధ్య ఈ కాలేజీ పిల్లలేమిటో , వీళ్ళ కథేమిటో.. అయోమయంగా వుంది.. ఇంతకీ ఇక్కడ ఏం జరుగుతోంది ? అసలు వీళ్ళు ఏం చెప్పాలని లోపలికి వచ్చారు .. నాకంతా అగమ్య గోచరంగా , అంతకు మించి అసహనంగా వుంది. 'మేడమ్ ! మీ పాప ఇంకా రాలేదని

కదా మీరు బాధ పడుతున్నారు ! ఆ విషయం చెపుదామనే వచ్చాం !' అంది సంగీత . ఇంతలో – 'ఇదిగో మీ పాప ! ఈ రాత్రి మీ పాప మీ ఇంటికి క్షేమంగా చేరేలా ఈ కాలేజీ అమ్మాయిలు పూనుకోకపోతే .. మీ పాప మీకు ప్రాణాలతో దక్కేది కాదు !' అంటూ బిలబిలమంటూ లోపలికి అడుగెట్టారు పోలీసులు..

' మమ్మీ !' అంటూ ఒక్కుదుటున పరిగెత్తుకొచ్చి వెక్కి వెక్కి ఏడుస్తూ నన్ను వాటేసుకుంది పాప. పాపని గట్టిగా గుండెలకు హత్తుకుని, ఎడాపెడా ముద్దుల వర్షం కురిపించాను.. నా కళ్ళనుండి ధారాపాతంగా కన్నీళ్లు కురుస్తూనే వున్నాయి .. ప్రపంచం ఏమైపోనీ .... నేనేమీ వినదలచుకోలేదు.. నా పాప నాకు దక్కింది , అది చాలు !

'జల్సాల కోసం దొంగతనాలు చేస్తూ ...మూడేళ్ళ కింద కాలేజీ నుండి డిబార్ అయ్యాడు మీ డ్రైవర్. అతడి బ్యాక్గ్రౌండ తెలీని మీ ఆయన ...అతడ్ని పనిలో పెట్టుకున్నారు.. అతడి నక్క వినయాలు తెలీక అతడ్ని పూర్తిగా నమ్మారు మీరు . పెళ్ళిళ్ళకీ , ఫంక్షన్స్ కీ ఎక్కడికి వెళ్లినా – మీ పర్స్ ని మొయ్యలేక ..దాన్ని కార్లోనే వదిలి వెళ్లేవారు మీరు .. పైగా ఆ పర్సుని కొన్ని సార్లు అతడి చేతికే ఇచ్చేవారు. అందులోంచి డబ్బు కొట్టేస్తూ – తన సరదాలు తీర్చుకునేవాడు అతడు ...' అంటూ ఒక నిముషం ఆగాడు సబ్ ఇన్స్పెక్టర్.

మరు నిముషం నా వంక చూస్తూ– 'మరో విషయం అమ్మా ! మీరెప్పుడూ మీ పర్స్ లో ఎంత డబ్బు వుందో కూడా చూసుకునే వారు కాదు కాబట్టి .. చాలా రోజులుగా అతడికి ఆడింది ఆటగా , పాడింది పాటగా గడిచిపోయింది...ఈ మధ్య మీ అనారోగ్యం మూలంగా మీరు ఎటూ వెళ్లలేకపోవడంతో .. మీ పర్స్ లోంచి డబ్బు కొట్టే అవకాశం దొరక్క .. తన అవసరాలు తీరే దారీ లేక .. మీ అమ్మాయిని కిడ్నాప్ చేసి , డబ్బులు డిమాండ చేయాలన్న ఆలోచనతో ఛాన్స్ కోసం ఎదురు చూసాడు – ఆ అవకాశం మీ వారి ' స్టాగ్ పార్టీ ' రూపంలో తనకు దొరికిందనీ మా ఇంటరాగేషన్ లో అంగీకరించాడు మీ డ్రైవర్! ' విడమరిచి చెప్పాడు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ .

' అవును మేడం ! ఈ రోజు తను ఇంట్లో వుండననీ , ఎప్పుడో అర్ధరాత్రి దాకా రాననీ , అందాకా మీకు కాపలాగా తననే వుండమని మీ భర్త అతడికి చెప్పడంతో .. తను ఎన్నాళ్ళుగానో ఎదురు చూస్తోన్న ఛాన్స్ దొరికిందని ఉబ్బితబ్బిబ్బయ్యాడు మీ డ్రైవర్ .. ఆ సంతోషంలో తన స్నేహితుడితో కలిసి – తనతో సహా మీ పాపని మరెవరో కిడ్నాప్ చేసినట్టుగా ఏమేం చేయాలో , ట్రాకింగ్ ద్వారా ఆ పాప ఆచూకీ తెలిసే అంశాలు ఏమేమి వున్నాయో , వాటిని ఎక్కడెక్కడ ఎలా ధ్వంసం చేయాలో , చివరకు కారుని ఎక్కడ వదిలిపెట్టాలో , ఒకవేళ తమ ప్లాన్ బెడిసికొడితే .. తమ గుట్టు రట్టయితే ... ఆ పాపని ఎలా చంపేయాలో ...అన్నీ డీటైల్డ్ గా ... తన స్నేహితుడితో ... రోడ్డు పక్కన చెట్ల కిందున్న ఫుట్ పాత్ మీద నించుని డిస్కస్ చేసాడు మీ డ్రైవర్.. ' చెప్పింది రజని.

' అంతకన్నా ఓ అయిదు నిముషాల ముందు ... మా చెట్లు నాటే కార్యక్రమాన్ని రికార్డ్ చేయడానికోసం .. అతడు నించున్న ఫుట్ పాత్ పక్కనున్న చెట్టు కొమ్మ మీద మా సెల్ఫోన్ ని ఆటో మోడ్ లో పెట్టుకున్నాం ! లంచ్ టైమ్ లో వెళ్లి మా మొబైల్ చూస్తే ... అందులో మా చెట్లు నాటే కార్యక్రమంతో పాటు మీ డ్రైవర్ సంభాషణ కూడా రికార్డ్ అవడం కన్పించి విస్తుపోయాం . దాన్ని వెంటనే మేము పోలీసులకు ఫార్వర్డ్ చేయడంతో .. వాళ్ళు మీ పాప ఆచూకీని సకాలంలో తెలుసుకోగలిగారు !'చెప్పింది సంగీత.

' అదొక్కటే కాదు – కాలేజీ అమ్మాయిలు చెప్పిన విషయాన్ని వెంటనే తమ భర్తలకు చేరవేసి ... వాళ్ళ భర్తలు కూడా ఓ క్యాబ్ బుక్ చేసుకుని మీ డ్రైవర్ని ఫాలో అయ్యేలా ఈ నలుగురు కూలీ అమ్మాయిలు కూడా పూనుకోకపోతే ఈ కేసుని మేము ఇంత తొందరగా – అదీ కేవలం మూడున్నర గంటల వ్యవధిలో చేధించగలిగే వాళ్ళం కాదు ! క్రెడిట్ గోస్ టు దెమ్ ఆల్సో !' కూలీ అమ్మాయిల వంక ప్రశంసాపూర్వకంగా చూస్తూ చెప్పాడు సబ్ ఇన్స్పెక్టర్

' అతడు చాలా తెలివైన నేరస్తుడు సర్ .. అయితే ఎంత తెలివైన నేరస్తుడైనా ... ఒక చిన్న తెలివి తక్కువ పని ద్వారా పట్టుబడిపోతాడని తరచూ మీ పోలీసులు చెప్పే మాట నిజమైంది ! ' అంది రజని.

' మీ వారు పెద్ద బిజినెస్ టైకూన్. ఆయనకి ఎంతకీ మిమ్మల్ని అపురూపంగా చూసుకోవాలన్న తపనే తప్ప – మీ చుట్టూ ఎన్ని విష నాగులు తిరుగుతున్నాయో పట్టించుకోలేని బిజీ మనిషి ! ఇదిగో మీ ఆయా కూడా మరో విషప్పురుగు ..ఆమెతో కలిసి మరెన్నో పన్నాగాలు పన్నాడు మీ డ్రైవర్. మీ అదృష్టవశాత్తూ అతడి మొదటి పన్నాగం ఇలా బెడిసికొట్టింది ! డ్రైవర్లనీ , పని మనుషుల్నీ కొత్తగా పనిలోకి తీసుకునే ముందు ఆధార్ కార్డు అడగడం , వాళ్ళ నడత గురించి ఊరి పెద్దల్ని అడిగి తెలుసుకోవడం చాలా అవసరం ' చెప్తున్నాడు సబ్ ఇన్స్పెక్టర్ ఆయాని అదుపులోకి తీసుకుంటూ.

నా తల తిరిగి పోతోంది ...కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి ! ఆ తర్వాత నాకు ఎప్పుడు స్పృహ వచ్చిందో తెలీదు గానీ .. కళ్ళు తెరిచేసరికి .. నేనేదో హాస్పిటల్లో వున్నట్టుగా అర్థమైంది . నా మంచం చుట్టూ చేరి నా వంకే ఆదుర్దాగా చూస్తోన్న రవీ , పాప ,నలుగురు కూలీ అమ్మాయిలు , ఇద్దరు కాలేజీ అమ్మాయిలు కన్పించారు. ముందుగా ఆ నలుగురు కూలీ అమ్మాయిలను దగ్గరకు రమ్మంటూ సైగ చేసి – ' అమ్మాయిలంటే మీలా ధైర్యంగా , చురుగ్గా , అలర్ట్ గా వుండాలి ! అప్పుడు – మీరే కాదు , దేశంలోని ఆడపిల్లలందరూ క్షేమంగా , నిర్భయంగా వుంటారు ! ఇప్పుడు కావాల్సింది ... నాలా చేవలేని మనుషులు కాదమ్మా... నవ్వుతూ తుళ్ళుతూ తమ చెమట చుక్కల్ని ధారపోస్తూ ... ఎంత పని చేస్తున్నా .. ఎంతకీ వాడిపోని 'బోగన్విలియా ' మొక్కల్లాంటి మీ శ్రమజీవులు ! మీ

రుణం ఎప్పటికీ తీర్చుకోలేను !' అంటూ రెండు చేతులూ జోడించాను.

రవి కళ్ళు తడిసాయి! ' మీరన్నది అక్షరాలా నిజం మేడమ్ ! తమ కొమ్మల్నో , రెమ్మల్నో చిదిమివేయాలని చూసే వ్యక్తులని ... వాళ్ళ ఒళ్ళంతా రాష్ వచ్చేలా చేసి, కసి తీర్చుకుంటాయి ఆ బోగన్విలియా మొక్కలు ! ' అంది రజని. ' మీరేం తక్కువ తల్లీ ? కాళ్లతో అదిమి తొక్కినా– చివ్వున పైకి లేచి , నిటారుగా నించునే మెత్తని లాన్ లాంటి వాళ్ళు మీ కాలేజీ అమ్మాయిలు ! మీలాంటి వాళ్ళుంటే ... ఎవరూ కిడ్నాపులకీ , యాసిడ్ దాడులకీ , రేప్ లకీ , కత్తిపోట్లకీ గురికారు! అసలు మీలాంటి వాళ్లకి ఇవ్వాలి .. దేశంలోని అత్యున్నత పురస్కారాలు ! ' అంటూ ఆ కాలేజీ అమ్మాయిల చేతుల్ని నా చేతుల్లోకి తీసుకుని ముద్దెట్టుకున్నాను ! పాప కళ్ళు మెరిసాయి !

# జి. అమృతలత

జి. అమృతలత స్వస్థలం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్. ఎంఏ, ఎంఈడీ, పీహెచ్‌డీ చేశారు. హైదరాబాద్‌లోని 'మౌరి టెక్' సాఫ్ట్‌వేర్ సంస్థకు బిజినెస్ డెవలప్‌మెంట్ అడ్వయిజర్‌గా పనిచేస్తున్నారు. స్వాతి వార పత్రిక 1971లో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల కోసం నిర్వహించిన కథల పోటీలో వీరు రాసిన 'మనసు ఎదగని మనుషులు' కథానిక.. ఉత్తమకథగా ఎంపికైంది. అదే ఏడాది ఎమెస్కో సాహితీ సంస్థ నిర్వహించిన కథల పోటీలో.. 'కన్నీళ్లతో కాలక్షేపం' కథకు ప్రథమ బహుమతి లభించింది. 'సృజన' మాసపత్రిక 1970లో నిర్వహించిన కవితల పోటీలో.. 'కూలి' కవిత ఉత్తమ కవితగా ఎంపికైంది. నిజామాబాద్ నుంచి వెలువడిన 'అమృతకిరణ్' పక్షపత్రికకు రెండేళ్లపాటు ఎడిటర్‌గా పనిచేశారు. తెలంగాణ ఉద్యమకాలంలో 'గాయాలే.. గేయాలై' కవితా సంకలనం, 'వెతలే.. కథలై' కథా సంకలనం వెలువరించారు. అమృత వర్షిణి, సృష్టిలో తీయనిది, స్పందన, చుక్కలలోకం చుట్టొద్దాం!, గోడలకే ప్రాణముంటే, ఓటెందుకు? సంపుటాలు ప్రచురితమయ్యాయి. వివిధ సంస్థలు, సొసైటీల నుంచి పలు అవార్డులు, సన్మానాలు అందుకున్నారు.

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 350

# స్వాతంత్ర్యం



**చింతకింది శివశంకర్**
**9912324492**

ఆగస్టు 15, 1947. నిన్న అర్ధరాత్రి అఖండ భారత దేశాన్ని రెండు సర్వసత్తాక దేశాలుగా విభజించి స్వాతంత్రాన్ని ప్రకటించింది బ్రిటిష్ ప్రభుత్వం. భారతదేశంలోని నాయకులు, ప్రజలు జెండాను ఎగరేసి సంబరాలు చేసుకుంటున్నారు. అంటూ సాగుతున్న వార్తలకు మధ్యలో అంతరాయం కలిగిస్తూ..

ఏంటి భారతదేశానికి అప్పుడే స్వాతంత్ర్యం వచ్చిందా..! వచ్చే సంవత్సరం ఇస్తానన్నారుగా, ముందే ఇచ్చేశారేంటి అంటూ అనుమానంగా అడిగాడు మైపాల్ రెడ్డి. తండ్రి మాటలు విని రేడియో సౌండ తగ్గించింది మైపాల్ రెడ్డి కూతురు.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత విన్స్టన్ చర్చిల్ ఓడిపోయాడు నాన్న, ఇప్పుడు బ్రిటన్లో కొత్త ప్రభుత్వం లేబర్ పార్టీ అని ఏర్పడింది. అందుకే

పోయిన యేడాదే మనకు ఎన్నికలు పెట్టింది ఈ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత భారతీయుల ఒత్తిడి బాగా ఎక్కువైంది. అందుకే ఇచ్చే స్వాతంత్రమేదో ముందు ఇచ్చేసి వెళ్ళిపోతున్నారు అంటూ జరిగిన, జరుగుతున్న రాజకీయాల్నివివరించింది. మైపాల్ రెడ్డికి భారతదేశంలోని రాజకీయాలే అంతంత మాత్రమే తెలుసు, బయటి దేశాలవంటే అసలే తెల్వవు. వెళ్తే వెళ్లారుగాని, దేశాన్ని రెండు ముక్కలు చేసి వెళ్ళాలా..!? తప్పదు నాన్న.. స్వాతంత్రం కావాలంటే రెండుగా విడదీయాలి అయినా రెండు మతాలుగా కలిసుండటం కంటే రెండు దేశాలుగా విడిపోవడం మంచిది అని ఎవరు చెప్పారు. అంబేద్కర్ లాంటి కొంతమంది మేధావులు మద్దతిచ్చారు.

ఈయనొకడు పానకంలో పుడకలాగా అందరూ ఒకటంటే ఈన ఇంకోటంటాడు. అందుకే ఈ గతిలేనొళ్లను చదువుకోవద్దని దూరం పెట్టింది చదువుకుంటే ఇగో ఇలా అన్నింట్లో వేలుపెడతారు అంటూ అక్కడే ఇల్లు తూడుస్తున్నదేవమ్మ వైపు చూశాడు. ఇంతలో కూతురు ఏదో చెప్పబోయింది..అంతలోనే, ఏందే అట్లా సుస్తుండవు. ఇల్లు సక్కగా తూడువు అన్నాడు.

ఇల్లు తూడుస్తూ భయంభయంగా బయటకు వచ్చింది. బకీటల నీళ్లు పారబోసి ఇంటికి బయల్దేరింది. నిజానికి దేవమ్మ ఇల్లు తూడుస్తూనే, ఆ తండ్రి కూతుర్లు మాట్లాడుకునే మాటలన్నివిన్నది. పటేల్ సెప్తే ఊరంతా ఇంటది అట్టాంటి పటేలు కూతురు మాట ఇంటాండు.ఎంతైనా చదువుకున్న పిల్ల అని ఆలోచిస్తూ ఇంటికి చేరుకుంది. ఇంట్లో నుండి ఉమ్మేస్తే వాకిట్లో పడ్డట్టు, వాకిట్లో నుండి ఉమ్మేస్తే వీధి అవతల పడ్డట్టు, ఊరు నుండి ఉమ్మేస్తే ఊరి అవతల పడ్డట్టు ఉంది ఆ గుడిసె.

ఆ గుడిసెలో ఆరేండ్ల పిలగాడు, వాడు భూమ్మీద పడగానే మొగుడు పోయిండు అప్పటి నుండి నానా కష్టంచేసి పెంచుతుంది కొడుకుని. పొద్దుగాల లేసి ఇంత అంబలి కాసి, పటేల్ ఇంటికి పోతది ఆ ఇంట్లో ఉన్న పనంతా చేసి మల్ల ఇంటికొచ్చి తిని కూలిపనికి పోయి,పొద్దుగుకినాక వస్తది. బుక్కెడు వండుకొనితిని పిల్లగానికి కథలు సెప్పుకుంట పండుకుంటది.

ఇంటికొచ్చిన దేవమ్మని సుసిండు కొడుకు. అమ్మ ఇయ్యాల అంబలి కొంచెమే కాసినవ్.ఏం లేదు బిడ్డ శాననే కాసిన కానీ పొద్దుగాల ఒకాయనొస్తే కొంచెం పోసిన. ఎవరమ్మా ఆయినా. ఏమో ఎవరు పొద్దుపొద్దుగాల శాతకాక మన ఇంటి ముందు కూసుంటే ఇంత పోసిన. అమ్మా మనకు తక్కువ అయితది కదనే. ఏం కాదు, నువ్వు మధ్యానం అంబలి తాగు నేను వొట్టిరొట్టె తీసుకుపోతా. అమ్మ రాతిరికేం తొక్కే. చింత చిగురు చేస్తాలే. అమ్మ నాకు కోడిగుడ్డు... కోడిగుడ్డు.. అంటూ ఎగిరాడు. సరే ఇయ్యాల కోడివెట్టె గుడ్డు నీకే.., నీవుమాత్రం యాడికిపోకుండా ఈనే ఆడుకో నేను అప్పటికొస్తా. అమ్మ అమ్మ శెల్కలకు నేను వస్తానే.

వొద్దుబిడ్డా అది శానదూరం నువ్వు నా ఎంబడి వస్తే, కోన్నిపట్టుకొని గంపకింద ఎవరు పెడ్తారు. మాపటికి గుడ్డు కావాల్నా.. వద్దా..!? కావాలి... కావాలి...ఐతే ఈనే ఉండు..,

సరేనా... అంటూ దేవమ్మ సద్ది కట్టుకొనిపోయింది.

పటేలు శెల్కల పత్తి ఏరనికేపోయింది. దేవమ్మతో పాటు శానమంది వొస్తరు. వాళ్లకి పది సాల్లా అవ్తల పత్తి ఏరుతుంది. తెచ్చుకున్న సద్దికూడా ఒక్కదానిదే దూరంగా ఉంటది. ఏం అవసరం వచ్చినా... ఏ ఆపద వచ్చినా.. ఆ దిక్కుకు పోవ్వొద్దు. పని శెసేటప్పుడు పాటలు పాడుకుంటూ పనిచేస్తరు. దేవమ్మకు వాళ్లు పాడే పాటలన్ని వచ్చు అయినా పాడకూడదు.

ఎండ నెత్తిమీదికొచ్చింది అందరూ తిననీకే కుసున్నరు. దేవమ్మ కూడవెల్లి తెచ్చుకున్న సద్దిప్పి వొట్టిరొట్టెను ఇరిసి నీల్లల్ల నానవెట్టింది. దానికి తోడు కాస్త మెర్పొడి తీసుకొచ్చింది. రొట్టింకా నానలేదు. అందుకే నీల్లల్లకి వొత్తుకుంటా గాలికి అక్కడిక్కడ చూసింది. దూరంగా ఎవరో వొస్తున్నట్టు అనిపిచ్చింది. చేతిలో కట్టెను చూసి కావలాయన అని గుర్తుపట్టింది. రొట్టె కాస్త నానింది, ఓ రొట్టెతుంకను మెర్పొడిల అద్దుకొని నోట్లేసుకుంది. ఇంతలో కావలాయన

దేవమ్మ.. ఓ దేవమ్మ.. అని పిలిచిండు. ఇదేంది కావలాయినా నాకోసం వొచ్చిండు. అనుకొని పలికింది. నిన్ను పటేల్ రమ్మంటుండు. అదేంది ఎండపొద్దున రమ్మంటుండు అనుకొని సరే వొస్తున్నా అంటూ తెచ్చుకున్న సద్ది మూటకట్టుకుంది. పటేల్ ఇంటికాడ పోలీస్ జీప్ ఆగివుంది. దేవమ్మ ఇంటి ముందుకు వొచ్చిందో..లేదో.. దూరం నుంచి సూసిన పటేల్ కోపంగా దేవమ్మ మీదికి వొస్తూ..

నీయమ్మ నాఇంట్ల పనిజేసుకుంట నన్నే సంపనికే సుస్తావా అంటూ చెంప మీద కొట్టిండు. దేవమ్మ పరిశానైంది. వెనక నుండి పోలీస్ వొచ్చి..పటేల్ సాబ్ ఇవన్నీ మేం సూసుకుంటం అంటూ దేవమ్మతోనికి పోయి ఆ చంప ఈ చెంప సర్సిండు. నిజంజెప్పు, పటేల్ను సంపనికే ఎప్పట్నించి సూస్తున్నరు..!? ఎంతమంది వచ్చింద్రు... ఎవరెవరు వచ్చింద్రు..!? దేవమ్మకి ఏం అర్థంకాలే..భయమైతుంది...ఏం జేయ్యాల్నో ఏం తోస్తలేదు.నాకేం తెల్వదు సారూ.. నేనెందుకు పటేల్ని సంపాలనుకుంటా.. అంటూ ఏడుస్తుంది. పోలీసు దేవమ్మ జెడవట్టుకొని అసలు నీకు అన్నలకు సంమ్మందమేంది.. ఎప్పటి నుండి పని చేస్తున్నావ్ వాళ్లకు.. అన్నాడు దేవమ్మకి భయం ఎక్కువైంది. నాకేం తెలుసు సారూ.. అన్నలు ఎవరో కూడా నాకు తెల్వదు. నన్ను నమ్మండి సారూ.. అంటూ ఏడుస్తూనే ఉంది.

ఏం తెల్వదానే., దొంగ ముండా.. అంటూ పటేల్ పండ్లు కొరుకుతూ మీదికి వచ్చిండు.

పటేల్ సాబ్, నేను చూసుకుంటా అని శెప్పిన కదా మీ చేతికి ఎందుకు మైలంటుకుంటది అనుకుంటు దేవమ్మతోనికి పోయి.. ఇయ్యాల పొద్దుగాల మీ ఇంటికి అన్నలు వచ్చింద్రా.. లేదా.. అన్నాడు. లేదు.. అన్నట్టుగా తలూపింది దేవమ్మ.పోలీస్ కండ్లల్ల క్రూరత్వం మొదలైంది. ఇయ్యాల పొద్దుగాల మీ ఇంటికి ఒకడు వచ్చిండు.. ఆనికి నీవు అంబలి పోసి పంపినవ్.., అవునా... కాదా..? అవును అన్నట్టు ఏడుసుకుంటనే తల ఊపింది. ఆయినా అన్నలని నాకు తెల్వదు, నీరసంగా కనిపిస్తే అంబలి పోసి ఇచ్చిన, అంతకుమించి నాకేం తెల్వదు సారూ.

నీరసంగా ఉంటే అంబలి పోసి ఇస్తావా.., నా పెండ్లం లేక మూడు రోజులైతుంది, నాకూ... ఒంట్లో నీరసంగా ఉంది.. అంటూ దేవమ్మకు మరింత దగ్గరికెళ్ళి శెప్పాడు. దేవమ్మ గుండె శెరువైంది. పటేలా దీని గుడిసె సోదా శెయ్యాలే.. అన్నాడు పటేల్ను సూస్తూ. సరే అన్నట్టు తలూపాడు పటేల్. దేవమ్మని కొట్టుకుంట గుడిసెకాడికి తీసుకొచ్చిండు. గుడిసె మూసుకొని ఉంది. పిలగాడు లేడు. దేవమ్మ అక్కడేం జరిగిందో మొత్తం పూసగుచ్చినట్టు శెప్పి.. శేసి సూపించింది. అయినా పోలీసు విన్లేదు, జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్ళి గుడిసె తలుపును తన్ని దేవమ్మని లోపలికి తోసిండు. గుడిసెలోంచి కోడిపెట్ట ఎగిరి బయటికొచ్చింది. ఆ కోడిపెట్ట కాలిగోరు పోలీసుచేతికి గీసుకపోయింది, అక్కడే ఉన్న సిపాయిలకు దాన్ని పట్టుకరమ్మని శెప్పిండు. అప్పటికే దేవమ్మ కొడుకొచ్చి వాకిట్ల నిలవడిండు. పోలీసు పిలగాన్ని సూసుకుంట తలుపేసిండు.

కొంచేపైనాక తలుపు తీసుకొని సొక్కా భుజానికి ఏసుకుని బయటికొచ్చిండు, ఎదురుగా ఇద్దరు సిపాయిలు కోడిపెట్టని పట్టుకొని నిలవడ్డారు, ఆ పక్కనే పిలగాడు నిలవడిండు.

వెళ్దాం పద అన్నట్టుగా సైగ శేసిండు పోలీస్, పోతూపోతూ పిల్లాడి తల నిమిరిపోయిండు.

కొంచేపటికి పిలగాడు గుడిసెలోనికి పోయిండు. దేవమ్మ ముద్దగా కూసొనుంది. ఎడంచేతికాడ కొంచెం రైక సినిగింది. శీర శానతౌవల్ల సినిగిపోయింది. పైయంత నొప్పులతో పులిసిపోయింది.

పిలగాడు అమ్మా.. అంటూ దేవమ్మ దగ్గరికిపోయిండు. దేవమ్మ ఏంమాట్లాడకుండా లేసి తానానికి వెళ్ళింది. పిలగానికి ఏమీ అర్థం కాక బయిటోచ్చి కూసున్నడు. దేవమ్మ తానం చేసి, లోపలికెళ్ళి ఇంగో శీర కట్టుకొని వచ్చింది. ఎండవెట్టిన చింతచిగురు తీసి పొయ్యిమీద యేసింది. లోపలికెళ్ళి గుడ్డు తీసుకొచ్చి ఉడుకవెట్టింది. వంట చేసి తిననికే కూసున్నరు. పిలగాడు దేవమ్మని సూస్తూనే ఉన్నడు, కానీ ఏమీ మాట్లాడలేదు.. మాటలు లేకుండానే తిన్నారు. గుడిసె బయట సాపేసి ఇద్దరు పడుకున్నారు. దేవమ్మ ఆకాశంలోకి సూస్తుంది. అమ్మా అంటూ పిలిసిండు.. దేవమ్మ ఆకాశంలోకి సుస్తూనే పలికింది. వాళ్ళు నిన్నెందుకు లోపలికి గుంజుకపోయింఁడు.. లోపల నిన్ను కొట్టింఁడా.. అని తల్లిని చూస్తూ అడిగిండు.

ఆకాశం యిరిగి యీపు మీదపడ్డట్టనిపించింది దేవమ్మకి, ఆరేండ్ల పిల్లాడికి అది తన సొంత కొడుక్కి ఆమె శేయని తప్పుకి శేసిన సాయానికి ప్రతిఫలంగా అనుభవించిన మానభంగం గురించి ఏమని శెప్తుంది. ఆమె రెండు దవడలు బిగుసుకుపోయి ఆ పంటికింద బాధని ఎంత నమిలినా నలగట్లేదు, కండ్లలోని సుడిగుండాల్ని, ముక్కుపుటలదిరే శ్వాసల్ని, శ్వాసలోని ఆయాసాన్ని పిడికిళ్ళు బిగపట్టి...

అవును.. కొట్టారు.. అంటూ ఇంట్లకుపోయి, కండ్లు తుడుసుకొని సినిగిన శీర జాకెట్టు తీసుకొచ్చి కుడుతుంది. రేపటి నుంచి మనల్ని ఎవరు కొట్టరమ్మా.. అంటూ ఒళ్లో పడుకున్నాడు పిలగాడు.

యే యెందుకు అని అంటూ పిల్లాడిదిక్కు తిరిగింది దేవమ్మ. మనకు సొతంత్రం వొచ్చిందంట అన్నాడు సిన్న నవ్వు మోకంతో. నీకెవరు చెప్పింద్రు అని అడిగింది దేవమ్మ. ఎక్కువొళ్ల పిల్లలు అంటుంటే విన్నా.. సొతంత్రం వస్తే ఎవరిని కొట్టరంటమ్మా.. నిజమే, కానీ సొతంత్రం మనకు రాలేదు. మరీ..!? భారతీయులకు వొచ్చింది. మరి మనమెవరం..? మనం హైద్రాబాదొల్లం.. మనది నిజాం రాజేం.. మల్ల మనకెప్పుడొస్తది.. మనమీద పోలీసోడుండు.. వానీమీద పటేలుండు... పటేల్ మీద దొరుండు... దొర పైన నిజామోడుండు ఇంతమందిని దాటుకొని మనకేడొస్తది బిడ్డ సొతంత్రం.. అయితే మనం భారతదేశం పోదాం.. పోవాలే సదువు యేడ దొరికితే ఆడికె పోవాలే, నిన్ను సదివిస్త.. ఈలోకం సదివినోని మాటనే ఇంటది. మన ఊర్ని యేలే పటేల్, సదువుకున్న ఆయిన బిడ్డ మాట వింటుండు.. రేపు నీవు సదువుతే నీమాట అందరూ ఇంటరు.

మౌనంగా గెలవాలి.. గెలిచినాక ప్రపంచమంతా ఇనిపించేటట్లు అరవాలి... అదే నిజమైన గెలుపు. అని మనసులో అనుకుంది దేవమ్మ. శీర, రైక పక్కనపెట్టి పడుకొని ఆకాశంలోకి సూస్తూ సింతశేస్తుంది. అమ్మా భారతదేశం పోదామే అక్కడైయితే నిన్నెవరు కొట్టరు. సరేనన్నట్టుగా నవ్వుతూ తలూపింది. భారతదేశమైనా.. లోకంలో ఏదేశమైనా.. ఆడదాని బతుకులో ఏం తేడా ఉండదు, ఏం చేతకాని మగాడైనా.. వాడి అధికారం అంతా ఆడదానిపైనే, అయినా మిమ్మల్ని అని ఏం లాభం.. కులాన్నిబట్టి మానానికి, పాణానికి విలువివ్వాలని చెప్పినోన్ని పూజించే ఈ దేశంలో ఉంటే ఎంత.. పోతే ఎంత.. అనుకుంటూ కండ్లు మూసుకుంది.

**చింతకింది శివశంకర్**

**చింతకింది శివశంకర్ స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా, అంబట్ పల్లి గ్రామం. ఈయన ఇన్ఫోసిస్‌లో టెలికాం ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శివశంకర్ రాసిన మొదటి కథ "స్వాతంత్ర్యం". చరిత కామాక్షి అనే సినిమాకి రచయితగా కూడా పనిచేస్తున్నారు. అలాగే** https://www.youtube.com/c/MrStoryTeller **అనే** Yotube channel **ను పెట్టి పుస్తకాల గురించి చెపుతున్నారు. అంతేకాకుండా** Asura Telugu Podcost **పెట్టి 85 ఎపిసోడ్‌లు పూర్తిచేశారు.**

# వస్తు మారకం!



డాక్టర్ ఎమ్. సుగుణరావు
9704677930

చెట్లు మీద నుంచి కుహ కుహలు, కిల కిలా రావాలు చేసే రంగు రంగుల పక్షులు, పిట్టల మాదిరిగా వుంది న్యూ ఢిల్లీ రైల్వే స్టేషన్.

రకరకాల భాషలు, యాసలు, వేషధారణలతో ఉన్న ప్రయాణీకులతో భారతదేశం మొత్తం కనిపిస్తోంది. ట్రెయిన్ దిగాను. నేనిప్పుడు మెట్రో ఎక్కి ఢిల్లీ యూనివర్శిటీ నార్త్ కేంపస్కు చేరాలి. అక్కడ బియ్యే ఆఖరి సంవత్సరం చదువుతున్న మా అబ్బాయిని కలవాలి. నాకు ఢిల్లీ రావడం ఇది రెండో సారి. మూడేళ్ళ క్రితం మా వాడిని చేర్పించడానికి వచ్చాను. నాకు దారులు గుర్తుండవు. అది నా బలహీనత. అలా నేను మా అబ్బాయి హాస్టలు వుండే విశ్వవిద్యాలయ ప్రాంతం వెళ్ళాలంటే మెట్రో ఎక్కాలి. ఆలోచిస్తూనే ప్రక్క నున్న ప్రయాణికుడిని అడిగాను. అతను హిందీలో ఏదో చెప్పినా అర్థం కాలేదు. మా వాడికి ఏదో స్పెషల్ క్లాస్ వుందట, నన్నే వచ్చేయమన్నాడు. అందుకే ఈ ప్రయాసలు.

అంతవరకూ నన్ను పరిశీలనగా చూసిన ఒక పెద్దాయన, 'నేను అటువేపే వెళ్తున్నాను. మీ బేగ్

ఇవ్వండి' అన్నాడు హిందీలో.

అతనిని ఎక్కడో చూసినట్టుంది. అరవై సంవత్సరాలు పైగానే ఉంటాయి. జుట్టు బాగా తెల్లబడిరది. సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. బట్టలు ఇస్త్రీవి కాకపోయినా శుభ్రంగానే ఉన్నాయి. నా దగ్గర పెద్ద లగేజీ లేకపోయినా మా అబ్బాయి కోసం పెట్టిన పచ్చడి సీసాలు, తినుబండారాలు ఒకే బేగులో మా ఆవిడ సర్దింది. ఇంకో బేగులో నా బట్టలు, ఆఫీసు ఫైళ్ళు. సరే ఈయన సాయం వస్తున్నాడు కదా అని ఒక బేగు అందించాను. ఆయనను అనుసరించాను.

అతను రెండు ప్లాట్ఫారములు దాటి ఎలివేటర్ ఎక్కి, బైటకు నడిచాడు. అక్కడ ఆటో స్టాండు దగ్గరే న్యూ ఢల్లీ మెట్రో స్టేషన్. విశ్వవిద్యాలయానికి వెళ్ళాలి అన్నాను. తనే టిక్కెట్టు తీసుకొచ్చాడు. తనకు పాస్ ఉందట. ప్లాట్ఫారం మీదకు వెళ్ళాము. చాలా వేగంగా వచ్చేసింది ఎక్కవలసిన ట్రెయిన్.

గబగబా ఎక్కేసాము. రెండు స్టేషన్లు దాటిన తర్వాత అడిగాను. 'తరువాతే నా విశ్వవిద్యాలయం' అని. వెంటనే జేబు లోంచి ఒక కాగితం తీసి చూపించాడు. చావిడి బజార్, చాందినీ చౌక్, కాశ్మీర్ గేట్, సివిల్ లైన్స్, విధాన సభ... ఇవి దాటిన తర్వాత నేను దిగవలసిన విశ్వవిద్యాలయం స్టేషన్. 'థేంక్స్' అన్నాను. అరగంట ప్రయాణం తర్వాత నేను దిగవలసిన స్టేషన్ వచ్చేసింది. ప్లాట్ఫారం దాటి బయటికి వచ్చి ఈరిక్షా ఎక్కాము. పది నిమిషాల్లో మా వాడి హాస్టలుకు చేరుకున్నాము. నేను ఇద్దరి ఆటో చార్జీలు ఇవ్వబోతుంటే, 'మీది మీరు ఇవ్వండి' అంటూ తన సంచీ లోంచి రెండు ఏపిల్ పళ్ళు తీసి ఆ ఆటో అతనికి ఇచ్చాడు. వెళ్తున్న అతనిని అడిగాను. అయ్యా! మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుంది. ఎక్కడి వారు? అన్నాను. అతనికి వినబడలేదేమో సమాధానం చెప్పకుండా కదిలిపోయాడు. నేనే పొరపాటు పడ్డానేమో! ఈయన ఎవరో అనుకున్నాను. ఆటో అతను నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆయన చేష్టలకు నాకు ఆశ్చర్యం కలిగింది. ప్రపంచంలో ఎనిమిదో వింత. ఆటో చార్జీలకు బదులు పళ్ళు ఇవ్వడం, దానికి ఆటో అతను ఒప్పుకోవడం బూ ఆలోచిస్తూనే హాస్టల్లోకి అడుగు పెట్టాను. గేటు దగ్గర ఒక అబ్బాయి 'నమస్తే అంకుల్' అన్నాడు. తెల్లగా పొట్టిగా ఉన్నాడు. ఆకర్షణీయమైన ముఖం. 'హర్ష చెప్పాడు. తనకు క్లాస్ వుంది. రండి' అన్నాడు ఇంగ్లీషులో. అతడితో లోపలకు వెళ్ళాడు. 'నా పేరు 'లోపా'. మాది మణిపూర్' అంటూ పరిచయం చేసుకున్నాడు.

రూము చిన్నదిగా ఉంది. క్రింద పరుపు, ఒక ఐరన్ టేబుల్, దాని మీద పొందికగా సర్దిన పుస్తకాలు. 'విశ్రాంతి తీసుకోండి' అంటూ అతను గదిలోంచి బైటకు నడిచాడు. చొక్కా తీసి హేంగరుకు తగిలించి, వాష్ రూమ్కు వెళదామనుకునేసరికి జేబులోంచి ఒక కాగితం జారి పడిరది. అది అన్నయ్య రాసిన లెటర్. ఆ మూడు పేజీల ఉత్తరం సారాంశం బూ మా ఇద్దరికీ తండ్రి గారి నుంచి సంక్రమించిన ఆ పాత ఇంటిని వదిలేయమంటున్నాడు. అమ్మను,

నాన్నను నేనే చూసుకున్నాను, నీకు భారం లేకుండా. నీది గవర్నమెంటు ఉద్యోగం. మీ ఆవిడా బేంకు ఉద్యోగి. నేను ఈ పల్లెటూళ్ళో సింగిల్ టీచర్. నీ కొడుకు ఢల్లీలో, కూతురు అమెరికాలో చదువుతోంది. నాకు పిల్లలు సరిగ్గా సెటిల్ కాలేదు. ఇదీ అన్నయ్య వేదన.

ఆయనకు ఆ పల్లెటూళ్ళో ఖర్చులేం ఉంటాయి! పైగా వాళ్ళ ఆవిడ తరపున కొద్దో గొప్పో భూమి వుంది. మనకూ కూతురు వుంది. పెళ్ళి చేయాలి కదా! మన వాటా వదులుకోకండి. ఇదీ మా ఆవిడ వాదన. వాదనకు జోటెయ్యాలా, వేదనకు చోటివ్వాలా? తేల్చుకోలేకుండా ఉన్నాను.

ఆలోచనల్లో ఉండగానే మా అబ్బాయి వచ్చేసాడు. 'డాడీ...' అంటూ హుషారుగా నన్ను చుట్టేసాడు. వాడి వెనక ఇందాకటి లోపాతో పాటు అమ్మాయి. నా పేరు 'రాకా అధికారి' అంటూ పరిచయం చేసుకుంది. చక్కగా రెండు జడలు వేసుకుని, నుదుట మీద చిన్న బొట్టుతో, కాటన్ చీర వేసుకుని, చూడగానే బెంగాలీ అమ్మాయి అనిపించింది. పావుగంట కబుర్ల తర్వాత... అందరం భోజనం చేయడానికి దగ్గరలో ఉన్న సౌత్ ఇండియా రెస్టారెంట్కు బయలుదేరాము.

ఆ హోటల్లో కష్టమర్ల రద్దీ. భోజనం బావుంటుందని వేచి చూస్తూ కూర్చున్నాము.

'ఏమిటీ ఢల్లీలో వింతలు, విశేషాలు' అన్నాను. 'ఒక అంతర్జాతీయ వింత గురించి చెపుతాము కాదు చూపిస్తాము' అంటూ మా అబ్బాయి మా ముందుకు వచ్చి కేటరింగ్ వారి నుంచి కూరలు తీసుకువెళుతున్న వ్యక్తిని చూపించాడు. నేను ఆశ్చర్యపోయాను. ఉదయం నన్ను హాస్టలుకు దింపిన వ్యక్తి, ఆటో ఆబ్బాయికి ఆటో చార్జీలకు, ఏపిల్ పళ్ళు మారకం చేసిన వాడు...

'ఈయన నాకు తెలుసు. ఉదయం నాకు దారి చూపించింది ఈయనే. అయితే ఎక్కడో చూసిన ముఖం. ఔను. మా ఊళ్ళో ఒక హోటల్ యజమాని. ఈయనలా ఉంటాడు' అన్నాను. ఉదయం వచ్చిన అనుమానం ఇప్పుడు మరింత బలపడిరది.

'ఆయనేనేమో!' అన్నాడు మా అబ్బాయి. లేదు... ఆయన చనిపోయాడు. వంద శాతం కరెక్ట్. మనిషిని పోలిన మనుషులు ఏడుగురు ఉంటారు ఇంతకీ ఈ పెద్దాయన ఢల్లీలో ఏం చేస్తున్నాడు?' అన్నాను.

'ఇడ్లీ వ్యాపారం. కరెక్టా ఏ నాలుగు రోడ్ల జంక్షనులోనో దుకాణం తెరుస్తాడు. ఒక గేస్ స్టవ్, ఇడ్లీ కుక్కరు అంతే! గబగబ ఒక పాతిక వాయలు అంటే ఒక రెండు, మూడు వందల ఇడ్లీలు వేస్తాడు. మెత్తగా హాయిగా తినేట్టు వుంటాయి. దాంట్లోకి చట్నీ, కారప్పొడి. 'అయితే ఇడ్లీలు కొంటే డబ్బులు తీసుకోడు' అన్నాడు మా అబ్బాయి. 'మరి ఫ్రీగానా...?!' అన్నాను ఆశ్చర్యంగా. 'కాదు, ఇడ్లీల ఖరీదు బదులు ఏదైనా ఇవ్వాలి. బిస్కట్ పేకెట్లో, పళ్ళో, కూరగాయలో...' అన్నాడు. 'మరి అందరికీ అవి దొరకవు కదా! బీదా, బిక్కి దగ్గర ఇవి లేకపోతో..?!' అన్నాను. 'అలా ఎవరు ఏమీ ఇవ్వకపోయినా వారికి ఫ్రీయే! అయితే వారిచేత పని చేయిస్తాడు. ప్లేట్లు కడగడమో, పంపు దగ్గర నుంచి నీరు తేవడమో...!' అన్నాడు. 'మై

గౌడ.. మరి అతనికి ఇడ్లీలు, చట్నీ చేయడానికి ముడిసరుకు ఎలా వస్తుంది? వాటికైనా డబ్బు ఇవ్వాలి కదా?' అన్నాను.

'ఏదోలాగా మేనేజ్ చేస్తాడట! వారికి డబ్బులివ్వడట! ఈయన మీద లోకల్ పేపర్లో ఆర్టికల్ వచ్చింది. ఈయనకు ఏం కావలిస్తే అవి ఫ్రీగా ఇచ్చేందుకు దాతలు ముందుకొస్తున్నారు. ఎందుకంటే తనకు ఇడ్లీలు అమ్మగా వచ్చిన వాటిని స్లమ్ ఏరియాలో పేదలకు పంచేస్తాడు. అయితే రోజూ ఇడ్లీలు వుండవు. ఒక రోజు దోసెలు, ఇంకో రోజు పొంగల్, మరో రోజు బిసీబిలా బాత్... అవన్నీ రుచిగా వండుతాడు' అన్నాడు మా అబ్బాయి. ఇంతలో మా భోజనం ప్లేట్లు వచ్చాయి. అందరం ఆకలి మీద ఉండడంతో ప్లేట్ల మీద పడ్డాము. అరగంట తర్వాత మా అబ్బాయితో సహా అతడి ఇద్దరి సహాధ్యాయులను అడిగాను. 'ఇదంతా ఆయన ఎందుకు చేస్తున్నాడు?! ఇలా డబ్బు బదులు ఆహారం బదిలీ...' అన్నాను. వాళ్ళు ముగ్గురూ వెంటనే అన్నారు, 'ఆయన డబ్బును వదులుకుందామనే ఉద్దేశ్యంతో ఉన్నాడు. బహుశా... డబ్బు మీద వ్యామోహం లేనివాడై ఉంటాడు!' అన్నారు.

అయితే దీనిని బార్టర్ సిస్టమ్ అంటారు. అంటే తమకున్న వస్తువులు అవి లేని వారికి మారకం చేసి వారి దగ్గర నుంచి తమకు కావలసిన వస్తువులు తీసుకుంటారు. ఈ వస్తు మారకంలో డబ్బుతో పని లేదు. ఆర్థిక స్థిరత్వం ఉంటుంది. తమ వస్తువులు వృథా పోవు. ఈ రకమైన పద్ధతి క్రీ.పూ. 3000 వ సంవత్సరంలో మెసపటోమియా నాగరికతలో ఉపయోగించారు. అయితే ఈ పద్ధతి అమలుచేయాలంటే నైతిక, నిబద్ధత ముఖ్యం. ఒకరికి ఎక్కువ విలువైన వస్తువులు రావచ్చు. ఇంకొకరు నష్టపోవచ్చు. అయితే ప్రతిఫలం ప్రశాంత జీవితం. ఆర్థిక జంజాటనాలు వుండవు. డబ్బు ప్రసక్తి లేని వ్యవస్థలో మనిషికి ఆనందం దొరుకుతుంది. ఆస్తులు, అంతస్తులు, పేద, ధనిక, భేదం ఉండదేమో!' అన్నాడు ఎకనమిక్ చదివే మా అబ్బాయి.

నాకు మా అబ్బాయితో సహా ఇద్దరి పిల్లలను చూసి ఆనందం కలిగింది. ఈ చిన్న వయసులో ఆ పెద్దాయన ధర్మ సూక్ష్మాన్ని అర్థం చేసుకున్నారనిపించింది. వారు సరైన దారిలోనే వెళుతున్నారు. వెళ్ళవలసింది పెద్దలమైన మేము కదా! అనుకున్నాను. భోజనం పూర్తిచేసి వాష్ బేసిన్ దగ్గరకు వెళ్ళాను. అక్కడికి పొడుగ్గా సన్నగా ఉన్న ఒక ముప్పయ్యేళ్ళ యువకుడు వచ్చి 'ఎక్స్క్యూజ్ మి సార్... ఇందాక మీరు పిల్లలకు ఆ ఇడ్లీ పెద్దాయన కథ చెప్పారు కదా... ఆయనను మీరు ఎక్కడ కలిసారు?!' అన్నాడు.

'ఢిల్లీ యూనివర్శిటీ హాస్టలు దగ్గర...' అన్నాను, అతని వంక పరిశీలనగా చూస్తూ. 'ఆయనను కలవాలి ఎక్కడ దొరుకుతాడు?' అన్నాడు. 'ఇప్పుడే హోటల్లో ఏదో కొనుక్కొని వెళ్ళారు. బహుశా వాటిని పంచడానికి ఏ స్లమ్ ఏరియాకో వెళ్ళి ఉంటారు' అన్నాడు నా వెనక వచ్చిన మా అబ్బాయి. 'మీ కెందుకు? ఆయనతో ఏం పని?' అన్నాను అనుమానంగా. సమాధానం చెప్పకుండా ఆ యువకుడు వేగంగా ఆ హోటల్ నుంచి బైటకు నడిచాడు. నా గుండెల్లో రాయి పడిరది. కొంపదీసి ఈ పెద్దాయనను ఏమైనా చేస్తారా, ఇప్పుడు ఆయనను

గురించి ఎంక్వయిరీ చేసిన యువకుడు. ఒక 'డాన్'లా కనిపించాడు. నల్ల కళ్ళద్దాలు, తెల్ల బట్టలు. ఎందుకో ఆ క్షణంలో కొద్దిగా నా గుండె దడదడ లాడిరది. అవన్నీ మనసులోనే దాచుకుని, ఆ హోటల్ లోంచి బైట పడ్డాను.

ఆఫీసు పని కోసం సుప్రీం కోర్టుకు బయలుదేరాను, మా అబ్బాయి బుక్ చేసిన టాక్సీలో. టాక్సీ ఎక్కిన నేను గతంలోకి వెళ్ళాను. మా ఊళ్ళో ఒక పెద్దాయనది ఇడ్లీ వ్యాపారం. ఆయన పేరు చలమయ్య. ఆయనకు ఇద్దరు కొడుకులు. పెద్దవాడు గురవయ్య, చిన్నవాడు ధర్మయ్య. చలమయ్య సైకిల్ మీద ఇడ్లీలు అమ్మే స్థాయి నుంచి ఒక కార్పోరేట్ స్థాయిలో ఇడ్లీ వ్యాపారవేత్తగా ఎదిగాడు. మా చిన్నప్పుడు రూపాయికి ఐదు ఇడ్లీలు. దానితో పాటు చట్నీ, కారప్పొడి, నెయ్యి, ఇంకా కావలసినంత సాంబారు.

అంత ఎదిగినా ఆ ధరలు మాత్రం ఎదగలేదు. అవి సామాన్యుడికి అందుబాటులో వుండేవి. ఆయన తదనంతరం ఆయన కొడుకులు గురవయ్య, ధర్మయ్య ఆయన పంథాలోనే ఆ హోటళ్ళు నడిపేరు. అయితే ఆ ఇద్దరికీ పిల్లలు పుట్టి వాళ్ళు పెద్దవాళ్ళయి బిజినెస్ మేనేజ్మెంట్ డిగ్రీలు, పెద్ద కాలేజీల్లో లా పట్టాలు పొందేసరికి, తమ తండ్రుల వ్యవహారం నచ్చలేదు. ఇంకా దేశంలో సంపన్నుల జాబితాలోకి వెళ్ళవలసిన వాళ్ళం. రాష్ట్ర స్థాయి ధనికుల జాబితాలోనే ఉండిపోయాం అనుకుని తమకు చదువు నేర్పిన ఆర్థిక సూత్రాలు అమలుపరిచారు.

ఇది పెద్దవాళ్ళయిన గురవయ్య, ధర్మయ్యలకు నచ్చలేదు. వాదోపవాదాలు జరిగాయి. ఘర్షణలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో పెద్దవాడు గురవయ్యగారు తన అరవై అయిదో యేట ఒక రాత్రి పూట హార్ట్ ఎటాక్తో చనిపోయాడు. తమ్ముడు ధర్మయ్య అరవయ్యేళ్ళవాడు. అన్నయ్య మరణం తట్టుకోలేకపోయాడు. ఈ నేపథ్యంలో ఆస్తి తగాదా మొదలయింది. తమ తాతగారు మొదలుపెట్టిన మొదటి హోటల్ భవనం, స్థలం కోట్లలో పలుకుతోంది. అది ధర్మయ్య పేరన వుంది. అది తమదే అంటూ గురవయ్య పిల్లలు కోర్టుకెక్కారు. 'కాదు మా నాన్నది' అంటూ ధర్మయ్య పిల్లలు దానికి కౌంటర్ వేసారు. కారణం అది ధర్మయ్యదే! తన భార్య నుంచి సంక్రమించిన స్థలం కాబట్టి వారు పోరాడి కోర్టులో గెలిచాడు. ఐతే అలా గెలిచిన ఆ స్థలం తన కొడుకులకు చెందాల్సింది. తిరిగి తన అన్న కొడుకులకు రాసేసి, తాను తీర్థయాత్రల కోసం బస్ ఎక్కాడు. అయితే ఆ బస్సు గోదావరి దగ్గర జరిగిన ఘోర ప్రమాదంలో బోల్తా పడి గోదావరిలో కొట్టుకుపోయింది. అలా ధర్మయ్య చనిపోయాడు.

నేనెక్కిన కారు సుప్రీం కోర్టు ఆవరణలో ఆగింది. నా ఆలోచనలు టక్కున ఆగపోయాయి. ఆ చనిపోయిన ధర్మయ్యగారు ఈ ఢిల్లీ నగరంలోని పెద్దాయనల ఉండడమే నాకు షాక్ కలిగించింది. కోర్టు లోపలికి వెళ్ళి నా పనుల్లో తలమునకలయ్యాను, ఆలోచనలకు స్వస్తి చెప్పి.

* * *

కోర్టులో పని ముగించుకుని తీరిక లభించడంతో తాపీగా మెట్రో స్టేషన్లో ట్రెయిన్ ఎక్కి

విశ్వవిద్యాలయం స్టేజి దగ్గర దిగి మా వాడి హాస్టల్ వైపు నడక సాగించాను. అయితే కొంత దూరం నడిచేసరికి దారి తప్పాను. అయోమయంగా అనిపించింది.

ఇంతలో ఒక టీ బంకు కనిపిస్తే ఆగాను. 'సార్' అంటూ మధ్యాహ్నం హోటల్ దగ్గర ఆ పెద్దాయన గురించి ఎంక్వయిరీ చేసిన యువకుడు అతని వెనక ఇంకో నలుగురు. అదే వయసు వారు కనిపించారు. అంతా ఖరీదైన మనుషుల్లాగే ఉన్నారు. 'సార్... మీరు చెప్పిన దారిలో వెతికాం. ఆయన దొరకలేదు' అన్నాడు ఆ యువకుడు. 'ఇంతకీ మీరెవరు? ఆయనతో మీకేం పని?' అన్నాను. 'మీరు హోటల్లో అందరికీ ఇడ్లీలు అమ్మే పెద్దాయన గురించి చెపుతుంటే విన్నాం. ఆయనను మీరు అనుకుంటున్నట్టు ఎవరో కాదు, ఆయన ధర్మయ్యగారు. మా చిన్నాయన. ఈ అబ్బాయిలు వారి పిల్లలు. ఆయన కోసం వెతుక్కుంటూ వచ్చాం ఢిల్లీ. ఇక్కడ ఉన్నాడని తెలిసి' అన్నాడతను. 'నేను వారి మాటలకు ఆశ్చర్యపోయి 'ధర్మయ్యగారు బస్సు ప్రమాదంలో చనిపోయారు కదా?' అన్నాను. 'లేదు. మా చిన్నాయన చనిపోలేదు. ఆయనకు బస్ ఎక్కే ముందు వాష్ రూమ్కు వెళ్ళాల్సివచ్చింది. ఐతే ఆయన సీటులో బేగు, శాలువా, స్వెట్టర్ వుంచి క్రిందకు దిగాడు. ఆయన ఉన్నాడనుకొని డ్రైవర్ బస్ పోనిచ్చాడు. ఆ బస్ గోదావరి నదిలో పడిరది. ఆయన చనిపోయాడని అందరం అనుకున్నాము. డేడ బాడీ దొరకకపోవడంతో ఆరు నెలల తర్వాత తెలిసింది, ఆయన బస్ ఎక్కలేదని... వెతికితే ఢల్లీలో ఉన్నాడని తెలిసి వచ్చాము. ఆయన దొరకడంలేదు' అన్నాడతను విచారంగా.

నేను క్షణం ఆలోచనలో పడి 'ఆయన దారిలో వెళ్ళండి దొరుకుతాడు' అన్నాను స్థిరంగా. 'అంటే?!' అన్నారు వాళ్ళు అయోమయంగా. 'అదే ఆయన దారే...' అన్నాను మళ్ళీ మళ్ళీ.అతను ఒక్క క్షణం ఆగి 'మీరు చెప్పిన విషయం అర్థమయింది. 'దారి తప్పిన వాళ్ళం అని మా చిన్నాన్న మమ్మల్ని ఆయన పిల్లల్ని వదిలి తన దారి వెతుక్కున్నాడు. మాకు ఇప్పటికి అర్థం అయింది. ఆయన చూపిన దారే బాగుందని. అందరం కలిసిపోయాము. ఈ ఆనందం ఆయనతో పంచుకోవాలని వస్తే ఆయన దొరకడంలేదు' బాధగా చెప్పాడు అతను. 'ఫరవాలేదు. దొరుకుతాడు' అన్నాను. వారి ముఖాల్లో సంతోషం కనిపించింది. అక్కడి నుంచి కదిలారు.

నేను వారికి చెప్పిన విషయం నాకు ఆశ్చర్యం, ఆనందం కలిగించింది. కుతంత్రపు ప్రపంచం బొరుసైతే అది ధర్మాన్ని దారి తప్పించేది. అది నాణేనికి ఒక వైపు. ఈ ధర్మయ్యగారు మరో వైపు. ఆయనను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న మా అబ్బాయి లాంటి యువతరం, ఇంకా ఆ పెద్దాయన దారిలోకే నడవడం సాగిస్తున్న ఆయన కుటుంబం.

అలా ఆలోచనల్లో ఉన్న నేను పక్కకు తిరిగి చూస్తే మా అబ్బాయి హాస్టలు వైపుగా రోడ్డు పక్కలో వున్న రావిచెట్టు కనిపించింది. ఆ చెట్టు క్రింద కూర్చుని భోజనం చేస్తున్న ఒక యాచకురాలు. ఆమె చుట్టూ కోతుల గుంపు. తన అన్నాన్ని వారికి పంచుతోంది. ఆ చెట్టు చూసేసరికి హాస్టలు వైపు వెళ్ళాడానికి దారి తెలిసింది. అలాగే నాకు మనసులో తొలుస్తున్న

సమస్యకు దారి దొరికింది. నా జేబులో గుండెకు దగ్గరగా ఉన్న మా అన్నయ్య రాసిన ఉత్తరం రేపిన అలజడి లేదు.

అన్నయ్యకు ఫోన్ చెయ్యడానికి నిర్ణయించాను. వాదనలో అర్థం వున్నా వేదనలో పరమార్థం ఉందని బోధ పడిరది. వెంటనే ఫోన్ చేసాను. అన్నయ్య గొంతు వినిపించింది. 'ఆ ఇల్లు నువ్వే తీసుకో. ఒక పని మాత్రం నా కోసం చెయ్యి' అన్నాను. 'ఏమైనా డబ్బులు ఇమ్మంటావా? ఎంత డబ్బు ఇమ్మంటావో చెప్పు. ఇస్తాను' అన్నాడు అన్నయ్య. 'డబ్బులేమీ వద్దు. వస్తు మారకం. అంటే బార్టర్ సిస్టమ్.' 'అంటే ఏంటిరా?' అన్నాడు అన్నయ్య. 'మనం చిన్నప్పుడు అమ్మ పని పాటూ చేసుకుంటూ మా ఇంటి పెరట్లో ఉన్న వేపచెట్టుకు ఉయ్యాల కట్టి దాంట్లో నన్ను ఉంచేది. నువ్వు ఉయ్యాల ఊపుతూంటే నేను నిద్రపోయేవాడిని. అందుకే ఆ చెట్టు కొట్టించకు. అక్కడ మళ్లీ ఉయ్యాల కట్టి దాంట్లో ఊగాలని ఉంది నాకు. నన్ను ఊపేది నువ్వే!' అన్నాను. అవతలి నుంచి ఏడుస్తున్న అన్నయ్య. అవి ఆనంద బాష్పాలు. నా కళ్లు కూడా తడిసాయి సాంత్వనతో.

* * *

## డాక్టర్ ఎమ్.సుగుణరావు

డాక్టర్ ఎం. సుగుణరావు స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం. ప్రస్తుతం విశాఖపట్నంలో స్థిరపడ్డారు. వెటర్నరీ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. భారత ప్రభుత్వరంగ బీమా సంస్థలో ఉద్యోగం చేసి, సీనియర్ డివిజనల్ మేనేజర్‌గా పదవీ విరమణ పొందారు. దాదాపు 30 ఏళ్లుగా కథలు రాస్తున్నారు. ఇప్పటివరకూ 225కు పైగా కథలు రాశారు. వీటిలో 70 కథలకు బహుమతులు అందుకున్నారు. పలు కథలు అన్ని ప్రముఖ దిన, వార, మాస పత్రికల్లో ప్రచురితం అయ్యాయి. 'జాబిలి మీద సంతకం', 'నేలకు దిగిన నక్షత్రం' పేరుతో కథా సంకలనాలు వెలువరించారు. ఆకాశంలో ఒక నక్షత్రం కథ.. ఇంగ్లీషు నాటకంగా రూపుదిద్దుకుంది. దేవుడిని చూసినవాడు, మంచుపల్లకి, దుర్గమ్మ కూతురు కథలు కన్నడంలోకి అనువాదం అయ్యాయి. 'క్షమాభిక్ష' కథకు స్వాతి మాసపత్రిక అనిల్ అవార్డు దక్కింది. 2020లో నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ నిర్వహించిన కథల పోటీలో.. 'పోలేరమ్మ' కథ రూ.15000 బహుమతి గెలుచుకున్నది. వీటితోపాటు వివిధ కథలకు బహుమతులు, సన్మానాలు అందుకున్నారు.

# ది అన్టోల్డ్ సీక్రెట్స్ ఆఫ్ ఉమెన్ సప్రెషన్

The Untold secrets of women suppression



**పద్మజ బొలిశెట్టి**

"హలో సూరజ్!".

"హాయ్ డాడ్! హౌ ఆర్ యూ..? హౌ ఈజ్ యువర్ హెల్త్?".

"ఐయాం ఫైన్ రా! నీకో విషయం చెప్పాలి!".

"ఓహ్.. చెప్పు డాడ్! ఏంటీ విశేషం? ఎదురింట్లో మీ పాత గర్ల్‌ఫ్రెండ్ ఏమైనా దిగిందా?".

"అరేయ్.. మాట మార్చకురోయ్! అమ్మ ఉంది పక్కనే.. లిటిగేటేషన్స్ పెట్టకు! తనతో వాదించలేను. సరేలే గానీ.. మీ మామ్ నీకో సంబంధం తెచ్చింది. అమ్మాయిది ఐటీ జాబ్. ఫొటో చూశా.. బాగుంది! ఒకసారి నువ్వుకూడా చూసి చెప్పురా! షి ఈజ్ వెయిటింగ్ ఫర్ యువర్ ఆన్సర్".

"ఇప్పుడెందుకు డాడ్! కొద్దిరోజుల్లో యూఎస్ నుంచి ఇండియా వస్తానుగా. వచ్చినంక చూద్దాం. ఈ ఫొటోల్లో ఎడిటింగ్.. అవీ ఇవీ ఉంటాయి. ఒరిజినాలిటీ మిస్ అవుతుంది!".

"ఏదో.. తన సంతోషం! ఒక్కసారి వాట్సాప్ చూసి

చెప్పురా.. నీ ఒపీనియన్".

"ఓకే డాడ్!"..

అని ఫోన్ పెట్టేసి.. వాట్సాప్‌లో పిక్ ఓపెన్ చేశాను.

ఆ అమ్మాయి.. అవును అదే అమ్మాయి!

సరిగ్గా ఆరునెలల క్రితం. ముంబైలో ఉండగా, ఒకరోజు ఈవినింగ్ బీచ్‌కు వెళ్దామని పంకజ్, సుశాంత్‌గాడికి ఫోన్‌చేస్తే.. ఒకడేమో స్విచ్‌ఆఫ్, ఇంకొకడు ఏదో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయానని ఇరుకు గొంతుతో సమాధానం.

ఆ రోజు పూర్తిగా ఎండకాకుండా.. అలా అని మబ్బులు లేకుండా, కాస్తంత డస్కీగా ఉన్నది వాతావరణం. ఆ చల్లని వాతావరణంలో ఒక్కణ్నే బాల్కనీలో కూర్చోలేక.. అరగంట ప్రయాణానికి ట్రాఫిక్‌లో ముప్పావుగంట వెయిట్ చేసి బీచ్‌కు వెళ్లిపోయా!

సూర్యుడు పూర్తిగా సెలవు తీసుకొని, చంద్రునికి స్థానం ఇస్తున్నట్టు.. మసక బారుతున్న సమయంలో, దూరం నుంచి ఒక్కసారిగా ఓ తెల్లని మెరుపు. 'ఏంటా!?' అని పరిశీలిస్తూ చూస్తుంటే.. దూరంగా తెల్లని చుడీదార్ మీద, గులాబీ రంగు చున్నీ. రింగుల జుట్టు. ఐదడుగులకు రెండుమూడు అంగుళాలు ఎక్కువ ఉంటుందేమో! గోధుమ – ఎరుపు రంగు కలగలిసిన మేనిఛాయతో ఒక ప్రకాశవంతమైన ముఖం. అందులోంచి సూటిగా చూస్తున్న పెద్దకళ్లు. అలలకు కొద్దిదూరంలో కూర్చొని ఉందా అమ్మాయి.

పైన చుక్కల ఆకాశం, కింద ఇసుక నిండిన బీచ్‌లో అలలు వచ్చి ఒక్కొక్కటిగా తన కాళ్లను తాకుతూ.. కాళ్ల కిందున్న ఇసుకను బతిమిలాడుకొని తీసుకెళ్తున్నాయి.

మొదటి చూపులోనే కాస్త దగ్గరగా వెళ్లి, తనను పలకరించాలని అనిపించింది. కాస్తంత దగ్గరగా వెళ్లి.. భయంతో కూడిన నటనతో..

"హాయ్!" అన్నాను.

తను చూడలేదు. మళ్లీ..

"హాయ్! ఐయాం సూరజ్. వర్కింగ్ ఇన్ ఐటీ సెక్టార్" అని చెప్పాను.

మళ్లీ నిరాశే!

"ఎక్స్‌క్యూజ్‌మీ! మే ఐ నో యువర్ నేమ్ ప్లీజ్!".. పేరు తెలుసుకోవాలనే తాపత్రయంతో మళ్లీ అడిగాను.

తను చూసి..

"రేష్మ" అని మెల్లిగా చెప్పింది.

"ఓహ్.. నైస్ నేమ్! మీరు రెగ్యులర్‌గా బీచ్‌కు వస్తారా!? ఐ థింక్ యూ లైక్ బీచ్ వెరీ మచ్".

"ఇక్కడ ఖాళీ ఏది ఉండదు! ఆకాశం – భూమి – సముద్రం.. ఒకదానికొకటి విడదీ–

యరాని పెయింటింగ్‌లాగా, ఒకరినొకరు గూఢచారిలాగా రహస్యంగా గమనించుకుంటాయి. ఇక్కడ.. ఈ ఎడారి బీచ్‌లో పురుషులు, స్త్రీలు, ప్రకృతి.. హింస నుంచి తమను తాము రక్షించుకోవడానికి దాగి ఉంటారు"..

ఆమె చెప్పిన సమాధానంలో ఏదో తెలియని లోతైన విశ్లేషణ దాగి ఉంది. ఆమె కళ్లలో సహజత్వంతో కూడిన గాంభీర్యం ఉట్టిపడుతున్నది. ఇంకేమీ మాట్లాడకుండా అక్కడినుంచి వచ్చేశాను.

దూరం నుంచే ఒక గంటసేపు.. ఆ సాగర అలల సరిగమల మధ్యన ఆమెనే చూస్తూ ఉండిపోయా!

కట్ చేస్తే..

ఆ అమ్మాయే ఈ అమ్మాయి. వావ్.. ఎగిరి గంతేసినంత పని చేసి, మామ్‌కు కాల్ చేశా!

"అమ్మాయికి ఓకే అయితే.. నాకు ఓకే!" అని చెప్పేశా

నిశ్చితార్థం ఏదో ఫార్మల్‌గా.. నేను లేకున్నా, పెద్దలలో జరిపించమన్నాను. ఆ రోజు నిఖాలో తనను చూస్తుంటే.. తన అమాయకత్వం, హుందాతనంతో ఫెయిరీ క్వీన్‌లా కనిపించింది. నా కళ్లు మళ్లీ మళ్లీ తన వైపే తిరిగేంత కంట్రోల్ తప్పాయి.

***ఆ తర్వాతి రోజు రాత్రి..***

అందరూ ఎంతో ఆతృతతో ఎదురుచూసే రాత్రి అది. సమయం లేకపోవడం, దూరం వల్ల కనీసం పెళ్లికి ముందు తనను కలిసి, తన అభిప్రాయాలు తెలుసుకునే అవకాశం రాలేదు. అందుకు నన్ను నేనే తిట్టుకుంటూ.. ఈ రోజు ఎలాగైనా తనతో విషయం చెప్పి, ఒక హగ్ అయినా ఇవ్వాలనే ఆరాటంతో ఎదురుచూస్తూ ఉన్నా. తను మాత్రం ఏదో ఫార్మల్‌గా.. పాలగ్లాసు అదీ తేకుండా, సింపుల్‌గా కుచ్చిళ్లు నేలకు జారుతున్న ఎర్రరంగు చీరలో, జడలో కొన్ని విరజాజులతో గదిలోకి వచ్చింది. తనను చూసి ఆటోమేటిగ్గా నాలో కంగారు మొదలైంది. నేనే నిల్చొని.. తనకు 'వెల్కమ్!' చెప్పా!

'కూర్చో!' అనగానే, తను మంచంపై కూర్చున్నది.

నేను ఇంకాస్త పక్కకు జరిగి.. టేబుల్‌పై ఉన్న రోజా పువ్వు తీసుకొని తనకు అందిస్తూ..

"హాయ్! ఐ లవ్ యూ! ఇది నేను నిన్ను చూసిన మొదటిరోజు చెప్పాలనుకున్న విషయం. ఇలా చెప్తున్నందుకు హ్యాపీ" అని చెప్పా.

తను ఏమీ మాట్లాడకపోయేసరికి..

ఇంకొంచెం పక్కకు జరిగి.. తన చేతిని పట్టుకొని దగ్గరగావెళ్లి కిస్ చేసే ప్రయత్నం చేశా..

వెంటనే తను..

"నో!" అంటూ.. కోపంతో నా చెంపపై ఒక్కటిచ్చింది.

"..ప్లీజ్ డోంట్ టచ్ మీ" అని అరుస్తూ.. ఏడుస్తున్నది.

ఎంతో మధురమైన అనుభూతిలా మిగలాల్సిన ఆ రాత్రి.. మా మధ్య నిశ్శబ్ద నిశీధిలో ఒంటరి ప్రయాణం. చెప్పుకోలేని, విప్పలేని రహస్యాల కౌగిట్లో కట్టిన గోడల మధ్యన.. ఇరువురి అష్టదిగ్బంధం.

ఉదయాన్నే నా ఫ్రెండ్ నీరజ ఫోన్ కాల్..

"హాయ్! ఒరేయ్ కంగ్రాచ్యులేషన్స్! పార్టీ ఎప్పుడు ఇస్తావ్? ఎలా ఉన్నావ్ హ్యాపీ కదా?".

"హ్మ్.. బతికే ఉన్నా!".

"ఏంట్రా ఆ సమాధానం?".

పరీక్షల్లో ప్రశ్నలన్నిటికీ సమాధానం తెలిసీ, పెన్ను మరిచిపోయిన వాడి పరిస్థితి ఎలా ఉంటుందో.. అలా ఉంది నా పరిస్థితి.

రాత్రి జరిగిన విషయాన్ని చెప్పాక..

"తనను సాయంత్రం ఇంటికి తీసుకురా! పరిచయం చేద్దువు గానీ" అన్నది నీరజ.

ఫోన్ పెట్టేసి.. రేష్మను పిలిచా.

"నా ఫ్రెండ్ నీరజ! సైకాలజిస్ట్ తెలుసుగా.. సాయంత్రం వాళ్ల ఇంటికి రమ్మంది. వెళ్దాం!" అని చెప్పా.

ఆటోమేటిగ్గా అడిక్ట్ అయిన నా కళ్లను తనవైపు నుంచి తిప్పుకొంటూ ఉంటే.. తను నన్నే చూస్తున్నది.

ఆ చూపుల్లో.. వసంతకాలపు లేతచిగుళ్ల నుంచి వేకువజామున వచ్చే తాజాదనం ఉంది.

కోయిల గానంలో, మయూర నాట్యంలో, చిరుగాలుల సవ్వడిలో వినిపించే ప్రశాంత స్వరంతో.. ఒక అద్భుతం ఆకాశం నుంచి నేలకు జారినట్లుగా..

"ఓకే..!" అన్నది.

సాయంత్రం కాగానే.. ఇద్దరం కలిసి నీరజ వాళ్ల ఇంటికి వెళ్లాం.

నీరజకు తనను పరిచయం చేశాను.

"హాయ్! బిజీగా ఉండి మీ పెళ్లికి రాలేకపోయా. వీడూ నేనూ చిన్నప్పటి నుంచి బెస్ట్ ఫ్రెండ్స్! అల్లరి వెధవ.. నీతోకూడా స్టార్ట్ చేసే ఉంటాడు" అంటూ తనను లోపలికి తీసుకెళ్లింది నీరజ.

నేనూ వారితోనే వెళ్లబోతుంటే..

"నేను తనతో కొంచెం పర్సనల్‌గా మాట్లాడాలి సూరజ్! నువ్వలా బయటికి వెళ్లి టీ తాగేసి రా!" అంటూ.. నవ్వుతూనే నన్ను గెంటేసినంత పనిచేసింది నీరజ. నేను అలా గుమ్మంవైపు రెండు అడుగులు వేశానో లేదో.. రేష్మను తీసుకొని తన గదిలోకి వెళ్లింది నీరజ.

అయితే.. నాకు ఆ గుమ్మం దాటాలని అనిపించలేదు.

ఎందుకంటే.. ఆ నల్లని కాటుక కళ్ల వెనుక దాగిన నిగూఢ రహస్యం తెలుసుకోవాలనే ఆత్రుత నాది.

"ఇలా చూడమ్మా! ఆడపిల్లలకు అన్ని పరిస్థితులూ ఒకేలా ఉండవు. నన్ను చూడు.. అమ్మ, నాన్న అందరూ అమెరికాలో.. పిల్లలు కూడా! బట్ ప్రొఫెషన్ కోసం నేను ఇక్కడే ఉండిపోయా. కొన్నిటిలో అడ్జస్ట్ అవ్వాలి. ఆర్ యూ హ్యాపీ విత్ సూరజ్? లేదా ఇంకేదైనా బ్రేకప్ లవ్?".. సూటిగా మ్యాటర్‌లోకి వచ్చేసింది నీరజ.

ఆమె మాట పూర్తి చేయకముందే..

"అలాంటిదేమీ లేదండీ! సూరజ్‌లోని ప్రశాంతత, సెన్స్ ఆఫ్ హ్యూమర్.. అన్నిటి కంటే తను మనుషులను అర్థం చేసుకొనే విధానం అంటే నాకు ఇష్టం. ఐ లైక్ హిజ్ గుడ్ మ్యానర్స్" అంటూ చెప్పింది రేష్మ.

"ఓహ్ గుడ్! అయితే మరింకేం!? ఏ అమ్మాయికైనా మొదటిరాత్రి ఉండే టెన్షన్ అలానే ఉంటుందిలే! కాస్త చనువు పెరిగితే నువ్వే సర్దుకుంటావు సంతోషంగా.." అన్నది నీరజ.

కొద్దిసేపు నిశబ్దం.

"లేదు డాక్టర్! ఈ భయం.. ఎప్పుడో ఓసారి వచ్చిపోయే చుట్టం కాదు. జీవితాంతం నన్ను అంటిపెట్టుకొని ఉండే నా నేస్తంలా ఉంది".

"ఎందుకలా? టెల్ మి ద రీజన్? నేనేమైనా హెల్ప్ చేయగలనేమో?! ఎప్పటినుంచి ఉంది చెప్పు ఈ భయం?".

ఆమె పెదాలు తడుపుకొంటూ.. నేలకేసి చూస్తూ..

"డాక్టర్.. నేను ఈ బయటి ప్రపంచానికి దూరంగా, ఒక చిన్న మారుమూల గ్రామం నుంచి వచ్చిన వ్యక్తిని. నాకు చిన్నప్పుడు.. సరిగ్గా ఆరేండ్ల వయసు ఉంటుంది. మా ఇంటికి కొందరు పెద్దవాళ్లు వచ్చి మా వాళ్లతో.. 'ఇదే చివరి అవకాశం! ఇప్పుడు చేయకపోతే మీరు

పాపాలు చేసినవారు అవుతారు. మీరు మన ఆచారం నుంచి వెలివేయబడుతారు!' అని గట్టిగా వాదించారు. వాళ్లు వెళ్లిపోయాక రాత్రివరకూ అమ్మ ఏడుస్తూనే ఉన్నది.

తెల్లవారిన తర్వాత ఒక ముసలావిడ మా ఇంటికి వచ్చింది. మా నాన్నమ్మ నాకు చాక్లెట్స్ కొనిచ్చి, ఎత్తుకొని శిథిలావస్థలో ఉన్న ఇంటిలోకి తీసుకెళ్లింది. అక్కడ నన్ను ఒక బల్లపై పడుకోబెట్టింది. ఒకవైపు నిప్పుల్లో కత్తిని పదును చేస్తున్నారు. ఒకావిడ వచ్చి నా దుస్తులను తొలగించింది. నేను ఏడుస్తుంటే.. నా చేతులను ఆ ముసలావిడ గట్టిగా పట్టుకున్నది. నా కింది భాగంలో ఒక పదునైన కత్తితో కోసినట్లు అనిపించింది. నొప్పితో నేను అరుస్తూ ఉంటే.. దానిపై ఒక నల్లని పొడిని ఉంచింది. నేను చాలా భయపడ్డాను. నొప్పితోకూడిన ఆ షాక్‌ను నేను ఇప్పటికీ అనుభవిస్తున్నాను. చిన్నప్పుడు ఇలాగే చేయబడ్డ మా కజిన్.. తనకు బాబు పుట్టే సమయంలో ఓవర్ బ్లీడింగ్ అయ్యి చనిపోయింది. ప్లీజ్ డాక్టర్.. అసలు తనకేమైంది. నేను కూడా అలాగే చనిపోతానా? ప్లీజ్ టెల్ మీ ద ఫ్యాక్ట్స్ ప్లీజ్!"..

రేష్మ గొంతు వణికిపోతున్నది. ఆమె నిలువెల్లా కదిలిపోతున్నది. నీరజ సోఫాలోంచి లేచి.. రేష్మ దగ్గరికి వచ్చింది. తనను దగ్గరికి తీసుకుంటూ..

"భయపడకు!" అని ఓదార్చింది.

రేష్మ ఏడుస్తూనే..

"చెప్పండి! నాకు ఏమైంది?" అని అడిగింది మళ్లీ.

"ఈ ప్రకృతిలో స్త్రీకి మాత్రమే ఉత్పత్తితోపాటు పునరుత్పత్తి శక్తి ఉంది. ఒక స్త్రీ మాత్రమే పురుషుని కంటే ఎక్కువగా తనలో తానే మనగలుగుతుంది. అన్నిటికంటే.. పురుషుని కన్నా స్త్రీకే ధైర్యం ఎక్కువ. ఎటువంటి పరిస్థితుల్లోనైనా జీవించే సామర్థ్యం.. ప్రకృతి తనకు కల్పిస్తుంది. దానిని గుర్తించిన పురుషుడు.. క్రమంగా స్త్రీని నిర్వీర్యం చేయాలని ఎన్నో ఆచారాలు, ఎన్నో సిద్ధాంతాలు, కట్టుబాట్లతో అనునిత్యం ఆమెను కట్టివేస్తున్నాడు. దానిలో భాగంగా జరిగిన ఒక క్రూరమైన మతాచారమే.. ఫిమేల్ జెనిటల్ మ్యుటిలేషన్!" అంటూ ఒక్కసారి గట్టిగా ఊపిరి పీల్చుకుంది.

మళ్లీ తానే..

"స్త్రీ జననాంగ విచ్ఛేదం.. అంటే 'ఖత్నా' అని పిలిచే ఒక క్రూరమైన సంప్రదాయం ఇది. స్త్రీ జననేంద్రియాల్లోని మృదువైన క్లిటోరిస్ తలను కత్తిరించడం. దీనివల్ల తనకు లైంగికపరమైన ఆసక్తి తగ్గి, పెళ్లికి ముందు కానీ తర్వాత కానీ ఇతరులతో సెక్స్‌పట్ల విముఖత వ్యక్తం చేస్తుంది. కేవలం స్త్రీని పిల్లలు పుట్టించడానికి మాత్రమే పనికొచ్చేలా చేసే ఒక దురాచారం ఇది. ఇది ఆఫ్రికా దేశాల్లో కొన్ని మిలియన్ల మంది స్త్రీలపై.. నిత్యం జరుగుతున్న క్రూరమైన చర్య ఇది. ప్రపంచ ఆరోగ్య సంస్థ చొరవ వల్ల దీనిపై కొంత అవగాహన ఏర్పడి,

కొన్ని దేశాల్లో ఇలాంటి దురాచారంపై నిషేధం ఉంది. కానీ, మన దగ్గర బహిరంగంగా ఎవరూ చర్చించనీ.. కొన్ని తెగలు ఇంకా ఈ ఆచారాన్ని పాటిస్తున్నాయనేది ఒప్పుకోవాల్సిన నిజం!"..

నీరజ గొంతులో అంతులేని ఆవేదన.

"నీరజా! అమ్మ ఫోన్ చేసింది. మమ్మల్ని రమ్మంటున్నది!" అంటూ నీరజ గది తలుపులు తట్టాను.

కాసేపు మౌనం తర్వాత.. తలుపులు తెరుచుకున్నాయి.

నీరజ దగ్గర సెలవు తీసుకొని.. రేష్మను తీసుకొని అక్కడినుంచి వచ్చేశా.

మరుసటి రోజు..

"ఇవ్వాళ ఆఫీస్ నుంచి త్వరగా వస్తాను. బీచ్‌కు వెళ్దాం!" చెప్పాను ఆమెతో.

తల దించుకునే.. "అలాగే!" అన్నది.

ఆ సాయంత్రం..

అలల నడుమన నిశ్శబ్దంగా నడుస్తున్నాం ఇద్దరం.

రేష్మ మెల్లిగా..

"సూరజ్! నీకో విషయం చెప్పాలి. దాన్ని నువ్వు ఎలా తీసుకున్నా నాకు ఇష్టమే! నీ లైఫ్‌లో నేను.." అంటూ ఏదో చెప్పబోయింది.

"ప్లీజ్ స్టాప్.. రేష్మ!" మృదువుగానే అన్నాను.

"లెట్ మీ కంప్లీట్ సూరజ్! నేను నీకు సెట్ అవ్వలేను. నిన్ను నేను ఏ విధంగానూ సుఖపెట్టలేను. అసలు విషయం నీకు తెలియదు. నేను"..

"నాకంతా తెలుసు రేష్మా! నీరజతో నువ్వు చెప్పిందంతా నేను విన్నాను. చూడు రేష్మా! నేను నిన్ను ఈ భూమి – ఆకాశం – సముద్రం – గాలి.. అదిగో దూరంగా కనిపించే ఆ లైట్ హౌజ్‌లోని అగ్ని సాక్షిగా ప్రేమించాను. ఇక ఈ జీవితం నీతోనే! ట్రస్ట్ మీ!"..

అంటూ నా మోకాళ్లపై కూర్చొని, చేతిలో గులాబీ పువ్వుతో.. తన కళ్ల వైపే చూస్తూ అడిగాను.. నా కళ్లలో నీళ్లు నింపుకొని.

రేష్మ గొంతులోని బాధను దిగమింగుకుంటూ.. తన కళ్లలోనూ నీళ్లు నింపుకొన్నది.

అవి ఆనందబాష్పాలేనని గుర్తించడానికి నాకు ఎక్కువ సమయం పట్టలేదు.

నా చేతిలోని గులాబీని అందుకుంటూ..

"నాలాగా ఇకముందు ఏ అమ్మాయి కూడా ఇలా అవగాహన రాహిత్యంతో బాధకు గురై.. జీవితాంతం నొప్పిని అనుభవించొద్దు. ఫిమేల్ జెనిటల్ మ్యుటిలేషన్‌కు వ్యతిరేకంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించే కార్యక్రమాల్లో నేనూ పాల్గొంటాను. నాలాంటి వాళ్ల

కోసం నేనూ పనిచేస్తాను సూరజ్” అన్నది.

“ఓకే! నీ ఇష్టం” అన్నాను.

ఆ బీచ్‌లో..

ఆమె ఒంటరిగా ముందుకు నడుస్తూ పోతూ ఉన్నది.

మొదటిసారి తనను కలిసినప్పుడు.. ‘ఈ ఎడారి బీచ్‌లో ప్రకృతి, స్త్రీ.. హింస నుంచి తప్పించుకోవడానికి దాగి ఉంటారు’ అని తను చెప్పిన సమాధానంలో తాత్వికత కొద్దిగా అర్థం అయినట్లుగా..

ఈ రోజు తను నడుస్తుంటే..

ఆమె కళ్లు ఆ చీకటిని చీల్చడానికి వెళ్లే ఓ వెలుతురు కిరణంలా..

తన మాట నిశ్శబ్దాన్ని కదిలించే ఆది ప్రణవ నాదంలా..

ఆమె చూపు అగ్నిపర్వతం వెదజల్లే ఎర్రని వెచ్చని లావాలా..

ఆ ప్రశాంత తీరంలో సాగిపోతున్నది.

అనంత సంఘర్షణలను, సంవేదనలను, సంచలనాలను అనాదిగా అనుభవిస్తూ.. అధిగమిస్తూ నిలుస్తున్న ఆటుపోటుల సముద్రంలా.. నేను కూడా ఆమెను అనుసరిస్తున్నా.

దూరంగా.. నింగీ – నేలా కౌగిలించుకుంటున్నాయి.

ఎత్తుగా.. నీరు – సూర్యుడు ముద్దాడుకుంటున్నాయి.

ఎగురుతున్న రెండు పక్షులు.. మరింత పైకెగిరి ఒకటిగా, ముద్దగా కనిపిస్తున్నాయి.

# పద్మజ బొలిషెట్టి

పద్మజ బొలిషెట్టి స్వస్థలం మంచిర్యాల. రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఎక్కువగా కవిత్వం రాస్తుంటారు. 30కి పైగా దేశ విదేశాల కవయిత్రుల కవిత్వాన్ని తెలుగులోకి అనువాదం చేశారు. ‘ది అన్‌టోల్డ్ సీక్రెట్స్ ఆఫ్ ఉమెన్ సప్రెషన్’.. రచయిత్రి మొదటి కథ. ఆఫ్రికా దేశాల్లో ఎక్కువగా కనిపించే.. ‘ఖత్నా’ అనే సాంఘిక దురాచారం ఆధారంగా ఈ కథ రాశారు పద్మజ. ‘ఫిమేల్ జెనిటల్ మ్యుటిలేషన్ (ఎఫ్‌జీఎం) అనేది స్త్రీ జననేంద్రియ విచ్ఛేదం అనే క్రూరమైన దురాచారం. ఇది భారత్ సహా 30 దేశాలలో నేటికీ సజీవంగా ఉన్నది. 20 కోట్ల కంటే ఎక్కువమంది బాలికలు, మహిళలు ఈ ఎఫ్‌జీఎం దురాచారానికి బలయ్యారు. స్త్రీలకు సంబంధించిన సామాజిక రుగ్మతలను సమాజానికి తెలియజేసే ఒక చిన్న ప్రయత్నమే.. ఈ కథ ముఖ్య ఉద్దేశం’ అని అంటున్నారు రచయిత్రి.

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 370

# గడువు



**రావుల పుల్లాచారి**

**9949208476**

తెల్లవారి మామూలుగా 4గంటలకు నిద్రలేచే బాలమల్లు, గత కొద్ది రోజులుగా, నలత నలతగా నిద్రపడుతుంటే 3గం. లేచి కూర్చుంటున్నాడు. మనసు నిండా ఆలోచనలు, ఆందోళన కలుగుతుంటే, వాటి నుండి కొంత ఉపశమణం పొందడానికి, ఇంటి ముందు, ఉన్న వ్యాయమ శాలలోకి తలుపు తీసుకొని వెళ్ళాడు. వ్యాయమశాలతో స్వీచ్ వేశాడు, వెలుతురు ఎక్కువ ఇవ్వని నాలుగు బల్బులు, ఆ ప్రాంగణం అంతా గుడ్డివెలుగులు నింపాయి, గోడకు వేలాడుతున్న తన గురువు పహిల్వాన్ వెంకన్న ఫోటోను దండం పెట్టుకొన్నాడు. పేయ్యి మీద ఉన్న బనియన్ విప్పి, కట్టుకొన్న దోవతిని లంగోటిలా సవరించి కట్టుకున్నాడు, స్వరం సవరించుకొని, ఒకటి ..రెండు.. అంటూ హనుమాన్ దండీలు చేయడం ప్రారంభించాడు. అలా యాభైవరకు చేశాడు, స్టూల్ మీద ఉన్న టవల్‌తో చేతులు తుడుచుకొని గోడకు నిలబెట్టి ఉన్న 'ముక్దార్స్'ను చేతుల్లోకి తీసుకొని, జబ్బ కండరాలు అదురుతుంటే గుండ్రంగా తిప్పాడు. కొంత సేపు సవ్యంగా, మరికొంత సేపు వ్యతిరేఖ దిశగా తిప్పాడు, అలా అరగంట వరకు

చేశాడు. అలాగే యాభై కిలోల వెయిట్ లిఫ్టింగ్ చక్రాలను, నాలుగు, ఐదుసార్లు పైకి లేపుతు, అంతే నెమ్మదిగా కింద పెట్టసాగాడు, వీవైనన్ని బస్కీలు తీశాడు. అప్పటికి శరీరం చేమటతో నిండి పోయింది, తన గురువు బతికి ఉన్న రోజుల్లో ఇప్పుడు చేసిన ఫీట్స్ అన్నింటినీ రెట్టింపు సంఖ్యలో చేసేవాడు, అప్పటి వయసు లేదు, ఇప్పటి వయసు పైబడ్డ రోజులు వేరనిపించింది. తాను అరవై ఏళ్లు దాటినా ఈ మాత్రం చేస్తున్నందుకు మీసం మెలేసుకున్నాడు.

ఆరోజుల్లో తాను సాధించి, ర్యాకుల్లో భద్రపరుచుకున్న మెడల్స్‌ను గర్వంగా చూసుకొన్నాడు.

ఒకటే ఏమిటి జిల్లాల్లో, రాష్ట్రాల్లో, నేషనల్, ఇంటర్నేషనల్‌లో జరిగిన కుస్తీ పోటీల్లో పొందిన కప్పులను, బిరుదులను వరుసగా అమర్చుకున్నాడు, వాటన్నింటిని

రెండు చేతుల్తో ప్రేమగా పుణికి చూసుకొన్నాడు.

ఆనాడు తనను పెద్ద పహిల్వానుగా ప్రభుత్వం గుర్తించి, రాష్ట్రపతి చేతుల మీదుగా పెద్ద

షీల్డ్ అదుకొంటున్నపుడు తీసుకొన్న ఫొటోను ఫ్రేం కట్టించి వ్యాయమశాలలో ఎదురుగా పెట్టాడు, తదేకంగా ఫొటోను చూసిన బాలమల్లు, చేతి కండల్ని బొమ్మ బాగాల్ని చిత్రంగా ఎగిరించాడు.

అప్పటికి ఏడుగంటలు అయ్యింది, వ్యాయామశాలకు ఉన్న ద్వారం మూసి, దొడ్లోకి వెళ్లాడు. అక్కడ మాటకు కట్టిన ఆవులు, తన రాక కోసం ఎదురు చూస్తున్నట్టు ఉన్నాయి.

తన భార్య వసంతలక్ష్మి చనిపోయిన తరువాత, వాటి ఆలనా, పాలనాతో పాటు, పాలు పితకడం బాలమల్లు చూసుకొంటున్నారు, రెండు ఆవుల పాలు పెద్ద సర్వలో పిండుకొని, ఇంట్లోకి వెళ్ళి, దంతదావడం చేసుకొని లీటర్ పాలు తాగి బయటకు వచ్చేసరికి పూర్తిగా తెల్లవారింది. ఇంటి ముందు వరండాలోని బల్ల మీద హరహాసనం వేసుకొని సాధన చేస్తున్న మనిషిలా కూర్చున్నాడు. అలా కూర్చున్నప్పుడల్లా, అతని మనసు నిండా, గతం మెదులుతు ఉంటుంది తమది ప్రధానంగా వ్యవసాయ కుటుంబం అయినప్పటికి, తాత, తండ్రి నుండి కూడ వహిల్వాన్ వంశంగా ఆ చుట్టు పట్ల గ్రామాల్లో పేరు పొందింది.

తండ్రి స్థాపించిన వ్యాయమశాలలోనే, వ్యాయమ విద్యల్లోని కర్రసాము, కుస్తీ పట్లు నేర్చుకున్నాడు. దానికి తోడు శరీర ధారుడ్యాన్ని పెంచుకొన్నారు. తల్లి చనిపోయిన తర్వాత, ఊల్లో ఉన్న బడిలో పదవ తరగతి వరకు చదువుకొని ఒదిలేశాడు.

తనకు 'ఇరవై ఏళ్ళు దాటగానే, మా అమ్మ తమ్ముడు, నా మేన మామ కూతురు . వరలక్ష్మీతో పెండ్లి జరిపించారు. మూడు ఎకరాల భూమి మా ముగ్గురి జీవితాలకు ఆధారమైంది.

వరలక్ష్మికి వ్యవసాయ మెలకువలన్ని తెలుసు కాబట్టి, అన్నీ ఆమే అయి,

వ్యవసాయం

నడిపించింది, అప్పటి వరకు నాకు బతుకు, తేలికగానే కనిపించింది.

మాకు వరుసగా ముగ్గురు ఆడ పిల్లలు పుట్టారు. ఆ సమయంలో, నాయన వరలక్ష్మీ తోడు ఉంటు కుటుంబాన్ని ఈడ్చుకు వచ్చారు. నాయన కాలం చేసిన తర్వాతనే, సంసార భారమంతా తన మీద ఒరిగింది, తనకు వచ్చిన పహిల్వాన్ విద్యతో కుటుంబాన్ని నెట్టుకు రావడం ఎలా అనే భయం ప్రారంభం అయింది.

వరలక్ష్మీ తనను ఏనాడు, మీరేం పనిచేస్తలేరు, ఇంత సంసారాన్ని ఒక్కదాన్ని ఎలా

లాగించాలని, వరలక్ష్మీ తనను నిలదీయకపోవడం కూడా తనకు అవమానంగా అనిపించసాగింది.

ఆమెకు పోలాల్లో ఏదైనా సాయం చేద్దామని పొలాల్లోకి వెళితే, నువ్వు ఎం చేస్తావయ్యా, నువ్వు పెద్ద పహిల్వానవుగదా!! అలా వెళ్ళి గట్టు మీద కూర్చో అనేది చిన్నగా నవ్వుతు.

వరలక్ష్మీ అలా అన్నప్పుడుల్ల, తన మీద ప్రేమతోనా ! లేక ఎకసెక్కంగా నా ? ఆనేది తనకు అర్థం కాకపోయేది, నేను ఏ సాయం చేద్దామనుకున్నప్పటికీ నా సాయాన్ని అంగీకరించేది కాదు! బహుశా నా మీద ఉన్న అభిమానమేనని అర్థం అయింది. సంసారం గడవడానికి తాను కూడా కొంత సంపాదించాలనుకున్నది. ఒక రోజు బాగా ఆలోచించుకొని, విశేష ప్రజాధారణతో వరంగల్‌లో ఆడుతున్నా జెమినీ సర్కస్‌లో చేరాలని వెళ్లాడు. సర్కస్ మెనేజర్ బహద్దూర్ సింగ్‌ను తెలుసుకొని, తాను గెలుచుకున్న పతకాలు, రాష్ట్రపతి రివార్డు చూపించి దానికి తోడు తన శరీరంలోని కండరాలన్నింటిని, వివిధ భంగిమల్లో ప్రదర్శించి చూపించాడు.

బాలమల్లును పరీక్షగా చూసిన బహద్దూల్ సింగ్, మంచి యువకుడు, దానికి తోడు శరీర సౌష్టం గలవారు అనుకొని తన సర్కస్‌లో పహిల్వాన్‌గా నియమించుకుంటే మంచి

ఆకర్షణగా ఉంటుందని భావించి వెంటనే ఒప్పుకొన్నాడు, బాలమల్లు అడిగినంత జీతం కూడా ఇస్తానన్నాడు. జెమినీ సర్కస్‌లో బాలమల్లు చేస్తున్న పట్లు అన్నీ, పిల్లల్ని పెద్దల్ని బాగా ఆకర్షిస్తుంటే, సర్కస్ పహిల్వాన్ పేరు సంపాదించుకొన్నాడు.

సర్కస్ వాళ్ళతో రెండు మూడు రాష్ట్రాలు కూడా తిరిగాడు. నెలనెలా వచ్చే జీతం ఇంటికి పంపేవాడు. వీలైనప్పుడల్లా ఇంటికి వచ్చి పిల్లల్ని చూసుకొనేవారు.

ఇది కొంతకాలం బాగానే గడిచిపోయింది, వన్యప్రాణుల సంరక్షణ అంటూ ప్రభుత్వం

తీసుకు వచ్చిన చట్టం వల్ల సర్కస్‌లోని మగాల్ని, ఏనుగుల్ని ప్రభుత్వానికి అప్పగించారు.

వెను వెంటనే సర్కస్ మూతపడి పోయింది. తనలాంటి ఎందలో కళాకారుల బతుకులు బజారు పాలయ్యాయి, కొంత మంది కళాకారులు తమకు వచ్చిన విద్యలను

నగర కూడళ్లలో ప్రదర్శనలు ఇచ్చుకొంటు బతుకు గడపసాగారు.

ఏది కూడా ఎంతో కాలం సాగలేదు, కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే, అదో విషాధగాథ అనిపిస్తుంది.

సర్కస్ విద్యలన్నింటిని ప్రజలు పూర్తిగా నిరాదరించండం వల్ల అన్నీ మూతపడిపోయాయి. సర్కస్ గురించిన విశేషాలను, ఈనాటి తరానికి కథలు కథలుగా చెప్పాల్సిన పరిస్థితి

ఏర్పడింది అనేది పెద్ద విషాదంగా మారిందనిపిస్తుంది బాలమల్లుకు.

మూడునాళ్ళ ముచ్చటగా ముగిసిపోయిన తన సంపాదన వల్ల తిరిగి ఇల్లు చేరాడు.

తనకు తన కుటుంబానికి ఇంత తిండి పెట్టలేని తన విద్య మీద హేవగింపు కలిగింది.

కాని, కోడిరామకష్ణ, ధారాసింగ్ లాంటి యోధుల్ని ఆదర్శంగా తీసుకొని సాగాలనుకొన్న తన ధడ నిశ్చయాన్ని సడలనివ్వలేదు.

కొంతమంది యువకుల్ని తన వ్యాయమశాలలో చేర్చుకొని, వాళ్ళకు శిక్షణ ఇస్తు, కొంత

ఉపాధి సంపాధించుకోవడం ప్రారంభించాడు. బాలమల్లు నేర్పించే, విద్యల్ని శిష్యులు కూడ శ్రద్ధగా నేర్చుకొని, ఇంటర్వ్యాలకు వెళ్ళి, పోలీస్ ఆఫీసర్లుగా, వ్యాయామ ఉపాధ్యాయులుగా, ఎందరో ఉద్యోగాలు సాధించుకొని బాలమల్లుకు పెద్ద మొత్తంలో పారితోషకం ఇచ్చుకొని ఘనంగా సన్మానించుకొనేవారు.

ఇప్పటికి తన శిష్యులు, ఎంతో అభిమానం చూపిస్తూనే ఉన్నారు.

తనకు కష్టకాలం వచ్చిందని కాలం ఆగలేదు, రెండు ఎకరాలు అమ్ముకొని, ముగ్గురు ఆడ పిల్లల పెండ్లిళ్లు చేశాం. వరలక్ష్మి నేను సంతోషంగా ఉన్నాం. ఆసంతోషం ఎంతో కాలం నిల్వ లేదు.

ఇంతలోకే వరలక్ష్మి తీవ్ర జబ్బుపడింది.

ఆమెకు వచ్చిన 'భోగం ఏమిటో తెలియక ముందే ఉన్న ఎకరం భూమి కూడ అమ్మక తప్పలేదు

ఇవన్నింటిని గమనిస్తున్న వరలక్ష్మీ ఒకరోజు తనతో అంది. "ఏమయ్య నన్ను పట్టుకొని ఎన్ని హాస్పిటల్స్ తిరిగినా నా, వ్యాధి ఇదీ అని డాక్టర్స్ చెప్పలేక పోతున్నారు. పిల్లల పెండ్లిళ్ళు చేశాము నాకా తప్తచాలయ్యా ... నా కోసం నువ్వు మరింత పైసలు ఖర్చుపేడుతు, అప్పుల పాలుకాకు. నేను బతికి బట్ట కట్టేలా లేను, దండం పెడతాను, నువ్వు మాత్రం అప్పులు చేయకు అంటు ప్రాధేయపడింది. వరలక్ష్మీ నన్ను భర్తగా నా కర్తవ్యం నన్ను చేయనియి, నా బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు అవుతుంది ఆమెను ఒప్పించాలని అన్నాడు.

"సుతరాముగా నా నోరు మూస్తూ, నువ్వు నా కోసం చాలా చెశావయ్యె, నిన్ను చేసుకొని

నేను సుఖపడ్డాను కాని, నువ్వు నన్ను చేసుకొని సుఖపడలేదయ్యా... నా మాట నమ్ము,

నన్ను, నిలువరిస్తూనే కన్ను మూసింది,

వరలక్ష్మి అంతరంగా వెళ్ళి పోయినందులకు, బాలమల్లు కంటి నుండి చుక్క కన్నీరు రాలేదు.

కాని గుండె గాయమయింది.

ఆలోచిస్తున్న కొద్ది గతం అంతా చిక్కుపక్ష దారపు ఉండలా ఉంది. దాని లో నుండి

ఏ పోగు లాగినా, నిరాశజనకంగానే ఉంది, ఏ ఒక్కటి ఆశా జనకంగా ముందుకు సాగడం లేదు.

ఆలా ఉంటేనే బతుకు అవుతుందేమో, అనుకొన్నాడు, బాలమల్లు నిర్లిప్తంగా అప్పుడే బుల్లెట్ బండి మీద వచ్చిన, బాలమల్లు పి్రయ శిష్యుడు ముకుందం అంత దూరం నుండే దండం పెడుతు వచ్చాడు. ముకుందాన్ని కళ్ళతోనే పలకరించి, చేతితో ఆహ్వానిస్తు, కూర్చోమంటు కుర్చీ చూపించాడు. 'ఆ! చెప్పు ముకుందం నువ్వు వెళ్ళిన పని ఏమయింది' అంటు అడిగాడు బాలమల్లు

స్కూల్ హెడ్ మాస్టర్ గారిని కలిశాను, మీ స్కూల్‌లోని పిల్లల కోసం, మా గురువు.

పహిల్వాన్ బాలమల్లు గారి ప్రోగ్రాం ఏర్పాటు చేయండి, మీ పిల్లలు వద్ద నుండి తల రూ.యాభై వసూలు చేసి ఇచ్చినా, మా గురువు గారిని ఆదుకున్నవారు అవుతారని అడిగాడు దొరా!

ముకుందం గారు మీరు ఇంతగా చెప్పాలా! ప్రతి ఏడాదిలాగానే, ఈ సంవత్సరం కూడ

వారి ప్రోగాం్ర ఏర్పాటు చేసే వాడిని కాని, మా స్కూల్ విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది.

అందుకే ఈసారి, బాలమల్లు గారి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయలేక పోతున్నాము, దయ చేసి గురువుగారిని ఏమి అనుకో మానండి, అంటూ ప్రాధేయపడ్డాడు దొర. వినయంగా చెప్పాడు "ఫర్వాలేదు ముకుందం బాధ పడకు" అంటు ధర్మంగా ఒక నిట్టూర్పు విడిచి, నొసల్ని మూసి వేళ్లతో రుద్ది మెల్లగా అన్నారు.

"స్థిరమైన ఉపాధిని ఇవ్వలేని ఏవత్తిలో కూడ, మనిషి చివరంట కొనసాడలేదని ఇప్పుడు అనిపిస్తుంది. ముకుందం.

దొరా! అంత మాట అనకండి, మీకు లభించిన అవార్డులను, రివార్డులన్నింటిని చూస్తూంటే, మీ శిష్యులమైన మేము ఎంతో గర్విస్తుంటాము దొర' గొప్పగా అన్నాడు ముకుందు.

వద్దు ముకుందం, ఈ కష్ట కాలంలో నువ్వు నాకోసం వెన్నంటి ఉంటున్నావు, అది చాలు. తటపటాయించిన బాలమల్లు, కుర్చీలో సర్దుకు కూర్చుంటు "ముకుందం.. నేను చాలా మంది దగ్గర అప్పు చేశాను, పాపం వారికి వడ్డీ కూడా కట్టలేకపోతున్నాను. వారంతా నా మీది గౌరవంతో అడగలేకపోతున్నారనిపిస్తుంది. వారు డబ్బు అడగకుండా నన్ను మౌనంగా హిసిస్తున్నారనిపిస్తుంది...! గద్గద స్వరంతో అన్నాడు బాలమల్లు.

"అయ్యో! గురువుగారు, వారంతో నన్ను కలుస్తూనే ఉన్నారు, వడ్డీ గురించిన ప్రస్తావన

ఏమి తేవడం లేదు ... వారంతా ఒక నిర్ణయానికి వచ్చారట" నసుగుతు చెప్పాడు ముకుందం ' ఏమిటి? నిన్ను కలుస్తున్నారా!' ఆశ్చర్యంగా ముకుందం వైపు చూశారు.

" అవును, వడ్డీ పైసలు మీనుండి ఆశించడం లేదు, అసలు ఇస్తే చాలంటున్నారు దోరా !'

"అయితే, నా మీద సానుభూతి చూపిస్తున్నారా! ముకుందం ... అది నాకు నచ్చదు.

ఇప్పటికీ నేను వారి దష్టిలో ఒక మెట్టు దిగజారననిపిస్తుంది, ఇది నేను భరించలేము....

నేను ఏమైనా ఫర్వాలేదు, వారి వద్ద నుండి ఏ మాట చెప్పి డబ్బు తీసుకొన్నానో...

తిరిగి ఇచ్చె అపుడు కూడ ఆ మాట ప్రకారమే ఇస్తాను,

రేపు ఒకసారి వారిని తీసుకోనిరా! మాట్లాడాలి". ముకుందం'అంటు మౌనంగా

లోపలకు వెళ్ళాడు...

ముకుందం మర్నాడు ఉదయమే, బాలమల్లుకు అప్పు ఇచ్చిన నలుగురు వ్యక్తుల్ని తీసుకువచ్చారు. వారందరిని సాదరంగా లోపలకు ఆహ్వానించిన బాలమల్లు తన ముందు కూర్చోపెట్టుకున్నాడు. కాని, ఎవరు ఏమి మాట్లాడలేక పోతున్నారు.

బాలమల్లు ఆ గంభీర క్షణాల్ని ఛేదిస్తూ గొంతు విప్పాడు.

మీరు నాకు అప్పు ఇచ్చి ఆపత్కాలంలో నన్ను ఆదుకున్నారు. మీ అప్పును వడ్డీతో సహా త్వరలోనే తీర్చుకుంటాను నన్ను నమ్మండి !" గొంతు తడబడుతూ మెల్లగా అన్నాడు.

"దొరా! మీకు దండం పెడతాము, మాకు వడ్డీ వద్దు, అసలు ఇవ్వండి చాలు అంటూ ముకుందం ముందు కూర్చున్న వ్యక్తి అన్నాడు.

'అయ్యా! అమ్మగారు బతికి ఉన్నపుడు, మేము, మీకు డబ్బులు ఇచ్చాము, అమ్మగారు

చనిపోయి కూడ మూడు సంవత్సరాలు దాటి పోయాయి,

మాకు కూడా అవసరాలు ఉంటాయి.

ఇపుడు ఇస్తేనే బాగుంటుంది, మరో పక్కన కూర్చోన్న వ్యక్తి ఇదే అదనంగా

భావించి గట్టిగానే అడిగాడు.

ఇస్తారు...

మా గురువుగారు, మీ అందరి డబ్బులు

...... బతిమాలుతు అన్నాడు ముకుందం

మన ఊరి పెద్ద పహిల్వాను కదా! వారి నుంచి మాకు ఎలాంటి వడ్డీ అవసరం లేదు. దయచేసి మా అసలు మాకు ఇప్పించండి చాలు..! "వచ్చిన వారిలో మరో ఇద్దరు ముందుకు వచ్చి అన్నారు.

" ఆగండి! నాకు వడ్డీ మాఫీ చేయవలసిన అవసరం లేదు. నాకు ఒక రెండు నెలల గడువు ఇవ్వండి, వడ్డీ, అసలు ఇస్తాను' అర్థింపుగా అడిగాడు బాలమల్లు.

"ఇప్పటికే టైం చాలా ఇచ్చాము, ఈ రోజు డబ్బులు ఇస్తే వెళ్ళిపోతాము దొరా!

ముకుందం కంగారుపడిపోతు 'గురువుగారు ఇస్తానంటున్నారుగా, రెండు నెలలు ఓపిక పట్టండి ప్లీజ్.. అంటూ వాళ్లను బతిమిలాడసాగారు. 'లేదు మాకు డబ్బులు కావాలి! మీ గురువుగారికి చెప్పి ఇప్పించు ముకుందం అంటున్న వాళ్ళను చూస్తున్న బాలమల్లులో మొదటి సారి అవమానభారంతో, పళ్ళు పట పటలాడుతు, పిడికిళ్ళు బిగించుకున్నాయి, ఎంతో కష్టంగా తమాయించుకొన్నాడు, అంతలోనే ఒక నిర్ణయానికి వచ్చిన వాడిలా లోపలకు వెళ్ళాడు.

చేతుల నిండా తనకు వచ్చిన గోల్డ్ మెడల్స్‌ను, రజత పతకాలను, మరికొన్ని పెద్దపెద్ద కప్పులన్నింటిని పట్టుకు వచ్చి వాళ్ళ ముందు పెట్టాడు.

" ఇవన్నీ....

నేను గెలిచి సాధించిన బంగారు, వెండి పతకాలు, వీటన్నింటి విలువ లక్షల్లో ఉంటుంది, మీలో ఎవరికి, కావలసింది, వారు తీసుకువెళ్ళండి.

'అయ్యా ! అవన్ని మీరు సాధించుకొన్న ఎంతో విలువైన పతకాలు, కావచ్చు, కాని ఆవన్ని మేము సంపాదించుకొన్న మా డబ్బుకు సరిరావయ్య !

"అవన్నీ మాకు అక్కర లేదు, మాకు కావలసింది, డబ్బు' ముక్త కంఠంతో అన్నారు, ఊహించని మాటలు విన్న బాలమల్లు ఎంతో భావోద్యోగానికి లోనవుతు, నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

ముకుందం వేరు పేరునా వేడుకొంటు, మా గురువుగారు అడిగిన వాళ్ళందరిని సమయం ఇవ్వండి! నన్ను నమ్మండి.. పెద్దాయనను ఇచ్చింది పెట్టకండి!' మీరు వెళ్ళండి'

అంటు వేడుకొన్నాడు.

'మీ దగ్గర డబ్బు అ తీసుకొన్నది నేను నేను చెప్పిన గడువులో మీ డబ్బులు మీకు అప్పజెపుతాను." అంటు చేతులు జోడించబోయిన బాలమల్లు రెండు చేతుల్ని, ఆ వచ్చిన వారే చేతులు కలపకుండా ఆపారు."

ఆకస్మికంగా చేతులు జోడించి దండం పెట్టపోయిన బాలమల్లు పనికి, అప్పులవారు ఉగ్భాంతి చెందుతూ బాలమల్లు మోహంలోకి సూటిగా చూడలేక పోతు...

'సరే, దొరా! మీరన్న గడువులో మాత్రం తప్పకుండా డబ్బులు ఇవ్వండి" అంటూ ఒకరొకరుగా వెళ్ళిపోయారు.

గురువుగారు, మీరు ఇంత అధైర్యపడిపోతు వాళ్ళకు దండం పెట్టబోతుంటే,

నేను చూస్తు తట్టుకోలేక పోయాను, అంటూ ముకుందం బాలమల్లు దగ్గరగా వెళ్ళాడు.

ముకుందాన్ని బాలమల్లు గట్టిగా కౌగలించుకొంటు..

ముకుందం, నేటినుండి నేను ఒక నిర్ణయానికి వచ్చాను, వాళ్ళ డబ్బు చెల్లించేవరకు

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో, లారీల్లోని ధాన్యపు బస్తాలను, లోడ్, అన్ లోడ్ చేస్తాను స్థిరంగా అన్నాడు.

గురువుగారు, మీరు బస్తాలు మొస్తారా! కండ్లల్లో నీళ్ళు తిరుగుతుంటే గద్గదికంగా అన్నాడు ముకుందం,

బాధపడకు ముకుందం, ఇన్నాళ్లు నేను పెంచుకొన్న కండల్లో సత్తువ ఉంది. నేను నమ్ముకున్న శరీర ధారుడ్యం ఉంది, వంద కేజీల బస్తాలు మోయడం ఒక లెక్క కాదు ముకుందం .. మొహం మీద ముసిరిన సన్నటి చెమట చుక్కల్ని తుడుచుకుంటూ అన్నాడు.

"ఇంత కఠిన నిర్ణయం ఎందుకు తీసుకున్నారు గురువుగారు, మీ తప్పు మీ శిష్యులమైన

మేమంతా కలసి తీర్పుతాము, దయచేసి, మీరు నిశ్చింతగా ఉండండి" అన్నాడు

'వద్దు ముకుందం, నేనే తీర్చుకొంటాను. కానీ, నా కున్న అనుమానం ఒక్కటే.. భగవంతుడు ఆ ఆయుష్షును ఇచ్చిన గడువులోపల నేను వీళ్లందరికీ అప్పు తీర్చడానికి పెట్టిన గడువు ముందు వస్తుందోనని అర్థం కావడం లేదు... కంపిత స్వరంతో తాను అనుకొన్నా మాటలు యాదచ్ఛికంగా పైకి అనేశాడు బాలమల్లు భయం భయంగా..

## రావుల పుల్లా చారి

స్వస్థలం కరీంనగర్ జిల్లా హుజురాబాదు. తల్లి తండ్రులు ఈశ్వరమ్మ రావుల దశరథం. 1950 లో న్మించారు. బి.కాం. తర్వాత నీటి పారుదల శాఖలో ఉద్యోగంలో చేరారు. వివిధ హొదాలో పనిచేసి 2008 లో సూపరింటెండెంట్ గా పదవీ విరమణ పొందారు. . అంతకుముందు నుండే సాహిత్యం వైపు అడుగులేశారు. కవితలు, కథలు, నాటక రచనలు మనసు పెట్టి రాయడం ప్రారంభించారు. ఇప్పటి వరకు ఇరవై నాటికలతో పాటు బెత్తెడు జాగ " కథా సంపుటి నాలోకి" . వ్యాస సంపుటి " వాళ్ళిద్దరు కవితా సంపుటి " ప్రచురించారు. జంతువులే ప్రధాన పాత్రలుగా ఎంచుకొని కథలను రాశారు. రచ్చబండనాటిక 2016 లో నిర్వహించిన 20వ నంది నాటకోత్సవాల్లో ప్రదర్శితమై రెండు తెలుగు రాష్ట్రాలకుగాను ద్వితీయ రచనగా నంది అవార్డును అందుకన్నారు. 2014 లో తెలంగాణ ప్రభుత్వం ఉత్తమ రచయిత అవార్డు తో సన్మానించింది.

# నిరుపేద



**సూర్యప్రసాద్ రావు**
**9885156844**

ప్రపంచ ప్రసిద్ధి చెందిన మా మల్టీనేషనల్ కంపెనీ రజతోత్సవ సంబరాల సంరంభాలు ప్రారంభమైనాయి. దేశమంతా విస్తరించిన అన్ని శాఖల ఉద్యోగులకు, మా అభయ ఛారిటబుల్ ట్రస్ట్ భాగస్వాములకు ఆ ఆరురోజుల పండుగే! విందులూ వినోదాలు చర్చలు, సెమినార్లు, భవిష్యత్ ప్రణాళికా రచనలలో కాలమే తెలియడం లేదు. ఉదయం తొమ్మిది గంటలకే అల్పాహార విందు తరువాత ప్రారంభమయ్యే సమావేశాలు ఇండోర్ ఎ.సి. ఆడిటోరియం అలుపూ సొలుపూ తెలియనీయడం లేదు. సామూహిక వివాహ వేడుకల్లా, సామూహిక వ్రత నిర్వహణా విధానాల్లా పాల్గొనే వారిలో నూతనోత్సాహం నింపుతూనే ఉన్నాయి. మధ్యాహ్నం ఒంటిగంటకు దేశీయ వంటకాలతో షడ్రసోపేతమైన విందుభోజనం ఓ గంట కునుకు ప్రసాదించి తీరుతుంది! అందుకే మధ్యాహ్నం నాలుగు గంటలకు మొదలై స్వల్ప టీ విరామంతో రాత్రి తొమ్మిది గంటలకు ముగుస్తున్నాయి!

ఛైర్మన్ గారి పర్సనల్ సెక్రటరీగా రజతోత్సవ సంబరాల నిర్వహణ బాధ్యతలన్నీ నా భుజస్కంధాలపై వేసుకొని పదిమంది అసిస్టెంట్ల సహాయంతో ఆ మహోత్సవాలలో ఎట్టి లోపాలు రాకుండా చూడడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాను. ఆరు రోజుల కార్యక్రమాలు ముగింపు దశకు చేరుకున్నాయి.

ఆ ఆరు రోజుల కార్యక్రమాలు రూపొందించడంలో, సాహితీ, సాంస్కృతిక మనోవైజ్ఞానిక, మనోరంజక ప్రోగ్రాములతో

అతిథులనందరినీ అలరించినందులకు, మానసికోల్లాసం కలిగించినందుకు ఛైర్మన్‌గారు నన్ను అభినందించారు. ఎక్కడా విసుగూ విరామం లేకుండా, తంచనుగా అనుకున్న సమయానికి తగిన విధంగా, ఎవ్వరినీ నొప్పించక నేను నొచ్చుకోకుండా నిర్వహించిన కార్యక్రమాలకు అతిథుల ఆదరణ అందుకున్నాను. అందులో నాతో పాటు కలిసి పనిచేసిన సి.ఇ.వో పాత్ర ప్రముఖంగా ప్రశంసించదగింది! అందుకే ఆరు రోజులు ఆరు క్షణాల్లో అయిపోయాయనిపించింది!

ముగింపు సమావేశం ఛైర్మన్‌గారి అధ్యక్షతన ప్రారంభమై అతిథుల అంతరంగ ఆవిష్కరణకు అవకాశమిచ్చింది. కంపెనీ విధి విధానాలపై, నడుస్తున్న భవిష్యత్ కార్యక్రమాలపై అనుభవాలు వివరించమని ఆహ్వానించబడ్డాయి.

"మా కంపెనీ హితులకు, సన్నిహితులకు, శ్రేయోభిలాషులకు, నిర్వహణలో ప్రముఖపాత్ర వహించే నిర్వాహకులకు, తమ శక్తి సామర్థ్యాలతో మన సంస్థను ఈ స్థాయికి తెచ్చిన ఉద్యోగ మిత్రులందరకూ స్వాగతం! సుస్వాగతం! శుభ స్వాగతం!

పాతిక సంవత్సరాల క్రితం చిన్న వ్యవస్థగా ప్రారంభమైన మన కంపెనీ ఆర్థిక వ్యవహారాలు, పెట్టుబడులు, షేర్‌లు, లావాదేవీలు అనూహ్యంగా పెరగడం ప్రారంభించి సుమారు పదిహేను సంవత్సరాలైంది! అప్పటి వరకూ నత్తనడక సాగిన షేర్లు, లాభాలు, లాభాల వాటాలు దినదిన ప్రవర్ధమానంగా పెరగడం ప్రారంభించాయి. ఎందరో ఔత్సాహికులను ఆకర్షిస్తున్నాయి. సామాజిక సేవను ప్రోత్సహిస్తున్నాయి. ఈ సందర్భంగా మిమ్మల్ని మనసు విప్పి మాట్లాడమని, మీ అమూల్యమైన, నిర్మాణాత్మకమైన సలహాలతో, సూచనలతో మన బంగారు భవిష్యత్తుకు పటిష్టమైన పునాదులు వేయవలసిందిగా ఒక్కొక్కరిగా వేదిక మీదకు ఆహ్వానిస్తున్నాను".

నా స్వాగత వచనాల తరువాత ఒక్కొక్కరు వేదిక మీదకు వచ్చి తమ అమూల్యమైన అంతరంగాలను ఆవిష్కరించడం ఆరంభించారు. "మిత్రులారా! కంపెనీ ప్రారంభమైన దగ్గరనుండీ మనలో కొందరం భాగస్వాములుగా ఉంటున్నాం! పి.యమ్. చెప్పినట్లుగా పదిహేను సంవత్సరాల నుండీ షేర్ల విలువ బాగా పెరిగింది. అభయ ఛారిటబుల్ ట్రస్ట్ భాగస్వామ్యానికి ఎందరో ముందుకు వస్తున్నారు. మన కంపెనీలో షేర్లు కొనాలని ఎందరో తహతహలాడుతున్నారు. దానికి కారణం ఛైర్మన్ గారు చేపడుతున్న సామాజిక కార్యక్రమాలు! మురికివాడలను బాగు చేయడంలో, స్కూళ్ళను స్థాపించడంలో, నిర్వహించడంలో, వారికి కనీస అవసరాలు సమకూర్చడంలో మనల్ని భాగస్వాములను చేస్తున్నారు. కనుకనే మనం కూడా చిత్తశుద్ధితో భారీ పెట్టుబడులు పెడుతున్నాము. ఫలాలు రాబట్టుతున్నాం!" ఒకరు భాగస్వామ్యం వివరించారు.

"డియర్ ఫ్రెండ్స్! కంపెనీ భాగస్వామ్యం గొప్పదా... మన అభయ ఛారిటబుల్ షేర్లు కొనడం గొప్పదా... అని ప్రశ్నిస్తే..." చెట్టుముందా... విత్తుముందా... అనే సామెత గుర్తుకు వస్తుంది. మేము రెండింటిలోనూ మా వంతు కృషి చేస్తూ ఆనందాన్ని

అనుభవిస్తున్నాం! కంపెనీ ఈ విధంగా దినదిన ప్రవర్ధమానంగా వర్ధిల్లాలని మనలాంటి వారెందరో మనతో చేయికలపాలని ఆశిస్తున్నాము!"

"మా కంపెనీ నిర్మించే పేదల గృహ సముదాయాలకూ, స్కూలు బిల్డింగ్‌లకూ, మరుగుదొడ్లకూ రాజీపడని నాణ్యత తగ్గని స్వల్పమైన లాభాలతో నిర్మించే అవకాశమిస్తున్న ఛైర్మన్ గారికి కృతజ్ఞతలు తెలపకుండా ఉండలేను!"

"అనాధ శరణాలయాల నిర్వహణకు, స్కూళ్ళల్లో మధ్యాహ్న భోజన పథకాలకు అవసరమైన అన్ని సంబారాలను సమకూర్చే అవకాశం కలిగించినందులకు ఛైర్మన్ గార్కి హృదయపూర్వక నమస్కారాలు సమర్పించుకొంటున్నాను!"

అభయ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న అనేక సామాజిక సహకార పునరుద్ధరణా కార్యక్రమాల్లో తమవంతు ఇతోధిక సహాయ సహకారాలందిస్తూ అత్యంత సంతృప్తిని, ఆత్మీయ అనుభూతిని తమ పొగడ్తల ద్వారా తెలియజేసిన భాగస్వాముల ఆనందాన్ని ఛైర్మన్‌గారు చిరునవ్వుతో స్వీకరించారు. అందుకు సమాధానం చెప్పమని సైగ చేశారు.

అందరి ఆత్మీయ భాషణలు పూర్తయిన తరువాత నేను తిరిగి మైక్ ముందుకు వచ్చాను. 'ఆత్మీయ అనుభూతులు పంచిన అందరికి కృతజ్ఞతా భివందనములు తెలియపరు–స్తున్నాను. ఇంతటి అమోఘమైన, అనూహ్యమైన నిర్మాణాత్మక కార్యక్రమాలు ప్రారంభం కావడానికి కారణం... ఒక ఆశ్చర్యకరమైన, నమ్మశక్యంగాని, ఒక అద్భుతమైన సంఘటన! అది జరిగి నేటికి సరిగ్గా పదిహేను సంవత్సరాలైంది. ఆ సంఘటన వివరించమంటే, సభికులంతా కోరుకుంటే నేను తప్పక వివరించుదా మనుకుంటున్నాను, అదీ... ఛైర్మన్‌గారి అనుమతితో!"....

క్షణం విరామమిచ్చి ఛైర్మన్ గారి వైపుచూచి ఆయన అంగీకారం తీసుకున్నాను. ఆ విరామాన్నే అతిధులు భరించలేకపోయారు. "చెప్పండి! ఏం జరిగిందో? ఏం జరిగిందో?" అతిధులంతా మూకుమ్మడిగా ఆసక్తిని చూపించారు. "ఒకసారి బిజినెస్‌టూర్‌లో ఉండగా... మార్నింగ్ వాకింగ్ తరువాత ఛైర్మన్‌గారు తమ పర్స్ పోగొట్టుకున్నారు. హోటల్‌కు తిరిగి వచ్చిన తరువాత తెలిసింది! పర్స్‌పోయిందని"!

"వాట్! ఛైర్మన్‌గారి పర్స్‌పోయిందా!" ఒకరు ఆశ్చర్యం ప్రకటించగానే ఒక్కొక్కరుగా తమ సంభ్రమాశ్చర్యాలు ప్రదర్శించారు. "అందులో ఎంతో విలువైన కరెన్సీ ఉండాలే!" "ఇండియన్ కరెన్సీయే కాదు.. డాలర్లు, పౌండ్లు ఉండి ఉండాలే!" "ఎన్నో కంపెనీల కార్డులు ఉండాలే!" "డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు ఉండాలే!" వారి రకరాల ప్రశ్నలతో సభలో గందరగోళం నెలకొంది. వెంటనే నేనందుకున్నాను... చిన్న సూచన చేశాను. ఆ సంఘటన యధాతథంగా వివరించాలంటే సభ నిశ్శబ్ధంగా ఉంటే మంచిది!" అంతే! సభలో గుండు సూది వేస్తే వినిపించేంత నిశ్శబ్దం ఆవహించింది.

"నా పర్స్‌పోయింది... రాజేష్!" ఛైర్మన్ గారన్నారు. "ఎప్పుడుపోయి ఉంటుందంటారు?" "ఏమో! ఎప్పుడు పోయిందో గమనించలేదు. బహుశః మార్నింగ్

వాకింగ్ తరువాత పోయి ఉంటుంది!" ఆయన ఆలోచనలో పడ్డారు. 'ఈరోజు మురికివాడల్లో మార్నింగ్ వాకింగ్ చేశారు. అక్కడే పోయి ఉండాలి' ఆయనవైపు ప్రశ్నార్థకంగా చూశాను. 'అక్కడే పోయి ఉంటుంది రాజేష్! అయినా సాయంత్రానికి ఎవరో ఒకరు తెచ్చి ఇస్తారులే!' నిబ్బరంగా అన్నారు. నేను కంగారు పడ్డాను. 'సర్' అందులో వేల రూపాయలున్నాయి. ఫారిన్ కరెన్సీ ఉంది! ఎన్నో కార్డులు ఉన్నాయి! పోలీస్ కంప్లెయింట్ ఇద్దాము?' ఆయన అనుమతిని అడిగాను. "ఉన్నా... పరవాలేదు రాజేష్! ఎవరో ఒకరు తప్పకుండా తెచ్చి ఇస్తారు!" "నాకు నమ్మకం లేదు సర్! వెంటనే బ్యాంక్‌లకు ఫోన్ చేసి కార్డుల్ని బ్లాక్ చేయమని చెబుతాను, ఎకౌంట్స్ సీజ్ చేయమని చెబుతాను... ఫారిన్ కరెన్సీ వస్తే ఇన్‌ఫామ్ చేయమంటాను' కార్యాచరణ వివరించాను.

'లేదు రాజేష్! నాకు పేదరికం నిజాయితీ మీద నమ్మకం ఉంది! వారి పవిత్రమైన హృదయాల మీద ప్రగాఢమైన విశ్వాసముంది! వాళ్ళ కరుణాతరంగాల మీద అపనమ్మకం కలిగే అవకాశం లేదు. తప్పకుండా సాయంత్రం దాకా వేచి చూద్దాం! పర్స్ తప్పకుండా దొరుకుతుంది! అందులో మన ఫోన్ నంబర్లు అడ్రస్‌లున్నాయి. సాయంత్రానికి ఫోన్‌కాల్ తప్పక వస్తుంది!".

ఛైర్మన్ గారు నిర్లిప్తంగా విశ్రాంతి కోసం రూమ్‌లోకి వెళ్ళిపోయారు. పేదల అంతరంగాల మీద ఆయనకున్న అవ్యాజానురాగానికి, నిజాయితికి నాకు అమితాశ్చర్యం వేసింది! పర్స్ దొరకదని తెలుసు! ఏ చర్య తీసుకోవాలన్నా సాయంత్రం దాకా ఆగాలి!

ఆయన ప్రశాంతంగా హోటల్ రూమ్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారు! నేను బయట కారిడార్లో కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాను.సరిగ్గా ఐదు గంటలకు ఛైర్మన్ గారి ఫోన్ రింగయింది. స్పీకర్ ఆన్ చేశాను. "హలో" నేనే జవాబిచ్చాను.

"చైర్మన్‌గారి పర్స్ మా మురికివాడలో దొరికింది! మీరు వాడ చివరనున్న పబ్లిక్ ఫోన్ దగ్గరకు వస్తే అందచేస్తాను"అది ఓ పిల్లవాడి గొంతులా ఉంది. స్పీకర్‌లోంచి ఆ సంభాణంతా విని ఛైర్మన్‌గారు బయటకు వచ్చారు.

"వెళ్దామా... రాజేష్! నేను చెప్పానా... లేదా... తప్పకుండా నా పర్స్ దొరకుతుందని... అది సేఫ్‌గా తిరిగి నా చేతికి వస్తుందని" ఆయన ముఖంలో చిరునవ్వు అందంగా తొంగిచూసింది."అలాగే సర్! వెళ్దాం రండి!" మురికివాడ ముందు పబ్లిక్ టెలిఫోన్ ముందు కారు ఆపించాను. ఎదురుగా పర్స్ చేతితో పట్టుకున్న పిల్లవాడు కనిపించాడు. కారు ఆగిందో...లేదో... దిగిపోయి గబగబా ఆ పిల్లవాడి చేతిలో నున్న పర్స్‌ను లాక్కునేంత పని చేశాను.

క్షణంసంగంలో పర్స్‌ను ఓపెన్ చేసి పర్స్ విలువను అంచనా కట్టాను. నోట్లన్నీ యధాతథంగా ఉన్నాయి. ఫారిన్ కరెన్సీ సెఫ్‌గా ఉంది. ఇక బిజినెస్ కార్డుల గురించి చెప్పనక్కరలేదు. "పర్స్ సేఫ్‌గా ఉంది సర్!" ఆనందంతో ఆయన కందించాను. "ఉంటుందని అప్పుడే చెప్పానుగా!" నిర్లిప్తంగా అన్నారు. ఆ పిల్లవాడి వైపు ఎగాదిగా చూశాను. బాగా

మాసిపోయిన చొక్కా నిక్కరు. అక్కడక్కడా చిగురులు కనిపించకుండా మాసికలు వేసి ఉన్నాయి. తైల సంస్కారం లేని జుట్టు... నిరుపేదరికానికి నిలువెత్తు నిదర్శనంలా ఉన్నాడు. సుమారు పది, పన్నెండేళ్ళుండవచ్చు. వయసు తెలియడం లేదు.

ముందుగా నేను కారు ఎక్కబోతుంటే... ఆ పిల్లవాడన్నాడు. "అయ్యా!' అని పిలిచాడు... నేను కారు దిగి ఏమిటన్నట్లు చూశాను. 'నాకు కొంచెం డబ్బు కావాలి!" వినయంగా అడిగాడు. "చూశారా సర్! పర్స్ తిరిగి ఇచ్చినందుకు వెయ్యో, పదివేలో అడగబోతున్నాడు!' కళ్ళతోనే ఎక్స్‌ప్రెషన్ ఇవ్వగలిగాను. "ఎంత కావాలి బాబూ?" ఛైర్మన్ గారు మృదువుగా అడిగారు. 'ఒక్క రూపాయి ఇప్పించండి!" ఆ పిల్లవాడు మరింతవినయంగా అడిగాడు. 'ఒక్క రూపాయా?' నేను నిశ్చేష్టుడనైనాను. వాడిని, వాడి పేదరికాన్ని చులకనగా చూసినందులకు తలదించుకున్నాను. "ఎందుకు బాబూ?' ఛైర్మన్‌గారు వివరమడిగారు.

'అయ్యగారూ! పర్స్ దొరికినదగ్గర నుండీ మీ నంబర్‌కు ఫోన్ చేద్దామనుకుంటున్నాను. మురికివాడలో ఫోనుండదుగా! తీరా పబ్లిక్ ఫోన్ దగ్గరకు వచ్చేసరికి రూపాయి అవసరమైంది. ఈ షాపువాడి దగ్గర రూపాయి అప్పు తీసుకొని మీకు ఫోన్ చేశాను. రూపాయి అతడికి తిరిగి ఇవ్వాలిగా! అందుకే రూపాయి అడిగాను. నాకీయనవసరం లేదు. ఆషాపు వాడికివ్వండి!'

సమాధానం కోసం ఎదురు చూడకుండా వాడు మురికివాడలో కలిసిపోయాడు. కథ ముగించి నేను సభికుల వైపు చూశాను. క్షణకాలం సంభ్రమాశ్చర్యాల నుండి తేరుకొనిన సభికులంతా ముక్తకంఠంతో ఒకే ఒక ప్రశ్నవేశారు. "తరువాతేమైందో చెప్పండి! మమ్మల్ని సస్పెన్స్‌తో అర్థాంతరంగా వదలి వేయకుండా మిగిలిన కథ చెప్పండి!" వారికి సమాధానం చెప్పడం కోసం ఛైర్మన్ గారివైపు చూశాను. "ఇప్పుడు మిగిలిన కథ నేను చెబుతాను...." ఛైర్మన్‌గారందుకున్నారు. "పేదవారి గురించి నేను చెప్పిన మాటలు నిజమైనాయి! ఆ పేద పిల్లవాడు రూపాయి తీసుకోకుండా యథాతథంగా నా పర్స్ తిరిగి ఇవ్వడం ద్వారా వారి నిజాయితీ నిరూపించబడింది. వారి కరుణాంతరంగాలు ఆవిష్కరించబడ్డాయి. వాళ్ళ పవిత్రమైన హృదయాలు, నిష్కల్మషమైన జాలి, దయ, సానుభూతి అవగతమైనాయి. అవి నాకంటే ముఖ్యంగా నా పి.యస్.రాజేష్ ముందు సాక్షాత్కరించాయి.

"షాపువాడికి రూపాయి ఇచ్చేసి ఆ పిల్లవాడిని అనుసరించమని వాడి వివరాలు సేకరించమని, వారి ఆర్థిక స్థితిగతులను అవగాహన చేసుకు రమ్మనమని మురికివాడకు పంపించాను. ఆ మురికివాడ పరిస్థితిని అంచనా కట్టి తిరిగి వచ్చేంతవరకూ అక్కడే ఉంటానని షరతు విధించాను.

సరిగ్గా అరగంటకు రాజేష్ తిరిగి వచ్చాడు. అతడు సేకరించిన వివరాలు వారి నిరుపేద జీవితాల స్థితిగతులు నా హృదయాన్ని ద్రవింపచేశాయి. ఆ రోజుకు సరిగ్గా ఆ పిల్లవాడి అక్క చనిపోయి పదిరోజులైంది. మరునాడు, పదకొండవ రోజు కనీసం

ముగ్గురికైనా అక్క ఆత్మశాంతికై అన్నం పెట్టాలని తండ్రీ కొడుకులు ఆశపడ్డారు. అందుకు కూడా డబ్బు దొరకలేదు. ఆ సమయంలోనే నా పర్స్ దొరికింది. అందులో డబ్బు ఖర్చు పెట్టి అన్నదానం చేయమని ఎందరో ప్రలోభపెట్టారు. కానీ వాడి నిజాయితీ అందుకు ఒప్పుకోలేదు. ఫలితంగా నా పర్స్ క్షేమంగా నన్ను చేరుకొంది!" క్షణం ఆగి కథ కొనసాగించాడు.

"అప్పుడే ఆ మురికివాడను దత్తత తీసుకోవాలనిపించింది. వారికి కనీస సౌకర్యాలు కల్పించాలనిపించింది. ముఖ్యంగా మరుగుదొడ్లు కట్టించి, మురుగు పారుదల సౌకర్యాలు పెంచి ఆరోగ్యాన్ని హరించే దోమలు వైగరాలు నివాసం చేయకుండా చేయాలనిపించింది. ప్రాథమిక వైద్యశిబిరం నెలకొల్పాలనిపించింది. విద్య నేర్పడానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలనిపించింది. అందులో భాగంగా మొట్టమొదటగా మరునాడు ఆ పిల్లవాడి అక్క దశదిన కార్యక్రమం సందర్భంగా ఆ మురికివాడలో అందరికీ ఆహారపు పొట్లాలు పంచి పెట్టమని, ఆవిధంగా అన్నదాన కార్యక్రమం చేయమని పి.యస్.ను ఆదేశించాను. ఆ క్షణం నుండి మన అభయ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహించే కార్యక్రమాల్లో విప్లవాత్మకమైన పెనుమార్పులు కావాలని ఆశించాను. అందుకు అందరూ సహకరించారు. నెమ్మదిగా మురికివాడలు అభివృద్ధి చెందడం మనం కనులారా చూస్తూనే ఉన్నాం!"

ఛైర్మన్‌గారు ఉపన్యాసం ముగించి కూర్చుండిపోయారు. సభ నిశ్శబ్దం నుండి తేరుకునేలోగా పదిహేనేళ్ళ క్రితం ఆరోజు సర్వసభ్య సమావేశంలో ఛైర్మన్‌గారి ప్రసంగ పాఠ సారాంశాన్ని సభికులకు జ్ఞప్తి చేశాను. "స్నేహితులారా! సమాజంలో ఉన్న వాళ్ళంటే గౌరవం... పేదవారంటే చులకన! ఉన్న వాళ్ళు ప్రలోభాలకు లోనుకారని, నిజాయితీ వారికి మాత్రమే ఉందని, ప్రగాఢమైన నమ్మకం! పేదవారంతా ఆశాపరులు, స్వార్థపరులు, నిజాయితీ లేనివారని, విశ్వాసం లేనివారని మన అంతరంగాలలో పాతుకుపోయింది.

ఈరోజు జరిగిన ఒక అద్భుతమైన సంఘటన ఆవిధంగానే ఆలోచించే రాజేష్ అంచనాలను పటాపంచలు చేసింది. లక్షల విలువైన నా పర్స్ దొరికినా ఒక్క రూపాయి కూడా ఆశించక కేవలం నాకు ఫోన్ చేసినందులకు అప్పుగా తీసుకున్న ఒక్క రూపాయిని మాత్రమే ఇవ్వమన్న మురికి వాడల్లోని పది పన్నెండేళ్ళ పేదపిల్లవాడు వాళ్ళ నీతి నిజాయితీలకు పట్టం కట్టాడు. వాడి కరుణాంతరంగాలను ఆవిష్కరించాడు.

సమాజంలో తినడానికి తిండిలేని, నిలువ నీడలేని అటువంటి పవిత్రమైన వారి మనుగడకు, పురోభివృద్ధికి మన అభయ ఛారిటబుల్ ట్రస్ట్ స్థానం కల్పించాలి! మరిన్ని సంక్షేమ పథకాలు, సేవా కార్యక్రమాలు రూపుదిద్దుకోవాలి! ప్రతీపైసా అవసరమున్న వాడికి అందుతుంది. అటువంటి మరికొందరికి చేయూతనిస్తారు. కనుక మన పెట్టుబడులు మురికివాడల పునరుద్ధరణకు వినియోగించుకుందాం! ప్రభుత్వమేదైనా మేచింగ్ గ్రాంట్ ఇస్తే దానిని సద్వినియోగపరుచుకుందాం!"

ఆరోజు ఛైర్మన్‌గారి ప్రసంగ పాఠ సారాంశం జ్ఞప్తికి తెచ్చిన తరువాత

అభయఛారిటబుల్ ట్రస్ట్ సాధించిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను వివరించాను. "మనం ఎన్నో అనాథాశ్రమాలు నెలకొల్పాం! మానసిక వికలాంగులకు ఆశ్రయం కల్పించాం! నిరుపేద వృద్ధాశ్రమాలు నిర్మించాం! ఎందరినో దత్తత తీసుకొని ఉన్నత విద్యాభ్యాసం అందించాం! మరెందరినో ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, లాయర్లుగా, టీచర్లుగా తీర్చిదిద్దాం! నిరుపేద యువతులకు సామూహిక వివాహాలు చేయించాం! ప్రతీ జంటకూ మాంగల్యాలు, జత పట్టుబట్టలు, చిన్న కుటుంబానికి కావలసిన వంటపాత్రలు, తదితర నిత్యావసర వస్తువులను దానంగా అందిస్తున్నాం! అందుకే మన ఛారిటబుల్ ట్రస్ట్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఎందరో ధనవంతులు ముందుకువస్తున్నారు. అందుకు కారణం...ఆరోజు జరిగిన మురికివాడ సంఘటనే! ఆ పిల్లవాడే మన ఛారిటబుల్ ట్రస్ట్ దిశానిర్దేశాన్ని మార్చగలిగాడు. అందుకు ఆ పేద పిల్లవాడికి హృదయపూర్వకమైన కృతజ్ఞతలు సభాముఖంగా సమర్పించకుండా ఉండలేకపోతున్నాను!" నా గొంతు గద్గదమవ్వడం స్పష్టంగా తెలుస్తోంది.

క్షణకాలం సభలో గుండుసూది వేస్తే వినిపించేంత నిశ్శబ్దం ఆవరించింది. మరుక్షణంలో కలకలం మొదలైంది. ఒకరు లేచి సమయానుకూలమైన సందర్భోచితమైన మంచి ప్రశ్న సంధించాడు. "ఇంతకూ ఆ పిల్లవాడెవరు? ఇప్పుడెక్కడ ఉన్నాడు? ఏం చేస్తున్నాడు? ఎలా ఉన్నాడు? ఈ మిలియన్ డాలర్ల ప్రశ్నలకు సమాధానం లభించేంత వరకూ సభలో కలకలం సద్దుమణగదు!"

అందరూ... ఔనంటూ ముక్తకంఠంతో ఆ ప్రశ్నలను సమర్ధించారు. ఉత్కంఠతో అందరి చూపులూ నా మీద, ఛైర్మన్‌గారి మీదకు ప్రసరించనారంభించాయి. నేను ఛైర్మన్‌గారిని, సి.ఇ.ఒను మార్చి మార్చి చూస్తున్నాను. ఛైర్మన్ గారి ఆదేశానుసారం సి.ఇ.ఒ.ను ప్రసంగించవలసిందిగా ఆహ్వానించాను. అంతవరకూ వేదికపై ఓ మూల ఆశీనుడైన సి.ఇ.వో మైక్ ముందుకు రావడంతో కలకలం కొంత సద్దుమణిగింది. "సభకు నమస్కారం! ఆ పేద పిల్లవాడెవరో నాకు తెలుసు! తరువాత ఏం చేశాడో తెలుసు! ఛైర్మన్‌గారు అనుమతిస్తే ఆ పిల్లవాడి కథ వినిపిస్తాను" అని సి.ఇ.వో అనగానే సభలో నిశ్శబ్ధం రాజ్యమేలసాగింది.

ఛైర్మన్‌గారు చిరునవ్వుతో అంగీకారం తెలుపగానే సి.ఇ.వో ప్రారంభించారు. "డియర్ ఫ్రెండ్స్! ఛైర్మన్‌గారు పర్సు పోగొట్టుకున్న అరగంటకు మురికి కాలువ ఒడ్డున ఆయన పర్స్ ఆ పిల్లవాడికి కనిపించింది. అందులో ఏవేవో కార్డులున్నాయి. వేలు, ఐదు వందలు, వంద రూపాయల నోట్లున్నాయి. వాటితో బాటు ఏవేవో రంగురంగుల నోట్లు కనిపించాయి. వెంటనే ఆ పిల్లవాడు తన తండ్రికి ఆ పర్స్ చూపించాడు. తనకు తెలిసిన ఇంగ్లీషులో వాడు ఆ కార్డుపైనున్న యజమాని పేరు, అడ్రస్, ఫోన్ నంబర్లు చదివి వినిపించాడు.

"ఈయన పెద్ద పారిశ్రామిక వేత్తరా! ఎన్నో ఫ్యాక్టరీలు, కంపెనీలున్నాయి. ఎందరో

ఆయన క్రింద పని చేస్తున్నారు. ఇందులో డబ్బు విలువ మనకు తెలియదు. కార్డుల విలువ అంతకన్నా తెలియదు. ఆయనకు పర్స్ అందజేయడమెలాగబ్బా!" వాడి నాన్న ఆలోచిస్తుంటే వాడే పరిష్కారం సూచించాడు.

"ఇందులో ఫోన్ నెంబర్లున్నాయి నాన్నా? ఆయనకు ఫోన్ చేస్తే వచ్చి తీసుకు వెళతాడు. ఇందులో నుండి వందరూపాయలు తీసుకోనా! అక్క చనిపోయి రేపు పదకొండవ రోజు! ముగ్గురికి అన్నం పెడదామన్నావుగా!" ఆశగా అన్నాడు. "వద్దురా! అందులో రూపాయి కూడా తీయవద్దు! నా మీద ఒట్టు! మీ అమ్మ మీద... అక్కమీద ఒట్టు! వెంటనే బయలుదేరి ఫోన్ చేసి ఆయనను రమ్మనమను... పర్స్ జాగ్రత్తగా అందించు! నేను పనికి వెళ్తున్నా! తిరిగి వచ్చేసరికి పర్స్ నాకు కనిపించకూడదు!' వాడి నాన్న పనికి వెళ్ళిపోయాడు.

వాడు అమ్మ ఫొటో, అక్క ఫొటోల ముందు పర్స్ ఉంచాడు. రెండు ఫొటోలకు దండలు వేసి ఉన్నాయి. తొమ్మిదవ రోజు ఉదయాన్నే తండ్రితో కలిసి స్మశానానికి వెళ్ళి అక్కకు ఇష్టమైన వస్తువులన్నీ ఆమె సమాధిపై ఉంచి వచ్చిన దగ్గరనుండీ ఆ ఫొటోలనే తదేకంగా చూస్తున్నాడు. 'ఎప్పుడూ అమ్మ అబద్ధమే చెప్పేది! నిజం చెప్పేది కాదు! అవసాన దశలో కూడా ఎప్పుడూ తనకు అనారోగ్యంగా ఉందని నిజం చెప్పలేదు. ఆకలిగా ఉందంటే... అన్నం పెట్టేది! చాలక ఇంకా కావాలంటే తను తినేదానిలోంచి కూడా పెట్టేసేది.

'అమ్మా! నీకు అన్నం ఉందమ్మా....' అని అడిగితే... ఉందనే చెప్పేది! అన్నం గిన్నె వెదకబోతుంటే.... 'నా కాకలిగా లేదురా.... అని' అబ్ధం చెప్పేది. తనను స్కూల్లో చదివించడానికి తెల్లవారకముందే పనిలోకి వెళ్ళేది. అక్కడినుండి ఏవేవో తెచ్చి అక్కకూ, తనకూ తినిపించేది. రాత్రి చాలా సేపటి వరకూ మిషన్ కుడుతూ మెలకువతో ఉంటే...' అమ్మా! ప్రొద్దున్న ఎప్పుడో లేచావుగదా! నిద్ర రావడం లేదా' అంటే 'నిద్ర రావడం లేదురా' అంటూ అబద్ధం చెప్పేది.

ఒంట్లో బాగుండక గవర్నమెంట్ హాస్పటల్‌కు వెళ్ళి వస్తుంటే... 'ఏమైందమ్మా...' అంటే 'ఏమీ లేదురా... బాగానే ఉన్నానురా' అబద్ధమాడేది. కాన్సర్‌తో ఆఖరి క్షణాల్లో ఉంటే... 'ఎలాగున్నావమ్మా' అని అడిగితే 'బాగానే ఉన్నానురా! చక్కగా చదువుకోరా! స్కూలుకు వెళ్ళిరా!' అబద్దాలు చెప్పి తనను స్కూలుకు పంపించి... 'తిరిగి వచ్చే సరికి తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయింది! పోతూ... పోతూ... ఆయమ్మ మూడు రోజుల పాటు ఆ పిల్లవాడికి కడుపునిండా భోజనం పెట్టించింది. చుట్టుప్రక్కల వాళ్ళు ఆమె పోయిన తరువాత మూడు రోజులపాటు తమ వంటలతో ఆ పిల్లవాడికి ఆకలి లేకుండా చేశారు".

చెబుతున్న కథకు కళ్ళు చెమ్మగిల్లాయేమో... క్షణకాలం ఆగి సి.ఇ.వో కళ్ళ తుడుచుకొని కథను కొనసాగించాడు. "ఈసారి వాడి అమ్మ స్థానంలోకి అక్క వచ్చింది. అమ్మలాగా ఆకలిలేకుండా చూసుకునేది! తాను తినడం మానైనా వాడికి కడుపునిండా పెట్టింది. అమ్మలాగే అబద్ధాలతోనే వాడిని మభ్యపెట్టింది. రెండు మూడిళ్ళలో పని చేసేది. అర్ధాంతరంగా నాన్న అనారోగ్యంతో మంచంపడితే అన్ని అక్కే చూసుకునేది. అర్ధాకలితో

నిద్రపట్టకపోతే... అమ్మ జ్ఞాపకాలతో కలత నిద్రతో కలవరపడుతుంటే.... అక్క చక్కని జోలపాట పాడేది... ఆ పాట నాకు తెలుసు...

"నిదురపోరా తమ్ముడా... నిదురపోరా తమ్ముడా
నిదురలోన గతమునంతా నిముసమైనా మరచిపోరా"

సి.ఇ.వో పాడుతున్న ఆర్ద్రగీతం పల్లవి అందరి కళ్ళను చెమ్మగిల్లేలా చేశాయి.

"కలలు పండే కాలమంతా కనుల ముందే కదలిపోయే
లేత మనసుల చిగురు టాశ పూతలోనే రాలిపోయే..."

నిరాశను అద్భుతంగా ఆలపించిన తీరు మూగ బాధకు గురి చేసింది.

"జాలి తలచి కన్నీరు తుడిచే దాతలే కరువాయె
చితికిపోయిన జీవితమంతా చింతలో చితి ఆయె
నీడనిచ్చే నెలవు మనకు నిదుర యేరా తమ్ముడా...."

ఆదుకొనే అన్నదాతల కోసం, ఆసరాకోసం ఆరాటపడే నిరుపేద బ్రతుకుల వెతలన్నీ కళ్ళకు కట్టేలా పాడడంతో అతడి పాట సభికుల హృదయాలలో జాలి కరుణ కురిపించాయి. మనసులను కదిలించాయి. క్షణకాలం ........ నిశ్శబ్దం ఆవహించిన వాతావరణం నుండి సభికులను వెలుపలకు రప్పించాలని... నేనే చప్పట్లతో ఇహంలోకి రప్పించాను. సభ కరతాళధ్వనులకు శిరస్సు వంచి సి.ఇ.వో కథను కొనసాగించాడు.'అక్క కూడా అనారోగ్యం పాలై ఆకలిని తీర్చలేని తరుణంలో... ఆమె మంచంపై మృత్యువుతో పోరాడే సమయంలో ఆ పిల్లవాడు తండ్రిని ఓ ప్రశ్న వేశాడు.... అక్క ఎప్పుడు చచ్చిపోతుంది నాన్నా!' 'ఎందుకురా... అలా అడిగావు?" నాన్న విచారంగా అన్నాడు. 'ఆకలేస్తోంది నాన్నా! మూడు రోజులపాటు కడుపునిండా తినవచ్చుగా!' వాడి అమాయకత్వానికి తండ్రికి నవ్వాలో... ఏడవాలో అర్థం కాలేదు. మరి వారం రోజులకు వాడికి కడుపునిండా తినే అవకాశం ఇచ్చి అక్క వెళ్ళిపోయింది. ఈసారి వాడు తినలేకపోయాడు. ఊహ తెలిసిన వాడైనాడుగా! తాను అన్నది జరుగుతుందని అనుకోలేదు. అక్క కూడా అమ్మలాగే అబద్ధాలు చెప్పిందని... తనకు దూరమైందని అర్థమైంది! అక్క పోయిన పదవరోజు వాడికి ఛైర్మన్‌గారి పర్స్ దొరకడం, తిరిగి ఆయనకు ఇవ్వడం జరిగింది. ఆ మరునాడు అందరికీ ఆహారపు పొట్లాల రూపంలో అన్నదానం జరిగింది".

క్షణం విరామ మిచ్చి కథనం కొనసాగించాడు. "అతడి నిజాయితీకి ఫలితం దక్కింది. కరుణాంతరంగాన్ని అదృష్టం వరించింది. ఆయన సహాయ సహకారాలతో స్కూల్లో మధ్యాహ్నం భోజనం చేయగలిగాడు. స్కూల్ ఫస్ట్ సాధించాడు. ఓ కార్పోరేట్ కళాశాలలో పైసా ఖర్చు లేకుండా ఇంటర్ చదవగలిగాడు. ఐ.ఐ.టి. సీటు సాధించి అభయ ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఐ.ఐ.యంలో యం.బి.ఏ.లో ర్యాంక్ సాధించగలిగాడు. మార్కెటింగ్, ఫైనాన్స్‌లో అత్యధిక మార్కులు సాధించి ప్రస్తుతం ఓ మంచి కంపెనీలో మంచి హోదాలో ఉద్యోగ నిర్వహణ చేస్తున్నాడు. ఇదీ... ఆ పేద ఇంటి పిల్లవాడి కరుణామయ గాధ!"

సి.ఇ.వో చెప్పడం పూర్తి చేసి కళ్ళను కర్చీఫ్‌తో అద్దుకోసాగాడు. ఆ పిల్లవాడి కథ ముగిసేలోపు ఛైర్మన్‌గారి సంజ్ఞ నందుకొని.... అతడు వెనుదిరిగేలోపు అడ్డుకొని మైకు నందుకున్నాను. "డియర్ ఫ్రెండ్స్! నాడు మన ఛైర్మన్ గారి పోయిన పర్సును తిరిగి ఇచ్చి నా అంచనాలను తలక్రిందులు చేసి ఛైర్మన్‌గారి అచంచలమైన నమ్మకాన్ని వమ్ము కానీయని ఆ పేద ఇంటి పిల్లవాడు ఇక్కడే ఉన్నాడు.... మన మధ్యనే ఉన్నాడు.... మంచి హోదాలో ఉన్నాడు!" కావాలనే క్షణకాలం విరామమిచ్చాను. "ఇక్కడే ఉన్నాడా? మన మధ్యనే ఉన్నాడా? అయితే అతడెవరో చెప్పండి! ఏం చేస్తున్నాడో చెప్పండి! అతడిని సభకు పరిచయం చేయండి!"సభికులంతా ముక్తకంఠంతో ప్రశ్నలవర్షం కురిపించారు.
"అతడు ఎవరో కాదు... ఎవరో కాదు... మన కంపెనీ సి.ఇ.వోనే ఆ పేద పిల్లవాడు!" సి.ఇ.వో చేయి పట్టి పైకెత్తి సభకు పరిచయం చేస్తుంటే స్టాండింగ్ ఒవేషన్‌లో సభ అతడిని అభినందించింది.

అప్పుడే వేదిక ముందుకు వచ్చిన ఛైర్మన్‌గారి కరతాళ ధ్వనితో పులకించిపోయిన సి.ఇ.వో. ఆయనకు, తనకు ఉజ్జ్వల భవిషత్తునిచ్చిన తండ్రి లాంటి ఆయనకు పాదాభివందనం చేయకుండా ఉండలేకపోయాడు. సి.ఇ.వో పాదాభివందనం పూర్తికాకముందే ఛైర్మన్‌గారు అతడిని ఆత్మీయ ఆలింగనంతో బంధించి వేశారు.
ఆ అపురూపదృశ్యం కనిపించకుండా కనుకొలకుల్లో కన్నీటి బిందువులు అడ్డువచ్చాయి. నాకైతే కళ్ళజోడు తీసి తుడుచుకుందామనిపించలేదు..... ఎందుకంటే.... అవి... ఆనందభాష్పాలు!!.

**ఎం. సూర్యప్రసాద రావు,**

**సూర్యప్రసాద రావు ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలిలో జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ (జంతుశాస్త్రం) చేశారు. ఖమ్మంలోని శీలంసిద్ధారెడ్డి జ్యోతి కళాశాలలో జంతుశాస్త్ర హెచ్‌వోడీగా పనిచేశారు. ఇప్పటి వరకు 350 కథలు, 200 సంప్రదాయ వ్యాసాలు, వంద కవితలు, ఐదు కథాసంపుటాలు వెలువరించారు. వివిధ సంస్థలు నిర్వహించిన కథల పోటీల్లో పాతిక కథలకు బహుమతులను అందుకున్నారు. ఈయన రచనలపై నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఒకరు పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. 'అనిర్వచనీయం' నవల చతురలో, 'అతడు ఆమె ఓ చిలిపి అమ్మాయి' నవల స్వాతి మాసపత్రికలో ప్రచురితం అయ్యాయి.**

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 388

# మూడు దావల దిష్టి



పాలగిరి విశ్వప్రసాదరెడ్డి
**9866511616**

'నేలనపడి ఊపిరితో వున్న యెద్దును కటికకు ఎట్లమ్ముతావు సోమీ!' అప్పటికి పావుగంట నుండి మాలిండ్లలో వున్న పెద్దమనుషులంతా కట్టకట్టుకునొచ్చి నిలేస్తున్నారు. అందరూ యాభై అరవై యేండ్ల పైబడినోళ్ళే.

ఇంటి వసారాలో అరుగుమీద కూర్చొని కలబందనారతో పగ్గం పేనుకుంటున్న నాగన్న అంతసేపూ తలకాయొంచుకొని వాళ్ళ మాటలు, నిలదీతలు వింటూనే వున్నాడు. కొందరు వసారాలో కింద కూర్చుని వున్నారు. ఇంకొందరు అరుగునానుకుని నాగన్నకు దగ్గరగా నిలబడి వున్నారు. వాళ్ళలో ఒక పెద్దమనిషి – నాగన్న నాయన కాలంలో 'ఇంటి మాలోడు'గా వున్న పెదరాజు – కలబందనార పాయలు చిక్కుతీసి నాగన్న చేతికిస్తూ సాయపడుతున్నాడు.

'పెద్దరెడ్డి వైయుండి నువ్వే ఊరికట్టడి దాటితే ఎట్లబ్బా!' – నార అందిస్తున్న పెద్దమనిషి అనునయంగానే నిలదీసినాడు.

పేనిన భాగాన్ని తొడకిందనుండి వెనక్కి జరుపుకుని, ఆ పెద్దమనిషి చేతినుండి నారపాయను అందుకుంటూ నాగన్న తలెత్తినాడు.

'పెద్దరెడ్డె వడురా! పెద్దరెడ్డి నయితే దాని వూపిరి నిలిచిపోయిన్దాకా సగదీరి, గుంతతీసి పూడ్చిందును. దాని బతుకంతా నాకే చాకిరీచేసింది. అట్లాంటిదాన్ని నాకు ఉసి లేకనే అమ్ముకుంటున్నా. మా యబ్బ కాలంనాటి ఈ లంకంత కొంపతప్ప నాకేముంది! పైన దంతెలు ఇరిగిపోయి మెత్తు రాలిపోతాంటే సరిచేయిచ్చు కోలేకుండా!' – అన్నాడు.

'నీ యిబ్బందులెట్లన్నా వుండనీ, అంతోయింతో భూమి, యెద్దులు, యెనుముల యాసంగం ఉన్న మారాజువి. మీ నాయన, అబ్బల కాలం నుండీ ఊరిలో పదిమందికి మంచీ చెడ్డా చెప్పిన కుటుంబం. నువ్వు కట్టడి దాటడం సరికాదబ్బా!' – ఆ మాల పెద్దమనిషి గిరిగీసి దాటొద్దన్నట్లు అనునయంలోనే కటువు ధ్వనించినాడు.

నాగన్న పేనుతున్న పగ్గాన్ని నడిమధ్యనే విసురుగా పక్కకుతోసి – 'మీరందరూ కట్టుబాట్లు, కట్టడ్లను దాటకుండానే బతుకుతున్నారా? రైతుకు, మాలోనికి యాడన్నా సంబంధం మిగులుందారా? మీ బతుకులు మీయయినాయి, మా బతుకులు మాయయినాయి. మీ పిల్లోళ్ళు తిప్పే ఆటోల్లో మేమెక్కుతా వుండాం. మా దగ్గరలేని సెల్‌ఫోన్లు మీ దగ్గరుండాయి. ఇంగా కట్టడి పేరుతో నాయట్లాటి బక్క రైతుమింద పడటమేందిరా! అయినా ఊర్లో ఇంగా ఏ కట్టుబాట్లయినా బతికున్నాయారా. యా కాలంలో ఉండారు. పోండిరా. నా యెద్దును నేను అమ్ముకొంటాను. ఎవడడ్డ మొస్తాడో చూస్తా' అంటూ లేచి యింట్లోకి నడిచినాడు.

మాల పెద్దమనుషులందరూ ఒక నిట్టూర్పు విడిచి 'పోదాం పాండిరా, పంచాయితీ పెట్టిద్దాం!' అని తలోమాట అంటూ అనుకుంటూ లేచి తమ యిండ్లదావ పట్టినారు.

* * *

గాడిపాటన కండ్లు మూసుకుని నెమరేస్తా పడున్న యెద్దును చూస్తా వుంటే నాగన్నకు గుండె చెరువవుతావుంది. మక్కి విరిగిన కాలును పొరజాపుకుని యెద్దు పడుకునుంది. వారం దినాలనుండి ఎట్ల పడున్న యెద్దు అట్లనే వుంది. అటూ ఇటూ కాలుమార్చి పొర్లలేని స్థితిలో ఒకేవైపుకు పడుకుని వుంది. నేలకానిన వైపు కడుపు, పక్క భాగమంతా తోలు చివికిపోయి పీక్కొచ్చి పుండవుతా వుంది.

వారం కిందట గాడిపాటన కాలుజారి దభేలుమని పడింది. అంతకు ముందు వారం దినాలు తెరపిలేకుండా వానలు కురిసి ఊరూ చేలూ జివజివమని బురద మయమయ్యాయి. ఇండ్లలో గాడిపాళ్ళు ఎంత వూడ్చినా అరకుండా జోమొడుస్తా వున్నాయి. ఊడ్చేటప్పుడు యేమారితో సర్రున కాలు జారేలా వున్నాయి. ప్రాయం మీద పడిన యెద్దులు. నాగన్న మేత జొళ్ళ గాట్లో గుమ్మరిస్తుండగానే, పడుకొనున్న యెద్దులు ఆత్రంగా మేతకోసం లేచినాయి. లేవబోతున్న కొమ్ములెద్దు వెనక కాలు సర్రున జారి దబ్బునపడింది. అంతే లేవలేకపోయింది. నాగన్న అదిలిచ్చినాడు. భార్య, ఈడొచ్చిన ఆడపిల్లలిద్దరితో కలిసి లేపాలని శతవిధాలా పోరాడినాడు. వాళ్ళ తరం కాలేదు.

బయటకుపోయి ఇరుగుపొరుగు, అయిన పొయినోళ్ళను పదిమందిని వెంటేసుకొచ్చినాడు. తలోమాట, తలో సలహా మాట్లాడినారు. కూలబడిన యెద్దు నడుములు పట్టుకుని కొంచెం లేపి ఆ సందున కాడిమాను దూర్చి, అటు నలుగురూ ఇటు నలుగురూ కాడిమాను పట్టుకొని యెద్దును లేపి నిలబెట్టినారు. కాడిమాను యెద్దు కిందనుండి తీస్తుండగానే కాలు నిలబడక మళ్ళీ డబ్బున పడిపోయింది. అందరూ పెదవి విరచినారు. మక్కి విరిగిందని తేల్చినారు.

ఆ దినం నుండి, ఈ వారం దినాలుగా యేటి అవతల పల్లెనుండి బుడేన్‌సాబ్ వచ్చి వైద్యం చేస్తున్నాడు. తనే కొండకుపోయి యెవో ఆకులు కోసుకొచ్చి నూరి, కోడిగుడ్లలోని తెల్లసొనతో కలిపి పట్టు వేస్తున్నాడు. వారం దినాలయినా గుణం కనిపించలేదు. వారం గడిచాక పదిమందీ తోడై మళ్ళీ ఒక్కసారి యెద్దునులేపి నిలబెట్టే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు.

'పాయం మీరింది, యెంక కట్టుకోవడం కష్టం నాగిరెడ్డీ! కట్టుకున్నా లేచి నిలబడుతుందేమో గానీ యాసంగానికి పనికిరాదు. ఈలోపుగా యెద్దు అవతలిపక్క తోలు పాచిపోయి అదొక పుండయితుంది.' అని బుడేన్‌సాబ్ తేల్చేసినాడు.

నాగన్నకు గుండెల్లో యేదో నొప్పి తగిలింది. తనకున్న అయిదెకరాల మెట్టతోపాటు, పదిమందికి యెద్దులతో బాడుగ సేద్యాలకుపోయి నెట్టుకొస్తున్నాడు. రెండెనుముల పాడి అమ్మి భార్య ఉప్పుకు, పప్పుకు సరిపెడుతోంది. అయినా యెదిగిన ఆడపిల్లల చదువులు ఇంటర్‌తోనే ఆగిపోయినాయి. రెండేండ్ల నుండి అనుకుంటున్నా, ముసలెద్దులను అమ్మి కోడెలను పట్టుకొచ్చేందుకు పైకం బిసలేక కాలం వెళ్ళదీస్తున్నాడు. ఇప్పుడు నేలనపడిన యెద్దును

బతికినంత కాలం సగదీర్చేంత సత్తువ తనకు లేదు.

ఊర్లో యెద్దులను బాడుగులకు పిలవడం కూడా తగ్గిపోయింది. ఊర్లో ట్రాక్టర్లు యెక్కువవుతున్నాయి. ఎద్దులతో విత్తనం వేసి, సేద్యం చేయించుకోవాల్సిన జొన్న, కొఱ్ఱ, వేరుశనగ పంటలు మాయమయి, బుడ్డసెనగపంట వచ్చి పడింది. ఇప్పుడు అప్పుచేసి మళ్ళీ ఇంకో యెద్దును కొనడం కన్నా రెండెద్దులనూ అమ్మడమే మేలనిపించింది.

బుడేన్‌సాబ్‌కే ఫోన్‌చేసి బేరగాండ్లను తోడుక రమ్మన్నాడు.

ఇంతలోనే యెట్ల తెలిసిందో, మాలిండ్లలోని పెద్దమనుషులంతా కట్టకట్టుకుని వచ్చినారు.

ఎద్దు పనిచేయలేక నేలనపడి ప్రాణంతో వుంటే, దాన్ని కటికకు అమ్మే హక్కు రైతుకు లేదు. దానంతకది నడిచి పోయేటట్లుంటేనే రైతు అమ్ముకోవాల. బండికెత్తి పంపే స్థితిలో అమ్మకూడదు. అది మాలల సొంతం. ప్రాణం పోయిన యెద్దయితే మాదిగల సొంతం. అది అనాదిగా ఉన్న ఊరి కట్టడి – అంటూ తన బతుకుకు అడ్డుపడినారు.

ఈ రెండూ వొద్దనుకుంటే, రైతు ఆ యెద్దును బతికినంత దూరం సగదీర్చి చచ్చినాక పూడ్చుకోవాలి.

నలభై యేండ్ల కిందట సర్పంచు సుబ్బిరెడ్డి ఇంట్లో ఈ రకంగా యెద్దు యెత్తుబడితే మాలోళ్ళ కిచ్చినాడు. ఇరవై యేండ్ల కిందట తనవంటి చిన్న రైతే వెంకటసుబ్బన్న యెద్దు కూలబడిపోయింది. బతికినంత కాలం నీళ్ళు, మేపు పెట్టి చచ్చాక కోసుకోవాలని షరతుమీద మాదిగోళ్ళ కిచ్చినాడు. ఇన్నేండ్లకు, కాలం మారిపోయి అన్ని కట్టడులు పోయినాక తనకు ఈ కష్టమొచ్చింది.

* * *

మాలలు అటుపోయిన గంటకు నలుగురు మాదిగ పెద్దమనుష లొచ్చినారు. నాగన్న యెద్దుకు నీళ్ళు పెడుతుండగా చూసి, యెద్దుచుట్టూ గాడిపాటకు చేరినారు. ఎద్దును పట్టిపట్టి చూసినారు. సానుభూతి పలుకులు పలికినారు.

నాగన్న చేతిలోని తవుడు చేటను ఓ పెద్దమనిషి – నాగన్న నాయన కాలంలో 'ఇంటి మాదిగోడు'గా ఉండిన రాముడు – తీసుకుని యెద్దు మూతిపెట్టి తాగుతున్న నీళ్ళ బకెట్లో కలుపుతూ అక్కడే కూర్చున్నాడు. మరొకరు నిలబడి వుండగా, యిద్దరు గాడిపాట బండమీద పిర్రలు మోపినారు.

ఎద్దుమీద ఆమాట ఈమాట మాట్లాడి, 'నీ యింట్లోనే బతుకంతా బతికి నీకు సేవచేసిన జీవం. దాని రుణం నువ్వు తీర్చుకోలేవు రెడ్డీ! బతికుండగానే చూసి చూసి ఆ మాలోళ్ళకు మాత్రం యియ్యాకు. సగదీరను నీకు అంత బరువయితే, మా ఇండ్లలో రాముల దేవళం కాడికి మోసుకుపోయి పండబెట్టి చచ్చేదాంకా సగదీరుతాం!' అన్నాడు రాముడు.

'ఏమొద్దు పాండిరా! నేను వాళ్ళకు యియ్యను. మీకు యియ్యను. నా సావు నన్ను సావనీయండిరా!' రాముని చేతిలోని తవుడు చేట గుంజుకున్నాడు నాగన్న.

* * *

'ఫోన్‌జేసి రమ్మన్నావంటనే, చిన్నాయమ్మి చెప్పింది', సర్పంచు సుబ్బిరెడ్డిని సమీపిస్తూ

నాగన్న అడిగినాడు. వసారా అరుగుకు ఆన్చిన మంచంలో కూర్చుని కాఫీ సేవిస్తున్న సుబ్బిరెడ్డి 'రావోరు కూర్చో' అన్నాడు. పయి మిందున్న తుండుగుడ్డను అరుగుమీద వున్న స్తంభము దగ్గర వేసి, స్తంభానికానుకుని కూర్చున్నాడు నాగన్న. యెద్దు పంచాయితీ కోసమేనని తనకు తెలుస్తూనే వుంది. సుబ్బిరెడ్డి నేరుగా విషయంలోకి దిగినాడు – 'ఏంది వోరు! లేవలేని యెద్దును వూపిరుండగానే కటికకు అమ్ముకుంటుండా వంటనే?' 'ఏమ్ అమ్ముకొంటే? నా యెద్దును నా యిష్టమొచ్చినట్లు చేసుకుంటా మావా! మాలోళ్ళను వెనకేసుకొస్తున్నావా?' నాగన్న గొంతులో బింకం బయటపడింది. 'ఒకర్ని వెనకేసుకొని రావడ మేందోరు! నువ్వు సాటి కాపోనివి, చుట్టానివి. నీకు అన్యాయం జేయాలనుకుంటానా?' 'చుట్టరికాల మాటెందుకులే మావా! నువ్వు యాపొద్దు నన్ను పిలిచి నీ యింట్లో ఆకేసినావు? నా యింటికొచ్చి యాపొద్దు చెయ్యి కడిగినావు? ఎద్దు మాట యెందో చెప్పు'

సుబ్బిరెడ్డికి ఇక యవ్వారం తెంచక తప్పలేదు. తేనె పూసిన మాటలు పనిచేయ వనుకున్నాడు. 'చెప్పడాని కేముందోరు! ఊరికి ఒక కట్టుబాటు, కట్టడి వుందన్నాక నువ్వూ నేనూ అందరం కట్టుబడి వుండాల్సిందే. ఏమ్, నా యింట్లో యెద్దు యెత్తుబడినపుడు మాలోళ్ళ యెదాన కొట్టిండ్లా?' – సుబ్బిరెడ్డి సర్పంచ్ దర్పం చూపినాడు. 'నువ్వు ఇచ్చినావులే నలభై యేండ్ల నాడు. ఇప్పుడు యింగా నా యట్లాటోళ్ళ మెడకు చుట్టడానికా యీ కట్టడ్లు? యాడుండారు మావా అన్ని కట్టడ్లు? ఇంటి మాలోడు, యింటి మాదిగోడంటే అన్నిటికి తల్లేరు పట్టినట్లు ముందుంటాడిరి. మన యింట్లో యెవరైనా చస్తే ఇంటి మాలోడొచ్చి గుంత తీస్తాండాడా? వాళ్ళడిగినంత లెక్క యిచ్చి గుంత తీయించుకుంటా ఉండాం. మెట్టు తెగిపోతే మాదిగోడు యెవడన్నా కుట్టిస్తా ఉండాడా? సెలకోలుకు వార్లు పెట్టమన్నా పెట్టడంలేదే! అయినా యెద్దులు యెత్తిపెట్టి ట్రాక్టర్లు తెచ్చుకున్న నీ యట్లాటోళ్ళకు వాళ్ళిద్దరితో పనిలేదు. మరెందుకు ఈ కట్టడ్లు? ఊర్లో యింగా యెద్దుల సేద్యం చేసుకునే మా యట్లాటి పది ఇరవై మంది సన్నకారు జీవాలను నలిపి పారేయడానికా ఈ కట్టుబాట్లు?' – సర్పంచు సుబ్బిరెడ్డిని ఎదిరిస్తూ మాట్లాడుతున్న నాగన్న స్వరంలో ఆ పదురు కనిపిస్తోంది.

'ఒరే యెర్రి నాగన్నా! ఊరి కట్టుబాట్లు మనం పెట్టినయేరా. వాళ్ళు పెట్టుకున్నయి కాదు. కట్టుబాట్లలో మనకు మేలుచేసేవి నూరుంటే, వాళ్ళకు మేలుచేసేవి ఒకటీ అరా వుంటాయి. వాళ్ళకు మేలుచేసేవి ఒక్కొక్కటే తగ్గిచ్చుకుంటా మనమే వాళ్ళకు అన్యాయం చేసినాము. వాళ్ళకు మనమూ, మనకు వాళ్ళూ అన్నెట్లుండే వాళ్ళం. ఇప్పుడుండామా? మనింట్లో పెండ్లయినా, వాళ్ళింట్లో పెండ్లయినా ఒక్కరవ్వ బంగారు తునక యిచ్చేవాళ్ళం, యిప్పుడిస్తాండామా? మేరగింజలు కొలుస్తాండామా? అన్నీ మానుకొన్నాం కదవోరు. వాళ్ళకు మేలుచేసే ఒకటీ అరా కట్టడిని కూడా ఇప్పుడు మనం కాదంటే, ఇంగ వాళ్ళు దేనికీ మన చెప్పుచేతల్లో ఉండరు. అది తెలుసుకో' – సర్పంచు నాగన్నకు జ్ఞానబోధ చేసినాడు.

'వాళ్ళనెవర్నో చెప్పుచేతల్లో పెట్టుకొనే తాహతు నాకులేదు. ఆ అక్కరా నాకులేదు. ఓట్లకోసమో, యింగోదానికో నీకు అక్కరుందేమో! ఆ అక్కర ఉన్నోళ్ళకోసం నేనెందుకు నలిగిపోవాల మావా? నేను యే కట్టడికి కట్టుబడను. నా పని నేను చేసుకుంటా!' – నాగన్న

ఖరాకండీగా చెప్పి, లేచి కిందవేసుకున్న తుండుగుడ్డ విదిలించి పయిమీద వేసుకుని తిరిగి చూడకుండా దాటుకున్నాడు. 'ఒరే నాగన్నా! నా మాట యినకుంటే తిప్పలు పడతావ్' – వెనుక నుండి సుబ్బిరెడ్డి హుంకరింపు వినపడింది.

* * *

నాగన్న సుబ్బిరెడ్డి దగ్గర యెదిరించి వచ్చినాడే కానీ యే నిర్ణయం తీసుకోవాలో తోచలేదు. తనదీ మాలా మాదిగోళ్ళ బతుకే. ఆ యెద్దును కటికకు అమ్ముకుంటే అంతో యింతో నష్టం తగ్గుతుంది. సర్పంచునూ, మాలోళ్ళనూ, మాదిగోళ్ళనూ కాదని నేలకూలబడిన యెద్దును ప్రాణంతో అమ్ముకోలేడు. వీళ్ళకో, వాళ్ళకో యివ్వడం వల్ల పరోక్షంగా సర్పంచు సుబ్బిరెడ్డి ఆధిపత్యపు నీడ వీళ్ళమీదో, వాళ్ళమీదో మరింత చిక్కగా పరుచుకుంటుంది. నడిమధ్యన అందరి నడుమా తను నష్టపోతాడు. నాగన్న యెటూ నిర్ణయించుకోలేక పోయినాడు. మూడు దావల కూడలిలో నిలబడి నట్లయింది. ఇంటికి వచ్చి భార్య వెంకటసుబ్బమ్మతో జరిగిందంతా చెప్పినాడు. 'ఎవనికీ యియెద్దు. ఎద్దు చచ్చేదాంకా మేతా, నీళ్ళు పెట్టి చచ్చినాక కల్లంలో పూడ్చిపెడదాం! పెసిడెంటు పెత్తనానికీ, దిక్కుమాలిన ఊరి కట్టడులకూ మూడు దావాల దిష్టి తీసి పారేసినా మనుకుందాం!' – అంది ఖండితంగా. భార్యలో వున్న తెగువ నాగన్నలో కనిపించలేదు. దిగులు ఆవరించిన మనసుతో భార్యకు తలవూపినాడు.

* * *

**పాలగిరి విశ్వప్రసాద రెడ్డి స్వస్థలం కడపజిల్లా, యర్రగుంట్ల మండలం, హనుమగుత్తి గ్రామం. ఈయన వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. బి.ఎస్సీ. చదివారు. విద్యాభ్యాసం అనంతరం కొన్నేండ్లు వ్యవసాయం చేసిన ఈయన 25 ఏండ్లకు పైగా జర్నలిస్ట్‌గా పనిచేశారు. విశ్వప్రసాదరెడ్డి రాసిన మొదటి కథ "కాపలా కుక్కలు". ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమయింది. ఆ తరువాత 2005లో పది కథలతో కూడిన "చుక్క పొడిచింది" కథల సంపుటి రచించారు. ఆ తరువాత ఈయన మరో 12 కథలు రచించారు. ఇవి పలు ప్రధాన పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఇటీవల రాసిన 'మూడు దావల దిష్టి' కథ ఆయనకు మరింత గుర్తింపుని తీసుకువచ్చింది. ఈయన యోగివేమన యూనివర్సిటీ వారి 'గజ్జల మల్లారెడ్డి సాహిత్య పురస్కారం, మల్లెమాల సాహిత్య పురస్కారం, కవిత సాహిత్య సాంస్కృతిక పురస్కారాలను పొందారు.**

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 393

# కొలిమి



రామా చంద్రమౌళి
9390109993

చిన్మయి.. అప్పటిదాకా భద్రునితో ఎంతో ఉద్వేగంగా మాట్లాడుతున్న చేతిలోని మొబైల్ ఫోన్‌ను ముందున్న టేబుల్‌పై పెట్టి, వెనక్కి వాలి కళ్లు మూసుకుంది అలసటగా!

టైం తెలుసు ఆమెకు. రాత్రి పదకొండూ పది నిమిషాలు. మానవ శరీరం ఒక బయోవాచ్. సమయం తనంతట అదే తెలుస్తూ ఉంటుంది స్పృహిస్తే. బయట సన్నగా కురుస్తున్న వర్షం చినుకుల చప్పుడు లయాత్మకంగా వినిపిస్తూనే ఉంది. ఎందుకో ఆమె మనసు చాలా ఉద్విగ్నంగా ఉంది.. బాధగా ఉంది. కొండొకచో దుఃఖంగా కూడా ఉంది.

'ఈ దేశంలో ఎందుకిలా విలువలూ, నీతీ నియమాలూ, ధర్మాధర్మ విచక్షణా, మానవీయ ఉదాత్తతా.. ఇవన్నీ వారసత్వంగా కొన్ని వేల సంవత్సరాలుగా కొనసాగుతూ వచ్చీ వచ్చీ.. ఇప్పుడెందుకిలా అతి వేగంగా ధ్వంసమైపోతున్నాయి? కొండపైనుంచి జారిపడిపోతున్న బండరాయిలా! ఎటు

చూసినా మనదేశం లోపలా, బయటి దేశాల్లో కూడా సకల మానవ జాతిలోనే సామూహిక విలువలు లుప్తమవుతూ సాంస్కృతిక విధ్వంసం కొనసాగుతూ వస్తున్నది. ఎందుకు.. ఎందుకిలా.. ఎందుకు ఈ నైతిక పతనం మహోధృతంగా ఒక మహాసముద్రపు ఉప్పెనలా దూసుకొస్తున్నది? ఈ దుష్టతరపు మానవ సమాజంపై కరోనాకంటే కూడా అతిప్రమాదకరంగా!'

ఆమె ముందున్న టేబుల్‌పై వరుసగా పేర్చి ఉన్న పదిహేను సంపుటాల ఇండియన్ నేషనల్ ఎపిక్.. భారతదేశ జాతీయ ఇతిహాసం, పంచమ వేదం.. వ్యాస విరచిత 'మహాభారతం' బౌండ్ సంపుటాలు పేర్చి ఉన్నాయి. టీటీడీ ఆ గ్రంథాలను ప్రచురించి, పద్దెనిమిది వందల రూపాయలకే అందిస్తున్నది. ఆ ధరకు కనీసం వాటి బైండింగ్ కూడా చేయించలేం.

అవి వ్యాసుడు రచించిన ఒరిజినల్ మహాభారతానికి నన్నయభట్టు చేసిన తెలుగు అనువాద.. సరళ తెలుగీకరణ సంపుటాలు. ప్రత్యేకంగా సమయం కేటాయించుకొని గత నెలరోజులుగా ఆ అన్ని సంపుటాలనూ పట్టువిడువక చదువుతున్న చిన్మయి.. చిట్టచివరి పదిహేనవ సంపుటిని కూడా చదవడం పూర్తి చేసి, ఒక రకమైన పూర్ణతృప్తి నిండిన మహదానుభూతితో పరవశించిపోతూ ప్రచలిస్తున్నది.

వేదలూ, శాస్త్రాలూ, పురాణాలూ, ఉపనిషత్తుల పాఠాన్ని సమీకృతపర్చుకున్న ఈ 'మహాభారతం' అనబడే ప్రపంచ మహోత్కృష్ట మహాగ్రంథానికి వారసురాలై.. ఈ పుణ్యభూమిపై పుట్టిన తన జన్మ ధన్యమైనట్టేనా.. అనుకుంటూ, ఆమె తనను తాను ఒకసారి అవలోకించి చూసుకొని పులకించిపోయింది.

ఐదు వేల సంవత్సరాల క్రితం రాసినట్టు చెప్పే మహాభారతం.. ఇప్పటికి కూడా పరిపూర్ణ ఔచిత్యంతో, అన్వయానుకూలతతో వర్ధిల్లుతున్న ఈ ఇతిహాసంలో వ్యాసుడు ఏమన్నాడంటే..

'యదిహాస్తి తదన్యత్ర, యన్నేహాస్తి న తత్ క్వచిత్' అంటే.. ఇందులో ఉండేదే ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా లేదు'

( What is in mahabhaarata is every where. what is not in Mahabharata is nowhere ) – అని.

ఈ ఇతిహాసంలో సృష్టించిన పాత్రల చిత్రణ ( Character delineation ), ఉద్వేగ వైవిధ్యత (Range of emotions ) కూడా ఏ ఇతర గ్రంథాల్లోనూ లేదు.

చిన్మయి మొబైల్ ఫోన్ చటుక్కున మోగింది.. ఏదో లోకంలో మునిగిపోయిన ఆమె, ఉలిక్కిపడి ఫోన్ ఎత్తి.. 'హలో' అన్నది. అటువైపు భద్రుడు. 'అంతా రెడీ మేడం'. 'మొత్తం ఎంతమంది మనవాళ్లు'. 'నలభై మంది మేడం'. 'స్థావరమెక్కడ'. 'జూబ్లీహిల్స్ మేడం'.

'మొబైల్ పబ్బా? ఒకవైపు మనం నిర్మూలించుకుంటూ పోతూంటే, మరోవైపు వాళ్లు

జరాసంధుని బాడీలాగ మళ్లీ మళ్లీ పుట్టుకొస్తున్నారు కదా భద్రుడూ!' అన్నది. మళ్లీ తనే..

'ఖాళీగా ఉన్న పోష్ భవనాలను కిరాయికి తీసుకొని, సర్కస్ గుడారాల్లాగ అప్పటికప్పుడు అంతా సెట్ చేసి, ఈ బహిరంగ దందా చేస్తున్న ఆ నిర్వాహకుణ్నీ, బిల్డింగును కిరాయికి ఇచ్చినవాణ్నీ ఈసారి బట్టలు విడిపించి.. అదే జూబ్లీహిల్స్ నడిరోడుపై నెత్తిపైన విస్కీ సీసాలను పెట్టి ఊరేగిద్దామా భద్రుడూ!' అన్నది చిన్మయి ఐపీఎస్.

'కానీ, పొలిటికల్ అండ్ బ్యూరోక్రాట్స్ ప్రెషర్..'. 'అది మామూలే కదా మనకు! చూద్దాం.. ముందు నేనూ, ఇంకో ఇద్దరు లేడీ స్టాఫ్ మఫ్టీలో వెళ్తాం. ట్రూ షేప్ బయటికొస్తది. ఇంకో పావుగంట తర్వాత రెడీ జంగ్.. నేనే అక్కడికొస్తా! లొకేషన్ షేర్ చెయ్యి'. 'ఎస్ మేడం.. సునందా, ఊర్మిళ వస్తారు రైడింగ్‌కు'. 'ఓకే'. . ఫోన్ కట్ చేసి.. కలెక్టర్‌కు లైన్ కలిపింది చిన్మయి. అటునుండి కలెక్టర్.. 'హలో!' అన్నాడు. ఐదు నిమిషాల తర్వాత ఆయన జవాబు.. 'ప్లీజ్ గో ఎహెడ్' అని రాగానే, లోపలినుంచి విద్యుత్తు విరజిమ్ముతుండగా లేచి నిలబడ్డది చిన్మయి. భూమిలోంచి మొలిచిన శివుడి శూలంలా!

***

భయం గొప్పదా? ప్రేమ గొప్పదా? అని ప్రశ్న. ప్రేమ అనేది ఒక మాయ. కథల్లో, సినిమాల్లో, ఉటోపియన్ కల్పితాల్లో తప్ప.. ప్రేమ ఎక్కడా దీర్ఘకాలం జీవిస్తూ, ఒక వ్యక్తి జీవితాంతం పొగచూరకుండా ఉజ్జ్వలమై తృప్తిని మిగిల్చిన సందర్భాలు ఉండవు. 'ఆలుమగలు మాయ, అన్నదమ్ములు మాయ, తల్లిదండ్రులు మాయ, తాను మాయ, మాయ తెలియనీదు దీనిల్లు పాడాయె విశ్వదాభిరామ వినుర వేమ'.. అన్న పద్యంలో వేమన నిష్కర్షగా చెప్పింది అబద్ధం కాదు. అయితే ప్రేమ మాయ అని తెలియడానికీ, మనిషి అంగీకరించడానికీ ఒక జీవితకాలం పడుతుంది. ఒక సర్వేలో ఇరవై వృద్ధాశ్రమాలలో ఉంటున్న దాదాపు ఐదువందల మంది వృద్ధులను ఒక్కరొక్కరిగా ఇంటర్వ్యూ చేసి, అందరి అభిప్రాయాలను క్రోడీకరిస్తే.. కన్నీళ్ల పర్యంతమవుతూ తొంభై శాతం మంది వెలిబుచ్చిన అభిప్రాయం ఏమిటంటే.. 'ప్రేమ అనేది ఒక భ్రాంతి' అని. అది యవ్వన దశలో ఉడికిస్తూ, ఉరికిస్తూ మత్తులా మనిషిని కమ్మేసి, చక్కిలిగిలి పెట్టి.. రాగితీగలో నుంచి అంతర్థానమయ్యే కరెంటులా మాయమైపోతుంది. వయసు పెరుగుతున్నకొద్దీ వెలిసిపోయే రంగులా అంతా పాలిపోయి, పాతచెప్పులా మిగులుతూ, ఒట్టి వెలిసిపోయిన వాసనలేని కాగితపు పువ్వులా మిగిలిపోతుంది ప్రేమ.. పరమ వికారంగా! ఇక భయం.. నిత్య నూతనమూ, నిత్య యవ్వనీ అయినది. చిన్నప్పుడు నాన్న కొడతాడనీ, అమ్మ తిడుతుందనీ భయం. బడికి పోకుంటే పంతులు దండిస్తాడని భయం. పెద్దయ్యాక ఆఫీసర్ తిడతాడని భయం. తప్పు చేస్తే ఇంక్రిమెంట్ కట్ చేస్తాడనీ భయం. రోజులు గడుస్తుంటే.. మాట వినకుంటే పెళ్లాం రాత్రికి అన్నీ బంద్ చేస్తుందని భయం.

ఒకప్పుడు మనకు భయపడే పిల్లలు.. మనల్ని భయపెట్టే స్థితికి ఎదిగిన తర్వాత, అవమానకరంగా భయపడలేక భయం. పోలీసోళ్లతో భయం, ఫీజులు ఇచ్చుకొని కూడా డాక్టర్లతో భయం. రాజకీయాల్లోనైతే పార్టీ పెద్ద పదవులివ్వడని భయం, ప్రమోషన్లు ఇవ్వడని భయం.. చివరికి పిల్లలు చరమదశలో పట్టించుకోక కుక్కతిట్లు తిడతారని భయం.

భయమే శాశ్వతం! భయమే సత్యం! భయమే నిత్యం! భయమే జీవితమై.. అంతిమంగా అనుక్షణం వెంటాడుతూ రోగాలతో, నొప్పులతో సంక్లిష్టమై, చావుగా పరిణమిస్తూ.. భయమే మృత్యువు. 'కాబట్టి డియర్ ఫ్రెండ్స్! మనం భయమనే ఆయుధంతోనే ఈ సమాజాన్నీ, రోగగ్రస్తమైన ఈ వ్యవస్థలనూ, ఈ చిలుంపట్టి శిథిలమవుతున్న వర్తమానాన్నీ, అతిస్వేచ్ఛ అనే విచిత్రమైన వ్యాధితో బాధపడుతూ, దారి తప్పుతూ ఏ మరమ్మతులకూ లొంగని మొండి జబ్బుగా మిగిలిపోతున్న ఈ మనుషులను షాక్ ట్రీట్‌మెంట్‌తో సెట్‌రైట్ చేయాలె. బయల్దేరుదామా!'.. చిన్మయి తన నాలుగు బ్యాచ్‌లకు అప్పటికే స్పష్టమైన ఆదేశాలనూ, అసైన్‌మెంట్లనూ ఇచ్చింది. 30 మంది సుశిక్షితులైన నిజాయితీగల పోలీసులు ఒక జట్టు.

ఏక కాలంలో నాలుగు స్థావరాలపై దాడి.

ఔటర్ రింగ్‌రోడ్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో.. ఒక ఫార్మ్‌హౌజ్. ఐదు ఎకరాలు. మధ్యలో దేదీప్యమానంగా వెలిగిపోతూ విలాసవంతమైన విల్లా. బయట అతివిశాలమైన పార్కింగ్ ఏరియా. టైల్స్‌తో ఫ్లోరింగ్. అన్నీ హైఎండ్ కార్లు. బీఎండబ్ల్యూ స్థాయికి తగ్గకుండా జాగ్వార్లు, మెర్సిడెజ్ బెంజ్, ఆడి, పోర్చే, లెక్సస్, వోల్వో, ఫెరారీ, ల్యాండ్ రోవర్ వంటివి. వాటిని చూస్తేనే చిన్మయికి అర్థమైపోయింది.. లోపల మనుషులు ఎవరెవరు ఉంటారోనని.

అదొక అనఫీషియల్ అడ్డా. అసలు ఈ ప్రభుత్వాలకు సకల అక్రమ దందాలకు ఆలవాలమై, అక్రమార్జనతో సర్వ దుర్లక్షణాలను కలిగి 'డబ్బు మదం' అనే వ్యాధితో కళ్లనూ, చూపునూ కోల్పోయి, హృదయాన్ని పోగొట్టుకొని, పొగరూ, దర్పమూ తలకెక్కి.. కన్నూ మిన్నూ కానక వ్యవహరించే ఒక ప్రత్యేక జాతితో ఏమి పని. ఈ మదాంధ జనానిది గుడ్లగూబ జాతి. దినమంతా ఎక్కడెక్కడో మంది కొంపలు ముంచుతూ, దేశాన్ని పందికొక్కుల్లా తోడుకు తింటూ.. రాత్రుళ్లు మాత్రం అతి చురుగ్గా సమూహాలు సమూహాలుగా, ఈ అసాంఘిక స్థావరాల్లో మిలాఖాతై.. బృందాలు బృందాలుగా సంచరించే రాక్షస తెగ అది.

బ్రోకర్లు, తార్పుడుగాళ్లు, పేకాట, డ్రగ్స్, ఆల్కాహాల్, వ్యభిచారం.. మనుషుల బలహీనతలన్నిటినీ క్యాష్ చేసుకుంటూ, అన్ని రకాల సౌఖ్యాలను 'అమ్మకానికి' పెట్టగలిగే వృత్తిలో తరించే పరాన్నభుక్కు అజ్ఞాత వర్గం ఒకటుంటుంది ఈ ఉన్నతవర్గ సమాజంలో!

'గాలం వేసి చేపను పట్టు', 'చేపను వలలో పెట్టి బ్లాక్ మెయిల్ దందా చెయ్', 'యూజ్ అండ్ త్రో.. త్రో అండ్ ఎగైన్ యూజ్', 'హిట్ అండ్ మిస్', 'కిల్ అండ్ ఎస్కేప్' వంటి థియరీలతో కర్కశ సాధన చేసిన జన్మతః క్రిమినల్స్ వాళ్లు. ఈ దేశ దౌర్భాగ్యమేమిటో గానీ, ఈ ప్రభుత్వాలకూ ఈ క్రిమినల్స్‌తోనే చాలా చాలా పని ఉంటుందెప్పుడూ ఎందుకనో. లేకుంటే ఈ దేశ పవిత్ర లోక్‌సభలో 50% మంది ప్రజాప్రతినిధులు నేరస్థులే ఎందుకుంటారు?

ముందు చిన్మయీ, భద్రుడూ మరో ఇద్దరు షూటర్స్ మఫ్టీలో వెళ్లారు లోపలికి. లోపల అంతా ఫిష్ మార్కెట్ కోలాహలం. ఒక పెద్ద రేవ్‌పార్టీ. హైదరాబాద్‌లోని చాలామంది కార్పొరేట్ హాస్పిటళ్లకు చెందిన ప్రసిద్ధ డాక్టర్లు ఉన్నారక్కడ.. తూలుతూ, అమ్మాయిల కౌగిళ్లలో తూగుతూ! విచ్చలవిడి శృంగార ఛాయలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. అక్కడక్కడా ఓ ఇరవై ముప్పై పేకాట టేబుల్స్ ఉన్నాయి. టేబుల్స్ పైనే ఐదు వందల, రెండువేల రూపాయల నోట్ల కట్టలు పరిచి.. అంతా ఓ గమ్మత్తయిన మందూ, తిండీ మసాలాల వాసన.. పెర్ఫ్యూం మత్తు.. కల్లు దుకాణం కన్నా అధ్వాన్నంగా కోలాహలం! బేరర్స్ అందరూ శృంగారాన్ని ఒలకబోస్తున్న వయ్యారులే. చిన్మయి సూచనతో భద్రుడు వెళ్లి ఒక రౌండ్ అంతా పరికిద్దామని కదులుతూండగా.. ఇద్దరు బౌన్సర్లు ఉరికొచ్చారు. భద్రుడు చాలా హుందాగా, వ్యూహాత్మకంగా ప్రతిస్పందిస్తుండగా.. అర్థమైపోయింది నిర్వాహకులకు. ఇటువంటి డెన్‌లను నిర్వహించే వాళ్లందరిదీ నిజానికి రేచుకుక్క జాతి అయిఉంటుంది. వాసన పసిగట్టి ఎదురుదాడి చేయడం, అవసరమైతే తప్పించుకొని నీటిలోకి చేపలా జారిపోవడం వాళ్లకు అబ్బిన జన్మవిద్య. ఓ పది నిమిషాలు భద్రుడూ అండ్ అదర్స్.. ప్రాథమిక చర్యలు ప్రారంభించిన తర్వాత, చిన్మయి తన చేతిలోని పిస్టల్‌ను గాలిలోకి కాల్చి ఒక ఉలిక్కిపాటును క్రియేట్ చేసి.. సడెన్‌గా ఒక తుఫాన్ ఉప్పెనగా మారి పైబడ్డట్టు.. అంతా కకావికలు. చెల్లాచెదురు. తత్తరబిత్తర. అప్పుడు ప్రవేశించింది మిగిలిన ఇరవైకిపైగా పోలీసుల బృందం..

ఓ వార్నింగ్.. 'ఎక్కడివాళ్లక్కడే ఉండండి. డోంట్ మూవ్' అని గంభీర ప్రకటన. టీవీల్లో 'బ్రేకింగ్ న్యూస్' బాంబులు పేలుతున్నాయి. రాజకీయ నాయకులు, సెలెబ్రిటీలు, పెద్దమనుషులు, బడా బాబులు, పరువులేని పనులు చేస్తూ పరువుకోసం పాకులాడేవాళ్లు.. గంట తర్వాత లెక్క తేలింది. ఎనిమిది మంది నిర్వాహకులు, ఒక ఆర్గనైజర్, దాదాపు వందమంది ఏజెంట్లు, మొత్తం వందకు పైగా యవ్వనవతులైన అమ్మాయిలు. గదుల్లో కొనసాగుతున్న అసభ్యకర శృంగార సంభోగ తంతు. భారీ స్థాయిలో డ్రగ్స్.. వయాగ్రా వంటి అనేక ఉద్దీపన టాబ్లెట్లు!

***

రెండో స్థావరం. ఔటర్ రింగ్ రోడ్డుకు దగ్గర్లో ఓ పది ఫర్లాంగుల దూరంలో.. ఒక

నిశ్శబ్ద ఫార్మ్‌హౌజ్.. రెండు ఎకరాల్లో. బయట బోర్డ్.. వెంకటేశ్వరా గెస్ట్‌హౌజ్. లైట్లు వెలుగుతున్నాయి దేదీప్యమానంగా. ఎక్కడా ఎవరూ లేరు. పోర్టికో కింద ఐదారు మోటార్ సైకిళ్లు.. బుల్లెట్లు, పల్సర్, హార్లే డెవిడ్‌సన్.. ఇంకా ఏవేవో స్పోర్ట్స్ బైకులు. జీప్‌ను చూడగానే లోపలి నుంచి నెత్తికి రుమాలు చుట్టుకున్న ఒక రైతువంటివాడు పరుగెత్తుకొచ్చాడు.

చేతులు కట్టుకొని.. 'అయ్యా!' అన్నాడు వినయంగా.. భయం భయంగా. 'ఎవరిదీ గెస్ట్‌హౌస్?'. ఆ పల్లెటూరి మనిషి తన బనీను జేబులో నుంచి ఒక విజిటింగ్ కార్డ్ తీసిచ్చాడు. లయన్ జి. రమణకుమార్. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (రిటైర్డ్). గచ్చీబౌలీ. ఇంకేవేవో వివరాలు.

'లోపలెవరున్నారు?'. 'ఆ.. మా అయ్యగారి బిడ్డ'. 'ఇంకా?'. 'ఆమె దోస్తీగాళ్లు'. 'మొత్తం ఎంతమంది?'. 'నలుగురు ఆడోళ్లు.. ఆరుగురు మొగపోరగాళ్లు సర్'. 'ఎప్పుడొచ్చిండ్లు?'.'కాలేజీ నుంచి పగటీలి దొరా'. 'ఇప్పుడేం చేస్తాండ్లు లోపల?''గదే.. తాగుడు తినుడు. మూజిక్ పెట్టుకొని చెంగడబింగడ ఎగురుడు! రూంలల్లకు పోయి ఇష్టమొచ్చినట్టు వాయివరుసలు లేకుంట దుకాణం పెట్టుడు' 'మరి నువ్వేం జేస్తాన్నవ్?'. 'నేనేంజేస్త దొరా.. బక్కపీసుగాన్ని. ఈ చెల్క నాదే! రెండేండ్ల కింద అమ్మిన ఈ పోలీస్ సార్‌కు. పది లచ్చలకు. ఐదిచ్చిండు. ఈ బంగ్లా కట్టిండు.. మిగిలిన పైసలియ్యిమంటే.. 'ఏ పోరా! ఇత్తతియ్యిర. ఏం జేసుకుంటవ్ పైసల్.. ఇక్కడ్నే పనిజెయ్యి నా దగ్గర..' అంటడు. అడిగి అడిగి మా ముసల్ది పానం తీసుకుంది ఉరేసుకొని. అగో ప్రతిరోజూ వాని బిడ్డ, లేకుంటె వాని మదమెక్కిన కొడుకు.. దోస్తులను వెంటేసుకొని వస్తరు. ఒకటే తినుడు తాగుడు.. దుకాణం పెట్టుడు రూంలల్ల. ఛీఛీ లండు ముండలు, దొంగ ముండా కొడుకులు సారు'.

.. అంతా అర్థమైపోయింది సీఐ అర్జున్‌రెడ్డికి. లోపలికి సరసరా వెళ్లి.. స్వర్గలోకంలాంటి ఆ ఇంటీరియర్‌లో.. ఫస్ట్ ఫ్లోర్‌కి వెళ్లి ఒక గది తలుపులను హ్యాండిల్‌తో బాది.. తెరుచుకున్నాక చూస్తే.. మద్‌హోష్‌లో తూలుతూ ఒక రొయ్యకాళ్ల పోరడు.. అటుపక్క బెడ్ మీద ఒంటిపై బట్టలు తొలగిపోయి అన్నీ కనబడుతున్న స్థితిలో ఇద్దరు అమ్మాయిలు.. మద్‌హోష్. దగ్గరికి వెళ్లి పరిశీలనగా గమనిస్తే.. ఐదారు ఖాళీ బీర్ సీసాలు, పక్కన సిల్డినాఫిల్ సిట్రేట్ పెనెగ్రా టాబ్లెట్స్.. టాడాల్ఫిల్ మెగాలిస్ – 50 బిళ్లలు.

ఈ విచ్చలవిడితనం.. అతి స్వేచ్ఛ, ఎవరి హద్దూ అదుపూలేని బీభత్స ప్రవర్తన.. అడిగేవాళ్లెవరూ లేని.. ఒకరకంగా అస్సలే పట్టించుకోని తల్లిదండ్రులు. ఏమిటిది? వీళ్లేనా భావిభారత పౌరులు. 'కొంతమంది యువకులు పుట్టుకతో వృద్ధులు' అని శ్రీశ్రీ చెప్పింది అక్షరాలా సత్యమేగదా!

అర్జున్ రెడ్డి మొబైల్ మోగింది. 'రిపోర్ట్'.. చిన్మయి గొంతు. 'మనకొచ్చిన రిపోర్ట్ కరెక్టే

మేడం'. 'హౌమెనీ?'.'నలుగురు అమ్మాయిలు.. ఆరుగురు అబ్బాయిలు'.'కరెక్టా? అందరి వివరాలు రికార్డ్ చేసుకొని, అందరినీ అరెస్ట్ చేసి తీసుకురా స్టేషన్‌కు'. 'ఓకే మేడం!'. 'ఓవర్'..

***

స్థావరం మూడు. జూబ్లీ హిల్స్ రోడ్ నంబర్ 12. మధురా బృందావనం. రాత్రి మూడున్నర.

సెక్యూరిటీ గూర్ఖా లోపలికి రానివ్వలేదు.. ఎవ్వరినీ ఎంత సముదాయించినా! చిన్మయి సైగ చేయగానే భద్రుడు వాణ్ని మెడలమీద ఒకరకంగా మెలికపెట్టి ఒత్తాడు. అంతే.. వాడు స్పృహతప్పి గిలగిలా కొట్టుకున్నాడు.

పది పోలీస్ టొయోటా కార్లు బుల్లెట్లలా దూసుకొచ్చి, ఆ విశాల ఆవరణలో ఆగాయి. అంతా నిశ్శబ్దం. అటు పక్కన ఒక షెల్టర్ కింద లోపల ఉన్న తొమ్మిదిమంది ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలూ.. ఒక అధికార పార్టీ మంత్రికి చెందిన మొత్తం పద్దెనిమిదిమంది గన్‌మెన్లు మస్తుగా తాగి, కూర్చొట్లు పడుతూ ఏ ఒక్కరు వచ్చినా.. చిన్మయి, పోలీస్ కమిషనర్ గానీ, ఇతర హయ్యర్ ఆఫీసర్లు గానీ గమనించకుండా పొర్లుతున్న తరుణంలో..

ఒక విశాలమైన హాల్‌లో, నిశ్శబ్ద విందు జరుగుతున్నది. టేబుళ్లపై అన్నీ ఇంపోర్టెడ్ సీసాలు. వివిధ రకాల వెజ్, నాన్ వెజ్ అద్భుత వంటకాలు. అందరికీ సర్వ్ చేస్తున్న ఆడ పరిచారికలు.. ఏదంటే అది అందించేందుకు!

చిన్మయి లేజర్ చూపులతో అందర్నీ గమనించి.. గుర్తుపట్టి.. అధికార పార్టీ మంత్రి మాట్లాడుతున్నాడు లోస్వరంతో.. 'ఇప్పటిదాకా మన ఆడిటర్ గారు మీరందరూ ఇటీవలి ఎన్నికల్లో పెట్టిన ఖర్చును మదింపుజేసి.. అనుకున్న ప్రకారం దానికి రెట్టింపు మొత్తాలను అన్నీ రెండువేల నోట్లతో సూట్‌కేసుల్లో నింపి మీ మనుషులకు చెప్పి భద్రంగా మీరు చెప్పిన ఇండ్లకు చేరవేశారు. ఇట్స్ ఓవర్. ఇక రేపు మీరు పార్టీ మారుతున్నట్టు స్పీకర్ గారికి అఫీషియల్ ఫార్మాట్‌లో ఒక వినతిపత్రం ఇస్తారు. మిగతా అన్ని సంగతులను మన లెజిస్లేచర్ సెక్రెటరీ చూసుకుంటాడు. ఒకే!'.

టపటపా చప్పట్లు. ఆ ప్రసంగాన్నీ, పరిసరాలనూ అదృశ్య కెమెరాలు రికార్డ్ చేశాయి. చిన్మయి మెల్లగా చప్పుడు కాకుండా నడుస్తూ, అందరూ విందుకోసం కూర్చున్న చోటుకు వెళ్లి నిలబడి.. నిశ్శబ్దంగా చూస్తుండగా.. మంత్రిగారి పీఏ మొబైల్‌తో ఎవరికో ఫోన్ చేయబోయాడు. 'నో మిస్టర్ జగదీశ్!' అని అరిచింది చిన్మయి. అంతా నిశ్శబ్దం. 'యు ఆర్ ఆల్ అండర్ అరెస్ట్'.

అంతా ఉక్కపోత.. అందరికీ! ఆ చల్లని ఏసీ హాల్‌లో.. ఎందుకో బయట కుక్కలు గుంపుగా అరవడం వినిపిస్తున్నదప్పుడు.

***

రాష్ట్రం అట్టుడికిపోయింది.. అన్ని టీవీ ఛానెళ్లలో బ్రేకింగ్ న్యూస్‌లతో. ఉదయం ఆరు వరకు చిన్మయి నాలుగో స్థావరం.. నగరంలోని పది ఆన్‌లైన్ వ్యభిచార గృహాల్లోనుంచి మొత్తం ఇరవై రెండుమంది వేశ్యలను పట్టుకొని తెచ్చారు. అందరూ రాజమండ్రి, పాలకొల్లు, కరీంనగర్, వరంగల్‌కు చెందినవాళ్లు. ప్యాసింజర్ ఆన్‌లైన్‌లోనే మనిషిని నెట్‌లో చూసి బుక్ చేసుకుంటాడు. డబ్బును ఫోన్ పే చేస్తాడు చెప్పిన అకౌంట్‌కు. వాళ్లు ఓటీపీ లాగా ఒక కార్ నంబర్ ఇస్తారు.. టైంతో సహా! ఆ సమయానికి కారూ, అమ్మాయీ వస్తారు ప్యాసింజర్ అపార్ట్‌మెంట్‌కు. అంతా వస్తు మార్పిడి. నో రిఫండ్.

చిన్మయి ముందే కోర్టునూ, జిల్లా కలెక్టర్‌నూ, తనలా ఏకరీతి అభ్యుదయ ఆలోచనలుగల సహ ఐపీఎస్ అధికారులనూ కలిసి.. కోర్టులో సూమోటో పిటిషన్ కోసం విజ్ఞప్తి చేసి.. ఒక అవినీతి ప్రతిఘటన ఉద్యమాన్ని నిర్మిస్తున్నది. ఉదయం పది గంటలకు.. జూబ్లీ హిల్స్, రోడ్ నంబర్ 10.. పార్క్ ఏరియా. పదుల సంఖ్యలో అన్ని మీడియా చానెళ్ల కెమెరాలు కళ్లు తెరిచి చూస్తూండగా..

చిన్మయి తన వెంట పదుల సంఖ్యలో సహ ఐపీఎస్ ఆఫీసర్లను తీసుకొని.. అందరూ మోస్ట్ యంగ్.. వెంట గత దినపు చానెళ్లలో ప్రకటించిన నాలుగు స్థావరాలపై జరిగిన దాడుల్లో అరెస్ట్ చేసిన మొత్తం నూటా అరవై రెండు మంది.. డాక్టర్లు, లాయర్లు, కొందరు పోలీస్ ఆఫీసర్లు, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఒక మంత్రి, అనేకమంది వేశ్యలు, కాలేజ్ ఎగ్గొట్టి రసికులైన ఫాంహౌస్ పావనకారులు, విద్యార్థులు.. అందరినీ ఫొటోలతో సహా.. ప్రజల సందర్శనార్థం ప్రత్యక్ష పరిచినపుడు..

అక్కడ ప్రజల తీర్థం.. జాతర! సమాజంలో సెలెబ్రిటీలుగా చెలామణి అవుతున్నవాళ్లు.. తప్పుచేసిన చిన్న శిశు తరగతి పిల్లలకన్నా హీనంగా సిగ్గుతో తలవంచుకొని నిలబడి ఉన్న పెద్దలను చూస్తూండగా.. చిన్మయి మాట్లాడటం ప్రారంభించింది. 'వీళ్లందరూ ఏ కారణం చేతనైతే అరెస్టయి మీముందు నిలబడి తలలు వంచుకొని ఉన్నారో.. ఇప్పుడు వాళ్లకు చాలా స్పష్టంగా అర్థమవుతున్నది. తాము ఎంత బ్లండర్ చేశారో! ఈ క్షణం వీళ్లందర్నీ వాళ్ల వాళ్ల భార్యాపిల్లలు, కుటుంబసభ్యులు, స్నేహితులు టీవీల్లో చూస్తూంటారు. వీళ్లను కోర్టులో ప్రవేశపెడితే, ఎన్ని రూపాయలు జరిమానా విధించినా నిస్సిగ్గుగా కట్టి జారుకుంటారు. మళ్లీ మళ్లీ ఇటువంటి తప్పులే చేస్తుంటారు. నిజానికి ఈ ప్రవర్తనకు కారణం.. వీళ్లలో జెనెటికల్‌గా ఉన్న నేరప్రవృత్తి. విచ్చలవిడితనం. అనుభవిస్తున్న అతిస్వేచ్ఛ. సమాజంపట్ల అసలు బాధ్యతే లేని జులాయితనం. మనుషులకు అసలైన శిక్ష.. వాళ్ల పరువు పోతున్నప్పుడు తెలుస్తుంది. ఇప్పుడు ప్రజలముందు సిగ్గుతో తలదించుకొని నిలబడ్డ వీళ్లందరూ.. ఇకముందు ఇటువంటి తప్పులను మళ్లీ చేయరని బలంగా నమ్ముతాను నేను. కోర్టు వీళ్లకు జరిమానా విధిస్తే అప్పుడే కట్టి వెళ్లిపోతారు. లేదా డబ్బు కట్టి బెయిల్ తెచ్చుకుంటారు. దోషిగా

నిలబెట్టి మనిషిలో పరివర్తన తెచ్చినపుడు.. అది మనిషిని శాశ్వతంగా మారుస్తుంది. మరో ముఖ్యమైన విషయం గమనించండి.. వీళ్లందరూ బాగా చదువుకున్నవారు. విద్యావంతులు. వీళ్లే ఎక్కువగా తప్పులు చేస్తూ సమాజానికి తలవంపులు తెస్తున్నారు. ఈ దేశానికి వేల కోట్ల రూపాయలను బ్యాంకులద్వారా ఎగ్గొట్టి మోసం చేస్తున్నవాళ్లందరూ ఉన్నత విద్యావంతులూ, హైలీ క్వాలిఫైడే! వేలకోట్ల రూపాయలను ఈ రకంగా తస్కరించినవాళ్లే ఈ మన సమాజానికి చీడపురుగులు..' చిన్మయి గంగలా గలగలా ప్రవహిస్తున్నది.

ఒక్క గంగే క్షేత్రాన్నంతటినీ శుభ్రిస్తూ ప్రక్షాళన చేయగలదా? భ్రష్టుపట్టి పోతున్న విశృంఖలతతో తమను తామే ధ్వంసించుకుంటున్న ఇప్పటి తరం ఈ సత్యాన్ని గ్రహిస్తూ స్పృహించాలె.. ఆలోచించండి. ప్రతి మనిషీ ఒక నది కావాలె. ప్రవహించాలె. మనందరి చుట్టూ కాలుష్య కారకాలైన టీవీ, ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లు, చేయి చాస్తే అందే సకల విచ్చలవిడి సౌకర్యాలు, ల్యాప్‌టాప్‌లు.. ఇవన్నీ రెండువైపులా పదునున్న కత్తుల్లాంటివి.

మనల్ని మనమే.. మనపైకి దండెత్తే ఈ అదృశ్య కాలుష్యంనుంచి కాపాడుకోవాలె!

***

ఆలోచన ఒక అగ్నిమొలక. అది దహిస్తుంది.. వెలుగిస్తుంది కూడా!

**1950 లో జన్మించిన ప్రొఫెసర్ రామా చంద్రమౌళి మెకానికల్ ఇంజనీరింగ్ లో పోస్ట్ గ్రాడ్యుఏషన్ పూర్తి చేశారు. ప్రస్తుతం వరంగల్‌లోని 'గణపతి ఇంజనీరింగ్ కాలేజ్' లో వైస్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. ఆయన కవి, కథకులు, నవలాకారులు, విమర్శకులు. ఇంతవరకు 76గ్రంథాలను ప్రచురించిన చంద్రమౌళి 32 నవలలు, 385 కథలు, 12 కవిత్వ సంపుటాలు, 3 నాటకాలు, 4 విమర్శా గ్రంథాలను వెలువరించారు. తెలంగాణ రాష్ట్ర అత్యున్నత సాహిత్య అవార్డ్ 'కాళోజీ పురస్కారం - 2020' ను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖ-రరావు గారి చేతులమీదుగా అందుకున్నారు. చంద్రమౌళి గారి కథలు, కవిత్వం , నవలలు అనేకం పంజాబి, తమిళం, కన్నడ, బెంగాలి, హిందీ వంటి తెలుగేతర భారతీయ భాషల్లోకి అనువదించబడి జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని సమకూర్చిపెట్టాయి.**

**2386 ఎంట్రీలను పరిశీలించి ప్రపంచవ్యాప్తంగా 60 మందికి ప్రకటించిన 'నాజి నామన్ ప్రపంచస్థాయి జీవితకాల సాఫల్య పురస్కారం- 2019' భారతదేశంలో ఒక్క రామా చంద్రమౌళికి మాత్రమే దక్కింది.**



**ఐతా చంద్రయ్య**
**9391205299**

# సాధనా శూరత్వము

'సదువు సక్కగ లేనోని బతుకు.. సముద్రంల నాటుపడవ లెక్కుంటది' అని అనుకుంటున్న రాజారాం మెదడు అల్లకల్లోలంగా ఉన్నది. అదే మనాది ముల్లెను కొడుకు ముందు విప్పిండు. కొడుకు పరశురాములు అల్లాటప్పా మనిషి గాదు.

'నీ యవ్వ! ఇదంతా నువ్వే జేసినవు. కులకష్పి అనుకుంట బడికి సరిగ్గా పోనియ్యకపోతివి'.. పరశురాములు కొరకొర చూపులు, రాజారాం పొత్తి కడుపును పరపర కోసేస్తున్నట్టున్నయ్.

'వాణ్ని బడికి తోలియ్యకుండ తాతల నాటి విద్య నేర్చుకొమ్మని తల్కాయె దింటివి. వానికో బంగిరిద్దెల విద్య నేర్పితివి. వాడు అందరిలెక్క బడికి వోతె పదో తరగతి ఎప్పుడో పాసైపోతుండె. ఆ బంగిరిద్దెల విద్యను

ఇప్పుడెవ్వడూ దేకుతలేడు. ఈ బోడ్‌సోడ్ విద్యను నమ్ముకొంటే బతుకు నడిగంట్ల నాగిలిడిశినట్టాయె' రాజారాం భార్య మణెవ్వ కడుపుల కుతకుతలాడుతుంది. ఆ మాటలు విన్న రాజారాంకు వీపుమీద సురుకులు వెట్టినట్టు అయ్యింది. ఓర్చుకోక తప్పలేదు. అప్పుడే పరశురాములు మనసుల ఓ ఇత్తనం నాటుకుంది.

'నన్ను ఎటుగాకుంట చేసినవు గదా! నిన్ను ముప్పు తిప్పలు వెట్టి, మూడు శేర్ల నీళ్లు దాగిస్తా!' అన్నడు తండ్రితోటి. 'అయిందేదో అయ్యింది. ఇంట్ల బాగా సదువుకొని ఆ పదో తరగతి పరీక్షలు మల్లా ఇయ్యచ్చు గదా?' రాజారాం సలహా.

గట్ల ఎన్నిసార్లు జెప్పినా పరశురాములు ఒగ్గూపినట్టు తల్కాయె ఊపె. గానీ, పుస్తకమైతె పట్టకపాయె. లండు సోపతులు వట్టి దున్నపోతుల లెక్క తిరగవట్టె.. రాజారాం రంది.

పెద్దలిచ్చిన భూమి అమ్మి ఇద్దరాడ పిల్లల లగ్గం జేసిండు. చెల్లెండ్ల లగ్గాలాయె.. ఇంకా తన లగ్గం కాలేదని వాని కసి. కులవృత్తి కళలకు ఆదరణ అడుగంటె. సంపాదన లేని పరశురాములుకు ఎవ్వలూ పిల్లను ఇవ్వకపోయిరి. తండ్రి విద్యను తాను నేర్చుకొని, ప్రదర్శించి నాలుగు పైసలు సంపాదించకపాయె.

వారం కింద.. 'వారీ పర్శరాములూ! సిరిసిల్లల నాకు తెలిసినోల్లున్నరు. వాళ్లతోని మాట్లాడ్తా. నువ్వక్కడికి వొయ్యి సాంచాలు నడుపుడు నేర్సుకొని, గదే సాంచాలల్ల జీతముంటె బాగుంటది' రాజారాం సలహా. 'సగమీడు దిరిగినంక సముర్త కట్నాలన్నట్టు.. ముప్పయేండ్లు ముడ్డికిందికొచ్చె. గా ఊర్లె జీతముంటడా?' భార్య జవాబు. వాడు ముందే ఆవారాగాడు. వానికి తల్లి ఊదుపొగ ఎయ్యవట్టె. 'ముందుగాల నాకు లగ్గం జెయ్యి. గప్పుడాలోచిస్త' కొడుకు సిగ్గు విడిచిండు. 'గదేదో శాస్త్రముంది! పిచ్చి కుదిరితే పెండ్లయితది. పెండ్లయితే పిచ్చి నయమైతది.. అన్నట్టు నీకు సొంత సంపాదనుంటే ఎవ్వడైన పిల్లనిస్తడు..'.

పరశురాములు వొయ్యి ఊరుమీద వడ్డడు. రాజారాం మంచమ్మీద ఒరిగిండు. తేనెతుట్టెలోని తేనెటీగల్లాగ ఆలోచనలు.. పాత జ్ఞాపకాలు మెదడును ముసురుకుంటున్నయి.

***

ఆ రోజులల్ల కులవృత్తి విద్యలు బలంగా సాగుతుండేవి. సాధనాశూరుల విద్య ప్రదర్శన చూసి, అంతా సంతోషించి ధాన్యం, పైసలు ఇచ్చేటోళ్లు. కూరగాయలు, ఇంకేవేవో దానమిచ్చెటోళ్లు. శ్రీమంతులు కొత్త బట్టలు పెట్టేటోళ్లు. రందిలేని జీవితం.

ఆ ఊరు చింతమడక. కామునికంత పెద్ద చౌరస్తా. ఆ రోజు సాధనాశూరుల విద్య ప్రదర్శన. బెల్లం చుట్టూ ఈగల లెక్క జనాలు గుమిగూడిండ్రు. ఆట చూపించెటోళ్లు.. అనుభవమున్నోళ్లు. ఊరి మస్కూరీలు అందరినీ పద్ధతిలో కూర్చుండబెట్టిండ్రు. ప్రదర్శన షురువైంది.

పెద్దమనిషి ముందట నీళ్లు, పసుపుపొడి, ఇటుకపొడి తాంబాలాలున్నయి. పసుపు, ఇటుకపొడిని కలిపి నీళ్లు బోసిండు. అందులోకి సూర్య కిరణాలు తొంగి చూస్తున్నయి. చేతులు పైకెత్తి దండం బెట్టిండు.

'ఇటుకపొడి, పసుపుపొడి నీళ్లల్ల కలిసినై గదా! కలిసిపోయిన వాటిని నీళ్ల నుంచి పొడిపొడిగా తీస్తున్నా..' అంటూ ఇటుకపొడి తీసి ఒక తాంబాలంల, పసుపు పొడి తీసి వేరే తాంబాలంల పోసిండు. చప్పట్లు మార్మోగినయి.

'ఇంకోటి చూడుండ్రి..' పెద్దమనిషి నవ్విండు. నాలుగు పందిరి గుంజలను నాలుగు దిక్కుల పాతిండ్రు. మొదటి గుంజకు యువకుడు నారాయణను కట్టేసిండ్రు. మీద, చుట్టూ పరదాలు కట్టిండ్రు. లోపల నారాయణ ఒక్కడే ఉన్నడు. రెండు నిమిషాలాగి పరదాలు విప్పేసిండ్రు. ఈ గుంజకున్న నారాయణ మరో గుంజకు కట్టేసున్నడు.

చప్పట్లతో చౌరస్తా మురిసింది. నారాయణను అట్లే ఉంచి, మళ్లీ పరదాలు కట్టిండ్రు. నారాయణ పందిట్లనే ఉన్నడని అనుకున్నారంతా. పెద్దమనిషి నారాయణను పిలిచిండు.

'వస్తున్నా..' అనుకుంట నారాయణ జనాల గుంపులోంచి వచ్చిండు. పరదాలు విప్పి చూస్తే.. ఎవరూ లేరు. మళ్లీ చప్పట్ల జడివాన. చుట్టూ జనాల గుంపు బాగా పెరిగింది.

ఈల వేసి పెద్దమనిషి రాజును పిలిచిండు. గుంపుల నుంచి వచ్చిన రాజు చేతుల వేపరెమ్మలు ఉన్నయి. ఇద్దరు మనుషులు రాజును కింద కూచోబెట్టి, వేప రెమ్మలు నెత్తిమీద పెట్టిండ్రు. పక్కన ఉన్నాయన రెడీగా ఉన్న సిమెంటు పొయ్యిని నెత్తిమీది వేప రెమ్మలమీద పెట్టిండు. పొయ్యిలో గ్యాసునూనెలో తడిపిన బట్టపేగులేసి, అగ్గిపుల్ల గీసి అంటుబెట్టిండు. పొయ్యి మీద వెట్టిన గిన్నెల నూనె ఉంది. పొయ్యిల మంటలు లేస్తున్నయి. ఇంకొకాయన గోధుమ పూరీలు చేసి, గిన్నెలో వేసిండు. పూరీలు దేవి తీసిండు. రాజు ఖుషీగా నవ్వుతున్నడు.

'అరె! నెత్తిమీద మంట వెడితే జుట్టుగూడ కాలలేదు'.. జనాల మాటల్తో చప్పట్లు లేచినయి. పక్కనున్న చింతచెట్టు నవ్వుతున్నట్టు.. కొమ్మలు – రెమ్మలు గట్టిగా ఊగినయి.

'ఇంకో గమ్మతి చూడుండ్రి!' అంటూ పెద్దమనిషి ఇద్దరికి సైగ జేసిండు. వాళ్లు సొప్పబెండ్లు, దారంతోని మంచం, ఉయ్యాల తయారు చేసిండ్రు. పెద్ద కట్టెకు ఉయ్యాల కట్టిండ్రు. సొప్ప బెండ్ల ఉయ్యాల మీద పెద్దమనిషి కూసున్నడు. ఇద్దరు మనుషులు ఉయ్యాల కట్టెను లేపి, చెరో భుజమ్మీద పెట్టుకొని చుట్టూ తిప్పిండ్రు. బెండ్లు ఇరుగలేదు.. దారం తెగలేదు.

'అదెట్లా?' ఒకాయన అడిగిండు. 'ఈ విద్య మాకు దైవదత్తం..' పెద్దమనిషి జవాబు. మళ్లీ ఈలలు, చప్పట్లు.. ఆకాశానికి అంటినయి. ఇట్లా చిత్ర, విచిత్రాలు రెండు గంటలపాటు చూపించిండ్రు. ఓ పక్కన కుర్చీలో కూసున్న దొర.. 'బాగుందిరా సాధనాశూరుల విద్య! మా ఇంటికొచ్చి రెండు బుడ్ల వడ్లు తీసుకోండ్రి!' అని ఆదేశించిండు. 'దొరకు దండాలు! గిసొంటి వాళ్లతోనే బతుకుతున్నం. మీరు సల్లంగుండాలె దొరా!' పెద్దమనిషి దొర కాళ్లకు మొక్కిండు.

'గీ విద్య ఎట్ల నేర్చుకున్నరు రా?'.. దొర సందేహం. 'దొరా! వంశపారంపర్యంగా మా తాతతండ్రుల నుంచి వచ్చిన విద్య. తరం తర్వాత తరం నేర్చుకుంటున్నం'. దొర వెళ్లినంక.. జనాల మధ్య గుడ్డ పరిచి..

'దానం చెయ్యుండ్రయ్యా!' అంటూ అందరికీ దండం బెట్టిండు పెద్దమనిషి. నాణేలు,

నోట్లు.. ఆ పరిచిన గుడ్డలో జడివాన లెక్క పడినయి.

ఆ పెద్దమనిషే.. రాజారాం. ఇంకో నలుగురితో కలిసి ఊరూరా తిరుగుతూ బట్ట – పొట్టకు తిప్పలు లేకుండా గడిపేవాడు.

***

'ఏందయ్యా! గట్ల బీరిపొయ్యి కూసున్నవ్'.. మణెవ్వ గొంతు విని మరో లోకం నుంచి మానవలోకానికి వచ్చిండు రాజారాం. లేచి కూసొని చెయ్యి అందుకోబోయిండు. 'బాగానే ఉంది సంబడం..' చెయ్యి వెనక్కు లాక్కుంది మణెవ్వ. ముక్కుపుడక మెరుస్తూ ఉంటే.. మణెవ్వ చాయ గ్లాసు అందించింది. తానో చాయ గ్లాసుతో ఉంది. 'ఛీఛీ! వాని బతుకు బండవారిపాయె!'.. అంటున్న భర్త పక్కనే కూర్చొని, వేడి చాయ జుర్రుతున్నది మణెవ్వ. చాయ పాములెక్క నరాలల్లకు పాకింది. పానం ఉషారైంది. 'నేనేం జెయ్యాలె?'.. అన్నది.'ఎక్కడన్నా జీతముండడు. సొంత యాపారం పెట్టిద్దామంటే పెట్టువడికి పైసల్లేవాయె. పైసలు లేనోన్ని పెండల పురుగోలె తీసిపారేస్తరు. గౌర్మెంటు ఇస్తున్న గా పించినితోనే ఇల్లు గడువవట్టె. శిల్లర బాకీలు కుప్పలోలె ఉండె'. 'ఏదన్నా ఉపాయం జెయ్యాలయ్యా!'. 'గింత పెద్దిల్లు ఏం జేసుకుంటం? సగమంత అమ్మి వానికి కిరాణ దుకాణం పెట్టిత్తె బాగుంటది గదా?'. 'గట్లయితే ఇప్పుడేదో సదురుకోవచ్చు గానీ, వాని పెండ్లయినంక ఇరుకుటమైతదేమో..?'.'ఇరుకుడో.. గిరుకుడో.. వాడు తొవ్వల వడాలె!'. గప్పుడే గోడ మీది బల్లి అరిచింది. 'కృష్ణ కృష్ణా! బల్లి గూడ పలికింది. అట్ల జేస్తె బాగనే ఉంటది' రాజారాం ఆలోచన.

***

'అక్కా! ఓ అక్కా!' అనుకుంట ఇంట్లకు ఓ కొత్త మనిషొచ్చిండు. భార్యాభర్తలు అటు చూసింద్రు. పైజామా, గీతల షర్టు. భుజమ్మీద తుండుగుడ్డ, నుదుట భస్మరేఖలు, అతని వెనక ఇరవై ఐదేండ్ల పడుసు పిల్ల. సామ నలుపు, ముఖమ్మీద ఆరబోసిన అమాయకత్వం, చెవులకు రింగులు. ఆ కొత్తవాళ్లు మంచం దాకా వచ్చింద్రు. 'ఏందక్కా? నేను.. బావా! నీ బామ్మర్ది శంకరయ్యను. ఇది భవాని, నా బిడ్డ. బొంబై నుంచి అచ్చిన' అంటూ సూటుకేసు కిందవెట్టిండు.

మొగ్గలెక్క ముడుసుకున్న మణెవ్వ ముఖం.. బీరపువ్వోలె విచ్చుకుంది. 'నువ్వార శంకరీ! గిట్లయినవు ఏందిరా?' అనుకుంట సూటుకేసు తీసి, లోపల వెట్టింది. 'సుక్కతెగి వడ్డట్టు వచ్చినవురా' అంటూ తమ్ముని చేతులందుకొని కండ్లకద్దుకున్నది. 'ఒక ఉత్తరం గూడ రాయకపోతివి. నీ బిడ్డ అప్పుడు శిన్నపిల్ల. దీని పేరు భవాని గదా? నీ పెండ్లాం ఎట్లుందిరా?'.. అంటూ కుశల ప్రశ్నలేసింది. రాజారాం.. భవాని తలనిమిరిండు. మణెవ్వ దంపతుల కాళ్లకు మొక్కింది భవాని. 'మీ అమ్మ బాగుందా బిడ్డా?' అంటూ భవానిని లేపి, గుండెలకు హత్తుకుంది మణెవ్వ. 'మా అమ్మ.. అమ్మ..' అనంగనే.. భవాని కండ్లల్ల నీళ్లు దిరిగినయి. 'మీ

అమ్మకేమైందే?' మణెవ్వలో ఆత్రుత. 'అమ్మ.. సచ్చిపోయిందత్తా..' అంటూ గొల్లుమన్నది భవాని. మణెవ్వ కండ్లు మంచు పూలైనయి. 'గట్లెట్లరా..? శంకరా!' గుండె పిండినట్టయ్యింది. 'ఎవల బిశాది ఏందని గన్నేండ్ల కింద బొంబై వోతి!'.. తుండుగుడ్డతో కండ్లద్దుకున్నడు శంకరయ్య.

'మొదట్ల కూలిగ పన్జేసినక్కా! రాత్రింబగళ్లు పంజేస్తి. పెండ్లాన్ని తోల్కపోతి. పైసలు కూడవెట్టి సాంచాలు కొంటి. బట్టలు తయారుజేస్తి. నాకష్టం లెక్క సాంచాలు పెరిగినయి'.

'మరి!'.. కంటిధారల్ని మణెవ్వ కొంగుతో అద్దుకుంది.

'మంచి పిల్లగాన్ని జూసి భవాని లగ్గం జేత్తి! భవాని మొగడు ప్రైవేటు కంపెనీల పంజేసెటోడు. నా అల్లునిది రాజా గుణం. ఏడాది దిర్గకుండనే ఆళ్లకు కొడుకు పుట్టిండు. గంతల్నే ఏ దేవునికి కన్నుగుట్టిందో! నా బిడ్డ బతుకు అన్యాయమై పోయిందక్కా! ఓ రోజు ముగ్గురూ బైకు మీద సిన్మాకు పోతుంటే.. యాక్సిడెంటైంది. తండ్రి కొడుకులు అక్కడికక్కడే సచ్చిపోయింద్రు. భవాని దెబ్బలతోటి బైటవడ్డది. నా భార్య, నేను బుద్దార ఏడ్శినం. బిడ్డ బతుకు ఆగమైందన్న రందితోనే నీ మర్దలు మంచంల వడ్డది. ఎన్ని దావకాండ్లు దిప్పినా దక్కలే! ఇగ మా గతి అంగట్ల అవ్వా అంటే.. ఎవనికి పుట్టినవ్ బిడ్డా? అన్నట్టుగైంది. మాకక్కడ నా అన్నవాళ్లెవరూ లేరు. గంతల్నే మీరు గుర్తుకొచ్చింద్రు. మనసంతా పింజంపింజమైంది. ఇల్లు అమ్మేసి, సాంచాలు కిరాయికిచ్చి వచ్చినం' తన కథ మొత్తం చెప్పుకొచ్చిండు శంకరయ్య.

శంకరయ్య, భవానీ దుఃఖం కక్కేస్తుంటే.. రాజారాం, మణెవ్వ లోపలినుంచి పొంగుకొచ్చిన ఆవేదన అంతా ఇంతా కాదు. శంకరయ్యను గుండెలకు హత్తుకున్నడు రాజారాం. 'శంకరా! మనుషులమంతా పైవాని చేతిల ఆటబొమ్మలం. అదంతా రుణానుబంధం'.. తుండుగుడ్డతో బామ్మర్ది కండ్లు తుడిచిండు. 'అందరి సంగేతేందో గానీ, నా బతుకు బండల పాలైందత్తా!' అంటూ మేనత్త ఒడిలో ఒదిగిపోయింది భవాని.

'మనిషి బతుకుల కష్టసుఖాలు రెండూ ఉంటాయి భవానీ!' వీపు నిమిరింది మణెవ్వ.'నీ బతుకు బండలైందని అనుకోకు. మేమంతా ఉన్నం గదా!' అంటూ ఊరడించింది. గంతల్నే.. 'కల కానిదీ.. విలువైనదీ బతుకూ...' అంటూ సిన్మా పాట పాడుకుంట పరశురాములొచ్చిండు. ముందర వయసు పొంగులతోని భవాని కనబడింది. 'అబ్బో! ఏవలీ ముద్దుగుమ్మ? కొచిప్పలోలె కండ్లు, చెక్కిన ముక్కు, గంత పొడుగు జడ..' అని మనసులోనే అనుకుంటున్నడు.

'ఏందిరా గట్ల జూస్తున్నవ్! అది భవాని! నీ మేన మరదలు. ఇగో.. మా తమ్ముడు శంకరయ్య. బొంబై నుంచి మూట ముల్లె సద్దుకొని వచ్చింద్రు..' మణెవ్వ చొరవ సూపుకుంట అన్నది. 'మామా!' పరశురాములు ఆశ్చర్యానందాలు. 'మిమ్మల్ని చూసి చానా కాలమైంది. అంతా బాగున్నరా?'. 'ఏదో బిడ్డా! గిట్లున్నం. నా మేనల్లుడు శానా పెద్దోడైండు. పెండ్లాం పిల్లలంతా..' శంకరయ్య అయోమయంలో ఆశ.'ఆనికి ఇంక లగ్గమే కాలే. మన

సాధనాశూరుల విద్య నేర్సుకొని ఎటూ గాకుంట వోయిండు..' సంగతంతా చెప్పిండు రాజారాం.

ఆ దినం సాయంత్రం భవాని సంగతంతా పూస గుచ్చినట్టు చెప్పింది మణెవ్వ.. కొడుక్కు. భవాని, పరశురాములు చూపులు కలుసుకొని ఒకరినొకరి ఆసాంతం పరిశీలించుకుంటున్నరు. గుండెల గుసగుసలు. భవానికి తన పరిస్థితి గుర్తుకొచ్చి, గంభీరమైంది. మొహం ముడుచుకుపోయింది.

***

నాలుగు రోజులు గుంభనంగ గడిచినయి. గుండెల్ల గుండు సూది గుచ్చినట్టుగుంది భవానికి.. గది నుంచి బయటికి రాలేదు. అక్కను సూడగానే.. గుండెమంటల మీద నీళ్లు వోసినట్టు అయ్యింది శంకరయ్యకు.

'భవాని గురించి అంతా శెప్పితి. అక్కాబావలకు దయ కలిగిందో.. లేదో? భవానిని వాళ్ల కొడుక్కిచ్చి లగ్గం జెయ్యమని అడిగితే! బావ కోపానికొచ్చి కొండెంగలెక్క అయిపోతడేమో? 'ముండ మోసిన పోరిని నా కొడుక్కు చేసుకోవాల్నా?' అని ఒంటికాలి మీద లేస్తడేమో?'.. ఆలోచనలు అల్లకల్లోలం చేస్తున్నయి.

ఇటు జూత్తె మణెవ్వ.. 'నా తమ్ముని బిడ్డ బతుకు ఎనుగుల వడ్డ ఎలుక పిల్లలెక్కాయె. కొడుకును సూత్తె కొండమీది కొంగలెక్కుండె. ఎటు ఎగిరిపోతడో.. వన్నెల పోశెట్టి. భవానిని లగ్గం జేసుకుంటడో?' ఆలోచనాలోచనాలు తిరుగుతున్నయి.

ఇక రాజారాంది.. కుడితిల వడ్డ ఎలుకలెక్కుంది పరిస్థితి. 'బామ్మర్ది, ఆని బిడ్డ ఎన్ని రోజులుంటరో? మాకే తిండికి తిప్పలు గావట్టె. బోడిగుండు మీద కొబ్బరి బోండం పడ్డట్టుంది. కొడుకు ఎట్లా బాగుపడాలె? శంకరయ్య ఏదన్న సాయం జేస్తడో?'.

భవానిని చూసినప్పటి సంది పరశురాములు మనసు అటే లాగుతున్నది. 'భవాని బొమ్మోలె బాగానే ఉంది. కానీ, నా పరిస్థితి.. సంపాదన సున్న, ఖర్చు మిన్న. భవానిది ముందే దెబ్బతిన్న పానం. నాతో పెండ్లికి ఒప్పుకొంటదా?'. భవాని ఒకసారి బయటికొచ్చి చూసింది. అందరి లెక్క తాను గూడ పొద్దున చాయదాగి, పరశురాముల్ని చూసింది. ప్చ్.. ఏం లాభం? నరాలల్ల కొత్త అల్లకల్లోలం పుట్టుకొస్తుంటె.. తిరిగి గదిలోకెళ్లి మంచమ్మీద కూర్చుంది.

***

మధ్యాహ్న మార్తాండుడు వేడిని వెదజల్లుతున్నడు. భోజనాలైనంక అందరూ వసారాల కూసున్నరు. భవాని తల పైకెత్తడం లేదు. 'మా ఇంట్ల ఇంకెన్ని రోజులుంటవురా శంకరీ?' అని అడుగుదామని అనుకున్న రాజారాం, భార్య సైగలతో ఆగాడు. 'బావా! అక్కా!'.. శంకరయ్యలో మొండి ధైర్యం. ఇద్దరినీ మార్చి మార్చి చూస్తున్నడు.

'ముసుగుల గుద్దులాట ఎందుగ్గాని.. నెనొకటి చెప్తా.. మీరు సరేనంటరా?' అని అడిగిండు. 'అందరికీ బాగుంటే అవునంటం..' రాజారాం తెగింపు. మణెవ్వ జాగ్రత్తగా వింటున్నది.

'అయితే వినుండ్రి.. నా బిడ్డ భవానికి మల్ల లగ్గం జెయ్యాలనుకున్న. మీ కొడుకూ లగ్గానికున్నడు. నా దగ్గర లక్ష రూపాలున్నయి. మీరు భవానిని పరశురాములకు చేసుకుంటె.. ఆ లక్ష మీకే ఇస్త. బొంబైలున్న సాంచాలు దెప్పించి, సిద్దిపేటల వెట్టిపిస్త. వాటిని గూడ మీకే ఇచ్చేస్త. పరశురాములు సాంచాల మీద పనిచేసుకుంట నాల్రూపాలు సంపాయించుకుంటడు. తాను బతుకుతడు. మనందర్ని బతికిస్తడు. నేను జిందగీ ఉన్నంతదాక మీతోనే ఉంట. ఇప్పుడేమంటరు?' సూటిగ అడిగిండు.

అందరూ హాయిగా ఊపిరి పీల్చుకున్నరు. అందరి కండ్లల్లో కొత్త కాంతులు మెరుస్తున్నయి. భవాని, పరశురాములు కండ్లు కలుసుకొని సైగలు చేసుకుంటున్నయి. ఇద్దరూ భవిష్యత్తు గురించి ఊహల ఉయ్యాలలూగుతున్నరు.

***

**ఐతా చంద్రయ్య**

**ఐతా చంద్రయ్య స్వస్థలం సిద్దిపేట జిల్లా చింతమడక. బీఏ చేశారు. పోస్ట్‌మాస్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. 50 ఏండ్లుగా కథా రచనలో ఉన్నారు. ఇప్పటివరకూ ఈయన 700 లకు పైగా కథలు రాయగా, అవి 22 సంపుటాలుగా వెలువడ్డాయి. 19 కవితా సంపుటాలు, 11 నవలలు, 6 రంగస్థల నాటకాలు, 18 రేడియో నాటికలు, 6 ఏకపాత్ర సంపుటాలు, 29 బాలసాహిత్య సంపుటాలు, మరో 23 అనువాదాలు, 9 ఇతర సంపుటాలను వెలువరించారు. తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి, సాహితీ, ప్రతిభా పురస్కారాలను అందుకున్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం నుంచి సాహితీ పురస్కారం, తెలంగాణ సారస్వత పరిషత్తు నుంచి వరిష్ఠ పురస్కారంతో పాటు అనేక అవార్డులు, సన్మానాలు పొందారు. వివిధ సంస్థల నుంచి కథా శిల్పి, కవిశేఖర, బాల కథా శిల్పి బిరుదులు ఈయనను వరించాయి. ఐతా చంద్రయ్య రచనలపై పరిశోధనలు చేసి... ఒకరు పీహెచ్‌డీ, మరొకరు ఎంఫిల్ పట్టాలు పొందారు.**

# ఆకాశం



**గుమ్మడి రవీంద్రనాథ్**
**8297356766**

నాంది :

హైదరాబాద్ మహానగరం. జూబ్లీహిల్స్ ప్రాంతంలోని ఓ అధునాతన భవంతి ముందున్న ఆవరణలో.. పచ్చటి తివాచీ పరిచినట్లుగా పచ్చిక (లాన్). ఆ పచ్చదనాన్ని మరింత ఆకర్షణీయపరుస్తూ రకరకాల పూల మొక్కలు. ఎరుపూ, పసుపూ, తెలుపూ.. వివిధ రంగుల్లో విరబూసిన పూలు, ఎనిమిది గంటల ఉదయపు ఎండలో నవనవలు కురిపిస్తున్నాయి. నూతనంగా నిర్మించిన ఆ ఇంటి ముందర ఆవరణలో కుడివైపున ప్రహరీ దగ్గర కళ్లు మూసుకుని ఉంది భూమి. కళ్లు తెరిచి ఈ లోకాన్ని చూడటానికే వణికిపోతున్నది.

ఆ ఇంటి తలుపు తెరుచుకుంది. లోపలి నుంచి ఒక యువతి బయటికి వచ్చింది. పచ్చిక పక్కగా ఉన్న దారిమీదుగా, భూమి వైపు అడుగులు వేస్తున్నది ఆమె. ఉషోదయపు లేత ఎండకన్నా కాంతిమంతంగా మెరుస్తున్నదా యువతి ముఖం. నిర్మలత్వపు గాఢతతో కూడిన అందమైన కాంతి అది.

***

నెల రోజుల క్రితం ఓ ఆదివారం సాయంత్రం ఆరుబయట పచ్చికపై చాప వేసుకొని యోగా చేస్తుండగా.. ఎక్కడినుంచో ఏదో మూలుగు వినిపించినట్లు అనిపించింది ఆమెకు. సాయంకాలపు సంధ్యాకాంతులు పశ్చిమాన్ని నారింజరంగులో వెలిగిస్తున్నాయి. ఆ మూలుగు తనకు సమీపంలోనే అనిపించి, లేచి ఇనుప గేటు తెరిచి బయటికి

రెండడుగులు వేసింది. రోడ్డు పక్కన కనిపించిన ఆ దృశ్యాన్ని చూసి ఒక్కక్షణం ఆమె ఊపిరి ఆగిపోయింది. ఏడెనిమిది నెలల వయసున్న ఒక వీధికుక్క.. రక్తపు మడుగులో పడి ఉంది. ఆ దృశ్యం హృదయవిదారకంగా ఉంది. ఆమె గుండె కదిలిపోయింది. క్షణం ఆలస్యం చేయకుండా, ఇంటిలో పనిచేసే కవితను వెంటబెట్టుకుని.. పాత దుప్పట్ల మధ్య ఆ కుక్కను జాగ్రత్తగా పడుకోబెట్టి, కారులో హుటాహుటిన వెటర్నరీ ఆసుపత్రికి తీసుకువెళ్లింది.

రెండున్నర గంటల తర్వాత ఆ వైద్యుడు, ఆమె దగ్గరికొచ్చి.. 'ఆ కుక్క మీదేనా?' అని అడిగాడు. 'కాదండీ! మా ఇంటి ముందు పడుంది. రక్తం మడుగులో కదల్లేని స్థితిలో ఉంటే చూసి తీసుకొచ్చాను. చాలా రక్తం పోయింది. బతుకుతుందా? అసలు!' ఆ యువతి వివరించింది. అప్పుడు ఆ డాక్టర్ దీర్ఘంగా శ్వాస తీసుకొని.. 'దాన్ని ఎవరో దారుణంగా హింసించారు. నాలుగు కాళ్లూ కట్టేసి చిత్రహింసకు గురిచేశారు. నిర్లక్ష్యానికీ, హింసకీ, 'అబ్యూస్'కీ గురైన ఎన్నో జంతువులను చూశాను గానీ, మరీ ఇంత దారుణమైన హింసను నేనింతవరకూ చూడలేదు! రెండు సర్జరీలు చేయాల్సి వచ్చింది. ప్రాణం కాపాడగలిగాను. కానీ, పూర్తిగా కోలుకోవడానికి సమయం పడుతుంది'. ఆ మాటలు విని ఆమె నిర్ఘాంతపోయింది.

'నోరు లేని జీవులమీద కూడా ఇంత క్రూరత్వమేంటి? అబ్యూజ్ ఏంటి?'.. ఆ కుక్కను బ్లూక్రాస్ వాళ్లకో, జంతు సంరక్షణ సంస్థలకో అప్పగించి అక్కడితో వదిలేయాలని అనిపించలేదు ఆమెకు.

తనతో ఇంటికి తీసుకువచ్చి, ఒక గూడు (కెన్నెల్) కొని దానిలో ఉంచింది. ఆడ కుక్క కావడంతో 'భూమి' అని పేరుపెట్టి, దాని సంరక్షణ భారం తనే తీసుకుంది. అయితే, భూమి తన శారీరక గాయాల నుంచి కోలుకుంటున్నది కానీ, తాను అనుభవించిన ఆ 'ట్రామా', మనసుకు తగిలిన 'గాయం' నుంచి మాత్రం తేరుకోలేక పోతున్నది. దాని కళ్లలో జాలి తప్ప 'జీవం' కానరావడం లేదు. తీవ్రమైన మానసిక వేదనను అనుభవిస్తున్నదానిలా, నిస్తేజంగా నిర్వికారంగా చూస్తుంది. తోక ముడిచేసుకొని కాళ్ల మధ్య పెట్టేసుకుంటుంది. దాని మనసంతా భయమే! ఆందోళనే! తన గూట్లో ఓ మూలకు పోయి ముడుచుకుపోయి ఉంటుంది. ఆహారం కూడా సరిగ్గా తినదు. మనిషైతే కౌన్సెలింగ్ లాంటివి చేయవచ్చు. నమ్మకాన్ని, ఆత్మవిశ్వాసాన్నీ నింపే సలహాలు, సూచనలూ ఇవ్వవచ్చు. కానీ, అది మూగజీవి. భూమిని అలా చూస్తుంటే.. జాలితో ఆమె గుండె కరిగిపోతూ ఉంటుంది. తన గతాన్నీ, ఆ దారుణమైన హింసనీ మర్చిపోయి.. భూమి తిరిగి మామూలుగా మారితే చూడాలని ఆశగా ఎదురుచూస్తున్నదామె.

***

ఆరోజు తనకొక ఆలోచన వచ్చింది. దాన్ని కార్యరూపంలో పెట్టడానికే.. ఉదయాన్నే భూమి దగ్గరికి వచ్చింది. రోజూలానే, భూమి తన గూటిలో ఓ మూలన పడుకొని ఉంది.. నిర్వేదంగా! ఆమె రాకను గమనించి, బలహీనంగా కనురెప్పలు ఎత్తి ఓసారి ఆమె వైపు

చూసింది అంతే! ఎలాంటి ఉత్సాహమూ లేదు. ఎలాంటి ఉద్వేగమూ లేదు. అప్పుడామె తనతోపాటు తీసుకొచ్చిన వేణువును పెదవులకు ఆన్చుకుంది. ఆమె చూపు కెన్నెల్ లోపల పడుకొని ఉన్న భూమి పైనే ఉంది. ఊపిరి మాత్రం 'భూ'పాళ రాగంలో ఓ మృదుమంజుల నాదంలా మారి, వేణువులోంచి వెలువడుతున్నది. అది అక్కడి గాలితో, పూలతో మమేకమవుతూ.. ప్రకృతినే పారవశ్యంలోకి నెట్టేస్తున్నట్లుంది. ఆ మధుర సంగీతఝురి అలా కొనసాగుతుండగా.. అక్కడొక అద్భుతం జరిగింది. భూమి మెలమెల్లగా తల ఎత్తింది. ఈసారి జాలి గూడుకట్టుకుని ఉన్నా, దాని కళ్లలో ఏదో వింత కాంతి! మొట్టమొదటిసారి తలెత్తడమే కాదు.. మెల్లగా లేచింది. లేచి ముందుకు అడుగులు వేస్తున్నది. భూమిలో ఆ మార్పును చూస్తున్న ఆమె కళ్లు విప్పారాయి. కాళ్ల మధ్య ముడుచుకుపోయిన తోకను.. మొట్టమొదటిసారి కొద్దిగా పైకి లేపింది భూమి! ఆ సంగీత ధ్వని, ఆ మూగప్రాణి అంతరంగాన్ని ఎలా ప్రేరేపించిందో తెలియదుగానీ, భూమి తన తోకను మెల్లగా ఊపసాగింది. ఇన్నాళ్లుగా గూడుకట్టుకుని ఉన్న భయం, ఆందోళన, నిర్వేదం, అభద్రతాభావం.. అన్నీ మంచులా మెల్లగా కరగడం ప్రారంభించినట్లు.. భూమిలో చిన్నపాటి ఉత్సాహపు నీడ కనిపిస్తున్నది. వేణువు భూపాళంలో ఉన్నా.. భూమి గుండె ఆనందభైరవి అయ్యింది.

***

ప్రారంభం :

మహానగరానికి మూడు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక మారుమూల గ్రామం. ఉదయం పది గంటల సమయం. ఏపుగా పెరిగిన అరటి తోట.. ఎండల్లో హరితశోభతో పచ్చగా మెరుస్తున్నది. మగ కూలీలు కొందరు అరటి చెట్లకు సేంద్రియ ఎరువులు వేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఎండుటాకుల్ని కొడవలితో కోసి, పారతో చెట్టు మొదలు చుట్టూ తవ్వుతున్నాడు సీతారాముడు. అతని ఏకాగ్రతను చెదరగొడుతూ, కొంచెం దూరంలో కిలకిలమని నవ్వులు వినిపించాయి. తలెత్తి చూశాడు. పక్కనున్న గులాబీ తోటలోకి ఆడ కూలీలు వచ్చారప్పుడే! వాళ్లలో ఒకమ్మాయి మీద సీతారాముడి దృష్టి నిలిచిపోయింది. సరిగ్గా అప్పుడే ఆ అమ్మాయి దృష్టి కూడా అతని మీద పడింది. లంగావోణీ వేసుకుని తెల్లగా వెన్నెల తునకలా ఉన్నదామె. కళ్లతోనే చిరునవ్వులు పంచుకుంటున్నట్టూ.. చూపుల్లోనే పలకరింపుల ప్రసరింపులు జరిగిపోతున్నాయి. వాళ్ల కళ్ల భాష కనిపెట్టిన ఒక యువతి..

'గౌరీ!'.. అని పిలిచి, 'మీ ముచ్చట నాకు దెల్సులే!' అన్నట్టు కిసుక్కున నవ్వింది. ఆ అమ్మాయి పిలుపుతో ఉలిక్కిపడింది గౌరి. సీతారాముడి మీదినుంచి చూపు తిప్పేసుకొని..'నీ పేరేంది?' అని అడిగింది ఆ అమ్మాయిని. ఆ అమ్మాయి ఎందుకో ఒక క్షణం సందిగ్ధపడి..'బేబంటరు' అన్నది. 'బేబి?' ప్రశ్నార్థకంగా పలికింది గౌరి. 'అవును' అన్నట్టు తలూపిందా అమ్మాయి. బేబీ అన్నది ఆ అమ్మాయి అసలు పేరు కాదని అస్సలూహించలేదు గౌరి. అరటితోటలో ఉన్న సీతారాముడు తన్మయంగా గౌరినే చూస్తూ ఉన్నాడు.. 'గౌరి

సక్కదనం ముందల ఆ గులాపూల సక్కదనం నిలబడతదా?' అనుకుంటూ! ఆడ కూలీలు గులాబీపూలు తుంచే పనిలో పడ్డారు.

***

పన్నెండెకరాల్లో పాతికేళ్లుగా సేంద్రియ వ్యవసాయం చేస్తూ, ఉద్యోగం, వ్యాపారాలకంటే వ్యవసాయమే లాభదాయకం అన్న సత్యాన్ని నిరూపిస్తున్న శ్రీనివాసరావు అనే ఆదర్శరైతు పొలాలు అవన్నీ. గులాబీ, చేమంతి, బంతి తోటలు, పసుపు, అరటి, కంద, వరిలాంటి పంటలతో పాటు అన్ని రకాల కూరగాయలనూ సహజ వ్యవసాయ పద్ధతుల్లో పండిస్తుంటారక్కడ. సాగులో వినూత్న పద్ధతులను అవలంబిస్తూ.. 'అనితర సేద్యుడు' అనిపించుకున్నాడాయన. వ్యవసాయంతోపాటు పాడి, కోళ్లు, మేకలు, చేపలతోపాటు తేనెటీగల పెంపకం కూడా చేపట్టాడు. అక్కడ పనిచేసే కూలీలను కూడా సొంతబిడ్డల్లా చూసుకుంటాడు. వాళ్లు కూడా కూలి కోసం పని చేస్తున్నట్టు కాక.. సొంత ఇంటిపని చేస్తున్నట్టు, ఇష్టంగా కష్టపడతారు.

***

మధ్యాహ్నం కూలీలంతా భోజనాలకు కూర్చున్నారు.. చెట్ల కింద! సీతారాముడు, గౌరి మాత్రం.. కాస్త దూరంగా వెళ్లి ఓ కొబ్బరిచెట్టు నీడలో కూర్చున్నారు. ఆ పక్కనే దట్టంగా ఎదిగిన మల్లెపొదలు ఉన్నాయి. బాగా విచ్చుకుని ఉన్న ఓ బొండు మల్లెను కాడతో సహా తుంచి, గౌరి ముక్కు దగ్గర ఆన్చి.. 'ఈ మల్లెపూలు సూడు ఎంత వాసన గొడ్తున్నయో?' అన్నాడు రాముడు. గౌరి ఆ మల్లెల వాసన పీల్చి.. 'అవును.. చానా మంచిగ గొడ్తున్నయ్!' అన్నది.. ఆ పరిమళాన్ని ఆస్వాదిస్తూ. అప్పుడు రాముడు గౌరినొకసారి ఎగాదిగా చూసి.. 'లంగా వోణీల నువ్వెంత ముద్దుగున్నవో!' అన్నాడు మురిపెంగా. ఆ బొండు మల్లెకన్నా స్వచ్ఛమైన నవ్వొకటి గౌరి పెదవులపైన మెరిసింది. పంటలమీది నుంచి వీచే గాలి అలలు, ఆమె ముంగురుల్ని ముఖం పైకి తోస్తున్నాయి. 'నాకాకలైతంది!' అన్నది గౌరి, పొట్టమీద చేతిని ఉంచుకొని. అంతదాకా గులాబీ తోటలో పనిచేసి వచ్చిందేమో.. ఆ నాటు గులాబీ పూల పరిమళం ఆమె ఒంటి నుంచి వస్తున్నది.సీతారాముడు భోజనం డబ్బాల్ని తెరవడానికి ఉపక్రమించాడు.

***

ఆ రాత్రి.. గౌరి చెవిలో ఏదో చెప్పాడు రాముడు. 'బాగా రాతిరైంది గదా?'.. భయంగా, సంశయంగా అన్నది గౌరి. 'తొమ్మిదైతంది గంతే! ఎన్నెల మస్తు గొడ్తంది. ఎండకాలం రాత్రిల్ల ఎన్నెల బాగనిపిస్తది'.. ప్రోత్సహిస్తున్నట్టు చెప్పాడు రాముడు. ఇద్దరూ కలిసి వెన్నెల్లో నడుస్తూ వెళ్తున్నారు. వెన్నెల తళతళలు పడ్డ వరిచేలు.. పిల్లగాలికి ఊగుతున్నాయి వయ్యారంగా! ఒకచోట పంట బోదెపై ఉన్న సన్నటి వంతెన మీదుగా నడవడానికి గౌరి భయపడుతుంటే.. రాముడు చటుక్కున తన రెండు చేతులమీద ఎత్తుకొని కాలువ దాటించాడు. ప్రకృతి,

పంటచేల మధ్య వెన్నెల్లో అలా విహరిస్తుంటే.. ఇద్దరి ఆత్మలూ ఏవో తెలియని ప్రశాంతతతో తేలిపోతున్నాయి.

మంచె దగ్గర ఆగారిద్దరూ. అప్పుడు రాముడు తనతోపాటు తెచ్చిన ఒక సీసా మూత తెరిచాడు. దాంట్లోని ద్రవాన్ని నాలుకమీద వేసుకుని చప్పరించాడు. ముఖం వికారంగా పెట్టి..'సీ! గింత సప్పగున్నదేంది?' అన్నాడు. 'ఏందది?'. 'పట్టుతేనె!'. 'తేనా? తేనె సప్పగుంటదా యాడైనా?'. 'ఎన్నెట్లో నీతాన కూసోని యిస్రాంతిగా ముచ్చట్లు బెట్టుకుంటే, దాని ముందుగాల తేనె గూడ సప్పగనే అనిపిస్తది' అన్నాడు పరవశంగా. 'సాల్లే! బాగా బిస్కెట్లు తినిపించుడు నేర్సినవు'. 'సత్తెంగ జెప్పిన గౌరీ!' 'నీ మాటలు నమ్మ తియ్యిగానీ.. ఆకాసమూ, సుక్కలూ, సల్లగాలి గూడ.. ఇంత మంచిగ ఎన్నడూ అనిపియ్యలే! నాగ్గూడ' చెప్పింది గౌరి. ప్రకృతిలోని ఆ ఆహ్లాదాన్ని తనూ గుండెనిండా నింపుకొన్నట్టు. 'నేనే సాయంగా సెట్టెక్కి దెచ్చిన. జరంత నోరు తెరువే!' అంటూ ఆ పట్టుతేనె చుక్కలు కొన్ని గౌరి నోట్లో వేశాడు రాముడు.

***

గ్రామంలో ఓ రైతు కూతురి పెళ్లి ఆ రోజు. ఆ వేడుకను ఆసక్తిగా చూస్తున్నది గౌరి. గ్రామం మొత్తం తరలివచ్చేసింది పెళ్లికి. పెళ్లికూతురి ముఖం నిండా సంతోషం పొంగిపొర్లుతున్నది. ప్రపంచంలోని సంతోషం అంతా.. ఆమె కళ్లలోకే చేరిపోయినట్లుంది. పెళ్లి కార్యక్రమం ముగిశాక, చివర్లో ఓ పాట స్పీకర్‌లోంచి గట్టిగా వినపడసాగింది. 'నీ బుల్లెట్టు బండెక్కి వచ్చేత్త పా!'..

మోహన భోగరాజు పాడిన ఆ పాట మొదలవ్వగానే.. పట్టుచీర, పూలజడ, బంగారు ఆభరణాలతో ముస్తాబై ఉన్న ఆ పెళ్లికూతురు ఉద్వేగంతో దిగ్గున లేచి, నృత్యం చేయడం మొదలుపెట్టింది. పెళ్లికూతురు అలా నృత్యం చేయడం చూసి అబ్బురపడుతూ, గౌరి వైపు చూశాడు సీతారాముడు.

గౌరి కూడా రాముణ్నే చూస్తున్నది. పెళ్లికూతురు నృత్యం చక్కగా చేస్తున్నది.. పాటలోని ప్రతి పదానికి నృత్య భంగిమల్లో భావాన్ని అభివ్యక్తం చేస్తూ. పెళ్లికి వచ్చిన వారంతా హుషారుగా ఈలలు వేస్తూ, చప్పట్లు కొడుతున్నారు. కొన్ని నిమిషాల ముందు మూడుముళ్లేసి తన జీవన సహచరిగా చేసుకున్న తన అర్ధాంగి.. అంతచక్కగా నృత్యం చేయడం చూస్తూ ఆనందంతో మురిసిపోతున్నాడు పెళ్లికొడుకు. ఆ పాటలోని 'ఆడపిల్ల మనసు'ని ఆ అమ్మాయి అలా నృత్యరూపంలో కళ్లముందు ఆవిష్కరిస్తుంటే.. గౌరి మనసూ ఏదో భావోద్వేగంతో నిండిపోయింది. సరిగ్గా అప్పుడే.. అక్కడొక ఊహించని సంఘటన జరిగింది.

***

పెళ్లికూతురు నృత్యం చేస్తున్న ప్రదేశానికి దగ్గర్లో ఉన్న ఒక దుకాణానికి.. 'ఆంజనేయులు కిరాణం' అన్న బోర్డు వేలాడుతున్నది. ఉన్నట్టుండి ఆ సైన్ బోర్డ్ ఊడి, కింద కూలిపోయింది పెద్ద శబ్దం చేస్తూ. సరిగ్గా ఆ క్షణంలో అక్కడే నిలబడి పెళ్లివేడుక చూస్తున్న ఓ పదేళ్ల కుర్రాడి

మీద పడిందది. ఆ దెబ్బకు ఆ అబ్బాయి.. 'అమ్మా!' అని అరిచి కుప్పకూలి పోయాడు.

'అయ్యో.. నా బిడ్డ!' అని అరుస్తూ కొడుకు దగ్గరికి పరిగెత్తింది అతని తల్లి. స్పీకర్‌లోంచి వస్తున్న పాట ఆగిపోయింది. అంతదాకా ఆనందాలతో వెల్లివిరిసిన ఆ వాతావరణం.. ఒక్కసారిగా గంభీరంగా మారిపోయింది. అందరూ కిందపడిపోయిన ఆ అబ్బాయి చుట్టూ గుమిగూడారు. నేల ఎర్రబారుతున్నది.. ఆ పిల్లాడి రక్తంతో! 'నూటెన్మిది పోను గలుపుండ్రి ఎవ్వలైనా!' అరిచారెవరో. అక్కడున్న జనంలో ఒక డాక్టరు ఉన్నాడు. ఆయన ముందుకొచ్చి.. 'నేను డాక్టర్ని.. శుభ్రమైన గుడ్డొకటుంటే ఇవ్వండి!' అంటూ, ఆ పిల్లవాడి దగ్గర కూర్చొని పరిశీలనగా చూశాడు. మెడ దగ్గర రక్తం ధారగా కారిపోతున్నది. ఎవరో వచ్చి తుండుగుడ్డ అందించారు డాక్టర్‌కు. దాన్ని ఆ పిల్లవాడి మెడమీది గాయంపైన వేసి, గట్టిగా అదిమి పట్టుకున్నాడు డాక్టర్.

సరిగ్గా అప్పుడే.. గౌరి ముందుడుగు వేసింది. 'ఓసారూ! నువు గట్ల నొక్కినవంటే.. పిల్లగాడు సచ్చిపోతడు. రకతం ఆపనీకి గట్ల నొక్కద్దయ్యా! పోరనికి ఊపిరిగిట్ల ఆడనియ్యవా ఏం?' అన్నది కంగారు పడుతూ. ఆ డాక్టర్ భృకుటి ముడిచి.. 'నువ్వేంటి నాకు చెప్పేది?' అన్నట్లు ఈసడింపుగా ఓసారి ఆమెను చూశాడు. 'నేను డాక్టర్ని. ఎంబీబీఎస్ చదివాను. 'జగులర్ వెయిన్' తెగిపోయింది. బ్లీడింగ్ ఆపుతున్నాను' అన్నాడు. 'వయసోళ్లకైతే గట్ల సెయ్యచ్చు గానీ.. ఈడు సిన్న పిల్లగాడాయే! జరంత 'పైన' నొక్కుండ్రి' చెప్పింది గౌరి. 'నేను అనాటమీ చదివాను. నాకు తెలుసు ఎక్కడ నొక్కిపెట్టాలో..' అహం దెబ్బతిన్నట్లు అసహనంగా చెప్పాడు ఆ డాక్టర్. 'డాక్టర్! యూ అర్ కిల్లింగ్ దట్ బోయ్..' గౌరి గొంతులోంచి ఆ మాట ఒక తూటాలా బయటికి వచ్చింది. అంతే! ఆ డాక్టర్‌దే కాదు.. అక్కడున్న అందరి ఊపిరీ ఒక్కసారి ఆగిపోయింది! పెళ్లికూతురు ఆశ్చర్యంతో రెప్పవాల్చడం మరిచిపోయింది. అప్పుడు సీతారాముడు కూడా డాక్టర్‌కు దగ్గరగా వెళ్లి, మెల్లగా చెప్పాడు..

'డాక్టర్! మీరు 'ట్రెకియా' మీద ప్రెషర్ పెడుతున్నారు. అక్కడ నొక్కిపెట్టేస్తే ఆ పిల్లాడి శ్వాస ఆగిపోతుంది'. సీతారాముడు అలా అన్న మరుక్షణం.. నిజంగానే ఆ పిల్లాడి శ్వాస ఆగిపోయింది. అప్పుడు కనిపించింది డాక్టర్ కళ్లలో విభ్రాంతి. గౌరి చటుక్కున వంగి డాక్టర్ చేతిని గాయానికి కాస్త పైకి జరిపింది. 'ట్రెకియా' మీద ఒత్తిడి తొలగగానే, ఆ అబ్బాయిలో శ్వాస తిరిగి ప్రారంభమైంది. కళ్ల ముందు ఏదో అద్భుతం జరుగుతున్నట్లు అందరూ నిశ్చేష్టులయ్యారు. నమ్మశక్యం కానట్లు విభ్రాంతితో చూస్తున్నాడా డాక్టర్. ఆ పిల్లాడి తల్లికి నోట మాట రావడం లేదు. ఊపిరి బిగపట్టి.. గౌరినీ, సీతారాముణ్నీ అలానే చూస్తున్నది.

'సమ్‌థింగ్ రాంగ్ విత్ ద లంగ్స్! హిజ్ ఛెస్ట్ ఈజ్ మూవింగ్ స్ట్రేంజ్‌లీ!'.. ఆ పిల్లవాడి పరిస్థితిని నిశితంగా గమనిస్తూ చెప్పింది గౌరి.. రాముడితో. రాముడు గబగబా పిల్లవాడి చొక్కా విప్పాడు. అప్పుడు కనిపించింది.. వాడి పొట్టలో గుచ్చుకుపోయిన ఒక ఇనుప రేకు.

'ఓ గాడ్!' అంటూనే.. 'నైఫ్ కావాలి.. కాస్త పొడుగాటిది!' అని చెప్పాడు రాముడు. బిడ్డ

పొట్టలో దిగబడ్డ రేకును చూసి, వాడితల్లి గట్టిగా ఏడ్చేస్తున్నది. ఎవరో కత్తి తెచ్చి ఇచ్చారు. 'రెండు రిబ్స్ కింది నుంచి ఇన్‌సిజన్ చెయ్యాలి గౌరీ!' చెప్పాడు రాముడు.

వెంటనే గౌరి ఆ కుర్రాడి పక్కటెముకల కిందినుంచి గాటుపెట్టి కోసేస్తుంటే.. ఆ అబ్బాయి తల్లి 'నేను చూడలేను' అన్నట్టుగా తల తిప్పేసుకుంది. పది నిమిషాల్లోనే ఆ 'మేక్ - షిఫ్ట్' శస్త్రచికిత్స ముగిసింది. ఆ పిల్లవాడి ఊపిరితిత్తులు ఇప్పుడు తిరిగి సక్రమంగా పని చేస్తున్నాయి. మెల్లగా కళ్లు విప్పాడు. అది చూసి, వాడి తల్లి భావోద్వేగంతో కదిలిపోయింది. చటుక్కున గౌరి కాళ్లను చుట్టేసుకుంది. ఆనంద బాష్పాలతో గౌరి పాదాలను అభిషేకిస్తున్నది. అదంతా దగ్గరగా చూస్తున్న ఓ ఆడపిల్ల.. గౌరి వంక ఆశగా చూస్తున్నది. ముళ్ల కంచెలో చిక్కుకుపోయి శిథిలమైపోయిన తన జీవితమూ, కొత్తచిగురు వేస్తుందనే ఓ చిరు ఆశ.. ఆ ఆడపిల్ల కళ్లలో క్షణకాలం మెరిసింది. ముందురోజు గులాబీతోటలో, గౌరితో తన అసలు పేరు చెప్పకుండా 'బేబి' అని అబద్ధం చెప్పిన ఆ ఆడపిల్ల కంటి కొసల్లో చెమ్మ ఊరిపోతున్నది.

***

హైదరాబాద్

గ్లోబ్ హాస్పిటల్స్ ప్రైవేట్ లిమిటెడ్. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే అతిపెద్ద సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి. ముఖ్యంగా శస్త్రచికిత్సల్లో అత్యున్నత ప్రమాణాలు కలదిగా పేరుగాంచిన ప్రతిష్ఠాత్మకమైన ఆసుపత్రి. దాని అధినేత (చైర్మన్).. తన ఛాంబర్‌లో తనకు ఎదురుగా ఉన్న ఇద్దరు వ్యక్తులను ఉద్దేశించి.. 'సో! యూ ఆర్ రిపోర్టింగ్ బ్యాక్..?' అని అడిగారు.

ఎదురుగా ఉన్నవారు.. శస్త్రచికిత్స విభాగంలో అతిముఖ్యమైన సర్జన్లు. అపారమైన వైద్యశాస్త్ర పరిజ్ఞానం, అపురూపమైన మేధస్సూ, అనితరసాధ్యమైన శస్త్రచికిత్సా నైపుణ్యం.. ఆ ఇద్దరి సొంతం.

***

వారిలో ఒకరు డాక్టర్ రామ్, మరొకరు డాక్టర్ ప్రియ! ఇద్దరూ కలిసి చదువుకున్నారు. కాలేజీలో చిగురించిన ప్రేమ, మూడేళ్ల క్రితమే పెళ్లిగా మారింది. పెళ్లి కోసం కూడా వాళ్లు నాలుగంటే నాలుగు రోజులే సెలవు తీసుకున్నారు. అవి తప్ప మళ్లీ ఎప్పుడూ ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదా దంపతులు. డాక్టర్ (సీతా) రామ్, డాక్టర్ (గౌరీ) ప్రియ! వైద్యవృత్తి పట్లా, ప్రాణాల్ని కాపాడే పనిపట్లా ఆ దంపతులకున్న అంకితభావం అలాంటిది. చిరుప్రాయంలోనే అత్యంత ప్రతిభావంతులైన సర్జన్లుగా పేరుతెచ్చుకున్న ఆ ఇద్దరంటే.. చైర్మన్ గారికి ప్రత్యేక అభిమానం. నెలరోజుల క్రితం.. పాన్‌క్రియాస్ క్యాన్సర్‌కు సంబంధించిన ఒక అత్యంత అరుదైన, అత్యంత కఠినతరమైన శస్త్రచికిత్సను 23 గంటలపాటు నిర్విరామంగా నిర్వహించి విజయవంతం అయ్యారు డాక్టర్ రామ్, డాక్టర్ ప్రియ. దాంతో ఆ ఆసుపత్రి కీర్తి ప్రతిష్ఠలు పతాకస్థాయికి చేరిపోయాయి. అన్ని పత్రికల్లోనూ ఆ అరుదైన శస్త్రచికిత్స గురించి రాశారు. ఆ సందర్భంగా చైర్మన్ వాళ్లిద్దర్నీ పిలిచి..

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 416

'మీ పెళ్లయ్యాక హనీమూన్‌కి కూడా ఎక్కడికీ వెళ్లలేదని నాకు తెలుసు. యూ బోత్ నీడ్ ఎ బ్రేక్! అండ్ యూ డిజర్వ్ ఇట్. ఓ పది పదిహేను రోజులు సరదాగా ఎక్కడైనా తిరిగిరండి. ఎనీ ఎగ్జోటిక్ ప్లేస్ ఆఫ్ యువర్ చాయిస్.. ఇండియా అయినా, విదేశాల్లో అయినా మీ ఇష్టం! ఖర్చులన్నీ హాస్పిటల్ చూసుకుంటుంది. మీ చైర్మన్ నుంచి మీకు ఓ చిరుకానుక!' అని చెప్పారు.

వాళ్లు ఏ యూరప్‌కో, మాల్దీవులకో, స్విట్జర్లాండ్‌కో వెళ్లలేదు. రామ్ తండ్రిగారైన శ్రీనివాసరావు గారి గ్రామానికి.. సీతారాముడు, గౌరిగా వెళ్లారు. అక్కడి ఆ పల్లె వాతావరణంతో మమేకమయ్యారు. ఆ పచ్చటి పొలాల మధ్య స్వచ్ఛమైన గాలి పీలుస్తూ, అక్కడి మట్టి పరిమళాన్ని తమ గుండెల నిండా నింపుకొన్నారు. పల్లెజనంతో కలగలసిపోయి వనాల్ని, వెన్నెల్ని.. ప్రకృతిలోని ప్రతి సౌందర్యాన్నీ అనుభూతి చెందారు. తమలో ఓ కొత్త ఉత్సాహాన్ని నింపుకొన్నారు.

***

హాస్పిటల్‌లో రిపోర్ట్ చేసి, చైర్మన్‌గారి గది నుంచి బయటికి రాగానే.. 'రామ్.. నీతో ఓ కేస్ గురించి మాట్లాడాలి' అన్నది ప్రియ గంభీరంగా! ఇద్దరూ హాస్పిటల్‌లో తమ ఛాంబర్‌కు వెళ్లిపోయారు. 'మొన్న మనం గ్రామంలో ఆ పిల్లవాడి ప్రాణం కాపాడటం చూసి, ఓ అమ్మాయి నా దగ్గరికి వచ్చింది. ఆమె పేరు బేబీ! గులాబీ తోటలో పూలు తుంచే పనిక్కూడా వచ్చింది. ఆ పల్లెలో.. సంతోషంగా జీవిస్తున్నదని అనుకున్నాను. కానీ, ఆ అమ్మాయి వెనుక ఓ గతం ఉంది..' 'కేస్ గురించి మాట్లాడాలి అంటే.. ఏదైనా మెడికల్ ఇష్యూనేమో అనుకున్నా! గతం అంటున్నావ్ ఏం జరిగింది?' అడిగాడు రామ్.

'బేబీది అసలు ఆ ఊరు కాదు. కాస్త దూరంలోని మరో కుగ్రామం. అక్కడ కొన్ని సామాజిక వర్గాల మధ్య ఘర్షణలు. ఆ కక్షలకు.. కులం ప్రధాన కారణమవడం బేబీ పాలిట శాపమయ్యింది. తక్కువ కులంలో జన్మించడమే ఆమె తప్పయిపోయింది. ఎనిమిదేళ్ల వయసులో ఒక రోజు బహిర్భూమికి వెళ్లి వస్తున్నప్పుడు.. ఇద్దరు యువకులు బేబీని అపహరించుకు పోయారు. నాలుగు గంటల పైశాచికానందం తర్వాత ఆ పిల్ల శరీరాన్ని రోడ్డుమీద పడేసి పోయారు. బడుగు బలహీన వర్గాల పైన ఉండే చిన్నచూపు, ఏం చేసినా తిరగబడలేరన్న అహంకారం.. ఆ మృగాలలోని 'పర్వర్షన్'కు ఆజ్యం పోశాయి. రక్తం మడుగులో నిశ్చలంగా పడి ఉన్న ఆ ఎనిమిదేళ్ల నగ్న శరీరాన్ని చూసి బతికి ఉండే అవకాశం ఏ మాత్రం లేదనే అనుకున్నారట. ఎలాగోలా ఆసుపత్రికి తీసుకువెళ్తే.. అక్కడ పాపను పరీక్షించిన వైద్యుడు ఒకలాంటి షాక్‌తో విచలితుడైపోయాడట. అది కేవలం అత్యాచారం కాదు. దారుణమైన హింస. క్రూరత్వం. పెద్దజాతి, చిన్నజాతిని అణచివేసే హేయమైన రాక్షసక్రీడ. షీ వజ్ బ్రూటలైజ్డ్.. బియాండ్ వర్డ్స్ రామ్!'.

ప్రియ గొంతు గద్గదమైపోతుండటం రామ్ గుర్తించాడు. లోపలి నుంచి దుఃఖం పొంగుకు

వస్తున్నది. కొన్ని క్షణాలు ఏమీ మాట్లాడలేక పోయింది. భార్య అరచేతిని తాకి, అనునయ పరుస్తున్నట్టుగా గట్టిగా పట్టుకున్నాడు రామ్. ఆమె కంటి నుంచి ఆమెకు తెలియకుండానే అశ్రుకణాలు రాలిపడుతున్నాయి. ప్రియ తిరిగి మాట్లాడసాగింది..

'నిర్భయ, దిశలే కాదు.. ఇంకా ఎందరో 'బేబీ'లు కూడా ఉన్నారు మన చుట్టూ. అంతకన్నా దారుణమైన హింసకు గురిచేశారు ఆ పసిదాన్ని. కాళ్ల మధ్య ధారాపాతంగా కారిపోతున్న నెత్తురు. లోపల గుచ్చుకు పోయిన పదునైన గాజుపెంకుల్ని తొలగించడానికే ఆ డాక్టర్‌కు చాలా సమయం పట్టిందట!'. గగుర్పాటుతో వింటున్న రామ్‌లోనూ బాధ సుడులు తిరుగుతున్నది. ఇద్దరూ ఒకరి చేతిని ఒకరు గట్టిగా పట్టుకొని ఉన్నారు.

'రామ్! షీ నీడ్స్ ఎ రీకన్‌స్ట్రక్షన్ సర్జరీ! ఆనాటి రాక్షసోన్మాదం ఆమె శరీరభాగాన్ని ఛిద్రం చేసింది. కంప్లీట్ జెనిటల్ మ్యుటిలేషన్! బేబీని తిరిగి మామూలు 'ఆడపిల్ల'గా మార్చాలి మనం. ఆ గ్రామంలోని దివాకరం అనే అబ్బాయి తనను ప్రేమిస్తున్నాడట. పెళ్లి చేసుకోమని ప్రాధేయ పడుతున్నాడట. దాంపత్య జీవితంలోని మాధుర్యాన్ని కూడా ఆమె శరీరం గ్రహించలేనంతగా ఛిద్రమైన తను.. తనను తాను అతనికెలా అర్పించుకోగలదు?'.

డాక్టర్ రామ్‌కి అర్థమయింది. 'అనుభూతి'కి కేంద్రబిందువైన 'అతి సున్నితమైన ఒక భాగం' కూడా గాజుపెంకుల పదునుకు బలైపోయిందనీ! అందువల్లే ఆ అమ్మాయి ఒక 'ఐస్ ముక్క'లా మారిపోయిందని! ఆమెకు ఎలాంటి స్పందనలూ, ఎలాంటి భావాలూ ఉండవు. ప్రేమ అనే అనుభూతీ తెలియదు. అన్నీ కోల్పోయినట్టే అనిపిస్తుంటుంది. ఏదో తెలియని 'శూన్యం'! అంతా 'ఖాళీ' అయిపోయిన భావన. కానీ, ఆనందంగా ఉండటం, ఆనందం కోసం ప్రయత్నించడం.. మనిషికున్న విశ్వజనీనమైన హక్కు. ఆ హక్కును ఆమెకు ప్రసాదించాలి.

'బేబీని పెళ్లి చేసుకోవాలని ఆశపడుతున్న ఆ అబ్బాయికి జరిగిందంతా తెలుసా?' అడిగాడు రామ్. 'తెలీదు. తను చెప్పలేదట'. 'సర్జరీకి ఆమె తల్లిదండ్రుల సమ్మతి అవసరం అవుతుంది కదా?''తను అనాథ రామ్! ఆ అత్యాచారం విషయం బయటికి పొక్కగానే.. తల్లిదండ్రులిద్దరూ పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారట. ఎవరో దూరపు బంధువు ఒకరి దగ్గర కొన్నాళ్లు పెరిగిందట. ఆ తర్వాత ఆ ఊరు వదిలేసి వచ్చేసిందట!'. 'ఎప్పుడు ప్లాన్ చేద్దాం.. ఆపరేషన్?'.'రేపే!' చెప్పింది డాక్టర్ ప్రియ..

***

మర్నాడు ఉదయం ఏడు గంటలకే బేబిని సర్జరీకి సిద్ధం చేశారు. సర్జికల్ గౌన్లూ, ముఖానికి మాస్కులూ వేసుకొని ఆపరేషన్ థియేటర్లో ఉన్నారు ప్రియ, రామ్. వచ్చేముందు దేవుడి ముందు మోకరిల్లి ప్రార్థించి వచ్చింది ప్రియ. ఆమె అంతకు ముందెన్నడూ ఇలాంటి శస్త్రచికిత్స చేయలేదు. ఇది శరీరాన్ని కోసి, కుట్లు వేసేయడం లాంటిది కాదు. ఒక మోడును 'చిగురింప' చేసే ప్రయత్నమది. మూగబోయిన వీణకు ఊపిరులూదే ప్రక్రియ. నిస్తేజమైపోయిన పుడమి

తల్లికి పులకింతలు రేపే యజ్ఞమది.. జననేంద్రియ పునర్నిర్మాణపు శస్త్రచికిత్స.

అత్యంత ఏకాగ్రతతో ప్రియ ఆ సర్జరీని నిర్వహిస్తున్నది. రామ్.. భార్య పక్కనే ఉండి తన సహకారాన్ని అందిస్తున్నాడు. 'శీర్ష భాగం'లోని నెర్వ్ – ఎండ్స్‌ను సరిగ్గా కలపకపోతే శ్రమంతా వృథా అయిపోతుందని తెలుసు.. ఆ ఇద్దరు వైద్యులకూ! అందుకే ఎక్కడా ఎలాంటి పొరబాటూ జరగకూడదని ఎంతో అప్రమత్తంగా ఉన్నారు. క్షణాలు నిమిషాలు అవుతున్నాయి. నిమిషాలు గంటలు అవుతున్నాయి.

నాలుగు గంటల ఇరవై నిమిషాల తర్వాత సర్జరీ ముగిసింది. బేబిని ప్రత్యేక గదికి తరలించారు. కొద్దిసేపటికి ఆమెకు స్పృహ వచ్చింది. కళ్లు తెరిచి చూసేసరికి ఎదురుగా.. 'గౌరమ్మా, సీతారాముడు' కనిపించారు.

'హాయ్ బేబీ!' గౌరీప్రియ పలకరించింది. 'కంగ్రాచ్యులేషన్స్! సర్జరీ చాలా చక్కగా జరిగిందమ్మా! నువ్విప్పుడు అందరు ఆడపిల్లల్లా మాములుగా అయిపోయావ్. నువ్వు ఆనందంగా జీవితాన్ని గడపగలవు. నిన్ను ఇష్టపడుతున్న ఆ అబ్బాయిని హాయిగా, ఏ సంకోచమూ లేకుండా వివాహం చేసుకోవచ్చు'.. గౌరి మాటలు వింటుంటే, ఆ అమ్మాయి కళ్లలోంచి జలజలా కన్నీళ్లు రాలిపోతున్నాయెందుకో! పొంగిపోతున్న కృతజ్ఞతాభావంతో ఆమె గుండె నిండిపోతున్నది. మాటకూడా రానంత సంతోషపు ఉక్కిరి బిక్కిరి.

'బేబీ.. నీ అందమైన కుడి బుగ్గలోంచి చిన్ని 'గ్రాఫ్ట్' తీసుకొని జననేంద్రియ శీర్షాన్ని కూడా పర్‌ఫెక్ట్‌గా పునర్నిర్మించాం. పూర్తిగా విజయవంతమైన ఆపరేషన్ ఇది. ఐయామ్ సో హ్యాపీ ఫర్ యూ..' డాక్టర్ ప్రియ సంతోషంగా, తెలియని ఉద్వేగంతో చెప్పింది.

బేబి కళ్లు ఇంకా వర్షిస్తూనే ఉన్నాయి. ఇన్నాళ్లుగా గుండెలో పేరుకుపోయిన మంచుగడ్డ ఒకటి కరిగిపోయి, శరీరమంతా గాల్లో తేలిపోతున్న భావన. అప్రయత్నంగా ఆ అమ్మాయి చేతి చూపుడువేలు తన కుడిబుగ్గను మెల్లగా తాకింది.. సర్జరీ కోసం 'కణజాలాన్ని' తీసిన చోట!

***

శస్త్ర చికిత్స జరిగిన నెల రోజులకే పెళ్లి కూతురు అయిపోయింది బేబి. ఏర్పాట్లన్నీ శ్రీనివాసరావు గారు చూసుకున్నారు. కొబ్బరాకులతో వేసిన పచ్చటి పందిట్లో పీటలమీద బేబి పక్కన కూర్చుని ఉన్నాడు దివాకరం. పంతులు గారు వేదమంత్రాలు చదువుతున్నారు. మోగుతున్న సన్నాయి నేరుగా బేబి గుండెల్లోకి పాకుతున్నది తీయగా.. అయితే, ఆమె మనసంతా డాక్టర్ గారి మీదే ఉంది!

సరిగ్గా అప్పుడే కాస్త దూరంలో కారు ఆగిన చప్పుడైంది. మరునిమిషం బేబి కళ్లెదురుగా గౌరీ, సీతారాముడు ప్రత్యక్షమయ్యారు. ఆ దంపతుల్ని చూడటంతోనే బేబీ హృదయం ఆనందంతో ఎగిసిపడింది. గౌరి.. బేబిని చూసి చిరునవ్వు నవ్వింది. దగ్గరగా రమ్మన్నట్టు చేతితో సంజ్ఞ చేసింది బేబి. ప్రియ దగ్గరికి రాగానే.. ఆమె పాదాల్ని పట్టుకొని కళ్లకు అద్దుకుంది.

వేదమంత్రాల సాక్షిగా దివాకరం.. బేబి మెడలో తాళిబొట్టు కట్టాడు. మైకులోంచి అప్పుడొక పాట ప్రారంభమైంది. 'నీ బుల్లెట్టు బండెక్కి వచ్చేత్త పా.. డుగ్గు డుగ్గు డుగ్గు డుగ్గు డుగ్గనీ! అందాల లోకాన్ని సూపిత్త పా.. చిక్కుబుక్కు చిక్కు చిక్కుబుక్కనీ!'.. 'లే! డాన్స్ చెయ్..' చెప్పింది గౌరి. సిగ్గుపడుతూనే లేచి నృత్యం చేయడం ప్రారంభించింది బేబి. పాట పూర్తవగానే దివాకరం గబగబా ప్రియ, రామ్ దగ్గరగా వచ్చి.. చటుక్కున వారి పాదాలమీద వాలిపోయాడు.

'నో ప్లీజ్! లే దివాకరం..' అంటూ, పైకి లేవమన్నట్టు అతని భుజాల్ని పట్టుకుంది గౌరి.

అతని కళ్లలో అవ్యక్తమైన ఒక భావోద్వేగం. సన్నటి నీటి చెమ్మ. రెండు చేతులూ జోడించి హృదయపూర్వకంగా నమస్కరించాడు. అప్పుడు వచ్చింది ప్రియకు ఆ సందేహం. ఆమె కళ్లు బేబీవైపు చూశాయి.. 'చెప్పేశావా?' అన్నట్టు. 'అవ్.. ఏం దాపెట్లా! అంతా సెప్పేసినా' అన్నభావాన్ని కళ్లతోనే వ్యక్తం చేసింది బేబి. దివాకరం 'పెద్దమనసు'కు ప్రియ కళ్లు చెమర్చాయి.

'ఏయ్ బేబీ! అందాల దునియా సూపిత్త పా.. అన్నావ్‌గా! చూపించు మీ ఆయనకు..' అంటూ బేబిని దివాకరం మీదికి తోసింది ప్రియ. దాంతో దివాకరం, బేబి ఇద్దరూ నవ్వారు.అప్పుడు బేబి.. 'గౌరమ్మా! నీకాడ నేనొకటి దాపెట్నా! నాపేరు బేబి కాదు..' అన్నది. 'మరి?'. 'లచ్మి.. భూలచ్మి!'.'భూలక్ష్మి?'. 'అవును' అన్నట్టు తలూపింది భూలక్ష్మి. అప్పుడు గౌరి ఏదో స్ఫురించినట్టు.. వెనక్కి తిరిగి తమ కారు ఆపి ఉంచిన చోటుకేసి చూసి..

'భూమీ! కమాన్!' అన్నది గట్టిగా. గౌరి చెప్పిన మాటకు కట్టుబడి కారు దగ్గరే ఆగిపోయి, ఎదురుచూస్తున్న భూమి.. గౌరి గొంతు వినగానే చెంగు చెంగున దూకుతూ.. వేగంగా, ఉత్సాహంగా ఆమె దగ్గరికి రివ్వున దూసుకొచ్చింది. ఆనాటి నిర్లిప్తత, నిస్తేజం మచ్చుకైనా లేవిప్పుడు భూమిలో! ఆపకుండా ఊపేస్తున్నది తోకను. గౌరి చుట్టూ గిరగిరా తిరిగేస్తున్నది. గౌరి వైపు ఆరాధనగా చూస్తూ, ఆమె మీదికి ఆపేక్షగా ఎగురుతున్నది.. గౌరి ముఖాన్ని ముద్దాడుతున్నట్టు! మందులతో మానని మానసిక గాయం.. సంగీత చికిత్సకు లొంగింది!

'ఇది మా భూమి!' చెప్పింది గౌరి.

***

ఉపసంహారం

'ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ ప్రియా!'.. ఆ రోజు మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో చెప్పాడు రామ్.. భార్యతో! 'దేనికి?'.'ఆ అమ్మాయికి నిజంగా కొత్త జీవితాన్ని ఇచ్చావ్'. 'నేను కేవలం మెడికల్‌గా ఓ చికిత్స చేశానంతే! కానీ, గతం తెలిసి కూడా ఆమెను భార్యగా ఇంటికి తెచ్చుకున్న దివాకరమే.. నా దృష్టిలో ఆమెకు కొత్త జీవితాన్ని ఇచ్చినట్టు!'.

రెండుక్షణాలు అగి.. 'కానీ రామ్! మనకు తెలియకుండా ఇంకెందరో ఆడపిల్లలు అలాంటి అకృత్యాల బారిన పడుతూనే ఉంటారు కదా! ఆఖరికి నోరులేని జీవాల్నీ విడిచిపెట్టడం లేదీ కీచకమూకలు. ఈ దురాగతాల్ని మనం ఆపలేక పోవచ్చు. కానీ, ఈ 'భూమి'ల కోసం.. ఈ

'భూలక్ష్మి'ల కోసం ఏదైనా చేయాలని అనిపిస్తున్నది'.

భార్య స్వరంలోని ఆవేదన అతనికి తెలుస్తున్నది. 'ఒక ఆశ్రమాన్ని ఏర్పాటు చేద్దాం రామ్! అకృత్యాల బారినపడి, హింసకు గురైన బాధితులకు మనవల్ల చేతనైన సాయం చేద్దాం! సాంత్వన ఇద్దాం.. రామ్!' ఆమె ఉద్వేగపూరితంగా చెప్పింది. క్షణంసేపు కూడా ఆలోచించలేదు అతను. బొటనవేలు చూపిస్తూ.. 'ఐ సెడ్?. ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ!' అన్నాడు. 'ఆశ్రమానికి ఏపేరు పెడదాం?' అడిగాడు.

'ఆకాశ్ అని పెడదాం. ఎన్ని చట్టాలు వచ్చినా, ఎన్ని శిక్షలు పడినా, హేయమైన అఘాయిత్యాలు జరిగిపోతూనే ఉంటాయి. వాటికి 'భూ(లచ్చి)మి'లు బలి అవుతూనే ఉంటారు. అందుకే, 'భూమి' చుట్టూ ఉండే 'ఆకాశం'లా మన ఆశ్రమం వారికి నీడనిస్తుంది'.

ఆ వివరణ అతనికి ఎంతగా నచ్చిందంటే.. చప్పున దగ్గరికి వెళ్ళి భార్య నుదుటన ముద్దు పెట్టుకున్నాడు ఆర్ద్రంగా!

అప్పుడామె భర్త చేతిని గట్టిగా పట్టుకుంది. కళ్లలోకి చూస్తూ.. అదోలా అందంగా నవ్వింది. ఆమె చూపులో సిగ్గు కూడా తొంగి చూస్తుంటే.. 'ఏంటి?' అన్నాడు రామ్ అర్థంకాక.

'.. అంతేకాదు! త్వరలోనే మిమ్మల్ని తండ్రిని చేసే మన బాబుకు పెట్టబోయే పేరు కూడా అదే.. ఆకాశ్!' అన్నది ప్రియ. మామూలు ఆడపిల్లలా సిగ్గుపడిపోతూ.. అతని గుండెల్లో దాచేసుకుని!

ఆ క్షణం.. గౌరి, సీతారాముడి హృదయాలలోని ఆనందం కూడా ఆకాశమే అయ్యింది. వారి ఆశయంలా!

***

**గుమ్మడి రవీంద్రనాథ్**

**గుమ్మడి రవీంద్రనాథ్ స్వస్థలం గుడివాడ. ప్రభుత్వరంగ బీమా సంస్థ – యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలో డిప్యూటి జనరల్ మేనేజర్గా, హైదరాబాద్ రీజినల్ చీఫ్గా పనిచేసి , జనవరి 31, 2022 న పదవీ విరమణ పొందారు. ఈయన తొలి కథ "కొస విరుపు". తొలి నవల (ధారావాహిక)– గన్‌మెన్. ఈ రెండూ కూడా ఆంధ్రజ్యోతి వారపత్రికలో ప్రచురితమయ్యాయి. 160 కి పైగా కథలు దాదాపు అన్ని ప్రముఖ పత్రికలలో ప్రచురితమయ్యాయి. అలాగే మరో తొమ్మిది నవలలు స్వాతి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, నవ్య, ప్రియదత్త పత్రికలలో ధారావాహికలుగా వెలువడ్డాయి. ఈయన రాసిన కథలకు గాను అనేక బహుమతులు పొందారు. అలాగే ఐదు ధారావాహికలు నవలల రూపంలో పుస్తకాలుగా వచ్చాయి. అవి: గన్‌మేన్, నా నువ్వు– నీ నేను, హైటెక్ ప్రియుడు, మ్యూజిక్ (ఆఫ్ లవ్), సుమధురం. అలాగే నమస్తే నిర్వహించిన కథల పోటీలో ఈయన రాసిన "ఆకాశం" కథ విశిష్ట బహుమతిని సొంతం చేసుకుంది.**

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 421

# మట్టిబంధం



**ఎగుమామిడి అయోధ్యారెడ్డి**
**9399962117**

'మన సీతంబాయి పొలం అమ్మేద్దాం బాపూ!'..

పెద్దకొడుకు బయటినుంచి వస్తూనే అన్నాడు.. అందరికీ వినిపించేటట్టు! హైదరాబాద్‌లో ఉంటాడు. హైటెక్‌సిటీలో ఉద్యోగం. ఆరోజే ఊర్లో దిగాడు. పొద్దుననగా బయటికి పోయి, చీకటిపడిన తర్వాత తిరిగొచ్చాడు. గడపదాటి ఇంట్లో అడుగు పెడుతూనే ఇంతపెద్ద నిర్ణయం ప్రకటించాడు.

అరవై ఐదేళ్ల వయసు, మూడెకరాల పొలమూ ఉన్న సన్నకారు రైతు నారాయణ. భూమిని నమ్ముకున్న కష్టజీవి. ఊర్లో పెద్దమనిషి, మర్యాదస్తుడన్న పేరుంది. పొలం అమ్ముదామని పెద్దకొడుకు యాదగిరి అన్నప్పుడు.. ఇంట్లో జనాభా అంతా అక్కడే ఉన్నారు. నారాయణ భార్య శ్యామలమ్మ అప్పుడే వంట ముగించి, మల్లెసాలలో మొగురానికి ఆనుకొని కూర్చున్నది. ఊర్లో దోస్తులతో తిరుగుళ్లు ముగించి, అంతక్రితమే ఇల్లుచేరిన చిన్నకొడుకు తీరుబడిగా కూర్చొని టీవీ చూస్తున్నాడు.

బర్రె పాలు పిండేందుకు సర్వ పట్టుకొని వాకిట్లో

కొచ్చిన నారాయణ.. దూడను దాని మెడకున్న తలుగుతోనే విడిచిపెట్టి, సొప్పకట్ట ఒకటి తీసి బర్రె ముందు వేశాడు. అతనికి చూపు సరిగా ఆనదు. ఒక కంటి శుక్లానికి అప్పుడెప్పుడో కంటివెలుగు స్కీములో ఆపరేషన్ చేయించుకున్నాడు. తర్వాత రెండేళ్లకే ఇంకో కన్నుకు శుక్లం నిండుకున్నది. ఎవరూ పట్టించుకోలేదు. అత్యవసరం కాకపోవడంతో అతనూ పట్టించుకోలేదు. ఒక కంటితో పని నడుస్తున్నదని రెండోదానిపై శీతకన్నువేసి, వైద్యం వాయిదా వేశాడు.

కొద్దిసేపటి తర్వాత బర్రె పొదుగులో చేయిపెట్టి చూసి, దూడను మళ్లా గుంజకు కట్టేసి పాలు పిండటం మొదలుపెట్టాడు.

'బాపూ! నామాట ఇనవడ్డదానే? మన బాయిపొలం అమ్ముదామంటున్న'.. యాదగిరి ఈసారి ఇంకొంచెం గట్టిగా అన్నాడు.

నారాయణ విన్నాడు. కానీ, మాట్లాడలేదు. రెండు మోకాళ్ల నడుమ బిగించి పెట్టిన సర్వలో ధారలుగా పడుతున్న పాల చప్పుడు వినిపిస్తున్నది. రోజురోజుకూ బర్రె ఎండిపోతున్నది. పాలు తగ్గిపోతున్నయి. బర్రెకు పచ్చిమేత వేసి ఎన్నిరోజులైందో? పొలం కాడ కూడా మేసెటందుకు ఏమీలేదు. ఎండు వరిగడ్డి, జొన్నసొప్పలేస్తే పాలిచ్చే బర్రె ఎండిపోక ఏంజేస్తది?

నారాయణ పాలు పిండుకొచ్చి భార్య చేతికిచ్చాడు. కొయ్యకు వేలాడేసిన అంగీ జేబుల నుంచి బీడీకట్ట తీసి, ఒక బీడి వెలిగించాడు. మెల్లగా వచ్చి పెద్ద దర్వాజ పక్కనున్న చెక్క కుర్చీలో కూర్చున్నాడు. నిజానికి సీతంబాయిని అమ్ముదామన్న కొడుకు మాట అతనికి మొదటిసారే వినిపించింది. కానీ, బదులు చెప్పలేదు.

'నువ్వింక వ్యవసాయం చెయ్యలేవు బాపూ! అందుకే బాయిపొలం అమ్మితే మంచిది' మళ్లీ చెప్పాడు కొడుకు. 'అదేందీ.. ఎవుసం జెయ్యలేనా? ఎందుకు జెయ్యలేను? చేస్తనే ఉన్నగద. ఎందుకొచ్చిందిరా అనుమానం?' కొడుకు దిక్కు చూడకుండానే అన్నాడు. అతనికి లోపల కొంత కంగారుగానే ఉన్నది. బాయిపొలం అమ్ముకుంటే ఇంకేమన్న ఉన్నదా? తర్వాత ఏం తింటం? ఎట్ల బతుకుతం? 'చేస్తున్నవు నిజమే బాపూ! కానీ, ఏమన్న ఫలితం ఉంటున్నదా? పతేడూ నష్టపోవుడు. అప్పులు చేసుడు తప్ప!'.

నారాయణ మాట్లాడలేదు. బీడి ముక్క పారేస్తూ లేచివెళ్లి తినడానికి కూర్చున్నాడు. శ్యామలమ్మ వడ్డిస్తున్నది. తింటూనే నెమ్మదిగా అన్నాడు.. 'అట్లనుకుంటే ఎట్లరా పెద్దోడా! రైతు అనేటోడు ఎవుసం జెయ్యక ఇంకేం జేస్తడు? పెట్టుబడుల కోసం, చేతి ఖర్సుల కోసం అప్పులు దునియ మీద అందరు రైతులు చేస్తలేరా? పంటలు పండినంక గింజలమ్మి మళ్లా ఆ అప్పులు తీరుస్తలేరా?'.

'అది పాత ముచ్చట బాపూ! ఇప్పుడు రైతు అప్పుల్లో మునుగుడే తప్ప తేలుడుండది. నా మాటలు నీకు కష్టం కలిగించొచ్చు. బాయిపొలం అమ్ముడంటే నువ్వు భరించలేక పోవొచ్చు. కానీ, మనకు వేరే తొవ్వలేదు. పుట్టెడు అప్పులున్నయి. పొలం అమ్మితేనే వాటి

నుంచి ఒడ్డుకు పడుతం' నచ్చజెపుతున్నట్టు అన్నాడు.

నారాయణ మౌనం వహించాడు. కొడుకు మాటలకు తిండిలో రుచి పోయినట్టు అనిపించింది. ఎలాగో ముగించి లేచాడు.

కొద్దిసేపటి తర్వాత ఇంట్లో అందరి భోజనాలూ అయిపోయాయి. తండ్రి తను చెప్పేది సీరియస్‌గా తీసుకోవడం లేదని భావించిన యాదగిరి స్వరంలో తీవ్రత పెంచాడు.

'మనూరు ఇప్పుడు మునుపటి పల్లె కాదు. పట్టణంలో కలుస్తున్నది. రేపోమాపో మన గ్రామం కూడ కార్పొరేషన్ల చేరిపోతది. మనకు దగ్గర్లోనే కొత్తగ రైల్వేస్టేషన్ వస్తున్నది. కలెక్టరాఫీసు ఇప్పటికే ఇక్కడికి మార్చిరి. ఇంకా నాలుగైదు ఇంజినీరింగ్ కాలేజీలు, మెడికల్ కాలేజీ కూడా వచ్చినయి. ఎక్కడెక్కడోళ్లో మానూరు సుట్టు జాగలు కొనుక్కోని ఇండ్లు కట్టుకుంటున్నరు. ఇంకా ఎన్నో షాపులు, షోరూములు, వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ అంతా మనూరు సుట్టుపక్కలనే జరుగుతది. పైగా మన పొలం హైవేకు దగ్గరున్నది. మంచి డిమాండ్ వస్తది. అమ్మితే మస్తు ధర పలుకుతది'.

నారాయణ వృద్ధదేహం చెక్కకుర్చీలో ఇబ్బందిగా కదిలింది. కొడుకు వైపు దిగులుగానూ, తనకు ఇష్టం లేనట్టుగానూ చూశాడు.'ఇంత జల్దిన అంత అవసరం ఏమొచ్చింది? ఎక్కువ ధరొస్తే మాత్రం పొలం అమ్ముకుంటమా?' అన్నాడు. 'ఇప్పుడు పరిస్థితులు అట్లున్నయి గనుకే.. అమ్ముదామంటున్న. నువ్వేచెప్పు.. మనూర్లో ఎంతమంది చేస్తున్నరు వ్యవసాయం? ఎవరి పొలాలు చూసినా నీళ్లు లేక పడావు వడి సర్కారు తుమ్మలు మొలిచినయి. అసలు ఊర్ల చాలామంది ఇప్పటికే భూములు అమ్ముకొని పట్నం పోయిండ్రు. నువ్వేమో ఇంకా పనికిరాని జాగను పట్టుకొని వేలాడుతున్నవు'.

'నీకెందుకురా బాధ? కష్టం జేసేది నేనుగద!' తండ్రికి కోపమొచ్చింది.

'అవును.. నువ్వే! కాదనను. కానీ, ఎంత కష్టం చేసినా దండుగే అంటున్న. నీ బతుకు మొత్తం మట్టిలోనే గడిపినవు. చెమటలు ధారపోసినవు. కానీ, ఏం సాధించినవు? చేసిచేసి నీ రెక్కలు పోయినయి. పెయ్యి అలిసిపోయింది. నీకిప్పుడు విశ్రాంతి అవసరం బాపూ! సీతంబాయి పొలం అమ్మితేనే మన కష్టాలు తీరుతయి'.

'ఎవుసం జేసే రైతు అలిసిపోవుడు ఏందిరా? చిత్రంగ మాట్లాడుతవు. నాకెందుకు విశ్రాంతి? మట్టిల పుట్టి మట్టిల పెరిగినోణ్ని. మట్టిల కలిసిపోయెదాక.. ఈ మట్టినే నమ్ముకొని బతుకుత. అయినా ఉన్న ఒక్క ఆధారం అమ్ముకొని యాడికి పోతం?'.

'యాడికో పోవుడేంది! మీరూ నాతోపాటే ఉంటారు. మీ బాధ్యత నేను చూసుకుంటా. తమ్ముడు కూడ సిటీలో నా దగ్గరనే ఉండి చదువుకుంటడు'. 'తాతల నుంచి వచ్చిన భూమి. మన బతుకులన్నీ దానితోనే ముడివడి ఉండె. చిన్నతనం నుంచి బడికి కూడ పోకుండ ఎవుసం చేసిన. యాళ్ల తెలువకుండ కష్టం జేసినోణ్ని. ఇప్పుడన్నీ ఇడిసిపెట్టి ఉత్తగ ఇంట్ల కూసుండుమంటె ఎట్లయితది? అయినా నీకిప్పుడు పైసల అవసరం ఏమొచ్చింది? నౌకరి జేస్తున్నవు గద. పొలం అమ్ముతనంట వెందుకు?'.

'నాకు పైసల అవసరమొచ్చి కాదు బాపూ! ఈ అప్పుల ఊబి నుంచి ఎట్ల బయటపడుతవని? సేద్యం కోసం ఇన్నేళ్ల నుంచి నువ్వు చేసిన బాకీలు, పొలం మీద తెచ్చిన అప్పులు, వాటికి వడ్డీలు కలుపుకొని కొండల్లెక్క పెరిగినయి. అవన్నీ ఎట్ల తీరుస్తవు? ఎండిపోయిన బాయి కింద ఏం పంటలు పండిచ్చి తీరుస్తవు? రేపు అప్పులోళ్లు వచ్చి నీ బొండిగె మీద కూసుంటరు. అప్పుడేం జేస్తవు? ఏమున్నయి నీ దగ్గర బాకీలు తీర్చేటందుకు?'.

'అందుకని భూమాతను అమ్ముకుంటా(ర?' నారాయణలో కోపమూ, దానివెంబడే నిస్సహాయతా పోటీ పడినయి.

'కాపుదనం చేసే రైతుకు మట్టితో ఉన్న బంధం ఏంటిదో నీకు తెలుసార..? పొలం అమ్ముకోవడం అంటే పెయ్యిల మాంసం ముక్క కోసిపారేసుకున్నట్టు. కన్నతల్లి లాంటి పొలం ఇడిసి నీతోని రావాల్నా! అదెట్ల కుదుర్తది? నేనైనా, మీ అమ్మయినా పట్నంలో అస్సలు ఉండలేం'.. చెపుతుంటే నారాయణ గొంతు జీరబోయింది. ముఖంలో బాధ కమ్ముకున్నది. భార్య దిక్కూ, చిన్నకొడుకు దిక్కూ విచారంగా చూశాడు. తనలో పొంగుకొచ్చే ఆరాటం, ఆవేదన వాళ్లలోనూ కనిపిస్తుందని భావించాడు. కానీ, అదేమీ లేదు. వాళ్లలో విచారానికి బదులు సమ్మతితో కూడిన ఉత్సాహాన్ని గమనించాడు. తనవాళ్లలో ఈ రకమైన మార్పును అతడు ఊహించలేదు. తట్టుకోలేక తలవంచుకొని ఉండిపోయాడు.

'భూమి తల్లి, మట్టి బంధం.. ఇటువంటి కథలు చెప్పకు బాపూ!' యాదగిరి విసుక్కున్నాడు.

'అవన్నీ బేకార్ సెంటిమెంట్లు. ఒక్క పైసా లాభంలేని ముచ్చట్లు. భూమితో బంధం అంటున్నవు సరే.. మరి అప్పులతో సంబంధం నీకు లేదా? నువ్వు చేసిన బాకీల బరువునంతా నీకు బదులు మేము మొయ్యాలా? వాటిని తీర్చేటందుకు మా జీవితాలను త్యాగం చెయ్యాలా?'.

'భూమి గురించి నీకేం తెలుసురా? భూమి అంటే ఒక్క జాగ మాత్రమేనా? దాంతో ఇంకెన్ని ముడివడి ఉంటయి? నీకు కొత్తగ ఉద్యోగమొచ్చింది. అదిసుత ప్రయివేట్ కొలువు. ఎంతకాలం ఉంటదో, ఎప్పుడు ఏమైతదో తెల్వది. కానీ, నా ఉద్యోగం అట్ల కాదు. తాతల నుంచి నమ్ముకున్నది. మన ఇల్లును నడుపుకొచ్చింది.. మన బతుకులు బాగుజేసింది ఇదే! ఇప్పుడీ పొలం అమ్ముకుంటే రేపేదన్న అయితే రోడ్ల మీదవడి బిచ్చమెత్తుకోవాలె'.

'ఇప్పుడు అంతకన్న గొప్పగున్నదా బతుకు? భూమి ఉండి ఏం జేస్తున్నది? నువ్వు చెప్పే బిచ్చగాళ్లకు ఏ రంధీ ఉండది. ఉన్నకాడికి తింటరు, కంటినిండా నిద్రపోతరు. నీకు ఒక్క దినమన్నా ప్రశాంతమున్నదా?' విసురుగా అన్నాడు కొడుకు.

ఇంత జరుగుతుంటే నారాయణ భార్య, చిన్నకొడుకు వింటూ కూర్చున్నరు. చిన్నోడికి అన్నయ్య ఆలోచన బాగా నచ్చింది.

'నిజంగనే పొలం అమ్మితే బాగుంటది. అప్పుడు అందరి చేతుల్ల డబ్బులుంటయి' అతని

పరిధిలో అంతవరకే ఆలోచించి సంతోషించాడు. పల్లెటూరొదిలి ఎప్పుడు సిటీలో వాలిపోదామా అనే ఉబలాటం అతనికి పెరిగిపోయింది.

'బాపూ! అన్నయ్య చెపుతున్నది నిజమే! నువ్వు మునుపటి లెక్క నాగలి దున్నలేవు. కాయకష్టం చెయ్యలేవు. బరువు పనులు ఇంక నీతోని కావు. అందుకని పొలం అమ్మడే మంచిది' అన్నాడు.

చిన్నకొడుకు మాటతో నారాయణకు చిర్రెత్తుకొచ్చింది. ఎన్నడూ బాయి ముఖం సూడనోడు, కాలికి బురుద అంటించుకోనోడు, ఎవుసం గురించి తోకా తొండెం తెలువని పోరడు సుత తనకు సుద్దులు చెపుతుండు..

ముప్పిరిగొన్న ఆవేశంతో అతడు కొద్దిసేపు మాట్లాడలేకపోయాడు. నిస్సహాయతతో గుండె మండుతున్నది. ఇంట్లో అందరూ ఒక్కటై ఏవో కారణాలు చెపుతుంటే తనేం జెయ్యగలడు? వీళ్లకు ఉన్నట్టుండి తను చేతకానోని తీరుగ కనిపిస్తున్నడు.

'బాపూ.. నేనింత చెప్పినా నీ చెవులకు ఎక్కుతలేదు. నీకు భూమే ముఖ్యమనుకుంటే అట్లనే ఉంచుకో. అయితే ఇక ఈ ఇంటితో నాకేం సంబంధం లేదు. నా నుంచి మీరేమీ ఆశించవద్దు. ఆ పొలంలోనే ఉండండి. అప్పులూ, వడ్డీలు అన్నీ మీరే చూసుకోండి. నేను పోతా'.. యాదగిరి స్వరంలో మార్దవం మాయమైంది.

కొడుకు హెచ్చరిస్తున్నట్టు అన్న మాటతో అప్పటిదాకా మౌనంగా ఉన్న శ్యామలమ్మలో కదలికొచ్చింది. 'అదేందిరా పెద్దోడా అట్ల మాట్లాడుతవు? నువ్వు వేరే, మేము వేరే అన్నట్టు జేస్తవేంది?' అన్నది ఆదుర్దా పడుతూ. 'మరి లేకపోతే ఏంటిదమ్మా! ఆ జాగల ఏమున్నది? అదేమన్నా రేగడి పొలమా? ఏడాదికి మూడు పంటలు పండుతయా? లేకపోతే నది కాలువలేమన్న వస్తున్నయా? ఎప్పుడు చూసినా ఏదో రకంగా నష్టాలు. పెట్టుబడుల కోసం అప్పులు. ఇట్లనే బతుకంతా గడిచిపోయె. ఫలితమున్నదా? ఇప్పటివరకు ఏమన్న బాగుపడ్డమా? దానికంటే ఉన్నది అమ్మేసి బాకీలు కట్టుకొని ప్రశాంతంగ ఉండొచ్చుగద'.

'అన్నిదినాలు ఒక్కతీర్గనే ఉంటయా? కాలం గాకపోతదా.. బాయిల్ల నీళ్లు పుట్టకపోతయా? పంటలు పండనిదే ఇన్నేండ్ల నుంచి మనమంత ఎట్ల బతికినం? ఊర్ల అందరు పంటలు పండిస్తలేరా? కష్టపడాలె. రైతుకు ఓపిక ఉండాలె'.. కొడుక్కు సర్దిచెప్పబోయాడు నారాయణ.

తండ్రి ధోరణి యాదగిరికి విసుగు తెప్పించింది. ఎంతసేపూ అదే పాతకాలం ఆలోచన. ముందుచూపు లేదు. పరిస్థితి అర్థం కాదు. వ్యవసాయం మీద మక్కువతో వాస్తవం ఆలోచించడం లేదు. రైతుకు భూమే సర్వస్వం కావొచ్చు. కానీ, అది పాతమాట. ఇప్పుడు సేద్యం రైతుకు భరోసా ఇవ్వడం లేదు. రైతుకే విలువలేని స్థితి. సంవత్సరాల చరిత్ర ఉన్న తమ సీతంబాయి పొలం ఇప్పుడు సేద్యానికి అనుకూలం కాదు. ఆ రోజులు పోయినయి. తమకున్నది మూడెకరాలు. దానికే సరైన దిక్కులేదు. అది చాలదన్నట్టు ఆశకు పోయి మరింత పొలం కౌలుకు తీసుకోవడం. అందుకోసం మరిన్ని పెట్టుబడులు. విత్తనాలు, ఎరువులు,

పురుగుమందులు, కూలీలు.. ఇట్లా తలకుమించిన అప్పులు. చివరికి చేతులు కాల్చుకోవడం. పైగా తండ్రివన్నీ పాతకాలం పద్ధతులు. పరిస్థితులకు అనువైన పంటలు వేయడు. అదే మూస వ్యవసాయం. గొడ్డు చాకిరీ చేస్తాడు. అన్నీ ఒక్కడే. జీతగాణ్ని పెట్టుకునే స్థితి లేదు.

'మన బాయిల నీళ్లు లేకపోయినా భూమి హైవేకు దగ్గర్లో ఉన్నది గనుక మంచి డిమాండ్ వస్తది. ఎక్కువ ధర కూడా పలుకుతది. నామాట విను బాపూ! వ్యవసాయం జేసి ఏం సాధించినవు చెప్పు? అదే పాడుబడ్డ పాతబాయి. లక్షలు పోసి తవ్వించినా నీళ్లురాని బోరుబావులు. నిండా అప్పులు. మనం బాకీలు కట్టకపోతే కొద్దిరోజులు ఊర్లో ఆసాములు ఊరుకున్నా.. బయటివాళ్లు, బ్యాంకులవాళ్లూ ఊరుకోరు. వాళ్లు పొలాన్ని తెగనమ్మి వచ్చినకాడికి తీసుకపోతరు. నువ్వు ప్రైవేటువాళ్ల దగ్గర తెచ్చిన అప్పులకు వడ్డీలు తలుసుకుంటేనే భయం పుడుతుంది. వాళ్లు మంచోళ్లు కాదు. ఇజ్జత్ దీస్తరు. దానికంటే మనమే మంచి బేరానికి పొలం అమ్మేసి ఎవన్ది వానికి పారేస్తే పాయే' తండ్రి మెదడును ఆసాంతం కడిగేస్తున్నట్టు చెప్పుకొచ్చాడు యాదగిరి.

'పెద్దోని మాట నాకు బాగనే అనిపిస్తుంది. నువ్వు కూడ కొద్దిగ ఆలోచన జెయ్యి. నీకిప్పుడు మునుపటిలెక్క చాతనైత లేదు. పాణం బాగుంటలేదు. ఇంక నువ్వు ఎవుసం జెయ్యలేవు. పనిలో నీకు తోడుండేటోళ్లు కూడ ఎవ్వరు లేరు. నీకేదన్న అయితే ఎట్ల? ఇప్పటికే పొలం గెట్టు మీంచి పడి నడుం ఇరగ్గొట్టుకుంటివి. మీదినుంచి మోకాళ్ల నొప్పులు. పెద్దోడు జెప్పినట్టు సీతంబాయి పొలం అమ్మితే మన బాధలన్నీ పోతయి' శ్యామలమ్మ భర్తకు సర్దిచెప్పింది.

'ఇంతమందిమి చెపుతుంటే ఇనవేంది బాపూ! బతుకంత పనిచేసి చేసి దీర్ఘరోగి లెక్క అయినవు. ఇంక నువ్వెంత కాలం కష్టపడ్డా పొలంపైన ఎంత మమకారం ఉన్నా దండుగ. ఇప్పుడున్న బాకీలు వ్యవసాయం మీద ఎన్నటికీ తీర్చలేవు. మన ఊరు పట్నంల కలిసింది. నువ్వు చూస్తుండు.. మన భూమి కొనేటందుకు పెద్దపెద్దోళ్లు ఎగబడుతరు. అందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ నేను చేస్తా. నువు నిమ్మలంగా ఉండు'.. ఇదే చివరి నిర్ణయం అన్నట్టు పెద్దకొడుకు స్పష్టం చేశాడు.

నారాయణ ఉరిశిక్ష పడ్డ ముద్దాయిలా నిర్వేదంగా కొడుకు దిక్కు చూశాడు. కూర్చున్న కుర్చీలో కుంచించుకుపోయి అసహనంగా కదిలాడు. ఇంట్లో అంతా ఒక్కటై ఎదురుతిరిగిన తర్వాత తను ఒక్కడు ఏం చెయ్యగలడు?

'మీ అందరు చెప్పినయి బాగనే విన్న. మొత్తానికి అందరూ కల్సి నన్ను చేతకానోని కింద జమ కట్టిన్రు. 'ఎవుసం బేకార్' అని చెపుతున్నరు. మీ ఆలోచన అదే అయితే అట్లనే కానియ్యుండి. మీ ఇష్టమున్నట్టు చేసుకోండి' అని కుర్చీలోంచి నీరసంగా లేచాడు. బరువెక్కిన మనసుతో చీకట్లో కలిసిన నీడలా వాకిట్లోకి వెళ్లిపోయాడు.

***

నారాయణ రాత్రంతా కలత నిద్రపోయాడు. కళ్లు మూస్తేచాలు సీతంబాయి పొలం కదలాడింది. ఆ రోజు పొద్దున లేవగానే చాయ కూడా తాగకుండా బాయికాడికి

బయలుదేరాడు. సీతంబాయి అంటే ఆ ఊర్లోనే నెంబర్‌వన్ బాయి. వాగు ఒడ్డున్నే ఉంటది. నారాయణ చిన్నతనంలో చూశాడు. దానికింద ఇరవై ఎకరాల పొలం ఉండేది. అతని తాత ఎంతోకాలం శ్రమించి మెట్టభూమిని అచ్చుకట్టి పంటపొలం కింద మార్చాడు. అప్పుడు బాయిలో పుష్కలంగా నీళ్లు. పైన చెరువులు నిండి అలుగులు పారి వాగు జీవనదిలా ప్రవహించేది. సీతంబాయికి ఏనాడూ నీళ్ల కరువుండేది కాదు.

తాత పోయాక తండ్రి నిర్లక్ష్యం, కష్టపడి పనిచేసే తత్వం లేకపోవడం వల్ల ముగ్గురు ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం.. తన తాగుడు కోసం పొలం కొంత కొంత అమ్ముతూ వచ్చాడు. బడికెళ్లడం మానుకొని చిన్ననాడే సేద్యానికి మళ్లిన నారాయణ, తన కళ్లముందే భూమి కరిగిపోవడం చూశాడు. చివరికి మూడు ఎకరాలు మిగిలింది. అదైనా గుండెజబ్బుతో తండ్రి హఠాత్తుగా పోయాడు గనుక మిగిలింది. లేదంటే ఏమీ ఉంచేవాడు కాదని నారాయణే కాదు.. ఊళ్లో చాలామంది అంటుంటారు.

మూడెకరాల పొలంతో, మూడుముళ్లు వేసిన శ్యామలమ్మతో బతుకు బండిని లాక్కొచ్చాడు నారాయణ. చిన్నతనంలో తాతగారి వెంబడే తిరుగుతూ వ్యవసాయ పనులు నేర్చుకోవడం, తండ్రి నిర్లక్ష్యంతో కుంటుపడిన సేద్యాన్ని భుజాలపైన వేసుకోవడం.. అట్లా సీతంబాయి అతనిలో ఒక భాగమైంది. చివరికి అదే అతని ప్రపంచమైంది. ఏ వినోదాలూ, వెసులుబాట్లూ అతడెరుగడు. భూమితోనే బంధం, అదే ఆనందం. అతని మూడొంతుల జీవన జ్ఞాపకాలు ఆ పొలంతోనే ముడిపడి ఉన్నయి.

అయితే సీతంబాయి ప్రాభవమంతా గతం. ఇప్పుడది చుక్కకూడా లేని బాయి బొంద. వర్షాలు లేక, చెరువులు ఉనికినే కోల్పోయి, వాగులు కనుమరుగైన పరిస్థితుల్లో.. సీతంబాయి ఎండిపోయి చెలిమెలేని గొయ్యిగా మిగిలింది.

నారాయణ బాయిగడ్డ మీద నిలబడి చుట్టూ చూశాడు. ఎంతో ఆరాటంగా పొలమంతా కలియతిరిగాడు. ఎక్కడా పచ్చదనం లేదు. మరోపక్క కొండచిలువ నోరు తెరుచుకొని మింగడాని కొస్తున్నట్టు పట్టణం వైపు నుంచి కబళిస్తున్న పెద్దపెద్ద కట్టడాలు. విత్తనాలు మొలకెత్తే భూమిలోంచి మొలుచుకొస్తున్న వందలాది ఇండ్లు.. భవంతులు. ఎకరాలకొద్దీ భూమి ప్లాట్లు కొట్టి ముమ్మరంగా సాగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం. లాభాపేక్షతో భూములు కొన్నవాళ్లు తమ జాగల చుట్టూ దయ్యాల మాదిరి పాతిన సరిహద్దు రాళ్లు.

'రేపు సీతంబాయిని కొనుక్కునే పెద్దమనిషి ఈ పొలంలో ఎవుసం చేస్తడా? లేక జేసీబీలతో భూమి మొత్తం చదును చేసి ప్లాట్లు గొట్టి అమ్ముకుంటడా?' కత్తితో తన దేహాన్ని పరపరా కోసి ముక్కల కింద కొట్టినట్టు నారాయణ విలవిల్లాడి పోయాడు. వందల ఏండ్ల అతని కుటుంబ చరిత్రను కడుపులో దాచుకున్న సీతంబాయి ఇకపై కనిపించదు. ఆనవాళ్లు కూడా ఉండవు. రిజర్వాయర్లు కట్టినా, ఊరూరుకు కాలువలొచ్చినా, దండిగా వర్షాలు కురిసినా ఇకముందు ఎవరికీ ఏ తేడా ఉండదు.

కాంక్రీట్ సాగు జరిగే ఇక్కడ భూమికి నీటిస్పర్శ తెలియదు. చినుకుపడితే ఆస్వాదించే

మట్టినేల కనిపించదు. నాగేటి చాళ్లకు బదులు సిమెంటు దారులు, పంటమొక్కల బదులు కాంక్రీటు కట్టడాలు లేస్తాయి. చినుకు పడాలి. నాగళ్లు దున్నాలి. విత్తనాలు వెయ్యాలి. మొక్కలు మొలవాలి. ఎరువులు వెయ్యాలి. పంటలు పండాలి. ఇవేవీ ఉండవు. ఇకముందు ఇక్కడ అడుగడుగునా మనుషులు మొలుచుకొస్తారు. జనారణ్యం విస్తరిస్తుంది.

నారాయణ తన పొలాన్ని కళ్లతో మరోమారు జల్లెడ పట్టాడు. ఎక్కడా పచ్చదనం లేదు. నీళ్లు ఉంటే కదా నేల పచ్చరంగు అద్దుకునేది. అదేమిటో ప్రకృతికీ, వ్యవసాయానికీ ఎప్పుడూ పడదు. ప్రకృతి ఎంతసేపూ యాజమానిలా సాధిస్తుంది. తనుకొట్టే దెబ్బలకు ఎదుటివారు కుదేలవుతుంటే చూడటం ఎవరికైనా బాగుంటుంది. ప్రకృతికి కూడా అంతే! ఈ ఏడాదైనా కాలం మంచిగై పంటలు బాగా పండుతాయని రైతు ఆశలగూడు అల్లుకుంటాడు. కానీ, ప్రకృతి కన్నెర్రచేస్తే ఆ గూడు చెదురుతుంది. రైతు మళ్లా ఆశపడతాడు. మళ్లా ఎదురుదెబ్బలు. ఇదిట్లా సాగుతూనే ఉంటది.

నారాయణ పొలాన్ని తనివితీరా చూసుకున్నాడు. పొలంతో ముడిపడిన జీవితకాల జ్ఞాపకాలను మననం చేసుకున్నాడు. పాడుబడిన సీతంబాయి చుట్టూ చెట్లు దట్టంగా పెరిగి బాయి మూసుకుపోయింది. ఎంతో ఆశగా తను తవ్వించిన బోరు బావులను తలుచుకుంటే అతనికి బాధేసింది. తాహతుకు మించి అప్పుచేసి బోరువేయిస్తే బండపడింది. దాంతో దిక్కుతోచలేదు. నీళ్లు లేకుంటే పంటపండే దారిలేదు. అందుకే తెగించి ఇంకిన్ని అప్పులు చేసి రెండోచోట బోరు వేయించాడు. అందులో నీళ్లు బాగానే పడ్డయి. ఇక తన కష్టాలు తీరినట్టేనని సంతోషపడ్డడు.

'ఇంకేంది నారాయణా! నీ అదృష్టం పలికింది. బోరునీళ్లతోని నీ మొత్తం పొలం పారుతది. ఇగ మస్తు పంట..' ఊర్లో అందరూ అంటుంటే నారాయణ ఆనందపడ్డాడు.

బోరు పరిస్థితి వానకాలంలో బాగనే ఉన్నది. కానీ, చలికాలం నుంచి నీళ్లు క్రమంగా తగ్గిపోతూ వచ్చినయి. ఎకరమన్నా నాటు వేద్దామని నెలకిందనే వరి నారు పోసిండు. అది పెరిగి ముదిరిపోయింది. నీళ్లు లేక దున్నిన దుక్కి ఎండిపోయింది. ఇంక చేయగలిగింది ఏమీలేదు. గింజ ఇంటికొచ్చే పరిస్థితి లేదు. దీనికితోడు ఈ యేడు వానకాలం తన పొలం కింద ఇంకో ఐదెకరాలు కౌలుకు తీసుకొని పత్తి వేశాడు. 'నాకు అన్ని పంటలూ సమానమే' అన్నట్టు ప్రకృతి కత్తిగట్టి దెబ్బతీసింది. నాణ్యతలేని పత్తిని ఏరినా లాభంలేదని, కూలీ ఖర్చులు దండగని పాడైన పంటను చేనుమీదే వదిలేశాడు. చివరికి అతని రుణభారం మరింత బరువైంది. తీసుకున్న భూమికి కౌలు గట్టాలి. సహకార రుణం తీర్చాలి. పంటరుణం మీద సర్కారు వడ్డీ మాఫీ చేసినా.. అసలు కడితేనే మళ్లా అప్పు ఇచ్చేది. మరోవైపు ఇల్లు తనఖా పెట్టి తెచ్చిన బాకీ వడ్డీతో కలిసి ఇంటికన్నా ఎత్తుకు పెరిగింది.

'మన కొంపను ఒక్కసారి చూడు బాపూ.. కట్టి వందేళ్లయినా అయ్యుంటది. కనీసం గట్టిగా మరమ్మతు కూడా చేయించలేక పోయినవు. కొత్తగా ఇంకో ఇల్లు ఎన్నటికీ కట్టలేం. ఇదెప్పుడు కూలిపోతుందో తెలియదు. పైగా దీనిమీదా అప్పు తెచ్చినవు'.. వీపుమీద గుద్దినట్టు

పెద్దకొడుకు అన్న మాటలు కంపముండ్ల లాగా గుచ్చుతూనే ఉన్నయి. నారాయణ మనసు వికలమైంది. బాయిగడ్డ దిగి ఇంటివైపు నడిచాడు.

ముగ్గురు అక్కల పెళ్లిళ్లకు, తండ్రి వ్యసనాలకు ఒక్కో ఎకరం పరాయిదై పోగా చివరికి మిగిలిన మూడెకరాలను నారాయణ ఇప్పటికీ పదిలంగా కాపాడుకున్నాడు. ఎన్ని కష్టాలొచ్చినా అందులో గుంట జాగ అమ్మలేదు. కానీ, ఏళ్ల తరబడి రెక్కలు ముక్కలు చేసుకొని సాగుచేస్తున్నా ఉన్నదానికి అర ఎకరం కూడా పెంచలేకపోయాడు.

అతడు తన పిల్లల్ని చిన్నప్పటి నుంచి బాయి దిక్కు రానియ్యలేదు. పొలం పనులేవీ చెప్పకుండా వాళ్లను చదువుకోమన్నడు. తనూ, భార్యా కలిసి వ్యవసాయం చేశారు. పొద్దు పొడువగానే పొలానికి, పొద్దుగూకినంక ఇంటికి. అట్లా తన బతుకులో, పొలం పనుల్లో అనునిత్యం చేదోడు వాదోడుగా నిలిచిన భార్య కూడా ఇప్పుడు తను వ్యవసాయం చేయలేడని తేల్చేసింది. పొలం అమ్ముదామని అంటున్న కొడుక్కు మద్దతు పలుకుతున్నది. ఈ నేలతో మట్టితో ఆమెకూ బంధం ఉన్నది గదా? ఇన్నేళ్లు ఆమె కూడా కష్టపడింది. అదంతా ఎట్లా మరిచిపోయింది? కొడుకును అడ్డుకోవాలి గదా? ఉన్న కాస్త పొలం అమ్ముకుంటే ఎట్లా బతుకుతామనే ఆలోచన చెయ్యాలి గదా? ఆమెకు పల్లెటూరు నచ్చక కొడుకుతో సిటీలో ఉండాలన్న మోజు పుట్టుకొచ్చిందా?

'ఇంక నువ్వు ఎవుసం చెయ్యలేవు. నీకు చేతకాదు. పెద్దోడు చెప్పినట్టు అమ్మేద్దాం'.. గంట కొట్టినట్టు చెప్పింది. ఎంత చిత్రం..? ఇంతకాలం తర్వాత హఠాత్తుగా తను రైతు కాకుండా పోతున్నాడు. ఇంట్లో అంతా తనను చేతకానివాణ్ని చేయడం నారాయణకు బాధగా ఉన్నది. ఒకసారెప్పుడో పొలంలో ఒడ్డుమీద నడుస్తూ కాలుజారి పడ్డాడు. దానివల్ల ఎప్పుడన్నా వెన్నులో కొంచెం నొప్పి వస్తుంటది. అట్లాగే ఎప్పటినుంచో మోకాలి నొప్పులు. అవేం కొత్తవి కాదు. తన పనులకు ఎన్నడూ అడ్డుకాలేదు.

'ఇన్నేళ్లు వ్యవసాయం చేసి ఏం సాధించినవు? తొండలు గుడ్లు పెట్టే భూమిలో ఏం పండిస్తవు? కష్టం చెయ్యడం, అప్పులు చెయ్యడం తప్ప ఏం మిగిలింది?'.. కొడుకు మాటలు ఈటెల్లా గుచ్చుతున్నాయి. ఇంట్లో ముగ్గురూ ఒక్కమాట మీదున్నరు. తానొక్కడు ఏం చేయగలడు? తను వద్దన్నా ఆగేటట్టు లేరు. 'ఇన్నేండ్లుగా ఎవుసం మీద కాకుంటే వీళ్లు ఎట్ల బతికిన్రు?'.. నారాయణ పైకే గొణుక్కున్నాడు.

***

నాలుగు రోజులుగా తండ్రి ముభావంగా, సర్వం పోగొట్టుకున్నట్టు ఉండటం యాదగిరి గమనించాడు. తండ్రిని అనునయించే ప్రయత్నం చేశాడు. 'రంధి పడకు బాపూ..! మన పొలానికి మంచి ధరొస్తది. అట్లా వచ్చేటందుకు ఏర్పాట్లు చేస్తున్నా. దీంతో మన కష్టాలన్నీ తీరిపోతయి. నువ్వే ఆలోచన పెట్టుకోక హాయిగా ఉండు'.. భరోసా మాటలు పలికాడు.

నారాయణ సమాధానం ఇవ్వలేదు. జీవంలేని నవ్వు నవ్వి ఊరుకున్నాడు. తండ్రి ఆవేదన యాదగిరికి తెలియంది కాదు. సేద్యాన్ని పూర్తిగా నమ్ముకున్న ఒక రైతు మనోభావాలు తన

భూమి చుట్టే అల్లుకొని ఉంటయి. భూమి అంటే రైతుకు వృత్తి. భూమి అంటే రైతుకు ఉనికి. రైతు మట్టిని ఆశ్రయించి బతికే జీవి. మట్టి వదిలి రాడు. అందుకే ఎన్నిసార్లు ఎదురుదెబ్బలు తిన్నా.. రైతు రైతుగానే కొనసాగుతున్నాడు. పెట్టుబడులకు అప్పులమీద అప్పులు చేస్తూ మరో యోచన లేకుండా ముందుకు పోతున్నాడు. రుణాలు తన స్థాయి మించిపోతున్నా ఎప్పటికైనా తీరుస్తాననే నమ్మకం తనకంటే భూమ్మీదే ఎక్కువ ఉంచడం. క్రమంగా ఆస్తులు తరుగుతూ, బతుకులు ప్రశ్నార్థకమవుతున్నా సాగుబాట వీడకపోవడం.

ఇటువంటి పరిస్థితుల్లో పొలం అమ్మాలనే తన నిర్ణయం సరైనదేనని యాదగిరి భావించాడు. పొలం అమ్మడం కేవలం ఒక లావాదేవీ కాదు. వాస్తవానికి అది తండ్రి గుర్తింపును చెరపడమే. ఆయన దశాబ్దాల శ్రమను ఎగతాళి చెయ్యడమే. కానీ తప్పదు. మారిన కాల పరిస్థితులు, వ్యవసాయం చుట్టూ అల్లుకున్న చిక్కుముడులు గత్యంతరం లేకుండా చేస్తున్నయి. అప్పులు తీరిపోతే తండ్రి మళ్లా మామూలు మనిషి అవుతాడని అనుకున్నాడు. పొలం విక్రయంలో మంచి ధర వచ్చేందుకు యాదగిరి నవీన పద్ధతుల్లో ముందుకెళ్లాడు. ఏదో ఒక ధరకు, ఎవరో ఒకరికి తెగనమ్మడం కాకుండా.. తన ఆధ్వర్యంలోనే వేలంపాట జరిపి ఎక్కువమందిని ఆకర్షించాలని భావించాడు. డబ్బు ఖర్చయినా వెనుకాడకుండా ఇందుకోసం ముమ్మరంగా ప్రచారం చేశాడు.

చుట్టుపక్కల ఊళ్లలోనే కాకుండా ఇతర జిల్లాల్లో రియల్ ఎస్టేట్ సర్కిళ్లలోకి ఈ విషయం తెలిసేలా చేశాడు. సీతంబాయి పొలం గురించిన అన్ని వివరాలు, వేలం జరిగే స్థలం, తేదీలతో పోస్టర్లు వేశాడు. బ్రోచర్లు, కరపత్రాలు పంచాడు. ముఖ్యంగా దీనికోసం టెక్నాలజీని, సోషల్ మీడియాను బాగా వాడుకున్నాడు. ఫేస్‌బుక్, ట్విటర్, రియల్ వెబ్‌సైట్లు.. ఇట్లా దేన్నీ వదల్లేదు. వేలంపాట మూడు రోజులు ఉందనగా అన్ని దినపత్రికల్లో ప్రాంతీయ ఎడిషన్లలో ప్రకటనలు ఇప్పించాడు. పెద్ద నెట్‌వర్క్ ఉన్న స్థానిక కేబుల్ టీవీలో ప్రచారం చేయించాడు. యాదగిరి ఇదంతా ఆ ప్రాంతంలో ఇదివరకెవరూ చేయని విధంగా, కొత్తగా సమర్థంగా నిర్వహించాడు.

***

సీతంబాయి పొలం వేలంపాట దగ్గరపడుతుంటే ఆ ఇంట్లో ఒక్కొక్కరి స్థితి ఒక్కోవిధంగా ఉన్నది. పెద్దకొడుకు యాదగిరి భూమి విక్రయపనుల్లో తలమునకలై తిరుగుతుంటే.. శ్యామలమ్మ తెలియని ఉద్వేగంతో ఉక్కిరి బిక్కిరయింది. చిన్నకొడుకు మాత్రం ఉత్సాహంతో ఉన్నాడు. వేలం పనుల్లో అన్నకు ఆసరా అయ్యాడు. ఎప్పుడు పొలం అమ్ముడవుతుందా, ఎంత త్వరగా నగరంలో వాలిపోదామా అనే ఆత్రుత. నారాయణ పరిస్థితి వేరుగా ఉంది. అతని మనోగతం సముద్రంలా లోతుగా ఉన్నది. ఒక మాటా లేదు, ఉత్సాహమూ లేదు. స్తబ్ధుగా, నిశ్శబ్దంగా ఉంటున్నాడు.

అనుకున్న దినం రానే వచ్చింది..

సీతంబాయి గడ్డ మీదున్న చింతచెట్టు కిందనే వేలంపాటకు అన్ని ఏర్పాట్లూ చేశారు. ఆ

గ్రామం పట్టణంలో కలిసిపోవడం, పొలం హైవేకు దగ్గర కావడం, ముందుముందు అభివృద్ధికి అవకాశాలు ఎక్కువగా ఉండటం, రియల్ ఎస్టేట్ బూమ్ సాగుతున్న ఫలితంగా సీతంబాయి పొలం కొనేందుకు చాలామందే వచ్చారు. సొంత ఊరోళ్లే కాకుండా, వేరే ఊర్ల నుంచి కూడా వ్యాపారులు దిగారు. పక్కన టౌన్ నుంచి వ్యాపారస్తులు చేరుకున్నారు. ఇంకా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ లాంటి దూరప్రాంతం నుంచి వచ్చినోళ్లు కూడా ఉన్నారు. విదేశాల్లో ఉంటున్న తమ పిల్లల సూచన మేరకు అందుబాటులో ఉంటే కొందామని కొందరు, అసలు వేలం ఎట్లా జరుగుతుందో చూద్దామని ఇంకొందరు ఉత్సాహపడ్డారు.

ఊరి కొత్త సర్పంచ్ యువకుడు. చిన్నతనం నుంచి కలిసి చదువుకున్న యాదగిరి అతనికి దగ్గరి మిత్రుడు. సర్పంచ్ స్వయంగా వేలంపాట నిర్వహించాడు. వెనుక చింతచెట్టు మొదట్లో కూర్చొని ఉన్నాడు నారాయణ. అక్కడ జరుగుతున్నదంతా అతనికి ఏదో కలలాగా ఉంది. పక్కన ఎవరు పలుకరించినా ధ్యాసే లేనట్టు తనలోకంలో ఉండిపోయాడు.

'ఇంకొద్దిసేపట్ల పొలం ఎవడో దక్కించుకుంటడు. కాయితాలు రాయించుకుంటడు. తర్వాత ఇంక అది నాది కాదు. పరాయి పరమైతది. ఎట్లాంటి పొలమిది? నా జవసత్వాలు ధారపోసిన. కన్నబిడ్డ తీర్గ చూసుకున్న. ఎన్నెన్ని పంటలు పండిచ్చిన. పంట బాగుంటే సంతోషపడ్డ. పాడైతే బాధపడ్డ. దురదృష్టం అనుకున్న. కాలం కలిసి రాలేదనుకున్న. కానీ, ఒక్కనాడు కూడ భూమిని తప్పుబట్టలే. మట్టిమీద నిందెయ్యలే. ఇప్పుడీ నేలను ఎవడు కొంటడో..? కొన్నోడు ఎవుసం జేస్తడా? లేక ఇంకేదన్న జేస్తడా? కచ్చితంగ వాడు భూమి దున్ని పంటలైతే పండియ్యడు. ముందు మిషిన్లు పెట్టి సీతంబాయిని కూడిపేస్తడు. తర్వాత మొత్తం మూడెకరాలు మట్టంజేసి ఏ బిల్డింగులో, ఇండ్లనో కట్టించి మళ్ల అమ్ముకుంటడు. ఇంక సీతంబాయి ఆనవాలు కూడ దొరుకది. విత్తనాలు మొలకలెత్తే నేల, కడుపులకు పట్టెడు మెతుకులు పెట్టే నేల.. ఇకపైన కాంక్రీటు కట్టడాల కింద అణిగిమణిగి కనిపించకుండా పోతది'.. నారాయణకు తల గిర్రున తిరిగినట్టయింది. ఒంట్లో సత్తువనంతా తోడేసినట్టయి బలహీనంగా చెట్టుకు జారవడి కండ్లు మూసుకున్నాడు. అతనికి తన తాత గుర్తుకొచ్చాడు. ఆయనతో కలిసి పొలంలో పనిచేయడం గుర్తుకొచ్చింది. నాగలి దున్నడం, ఒడ్డు చెక్కడం, గొర్రు కొట్టడం, పంట కోయడం, కుప్పకొట్టడం, మోపులు మోయడం.. ఒక్కటేంది ఎవుసం పనులన్నిటికీ తనకు తాతనే గురువు. తాత పోయాక తండ్రి నిర్లక్ష్యం వల్ల ఎవుసంతో పాటు, ఇంటి బాధ్యతలు కూడా మోయడం నేర్చుకున్నడు. తండ్రి మరణంతో ఇక ఎవుసమే తన లోకమైంది.

సర్పంచ్ వేలం ప్రారంభించాడు. మొదట భూమి అమ్మకానికి పెట్టుకున్న నియమ నిబంధనలు అందరికీ వివరించాడు. తర్వాత సీతంబాయి చరిత్ర గురించి గొప్పగా చెప్పాడు. ఇదివరలో ఆ బాయి కింద ఎన్ని ఎకరాలు పొలం పారేదో తెలిపాడు. బాయి పొలం హైవేకు దగ్గరగా ఉందన్న విషయాన్ని గుర్తుచేశాడు. భవిష్యత్తులో ఆ భూమికి సమీపాన జరిగే అభివృద్ధి గురించీ, కాలుష్యం లేని ఇక్కడి వాతావరణం గురించీ ఆకట్టుకునే విధంగా

వివరించాడు. సర్పంచ్ తెలివిగా ఎండిపోయిన సీతంబాయి ప్రస్తుత పరిస్థితిని మాత్రం ప్రస్తావించలేదు. అయినా అది తెలియని విషయమేమీ కాదు. నిజానికి అదెవరికీ అవసరం లేదు కూడా! ఎందుకంటే అక్కడున్నోళ్లు సీతంబాయి పొలాన్ని ఇప్పుడొక ఆస్తిగా కొనేందుకొచ్చారు తప్ప వ్యవసాయ క్షేత్రంగా కాదు.

వేలంపాట నడుస్తున్నది. నారాయణకు సర్పంచ్ గొంతు ఎక్కడో దూరంగా లీలగా వినిపిస్తున్నది. పైనుంచి తాత దేనికో తనను గట్టిగా మందలిస్తున్నడు. ఆయన ముఖంలో కోపం కనిపిస్తున్నది. మరోపక్క సీతంబాయి పొలం దీనంగా తననే చూస్తూ ఏదో నిలేసి అడుగుతున్నది. తనకేదీ అర్థం కాలేదు. తర్వాత క్రమంగా ఏ దృశ్యాలూ కనిపించకుండా పోయినయి.

సీతంబాయి పొలం అనుకున్నదానికన్నా ఎక్కువ ధరకు అమ్ముడైన ఆనందంలో పరుగు పరుగున తండ్రి వద్దకు వచ్చాడు యాదగిరి. 'బాపూ! నేను చెప్పినట్టే జరిగింది. పొలానికి మంచి ధర పలికింది. ఇంక మన బాధలు తీరినట్టే!' ఉత్సాహంగా చెప్పాడు. తండ్రికి వినపడిందో లేదోకానీ.. ఆయన పలుకలేదు. కనీసం కదిలినట్టు కూడా అనిపించలేదు. యాదగిరి తండ్రి భుజం పట్టి కుదిపాడు. జీవంలేని నారాయణ దేహం.. ఒక పక్కకి ఒరిగి సీతంబాయి పొలం మట్టిని ప్రేమగా తాకింది. ***

**ఎ.యం.అయోధ్యారెడ్డి (ఎగుమామిడి అయోధ్యారెడ్డి) స్వస్థలం సిద్దిపేట జిల్లా మిట్టపల్లి గ్రామం. 11 ఫిబ్రవరి 1955న పుట్టారు. నాలుగు దశాబ్దాలుగా హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. పదో తరగతి వరకు స్వగ్రామంలోని హైస్కూల్లో, సిద్దిపేట ప్రభుత్వ కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు. అనంతరం రాజనీతి శాస్త్రంలో ఎం.ఏ, తర్వాత డాక్టరేట్ చేశారు. 1982లో జర్నలిజం మీద మక్కువతో పాత్రికేయ రంగంలో ప్రవేశించి జర్నలిస్టుగా దాదాపు మూడున్నర దశాబ్దాలు చేశారు. వచన సాహిత్యం (కథలు, నవలలు), ముఖ్యంగా ప్రపంచ సాహిత్యం విస్తృతంగా చదువుకున్నారు. కాలేజీ కాలం నుంచి రచన చేపట్టి ఎంతో ఆసక్తితో కథలు రాశారు. తొలికథ "మృత్యువులో వ్యత్యాసం" 1974 లో గులాబి మాసపత్రికలో అచ్చయింది. ఇప్పటి వరకు 70కి పైగా కథలు, రెండు నవలలు రాశారు. 30 విదేశీ కథలు, ఒక విదేశీ నవల తెలుగులోకి అనువదించారు. ప్రపంచ దిగ్గజ రచయి-ంతల ఇరవై క్లాసిక్ కథల అనువాద సంపుటి "కథా సంగమం" ఈ ఏడాదే వచ్చింది. నాటి ప్రసిద్ధ పత్రికలైన భారతి, యువ, ప్రభ, పత్రిక, జ్యోతి నుంచి నేటి అన్ని దిన, వార, మాస, వెబ్ పత్రికల్లో కథలు, అనువాదాలు ప్రచురితం అయ్యాయి. ఇవేకాకుండా పలు పత్రికలకు, ఆలిండియా రేడియో కోసం సాహిత్య విమర్శలు, వాణిజ్య, క్రీడా రంగ వ్యాసాలు రాశారు. . నాగిరెడ్డి చక్రపాణి, సాహితిగౌతమి, పాకాల యశోదారెడ్డి, మాడభూషి తదితర పలు పురస్కారాలు అందుకున్నారు.**



**జనపాల శంకరయ్య**
**8074724108**

# బతుకు కుయ్యం

ఓ రోజు సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ గారి ఇంటర్వ్యూ టీవీలో వచ్చింది. 'కథ, పాట, పద్యం, కవిత్వం.. మానవత్వం ఉన్న మనిషిగా తీర్చిదిద్దుతయి. సమాజహితమే సాహిత్యం! మానసిక ధైర్యాన్నిచ్చి ముందుకు నడిపిస్తూ.. జీవిత సాఫల్యాన్ని పూర్తి చేసేది సాహిత్యం!' అని ఆ ఇంటర్వ్యూలో చెప్పారాయన. ఆ మాటలకు బూర రాజేశ్వరి ప్రభావితమైంది. కాళ్లతోనే కలం, కాగితం అందుకుంది. మనోధైర్యాన్నిచ్చే కవిత్వం రాయడం మొదలుపెట్టింది. అంగవైకల్యాన్ని లెక్క చేయలేదు. దృఢసంకల్పంతో ముందుకు దూసుకుపోయింది. అందరి మనసులపై కైతల బాణాల్ని ఎక్కుపెట్టింది. గురిచూసి వదలడం మొదలుపెట్టింది.

'అయ్యలారా! ఆలోచించండి! అన్ని జీవులలో మనిషి పుట్టుక గొప్పది. అమూల్యమైనది. శరీరంల మొస ఉంటేనే.. ఏదైనా సాధించవచ్చు. ఊపిరి వదలగానే ఈ శరీరం ఉబ్బి.. గబ్బు వాసనైతది.

మద్యానికి బానిసలై, అప్పుల ఊబితో ఉరితాళ్లకు ఊగులాడకుండ్రి. ఆకులు, అలములు, రేగడి మట్టిని తిని బతికింద్రు ఓనాడు. కష్టం, సుఖం అన్నీ కలిస్తేనే అసలైన జీవితం. మీ పెళ్లాం, పిల్లగాండ్లు తెర్లు ఐతరు. ఒక్కసారి నన్ను చూడండ్రి! అవిటి బతుకైనా.. ఏదో సాధించాలని, నాలో తపన ఉంది. అన్ని అవయవాలూ బాగుండి పిరికోళ్లయి సస్తుండ్రు ఎంతోమంది. నాకు ఎన్నో కోరికలున్నా.. అన్నీ తీరుతయా? సావు పరిష్కారం కాదు! బతికి గెలుద్దాం! ఆత్మతృప్తితో ఆనందాలే చిందిస్తూ, అందరి కోసం బతుకుదాం!'..

బూర రాజేశ్వరి రాసిన కవితలు, ఆమె మాటలు.. వివిధ పత్రికల్లో, లోకల్ కేబుల్ వార్తల్లో, వాట్సప్ గ్రూపుల్లో ప్రసారమయ్యాయి. ఆమె పేరు రాష్ట్రమంతటా మార్మోగిపోయింది. రాజేశ్వరి.. రాష్ట్ర సర్కారు దృష్టికి వచ్చింది. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా.. 'ఉత్తమ మహిళ' అవార్డునిచ్చి సత్కరించింది. రాజేశ్వరి తల్లి అనసూయ, పెద్దన్న ఆమె వెంటే ఉన్నరు. వాళ్ల మనసు పొంగిపోయింది.

'సిరిసిల్ల సాహితీ సమితి'.. రాజేశ్వరికి తమ సంఘంలో సభ్యత్వమిచ్చి, 'ఉత్తమ రచయిత్రి' అవార్డుతో సన్మానించిది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన ఒక వీడియో క్లిప్‌లో.. బూర రాజేశ్వరి రూపం, నడక, మాటలు.. ప్రతిఒక్కరి హృదయాన్ని

కదిలించాయి.

ఒక ఇంటర్వ్యూలో..

"నీ కోరిక ఏమిటి?" అని అడిగిన ప్రశ్నకు..

"సుద్దాల అశోక్ తేజతో ఒకసారి మాట్లాడాలని ఉంది" అని చెప్పింది రాజేశ్వరి.

ఆ ఇంటర్వ్యూను సుద్దాల అశోక్ తేజ, ఆయన సతీమణి నిర్మల చూసింద్రు. ఆగమాగంగా సిరిసిల్లలోని రాజేశ్వరి ఇంటికి వచ్చి.. కలిసింద్రు."ఎవరి వల్ల ఇంత సాహసం చేయగలిగినవు. ఏ ధైర్యంతో కవిత్వాన్ని ఆయుధంగా వాడినవు" అని ప్రశ్నించిండు అశోక్ తేజ."కవిత్వం రాయడానికి స్ఫూర్తి మీరే! టీవీలో మీ ఇంటర్వ్యూ చూశాను. అవిటితనమైనా అందరి మనసులో నిలవడానికి కారణం మీరే!" అన్నది రాజేశ్వరి. ఆ మాటలతో పట్టరాని సంతోషంతో..

"బిడ్డా! నీ మాటలు నా గుండెను తాకినయి. ఎన్నో అవార్డులు పొందినా రాని సంబురం.. నీవల్ల లభించింది" అని కళ్ల నిండా నీళ్లు నింపుకొని, రాజేశ్వరికి నమ-స్కరించి.. కొండంత వాత్సల్యంతో దగ్గరికి తీసుకుండు అశోక్ తేజ.

"బాపూ! మీరు గింత గొప్పోల్లు. నన్ను దగ్గరికి తీసుకుంటే నూరేళ్లు బతికి, మనో

దౌర్బల్యం ఉన్నోళ్లకు నా 'కవితల' ద్వారా మనోధైర్యాన్ని నూరిపోస్తా!" అంటూ మనసు ఉప్పొంగగా స్పందించింది రాజేశ్వరి.

"సరే బిడ్డా! నువ్వు ఎట్లా చదువుకున్నవు? స్కూలుకు వెళ్లినవా? ఒక్కదానివే వెళ్లినవా?" అని అడిగిండు.

"బాపూ! మా చెల్లె మల్లీశ్వరి, అన్నబిడ్డ లతతో కలిసి బడికి వెళ్లిన. నడువరాకున్నా పోరాటం చేసిన. ఆరాటంతో ఉడుం పట్టుపట్టి ఏడో తరగతి దాకా సదువుకున్న. కొందరు సార్ల సహాయంతో ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు రాసి పాసయిన!" అంటూ చెప్పింది రాజేశ్వరి.

"చూడు బిడ్డా! ధైర్యే సాహసే లక్ష్మి అన్నట్లు నువ్వు ధైర్యంతో అన్నిటినీ ఎదుర్కొంటున్నవు. ఆ భగవంతుడు నీకు తోడ్పడుతుండు! శభాష్ బిడ్డా!".

"బాపూ! నాకు వచ్చే వికలాంగుల పెన్షన్ నుంచి ఏటా 15 ఆగస్టు, 26 జనవరికి ఓ బడికి వెయ్యి రూపాయలు ఇస్తా! ఆ డబ్బులను ఆటల్లో విజేతలకు బహుమతులుగా అందజేస్తరు. గదో ఆనందం నాకు".

"సరే.. బిడ్డా! నీ కవితలన్నీ నేను తీసుకుంటున్న.. 'సిరిసిల్ల రాజేశ్వరి కవితలు' పుస్తకంగా అచ్చువేస్తానని మాట ఇస్తున్నా! అట్లాగే మా అమ్మనాన్న సుద్దాల హనుమంతు – జానకి గార్ల అవార్డు ఈసారి నీకే దక్కుతుంది" అంటూ సంబురంతో అన్నడు అశోక్ తేజ.

* * *

భాగ్యనగరం నడిబొడ్డున కళలకు నెలవైన రవీంద్ర

భారతిలో.. ఎందరెందరో మేధావులు, కవి గాయకులు, నాయకులు, అభిమానుల నడుమ.. 'సిరిసిల్ల రాజేశ్వరి కవితలు' పుస్తకాన్ని, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి ఆవిష్కరించి, ఆశీర్వదించిండు. సుద్దాల అశోక్ తేజ.. తన తల్లిదండ్రుల పేరున 'సుద్దాల హనుమంతు %--% జానకి అవార్డు' రాజేశ్వరికి అందించిండు. సప్పట్ల సప్పుడులో ఆయన మాట్లాడుతూ..

"సంకల్పం ముందు వికల్పం ఎంత? దృఢచిత్తం ముందు దురదృష్టం ఎంత? ఎదురీత ముందు విధిరాత ఎంత? పోరాటం ముందు ఆరాటం ఎంత? ఈ మాటలకు సజీవ ఉదాహరణ సిరిసిల్ల రాజేశ్వరి! భౌతిక వైకల్యాన్ని సవాలు చేస్తూ జీవిస్తున్న సమర యోధురాలు!" అంటూ కీర్తించిండు.

ఈ సందర్భంగా 'సిరిసిల్ల సాహితీ సమితి'

రాజేశ్వరిని ఘనంగా సత్కరించింది. తమ ప్రకటనలో..

"మా సభ్యురాలు రాజేశ్వరికి వైద్యఖర్చులు, జీవ

నోపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆధారం చూపాలి" అంటూ విజ్ఞప్తి చేసింది. అక్కడున్న మేధావులు కొందరు.. ఎవరికి తోచినంత వాళ్లు ఆర్థిక సాయం అందించిండ్రు. చూస్తుండగానే లక్ష రూపాయలు

పోగైనయి. ఆమె కుటుంబం సంబురం.. అంబరాన్ని అంటింది. నాటి ముఖ్యమంత్రి చెవుల్లోనూ రాజేశ్వరి చరిత్ర దూరింది. వెంటనే ఆమెకు పది లక్షలు ప్రకటించిండ్రు. ఆ పైసలను ఆమె పేరున బ్యాంకు అకౌంట్లో వేసి.. ప్రతినెలా వడ్డీ అందేట్లు చూడాలని కలెక్టర్‌కు ఆదేశాలు అందినయి. ఆమె కుటుంబం, అభిమానులు అందరూ సంబురపడ్డరు.

సాయంత్రానికి ఇల్లు చేరిండ్రు. హైద్రాబాద్‌లో జరిగిన సంబురాన్ని ఇంట్లో పిల్లా జెల్లా చెప్పుకొని సంతోషపడ్డరు. గప్పుడే కన్నారం విశ్వబ్రాహ్మణ సంఘం పిలుపురాంగనే.. రాజేశ్వరి, అమ్మ అనసూయ, అన్న ఓదెలు కలిసి కళాసాగర్ భవనానికి చేరుకున్నరు. విశ్వబ్రాహ్మణ సంఘం వారు 'ప్రాణ రక్షక' అవార్డుతోపాటు రూ.పదివేల నగదు అందిస్తూ, రాజేశ్వరిని ఘనంగా సత్కరించిండ్రు.

"రాజేశ్వరి కవితలు ఎందరెందరో పానాలను నిలిపినయి. మహారాష్ట్ర సర్కారు తమ పాఠ్యాంశాల్లో

'రాజేశ్వరి చరిత్ర'ను చేర్చింది" అని వ్యాఖ్యాత తనదైన శైలిలో చెప్పిండు.

ఆ ప్రశంసలను మనసులో మూటగట్టుకొని ఇంటిదారి పట్టిండ్రు.

"అవ్వా! చెల్లె రాజేశ్వరి మనసు, ఆలోచనల గొప్పదనంతో మన కుటుంబం ఒక గాడిలో పడ్డది. మొన్నటిదాకా ఓ పూటకు ఉంటే.. ఇంకో పూటకు లేదు. తమ్ముడు రామచంద్రం సాంచలు నడుపుతుండు. సమ్మక్క, మల్లీశ్వరి బీడీలు చుడుతుండ్రు. అయ్య పోయినప్పటి సంది గింత దాకా! కుటుంబాన్ని ఈదుకచ్చిన. గిప్పుడు ఐదేళ్లు నోట్లెకు పోతున్నయి".. సంబురాన్ని తట్టుకోలేక అన్నడు ఓదెలు.

"నిజంగా బిడ్డ! రాజేశ్వరికి గిన్ని పైసలు రావట్టే! ఇంట్ల అందరం నోట్లె నాలిక లెక్క కలిసి కడుపునిండా తింటున్నం" ముఖంమీద చిరునవ్వులు ఒలుకుతుంటే.. అన్నది అనసూయ.

"అవ్వా! గిప్పుడు నాకు గుండెధైర్యం పెరిగింది. రేపు దసరా. మంచిగ జరుపుకొందం! సరేనా అవ్వా!?" అని అడిగిండు ఓదెలు.. గుండెనిండా ప్రేమతో!

* * *

తెల్లారింది. ఓదెలు సైకిలెక్కి మార్కెట్‌కు పోయిండు. శియ్యకూర తెచ్చి ఇంట్లో

బెట్టిండు. సారంపెల్లికి పోయి ఈతకల్లు దెచ్చిండు.

"అవ్వా! పొద్దిమీకి బంతి గూకుందాం" అని .. సాంచల పనిలలో చేరిండు.

రాజేశ్వరిది ఉమ్మడి కుటుంబం. మాపటీలికి అందరూ బంతి కూసుకున్నరు. విస్తర్లల్ల శియ్యకూర, బజ్జీలు, పూరీలు వడ్డించిండ్రు. అందరూ తింటాంటే.. ఓదెలు గిలాసల్ల ఈతకల్లు పోస్తుండు. పిల్లలూ, పెద్దలూ సంబురంతో ముచ్చట్లు వెట్టుకుంటుండ్రు. ఎవలకు కన్నుకుట్టిందో.. నవ్వుకుంట మాట్లాడుతున్న ఓదెలుకు ఒక్కసారి సరం పడ్డది.

రేవతి గిలాసల నీళ్లిచ్చి, ఈపుల సరిసింది.

"అవ్వా! మొస మర్రుత లేదు. బొచ్చెల బగ్గ నొత్తుంది. ఎడమ చెయ్యి గుంజుతంది. తల్లడం మల్లడం అయితంది!" అనుకుంట తిండి మీదికెల్లి లేచిండు.

ఆయాసంతో విలవిల లాడుతున్నడు ఓదెలు. శెమటతోని పెయ్యంత తడిసింది. అప్పటిదాకా అందరిలో ఉన్న ఆ సంబురం.. ఒక్కసారి అడుగంటింది. అందరి మనసుల్లో ఆందోళన, భయం ముసురుకుంది. వాడకట్టు డాక్టర్‌ను తోలుకచ్చింది అనసూయ. ఆయినె చూసి..

"అవ్వా! గిది గుండెనొప్పి లెక్క ఉన్నట్టుంది. జెప్పన పెద్ద దవాఖానకు తీసుకపోండ్రి" అన్నడు.

అనసూయకు గుండెల రాయిపడ్డట్టు అయింది. ఆడనే కూలవడ్డది. రాజేశ్వరి కడుపులో కవ్వం తిరిగినట్లు అయ్యింది.

"నాకు వచ్చిన పైసలు తీసుకోండ్రి. అన్నను కాపాడుకోవాలె. వదినె, చిన్నన్న.. జల్ది పోండ్రి!" అని ఏడుసుకుంటనే అన్నది రాజేశ్వరి.

ఓదెలును ఆటోలో కూర్చోబెట్టిండ్రు. ఒక దిక్కు రామచంద్రం, మరో దిక్కు విజయ, అనసూయ కూసున్నరు. వాళ్ల చేతుల లక్ష రూపాయలు వెట్టింది రాజేశ్వరి.

దగ్గర్లనే ఉన్న ఓ ప్రైవేటు దవాఖానకు తోలుక పోయిండ్రు. ఓదెలును చూసిన డాక్టర్..

"ఇక్కడ గాదు. కరీంనగర్ పోవాల్సిందే!" అన్నడు.

గదే ఆటోలో కన్నారం బయల్దేరిండ్రు.

కన్నారం చేరుతున్నమనంగా.. ఓదెలుకు చెమటలు గుమ్మరించినయి. నోటమాట ఆగింది. మొసకొట్టుడు మొదలైంది. లబోదిబోమని గుండెలు కొట్టుకుంటూనే.. ఓ పెద్ద దవాఖానల శెరీక్ జేసిండ్రు. యాభైవేలు అడ్వాన్స్ పెట్టిండ్రు. అప్పటిదప్పుడే.. ఇరవై ఐదువేల సూదిమందు ఇచ్చిండ్రు ఓదెలుకు. గ్లూకోజ్ పెట్టిండ్రు. ఒక్క గంట

గడిచినంక.. క్యాలికి అచ్చిండు. దగ్గరికి రమ్మంటూ.. విజయకు కండ్లతోనే సైగ చేసిండు.

"విజయా! నువ్వు పైలం. ఇంట్ల అందర్నీ మంచిగ చూసుకో! కలిసిమెలిసి ఉండుండ్రి. అవ్వా! నా పిల్లలు లత, భాస్కర్, సందీప్ పైలం.. నాకేం గాదు. గానీ, జరగరానిది జరిగితే.. నా గుండె ఆగినా! మొస ఆగినా! నా పెండ్లాం, పిల్లలు.." అంటూ కండ్లల్ల నీళ్లు వెట్టుకుంట..

భార్య విజయను, తల్లిని దగ్గరికి తీసుకున్నడు.

"తమ్ముడూ! నేను మంచిగైతె.. అందరం మంచిగుందం. ఒగాల్ల నేను సచ్చిపోతే! మీ వదినెను, పిల్లలను, చెల్లెళ్లను, అవ్వను తెర్లు గానియ్యకు. మంచిగ చూసుకో!".. కన్నీళ్ల ధార జారి పడుతుండంగ ఒప్పజెప్పిండు ఓదెలు.

"అన్నా! నువ్వు జల్ది మంచిగైతవు. రంది పెట్టుకోకు. చెల్లె రాజేశ్వరికి వచ్చిన పైసలు లక్ష ఇచ్చింది. ఇల్లు అమ్మి అయినా.. నిన్ను కాపాడుకుంటం. నువ్వు మంచిగ్గావాల్నని చెల్లెండ్లు, పిల్లలు అందరూ దేవుండ్లకు మొక్కులు మొక్కుతుండ్రు" అని ధైర్యం నూరిపోసిండు తమ్ముడు రామచంద్రం.

* * *

రాత్రంతా బెడ్ పక్కనే ఉండి.. పెనిమిటి అవసరాలను తీర్సుకుంట సేవ చేసింది విజయ.

మూలసుక్క పొడుస్తుండగా..

"విజయా! దూపైతంది!" అన్నడు ఓదెలు.

ఓ గిలాసల మంచినీళ్లు ఇచ్చింది. తాగుతుండగా మల్ల సరం పడ్డది. తలమీద, వీపుల మెల్లగ చరిచింది. ఐనా తల్లడం మల్లడం ఐతుండు. కిందమీద ఐతుండు.

విజయకు నోట మాట రాలేదు. ఏడుసుకుంట వొయ్యి డాక్టర్లను, నర్సులను పిల్చుకచ్చింది. వాళ్లు ఓదెలును ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకుపోయిండ్రు. విజయకు కాళ్లు, చేతులు చల్లబడ్డయి. గుండె వేగం పెరిగింది. లోపలికి పోనిస్తలేరు. అత్త, మరిది దగ్గరికిపోయి వాళ్లను నిద్రలేపింది. గుండెల్లో దడ పెరుగుతుంటే, కన్నీళ్లు కాలువలై పారుతుంటే.. పత్తికాయ పగిలినట్లు ఏడుపుతో జరిగిన సంగతి చెప్పింది. ముగ్గురి మనసుల్లో భయం జొర్రింది. ఆగమాగం అవుతున్నరు. ఏం జరుగుతుందో అర్థంకాక బిక్కుబిక్కుమనుకుంట కూసున్నరు.

రాత్రి గడిచింది. పొద్దుగాల డాక్టర్లు వచ్చింద్రు.

"మా ప్రయత్నం మేం చేసినం.. ప్రాణాలు కాపాడలేక పోయినం సారీ!" అన్నరు.

ముగ్గురూ దుఃఖసాగరంలో మునిగింద్రు.

ఇంటికాడ.. ఏడుపును దిగమింగుకొని, పిల్లలకు ధైర్యం చెప్పుకొంటనే ఎదురుచూస్తున్నది రాజేశ్వరి. పొద్దు నెత్తి మీదికి వచ్చింది. ఇంటి ముంగట అంబులెన్స్ ఆగింది. శవాన్ని దించి.. ఆకిట్ల గడ్డిమీద పండుకోబెట్టింద్రు. పిల్లలు, రాజేశ్వరి కుటుంబమంతా ఒక్కసారి ప్రభంజనంవోలే అయింది. కర్మకాండలు పూర్తి చేసింద్రు. రాజేశ్వరి గుండె నిండా మోయలేని ఏడ్పు ఆవరించి ఉన్నా.. అనుభవమున్న పెద్దమనిషిలెక్క..

"అవ్వా! వదినె.. ఎవ్వలమైనా ఎల్లకాలం ఉండేటోళ్లం గాదు. ఎన్ని రోజులు భూమ్మీద నూకలు బాకీ ఉన్నాయో! గప్పటి దాక 'బతుకే ఓ కయ్యం' ఇది. 'ఆత్మహత్యల' జోలికి పోవద్దు. గది పెద్ద పాపం. మన బాధ్యతల్ని మరిచిపోవద్దు. పిల్లల బాధ్యత మనమీద ఉన్నది" అని బుద్ధి చెప్పింది.

* * *

కొంతకాలం గడిచింది. ఓదెలు మరణగాయం.. కొద్దికొద్దిగ మానుతున్నది. గంతల్నే.. పక్కింటోళ్లకు జరం వస్తే.. వెళ్లి చూసచ్చింద్రు అనసూయ, రాజేశ్వరి. గంతే! వీళ్లకూ జరం, దగ్గు అందుకుంది. సర్కారు దవాఖానకు పోయి పరీక్షలు చేయించుకుంద్రు. తల్లీబిడ్డలకు కరోనా పాజిటివ్ వచ్చింది. ఇద్దర్నీ సిరిసిల్ల సర్కార్ దవాఖానల క్వారెంటైన్లకు తీసుకుపోయింద్రు.

ఇంకేముంది.. 'నోరోటి ఆడితే నొసలోటి ఆడినట్లు' ఒక్కసారి భయంలోకి జారుకుంద్రు.

తనకూ, తన తల్లికి కరోనా పాజిటివ్ వచ్చిన విషయాన్ని ఫోన్ ద్వారా సాహితీ మిత్రులకు చెప్పింది రాజేశ్వరి. విషయాన్ని వాళ్లు వాట్సాప్ గ్రూపుల్లో పెట్టడంతో.. సిరిసిల్ల పట్టణమంత పాకిందీ వార్త.

చంద్రంపేట అంజమ్మ పూటకూళ్ల ఇంట్ల రాత్రిపూట తిండికి వచ్చినోళ్లకూ ఈ ముచ్చట తెలిసింది.

"అరేయ్! రచయిత్రి రాజేశ్వరికి కరోనా వచ్చిందంట. గిప్పుడంటే.. బతుకమ్మ చీరలు బతుకునిస్తున్నయి. ఇంతకుముందైతే.. నేతన్నకు ఉరే గతి. నేనుగూడ ఫ్యాన్‌కు ఉరేసుకుందమని నైలాన్ తాడుతో తయారుగున్న! టీవీల రాజేశ్వరి మాటలు శెవుల సొర్రినయి. గంతే, తాడు ఇడిసి పక్కకు పారేసిన! లేకపోతే నా బొంద మీద గడ్డి మొలుస్తుండె" అన్నడు సురేష్.

"అరేయ్ సురేష్‌గా! నేనైతే బ్రాండిల ఇసం గల్పుకున్న! దేవతోలె ఆమె మాటలు

మనసుకెక్కి 'ఛీఛీ.. గింతపిరికోన్నా?' అని సీసా పెంటల ఇసిరికొట్టిన!" అన్నడు శేఖర్.

'బతుకు బరువు మోయలేక సావు అంచుల దాకా పోయిన ఎందరికో.. రాజేశ్వరి మాటలు పునర్జీవితాన్ని ఇచ్చినయి. అలాంటి రాజేశ్వరి కష్టాల్లో ఉన్నప్పుడు అందరం అండగ నిలువాలె!' అని ప్రతి ఒక్కరూ తీర్మానించుకున్నరు. విషయాన్ని వాట్సప్ గ్రూపులల్ల షేర్ చేసింగ్రు. సిరిసిల్లలోని అన్ని ఇండ్లల్ల గిదే చర్చ

వెట్టింగ్రు. ఎంతోమంది కదిలింగ్రు. సిరిసిల్ల దవాఖానకు క్యూ కట్టింగ్రు. రాజేశ్వరికి మందులు, పండ్లు, పోషకాహార కిట్లు, ఆర్థిక సాయం అందిస్తూ అండగా నిలిచింగ్రు. తనకోసం సిరిసిల్లవాసులంతా కదిలిరావడంతో రాజేశ్వరి మనసు తబ్బిబ్బు అయ్యింది.

"అయ్యల్లారా! గింత భయంకర ఆపద సమయంలో ఈ అవిటి రచయిత్రిపై మీరు చూపుతున్న ఆప్యాయతకు, అనురాగానికి నా గుండె పొంగింది. నా భయం బద్దలైంది. మీ ఆశీస్సులున్నయి. నాకేం గాదు" అని అందరికీ తలవంచి దండంపెట్టింది రాజేశ్వరి.

"మీరు, మీ అమ్మ కరోనా నుంచి జెప్పన కోలుకోవాల్నని ఎములాడ రాజన్నకు మొక్కుతున్నం. ఈ గండం నుంచి బయటపడే దాకా నీ వెంటే ఉంటం. జీవితంపై విరక్తి చెందిన మాకు.. మీ మాటలతో బతుకు మీద ఆశ పుట్టించింగ్రు. మా ప్రాణాలు గాలిలో కలిసిపోకుండ కాపాడింగ్రు. మేమంతా మీ అభిమానులం!" అంటూ కన్నీళు పటపట రాలుస్తూ చెప్పింగ్రు.

"బిడ్డా! రాజీ.. నాకు దమ్ము ఎత్తేసుకత్తుంది. ఆయాసం ఎక్కువైతంది. నువ్వు.. అందరూ పైలం బిడ్డా! వదినెలు నీకు ఎట్ల సేవ జేస్తరో.. ఏమో!? అనే దిగులుంది. దేవుడు నిన్ను గిట్ల పుట్టించె! ఒకళ్ల మీద ఆధారపడుడాయె!" తల్లడిల్లింది ఆ తల్లి మనసు. మాట్లాడుతుండంగనే.. మొసరాక ఆగమాగమైంది అనసూయ. డాక్టర్లు వచ్చింగ్రు.. "రాజేశ్వరీ! మీ అమ్మకు ఆక్సిజన్ లెవెల్స్ పడిపోతున్నయి. ఐసీయూలోకి తీసుకెళ్తం! మేం జేసే ప్రయత్నం మేం జేస్తం.. మీరు దేవుడి మీద భారమేయండి.." అంటూ అనసూయను తీసుకెళ్లింగ్రు. రాజేశ్వరి మస్తు బెంగ వెట్టుకున్నది. పక్కపక్కనే ఉన్నప్పుడు ఏమీ అనిపించలేదు. గిప్పుడు చెరో దగ్గర అయ్యేసరికి అక్కడ ఏం జరుగుతున్నదో తెల్వక ఆందోళన చెందుతున్నది. కొడుకు, కోడళ్లు దూరం నుంచే మాట్లాడుకుంట పోతున్నరు. రాత్రి గడిచి తెల్లారింది.

అక్కన్నే ఉన్న నర్సులను పిలిచి..

"మా అమ్మకెట్లుంది?" అని అడిగింది రాజేశ్వరి.

"ఇప్పుడే ఏం చెప్పలేం! ఇంకా ఆక్సిజన్ లెవెల్స్ తక్కువనే ఉన్నయి" అని చెప్పింగ్రు

వాళ్లు.

తన అవస్థను చెప్పుకోడానికి ఐసీయూ లోపలున్న అనసూయ దగ్గర ఎవర్లేరు. గంతల్నే దమ్ము ఎగపోత పెరిగింది. మృత్యువుతో పోరాడి పోరాడి.. కొడుకు, కోడలు వచ్చేసరికి తుదిశ్వాస విడిచింది.

“అమ్మా! అన్నీ నువ్వే అయి మమ్మల్ని నడిపించినవు. ఇగ మాకు దిక్కెవరు?” అని గుండె పగిలి ఏడ్చింది రాజేశ్వరి.

కరోనా నిబంధనలు పాటిస్తూ.. అనసూయ అంత్యక్రియలు జరిపిండ్రు కొడుకు, కోడలు. అభిమానులు, కవులు, కళాకారులు.. నిబంధనలతో ఆ కార్యక్రమంలో పాల్గొన్నరు. అమ్మలేని బాధను భరిస్తూనే.. కరోనాను జయించింది రాజేశ్వరి.

ధైర్యాన్ని కూడగట్టుకుని..

‘రాజైనా! బంటైనా! ధనికుడైనా! పేదైనా.. ఎవలైనా మట్టిలో కలిసేదే కదా! మిగిలేది.. మంచి, చెడు’ అనుకుంటూ ఆత్మస్థయిర్యాన్ని మరింత పెంచుకుంది. వదినెలు మంచోళ్లు. తల్లిలేని లోటు తీరుస్తూ.. సాయం అందిస్తూనే ఉన్నరు. తనకు జరిగిన గాయాలను కవి సమ్మేళనాలలో కవితల రూపంలో వెల్లడించింది రాజేశ్వరి. రెట్టింపు పదునుదేలి ముందుకు సాగుతున్నది. తన అవిటితనాన్ని మరిచి.. తెగింపుతో, పట్టుదలతో, సాధన చేస్తూనే ఉన్నది. రాజీ పకుండా.. ‘బతుకే! ఓ కయ్యం!’ అనుకుంటూ.

**జనపాల శంకరయ్య స్వస్థలం, రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూరు. ఏడో తరగతితోనే చదువును ఆపేసినా.. ఉన్నత విద్యాభ్యాసంపై మక్కువతో ప్రైవేట్‌గానే ఎం.ఎ, ఎంఫిల్, పీహెచ్‌డీ చేశారు. ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయుడిగా సేవలందించారు. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు అందుకున్నారు. పద్య, వ్యాస రచన, బుర్రకథ ప్రక్రియల్లో అనేక రచనలు చేశారు. ‘కరీంనగర్ జిల్లా లంబాడీల ఆచార వ్యవహారాలు’, ‘బహుముఖ ప్రజ్ఞాశాలి కల్వకుంట్ల తారక రామారావు బుర్రకథ’, ‘తెలంగాణ సమరశంఖం’, ‘అవినీతిపై అక్షరాంకుశం’, ‘పర్యావరణ పరిరక్షణ పాంచజన్యం’, ‘వైద్యం – ఆరోగ్యం’ కవితా సంకలనాలకు సంపాదకత్వం వహించారు. సిరిసిల్ల సాహితీ సమితి ప్రధాన కార్యదర్శిగా, రాజన్న సిరిసిల్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడిగా సాహితీ సేవ చేశారు. ఈయన రాసిన ‘ఆచార్య దేవోభవ’ శతకానికి పాలకొల్లు విశిష్ట పురస్కారం, చెలిమి సాంస్కృతిక సంస్థ పురస్కారం దక్కాయి.**

# రోహిణి ఐ.ఏ.ఎస్



తటవర్తి నాగేశ్వరి

9989773549

"త్వరగా పోనివ్వు ముత్యాలు.. వాళ్లు వెయిట్ చేస్తూ ఉంటారు" అన్నది సోషల్ వెల్ఫేర్ కమిషనర్ రోహిణి.

"సరే.. అమ్మగారూ!" అంటూ కారు స్పీడ్ పెంచాడు ముత్యాలు.

ఏసీ ఆఫ్ చేయమని చెప్పి.. కార్ విండో ఓపెన్ చేసింది. టేకు చెట్ల మీదినుంచి చల్లటి గాలి వీస్తున్నది. బాసర చేరే సరికి మధ్యాహ్నం దాటింది. అప్పటికే అక్కడ మహిళలు గుమిగూడి ఉన్నారు. కారు దిగగానే.. ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సదానందం, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ మార్కస్.. రోహిణికి బొకేతో స్వాగతం పలికారు. అక్కడ ఉన్న మహిళలు గౌరవప్రదంగా లేచి నిల్చున్నారు. రోహిణి దగ్గరికి వచ్చి లబ్ధిదారుల జాబితా చూపిస్తూ..

"వీళ్లలో చాలామందికి ఇంతకుముందే రుణాలు ఇచ్చాం మేడమ్" అని ఏదో చెప్పబోయాడు ఈడీ.

"ఆ రుణాలు కట్టలేదా?" అడిగింది.

"గత ప్రభుత్వం రద్దు చేసిందమ్మా" అన్నాడు డిప్యూటీ డైరెక్టర్.

"మరి పాత రుణాలను ఎందుకు గుర్తుచేస్తున్నారు?" అడిగింది.. ఈడీని చూస్తూ.

"ప్రతి ఏడాది కొత్త కమిషనర్ రావడం.. రుణమేళా ఏర్పాటు చేయడం.. ఆనవాయితీగా మారింది తప్పా, వీళ్ల జీవితంలో మార్పు లేదమ్మా! అదే తమకు చెప్ప

బోతున్నా!" చెప్పాడు ఈడీ.

"మనం తెద్దాం..! వీళ్లు గౌరవప్రదంగా బతకడమేకదా మనకు కావాల్సింది" అన్నది రోహిణి.

"మమ్మల్ని మనుషులుగా ఎవరు చూస్తున్నారు మేడం? సెక్స్ వర్కర్ల లెక్క. అధికారుల నుంచి ఊళ్లో మోతుబరుల వరకూ.. అందరూ అలాగే చూస్తున్నారు" అన్నది వాళ్లలో ఓ అమ్మాయి.

అందం, తెలివి పోటీ పడినట్టున్న ఆ అమ్మాయిని చూస్తూ..

"నువ్వు చదువుకున్నావా?" అడిగింది రోహిణి.

"డిగ్రీ డిస్‌కంటిన్యూ.. మేడం!".

"ఎందుకలా?".

"ఇంటర్ దాకా చదవడమే మాకు చాలా గొప్ప మేడం. రెండో తరగతిలో మొదలయ్యే హేళన.. కొన

సాగుతూనే ఉంటుంది. ఆ ఎగతాళి భరించలేక కూలీకి వెళ్లి బతుకుతుంటాం. మా జీవితాలు ఇలాగే రాలిపోతుంటాయి".. కళ్లలో నీళ్లు ఉబికి వస్తున్నాయి.

రోహిణి కళ్లూ.. అరుణిమ దాల్చాయి.

"ఏమని హేళన చేస్తుంటారు మిమ్మల్ని?"..

పీఏ రామ్మూర్తి ఎంటరై చొరవగా అడిగాడు.

"ఒకడు.. 'మీ నాన్న ఎవడే?' అని అడుగుతాడు. ఇంకొకడు.. 'నీకు నాన్న ఎవరో తెలీదు కదా!?' అంటాడు.." ఇంకా చెప్పబోతుంటే, రోహిణి అడ్డుకొని..

"ఐ నో.. నాకు తెలుసు. మీ అవమానాల జాబితా నా దగ్గర కూడా ఉంది. మీరు చేయని తప్పులకు మీరు గిల్టీగా ఫీలవ్వాల్సిన అవసరం లేదు. మీరెవరూ చదువులు మానకండి" అన్నది రోహిణి.

తన ఎదురుగా ఉన్న ఆ అమ్మాయి కళ్లలోకి చూస్తూ..

"నువ్వు స్టడీస్ కంప్లీట్ చెయ్.. నేను సపోర్ట్ ఏర్పాటు చేస్తాను" అని చెప్పింది రోహిణి.

"ఇలా చాలామంది చెప్పి పోతుంటారు. ఈ కాలనీలో డిగ్రీ వరకు వచ్చింది ఈ పిల్లొక్కతే. ఏటికి ఎదురీదుతున్నది" అన్నది అక్కడున్న ఓ మహిళ.

"నీ పేరు ఏంటమ్మా?" అడిగింది రోహిణి.

"సాయమ్మ!" చెప్పిందామె.

ఆమె వైపు చూస్తూ%౯ా

%"సాయమ్మా! నేను ఇంకో గంట ఇక్కడే ఉంటా కదా. ఈ అమ్మాయిని బట్టలు సర్దుకొని రెడీగా ఉండమను. నేనే తీసుకెళ్లి చదివిస్తా" చెప్పింది రోహిణి.

నమ్మశక్యం కానట్టు చూసింది ఆ అమ్మాయి.

అక్కడ గుమిగూడిన జనం దిక్కు తిరిగి..

"జోగిని వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసి చాలాకాలమైంది. మీ జీవితాల్లో మార్పుకోసమే ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. ఇక ఎవరూ మీ పిల్లల్ని జోగినిగా మార్చాల్సిన పనిలేదు. మీకు నచ్చిన వృత్తిని మీరు ఎంపిక చేసుకోండి. మిమ్మల్ని ఎవరైనా ఇష్టపడితే

నిరభ్యంతరంగా పెళ్లి చేసుకోండి. అందుకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం కూడా కొంత డబ్బు ఇస్తుంది. ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తుంది. మిగతా వాళ్లలాగే మీరంతా పిల్లాపాపలతో సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను" చెప్పింది రోహిణి.

ఒక్కసారిగా హర్ష ధ్వానాలు మిన్నంటాయి.

తిరుగు ప్రయాణంలో తనతోపాటు తీసుకెళ్లాలనుకున్న అమ్మాయి తల్లి బసంతిని కలిసింది. అనారోగ్యంతో మంచంపైన పడుకొని ఉన్న ఆమెవైపు చూస్తూ..

"మీరు దిగులు పడకండి. మీ అమ్మాయిని పెద్ద

ఆఫీసర్ని చేస్తాను" హామీ ఇచ్చింది రోహిణి.

బలహీన దేహంతోనే పైకి లేచి, రోహిణి కాళ్ల మీద పడినంత పనిచేసింది బసంతి.

అక్కడినుంచి కదిలి, ఆ అమ్మాయిని తన కారులో ఎక్కించుకొంది.

"ఇంతకీ నీ పేరేంటి?" అని అడిగింది రోహిణి.

"హాసిని".

"గుడ్ నేమ్".

"మా అమ్మతో ఎవరో ఒక పెద్ద

మనిషి జత కడితే నేను పుట్టానట. ఒకరోజు అతను అమ్మ దగ్గరికి వచ్చి, ఈ పేరు పెట్టమని చెప్పి.. పదివేలు ఇచ్చి వెళ్లాడట. ఆయన సుహాసినిగారి ఫ్యాన్ అట. మళ్లీ అతను మా అమ్మ కంటికి కనిపించలేదు!".. చెప్పింది హాసిని నవ్వూ.. దిగులూ కలగలసిన చూపుతో.

నాలుగున్నర గంటల ప్రయాణం తర్వాత.. కారు హైదరాబాద్‌లో రోహిణి ఇంటి ముందు ఆగింది.

భార్య వెంట వచ్చిన హాసినిని చూసి.. రఘోత్తమ్ భృకుటి ముడిపడింది.

"ఏంటి అలా చూస్తున్నారు?" అడిగింది రోహిణి.

“ఇప్పుడే టీవీలో చూస్తున్నానోయ్.. నీ ఘనకార్యం” అన్నాడు రఘోత్తమ్.

భర్తను హాసినికి పరిచయం చేసి..

“హాసినీ.. అది నీ గది. వెళ్లి ఫ్రెషప్ కా!”.. అన్నది ఒక గదిని చూపిస్తూ.

హాసిని బిడియంగా ఆ గదిలోకి నడిచింది.

భార్యవైపు చూస్తూ..

“ఇది మీడియాకి స్పెషల్ న్యూస్ అయ్యింది. ఒక జోగిని అమ్మాయిని కమిషనర్ అడాప్ట్ చేసుకొన్నారని న్యూస్ టెలికాస్ట్ చేశారు” చెప్పాడు.

“సారీ.. తను జోగిని కాదు” అన్నది రోహిణి.

“అఫ్‌కోర్స్! రెస్క్యూ హెరీమ్స్ ఉన్నాయి కదా.. అక్కడ వదిలి రాలేకపోయావా?”.

“నేరుగా అక్కడికి పంపిస్తే ఆ అమ్మాయి అడ్జస్ట్ అవ్వాలి కదా! ఉండనీయండి మనతో కొద్దిరోజులు”.

“ఓకే మేడం! మీ మాట మేం ఎలా కాదనగలం?”.

కాసేపటికి.. హాసిని స్నానం చేసి వచ్చింది. డైనింగ్ టేబుల్ దగ్గర హాసినికి స్వయంగా వడ్డించింది

కమిషనర్.

“హాసినిని మంచి కాలేజీలో చేర్పించి, మంచి హాస్టల్లో అకామిడేషన్ ఏర్పాటు చేద్దాం” చెప్పాడు

రఘోత్తమ్.

“నాకు కిచెన్‌లో కాస్త జాగా ఇవ్వమ్మా చాలు. నేను ప్రైవేటుగా డిగ్రీ పూర్తి చేసుకుంటాను” అన్నది హాసిని.

“నిన్ను తెచ్చిందే కాలేజీలో చేర్పించడానికి.. కదా హాసినీ!” అన్నాడు రఘోత్తమ్.

హాసిని భయంగా చూసింది.

“వద్దమ్మా.. నన్ను జోగినీ పిల్ల అని ఎగతాళి చేస్తారు”.

“వాళ్లకు ఎవరు చెబుతారు? నువ్వు కూడా చెప్పకు”.

“మీరు నన్ను చదివించడానికి బాసర నుంచి తెచ్చినట్టు ఇప్పటికే మీడియాలో వచ్చింది కదమ్మా!”.

“భయపడకు హాసినీ.. కాలేజీలో ఎవరైనా టీజ్ చేస్తే, నాకు కాల్ చెయ్. జీవితంలో మళ్లీ వాడు రోడ్డుమీద నడవకుండా చేస్తాను” అన్నాడు రఘోత్తమ్.

“నాకోసం గొడవలెందుకు సార్?”.

“హాసినీ.. సొసైటీలో అందరితోపాటే నీకూ సమాన హక్కులు ఉన్నాయ్. నువ్విలా అధైర్యపడితే ఎలా?”.. ధైర్యం చెప్పింది రోహిణి.

డిన్నర్ తర్వాత తమ గదిలోకి వెళ్లారు భార్యాభర్తలు. గదిలో వాతావరణం గంభీరంగా ఉంది. బయట వర్షం వస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. చల్లటి గాలి ముఖానికి తగలడంతో కిటికీ వేయడానికి వెళ్లిన రోహిణి.. కిటికీలోంచి బయటికి చూస్తూ అలాగే నిల్చుండి పోయింది.

"ఏంట్రా! అలా నిల్చుండిపోయావ్?" అడిగాడు రఘోత్తమ్.

"మావయ్యగారు గుర్తొస్తున్నారండీ".

"నాన్నను నాకంటే నువ్వే ఎక్కువ గుర్తు చేసుకుంటావ్ రోహిణీ".

"ఒక అనాథను తీర్చిదిద్ది.. తన కోడలిగా కూడా చేసుకున్నారు కదా!".

"అమ్మానాన్న లేని వాళ్లందరూ అనాథలేనా? మనం భూమ్మీద కొచ్చినప్పటినుంచీ ప్రకృతి సదా మనకు తోడుగానే ఉంటుంది" చెప్పాడు రఘోత్తమ్.

"అమ్మెవరో తెలీదు. నాన్న ఎవరో తెలీదు. ఊహ తెలిసే నాటికే ఆశ్రమంలో ఉన్నాను. నెలకొకసారి మావయ్యగారు వచ్చేవాళ్లు. 'నీ కేర్‌టేకర్ వీరేనమ్మా!' అని పరిచయం చేసింది వార్డెన్. మావయ్యగారు మంచి బట్టలు, తినుబండారాలు తీసుకొచ్చి ఇచ్చేవాళ్లు. 'నన్ను మీ ఇంటికి తీసుకెళ్లొచ్చు కదా అంకుల్' అని అడిగానోసారి.

'నిన్ను ఇంత శ్రద్ధగా చూసుకొనేవాళ్లు ఎవరూ అక్కడ ఉండరమ్మా' అని చెప్పారు.

మళ్లీ నేను అడగలేదు. డిగ్రీ పూర్తయ్యాక..

'పీజీ చేస్తావా?' అని అడిగారు.

'మీ ఇష్టం!' అన్నాను.

అప్పటికే నేను ఆశ్రమం నుంచి హాస్టల్‌కు షిఫ్ట్ అయ్యాను. అందరూ సెలవు రోజుల్లో సొంతిళ్లకు వెళ్తే.. నేను వెళ్లడానికి ఏ ఇల్లూ లేక హాస్టల్ గదిలోనే ఒక మూలన ముడుచుకొని కూర్చొనేదాన్ని. ఒకరోజు మావయ్యగారు వచ్చారు.

'సివిల్స్ కోసం నిన్ను ఢిల్లీ పంపిస్తున్నాను' అని చెప్పారు.

'నేనా?' అన్నాను ఆశ్చర్యపోతూ..

'నేకేం! నీ స్టడీ ట్రాక్ రికార్డ్ చాలా బాగుంది. నీ టాలెంట్‌కు 'సివిల్స్' సాధించడం పెద్ద కష్టమేం కాదు' అన్నారు.

ఆయన మాటలను కాదనలేదు. రెండేళ్ల తర్వాత సివిల్ సర్వీస్ సాధించాను. ఒక జిల్లాకు జాయింట్ కలెక్టర్ అయ్యాను. ఒకరోజు నా బంగ్లాకు వచ్చారు. ఆయన కాళ్లకు నేను ఎప్పట్లా నమస్కారం చేశాను. నా భుజాలు పట్టి పైకి లేపి..

'నీకు పెళ్లి కళ వచ్చిందమ్మా!' అన్నారు.

మీ ఫొటో చూపించి..

'నాకొడుకు రఘోత్తమ్. ఐఐటీ కాన్పూర్‌లో ఎంటెక్ చేశాడు. నా ఆరోగ్యం సహకరించడం లేదని నా రాజకీయ వారసుడిగా వాణ్ని ఎన్నికల్లో నిలబెట్టాను. నిజానికి వారసత్వ రాజకీయాలు నాకు నచ్చవు. కానీ, నా కొడుకు అయితేనే గెలుస్తాడని పార్టీ పెద్దలు అనడంతో నేను మౌనం వహించక తప్పలేదు' అని చెప్పారు.

ఫొటోలో చూడగానే మీరు నాకు నచ్చారు. ఉన్నత విద్యాభ్యాసం చేసి, శాసనసభ్యులుగా ప్రజాజీవితంలో ఉన్న మిమ్మల్ని కాదనడానికి నాకు ఏ కారణం కనిపించలేదు. నాకు ఇంత మంచి జీవితాన్ని ఇచ్చిన మావయ్యగారు.. నాకు దైవ సమానులు. ఆయన మాట కాదనడం నాకు సాధ్యం కాని పని. అలా మీరు నా జీవితంలోకి వచ్చారు. మావయ్య గారిని మించిన ప్రేమ మీరు నిరంతరం చూపుతూనే ఉన్నారు. ఏనాటిదో మన బంధం. కానీ, తరచూ నేను అనాథనని గుర్తుకొస్తూ ఉంటుంది. ఈరోజు హాసినిని చూస్తే.. నా గతం అంతా నా కళ్లముందు ఒకసారి కదలాడింది. తనకూ తండ్రెవరో తెలీదు.. నాకూ నా తండ్రి ఎవరో తెలీదు".. చెప్పడం ఆపింది రోహిణి. ఆమె కళ్లలో కన్నీళ్లు. కదిలిపోయాడు రఘోత్తమ్.

"నువ్వు అనాథవి కాదు రోహిణీ? నీకు నేనున్నా" అన్నాడు. భర్త నుదుటిని ముద్దాడింది రోహిణి.

"హాసిని లాంటి వారికి మన సపోర్ట్ ఎప్పుడూ ఉంటుంది.." అన్నాడు ఆమెను దగ్గరికి తీసుకుంటూ.

రోహిణి అతని గుండెలపై తల పెట్టింది.

"మావయ్యగారు తన ఆఖరి రోజుల్లో నా దగ్గర ఒక మాట తీసుకున్నారు".

"ఏ విషయంలో?".

"జోగిని వ్యవస్థను సమూలంగా తుడిచేయాలని ఆయనెప్పుడూ చెబుతుండేవారు. 'ఒక సివిల్

సర్వెంట్‌గా వాళ్ల జీవితాల్లో వెలుగు తీసుకురావడానికి నువ్వు పని చేయాలి తల్లీ!' అని చెప్పారు. అందుకే.. నేను ఏరి కోరి సోషల్ వెల్ఫేర్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నాను. రాష్ట్రవ్యాప్తంగా వాళ్ల పునరావాసం కోసం పనిచేస్తున్నాను. ఇదే మావయ్య గారికి నేనిచ్చే నివాళి అని భావిస్తున్నాను. హాసిని లాంటి తండ్రిపేరు చెప్పుకోలేని అమ్మాయిలు, తండ్రెవరో తెలియని వాళ్లు.. ఈ సమాజంలో చాలామంది ఉన్నారు. వాళ్ల జీవితాల్లో మార్పు కోసం ప్రయత్నించాలి".. అన్నది భావోద్వేగంతో.. "తప్పకుండా!" అన్నాడు రఘోత్తమ్.

రోహిణి నిద్రపట్టక అటు వైపు తిరిగి కదలాడుతుంటే.. రఘోత్తమ్ ఇటువైపు తిరిగి ఆలోచనలో పడ్డాడు. అతనికీ నిద్రపట్టడం లేదు. లేచి వెళ్లి కిటికీ దగ్గర నిల్చున్నాడు. చల్లటి

జల్లు కురుస్తూనే ఉంది.

'అనాథ అన్న ఫీలింగే రోహిణిని దహించి వేస్తున్నది. ఇంక తన జన్మరహస్యం తెలిస్తే.. ఇంకా ఎంత కుంగిపోతుందో!?' అన్న ఆలోచన.. రఘోత్తమ్‌ను నలిబిలి చేస్తున్నది. ఒక్కసారిగా గతం కళ్లముందు కదలాడింది.

"ఏం మాట్లాడుతున్నారు మీరు?" అన్నది

కిరణ్మయి.

"వేరే ఎవర్ని చేసుకున్నా.. తన లైఫ్ చాలా డిస్టర్బ్ అవుతుంది.." అంటూ ఆగాడు సర్వోత్తమ్ రావు.

"ఏదో దిక్కులేని పిల్లను దేశోద్ధారకుడిలా చదివిస్తున్నారంటే.. చూసీ చూడకుండా వదిలేశాను. ఇప్పుడు 'ఇంటికి కోడలిగా తెస్తా' అంటే, ఎలా ఊరుకుంటాను?".. కిరణ్మయి హూంకరించింది.

"తను ఇప్పుడు ఐఏఎస్ ఆఫీసర్. అనాథ కాదు".

"నా కొడుక్కు ఏ ఆఫీసర్ అవసరం లేదు. జనం పేరుతో వాడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసి, రాజకీయాల్లోకి దింపారు. ఇప్పుడు వాడి వ్యక్తిగత జీవితం కూడా నాశనం చేస్తారా?".

కిరణ్మయి తన మాట వినేలా లేదని అతనికి అర్థమైంది. తీవ్రమైన మానసిక వ్యధతో.. సర్వోత్తమ్ రావుకు గుండెపోటు వచ్చింది. డాక్టర్లు ఆపరేషన్ అవసరం అన్నారు. ఆపరేషన్‌కు వెళ్లేముందు కొడుకును పిలిచాడు. ఒక నిమిషం ఇద్దరి మధ్య మౌనం నడిచింది.

"ఏంటి నాన్నా! ఇంత మథన పడుతున్నారు?"

అడిగాడు రఘోత్తమ్.

"రోహిణిని పెళ్లి చేసుకోరా!".

"అమ్మా, మీరూ మాట్లాడుకోవడం నేను విన్నాను నాన్నా. నాలాంటి పొలిటీషియన్‌ని పెళ్లి చేసుకోవడానికి తనే ఆలోచించాలి".

"నీకేం రా.. నువ్వు బంగారానివి".

"ముందు మీరు ఆపరేషన్‌కు వెళ్లి రండి నాన్నా".

"ఆ ఆపరేషన్ టేబుల్‌పైనే ప్రాణాలు పోయినవాళ్లు చాలామంది ఉన్నారు. నాకు మాటివ్వు.." అంటూ చెయ్యి చాపాడు సర్వోత్తమ్ రావు.

"మీరు తనకు చారిటీ చేశారని తెలుసు నాన్నా! బట్.. నౌ షీ ఈజ్ యాన్ ఆఫీసర్. బలవంతంగా మన నిర్ణయాలు అవతలి వాళ్లపై రుద్దకూడదు కదా నాన్నా!?".

కొడుకు వైపు అదోలా చూశాడు.

"తనకు అభ్యంతరం లేకపోతే నేను సంతోషంగా చేసుకుంటాను నాన్నా! కానీ, నాదో సందేహం".. అంటూ ఆగాడు రఘోత్తమ్.

'ఏంట్రా?' అన్నట్టు చూశాడు తండ్రి.

"తను ఇప్పుడు పెద్ద ఆఫీసర్. ఆమె కులాన్ని, మతాన్ని చూడకుండా ఎవరైనా చేసుకుంటారు. అలాంటిది.. మన ఇంటికి కోడలుగా రావాలని ఎందుకు పట్టుబడుతున్నారో తెలుసుకోవచ్చా?" అడిగాడు.

ఒక నిమిషం తటపటాయించాడు సర్వోత్తమ్ రావు.

"తన గురించి ఒక రహస్యం నాకు మాత్రమే తెలుసురా! అది ఏ రోజైనా ఒక ప్రశ్నగా మారొచ్చు. ఏ మార్గంలోనైనా బయటికి వస్తే.. ఈ పురుషాధిక్య సమాజంలో తన వివాహ జీవితం దెబ్బతింటుందని నేను భయపడుతున్నాను" చెప్పాడు సర్వోత్తమ్ రావు.

ఆసక్తిగా తండ్రి ముఖంలోకి చూస్తూ..

"ఏంటి నాన్నా.. ఆ రహస్యం?" అడిగాడు

రఘోత్తమ్.

కొడుకు కళ్లలోకి చూస్తూ..

"మీ నాన్న ఇంతకాలం బయట తిరుగుతున్నాడంటే.. అది రోహిణి తల్లి దయేరా" అన్నాడు.

ఇంకా ఆశ్చర్యపోయాడు రఘోత్తమ్.

"అవును రా! ఆ రోజు నేనే స్వయంగా జీపు నడుపుకొంటూ ఓ గూడేనికి వెళ్లాను. తిరిగి వెనక్కి వచ్చే సమయానికి చీకటిపడింది. జీపు లైట్లు కూడా సరిగ్గా వెలగడం లేదు. ఊరి పొలిమేర దాటగానే.. గడ్డిమోపు నెత్తిన పెట్టుకొని ఒక మహిళ రోడ్డు పైకి వచ్చింది. నేను ఆమెను గమనించలేదు. జీపు తగిలి కిందపడి తీవ్రంగా గాయపడింది. తను నిండు గర్భిణి. నా ముఖంలో కంగారు చూసి.. 'మీరు కావాలని నాకు బండి తాకించలేదు కదా దొరా! ఈ దెబ్బలతో నన్ను గూడెంలోకి తీసుకెళ్తే.. మావాళ్లు కోపంలో మిమ్మల్ని కొట్టి చంపినా ఆశ్చర్యంలేదు. నన్ను బేగిన దవాఖానకు తీసుకెళ్లండి దొరా!' అని వేడుకుంది. వెన్నులో చలీ, జ్వరం మొదలైంది. ఎలాగోలా హాస్పిటల్‌కు తీసుకెళ్లేసరికి రక్తం చాలాపోయింది. ఎవరో ఒకర్నే బతికించే అవకాశం ఉందని చెప్పారు డాక్టర్లు. కొన ఊపిరితో ఉన్న ఆమెకు విషయం చెప్పాను. 'నన్ను బతికించక పోయినా సరే.. నా బిడ్డను మాత్రం బతికించండి' అని వేడుకుంది. యాక్సిడెంట్ కేసు కావడంతో హాస్పిటల్ సిబ్బంది ఇచ్చిన కంప్లయింట్‌తో

అప్పటికే పోలీసులు వచ్చారు. ఆ నిమిషం.. నా వల్లే ప్రమాదం జరిగిందని తను

చెప్పి ఉంటే, జైల్లోకెళ్లి ఊచలు లెక్కపెట్టుకొనే వాణ్ని. ఎవరో రోడ్డుమీద బండితో గుద్దేసి పోతే.. నేనే కాపాడి తీసుకొచ్చి, దవాఖానలో చేర్చానని చెప్పింది. తన పేరు, ఊరు.. ఏ వివరాలు కూడా చెప్పలేదు. ఆపరేషన్ థియేటర్లోకి పోయే కాసేపటి ముందు..

'మీ ఆయన పేరు చెప్పమ్మా! నీకేమైనా అయితే నీ బిడ్డను తండ్రి దగ్గరికి చేరుస్తా' అన్నాను.

కళ్లలో ఊపిరి నిలుపుకొన్న ఆమె ఎగశ్వాసతో..

'మా బిడ్డలకు తండ్రులెవరో మాకే తెలియదు దొరా! మావి ఊరుమ్మడి బతుకులు.. నేను జోగినిని' అన్నది.

షాక్ అయ్యాను.

'నా బిడ్డను మళ్లీ మా గూడానికి చేర్చమాకు దొరా! ఆడపిల్ల పుడితే దాన్ని కూడా మావాళ్లు జోగినిగా మారుస్తారు. ఎక్కడైనా అనాథాశ్రమంలో చేర్పించి పుణ్యం కట్టుకోండి' అని నా చేతులు పట్టుకుంది. ఆపరేషన్ థియేటర్లోకి వెళ్లిన ఆమె.. మళ్లీ బయటికి రాలేదు"..

సర్వోత్తమ్ కళ్లలో నీళ్లు..

"ఆ బిడ్డను ఇంటికి తీసుకు రావడానికి మీ అమ్మ ఒప్పుకోదని తెలుసు. పైగా లేనిపోని అభాండాలు వేస్తుంది. నెత్తుటిగుడ్డుని హాస్పిటల్‌లోనే ఉంచి.. ఆమె శవాన్ని పోలీసుల సాయంతో ఖననం చేయించాను. నాకు తెలిసిన ఆశ్రమంలో పసికందును చేర్చాను. ఆ గిల్టీ ఫీలింగ్ ఇప్పటికీ నన్ను దహించి వేస్తూనే ఉంది. ఇప్పటి వరకూ ఆమె జన్మరహస్యం ఎవరికీ చెప్పలేదు. రోహిణికి చెబితే తల్లిని యాక్సిడెంట్ చేసి చంపిన వ్యక్తిగా.. నన్ను అసహ్యించుకుంటుందేమోనని భయం. పైగా విషయం మన ప్రత్యర్థులకు చేరితే.. రాజకీయ జీవితం సమాధి అవుతుందేమోనని మరో భయం. మనం రోహిణికీ, ఆమె తల్లికీ రుణపడి ఉన్నాం నాయనా! ఈ విషయాలేవీ మీ అమ్మకు తెలియవు. ఒక దుర్మార్గ పూరిత వ్యవస్థకు రోహిణి తల్లి బలైంది. మన వల్లే రోహిణి అనాథగా మారింది. తను తెలివైన అమ్మాయి మాత్రమే కాదు. ఉన్నత సంస్కారవంతురాలు. మనం అండగా ఉండాలి. మన ఇంటి కోడలిగా చేసుకుని కాపాడుకోవాలి!"..

చెప్పడం ఆపాడు సర్వోత్తమ్ రావు. అప్రయత్నంగా తండ్రి చేతిలో చేయి వేశాడు రఘోత్తమ్.

"ఏంటీ అక్కడ నిల్చొన్నారు?".. రోహిణి మాటలతో గతంలోంచి బయటపడ్డాడు రఘోత్తమ్.

వెనక్కి తిరిగి, ఆమె ముఖంలోకి చూస్తూ..

"ఎందుకో నిద్ర పట్టలేదు రోహిణీ!" అన్నాడు.

"హాసిని గురించి ఆలోచిస్తున్నారా?" అడిగింది.

"అవును. తనను కూడా నీకులానే మంచి ఆఫీసర్‌ని చేయాలి" అన్నాడు స్థిర సంకల్పంతో.

"మిమ్మల్ని చూస్తుంటే మావయ్యే గుర్తొస్తున్నారు".. అంటున్న రోహిణి ఐఏఎస్ పెదవులపై.. సంతోషంతో కూడుకున్న చిరునవ్వు మొలిచింది.

మరుసటి రోజు.. హాసినిని దత్తత తీసుకుంటున్నట్టు మీడియాలో ప్రకటించాడు రఘోత్తమ్.

# తటవర్తి నాగేశ్వరి

**తటవర్తి నాగేశ్వరి స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా గౌరవరం. ఎంఏ (తెలుగు) చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో మేనేజర్‌గా పదవీ విరమణ పొందారు. 2012 నుంచి కథలు రాస్తున్నారు. మొదటి కథ.. 'తదనంతరం' ఆంధ్రజ్యోతి 'నవ్య' వీక్లీలో ప్రచురితమైంది. 'దాడి' కథ.. రమ్యభారతి సాహిత్య మాస పత్రిక నిర్వహించిన కథల పోటీలో బహుమతి దక్కించుకున్నది. శ్రీకళ్లేపల్లి వెంకటశాస్త్రి శత జయంతి పురస్కార కథల పోటీలో 'నవ్వు నవ్వించు' కథకు బహుమతి అందుకున్నారు. మొదటి నవల 'మమజీవన హేతునా'.. 'స్వాతి' మాస పత్రికలో అనుబంధ నవలగా ప్రచురితమైంది. 'నవ్య' వీక్లీ, 'తురగా' ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన పోటీలో 'కల్కి' సీరియల్‌కు తృతీయ బహుమతి గెలుచుకున్నారు. వివిధ పత్రికలు, సాహితీ సంస్థలు నిర్వహించిన కథల పోటీల్లో సంధ్యారాగం, సత్యభామ, గురి, అమ్మరుణం, అమ్మకోసం తదితర కథలకు బహుమతులు అందుకున్నారు.**

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 452

# జీవన తీరాలు



బద్రి నర్సన్,
**9440128169**

“పప్పా .. హమ్ కాలేజ్ జావ్ చూ.. అంటూ తను కాలేజీ వెళ్తున్నానని రాజేశంకు చెబుతూ సుభద్ర సైకిలెక్కి బయలుదేరింది. ‘ తే బరా బరా చే..’ అంటూ గుజరాతీలో సరేనమ్మా అని కూతురుకి బదులిచ్చాడు రాజేశం. అసలుకు రాజేశం సొంతూరు వరంగల్ దగ్గరి శంభునిపేట. కట్టుబట్టలతో ఊరును వదిలిపెట్టి సూరత్ లో అడుగు పెట్టి ఇప్పటికి ఇరువై రెండు ఏండ్లయితాంది. అప్పుడాయన వయసు ఇరువై ఏండ్లు. వచ్చిన నాల్రోజులకే డైమండ్ నగర్ లోని ఓ బట్టల మిల్లులో పని దొరికింది. రోజుకు పన్నెండు గంటల పని. మిల్లు పక్కనే ఉన్న కిరాయి గదిలో కూడా పగలో రాత్రో పన్నెండు గంటలు మాత్రమే ఉండచ్చు. పనిలో ఉన్నా, పడుకున్నా మగ్గాల టక టక చప్పుడు మాత్రం చెవుల దగ్గరే ఉంటది. ఇప్పుడు ఒడిశా కార్మికులు ఉండే కిస్మత్ కాలనిలో నివాసం. రాజేశం భార్య పేరు దీపాలి బెహరా.

ఆమె ఒడిశాలో పుట్టి పెరిగింది. రాజేశం దీప అని పిలుస్తాడు. రాజేశంకు ఒక్కతే బిడ్డ. కొడుకుల్లేరు. ఆయన తల్లి పేరు భద్రమ్మ. ఆ పేరు కలిసేలా బిడ్డకు ఈ పేరు పెట్టాడు. సుభద్ర ఇప్పుడు బి ఎ చదువుతోంది. ఇన్నేండ్లు ఇంటి ముచ్చట తెలువకుంటనే బతుకుతున్నాడు. లేక లేక పుట్టిన కొడుకు ఎటు పోయిండో ఆ తల్లికి తెలియదు. తల్లి బతికి ఉందో లేదో కొడుక్కి తెలియదు. అప్పటికే తల్లి అరవై ఏండ్లామె. ఇప్పటికి బతికి ఉండే అవకాశం లేదని మల్లేశం మనసులోనే తల్లిని తలచుకొంటూ బాధ పడుతూ ఉంటాడు. అక్క సుగుణ తన కన్నా ఐదేండ్లు పెద్దది. పెండ్లయింది. రాజేశం ఊరిడిసేనాటికి సుగుణకు రెండేండ్ల వయసు కొడుకు ఉండె. అక్కంటే రాజేశంకు ఎంతో ఇష్టం. అల్లుణ్ణి ఎత్తుకొని ఆడుకున్న రోజులు ఇంకా గుర్తున్నయి. తల్లి మాదిరే అక్క కూడా తన కోసం ఏడ్చి ఏడ్చి ఊర్కున్నదేమో అని దిగులు పడుతుంటాడు. ఈ బాధలన్నీ తనకే కానీ దీపకు, సుభద్రకు ఏమి తెలియదు. దీప దృష్టిలో ఆయనొక అనాథ. సూరత్ లనే పుట్టి గుజరాతీ పిల్లలా పెరిగిన సుభద్ర తానొక వలస కార్మిక కుటుంబపు పిల్లను అనుకుంటుంది. దీపాలి తండ్రి సూర్యకాంత్. ఒడిశా నుండి ఎప్పుడో వచ్చి మిల్లు పనిలో చేరాడు.. ఆమె తల్లి చిన్నప్పుడే కాలం చేసింది. సూర్యకాంత్ అనారోగ్యంతో చనిపోతే సేట్లు ఎలాంటి పరిహారం ఇచ్చేందుకు ముందు ఒప్పుకోలేదు. మిల్లులో కాక ఇంట్లో చచ్చిపోతే పైసా ఇయ్యమని అన్నారు. సమ్మె నోటీసు ఇచ్చినంక వాళ్లు దిగి రాక తప్పలేదు.. అప్పుడు యూనియన్ లీడర్ గా ఉన్న రాజేశంకు దీప పరిచయమైంది. ఆమె ముఖంలో సూర్యకాంతే దీనంగా కనబడ్డాడు. ఒంటరిగా ఎలా బతుకుతుందని ఇంటికి తెచ్చుకొని ఇల్లాల్ని చేసుకున్నాడు.

రాజేశంకు తాను ఊర్లో విన్న ఆనాటి చివరి తెలుగు మాటలు ఇంకా గుర్తున్నాయి.

'పోరండ్ల రాజేశం ఇల్లెక్కడ?' ఒక గొంతు మెల్లగా అడుగుతోంది.

అప్పుడు రాత్రి ఒంటిగంట దాటింది. ఆ మాటకు అరుగు మీదనే పడుకున్న రాజేశంకు తెలివైంది. బేల్ కట్ పట్టీల పొక్కల్లోంచి బయటికి చూసిండు. బయట మంచంల పడుకున్న లచ్చన్నను లేపి అడుగుతున్నారు.

'కాలేజీల చదువుకుంటాడు..' అని ఇంకో ఆయన ప్రశ్న.

వెంటనే రాజేశం లేచి డ్రెస్ సంకలపెట్టుకొని ఇంటెనుక తలుపు తీసుకోని బయటకొచ్చి పక్కింటి పరారీ గోడ దుంకి చింతకింది మూలకు చీకట్ల ఉన్న పాయిఖానాల దాక్కున్నాడు. పెరట్ల లైట్ వెలిగింది. తెరిచిన చిన్న తలుపులోంచి ఇద్దరు సివిల్ డ్రెస్ లో ఉన్న కానిస్టేబుళ్లు బయటికి వచ్చినారు. అటు ఇటు వెదికి కోపంగా బూతులు తిడుతూ వెళ్లిపోయారు. కొద్దిసేపు ఆగి చీకట్లనే ఊరు దాటిండు. తల్లిని కలవాలని ఉన్నా ఏ ప్రమాదం పొంచి ఉందోనని భయపడ్డాడు.

బిఎ చదువుతున్న రాజేశం ఇట్లా ప్రాణభయంతో ఊరు దాటడానికి

కారణమేమిటంటే ఆ రోజు ఓ కాలేజీ స్టూడెంట్ హత్య జరిగింది. కాలేజీలో రెండు యూనియన్లు ఉండేవి . రెండింటి మధ్య ఎప్పుడు కొట్లాటలే. పొద్దున్నే రూములో వ్యాయాయం చేస్తున్న విద్యార్థిని కొట్టడానికి వెళితే అది ఆయన చావు దాక వెళ్ళింది. రాజేశం దాడి చేసిన వారి పక్షం. తాను రూములోకి వెళ్ళలేదు కానీ బయట సైకిల్ మీద ఉన్నాడు. కొట్టి బయటకు రాంగానే ఒకణ్ణి సైకిలుపై ఎక్కుంచుక పోయిండు. అంటే దాడి చేసిన వారిలో ఒకడు అన్నట్లే.

అదే రోజు ఒంటి గంటకు కాలేజీ గేట్ దగ్గరికి పోలీసులు వచ్చినారు. బయటికెళు తున్న స్టూడెంట్స్ నుంచి ఇద్దరిని పట్టుకొని అందరి ముందే బట్టలూడదీసి కట్ డ్రాయర్ మీదుంచి కొట్టుకుంటూ, తన్నుకుంటూ పట్టుకు పోయారు. వారి వెనుకే రాజేశం ఉన్నాడు. పోలీసులు తనను చూసి కూడా వదిలేసేసరికి ఊపిరి పీల్చుకున్నాడు. అయితే ఊహించని రీతిలో పోలీసులు అర్ధ రాత్రి ఇంటికి రావడంతో కథ మారిపోయింది.

అయితే రాజేశంకు తెలియని అసలు సంగతి మరోటుంది. ఆ రోజు ముందటి రాత్రి హసన్ పర్తిలో నక్సలైట్లు ఓ భూస్వామిని చంపేశారు. వచ్చిన దళంలో ఒకరు 'రాజేశం..కానియ్' అన్నారని, అ వెంటనే తుపాకీ పేల్చిన చప్పుడచ్చిందని విన్నవారు పోలీసులకు చెప్పారు. ఆ మాట ఈ రాజేశం మెడకు చుట్టుకుంది. దానికి కూడా ఒక బలమైన నేపథ్యముంది.

అదేమిటంటే– రాజేశంకు పాటలంటే మహా ఇష్టం. మంచిగా పాడుతాడు కూడా. ఆ పాటలు విన్న తెలుగు లెక్చరర్ ఓ రోజు ఇంటికి తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ మరో పది మంది స్టూడెంట్స్ ఉన్నారు.

లెక్చరర్ మాట్లాడుతూ 'ఈ వేసవి సెలవుల్లో మీరంతా గ్రామాలకు తరలండి ప్రోగ్రాం లో పాల్గొనాలి. ఊర్లలో వెట్టి చాకిరీ, తక్కువ కూలీరేట్లు కొనసాగుతున్నాయి. వీటికి వ్యతిరేకంగా పోరాడేందుకు గ్రామాల్లో సంఘాలు ఏర్పడాలి. గ్రామస్తులకు ఈ విషయాలన్నీ వివరించేందుకు ఊర్లలో అక్కడక్కడా మీరు మీటింగులు పెట్టాలి.. మీరు హసన్ పర్తి వెళ్ళాలి. అదే ఊర్లో దళితవాడల్లో తింటూ పడుకోవాలి. మన రాజేశం మంచి పాటగాడు.. ఊర్లలో పాడే పాటల పుస్తం ఆయనకు ఇస్తా.. ప్రాక్టీస్ చేస్తాడు. స్పీచ్ లు ఇచ్చేవాళ్లకు నేను ట్రైనింగ్ ఇస్తాను. సరేనా..' అన్నాడు

అసలు టైముకు సగం మంది జారుకున్నారు. మిగిలిన అయిదుగురు చిన్న సంచుల్లో బట్టలు సర్దుకొని హసన్ పర్తికి వెళ్లారు. వారిలో రాజేశం ఒకడు. పోయిన రోజే హోటల్ దగ్గర చాయ్ తాగుతూ అక్కడున్నవారితో తాము వచ్చిన పని గురించి చెప్పారు. కొందరు ఆసక్తిగా విన్నారు, కొందరు సరే బాగుందన్నారు. వచ్చిన పని తొందరగానే లైన్లో పడిందని వారిలో హుషారు పెరిగింది. రాజేశం ఆగలేక ఒక పాటెత్తుకున్నాడు. మరింత మంది గుమికూడారు. పొద్దు గుంకినంక మా వాడల మీటింగ్ పెట్టుండ్రని కొందరు

ముందుకొచ్చారు. ఇదంతా జరిగిన గంటకే వీరికోసమే అన్నట్లు పోలీసు జీపు వచ్చి ఎదురుగా, అడ్డంగా ఆగింది. దాన్ని చూడగానే భయపడిపోయి తలో దారి పరుగు తీశారు. పోలీసులు వెంటపడి ముగ్గురిని పట్టుకున్నారు. చిక్కినవారిలో రాజేశం ఒకడు. వీరి సంచుల్లో ఉన్న పుస్తకాలను చూసి స్టేషన్ కు తీసుకొనిపోయారు. రెండు రోజులు పగలు రాత్రి లాకప్ లో పోలీస్ మర్యాదలు. అయినా లెక్చరర్ పంపాడని చెప్పలేదు. మరునాడు ఓ అడ్వొకేట్ వచ్చి వారిని విడిపించుకు వెళ్ళాడు. పోలీసులు ఈ ముగ్గురి వివరాలు, ఫోటోలు, వేలు ముద్రలు తీసుకున్నారు. ఇది జరిగిన మూన్నెల్లకు హసన్ పర్తిలో భూస్వామి హత్య జరిగింది. రాజేశంకు దీనితో సంబంధం ఉందని నమ్మిన పోలీసులు ఆ రాత్రి ఇంటికి వచ్చారు. ఇలా పారిపోవడంతో రాజేశంపై హత్య కేసు నమోదు చేసి నక్సలైటుగా ముద్ర వేసి పరారీలో ఉన్నట్లు రికార్డు చేసుకున్నారు.

***

ఇక్కడ మాత్రం అది తన గతమే కానట్లు వలసకూలీగా రాజేశం బతుకు బండి సాగుతోంది. పెరుగుతున్న కూతురును చూస్తుంటే రాజేశంకు ఎప్పటినుంచో 'నీకో బావ ఉన్నడే..' అని చెప్పాలనిపిస్తుంది. బిడ్డను తన అల్లుడికిచ్చి పెళ్లి చేయాలనీ ప్రాణం కొట్టుకొంటోంది. కూతురు పుట్టకపోతే ఈ బంధాలే గుర్తుకు వచ్చేవి కాదేమో.. అక్క ఎలా ఉందో.. అల్లుడు ఎంతవాడయ్యాడో.. ఏం చేస్తున్నాడో.. అని మనసు ఇప్పుడు ఎత్తైన కొండ దాటి ఆ వైపు చూడాలని ఆశపడుతోంది. ఏదో కావాలని మనసు బలంగా కోరుకున్నప్పుడు అది ఒకవైపే ఆలోచిస్తుందనడానికి రాజేశం వేసిన అడుగే రుజువు. ఇన్నాళ్లకు ఆయన తన అక్కకు ఉత్తరం రాయాలనుకున్నాడు.

ఓ రోజు రాత్రి షిఫ్టు నుండి వస్తూ పోస్టాఫీసుకు పోయి అక్క పేరిట ఉత్తరం రాసి డబ్బాలో వేసి వచ్చాడు. ఈ విషయం ఇంట్లో ఎవరికీ చెప్పలేదు. తాను మాత్రం ఫలితాల కోసం చూసే విద్యార్థిలా జవాబు కోసం ఎదురుచూస్తున్నాడు. వారం గడిచింది.

రాత్రి ఎనిమిదింటికి డ్యూటీ చేసి వచ్చిన రాజేశం స్నానం చేసి అన్నం గిన్నె కోసం ఎదిరిచూస్తూ వాకిట్లో మంచం మీద కూచున్నాడు. మెల్లగా నడుచుకుంటూ వచ్చిన నలుగురు ఆయన ముందుకొచ్చి నిలబడ్డారు. 'నీ పేరేంది?' అని ఒకాయన అడిగాడు. ఏమాలోచించకుండా 'రాజేశం' అన్నాడు. వెంటనే నలుగురు ఆయన్ని అదిమి పట్టుకొని బయటకు తీసికెళ్లారు. 'మీరెవలు, నన్నెటు తీస్కపోతుండ్రు..' అన్నా జవాబు ఈయకుండా బయట సిద్ధంగా ఉన్న కార్లో వేసుకొన్నారు. ఆ చప్పుడు విన్న దీప పళ్లెం చేత్తో పట్టుకొని పరుగున రాగానే కదిలిపోతున్న కారు ఆమెకు కనబడింది. వెంటనే లోపలి గదిలో చదువుకుంటున్న బిడ్డకు ఈ విషయం చెప్పింది. ఇద్దరు కలిసి పోలీస్ స్టేషన్ కు పరుగుతీశారు.

ఇన్స్ పెక్టర్ తో సుభద్ర 'మారా పితనే కోయి లెయి గయు' అంది.

‘ తెలంగాణ పోలీస్ తేనే లెయ్ గయి’ అని చెప్పాడాయన.

‘సా మాటే..’ అని తీసుకుపోవడానికి కారణమడిగింది.

‘ఆమ్నే ఖబర న థీ..’ అని తెలియదన్నాడాయన.

అసలు ఈ తెలంగాణ ఏమిటి.. అక్కడి పోలీసులు ఇతన్ని తీసుకుపోవడమేమిటి.. ఏదీ తల్లీ కూతుళ్ళకు అర్థం కాలేదు. అదే రాత్రి యూనియన్ లీడర్ దగ్గరికి వెళ్లారు. తాను ఎమ్మెల్యేతో లేబర్ మినిష్టర్ ని కలిసి రాజేష్ భాయ్ ఎక్కడున్నా ఇంటికి రప్పిస్తానని ఆయన భరోసా మాట చెప్పాడు. అంతకు మించి ఏమిచేయలేని వీరు ఇంటికి తిరిగి వచ్చారు.

రాజేశం అక్కకు రాసిన ఉత్తరం శంభునిపేట పోస్టాఫీసు నుండి సుగుణ చేతికి రాకుండా సరాసరి పోలీస్ స్టేషన్ కు చేరింది. నక్సలైట్ల కట్టడి, ఆచూకీ కోసం పోలీసు నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసుకున్న యుద్ధతంత్రంలో భాగంగా ఆ ఉత్తరం యొక్క గమ్యం మారింది.

హసన్ పర్తి భూస్వామి హత్యతో పాటు పలు తీవ్రవాద సంఘటనలతో సంబంధమున్న దళసభ్యుడు రాజేశం ఇన్నాళ్లకు పోలీసులకు చిక్కాడని ఫొటోతో సహా పత్రికల్లో వార్త వచ్చింది. పొద్దున్నే పత్రికలో రాజేశం ఫోటో, వార్త చూడగానే ప్రకాష్ ‘అయ్యో.. ఇట్లయిందేమి..’ అనుకున్నాడు. ప్రకాష్ జనవాణి పత్రికలో సీనియర్ జర్నలిస్టు. చదువుకునే రోజుల్లో విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న, విలేకరిగా నక్సల్స్ వార్తలు, కథనాలు వ్రాసిన అనుభవం ఆయనది. తనకు తెలిసిన వాస్తవాన్ని చెప్పేందుకు వెంటనే పోలీస్ స్టేషన్ కు వెళ్ళాడు.

సర్కిల్ ఇన్స్ పెక్టర్ తో ‘ సార్.. ఇది నక్సలైట్ రాజేశం ఫోటో కాదు. ఈయనెవరో అమాయకుడు.’ అన్నాడు.

‘లేదయ్యా బాబు.. ఈయన మా రికార్డుల్లో తప్పించుకు తిరుగుతున్న నక్సలైట్ గా ఎప్పుడో రాసుంది. నేను కొత్తగా ఎక్కించింది కాదు.’ అని సర్కిల్ ఆయన మాట నమ్మలేదు.

‘అసలు రాజేశం కాలేజీలో నా క్లాస్ మేట్. నాకు బాగా తెలుసు. ఆయన ఊరు కేశవపట్నం. ఇప్పటికి ఆయన అన్నదమ్ములు ఆ ఊర్లోనే ఉన్నారు” అని చెప్పాడు.

‘సరే..చూద్దాం’ అంటూ సర్కిల్ ఇన్స్ పెక్టర్ ఏదో పని ఉందంటూ వెళ్ళిపోయాడు.

ప్రకాష్ సరాసరి మోటార్ సైకిల్ పై కేశవపట్నం వెళ్ళాడు. రాజేశం తమ్ముడు సుధాకర్ కు విషయం చెప్పి, ఒప్పించి ఆయన ఆధార్, ఓటర్ కార్డులు తీసుకోని తన వెంట పోలీస్ స్టేషనుకు తీసుకొచ్చాడు.

‘ సార్.. ఈయన కేశవపట్నం రాజేశం సొంత తమ్ముడు సుధాకర్ .. మీరు సూరత్ నుంచి తెచ్చిన రాజేశంను ఈయనకు చూయిస్తే అతడు తన అన్న అవునా కాదా

చెప్పేస్తాడు' అన్నాడు కొంత ప్రాధేయపూర్వకంగా.

సర్కిల్ సాబ్ కొంత మెత్తబడి సుధాకర్ వెంట తెచ్చిన రుజువులను పరిశీలించాడు.

తండ్రి పేరు, ఊరు వివరాలు, రాజేశం చదువుకున్న స్కూళ్ళు, దగ్గరి దోస్తులు, బంధువుల వివరాలు నోటు చేసుకున్నారు. చాల జాగ్రత్తగా వ్యవహరించకపోతే నేరగాడు జారిపోవడమే కాకుండా తనకు పెద్ద రిమార్కు వస్తుందని ఆయన మనసులో ఉంది.

'కొద్దిసేపు మీరు బయట ఉండండి..నేను డిఎస్పీ సార్ తో మాట్లాడి చూస్తాను' అన్నాడు నిదానంగా.

అరగంట తర్వాత ఓ కానిస్టేబుల్ వచ్చి 'సార్ రమ్మంటున్నాడు' అంటూ ప్రకాష్ ను లోపలి తీసుకెళ్లాడు.

' కలిసేందుకు సార్ పర్మిషన్ ఇచ్చారు . ఇదేదో తెల్లగోలు అవడం అందరికి మంచిదే అన్నారు. మీరు నాలుగు గంటలకు రండి..వెళ్దాం ' అన్నాడు.

బయటికి వచ్చిన ప్రకాష్.. సుధాకర్ ను ఎటు పోనీయకుండా తన ఇంటికే తీసికెళ్ళాడు.

భోజనం చేసి ముచ్చట్లతో గడిపి ఇద్దరు మూడింటికే స్టేషన్ వైపు బయలుదేరారు.

ముగ్గురు కలిసి పోలీస్ కారులో జైలులో ఉన్న రాజేశం దగ్గరికి వెళ్లారు..

' రాజేశం.. మీ తమ్ముడు నిన్ను కలవడానికి వచ్చాడు. చూడు.. ఏమైనా మాట్లాడేది ఉంటే మాట్లాడు' అన్నాడు సర్కిల్ నిదానంగా.

ఆ మాట విన్న రాజేశం చేతులెత్తి మొక్కుతూ కన్నీళ్లతో ' సార్.. నేను ఒక్కణ్ణే..నాకు అన్నదమ్ములు లేరు. ఈయనెవలో నేనెన్నడూ చూడలేదు. సూరత్ నుంచి నన్నెందుకు తెచ్చిండ్రో నాకర్థమైతలేదు. మాది శంభునిపేట. ఊర్లె మా అక్క ఉంటది. సూరత్ ల భార్య బిడ్డ ఉంటారు. వాళ్ళెంత పరేషాన్ అయితున్నారో.. నేనిక్కడున్నట్లు చెప్పనైనా చెప్పండి.' అని బతిమాలుతున్నాడు.

'ఏదైనా ఫోన్ నెంబరుంటే నాకివ్వు ' అన్నాడు ప్రకాష్.

రాజేశం సర్కిల్ వైపు చూశాడు.

ఆయన ఫోను తన దగ్గరే ఉందని చెప్పి అడిగిన నెంబర్లు ప్రకాష్ కు ఇచ్చాడు.

' మరి నువ్వు తప్పించుకు ఎందుకు తిరుగుతున్నావయ్యా..' అన్నాడు ఇన్స్ పెక్టర్ రాజేశంతో.

చదువుకొనే రోజుల్లో విద్యార్థి హత్య, గ్రామాలకు తరలండి, తాను పారిపోయిన కారణాలు అన్నీ వివరంగా చెప్పాడు.

పోలీసులు రాజేశంను శంభునిపేటకు తీసుకెళ్లి సుగుణకు చూయించారు. ముందు ఆశ్చర్యపోయిన సుగుణ విషయం తెలుసుకొని 'మా తమ్ముడు అసుంటోడు కాదు' అంటూ పోలీసుల కాళ్లపై పడింది. దీనితో పోలీసులకు మరింత స్పష్టత వచ్చింది. రికార్డుల్లో

ఎక్కడో తప్పు జరిగిందని వారికీ అనిపించింది. పైనుంచి అనుమతి వచ్చేదాకా రోజూ పోలీస్ స్టేషన్ కు వచ్చే కండిషన్ తో రాజేశంను ప్రకాష్ కు అప్పగించారు. సుగుణ తమ్ముడి వెంటే ఉంది. మరుసటిరోజు సూరత్ నుంచి ప్రకాష్ వద్దకు వచ్చిన దీప, సుభద్రలు రాజేశం పట్టుకొని ఏడ్చి విషయమంతా తెలుసుకొని ప్రకాష్ చేసిన మేలుకు చేతులెత్తి దండం పెట్టారు. సుగుణ మరదలు, కోడల్ని దగ్గరికి తీసుకొంది.

'బావ, అల్లుడు ఇంకా రాలేదేంది.. ఎక్కడున్నారు..' అన్నాడు రాజేశం.

'ఇద్దరు షోలాపూర్ ల చద్దర్ల మిల్లుల పనిజేస్తున్నరు. బండి ఎక్కింంద్రు..రాత్రికి దిగుతరు' అంది.

ఏమిటి అన్నట్లు తండ్రి ముఖం చూసింది సుభద్ర.

'ససరా, బనేవి ఆవ్తా' అన్నాడు రాజేశం.

ఆశ్చర్యంతో పాటు కొంత సిగ్గుపడిందామె.

'మొగడు.. మొగడు..' అన్నది సులోచన నవ్వుతూ.

***

**బద్రి నర్సన్**

**రచయితగా, కాలమిస్ట్‌గా చిరపరిచితులైన బద్రి నర్సన్ స్వస్థలం జగిత్యాల. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. డిగ్రీ వరకూ జగిత్యాలలోనే విద్యాభ్యాసం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంఏ, ఎంఎడ్ చేశారు. పాఠశాల స్థాయినుంచే సాహిత్యాభిలాషను పెంచుకున్నారు. బాల్య స్నేహితులతో కలిసి 'సాహితీ మిత్ర దీప్తి' అనే సంస్థ ద్వారా కవితల పోటీలు నిర్వహించారు. ఎంపికైన రచనలను పుస్తకాల రూపంలోకి తెచ్చారు. ఓయూలో చదువుతున్న రోజుల్లోనే 'రంగుల కల', 'విముక్తి కోసం' సినిమాలకు రచన, దర్శకత్వ శాఖల్లో పనిచేశారు. ఉన్నత విద్యాభ్యాసం తర్వాత తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఉద్యోగంలో చేరారు. 2015లో విరమణ పొందారు. పదేండ్లుగా సమకాలీన అంశాలపై వివిధ పత్రికలకు విశ్లేషణాత్మక వ్యాసాలు రాస్తున్నారు. దివంగత కవి, చిత్రకారుడు అలిశెట్టి ప్రభాకర్ కవిత్వాన్ని పుస్తకంగా తెచ్చారు. తన జీవితంలో అత్యంత సంతృప్తిని ఇచ్చిన అంశం ఇదేనని నర్సన్ చెప్తారు. సాహిత్యంపై మక్కువతో 30 వరకూ కథలు రాశారు.**

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 459

# వడ్లు



రాయపాటి హైమావతి
80081 69672

"మనం బాన్స్‌వాడా తండాకి వెళుతున్నాం.." చెప్పింది కలెక్టర్ ఝాన్సీ రాథోడ్.

"ఓ.కే.. మేడమ్." అంది డీ.ఆర్.ఓ రాగిణి.ఎందుకని అడగలేదు.కలెక్టర్ ఝాన్సీకి సర్‌ప్రైజ్ విజిట్స్

చేయడం అలవాటు.ఉదయం ఎనిమిదింటికల్లా కలెక్టర్ బంగ్లాకి వచ్చింది రాగిణి.

ఇద్దరూ ఒకే కారులోనే బయలు దేరారు.కారు బయలుదేరే ముందు సి.సి.రాంబాబుకి ఫోన్ చేసింది రాగిణి

"మేడమ్ విజిట్ వుంది కదా ఏర్పాటు చేసారా?" అడిగింది.

"ఏం విజిట్ మేడమ్ ?" అడిగాడు అమాయకంగా రాంబాబు.

"అదేంటి ప్రోగ్రామ్ తెలీదా? " అడిగింది స్వరం తగ్గించి.ఝాన్సీ రాగిణి మాట విని

"ఇది అఫిషియల్ విజిట్ కాదు కదా రాగిణీ.." అంది.

"సెక్యూరిటీ రీజన్స్ వున్నాయి కదా మేడమ్." అంది. "పర్వాలేదు..మనల్ని ఎవరూ టార్గెట్ చేయరులే.."

అని ఒక న్యూస్ పేపర్ రాగిణికి ఇచ్చింది.అది ముందు రోజు పేపర్.ఒక న్యూస్ ఐటమ్ మార్కింగ్ చేసి

వుంది. విషయం అర్ధమైంది రాగిణికి."ఇప్పుడు మనమేం చేయగలం మేడమ్." అడిగింది.

"ఊర్లో పరిస్థితి అంచనా వేద్దాం.ఇలాంటి మరణం మరొకటి జరగకుండా చూడాలి కదా.." అంది ఝాన్సీ.

డ్రైవర్ ముత్యాలును చూస్తూ "బాన్సవాడా తండా తెలుసు కదా నీకు.." అడిగింది.

"ఊర్లోకి ఎంటరయ్యాక తెలుసుకుంటానమ్మా.." అన్నాడు.బాన్స్ వాడా కథనం రాగిణి ముందు మరోసారి కదిలింది.'బిడ్డను కోల్పోయిన తల్లి ఆత్మహత్య.' అది వార్తకు పెట్టిన హెడ్డింగ్. మరోసారి వార్త చదివింది.

"గంగూబాయి పాతికేళ్ల యువతి.మగ సంతానం కోసం మూడోసారి కూడా గర్భం దాల్చింది.మళ్లీ ఆడపిల్లేపుట్టింది.దాంతో ఆమె భర్త భీమ్లా నాయక్ యధావిధిగా పుట్టిన బిడ్డ గొంతులో వడ్లు వేసి చంపేశాడు.

బిడ్డను కోల్పోయిన గంగూ భాయి శోక భారంతో ఆత్మహత్య చేసుకుంది.గతంలో ఆమెకి పుట్టిన మరో

ఇద్దరు ఆడపిల్లలను కూడా భీమ్లా నాయక్ గొంతులో వడ్ల గింజలు వేసి చంపేసినట్టు గ్రామస్తుల కథనం.పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు భీమ్లా నాయక్‌ను జైలుకి తరలించారు."

"తనేమో ఆత్మహత్య చేసుకుంది.ఆమె భర్త జైలుకెళ్లాడు.ఎవర్ని కలవాలి మేడమ్?" అడిగింది రాగిణి.

"గంగూ బాయ్ తల్లి కూడా ఆడదేగా! బిడ్డను కోల్పోయిన బాధలో ఆమె కూడా వుంటుంది.మన పరామర్శ ఆమెకి కొంత స్వాంతన ఇస్తుంది కదా.?" అంది ఝాన్సీ.

"గంగూ బాయి తల్లిది కూడా అదే ఊరా మేడమ్.." అడిగింది రాగిణి.

"భీమ్లానాయక్ స్వయానా ఆమెకి తమ్ముడే.ఒకే ఊరు." అంది ఝాన్సీ రాథోడ్.

"ఇది చాలా దారుణం మేడమ్.ఆడపిల్లని బ్రతకనివ్వరా?" అంది.ఆమె స్వరం వణికింది.రాగిణి కళ్ళు

వర్షించడం గమనించింది. "కంట్రోల్ యువర్‌సెల్ఫ్ రాగిణీ." అంది ఝాన్సి.

కారు రోడ్డు మీద వున్న గుంటల్లో పడ్డంతో ఎత్తెత్తి కుదేస్తూ వెళుతుంది.

"ముత్యాలూ.. కాస్త నిదానంగా వెళ్లు" అంది రాగిణి.కలెక్టర్ ఝాన్సీ ఐదు నెలల గర్భిణి.

"నేను తిన్నగానే వెళుతున్నాను మేడమ్.రోడ్డు దారుణంగా వుంది.ఇటీవల వచ్చిన వర్షాలకు రోడ్డు

కొట్టుకు పోయింది " చెప్పాడు."ఈ రోడ్డు వేసి ఆరునెలలే కదా అయ్యింది." అంది ఝాన్సీ.

"కాంట్రాక్టర్ ఎమ్.ఎల్.ఏ మనిషి కదా..సగం లాక్కుని వుంటాడు." అంది రాగిణి.

"అఫ్‌కోర్స్.." అంది ఝాన్సీ. "వాడ్ని బ్లాక్ లిస్ట్‌లో పెడదాం మేడమ్.." అంది రాగిణి.

"ఎమ్.ఎల్.ఏ కి..సి.యం బ్లెస్సింగ్స్ వున్నాయ్.." అంది ఝాన్సీ.

"సి.యం ఇలాంటి కరెప్షన్స్ ఒప్పుకోడు మేడమ్."అంది.ఝాన్సీ నవ్వింది.ఆ నవ్వులో నిస్పృహ కన్పించింది.

"సి.యం గారి అబ్బాయి యం.పి కదా అతని నియోజక పరిధిలోనే ఈ అసెంబ్లీ వుంది.ఎం.ఎల్.ఏ ని

గట్టిగా మందలించలేని పరిస్థితి యం.పిది. పైగా ఈరోడ్డు యం.పి లాడ్స్‌లోంచే వేసింది." అంది ఝాన్సి.

"మీరు అనుమతిస్తే నేను ఒకసారి ఆ కాంట్రాక్టర్‌ని పిలిచి వాయిస్తాను మేడమ్.ఈ రోడ్డు మళ్లీ వాడి చేతే

వేయిస్తా." అంది."నీ స్పార్క్ నాకు నచ్చుతుంది రాగిణీ." అంది ఝాన్సి..

"మీలాంటి సిన్సియర్ కలెక్టర్ దగ్గర పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం మేడమ్." అంది రాగిణి.

"నిన్ను ఏరి కోరి వేయించుకున్నాను రాగిణీ..మంత్రిగారు జిల్లా అంతా ఆడాళ్ల రాజ్యం అయిపోయిందని

నవ్వుతూ అంటూ వుంటాడు.." అంది ఝాన్సీ."నిజమే మేడమ్..ఎస్.పి శాన్వీ కూడా మీకు లాగే స్పిరిట్

వున్న అమ్మాయి.తను మన జిల్లా ఎస్.పి గా వుండడం కూడా విశేషం.." అంది.

"ఎస్..శాన్వీకి ఒకసారి ఫోన్ చెయ్..సూసైడ్ చేసుకున్న గంగూ భాయి ఫ్యామిలీ హిస్టరీ..ఊర్లో పరిస్థితి

వాట్సప్ చేయమను.." చెప్పింది."ఎస్..మేడమ్." అంది రాగిణి.శాన్వీకి ఫోన్ చేసింది రాగిణి.

"మనం వెళ్తున్నట్టు చెప్పొద్దు" అంది ఝాన్సీ.

"మీ మూమెంట్ శాన్వీకి తెలీకుండా వుండదు మేడమ్" అంది.నవ్వుతూ ముత్యాలు వైపు చూసింది ఝాన్సి.

"కారు కదిలిస్తే మీ మూమెంట్ ఇంటల్ జెన్స్ వాళ్లకి చెప్పాలి మేడమ్.మీ సెక్యూరిటీ వాళ్ల బాధ్యత కదా." అన్నాడు ముత్యాలు.

"ఊర్లో హడావిడి వద్దని చెప్పు.మీడియా హడావిడి కూడా వద్దు.." చెప్పింది రాగిణికి.

"మా రెవెన్యూ వాళ్లకి మెసేజ్ పెట్టాను మేడమ్. అందుబాటులో ఉండమని.బట్ మనం పిలిస్తే తప్పా

వాళ్లు రారు." చెప్పింది.రెండు గంటల జర్నీ తర్వాత బాన్స్ వాడ చేరుకుంది ఝాన్సీ బృందం.

అప్పటికే మఫ్టీలో ఇద్దరు ముగ్గురు కానిస్టేబుళ్లు గ్రామంలోకి ప్రవేశించి వున్నారు.

గ్రామంలోకి అడుగుపెట్టాక "గంగూ బాయి మదర్ ఇళ్ళు ఎక్కడ వుందో కనుక్కో." చెప్పింది ముత్యాలునుచూస్తూ ఝాన్సీ. కారు ఆగంగానే ముత్యాలు దగ్గరకు ఒక మఫ్టీలో వుండే ఐ.డి కానిస్టేబుల్ వచ్చాడు.

ముత్యాలు ఏదో చెప్పడంతో "టు మినిట్స్ సమయం ఇవ్వండి." అని వెళ్లి సమాచారం సేకరించి తన బైక్ ముందుకు ఉరికించాడు.అప్పటికే కొందరు ఇళ్లలో నుండి బయటకు వచ్చి చూస్తున్నారు.ఊర్లో కొచ్చిన

కారు ఎవరిదా?! అని కళ్లు చిట్లించి చూస్తున్నారు.ఊర్లో శ్మశాన వాతావరణం కన్పిస్తుంది. కారు నెమ్మదిగాగంగూ బాయి తల్లి ఇంటిముందు కొచ్చి ఆగింది.గంగూ బాయి తల్లి కమిలిని ఒక కుక్కి మంచం మీద

పడుకొని వుంది.కలెక్టర్..డి.ఆర్.ఓ లను చూసి లేచింది."కలెక్టర్ గారు.." చెప్పింది రాగిణి.

వడలిపోయిన చేతులతో నమస్కారం చేసింది కమిలిని. ఏడ్చి..ఏడ్చి సొమ్మసిల్లిన చారికలు ఆమె మొఖం

మీద స్పష్టంగా కన్పిస్తున్నాయి."దరిద్రుడు నా బిడ్డను చంపేశాడు.." అంది ఏడుస్తూ. ఆమె చేతిని

ఓదార్పుగా పట్టుకుంది ఝాన్సి."అందుకే కదా జైలుకి వెళ్లాడు.ఇక వాడికి చిప్పకూడే.." అంది రాగిణి.

"భగవంతుడు ఎవర్నిస్తే వాళ్లని తీసుకోవాలి కానీ మగపిల్లాడికోసం వెంపర్లాడడం ఏంటమ్మా..? ఇద్దరు

బిడ్డలను పోగొట్టుకొని మూడో బిడ్డను కూడా కాపాడు కోలేని దౌర్భాగ్యానికి కుమిలి

పోయి ప్రాణాలు

తీసుకుంది నా బిడ్డ." అంది కమిలిని.దాదాపు అరవై ఏళ్ల వృద్ధుడు కారుని చూసి లోపలికి వచ్చాడు.

"గంగూ నాయన.." చెప్పింది కమిలిని.

"కలెక్టర్ మేడమ్ మిమ్మల్ని పరామర్శిండానికి వచ్చారు.." చెప్పింది రాగిణి.

బలహీనమైన చేతుల్తో నమస్కారం పెట్టాడు సోనూనాయక్.

"తోడ పుట్టిన వోడని బిడ్డని కళ్ళలో పెట్టుకొని చూసుకొంటాడని నా ఇంటి ఆడది ఆశ పడింది.వాడు పశువయ్యాడు.భార్యని చంపుకున్నాడు.కనుపాపలని చిదిమేశాడు" అంటూ వెక్కి..వెక్కి ఏడ్చాడు సోనూ నాయక్.

కాసేపు ఝాన్సీ ఏమీ మాట్లాడలేదు.

"మీకు కలిగిన దు:ఖాన్ని మేము పూడ్చలేం పెద్దయ్యా.ఇది ఉంచండి" అని పదివేల రూపాయల్ని ఒక

కవర్లో పెట్టి ఇచ్చింది."ఈ పైసలు ఏం చేసుకుంటాం కలెక్టరమ్మా.బెయిల్ మీద ఆ దుర్మార్గుడు మళ్లీ

వస్తాడట.ఆడు ఇంక అసలు ఈ ఊర్లో తిరగకూడదు.ఉరి వేయించండి వాడ్ని" అన్నాడు

సోనూ నాయక్ రొప్పుతూ. "చట్టం తన పని తాను చేసుకు పోతుంటుంది పెద్దయ్యా.." అంది రాగిణి

"చట్టం చట్టు బండలు కాకుండా కాపాడండి తల్లీ.ఈ గర్భ శోకం మరెవరికీ కలగకూడదు." అంది

కమిలిని. తిరుగు ప్రయాణ మయ్యారు ఇద్దరూ.

"ఎన్ని మరణాలు ఆపగలం రాగిణీ." అంది నిర్వేదంగా ఝాన్సీ.

"ప్రపంచాన్ని చూడకముందే ఈ లోకం నుండి ఆ పసిగుడ్డుల్ని పంపేయడం దారుణం మేడమ్" అంది

రాగిణి. "ఈ సమస్యకి పరిష్కారం లేదా అమ్మా." అన్నాడు ముత్యాలు డ్రైవ్ చేస్తూనే.

"మనిషి మనస్తత్వం లోనే మార్పు రావాలి ముత్యాలూ..ఏ బిడ్డ అయితేనేం..?" అంది రాగిణి.

"వీడు పుట్టడానికి ఒక ఆడది కావాలి.వీడు సెక్స్ వాంఛ తీర్చుకోవడం కోసం ఒక ఆడది కావాలి.వాడి

కడుపున మాత్రం ఆడపిల్ల పుట్టకూడదు.ఇదెక్కడి ఘోరం." అంది ఝాన్సీ కోపంగా

తనలో తానే

గొణుక్కుంటూ.శాన్వి సమాచారం పంపింది.తిరిగి ఏదో మెసేజ్ టైపు చేసి పంపింది.కాసేపటి తర్వాత

దాన్ని డిలీట్ చేసింది.వాళ్ల కారు నిజామాబాద్ చేరుకొనే లోపు ఎస్.పి శాన్వీ ఫోన్ చేసింది.

“అతడి బెయిలు కేసు వాదించడానికి ఎవరూ ముందుకు రావడం లేదట మేడమ్..” అంది శాన్వీ

కలెక్టర్ పెట్టిన మెసేజ్‌కి జవాబుగా ఝాన్సీ ఆలోచిస్తూ.

“వాడు బయటకు రావాలి శాన్వీ..హుక్ అండ్ క్రుక్..” అంది.

ఒక నిమిషం ఆలోచించి ..“ఎస్.. మేడమ్..” అంది శాన్వీ..

***

తన బెయిలు కోసం ఎవరు ప్రయత్నించారో అర్థం కాలేదు భీమ్లా నాయక్‌కి.భీమ్లా ఊర్లో కొచ్చాడని

తెలిసి అందరూ తలుపులు వేసుకున్నారు.అతడ్ని ఇంట్లోకి రానివ్వ కూడదని అందరూ తీర్మానించుకున్నారు. “నా బిడ్డను పొట్టన పెట్టుకున్న వాడ్ని చంపేస్తా..” అన్నాడు సోనూ నాయక్.

“వాడి చేసిన పాపమే వాడ్ని అంతం చేస్తుంది.” అంది అతని భార్య కమిలిని

“తమ్ముడు అని కనికరం చూపిస్తావేమో వాడ్ని బ్రతకనివ్వకూడదు..” అన్నాడు సోనూ నాయక్.

“అట్టాంటోడు భూమికి భారమేనయ్యా..వాడు నా తమ్ముడు అయితే నేం ” అంది కమిలిని.

అతడ్ని ఎలా మట్టుబెట్టాలా అని చూస్తున్నాడు సోనూ నాయక్..

***

కట్టెల పొయ్యిలో అన్నం వండుకొని అందులో గంజి పోసుకొని తిన్నాడు భీమ్లా నాయక్.

కూరలు ఎలా చేయాలో అతడికి తెలియదు.నాలుగు రోజులు గడిచాయి.

ఉన్న కాసిన్ని బియ్యం అయిపోయాయి.జేబులో రూపాయి డబ్బులు లేవు.ఎవరూ ఇంటి దర్వాజా తెరవడంలేదు.బావ సోనూ నాయక్ తన విషయంలో కారాలు మిరియాలు నూరుతున్నాడని అర్థమైంది.

తెగించి ఒకరోజు వెళితే “అరే దగుల్బాజీ మీ బావ నిన్ను చంపేస్తాడు వెళ్లిపో..”అంది

కమిలిని.

కాళ్లీడ్చుకుంటూ ఇంటికొచ్చి పడ్డాడు. అప్పు కూడా పుట్టే మార్గం కన్పించడం లేదు.

కడుపులో పేగులు నక..నక లాడుతున్నాయ్. తన భార్య గంగూబాయి గుర్తొచ్చింది. ఎక్కడ్నించి

తెస్తుందో తెలీదు వండిన కూర వండకుండా పెట్టేది. రోజు మార్చి రోజు నాటుకోడి తెచ్చి వండిపెట్టేది.

తనకిష్టమని వంకాయ,ఎండుచేప వేసి వండి పెట్టేది. గోంగూరలో మెత్తాళ్ళు వేసి వండేది. విప్పసారా తాగి

నాటుకోడి నంజుకొంటే తనకి స్వర్గం కన్పించేది. ఇద్దరు బిడ్డల్ని భర్త పొట్టన పెట్టుకున్నా మళ్లీ నీళ్లు

పోసుకుంది గంగూభాయి "ఈసారి ఎవరు భూమిమీద కొచ్చినా.. ఉసురు తియ్యకయ్యా." అంది ఒక రోజు

"సర్లేవే." అన్నాడే కానీ. భీమ్లానాయక్ మనసులో ఆలోచనలు మారలేదు.

"ఆడపిల్లో పుడితే దానికి ఎవరు కాపలా కాస్తాడు.? మగపిల్లాడయితే నాలా జల్సాగా బ్రతికేయచ్చు"

అనేవాడు. గంగూ భాయి భయం భయంగా చూసేది. "పుట్టించే వాడ్ని నే వున్నా కదే భయమెందుకు?"

అనేవాడు అదేదో గొప్పగా. "పుట్టి లోకం కూడా చూడకుండా నువ్వు సాగనంపుతున్న నా బిడ్డల ఉసురు

నీకు తగులుతుందయ్యా.." అనేది. "అదంతా నీ గుబులు లేవే. పుట్టించేది నేనే కదా. వద్దనుకొనే హక్కు

కూడా నాకే వుంటుంది. అయినా నాలుగు రోజులు చాకాక చంపలేం గానీ పుట్టిన సందిట్లో చంపితే

నష్టమేముంది.?మగపిల్లాడు పుట్టేవరకూ నీకు ఈ కష్టాలు తప్పవు కాస్త ఓర్చుకో.." అనేవాడు.

గంగూబాయి కన్నీరు మున్నీరై రాత్రంతా ఏడుస్తా కూర్చొనేది.

"ఈసారన్నా నా కడుపులో ఒక మగ నలుసు పుట్టేలా చూడు సామీ.." అని గుడులూ,గోపురాలు తిరిగేది.

గంగూభాయి కన్నీళ్లు సముద్రంగా మారి ఆ ఉప్పెనలో కొట్టుకు పోయినట్టు కలలొచ్చాయ్ భీమ్లానాయక్‌కి.

ఒకరాత్రి ఎవరో తట్టినట్టు అన్పిస్తే దిగ్గున లేచాడు. "ఎవరు..?" అడిగాడు.

"నా తోరా..?" పిలిచాడు ఒక అగంతుకుడు. "ఎవరు నువ్వు?" మళ్ళీ అడిగాడు భయంగా..

"ముందు బయటకు రా." చెప్పాడతడు. భయపడుతూనే నీరసంగా తూలుతూ బయటకు వచ్చాడు.

అక్కడ మరో ఇద్దరు వ్యక్తులు వున్నారు. "ఎవరు మీరు?.." అడిగాడు. వాళ్ళేమీ చెప్పలేదు.

"ఎవరో తెలిస్తే చస్తావ్.." అన్నారిద్దరూ. వణికి పోయాడు భీమ్లా నాయక్.

"ఎందుకొచ్చారు?" అడిగాడు. "రా చెబుతాం.." అన్నారిద్దరూ. "ఎక్కడికీ.." అని అడిగాడు.

వాళ్లిద్దరూ భీమ్లానాయక్ మెడపట్టి ముందుకు నెట్టారు. "ఎక్కడికి తీసుకెళుతున్నారు.?" మళ్ళీ అడిగాడు.

"తెలీదు. నడువ్.." అన్నాడు ఒక వ్యక్తి. "నేను అరుస్తా. అరిస్తే... ఊర్లో జనాలు బయటకు వస్తారు." అన్నాడు

"నిన్ను చంపినా ఎవరూ బయటకు రారు. మూసుకొని మాతో రా " అన్నాడు ఒక వ్యక్తి.

కాస్త దూరంగా పెట్టి ఉంచిన జీపు లోకి ఎక్కించారు భీమ్లానాయక్‌ని. జీపు కదిలింది.

"ఎక్కడికి తీసుకెళుతున్నారు?" కలవరంగా అడిగాడు. "తెలీదు." అన్నాడొక వ్యక్తి.

కాసేపు ప్రయాణం చేసిన తర్వాత పొలాల సమీపం లోని ఒక నిర్జన ప్రదేశంలో జీబు ఆగింది.

అప్పటికే అక్కడికి వచ్చి ఆగివున్న కార్లోంచి ఇద్దరు ఆడవాళ్లు దిగారు.

వాళ్లనెప్పుడూ తను చూసినట్టు గుర్తు లేదు. ఒక శాల్తీ దగ్గరకొచ్చింది.

"ఎవరు మీరు?" అడిగాడు భీమ్లా నాయక్ భయ భయంగా. అందులో ఒకామె ముందుకొస్తూ..

"మే మెవరో చెప్పేముందు నీకో కథ చెప్పాలి.." అంది. "ఏంటి మీరు చెప్పే కథ?" అడిగాడు.

"అది కూడా వడ్లు కథే..." అంది ఆమె. వెనక్కి విరిచి కట్టిన చేతుల్తో ఉన్న అతడ్ని ముందుకు నెడుతూ

కల్లాల్లో కుప్పగా పోసిన వడ్లు దగ్గరకు తీసుకొచ్చింది. "ఇవి నువ్వు తింటావా ?" అడిగింది.

"వడ్లు ఎలా తింటారు?" అడిగాడు. "తిని చూడు.ఎలా వుంటాయో తెలుస్తుంది." అంది.

"మీకేమయినా పిచ్చా.." అన్నాడు అరుస్తూ.వెనుక నుండి మరో శాల్తీ ముందుకు వచ్చి

"పసివాళ్ల గొంతులో వడ్లగింజ వేయడం మాత్రం పిచ్చితనం కాదా?" అంది.

"మీరేవరో నాకు అర్థమయింది.మీరు పోలీసులు కదూ.." అన్నాడు.

"మే మెవరో నీకు చెబితే వచ్చే లాభం ఏమీ లేదు.కానీ ఒక కథ చెబుతాను విను.." అంది మొదటి శాల్తీ

మళ్లీ."ఏంటా కథ.." అడిగాడు భయ భయంగా."అనగనగా ఒక ఊరు..ఆ ఊరిలో నీలాంటి ఒక తండ్రి. నీకు లాగే ఆడపిల్ల సంతానం వద్దు అనుకున్నాడు.పుట్టిన బిడ్డను అచ్చు నీలాగే వడ్ల గింజను వేసి

చంపాలనుకున్నాడు.ఆ బిడ్డ తల్లి తల్లడిల్లి పోయింది.బట్ నీ అమాయకపు భార్యలా తనను తాను దహించుకోలేదు.ఫుల్‌గా తాగి ఒళ్లు తెలీక పడున్న వాడ్ని లాంతర్‌లోని చమురుని వంచి గుడెసె తగల బెట్టి బిడ్డను తీసుకొని రాత్రికి రాత్రే ఊరు వదిలి పరుగులు తీసింది.బిడ్డను పొదివి పట్టుకొని కాలువలూ,గట్లూ ముళ్ల

పొదలు దాటుకొని ఒక ఊరిలో కొచ్చి పడిపోయింది.సొమ్మసిల్లి పడిపోయిన ఆ తల్లిని, గుక్క పెట్టి ఏడ్చి

ఏడ్చి కొనఊపిరి తో ఉన్న ఆ బిడ్డను ఆ ఊరు అక్కున చేర్చుకుంది.స్పృహలోకొచ్చిన ఆ తల్లి బిడ్డను తనివి తీరా కౌగిలించుకొని ఏడ్చేసింది.అమ్మ స్పర్శతో ఆ బిడ్డలో మళ్లీ ఊపిరాడ్డం మొదలై గుక్కపెట్టి ఏడ్వడం

మొదలు పెట్టింది.స్తన్యం ఇచ్చి "చంపేశానమ్మా.. నిన్ను చంపాలనుకున్న ఆ దుర్మార్గుడ్ని మీ నాన్నను

నిప్పు పెట్టి చంపేశాను.."అని పిచ్చిదానిలా అరిచి ఏడ్చింది.ఊరి జనాలకు విషయం అర్థమైంది.

ఊరు ఆదరువుగా నిలిచింది.తనని కాపాడ్డానికి అమ్మ ప్రాణాలు అడ్డుగా వేసిందని ఆ పసిదానికి

కాలక్రమంలో అర్థం అయింది.జీవితం విలువ తెలిసింది.చదువే లోకంగా బ్రతికింది.అమ్మ ఆశే ప్రపంచంగా మిగిలింది.ఊరు మొత్తం హారతులు పట్టేలా ఐ.ఏ.ఎస్ సాధించింది.ఊరి చరిత్రలో ఎవరూ సాధించలేనివిజయం సాధించింది." అంటూ ఆగింది.అక్కడున్న సిబ్బంది ఉత్కంఠ తో వింటున్నారు.

ఒక నిమిషం ఊపిరి పీల్చుకొని..“ ఆ ఐ.ఏ.ఎస్ నేనే ” అంది.ఆమె కళ్ల వెంట నీళు ,, ప్రవాహమవుతున్నాయ్

“ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్ మేడమ్..” అంది మరో శాల్తీ.

“ఎలా కంట్రోల్ చేసుకోవాలి శాన్వీ.ఆరోజు అమ్మ నన్ను కాపాడకపోతే ఏమయ్యేదాన్ని.ఉన్నతమైన ఈ

స్థాయికి ఎదిగే దాన్నా.?ఈ ప్రపంచాన్ని చూసే దాన్నా.?ఈ దుర్మార్గుడు పొట్టన పెట్టుకున్న ముగ్గురు

బిడ్డలు నాలా ఏ ఐ.ఏ.ఎస్సో.. డాక్టరో...ఇంజనీర్ గానో మారి సమాజానికి సేవ చేసే వాళ్లు కదా..” అందిదు:ఖోద్వేగంతో. బీమ్లా నాయక్ ఆమెని గుర్తు పట్టాడు.“మీరు కలెక్టర్ ఝాన్సీ కదూ..” అన్నాడు.

“అవును రా బాడ్కోవ్” అని అతని మొఖం మీద బలంగా గుద్దింది ఝాన్సీ..

“భూమ్మీద కొచ్చిన వాళ్లందరూ కలెక్టర్లూ..డాక్టర్లు కాలేరు.అయినా నా బిడ్డను నేను చంపుకుంటే

మీ కభ్యంతరం ఏంటి?” అన్నాడు.ఐ.పి.ఎస్ శాన్వీ ముందుకొచ్చింది.

“చట్టానికి అభ్యంతరం వుంది.అందుకే నిన్ను అరెస్ట్ చేశాం.బట్ అదే చట్టం నీలాంటి నరరూప

హంతుకుడికి బెయిల్ కూడా ఇచ్చింది.నీది క్షణికావేశం అనీ,విచారణ చేసి శిక్షించమంది.అందుకే నిన్ను

ఇలా విచారిస్తున్నాం.” అంటూ వుంటే అడ్డు పడ్డాడు భీమ్లా నాయక్.

“అర్ధ రాత్రుళ్ళు ఊరి బయటకు తీసుకొచ్చి విచారణ చేయరు.మీరేదో దురుద్దేశంతో నన్ను తెచ్చారు.”

అన్నాడు.

“సదుద్దేశమే..నీకు వడ్లు రుచి చూపాలనుకుంటున్నాం.అందుకే నీబెయిల్‌కి లాయర్ ని కూడా పెట్టి భయటకుతెచ్చాం.తిను ఎలాగూ ఆకలితో వున్నావ్ గా తిను..” అని అతడి మెడపై పిస్తోలు పెట్టింది శాన్వీ.

“ఈ వడ్లు తినాలా..ఇవి తిని బ్రతకడమేనా?” అన్నాడు.

“బ్రతుకుతావో లేదో తింటేగదా తెలిసేది..” అంది ఝాన్సీ.అతడి చేతుల్ని విడిపించి నలుగురు పోలీసులు రౌండ్‌గా నిలిచారు.“ఇవి తిని నువ్వు బ్రతికితే వదిలేస్తాం..” అన్నది ఝాన్సీ.

“నాకేమయినా అయితే మీకు ఉద్యోగాలు పోవడం ఖాయం” అన్నాడు భీమ్లా నాయక్

చావు తెలివి

తేటలు చూపిస్తూ."వీడితో మాటలు ఏంటి మేడమ్.వేసేస్తాం నా కొడుకుని." అంది కోపంగా శాన్వీ.

"ఆగు శాన్వీ.. " అని మళ్లీ భీమ్లా నాయక్ ని చూస్తూ.."ఇవి తినరా ఇవి తిని నువ్వు బ్రతికితే నిజంగానే

నిన్ను వదిలేస్తాం." అంది ఝాన్సీ గుప్పెడు వడ్లు అతడి చేతికిస్తూ.

"మాట తప్పరుగా" అన్నాడు ఆశగా భీమ్లానాయక్.

"అమ్మతోడు వదిలేస్తాం.ఆ తర్వాత చట్ట ప్రకారమే నీకు శిక్ష పడుతుంది" అంది ఝాన్సీ.

ఆశగా ఆ గుప్పెడు వడ్లు తీసుకొని గొంతులో పోసుకున్నాడు భీమ్లానాయక్.

నిజంగానే అవి అతడి గొంతులో అడ్డు పడ్డాయ్.గుటక వేశాడు.ఊపిరి ఆడని ఫీలింగ్.

గొంతులో వడ్లు వేసి తాను ఆయువు తీసిన ముగ్గురు పసిగుడ్లు అతడి కళ్లముందు కదిలాడారు.

గొంతు పిడచ కట్టుకుపోతున్న వైనం.అతడి ఊపిరి పోతుందా?

****

# రాయపాటి హైమావతి

**సామాజిక చైతన్యం కల్గిన కథలు చదవడం ఇష్టం.**

**లోకం చూడక ముందే అమ్మ కడుపులోనే కన్ను మూసే పసికందులను చూసి గుండె తరుక్కు పోయేది. ముఖ్యం గా తెలంగాణా సమాజం లోని గిరిజన తెగల్లో ఇలా పసికందులను చిదమి వేస్తున్నారని తెలిసి రాసిన కథ ఇది. రాసి కంటే వాసి ముఖ్యం అని నేను నమ్ముతాను.**

**ఒక గొప్ప ఆశయం తో మంచి సాహిత్యాన్ని ప్రజలకు ఇవ్వాలని తపిస్తున్న ముల్కనూర్ గ్రంథాలయం వారికి.. నమస్తే తెలంగాణా యాజమాన్యంకి కృతజ్ఞతలు.**

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 47

# యోగక్షేమం వహామ్యహమ్!



**లక్ష్మీ గాయత్రి**

**6302555947**

"మీకోసం ఎవరో ఒక పెద్దావిడ, ఒకాయన వచ్చారు సార్. మిమ్మల్ని చూసి పోవాలని వచ్చారట." వినయంగా చెప్పాడు సెక్రటరీ జీవన్. "పెద్దావిడా... " ఆశ్చర్యంగా చూశాడు మూర్తి. "అమ్మేమో" అన్న ఆశ మనసులో చిచ్చుబుడ్డిలా గుప్పున వెలిగి... మరుక్షణమే ఆరిపోయింది. అమ్మ ఎందుకొస్తుంది... అసలు ఎలా వస్తుంది?! తన గురించి అమ్మ కి తెలిసే అవకాశమే లేదు. ఇందు అమ్మ ఊసే ఎత్తదు. ఉన్న ఒక్కగానొక్క సంతానం హృదయ్ కి నానమ్మ గురించి తెలియనే తెలియదు. ఇంక తను లివర్ కేన్సర్ తో ఆస్పత్రిలో ఉన్నట్టు అమ్మకెలా తెలుస్తుంది?! నిరాశగా వెనక్కి వాలాడు మూర్తి. "ఇప్పుడు నాకు ఎవరితోనూ మాట్లాడే ఓపిక లేదు జీవన్. వాళ్లెవరో ఏమిటో నువ్వే కనుక్కుని, మాట్లాడి, పంపించెయ్యి." అన్నాడు జీవన్ సరేనన్నట్టు తల ఊపి, వెళ్లాడు. మళ్లీ ఐదు నిమిషాల్లో లోపలికి వచ్చి, "ఆయన మీకిమ్మన్నారు సార్.. " అంటూ చిన్న కాగితం

ముక్క ఇచ్చాడు. మూర్తి అనాసక్తిగానే చదివాడు..."మూర్తీ, నీ గురించి తెలిసి, అమ్మా నేనూ వచ్చాం...రాఘవ"

అది చదువుతూనే ఒక్క ఉదుటున లేచి కూచున్నాడు మూర్తి. "వాళ్లని లోపలికి తీసుకురా జీవన్. తర్వాత తలుపులు వేసేసి నువ్వు వెళ్లిపో. బైట డోంట్ డిస్టర్బ్ బోర్డు పెట్టి, నర్స్ కి చెప్పు. మూడు కప్పులు స్ట్రాంగ్ కాఫీ.. ఫిల్టర్ కాఫీ తెప్పించి లోపలికి పంపు." గబగబా చెప్పి, నీరసం వచ్చినట్టు వెనక్కి జేరబడ్డాడు. జీవన్ మొహంలో ఆశ్చర్యం దాచుకుంటూ తల ఊపి వెళ్లిపోయాడు. మూర్తి తల తిప్పి తలుపు వైపే దృష్టి కేంద్రీకరించాడు. "అమ్మ!"....ఇప్పుడు ఆ తలుపు తీసుకుని లోపలికి వస్తుంది అమ్మ! అమ్మ ని చూసి ఎన్నాళ్లు.. కాదు.. ఎన్నేళ్లయింది? ఖచ్చితంగా పదేళ్లు. అమ్మని తనింటి నుంచి గెంటేసి...ఇరవై సంవత్సరాలు!! అవును.. ఒక మనిషి తనంతట తాను ఇంట్లోంచి వెళ్లిపోయే పరిస్థితులు కల్పిస్తే అది గెంటెయ్యడమే. ఇందు అలాంటి పరిస్థితుల్ని భేషుగ్గా కల్పించింది. తను చూసీ చూడనట్లు ఊరుకున్నాడు. అమ్మ... నాన్న కూడా లేని అమ్మ.. ఏకాకి అయి, అయినా సరే దర్జాగా వెళ్లిపోయింది. అమ్మ వెళ్లిపోయినందుకు తను ఏనాడూ బాధపడలేదు సరికదా అమ్మ కి పల్లెలోనే బావుంటుందని కూడా అనుకున్నాడు. ఇదిగో, వారం రోజుల క్రితం డాక్టర్ తనకి లివర్ కేన్సర్ అని ఖరారు చేశాక, మళ్లీ అమ్మ పదే పదే గుర్తుకు రావడం మొదలైంది. పెద్దయాక కూడా తనకేమైనా ఒంట్లో బాగాలేకపోతే అమ్మ ఎలా లాలించేదో గుర్తొచ్చింది. ఈ యాభై ఏళ్ల వయసులో, మృత్యువు పొంచి చూస్తున్న వేళ, మళ్లీ అలాంటి లాలన కోసం మనసు కొట్టుకుపోయింది! ఇప్పుడు అమ్మే తన పక్కన ఉంటే ఏం చేసేది?! ఏడుస్తూ కూచునేది మాత్రం కాదు! తనకి తెలుసు... అమ్మ చాలా ధీరోదాత్తురాలు! ఆ పదానికి అర్థం ఏమిటో తనకి సరిగ్గా తెలీదు. కానీ అమ్మ మాత్రం అదే! ఖచ్చితంగా అదే!! అలాంటి అమ్మని తను వెళ్లగొట్టేశాడు! కన్నతల్లిని బాధ పెట్టడం వల్లనే తనకి ఈ జబ్బు వచ్చిందేమోనన్న పశ్చాత్తాపం డే వన్ నుంచీ మూర్తిని బాధించసాగింది. ఉండబట్టలేక ఇందుతో అన్నాడు కూడా. "చాలా ఫూలిష్ గా ఆలోచిస్తున్నారు మీరు. తల్లిదండ్రుల్ని చూడని వాళ్లందరికీ రోగాలొచ్చేస్తున్నాయా..?! మీ ఖర్మ కొద్దీ మీకొచ్చింది అంతే!" అంది ఇందు

"మీ ఖర్మ" అన్న మాట వినగానే మూర్తికి చివుక్కుమనిపించింది. "మన ఖర్మ" కాదు... "మీ ఖర్మ"!! అవును. అంతేగా. "ఇందిరా ఫార్మా" కంపెనీ అధినేత్రి ఇందిరామూర్తి, భర్త అనారోగ్యం కారణంగా కంపెనీ బాధ్యతలన్నీ భుజాన వేసుకుంది. కంపెనీకి వెళ్లాలంటే చక్కగా ముస్తాబవాలి. నవ్వుతూ పనులు చక్కబెట్టాలి. ఆస్పత్రి

గుడ్డలు వేసుకుని, సూదులు ఒంటికి గుచ్చుకుని, కదలా మెదలకుండా పక్క మీద పడి ఉండే ఖర్మ తనదే. తలుపు నెమ్మదిగా తెరుచుకుంది. తెల్లగా, పొట్టిగా, బక్కపల్చగా ఉన్న ఆకృతి లోపలికి వచ్చింది. నిర్మలంగా ఉన్న ఆ మొహంలో.. కళ్లజోడు వెనుక నుంచీ కూడా ఆ చూపు ఎంత దయార్ద్రంగా ఉందీ?! ఎంత నిష్కల్మషంగా, ప్రేమగా ఉందో?! "అమ్మా.. " మూర్తి అప్రయత్నంగా చెయ్యి చాపాడు. సావిత్రమ్మ చప్పున ముందుకొచ్చి కొడుకు చెయ్యి అందుకుంది. "అమ్మా.... " మూర్తి కళ్లు నీళ్లతో నిండిపోయాయి. "నేనూ నాన్న దగ్గరికి వెళ్లిపోతున్నానమ్మా"

"నీ మొహం" సావిత్రమ్మ ప్రేమగా కొడుకు బుగ్గలు పుణికింది. "నన్ను దాటించకుండా నువ్వెక్కడికి వెళతావురా.. నా పూజలన్నీ ఏమైపోవాలీ?" అంటూ పక్కనే ఉన్న రాఘవ వైపు చూసి నవ్వింది. "చిన్నప్పటి నుంచీ ఇంతే... ఉత్త భయస్థుడు."

రాఘవ కూడా స్నేహితుడి వైపు చూస్తూ చల్లని వెన్నెల లాంటి నవ్వు నవ్వాడు. అమ్మ మాటకి ఒక్కసారిగా పుంజుకున్నాడు మూర్తి. ధైర్యాన్ని సిరంజిలోకి ఎక్కించి, నరాల్లోకి పంపించినట్టయింది. అవును... ఇప్పట్లో తనకేమీ కాదు. అమ్మ ఎక్కడున్నా తను బావుండాలని పూజలు చేస్తూనే ఉంటుంది. డాక్టర్లు చెబుతూనే ఉన్నారు కదా... చాలా ఎర్లీ స్టేజి.. భయపడవలసిందేమీ లేదూ అని. అది అమ్మ పూజల వల్లే! అమ్మ ఎంత నిష్టగా పూజ చేస్తుందో తనకి తెలుసు. ఇందుకి షో ఎక్కువ. వరలక్ష్మీ వ్రతానికి లక్ష రూపాయల దాకా ఖర్చు చేస్తుంది. నిత్యపూజ మాత్రం సున్నా. "అమ్మా.. నీకెలా తెలిసింది?!"

"కాకొచ్చి కబురు చెప్పింది గాని, నాన్నా, నేను నీ దగ్గర ఓ వారం రోజులు ఉందామనుకుంటున్నానురా."

"అమ్మా...!" మూర్తి ఆనందం రెట్టింపు అయింది. "నన్ను చూసేసి వెళ్లిపోతావేమోనని భయపడుతున్నానమ్మా!"

"పిచ్చితండ్రి..అలా ఎలా వెళతాను? వీలైతే నిన్ను నాతో బాటు తీసుకువెళ్లాలని ఉంది నాకు!"

మూర్తి మాట్లాడలేదు.. అయిష్టతతో కాదు.. "అమ్మతో కలిసి వెళతానా" అన్న అపనమ్మకంతో.

కాఫీలొచ్చాయి. డాక్టర్ వచ్చి వెళ్లాడు! రాఘవ స్నేహితుడి దగ్గర సెలవు తీసుకుని వెళ్లిపోయాడు. తల్లీకొడుకూ మిగిలారు. "కాలక్షేపానికి విను..!" సావిత్రమ్మ తన సెల్ కొడుకు తల పక్కన పెట్టింది. "న కాంక్షే విజయం కృష్ణ.. నచ రాజ్యం సుఖానిచ"

ఘంటసాల భగవద్గీత వస్తోంది. "అమ్మా.. " చప్పున మళ్లీ మృత్యుభయం కమ్ముకుంది మూర్తిని. "నేను చచ్చిపోతానని.. చచ్చిపోబోయే ముందు భగవద్గీత వినిపిస్తున్నావా..?!"

సావిత్రమ్మ చల్లగా నవ్వింది. "ఇంచుమించు నలభై సంవత్సరాల నుంచీ భగవద్గీత నిత్యం పారాయణ చేస్తున్నాను నేను. చచ్చిపోతాననే చదువుతున్నానా?!"

మూర్తి మాట్లాడలేదు! "ఆర్ట్ ఆఫ్ లివింగ్ అని ఈనాడు చెబుతున్నారు చూశావా... యుగయుగాల కిందటే ఆ ఆర్ట్ ని గ్రంథస్థం చేసి మనకి అందించాడు కృష్ణ పరమాత్మ! ఆ స్వామి ఉన్నాడూ అని నువ్వు ఎంత దృఢంగా నమ్ముతావో, సమస్త రకాల బాధల నుంచీ నువ్వు అంత దూరమవుతావు! శారీరకంగా సుఖపడటానికి సంపాదన ఎంత అవసరమో, మనశ్శాంతికి ఆధ్యాత్మికత అంత అవసరం! పెద్దవాళ్లు మనతో బాటే ఉంటే, మన చెయ్యి పుచ్చుకుని ఆధ్యాత్మికత బాట పట్టిస్తారు! నేనిప్పుడు చేస్తున్నది అదే! ప్రశాంతంగా, ఏమీ ఆలోచించకుండా విను! నీ మనసుకి శాంతి దొరుకుతుందో లేదో చూడు!"

మంత్రముగ్ధుడిలా తల్లి మాటలు విన్నాడు మూర్తి. ఇహ తర్కించకుండా భగవద్గీత వినడం ప్రారంభించాడు. "దేహినోస్మిన్ యధా దేహి.. కౌమారం యవ్వనం జరా.."

అవును. చిన్నప్పుడు పరిగెడుతూ క్రికెట్ ఆడిన శక్తి తనకిప్పుడు లేదు. బాల్యం, యవ్వనం దాటేశాడు. బీపీ, సుగర్ శరీరాన్ని లొంగదీసుకున్నాయి. స్టేజి మీద తన పాత్ర చివరికి వస్తుంటే, ఇహ తెర వెనక్కి తప్పుకోవలసిన సమయం ఆసన్నమైందని వేరే ఎవరో చెప్పాలా?! ఎటూ తెరమరుగవడం తప్పనిసరి అయినప్పుడు, ఏ రకంగా అయితేనేమీ?! "అమ్మా... "

"ఏమిటి నాన్నా?!"

"డిశ్చార్జ్ చేశాక, నువ్వూ, నేనూ కలిసి మన ఊరు వెళదాం! నీ దగ్గర కొన్నాళు ్లంటానమ్మా"

***

చిన్న డాబా ఇల్లు! ముందు వైపు మథు మాలతి, సన్నజాజి, విరజాజి, వెనుక వైపు ఆనప, బీర, కాకర తీగెలతో కప్పుకుపోయి, లతాగృహంలా కనిపిస్తోంది. విశాలమైన పెరట్లో, తూర్పున గోశాల. తాటాకు కప్పిన ఆ పాక మీద కాశీరత్నం పూలతీగె నిండుగా విస్తరించి, పాకలో గోమాతకి పువ్వుల గొడుగు పట్టినట్టుంది! ఇంట్లో కాలు పెడుతూనే పెరట్లో నూతి దగ్గరికి వెళ్లి, అక్కడి గోలెంలో నీళ్లతో కాళ్లూ, చేతులూ,

మొహం కడుక్కుని, గోశాల వైపు నడిచింది సావిత్రమ్మ. చిన్నపిల్లాడిలా తల్లి వెనక వెనకే వస్తున్న మూర్తి, తనూ కాళ్లూ, చేతులూ కడుక్కుని, గోశాలలోకి వెళ్లాడు! "బావున్నావా తల్లీ.. " ఆవు గంగడోలు నిమురుతూ ఆప్యాయంగా అడిగింది సావిత్రమ్మ. ఆవు ఆమె రాకకి ఆనందిస్తున్నట్టు మెడ సాచి సావిత్రమ్మ కి మరింత దగ్గరగా మొహం పెట్టింది. పక్కనే మరో చిన్న గుంజకి కట్టేసి ఉన్న దూడ, తల్లిని రాసుకుంటూ ముందుకొచ్చి సావిత్రమ్మ తొడల్ని తలతో పొడిచింది. "అయ్యో, నిన్ను మర్చిపోలేదురా నాన్నా.. " సావిత్రమ్మ వంగి దూడని నిమురుతూ ముద్దు చేసింది. "ఇది సురభి! ఈ బుజ్జి దూడ గౌరి!" అని కొడుక్కి చెబుతూ, జబ్బ పట్టుకుని సురభి దగ్గరగా తీసుకువెళ్లింది. మూర్తి చెయ్యి పట్టుకుని సురభి గంగడోలు నిమిరించింది. తర్వాత చేతులు జోడించి నమస్కారం చేస్తూ, "అమ్మా, సురభీ! నీకు తెలియనిదేముంది.. వీడు నా ఒక్కగానొక్క పిల్లాడు! వీణ్ణి చల్లగా చూడాలి నువ్వు!" అంది. రాత్రి పడుకోబోయేముందు ఏలకపొడి, కలకండ కలిపిన గోరువెచ్చని ఆవుపాలు పెద్ద వెండిగ్లాసు నిండా తెచ్చి కొడుకు చేత తాగించింది. ఆ మర్నాటి నుంచీ మూర్తి దినచర్య సరికొత్తగా మొదలైంది. తెల్లవారుజామునే అమ్మతో బాటూ లేవడం, స్నానం చేసి, దేవుడి ముందు దీపం వెలిగించి ఒక పావుగంట సేపు నిశ్చలంగా ధ్యానం చేయడం. తర్వాత వేడిగా కాఫీ తాగి, గోశాలకు వెళ్లి, సురభి, గౌరి ఇద్దరి చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి, సురభి గంగడోలు నిమురుతూ మృత్యుంజయ మహా మంత్రాన్ని ముమ్మారు చెప్పడం. అదయాక, అలా పొలాల వైపు వాకింగ్! సావిత్రమ్మ కబురంపగా వచ్చిన ఆయుర్వేద వైద్యుడు ఏదో లేహ్యం, గుళికలూ ఇచ్చాడు. వేళకల్లా అవి వేసుకోవడం. అమ్మ పెట్టే సాత్వికాహారాన్ని తీసుకోవడం! రెండు పూటలా గోరువెచ్చని ఆవుపాలు తాగడం! సావిత్రమ్మ ఒక్క క్షణం కూడా ఖాళీగా ఉండదు. వంటపని అయి-ుపోతే భాగవతమో, రామాయణమో చదువుకుంటుంది. ఇంటికి ఎవరో ఒకరు ఏదో ఒక సలహా కోసం వస్తూనే ఉంటారు. అదిగాక, మధ్యాహ్నం మూడు దాటాక బోలెడు మంది ఆడవాళ్లు, మగవాళ్లు వస్తారు. వాళ్లందరినీ కూర్చోబెట్టి, రామాయణం, భాగవతం చెబుతుంది. సాయంత్రం మళ్లీ స్నానం, ధ్యానం. రాత్రికి గ్లాసెడు గోరువెచ్చని పాలు మాత్రమే ఆహారం!! తల్లి బుక్ షెల్ఫ్ లో కొన్ని ఇంగ్లీషు పుస్తకాలు కూడా కనిపించాయి మూర్తికి. అవి ఎవరు చదువుతారా అనుకున్నాడు మూర్తి. ఇంతలో ఒకరోజు కొడుక్కి ఒక పుస్తకం తీసుకొచ్చి ఇచ్చింది సావిత్రమ్మ. అదేమిటా అని మూర్తి కుతూహలంగా చూశాడు. Holy Cancer" అమిత్ వైద్య అనే వ్యక్తి రాసిన పుస్తకం అది.

Holy Cancer. How a Cow saved my life అని ఉంది. “చదువు. చాలా బావుంది” తల్లి చిరునవ్వుతో చెప్పింది. “చాలా బావుందా…నువ్వు చదివావా?!” ఆశ్చర్యంగా అడిగాడు మూర్తి

“అమ్మా.. నువ్వు ఇంగ్లీష్ నేర్చుకున్నావా.. ఎప్పుడూ…ఎవరు నేర్పారు?!” మూర్తి ఆశ్చర్యానికి అంతు లేదు. “చెబుతాను. విను. ఆరోజు ఆస్పత్రిలో నీ గురించి నాకు ఎలా తెలిసిందీ అని అడిగావు కదా.. “

“అవును”

“నాకు ఇంగ్లీష్ నేర్పిందీ..నేను వాడుతున్న స్మార్ట్ ఫోన్ నాకు కొనిచ్చి, దాని వాడకం నేర్పిందీ, నీ గురించి నాకు చెప్పిందీ ఒకరే.. ”

“ఎవరమ్మా. .” మూర్తి కుతూహలం రెట్టింపు అయింది. “చెబుతున్నా..! నేను నీ దగ్గర నుంచి వచ్చేశాక, నాకంటూ ఒక ప్రపంచాన్ని ఏర్పరచుకున్నాను. పూజాపునస్కారాలు, గోసేవ నాకు మొదటి నుంచీ ఇష్టమైన విషయాలు. భాగవతం, రామాయణం చదువుకుంటూ, తెలియనివి నేర్చుకుంటూ, తెలిసినవి నలుగురికీ చెబుతూ కాలక్షేపం చేస్తున్నాను. అలా ఉండగా ఒకరోజు నాకు ఫోన్ వచ్చింది. “నానమ్మా… నేను నీ మనవణ్ణి” అన్నాడు అవతలి నుంచి. నేను నిలువునా చలించిపోయాను. నేను వచ్చేసే టైంకి వాడు ఏడాది వాడు. ఇప్పుడు పదహారేళ్లు. “నానమ్మా.. నేను నీ దగ్గరకి రావచ్చా” అని అడిగాడు. కళ్లనీళ్లొచ్చాయి నాకు. రమ్మన్నాను. వచ్చాడు.

“మా ఇంట్లో ఎవ్వరూ ఉండరు… ఆ సైలెన్స్.. ఐ హేట్ నానమ్మా” అని వాడు అంటూంటే నాకు మీ నాన్నగారే గుర్తొచ్చారు. ఇల్లనేది సందడిగా ఉండాలనేవారాయన. అప్పుడే అంతా బావుంటుంది అనేవారు. హృదయ్ మనింట్లో ఎవరూ ఎందుకు లేరు అని మిమ్మల్ని అడిగి, నీ సెల్ లో నా ఫోన్ నంబర్ పట్టుకుని, మీకు చెప్పకుండా ఫ్రెండ్స్ తో కలిసి పిక్నిక్ పేరుతో ఇక్కడికి వచ్చాడు. ఇప్పుడు కనీసం రెండు నెలలకోసారైనా వస్తాడు. సురభి, గౌరి వాడు పెట్టిన పేర్లే. ఈ ఇల్లు ప్రస్తుతం నడుస్తున్నది వాడి ఊపిరితోనే!!”

మూర్తి నోట మాట రాలేదు! కానీ రక్తం ఉరకలేస్తోంది. గుండె గంగావతరణంలా “తొందర తొందర నడకల వెను వెన్కనె వేల్పుటేరు” లా పొంగుతోంది!!

***

పదేళ్ల తర్వాత.. ఇందిరా ఫార్మా” కంపెనీ అధినేత హృదయ్ తండ్రి రామమూర్తి షష్ఠిపూర్తి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి! ఎనభై ఏళ్ల ముదివగ్గు మూర్తి తల్లి

సావిత్రమ్మ సోఫాలో కూర్చుని ఉంది. మూర్తి లేచి, "నేను ఎక్కువగా మాట్లాడటానికి ఏమీ లేదు గానీ, రెండే రెండు మాటలు చెబుతాను. మొదటిది... మీ ఇళ్లల్లో పెద్దవాళ్లు ఉంటే వాళ్లని పెన్నిధిలా కాపాడుకోండి. మనం ఎలా బతకాలో... ఎలా బతికితే జీవిస్తామో చెప్పగలిగేది వాళ్లే! రెండోది కోరిక తీరడం కోసం భగవత్ప్రార్థన చెయ్యకండి. ఫలితం ఉండదు. మిమ్మల్ని మీరు సంపూర్ణంగా తీర్చిదిద్దుకోవడం కోసం ఆ పరమేశ్వరుని ఆశ్రయించండి. ఫలితం చక్రవడ్డీలా పెరుగుతుంది!! ఇక అందరూ లేచి తృప్తిగా భోజనం చెయ్యండి!" అన్నాడు.

సావిత్రమ్మ, హృదయ్ ఇద్దరూ చిరునవ్వుతో ఒకరినొకరు చూసుకున్నారు! "అనన్యాశ్చింతయంతో మాం.." మైక్ లోంచి ఘంటసాల స్వరంతో శ్రీకృష్ణ పరమాత్మ పలుకుతున్నాడు!

***

**పేరు లక్ష్మీ గాయత్రి. విశాఖపట్నం నివాసిని. 1980 లో ఇంగ్లీష్ లిటరేచర్ లో డిగ్రీ తీసుకున్నాను. రచయిత్రిగా నా గతమంతా సార్వభౌముల ఖడ్గ చాలనంలోనూ, పంచకళ్యాణి గుర్రాల పరుగులోనూ గడిచింది. 1983 నుంచి దాదాపు 30 సంవత్సరాల పాటు చందమామ పిల్లల మాసపత్రిక లో కథలూ, సీరియల్స్ రాశాను. అన్నిటి కంటే పెద్ద సీరియల్ "స్వర్ణ సింహాసనం" 2000 లో పబ్లిష్ అయింది. ఆ రోజుల్లోనే ఆంధ్ర పత్రిక (నా మొదటి కథ ఆంధ్ర పత్రిక లోనే వచ్చింది) స్వాతి వీక్లీ, మంత్లీ ల్లో నా కథలు వచ్చాయి. 1983లో ఈనాడు సబ్ ఎడిటర్ ఉద్యోగానికి ఇంటర్వ్యూ కి వెళ్లి, రామోజీరావు గారి ప్రశంసల్నీ, ఉద్యోగాన్నీ గెలుచుకోవడం. కానీ కారణాంతరాల వల్ల అసలు ఆ ఉద్యోగంలో చేరకనే పోవడం నా దురదృష్టం. విశాఖపట్నం లోకల్ పేపర్ లో పన్నెండు సంవత్సరాలు పనిచేసి, ప్రస్తుతం ఇంటిపట్టునే ఉంటున్నాను.**

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 477

# నీవు పాడే పాట..



**ఎమ్. రామలక్ష్మి**
**80084 44415**

నేను ఒక పాటని. చాలా రోజుల కిందటి సంగతి, "ఓ సజనా! బరఖా బహార్ ఆయి.." అని సుగుణ గొంతులోంచి నేను మళ్లీ మళ్లీ పుడుతూనే ఉండే రోజులవి. ప్రతి రోజూ తను మధ్యాహ్నం మూడయ్యేసరికి పొయ్యి మీద టీ పెట్టి గ్రాంఫోన్ లో మేముండే రికార్డ్ పెట్టేది. అందులో మేము నాలుగు పాటలం ఉన్నాం, అయినా తను నా దగ్గరే స్టైలస్ స్టిక్ పెట్టేది. మిగితావారందరూ నన్ను ఈర్ష్యగా చూస్తుంటే నాకు భలేగా ఉండేది. రికార్డ్ లోనుంచి రావడం అందరిముందూ గొప్పగా ఉన్నా, సుగుణ గొంతులో నుంచి రావడం నాకు ఇంకా హాయిగా ఉండేది. సుగుణకి పెళ్లయ్యాక, నాగ్ పూర్ శంకరం దగ్గరకి వచ్చినప్పుడు, శంకరం ఇచ్చిన మొదటి బహుమతి ఈ రికార్డ్.

నాగ్ పూర్ లో రైల్వే క్వాటర్స్ లో ఉండే తెలుగువారందరికీ సుగుణ పాటలు తెగ నచ్చుతాయి. వాళు వచ్చినప్పుడల్లా తనని పాడమని అడుగుతారు. తెలుగు పాటలు చాలా బాగా పాడుతుంది తను. ఎవరైనా హిందీ వాళ్లు వస్తే నాకు చాలా సంబరం. వాళ్ల ముందు ఫస్ట్ నన్నే పాడుతుంది సుగుణ. అందరూ తనని మెచ్చుకుంటే నాకు ఎంత సంబరమో.

తను టీ తాగుతూ మమ్మల్ని వింటుంటే కూడా ఎంత హాయిగా ఉండేదో. ఎందుకంటే సుగుణ పాడడమే కాదు, చాలా బాగా వింటుంది, పాటే తానైపోతుంది.

సుగుణ దగ్గరకి తెలుగు ట్యూషన్ కి పిల్లలొస్తారు. వాళ్లకి సుగుణ చెప్పే కబుర్లూ, కథలూ, చిన్ని చిన్ని పాటలూ చాలా సరదాగా వింటారు. ట్యూషన్లు బానే ఉంటాయి కానీ, ఇవి మొదలయ్యాక తన గొంతు లోనుంచి జారి పడే అవకాశం నాకు కాస్త తగ్గింది. ఒకసారి తెలుగువాళ్ల ఫంక్షన్లో ఎవరో చెప్పారు, తను ఒక తెలుగు పాట చాలా బాగా పాడుతుందని, అందరూ తనని పాడమని బలవంతం చేసారు. సుగుణ సున్నితంగా మెల్లిగా మెత్తగా 'మనసున మల్లెల మాలలూగెనే%ా%.' అని మొదలు పెట్టింది. ఏమా మార్ధవం, ఏమా ఆర్ధ్రత... పరాయి భాష పాటైనా, నా మనసు ఆర్తి తో చెమ్మగిల్లింది. ఆ రోజు రాత్రి శంకరం సుగుణని దగ్గరకు తీసుకుని "ఎందుకంత బతిమాలించుకున్నారు అమ్మాయిగారు" అని అడిగాడు.

అందులో మల్లీశ్వరి మళ్లీ విడిపోతామేమో అన్న బాధతో, భయంతో పాడుతుంది కదా, నాకు ఎప్పటికీ అలాంటి బాధ వద్దు బాబూ. అందుకే అందులో పూర్తిగా లీనమయ్యి పాడలేను" అంది శంకరాన్ని హత్తుకుపోతూ.

మరి పూర్తిగా లీనమయ్యి ఇష్టంగా పాడే పాట ఏమిటో "అని అడిగాడు శంకరం సుగుణ సోగ కళ్ళలోకి చూస్తూ, ఆమె జడతో ఆడుకుంటూ. నేను ఆత్రంగా చూస్తున్నాను ఏమంటుందో అని. పక్కన ఉన్న రికార్డ్ లోనుంచి 'రసిక్ బలమా' 'ఆజారే పరదేశి ' , 'యే షాం కీ తన్ హాయియా' ఇవన్నీ కూడా ఆత్రంగా చూస్తున్నాయి. దానికి తోడు సుగుణ పెళ్లికి ముందు పాడుకున్న తెలుగు పాటలు కొన్ని చాలా ఎదురు చూస్తున్నాయి.

కానీ సుగుణ శంకరాన్ని లాలనగా హత్తుకుంటూ ఒళ్లో పడుకోబెట్టుకుంటూ 'సడి సేయకో గాలి, సడి సేయబోకే' అంటూ ఒక తెలుగు పాటనీ మెత్తగా బంగారు తల్లిలా జో కొడుతూ పాడింది. శంకరం ఆమె ప్రేమలో కరిగిపోతూ నిదురపోయాడు.

నాకు సంతోషంతో కూడిన ఈర్ష్య వచ్చింది. నాకు లోపల ఏదో నమ్మకం, నిద్ర జోకొట్టడానికి పాడింది కానీ, నేనంటేనే తనకి ఇష్టం. కొంచెం మబ్బు పట్టగానే, రికార్డ్ పెట్టి, పనులు చేసుకుంటూ నన్నేగాపాడుకుంటూ ఉండేది.

సుగుణ ఏ పని చేసినా కూని రాగాలు తీస్తూనే ఉండేది. పక్కింటావిడ కబుర్లు చెప్పడానికి వస్తే పాల మీగడ లాంటి గలేబాల మీద బుల్లి బుల్లి అందమైన పూలు కుడుతూ అందమైన జడని ఒక చేత్తో వెనక్కి తోసుకుంటూ సొగసుగా మాట్లాడేది. చేసేది ఏ పనైనా ఎంత అందంగా చేసేదో.

శంకరం మంచివాడు, సుగుణ అంటే ప్రాణం, ఒకసారి ఎదో ఒక నైట్ డ్రస్ తెచ్చాడు వేసుకోమని, "ఛీ.. ఛీ..! నేను వేసుకోన" నింది సుగుణ. "ఇంట్లో రాత్రి పూట వేసుకోవడానికి కూడా నీకు అభ్యంతరం ఏమిటి" అన్నాడు శంకరం. వాళ్ళిద్దరూ పోట్లాడుకోవడం అదే మొదటిసారి. మళ్లీ ఉదయానికల్లా రాత్రి పోట్లాడుకుంది

మరచిపోయి మళ్ళీ కలిసిపోయారు. సుగుణ రోజూ లాగే ఉదయం పూజ చేసుకొని సుప్రభాతం చదువుతూ శంకరాన్ని లేపుతుంటే మేము హమ్మయ్యా అనుకున్నాం.

రోజులు మూడు తెలుగు పాటలూ, ఆరు హిందీ పాటల్లా మధురంగా గడిచిపోయాయి. గ్రాంఫోన్ ప్లేయర్ కి, మా రికార్డ్ లకీ మంచి స్నేహం ఉండేది. మేము గ్రాంఫోన్ ప్లేయర్ ని "మావయ్యా" అని పిలిచేవాళ్లం. మావయ్య మీద గిర గిరా తిరుగుతూ పాటలు బయటకి వస్తుంటే మాకు చాలా బావుండేది. ప్రతి సంవత్సరం కొత్త రికార్డులు ఏవో ఒకటి వచ్చినా ఇంకా మా రాజ్యమే నడుస్తూ ఉండేది.

చూస్తుండగా సుగుణ కీ, శంకరానికీ ముగ్గురు ఆడ పిల్లలు పుట్టారు. శంకరానికి ఆంధ్ర ప్రదేశ్ కి ట్రన్స్ ఫర్ అయ్యింది. బొబ్బిలి వచ్చాక హిందీ పాటల సందడి బాగానే తగ్గిపోయింది.

మా గ్రాంఫోన్ మావయ్య కి కొత్త రికార్డులు ఎన్నో పరిచయం అయ్యాయి. ముత్యాల ముగ్గు డైలాగులూ, ఘంటసాల గారి ప్రైవేటు పాటలూ మమ్మల్ని బానే వెనక్కి నెట్టేసాయి. అయినా సుగుణ పిల్లలకి జడలు వేస్తూ, సాయంకాలం దీపాలు వెలిగిస్తూ, జాజి పూల మాలలు కడుతూ పాడే మధుర గీతాల్లో నాకెప్పుడూ చోటు ఉంటూనే ఉండేది. కాకపోతే ఒక కొత్త చిక్కు వచ్చింది, సుగుణ పెద్ద కూతురు సంధ్య కి కాస్త సంగీతం రావడం మొదలుపెట్టింది. దాంతో ఒక వృద్ధ వీణ మాస్టారుతో వీణ నేర్పించడం మొదలుపెట్టారు. ఆయన ఠంచనుగా సాయంత్రం 4 గంటలకల్లా వచ్చేవారు. సుగుణకి ఇంక తీరిగ్గా టీ తాగుతూ మమ్మల్ని పలకరించే టైం లేకపోయింది.

ట్యూషన్ కి చాప వేయడం, వీణ తీసి రెడీ పెట్టడం, సంధ్య ని కూర్చోపెట్టడం, దీనితోనే సరిపోయేది. నిజానికి నేర్పేది సంధ్యకే అయినా నేర్చుకునేది సుగుణే. పక్కనే కూర్చుని, వీణని చూస్తూ చూస్తూ నేర్చేసుకుంది సుగుణ.

మాస్టారు వెళ్లగానే పిల్లలు ముగ్గురూ పొలోమంటూ బయటకు పరిగెత్తేవారు ఆటలని. అప్పుడింక సరస్వతీ దేవి వాయిల్ చీర కట్టుకుని వయ్యారంగా కూర్చుని వీణ వాయిస్తున్నట్లు సుగుణ చకచకా ఆవాల్టి పాఠాన్ని పాడుకుంటూ వాయించేసుకునేది. కొన్ని సార్లు, మా పంట కూడా పండేది. మమ్మల్ని వీణ మీద పలికించాలని సుగుణ ప్రయత్నాలు చేస్తూ ఉండేది. స్వరాల్ని కూడబలుక్కుంటూ, రాగాల్ని ఊహిస్తూ మొత్తానికి మాకు వీణా స్పర్శా సౌఖ్యాన్ని కలిగించేది. తనకి సరిగ్గా వచ్చే వరకూ చేసే సాధన కు పిల్లలు నవ్వులూ, కేరింతలూ, పక్క వాద్యాలు. అవి బంగారం రోజులు.

ఉద్యోగం లో శంకరానికి పని వత్తిడి చాలా ఉండేది. దాంతో ఒకప్పటిలా గోముగా పాటలు పాడమని అడిగే దృశ్య కావ్యాలూ, మోహన రాగాలూ తగ్గినా, వారి అనుబంధం మాత్రం చెక్కుచెదరకుండా మౌన రాగాలు పలికిస్తూ సాగిపోయింది. కొత్త సినిమాలూ, కొత్త పాటలూ, ఇంట్లో వీణా గానాలూ, వీటితో మా హిందీ పాటలం బానే వెనక్కి పడ్డాం. మా గ్రాంఫోన్ మావయ్య మాత్రం చాలా బిజీగా ఉండేవాడు.

ఒక్కసారి మమ్మల్ని ఎవరైనా వింటే బాగుండు తనని పలకరించగలుగుతాం అనిపించేది. ఇంతలో ఒక దారుణం జరిగింది. ఒక చిన్న డబ్బా మమ్మల్ని శాశ్వతంగా వెనక్కి నెట్టేసింది. ఈ చిన్న డబ్బా.. టేప్ రికార్డర్ అని, ఎప్పుడంటే అప్పుడూ, ఎక్కడంటే అక్కడ చాలా సులువుగా పెట్టేసుకోవచ్చు, దాంతో హఠత్తుగా మమ్మల్ని ఎవరూ పట్టించుకోకుండా అయిపోయింది.

మేమంటే పాటలం గాబట్టి రికార్డు మీదా ఉండగలం, క్యాసెట్టు మీదా ఉండగలం, కానీ పాపం గ్రాంఫోన్ మావయ్య అలా కాదు కదా. ఎక్కడికి వెళ్ళిపోయాడో తెలీదు, మళ్ళీ ఎప్పుడూ చూడలేదు.

పాత పాటల పల్లకీ జ్ఞాపకాల్ని మోసుకుంటూ అలమరాలెక్కింది. కొత్త పాటలు జోరుగా హుషారుగా కారులో షికారు కొడుతున్నాయి. ప్రతి సంవత్సరం ఎన్నో వందల పాటలు పుడుతుంటే, ఆపాత మధురాల్ని తట్టి పలకరించడానికి ఏ గొంతుకి మాత్రం కుదురుతుంది?

సుగుణ మాత్రం మబ్బు పట్టగానే ఒక్కసారి నన్ను పాడుతుంది. ఆ గొంతుని ఆర్ద్రంగా తడుముకుంటాను మళ్ళీ ఎప్పటికి పిలుస్తుందో కదా అని.

కాలం తెచ్చే కొత్త మార్పుల్ని చూస్తూ చూస్తూ అలమారాలో ఓ మూలగా జీవితాన్ని గడిపేసాము. నేను అప్పుడప్పుడూ రేడియోలో వినపడతాను గానీ, అది పూర్తిగా నేను కాదు. సుగుణకి వినపడి ఆమే గొంతులోనుంచి, తన కంఠాంతరంలో నుంచి బయటపడే నేనే నేను.

సుగుణ లాంటి బంగారాలు అమ్మలయ్యి, అమ్మమ్మలయ్యి బాధ్యతల్ని తలమీదకెత్తుకొని పాటల్ని గుండెల్లో పెట్టిమూసేసారు. వేసవి వెన్నెలలో పెరట్లో మడత మంచాల మీద మల్లెపూల సువాసనల మధ్య మెత్తటి చీర కట్టుకొని వత్తైన జుట్టుని జడగా అల్లుకుంటూ, పిల్లలకీ కథలు చెప్తూ, మమ్మల్ని కూడా ప్రేమగా పిలిచి తన గొంతుతో హత్తుకున్న ఆ అందాల రాసి మమ్మల్ని మళ్ళీ అలా పిలవడం ఇంక కలే.

సుగుణ చూస్తుండగా సుగుణమ్మ అయ్యింది, అమ్మమ్మ అయ్యిందిగా మరి. పిల్లలు ఎప్పుడైనా పాడమంటే, అబ్బే గొంతులో జీర వచ్చిందర్రా అని పాడడం ఎప్పుడో ఆపేసింది. ఆ జీర మమ్మల్ని కోస్తుందనీ, మాకు నొప్పెడుతుందనీ తనకి భయం పాపం.

ఆ జీర ను మేము లెక్క చేయమనీ, ఆమె గొంతులో నుంచి రావడం మాకెంతో ఇష్టమనీ తనకి తెలీదుగ పాపం. ఎవరైనా తనని బలవంతపెట్టి మమ్మల్ని పిలిపిస్తారనీ ఎంతో ఆశ ఎదురు చూస్తుంటాను. టీవీలు వచ్చాక, పాటల కార్యక్రమాలు పెరిగాక ఎంతోమంది పాత పాటలు పాడుతున్నారు. కానీ, నన్ను పెద్దగా ఎవరూ పాడలేదు. ఎవరైనా నన్ను పాడినా కూడా నాకు ఆనందం ఏమీ లేదు. కానీ, అది విని నన్ను గుర్తు చేసుకుని, సుగుణేమన్నా నన్ను గొంతు చేసుకుంటుందేమో అని ఆశ. ఎన్నోసార్లు వర్షపు

రాత్రులు ఎదురుచూసాను తనకి నేను గుర్తొస్తానేమోనని, అసలు తనకి ఆ ధ్యాసే లేదు. నాకు శంకరం మీద పిచ్చి కోపం వస్తుంది. అప్పట్లో అంత గోముగా అది పాడు, ఇది పాడు అని అడిగేవాడు, అంతలా ఎలా మర్చిపోయాడు.డాబా మీద చాపలు పర్చుకొని, వెన్నెల్లో నక్షత్రాల కింద పడుకుని పాడుకునే పాటల కంటే బాగున్నాయా ఈ టీవీలో ఎవరో పాడే పాటలు. ఏసీలు, ఫ్యాన్లూ... ఉక్కిరిబిక్కిరిగా లేదా వీళ్లకీ??

ఆరుబయట కూర్చుని నీలి మేఘాలలో గాలి కెరటాలలో అని ఎంత బాగా పాడుకునేది సుగుణ, మరి ఆ గదుల్లోనే పనుల మధ్యలో ఉంచేస్తే గొంతు పూడుకుపోయిందేమో పాపం, పాడడమే ఆపేసింది. పాడే గొంతు ని పూడ్చేస్తే ఊరుకుంటుందా , సుగుణ మెత్తని గుండెని వత్తిడి చేసింది. వీణలు మీటాల్సిన చెయ్యి ఏవేవో పనులు చేయాలంటే ఎందుకు వింటుంది? ఇంక లేవనంది. పాటని మర్చిపోయేటట్టు చేసిన జీవన శైలి బ్రైన్ స్ట్రోక్ రూపంలో వచ్చి అన్నీ మర్చిపోయేట్టుగా చేసింది. మంచాన పడేసింది.

తనే లోకంగా బ్రతికిన సుగుణ, మౌనంగా తన లోకంలో తాను ఉంటుంటే ఎలా తట్టుకోవాలో తెలీలేదు శంకరానికి. ముగ్గురు కూతుర్లూ వచ్చారు, సుగుణని చంటి పిల్లలా చూసుకున్నారు.

ఏ భావమూ లేని స్వచ్ఛమైన కళ్ళతో వాళ్లని చూస్తుండేది సుగుణ. అందరూ ఇంట్లో నే ఉండడం, పిల్లలు ఇంట్లోనే ఉండడంతో, ఎవరో మొత్తానికి పెట్టెలో ఉన్న రికార్డులను తీసి అలమరాలో పెట్టారు. నేను ఉన్న రికార్డు పైకి కనపడుతూ ఉండేది. సుగుణ నిశ్చలమైన చూపులు అన్నిటినీ ఒకేలా చూస్తున్నాయి. నన్ను గుర్తుపట్టలేదా, ఈ రికార్డు చూసి నేనేమైనా తన మనసులో మెదిలితే, అనక గతం ఏమన్నా గుర్తుకు వస్తుందేమో అని ఆశ నాకు. కానీ, ఏమి లాభం?? తన గొంతులో నన్ను ఇంక ఎప్పటికీ నింపుకోలేదు కదా అని పుట్టెడు దు:ఖం వస్తోంది నాకు తనని చూస్తుంటే.

తమకెన్నో తీపి గుర్తులిచ్చిన తల్లికి తామే గుర్తులేకపోవడం చాలా కష్టంగా ఉంది కూతుర్లకి. కూతుర్లూ, మనవలూ, మనవరాళ్లూ కళ్ళ ముందే తిరుగుతున్నా, ఏ భావం లేకుండా స్వచ్ఛంగా చూపులు ప్రసరిస్తూ నిర్వికారంగా ఉంది సుగుణ.

ఒకరోజు పెద్ద మనవరాలు అలమరా లో నేను ఉన్న రికార్డు ని తీసి ఇది ఏమిటి తాతయ్యా అని అడిగింది. నా దృష్టి అంతా సుగుణ మీదే ఉంది. వాళ్లంతా మాట్లాడుకుంటూ ఉన్నారు. శంకరం ఆ రికార్డు ఎలా ఉండేవో ఆ రోజుల్లో, గ్రాంఫోన్ మీద ఎలా పెట్టేవారో చెప్తున్నాడు పిల్లలకి. సుగుణ కళ్ళల్లో వచ్చిన చిన్న మార్పుని గమనించలేదు ఎవరూ.

హఠాత్తుగా ఆఖరి మనవరాలు “అమ్మమ్మ తల తిప్పి మన వైపు చూస్తోంది” అంది. ఒక్కసారి శంకరం “సుగుణా, సుగుణా” అంటూ దగ్గరరకి వెళ్ళాడు.. అందరూ ఆ రికార్డు ని ఎలా ప్లే చేయాలి అనే హడావుడి లో ఉన్నారు. అయ్యో శంకరం ఇంకా

గుర్తు రాలేదా, పోనీ నన్ను ఏదైనా టేప్ రికార్డరో అయినా పెట్టి వినిపించొచ్చు కదా. సెల్ ఫోన్ లొ కూడా వినిపిస్తారు కదా. నేను ఎవరికీ తట్టలేదు ఏంటి?

ఎవరో చెప్పారు పాత గ్రాంఫోన్ రికార్డులు దొరికే షాపు ఒకటి ఉందని. అర్జెంట్ గా మనిషిని పంపి తెప్పించారు. నాకు ఎక్కడో ఆశ, గ్రాంఫోన్ మవయ్య ఏమన్నా వస్తాడేమోనని. కానీ కాదు, ఇంకేదో పాత గ్రాంఫోన్ ప్లేయర్ వచ్చింది.

నేను ఉన్న రికార్డుని పెట్టి ప్లే చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. సుగుణ చూపులన్నీ ఆ రికార్డు కవర్ మీదే ఉన్నాయి. వీళ్లెవరికీ తెలీదు. శంకరానికేమో గుర్తురావడం లేదు. సుగుణ నన్ను కోరుతోంది, నన్ను వినాలని అడుగుతోంది, అందులో నేను ఉన్నానని వీళ్లకి తెలీదు. అయ్యో ఎలా?? ఆ పాత రికార్డు ప్లేయరు బరబరా గీరుతోంది, కానీ మేము బయటకి రాలేక పోతున్నాము. ఇక నేనే ఎలాగోలా బయటకి రావాలని ప్రయత్నం చేసాను. “ఓ సజనా... బరా బహార్ ఆయి..”

ఓహ్ అని అందరూ చప్పట్లు కొడుతూ రికార్డర్ పని చేసిందని సంతోష పడుతున్నారు. “బర్సే పుకార్ ఆయి” అని ఇంకా నేను వస్తున్నాను. నేను సుగుణ వంకే చూస్తున్నాను. ఆమె కళ్లు ఒక్కసారి ఆనందంగా వెలిగాయి. తన పెదాల మీదకి చిన్న చిరునవ్వు వచ్చి గాలిలో కలిసిపోయింది. నన్ను పలకరించింది... నన్నే పలకరించింది.

అమ్మమ్మ నవ్వింది” అన్నారు పిల్లలు, ఇంతలో పాట ఆగిపోయింది . ఎవరో మళ్ళీ ప్రయత్నం చేస్తున్నారు పాట రావాలని... కానీ నేనింక రాను, సుగుణ వెళ్లిపోయింది, అది నాకే తెలుసు. వీళ్లింకా గమనించలేదు. ఇంక నేను వినబడను.

బయట చిన్నగా వాన పడుతోంది, ఇలాంటి వానంటే సుగుణ కి ఎంత ఇష్టమో, నేను వెళ్లాలి, నీలి మేఘాలలో తను మళ్లీ కలుస్తుందేమో.. శెలవా మరి.

–మేరా

**ఎం.రామలక్ష్మి స్వస్థలం పాలకొల్లు. శ్రీకాకుళం జిల్లాలో విద్యాభ్యాసం కొనసాగించారు. తిరుపతి మహిళా యూనివర్సిటీ నుంచి ఎంఏ (సోషల్ వర్క్) పట్టా అందుకున్నారు. యూఎస్ఏలో ఎంఎస్ (కంప్యూటర్ సైన్స్) చేశారు. ఏడేళ్ల అమెరికావాసం తరువాత.. 2001 నుంచి 2018 వరకూ తెలుగు టెలివిజన్ రంగంలో వివిధ స్థాయుల్లో బాధ్యతలు నిర్వహించారు. మా టీవీ పునాది కార్యక్రమల రూపకల్పన, భక్తి టీవీ, ఎస్వీబీసీలలో ప్రోగ్రామింగ్ అధికారిగా, భారత్ టుడే చానల్‌కు కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహించారు. భారత్ టుడే చానల్‌లో ‘చెప్పాలని ఉంది’ కార్యక్రమ్మనికి ప్రయోక్తగా అనేకమంది ప్రమ–ుఖులను ఇంటర్వ్యూలు చేశారు. ‘అమ్మ’ జ్ఞాపకంతో రాసిన ‘నీవు పాడే పాట’.. రచయిత్రికి మొదటి కథ.**

# కాకతీయ కేతనం



మత్తిభానుమూర్తి
9989371284

"గణపతి దేవుడు.. ఏడి?"

ఎవరో చిన్నగా అన్నారు.

"ఇక్కడే ఉన్నాడే.." "అయ్యో .. ఏడి.." "గణపతి దేవా.. యువరాజా ఎక్కడున్నారు?" "గణపతి దేవా.. దేవా.."

"అయ్యో.. కనపడటంలేదు. వెదకండి వెదకండి.."

సైనికులు అటూ ఇటూ పరుగులు పెడుతున్నారు.

అది యుద్ధభూమి. అక్కడ శవమై పడిఉన్నాడు కాకతీయ మహారాజు మహాదేవుడు. యుద్ధగజం అంబారిలో తండ్రి సరసనే కత్తి ఝుళిపిస్తూ కనిపించిన యువరాజు గణపతిదేవుడు తండ్రిమరణించాక మాయ-ంమైపోయా డు. అంతకు ఐదుఘడియల ముందు కాకతీయమహారాజు మహాదేవుడు కత్తిదూసి యుద్ధంచేస్తూ అంబారి నుండి క్రిందికి దూకాడు. అప్పుడే వెనుకనుండి ఓ శత్రుసేనాపతి విసిరిన బాణం దూసుకొచ్చి ఆయనకు వెనుక నుండి ఎడమ డొక్కలో దిగబడింది. అయినా తట్టుకున్నాడు. మీదకు దూసుకొస్తున్న శత్రువీరులను ఎదుర్కున్నాడు. కాని శక్తి క్షీణిస్తున్న మహాదేవుడ్ని శత్రు సైన్యాధ్యక్షుడు అత్యంత నైపుణ్యంతో దూకుడుతో మీదకు వెళ్లి పోరాడి సంహరించాడు. చుట్టూ ఉన్న అంగరక్షకులు, కాకతీయవీరులు ఆయనను రక్షించలేక పోయారు. నేలవాలిన తమ మహారాజు పార్థివశరీరాన్ని నీరునిండిన కన్నులతో చూడటం మినహా మరేమీ చేయలేక పోయారు.

పరుగుపరుగున వచ్చి పడ్డాడు రేచర్ల రుద్రయ..

కాకతీయ సైన్యాధ్యక్షుడు. అతన్ని దూరంగా యుద్ధంలో నిమ గ్నుడిని చేసి ఇక్కడ మహాదేవుడ్ని నిర్జించారు.

మహాదేవుడ్నిచూసి బావురుమన్నాడు రుద్రయ. మహారాజు శిరస్సును వొడిలో జేర్చుకుని విలవిలలాడి పోయాడు. "రెండు ఘడియలు.. రెండే రెండు ఘడియలు కాపాడలేకపోయారా నీచులారా.. నేనే వచ్చి కాపా డుకునేవాడిని. మహారాజును పొట్టన పెట్టుకున్నాము కదరా. ఇప్పుడు అనుమకొండ ఎలా వెళ్ళాలి.. మహా రాజు మృతదేహంతో వెళ్లి కాకతీయప్రజలకు ఏమి సమాధానం చెప్పాలి.. ఎలా జవాబు చెప్పాలి.."

కుమిలిపోతున్నాడు అరివీర భయంకరుడు రుద్రసేనాని. మహాదేవుడి నిర్జీవశరీరాన్ని చూస్తూ తల్లడిల్లి పోతు న్నాడు. శత్రువులను బూతులు తిట్టాడు. చేతకాని కాకతీయ సైనికులపై అరచాడు. గావుకేకలు వేశాడు.

యుద్ధ భూమిలో తలోదిక్కున యుద్ధం చేస్తున్న మహామహా కాకతీయ వీరయోధులు పిల్లలమర్రి బేతిరెడ్డి, చెరుకు బొల్లయ, విరియాల సూరన, మల్యాల కాటయనాయకుడు, కామిరెడ్డి, విరియాల బేతరాజు, చౌండ.. మహారాజు ధ్వజకేతనం కూలడం చూసి పరుగుపరుగున అక్కడికి వచ్చారు. మహాదేవరాజు శవమై రుద్రయ ఒడిలో ఉండటాన్ని చూసి దిగ్భ్రమతో నిలబడిపోయి ఆనక ఆయన శరీరంపై పడి ఏడవసాగారు.

అప్పుడు గొణిగాడు దళపతి నాచన, "యువరాజు.. మన గణపతిదేవుడు.."

చివ్వున చూశాడు రుద్రయ.. "ఏడి.. యువరాజు ఎక్కడ?" ఎక్కడా కనిపించలేదు.

"శత్రువులు అపహరించుకు పోయారు సేనాని.."

మరుక్షణం నాచన తల వొక్కవేటుతో తెగి ఆవలపడింది. ఆయన కరవాల ప్రహారానికి మరో తల అందకుండా అందరూ నేలపై పడిపోయారు. "క్షమించండి మహాసేనాని.. క్షమించండి.."

ఇప్పుడు అసలుసమస్య మహారాజు మరణించడం కాదు. ఇప్పుడు కాకతీయరాజ్యం రాజులేని శ్మశానరాజ్యం. ఎవ్వరూ లేని నిస్సహాయ. శత్రువులంతా తలో వైపు కమ్ముకుంటారు.

అటూ ఇటూ చూశాడు.

కాకతీయ మహారాజును చంపి యుద్ధంలో విజయం సాధించిన దేవగిరిమహారాజు జైత్రపాలుడు గాని, దేవగిరి సైన్యాధ్యక్షుడు జల్లన, ప్రధానమంత్రి బసవసురుడు.. ఏరి కనిపించరేం.. మహాదేవుడి పార్ధీవదేహాన్ని వదిలేసి వెళ్లి పోయారేం.. మహాదేవుడి శిరస్సును ఖండించి తమతో తీసుకుపోయి దేవగిరిలో కందుకక్రీడ ఆడటానికి ఎందుకు ఆసక్తి చూపలేదు.. కాకతీయ ఛత్ర కేతనాలను..ఇతర రాజరికహెూదాలను స్వాధీనపరచుకోలేదు?.. గణపతి దేవుడ్ని తీసుకుని మాయమయ్యారంటే వాళ్ళ ఆలోచన ఏమిటి..

రుద్రయ ముందు తేరుకున్నాడు. సేనానులను, దళపతులను చూస్తూ అన్నాడు, "మహారాజు మహాదేవుల వారు వీరమరణం పొందారు. యువరాజు గణపతిదేవుడు కోటలో ఉన్నారు.. ఇదే అందరికి.. రాజధానిలోని సాధారణ ప్రజలందరికీ ఇదే చెప్పాలి.. అర్ధమైందా.. నేనన్నది విన్నారా.. ఏం చెప్పాలి?!.. యువరాజు కోటలో ఉన్నారు!!.. సరేనా.."

అందరికి అర్ధంఅయ్యింది. వాళ్ళంతా సైనికులు. రాజు చనిపోయి, యువరాజు శత్రువులకు చిక్కాడంటే సాధా రణ ప్రజల్లో కలిగే అలజడి, శత్రురాజుల్లో తొణికే రణోత్సాహం వారు అర్ధంచేసుకోగలరు.

"అలాగే మహాసేనాని.." అన్నారు.

కళ్ళు తుడుచుకుని లేచి అందరిని మహాదేవరాజు శవంచుట్టూ నిలబెట్టి ప్రమాణం చేయించాడు. "మనం యువరాజు గణపతిదేవుని తోడ్కొని మాత్రమే తిరిగి అనుమకొండ వెళతాం.. లేదా ఇక్కడే మరణిస్తాం. అప్పటి వరకూ స్కంధావారం విడిచి వెళ్ళం. ఇది మన మహారాజు శ్రీశ్రీశ్రీ మహాదేవులవారి పార్ధీవ శరీరంపై ఆన.." వంట్లో సలసలమండుతున్నరక్తం నిలువెల్లా పొంగుతుండగా.. అందరూ నిండుహృదయంతో, ముక్తకంఠంతో నినదించారు.

అనంతరం మహాదేవుని శరీరాన్ని రుద్రయ భుజాన వేసుకున్నాడు. స్కంధావారానికి చేరారు.

నిజానికి దేవగిరిపై యుద్ధం ప్రకటించి మొదట దండయాత్ర చేసినవాడు కాకతీయ మహాదేవరాజే. ఈయనకు ముందు కాకతీయరాజ్యాన్ని పాలించిన తన అన్న రుద్రదేవరాజు మరణానికి జైత్రపాలుడే కారణం అని మహా దేవుడి అభిప్రాయం.

అనుమకొండకు పక్కలో బల్లెంలా ఉంది దేవగిరిరాజ్యం. ఇరురాజ్యాలమధ్య ఐదేళ్ళుగా నిరంతరం యుద్దాలు తప్పడంలేదు. సేవణులుగా పిలవబడే యదువంశానికి రాజు జైతుగి అనబడే జైత్రపాలకుడు.. శత్రు భీకరుడు. ఇటీవల కాకతీయులపై కత్తికట్టాడు. క్రీ.శ.1195లో రుద్రదేవుడి మరణంతో కాకతీయరాజ్యానికి పరీక్షాకాలం ఎదురయ్యింది. రుద్రదేవుడు నిజమైన మహానేత. ప్రజలు రుద్రదేవుడ్ని మర్చిపోలేకపోతున్నారు.

సైన్యమంతా స్కంధావారానికి చేరేసరికి అనుమకొండ నుండి మహాప్రధాని గంగాధరమంత్రి, మంత్రులు శాక్య శివుడు, భరద్వాజుడు తదితర ముఖ్యులు వార్త తెలియగానే హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. మహా రాజు మరణించిన విషాదం కంటే యువరాజు అదృశ్యం వారిని మరింత భయపెడుతోంది.

"యువరాజును కూడా ఆ దుర్మార్గులు సంహరించారేమో..?!!"

రుద్రసేనాని ఆ మాటను ఖండించాడు. శత్రువును ఎవరైనా యుద్ధభూమిలోనే చంపుతారు. తమ కోటకు తీసు

కుపోయి తీరుబడిగా చంపరు. కేవలం అధిక ప్రయోజన లావాదేవీల కోసమే

రాజకుటుంబీకులను బందీలుగా తీసుకుపోతారు. కానీ చిత్రంగా దేవగిరిరాజ్యం కాకతీయులపై గెలిచింది. కాబట్టి కాకతీయరాజ్యాన్ని ఆక్రమించు కోవచ్చు. సహజంగా యుద్ధానంతరం ఓడిన రాజ్యపు ఛత్ర కేతనాలను చిన్నాభిన్నం చేసి అవమానిస్తుంది.

సప్తాంగాలను స్వాధీనపరచుకుంటుంది. దీనిపై ఇరుపక్షాల సంధివిగ్రహిలు సమావేశం కావాలి. యుద్ధానంతర

కార్యకలాపాలు ఏమీ జరగలేదు. కేవలం మహారాజును సంహరించి, యువరాజునుబంధించి సైన్యంతోసహా వెళ్లి

పోయాడు దేవగిరి మహారాజు జైత్రపాలకుడు.

కిం కర్తవ్యమ్ ? ఇప్పుడు మనం ఏమి చెయ్యాలి??

***

"కిం కర్తవ్యం?" అంతవరకూ చెప్పి ప్రశ్నించాడు ఎలకుర్తి మండలేశ్వరుడు రేచర్ల రుద్రయ.

"చెప్పండి. అప్పుడు నా మనఃస్థితి.. ఇటు మహారాజు పార్థివదేహం, అటు యువరాజు అదృశ్యం, గెలిచిన రాజు వాళ్ళ కోటలోకి వెళ్ళి ద్వారాలు మూసుకోవడం.. మేమంతా ఓడిపోయి వాడి కోట ఈవల స్కంధావారంలో దిక్కుతోచక నిలబడిపోవడం. అప్పుడు నేనేమి చెయ్యాలో.. చెప్పండి.." అన్నాడాయన.

అప్పుడాయన ఆతుకూరిపురం గ్రామంలో రుద్రేశ్వర దేవాలయం ఆరుబయట రాతిబండలపై కూర్చుని ఉన్నా డు. ఆయన ముందు ఓ పాతికమంది వడ్దంకులు కూర్చుని రెప్పవేయ్యకుండా ఆయన చెప్పేది వింటున్నారు. అందరి మనస్సులో అదే ప్రశ్న.. అప్పుడు రుద్రయ ఏమి చేసి ఉంటాడు?!

ఆయనను అడగడం ఉత్సుకత కొద్దీ అడిగేశారు గాని ఆయనే ఇలా ప్రశ్నిస్తే ఏమి చెప్పాలో వాళ్ళకు తోచలేదు.

ఆరోజు శ. సం. 1135 శ్రీముఖనామ సంవత్సరం మధుమాస వసంత శుక్లపక్ష సప్తమి శనివారం.

తెల్లవారితే అంటే రేపే అష్టమి ఆదివారంనాడు పుష్యమి నక్షత్రాన రుద్రేశ్వరుడి ప్రతిష్టాపన ముహూర్తం. (క్రీ.శ1213 మార్చి31.)

%ప్రారంభించిన యాభైఏళ్లకు రుద్రేశ్వరాలయం పూర్తయ్యింది. ప్రతిష్టాపనోత్సవానికి అలంకారాలు జరుగుతుండ గా అక్కడక్కడా తుది మెరుగులు దిద్దుతున్నారు శిల్పులైన వడ్దంకులు. దేవాలయనిర్మాత, కాకతీయ సకల సైన్యాధ్యక్షుడు, మండలేశ్వరుడు రేచర్లరుద్రయ పక్షంరోజులుగా అక్కడేఉంటూ ముగ్గురు మహావ్యక్తులు కలలు గన్న ఆ

దేవాలయ పూర్తిరూపాన్ని దగ్గరుండి తృప్తిగా చూసుకుంటున్నాడు. ప్రక్కన రుద్రయ తల్లిదండ్రుల పేర్ల పై నిర్మిస్తున్న కాటేశ్వర, కామేశ్వర ఉపాలయాలు, నంది మండపం, లిఖిత శాసనం, దాని కోసం ప్రత్యేక మండపం.. నిర్మాణం కూడా పూర్తయ్యాయి.

పొద్దు ఏటవాలింది. పటమటిగాలి చిందులు వేస్తూ రివ్వురివ్వున చక్కిలిగింతలు పెడుతోంది.

దూరంగా ఆతుకూరు చెరువు తవ్వకం జరుగుతోంది. చెరువులోని మట్టిని తట్టలతో ఎత్తి ఎడ్లబళ్లలోకి పోస్తు న్నారు మట్టి మనుష్యులు. వారి పాటలు, మాటలు ఎడ్ల మెడళ్ళలోని చిరుగంటల సవ్వడిలో కలగలిసి గాలిలో తేలి వస్తూ కర్షక లోకపు కల్యాణానికి నాందీ గీతాల్లా చెవులకు సోకుతున్నాయి.

ఇక్కడ శిల్పుల ఉలిశబ్దాలు రాతికి దెబ్బతగులుతుందేమోనన్నస్పృహతో మంద్రంగా కళపెళలాడుతున్నాయి. అనుమకొండ వేయి స్థంభాలగుడి, ఈ ఆతుకూరు రుద్రేశ్వరాలయం రెండూ ఎప్పుడో మహారాజు రుద్రదేవుని ఊహల్లో పురుడు పోసుకున్నవే. క్రీ.శ. 1163లోనే అనుమకొండ వేయిస్థంభాలగుడి పూర్తవ్వగా ఈ గుడి మరో యాభై ఏళ్లకు ఇప్పుడు పూర్తిరూపం దాల్చింది. పునాది నుండి విమాన కలశం వరకూ అణువణువూ ప్రత్యేకత లతో యాభై ఏళ్లపాటు ఎందరో మహామహుల ఆలోచనలు, భావనలు కలగలిపి వాటికొక ఆకారం సాకారం చేసినవాడు ప్రధాన స్థపతి రామప్ప. ఎదురుగా సమున్నతంగా భాసిస్తోన్న విమాన గోపురాన్ని చూస్తూ పుల కించిపోతున్న రుద్రయకు దగ్గరగా ఓ ప్రశ్న వినవచ్చింది.

“మహాసేనాని.. కాకతీయవంశం ఆంధ్రసామ్రాజ్యాన్ని స్థాపించడానికి అహర్నిశమూ పోరాడుతున్న వంశంగా..

గణపతిదేవమహారాజు కాబోయే చక్రవర్తి అని స్థపతి రామప్ప మాతో అన్నారు. అందుకు కారణం మీరేనని.. ఆనాడు గణపతిదేవుని శత్రుసేనలు బందీని చేసి తీసుకుపోతే మీరు చేసిన గొప్పనిర్ణయాల వల్లనే కాకతీయ కేతనం అవనతం కాకుండా తిరిగి సమున్నతంగా ఎగురుతోందని అందరూ చెప్పుకుంటారు. అంతటి క్లిష్ట సమ యంలో ఇంటాబయటా మీరెంత కఠినపరీక్షలు ఎదుర్కున్నారో.. గణపతిదేవులవారిని తిరిగి కాకతీయ సింహా సనంపై ఎలా ప్రతిష్టించారో.. తెలుసుకోవాలని కోరికగా ఉంది స్వామి..”

ఓ యువశిల్పి దగ్గరగా వచ్చి అన్నాడు. విన్నాడు రుద్రయ. అప్పుడాయన చూపు గర్భాలయద్వారంపై భార్య అన్నమ తో సహా చెక్కిన తమ మిధునశిల్పం పై నిలిచివుంది.

అతని ప్రశ్నకు రుద్రయ ఏమిజవాబు చెబుతారోనని, ఉలిశబ్దాల మధ్య ముచ్చట్లు చెప్పుకోవడం అలవాటున్న వద్దంకులంతా చెవులు రిక్కించారు. రుద్రయ నిశ్శబ్దంతో ఆ యువశిల్పి మరో ప్రశ్న సంధించాడు.

“మీరే ఎందుకు అనుమకొండ సింహాసనాన్ని ఆక్రమించలేదు.. రేచర్ల వంశపాలనను ఎందుకు ప్రారంభించ లేదు?” ఇబ్బందిగా కదిలాడు రుద్రయ.

ఈ ప్రశ్న ఎప్పుడూ ఎవరో వొకరు అడుగుతూనే ఉంటారు. తనేదో గొప్ప త్యాగంచేశానని.. ఘనకార్యం సాధించా నని చెప్పుకోవడం ఆయనకు సుతరామూ ఇష్టం ఉండదు. కానీ ఇప్పుడు ఇక్కడ ఈ సమయలో ఆయనకు చెప్పాలనిపించింది. కారణం ఆ శిల్పి అన్న ఒక మాట.. “ఇంటా బయటా..”

అవును. అందరూ అడిగేది వినేది చూసేది బయటజరిగిన మంత్రాంగం.. యుద్ధాలు. కాని ఇంట జరిగిన సంఘ టనలు ఎవరూ ఎప్పుడూ అడగలేదు. తనూ ఎప్పుడూ ఎవ్వరికి చెప్పలేదు. నిజానికి చెప్పకూడనివి!!

ఆనాడు తన ఇంట జరిగిన సంఘటనలు.. ఇంటి పోరు.. గుర్తొచ్చి నవ్వుకున్నాడు రుద్రయ. ఆయన నవ్వు చూసిన శిల్పులంతా ఉలిలు ప్రక్కన పడేసి ఆయన ప్రక్కకు చేరారు. ఇక చెప్పక తప్పింది కాదు రుద్రయకు.

ఆ క్లిష్టసమయం క్రీ.శ. 1199 లో వచ్చింది.

దేవగిరిరాజు బంధించి తీసుకుపోయిన గణపతిదేవుని ఎన్నో టక్కుటమారవిద్యలను ప్రదర్శించి తిరిగి కాకతీయ

సింహాసనంపై కూర్చుండబెట్టిన సేనానుల బృందానికి అధినాయకుడు రేచర్ల రుద్ర సేనాని. కాకతీయ రాజ్యమే కాదు సర్వదేశాలు ఆయన తంత్రజ్ఞతను.. ముఖ్యంగా ఆయన త్యాగాన్ని వేనోళ్ళా కీర్తించాయి.

గణపతిదేవుడయితే కన్నతండ్రిలా చూస్తాడు. ‘కాకేత రాజ్యభార ధౌరేయుడు’ అన్న బిరుదునిచ్చి, సైన్యంలో సర్వ సైన్యాధ్యక్షుడు పైన సలక సైన్యాధ్యక్షుడు అనే అత్యుత్తమపదవి సృష్టించి జీవితాంతం ఆయనే ఉండేలా పేరోలగంలో ప్రకటించి తన కృతజ్ఞత చాటుకున్నాడు. రాజధాని అనుమకొండలో, నిర్మాణమౌతున్న క్రొత్త రాజ ధాని ఓరుగల్లులో.. రాజ్యంలోని ఏ ప్రాంతానికి వెళ్ళినా ఎదురయ్యే ప్రజల చూపుల్లో కనపడే ఆరాధన.. అభినం దన ఆయన ఈ పదిహేనేళ్ళుగా అనుభూతిస్తూనే ఉన్నాడు.

కానీ రుద్రసేనాని స్థితప్రజ్ఞుడు. తొణకని నిండు కుండ. నిత్యమూ కాకతీయ చత్ర కేతనాల పరిరక్షణే ఆయన ధ్యేయం. చెరువుల, దేవాలయ నిర్మాణం దైవప్రేరిత ప్రసాదాలుగా భావిస్తూ నిర్మిస్తూ జీవితాన్ని చరితార్థం చేసుకుంటూ సాగిపోతున్నాడా కర్మయోగి.

దేవగిరిపై యుద్ధానికి పోయి మహారాజు మహాదేవుడు మరణించడం, యువరాజు గణపతిదేవుడు అదృశ్యం కావడం, కాకతీయ స్కంధావారం ఏమి చెయ్యాలో తోచక నిలబడిపోయిన సంఘటన వరకు చెప్పి అడిగాడు రుద్రసేనాని. “కింకర్తవ్యం?”

ఎవ్వరూ చెప్పలేనట్లు మాట్లాడలేకపోయారు. తనే కొనసాగించాడు.. బయట జరిగినవి చెబుతూ ఇంట జరిగి

నవి మనసులో మననం చేసుకుంటూ..

గెలిచినరాజు ఓడిన యువరాజును బంధించి తీసుకుపోయి నిశ్శబ్దంగా ఉండటంలో

ఆంతర్యం ఏమిటి..? మన

కాకతీయమంత్రులు, సేనానులు తీవ్రంగా బుర్రలు పగలగొట్టుకుంటున్నారు స్కంధావారంలో. కలుగులో దాగిన

ఎలుకను ఎలా బయటకు లాగాలి అనేది అందరి ఆలోచన. సాధారణంగా జరిగే దౌత్యవిధానం సంధివిగ్రహిని పంపడం. అదే చేశాడు రుద్రసేనాని. సంధివిగ్రహి పాపయబట్టారకుడు వెళ్లి పక్షం రోజులయినా తిరిగి రాలేదు. కానీ మహాప్రధాని గంగాధరమంత్రి ఉద్దండుడు. ఓరుగల్లునగర అధ్యక్షుడు ఇందులూరి పెదమల్లనను, నియో గాధిపతులను, బహాత్తరనియోగాధిపతి దమ్మవీరను.. అందరిని హెచ్చరించాడు. ప్రజల దైనందినంలో ఎలాంటి ఒడుదుడుకులు ఉండరాదని ఆజ్ఞలు జారీచేశాడు. రాజ్యమంతటా ఎక్కడా నిత్యావసరాల కొరత ఉండకూడదని వర్తక సమయాల శెట్టిలందరికి వర్తమానం పంపాడు. రాజ్యమంతా ప్రశాంతత ఉన్నా ఏదో నిగూఢమైన బాధ రాజ్యమంతా వ్యాపించి వుంది.

రోజురోజుకు రుద్రయ అల్లకల్లోలమై పోతున్నాడు. మహాయోధుడైన రుద్రయకు అద్భుతమైన పోరాటపటిమ తప్ప రాజకీయం చాతకాదు. ఇలాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్న అనుభవం లేదు. అదే అన్నాడు గంగాధరమంత్రితో. ఆయనతో ఘడియ ఘడియకు చర్చిస్తున్నాడు. వార్తాహరులు అటూఇటూ అశ్వాలపై పరు గులు పెడుతున్నారు చర్చల లేఖలతో.

"మనం తెగించి కోట మీదికి పోదామంటే మనం కోట ఘడియలు తెరిచేలోగా.."

"వద్దు వద్దు.. నీభయం నిజమే. యువరాజుకు ఏదైనా కీడు తలపెట్టవచ్చు జైతుగి.." అన్నాడు గంగాధరుడు.

ఆ గంగాధరుడే మరునాడు ఓ వ్యక్తిని వెంటబెట్టుకుని స్కంధావారానికి వచ్చాడు.

"రుద్రా.. ఇతను మన చారుడు. దేవగిరికోటలో పూలమాలవాడుగా పనిచేస్తూ ఎప్పటికప్పుడు వార్తలు మనకు చేరవేస్తాడు. జైతుగి గురించి ఆసక్తికరమైన సంగతి చెబుతున్నాడు.. విను.." అన్నాడు.

రుద్రయ ఆసక్తిగా చూశాడు.. "చిత్తం మహాసేనాని. జైత్రపాలకుడు పెద్ద గందరగోళం మనిషి. బంధించి తెచ్చిన యువరాజు గణపతిదేవులవారిని ఏమి చెయ్యాలో తెలియడం లేదాయనకు. కొన్ని రోజులు రాజమందిరంలో ప్రత్యేక గదిలో ఉంచుతున్నాడు. కొన్నిరోజులు కారాగారంలో సంకెళ్ళతో కట్టి వేయిస్తున్నాడు. అసలుఎందుకు బంధించామూ!? అని సేనాపతులను అడుగున్నట్లు వినవచ్చింది."

రుద్రయ ఆశ్చర్యపోయాడు. గంగాధరమంత్రితో, ఇతర యుద్ధసేనానులతో చర్చించి దేవగిరిరాజు జైత్రపాలుని గందరగోళానికి తగినట్లు తమ యుద్ధతంత్రాలు ఉండాలని నిర్ణయించారు.

అ మర్నాడు రుద్రయ ఊహించని సంఘటన జరిగింది.

ఉదయాన్నే రుద్రయభార్య అన్నమ ముగ్గురు కొడుకులు లోకచమూపతి, పెద్దగణపతి, కాటయలను వెంట బెట్టుకు వచ్చింది. స్వతస్సిద్ధమైన వీరత్వంతో ఎదిగిన ముగ్గురూ చమూపతులుగా కాకతీయ సైన్యంలో గౌర వం పొందుతున్నారు. వారి ముఖాలు వెలిగి పోతున్నాయి. మహారాజు మరణించిన విషాదంగాని, యువరాజు బంధి అయిన బాధగాని లేదు సరికదా వారి ముఖాలలో తెలియని ఆనందం తుళ్ళిపడుతోంది.

ఆమె రుద్రయ గొల్లెనలో ఉన్న వారందరిని బయటకు వెళ్ళమని సంజ్ఞ చేసింది. వెళ్ళాక ఏకాంతంగా దగ్గరకు వచ్చి అన్నది, "అనుమకొండ అంతటా.. మీరే కాబోయే మహామండలేశ్వరులని చెప్పుకుంటున్నారు."

తుళ్ళిపడ్డాడు రుద్రసేనాని. అప్పుడర్థమయ్యింది వాళ్ళ ముఖలలోని వెలుగుకు ఆధారం. ఇలాంటి మాట ఏదో

ఇక్కడ స్కంధావారంలో కూడా గుసగుసగా అనుకుంటున్నట్లు చెవిన పడింది. కానీ పెడచెవిన పెట్టాడు.

"అలాంటిది ఏమీలేదు. వెళ్ళండి. ఇది చెప్పడానికా యుద్ధభూమికి వచ్చింది?!.." అన్నాడు తీవ్రంగా.

ముగ్గురూ తండ్రి ఇలాగే అంటాడని ఊహించగల యుక్తవయస్కులే. తండ్రిగారి ఈ కోపం మనం ముందే అను

కున్నాం కదా అన్నట్లు నలుగురూ ముఖాలు చూసుకున్నారు. పెద్దకొడుకు లోకయ చమూపతి అన్నాడు, "తండ్రి.. మన రేచర్లవంశచరిత్ర, మన తాతముత్తాతల మహోన్నత వీరత్వాలు.. అన్ని మీకుతెలుసు. మీ శక్తి యుక్తులు జగద్విఖ్యాతమే కదా. మీరు అనుమకొండ సింహాసనాన్ని అధిరోహించినట్లయితే ఎదురు ప్రశ్నించే వారెవ్వరూ లేరు. మీరు ఆ దిశగా ఆలోచన చేయకూడదా?! కాకతీయరాజ్యం తిరిగి మీ నాయకత్వాన రేచర్ల రాజ్యంగా ప్రభవిస్తుంది.."

"నోర్ముయ్..ఎవరునీకు ఈఆలోచన నూరిపోసింది? పొండి వెళ్ళిపొండి.." అరచాడు రుద్రసేనాని. మరో కొడుకు అన్నాడు, "ఇది మా అభిప్రాయమేకాదు నాన్నగారూ. మీకు చెప్పలేక ఎందరో మీవెనుక అనుకుంటున్నారు."

ఉద్వేగమూ రౌద్రమూ కలగసిన ఆయన ముఖం చూసి మౌనంగా నిష్క్రమించారు నలుగురూ.

ఇది వీళ్ళకుపుట్టిన బుద్దా.. లేక ఇతరులుకూడా ఈ అభిప్రాయాన్నే వ్యక్తపరుస్తూ ఇదే కాకతీయ రాజ్యానికి మంచి, సులభమైన పరిష్కారంగా భావిస్తున్నారా?! వాళ్ళు భావిస్తున్నట్లే తను రాజ్యాధికారం ప్రకటించుకుంటే తప్పేముంది.. ఇప్పటికే తనొక మండలేశ్వరుడు.. పరిపాలనలో తగినంత అనుభవముంది. తమ రేచర్ల వంశా నికి, కుటుంబానికి ఎంతో

ఘనచరిత్ర ఉంది.

ఎందులో? అవును ఎందులో..??

విశ్వసనీయతలో! తిరుగులేని యుద్ధ కౌశలంలో!!

కాని విశ్వాసఘాతుకంలో లేదు. అతనికి వెంటనే రేచర్ల ముచ్చారెడ్డి గుర్తొచ్చాడు. స్వయంగా అతని అన్న.

ఆయన చేసిన విశ్వాసఘాతుకానికి మహారాజురుద్రదేవుడు ఎంత వ్యధననుభవిచాడో రుద్రయకు నరనరానా వ్యాపించి ఉంది. తను ఎప్పుడూ ఆ తప్పు చెయ్యడు. కాకతీయసామ్రాజ్య స్థాపన పరిపూర్ణం కావాలి. తెలుగు మాట్లాడేవారి ప్రాంతమంతా ఏకరాజ్యంగా ఏకఛత్రం క్రిందికి రావాలి. క్రొత్తగా నిర్మిస్తున్న ఓరుగల్లు మహానగరమై ఆంధ్ర ప్రజల రాజధానిగా జగత్ప్రసిద్ధం కావాలి.

రుద్రదేవుడు తనను ప్రాణప్రదంగా చూశాడు. మహాదేవుడు, గంగాధరుడు, తను.. ముగ్గురం స్వంత అన్నద మ్ముల్లా అన్యోన్యంగా ఉండటం చూసి ఆయన ఎంతో ఆనందించేవాడు.

"మనం ఆంధ్రసామ్రాజ్యం స్థాపించాలి రుద్రా.. అందుకు మనం ఎంతో పోరాడాలి. అప్పుడే మన ఆశయం రూపు దాలుస్తుంది. సమాజం ఎన్నో తరాలు మనల్ని కొలుస్తుంది. చరిత్ర మనకొక అధ్యాయం లిఖిస్తుంది.."

ఎంత అద్భుతమైన భావన.. ముగ్గురిలో అవి నరనరానా ఇంకిపోయాయి. ముఖ్యంగా గణపతిదేవుడు ఆయ నకు ప్రతిరూపంగా ఎదుగుతున్నాడు. అందుకే ఆయన తమ్ముడి కొడుకైన గణపతిదేవుడ్ని దత్తత తీసుకు న్నాడు. మహాదేవుడు కూడా అన్నమాటకు ఏనాడూ ఎదురాడి ఎరుగడు.

కాని ఊహాతీతంగా మూడేళ్ళలోనే పరిస్థితులు తిరగబడ్డాయి. ఇప్పుడు తనను అనుమకొండ సింహాసనాన్ని ఆక్రమించమని కోరుతున్నారు. ఆక్రమించాలట.. తను ఎలా అంగీకరిస్తాడు?!

రుద్రయ ఆలోచనలను భగ్నపరుస్తూ మహాప్రధాని గంగాధరమంత్రి మరో గూఢచారిని వెంటబెట్టుకు వచ్చాడు. వెనుక బేతిరెడ్డి, బోల్లయ, మల్యాల చౌండ తదితర సేనానులు, మండలేశ్వరులు..

"రుద్రా.. ఈ గూఢచారి చెప్పేది విను. మనం మన ప్రజలకోసం గణపతిదేవుడు కోటలోనే ఉన్నాడని చెబితే

అక్కడ జైతుగి అది నమ్మేసి కంగారుపడుతున్నాడట. గణపతిదేవుడు కోటలోనే ఉంటే మరి మనం బంధిం

చింది ఎవరిని? అసలైన కాకతీయ వారసుడినా లేక మరొకడినా అని అందరి మీదా అరుస్తున్నాడట.."

గూడచారి అవునన్నట్లు తలఊపాడు వినయంగా. రుద్రయతోపాటు ఇతర సేనానుల ముఖాల్లోకూడా విభ్రమ!

"అసలే గందరగోళం గాడు.. యువరాజుకు ఏదైనా ఆపద తలపెడితే.." చెరుకు బొల్లయ సంశయించాడు.

అందరూ ఆ భయసంశయంలో ఉండగా గంగాధరుడు అన్నాడు, "వాడికి అడ్డుకట్ట వెయ్యడానికి మన పాపయ

భట్టారకుడు ఉన్నాడుకదా.." అంతా ఆయనవంక చూశాడు. "సంధివిగ్రహిగా వెళ్ళిన పాపయభట్టారకునికి దేవ గిరి ప్రధానమంత్రి బసవరసుడు తన ఇంట ఆతిథ్యం ఇచ్చాడు. ఆయన మన పట్ల కొంచం సావదానంగా ఉన్నా డు. ఆయన మాట జవదాటడు జైతుగి. అందువల్ల పాపయ అక్కడ ఉన్నంతకాలం యువరాజు గణపతిదేవు ని ప్రాణాలకు ముప్పు రాదు.."

అంతా ఊపిరి పీల్చుకున్నారు. గంగాధరమంత్రిని ప్రశంసాపూర్వకంగా చూశారు.

"మరొక విషయం.. దేవగిరి మరోమంత్రి హేమాద్రి పంత్ కుమార్తెకు మా అబ్బాయిని ఇచ్చి వివాహం చెయ్యడా నికి నిశ్చయ తాంబూలాలు అయ్యాయి. ఈలోగా ఈ యుద్ధం ముంచుకు వచ్చింది. వచ్చే మాఘమాసంలోనే ముహూర్తం..." వివరించాడు గంగాధరమంత్రి.

బేతిరెడ్డి నవ్వాడు. " రుద్రదేవమహారాజు యుద్ధనీతినే నువ్వూ పాటిస్తూ శత్రురాజ్యంతోనే వియ్యమాడుతున్నా వన్న మాట.. గంగాధరా.."

"అవకాశం అలావచ్చింది బేతిరెడ్డి.."

"ఇవ్వాళ శత్రురాజ్యం రేపు మిత్రరాజ్యం కావచ్చు కదా బేతిరెడ్డి.." అన్నాడు మల్యాల కాటయ. రుద్ర సేనాని కొంచం తెప్పరిల్లాడు. అతనికి తనవీరత్వానికి గంగాధరుని వ్యూహచాతుర్యం బాగా జతకలుస్తుందని నమ్మకం. ఈ పెళ్లిబంధుత్వం అందరిలో క్రొత్త యుద్ధవ్యూహాలకు ఊపిరులూదింది. అందరూ తీవ్రంగా ఆలోచిస్తుండగా అన్నాడు గంగాధరుడు.

"నాకొక ఆలోచన వచ్చింది.." అందరి వంక చూసి చెప్పాడు. "మన రుద్రయకొడుకు గణపతిని కొంతకాలం యువరాజుగా సింహాసనంపై కూర్చోబెడదాం. మనకోటలో కూడా దేవగిరి గూఢచారులున్నారు. అందువల్ల అక్కడ కొంత గందరగోళం కొనసాగించవచ్చు.."

అందరూ చప్పట్లు కొట్టారు. "భేష్ గంగాధరా.. ఎంతయినా రుద్రదేవులవారి అనుంగు శిష్యుడవు. ఆయన బుర్ర పూర్తిగా నీకు వచ్చేసింది.." అంతా ఆనందంగా తలొక మాటా అన్నారు గాని ఏమీమాట్లాడకుండా ఉండిపోయా డు రుద్రయ. కారణం అతనికి తప్ప ఎవ్వరికి తెలియదు.

అందరూ బయటకు వెళ్ళాక లోపలికి వచ్చి రుద్రయకు చేతులెత్తి నమస్కరించాడు

గణపతి, రుద్రసేనాని రెండవ కుమార రత్నం. నవ్విన రుద్రయ ముఖంలో జీవంలేదు. తన కొడుకు నిజంగానే యువరాజుగా సింహా సనంపై కూర్చోబోతున్నాడు. అతనికి కుటుంబ సహకారమే కాదు అపరచాణక్యుడు గంగాధరుని ఆశీస్సులు కూడా ఉన్నాయా??

మరునాడు భార్య అన్నమ వచ్చింది. ముఖం మధ్యాహ్నసూర్యబింబంలా వెలిగిపోతోంది.

" తండ్రి గారి ఆశీస్సులు లభించాయని మీ ముద్దులకొడుకు మురిసిపోతున్నాడు.." అన్నది.

ఏమి చెప్పాలి ? తనెందుకు ఈ పరిణామాలకు సంతోషించడం లేదు??

"తండ్రి అధిరోహించని సింహాసనం కుమారుడు అధిరోహించడం.. భలే.. ఆశ్చర్యంగా ఉంది కదూ.. నాకైతే గొప్ప

గర్వంగా ఉంది స్వామీ.." తల్లిగా పులకించిపోతోంది. ఇది మూడునాళ్ళముచ్చట అని వీళ్ళకు తెలియదా..

వీళ్ళతో గంగాధరమంత్రి కూడా చేతులు కలిపాడా.. ఆయన ఆ రాజ్య మంత్రితో వియ్యమందబోతున్నాడు. ఆయన గణపతికి మాట ఇచ్చాడా.. వీళ్ళంతా కలిసి తనపేరు చాటున గూడుపుఠాణి చేస్తున్నారా.. అయితే

యువరాజు గణపతిదేవుని ఏమి చెయ్యబోతున్నారు.. వీళ్ళే ఏదో చేసి జైతుగి మీదికి తోసేస్తే?!

అన్నమ అన్నది, " నా కొడుకు సింహాసనంలో కూర్చోబోతున్నవేళ వాడి వెంట కాకతీయ కేతనం, ఛత్రం, వీవెనలు, పంచశబ్దాలు.. లాంటి సకలలాంఛనాలూ ఉంటే.. అది కన్నులపండువగా ఉంటుంది. మహారాజు మహాదేవునితో అవన్నీ ఇక్కడే యుద్ధభూమికి వచ్చాయట. మీరే వాటిని భద్రపరచారట. స్వామీ.. మీకొడుకు సింహాసనం అధిష్టించేవేళ.." ఆమె మాటలను తొట్రుపాటుతో ఖండించాడు రుద్రయ. "లేవు లేవు. అవి మహా

రాజు పార్థివదేహంతో పాటు ఆరోజే గంగాధరమంత్రి అనుమకొండకు తీసుకువెళ్ళాడు. నాదగ్గర లేవు. అయినా

తొందరపడుతున్నావు అన్నమా.. మన గణపతి కాకతీయసింహాసనంలో కూర్చోవడం నాకు అంగీకారం కాదు.

కుక్కపని కుక్క చెయ్యాలి.. గాడిద పని గాడిద చెయ్యాలి.."

"నా కొడుకు కుక్క, గాడిద కాదు.. జవనాశ్వం.. మహాయుద్ధ గజం.." రోషంగా అంది.

అనునయంగా ఆమె భుజంపై చెయ్యివేసి, "చూడు అన్నమా.. కొడుకు ప్రయోజకుడైతే సంతోషించని తండ్రిని కాను నేను. కానీ మన వంశ దృక్కోణం అది కాదు. నాకు ఇష్టంలేని దానిని నువ్వు ఆచరిస్తావా.. చెప్పు." అతని మాటలోని మమత, గొంతులోని మార్దవంకు ఆమె జవాబుచెప్పలేక భోరున ఏడ్చింది. పరిపూర్ణమైన రుద్రయ వ్యక్తిత్వం ఆమెకు తెలుసు. భర్త అడుగుజాడల్లో కదిలే సాధ్విలలామ ఆమె. ఎదిగిన కొడుకులను చూసుకుని ఆనందించే

సగటు రాచరిక తల్లి. కళ్ళు తుడుచుకుని వెళ్ళిపోయింది. నిరత్తరుడై నిలబడిపోయాడు రుద్రయ.

తన సంశయాత్మక చిత్తం, నిర్ణయం తీసుకోవడంలో డొల్లదనం ఆయనకే తెలుస్తోంది.

రాజు ఉన్నాడో లేడో తెలియని స్థితిలో బలహీనమైన కాకతీయరాజ్యం పట్ల ప్రధాన రాజ్యాలు చూస్తూ కూర్చో లేదు. అన్ని వైపులా దాడికి సమాయత్తమౌతున్నారని వార్తలొస్తున్నాయి. వార్తలకన్నా వేగంగా శత్రుసేనలు నలుమూలలా చుట్టుముడుతున్నారు. వెలనాడు పృధ్వీశ్వరుడు ప్రక్కనున్న మన సామంతరాజ్యాలను ఆక్ర మించుకుంటున్నాడట. తూర్పునుండి కులోత్తుంగచోళుడు ఓరుగల్లు వైపు దూసుకొస్తున్నాడట. పడమర ముదిగొండ నాగతిభూపాలుడు కొరివి మండలంవరకు వచ్చేసినట్లే.. దక్షిణాన మరొకడు.. మరొకడు..

అంతర్గతంగా కూడా వేర్వేరు ఆశావహులు వాళ్ళతో చేతులు కలుపుతున్నట్లు అనుమకొండలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

రుద్రయకు మళ్ళీసందేహం.. తనకొడుకు గణపతిచమూపతి ఎవరితోనైనా చేతులు కలుపుతున్నడా.. ఎవరైనా సేనానులు, మండలేశ్వరులు అతనిని ఆమోదిస్తున్నారా.. ప్చ్.. ఇలా అలోచించడం రుద్రయకు క్రొత్త.. ఈ కుట్రలు కుతంత్రాలు ఊహకందవు. యుద్ధభూమిలోకి దూకడమే సులువు.

మహాసేనానులు, ప్రధాని గంగాధరుడు, ఇతరమంత్రులు కూడా సమాయత్తమై యుద్ధతంత్రం రూపొందించారు.

అందరి ఆశయం వొక్కటే.. కాకతీయ కేతనం సముజ్వలంగా ఎగిరి తీరవలసిందే. కాకతీయ ఛత్రం సింహాసనం వెనుక సమున్నతంగా నిలబడవలసిందే.

ఒక ఓటమి చవిచూసి విజయంకోసం పరితపిస్తూ స్కంధావారంలోనే ఉన్న కాకతీయసేనలు సమధికోత్సాహం తో మహాయోధుల నాయకత్వాన నలువైపులా దూసుకుపోయాయి.

అన్నివైపులా శత్రువులను నిలువరించడం, తరమడం ప్రారంభమైంది. దేవగిరి దగ్గర స్కంధావారంలోనే ఉంటూ

అన్నివైపులా యుద్ధంచేస్తున్న కాకతీయసైన్యాన్ని సమన్వయం చేస్తున్నాడు రుద్రసేనాని. అన్నివైపులనుండి శుభవార్తలే వినవస్తున్నాయి. కసితో ఉన్న సైన్యం వీరవిహారం చేస్తోంది.

ఆ సమయంలోనే గంగాధరమంత్రి మళ్ళీ మతి చెడగొట్టాడు. “నీ కొడుకు.. అదే.. మన యువరాజు గణపతి

చమూపతి.. గొప్పగా నటిస్తున్నాడు. నిజమైన యువరాజు గణపతిదేవుడుకూడా అలా ప్రవర్తించలేడేమో.. దేవగిరి గూఢచారులను గుర్తించి వారిముందు మరీ జీవిస్తున్నాడు అచ్చమైన యువరాజులా..”

మళ్ళీ దిగులు ఆవహించింది రుద్రయను.

రేపు అసలైన యువరాజు వచ్చాక వీడు సింహాసనం దిగను అంటే..

గంగాధరమంత్రి కూడా వీడినే కూర్చోబెట్టేలా ఉన్నాడు. ఆయన విజయవంతంగా తిరిగి వస్తే అప్పుడు ఏమి

జరుగుతుందో.. రుద్రేశ్వరా.. నువ్వే దిక్కు..

కాకతీయసైన్యం తలో దిక్కునా మొహరించి శత్రుసైనికులను ఎదుర్కోవడం అనుమకొండవాసుల్లో ఆనందం కలిగించింది. కారణం యువరాజు గణపతిదేవుడు మంచి యుద్ధతంత్రాలతో నాయకత్వం వహిస్తున్నాడని ప్రజలు భావించడం. అది తెలిసి రుద్రయ మరీ గందరగోళమై పోయాడు.

అప్పుడే గంగాధరుడు స్కంధావారానికి వచ్చాడు. "రుద్రా.. నాకో ఆలోచన వచ్చింది. నిజానికి దేవగిరి సేఉవు లకు ప్రధానశత్రువు మనం కాదు. హొయసల బల్లాలుడు. ఇప్పటికే ఆయన సేఉవులరాజ్యంలో కొంత భాగా న్ని ఆక్రమించుకున్నాడు. జైతుగి ఏమీ చెయ్యలేక నిస్సత్తువగా ఉండగా, తగుదునమ్మా అని మనం దేవగిరి పై దండెత్తి అన్ని పోగొట్టుకుని దిక్కులు చూస్తున్నాం. నువ్వంటే బల్లాల మహారాజు ఇష్టపడతాడు. నువ్వే స్వయంగా వెళ్లి మన పరిస్థితి వివరించి ఆయన సహాయం అర్దిస్తే.."

ఇక చెప్పనక్కరలేదు. యుద్దతంత్రంలో దీనికి తిరుగులేదు. దేవగిరికి తూర్పున అనుమకొండ ఉంటే దక్షిణం గా హొయసలరాజ్యం ఉంది. హొయసల బల్లాలుడు మహాయోధుడు. దేవగిరి సేఉవులను ముప్పుతిప్పలు పెడుతున్నాడు. ఇప్పటికే కొంత భాగాన్ని ఆక్రమించాడు. ఆయనకు రుద్ర దేవుడు, ఆయన తండ్రి రెండవ ప్రోల రాజు సామంతులుగా విశ్వసనీయులుగా ఉండేవారు. రుద్రసేనాని వీరోచిత యుద్ధ నైపుణ్యం ఆయనకు బాగా తెలుసు. ఎప్పుడూ ప్రశంసిస్తూ ఉంటాడు కూడా.

అప్పటికప్పుడు ముఖ్య అంగరక్షకులతో హొయసల వైపు కదిలాడు రుద్రసేనాని. "ఇక్కడి వార్తలు ఎప్పటిక ప్పుడు నీకు చేరవేస్తాను. కార్యం విజయవంతంగా నిర్వహించుకుని రా రుద్రా.." అన్నాడు గంగాధరుడు. అద్భుతమైన ఆతిథ్యం ఇచ్చి, "జైతుగి చావు మూడింది.." అన్నాడు బల్లాల మహారాజు. " సమయం మాకు తెలియజెయ్యి రుద్రా.. మీకు సహాయంగా దేవగిరిపై దాడి చెయ్యడం తథ్యం.." అంటూ అభయమిచ్చాడు.

అక్కడ ఉండగానే మరోవార్త పంపాడు గంగాధరుడు. ముదిగొండ చాళక్యరాజు నాగతిభూపాలుడు విసురునాడు (కొరవి) మండలాన్ని స్వాధీన పరచుకున్నాడు. అనుమకొండ వైపు సాగివస్తున్నాయి అతని సేనలు.

"నాగతికి అంత ధైర్యం లేదు. అనుమకొండలోనే ఎవరో సహకరిస్తున్నారు.." గంగాధరుడి సమాచారం.

"కోటలో ఏవేవో జరుగుతున్నాయి.. మన గణపతిమీద కూడా నాకుసందేహాలు కలుగుతున్నాయి.." అన్నమ సమాచారం. ఈవార్తకు రుద్రసేనాని మహోగ్రుడయ్యాడు.

ముదిగొండ కుసుమాయుధుడిని, వాడి తమ్ముడు ఈ నాగతిని రుద్రదేవుడు ఎన్నోసార్లు తిప్పితిప్పి కొట్టాడు. అయినా వాడు సమయంచూసి ఇప్పుడు మళ్ళీ ఆక్రమ

ణ ప్రారంభించాడు. వాడికి జీవితాంతం గుర్తుండే అవమానం చెయ్యాలి.

ముఖ్య మహాసేనానులంతా వేరువేరు దిక్కులలో శత్రువులను ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు తనే వాడి భర

తం పట్టాలి. పట్టరానిక్రోధంతో వాయువేగ మనోవేగాలతో అనుమకొండకు వచ్చిపడ్డాడు. అప్పటికే ఓ అక్షౌహిణీ

సేనను రుద్రయకోసం సిద్దంచేశాడు ఆయన సేనాపతి రాజనాయకుడు. రుద్రయ యుద్ధశంఖం పూరించే నాటికే

నాగతి ససైన్యంగా వికటాట్టహాసాలతో అనుమకొండలోకి చొచ్చుకు వచ్చాడు. అతని ధాటికి అనుమకొండ పుర

వాసులు భయంతో భీతిల్లిపోతున్నారు.

అయితే కేవలం ఒక్కపూట కాలంలో నాగతి తోక విరిచేశాడు రుద్రసేనాని. రుద్రయ రాకతో రెచ్చిపోయిన కాక తీయసైనికులు నాగతిసైన్యాన్ని కకావికలు చేశారు. అనుమకొండవీధుల్లో వెంటపడి నరికి చంపారు. నాగతిని పట్టి బంధించారు. అతన్ని తన రథంవెనక చక్రానికి కట్టివేశాడు రుద్రయ. నాగతి చత్రాన్ని, కేతనాన్ని చింపి తనఅశ్వాల కాళ్ళకుకట్టాడు. ఓముక్కచింపి తన తమ్మిపడగ (ఉమ్మిబుట్ట) కు చుట్టాడు. జంట అశ్వాలు పూన్చిన తనరథాన్ని అనుమకొండ వీధివీధికి తిప్పుతూ తమ్మిపడగలో ఉమ్మివేస్తూ తీవ్రాతితీవ్రంగా అవమా నించి అనుమకొండ ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాడు. ఆసమయంలో స్థానికంగా నాగతికి సహాయపడిన వాళ్ళు ఒక్కరంటే ఒక్కరు కనిపిస్తే వొట్టు. తనకొడుకులు ఎక్కడైనా కనిపిస్తారని వో కంట వెదికాడు రుద్రయ. ఎవ్వడూ కనిపించలేదు. నాగతిని, అతని సైన్యాన్ని కొరివి దాటి, ముదిగొండ దాటి పది ఆమడల దూరం తరిమి తరిమి కొట్టి ఆనక శాంతించాడు.

ఈ సంఘటనతో కాకతీయ పౌరుషం, కాకతీయసేనానుల స్వామిభక్తి గురించి తెలుగురాజ్యాలలో ఆశ్చర్యంగా చెప్పుకున్నారు. అన్నిదిక్కులలో ఆక్రమించుకోవడానికి వచ్చిన శత్రువులు తోక ముడిచారు.

అనంతరం తిరిగి దేవగిరి పొలిమేరల్లో ఉన్న స్కంధావారానికే వెళ్ళిపోయాడు రుద్రయ.

మరునాడు అన్నమ భర్తకు భోజనం తీసుకువచ్చింది. “ఊరిలోకి వచ్చిఇంటికి రాకపోవడం నాకెంత బాధగా ఉంటుందో అలోచించారా..?!” అంది రోషంగా. “నేను అనుమకొండకు పెళ్ళికి రాలేదు అన్నమా.. అయినా నేను తిరిగి అనుమకొండ వచ్చేది యువరాజులవారి తోనే..” అన్నాడు. ఎన్నోరోజుల తర్వాత భార్య చేతి భోజనం. తృప్తిగా తిన్నాడు. ఆమె కొడుకుల ప్రస్తావన తెస్తుందని ఎదురుచూశాడు. చివరికి తనే తెచ్చాడు,

"ఏమంటున్నారు నీ కొడుకులు?"

"తండ్రి వీరవిహారం చూసి గడగడ వణకుతున్నారు.." ఆ వొక్కమాటతో మౌనంగా నిష్క్రమించింది అన్నమ.

అతని మనసు ఏదో శంకిస్తూనే ఉంది. చారులను నియోగిద్దామంటే తన ఇంట్లోకి తనే చారులను పంపడం..

ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేడు కదా!!

అనుమకొండలో నాగతికి జరిగిన అవమానం తెలిసి దేవగిరి జైత్రపాలకుడు క్రోధంతో రగిలిపోయాడని వార్త. గణపతిదేవుడ్నికూడా రథానికి కట్టి దేవగిరిలో తిప్పి అవమానించాలని సమాలోచనలు చేస్తున్నట్లు వేగులు వార్తలు తెచ్చారు. గణపతిదేవుడ్ని ఎలా వదిలించుకోవాలో చెప్పండని మంత్రులను అడిగినట్లు మరో వార్త.

***

దేవగిరి పట్టణం బ్రాహ్మణవీధిలో హేమంత పంత్ ఇంట పెళ్లి బాజాలు మ్రోగుతున్నాయి.

అత్యంతరమణీయంగా అలంకరించిన వివాహవేదిక.. ప్రక్కగా ఉజ్వలంగా మండుతున్న అగ్నిహొత్రం.. అన్ని ప్రక్కలా కూర్చుని ఏకకంఠంతో వేదగానం చేస్తోన్న వేదవేదాంగపారంగతులు, మహారుషులు. అదొక బ్రాహ్మణ వివాహవేడుక కావటాన అక్కడ అట్టహాసాల కన్నా వైదిక శాస్త్రీయతే ఎక్కవ ద్యోతకమాడుతోంది.

అయితే జరుగుతోంది సాధారణ బ్రాహ్మణుని ఇంట పెళ్లి కాదు. సాక్షాత్తూ మహారాజుగారి అంతరంగిక సలహా

దారు, మహామంత్రి హెూదాకలిగిన పండితోత్తముడు, మహాకవి, శాస్త్రకోవిదుడు హేమంత పంత్ గారి ఇంట పెళ్లి.

వియ్యాలవారు కూడా సామాన్యులు కారు. కాకతీయరాజ్య మహాప్రధాని గంగాధరమంత్రి గారు.

హేమంత పంత్ చేసిన ఏర్పాట్లకు తగ్గట్లు వియ్యాలవారుకూడా భారీగానే తరలివచ్చారు. నాలుగురోజుల పెళ్లికి

పక్షంరోజులుగా అనుమకొండనుండి దేవగిరి వరకు మేనాలు, పల్లకిలు, అశ్వరథాలు, అంబారీల ఏనుగులు,

గూడు ఎడ్లబళ్ళు.. ప్రవాహంలా వస్తూనే ఉన్నాయి. అంతమంది తరలి రావడం ఆశ్చర్యంగానే ఉంది దేవగిరి వాసులకు.

కాని వారంతా బంధువులరూపంలో ఉన్న మహాసేనానులు, అరివీర విక్రములైన యుద్ధవీరులు, మెరుపు వీరులయిన లెంకలు, ఒంటరులు.. కన్నుమూసి తెరిచేలోగా ఒక్కొక్కరూ వందమందిని నోరెత్తకుండా మట్టు బెట్టగల కాకతీయ వీరాధివీరులు.. అని

దేవగిరి వాసులకు తెలియదు.

తమ యువరాజుని రక్షించుకోవడానికి అంత్యయుద్ధానికి సమాయత్తమై మైలారదేవుడికి, రుద్రేశ్వరుడికి, పద్మాక్షికి మ్రొక్కి చావోరేవో తేల్చుకోవడానికి మృత్యుగహ్వారం లాంటి శత్రువు కోటలోకి ప్రవేశించారు. నున్నని గుండ్లు.. మీసాలులేని మూతులు.. పరమభాగవతోత్తముల్లా జంధ్యాలు సవరించుకుంటూ బ్రాహ్మణవేషాలతో.

"అనుమకొండ శత్రువుల తాకిడితో అల్లకల్లోలంగా ఉంది. అందువల్ల యువరాజు, సేనానులు, యుద్ధ వీరులు ఎవ్వరూ రావడం లేదు. కేవలం మన బ్రాహ్మణబంధువులే.. అతిథ్యం అదిరిపోవాలి సుమా.." అన్నాడు గంగా ధరుడు హేమంత్ పంత్ తో.

ఆయన హాయిగా నిట్టూర్చి, "మా మహారాజు గందరగోళంగాడు కాబట్టి అంగీకరించాడు గాని పక్కలోబల్లెంలా

ఉన్న కాకతీయమంత్రితో వియ్యమంటే మరో మహారాజు అంగీకరిస్తాడా బావగారూ.." అంటూనే ఏర్పాట్లు భారీ

గానే చేశాడు పంత్.

కాకతీయయోధులు మెల్లమెల్లగా నగరమంతా తమ గుప్పిట్లోకి తీసుకుంటున్నారు. ఒక బృందం రాజకోట

లోకి, స్త్రీవేషాలతో వున్న మరో బృందం అంతఃపురంలోకి కూడా చొచ్చుకుపోయారు. అందరూ లోదుస్తుల్లో బాగా నూరిన చురకలు దాచుకున్నారు. ఏ క్షణమైనా వివాహవేదిక రణవేదిక చెయ్యడానికి పెళ్లి కుమారుడితో సహా అందరూ సంసిద్ధులై ఉన్నారు. అందరి ధ్యేయం వొక్కటే.. గణపతిదేవుని విడిపించుకు పోవాలి. లేదా ఇక్కడే చావాలి!

అప్పటికే లోపలనున్నవేగులు గణపతిదేవుడ్ని ఎక్కడ బంధించారో రుద్రయకు చేరవేశారు. ఆ మందిరమంతా మెరపుయోధుల్ని నియోగించాడు రుద్రయ. పండితోత్తముడుగా పేరున్న హేమంత్ పంత్ ఇంట వివాహం కావ డంతో వేగులు, సైనికులు అక్కడ ఎవ్వరూ లేరు.

గణపతిదేవున్ని ఎలా తప్పించాలి.. వెంట ఎవరు ఉండాలి.. ఏ అశ్వరథం అధిరోహించాలి.. ఆ రథం ఎంత వేగం గా పోవాలి.. ఎన్ని ఘడియల్లో దేవగిరిపట్టణం దాటాలి.. చుట్టూ ఉండాల్సిన ప్రత్యేక ఒంటరి మెరపు యోధులు వారి అశ్వాలు.. ఆయుధాలు.. అన్నీ ప్రణాళిక ప్రకారం సంసిద్ధం!!

అప్పుడే పెళ్లిమండపం వద్దకు యాదవుల యువరాణి సోమలదేవి వచ్చింది. సుమారు ఎత్తులో అంతంత మాత్రపుఛాయలో నిండైన అలంకరణలో రాణితనపు హెూదాతో హుందాగా ఉన్న సోమలను అందరూ చూస్తుం డగా కాకతీయయోధులు ఆ వివాహ మందిరమంతా విస్తరించి కమ్మేశారు.

తుది పోరాటానికి బయలుదేరే ముందే హెూయసల బల్లాలుడికి వర్తమానం పంపి తమ ఎత్తుగడ వివరించాడు

రుద్రయ. హొయసల సైన్యం కదిలింది దేవగిరి వైపు.

పెళ్లి మండపం వద్దకు మహారాజు జైత్రపాలకుడు వచ్చాడు. హేమంత పంత్ తన బంధువులతో ఎదురేగి ఆహ్వా

నించి మహారాజుకు ఉచితాసంలో కూర్చుండబెట్టాడు. ఆయన అక్కడున్న పండితులతోనూ, కవులతోనూ ముచ్చట్లాడుతున్నాడు.

మేళతాళాలు మారుమ్రోగుతున్నాయి. పెళ్ళికుమారుడు విడిదినుండి సన్నాయిమేళం మధ్య వచ్చి అందరికి

నమస్కరించి పెళ్లి పీటమెక్కాడు. పెళ్లి కూతురిని మేనమామలు బంగారుతాపడం చేసిన పెళ్లిబుట్టలో మ్రోసు కుని తెస్తున్నారు. పెళ్లి కుమార్తెతో యువరాణి సోమలదేవి మేలమాడుతూ వెంటరాగా..నవ్వులతో సరదాలతో వేదఘోషతో ఆ పెళ్లిపందిరి అంతా కళకళలాడుతోంది.

మరి రెండుఘడియలకు సర్వసేనాని జల్లన పరుగున వచ్చి మహారాజు చెవిలో చెప్పాడు "హొయసల బల్లా లుడు మనపై దండెత్తి వచ్చాడు మహాప్రభూ.. బల్లాలుని మహా సైన్యం దేవగిరి పొలిమేరలకు చేరింది.."

గందరగోళమై పోయాడు జైతుగి. ఊపిరి బిగబెట్టి చూస్తున్నారు కాకతీయ మెరుపువీరులు.. అప్పుడప్పుడూ

చురకలపైకి వెళుతున్నాయి వాళ్ళ చేతులు. అందరిచూపు క్రీగంట రుద్రయ వైపే. ఆయన కనురెప్ప కదిలిస్తే

చాలు.. జైతుగి వైపు ఉరకడానికి సన్నద్ధం.

దేవగిరి మహాప్రధాని బసవరసుడు, ఇతరమంత్రులు, సేనానులందరూ పరుగున అక్కడికి చేరుకున్నారు జైతుగి అనుజ్ఞ కోసం. అప్పుడొచ్చాడు హొయసల సంధివిగ్రహి కన్నడదాసు. వెంట కాకతీయ సంది విగ్రహి పాపయ భట్టారకుడుతో పాటు సేవణుల సంధి విగ్రహి చముండశర్మ.

జైతుగికి తనను పరిచయం చేసుకుని, "దేవగిరి మహారాజు జైత్రపాలుర వారికి హొ–యసల మహారాజు బల్లాల దేవుని వారి ప్రతిపాదన. తక్షణం కాకతీయ యువరాజు గణపతిదేవుని భేషరతుగా విడిచి పుచ్చాలి. లేకుంటే సంకులసమరమే. పొలిమేరల్లోని కొన్నిగ్రామాల స్వాధీనం కాదు. ఏకంగా దేవగిరి స్వాధీనమే హొయసలవీరుల తక్షణ కర్తవ్యం.." స్పష్టం చేశాడు సంధివిగ్రహి కన్నడదాసు.

జైతుగి కోపంతో ఊగిపోతూ, "ఇది కాకతీయ, సేణువుల మధ్య సమస్య. బల్లాలునికి ఏమి పని?"

మరుక్షణం రుద్రయ ఎగిరి దూకి జైతుగి నడుముదొరక బుచ్చుకుని చురక ఆయన కంఠానికి గురిపెట్టాడు.

కనురెప్పవేయకముందే కాకతీయ మెరపుయోధులు అక్కడున్న సేవణముఖ్యుల పైకి లంఘించి అందరి కంటాలకు తమ చురకలను ఆనించారు. ఇదంతా క్షణంలో వెయ్యోవంతుకాలంలో జరిగిపోయింది. పెళ్లి మండ పం బిర్రబిగదీసుకుపోయింది. మహిళలు హాహాకారాలు, కెవ్వుకేకలతో మేళతాళాలు, వేదపటనాలు ఆగి

పోయాయి. రుద్రయ అరిచాడు, "రాజనాయకా.. యువరాజులవారిని బంధ విముక్తులను చెయ్యి. కారాగారం నుండి తప్పించి ఘడియల్లో ఇక్కడికి తోడ్కొని రావాలి.."

అందరూ చిత్తరువులై నిలబడి పోవగా మరి మూడు ఘడియలకు కాకతీయ యువరాజు గణపతిదేవుడు మెరపువీరుల మధ్య వివాహమండపానికి విచ్చేశాడు.

తమ యువరాజును చూసుకుని కాకతీయ యోధుల కన్నుల్లో ఉద్వేగం.. ఆనందభాష్పాలు..

రుద్రయ అరిచాడు, "గంగాధరా.. చెప్పు జైత్రపాలుడు తల త్రుంచివేయనా.. అనుజ్ఞ ఇవ్వు.."

గంగాధరుడు కంగారుగా అన్నాడు. "రుద్రా.. ఆగాగు. ఇది వేదమంత్రాలతో ఘోషిస్తున్న పవిత్ర వివాహ వేదిక. దీనిని రక్తసిక్తం కావించొద్దు. యువరాజుని తీసుకుని నువ్వు వెళ్ళిపో. నా కొడుకు వివాహం ప్రశాంతంగా జరగ నివ్వు.." అన్నాడు. దేవరసుడు, హేమంత పంత్ కూడా రుద్రసేనాని ముందు మోకరిల్లారు చేతులు జోడించి.

జైతుగి ఏమీ చెయ్యలేక హుంకరించాడు, "ఆనాడే ఈ గణపతిదేవుడ్ని నరికిపారేసి అనుమకొండ స్వాధీనం చేసుకుని రావాల్సింది. తప్పు చేశాను.."

"ఇప్పుడు మేమా తప్పుచెయ్యం జైత్రపాలా.. శత్రుశేషం లేకుండా దేవగిరినంతా అగ్నిప్రీతం చేసి వెళతాము.."

యుద్ధావేశంతో ఊగిపోతున్నాడు రుద్రయ.

అప్పుడు వినిపించింది మరో కంఠం. "రుద్రసేనా.. జైత్రపాలక మహారాజుల వారిని విడిచిపుచ్చు.."

అది హొయసలరాజు బల్లాలునిది. అప్పటికే వచ్చి ఉన్నాడాయన. "ఇది వివాహ వేడుక. అందునా బ్రాహ్మణ పెళ్లి. ఇక్కడ కత్తులకు చురకలకు ప్రవేశంలేదు. జరిగింది జరిగిపోయింది. కాకతీయులవీరత్వం మాకుతెలుసు. జైత్రపాలుడు మీపై గెలిచాడు. మహాదేవరాజును సంహరించి యువరాజుని బంధించారు. అలా వారూ విజయు లే. కాబట్టి ఇరువురూ యుద్ధావేశాలు వదిలేయండి. సామరస్యంగా సమస్యను పరిష్కరించుకొండి.." ఆగాడు.

ఉద్రిక్తత కొంచంతగ్గింది. రుద్రయ, గంగాధరుడు గణపతిదేవుని దగ్గరకు వెళ్లారు. జైత్రపాలుడు బల్లాలుని వద్దకు వచ్చి ఆయనను గొనిపోయి ఉచితాసంపై పై కూర్చోబెట్టి గౌరవించాడు. సోమలదేవి తండ్రి వద్దకు వచ్చి నిలుచుంది.

అంతా చేష్టలుడిగి నిలుచుండి పోయారు. సమస్యకు ముగింపు ఏవిటో ఎవ్వరికి స్పష్టమౌడం లేదు.

బల్లాలుడు సోమలదేవిని పరిశీలనగా చూశాడు. ఆమెను దగ్గరకు పిలిచాడు. సాలోచనగా చెయ్యి పట్టుకుని

అన్నాడు, "నాదొక సంధి ప్రతిపాదన. కాకతీయ మహానేత, ఒకప్పటి మా సామంతుడు, మా విశ్వాసపాత్రుడు రుద్రదేవుడు నిర్వహించినదే.. వివాహ బంధం. కాకతీయ యువరాజు గణపతిదేవునికి, దేవగిరి యువరాణి సోమలదేవికి వివాహం. ఇది నా ప్రతిపాదన. ఇరు పక్షాలు దీనికి అంగీకరించాలి.."

ఇందులో కాదు వద్దు అనడానికి ఎవ్వరికి అవకాశం లేదు.

"పురోహితులారా.. ఆ వివాహపీఠానికి ప్రక్క మరొక పీఠం వెయ్యండి. ఊ.. వెళ్ళండి పీఠం అలంకరించండి.."

రెండు ఘడియలు నిశ్శబ్దం. అనంతరం పుత్రికను స్వయంగా జైతుగే వేదిక పైపు తీసుకువెళ్ళాడు. రుద్రయ ముఖంలోని అంగీకారం చూసి వివాహవేదిక వైపు కదిలాడు గణపతిదేవుడు. "ఊ.. మ్రోగించండి భజంత్రీలు.." అంటూ అందరిలో ఉత్సాహం కలిగించి మందిరంలో వివాహశోభ పునరుద్ధరించాడు హొయసల బలాల్లుడు.

యుద్ధతంత్రం వివాహమంత్రాలతో ముగించడం రుద్రదేవుడు నిర్వహించిన గొప్ప దౌత్యవిధానం. కాకతీయ, యాదవుల వైరం కూడా చివరికి వివాహబంధంతోనే ముగిసింది.

స్కంధావారానికి చేరుకున్న నూతనవధూవరులతో కాకతీయ సైనికపటాలం విజయవంతంగా కదిలింది అను మకొండ వైపు. అప్పటివరకూ దాచిపెట్టిన కాకతీయ ఛత్రం, కేతనం బయటకు తీశాడు రుద్రసేనాని. అభిషక్త యువరాజు గణపతిదేవుని అశ్వరథానికి ముందు తన అశ్వంపై కేతనం చేతపట్టి పంచశబ్దాలైన భేరీ, బాకా, డోలు, ఘటం, శంఖాలు చేస్తున్న విజయధ్వానాల మధ్య సైనికుల జయజయ శబ్దాల చేస్తుండగా కదిలాడు మహా సేనాని రేచర్ల రుద్రయ అనుమకొండ వైపు.

***

"చివరికి మా హొయసల మహారాజుగారు సైన్యాన్ని పొలిమేరల్లో వుంచి సంధిప్రయత్నం చేస్తేనే జైతుగి అంగీక రించాడన్నమాట.." అన్నాడు రుద్రేశ్వరదేవాలయ స్థపతి రామప్ప. ఆయన ఎప్పుడు వచ్చాడో ఏమి విన్నాడో గాని రుద్రయ వాక్రవాహానికి అడ్డుకట్ట వేశాడు.

"విన్నది చాలు లేవండి. రేపే సుముహూర్తం. కాకతీయ మహారాజు గణపతిదేవులవారు స్వయంగా విచ్చేస్తు

న్నారు.. దైవప్రతిస్థాపన నిమిత్తం. రుద్రసేనాని నిలబెట్టిన కాకతీయకేతనం, ఛత్రం రేపు మనమంతా చూద్దాం.."

అన్నాడాయన. అంతాకదిలారు. రుద్రయ, రామప్ప దేవాలయప్రాంగణమంతా కలయతిరుగుతూ గర్భాలయం

వరకు వెళ్లి అక్కడ ఆగారు.

"మీ దంపతుల మిధునశిల్పం అందరినీ ఆకర్షిస్తోంది. మీరేమో..వద్దు, అది తీసివేయమని పోట్లాడుతున్నారు."

"అవును రామప్పా.. అది రేపు ప్రభువులు చూస్తే.."

"ఈ దేవాలయఅద్భుతాలలో నిర్మాణదారు జంటశిల్పం కూడావొకటి. ముందు చక్రవర్తులవారిని చూడనివ్వండి మహాసేనాని. ప్రభువులకు మీరంటే ఎంతో గౌరవం.. పితృసమానులుగా గౌరవిస్తారు. ఆ విగ్రహ ఏర్పాటు గురించి గతంలోనే వారికి విన్నవించాం. సంప్రదాయ విరుద్ధం కాబట్టి తొలగించమంటే అప్పుడు ఆలోచిద్దాం.." ఇలా రెండేళ్లుగా నచ్చజెబుతున్నాడు రామప్ప. రుద్రయ, అన్నమ ల మిధునశిల్పం చెక్కి గర్భాలయ ప్రవేశ ఎడమద్వారం పై ఏర్పాటు చేశాడు రామప్ప. అన్నమ శిల్పాన్ని చూస్తుంటే స్కంధావారం నుండి అనుమకొండ వచ్చాక జరిగిన సంభాషణ గుర్తొచ్చింది రుద్రయకు.

***

కాకతీయ మహారాజుగా గణపతిదేవుడ్ని సింహాసనంపై కూర్చోబెట్టేవరకు విశ్రాంతి లేదు రుద్రయకు. శాస్త్రోక్తంగా

సమస్త లాంఛనాలతో విధివిధానాలతో అభిషిక్తుడయ్యాడు గణపతిదేవుడు. కాకతీయచరిత్రలో మరో అధ్యాయం

ప్రారంభమయ్యింది.

ఆ రాత్రి భోజనాలవేళ ఎప్పటినుండో మనసులో ఉన్న భావనలు బయటకొచ్చాయి.

" ఆనాడు.. గంగాధరుని కొడుకు పెళ్ళికి ఆహ్వానించినా దేవగిరి ఎందుకురాలేదు నువ్వూ నీ కొడుకులు?" మెల్లగా, మెత్తగా అడిగాడు రుద్రయ. ఉహించని ప్రశ్న హటాత్తుగా వచ్చేసరికి ఖంగుతింది అన్నమ.

"పిల్లల యుద్ధతంత్రాలు, ప్రయాణాలు నాకు తెలియదు. అక్కడ జరగబోయే భీభత్సం ఉహించే నేను రాలేదు.."

"ముదిగొండ నాగతికి.. మన తాత్కాలిక యువరాజు సహాయపడ్డాడని నా సందేహం.. నిజమేనా?"

"నాకూ సందేహమే. కాని వాడు మీకొడుకు. రేచర్ల బిడ్డ. తప్పుచెయ్యడు.. కానీ కానీ.." ఆమె కంఠం వణికింది.

రుద్రయకు కూడా సంభ్రమం. ఏమి జరిగి ఉంటుంది.. చెప్పమన్నట్లు చూశాడు ఆమెవైపు.

"ప్రతిరోజూ నన్ను రాజప్రాసాదానికి రమ్మని పల్లకి పంపేవాడు. ఆరోజు పిలుపు లేదు.

పల్లకి రాలేదు. సందేహం కలిగి నేనే వెళ్ళాను.. భోజనం తీసుకుని మరీ..”

“అదేవిటి? రాజనగరానికి నువ్వు భోజనం తీసుకెళ్లడం ఏవిటి?”

“అవును. వాడికిష్టమైన దద్ధ్యోజనం వండి విషంకలిపి తీసుకెళ్ళాను. వాడేమైనా తండ్రి మాటను జవదాటుతు న్నాడేమోనన్న సందేహం.. ఎక్కడో.. మనసు మూలల్లో. అదే జరిగితే వాడికి ముద్దలు చేసి తినిపిద్దామని..” ఆమె వొక్కసారిగా బిగ్గరగా ఏడ్చింది. “నాబిడ్డ అలాంటివాడు కాదు మహాసేనాని.. కాదు..” అలా చాలాసేపు భారం తగ్గేవరకు ఏడ్చిఏడ్చి తలతిప్పి భర్తను చూసింది.

ఉత్తరీయంతో కళ్ళు తుడుచుకుంటున్నాడు మహాసేనాని రుద్రయ.

***

నడుముకున్న ఉత్తరీయం తీసి కళ్ళొత్తుకున్నాడు రుద్రసేనాని.

“ఆమె ఈ దేవాలయంలో ఉండాల్సిందే. నీతో అంగీకరిస్తున్నాను స్థపతి..”

మరునాడు.. ముహూర్తం సమీపిస్తోంది. దేవాలయప్రాంగణమంతా మామిడితోరణాలలో అరటిస్థంభాలతో అలం

కరించారు. మంత్రులు, సేనానులు, మండలేశ్వరులు, శిల్పాచార్యులు, పండితులు, కవులు, రాజ్య, మండల ప్రముఖులు, ఆతుకూరు గ్రామస్తులు.. తొలిసారి దేవాలయప్రాంగణంలో తిరుగాడుతూ ఆలయ విన్నాణానికి, నిర్మిత విధివిధాలకు, శిల్పాల అందచందాలకు, విభిన్నఅంశాలను ఏర్చి కూర్చిన రూపకల్పనకు దిగ్భ్రమలో ఉ ండిపోతున్నారు.

స్థపతి రామప్ప, నిర్మాణదారు రేచర్ల రుద్రసేనాని హడావిడిగా తిరుగుతూ ఎక్కడా తప్పులు దొర్లకుండా పరికి

స్తున్నారు. రాచబాటపై కలకలం.. కాకతీయచక్రవర్తి, మహా మండలేశ్వరుడు, దాయగజకేసరి శ్రీశ్రీశ్రీ గణపతి

దేవుల వారి ఆగమన సందోహం..

అందరూ ఎదురు చూస్తున్నట్లే దూరంగా ఎగురుతూ ముందు కనిపిస్తోంది కాకతీయ కేతనం.. సముజ్వలంగా సమున్నతంగా.. ముందు కేతనంపట్టి అశ్వంపై వస్తున్నవాడు రేచర్ల మండలేశ్వరుడు, రుద్రసేనాని వారసుడు గణపతి చమూపతి. వెనక సప్తాశ్వర సమారూఢమైన రథంపై గణపతిదేవుడు.. ఆయనకు వెనగ్గా పైఎత్తున అటూ ఇటూ కదలుతున్నాయి రెండు కాకతీయఛత్రాలు.. చేతపట్టినవారు లోకచమూపతి, కాటయ చమూ పతి. రేచర్ల ఘన వంశ వారసులు.. రుద్రయ కుమారులు.

ఎత్తైన రుద్రేశ్వర దేవాలయ అంచున నిలబడి ఆ మనోహరదృశ్యాన్ని సజలనయనలతో వీక్షిస్తున్నవారు రేచర్ల

రుద్రయ, అన్నమ పుణ్య దంపతులు.

***

# వెనకకు నడుస్తున్న మనిషి



బోరి మురళీధర్
94402 29728

మా ముందు సిరిమాను కట్టెల మంట.. మా గొంతులో దిగుతున్న ఇప్పసారాయిలా భగభగ మండుతున్నది. రాత్రిపూట అడవిలో నుంచి వీచే తేమలో అడవిపూల సువాసన కలిసిపోయి, ఉత్సవ సౌరభంలా మమ్మల్ని చుట్టేస్తున్నది. పక్కనే నిప్పులమీద కుతకుత ఉడుకుతున్న నాటుకోడి కూర వాసన.. ఆకలిని కేకవేసి మరీ లేపుతున్నది. ఇంద్రారెడ్డి బ్లూటూత్ స్పీకర్‌లో నుంచి వినిపించే సూఫీ సంగీతం.. ఆ వాతావరణాన్ని ఇహలోకపు అంచులు దాటించే ప్రయత్నం చేస్తూ ఉన్నది.

నాగరిక ప్రపంచానికి దూరంగా, చుట్టూ ఎత్తయిన గుట్టల మధ్య.. లోతైన లోయలతో ఆవరించి ఉన్న "లొహార" అనే గిరిజనగూడెంలో మా గౌడ్ భూమన్న ఏర్పాటు చేసిన బస ముందు.. నెగడు చుట్టూ కూర్చున్నాం.

"భూమన్నా! నిజంగా ఇది ఆరోగ్యానికి మంచిదేనంటావా?".. అప్పటిదాకా ఇప్పసారా రుచిచూడని బాపురెడ్డి అడిగాడు.

"ఒట్టు సార్! ఇది తబియత్‌కు చాలా మంచిదని మా పెద్దలు జెప్తరు. కడుపుల ఏ రోగమున్నా తక్వయిపోతదట! అయితే ఎంత తాగాల్నో గంతే తాగాల! మందును మందుమెరంగ తాగితేనే.. మందు మెరంగ పనిచేస్తది సారూ!"..

ఇప్పసారా మహత్యాన్ని వివరిస్తూ, చిన్న గాజుగ్లాసులో పోసి బాపురెడ్డికి అందించాడు భూమన్న.

ఒక్క గుటక వేశాడో లేదో..

"హమ్మో ఘాటు!" అంటూ అరిచాడు.

మన్న ఇంకొన్ని నీళ్లు కలిపి ఇచ్చాడు. ఆయుర్వేదంలో ఇప్పసారా గురించి ప్రముఖంగా ప్రస్తావిస్తారు. దానికి తగ్గట్లు ఇక్కడి గ్రామీణ ప్రాంత ఆయుర్వేద వైద్యులు.. కొన్ని మొండి వ్యాధులకు మూలికల రసాన్ని ఇప్పసారాలో కలిపి రోగులతో తాగిస్తారు. ఇప్పసారాతో కలిసిన ఔషధం నేరుగా రక్తంలోకి ప్రవేశించి.. రక్త దోషాలను నివారిస్తుందట!

ఈ లోపు భూమన్న చెరో ప్లేటు అందించి, వేడి వేడి కోడి పులుసూ, చెరో రెండు జొన్న రొట్టెలను వడ్డించాడు. ఈ విందు భోజనం గానీ, ఈ వాతావరణం గానీ ఎన్ని వేలూ, లక్షలు పెట్టినా.. ఏ ఫైవ్‌స్టార్ హొటళ్లలోనూ దొరకదనీ, స్టార్ హొటళ్ల చరిత్ర తెలిసిన ఇంద్రారెడ్డి వ్యాఖ్యానించాడు. ఇక కాలేజీలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న రాధాకృష్ణ.. అప్పటికప్పుడు మా మిత్రుల కలయిక గురించీ, అక్కడి వాతావరణం, ప్రకృతి అందాల గురించి ఆశువుగా కవిత్వం వినిపిస్తున్నాడు.

"ఇప్పసారా మనవాడితో మంచి కవిత్వాన్నే పలికిస్తున్నది" అని బాపురెడ్డి పరిహాసమాడితే..
"ఇప్పటిదాకా నువ్వు రాసిన కవితలలో ఇదే తోపు!" అని కమల్ ప్రశంసించాడు.

కమల్, రాధాకృష్ణ టీచింగ్ ప్రొఫెషనల్‌లో ఉంటే.. బాపురెడ్డి మంచి డాక్టరు. ఫిజీషియన్. ఇక ఇంద్రారెడ్డి సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగి. ఫొటోగ్రఫీలో, డాక్యుమెంటరీలు రూపొందించడంలో మాస్టర్! ఇక నాకు.. సంగీత సాహిత్యాలంటే ఇష్టం. చేసే ఉద్యోగం వీటికి పూర్తిగా వ్యతిరేకం. ఇట్లా రకరకాల వృత్తులూ, ప్రవృత్తులూ కలిసి ఉన్నప్పటికీ.. మేమంతా బాల్య స్నేహితులం. పొట్ట చేతపట్టుకొని తలోవైపుకి చెదిరిపోయాం. కొంత కుదురుకున్నాక ఇదిగో ఇలా అప్పుడప్పుడూ కలుసుకుని రెండు రోజులు గడుపుతాం. ప్రతిసారీ పట్నాల్లో, లాడ్జీల్లో, హొటళ్లలో కలుసుకునే మేము.. ఈసారి ఇలా కలుద్దామని కమల్ ప్లాన్ చేశాడు. నా వృతిరీత్యా ఈ ప్రాంతమంతా నేను తిరిగిందే కాబట్టి నాకు అదంతా కొత్త కాదు.

"ఏయ్! ఇంద్రారెడ్డి! ఇక ఆ సూఫీని ఆపెయ్! మూడుకు తగిన క్లాసిక్ ఏదన్నా వినిపించు! 'దర్బారీ కానడా'లో అదేదో మన్నాడేది ఉందికదా ! అది వినిపించు!"..

నేను అనడమే ఆలస్యం అందరూ.. 'అదే అదే కావాలి!' అన్నారు.

మన్నాడే.. మా అందరిలో తన అద్భుతమైన గమకాలను పొదువుతున్నాడు.

"భూమన్నా! ఓ భూమన్నా!"..

జంగుపటేల్ గాబరాగా అరుస్తూ వచ్చాడు.

వాళ్ల భాషలో భూమన్నతో ఏదో చెప్పాడు. రెడ్డి పాట ఆపేశాడు.

"సార్లూ! ఇక మీరంతా లోపలికి పోండి! చిత్తపులి వచ్చిందట! అగో ఆ గుట్ట మీద గూసొని ఒర్లుతున్నదట! మావోళ్లు ఇప్పుడే మంచెల మీదికెల్లి లొల్లి జేస్తున్నరు. చిత్తపులి.. పిల్లిమెరంగ నంపువెట్టి ఎప్పుడు ఎటస్తదో తెల్వది. లెవ్వండ్రి! లెవ్వండ్రి!"..

భూమన్న ప్లేట్లు, గిన్నెలూ సర్దేస్తున్నాడు.

హఠాత్తుగా గూడెంలో ఒకవైపు కుక్కలు భౌభౌమని కోరస్‌గా మొరగసాగాయి. అవి అంత భయంకరంగా మొరుగుతున్నాయంటే.. వాటికి చిరుతపులి కనిపించిందన్న మాటే! పక్కన ఉన్న గుడిసెల వాళ్లులేచి గట్టిగా తుడుం, డోలు మోగిస్తూ.. అరుస్తున్నారు. ఈ గూడెంలో లొల్లి గమనించిన కూతవేటు దూరంలోని గూడేలవాళ్లంతా మేల్కొని.. మేకల కొట్టాల వద్ద, పశువుల కొట్టాల వద్ద పెద్దపెద్ద మంటలు వేస్తున్నారు.

క్షణాలలో వాతావరణం మారిపోయింది!

మేం పరుగు పరుగున తట్టా బుట్టా సర్దుకొని, కమ్యూనిటీ హాలులాంటి మా బసలోకి దూరి తలుపులు బిడాయించుకున్నాం. ఆ తలుపులకు లోపలి నుంచి గడియ లేదు. తలుపులకు ఆనుకుని కమల్ మంచం వేసుకొని పడుకున్నాడు. ఇంద్రారెడ్డి కిటికీ దగ్గర కెమెరా పట్టుకుని.. 'షూట్ ఎట్ సైట్' లాగా కాపు గాసున్నాడు. నేనూ, రాధాకృష్ణ, బాపురెడ్డి.. మంచాల్లో నడుం వాల్చాం.

ఉదయం గూడెంవరకు కార్లలో వచ్చిన మా బృందం దినమంతా ట్రెక్కింగ్ చేస్తూ.. చుట్టు పక్కల ఉన్న చిన్నచిన్న జలపాతాల అందాలను ఆస్వాదించాం. అడవిలో గలగలా పారే వాగులోని స్వచ్ఛమైన నీటిలో చిన్నపిల్లల్లా కేరింతలు కొట్టాం.

భూమన్న మా మధ్యాహ్న భోజనం దారిలో ఉండే రాజుల గూడెంలో ఏర్పాటుచేశాడు. మసాలా వంకాయ, జొన్నరొట్టె, ముద్దపప్పు, పచ్చిపులుసు చారు, రాగటి వడ్ల బువ్వ, గడ్డ పెరుగు. మసాలా కంటే వంకాయనే రుచిగా ఉంది. రాగటి వడ్ల ఎర్రబువ్వతో గడ్డ పెరుగు కలిపి.. అంచుకు పచ్చిమిరప %--% నువ్వుల చట్నీ వేసుకొని తింటే ఆ రుచులే వేరనిపించాయి. చాలా రోజుల తర్వాత మా పట్నం మిత్రులు.. 'దిల్ ఖోల్‌కే' తిన్నారు. తమకున్న షుగర్, బీపీలు కూడా మర్చిపోయినట్లున్నారు. ఉదయం నుంచి తిరుగుతూ అలసిపోయి ఉన్నామేమో.. ఆ గూడెంలో వేపచెట్టు చుట్టూ ఉన్న అరుగు

మీద తువ్వాల్లు పరుచుకొని ఓ కునుకు కూడా తీసేశాం. లేచి వట్టివేర్ల డికాక్షన్ తాగి సూర్యాస్తమయం చూసేందుకు 'దార్‌లొద్ది'కి బయల్దేరాం. ఎత్తు నుంచి చూస్తే బాగా లోతైన లోయ. ఆ లోయ చివరన సూర్యుడు.. మరోచిన్న గుట్ట చాటుకు అస్తమిస్తున్నాడు. మా ఇంద్రారెడ్డి కెమెరా అలుపు లేకుండా పనిచేసింది. ఇప్పుడు వచ్చిన చిరుతపులి మాకు దార్లో ఎదురైవుంటే.. ఒక్కసారి ఒళ్లు జలదరించింది. మమ్మల్ని కాపాడటానికి మాగైడ్ భూమన్న ఉన్నాడన్న ధైర్యమే.. మమ్మల్ని అడవంతా నిర్భయంగా తిరిగేలా చేసింది. కానీ, రేపు అంత స్వేచ్ఛగా తిరగలేమేమో!

చిరుతపులి అలజడి తగ్గినా.. నిద్ర రావడం లేదు. రకరకాల ఆలోచనలు!

"అరవై దాటిన తర్వాత బతికివుండే రోజులన్నీ బోనస్‌గా వచ్చిన ఆయుష్షే!" అని ఇటీవల ఒక మిత్రుడు వ్యాఖ్యానించాడు.

మరి ఈ బోనస్‌గా వచ్చిన రోజుల్ని ఎలా గడపాలి? నగర జీవితం మీద ఆసక్తి పోయి విరక్తి కలుగుతున్నది. నిజానికి డబ్బులుంటే నగరంలో అన్ని సౌకర్యాలు నడిచి ఇంటికి వస్తాయి. కడుపులో చల్ల కదలకుండా.. కాలు మీద కాలు వేసుకుని బతకొచ్చు. కానీ, మార్పులేని బతుకు. అదీ ఒక బతుకేనా అనిపిస్తుంది నాలాంటి వారికి. ఇలా బయటికి వచ్చి ఒకటి రెండు రోజులు ప్రకృతిని ఆస్వాదించి వెళ్లిపోయే బదులు.. ఇక్కడే ఉండిపోయి తనివి తీరా ఆనందించవచ్చు కదా! అన్న ఆలోచన బలంగా మొలుస్తున్నది. ఆకర్షణీయమైన, సౌకర్యవంతమైన నగర జీవితాన్ని వదిలి ఈ మారుమూల పల్లెల్లో ఉ ండి ఏం సాధిద్దామని!? అనే ప్రశ్న కూడా ఎదురవుతున్నది. కానీ, ఆలోచించేకొద్దీ జీవితానికొక 'సార్థకత' అయితే సాధిస్తానని అనిపిస్తున్నది!

పుట్టాను! పెరిగాను, చదివాను, ఉద్యోగినయ్యాను, పెళ్లిచేసుకున్నాను, పిల్లలు – వాళ్ల చదువులు, ఉద్యోగాలు, పెళ్లిళ్లు.. వాళ్లపిల్లలూ.. చదువులూ.. మళ్లీ! ఇంతేనా జీవితం! అవెట్లాగూ ఎవరికీ తప్పవుగానీ, ఆ బాధ్యతలన్నీ అయిపోయాక కనీసం ఈ బోనస్‌నైనా నాకిష్టమొచ్చినట్లు ఖర్చు చేసుకునే వీలు లేదా? ఎందుకు లేదు! ఉంది! నిర్ణయం తీసుకోవడమే కావాల్సింది!

ఈ అకారణ రాగద్వేషాల ప్రపంచం నుంచి, పొరుగువాడి మీద అసూయపడని చోటికి వెళ్లిపోవాలి! తనకు గిట్టనివాడి పతనం మీద తన సంతోషాలను వెదుక్కునే దౌర్భాగ్యం నుంచి బయటపడాలి! భవిష్యత్తు గురించి అందమైన కలగంటూ పడుకున్న నాకు.. ఎప్పుడు నిద్ర పట్టిందో తెలవదు!

కిటికీలోనుంచి నీరెండతోపాటు, పల్లెవాసుల పశువులను అదిలించే కేకలు, చేదబావి దగ్గర గిలకలు చేసే చప్పుళ్లూ, పక్కనే ఉన్న అడవిలోనుంచి నెమళ్ల పిలుపులు వినిపిస్తుంటే.. నిద్రలేవక తప్పలేదు. రాత్రి చిత్తపులి సృష్టించిన బీభత్సపు ఆనవాళ్లు వెతికినా కనిపించకుండా పోయి.. పల్లె మరో అందమైన సూర్యోదయానికి సాక్షిగా నిలిచింది.

* * *

ప్రపంచమంతా కరోనా భయంతో వణికిపోతున్న సమయం. టీవీల నిండా, పత్రికల నిండా ఎప్పుడు చూసినా.. కరోనా వార్తలే! మిగతా వ్యవహారాలన్నీ స్తంభించిపోవడం వలన కరోనా తప్ప చెప్పుకోవడానికి ఏమీ మిగలలేదు. కొవిడ్-19గా పిలిచే ఈ మహమ్మారి దెబ్బకు ప్రపంచవ్యాప్తంగా జనజీవితం కనీవినీ ఎరుగని సంక్షోభానికి గురవుతున్నది. ఎప్పుడూ ఉరుకులు పరుగులతో ఉండే భూగోళమంతా నిస్తేజమై పోయింది. వందలకోట్ల మంది హోమ్ క్వారంటైన్ పేరుతో నెలల తరబడి ఇంట్లోనే ఉండిపోవడం ఇటీవలి మానవజాతి చరిత్రలోనే విచిత్రమైన, విషాదకర పరిణామం. ప్రపంచ యుద్ధాలు సంభవించిన సమయాల్లో కూడా ఇన్ని మరణాలు జరగలేదంటున్నారు. కరోనా, కొవిడ్, లాక్‌డౌన్, హోమ్ క్వారంటైన్ అనే పదాలు గతంలో ఎవరికీ తెలియవు. ఇప్పుడు ఇరవైనాలుగు గంటలూ అవే పదాలు వినిపిస్తున్నాయి. పేపర్లు, టీవీలు రోజూ వ్యాధి సోకినవారి సంఖ్య, వ్యాధితో కోలుకున్నవారి సంఖ్య, మరణించిన వారి సంఖ్యలను చూపిస్తున్నారు. ప్రపంచ దేశాలన్నీ లాక్‌డౌన్ విధించేశాయి. కేవలం అత్యవసరాలకు మాత్రమే సడలింపు ఉంది. బ్రిటన్‌లో గడిచిన ఇరవై నాలుగు గంటల్లో ఎనిమిది వందల మంది కరోనాతో చనిపోయారన్న వార్త.. ప్రపంచ దేశాలను గడగడలాడిస్తున్నది. కరోనా పేషెంట్లకు వైద్యం చేస్తూ, మనదేశంలో నాలుగు వందల మందికి పైగా డాక్టర్లు మరణించారన్న వార్తలు.. మరింత కలవరాన్ని పుట్టిస్తున్నాయి. అసలు మానవజాతి భవిష్యత్తు ఎలా ఉండబోతున్నది అన్న విషయం ఊహకు కూడా అందడంలేదు. కరోనాకు పేదలు, ధనికులూ అనే భేదం లేనట్లుంది. అన్ని వర్గాల ప్రజలూ మృత్యువాత పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో బతికి బట్ట కడితేనే గొప్ప అనే పరిస్థితి వచ్చేసింది. ఇదే అదనుగా సోషల్ మీడియాలో శాడిస్టు నెటిజన్లు పుకార్లను పుట్టించే పనిలో మునిగిపోయి ఉన్నారు.

వార్తలు చూస్తూ వట్టివేర్ల డికాక్షన్ తాగుతున్నాను.

"రాం! రాం! సారూ? ఏంజేస్తున్నారు?" అంటూ జంగూ పటేల్ వచ్చాడు.

"రాం! రాం! పటేలా! రా! ఇట్లగూసుండు! మీ జంగు దాదా అచ్చిండు.. చాయ్ దీస్కరా!".. లోపలికి కేక వేశాను.

"సారూ? గిదేం బీమారి! దునియంతా సుట్టుకపోతున్నదట. ఎక్కడోళ్లక్కడనే సచ్చిపోతున్నరట! మా పోరగాండ్లు సెల్‌ఫోన్లల్ల సూపిచ్చుకుంట అందర్ని భయపెడ్తున్నరు. అసలు దీని సంగతేంది!? మరి మనం ఎట్లు జేసుడు?!".. విషయంలోకి వచ్చాడు జంగూ పటేల్.

"నిజమే జంగూ! రోజూ వార్తలల్ల జూపిస్తున్నరు గని.. అవి మనదాకా రాకపోవచ్చు. మాకయితే అస్సలు రాకపోవచ్చు. మీకు రోగ నిరోధక శక్తి ఎక్కువ ఉంటది. మందుల తిండి దినరు కదా! మంచిగ దిని మంచిగ పని చేసుకుంటురు. గందుకు మీకు కూడ రాదు!".

"ఎక్కడ మంచి తిండి సారూ! బియ్యం సస్తా దొరకబట్టి మా ఇప్పటి పిలగాండ్లంతా బువ్వనే దింటున్నరు. మా కాలంల అడివికి బోతే ఏదన్నా ఒక షికారి చేసుకొని అస్తుంటిమి. నాలుగు తీర్ల మాసం దొరుకుతుండె. పది తీర్ల పండ్లు దొరుకుతుండె. ఇప్పుడు షికారి ఖానూన్ ఖిలాఫ్ అయిపోయింది. పండ్ల చెట్లు ఖతమైపోయినయి. మెల్లగ మెల్లగ అడివిగూడ నాశనం గావట్టె. మేంగూడా పట్నమోల్ల తిరంగ సునోసరం అయి-పోతున్నం".

"ఇప్పటి తరంల మన ప్రాంతంలో 'ఎనీమియా' అంటే.. రక్తహీనత ఉండి రోగాలు అస్తున్నయి అని సర్కారు రిపోర్టులు జెప్తున్నయి. ఈతరం మాత్రం కమ్‌జోర్ అవుతున్నది".

"కమ్‌జోర్‌గాక ఏమవుతది సారూ! ముందు మేం నెలకు రెండుముద్దల బెల్లం తింటుంటిమి. బెల్లం చాయ, బెల్లం పానకం, ఇప్పపువ్వు బెల్లం లడ్డూలు, బెల్లం బూరెలు.. గిట్ల బెల్లం బాగా తింటుంటిమి. అందుకు మాకు రక్తహీనత రాలే! ఇప్పుడంతా మారిపోయి బెల్లం దినుడు మోటు అనుకుంటున్నరు!".

"నిజమే జంగూ! ఇప్పుడు పల్లెలు కూడా పట్నాల తొవ్వ పట్టినయి. గందుకు గిన్ని కమ్‌జోరీలు అస్తున్నయి!".

"అయితే ఇప్పుడు మనోల్లందరు గలిసి మన ఊరును 'హద్దుబందు' జేద్దామంటున్నరు. కొత్తోల్లను ఓల్లనూ ఊర్లెకు రానీయద్దు. మనం ఊరు విడిచి పోవద్దంటున్నరు. ఒక్కళ్లు అంటువెట్టుకొని అచ్చినా.. ఊరంతా అంటుకుంటదట!".

'హద్‌బంద్' అంటే.. లాక్‌డౌన్ అన్నమాట. ఇది మంచి ఆలోచనే అనిపించింది నాకు. పల్లెటూరి వాళ్లు పాలు అమ్మడానికో, కూరగాయలు అమ్మడానితో పట్నాల్లోకి పోయి, ఆ రద్దీలో కరోనా అంటించుకొని వచ్చి.. ఊళ్లల్లో వ్యాపించడానికి కారణం అవుతున్నారని వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే చాలా గ్రామాలలో బయటివారు రాకుండా రహదారులను దిగ్బంధనం చేసి, కంచెలు వేసి కావలా ఉంటున్నారని ఫొటోలతో కథనాలు వస్తున్నాయి!

"జంగూ! మీరంతా ఏ ఫైసలా జేస్తే.. అదే నా మాట! అందరం ఒక్కమాట మీదుంటెనే ఇప్పుడు బతుకుతం. ఇక పాలూ, కూరగాయలు అమ్మెటోల్లకు కొంత నుక్సాన్ అయితది మరి. కొన్ని ఊర్లల్ల కూరగాయలు చేన్లనే మురిగిపోతున్నయట! ఇంకొన్ని ఊర్లల్ల అందరికీ ఉత్తగానే పంచి పెడ్తున్నరట!"..

"మనం కూడా గట్లనే జేద్దాం సారూ!".

"ఇయ్యాల నుండే హద్దుబందు జేసెయ్యుండ్రి! ఓల్లకన్నా అత్యవసరమైతే నా కారును దీసుకుపొమ్మని చెప్పు!".

"గట్లనే సారూ! మల్లీ భేటయితా! రాం! రాం!" అంటూ జంగు వెళ్లిపోయాడు.

నేను ఈ లొహార గ్రామంలో సెటిలైపోయి సంవత్సరంపైనే కావొస్తున్నది. ఒకానొకరాత్రి.. మా దోస్తులతో ఈ గ్రామంలో గట్టి నిర్ణయం తీసుకొని, మూడునెలల్లో అమలు చేశాను. మట్టి గోడలతో, గూన పెంకులతో, వెదురు బొంగులూ.. తడకలతో ఒక డిజైనర్ హౌస్ లాంటిది నిర్మించుకున్నాను. దీనికి హైదరాబాద్‌లోని నా మిత్రుడు శ్రీధర్ రూపకల్పన చేశాడు. ఇంటిముందు విశాలమైన స్థలంలో చిన్నపాటి పూలతోట, కూర్చోవడానికి ఇప్ప మొద్దులతో చేసిన బెంచీలు! ఇంటివెనుక కూరగాయల తోట కోసం అనువైన స్థలం. నాలుగు గదులు, ఒక విశాలమైన హాలు! మరోపక్క విడిగా అన్ని సౌకర్యాలతో రెండు గదుల 'గెస్ట్ హౌస్' కూడా కట్టుకున్నాను. మొదలు.. 'ఆ పల్లెటూరుకు నేను చస్తేరాను!' అని మొండికేసిన నా శ్రీమతి కేవలం ఆ ఇల్లు నచ్చే వచ్చేసింది! ఇప్పుడు.. 'చచ్చినా పట్నానికి పోను' అంటున్నది. రెండు గదుల డాబాపైన వృత్తాకారపు షెడ్ ఉన్నది. దానిలో కూర్చుంటే మూడువందల అరవై డిగ్రీల కోణంలో చుట్టూతా.. అడవి అందాలను వీక్షించవచ్చు. జడగడ్డితో కప్పిన ఆ షెడ్ పైకప్పు.. నీరెండలో బంగారు వర్ణంతో మెరిసిపోతుంది. ఇంటి చుట్టూ ఉన్న గోడలమీద గూడెంలో ఉన్న కళాకారులు మట్టితోనే వారి శైలిలో అందమైన దృశ్యాలను, కళాకృతులను రూపొందించారు. గోడల కిందిభాగంలో గిరిజన మహిళలు జాజు రంగు మట్టితో అలికి, సుద్ద మన్నుతో తెల్లని ముగ్గులు వేశారు. మొత్తానికి నా 'కలల గృహం' అలా తయారైంది!

నగర జీవితంపై విరక్తి కలిగిన ఫలితమిది. ఉద్యోగం కోసం, పిల్లల చదువుల కోసం నగరంలో ఉండే అవసరం ఉండేది. ఇప్పుడు పిల్లలిద్దరూ విదేశాల్లో స్థిరపడ్డాక, నేను పదవీ విరమణ చేశాక.. ఇంకా నగరంలో ఉండి చేసేదేముంది? ఇప్పుడు నగరానికి నా అవసరం లేదు. నాకు నగరం అవసరం అంతకన్నా లేదు! అందుకే నాకు నచ్చిన రీతిలో ప్రశాంతంగా బతుకుదామని ఇలా వచ్చేశాను. మా వయసుకు అవసరమైన అన్ని సౌకర్యాలనూ అమర్చుకున్నాం. కానీ కొన్నిటి అవసరమే రాదు. ఏసీ పెట్టుకున్నా.. మండు వేసవిలో కూడా దాని అవసరం పడలేదు. ఫ్రిజ్ ఉన్నా అప్పటికప్పుడు తాజాగా అన్నీ లభించే ఆ ఊళ్లో దాని అవసరం చాలా తక్కువ.

నాలుగు లోయలు కలిసే ఒక పల్లపు ప్రాంతంలో, జీవధారలాంటి వాగు ఒడ్డున వెలసిన ఈ లొహారా గ్రామం.. నాకు అన్నివిధాలా నచ్చడానికి కారణం.. ఇరవైఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న టౌనుకు ఏకాలంలోనైనా, ఏ సమయంలోనైనా నిరాటంకంగా పోయివచ్చే సౌలభ్యం ఉండటమే! ఏది కావాలనుకున్నా కొన్నిగంటల్లో తెప్పించుకోవచ్చు. ఇటీవల వారి భాషకూడా నేర్చుకున్నాం కాబట్టి.. ఊరివాళ్లతో మరింత సాన్నిహిత్యం పెరిగింది.

* * *

చాలా రోజుల తర్వాత ఇంద్రారెడ్డి ఫోన్ చేశాడు.

"ఏంటి మిత్రమా! మా అందరినీ వదివేసి ఆ మారుమూల అజ్ఞాత వాసంలోకి వెళ్లి పోయావు! ఎలా ఉన్నావు?".

"ఏనాటికైనా మీ అందరినీ వదిలేసి పోవాల్సిన వాడినే గదా? అసలు ఈ కరోనా కాలంలో ఎవరెవరు ఉంటారో, ఎవరు ఎప్పుడు పోతారో ఏమీ తెలీడం లేదుకదా!".

"నీకేం బాబూ! హాయిగా ప్రకృతి ఒడిలో.. కలలో కూడా కరోనా సోకని రాజ్యంలో ఉన్నావు. ఇప్పుడు మాకొచ్చి పడింది చావు! ఎప్పుడు ఏమవుతుందోనని భయం భయంగా బతుకుతున్నాం. ఇవాళ నేనూ, బాపురెడ్డి, రాధాకృష్ణ మాట్లాడుకున్నాం. ఇక్కడ రోజూ చావు భయంతో బతుకేకన్నా.. ఫ్యామిలీ సహా నీవద్దకు వచ్చి కొన్నాళ్లు ఉండి పోదామనుకుంటున్నాం!".

"నా దగ్గరికా? ఈ పల్లెటూరికా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును! ఇప్పుడు ప్రపంచం మొత్తం మీద పల్లెలే సేఫ్ ప్లేసెస్‌గా కనిపిస్తున్నాయి. అందుకని అక్కడికి వస్తే.. కొన్నాళ్లయినా భయాన్ని మరిచిపోవచ్చని అనుకుంటున్నాం. ఎలాగూ పూర్తి లాక్‌డౌన్‌లో ఇక్కడుండి కూడా చేసేదేమిలేదు కదా!".

"అయ్యో! ఇంద్రారెడ్డీ! ఒకరోజు ముందన్నా ఈ సంగతి చెప్పకపోతివి. ఇవ్వాళే మా ఊరువాళ్లు 'హద్‌బంద్' చేసి.. అంటే లాక్‌డౌన్ ప్రకటించి, ఊళ్లోకి వచ్చేబాటల వద్ద కంచెలు వేసి కాపలా ఉంటున్నారు" నిరాశగా అన్నాను.

"అవును! పల్లెటూళ్లన్నీ సెల్ఫ్ లాక్‌డౌన్ ప్రకటించుకొని, కొత్తవాళ్లు ఎవరినీ ఊళ్లలోకి రానీయడం లేదని పేపర్లు, చానల్స్‌లో చూస్తున్నాం. కానీ, నీ ఇన్‌ఫ్లూయన్స్ అంతా ఉపయోగించి ఎట్లయినా మేం అక్కడికి వచ్చేట్లు చూడు! ఇక్కడ పిల్లలతో ఇంట్లో మక్కిపోతున్నాం. మేమందరం ఆర్‌టీపీసీ రిపోర్టులు తీసుకొని మరీ వస్తామని చెప్పు!" ఇంద్రారెడ్డి బతిమాలుతున్నాడు.

"సరే! ఏ సంగతీ తెలుసుకొని ఫోన్ చేస్తాను!" అని పెట్టేశాను.

ఒక్కరోజు ముందుగా అడిగి ఉంటే.. ఎట్లయినా వారిని రప్పిద్దును. ఇవ్వాళే నిర్ణయం తీసుకొని.. రేపే దాన్ని ఉల్లఘించడమంటే కష్టమే! నిజానికి నాకూ వాళ్లందరినీ చూడాలనీ, వారితో గడపాలని కోరికగా ఉంది. నేనిక్కడ కట్టుకున్న నా డిజైనర్ ఇల్లునూ, పూలతోటనూ, పెరటి తోటనూ వారికి చూపించాలని ఉబలాటంగా ఉంది. ఈ అవకాశం మళ్లీ రాదు.

ఈ రోజు గుడి వద్ద రాత్రికి భజన కార్యక్రమం ఉంది. అక్కడయితే గ్రామ పెద్దలందరూ కలుస్తారు. అప్పుడప్పుడూ భజన కార్యక్రమానికి నేనూ హాజరవుతుంటాను.

భజనలో విరామ సమయం వచ్చింది. విషయం కదపడానికి ఇదే మంచి సమయం!

"సమ్‌దిర్‌కీ రాం రాం! మనం ఇయ్యాలనే హద్దుబందు జేసినంగదా! పట్నంకెల్లి మా దోస్తులు ఇయ్యాలనే ఫోన్ జేసింద్రు! అక్కడ భయం భయంగా ఉన్నదట! ఇక్కడికి కుటుంబాలతో సహా వచ్చి కొన్నిరోజులు ఉండి పోదామని అనుకుంటున్నరు. మీ అందరినీ అడిగినంకనే.. ఏ సంగతీ చెప్తానని అన్నా! ఏమంటరు?!" మెల్లగా అడిగాను.

"గదెట్లా కుదుర్తది సారూ! బయటికెల్లి ఓళ్లను రానీయమంటిమి కదా! మల్ల ఈల్లయితే పట్నంకెల్లి అస్తమంటున్నరు. మరి ఆ రోగమంటు వెట్టుకొని అస్తే.. మన ఊరు ఊరంతా అంటుకొని ఆగమైపోదా!?".. భీమ్‌రావు అన్నాడు.

"మీరన్నమాట సయే! అయితే వాళ్లందరూ ఆ రోగంలేదని టెస్ట్ రిపోర్టులు తీసుకొని అస్తమంటున్నరు. నిజంగా ఆళ్లకు ఆ రోగముంటే.. ఆడనే దవాఖాన్ల షరీక్ అయితరు గదా! ఈడదాక రానే రారు గదా! ఈ పట్నవాసులకు ఒకసారి మన పల్లె బతుకులు ఎలా ఉంటాయో చూపించాలని నా కోరిక!".. మరోసారి ప్రయత్నించాను.

"ఈ రిపోర్టులు గిపోర్టులు గంత భరోసావి కావు గానీ.. ఒగయాల్ల ఆళ్లకు రావాలని కచ్చితంగా అనిపిస్తే.. ఆళ్లను నారాజ్ చెయ్యకుండా ఒక ఇకమతు ఉన్నది".. హన్మంతు తనకు తోచిన ఉపాయాన్ని అందరి ముందుంచాడు.

"ఆళ్లు మనకు అంటకుండ, ముట్టకుండ దూరంగ ఉండాల! ఆళ్ల తిండీతిప్పలు ఆళ్లే చూసుకోవాల! కావాలంటే.. ఇంతజాములన్నీ మనంజేద్దం!".

"ఆళ్లను మన సారింట్ల ఉంచుకునుడు కూడా కుదరది! సారిల్లు నడి ఊళ్లెనే ఉన్నది గదా! అదీగాక.. ఆళ్లు ఎందరస్తరో తెలుసుకుంటే.. యాడ ఉంచాల్నో ఇచారం జేయచ్చు!".. అంటూ జంగు పటేల్ నా వైపు చూశాడు.

"మూడు కుటుంబాలు!.. అంటే నలుగురు చొప్పున పన్నెండు మంది! ఆరుగురు పెద్దోళ్లు, ఆరుగురు పిలగాళ్లు! పిల్లగాళ్లంటే పెద్దపిలగాండ్లే!".. చెప్పాను.

"ఇగో! ఆళ్లకు రానిద్దాం జంగు దాదా! గిసుంటోళ్లు మళ్ల మన ఊరుకు ఎప్పుడచ్చి ఉంటరు. ఇప్పుడు ఈ బీమారి చెయ్యవట్టి అస్తున్నరు! అయితే ఆళ్లను గొన్ని రోజులు మన జంగుదాదా పెద్దకొట్టంల ఉండుమందం! జాగ పెద్దగున్నది. ఊరుకు ఒక పక్కకున్నది. అండ్లనే ఆళ్లకు అన్ని ఇంతజాములు జేద్దాం!".. జంగు తమ్ముడు మోతీరాం మంచి ఐడియా ఇచ్చాడు.

తర్జన భర్జనల మీద మరికొన్ని షరతులు విధించి, అన్నిటికీ ఒప్పుకొంటేనే రమ్మనమని నిర్ణయం చేశారు. మర్నాడే ఇంద్రారెడ్డికి షరతులన్నీ వివరించాను. అన్నిటికీ ఒప్పుకొంటామనీ.. ఈ ఇంటి జైలుకన్నా ఆ అడవే నయమనీ, రెండు రోజుల్లో వచ్చేస్తామని చెప్పాడు.

పట్నాల్లో ఇళ్లన్నీ ఖాళీ అవుతున్నాయనీ, ప్రజలంతా తమ సొంత ఊళ్లకు

చేరుకుంటున్నారని, పల్లెలకు మళ్లీ మునుపటి వైభవం వచ్చేసి.. జనాలతో కళకళలాడుతున్నాయనీ, బంధుమిత్రుల బంధాలన్నీ మరొకసారి జ్ఞాపకం వచ్చి.. కలిసిమెలిసి హాయిగా గడుపుతున్నారన్న కథనాలు విరివిగా వస్తున్నాయి. వీళ్లంతా వస్తే.. మా లొహార గ్రామానికి కొత్త శోభ వస్తుందని నాకెంతో సంతోషంగా ఉంది!

* * *

"ఉన్నారా సార్! రాం! రాం!".. జంగు పటేల్ మరో ఇద్దరిని వెంటబెట్టుకొని వచ్చాడు.

"రా! రా! పటేలా! కూసోండ్రి!".

"సారూ! ఒకమాట మీ చెవుల ఏద్దమని అచ్చినం. ఏమనుకోకుండి! మీ దోస్తుల పిలగాండ్లు కొంచెం ఆగమున్నరు సార్!" నిష్టూరంగా అన్నాడు జంగు.

"అవునా? ఏమయింది? ఏం జేసిండ్రు!".. ఆందోళనగా అడిగాను.

"తెల్లందాకా గవ్వేమో పెద్దపెద్ద లోడు స్పీకర్లు పెట్టుకొని, పెద్ద సోందుతోని పాటలు ఇనుకుంట డ్యాన్సులు చేస్తున్నరు! ఆ సోండుకు అటు పక్క పదిండ్లమందికి తెల్లారేదాకా నిద్రలుంటలేవట! పొద్దుందాకా పనిచేసి అచ్చినోళ్లకు తెల్లందాకా నిద్రలేకపోతే మళ్లీ తెల్లారి పనిజేసుడు కష్టమయితది గదా!".

విషయం అర్థమయింది. పిల్లలు పగలు పడుకొని, రాత్రి ఇలా హంగామా చేసున్నారన్న మాట! వాళ్ల తల్లిదండ్రులన్నా మందలించి ఉండాల్సింది. అయినా రోమ్‌లో ఉన్నప్పుడు రోమన్లలాగే ఉండాలన్న ప్రాథమిక సూత్రం.. వీళ్లకు తెలిసినట్లు లేదు! అలా ఉండకపోతే, ఇక్కడ ఉండటం కుదరదని చెప్పేయాలి! వీళ్ల మూలన నాకు మాట వచ్చేట్లు ఉంది!

"జంగు పటేలా! నాకర్థమైంది! ఇగ నేజూసుకుంట. మీరు బేఫికర్ ఉండుండ్రి! ఉంటరా.. మంచిగుండాల! లేకుంటే వాసను ఎల్లిపోవాల! గింతే జెప్త ఆళ్లకు!"

వాళ్లను పంపించి.. మిత్రులు బస చేసిన కొట్టంవైపు నడిచాను.

* * *

మర్నాడు నుంచి గ్రామంలో దృశ్యాలన్నీ మారిపోయాయి! వాళ్లు వచ్చి వారం రోజులపైనే అయినందున క్వారంటైన్ పీరియడ్ ముగిసి.. వాళ్లను మా ఇంట్లోకి మారిపోవడానికి గ్రామస్తులు అనుమతించారు. వీళ్లంతా మాస్కులు పెట్టుకొని ఊళ్లో తిరగడానికి కూడా అనుమతి లభించింది!

కరోనా వల్ల ఆ ఊళ్లోని పిల్లలంతా చదువుకు దూరంగా ఉన్నారిన్నాళ్లు! మా రాధాకృష్ణ వాళ్ల అమ్మాయి అశ్విని టీచర్ అవతారమెత్తింది. రోజూ పిల్లల్ని జమచేసి చదువు చెప్పడమే కాకుండా.. కొత్త కొత్త ఆటలాడిస్తున్నందున పిల్లలు అశ్వినిని వదలడంలేదు! అశ్విని తమ్ముడు వేణు.. తనవెంట తెచ్చుకున్న వాటర్ కలర్ బాక్సులతో పిల్లలతో

బొమ్మలు వేయిస్తున్నాడు. ఇక మా డాక్టర్ బాపురెడ్డి మా గెస్ట్‌హౌస్‌లో పొద్దున రెండు గంటలూ, సాయంత్రం రెండు గంటలు ఓపీ క్లినిక్ నడుపుతున్నాడు. తన సొంత ఖర్చు మీదనే మందులు తెప్పించి.. అందరికీ ఉచితంగా ఇస్తున్నాడు. పక్కనున్న గూడేలకూ విజిట్‌కు వెళ్లివస్తున్నాడు. రాధాకృష్ణ ఊళ్లో ఉన్న యువతకు ఇంగ్లిష్ స్పీకింగ్ కోర్సు నేర్పిస్తున్నాడు. ఇంద్రారెడ్డయితే.. తన కెమెరాతో ఎప్పుడు ఎక్కడికి పోతున్నాడో తెలవడం లేదు. ఫొటోగ్రఫీ మీద ఆసక్తి ఉన్న నలుగురి టీమ్‌ను తయారుచేసి.. వారికి ప్రయోగాత్మకంగా శిక్షణ ఇస్తున్నాడు. అంతేగాదు.. ఊళ్లో ఉన్న వృద్ధులను, పెద్దవాళ్లను అందంగా ఫొటోలు తీసి, ప్రింట్ వేయించి.. ఫ్రేములుకట్టి వాళ్లకు బహూకరిస్తున్నాడు.

వాళ్లల్లో జీవితంలో మొదటిసారి తన ఫొటోను తాను చూసుకున్నవాళ్లు ఎందరోమంది ఉన్నారు. వీళ్ల శ్రీమతులు నా శ్రీమతితో కలిసి.. చేనూ, చెట్లూ కలియదిరుగుతూ.. రోజుకొక కొత్తరకం వంటల రుచులు మాకు చూపిస్తున్నారు.

తాజా గాలి పీల్చడంతో, తాజా ఆహారం తినడంతో, పదిహేను రోజుల్లో పట్నవాసుల మొహాల్లో.. పల్లెవాసుల్లో మాత్రమే కనిపించే ఒక అపురూపమైన సహజ సౌందర్యం తొంగి చూస్తున్నది!

వాళ్లు అప్పుడప్పుడూ మాట్లాడుకుంటున్న మాటల్ని బట్టి, నా ఊహ నిజమైతే.. వచ్చే సంవత్సరంలోపు నా డిజైనర్ ఇంటి పక్కనే మరో మూడు డిజైనర్ ఇండ్లు కచ్చితంగా అవతరిస్తాయని అనిపిస్తున్నది!

కరోనా చాలామందిని తమ మూలాల్లోని చెవి మెలేసి మరీ లాక్కుపోయింది! రానున్న కాలం మానవజాతికి ఇంకా ఏమేం పాఠాలు నేర్పనున్నదో!? అడ్డూఅదుపూ లేకుండా, అడ్డందిడ్డంగా ముందుకు పరిగెడుతున్న మనిషిని.. తిరిగి ఏమేరకు తన మూలాల్లోకి నడిపించనున్నదో? అలా వెనకకు నడుస్తున్న మనిషిని మళ్లీ ఏ దురాశ ముందుకు లాక్కెళ్తుందో.. కాలమే నిర్ణయిస్తుంది!

* * *

**బోరి మురళీధర్ స్వస్థలం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సొనాలా గ్రామం. ప్రస్తుతం ఆదిలాబాద్ పట్టణంలో నివాసం ఉంటున్నారు. ప్రభుత్వ వ్యవసాయశాఖలో 35 ఏళ్లు సేవలు అందించి.. 2013లో పదవీ విరమణ పొందారు. విద్యార్థిగా ఉన్నప్పుడే 1975లో జరిగిన మొదటి ప్రపంచ తెలుగు మహాసభలలో కళాశాల ప్రతినిధిగా పాల్గొన్నప్పటి నుంచీ.. తెలుగు సాహిత్యంపై అభిమానం పెంచుకున్నారు. 1987లో 'అడవిపువ్వు' కథతో కథారచన మొదలుపెట్టారు. ఇప్పటివరకు 25 మాత్రమే రాయగా.. అందులో 18 కథలు వివిధ ప్రతిష్ఠాత్మక పోటీలలో బహుమతులు దక్కించుకున్నాయి.**

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 515











ముల్కనూర్ – నమస్తే తెలంగాణ కథల పోటీలు 2019, 2020 బహుమతుల
పంపిణీ కార్యక్రమాల్లో విజేతలు, ప్రముఖులు



ఇది కథా వైభవం..

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 517








Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 51









ముల్కనూర్ ప్రజా గ్రంథాలయంలో సరస్వతీ అమ్మవారి ప్రతిష్ఠాపన కార్యక్రమం













Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 522




నమస్తే తెలంగాణ, ముల్కనూరు
ప్రజాగ్రంథాలయం
కథల పోటీలో బహుమతి 2019
పుస్తకం ముఖచిత్రం

## 2019 కథల పోటీ విజేతలు

1. **విత్తనం** : పెద్దింటి అశోక్ కుమార్
2. **హరామ్** : హుమాయున్ సంఘీర్
3. **ఒట్టిపోయిన అడవి** : శిరంశెట్టి కాంతారావు
4. **బేబక్క** : పుట్టగంటి గోపీకృష్ణ
5. **అమ్మ పండుగ** : ఎగుర్ల గణేష్
6. **సిద్ధయ్య మఠం** : రామా చంద్రమౌళి
7. **ఖుర్బానీ** : సయ్యద్ గఫార్
8. **అంటరాని బతుకమ్మ?** : డా. సిద్దెంకి యాదగిరి
9. **అమ్మల గాజులు** : డా. ప్రభాకర్ జైనీ
10. **రేణుక** : పర్కపెల్లి యాదగిరి
11. **ఒడి బియ్యం** : గంగుల నరసింహారెడ్డి
12. **గడి** : చందు తులసి
13. **బొడ్రాతు** : రావుల కిరణ్మయి
14. **అతడు మార్గదర్శి** : కూతురు రాంరెడ్డి
15. **తులసమ్మ బతికింది!** : యు. రాజ లింగమూర్తి
16. **సుక్కబర్రె** : మ్యాకం రవికుమార్, పెద్దపల్లి
17. **బూరుగు సందుగ** : చెన్నూరి సుదర్శన్
18. **స్వీట్ బాక్స్** : నందూరి సుందరీ నాగమణి
19. **పోరాటం** : చేవూరి శ్రీరాం, హన్మకొండ
20. **ఒక ఆకుపచ్చని ఆశ** : బి. మురళీధర్, ఆదిలాబాద్
21. **బతుకు వాసన** : గంధ్రకోట సూర్యనారాయణ శర్మ
22. **గుట్ట మీద దేవుడు** : మధుకర్ వైద్యుల

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 523




నమస్తే తెలంగాణ, ముల్కనూరు
ప్రజాగ్రంథాలయం
కథల పోటీలో బహుమతి 2020
పుస్తకం ముఖచిత్రం

| | | | |
|---|---|---|---|
| నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజా గ్రంథాలయం | | | |
| **కథల పోటీ – 2020 విజేతల జాబితా** | | | |
| ప్రథమ బహుమతి (1) | | | |
| 1 | గస్సాల్ | కటుకోజ్వల ఆనందాచారి | 99487 87660 |
| ద్వితీయ బహుమతులు (2) | | | |
| 2 | అమృతం | సయ్యద్ సలీమ్ | 75886 30243 |
| 3 | కుక్కసద్ది | డా.కాలువ మల్లయ్య | 91829 18567 |
| తృతీయ బహుమతులు (3) | | | |
| 4 | ఆకుపచ్చ తివాచీ | బి.వి.రమణమూర్తి | 98489 87239 |
| 5 | ఇదీ హత్యే కదా? | బి.వి.గిరిజ (కలం పేరు సుశోభ) | 89850 38173 |
| 6 | వృత్తి | కె.వి.నరేందర్ | 94404 02871 |
| ప్రత్యేక బహుమతులు (6) | | | |
| 7 | తక్కెడ | చందు తులసి | 99855 83022 |
| 8 | నషా | సయ్యద్ గఫార్ | 81067 40593 |
| 9 | ఉత్తమ నటుడు | యన్నంరెడ్డి వెంకటరెడ్డి | 98494 18365 |
| 10 | పాజిటివ్ | డా. వెల్దండి శ్రీధర్ | 98669 77741 |
| 11 | ఆరాధ్య | పొన్నాడ గౌరి | 63052 65908 |
| 12 | నిర్వాణ | ప్రొ. రామా చంద్రమౌళి | 93901 09993 |
| విశిష్ట బహుమతులు (10) | | | |
| 13 | ఋణం | ఎంఆర్‌వి సత్యనారాయణ మూర్తి | 98486 63735 |
| 14 | మా ఊరి ధన్వంతరి రాంరాం తాతా | డా.జనపాల శంకరయ్య | 80747 27108 |
| 15 | కర్మకాండ | బి.నర్సన్ | 94401 28169 |
| 16 | ఈద్ కా చాంద్ | హనీఫ్ | 83285 86518 |
| 17 | తీర్పు | గాజోజు నాగభూషణం | 98854 62052 |
| 18 | సుక్కబర్రె | వేముగంటి శుక్తిమతి | 99081 10937 |
| 19 | చీకటి వెలుగులు | స్ఫూర్తి కందివనం | 96527 45117 |
| 20 | మనసున మనసై | చింతపట్ల పద్మా రమేష్ | |
| 21 | గంగిరెద్దు గానుగెద్దు | సుగంధ శ్రీనివాస్ | 77300 65637 |
| 22 | అడవి బతుకులు | డా. దిలావర్ | 98669 23294 |

| | 'బతుకమ్మ'లో ప్రచురణకు ఎంపికైన కథలు (10) | | పేజీ నంబర్ |
|---|---|---|---|
| 23 | శభాష్ గౌండ్ల రామక్కా! | డా. ప్రభాకర్ జైనీ | 206 |
| 24 | నియ్యతి గల్లోడు | శిరంశెట్టి కాంతారావు | 213 |
| 25 | గుప్పెడు గంధం | రావుల పుల్లాచారి | 222 |
| 26 | కొత్త వెలుగు | సుంకోజి దేవేంద్రచారి | 231 |
| 27 | హనీ | తటపర్తి నాగేశ్వరి | 242 |
| 28 | వారసత్వం | గన్నవరపు నరసింహమూర్తి | 251 |
| 29 | పునరాగమనం | డా.రాయపెద్ది వివేకానంద్ | 259 |
| 30 | లెక్క తేల్చాలండి | ఈ. కోటేశ్వరరావు | 272 |
| 31 | సంస్కృతి రక్షితో.. | కె. శ్రీనివాస్ (కంచర్ల) | 280 |
| 32 | ఊరు పొమ్మంది, రమ్మంది | పంతంగి శ్రీనివాసరావు | 287 |
| | 'కథ-2020' ప్రచురణకు ఎంపికైన కథలు (17) | | |
| 33 | వీర | ఎనుగంటి వేణుగోపాల్ | 295 |
| 34 | చావు | మంచికంటి వెంకటేశ్వర్లు | 305 |
| 35 | పుట్టిన ఊరు | ఈతకోట సుబ్బారావు | 313 |
| 36 | మరో ప్రపంచం పిలిచింది! | మండ శ్రీకర్ | 320 |
| 37 | క్షమించవా! | కె. మనోహరాచారి | 326 |
| 38 | పాయెమాల్ | ఐతా చంద్రయ్య | 334 |
| 39 | కుదుపు | డా.బి.వి.ఎన్. స్వామి | 340 |
| 40 | ప్రశ్న | దాసరి వెంకటరమణ | 350 |
| 41 | ఊషర క్షేత్రం | పోతుబరి వెంకట రమణ | 383 |
| 42 | స్పర్శ | శ్రీమతి కె.వాసవదత్త రమణ | 356 |
| 43 | అమ్మ వస్తున్నది | పి.వి.ఎస్.కృష్ణ కుమారి | 366 |
| 44 | అమ్మ కడుపు చల్లగా | శ్రీమతి పి.వి. శేషరత్నం | 373 |
| 45 | వానకారు కోయిల | ఉమా మహేష్ ఆచాళ్ల | 392 |
| 46 | మా రోజులు మారాయి | వియోగి (కె.విజయ ప్రసాద్) | 400 |
| 47 | ఒక గీత ఆత్మకథ | డా.రమణ యశస్వి | 408 |
| 48 | రుణం | డా.సిద్దెంకి యాదగిరి | 414 |
| 49 | ముక్కలైన రెక్కల కష్టం | వేముగంటి మురళి కృష్ణ | 425 |
| | సంస్మరణార్థం ఎంపికైన కథ | | |
| 50 | మిత్రమా క్షమించు | దివంగత జీడిగుంట రామచంద్రమూర్తి | 432 |

తెలుగు కథకు ఏ కొలమానం సరిపోని సేవ ఇది.
వందలాది కథకులకు తరగని ప్రోత్సాహం ఇది.
ఈ కాలంలో అరుదైన సంకల్పం, ప్రేరణలతో
సాహితీవనంలో విరబూసిన కథా సంకలనం ఇది.

Katha PART 2_Layout 1 6/29/2023 2:49 PM Page 528